శ్రీమద్భగవద్గీత

ప్రధమ అధ్యాయము - అర్జున విషాదయోగము

1అ, 1శ్లో.

ధృతరాష్ట్ర ఉవాచ,

ధర్మక్షేత్రే సమవేతా కురుక్షేత్రే యుయుత్సవః ॥
మామకా: కిమకుర్వత పాండవాశ్చైవ సంజయ ॥1 ||

ధృతరాష్ట్రుడు పలికెను - ఓ సంజయా! యుద్ధసన్నద్ధులై ధర్మక్షేత్రమైన కురుక్షేత్రమునకు చేరియున్న నా కుమారులును, పాండు పుత్రులును ఏమి చేసిరి?

శ్రీకృష్ణ పరమాత్మాచే అర్జునునకు మరియు సమస్త మానవాళికి బోధించిన బ్రహ్మ విద్య, మరియు యోగశాస్త్రము.భగవానుడు మొట్టమొదట ధర్మ శబ్దముతో గీత బోధను ప్రారంభించాడు. ఇది మంగళవాచకము, శుభకరము.ధర్మక్షేత్రే కురుక్షేత్రే .... కురుక్షేత్రము ధర్మక్షేత్రము,కురు అంటే చేయునది మరియు కార్య క్షేత్రము,సమరక్షేత్రము. సమరం ఎవరితో? మనతో మనలో యుద్ధం చేసి మనల్ని మనం సాధించుకోవాలి.ఆత్మ స్థితిని (స్వస్వరూప స్థితిని) పొందాలి. ఇది మానవులందరి ప్రథమ కర్తవ్యం. ధర్మమంటే ధరించునది,ఆచరించునది. ధర్మ రూపంలో దైవము ఉన్నప్పుడే అది సాధ్యం. ధర్మాచరణ దైవ స్పర్శ ద్వారానే సాధ్యం.ఆ దైవ స్పర్శ దైవంతో అనుసంధానం,గీతా చరణ ద్వారానే సాధ్యం.ప్రతి దేహం ఒక క్షేత్రమే,ఈ మానవదేహాలన్నీ ధర్మబీజాలు నాటుకొని దైవం అనే పంటను పండించాలి, ఈ దేహం ద్వారా ధర్మాన్ని ఆచరించి దైవంగా మారాలి.

1అ, 2శ్లో.
సంజయ ఉవాచ,
దృష్ట్వా తు పాండవానీకం వ్యూఢం దుర్యోధనస్తదా ।
ఆచార్య రాజా ముపసంగమ్య వచనమబ్రవీత్ | 2 |

సంజయుడు పల్కెను - ఆ సమయమున రాజైన దుర్యోధనుడు వ్యూహరచనతో సమరమునకు మోహరించియున్న పాండవసైన్యమును చూచి, ద్రోణాచార్యుని కడకేగి యిట్లు పలికెను.

ఇక్కడ ధృతరాష్ట్రుడిది అంధకారం,దుర్యోధనుడిది అహంకారం. పాండవ సేనానియగు ధృష్టద్యుమ్నుడు యుద్ధ శాస్త్రాను సారంగా తన సైన్యమును వజ్రం అనే పేరు గల వ్యూహముగా నమర్చి ఉంచెను. వ్యూహకారంలో ఊహించరాని రీతిలో కనిపిస్తున్న పాండవ సైన్యాన్ని చూసి దుర్యోధనునకు లోపల భయం పుట్టింది అందుకే వెనువెంటనే ఆచార్యుడు

మరియు గురువైన ద్రోణుని దగ్గరకు వెళ్ళాడు. కౌరవ సైన్యంతో పోల్చితే పాండవ సైన్యం సంఖ్యాపరంగా తక్కువే కానీ పాండవుల వ్యూహరచన చూడగానే అతని అంతరంగంలో భయాందోళనలు మొదలయ్యాయి,కారణం దైవ బలం ఆత్మబలం అంతరాత్మ బలం లేకపోవడం. అంతరంగంలో యుద్ధం మొదలైంది.ఎవరు ఏ పని చేస్తున్నా వారి వారి అంతరంగం ప్రశ్నిస్తూ విచారిస్తూ ఉంటుంది. అపుడు దైవ స్పర్శ ఉంటే ఆ దైవమే మనల్ని సరియైన మార్గంలో నడిపిస్తుంది, అందుకే అంతరంగానికి విరుద్ధంగా ప్రవర్తించకూడదు. అధర్మపరుడైన దుర్యోధనుడుని ఆ అధర్మమే పతనం కావిస్తుంది. దైవ స్పర్శ కొరకై నిత్యం దైవంతో అనుసంధానమై ఉండాలి. ఆత్మస్థితిలో ఉండి కర్మలను కొనసాగించాలి. ఎప్పుడు ఏ కార్యాన్ని ప్రారంభించినా నిత్యా నిత్య వివేకంతో ధర్మాధర్మాలు గుర్తెరిగి బాహ్య ప్రపంచంలో ప్రవర్తించాలి.అప్పుడే మన అంతర జగత్తు ప్రశాంతంగా ఉంటుంది. భగవద్గీత అంటే భగవంతునికి దగ్గరకు చేర్చే గీత.

1అ, 3శ్లో.

పశ్యతాం పాండుపుత్రాణామ్ ఆచార్య మహతీం చమూమ్ |
వ్యూఢం ద్రుపదపుత్రేణ తవ శిష్యేణ ధీమతా ||

ఓ ఆచార్యా! బుద్ధిమంతుడైన మీ శిష్యుడును, ద్రుపదపుత్రుడును అయిన ధృష్టద్యుమ్నునిచే వ్యూహాత్మకముగా నిల్పబడిన పాండవుల ఈ మహాసైన్యమును చూడుడు.

ద్రోణాచార్యుడు కౌరవుల వైపు యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్నాడు కదా మరైతే బుద్ధిమంతుడైన మీ శిష్యుడు నీపైనే శరప్రయోగానికి సిద్ధంగా ఉన్నాడు అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నాడు దుర్యోధనుడు. ద్రుపదుని పుత్రుడును మీ శిష్యుడు నగు ధృష్టద్యుమ్నుడు పాండవసేనలను చక్కగా తీర్చిదిద్దెను అని పలుకుట ద్వారా అతడు ద్రోణాచార్యులకు ద్రుపదుని యెడల గల పూర్వపు వైరమును జ్ఞప్తికి తెచ్చెను. గురువు దగ్గరకు సమీపించినటువంటి శిష్యుడు ఇలా వ్యంగ్యాస్త్రాలను సంధించకూడదు కదా పైగా పాండుపుత్రాచార్య, పాండు పుత్రుల ఆచార్యుడా అనికూడా అర్థం స్ఫురిస్తోంది. చిన్ననాటి నుండి విద్యను నేర్పిన గురువు గారితో ఓవైపు వ్యంగ్యాస్త్రాలు సంధించడం, వక్రీకరించడం యుద్ధం చేయమని సూచించడం, మనకు కళ్ళ ముందు కనిపిస్తోంది ఇదంతా మనం చూస్తే దుర్యోధనుడి మనసు ఓ గమ్యం తెలియని ప్రయాణంలా ఆలోచిస్తుంది. దుర్యోధనుడి మాటలు ఒక స్థిరత్వం కానీ అతని ఆలోచన విధానానికి ఒక అర్థం కాని పరమార్థం కాని కనిపించడం లేదు. అందుకే జీవితానికి జీవన విధానానికి ఒక నియమిత ప్రణాళిక ఉండాలి, మనం మన జీవితానికి సమన్వయం చేసుకొని చూస్తే దుర్యోధనుడి మానసిక స్థితి మనకు అర్థం అవుతుంది. అంటే కాస్త ఆలోచించి మాట్లాడాలి ప్రవర్తించాలి దేహ పోషణను తీర్చుకోవడానికి ఒక ఉపాధి ఆ తర్వాత జీవిత పరమార్థాన్ని సాధించుకోవడానికి తగిన దైవసాధనను మనం జీవిత లక్ష్యంగా పెట్టుకొని ముందుకు పోతే జీవితం చాలా హాయిగాను ఆనందంగానూ శక్తివంతంగానూ ఉండి దైవాన్ని చేరుకోవడానికి మార్గం సుగమం అవుతుంది. మన దిశ సరైనదైతే మన

దశ సరిగ్గా ఉంటుంది, మన అసహనానికి మన అలజడికి మనమే కారణమని గ్రహించాలి. ఎందుకంటే సమస్యను గుర్తిస్తే మనకు పరిష్కారం దొరుకుతుంది,కనుక మనలోని శాంతిని నెలకొల్ప వలసింది కూడా మనమే అని గుర్తించాలి.

1అ, 4,5,6శ్లో.

అత్ర శూరా మహేష్వాసా భీమార్జునసమా యుధి |
యుయుధానో విరాటశ్చ ద్రుపదశ్చ మహారథ: |4|

ధృష్టకేతుశ్చేకితానః కాశిరాజశ్చ వీర్యవాన్ |
పురుజిత్ కుంతిభోజశ్చ శైబ్యశ్చ నరపుంగవః |5|

యుధామన్యుశ్చ విక్రాంత ఉత్తమౌజాశ్చ వీర్యవాన్ |
సౌభద్రో ద్రౌపదేయాశ్చ సర్వ ఏవ మహారథాః | 6 |

ఈ సేనలో ధనుర్ధారులైన గొప్పయోధులు కలరు. వారిలో సాత్యకి, విరాటుడు, మహారథియైన ద్రుపద మహారాజు, ధృష్టకేతువు, చేకితానుడు, వీరుడైన కాశీరాజు, పురుజిత్తు, కుంతిభోజుడు, నరశ్రేష్ఠుడైన శైబ్యుడు, పరాక్రమవంతుడైన యుధామన్యుడు, వీరుడైన ఉత్తమౌజుడు, సుభద్రాపుత్రుడైన అభిమన్యుడు, ద్రౌపదియొక్క ఐదుగురు పుత్రులును కలరు. వీరందరును మహారథులు. శౌర్యమున భీమార్జున సమానులు.

పాండవ సైన్యంలో భీమార్జునులతో సమానులైన శూరులు, గొప్ప ధనస్సులు ధరించి యున్నవారు ఉన్నారు. నిజానికి కురుపాండవులకు ఇద్దరికీ గురువైన ద్రోణాచార్యులకు దుర్యోధనుడు వాళ్ళ పేర్లను చెప్పి పరిచయం చేయవలసిన అవసరం లేదు. దుర్యోధనుడు తన గురువునకు పరిచయం చేసిన వీరులు వరుసగా సాత్యకి, విరాటరాజు, మహారథుడైన ద్రుపదుడు (మహారథుడు అనగా పది వేల ధనుర్ధరులగు యోధులతో నేకాకిగా యుద్ధము చేయగలవాడును, ఆయుధశాస్త్రమందు ప్రవీణుడునగు శూరుడు మహారథుడనబడును), శిశుపాలుని పుత్రుడైన ధృష్ట కేతువు, యదువంశవీరుడైన చేకితానుడు, శక్తి శాలి అయిన కాశీరాజు, పురుజిత్తు, కుంతి భోజుడు, నర శ్రేష్టుడైన శైబ్యుడు, పరాక్రమశాలి అయిన యుధామన్యుడు, మహా శక్తిశాలి అయిన ఉత్తమౌజుడు, సుభద్రా సుతుడైన అభిమన్యుడు, ద్రౌపదీపుత్రులైన ఉప పాండవులు వరుసగా ప్రతివింధ్యుడు, శ్రుతసోముడు, శ్రుత కీర్తి, శతానీకుడు, శ్రుతసేనుడు వీళ్లందరినీ మొత్తం 17 మందిని అధిరథులుగా దుర్యోధనుడు తన గురువు దగ్గర అంగీకరించాడు.

1అ, 7,8,9శ్లో.

అస్మాకం తు విశిష్టా యే తాన్నిబోధ ద్విజోత్తమ |
నాయకా మమ సైన్యస్య సంజ్ఞార్థం తాన్ బ్రవీమి తే |7|

ఓ బ్రాహ్మణోత్తమా! మన పక్షముననున్న ప్రధానయోధులను గూడ గమనింపుడు. మీ యెఱుకకై మన సేనానాయకులను గూర్చియు తెలుపుచున్నాను.

భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ కృపశ్చ సమితింజయః |
అశ్వత్థామా వికర్ణశ్చ సౌమదత్తిస్తథైవ చ |8|

మీరును, భీష్ముడు, కర్ణుడు, సంగ్రామవిజయుడగు కృపాచార్యుడు, అశ్వత్థామ, వికర్ణుడు, సోమదత్తుని కుమారుడైన భూరిశ్రవుడు ఇందు ముఖ్యులు.

అన్యే చ బహవః శూరా మదర్థే త్యక్తజీవితాః |
నానాశస్త్ర ప్రహరణాః సర్వే యుద్ధవిశారదాః |9|

ఇంకను పెక్కుమంది శూరులును, వీరులును మన సైన్యమునందు కలరు. వీరందరును యుద్ధవిశారదులు. నానాశస్త్రాస్త్రధారులు. నాకొరకు తమ ప్రాణముల నొడ్డియైనను యుద్ధము చేయుటకు సిద్ధముగా నున్నవారు.

పాండవ సైన్యంలో మహా వీరులను ద్రోణాచార్యునికి పరిచయం చేసిన తర్వాత దుర్యోధనుడు వారిని చూసి తాను భీతి చెందుతున్నట్లు తన ఆచార్యుడు అర్థం చేసుకుంటాడేమోనని తన సైన్యంలోని మహావీరులను కూడా పరిచయం చేస్తున్నాడు. వారు వరుసగా తమరు (ద్రోణాచార్యుడు),భీష్ముడు, కర్ణుడు, జయశీలి కృపాచార్యుడు, అశ్వద్ధాముడు, నా తమ్ముడు వికర్ణుడును, భూరి శ్రవుడును, సైంధవుడును ఇందుకలరు. ఈ 8 మంది కాకుండా ఇంకా చాలా మంది ప్రాణాన్ని పణంగా పెట్టి వచ్చినారు. శస్త్రాస్త్రములు ధరించిన వారు ఎందరో ఉన్నారు అని దుర్యోధనుడు తెలిపినాడు. నాకోసం ప్రాణాలు విడవడానికి వచ్చారని చెప్పడం సరికాదు. రాజు ప్రజల కొరకు ప్రాణాలు ఇస్తారు కానీ ఇక్కడ విరుద్దంగా దుర్యోధనుడు తెలుపుచున్నాడు. పాండవసేనలో 19 మందిని పేర్కొన్న దుర్యోధనుడు తనసేనలో 8 గురుని మాత్రమే తెలిపాడు, దీనిని బట్టి పాండవసేన ఏడు అక్షౌహిణులే అయినా వీరులు ఎక్కువగా ఉన్నారని తన సేన 11 అక్షౌహిణులైనా వీరులు తక్కువని దుర్యోధనుడు భయపడుతున్నాడు. పాల విలువ వెన్నను బట్టి, సేన విలువ వీరులను బట్టి ఉంటుంది.

ఇక్కడ ఒక ముఖ్య విషయం దాగి ఉంది,దుర్యోధనుడు మూడు శ్లోకాలలో పాండవ వీరుల గురించి ఒక శ్లోకంలో కౌరవ వీరుల గురించి తెలిపాడు,16వ అధ్యాయంలో దైవీ సంపత్తి గురించి శ్రీకృష్ణుడు మూడు శ్లోకములలో (16-1,2,3) వర్ణించి ఆసురీ సంపత్తి గురించి ఒక శ్లోకంలో చెప్పడం జరిగింది. ఈ రెండింటిని పోల్చి చూస్తే పాండవ సైన్యం దైవీ సంపత్తని

కౌరవ సైన్యం అసురీ సంపత్తని ఇట్టే తెలిసిపోతుంది,ఇక్కడ దుర్యోధనుని మనస్సు భయంతో అస్తవ్యస్తంగా ఉందని తెలుస్తోంది.

1అ, 10శ్లో.

అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభిరక్షితమ్ |
పర్యాప్తం త్విదమేతేషాం బలం భీమాభిరక్షితమ్ | 10 |

భీష్మపితామహునిచే సురక్షితము, అపరిమితముగా నున్న మనసైన్యము అజేయమైనది. భీమునిచే రక్షింపబడుచు పరిమితముగానున్న ఈ పాండవ సైన్యమును జయించుట సులభము.

పాపభీతి ఆవహించిన దుర్యోధనుడు మతిస్థిమితం కోల్పోయిన వాని వలె ద్రోణాచార్యులకు ఏదేదో బోధిస్తున్నాడు దుర్యోధనుని ఎత్తిపొడుపులను, సూటి పోటి మాటలను నీచ బుద్ధిని గ్రహించాడు ద్రోణాచార్యుడు, అయినా కర్తవ్యానికి బద్ధుడై మౌనంగా వింటున్నాడు. కురు సేనకు సర్వసేనాని భీష్ముడు కనుక తన బలం భీష్మాభి రక్షితం మరి పాండవసేనకు సర్వసేనాని ధృష్టద్యుమ్నుడు కదా భీమాభిరక్షితం అని ఎందుకన్నట్లు? పాండవ సర్వసేనాని ధృష్టద్యుమ్నుడు అయినా మొదటి రోజున వారి వ్యూహం వజ్ర వ్యూహం. వ్యూహముఖంలో గదా దండం ధరించిన భీమసేనుని నిలబెట్టి వ్యూహరక్షకుడిగా ఉంచడం వల్ల పాండవసేనను భీమాభి రక్షితం అన్నాడు దుర్యోధనుడు. అలాగే తన సేనని అపర్యాప్తం అన్నాడు దుర్యోధనుడు, అపరియాప్తం అంటే అపరిమితమైన అని ఒక అర్థం కాగా అసమర్థమైనది అసంపూర్ణమైనది అని మరొక అర్థం. అలాగే ఎదుటి సేనను పర్యాప్తం అన్నాడు పర్యాప్తం అంటే పరిమితమైనది అని ఒక అర్థం కాక సమర్థమైనది సంపూర్ణమైనది అని మరొక అర్థం. పాండవసేన 7 అక్షౌహిణులే గనుక పరిమితమైనది తనసేన 11 అక్షౌహిణులు గనుక అపరిమితం అనే భావంలో ఆ పదాల్ని ఉపయోగించాడు దుర్యోధనుడు, అయితే వాటికి వ్యతిరేకార్థాలు ఉండడం కాక తాళియం.

నిరంతరం మనసుని భగవంతునిపై నిలపాలి. భగవంతునిపై నిలపకపోతే భగవధ్యానంలో ఉండకపోతే మానసిక స్థితి ఇలాగే ఉంటుంది. సత్య దర్శనం చేసినప్పుడు ఆలోచన స్పష్టంగా ఉంటుంది, మనసు ఎలాంటి గందరగోళానికి గురవుతున్నదో చిత్రంలో మనకు కనిపిస్తుంది, అతని మాటల్లో నేను నాది అహం ఆకాశమంత ఆవరించిన పరిస్థితిని చూస్తున్నాం. ఆత్మ శక్తిని గుర్తించకుండా బాహ్యబలం, బలగంతోనో భౌతిక సేనలతోనో అంచనా వేయకూడదు.

1అ, 11శ్లో.

అయనేషు చ సర్వేషు యథాభాగమవస్థితాః |
భీష్మమేవాభిరక్షంతు భవంతః సర్వ ఏవ హి ||

కనుక మీరందరును మీమీ స్థానములలో సుస్థిరముగా నిలిచి, అన్నివైపులనుండి నిశ్చయముగా భీష్ముని రక్షించుచుండుడు.

దుర్యోధనుడు శిష్యుని లాగా ఆచార్యుని సమీపించి, రాజులాగా చెప్పదలచుకున్న విషయాలను చెప్పి ఇప్పుడు సేనలకు ఆదేశం ఇస్తున్నాడు. సేనలకు ఆదేశం ఇవ్వటం సేనాధిపతుల బాధ్యత ఏ అక్షౌహిణి సేనాధిపతి ఆ అక్షౌహిణీ సేనలకు తగిన సమయంలో తగిన ఆదేశాలిస్తూ సేనలు నడిపిస్తుంటాడు. ఇప్పుడు ద్రోణాచార్యుడు తన సేనలకు ఆదేశం ఇవ్వాలి,కానీ దుర్యోధనుడే స్వయంగా ఆదేశం ఇస్తున్నాడు. వీరందరూ మీ మీ నియమిత స్థానాల్లో ఉండి భీష్ముల వారిని రక్షించండి అని ఎందుకిలా? దుర్యోధనునిలో ప్రవేశించిన భయం పిరికితనం ఇలా అస్తవ్యస్తంగా ప్రవర్తించేట్లు చేస్తున్నది. ద్రోణాచార్యుని సమీపంలోనే భీష్ముడు ఉన్నాడు, దుర్యోధనుని వ్యర్థ ప్రలాపమంతా పితామహునికి వినపడే ఉంటుంది. సమరారంభంలో ఇదొక అనారోగ్యకరమైన వాతావరణమని భీష్ముడికి తెలుసు, వీరోత్సాహాన్ని ఇలాంటి సన్నివేశాలు నిస్సారంగా మారుస్తాయని కూడా తెలుసు.

బాహ్యదృష్టిని కాకుండా అంతర్దృష్టిని అలవరచుకున్నప్పుడు మన అంతరంగంలో ఉండేటటువంటి అంతః చైతన్యాన్ని ఉద్దీపనం చేసుకున్నప్పుడు మనం శక్తివంతులుగా తయారవుతాం. చైతన్యవంతులుగా అవుతాం, అప్పుడు మన మాట మన ప్రవర్తన మన ఆలోచన స్పష్టంగా ఉంటుంది. మన జీవితమంతా సుస్పష్టంగా ప్రశాంతంగా సాగుతుంది.

1అ, 12శ్లో.

తస్య సంజనయన్ హర్షం కురువృద్ధః పితామహః |
సింహనాదం వినద్యోచ్చైః శంఖం దధ్మౌ ప్రతాపవాన్ | 12 |

కురువృద్ధుడును, ప్రతాపశాలియును ఐన భీష్మ పితామహుడు (దుర్యోధనుని ఈ మాటలు విని) అతనిని సంతోషపఱచుటకై ఉచ్చస్వరముతో సింహనాద మొనర్చి, తన శంఖమును పూరించెను.

అందరూ కలిసి భీష్ముడిని రక్షించండి అని దుర్యోధనుడు పలికిన మాట భీష్ముల వారి చెవిన పడింది. పరశురాముని నిరసించి పోరాడిన తనను ఇతరులు రక్షించాలా? ఇక ఈ ఉన్మత్త ప్రలాపాన్ని ఆపాలని భావించాడో ఏమో మాట పలకకుండా సింహ గర్జన వంటి కేక వేసి శంఖాన్ని పూరించాడు. తరగతి గదిలో విద్యార్థులు గోల చేస్తూ ఉంటే ఉపాధ్యాయుడు బల్లను చరుస్తాడు, ఆ శబ్దానికి పిల్లలు నోళ్లు కట్టేసుకుంటారు. దుర్యోధనా ఇక పిల్ల చేష్టలు, వ్యర్థ ప్రసంగాలు ఆపు అని చెప్పకుండానే శంఖాన్ని పూరించి దుర్యోధనుని నోరు మూయించాడు భీష్ముడు.

దుర్యోధనునికి ధైర్యం ఉత్సాహం కావాలి, నీరసించిన నాడీ మండలం చైతన్యం కావాలి అని భావించి శంఖాన్ని పూరించాడు. ఒకసారి సైన్యం నిరుత్సాహం పాలైతే వారిచేత సరిగ్గా యుద్ధం చేయించటం చాలా కష్టమవుతుంది. ఇలాంటి పరిస్థితిని తప్పించాలంటే వారందరినీ ఒక కుదుపు కుదిపి నిరుత్సాహాన్ని తొలగించాలి. దుర్యోధనుని తెలివి తక్కువ పనులకు, మాటలకు ముగింపు పలకాలి. అందుకే గట్టిగా సింహనాదం చేసి తన శంఖాన్ని పూరించాడు. పితామహుని పిలుపునందుకొని సేనలన్నీ వారి వారి నాదాలను వినిపిస్తూ సమ్మతిని తెలిపాయి, సిద్ధమంటూ శబ్దంతో మారుపలికాయి.

1అ,13&14 శ్లో.

తతః శంఖాశ్చ భేర్యశ్చ పణవానకగోముఖాః |
సహసైవాభ్యహన్యంత స శబ్దస్తుములో భవత్ | 13 |

మరుక్షణమునందే శంఖములు, నగారాలు, తప్పెటలు, మృదంగములు, గోముఖవాద్యములు మొదలగునవి ఒక్కసారిగా మ్రోగినవి. దిక్కులను పిక్కటిల్లజేయు ఆ వాద్యనాదములు భయంకరములై ఒప్పినవి.

తతః శ్వేతైర్హయైర్యుక్తే మహతి స్యందనే స్థితౌ |
మాధవః పాండవశ్చైవ దివ్యౌ శంఖౌ ప్రదధ్మతుః |14 |

తదనంతరము శ్వేతాశ్వములను పూన్చిన మహారథముపై ఆసీనులైయున్న శ్రీకృష్ణార్జునులు తమ దివ్యశంఖములను పూరించిరి.

భీష్ముని యొక్క సింహనాధాన్ని శంఖ ధ్వనిని వినటంతోనే తాము కూడా యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని కౌరవ పక్షంలోని సేనాధిపతులు, వీరులు మిగిలిన యోధ ప్రముఖులంతా తమ తమ శంఖాలను ఊదటం ప్రారంభించారు. తెల్లని గుర్రములను కట్టిన మహా రథము నందు కూర్చొని యున్న కృష్ణార్జున లిరువురూ తమ దివ్య శంఖములను బలముగా ఊదిరి. తెల్లని గుర్రములు-ఇవి గంధర్వరాజు చిత్రరథుడు కానుకగా ఇచ్చినది, దివ్యమైనది శక్తివంతమైనది 18 రోజుల మహాభారత యుద్ధంలో అలుపు సొలుపు లేకుండా తమ అద్భుత దివ్య శక్తిని ప్రదర్శించినవి. తెలుపు రంగు సత్త గుణానికి ప్రతీక, ధర్మానికి ప్రతీక. నాలుగు గుర్రాలను నాలుగు అంతః కరణాలైనా మనసు, బుద్ధి, చిత్తం, అహంకారంగా వర్ణిస్తారు వేదాంతులు.

దివ్య రథం- అర్జునుని గుర్రాలే కాదు రథం కూడా దివ్యమైనదే. ఖాండవ వన దహన సమయంలో అగ్నిదేవుడు ప్రసాదించినది ఈ రథం. యుద్ధంలో 18 రోజులు ఒకే రథంపై నిలచి యుద్ధం చేశారు అర్జునుడు. రధాని మానవ శరీరం గా వర్ణిస్తారు వేదాంతులు.

మాధవ- మా అంటే లక్ష్మీదేవి, ధవ అంటే భర్త, మాధవుడు అంటే లక్ష్మీదేవి భర్త అని అర్థం. అంతఃకరణాలనబడే గుర్రాల తో శరీరం అనే రథంలో కూర్చుని జీవాత్మ అయిన అర్జునుడు రథికుడిగా పరమాత్మ అయిన శ్రీకృష్ణుని సారధిగా

చేసుకుని జీవన రంగం అనే యుద్ధ రంగంలో ప్రవేశిస్తున్నాడు. ఈ ప్రపంచం అనే జీవన నాటక రంగంలో ప్రవేశించిన జీవుళ్లంతా, మనమంతా ఈ జీవన రథాన్ని నడపడానికి పగ్గాలను పరమాత్మ చేతిలో ఉంచాలి. అప్పుడే జీవితం సార్థకమవుతుంది అని గ్రహించాలి. శ్రీకృష్ణార్జున సంకల్పం గురించి యుద్ధానికి తమ సంసిద్ధతను తెలియజేస్తున్నారు. ఈ శరీరమే ఒక శంఖం దీనికి పరమాత్మ పూరిస్తేనే- పరమాత్మ చైతన్యం ఉన్నంతవరకే ఇది పనిచేస్తుంది. పరమాత్మ అందని నాడు ఇది స్మశానం పాలై బూడిదవుతుంది. ఇక్కడ పరమాత్మ శంఖాలను పూరించాడు, అంటే శరీరాలకు చైతన్యం కలిగిస్తున్నాడు అని అంతరార్థం.

1అ,15 శ్లో.

పాంచజన్యం హృషీకేశో దేవదత్తం ధనంజయః |
పౌండ్రం దధ్మౌ మహాశంఖం భీమకర్మా వృకోదరః ||

శ్రీకృష్ణుడు పాంచజన్యమును, అర్జునుడు దేవదత్త శంఖమును పూరించిరి. అరివీరభయంకరుడైన భీముడు "పౌండ్రము" అను మహాశంఖమును పూరించెను.

పాంచ జన్యమను శంఖమును శ్రీకృష్ణుడును, దేవదత్త మను దానిని అర్జునుడు, పౌండ్ర మను మహాశంఖమును భీముడును ఊదిరి. కౌరవుల తరఫున మొదట భీష్ముడు శంఖం పూరించాడు, పాండవుల తరఫున సర్వసేనాని అయిన ధృష్టద్యుమ్నుడు పూరించకుండా శ్రీకృష్ణుడు పూరించాడు. కౌరవ సైన్యం వీరుల సంరక్షణలో ఉన్నది, పాండవుల సైన్యం ధీరుల సంరక్షణలోనూ, ధర్మం చేతిలోనూ ఉన్నది. తనను తాను జయించిన వాడు ధర్మం వైపు శరీరాన్ని ఒక పరికరంగా ఉపయోగిస్తాడు. వీరుడికి కండవరం ఉంటుంది ధీరునికి ఆత్మబలం దైవానుగ్రహం నడిపిస్తాయి. విజయం ఎప్పుడూ ధర్మం వైపే ఉంటుంది ధర్మాచరణ కావించడమే మానవ జీవిత లక్ష్యం కావాలి. రాజసూయ యాగంలో రాజ్యాలను జయించి ధనరాశులను తెచ్చినందువల్ల ధనుంజయుడని పేరు వచ్చింది. దైవానికే గాని ధనానికి పీఠం వేయనటువంటి వాడు కాబట్టి అర్జునులకు ధనంజయుడు అని పేరు భీముడు వృకం అనే అగ్నిని కడుపులో కలిగి ఉన్నాడు కనుక వృకోధరుడని పేరు వచ్చింది,ఎంత ఆహారాన్ని అయినా జీర్ణం చేసుకోగలిగిన శక్తి ఉంది.

1అ,16శ్లో.

అనంతవిజయం రాజా కుంతీపుత్రో యుధిష్ఠిరః |
నకులః సహదేవశ్చ సుఘోషమణిపుష్పకౌ ||

కుంతీపుత్రుడును, రాజును ఐన యుధిష్ఠిరుడు 'అనంతవిజయము' అను శంఖమును, నకుల సహదేవులు 'సుఘోష' 'మణిపుష్పకము'లను శంఖము లను పూరించిరి.

ధర్మరాజు అనంత విజయము అనే శంఖాన్ని పూరించాడు. అనంత విజయమంటే సదా విజయమును దర్శించువాడు అని అర్థం. ధర్మరాజును ప్రత్యేకంగా రాజు అని సంజయుడు సంబోధించడం గమనార్హం. ప్రస్తుతం రాజ్యానికి రాజు

దుర్యోధనుడే కానీ ధర్మరాజు కాడు. దుర్యోధనుడు రాజ్యాన్ని మోసంతో చేజిక్కించుకున్నా, వాస్తవానికి ధర్మరాజే రాజు అని సంజయుడు ధర్మ వచనాన్ని వినిపిస్తున్నాడు. అంతేకాదు అనంత విజయము అనే శంఖాన్ని పూరించిన యుధిష్టరుడు కురుక్షేత్రంలో విజయాన్ని సాధించి రాజుగా సింహాసనాన్ని అధిష్టించేది తథ్యం అనేది కూడా సంజయుని మాటలలో స్పష్టమవుతోంది. నకులుడు సుఘోషాన్ని వినిపించాడు. సహదేవుడు మణిపుష్పకం అనే శంఖాన్ని పూరించాడు. ఐదుగురు పాండవ సోదరులు దివ్యములైన ఐదు శంఖాలను పూరించారు. అన్నీ విజయ సూచికంగా మంగళకరంగా వినిపించాయి. ఇదంతా విజయసూచకము.

1అ,17,18శ్లో.

కాశ్యశ్చ పరమేష్వాసః శిఖండీ చ మహారథః |
ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకిశ్చాపరాజితః |17|

ద్రుపదో ద్రౌపదేయాశ్చ సర్వశః పృథివీపతే |
సౌభద్రశ్చ మహాబాహుః శంఖాన్ దధ్ముః పృథక్ పృథక్ | 18 |

ఓ రాజా! మహాధనుర్ధారియైన కాశీరాజు, మహారథుడైన "శిఖండి"యు, ధృష్టద్యుమ్నుడును, విరాటరాజు, అజేయుడైన 'సాత్యకి'యు, ద్రుపద మహారాజు, ద్రౌపదియొక్క ఐదుగురు పుత్రులును, భుజబలశాలియు సుభద్రాపుత్రుడును అగు అభిమన్యుడును తమ తమ శంఖములను వేర్వేరుగా పూరించిరి.

కౌరవ విజయం భీష్మ ద్రోణుల మీదే ఆధారపడి ఉంది. కానీ, కేవలం వారిద్దరిని సంహరించడానికి జన్మించిన వీరులు ఇద్దరూ ఈ 17వ శ్లోకంలోనే ఒదిగిపోయారు. భీష్ముని పాలిట మృత్యువుగా శిఖండి, ద్రోణుని పాలిట కాలుడుగా దృష్టద్యుమ్నుడు కనిపిస్తూనే ఉన్నారు. శిఖండి, దృష్టద్యుమ్ను లిద్దరూ ద్రుపదుని పుత్రులే. ఇద్దరూ ద్రోణాచార్యుని శిష్యులే. పాండవసేనలోని 7 అక్షౌహిణులకు ఏడుగురు మహావీరులను సేనాధిపతులుగా నియమించాడు ధర్మరాజు. వారు, 1.విరాటుడు, 2.ద్రుపదుడు, 3. దృష్టద్యుమ్నుడు 4.శిఖండి 5.సాత్యకి 6.దృష్టకేతువు 7.చేకితానుడు వీరిలో సర్వసమర్దుడైన దృష్టద్యుమ్నుని సర్వసేనానిగా నియమించాడు ధర్మరాజు.

ద్రుపదరాజు, ద్రౌపది కుమారులు (ఉప పాండవులు ఐదు మంది) గొప్ప బాహువు లు కలిగిన సుభద్ర కుమారుడు అభిమన్యుడు వీరందరూ శంఖాలను పూరించారు. కానీ పాండవ పక్షంలోని వీరులు పూరించిన శంఖాలన్నీ వేరువేరుగా ధ్వనించాయి. కౌరవులు తమ తమ శంఖాలను ఒకేసారి పూరించగా పాండవులు ఒకరి తరువాత ఒకరు పూరించారు. కౌరవులు క్రమశిక్షణరాహిత్యానికి, పాండవులు క్రమశిక్షణకు ఈ శంఖారావాలలోని వ్యత్యాసాలే అర్థం పడుతున్నవి. పాండవుల కన్నా ముందు కౌరవులు తమ తమ శంఖాలను పూరించిననూ వాటికి వేరువేరు పేర్లు లేవు.

ధర్మరాజు అనంత విజయము అనే శంఖాన్ని పూరించాడు. అనంత విజయమంటే సదా విజయమును దర్శించువాడు అని అర్థం. ధర్మరాజును ప్రత్యేకంగా రాజు అని సంజయుడు సంబోధించడం గమనార్హం. ప్రస్తుతం రాజ్యానికి రాజు

దుర్యోధనుడే కానీ ధర్మరాజు కాడు. దుర్యోధనుడు రాజ్యాన్ని మోసంతో చేజిక్కించుకున్నా, వాస్తవానికి ధర్మరాజే రాజు అని సంజయుడు ధర్మ వచనాన్ని వినిపిస్తున్నాడు. అంతేకాదు అనంత విజయము అనే శంఖాన్ని పూరించిన యుధిష్టరుడు కురుక్షేత్రంలో విజయాన్ని సాధించి రాజుగా సింహాసనాన్ని అధిష్టించేది తథ్యం అనేది కూడా సంజయుని మాటలలో స్పష్టమవుతోంది. నకులుడు సుఘోషాన్ని వినిపించాడు. సహదేవుడు మణిపుష్పకం అనే శంఖాన్ని పూరించాడు. ఐదుగురు పాండవ సోదరులు దివ్యములైన ఐదు శంఖాలను పూరించారు. అన్నీ విజయ సూచికంగా మంగళకరంగా వినిపించాయి. ఇదంతా విజయసూచకము.

1అ,19శ్లో.

స ఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్ |
నభశ్చ పృథివీం చైవ తుములో వ్యనునాదయన్ | 19 |

పాండవపక్షమహాయోధుల శంఖనినాదములకు భూమ్యాకాశములు దద్దరిల్లినవి. ఆ శంఖారావ ములకు ధార్తరాష్ట్రుల హృదయములు కకావికలములయ్యెను.

పాండవ సైన్యం చేసిన శంఖనాధాలు భూమి ఆకాశాలను ప్రతిధ్వనింపజేశాయి. కౌరవుల గుండెల్లో దడ పుట్టించాయి, హృదయ విదారకమైన ఈ పరిస్థితికి పాండవుల వీర్య శౌర్యాలు దివ్యములైన శంఖములు వినిపించిన భీకర ధ్వనులు ఒక కారణమైతే కౌరవులలో దోష స్పృహతో కూడిన అంతరంగిక సంఘర్షణ మరొక కారణం. కౌరవుల భయానికి వారి అధర్మవర్తనమే కారణం. పాండవుల ధైర్యానికి వారి ధర్మవర్తనము,గతంలో అర్థించిన పుణ్యమే కారణం.

1అ, 20,21శ్లో.

అథ వ్యవస్థితాన్ దృష్ట్వా ధార్తరాష్ట్రాన్ కపిధ్వజః |
ప్రవృత్తే శస్త్రసంపాతే ధనురుద్యమ్య పాండవ: |20|

హృషీకేశం తదా వాక్యమ్ ఇదమాహ మహీపతే |

అర్జున ఉవాచ,
సేనయోరుభయోర్మధ్యే రథం స్థాపయ మేఽచ్యుత | 21 |

ఓ ధృతరాష్ట్ర మహారాజా! పిమ్మట యుద్ధమునకై నడుము బిగించి సమర సన్నద్ధులైయున్న ధార్తరాష్ట్రులను చూచి, కపిధ్వజుడైన అర్జునుడు ధనుస్సును పైకెత్తి శ్రీకృష్ణునితో ఇట్లనెను. “ఓ అచ్యుతా! నా రథమును ఉభయసేనలమధ్య నిలుపుము.”

యావదేతాన్ నిరీక్షేఽహం యోద్ధుకామానవస్థితాన్ |
కైర్మయా సహ యోద్ధవ్యమ్ అస్మిన్ రణసముద్యమే | 22 |

రణరంగమునందు యుద్ధాభిలాషులై నిలిచియున్న ప్రతిపక్షయోధు లందరిని బాగుగా పరిశీలించునంత వరకును, వారిలో ఎవరితో నేను యుద్ధము చేయవలసియున్నదో గమనించునంత వరకును రథమును నిలిపియుంచుము.

'అథ' అనేది మంగళవాచకం. మహాభారత యుద్ధంలో ఉభయపక్షాల్లోనూ ఏకైక వీరుడు అని ప్రశంసించబడిన సర్వ శస్త్రాస్త్ర సంపన్నుడైన అర్జునుడు ఏ విధంగా యుద్ధ భూమిలోకి ప్రవేశిస్తున్నాడో సంజయుడు ధృతరాష్ట్రునికి వర్ణించి చెబుతున్నాడు. ఇంకా అస్త్రశస్త్రాలు ప్రయోగించడం ప్రారంభం కాలేదు.యుద్ధ ప్రారంభానికి రంగం సిద్ధమైంది. అంతటా ఉత్కంఠ, ప్రతివారి మనస్సు లోనూ ఉత్సాహం ఉరకలు వేస్తున్నది. ఎపుడెప్పుడు యుద్ధం మొదలవుతుందా? అని అంతా ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. అదిగో ఆ క్షణం రానే వచ్చింది, కపిధ్వజంతో అర్జునుడు వస్తున్నాడు. రణరంగంలో అందరి రథాలకు పథకాలు ఉంటాయి,కొందరివి ప్రత్యేక చిహ్నాలతో ఉంటాయి. అర్జునుని దివ్య రథానికి గల ధ్వజం దివ్యమైనది,అదే కపిధ్వజం.కపి అంటే కోతి, సాక్షాత్తు హనుమంతుడే ధ్వజ పతాకంపై కూర్చుని ఉన్నాడు. సౌగంధికా వనం వైపు వెళుతున్న భీమునికి హనుమంతుడు దర్శనమిస్తాడు,అపుడు హనుమంతుడు కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుని రథంపై రెపరెపలాడే ధ్వజంపై ఉంటానని మాట ఇచ్చాడు. ఆ కారణంగా అర్జునుని రథం యొక్క టెక్కెముపై హనుమంతుడు ఉండటం వలన అర్జునునికి కపిధ్వజుడనే పేరు వచ్చింది.

మహాభారత యుద్ధానికి ముందు ఎన్నో యుద్ధాలు జరిగాయి, కానీ ఈ స్థాయిలో యుద్ధాలు జరుగలేదు. ఉభయ సేనలు యుద్ధానికి సన్నద్ధంగా ఉన్నాయి. ధర్మానికి పట్టాభిషేకం చేయాలని పాండవులు ఆయుధాలతో నిలబడ్డారు. అర్జునుడు కృష్ణునితో ఇలా అంటున్నాడు, తాను ఎవరెవరితో యుద్ధం చేయాలో వాళ్లు ఎక్కడ నుండి చూస్తే స్పష్టంగా కనిపిస్తారో ఆ ప్రదేశానికి రథాన్ని పోనివ్వమని కృష్ణుడిని అర్థిస్తున్నాడు, ఒకరకంగా ఆజ్ఞాపిస్తున్నాడు. అర్జునునిలో ఎటువంటి భయం లేదు, ప్రమాదమనే ఆలోచన కూడా రాలేదు. అందుకే కౌరవులు యుద్ధానికి సిద్ధమయ్యారని తెలుసుకొని రథాన్ని సేనల మధ్య నిలుపుమన్నాడు. ఏదైనా ఒక పనిని ప్రారంభించే ముందు దాని మంచి చెడుల గురించి బాగుగా ఆలోచించి ప్రారంభించాలనేది బుద్ధిమంతుల లక్షణం. అలాగే తన బలం ఎదుటివారి బలాబలాలతో బేరీజు వేసుకొనడం వివేకవంతుల లక్షణం. సరైన అంచనాకు రావాలంటే రెండు పక్షాల నడుమ పక్షపాత రహితంగా అంచనా వేయాలి. దుర్యోధనుడు మాత్రం ఎదుటి సేనను, వీరులను మాత్రమే చూచి తన పక్షం వైపే నిలబడి ద్రోణాచార్యునితో మాట్లాడాడు. అర్జునునిది ఉత్తమ యుద్ధ వీరుని లక్షణం. ఇక్కడ అర్జునుని యుద్ధ సంసిద్ధత, ధైర్య సాహసాలు, శక్తి సామర్థ్యాలు, కార్యకుశలత, వివేకం మనకు అవగతం అవుతాయి. ఇంతవరకు అర్జునునకు ఎలాంటి భయం, విషాదఛాయలు లేవు.
అర్జునునకు ఈ ఆలోచన కలిగించినవాడు హృషీకేశుడే. ఆయన హృషీకాలకు (ఇంద్రియాలకు) ఈసుడు. ప్రభువు కదా అందుకే అర్జునునిలోని సంకల్పానికి ప్రేరణ కలిగించాడు. పలికించే ప్రభువు ప్రేరణ కలిగిస్తే తప్ప స్వయంగా పలికే శక్తి ఎవరికీ ఉండదు. ఇక్కడ అర్జునుడు శ్రీకృష్ణుడిని అచ్యుతా అని సంబోధిస్తున్నాడు. అచ్యుతుడు అంటే చ్యుతి లేనివాడు,

పడిపోనివాడు, చలించని వాడు అని అర్థం. శ్రీకృష్ణుడు తన స్వస్థితి నుండి పడిపోనివాడు, తన స్వస్వరూపం నుండి చలించనివాడు.

1అ,23,24,25 శ్లో.

యోత్స్యమానానవేక్షేఽహం య ఏతేఽత్ర సమాగతాః |
ధార్తరాష్ట్రస్య దుర్బుద్ధే: యుద్ధే ప్రియచికీర్షవః | 23 |

"దుర్బుద్ధియైన దుర్యోధనునకు ప్రియమును గూర్చుటకై యుద్ధమున పాల్గొనదలచి వచ్చియున్న రాజులను అందరిని ఒకపరి పరికించెదను."

సంజయ ఉవాచ,
ఏవముక్తో హృషీకేశో గుడాకేశేన భారత |
సేనయోరుభయోర్మధ్యే స్థాపయిత్వా రథోత్తమమ్ | 24 |

భీష్మద్రోణప్రముఖతః సర్వేషాం చ మహీక్షితామ్ ।
ఉవాచ పార్థ పశ్యైతాన్ సమవేతాన్ కురూనితి |25|

సంజయుడు పలికెను - ఓ ధృతరాష్ట్రా! అర్జునుని కోరికమేరకు శ్రీకృష్ణుడు ఆ దివ్యరథము భీష్మద్రోణులకును, ఆ పక్షమునందలి మహారాజు లందరికిని ఎదురుగా ఉభయసేనలమధ్య నిలిపెను. పిదప అతడు అర్జునునితో " పార్థా! ఇక్కడ సమావేశమైన ఈ కౌరవ వీరులందరిని పరికింపుము" అని నుడివెను.

అర్జునుని ఆదేశాల మేరకు శ్రీకృష్ణుడు సేనల మధ్యలో ఉన్న వీరుల వద్దకు, భీష్మ ద్రోణాదుల చెంతకు రథాన్ని ఉంచి కౌరవ సైన్యాన్ని చూడమన్నాడు. ప్రతి మానవ శరీరం కూడా రథమే, అందరిలోనూ దివ్యత్వం ఉంది. కానీ దైవ స్పృహ అందరిలో లేదు, దైవ స్పృహ కలిగిన దేహాలే ఉత్తమ రథాలు. అందుకే ఇక్కడ 'స్థాప యిత్వా రథోత్తమమ్' అని చెప్పారు. అందరిలోనూ దివ్యత్వం ఉంది. కానీ దైవ స్పృహ కొందరిలోనే ఉంటుంది, 'గుడాకేశేన' అంటే నిద్రను జయించినవాడు, తమోగుణాన్ని త్యజించినవాడు, అతి జాగ్రత్త పరుడు, కావున మనమందరం తమో గుణాన్ని మొదట జయించి (త్రిగుణాలను దాటి), జాగరూకులై, బ్రహ్మ విద్య అయిన శ్రీమద్భగవద్గీత ను అభ్యసించాలి, బ్రహ్మజ్ఞానాన్ని గురువు దగ్గర పొందాలి.

ఇక్కడ శ్రీకృష్ణుని 'చూడు' అనే మాట అర్జునుని ఆంతర్యంలో కల్లోలాన్ని రేపింది, అంతవరకు గంభీరంగా ఉన్న అర్జునునిలో అలజడి, కలత మొదలైంది. అదే శ్రీకృష్ణుని మాయ అదే గీతా భోధ కు బీజం వేసింది. అదే అర్జునుని జ్ఞానం బోధించమని శ్రీకృష్ణుడిని వేడుకునేటట్లు చేసింది.

1అ,26,27 శ్లో.
తత్రాపశ్యత్ స్థితాన్ పార్థః పితౄనథ పితామహాన్ |
ఆచార్యాన్ మాతులాన్ భ్రాతౄన్ పుత్రాన్ పౌత్రాన్ సఖీంస్తథా | 26 |
శ్వశురాన్ సుహృదశ్చైవ సేనయోరుభయోరపి |
పిమ్మట పార్థుడు ఆ ఉభయసేనలయందును చేరియున్న పెదతండ్రులను, పినతండ్రులను, తాతముత్తాతలను, గురువులను, మేనమామలను, సోదరులను, పుత్రులను, పౌత్రులను, మిత్రులను, పిల్లనిచ్చిన మామలను మున్నగు ఆత్మీయులను చూచెను.

తాన్ సమీక్ష్య స కౌంతేయః సర్వాన్ బంధూనవస్థితాన్ | 27 |
కృపయా పరయావిష్టో విషీదన్నిదమబ్రవీత్ |
సమరభూమికి వచ్చియున్న బంధువులను అందరిని చూచి, కుంతీపుత్రుడైన అర్జునుడు అత్యంత కరుణాసమంచితుడై శోకసంతప్తుడై ఇట్లు పలికెను.

అర్జునుడు అక్కడ ఉన్న రెండు సేనలలోని పితృ సమానులను మరియు తాతలను, గురువులను, మేనమామలను, సోదరులను, పుత్రులను, స్నేహితులను సమస్త బంధుగణాన్ని చూశాడు. రాజ్యాన్ని ధర్మబద్ధంగా పాలించాలనుకునే రాజుకి తర తమ భేధాలు ఉండకూడదు. పాండవులు ధీరులు అని ముందే తెలుసుకున్నాం. ధీరులకు కూడా ప్రేమ, మమకారం అడ్డు వచ్చే అవకాశం ఉంది. ప్రేమను కూడా ధర్మం వైపు నడిపించాలని దైవం ఎల్లప్పుడూ చూస్తుంది. ప్రేమ అనే బంధనాన్ని అడ్డుపెట్టుకొని దుష్ట కార్యాలకు పూనుకోరాదు, అటువంటి వాళ్లను ప్రోత్సహించరాదు. యుద్ధం చేయగల ధీరత్వం, వీరత్వం రెండూ సంతరించుకున్న వాళ్లు పాండవులు. అయితే యుద్ధం ఎవరితో? నాతో, నా కుటుంబంతో, నా వాళ్ళతోనే అనే ప్రేమాభిమానాలు అంకురించాయి. ఈ విషయాన్ని శ్రీకృష్ణుడు ముందుగానే గ్రహించాడు. తన వాళ్ళందరినీ ఒకే చోట చూడటంతో ఇన్నాళ్ల నుండి ఉన్న తన మనోస్థితి ఒక్కసారిగా మారిపోయింది. గొప్ప కరుణ ఆవహించింది, విషాదం కలిగింది. విషాదమైనా సరే ధర్మదృష్టి ఉంటే చాలు, ఆ విషాదం వ్యక్తిని భగవంతుని వైపుకు త్రిప్పుతుంది. అర్జునుని విషాదం అధర్మమైనది కాదు, స్వార్థపూరితమైనది కాదు, ధార్మికమైనది. అందుకే అర్జునుని విషాదం భగవద్గీత అనే బ్రహ్మ విద్యా ప్రతిపాదితము, యోగశాస్త్రము అయిన అద్భుత ఆధ్యాత్మిక జ్ఞానశాస్త్రం రావటానికి కారణమైంది.

తరువాత 27వ శ్లోకంలో అర్జునుడు తీవ్రమగు కృపకు వసుడై కృంగిపోవుచూ విలపించెను. ఈ కృపను భగవానుడు తరువాత నిరసించును (2-3) కృప సాదులక్షణము గదా? అయినప్పుడు ఎందుకు నిరసించ వలెను? కృప వేరు, దయ వేరు. కృప తనతో దౌర్బల్యమును కొని వచ్చును, తన కాశ్రయం ఇచ్చిన వానిని క్రియా అసమర్ధుని చేసి వేయును. దీనికి ప్రతి యగు దయ దైవగుణం (16 -2) .ఈ దయ 'ప్రేమ, వివేక, ప్రశాంత బలములతో'' పైనుండి దిగివచ్చును. ఇది మృదువు, కఠోరము రెండునూ అగును. దయతోనే ఈ దయ కఠోర చర్య గైకొనగలరు. గైకొని ఉద్ధరించగలదు.

అర్జునుడు అక్కడ ఉన్న రెండు సేనలలోని పితృ సమానులను మరియు తాతలను, గురువులను, మేనమామలను, సోదరులను, పుత్రులను, స్నేహితులను సమస్త బంధుగణాన్ని చూశాడు. రాజ్యాన్ని ధర్మబద్ధంగా పాలించాలనుకునే రాజుకి తర తమ భేధాలు ఉండకూడదు. పాండవులు ధీరులు అని ముందే తెలుసుకున్నాం. ధీరులకు కూడా ప్రేమ, మమకారం అడ్డు వచ్చే అవకాశం ఉంది. ప్రేమను కూడా ధర్మం వైపు నడిపించాలని దైవం ఎల్లప్పుడూ చూస్తుంది. ప్రేమ అనే బంధనాన్ని అడ్డుపెట్టుకొని దుష్ట కార్యాలకు పూనుకోరాదు, అటువంటి వాళ్లను ప్రోత్సహించరాదు. యుద్ధం చేయగల ధీరత్వం, వీరత్వం రెండూ సంతరించుకున్న వాళ్లు పాండవులు. అయితే యుద్ధం ఎవరితో? నాతో, నా కుటుంబంతో, నా వాళ్ళతోనే అనే ప్రేమాభిమానాలు అంకురించాయి. ఈ విషయాన్ని శ్రీకృష్ణుడు ముందుగానే గ్రహించాడు. తన వాళ్ళందరినీ ఒకే చోట చూడటంతో ఇన్నాళ్ల నుండి ఉన్న తన మనోస్థితి ఒక్కసారిగా మారిపోయింది. గొప్ప కరుణ ఆవహించింది, విషాదం కలిగింది. విషాదమైనా సరే ధర్మదృష్టి ఉంటే చాలు, ఆ విషాదం వ్యక్తిని భగవంతుని వైపుకు త్రిప్పుతుంది. అర్జునుని విషాదం అధర్మమైనది కాదు, స్వార్ధపూరితమైనది కాదు, ధార్మికమైనది. అందుకే అర్జునుని విషాదం భగవద్గీత అనే బ్రహ్మ విద్యా ప్రతిపాదితము, యోగశాస్త్రము అయిన అద్భుత ఆధ్యాత్మిక జ్ఞానశాస్త్రం రావటానికి కారణమైంది.

తరువాత 27వ శ్లోకంలో అర్జునుడు తీవ్రమగు కృపకు వసుడై కృంగిపోవుచూ విలపించెను. ఈ కృపను భగవానుడు తరువాత నిరసించును (2-3) కృప సాదులక్షణము గదా? అయినప్పుడు ఎందుకు నిరసించ వలెను? కృప వేరు, దయ వేరు. కృప తనతో దౌర్బల్యమును కొని వచ్చును, తన కాశ్రయం ఇచ్చిన వానిని క్రియా అసమర్ధుని చేసి వేయును. దీనికి ప్రతి యగు దయ దైవగుణం (16 -2) .ఈ దయ 'ప్రేమ, వివేక, ప్రశాంత బలములతో'' పైనుండి దిగివచ్చును. ఇది మృదువు, కఠోరము రెండునూ అగును. దయతోనే ఈ దయ కఠోర చర్య గైకొనగలరు. గైకొని ఉద్ధరించగలదు.

1అ,28,29,30 శ్లో.

అర్జున ఉవాచ,

దృష్ట్వేమం స్వజనం కృష్ణ యుయుత్సుం సముపస్థితమ్ | 28 |

సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి |

వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే |29|

అర్జునుడు పలికెను- ఓ కృష్ణా! సమరోత్సాహముతో రణరంగమున నిలిచియున్న ఈ స్వజనసమూహమును జూచి, నా అవయవములు శిథిలము లగుచున్నవి. నోరు ఎండిపోవుచున్నది. శరీరమునందు వణుకు, గగుర్పాటు కలుగుచున్నవి.

గాండీవం స్రంసతే హస్తాత్ త్వక్చైవ పరిదహ్యతే |

న చ శక్నోమ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః |30|

గాండీవము చేతినుండి జారిపోవుచున్నది. చర్మము తపించిపోవుచున్నది. మనస్సు భ్రమకు గురియైనట్లు అనిపించుచున్నది. కనుక ఇక్కడ నిలబడలేక పోవుచున్నాను.

ఇక్కడి నుండి అన్ని అర్జునుని శోకాన్ని వర్ణించే శ్లోకాలే. అర్జునుడు ముందుగా శరీరంలో కలిగిన మార్పులను వర్ణిస్తున్నాడు. పట్టుదప్పుతున్నాయని శరీరం వణుకుతున్నదని నోరెండి పోతున్నదని, గగుర్పాటు కలుగుతున్నదని ఇవన్నీ జ్వర లక్షణాలు. అయితే అర్జునుని మనసులో కలిగిన కలవరం వలన శరీరానికి వచ్చిన వికారాలు ఇవి. స్వజనులను చూడటం వలన తన వారిని చంపుకోవాల్సి వస్తున్నది అనే మమకారం వల్ల కలవరం. స్వధర్మ పాలన చేసే వాడికి మమకారం అడ్డు రాకూడదు. క్షత్రియుడికి యుద్ధం చేయడమే స్వధర్మం. అర్జునుని ఈ మమకారం అతడి స్వధర్మ నిష్టకు అడ్డు వచ్చింది. కేశవ! అనేక దుర్నిమిత్తాలు, అపశకునాలు కూడా కనిపిస్తున్నాయి అంటున్నాడు అర్జునుడు. మనిషిలో పిరికితనం, భయం ప్రవేశిస్తే మూఢుడై పోతాడు. విచక్షణ జ్ఞానం నశిస్తుంది. విజయం పై ఆశపోయి దుశ్శకునాలు కనిపిస్తాయి. స్వధర్మనిష్టుడైన వాడికి తన ధర్మాన్ని తాను పాలించడమే శ్రేయస్సు. అందులో నాకేం లాభం అని చూడకూడదు, లాభం కనిపిస్తే శ్రేయస్సు కాదు. ఈ శ్లోకంలో కృష్ణుని కేశవ! అని సంబోధిస్తున్నాడు. కేశవ అంటే కేసి అనే రాక్షసుని చంపిన వాడు అని కేసిని చంపినట్లే నా శోకాన్ని కూడా అంతం చేసి నాకు సదానందాన్ని కలిగించవయ్యా అని సమన్వయం.

1అ,31,32,33శ్లో.

నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ |
న చ శ్రేయోఽనుపశ్యామి హత్వా స్వజనమాహవే |31|
ఓ కేశవా! పెక్కు అపశకునములు కనబడు చున్నవి. యుద్ధమున స్వజనసమూహమును చంపుటచే శ్రేయస్సు కలుగునని అనిపించుటలేదు

న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ |
కిం నో రాజ్యేన గోవింద కిం భోగైర్జీవితేన వా |32|
ఓ కృష్ణా! నాకు విజయము గాని, రాజ్యము గాని, సుఖములు గాని అక్కరయే లేదు. గోవిందా! ఈ రాజ్యము వలనగాని, ఈ భోగములవలన గాని, ఈ జీవితమువలన గాని ప్రయోజనమేమి?

యేషామర్థే కాంక్షితం నో రాజ్యం భోగాః సుఖాని చ
త ఇమేఽవస్థితా యుద్ధే ప్రాణాంస్త్యక్త్వా ధనాని చ |33|
మనము ఎవరికై ఈ రాజ్యమును, భోగములను, సుఖములను కోరుకొనుచున్నామో, వారే ధనప్రాణములయెడ ఆశలు వదులుకొని యుద్ధమునకు వచ్చియున్నారు.

"న కాంక్షే విజయం కృష్ణ! న చ రాజ్యం సుఖాని చ", కృష్ణా నాకు రాజ్యం వద్దు, సుఖాలు వద్దు, విజయాన్ని కోరను అంటున్నాడు ఇప్పుడు అర్జునుడు.ఇదొక రకమైన తాత్కాలిక వైరాగ్యం,అసలు ఇంతకాలం నుండి ఆలోచనలు చేసింది యుద్ధం గురించి కాదా? ఇప్పుడు అర్జునునకు వచ్చిన వైరాగ్యం ఆత్మజ్ఞానం వల్ల వచ్చిన నిజమైన వైరాగ్యం కాదు,శ్మశాన వైరాగ్యం లాగా మమకారమనే జబ్బు వల్ల వచ్చిన తాత్కాలిక వైరాగ్యం మాత్రమే.అందుకే రాజ్యం వద్దు, సుఖాలు వద్దు,భోగాలు వద్దు అంటున్నాడు.అయితే ఈ యుద్ధం నిజంగా రాజ్యం కోసం, భోగాల కోసం అయితే భగవానుని దృష్టిలో ఇది తప్పు అవుతుంది.ఎందుకంటే ఇలా రాజ్యం కోసమే యుద్ధం అయితే అది కర్మ అవుతుంది, కానీ కర్మయోగం కాదు. ఫలితాన్ని ఆశించకుండా తన కర్తవ్యాన్ని నిర్వర్తించడమే కర్మయోగం.ఆ దృష్టి అర్జునునకు లేదు, తాను చాలా తెలివిగా వాధిస్తున్నానని భావించాడు అర్జునుడు.కానీ కృష్ణుని దృష్టిలో స్వధర్మ నిర్వహణ మాత్రమే యున్నది, ఎవరో మరణిస్తారని స్వధర్మాన్ని వదిలిపెట్టరాదు. యుద్ధం క్షత్రియునికి స్వధర్మం అందుకే యుద్ధమనే స్వధర్మ కర్మను తప్పక చేయాలి అర్జునుడు.

1అ,34,35 శ్లో.

ఆచార్యాః పితరః పుత్రాః తథైవ చ పితామహాః |
మాతులాః శ్వశురాః పౌత్రాః శ్యాలా: సంబంధినస్తథా | 34 |
గురువులు, తండ్రులు, తాతలు, కొడుకులు, మనుమలు, మేనమామలు, మామలు, బావమఱదులు, ఇతర బంధువులు మొదలగువారు అందరును ఇచ్చటికి చేరియున్నారు. (34)

ఏతాన్న హంతుమిచ్ఛామి ఘ్నతోఽపి మధుసూదన |
అపి త్రైలోక్యరాజ్యస్య హేతోః కిం ను మహీకృతే |35|
ఓ మధుసూదనా! ముల్లోకాధిపత్యము కొరకైనను నేను ఎవ్వరినీ చంపను. ఇక ఈ భూమండలవిషయమై చెప్పనేల? అట్లే వీరిలో ఎవ్వరైనను నన్ను చంపబూనిననూ నేను మాత్రము వీరిని చంపనే చంపను.

తనవాళ్లు,మనవాళ్ళు అనే మమకారం లేకుండా వాళ్ళు ప్రవర్తిస్తే అది వాళ్ళ వ్యవహారం. వాళ్ళు అలా వ్యవహరిస్తున్నారని నేను ఎందుకు అలా ప్రవర్తించాలి అనేది అర్జునుని ఆంతర్యం. ఎదుటివారిలోని దోషాలకు లేదా భావా వేశాలకు మనము స్పందించరాదు, మనలోని శాంతిని పోగొట్టుకొనరాదు. ఎవరి రోగమూ అంటించుకోకుండా అర్జునుని వలె ఉండటమే మానవునికి శ్రేయస్కరం, నిత్యజీవితంలో సంఘర్షణ పడకుండా ఉండాలని మనకు అర్జునుడు ఇచ్చే సందేశం. ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవాలి, ఇంద్రియాలపై పట్టుకోల్పోరాదు. స్వర్గలోకము, మానవలోకము, పాతాళము ఇవే త్రిలోకములు. ఈ మూడు లోకాల రాజ్యాధిపత్యాన్ని ఇచ్చినా తనవాళ్లను వధించడం సాధ్యం కాదు. అలాంటప్పుడు భూలోకంలో ఏదో కొద్దిపాటి రాజ్యం కొరకు వధించడం సాధ్యమా? అనేది అర్జునుని వాదము.

1అ,36,37 శ్లో.

నిహత్య ధార్తరాష్ట్రాన్నః కా ప్రీతిః స్యాజ్జనార్ధన |
పాపమేవాశ్రయేదస్మాన్ హత్వైతానాతతాయినః |36|
ఓ జనార్దనా! ఈ ధార్తరాష్ట్రులను చంపి, మనము బావుకొనునది ఏమి? (మనము మూట కట్టుకొనునది యేమి?) ఈ ఆతతాయులను చంపుటవలన మనకు పాపమే కలుగును.

తస్మాన్నార్హా వయం హంతుం ధార్తరాష్ట్రాన్ స్వబాంధవాన్ |
స్వజనం హి కథం హత్వా సుఖినః స్యామ మాధవ |37|
కనుక ఓ మాధవా! మనబంధువులైన ఈ ధార్తరాష్ట్రులను చంపుట మనకు తగదు. స్వజనులను చంపిన మనకు సుఖము ఎట్లు అబ్బును?

జనార్ధనా! ధృతరాష్ట్రుని బిడ్డల్ని చంపితే మాకేమి సుఖంతో? వాళ్ళు పాపాత్ములు. పాపుల్ని చంపితే మమ్మల్ని కూడా పాపమే చుట్టుకుంటుంది. కృష్ణా! బంధువులైన ధృతరాష్ట్రుని బిడ్డల్ని చంపడం మావల్ల కాదు. మాధవా!తన వాళ్ళని చంపుకొని ఎవరైనా ఎలా సుఖపడగలరు. ఇక్కడ అర్జునునికి కౌరవులకున్న రోగం అంటించుకోవడం ఇష్టం లేదని మనం గ్రహించాలి. ఆతతాయిలు అంటే అమానవీయ చర్యలకు పాల్పడేవారు,వికృత చేష్టలు చేసేవారు, ప్రకృతి విరుద్ధంగా కర్మలు చేసేవారు. 1.ఇంటికి నిప్పు పెట్టేవాడు. 2. విషం పెట్టేవాడు. 3.మారణాయుధాలు ధరించేవాడు. 4.పరుల ధనాన్ని అపహరించేవాడు. 5.ఇతరుల భూములను ఆక్రమించేవాడు. 6.అన్యుల భార్యలను అపహరించేవాడు లేదా అవమానించేవాడు.కౌరవులు పాండవులు పట్ల ఈ అకృత్యాలన్నీ చేశారు.కానీ ఇప్పుడున్న సమాజంలో చాలా మంది మనుషులు ఈ ఆరు రకాల వాళ్లే కాదు 60 రకాల విచిత్ర స్వభావం ఉన్న వారిని కూడా మనం చూస్తున్నాం. వారికి ఎటువంటి పేర్లు పెట్టలేం. బ్రహ్మవిద్య నందు కోవడానికి సిద్ధంగా ఉన్నవాడు అర్జునుడు,అందుకే శ్రీకృష్ణుని మీద ప్రశ్నల వర్షం కురిపిస్తున్నాడు. చంపడమే మనకు ఉన్న మార్గమా? మరొక మార్గాన్ని సూచించవలసిందిగా శ్రీకృష్ణుడిని పరోక్షంగా అర్జునుడు కోరుతున్నాడు. భగవద్గీత బోధకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పకనే చెబుతున్నాడు అర్జునుడు, శ్రీకృష్ణుడు కూడా సందర్భం కొరకు వేచి ఉన్నాడు.

1అ, 38,39శ్లో.

యద్యప్యేతే న పశ్యంతి లోభోపహతచేతసః
కులక్షయకృతం దోషం మిత్రద్రోహే చ పాతకమ్ | 38 |

కథం న జ్ఞేయమస్మాభిః పాపాదస్మాన్నివర్తితుమ్
కులక్షయకృతం దోషం ప్రపశ్యద్భిర్జనార్దన | 39 |

లోభకారణముగ భ్రష్టచిత్తులైన వీరు కులక్షయము వలన కలుగు దోషములను, మిత్రద్రోహమువలన సంభవించు పాపములను చూడకున్నచో, ఓ జనార్ధనా! కులనాశనమువలన కలుగు నష్టములను ఎరింగిన మనము ఈ పాపములకు దూరముగా ఉండుటకు ఏల ఆలోచింపరాదు?

అర్జునుడు శ్రీకృష్ణునితో ఇలా అంటున్నాడు. కులం నశిస్తే కలిగే చెడు ఏమిటో, మిత్ర ద్రోహం వల్ల ఏర్పడే పాతకం ఎలాంటిదో వాళ్లకు (కౌరవులకు) కనిపించకపోవచ్చు. వారికి రాజ్యమే కావాలి, అంతా లోభమే జనార్ధనా! కులక్షయము వల్ల కలిగే దోషమేమిటో మనకు తెలుసు కదా అలాంటప్పుడు ఈ పాపం నుండి మనం ఎందుకు తప్పించుకోకూడదు. లోభం మనిషి చేత ఏ పాపాన్నైనా చేయిస్తుంది. లోభికి లాభమే ప్రధానం, ధర్మం కాదు. లోభం గురువుల్ని గుర్తించదు, బంధువుల్ని ప్రేమించదు. దుర్యోధనాధులు పాడైపోయారు, అందువల్ల కులక్షయం వల్ల కలిగే దోషాన్ని వాళ్లు పట్టించుకోలేదు. లోభం ముందు ధర్మాధర్మాలు, పాప పుణ్యాలు పట్టించుకోరు. ధర్మబద్ధంగా రాజ్యం కావాలని పాండవులు ఆశించారు. అధర్మంగా నైనా రాజ్యాన్ని చేజిక్కించుకోవాలని దుర్యోధనుడు ఆరాటపడ్డాడు. రణ రంగానికి చేరారు, ఇక్కడ స్వజనుల్ని చూచిన తర్వాత మిత్రులను వీక్షించిన తర్వాత అర్జునుని మనస్సు మెత్తబడింది. లోభముతో పాడైపోయిన దుర్యోధనుని మనస్సు మారలేదు. కనుక అతడు రణరంగం నుండి మరలిపోలేదు, మారణ హోమాన్ని కోరుకున్నాడు. కానీ ధర్మమెరిగి దయాగుణం గల మేమైనా రణాన్ని ఎందుకని విరమించుకోకూడదు, కులక్షయం వల్ల సంభవించే ప్రమాదాలు చాలా ఉన్నాయి, అంటున్నాడు అర్జునుడు.

1అ, 40,41శ్లో.

కులక్షయే ప్రణశ్యంతి కులధర్మా: సనాతనాః |
ధర్మే నష్టే కులం కృత్స్నమ్ అధర్మోభిభవత్యుత |40|
కులక్షయమువలన సనాతనములైన కులధర్మము లన్నియును నశించును. ధర్మము అంతరించి పోయినప్పుడు కులమునందు అంతటను పాపమే వ్యాపించును.

అధర్మాభిభవాత్ కృష్ణ ప్రదుష్యంతి కులస్త్రియః |
స్త్రిషు దుష్టాసు వార్ణేయ జాయతే వర్ణసంకరః |41|
ఓ కృష్ణా! అధర్మము (పాపము) పెచ్చుపెరిగి పోయినప్పుడు కులస్త్రీలు మిక్కిలి దూషితలగుదురు. ఓ వార్ణేయా! స్త్రీలు దూషితలు ఐనచో వర్ణసాంకర్యము ఏర్పడును.

కులము నందలి పురుషులు యుద్ధమున నశించుటచే అనాదిగా వచ్చు కులధర్మములు నశించిపోవును. అట్లు ధర్మము నశింపగా కులమనందంతటను అధర్మము పెచ్చు మీరును. ఇక అందువల్ల కుల స్త్రీలు చెడిపోవుదురు, స్త్రీలు చెడిపోగా వర్ణ సంకరమగును. అట్టి సంకరము వలన కులఘాతకులకునూ, కులమునకును నరకము తథ్యము. ఏలన ఈ కులఘాతకుల పితరులు శ్రాద్ధ తర్పణములు లేక అధోగతి పాలగుదురు. శుభకరములైన శ్రేష్టులైన కులమర్యాదలసే సనాతన కుల ధర్మములని అందురు. కుల నాశన కారణమున ఈ కుల ధర్మములను ఎరిగినవారు, పరిరక్షించువారు అయిన పెద్దలు నశించినప్పుడు మిగిలిన వారందరి యందు ఈ ధర్మములు సహజముగానే అంతరించిపోవును.

శుభకరమైన శ్రేష్టమైన మర్యాదలు ఏ సమాజము నందు, ఏ కులమునందు నశించిపోవునో ఆ సమాజం లేదా కులంలోని వారు కళ్లెం లేని గుర్రములుగా విహారులైపోవుదురు. కుల ధర్మములు నశించి పోవుటచే కులము నందలి స్త్రీ, పురుషులిరువురూ విశృంఖలులై పోవుదురు. అప్పుడిక వారి కార్యకలాపములన్నియును దాదాపు అధర్మ యుక్తములగు చుండును.
పవిత్రమగు స్త్రీలు వివిధ వర్ణములకు చెందిన పరపురుషులతో సంపర్కము ఏర్పడి, వారికి కలిగిన సంతానం వలన వర్ణ సంకరమేర్పడును. శాస్త్రమును, కుల మర్యాదను తెలిసుకొని, ఆచరించు వారు మాత్రమే శ్రాద్ధ తర్పణములు చేయుటకు అర్హులు. కాని వర్ణ సంకరము ఏర్పడిన తర్వాత శ్రాద్ధ కర్మలు చేయుటకు అర్హత కోల్పోవుదురు. ఒకవేళ అజ్ఞానంతో చేసినా, అవి పితరులకు చెందవు. ఈ ప్రకారముగా పితరులకు సంతానము ద్వారా పిండ, జలములు లభింపనప్పుడు వారు దుర్గతుల పాలగుదురు.

1అ, 42,43,44 శ్లో.

సంకరో నరకాయైవ కులఘ్నానాం కులస్య చ |
పతంతి పితరో హ్యేషాం లుప్తపిండోదకక్రియాః |42|

వర్ణసాంకర్యము కులఘాతకులను, కులమును నరకమునందు పడవేయును. పిండోదకములు (శ్రాద్ధతర్పణములు) లోపించినందువలన వారి పితరులును అధోగతి పాలయ్యెదరు.

దోషైరేతైః కులఘ్నానాం వర్ణసంకరకారకైః |
ఉత్సాద్యంతే జాతిధర్మాః కులధర్మాశ్చ శాశ్వతాః | 43 |

వర్ణసాంకర్యమునకు మూలములైన ఈ దోషముల వలన కులఘాతకుల యొక్క సనాతన కులధర్మములు, జాతిధర్మములు నష్టమగును.

ఉత్సన్నకులధర్మాణాం మనుష్యాణాం జనార్దన |
నరకేఽనియతం వాసో భవతీత్యనుశుశ్రుమ |44|

ఓ జనార్దనా! కులధర్మములు నశించినవారికి నిరవధికముగా (కలకాలము) నరకప్రాప్తి తప్పదని ప్రతీతి.

వర్ణసంకరం జరిగితే జాతి ధర్మాలు, కుల ధర్మాలు నశించి ఎవరికి వారు ఇష్టారీతిన వ్యవహరిస్తారు. నీతి నియమాలు గాడి తప్పుతాయి. సామాన్య ధర్మాలు స్త్రీ, పురుష ధర్మాలు, విశేష ధర్మాలు అన్ని అవిచ్ఛిన్నమవుతాయి. ఇన్ని అనర్థాలకు మూలమైన యుద్ధం ఎందుకని అర్జునుడి అభిప్రాయం. కుల ధర్మాలు పాడు చేసిన వారికి నరకము తప్పనిసరి అని వింటున్నాము కదా! ఆధర్మ వ్యాప్తి, ప్రజలు అధోగతి అన్నీ తెలిసిన మనము దీనికి కారణమైన యుద్ధంలో ఎందుకు పాల్గొనాలి. కులధర్మములు, జాతి ధర్మములు నశించిన మానవులు పూర్తిగా ఆధర్మముల

యందు చిక్కుకొందురు. వారు చేసిన పాపాములకు ఫలితముగా కుంభీపాక, రౌరవాది నరకముల యందు ప్రవేశించి దీర్ఘకాలం వరకు నానావిధ భయంకర యమయాతనలు అనుభవించవలసి వచ్చును. అందువలన కుల నాశనమునకు కారణమగు చర్యలు ఎన్నడు కూడా చేయకూడదని అర్జునుడు ప్రకటిస్తున్నాడు.

1అ, 45,46,47శ్లో.

అహో బత మహత్పాపం కర్తుం వ్యవసితా వయమ్ |
యద్రాజ్యసుఖలోభేన హంతుం స్వజనముద్యతాః | 45 |

అయ్యో! మనము బుద్ధిమంతులమైయుండియు రాజ్యసుఖలోభముచే స్వజనులనే సంహరించుటకు ఉద్యుక్తులమై, ఘోరపాపకృత్యములకు ఒడిగట్టుచున్నాము- ఇది యెంత దారుణము? (45)

యది మామప్రతీకారమ్ అశస్త్రం శస్త్రపాణయః |
ధార్తరాష్ట్రా రణే హన్యుః తన్మే క్షేమతరం భవేత్ |46|

శస్త్రరహితుడనై, ఎదిరింపని నన్ను శస్త్రములను చేబూని ధార్తరాష్ట్రులు యుద్ధమున వధించినను, అది నాకు మిక్కిలి క్షేమకరమేయగును.

సంజయ ఉవాచ,

ఏవముక్త్వార్జునః సంఖ్యే రథోపస్థ ఉపావిశత్ |
విసృజ్య సశరం చాపం శోకసంవిగ్నమానసః |47|

సంజయుడు పలికెను- అర్జునుడు ఈ విధముగా పలికి శోకసంవిగ్న మానసుడై, యుద్ధభూమియందు ధనుర్బాణములను త్యజించి, రథము వెనుకభాగమున చతికిలబడెను.

'ఆహో ' అను అవ్యయము ఇచట ఆశ్చర్యద్యోతకము. 'బత' అను పదము మహా శోక సూచకము. మేము బుద్ధిమంతులమై వుండి రాజ్యసుఖ లోభము చే ఇంతటి మహా పాపమునకు ఒడి గట్టితిమి కదా! ఈ మాట అత్యంత ఆశ్చర్యమును, మిక్కిలి శోకమును కలిగించుచున్నది. మా అందరి రాజ్య సుఖానుభవ లోభముచే ఈ విధముగా ఉద్యమించుట చాలా దోషమని అర్జునుడు విచారిస్తూ తెలిపెను. ఆయుధాలు వదిలేసి ఎదురుగా నిలబడి యుద్ధం చేయని నన్ను వారు ఆయుధాలు ధరించి దృతరాష్ట్రుని కుమారులు నన్ను చంపినా నాకు మేలే. అంటే వాళ్ళని నేను ఎదిరించను, ఆయుధం పట్టను అని ఉభయ సేనల మధ్య అర్జునుడు ప్రకటిస్తున్నాడు. హింసతో విజయం సాధించడం కన్నా, అహింసా మార్గంలో మరణించడమే ఉత్తమ మార్గంగా భావిస్తున్నాడు. ఇది అర్జునుని లోని ధార్మిక స్పృహ. అన్ని విధాలుగా తన రథసారధికి వివరించిన అర్జునుడు ధనుర్బాణాలను క్రిందకు పడవేసి శోకతప్తుడై విల్లును, అమ్ములను వదిలి రథం దగ్గర మౌనంగా చతికిలబడి నానావిధ చింతలతో మునిగిపోయెను. అతని మనఃఫలకము

నందు కులనాశనము తద్వారా జరగబోవు దుష్పరిణామములు కళ్లెదుట కనిపించ సాగెను. అతని ముఖః మండలముపై విషాదము కమ్ముకొనెను. నేత్రములు కన్నీటి ధారలతో చెమ్మగిల్లినవి.

2వ అధ్యాయం – సాంఖ్య యోగము.

సాంఖ్యయోగము సంఖ్యతో గూడినది సాంఖ్యము. సాంఖ్యము అనగా జ్ఞానము, జ్ఞాన విచారణ యందు అనాత్మ వస్తువులను లెక్కించినప్పుడు సంఖ్యను ఆశ్రయించవలసి వచ్చును కనుక అది సాంఖ్య మని చెప్పబడును. ప్రకృతి నందుగల 24 తత్త్వములను లేక 96 తత్త్వములను లెస్సగా శోధించి అవి అనాత్మ రూపములని చర్చించి వానికి సాక్షిగా నున్నట్టి పరమాత్మను గ్రహించుటయే సాంఖ్య విద్య. అనాత్మనాత్మ వివేకరూపమగు విజ్ఞానమే సాంఖ్యం.

మొదటి అధ్యాయము గీతోపదేశం పూర్వ రంగమును వర్ణించుచు సంజయుడు ఉభయసేనలలో గల మహారధులను వారి శంఖ ధ్వనులను వర్ణించెను. రెండు సేనల మధ్యలో తన రధమును నిలుపుమని శ్రీకృష్ణుని అర్జునుడు అడుగటయు, పిమ్మట ఉభయ సేనలలో చేరియున్న స్వజన సముదాయమును చూసి శోక మోహితుడై అతడు యుద్ధము నుండి నివృత్తు డగుటయు మొదలగు విషయములను దెలిపి, సంజయుడు ప్రథమ అధ్యాయమును ముగించెను. ఇట్టి స్థితిలో శ్రీకృష్ణ భగవానుడు తెలిపిన విషయమును, అతడు అర్జునుని యుద్ధ సన్నద్ధునిగా చేసిన రీతిని వివరించుటకై సంజయుడు అర్జునుని విషాద స్థితిని వర్ణించుచు రెండవ అధ్యాయము ప్రారంభించెను.

ద్వితీయం అద్వితీయం అంటారు. ఈ అధ్యాయం నిజంగా అద్వితీయమే. గీతాసారం అంతా ఇందులోనే ఉన్నది. ఇది 72 శ్లోకాలతో కూడిన పెద్ద అధ్యాయము. ఇందులో 1 నుండి 10 వరకు గల శ్లోకాలు విషాదంలో మునిగి యున్న అర్జునుడు కృష్ణ ప్రభావానికి లొంగిపోయి సంపూర్ణ శరణాగతిని పొంది, ఆత్మజ్ఞానాన్ని అందుకొనుటకు అర్హతను సంపాదించిన విషయములను వివరిస్తున్నది. 11 నుండి 30 వరకు సంపూర్ణమైన ఆత్మ తత్త్వమును తెలియజేస్తున్నది. 31 నుండి 38 వరకు క్షత్రియ ధర్మాన్ని అనుసరించి చూచినా, అర్జునుడు తప్పక యుద్ధం చేయవలసిన విధిని గూర్చి తెలియజేస్తున్నది.

39 నుండి 53 వరకు నిష్కామకర్మ యోగం ఆవశ్యకతను తెలియజేస్తున్నది. 54 నుండి 72 వరకు గల శ్లోకాలు ఎవడు ఆత్మ జ్ఞానాన్ని పొంది ఆత్మానుభూతిలో ఉంటాడో అట్టి ఆత్మ జ్ఞాని స్థితప్రజ్ఞుడు ఎటువంటి లక్షణాలు కలిగి ఉంటాడో కన్నులకు కట్టినట్లు వివరిస్తున్నది. ఈ విధంగా అర్జునుని విషాదాన్ని పోగొట్టడానికి ఈ అధ్యాయంలోనే పూర్తి ప్రయత్నం శ్రీకృష్ణుని ద్వారా జరిగింది. అందుకే ఇది సమగ్రమైన అధ్యాయం. గీతాసారమంతా నిక్షిప్తం చేయబడిన అధ్యాయం.

అ2, 1శ్లో

సంజయ ఉవాచ,

తం తథా కృపయావిష్టమ్ అశ్రుపూర్ణాకులేక్షణమ్
విషీదంతమిదం వాక్యమ్ ఉవాచ మధుసూదనః |1|

సంజయుడు పలికెను - ఈ విధముగా కరుణాపూరిత హృదయుడైన అర్జునుని కనులలో అశ్రువులు నిండియుండెను. అవి అతని వ్యాకుల పాటును, శోకమును తెలుపుచుండెను. అట్టి అర్జుమునితో శ్రీకృష్ణభగవానుడు ఇట్లనెను.

మనిషి భౌతిక దృష్టితో ఈ భౌతిక ప్రపంచంలోని విషయాన్ని ఎంత తెలుసుకున్నా సరిపోడం లేదు. ఎంత డబ్బు సంపాదించినా సుఖంగాను సంతోషంగానూ ఉండటానికి సరిపోవడం లేదు, అంటే దీన్ని బట్టి పూర్ణమైనటువంటి జ్ఞానం వేరే ఏదో ఉంది. ఇప్పటివరకు అందిన వాటిల్లో పూర్ణత్వం లేదు ఒకవేళ ఉంటే మనిషికి ఆనందం దూరం కాకూడదు కదా, అలా దూరమవుతోంది అంటే జీవితంలోని వాస్తవాలకు మనం వాటిని అర్థం చేసుకునే విధానానికి మధ్య ఏదో అంతరం ఉంది. అదేంటి అనేది గమనించాల్సిన అవసరం ఉంది. మనలోని అనేక అంశాలు మనకు ఎంత విశ్లేషించినా అంతుచిక్కదు. విస్మరించినా దూరం కాదు, మన అంతరంగంలోని అలజడి మాత్రం ఆగదు వాటి పని అవి చేసుకుపోతూనే ఉంటున్నాయి. దీనికి కారణం మన పట్ల మనకు సరైన అవగాహన లేకపోవడమే. ఉదాహరణకు మనకు కనిపించే ఒక వస్తువు పట్ల మనకు అవగాహన ఉంటుంది. మనం ఉపయోగించే అనేక వస్తువుల పట్ల మనకు దాదాపుగా అవగాహన ఉంటుంది. ప్రతి వస్తువులోనూ వాహనంలోనూ ఎక్కడ రిపేర్ చేయాలో ఏ వాహనంలో ఏ వస్తువు సరిగా పనిచేయడం లేదో సరిగ్గా అంచనా వేయగలం. అలా చూసినప్పుడు ప్రతి వస్తువుని మనం సరిదిద్దుకోగలుగుతున్న లేదా రిపేరు మరమ్మత్తు చేయగలం, చేయించగలరు. అయితే ఇతర వస్తు, వాహనాదుల పట్ల మనకున్న అవగాహన మన దేహం అనే వాహనం లేదా ఈ పరికరం పట్ల మనకు అవగాహన లేకపోవడమే వీటికి కారణమని నిస్సందేహంగా ఏకగ్రీవంగా మనందరం అంగీకరించవలసినటువంటి అంశం. ఈ కార్యక్రమం లేదా ఈ విధానం అంటే ఈ మెకానిజం మనలో మనకు ఆరంభమైతే దాదాపుగా ఈ సమస్య సమూలంగా అంతమైపోతుంది. ఎందుకంటే సృష్టి మూలం మనలోనే ఉంది పరిష్కారాలన్నీ మనలోనే ఉన్నాయి. ఈ సత్యాన్ని గుర్తించినప్పుడు ఈ సామాజిక వ్యవస్థలోని అన్ని పరిస్థితులు చక్కబడుతాయి. ఇంతటి ఆలోచన మనిషిలో కలగడానికి ఇంతటి నేపథ్యాన్ని మనం చెప్పుకున్నాం, మొదటి అధ్యాయం అంతా కూడా అదే మన విషాదానికి కారణం. అందుకే మొదటి అధ్యాయానికి విషాద యోగం అనే పేరు సార్థకమయింది. ఆ విషాదమే నేటి సమాజంలోని వ్యక్తుల్ని ఆవరించి ఉంది. విషాదం అర్జునుడికి

అనుకుంటూ ఉన్నాం, పొరపాటు. అలా అనుకుంటే ఈ విషాదం, ఈ సమస్య సమాజం మొత్తానిది, ప్రజలందరి సమస్య. అన్ని దేశాలకు కాలాలకు సంబంధించిన సమస్య ఒక్క మాటలో చెప్పాలంటే మనిషికి మనిషే సమస్య, తనను తాను తెలుసుకోలేని సమస్య తన అస్తిత్వాన్ని తాను గుర్తించలేని అసమర్థత తన తత్వాన్ని పరిశీలించడం చేతకాని సమస్య. అందుకే ప్రతి మనిషి ఇలా సమాజాన్ని ఆవరించి ఉన్న జరా మృత్యు రోగం నుండి ఆ వ్యాధి నుండి గట్టెక్కించే బ్రహ్మవిద్యను లోకానికి తెలియజేయడమే పరిష్కారంగా భావించారు శ్రీకృష్ణార్జునులు. అందుకే అన్ని రకాల ప్రశ్నలని మొదటి అధ్యాయం అంతా సంధించాడు. ఇప్పుడు అతనికి సమాజాన్ని ఈ సమస్య నుండి తప్పించడానికి చేస్తున్న ప్రయత్నంలో కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి కలత చెందుతున్నాడు సమాజం సంస్కరించబడాలని కలవరపడ్డాడు ఆ కలవర పడిన గళము నుంచి జాలువారినవే అన్ని ప్రశ్నల బాణాలు. తనను తాను గుర్తిరిగే బ్రహ్మవిద్యను మనిషికి బోధ చేసే పరిస్థితిని ఇక్కడ కల్పించుకున్నారు. ఇప్పటివరకు చర్చించుకున్న అంశాలన్నీ కూడా మొదటి అధ్యాయం ఆరంభం నుంచి ఇప్పటివరకు చర్చించుకున్న అన్ని అంశాలు కూడా గీత ఆవిర్భావానికి నేపథ్యం మాత్రమే. అసలు గీత బోధ ఇంకా ఆరంభం కాలేదు. భగవానుడి బోధ ప్రారంభమైనప్పుడు గీతా బోధ ప్రారంభమైనట్లు, అప్పటివరకు జరిగిన అన్ని అంశాలను మనం నేపథ్యంగానే అంటే గీత ఆవిర్భావ నేపథ్యంగానే పరిగణించాల్సి ఉంటుంది.

2అ, 2శ్లో.

శ్రీభగవాన్ ఉవాచ,

కుతస్త్వా కశ్మలమిదం విషమే సముపస్థితమ్ ।
అనార్యజుష్టమస్వర్గ్యమ్ అకీర్తికరమర్జున ॥

శ్రీభగవానుడు ఇట్లనెను- ఓ అర్జునా! తగని సమయములో ఈ మోహము నీకు ఎట్లు దాపురించినది? ఇది శ్రేష్ఠులచే ఆచరింపబడునదియు కాదు, స్వర్గమును ఇచ్చునదియు కాదు, కీర్తిని కలిగించునదియు కాదు.

పిరికితనము, శోకము, మనోవ్యాకులత్వము మొదలైన వానిని భగవానుడు 'కశ్మలము' అని పేర్కొనెను. శరీరమునకు ఏ ప్రకారం మాలిన్య మంటు కొనునో మనస్సునకును శోక, మోహ,రాగ ద్వేషాది రూపమాలిన్యము అంటుకొనును. దేహముపై గల మురికిని వివిధ మార్గంల ద్వారా కడిగి వేయవచ్చు. మనోమాలిన్యమును పరమార్థ బోధ చే నివారింపవచ్చును. అర్జునుని ఈ కశ్మలములను శ్రీకృష్ణమూర్తి యొక్క దివ్యజ్ఞానోపదేశం తో తొలగింపబడనున్నది. అట్లే ప్రతివారును వారి వారి చిత్త కుహరములను పరిశోధించుకొని, అజ్ఞాన మాలిన్యమును గీతా ప్రభోదముచే తుడిచి వేయవలెను. ''ఆచార్యజుష్టం' ప్రపంచంలో రెండు తెగల వారు మాత్రమే కలరు. ఆర్యులు, అనార్యులు అని. ఆర్యులు

అంటే సన్మార్గము నవలంబించువారు, పవిత్రత చేపట్టు వారు, ప్రకాశమును వాంచించు వారు. ధైర్యము, ఉత్సాహము కలిగియుండు వారు ఆర్యులు. అనార్యులు అనగా దుర్మార్గము, నవలంబించువారు, అపవిత్రతను, కశ్మలమును జేబట్టు వారు, అంధకారమును వాంచించు వారు, అధైర్యము, నిరుత్సాహము, నిరంతర భీతి కలిగి ఉండువారు.

మానవత్వపు లక్షణాలను, వీరత్వాన్ని అధిగమించి ధీరత్వాన్ని సంతరించుకునేట్లు చేసుకోవాలి. అందుకు మార్గాన్ని భగవానుడు బోధించడం ప్రారంభిస్తున్నాడు. ప్రతి మనిషిలోనూ జరగాల్సిన అనివార్యమైనటువంటి ప్రక్రియ ఇది. అర్జునుడు ధీరత్వం దశ నుంచి యోగత్వం దిశకు సన్నద్ధమై ఉన్న సంధి దశ, సరిగ్గా ఈ దశలో అర్జునుడికి లేదా యోగత్వం సిద్ధింప చేసుకోవాలనుకునే మన అందరికీ ఈ గీతా మార్గం అత్యంత ఆవశ్యకం. అందుకే ఈ గ్రంథాన్ని బ్రహ్మవిద్యను అభ్యసింపజేసే యోగ శాస్త్రం అన్నారు. అర్జునుడు మనస్తత్వాన్ని మనం ఇప్పటివరకు చర్చించిన అంశాల్లో చూశాం. శత్రువులు యుద్ధ భూమిలో ఆయుధాలతో యుద్ధానికి సిద్ధంగా ఉన్నా కూడా అతను విముఖత చూపాడు గాని యుద్ధానికి ఉరకలేదు. అలాగే ధర్మాన్ని పరిరక్షించుకోవాలనే దృష్టిని మరల్చలేదు, అయితే ఈ రెండింటిని సమన్వయం చేసుకోవాల్సిన కిటుకు ఒకటి ఉన్నది. ఆ ముడి విప్పుకోవడం అర్జునుడికి తెలియలేదు. భౌతికతను ఆధ్యాత్మికతను సమన్వయం చేయగలిగే కిటుకు ఇదే ఈ విషయం జీవితాన్ని యోగంగా భావించినప్పుడు ఇది దర్శనమవుతుంది. ఇది దార్శనికతకు అందేదేగాని చర్మ చక్షువులకు అందదు. ఈ దార్శనిక దృష్టి పెంపొందించుకోవడానికి సిద్ధంగా ఉన్నవాడు అర్జునుడు. చూడటం వేరు దర్శించడం వేరు. ఆ దార్శనికతను అర్జునుడు ఎలా సిద్ధింప చేసుకుంటాడో ఈ గీతా ప్రయాణంలో అణువణువును పరిశీలనగా చూస్తూ ప్రయాణించినప్పుడు నెమ్మదిగా ఆ నిశిత పరిశీలన ద్వారా దార్శనికతకు మన దేహం సంసిద్ధమవుతుంది. అప్పుడు గ్రహించగలిగే శక్తి మనలో అభివృద్ధి చెందుతుంది.

2అ, 3 శ్లో.

క్లైబ్యం మా స్మ గమః పార్థ నైతత్త్వయ్యుపపద్యతే |
క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప ||

కావున ఓ అర్జునా! పిరికితనమునకు లోనుకావద్దు. నీకిది ఉచితము కాదు. ఓ పరంతపా! తుచ్ఛమైన ఈ హృదయదౌర్బల్యమును వీడి, యుద్ధమునకై నడుము బిగింపుము.

అంటే యుద్ధం చేయలేని అసమర్ధత కాదు యుద్ధం లేకుండా సామరస్యంగా సమస్యను పరిష్కరించుకుందామని అర్జునుడి నిరీక్షణ, అయితే అది వీలుకాని సందర్భాన్ని వివరిస్తూ యుద్ధం అనివార్యమని చెప్పి యుద్ధానికి ఉపక్రమించ

మంటున్నాడు భగవానుడు. యుద్ధానికి కావలసిన శక్తియుక్తులు, భగవంతుని అనుగ్రహం అన్ని ఉన్నాయి. అయితే ఎలా చేయాలి అనేది అర్జునుడికి అంతుచిక్కని అంశం, పరిపూర్ణ యోగం గురించిన ఆ చిక్కుముడిని అంటే తనలో ఉన్న తనను నాలో ఉన్న నన్ను ఆ నాలో ఉన్న నేనును గుర్తించే ఆ చిక్కుముడిని విడదీసుకుని దర్శించగలగాలి ఇంతటి మహత్తరమైనటువంటి కార్యాన్ని బ్రహ్మవిద్యను భగవానుడు తన బోధ ద్వారా అందిస్తున్నాడు.

సత్యాన్ని భౌతిక కళ్ళు దర్శించలేవు భౌతిక కళ్ళ ద్వారా గ్రంధాలను చదివి పాండిత్యం సంపాదించవచ్చు, కానీ జ్ఞానం, బ్రహ్మ విద్య అభ్యాసం అధ్యయనం ద్వారానే వీలవుతుంది. దీనికి రెండు మార్గాలు ఉన్నాయి ఒకటి సద్గురువుని ఆశ్రయించడం, రెండు గత జన్మల అపారమైనటువంటి సుకృతం ఉంటే స్వీయ అధ్యయనం, అంతర్ముఖ ప్రయాణం ఈ రెండింటిలో ఏదో ఒక మార్గం ద్వారా ప్రతి మానవుడు మధుసూదనుడిగా పరిణతి చెందాల్సిన అవసరం ఉంది, అదే జీవిత పరమార్థం కూడా. అన్యధా శరణం నాస్తి, ఎన్ని గ్రంథాలు చదివినా పాండిత్య ప్రదర్శన ఉంటుంది అంతేకానీ విద్యా అధ్యయనం వీలు కాదు. స్వా అనుభూతి లేక శాస్త్ర వాసనలచే సంశయంబు వీడదు.

ఇక్కడ మరో విషయం 'పరంతప' అంటున్నాడు,అంటే శత్రువుని పీడించేవాడు అని అర్థం. ఎలాంటి శత్రువుని దుర్యోధనుడిని ఈ పరిస్థితికి తీసుకొచ్చిన అతని పతనానికే కారణమవుతున్న, వామనుడిలా అతనిని ఆవరించి ఉన్న అరిషడ్వర్గాలనే అంతర్శత్రువులు, అది ఆ పదానికి అర్థం. అందుకే పరంతపా ఓ పార్థ ఇక నువ్వు ఆలోచించాల్సిన అవసరం లేదు, పిరికితనం నీకు సంబంధించింది కాదు నీలోని దృఢమైన లక్ష్యం వైపే నువ్వు దృష్టిని సారించాలి. మనిషిని మనిషిగా, మనిషిని మహర్షిగా, మహర్షిని మాధవుడిగా ఉంచే మహోత్సమైనటువంటి బోధనా విధానం. ఇది మనస్సులను మలచి మనుషులను తీర్చిదిద్దే కార్యంలో మహా శిల్పి లా ప్రదర్శించిన అసమానమైనటువంటి బోధనా కౌశ్శల్యమే ఇక్కడ మనకు కనిపిస్తుంది. అందుకే 'క్లైబ్యం మాస్మగమః' అనే పదునైనటువంటి అస్త్రాన్ని ప్రయోగించాడు. అంటే పిరికితనం పొందవద్దు అని అర్థం. అది పదం కాదు ఆ పదంలో అస్త్రం దాగి ఉంది. అందుకే ఓ పార్థ శత్రువులను పీడించే సంహరించే వాడివే కదా కాబట్టి హృదయ దౌర్భాల్యం నీకు తగదు, అది నీకు అంటదు, అది నీకు సంబంధం లేదు, లే రా నీ ధర్మాన్ని నీవు నిర్వర్తించు, అంటున్నాడు భగవానుడు.

2అ, 4శ్లో.

అర్జున ఉవాచ,

కథం భీష్మమహం సంఖ్యే ద్రోణం చ మధుసూదన |
ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హావరిసూదన

అర్జునుడు పలికెను - ఓ మధుసూదనా! పూజ్యులైన భీష్మపితామహుని, ద్రోణాచార్యులను యుద్ధమున ఎదిరించి బాణములతో ఎట్లు పోరాడగలను? ఏలనన ఓ అరిసూదనా, ఈ ఇరువురును నాకు పూజ్యులు.

నేను పిరికితనంతోనో, అధైర్యంతోనో కాదు కృష్ణా! వెనుకాడుతూ ఉన్నది, పూజించదగిన గురువులపై బాణాలను సంధించకూడదని వ్యక్తిత్వాన్ని మరింత స్పష్టం చేస్తున్నాడు. ఎంత లోతైన ఆలోచన ఇది. అర్జునుడి వ్యక్తిత్వం 'మధుసూదన' అని ప్రత్యేకించి సంబోధిస్తున్నాడు. పూజించదగిన ఆచార్యులను, ఆర్యులను చంపడం అశుభం కదా. ప్రాణం ఎవరైనా తీయగలరు, కానీ ప్రాణం పోయగలరా? అనేది అర్జునుడి ఆలోచన విధానం. ఇక్కడ ఉన్న సమస్య ఏమంటే ధర్మస్వరూపులైన పాండవులు నివసించడానికి కూడా వీలులేని పరిస్థితి అంటే ధర్మం నివసించడానికి వీలుకాని పరిస్థితిని కల్పించడం వల్ల భగవానుడు నోరు విప్పాల్సి వచ్చింది. అర్జునుడు సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంటూ 'కథం' అని ప్రశ్నిస్తున్నాడు. 'కథం'అంటే ఎలా?. ఇప్పుడు అతని మాటల్లో ప్రశ్నించే తత్వం పోయింది, నిలదీసే తత్వం పోయింది, నిర్ణయం తీసుకునే తత్వం కూడా పోయింది, సలహా ఇవ్వమని ఆ ప్రశ్న ధ్వనింప చేస్తుంది. భగవానుడు నోరు విప్పేటప్పటికీ ఏ విధంగా అని అడిగి మార్గాన్ని సూచించమంటున్నాడని మనకు స్పష్టంగా తెలియ వస్తుంది. ఇప్పటికే అతని దార్శనిక దృష్టి అలవడటం ఆరంభమైనట్లు మనకి తెలుస్తుంది. ఇదే పరిణితి చెందడం అంటే, అంతరంగాన్ని సూక్ష్మస్థాయిలో శోధించి తనను తాను లోతుల్లోకి వెళ్లి అర్థం చేసుకోవడానికి భగవద్గీత ఒక సాధనం. తద్వారా మనసు సమున్నతమైన ఆలోచనలపై కేంద్రీకృతమై అన్ని రకాల అహంభావనలు దూరమవుతాయి. చావు పుట్టుకల చిక్కుముడి ఎంత తికమక పెట్టినా, గీతా సాధకుడు వాటి నుండి విముక్తి పొందే మార్గాన్ని స్పష్టంగా తెలుసుకుంటాడు. రాగద్వేష రహితమైన దృష్టితో సమస్త విశ్వాన్ని సాక్షాత్కరింపజేసే తేజోమయమైన మనస్సును ఆవిష్కరించగలిగే మార్గమే గీతా మార్గం. అంతటి మహత్తరమైన మార్గం అర్జునుడి సంక్లిష్టతను అవలీలగా అర్థం చేయించి సత్యాన్ని అర్థం చేయించి సత్యాన్ని దర్శింప చేయగలదు. ఆ విషయం మనకు ఇక్కడ అర్జునుడి పరిణతి చెందిన దశలో స్పష్టంగా కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది. ఎందుకంటే అనేక కారణాలు చూపి నైతికతతో కూడుకున్నటువంటి కారణాలను చూపి నేను యుద్ధం చేయను అంటూ యుద్ధానికి విముఖత చూపాడు. అతని నిర్ణయంగా కూడా తేల్చి చెప్పాడు అలాంటిది ఇప్పుడు అర్జునుడి ప్రశ్నల్లో సందేహనివృత్తి చేసుకోవాలని దృష్టి మనకి కనిపిస్తోంది. అంటే ఏమి? యుద్ధం చేయను

అనటం లేదు, కానీ గురువుల్ని పూజ్యుల్ని బాణములతో ఎదిరించి ఎలా యుద్ధం చేయను కృష్ణా అంటూ తన సందేహాన్ని, తన యొక్క వ్యక్తిత్వాన్ని స్పష్టంగా తన భగవానుడితో తెలియజేస్తున్నాడు అర్జునుడు.

2అ, 5,6 శ్లో.

గురూనహత్వా హి మహానుభావాన్ శ్రేయో భోక్తుం భైక్ష్యమపీహ లోకే ।
హత్వార్థకామాంస్తు గురూనిహైవ భుంజీయ భోగాన్ రుధిరప్రదిగ్ధాన్ ।।

మహానుభావులైన ఈ గురుజనులను చంపకుండా బిచ్చమెత్తుకొని యైనను ఈ లోకమున జీవించుట నాకు శ్రేయస్కరమే. ఏలనన ఈ గురుజనులను చంపినను, రక్తసిక్తములైన రాజ్యసంపదలను, భోగములను మాత్రమే నేను అనుభవింపవలసి యుండునుగదా!

న చైతద్విద్మః కతరన్నో గరీయో యద్వా జయేమ యది వా నో జయేయుః |
యానేవ హత్వా న జిజీవిషామః తేఽవస్థితాః ప్రముఖే ధార్తరాష్ట్రాః | 6 |

ఈ యుద్ధముచేయుట శ్రేష్ఠమా? లేక చేయ కుండుట శ్రేష్ఠమా? అనునది ఎఱుగము. యుద్ధమున వారిని మనము జయింతుమా? లేక మనలను వారు జయింతురా? అను విషయమునుగూడ ఎఱుగము. మనకు ఆత్మీయులైన ధార్తరాష్ట్రులే ఇచట మనలను ఎదిరించి (పోరాడుటకు) నిలిచియున్నారు. వారిని చంపి, జీవించుటకును మనము ఇష్టపడము. (6)

కృష్ణా! గురువులు మహానుభావులైన వాళ్లను చంపడం మానేసి ఈ లోకంలో బిక్షం ఎత్తుకొని జీవించడం శ్రేయస్కరం కదా. మహానుభావులను చంపి నెత్తుటి కూడు తిని బతకడం అశుభం కదా అంటున్నాడు అర్జునుడు భగవానుడితో. రణరంగంలో ముందు వరుసలో ఉన్న సేనాధిపతులు పూజ్యనీయులు ఇది అర్జునుడి సమస్య ఒకవేళ యుద్ధ మానేస్తే శాంతి లభిస్తుందా అంటే అది లేదు. విరమించినా ఘర్షణే. ధర్మం తనంతట తాను ప్రశాంతంగా ఉన్నా కూడా ధర్మానికి నిలవడానికి నీడలేని క్లిష్ట పరిస్థితిని ఇక్కడ మనం గమనించాలి. ఇదే నేటి కలియుగమంతా ఆవరించి ఉన్నది కూడా. ధర్మం దేహం ద్వారానే ప్రకటితమవుతుంది, దేహాన్ని నడపటానికి ఇంధనం కావాలి. సరే బిక్షమెత్తి తింటాము అంటున్నాడు అర్జునుడు అందుకైనా దుర్యోధనుడు ఒప్పుకుంటాడా? ఒప్పుకోడే. యుద్ధ రంగంలో ఈ సంధి దశలో యుద్ధం చేయడమే సరైన భావించిన అర్జునుడు స్వధర్మాన్ని ఆచరించడమే తప్ప వేరే మార్గం లేదనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తుంది అయితే తానే జయిస్తాడని తెలుసు అర్జునుడికి. అదే మరి అతని సమస్య ఆ గెలుపు

ఓటమికన్నా, మరణం కన్నా ఇబ్బంది కరం అతనికి. ఎందుకంటే అర్జునుడు ధీరుడే కానీ యోగి కాదు కదా. యోగత్వం ఉన్నప్పుడు అతను చంపుతున్నది మనం గతంలో చెప్పుకున్న అంతరంగాన్ని ఆవరించి ఉన్న భౌతిక చక్షువుకి కనిపించని శత్రువుల్ని అని అర్థమవుతుంది.

ఇక్కడ మరో విషయం గమనించాలి అర్జునుడు యోగత్వాన్ని, బ్రహ్మవిద్యను, ఆ మార్గాన్ని పసిగట్టగలుగుతున్నాడు, దర్శించగలుగుతున్నాడు. అందుకే దుర్యోధనాధులలోని ఆలోచన ప్రవర్తన విధానం మారాలి కానీ వారిని చంపడం వల్ల ప్రయోజనం లేదు అని మొదటి నుంచి అంటూనే ఉన్నాడు. అయితే అది వీలుకానప్పుడు అవి ఆవరించి ఉన్న దేహంతో సహా చంపక తప్పదు అనే నిర్ణయం యోగత్వం సిద్ధింప చేసుకున్న వారికి అర్థమవుతుంది. మరో ముఖ్య విషయం దేహము అతనిలోని అంతరంగిక శత్రువులు రెండూ కూడా విడివడనంతగా ముడిపడి ఒకదానితో ఒకటి పెనవేసుకొని దేహాన్ని, మనస్సునీ, బుద్ధిని తొక్కి ఆ శత్రువులే కలుపు మొక్కల్లా ఏపుగా పెరిగిపోయి ఆ దుర్యోధనాధులను ఆవహించి రాజ్యమేలుతూ ఉన్న పరిస్థితి వారిది.

అందుకే భగవానుడు అలాంటి నిర్ణయం తీసుకున్నాడు. ఏదో ఒక అవయవం అయితే తగిన శస్త్ర చికిత్స ద్వారానో, మరమ్మత్తు ద్వారానో సరి చేసేవాడు. ఆ ప్రయత్నాలన్నీ వీలుకాకనే కదా ఇక్కడ దాకా వచ్చింది.

2అ, 7,8శ్లో.

కార్పణ్యదోషోపహతస్వభావః పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః ।
యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ।7।

కార్పణ్యదోషము (పిరికితనమునకు లోనై నా స్వభావమును కోల్పోయి గిలగిలలాడుచున్నాను. ధర్మాధర్మముల విచక్షణకు దూరమై నా కర్తవ్యమును నిర్ణయించుకొనలేకున్నాను. నాకు నిజముగా శ్రేయస్కరమైన దానిని తెలుపుము. నేను నీకు శిష్యుడను. శరణాగతుడను, ఉపదేశింపుము. (7)

న హి ప్రపశ్యామి మమాపనుద్యాత్ యచ్ఛోకముచ్ఛోషణమింద్రియాణామ్ ।
అవాప్య భూమావసపత్నమృద్ధం రాజ్యం సురాణామపి చాధిపత్యమ్ | 8 |

ఈ శోకము నా ఇంద్రియములను దహించి వేయుచున్నది. సిరిసంపదలతో గూడిన తిరుగులేని రాజ్యాధికారము లభించినను, కడకు సురాధిపత్యము ప్రాప్తించినను ఈ శోకదాహము చల్లారునుపాయమును గాంచలేకున్నాను. (8)

నా మనస్సు ను దైన్యం ఆవరించింది, ధర్మ నిర్ణయం చేసే శక్తిని నా మనసు కోల్పోయింది. అందుకే నిన్ను అడుగుతున్నాను, నాకు కావలసింది శ్రేయస్సు అది ఎలా సాధ్యము. నీవే ఖచ్చితంగా చెప్పాలి కృష్ణా!. నేను నీ శిష్యుడిని, నీవే నాకు శరణ్యము నన్ను శాసించు ఇది అర్జునుడి యొక్క మాటలు. జీవితమనేది ఒక సుదీర్ఘ ప్రయాణం, ఈ ప్రయాణంలో ప్రకృతి ప్రళయాలు ఎప్పుడు ఏ రూపంలో వచ్చి మనల్ని మేఘాల వలె కమ్మేస్తాయో మనకు తెలియదు. ఈ మానవ జీవన ప్రయాణంలో ఎప్పుడు ఏ సమస్య తలెత్తుతుందో కూడా తెలియదు. సాధారణ సమస్యల్ని సానుకూల దృక్పథంతో పరిష్కరించుకోవాలి. అయితే ధర్మాధర్మాల మధ్య సంఘర్షణ తలెత్తినప్పుడు వివేకవంతులు సైతం ఆలోచనలో పడాల్సిన పరిస్థితి వస్తుంది. ధీరులు ఈ పరిస్థితుల్లో వినాశనం వైపు మొగ్గు చూపకుండా శాశ్వతమైనటువంటి శ్రేయస్సు వైపే మరలుతారు. అర్జునుడు అదే చేశాడు, ఈ సంక్లిష్ట పరిస్థితిలో తనను తాను తనకు సంబంధం లేని వాడిగా భావించి నేను వేరు, నా దేహం వేరు అనే పరిపూర్ణ యోగమార్గాన్ని తిరిగి ఆ దిశగా ప్రయాణించడానికి సిద్ధమయ్యాడు. రెండు మార్గాల ద్వారా ఆత్మ విద్యను లేదా బ్రహ్మవిద్యను అధ్యయనం చేయొచ్చు అని, అందులో మొదటి మార్గాన్ని అవలంబించాలనే నిర్ణయానికి వచ్చిన అర్జునుడు సద్గురువును ఆశ్రయిస్తాడు. నేను నిర్ణయం తీసుకోలేని స్థితిలో ఉండటం వల్ల నేను నీకు శిష్యుడను కనుక నీవు చూపిన మార్గంలో నేను పయనిస్తానని ప్రతిజ్ఞ పూనుతున్నాను అని దాని యొక్క అర్థం.

అప్పటికే శ్రద్ధతో ధర్మశాస్త్రాలను పఠించి ఉన్నాడు, ఎందరో గురువుల బోధలు విని ఉన్నాడు అయినా అతని మనసు నిండా ధర్మ సందేహాలు చేరిపోయాయి,

'ధర్మసంమూఢ చేతాః' ఈ కారణంగా తనలోని ఆంతరంగిక పరిస్థితిని గమనించినటువంటి అర్జునుడు సత్య దర్శనమైతే తప్ప మరో మార్గం లేదని భావించి తాను తనను తన గురువుకి సమర్పించి తాను లేని స్థితికి చేరుకున్నాడు. ఏది ఏమైనా అర్జునుడు శ్రేయోదాయకమైన మార్గాన్ని ఎంచుకున్నాడు. ఇదో గొప్ప మలుపు, అంటే తనలో నిర్ణయ శక్తులు లేనందున తనను తాను భగవానుడికే వదిలిపెట్టాలనే నిర్ణయానికి వచ్చాడు. ఇక్కడ అర్జునుడు చేసిన సర్వ సమర్పణ చాలా సమున్నతమైనటువంటి ఘట్టంగా మనం పరిగణించాలి. తనను తాను దైవానికి సమర్పించినట్లు లెక్క, ఇలా దైవానికి సర్వసమర్పణతో చేసే ఏ కార్యమైన మనిషిని దైవత్వం వైపుకు, యోగత్వం వైపుకు పయనింప చేస్తుంది. ఈ పరిస్థితుల్లో ఉన్న ప్రతి మానవుడికి ఈ మార్గమే శ్రేయస్కరం. మనిషి పరిధిలులను దాటి ధార్మిక చైతన్యాన్ని విస్తృత పరచడం ధార్మిక ప్రగతి. దాన్ని సంకుచిత స్థాయికి కుదించడం ధార్మిక పతనం. ప్రగతి పథం వైపు పయనించడమే మనిషి యొక్క సహజత్వం. అందుకు కావలసిన మనుషులని, బుద్ధిని జాగృతం చేయడానికి తగిన కొలమానాలన్నీ కూడా మనకు భగవద్గీతలో నిక్షిప్తమై ఉన్నాయి. జీవితపు మూలాలను తెలుసుకునే మార్గం ఇది. మన దేహాన్ని

మనసును బుద్ధి తో నడిపించగలిగే దివ్యమైన నావ. ప్రాణ శక్తిని సైతం అదుపులోకి తీసుకొని, ఆత్మసాక్షాత్కారం పొందడానికి ఉపకరించే ప్రామాణికమైనటువంటి దిక్సూచి. ఈ సందర్భంలో గురు శిష్యుల బాంధవ్యం గురించి కొంత చర్చించుకోవాల్సిన బాధ్యత అవసరం ఉంది. ఇక్కడ గురు శిష్యుల బంధం అనేది అంటే విడదీయరానిది, సమపాళ్లలో నిండి ఉంటుంది. అదే దైవ ప్రేమ అప్పుడే అక్కడ బోధ మొదలవుతుంది, లేకపోతే అసంభవం. సర్వజీవుల పట్ల అపారమైన ప్రేమ తత్వం నిండి ఉన్నవారికి ఇలాంటి సదవకాశం లభిస్తుంది. ఆ ప్రేమ ఒకరి మీద ఒకరికి హక్కును కలిగింపజేస్తుంది, ఆ హక్కుతోనే అర్జునుడు నువ్వే నాకు నిర్ణయించి చెప్పు నేను నీకు శిష్యుడను. నిన్ను నేను శరణుజొచ్చిన వాడను. నన్ను శాసింపుము. చూసారా, ఇదే సర్వ సమర్పణ అంటే. అర్జునుడు జ్ఞాన బోధను వినడానికి సంసిద్ధం అయిపోయాడు. ఇలా ప్రసన్నత్వం వహించి సర్వ సమర్పణ గావించినవాడు అర్జునుడు.

కృష్ణా! సర్వేంద్రియ తాపంతో, శోకంతో కుమిలిపోతున్నాను. ఎలా తొలగించుకోవాలో తెలియడం లేదు. ఈ లోకంలో శత్రుశేషం లేని సకల ఐశ్వర్య సంపన్నమైన రాజ్యము లభించినా, నా శోకతాపాలు తీరేలా లేవు. సర్గాధిపత్యం కూడా అలాంటిదే అనిపిస్తుంది, అందుకే నాకు మరో మార్గం లేదు నువ్వే నాకు శరణ్యం అంటున్నాడు. జ్ఞానం అనే సౌధానికి ఓ పటిష్టమైన పునాది వంటిది ఈ రెండవ అధ్యాయంలోని 7,8 శ్లోకాలు. ఇది మలుపు, అద్భుతమైనటువంటి ఘట్టం. అర్జునుడు తనకు ఎదురైన పరిస్థితిని గమనించి తాను అభ్యసించాల్సిన విద్య ఏదో ఉందని గ్రహించి, ఈ మార్గాన్ని ఎంచుకోవడం, ఈ దిశగా తన ప్రయాణం ప్రారంభించడం మరో అద్భుతమైనటువంటి మలుపు. భగవానుడి సహాయంతో తనకున్న శక్తి యుక్తులతో యుద్ధం చేసి హాయిగా రాజ్యాన్ని రాజ్య భోగాల్ని అనుభవించకుండా సద్గురువును ఆశ్రయించి యోగ మార్గాన్ని ఎంచుకోవడం ఇది మానవ జీవితం పరమావధి. అప్పుడే జన్మ సార్ధకమైనట్లు.

2అ, 9శ్లో.

సంజయ ఉవాచ,

ఏవముక్త్వా హృషీకేశం గుడాకేశః పరంతప ।
న యోత్స్య ఇతి గోవిందమ్ ఉక్త్వా తూష్ణీం బభూవ హ ।।

సంజయుడు పలికెను- ఓ రాజా! ఈ విధముగా పలికిన పిమ్మట అంతర్యామియైన శ్రీకృష్ణునితో గుడాకేశుడైన అర్జునుడు, “నేను యుద్ధము చేయనే చేయను” అని స్పష్టముగా నుడివి మౌనము వహించెను.

హృషీకేశుడైన గోవిందునితో ఈ విధంగా పలికి నేను యుద్ధం చేయలేను అని తేల్చి చెప్పాడు, అని చెప్పి సంజయుడు ధృతరాష్ట్రుడితో చెప్పాడు. ఇక్కడ గోవిందా అని సంబోధిస్తున్నాడు. అందుకే గోవిందుడు అంటే ఎవరో తెలుసుకుందాం. 'గో' అనే పదానికి కామధేనువు అని అర్థం, కామధేనువు అంటే ఆవు అయినటువంటి గోమాత అనే నానుడి ఉంది. అంటే కోరిన వారికి కోరిన వరాలు ఇచ్చేదని అర్థం. ఇంకాస్త లోతుల్లోకి వెళ్లి ఆలోచించినప్పుడు మనిషికి కావలసిన వరం ఏమిటి? ఆహారం, అష్టైశ్వర్యాలు, భోగభాగ్యాలు ఇవన్నీ ఒక పరిధి వరకు భౌతిక అవసరాలు సౌకర్యాలు. ఇవి అంతా కూడా దేహం అంటే శరీరం యొక్క ప్రాథమిక అవసరాలు మాత్రమే. తరువాత ఏంటి అన్నప్పుడు ఈ దేహంలో ఉన్న ప్రాణం జీవం అని ఆలోచించవలసిన అవసరం ఉంది. ఆదిశగా మనం చూస్తే ఈ దేహంలోకి జీవం ఎలా వస్తుందో ఎలా పోతుందో ఇప్పటికీ ఏ శాస్త్రవేత్తలైన ఇద మిద్దమని నిర్ణయించారా? నిర్దేశించారా? తెలుసుకున్నారా?, భూమికి ఉన్న గురుత్వాకర్షణ శక్తి నుంచి అంతరిక్షపు అంచులను సైతం తాకగలిగాను కదా. తల్లి గర్భంలో పిండం అంటే మాంసపు ముద్ద ఎలా తయారవుతుందో వైద్యశాస్త్రజ్ఞులు నిరూపిస్తారు. మనం ఊహించగలం, ఆ పిండంలోకి ప్రవేశించిన జీవం సంగతి ఏంటి, ఆ జీవశక్తికి సంబంధించిన విచారణ చేయడమే మనిషి జీవితపు అంతిమ లక్ష్యం ఆ జీవశక్తే. గోవిందుడు అందుకే ఆ విద్య కోసం గోవిందా! శక్తిస్వరూపుడా! నీవే దిక్కు అని చెప్పి మౌనం వహించాడు. కాబట్టి మహాశక్తి స్వరూపమైన భగవంతుణ్ణి గోవిందా అని సంబోధిస్తున్నాడని మనకు తెలియాలి. ఆ మహా శక్తి వైపు మనిషి దృష్టిని సారించేటట్లు చేయటానికి మనిషిలోని ముందే మనం చెప్పుకున్న కంటికి కనిపించని అంతర శత్రువులను చంపడానికి ఉపకరణంగా అర్జునుడిని ఎంచుకున్నాడు గోవిందుడు. ఇది ఈ శ్లోకంలో దాగి ఉన్న నిగూఢమైనటువంటి అర్థం. అటువంటి గోవిందునితో నేను యుద్ధం చేయలేను, నిర్ణయం తీసుకోలేను అని తన పరిస్థితిని తెలియజేసి సర్వ సమర్పణ గావించి మౌనం వహించాడు.

2అ, 10శ్లో.

తమువాచ హృషీకేశః ప్రహసన్నివ భారత |
సేనయోరుభయోర్మధ్యే విషీదంతమిదం వచ: ||

ఓ ధృతరాష్ట్రా! ఉభయసేనల మధ్య శోకసంతప్తుడైన అర్జునుని జూచి, శ్రీకృష్ణుడు మందహాసముతో ఇట్లు పలికెను.

మహారాజా ఉభయసేనల మధ్య క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న అర్జునుడితో శ్రీకృష్ణుడు చిరునవ్వు చిందిస్తూ మాట కలిపాడు. అంటే తరువాతి 11వ శ్లోకం నుంచి బ్రహ్మవిద్య, ఆధ్యాత్మి విద్య ప్రారంభమవుతుంది అని దీన్ని బట్టి మనకు తెలుస్తుంది. ఇంతకముందు ఇదే రెండవ అధ్యాయంలోనే రెండు మూడు శ్లోకాలు సంక్లిష్ట పరిస్థితుల్లో ఉన్న అర్జునుడిని, మౌనం

వహించిన అర్జునుడిని పలకరించాడు. అంతే బోధ చేయలేదు. అలా పలకరించిన శ్రీకృష్ణుడితో తన అభిప్రాయాన్ని చెప్పి సాక్షాత్తు దైవాన్ని సద్గురువుగా ఎంచుకొని భగవానుడికి శిష్యుడయ్యాడు. అంటే బ్రహ్మ విద్య అభ్యసించడానికి శిష్యుడు, బోధించడానికి గురువు, సంసిద్ధంగా ఉన్నారు అని అర్థం. ఇక్కడ గురు శిష్యులను మనము దంపతులుగా పరిగణించాలి. ఎక్కడైనా గురు శిష్యులు అంటేనే అది ఒక దాంపత్య జీవనం. గురుశిష్యులది దాంపత్య జీవనం అనటానికి మనం కాస్త సందేహం కలగవచ్చు, అయితే అదే సత్యం. ఎలా అంటే దాంపత్యం అనేది శరీర సంబంధం మాత్రమే కాదని తెలుసుకోవాలి. భౌతిక, ప్రాపంచిక విషయాలకు అతీతంగా ఉంటూ ఒకరితో ఒకరు, ఒకరిలో ఒకరు తాదాత్యం చెందడమే దాంపత్యం. అలా మనము మరికొన్ని అంశాలను చూస్తే గృహస్థాశ్రమ దశలో స్త్రీ, పురుషులు కలిసి జీవించే భార్యాభర్తలు దంపతులు. రాష్ట్ర దశలో రాజు ప్రజలు దాంపత్యం వీరిది. విద్యావ్యవస్థలో విద్యార్థులు, ఉపాధ్యాయులు. సాహిత్యం విషయంలో శబ్దము, అర్థము దాంపత్యమిది. సమాజం దశలో వ్యక్తి, సమూహము. ఆధ్యాత్మిక దశలో గురువు, శిష్యుడు. ఇలా ఇప్పుడు మనం చెప్పుకున్న వారందరూ కూడా తమ తమ స్థాయిలో నిస్వార్థంగా పరమార్ధ దృష్టితో ఒకరితో ఒకరు సమన్వయంతో ముందుకెళ్ళినప్పుడు వీరి జీవితానికి జీవన విధానానికి అర్థం ఉంటుంది. ఇంతటి విశాల దృక్పథంతో ఆలోచించినప్పుడు సృష్టి అంతా కూడా వీటిపైనే ఆధారపడి కొనసాగుతుంది. సృష్టిలో ఉన్నటువంటి మూలం మనకు బోధపడుతుంది. ఒకరిలో ఒకరు మమేకమై సాక్షాత్తు మోక్షమార్గాన్ని తెలుసుకొని దైవాన్ని చేరుకునే విద్యను ఇద్దరూ కలిసి చర్చించుకోవడానికంటే మించినది ఈ భూమిలో మరొకటి ఏముంటుంది. నిజానికి స్త్రీపురుష దాంపత్య జీవనం ఇలా ఉండాలి. వివాహ వ్యవస్థను పటిష్టమైనదిగా రూపొందించింది మన భారతీయ వ్యవస్థ. గృహం అంటే ఇల్లు, ఏర్పాటు చేసుకున్నది కూడా అందుకోసమే. దైవ సాధనకే, తపస్సు కే. అంతేకానీ ఆస్తులు పెంచుకోవడానికి కాదు కదా. నేటి అస్తవ్యస్తపు సమాజానికి కారణం, తనతో తనకు సమన్వయం లోపించడమే, ఈ పరిస్థితికి మూలం కాబట్టి ఆ సమన్వయాన్ని పెంపొందించుకోవడానికి, దాంపత్య జీవన పెంపొందించుకోవడానికి, దాంపత్య జీవన విధానాన్ని నియమించుకున్నాం. మరొకటి శరీర వ్యవస్థను సమస్థితిలో ఉంచుకోవడానికి వ్యక్తిలో సహజంగా కలిగే భావాలకు తగిన వాతావరణం కల్పించడానికి. ఈ సత్యం గుర్తించే పరిస్థితి నేడు ఎక్కడుంది. ప్రాథమిక శారీరక అవసరాలను తీర్చుకుంటూ ఈ దేహాన్ని ఉపయోగించి దైవత్వం సిద్ధింప చేసుకునే మార్గమే వివాహం. అయితే పెళ్లిళ్లు ఇద్దరి ఆస్తులకు లేదా రెండు ఉద్యోగాలకు లేదా రెండు శరీర అవసరాలకు పరిమితమైపోయింది. భార్యాభర్తలు ఉన్నారు ఈ లోకంలో కానీ దంపతులు లేరే. దాంపత్యం లేదే, దాంపత్యం అంటే శరీర స్థాయిని, మానసిక స్థాయిని, బుద్ధిస్థాయిని దాటి వీటన్నింటిని అధిగమిస్తూ ఒకరిలో ఒకరు ఒకరితో ఒకరు మమేకమై చైతన్యపు స్థాయిలో కూడా సంఘమించగలగాలి. ఇద్దరూ ఏకమై దైవం వైపు దృష్టిని సారించాలి. ఆ ప్రయత్నం చేయని వారిని ఆ మార్గంలో ప్రయాణించని వారిని దంపతులుగా పరిగణించడానికి వీలు లేదు గాక లేదు. అలా ఉండని వారికి కేవలం భార్యాభర్తలు మాత్రమే. బాహ్య ప్రపంచంలో నేను ఫలానా వారి భార్యను నేను ఫలానా వారి భర్తను అని చెప్పుకోవడానికి లేదా భౌతిక

అవసరాలు, ఆస్తిపాస్తులు పంచుకోవడానికి అంతకుమించి దైవ స్థాయికి ఈ బంధం చేరనట్లు లెక్క. అంటే దాంపత్యం యొక్క పరమార్థాన్ని వీరు సంతరించుకోనట్లు లెక్క. దివ్యాత్మ స్వరూపులారా ఈ అంశాన్ని గమనించి వాస్తవాల్ని అంటే మన నిజ జీవితంలో జరిగే వాస్తవాన్ని జరుగుతున్న అనుభవాలని ఆలోచించుకొని మనం మన జీవితంతో సమన్వయం చేసుకొని దైవం వైపుగా మనసును మరల్చి, కేవలం భార్యాభర్తలు గాక దంపతులుగా జీవించాలి. భార్యాభర్తలు దాంపత్యం వైపు, దైవం వైపుగా దృష్టిని సారించాలి. ప్రతి వివాహితులు ఇలా ఆధ్యాత్మి విద్య అధ్యయనానికి సిద్ధంగా ఉండాలి. శిష్యుడైన అర్జునుడికి దేవాది దేవుడు బోధిస్తున్న విద్యను అర్జునుడితో పాటు మనం కూడా అధ్యయనం చేయడానికి సిద్ధమవుదాం.

2అ, 11శ్లో.

శ్రీభగవాన్ ఉవాచ,

అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।
గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ।।

శ్రీభగవానుడు పలికెను- ఓ అర్జునా! శోకింపదగని వారికొఱకై నీవు శోకించుచున్నావు. పైగా పండితుని (జ్ఞాని)వలె మాట్లాడుచున్నావు. పండితులైన వారు ప్రాణములు పోయిన వారిని గూర్చిగాని, ప్రాణములు పోనివారిని గుఱించి గాని శోకింపరు.

అర్జునా! ఏడవ కూడని వాళ్ళ కోసం ఏడుస్తున్నావు, పండితుల వాక్యాలు పలుకుతున్నావు, పండితులు పోయిన వాళ్ళ కోసం గాని, ఉన్నవాళ్ల కోసం గానీ దుఃఖించరు. ఇది భగవానుల వారి జ్ఞానబోధ ఆరంభ శ్లోకం. ఆత్మజ్ఞానమే కేంద్రంగా శోభిస్తున్న మోక్షప్రదాయని శ్రీమద్భగవద్గీత భగవానుడి మొదటి మాటలోనే నీవు శోకింపతగని వారికోసం అంటే ఏడవకూడని వారికోసం అనవసరంగా ఏడుస్తున్నావు. కాబట్టి దుఃఖించాల్సిన పరిస్థితి ఇక్కడ ఏముందని నువ్వు ఏ కారణం చేత ఎందుకని ఏడుస్తున్నావు చెప్పు అంతరంగపు ఆలోచనలలోకి నెమ్మదిగా తీసుకెళ్లి తన దృష్టిని పరుగులెడుతున్న అర్జునుడి మనసుని అంతర్ముఖత్వంలోకి మరలచుతున్నాడు, శ్రీకృష్ణుడు. ధర్మ నిర్ణయం విషయంలో దిక్కుతోచక మహాశోక సాగరంలో మునిగి ఉన్న అర్జునుడికి ఆత్మ జ్ఞానం అందించడం కంటే వేరే దారి లేదని భగవానుడు ఆత్మజ్ఞాన విద్యను ప్రస్తావిస్తున్నాడు.

ఇక్కడ గమనించాల్సిన అంశం ఏమంటే భగవానుడు అర్జునుడితో దుఃఖించకు అని చెప్పడం లేదు, దుఃఖించ తగినది కాదు అని స్పష్టం చేస్తున్నాడు, కారణం లేకుండానే దుక్కించడమేమిటి అని ప్రశ్నిస్తున్నాడు. దేహం ఉండటానికి ఆధార భూతం ఆత్మ. ఆత్మకు చావు లేదు, అది నిత్యమైనది, ఇంకా ఎందుకోసం దుఃఖించాలి? ఇక్కడ ఇప్పుడు దుఃఖించేది ఆత్మ కోసమా?, దేహం కోసమా? ఎవరికోసం ఈ దుఃఖం అంటున్నాడు.

మరణానికి ఎందుకు ఇంతటి బాధ అంటే దేహంలో ఏం జరిగినా మనం వాటిని చూస్తూ ఉంటాం కానీ, దేహమే రాలిపోతే ఆ తర్వాత ఏదీ ఉండదు అందుకే మరణ బాధ అంత దారుణంగా అనిపిస్తుంది. మరణం కూడా ఖచ్చితమే, అనివార్యమే కనుక మరణ బాధకు ఫలితం ఉండదు, కారణం కూడా ఉండదు.

ఎంత జాగ్రత్తగా ఈ శరీరాన్ని కాపాడినా ఇది స్థిరంగా ఉండబోదు కదా! ఏనాడు ఏ రోగం వచ్చి మోసగించునో ఎన్ని మందులు సేవించినా కర్మ తీరు వరకు ఈ తనువును విడిచిపెట్టదు కదా! ఎందరు వైద్యులు వచ్చినా మరణింపచేయు రోగమును పోగొట్టలేరు కదా! జీవుని ప్రయాణ కాలము నిర్ణయం అయినప్పుడు ఇంకొక్క నిమిషమైనా ఈ ప్రాణం ఈ దేహంలో ఉంటుందా? ఉండదు కదా. ఈ సత్యం దర్శించిన వారు దుఃఖించరు ఇది భగవానుడు అర్జునుడికి చేస్తున్నటువంటి బోధ యొక్క పరమార్థం.

2అ, 12శ్లో.

న త్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనాధిపాః |
న చైవ న భవిష్యామః సర్వే వయమతః పరమ్ | 12 |

నీవుగాని, నేనుగాని, ఈ రాజులుగాని ఉండని కాలమే లేదు. ఇక ముందు కూడ మనము ఉండము అనుమాటయే లేదు. (అన్ని కాలములలోను మనము ఉన్నాము. ఆత్మ శాశ్వతము. అది అన్ని కాలముల యందును ఉండును. శరీరపతనముతో అది నశించునది కాదు.)

పార్థ నేను ఒకప్పుడు లేనివాడిని కాను, నువ్వు కూడా లేని వాడివి కావు, ఈ రాజులందరూ కూడా ఒకప్పుడు ఉన్నవారే. మనమందరం భవిష్యత్తులో కూడా లేకుండా పోయే వాళ్ళము కానేకాము. ఇప్పుడు కూడా నాలోని అంటే ఈ శరీరంలోని నేను లేకపోవడం అన్నది లేనేలేదు. ఎప్పుడూ ఉంటుంది, చావు పుట్టుకలు దేహానికి మాత్రమే. ఉదాహరణకు కుండలో నీళ్లు ఉన్నాయి. అందులో ఆకాశం కనిపిస్తోంది, కుండ పగిలిపోయింది ఇప్పుడు కూడా ఆకాశం ఉంటూనే ఉంది కదా. ఈ నాలోని నేను కూడా అంతే నిత్యమే.

అలాగే నువ్వు, నీవాళ్లు, నేను, ఈ రాజులు ఎవ్వరు కూడా లేకపోవడం అన్నది లేదు. ఎప్పుడు ఉండేవారమే. దీన్ని బట్టి భగవానుడు జీవుడిని దేవుడిని ఒకే వేదిక పైకి తెచ్చాడు అని మనకు తెలియ వస్తుంది. ఇది సద్గురువైన భగవానుడి బోధనా నైపుణ్యానికి తార్కాణం. నువ్వు నేను అని తనను కూడా కలుపుకొని చెప్పడం అర్జునుడిలో ధైర్యం నింపటానికి ఇది దైవం వేసే ఎత్తుగడ. వ్యక్తిలో శక్తిని ధైర్యాన్ని నింపే గొప్ప ఉపాయం ఇది. భగవంతునికి భక్తునికి గురువుకి శిష్యుడికి భేదం లేదని అందరూ ఒక్కటేననే అపారమైన మనోధైర్యాన్ని ఇస్తున్నాడు భగవంతుడు. దిక్కుతోచని స్థితిలో ఉన్న అర్జునుడికి ధర్మ సూక్ష్మాన్ని స్పష్టంగా బోధిస్తున్నాడు. దేహవియోగానంతరం కూడా దేహి అంటే ఆత్మ ఉంటుందని తేటతెల్లం చేసి చెప్తున్నాడు. ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కరు కూడా ఒక కాలంలో పుట్టడం మరొక కాలంలో గిట్టడం, ఈ జనన మరణాలకు మధ్య ఉన్న కాలం లో మనిషి దేహంతో జీవిస్తాడు. ఒక వ్యక్తి ఉన్నాడంటే దేహంతో ఉన్నాడని అర్థం. ప్రతి మనిషికి మరణం అంటే బాధ, భయం, దుఃఖం అందుకే భగవానుడు ఆరంభమే జననం మరణం రెండూ సాధారణమే అని బోధ ప్రారంభిస్తున్నాడు. అంటే మనిషి ఎక్కడైతే దుఃఖానికి లోనవుతున్నాడో సరిగ్గా అక్కడి నుంచి బోధ చేసి అజ్ఞానపు మత్తును వదిలించి జ్ఞానం అనేది దాన్ని వెలిగిస్తున్నాడు. వాస్తవానికి నేనెవరు నాలో నేనుగా ఉన్నది ఎవరు అని ఆలోచిస్తే నేను దేహం కాదు కానీ నాకు దేహం ఉంది అనే సత్యం బోధపడుతుంది. అందుకే భగవానుడు అర్జునా నువ్వు ఉంటేనే అది ఉంటుంది, అది లేకపోయినా నువ్వు ఉంటావు. నువ్వు దేహం లేక ముందు కూడా ఉన్నవాడివే. అప్పుడు నీకు దేహం లేదు. లేనిదేహం ఇప్పుడు వచ్చింది అంటే దేహానికి ఆది ఉంది అది అనాది కాదు, కాబట్టి ఆది ఉన్నదేహానికి అంతం కూడా ఉంటుందని తెలుసుకోవాలి.

2అ, 13శ్లో.

దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా |
తథా దేహాంతరప్రాప్తి: ధీరస్తత్ర న ముహ్యతి । 13 |

జీవాత్మకు ఈ దేహమునందు కౌమారము, యౌవనము, వార్ధక్యము ఉన్నట్లే మఱియొక దేహప్రాప్తియు కలుగును. ధీరుడైనవాడు ఈ విషయమున మోహితుడు కాడు.

జీవుడికి ఈ దేహంలో బాల్యము తరువాత యవ్వనము ఆ తరువాత ముసలితనము కలుగుతూ ఉన్నాయి కదా అర్జునా! అలాగే చనిపోయిన తరువాత కూడా మరొక దేహం ప్రాప్తిస్తుంది. ఈ విషయంలో జ్ఞానులు గమనించవలసిన అవసరం ఉంది అని చెప్తున్నాడు శ్రీకృష్ణుడు.

అంటే ఈ అంశానికి సంబంధించిన జ్ఞానాన్ని సంప్రాప్తించుకోమని భగవానుడు స్పష్టంగా తెలియజేస్తున్నాడు. ఈ దేహానికి బాల్యం, యవ్వనం, వార్ధక్యం అనే అవస్థలు సహజంగానే ప్రాప్తిస్తున్నాయి. ఇదే విధంగా ఆత్మ మరోదేహాన్ని సంతరించుకోవడం కూడా అంతే సహజం. అటువంటప్పుడు ధీరులు ఈ అంశాన్ని గ్రహించాల్సిన ఆవశ్యకత ఉన్నది. ఈ దేహంలో జరిగే మార్పులన్నీ కూడా దేహ ధర్మాలే గాని ఆత్మ ధర్మాలు కావు, అందుకే మనం మరణించిన వ్యక్తి గురించి మాట్లాడేటప్పుడు జీవుడు దేహాన్ని వదిలేశాడు అతను శరీరాన్ని విడిచాడు అంటూ ఉంటారు. మారేదీ దేహమే, మరణించేది దేహమే. అది ఎప్పుడు మరణిస్తూనే ఉంటుంది అనేది అర్థం చేసుకోవాలి. మనం చెప్పుకున్న మార్పు అంతా కూడా ఒక్క క్షణంలో జరిగిపోలేదు కదా! ఒక్కసారిగాను ఒక్కచోటను జరగలేదు కదా, అది పుట్టిన నాటి నుండి గిట్టే వరకు జరుగుతూనే ఉంటుంది. ఒక ప్రవాహం లాంటిది. మన దేహంలోని ప్రతి జీవకణం నిరంతరం మార్పుకు లోనవుతూనే ఉంటుంది. ఈ బాల్య, యవ్వన, వార్ధక్య దశలు అలాగే దేహాంతర ప్రాప్తి కూడా ఒక దశ అని భగవానుడు తన శిష్యుడైన అర్జునుడికి మరియు ఇప్పుడు మనం కూడా శిష్యులై నేర్చుకుంటున్నాం కాబట్టి మనకు వివరిస్తున్నాడు. అవస్థలు మారినంత మాత్రాన జీవితం ఎలా నాశనం ఉండదో దేహాంతర ప్రాప్తి కూడా అలాంటిదే. క్రమంగా బాల్యం, యవ్వనం, ముసలితనం ఎలా ప్రాప్తించిందో అదే క్రమంలోనే దేహి మరో శరీరాన్ని పొందుతుందని తేటపరచాడు భగవానుడు. ఇదే దేహాంతర ప్రాప్తి అంటే. నేటి మనిషికి జీవితం చాలా భారంగాను, బాధగాను తయారైంది. జీవితం మృత్యువు కన్నా దుర్భరమైపోయింది.

ఈ శ్లోకం తనలోని తాను ఎప్పటికీ మరణించదన్న ఆత్మజ్ఞానం అందించడమే గీత ప్రధాన ప్రయోజనం. బాహ్యంలో ఉన్నది మాత్రమే మరణిస్తుంది,మనలోని ఆత్మశక్తిని దాని అనంత తత్వాన్ని తెలుసుకొని మృత్యు భయాన్ని వీడాలి.ఈ ఆంతరంగిక అవగాహన మనం సంప్రాప్తించుకోవాల్సిన అవసరం ఉంది.ఈ విషయంలో జ్ఞానులు శోకించరు,కనుక అర్జునా ! నిశితంగా పరిశీలించి ఈ సత్యాన్ని దర్శించు అంటూ దర్శింప చేస్తున్నాడు భగవానుడు.

2అ, 14శ్లో.

మాత్రాస్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణసుఖదుఃఖదాః
ఆగమాపాయినోఽనిత్యాః తాంస్తితిక్షస్వ భారత | 14 |

ఓ కౌంతేయా! విషయేంద్రియసంయోగమువలన శీతోష్ణములు సుఖదుఃఖములు కలుగుచున్నవి. అవి ఉత్పత్తి వినాశశీలములు. అనిత్యములు. కనుక భారతా! వాటిని సహింపుము. (పట్టించుకొనకుము)

అర్జునా! ఇంద్రియాలకు, ఇంద్రియ విషయాలతో సంబంధం కలిగినప్పుడు శీతోష్ణాలు కలుగుతాయి. అలాగే సుఖదుఃఖాలు ఏర్పడతాయి, పోతూ ఉంటాయి, స్థిరంగా ఉండవు. వాటిని నీవు ఓర్చుకోవాలి. భరత వంశంలో జన్మించిన ఓ అర్జునా! అంటే భగవానుడు ఎవరిని సంబోధిస్తున్నాడు? ఈ మార్గంలో విద్యనభ్యసిస్తున్న భగవంతుడి శిష్యులైన మన అందరిని దైవాంశ సంభూతులారా! ఇంద్రియాల యొక్క శబ్ద, స్పర్శాది విషయ సంయోగాలు చలిని, వేడిని సుఖాన్ని, దుఃఖాన్ని కలిగిస్తుంటాయి. అవి వస్తూ పోతూ ఉంటాయి. అవి అస్థిరములు.

మాత్రలు అంటే మన దేహంలో ఉండి శబ్దాధుల్ని గ్రహించే ఇంద్రియాలు చెవి, కన్ను, నాలుక, ముక్కు, చర్మం. స్పర్శలు అంటే పైన చెప్పుకున్న ఇంద్రియాలు అనే మాత్రల ద్వారా స్పృశించేటటువంటి విషయాలు స్పర్శలు. అంటే శబ్ద, స్పర్శ, రూప, రస, గంధం వీటిని స్పర్శలు అంటాం. ముందు చెప్పుకున్న పై ఐదు ఇంద్రియాలు ఈ ఐదు విషయాల్ని గ్రహిస్తూ ఉంటాయి. ఇంద్రియాలు ఏమో దేహంలోనివి, విషయాలేమో బయటవి అంటే బాహ్యంలో ఉంటాయి. శబ్ద విషయాల్లో ఉన్న వాటిని స్పర్శాదులు స్పృశించి ఆయా శబ్దాలు వేటికి సంబంధించినదో అంచనా వేయడానికి ఉపకరిస్తాయి. దేహం ఉన్నంతవరకు దేహంలో ఇంద్రియాలు ఉంటాయి. వీటి ద్వారానే జ్ఞాన సముపార్జన జరుగుతుంది. వీటినే పంచ జ్ఞానేంద్రియాలు, పంచతన్మాత్రలు అంటారు. ఈ పంచభూతాత్మకమైన భూమి ఉన్నంతవరకు విషయాలు ఉండనే ఉంటాయి, పంచ విషయాలు మనకు అందుతూనే ఉంటాయి. కాబట్టే ఇది ప్రపంచం అయిందని పెద్దలు చెప్తూ ఉంటారు. మాత్రలు స్పర్శలు మనకు అవసరం, అంతే కాదు అవి పరస్పరం సంబంధాల్ని కలిగి ఉండాలి కూడా అప్పుడే విషయ ప్రపంచానికి సంబంధించిన జ్ఞానం ఉత్పన్నమవుతుంది. తరువాత చలి వేడి, సుఖం దుఃఖం ఇవి ప్రతి రెండు కూడా ఒకదానితో ఒకటి కలిసే ఉంటాయి ఒకదాన్ని విడిచి ఒకటి ఉండదు. మన నీడ మనల్ని విడిచి దూరంగా ఉండటం ఎలా సాధ్యంకాదో అలాగే ఇవి కూడా ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. ఒకటి వస్తే దాని వెన్నంటే ఇంకొకటి కూడా వస్తుంది. పైన చెప్పుకున్న మాత్రలు అనే ఇంద్రియాలు, స్పర్శలు అనే విషయాలతో సంయోగం చెందడం ద్వారా మనకు చలి, వేడి తెలుస్తుంది, సుఖం సుఖం కలుగుతుంది. ఇక్కడ నిశితంగా మనం పరిశీలించి ఈ అంశంలోని సూక్ష్మాన్ని గ్రహించాలి. సూక్ష్మములోనే కదా మోక్షం ప్రాప్తించేది.

బాధకు మూలం అవగాహన రాహిత్యమే. అలా అర్థం చేసుకున్నప్పుడు గాలి ఎండ వానను మనం ఎలా ఆపలేమో శీతోష్ణ సుఖ దుఃఖాలు కూడా అలాంటివే. అందుకే భగవానుడు వాటిని ఆగమా పాయనాలు అన్నాడు. ఆగమం అంటే రావడం, అపాయం అంటే పోవడం. ఇవి అస్థిరమైనవి స్థిరంగా ఉండవు. వస్తూ పోతూ ఉంటాయి. వీటిని మనం సాక్షిగా వీక్షించాలి, సదవగాహనతో సహనాన్ని పెంచుకోవాలి. ఆ రాకపోకలు మన ఆధీనంలో ఉండవు, కానీ మన ప్రవర్తన, మన మనస్సు, మన ఆధీనంలో ఉంచుకోగలం. ఎందుకంటే శీతోష్ణాలు విషయాల నుండి ఏర్పడతాయి. కానీ సుఖదుఃఖాలు మనస్సు నుండి పుడుతుంది. అయితే తాను వాటిని తితిక్ష భారత సహించు భారతా, ఓర్చుకో బిడ్డ అంటున్నాడు.

ఇది అవగాహనతో, సాధనతో సిద్ధింప చేసుకోవలసినది. ఇక్కడ మళ్లీ శీతోష్ణ సుఖదుఃఖాల ఫలాపేక్షాలు కాకుండా సర్వ ద్వంద్వాల్నీ ఓర్చుకొని సమస్థితిని అలవర్చుకోవాలి. ఇక్కడ మళ్ళీ ఓర్చుకోవడం అంటే బాధల్నీ కష్టాల్నీ అనుభవించమని కాదు, అవగాహనతో పరిస్థితిని అవలోకనం చేసుకొని సమస్థితిలో ఉండటం. భగవానుడి శిష్యులమైన మనందరం జగద్గురువు బోధిస్తున్న అంశాల్నీ విద్యను తాత్విక కోణంలో పరిశీలించి మనందరం కూడా సమస్థితిని అలవర్చుకుందాం.

2అ, 15శ్లో.

యం హి న వ్యథయంత్యేతే పురుషం పురుషర్షభ |
సమదుఃఖసుఖం ధీరం సోఽమృతత్వాయ కల్పతే | 15 |

ఏలనన ఓ పురుషశ్రేష్ఠా! ధీరుడైనవాడు సుఖదుః ఖములను సమానముగా చూచును. అట్టి పురుషుని విషయేంద్రియ సంయోగములు చలింపజేయజాలవు. అతడే మోక్షమును పొందుటకు అర్హుడు.

ఇంద్రియాలు ఇంద్రియ విషయాలతో అంటే మాత్రాస్పర్శల సంయోగం ద్వారా శీతోష్ణాలు, సుఖదుఃఖాలు కలుగుతున్నాయని మనం ఇది వరకే తెలుసుకున్నాం. వీటి కారణంగానే మానవుడు సుఖదుఃఖాల ఊబిలో పడి బాధకు గురి అవుతున్నాడు. అర్థం లేని అర్థం కాని అనాలోచిత పరిస్థితి ఇది. అలా కాక సమస్తితిని సాధించుకున్న పురుషుడిని ఈ సుఖదుఃఖాలు బాధించలేవు అంటున్నాడు. సాధారణంగా మనం సుఖానికి అనుకూలంగానూ, దుఃఖానికి ప్రతికూలంగానూ ఉంటాం. సుఖదుఃఖాలు రెండూ మనోవికారాలు. వాస్తవానికి వాటిలో సుఖం సుఖంగా లేదు. ఈ అంశం పట్ల మొదటగా మనం స్పష్టత తెచ్చుకోవాలి. ఒక వ్యక్తికి సుఖంగా ఉండేది మరో వ్యక్తికి దుఃఖంగాను, ఇబ్బందిగాను ఉంటుంది.

ఒకే వ్యక్తికి ఒక దశలో ఒక కాలంలో సుఖాలుగా అనిపించేవే అదే వ్యక్తికి మరో దశలో మరో కాలంలో దుఃఖంగా ఉంటున్నాయి. అలాగే ఒక దశలో దుఃఖంగా అనిపించినవి మరో దశలో మరో కాలంలో సుఖంగాను అనిపిస్తాయి. ఒకసారి సుఖం రూపంలో వచ్చిందే మరోసారి దుఃఖం ముసుగు వేసుకొని వస్తోంది.

శబ్దాది విషయాలను జయించి సుఖదుఃఖాల పట్ల సమభావం ఉన్నవారు ధీరులు. ఈ స్థితిని పొందడం ఎలా? సుఖదుఃఖాల యందు ఆ సమత్వ స్థితిని కలిగి ఉండటమే ధీరత్వం. అర్జునుడిలా ధీరత్వాన్ని సంతరించుకున్న

వాళ్ళందరూ ఈ మోక్షమార్గానికి అర్హులే. సాధారణంగా మనిషికి, దేహస్థుడికి దేహాన్ని, మనసుని కుదిపేస్తాయి. అయితే వీరుడికి అలా కాదు అతను ఆత్మస్థుడు, నిత్యాత్మ దర్శనిష్టుడు.

నిత్యాత్మ దర్శనిష్ఠుడు శీతోష్ణాధి ద్వంద్వాలను సహించగలిగినవాడు, మృత్యువును దాటి మోక్షమార్గానికి సమర్థుడు అని నిర్ధారించాడు భగవానుడు. స్థూల, సూక్ష్మ శరీరం ప్రతాపానికి లోను కాకుండా ఉండేవాడు. ఉదాహరణకు ఆరుబయట పొయ్యిలోని మంట కుండను, కుండలోని నీళ్లను ఉడికించగలదు. అయితే అందులో కనిపించే ఆకాశాన్ని ఉడికించలేదు కదా. ఆత్మస్థితి రూపమోక్షమే మరణ రహితమైనది. కాబట్టి మోక్షం అనేది ఆకాశంలోనూ స్వర్గంలోనూ ఉండే వస్తువు కాదు, అది మనలో మనం సంప్రాప్తించుకోగలిగిన ఒకానొక స్థితి అని మనం అర్థం చేసుకోవాలి. కనుక భగవానుడు ఈ శ్లోకంలో చెప్పినట్లుగా మనందరం కూడా పురుష శ్రేష్టులుగా అంటే ధీరులుగా ఆ ధీరత్వాన్ని సంతరించుకోవాలి.

2అ, 16శ్లో.

నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః |
ఉభయోరపి దృష్టోఽంతః త్వనయోస్తత్త్వదర్శిభిః ||

అసత్తు అనుదానికి (అనిత్యమైనదానికి) ఉనికియే లేదు. సత్తు అనుదానికి లేమి లేదు. ఈ విధముగ ఈ రెండింటియొక్క వాస్తవస్వరూపములను తత్త్వజ్ఞానియైన వాడే ఎఱుంగును.

నామరూపాత్మకములై నశించే స్వభావం కలిగినటువంటి దేహాదులకు అంటే దేహము మొదలైన వాటికి ఉనికి లేదు. సత్యమైనట్టి ఆత్మకు లేమి లేదు. తత్వ జ్ఞానులు ఈ రెండింటి యొక్క నిశ్చయం పట్ల సదవగాహన కలిగి ఉంటారు. లేనిది ఉండేది లేదు, ఉన్నది లేకుండా ఉండదు. ఈ రెండింటి యదార్ధ స్వరూపాన్ని ఎరిగిన వారే జ్ఞానులు అంటున్నాడు జగద్గురువు.

ఉంది అనేది సత్తు అంటే ఆత్మ, దైవం, శక్తి. ఏ పేరు పెట్టుకున్నా అది ఎప్పటికీ ఉంటుంది. కాలంతో, దేశంతో, స్థలంతో సంబంధం లేకుండా సర్వకాలికంగానూ, సార్వజనీనంగాను ఏదైతే ఉందో అది సత్తు.

ఉంది అన్నప్పుడు లేకుండా పోవడం అనేది జరగదు. అది అనంతమైనది, అవధులు లేనిది, అపరిమితమైనది. కాలానికి ఒక చక్ర భ్రమణం ఉంది అయితే ఇది వలయం కాదు, వర్తులమే. ఎందుకంటే కాలం నుంచి వెనక్కి వెళ్లడం జరగదు ఇది ఏకముఖం. స్థలము, దేశము అంతా కూడా బహుముఖం అయినా కూడా ఒకప్పుడు లేదా ఒక దశలో

ఒక కాలంలో ఉండి వెళ్ళిపోయేది అసత్తు. లేదు అన్నప్పుడు అది కొంతకాలం వుండి వెళ్లిపోయి లేదనిపించుకునేది ఏదైనా అది లేనట్లే లెక్క. వచ్చి వెళ్ళిపోయేది ఏదైతే ఉందో అది ఎప్పటికీ లేనట్లే లెక్క.. దానికి ఉనికి లేదు ఇది దేశ కాలాలకు అతీతం కాదు కదా. అందువల్ల ఈ అంశంపై మనకు స్పష్టత రావాలి. నిశితంగా నెమ్మదిగా అంతర్ముఖత్వంలోకి వెళ్లి పరిశీలిస్తే ఖచ్చితంగా మనకు దర్శనమవుతుంది. బాహ్య పరిస్థితుల్ని ఆలోచించే మన దృష్టికి కొంత దూరంగా ఇది అనిపించినా ఆ దృష్టిని దారి మళ్లించి అంతరంగానికి మరల్చగానే ఈ సత్యం మనకి అవగతం అవుతుంది.

ఆకాశము నుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి నీరు, నీటి నుండి భూమి ఇది సృష్టి క్రమం. ఈ సృష్టికి పూర్వం ఒక్కటే ఉంది, అది తప్ప మరొకటి లేదు. ఆ ఆత్మలోకాలను అంటే ఈ సృష్టిని సృష్టించాలని సంకల్పించింది అని ఐతరియోపనిషత్తులో ఉంది.

బ్రహ్మం యొక్క సంకల్పంతోనే సృష్టి ఆవిర్భవించింది. కార్యమైన సృష్టి, కారణమైన బ్రహ్మం కన్నా వేరుగా లేదు. సృష్టి ఉంది అన్నప్పుడు సృష్టిలో ఉంది అనేది సృష్టి విలీనమైనప్పుడు కూడా ఉంటుంది, ఆ బ్రహ్మమే సత్తు. సృష్టి అనేక నామాలతో, రూపాలతో మనకు గోచరించే మూలశక్తి ఒక్కటే, అదే సత్తు. అది ఎప్పటికీ ఉంటుంది. అదే ఋషులు చెప్తున్న సనాతనం, శాశ్వతం. ఇలా ఎన్ని పేర్లు పెట్టుకున్నా నేనంటే ఈ శరీరం మాత్రమే కాదని మానససరోవరముల కెళ్ళి తెలుసుకోవాలి. ఈ స్వ అనుభవం ద్వారానే యదార్థం తెలియవస్తుంది.

'స్తత్వ దర్శిభిః' ఈ దేహం వచ్చేది, పోయేది కాబట్టి ఎప్పటికీ ఇది లేనట్లే తెలియాలి. అందులోని సర్వవ్యాపకమైన సత్తు ఎప్పటికీ ఉంటుంది, కాబట్టి అది ఎప్పటికీ ఉన్నట్లే గ్రహించాలి. అందుకు ఈ దేహంలో మనం శ్వాసించడానికి ఉపకరిస్తున్న ప్రాణ శక్తి ప్రవాహాన్ని మనం సాధనంగా స్వీకరిస్తే ఈ దర్శనం సులభతరం అవుతుంది. ఈ అవ్యక్తానికి, వ్యక్తానికి మధ్య ఉన్న ప్రయాణం తెలిస్తే చాలు. రెండింటినీ గూర్చిన నిర్ణయం తత్వజ్ఞులు దర్శించగలరు. చూడటం వేరు, దర్శించడం వేరని మనం గతంలో చెప్పుకున్నాం. అందుకే తగిన దార్శనికతను అలవర్చుకుంటూ తత్వజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ ముందుకెళ్లాలి.

2అ, 17శ్లో.

అవినాశి తు తద్విద్ధి యేన సర్వమిదం తతమ్ ।
వినాశమవ్యయస్యాస్య న కశ్చిత్ కర్తుమర్హతి ।17 ।

నాశరహితమైన ఆ సత్యము (పరమాత్మ తత్త్వము) జగత్తునందు అంతటను వ్యాపించియున్నదని యెరుంగుము. శాశ్వతమైన దానినెవ్వరును నశింపజేయ జాలరు.

సర్వవ్యాపకమై నిండి ఉన్న సత్ అనే బ్రహ్మం నశించనిది అని తెలుసుకో. అవ్యయమైన దీన్ని నశింప చేయడం ఎవరికీ సాధ్యం కాదు. ఎవ్వరూ అర్హులు కారు, నశించే స్వభావం లేనిది అవినాశి.

సత్ అనే బ్రహ్మం యొక్క స్వరూపం వ్యయం కాదు, దానికి అవయవాలు ఉండవు, రూపం ఉండదు. కనుక అవ్యయమైన ఈ జగత్తు అంతా వ్యాపించి ఉన్న ఈ బ్రహ్మమును నశింప చేయడం ఎవరికి సాధ్యం కాదు అని జగద్గురువు, సత్యం యొక్క తత్వాన్ని ఈ శ్లోకంలో తెలియజేస్తున్నాడు. కనుక దుఃఖానికి అవకాశం లేదు. ఈ నిత్యా నిత్య వివేకాన్ని అర్జునుడితో అంటే మనతో సత్య నిర్ణయం చేసి చెప్తున్నాడు. పెద్దలు చెప్పిన సాధన చతుష్టంలో అంటే నాలుగు విధానాల సాధనా పద్ధతుల్లో మొదటిది నిత్యా నిత్య వివేకం. 16వ శ్లోకంలో సత్య నిర్ణయం గురించి స్పష్టంగా వివరించిన జగద్గురువు ఈ శ్లోకంలో వాటి వాటి విధులను తెలియజేసి నిర్ణయించి దర్శించగలిగే సామర్థ్యాన్ని పెంపొందింప చేస్తున్నాడు. లేని అసత్తుకు ఉనికి లేదు, ఉన్న సతుకు లేమి లేదు అని శాస్త్రీయంగాను ప్రామాణికంగానూ, తాత్వికంగానూ చర్చిస్తున్నాడు. దేహానికి గుండె ఎంత కేంద్రమో అలాగే ఈ రెండవ అధ్యాయమైన సాంఖ్య యోగానికి 16, 17, 18 శ్లోకాలు కేంద్ర బిందువు వంటివి. 16వ శ్లోకంలో సత్తును చర్చించి 17వ శ్లోకంలో చెప్పుకున్న సత్తు యొక్క తత్వం గురించి చర్చిస్తున్నాడు. ఇవి మనకు విపులంగా అవగాహన అయితేనే ముందు ముందు అంశాలు బోధపడతాయి. ఎలా అంటే చక్కెర ఉప్పు లాంటి పదాలను మనం పలకడం ద్వారా మనకు రుచి తెలియదు కదా. వాటిని రుచి చూస్తేనే ఉప్పదనము, తీయదనము అనిపిస్తుంది. అలాగే ఈ పదాలను పలకడం ద్వారా కాదు, ఆ దర్శనం గావించాలి. అంతరాంతరాలలోకి వెళ్ళి అంతః చైతన్య సీమలలో ఉన్నటువంటి అనేక ఆధ్యాత్మిక అంశాలను మనం దర్శించగలగాలి. ఈ సమస్త జగత్తు సర్వమిదం,ఇది అంతా వ్యాపించి ఉంది. ఈ ప్రపంచమంతా సదాత్మచేత పరివ్యాప్తమై ఉంది. అన్నింటిలోనూ సత్తువ్యాపించి ఉంటుంది. అందుకే అది సర్వవ్యాపకం. సత్తును సద్వస్తువును నశింపజేసే శక్తి, అర్హత ఎవ్వరికీ లేదు కాబట్టి నువ్వు ఎవ్వరినీ చంపడం లేదు. చంపలేని సత్తును నీకు

చంపడం కూడా వీలుకాదు, కాబట్టి అర్జునా నీ కర్తవ్యాన్ని, నీ ధర్మాన్ని నిర్వర్తించు అంటూ, నిత్యా నిత్య వివేచన గావిస్తూ, అర్జునుడికి బ్రహ్మవిద్యను బోధిస్తున్నాడు జగద్గురువు.

2అ, 18శ్లో.

అంతవంత ఇమే దేహా నిత్యస్యోక్తాః శరీరిణః|
అనాశినోఽప్రమేయస్య తస్మాద్యుధ్యస్వ భారత | 18 |

ఈ శరీరములు అన్నియును నశించునవియే. కాని జీవాత్మ నాశరహితము, అప్రమేయము (అనిర్వచ నీయము). నిత్యము. కనుక (ఈ విషయమును ఎఱింగి) ఓ భరతవంశీ! అర్జునా! నీవు యుద్ధము చేయుము.

శరీరాలను ధరించే జీవుడు నిత్యుడు, నాశనము లేనివాడు. ఈ శరీరాలు అంతరించిపోతాయి, అందుచేత యుద్ధం చేయి నాయనా అంటున్నాడు జగద్గురువు.

తాడును చూసి పాము అనుకోవడం అజ్ఞానం, అంటే ఉన్న దాన్ని ఉన్నట్లుగా తెలియకపోవడమే కాక మరొకటిగా ఊహించడం ఎంత దారుణం. ఇది మన పరిస్థితి. ఈ ఉన్నదాన్ని ఉన్నట్లుగాను లేని దాన్ని లేనట్లుగాను తెలిస్తే చాలు, అంటే మనలోని భ్రమలు తొలగింప చేసుకుంటే చాలు. చాలా వరకు మనం సురక్షితులమే, జ్ఞానం పొందే సంగతి కనీసం వాస్తవాలను కూడా గ్రహించలేని అసమర్ధత కారణంగా మనిషి కలతకులోనై కలవర పడుతున్నాడు. అందుకే భగవానుడు ఆ కలతను పోగొట్టడానికి 16, 17 శ్లోకాలలో చాలా స్పష్టంగా అనేక ప్రమాణాలతో తేట తెల్లం చేసి ఉన్నది ఉన్నట్లుగా, లేనిది లేనట్లుగా విపులీకరించాడు, విప్పి చెప్పాడు. ఈ భ్రాంతి అనే మత్తుకు కారణం మాయామయమైన దేహాన్ని ధరించడం.

ఈ శరీరమున్నంతకాలం ఆశలకు లోబడి ఐశ్వర్యములే స్థిరమనుకొని అరిషడ్వర్గాది భ్రాంతులకు దాసులై జ్ఞాన భిక్షకు సద్గురుని ఆశ్రయించలేకపోతున్నారు. ఈ మత్తు వదలక పోతే మనలోని జీవుడిని దర్శించడం వీలు కాదు. అందుకని ఈ మత్తును వదిలించడానికి జగద్గురువు మనకు సత్య నిర్ణయం గావించాడు. కాబట్టి తాడును పాము అనుకునేలాంటి భ్రాంతిని తొలగించుకోవాలి. అందుకే ఈ శ్లోకంలో ఆసత్తుని గురించి స్పష్టం చేస్తున్నాడు. ఎలా మనం భ్రాంతికి లోనవుతున్నామో ఈ శ్లోకంలో స్పష్టం చేశాడు. సత్తును గూర్చి తేటతెల్లమయ్యాక ఇప్పుడు అసత్తును కూడా లేనిదాన్ని కూడా లేనట్లుగానే మనకు స్పష్టం చేశాడు. అంటే దేహాన్ని ఉపాధిగా కలిగిన దేహి సత్. సత్ అయిన దేహికి ఉపాధి. అసత్తు రూపమైన దేహం, ఈ అసత్తు రూపమైన దేహాలు అనిత్యాలు, అంతవంతాలు. అంతమయ్యే స్వభావం

కలవి కాబట్టి. అందుకే భగవానుడు వీటిని అంతవంతాలుగా పేర్కొన్నాడు. అవే శరీరాలు, ఈ శరీరాలలో చరించేవాడే శరీరి. అందుకే శరీరిన: అన్నారు. అందుకే దేహం అనిత్యం.దేహినిత్యం,సత్తు, అవినాశి. దేహం ఒకటిగా కనిపించినా ఈ దేహం అనేక అవయవాల కలయిక ఇది.

అవయవాలతో కలసివున్న ఈ చర్మంతో కప్పబడినటువంటి ఈ దేహం యంత్రాలకు అమర్చిన ఆయా వస్తువులు ఊడిపోయినట్లు ఏదో ఒక రోజు, ఈ అవయవాల కలయిక అయినటువంటి ఈ దేహం కూడా విడిపోతుంది, ఊడిపోతుంది. అందుకే ఈ దేహం అసత్తు. ఇది తెలియక ఈ దేహాన్ని నాది అనే భ్రాంతికి లోనై ప్రపంచమంతా అల్లకల్లోలం సృష్టిస్తూ ఉంటాం. ఎండమావులలో నీళ్ళు ఉన్నట్లు పంచభూతాత్మక ప్రపంచంలో దేహాలు ఉన్నాయి. కాబట్టి ఈ భ్రాంతిని, భౌతిక ప్రపంచపు మత్తును, ఈ క్షణమే తొలగించుకుందాం. ఈ శ్లోకంతో సత్తు, అసత్తుల నిర్ణయం పూర్తయింది. వీటన్నింటినీ గ్రహించి చక్కగా అవలోకనం చేసుకుందాం.

2అ, 19,20శ్లో.

య ఏనం వేత్తి హంతారం యశ్చైనం మన్యతే హతమ్
ఉభౌ తౌ న విజానీతో నాయం హంతి న హన్యతే | 19 |

ఆత్మ ఇతరులను చంపునని భావించువాడును, అది (ఆత్మ) ఇతరులచే చంపబడునని భావించువాడును, ఆ ఇద్దఱును అజ్ఞానులే. ఏలనన వాస్తవముగా ఆత్మ ఎవ్వరినీ చంపదు, ఎవ్వరిచేతను చంపబడదు. (19)

న జాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా భవితా వా న భూయః ।
అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే । 20 ।

ఈ ఆత్మ ఏ కాలమునందును పుట్టదు, గిట్టదు. పుట్టి ఉండునది కాదు. ఇది భావ వికారములు లేనిది (ఉత్పత్తి, అస్తిత్వము, వృద్ధి, విపరిణామము, అపక్షయము, వినాశము అను ఆఱును భావ వికారములు) ఇది జన్మ లేనిది. నిత్యము, శాశ్వతము, పురాతనము. శరీరము చంపబడినను ఇది చావదు.

దేహదారి అయిన జీవుడు చంపేవాడని భావించే వాడికి సత్యం తెలియదు. అలాగే జీవుడు చంపబడే వాడు అని భావించే వాడికి యధార్థం తెలియదు. దేహి చంపేవాడు కాదు, చంపబడే వాడు కాదు. ఎవడు ఈ ఆత్మను చంపేదిగా

తెలుసుకుంటాడో, ఎవడు ఈ ఆత్మను చచ్చేదిగా భావిస్తాడో, ఆ ఇద్దరూ కూడా తెలిసినవారు కారు. ఈ ఆత్మ చంపదు, చంపబడదు.

ఇదే భావం స్ఫురించే కఠోపనిషత్తులోని ఒక శ్లోకం చూద్దాం. భగవద్గీత ఉపనిషత్తుల సారమే కదా, ఆ శ్లోకం చూద్దాం.

తాను చంపుతున్నట్లు భావించేవాడు, తాను చంపబడినట్లు భావించేవాడు ఇద్దరూ సత్యాన్ని తెలుసుకోలేని వారే. ఆత్మ చావదు, చంపబడదు కూడా ఇది మనకు కఠోపనిషత్తు లో ఉన్నటువంటి శ్లోకం. నేను చంపుతున్నానని, అలాగే నేను చంపబడుతున్నానని, అనుకునే ఇద్దరు కూడా తెలిసినవారు కాదు. ప్రస్తుతం మనం చెప్పుకుంటున్న దేహిని హంత అనుకునేవాడు దేహం చనిపోయినప్పుడు అది హతమయింది అనుకునేవాడు ఇద్దరూ కూడా అవివేకులు. ఆత్మ చంపదు, హననక్రియకు కర్త కాదు. చంపబడదు, కర్మ కాదు. అంటే క్రియ లేనిదే ఆత్మ.

20వ శ్లోకం-- ఆత్మ ఎన్నడూ పుట్టదు కాబట్టి మరణించదు. కొంతకాలం ఉండి తరువాత లేకుండా పోయేది కాదు. కొంతకాలం లేకుండా ఉండి ఆ తర్వాత ఉండేది కూడా కాదు. ఆత్మ పుట్టుక లేనిది, నిత్యమైనది, పురాతనమైనది. దేహం క్షీణించినా ఆత్మ నశించదు. పుట్టడం అంటే అప్పటి వరకు లేనిది రావడం, కొత్తగా కనిపించడం అని అర్థం. చావడం అంటే, అంతవరకు ఉన్నది లేకుండా పోవడం. లేకుండా వచ్చేది జన్మ. ఉండిపోయేది మరణం. ఈ రెండూ ఈ ఆత్మకు లేవు. మన అవగాహన కోసం భగవానుడు చిక్కుముడిని విప్పి చూపి ఆ విప్పడం ఎలాగో దర్శింపజేస్తున్నాడు. దీన్నిబట్టి జననం ఉంటేనే మరణం. జననం లేకపోతే మరణమూ ఉండదు. మరణం అంటే ఒక్క మాటలో చెప్పుకోవాలంటే మార్పు. కర్త ఉండాలి, కర్మ జరగాలి అప్పుడే మార్పు జరుగుతుంది. ఇవి రెండూ లేని వాటికి మార్పు ఉండదు కదా! మనం 19వ శ్లోకంలో ఇప్పుడే చెప్పుకున్నాం కదా, కర్త క్రియ లేదని. కర్మ కూడా లేదని. కాబట్టి మార్పు అనేది ఏదైతే ఉందో అదే మరణం. అంతకంటే వేరుగా ఏమీ ఉండదు. మార్పు అంటే మరణం, మరణం అంటే మార్పు అని మనం గుర్తిస్తే, అప్పుడు భగవానుడు చెప్పినటువంటి ఈ శ్లోకంలో ఉన్న నిగూఢ అర్థం మనకి బోధపడుతుంది.

లేనిది కలగడం అంటే అంకురించడం అనుకుందాం అది ఒక విధమైన భావన, లేదు ఒక క్రియ. అది దాని సమయం అయిపోగానే అది వచ్చిన దారిలోనే మరలిపోవడం అనేది కూడా ఒక క్రియ. ఇలా లేనిది వచ్చి మరల లేకుండా పోతుంది. బాగా గమనించాలి, ఇలా మనం ఆలోచించినప్పుడు ఆత్మ పురాణహః అని అంటే పురాతనం అని, అది దివ్యమైనదని, ఆత్మ చంపేది కాదని, చంపబడేది కాదని మనకు దర్శనమవుతుంది. ఆ విధమైన ఆత్మ తానే అని తెలిసిన జ్ఞాని జీవించి ఉన్నప్పుడే ముక్తుడు. వీరిని జీవన్ముక్తులు అంటాం. ఇలాంటివారు దేహంలోనే ఉంటారు కానీ దేహంలో అంకురించే లేదా దేహంలో కలిగే లేదా దేహంలో పొతమరించే ఏ విధమైన భావనలకు ఉద్వేగాలకు లోను

కారు. అవన్నీ తనవి కావని గ్రహించి నేను దేహం అనే భావన, మహాత్ములలో కలగదు. నేను అనే భావన లేకుండా దేహంలో ఉంటారు. నాది అనేది తెలియని శరీరం అనే ఇంట్లో నివసిస్తూ ఉంటారు. వాళ్ళు తనలో నేను నాది అనే అహం ఆవిరైపోయి ఉంటుంది. అలాంటి వాళ్ళలో అందుకే అలాంటి వారిని మహాత్ములు అంటాము. అహాన్ని సమూలంగా వేర్లతో సహా పెకలించి వేయాలి. ఇక్కడ జ్ఞానము, భావన రెండూ భిన్నమైనవి. మన జీవితం రెండింటితోను ముడిపడి ఉంటుంది. మన జీవితాల మీద ప్రాబల్యం వహిస్తూ ఉంటాయి. ఎక్కువగా జ్ఞానం పాత్ర చాలా తక్కువ అందులోనూ ఆధ్యాత్మికత, భగవంతుడు, ఆత్మ వంటి సత్యాలను జ్ఞానంతో విచారణ చేసుకోవాలని జిజ్ఞాస కూడా తక్కువే. కారణం మన ఇంద్రియాలు బహిర్ముఖంగా ప్రయాణిస్తూ ఉంటాయి కదా! వీటిని అధిగమించి ఆ బహిర్ముఖ ప్రయాణాన్ని వెనక్కు తిప్పి దారి మళ్ళించి అంతర్ముఖమైతే అప్పుడు ఆ అన్వేషణ ప్రారంభమవుతుంది.

ఈ శ్లోకంలోనుంచి మనం గ్రహించవలసినటువంటి ప్రధానమైనటువంటి అంశం ఏమిటంటే, లేనిది కలగడం అనేది అంటే అంకురించడం అనేది ఒక భావన. ఇవన్నీ కూడా వచ్చినదారిలో మళ్లీ వెళ్ళిపోతూనే ఉంటాయి. అలా వచ్చేటివి పోయేటివి రాకపోకలుగా మనం ఇంతకుముందు చెప్పుకున్నాం. ఈ విషయాలను మనం కూడా జ్ఞాన దృష్టితో స్పష్టంగా అవగాహన చేసుకుని ముందుకు వెళదాం.

2అ, 21శ్లో.

వేదావినాశినం నిత్యం య ఏనమజమవ్యయమ్ ।
కథం స పురుషః పార్థ కం ఘాతయతి హంతి కమ్ ‌। 21 |

ఓ పార్థా! ఈ ఆత్మ నాశరహితము, నిత్యము అనియు, జననమరణములు లేనిదనియు, మార్పు లేనిదనియు తెలిసికొనిన పురుషుడు ఎవరిని ఎట్లు చంపించును? ఎవరిని ఎట్లు చంపును? (21)

నేను నిత్యమైన శాశ్వతమైన చావు పుట్టుకలు లేని ఆత్మను అని గ్రహించిన మానవుడు తనతో సహా అందరూ ఆత్మ స్వరూపులే అని తెలుసుకుంటాడు. ఇక అట్టివాడు ఎవరిని చంపుతాడు, ఎవరిని చంపిస్తాడు.

ఆత్మను గురించి ఏమీ తెలియని వాడు దేహమే నేను అనే భ్రమలో ఉన్నవాడు, నేను ఆత్మనే గానే దేహాన్ని కాదు అని తెలుసుకోలేని వాడు, నశించే దేహంలో నశించని ఆత్మగా ఉన్నానని గ్రహించలేనివాడు, శరీరాన్ని చంపి నేను అతన్ని చంపాను అని అనుకుంటాడు. అందుకే దుఃఖిస్తాడు, శోకిస్తాడు కానీ ఆత్మ జ్ఞానం కలిగిన మహాత్ముడు నేను ఆత్మను నశించని ఆత్మను అని నిశ్చయ జ్ఞానం గలవాడు ఆత్మనైన నాకు జనన మరణాలు లేవు అని గ్రహించి నేను

చంపేవాడిని అని గాని అతడు చనిపోయేవాడు అనగానే అనుకోడు. అంతేకాదు ఆత్మ నైన నేను అకర్తను ఏమి చేసే వాడిని కాదు అలాగే ఏమి చేయించే వాడిని కాదు అని గ్రహించినప్పుడు, నేను చంపే వాడిని కాదు, చంపించే వాడిని కాదు అని గ్రహిస్తాడు.

ఇక్కడ శ్రీకృష్ణుడు తాను చెప్పే మాటలలో అర్జునునితో పాటు తనను కూడా కలుపుకుంటున్నాడు. యుద్ధం చేయమని స్వయంగా అర్జునుని ప్రోత్సహిస్తున్నాడు- అంటే సామాన్య భావంలో అర్జునుడు చంపేవాడు, శ్రీకృష్ణుడు చంపించేవాడు. కానీ ఆత్మ జ్ఞానం కలిగితే నేను ఆత్మను అనే దృఢనిశ్చయముగా ఉంటే ఇక చంపేదెవరు, చంపించేది ఎవరు? తాను చెప్పే ఆత్మ జ్ఞానాన్ని అర్జునుడు గ్రహించి నేను ఆత్మను అని, ఆత్మచావు లేనిది అని గ్రహిస్తే అనుభవ పూర్వకంగా గ్రహిస్తే నేను చంపేవాడిని కానీ భావం పోతుంది. ఈ భావం పోతే ఇక దుఃఖానికి తావులేదు నశించే దానికి దుఖిఃంచాలి కానీ నశించని దానికై దుఃఖమెందుకు.

2అ, 22శ్లో.

వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి
తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ । 22 ॥

మానవుడు జీర్ణవస్త్రములను త్యజించి, నూతన వస్త్రములను ధరించినట్లు జీవాత్మ ప్రాతశరీరములను వీడి నూతనశరీరములను పొందును. (22)

మానవుడు ఏ ప్రకారంగా చినిగిపోయిన వస్త్రాలను విడిచి నూతన వస్త్రాలను ధరిస్తున్నాడో అలాగే ఆత్మ జీర్ణదేహాలను వదిలి క్రొత్త దేహాలను పొందుతున్నది.

ఆత్మ నిత్యమైనదని, శాశ్వతమైనదని, నాశనం లేనిదని, శరీరాలు నశించిపోయేవని సామాన్యులకు కూడా చక్కగా అర్థం కావడానికి వీలుగా అద్భుతమైన అందరి అనుభవంలో ఉన్న ఉదాహరణను భగవానుడు తెలియజేయడం భగవద్గీత పాఠకుల అదృష్టం. అసలు మనిషి చనిపోవడం అంటే ఏమిటి? చినిగిపోయిన పాత బట్టను విడిచి కొత్త బట్టలు ధరించినట్లుగా పనికిరాని పాత శరీరాన్ని వదలి క్రొత్త శరీరం కొరకు వెళ్లటమే. శరీరాన్ని విడిచి వెళ్ళటమే మరణం.

ఒక వ్యక్తి ఆయా సమయాలకు తగిన దుస్తులు ధరిస్తాడు. సమయాలకు పనులకు తగిన వస్త్రాలను ధరిస్తాడు. ఆ పనులకు సరిపడని వస్త్రాన్ని వదిలేస్తాడు. అలాగే జీవుడు కూడా తాను కోరిన అనుభవాలను పొందటానికి తగిన దేహాన్ని ధరించి ఈ లోకంలోకి వస్తాడు. ఎప్పుడైతే ఇక తన అనుభవాలకు ఈ దేహం పనికిరాదనుకుంటాడో అప్పుడు

దాన్ని విడిచి వెళ్తాడు. చినిగిన దుస్తులు వదిలేటప్పుడు ఎవరూ దుఃఖించరు. కానీ జీర్ణమైన దేహాన్ని విడిచేటప్పుడు మాత్రం దుఃఖిస్తాడు. మృత్యువు యొక్క స్వరూప స్వభావాలు తెలియని వారికి నీవు పొందవలసిన అనుభవాలకు ఈ శరీరం పనికిరానప్పుడు దీనిని వదిలి పనికి వచ్చే నూతన శరీరాన్ని ధరించడమే, ఈ మృత్యువు యొక్క స్వభావం అని తెలుసుకున్న వాడికి ఇక దుఃఖం ఎందుకు ఉంటుంది.

అలాగే ప్రకృతి మాత కూడా జీవుడు యొక్క అనుభవాలకు తగిన నూతన దేహాన్ని ఇవ్వటం కోసమే అనుభవాలనివ్వటానికి ఉపయోగపడని జీర్ణ దేహాన్ని బలవంతంగా వదిలించేస్తుంది. ఇది తెలియని అజ్ఞానే దేహం వదిలి పోతుందే అని ఏడుస్తాడు. పిల్లవాని బట్టలు చిరిగినప్పుడు క్రొత్త బట్టలు వేయటానికి తల్లి వాటిని తొలగిస్తుంది. ఇది తెలియని పిల్లవాడు ఏడుస్తాడు. అలాగే నూతన దేహాన్ని ఇవ్వటానికి జీర్ణదేహాన్ని ప్రకృతి తొలగిస్తుంటే ఆ ప్రకృతి మాత చేసే మేలును తెలుసుకోలేని మనుష్యులు గోల పెట్టి ఏడుస్తారు. కానీ ప్రకృతి వదలదు, దేహాన్ని వదిలించే తీరుతుందిస కనుక మరణ సమయంలో ఏడ్చేవాడు అజ్ఞాని. జ్ఞాని ఏడవడు, సంతోషిస్తాడు.

ఇక్కడ ఇంకొక ముఖ్యమైన విషయం ఏమిటంటే జీర్ణమైన దేహం అంటే ఏమిటో మనం పూర్తిగా అవగాహన చేసుకోవాలి. తన ప్రారబ్ద కర్మ ఫలాలు అనుభవించడానికి తగిన దేహాన్ని తీసుకుని జీవుడు ఈ లోకంలోకి వస్తున్నాడుస ఆ ప్రారబ్ద కర్మ ఫలాలు అనుభవించడం పూర్తయిపోయినప్పుడు ఇక ఆ దేహం జీర్ణ దేహమే. అసలు వస్త్రాలుగాని దేహాలు గాని జీర్ణమైనవా కాదా అని నిర్ణయించేదెవరు? వాటి స్వంతదారు మాత్రమే. జీవుడు తనకు కావలసిన అనుభవాలు పొందిన తరువాత ఇక వయసుతో నిమిత్తము లేకుండా తనువు చాలిస్తున్నాడు.

కనుక అర్జునా నీ ఎదుట నిలబడ్డ భీష్మ ద్రోణాదులు వారి జీర్ణ దేహాలను వదిలించుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. వారు ఆత్మజ్ఞాన సంపన్నులైతే దేహాల పీడను శాశ్వతంగా వదిలించుకుని విదేహముక్తులు అవుతారు. జ్ఞానులు కాకపోతే ఈ జీర్ణదేహాలను వదిలి తగిన నూతన దేహాలతో తిరిగి వస్తారు. ఎటుచూసినా అది వారికి లాభమే కానీ ఏమాత్రం నష్టం లేదు అని భగవానుడు సెలవిస్తున్నాడు.

వస్త్రాలు ఎన్ని మార్చిన దేహం అలాగే ఉంటుందిస దేహాలు ఎన్ని మార్చినా ఆత్మ అలాగే ఉంటుంది. ఆత్మ నిత్యమైనది, చావు పుట్టుకలు లేనిది, శాశ్వతమైనది అని తెలియజేసేందుకే భగవానుడీ శ్లోకంలో ఈ ఉదాహరణను ఇవ్వడం జరిగింది.

2అ, 23 శ్లో.

నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః |
న చైనం క్లేదయంత్యాపో న శోషయతి మారుత: । 23

ఈ ఆత్మను శస్త్రములు ఛేదింపజాలవు. అగ్ని దహింపజాలదు. నీరు తడుపజాలదు. వాయువు ఆరిపోవునట్లు చేయజాలదు. (23)

ప్రపంచంలోని వస్తువులు గాని ప్రాణుల దేహాలు గాని అన్నీ ఎప్పుడో ఒకప్పుడు నశించిపోయేవి. ఆయుధాల చేత ఛేదించబడతాయి. అగ్ని చేత దహింపబడతాయి. నీటి చేత తడుపబడతాయి. కానీ ఆత్మ ప్రపంచంలోని వస్తువుల లాంటిది కాదు, అది దేహముల వంటి స్థూల వస్తువు కాదు. ఆత్మ సూక్ష్మాతి సూక్ష్మమైనది. దానికి పుట్టుక లేదు, మరణము లేదు, నాశనము లేదు, అంతే కాదు ఈ శస్త్రాలు గాని, అగ్ని ,నీరు, వాయువు గాని ఆత్మను ఏమీ చేయలేవు. పంచభూతాలకతీతమైన ఆత్మను ఈ పంచభూతాలు ఏమీ చేయలేవు అని ఇక్కడ భగవానుడు స్పష్టం చేస్తున్నాడు. వస్తువులు సూక్ష్మమైన వాటిని ఏమీ చేయలేవు. ఆత్మ సూక్ష్మాతి సూక్ష్మమైనది కనుక ఆత్మను ఇవి ఏమి చేయలేవు. పంచభూతాలలో ఆకాశం సూక్ష్మమైనది దానికి శబ్దగుణం ఒక్కటే ఉంటుంది, మరియు భూమికి ఐదు గుణాలు(శబ్ద స్పర్శ, రూప, రస, గంధ) ఉంటాయి. కాబట్టి ఇది అన్నిటికంటే స్థూలమైనది. కానీ ఆత్మ ఏ ఒక్క గుణం కూడా లేని నిర్గుణ తత్వము కలది, సూక్ష్మాతి సూక్ష్మమైనది. అట్టి ఆత్మను ఈ పంచభూతాలు కూడా ఏమీ చేయలేవు.

ఈ శ్లోకంలో భగవానుడు చెప్పిన అగ్ని, నీరు, వాయువు ఈ మూడు పంచభూతాలకు చెందినవి, శస్త్రాలు భూతత్వం కనుక అవి పంచభూతాలలోని ఆకాశాన్ని ఛేదించలేవు. అలాంటిది ఆకాశం కన్నా సూక్ష్మాతి సూక్ష్మమైన ఆత్మను ఎలా ఛేదించగలుగుతాయి? అలాగే అగ్ని ఆకాశాన్ని కాల్చలేదు ఆత్మనెలా కాల్చగలుగుతుంది? నీరు ఆకాశాన్ని తడుపలేదు, ఆత్మను ఎలా తడుపుగలుగుతుంది? వాయువు ఆకాశాన్ని ఎండించలేందు, అలాంటిది ఆకాశం కన్నా సూక్ష్మాతి సూక్ష్మమైన ఆత్మను ఎలా ఎండించగలదు? కనుక ఇవేమీ ఆత్మ నేమీ చేయలేవు. ఆత్మదేని చేతను బాధింపబడేది కాదు.

అర్జునుని దగ్గర పంచభూతాలకు సంబంధించిన చాలా అస్త్ర శస్త్రాలు ఉన్నాయి. ఎలాంటి అస్త్ర శస్త్రాలు వున్నా ఈ స్థూలమైన దేహాలను నశింపజేస్తాయేగాని, సూక్ష్మాతి సూక్ష్మమైన నిత్యమైన అవ్యయమైన ఆత్మను ఏమీ చేయలేవు అని భగవానుడు స్పష్టం చేస్తున్నాడు.

2అ, 24శ్లో.

అచ్ఛేద్యోఽయమదాహ్యోఽయమ్ అక్లేద్యోఽశోష్య ఏవ చ |
నిత్యః సర్వగతః స్థాణుః అచలోఽయం సనాతనః | 24 |

ఈ ఆత్మ ఛేదించుటకును, దహించుటకును, తడుపుటకును, శోషింపజేయుటకును సాధ్యము కానిది. ఇది నిత్యము. సర్వవ్యాపి, చలింపనిది (అచలము) స్థాణువు (స్థిరమైనది) సనాతనము. (శాశ్వతము)

పంచభూతాలతో తయారైన వాటినే పంచభూతాలు బాధిస్తాయి, కానీ పంచభూతాలకతీతమైన ఆత్మను ఈ పంచభూతాలు కానీ పంచభూతాలతో తయారైన వస్తువులు గాని ఏమీ చేయలేవు. అందుకే ఆత్మ ఛేదించబడేది కాదు, దహించబడేది కాదు, తడుపబడేది కాదు, ఎండించబడేది కాదు అని భగవానుడు మరలా స్పష్టం చేస్తున్నాడు. ఆత్మ నిత్యము సర్వగతం, సనాతనం అని తెలుపబడినది.

ఆకాశము నిత్యము కాదు, ఏలనన మహాప్రళయ కాలమున అది నశించును. ఆత్మ ఎన్నటికీ నశింపదు. కావున అది నిత్యము. ఆకాశము సర్వవ్యాపకం కాదు. కేవలము అది తన కార్యావధిలోనే వ్యాప్తి చెందును. ఆత్మ సర్వవ్యాపి. ఆకాశము సనాతనము, శాశ్వతము, అనాదియు కాదు. ఆత్మ సనాతనము, శాశ్వతము, అనాది.

ఆత్మ యందు కదలికలు, గమనములు అని రెండు క్రియలు లేవు. ఒకే స్థానము నుండి చలింపదు. ఒకే స్థానం నుండి మరొక స్థానమునకు గమనం కలిగి ఉండదు. అది లేని స్థానమే లేదు.

ఆత్మ ఏ ఇంద్రియమునకు గోచరము కాదు. కావున దానిని అవ్యక్తము అందురు. అది మనస్సునకు అందనిది కావున దానిని అచింత్యమందురు.

ఆత్మను 'అవికార్యము' అని అనుట వలన అవ్యక్త ప్రకృతి కంటెను ఇది విలక్షణమైనదని తెలుపబడినది. సమస్త ఇంద్రియములు, అంతఃకరణం ప్రకృతి యొక్క కార్యములు. కావున అవి తమ కారణమైన ప్రకృతిని గ్రహింప లేవు. ప్రకృతియు అవ్యక్తము, అచింత్యము. కాని అది నిర్వికారము కాదు. దానియందు వికారములు గల్గును. ప్రకృతి కంటెను ఆత్మ మిక్కిలి విలక్షణమైనది.

ఆత్మను తెలుసుకొనుటకు అందుకొనుటకు ఆ స్థితిలో నిలుచుటకును యోగులు, తపశ్శక్తి సంపన్నులు, సాధకులు మహాత్ములు, జ్ఞానులు తమ సర్వశక్తులు ధారపోసి సాధన చేస్తుంటారు. కనుక అది ఎప్పుడును నూతనమైనది. ఆత్మ తత్వ విచారణయే మనందరి ప్రధమ కర్తవ్యం.

2అ, 25శ్లో.

అవ్యక్తోఽయమచింత్యోఽయమ్   అవికార్యోఽయముచ్యతే |
తస్మాదేవం విదిత్వైనం నానుశోచితుమర్హసి ||

ఈ ఆత్మ అవ్యక్తం (ఇంద్రియములకు గోచరించనిది), అచింత్యం (మనసు చేత చింతించే వీలు లేనిది), అవికార్యం(ఏ వికారాలు లేనిది). ఈ ప్రకారంగా ఆత్మను తెలుసుకొని శోకాన్ని విడిచిపెట్టు అని సెలవిస్తున్నాడు భగవానుడు.

ఇంతవరకు అర్జునుని శోకానికి కారణం 'ఆత్మనని తెలియని అజ్ఞానమే' అని గ్రహించిన భగవానుడు అతడి అజ్ఞానాన్ని తొలగించడానికి 11వ శ్లోకం నుండి ఆత్మజ్ఞానాన్ని అఖండంగా బోధిస్తున్నాడు. ఓ అర్జునా నీవు దేహానివి కాదు ఆత్మవు. దేహాన్నని భావించి, దేహంతో తాదాత్మ్యం చెందితే దేహ బాధలు నీవే అవుతాయి. అలాగాక నేను ఆత్మను అని తెలుసుకొని ఆత్మగా ఉన్నావా ఆత్మకు ఏ బాధలు దుఃఖాలు ఉండవు. ఏ మార్పులు వికారాలు ఉండవు. కనుక నీవు దుఃఖించే పని ఉండదు అని స్పష్టం చేయుట కొరకు ఆత్మ లక్షణాలను ఈ శ్లోకంలో మరోసారి తెలియజేస్తున్నారు. ఆత్మ అవ్యక్తం అంటే అన్ని స్థూల వస్తువుల లాగా వ్యక్తం అయ్యేది కాదు, మన ఇంద్రియాల ద్వారా గోచరించేది కాదు. అంతే కాదు ఆత్మ అచింత్యం అంటే మనసు ద్వారా చింతించే అవకాశం కూడా లేదు. ఎందుకంటే మనసేమో జడం, ఆత్మయేమో చైతన్యం. చైతన్యం జడ వస్తువును తెలుసుకోగలుగుతుంది, కానీ జడ వస్తువు చైతన్యాన్ని తెలుసుకోలేదు. ఏ మార్పులు లేనిది పుట్టడం పెరగటం కృశిచటం, నశించడం, మార్పులు చెందటం ఈ మార్పులన్నీ శరీరాలకి గాని ఆత్మకు ఇవేవీ లేవు.

ఇట్టి అమృతమైన ఆనంద స్వరూపమైన ఆత్మవి నీవు అని గ్రహించు. ఇక శోకించే పని ఉండదు. దీనిని బట్టి ఈ తాపత్రయాలతో సంసారదుఃఖాలలో పడి కొట్టుకునే వారందరికీ శాశ్వత దుఃఖ నివారణకు పరమౌషధం ఆత్మజ్ఞానమే. కనుక ఓ అర్జునా సుఖదుఃఖాలన్నీ దేహ మనో బుద్ధులకే వీటితో ఆత్మకు ఎటువంటి సంబంధము ఉండదు. అన్ని దేహాల్లో ఉన్న ఆ విరాట్ వీరపురుషుడిని ఖండించే ఖడ్గాలు ఎక్కడున్నాయి? మండించే మంటలు ఎక్కడున్నాయి? నీ అస్త్ర శాస్త్రాలన్నీ జడమైన శరీరాలకి గాని నిత్యము, నిర్వికారము, అక్షరము అయిన ఆత్మను తాకను కూడా తాకలేవు.

కనుక శోకించకు, దేహాల కోసం ఏడ్చినా ప్రయోజనం లేదు, ఆత్మ కోసం శోకించవలసిన పనిలేదు. ఆత్మ స్వరూపునికి దుఃఖం లేదు, భయం లేదు, శోకం లేదు, కోపం లేదు.

2అ, 26,27శ్లో.

అథ చైనం నిత్యజాతం నిత్యం వా మన్యసే మృతమ్ ।
తథాపి త్వం మహాబాహో నైవం శోచితుమర్హసి | 26 |

ఓ అర్జునా ఈ ఆత్మకు జనన మరణములు కలవని ఒకవేళ నీవు భావించినప్పటికిని దీనికై నీవు శోకింపదగదు.

జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ |
తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితుమర్హసి |27 ॥

ఏలనన పుట్టిన వానికి మరణము తప్పదు, మరణించిన వానికి పునర్జన్మ తప్పదు. కనుక అపరిహార్యములైన ఈ విషయములందు నీవు శోకింపదగదు.

భగవంతుడు ఇచ్చట వాస్తవిక సిద్ధాంతము గూర్చి చెప్పుటలేదు. అజ్ఞానుల దృష్టిలో ఆత్మకు జనన మరణములు ఉన్నట్లు విశ్వసించుట ప్రసిద్ధము. వారి విశ్వాసమును అనుసరించి మరణించిన వారు జన్మించుట నిశ్చయము. ఏలనన ముక్తిని గురించి వారు విశ్వసించరు, వాస్తవిక సిద్ధాంతమును అనుసరించి ముక్తిని విశ్వసించు వారు ఆత్మకు జనన మరణములు లేవని ఎఱుంగుదురు. ఈ జనన మరణములు కేవలము అజ్ఞాన జనితములే.

లోకంలో చాలా మందికి ఆత్మ జ్ఞానం ఉండదు. ఆత్మశాశ్వతంగా ఉండేదని తెలియదు. మరి వారు శోకించాల్సిందేనా? అంటే లేదు అని తెలియజేస్తున్నాడు. ఆత్మ పుట్టేది పోయేది అని అనుకున్నా, దేహం పోతే ఆత్మ పోయినట్లేనని అనుకున్నా, అప్పుడు కూడా నీవు శోకించాల్సిన పనిలేదు. ఎందుకంటే పుట్టిన ప్రతి జీవికి ఎప్పుడో ఒకప్పుడు మరణం తప్పదు. అలాగే మరణించిన ప్రతి జీవి తిరిగి జన్మించక తప్పదు. దీనిని నివారించడం ఎవరివల్లా కాదు. జీవులు అవ్యక్తం నుండి వచ్చే తమ ప్రారబ్ధ కర్మ ఫలాలను అనుభవించి వాసనలను ఖర్చు చేసుకొని, తమ ప్రారబ్ధ కర్మ ఫలాలు, వాసనలు క్షయం కాగానే ఈ దేహాన్ని విడిచి అవ్యక్తంలోకి వెళ్లి తమ సంచిత కర్మల నుండి పక్వానికి వచ్చిన ప్రారబ్ధ కర్మ ఫలాలను అనుభవించడానికి తగిన దేహంతో తిరిగి జన్మిస్తారని ఆస్తికుల నమ్మకం.

గంగా జల ప్రవాహం ఎడతెగకుండా ప్రవహించుచునే ఉండును. అది పుట్టు చోటున అఖండ రూపమున నుండి అంతమున సముద్రముతో కలసి ఏకమైపోవును. మరియు ఆ నీరు నిరంతరము ప్రవహించుచునే ఉన్నప్పటికీ మధ్య మధ్య అంతటను దీని అస్తిత్వము కనిపించుచునే యుండును. అదే రీతిన సృష్టి, స్థితి, లయము లనెడి త్రివిధావస్థలు కూడా శాశ్వతముగా ఒకదానితో ఒకటి కలసియే ఉండును. కాన నీవీ విషయమునకై దుఃఖించ దగిన దేదియు లేదని భగవానుడు స్పష్టం చేస్తున్నాడు. ఏలన ఈ స్థితి స్వాభావికము,అనాది నుంచి కలదు. ఓ అర్జునా వీరందరూ నిరంతరము పుట్టుచు, చచ్చు చుండెదరను విషయము నీకు సబబుగా కనిపించక పోయినప్పటికీ, ఇందు నీవు దుఃఖించ వలసిన దేదియు లేదు. ఏలన ఈ జనన మరణములు రెండునూ తప్పనిసరైనవి, వీటిని ఎవ్వరూ ఎన్నడూ ఆపలేరు.

కనుక ఈ దృష్టితో కూడా అర్జునుడు శోకించుట సర్వదా అనుచితమని భగవానుడు తెల్పుచున్నాడు.

2అ, 28శ్లో.

అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత |
అవ్యక్తనిధనాన్యేవ తత్ర కా పరిదేవనా | 28 |

ఓ అర్జునా ప్రాణులన్నియును పుట్టుకకు ముందు ఇంద్రియ గోచరములు గావు- (అవ్యక్తములు) మరణాంతరము కూడా అవి అవ్యక్తములే. ఈ జనన మరణముల మధ్య కాలమునందు మాత్రమే అవి ప్రకటితములు(ఇంద్రియ గోచరములు) అగుచుండును. ఇట్టి స్థితిలో వాటికై పరితపించుట నిష్ప్రయోజనము.

'భూతాని' అను పదము ఇచ్చట సమస్త ప్రాణులను తెలుపును. భూతము అంటే పుట్టినది అని.

ఇవన్నీ పుట్టక ముందు అవ్యక్తంలో ఉంటాయి కనుక మనకు కనిపించవు. అలాగే మరణించిన తర్వాత కూడా అవ్యక్తంలోకి వెళ్లి కనిపించవు. అయితే మధ్యలో కొంతకాలం పాటు కనిపిస్తాయి. అలా కనిపించిన మాత్రాన అవి సత్యమా? అంటే కాదు. ఎందుకంటే ఆదిలోను అంతంలోనూ కనిపించక మధ్యలో కనిపించినప్పటికీ అవి లేనట్లేనని మిథ్యయని 'మాండూక్యకారికలలో' గౌడ పాదాచార్యులు తెలియజేశారు.

అలాగే శ్రీ రమణ భగవానులు వారు కూడా ఉపదేశసారంలో చక్కగా తెలియజేశారు.

స్వప్నసృష్టి స్వప్న కాలమునకు ముందుగాని, స్వప్నానంతరముగాని ఉండదు. కేవలము స్వప్న కాలమునందే మనుష్యునకు దానితో సంబంధం ఉన్నట్లు ప్రతీతమగును. అదేవిధంగా జనన మరణముల మధ్య కాలమున మాత్రమే దానికి స్థూల శరీరంతో సంబంధము ఉండును. ఈ సంబంధం శాశ్వతము కాదు. కనుక దానికై శోకించుట తగదు. మహాభారత స్త్రీ పర్వమున రెండవ అధ్యాయము నందు విదురుడు కూడా ఈ విషయమునే తెలిపెను.

2అ, 29శ్లో.

ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేనమ్ ఆశ్చర్యవద్వదతి తథైవ చాన్యః ।
ఆశ్చర్యవచ్చైనమన్యః శృణోతి శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్ । 29 |

ఎవరో ఒక మహా పురుషుడు మాత్రమే దీనిని ఆశ్చర్యకరమైన దానినిగా చూచును. మరియొక మహాత్ముడు దీని తత్వమును ఆశ్చర్యకరముగా వర్ణించును. వేరొక పురుషుడు దీనిని ఆశ్చర్యకరమైన దానినిగా వినును. ఆ విన్నవారిలో కూడా కొందరు దీనిని గూర్చి ఏమియు ఎరుగఋ.

'ఆశ్చర్యవత్' అను పదము ఇచ్చట చూచుట, వినుట మొదలగు క్రియలకు విశేషణము. ఆత్మసాక్షాత్కారము అతి దుర్లభమైనది, అది ఎన్నో జన్మల ద్వారా అనుభవాన్ని గడించిన తరువాత గాని అర్హతను సాధించలేరు. అట్టివారు ఈ సృష్టిలో చాలా అరుదుగా ఉంటారు. అర్హతను సంపాదించుటకు బహు జన్మార్జిత పుణ్య పరిపాకము చిత్తనైర్మల్యము, వాసనరాహిత్యము అవసరము. ఆత్మ ఒకానొక దృశ్య వస్తువు వలె వినబడునది కాదు, చెప్పబడునది కాదు, చూడబడునది కాదు అది ఇంద్రియాతీతమైనది. అతి సూక్ష్మమై హృదయ గుహ యందు దాగి ఉన్నది.

మొట్టమొదట ఆత్మను గూర్చి సత్సంగంలో గాని సద్గురువుల వద్ద గాని విన్నప్పుడు ఆశ్చర్యకరముగా ఉండును. ఎందుకనగా ఆత్మ తత్వమును మునుపు ఎన్నడును విని ఉండలేదు, ఎవరి ద్వారా కూడా తెలుసుకొని ఉండలేదు. పైగా లౌకిక వస్తువులు దానితో సమానము కావు. ఈ కారణము వలన అది (ఆత్మ) అతనికి అత్యద్భుతముగా తోచును. ఆ తత్వమును అతడు తన్మయత్వంతో విని ముగ్ధుడగును. ఇంతకాలం అతడు శరీరాదులను తన స్వరూపముగాను, జడ పదార్థములను శాశ్వతమైన వాటిగను, సుఖప్రదములుగాను భావించుచూ వచ్చెను. ఇపుడు అవి అన్నియును అనిత్యములుగను, దుఃఖ ప్రదములుగను, జడములుగను గుర్తించును. ఆత్మ ఒక్కటి మాత్రమే వాటికంటెను సర్వదా విలక్షణమైనదని విని ఆశ్చర్య చకితుడగును. ఈ తత్వమును గురించి మునుపు ఎన్నడునూ అతను వినియుండలేదు. ఎవరి ద్వారా కూడా తెలుసుకొని యుండలేదు. పైగా లౌకిక వస్తువు లెవ్వియును దానితో సమానం గావు. ఈ కారణము వలన అది (ఆత్మ) అత్యద్భుతముగా తోచును.

అలా వినిన వారిలో కూడా కొందరు దీనిని తెలుసుకొన జాలరు. ఎందుకనగా అంతకరణ శుద్ధి, ఆస్తిక భావము లేని వాని బుద్ధి పవిత్రముగను, సూక్ష్మముగను ఉండదు. అర్హుడు కాని వాడు వినినను ఆత్మ తత్వమును సంపూర్ణముగా తెలుసుకొన జాలడు.

నిష్కామకర్మ, భక్తి, వైరాగ్యము, ధ్యానము, ఆత్మ విచారణ ఇద్యాది సాధనముల ద్వారా ఆత్మసాక్షాత్కారము కలిగినప్పుడు మొట్టమొదట సాధకుడు చాలా ఆశ్చర్యానికి లోనవుతాడు, మధురానుభూతి చెందుతాడు.

అలాగే తాను దర్శించి తెలుసుకున్న ఆత్మ తత్వమును ఆశ్చర్యకరముగా వర్ణించును. ఆత్మ తత్వమును వర్ణించుటకు ఉదాహరణములు ఏవియును దానిని సమగ్రముగా వివరింపజాలవు. దాని అంశాలలో ఏదో ఒకదానిని మాత్రమే ఉదాహరణముల ద్వారా వివరింప వీలగును. అనగా ఆత్మకు సదృశ్యమైన మరొక వస్తువు ఏదియును లేదు. ఇట్టి పరిస్థితుల్లో ఏ ఉదాహరణకు కూడా సంపూర్ణంగా దానిని వివరించుటకు చాలదు. వాస్తవముగా ఆత్మ వాక్కుల ద్వారా వర్ణించుటకు అలవికానిది అగుట వలన దీనిని స్పష్టమైన మాటల ద్వారా వర్ణించుట అసాధ్యము.

2అ, 30శ్లో.

దేహీ నిత్యమవధ్యోఽయం దేహే సర్వస్య భారత |
తస్మాత్ సర్వాణి భూతాని న త్వం శోచితుమర్హసి | 30 |

ఓ అర్జునా ప్రతి దేహమునందును ఉండెడి ఈ ఆత్మ వధించుటకు వీలుకానిది. కనుక ఏ ప్రాణిని గూర్చియైనను నీవు సోకింప దగదు.

మనమేమిటో మనకు తెలిస్తే మన దేహంతో పాటు ఈ ప్రపంచం ఏమిటో కూడా మనకు తెలియ వస్తుంది. అప్పుడు మనకు మనలో మనం ఉన్నట్లు తెలుస్తుంది. అదే విధంగా ఈ ప్రపంచంలో కూడా ఏవి ఎలా ఉన్నాయో కూడా మనకు తెలియ వస్తుంది. అలా తెలిసిన వాటిని గమనిస్తూ గమనిస్తూ అలాగే మార్పుకు లోనవుతున్న వాటిని కూడా గమనిస్తూ ఉండాలి. అప్పుడు మనలోని తాను అంటే నాలోని నేను నీలోని నువ్వు మారేవాడు కాదని కూడా మనం గ్రహించగలుగుతాం. తద్వారా మనకు మారేది ఏదో మారనిది ఏదో స్పష్టమవుతుంది. అంతర్ముఖ పరిశీలనలో మారనిది ఏదని మనకు అనిపిస్తుందో అదే ఈ శ్లోకంలో జగద్గురువు చెప్పిన దేహీ. మారుతున్న దేహాల్లో ఉంటూ మారని వాడే దేహీ. మార్పుకు లోను కాని దేహికి ఈ దేహాలన్నీ ఉపాధులు. దేహాల్లోని దేహి మాత్రం దేహంలోనే ఉంటూ నిత్యుడై నిత్యమై వెలుగొందుతున్నాడు. నాయన అర్జున నీవు అదే అయి ఉన్నావు. ఇప్పుడు ఉన్నది ఏదో అది ఉన్నట్లుగాను

లేనిది ఏదో అది లేనట్లుగాను బోధపడిందా అర్జునా. కాబట్టి నువ్వు అంటే నీలోని నువ్వు, ఎప్పుడు ఉన్నవాడివే. నువ్వు మధ్యలో వచ్చి పోయే వాడివి కాదు నాయనా. నిత్యాత్ముడై ఉండి నిత్యమై వెలుగుందుతూ సత్యాత్ముడై ఉండి తానే సత్యమై ఉన్నవాడివి. ప్రత్యక్షమై ఉండి బ్రహ్మమై ఉన్నవాడివి నీవు జీవులన్నింటిలో ఉండే సర్వ ప్రాణులకు ఆధారమైన అపురూప, ఆశ్చర్య, అవ్యక్త చైతన్యమే నీవు అని ఉద్బోధిస్తాడు. మనం కానిదేదో కూడా మనకు తెలిసింది, అర్థమైంది కూడా. కాబట్టి మనం కాని దాని గురించి, మనమే అయివున్నదాని గురించి శోకం అవసరం లేదు. 11వ శ్లోకంతో ప్రారంభమైన 'అశోచ్యాన్'అనే మాటకు పూర్తి వివరణ ఈ శ్లోకంతో ముగిసింది. ఇక శోకం, సోచ్యం లేదు. ఆత్మ, అనాత్మల ముడి వీగిపోయింది. ఈ సాంఖ్యయోగంలో ఈ శ్లోకంతో ఒక ప్రకరణం ముగిసినట్లు లెక్క.

2అ, 31శ్లో.

స్వధర్మమపి చావేక్ష్య న వికంపితుమర్హసి |
ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽన్యత్ క్షత్రియస్య న విద్యతే ||

అంతేగాక స్వధర్మమునుబట్టియు నీవు భయపడ నక్కరలేదు. ఏలనన క్షత్రియునకు ధర్మయుద్ధమునకు మించినట్టి శ్రేయస్కరమైన కర్తవ్యము మఱియొకటి ఏదియును లేదు.

ఈ శ్లోకం స్వధర్మం అనే పదంతో ప్రారంభమవుతుంది. అంటే ధర్మానికి సంబంధించినటువంటి ఘట్టంగా మనం ఈ అంశాన్ని గుర్తించాలి.

1వ అధ్యాయం 1వశ్లోకం ధర్మం అనే పదంతో ప్రారంభమైంది. అక్కడ ఆ శ్లోకంలో ధర్మం గురించి చర్చించుకున్న అనేక అంశాలు ఈ శ్లోకానికి పునాది అవుతుంది. యుద్ధం క్షత్రియులకు స్వధర్మం కదా. కాబట్టి అలా చూసినా భూమిని జయించడం ద్వారా ధర్మము రక్షింపబడుతుంది. కాబట్టి ధర్మం కోసమైనా నీవు యుద్ధం చేయక తప్పదు. అలాంటి ధర్మ యుద్ధం కంటే క్షత్రియులకు శ్రేయస్కరం మరొకటి లేదు. ఇక్కడ జగద్గురువు తన శిష్యుడికి, మనకు కర్తవ్య నిర్వహణ గురించి, స్వధర్మాచరణ గురించి, ధర్మబద్ధమైన కార్యాలను ఆచరించాల్సిన విధానం గురించి, స్పష్టంగా ప్రస్తావించాడు. దేహధారి అయిన మానవుడు సంఘజీవి. భగవద్గీత లక్ష్యం వ్యక్తి సంస్కరణ, సంఘసంస్కరణ. వ్యక్తి సంస్కరణ, సంఘసంస్కరణ అనేది ధర్మాచరణ ద్వారానే సాధ్యం. అలా ధర్మాచరణ గావించడానికి తగిన ప్రామాణికమైన దిక్సూచి భగవద్గీత అని మనం ముందే చెప్పుకున్నాం లేదా సమాజాన్ని సమాజం అంటే మనమే కాబట్టి మనం ధర్మాచరణ గావిస్తూ ప్రశాంతమైన జీవనం కొనసాగించాలి అంటే మనిషికి జీవితం అంటే ఏంటో తెలియాలి. జీవితం అంటే జీవించడం, జీవశక్తితో కూడి ఉండడం. అప్పుడే ఆరోగ్యకరమైన ఆనందమయమైన ఆధ్యాత్మికమయమైన జీవితం

సాధ్యమవుతుంది. అందుకు ప్రతి ఒక్కరూ ధర్మాన్ని గుర్తించి ఆ దిశగా అడుగులు వేయాల్సిన బాధ్యత అవసరం ఉంది. సత్తు, ఆసత్తులను గురించి విడదీసి వివరించిన గీత ఇప్పుడు సత్తు, అసత్తుల కలయికతో ఏర్పడిన మానవుడికి దిశా నిర్దేశం జేస్తున్నది. ఈ ప్రకరణలో అంటే ఈ విభాగంలో మనము ధర్మాచరణను గురించి స్పష్టంగా తెలుసుకుంటాం. దేహం వేరు, దేహి వేరు అయినా ఈ రెండింటి కలయిక మనిషి కాబట్టి మనిషి ఖచ్చితంగా ఆయా ధర్మాన్ని పాటించాల్సిన అవసరం ఉంది. ధర్మాన్ని ఆచరించకపోవడమే అధర్మం. ఇష్టం వచ్చినట్లు విచ్చలవిడిగా ప్రవర్తించడానికి లేదు. అగ్ని దగ్గరికి వెళ్లి నా ఇష్టం నేను అగ్నిని పట్టుకుంటాను అనడానికి లేదు కదా అతిక్రమించి పట్టుకుంటే అగ్ని కాల్చుతుంది.

మనిషి అంటే శరీరం, ఆత్మ. దేహం దేహి కలయిక. ఇప్పుడు మనం స్వధర్మం అన్నప్పుడు ఇందులో ఒకటి ఆత్మ ఆధ్యాత్మిక ధర్మం.రెండు దేహం భౌతిక ధర్మం. ఈ రెండు ధర్మాలను కలిపి మనం స్వధర్మంగా భావించాలి, గుర్తించాలి కూడా. ఈ రెండింటి ధర్మాలను ఆచరించడంలో స్పష్టమైన అవగాహనతో ముందుకెళ్లాలి. మనం మనకు తెలిసి దేహం, దేహ కార్యక్రమాలపై ఎంత సమయం ఎంత డబ్బు ఎంత శక్తిని వెచ్చిస్తున్నాం. ఏ రోజైనా మన ఉనికికి కారణమైన ఆత్మధర్మాలు ఆధ్యాత్మిక ధర్మాలు పాటిస్తున్నామా? ఈ సందర్భంగా మనల్ని మనం పరిశీలన చేసుకుందాం. స్వధర్మాన్ని గురించిన పరిశీలన మనం చెప్పుకున్నాం కదా. స్వధర్మంలో రెండు అంశాలు ఉన్నాయి ఒకటి ఆత్మ ఆధ్యాత్మిక ధర్మం, రెండు దేహం భౌతికంగా కనిపించేటటువంటి భౌతిక ధర్మాలు. ఈ స్వయం పరిశీలన ప్రతి మనిషి ఆచరించాలి. ఈ స్వయం పరిశీలన గావించినప్పుడే మనకు ఈ ధర్మాచరణకు సంబంధించినటువంటి ఘట్టం అవగాహన అవుతుంది. ఇదే అర్జునుడికి, మనకు భగవానుడు బోధిస్తున్న అంశం. అందుకే నాయనా ధర్మబద్ధమైన యుద్ధం క్షత్రియులకు శ్రేయస్కరం కదా అని స్పష్టంగా స్వధర్మం లో దాగి ఉన్న రెండు రకాల ధర్మాన్ని బోధిస్తున్నాడు జగద్గురువు.

2అ, 32శ్లో.

యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వారమపావృతమ్ |
సుఖినః క్షత్రియాః పార్థ లభంతే యుద్ధమీదృశమ్ ||

ఓ పార్థా! యాదృచ్ఛికముగా అనగా అనుకోకుండా తటస్థించిన ఇట్టి యుద్ధము అదృష్టవంతులైన క్షత్రియులకే లభించును. ఇది స్వర్గమునకు తెఱచిన ద్వారము వంటిది. (32)

ధర్మ యుద్ధం చేయగలిగే వారు ఎవరైనా క్షత్రియులే, ఈ విషయం ఇక్కడ గమనించాలి. కులానికి మతానికి సంబంధం లేదు. క్షత్రియత్వం క్షాత్ర ధర్మం అనేది గుణానికి సంబంధించింది. పూర్తి వివరాలు 4వ అధ్యాయంలో చూడవచ్చు. ప్రజల్ని ధర్మబద్ధంగా పాలిస్తూ శాంతిభద్రతల్ని కాపాడటం క్షత్రియ ధర్మం, రాజధర్మం. విపరీత విపత్కర పరిస్థితులు ప్రజల్ని చేరకుండా ప్రజలందరినీ కాపాడుకోవాల్సిన బాధ్యత ధర్మం క్షత్రియత్వానికి ఉంది. సమాజాన్ని అన్ని వైపుల నుండి కాపాడే వాడు క్షత్రియుడు. ఇతనికి వ్యక్తిగత ఆరాట పోరాటాలు ఉండవు, ఉండకూడదు కూడా ఉంటే వారు క్షత్రియులు కారు. అలా వీరు ధర్మాన్ని విడిచిపెట్టకుండా విధిగా ఆచరించాలి. ధర్మం అమృతంతో సమానం, ధర్మం మనిషికి ఊపిరినిస్తుంది. ఇది తప్పినప్పుడే మనిషి అలజడికి, అల్లకల్లోలానికి గురవుతాడు. కాబట్టి ధర్మాచరణ గావించాల్సిన క్షత్రియత్వం ఎప్పుడు కూడా ధర్మ యుద్ధము చేయడానికి వెనుకాడ కూడదు. ధర్మానికి హాని జరుగుతుందన్నప్పుడు దేశ సుస్థిరతను సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని యుద్ధం చేయాలి. వీరికి ఎప్పుడు ఏ కారణం చేత యుద్ధం సంభవిస్తుందో మనకు తెలియదు కాబట్టి ఈ సమయమైనా అప్రమత్తంగా ఉంటూ దేశాన్ని కాపాడాలి. క్షత్రియం అనేది అంతర్గతంగా నిక్షిప్తమై ఉన్న ఒక తత్వం, గుణం అని మనం అర్థం చేసుకోవాలి అంతేగాని కుల మతాలతో ఈ గుణాలకు ఎలాంటి సంబంధం లేదు గాక లేదు. ఇక ఇలా కోరుకోకుండా ప్రాప్తించిన యుద్ధం స్వర్గ ద్వారం లాంటిది అంటున్నాడు జగద్గురువు. ఇక్కడ శాంతిభద్రతలను కాపాడాలే తప్ప యుద్ధాన్ని అభిలాషించకూడదు. అలా ఆశించకుండా అభిలషించకుండా వచ్చిన అవకాశాన్ని క్షత్రియత్వం ఉన్న ధార్మికులు, విజ్ఞులు సద్వినియోగం చేసుకోవాలి. అప్పుడే స్వర్గం వైపుకి వారి ప్రయాణం అవుతుంది అంటే శాంతి వైపుకి వాళ్లు అడుగులు వేసినట్లు లెక్క.

నేను కౌరవుల దగ్గరకు రాయబారానికి వెళ్లేటప్పుడు కూడా నువ్వు యుద్ధాన్ని నివారించమని సంధి చేసుకోమని చెప్పావు కాబట్టి నీలో ఎలాంటి లోపం లేదు అర్జునా అయినా యుద్ధం అనివార్యమైంది కదా ఇది నువ్వు ఆశించకుండా ఎదురొచ్చాయా? అనుకోకుండా ప్రాప్తించింది. యుద్ధం చేయడం భీష్మాదులకు మాత్రం ఇష్టమా? కాదు కదా నీలాగే వారికీ ఇష్టం లేదు అయినా వారు సాక్షిగా నిలబడి వీక్షిస్తున్నారు కదా. కాబట్టి నీ ధర్మాన్ని నువ్వు నిర్వర్తించు. క్షేత్ర ధర్మాన్ని నిర్వర్తించేవారు దాని ఫలితంగా స్వర్గాన్ని పొందుతారు. ఈ అవకాశం పుణ్యం. ఒక్క క్షాత్ర ధర్మానికి ఉంది అంటున్నాడు కృష్ణుడు. యుద్ధం చేయడం పుణ్యకార్యం అని నీవు అడగవచ్చు కానీ అర్జునా ధర్మాచరణ పుణ్యకార్యం అదే స్వర్గ ద్వారం. శ్రీకృష్ణుడు రాయబారానికి హస్తినాపురానికి వెళ్ళినప్పుడు సంధి విఫలమై యుద్ధం అనివార్యమైంది. అప్పుడు తిరిగి పాండవుల వద్దకు వస్తూ దారిలో తన అత్తమ్మ ఆయిన కుంతీదేవిని దర్శించుకున్నాడు. శ్రీకృష్ణుడు ఆ సమయంలో కుంతీదేవి ఇలా అంటుంది. "కృష్ణా క్షత్రియ మాత దేనికోసం కుమారునికి జన్మనిచ్చిందో అలాంటి సమయం ఆసన్నమైంది ఈ విషయాన్ని నా మాటగా అర్జునుడికి, భీముడికి చెప్పు" అని సందేశాన్ని పంపుతుంది. ఈ

కారణంగా జగద్గురువు ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సమయస్ఫూర్తితో పార్థ! అని సంబోధిస్తున్నాడు. నీవు కుంతీదేవి పుత్రుడవు అని సంబోధిస్తూ యుద్ధానికి స్ఫూర్తిని ఇస్తున్నాడు.

2అ, 33శ్లో.

అథ చేత్త్వమిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి |
తతః స్వధర్మం కీర్తిం చ హిత్వా పాపమవాప్స్యసి | 33 |

ఈ యుద్ధము నీకు ధర్మబద్ధము. ఒకవేళ నీవు దీనిని ఆచరింపకున్నచో నీ స్వధర్మము నుండి పాటిపోయిన వాడవు అగుదువు. దానివలన కీర్తిని కోల్పోవుదువు. పైగా నీవు పాపము చేసిన వాడవగుదువు.

32వ శ్లోకంలో కోరుకోకుండా వచ్చిన ధర్మ యుద్ధం ఫలితం స్వర్గ ద్వారమని ఆజ్ఞాపించాడు. ఈ శ్లోకంలో అలాంటి ధర్మ యుద్ధాన్ని విస్మరిస్తే ఫలితం పాపం సంభవిస్తుందని ధ్రువీకరిస్తున్నాడు. కాబట్టి మనం ధర్మాధర్మాల విచక్షణతో మెలగాలని జగద్గురువుల ఆదేశం. ఇప్పటికైనా ఈ విచారణ మనలో బోధపడాలి ప్రారంభం కావాలి కూడా.

మనం 11వ శ్లోకం నుండి 30 వ శ్లోకం వరకు చెప్పుకున్నది ఆత్మబోధ, ఇది ధర్మ ప్రబోధ. ధర్మధూరులైన వారిని ధర్మ యుద్ధం ద్వారా జయించి రాజ్యాన్ని సుభిక్షంగా సుఖశాంతులతో చూసుకోవాల్సిన బాధ్యత క్షత్రియత్వానికి ఉంటుంది. అందుకే క్షత్రియత్వపు ధర్మానికి ప్రతీక ఆయన అర్జునుడిని ధర్మ యుద్ధం చేయకుండా విడిచిపెడితే స్వధర్మాన్ని పోగొట్టుకోవడమే కాక కీర్తిని కూడా పోగొట్టుకొని పాపాన్ని పొందాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాడు. స్వధర్మం విస్మరిస్తే పాపం తప్పదు అని సహేతుకంగా బోధిస్తున్నాడు. మన ఇష్టా ఇష్టాలను నిర్ణయించుకునే అధికారం మనిషికి ఉంది. వాటిని మార్పు చేసుకునే అధికారం స్వేచ్ఛ కూడా మనిషికి ఉంటుంది, కానీ స్వధర్మాన్ని విస్మరిస్తే నిర్ణయాధికారం ధర్మశాస్త్రానికి ఉంటుంది. అంతేకానీ మనిషి చేతిలో ఉండదు. ధర్మాన్ని నిర్వర్తించని వారు కర్తవ్యదక్షతను గుర్తించని వారు అధర్మపరులు. అధర్మఫలం పాపం. ఇది దేవుడు వేసే శిక్ష కాదు, ధర్మాన్ని శాస్త్రాన్ని ఉల్లంఘించడం ద్వారా ఎవరికి వారే వేసుకునేటటువంటి శిక్ష. స్వధర్మాన్ని అధిక్రమించడం ద్వారా శాస్త్రం వేసేటటువంటి శిక్ష. ఈ పరిస్థితుల్లో ఒకవేళ కలత చెందిన కారణంగా నిర్ణయం తీసుకోలేని పరిస్థితి సంభవిస్తే అప్పుడు సద్గురువును ఆశ్రయించి సన్మార్గంలో ప్రయాణించాలి అర్జునుడి లాగా. అంతేకానీ ధర్మాన్ని విస్మరించకూడదు.

జగద్గురువు ధర్మయుక్తమైన యుద్ధాన్ని విస్మరిస్తే పాపం సంభవిస్తుంది అని చెప్పడంలో ఒక మర్మం ఉంది. అదేమంటే అర్జునుడు మొదటి అధ్యాయం 36వ శ్లోకంలో, 45వ శ్లోకంలో యుద్ధం వల్ల పాపం వస్తుందని చెప్పి ఉన్నాడు భగవానుడితో. ఆ కారణంగా అర్జునుడిలో ఉన్న ఆ సంశయాన్ని పటాపంచలు చేస్తూ ఇక్కడ యుద్ధం అనివార్యమని

తేల్చాడు. విస్మరిస్తే పాపం, అంతేగాని ధర్మ యుద్ధం వల్ల పాపం సంభవించే ప్రసక్తే లేదని తగిన విధంగా ధర్మశాస్త్రాలతో సశాస్త్రీయ దృక్పథంతో నిరూపించాడు.

కాబట్టి ఈ ధర్మ యుక్తమైన యుద్ధం చేయకపోతే స్వధర్మాన్ని విడిచి కీర్తిని కూడా పోగొట్టుకొని పాపాన్ని పొందుతావు అని హెచ్చరించి ప్రబోధించి ధర్మ వైపుగా నడిపిస్తున్నాడు జగద్గురువు.

2అ, 34శ్లో.

అకీర్తిం చాపి భూతాని కథయిష్యంతి తేఽవ్యయామ్ |
సంభావితస్య చాకీర్తిః మరణాదతిరిచ్యతే ||

లోకులెల్లరును బహుకాలము వఱకును అపకీర్తిని గూర్చి చిలువలు పలువలుగా చెప్పికొందురు. మాన్యుడైన పురుషునకు అపకీర్తి మరణము కంటెను బాధాకరమైనది.

ప్రతి జీవి తన పూర్వజన్మల వాసనలు క్షయం చేసుకొనుటకు తగిన దేహాన్ని ధరించి ఈ లోకంలోకి వస్తాడు. ఆ వాసనలు క్షయం చేసుకొనుటకు తాను ఏ కర్మ చేస్తే అవి క్షయమై తాను మాయ నుండి విడివడి ముక్తిని పొందుతాడో ఆ కర్మే తనకు కర్తవ్య కర్మ అవుతుంది, అదే తన స్వధర్మమవుతుంది.

ఇప్పుడు అర్జుననికి తన చిత్తములో నిక్షిప్తమైన వాసనలను తొలగించుకొనడానికి ఈ ధర్మ యుద్ధం తన సంకల్పం లేకుండా ఒక మంచి అవకాశం గా వచ్చి పడింది. ఈ అవకాశాన్ని వినియోగించుకోకపోతే ఆ వాసనలు ఖర్చు గాక అలా పేరుకుంటాయి. మరియు స్వధర్మం నుండి పక్కకు తప్పుకున్నందుకు కొత్తగా పాపాన్ని మూటగట్టుకుంటాడు. అప్రతిష్ట పాలు అవుతాడు. స్వజనులచే నిందలు మోయవలసి వస్తుంది. అంతేకాదు తన సహజ స్వభావానికి విరుద్ధంగా నడుచుకోవడమే పాపం. శక్తి సామర్థ్యాలు ఉండి అధర్మపరులను చంపక వదిలేస్తే వారి అధర్మ కార్యాల వల్ల ఇంకా ఎందరో హింసింపబడుతారు. అలా పరోక్షంగా ఎందరి హింసకో కారణమవుతాడు అర్జునుడు. పరోక్షంగా ఇతరుల బాధలకు కష్టాలకు తాను కారణం కావడం కూడా పాపమే. గౌరవనీయులైన వారికి అపకీర్తి కన్నా మరణం మేలు కదా అంటున్నాడు భగవానుడు. ఇలా మాట్లాడుతున్న శ్రీకృష్ణునికి అర్జునుని పై ఎంతో సానుభూతి ఉంది. అర్జునుని పరాక్రమం, అస్త్ర సంపద ఎట్టిదో కూడా తెలుసు. యుద్ధం చేయడం ధర్మం కోసం కాబట్టి దానిని వదిలిపేయడం కేవలం పిరికితనం అవుతుందంటున్నాడు భగవానుడు. అందుకే యుద్ధం నుండి వెనుదిరిగితే జరిగే పరిణామాలను ఏ కరువు పెడుతున్నాడు.

2అ, 35శ్లో.

భయాద్రణాదుపరతం మంస్యంతే త్వాం మహారథాః ।
యేషాం చ త్వం బహుమతో భూత్వా యాస్యసి లాఘవమ్ । 35 ।

ఈ మహారథుల దృష్టిలో ఇప్పుడు నీవు మిక్కిలి మాన్యుడవు. యుద్ధ విముఖుడవైనచో వీరి దృష్టిలో నీవు ఎంతో చులకన అయ్యెదవు. అంతేగాక నీవు పిరికివాడవై యుద్ధము నుండి పారిపోయినట్లు వీరు భావింతురు.

భీష్మ ,ద్రోణ, శల్యాదులును, విరాట, ద్రుపద, సాత్యకి, ధృష్టద్యుమ్నాది మహారాజులును అర్జునుని ఎంతో గౌరవించుచు వచ్చిరి. అతనిని వారు మహాశూరునిగా, వీరునిగా, యోధునిగా, ధర్మాత్మునిగ భావించుచుండెరి. అతడు ఇప్పుడు యుద్ధమును త్యజించినచో వారి దృష్టిలో చులకనయగును. వారతనిని పిరికివానినిగా తలంతురు. ఫలితంగా అతనికి తలవంపులు తప్పవు. ఈ వాక్యము ద్వారా మహారాజుల దృష్టిలో అర్జునుడు చులకనయగునని భగవానుడు స్పష్ట పరచెను. జ్ఞాతుల మధ్య వైరం మంచిది కాదనే నీ ఆక్షేపణని మహావీరుడవైన నీవు బలహీన క్షణాలలో చేసిన పిరికి చేష్టగానే వ్యాఖ్యానిస్తారు. ఏ వీరుడు అలాంటి అవమానాన్ని ముఖ్యంగా తనతో సమానమైన శత్రుపక్ష వీరుల నుండి వస్తే భరించలేడు. ఈ పరిస్థితిలో యుద్ధము చేయకుండుట ఏ విధముగాను ఉచితము కాదని భగవానుడు బోధిస్తున్నాడు.

2అ, 36శ్లో.

అవాచ్యవాదాంశ్చ బహూన్ వదిష్యంతి తవాహితాః ।
నిందంతస్తవ సామర్థ్యం తతో దుఃఖతరం ను కిమ్ ॥

నీ శత్రువులు నీ సామర్థ్యమును నిందించుచు నిన్ను గూర్చి పెక్కు అనరాని మాటలను అందురు. అంతకంటే విచారకరమైన విషయమేముండును?

34 శ్లోకమున చెప్పబడినది సామాన్య మానవులు కలకాలం అతనిని నిందించు విషయము. కానీ ఇచట దుర్యోధనాది శత్రువులు అనరాని మాటలను అతని ముఖము మీదనే అందురు అని తెలుపుచున్నాడు. ఆ సామాన్యులు చేయు నిందలు కేవలము మాన్యులైన వారికే మిక్కిలి దుఃఖ కారకములు. అందఱికిని కాదు. కానీ ముఖము పైననే శత్రువులు దుర్భాషలాడినచో వాటిని సామాన్యులు గూడ భరింపజాలరు. అందువలన అర్జునుని అపకీర్తి సమస్త జగత్తు నందు వ్యాపించుటయేగాక ఇంతవరకును అతనిని శూరునిగా వీరునిగా భావించిన వారు కూడా మిక్కిలి పిరికివానిగా

తలంతురు. అంతేకాదు అతనికి అహితము గోరువారును, అతనికి హాని కలిగినచో సంతోషపడువారును ఐన దుర్యోధనాదులు అతని బలపరాక్రమములను యుద్ధ కౌశలాదులను తూలనాడుచు, అతనిపై అసహ్యమైన వాగ్బాణములను ప్రయోగింతురు. అంతేకాదు వారు 'అర్జునుడు ఎన్నడూ వీరుడే కాదు, ఒట్టి విరికివాడు అని గొంతులు చించుకొనుచు నిందించెదరు. పైగా అతని గాండీవమును పౌరుషమును కూడా కించపరచుదురు.

ఈ సంఘటనల పరిణామములు మిక్కిలి దుర్భరములని తెలిపెను. అంతకంటే విచారకరమైన విషయం ఏమీ ఉండదని భగవానుడు బోధిస్తున్నాడు. ఇంతవరకును యుద్ధమును త్యజించుట సుఖ ప్రధమనియు యుద్ధము చేయుట దుఃఖకారకమనియు అర్జునుడు తలంచి యుండెను. అది అతని భ్రమ మాత్రమే, యుద్ధము నుండి వైదొలగుట వలన భరింపరాని దుఃఖము కలుగునని భగవానుడు స్పష్టపఱచెను.

మనిషిలో దాగి ఉన్న స్వాభావికమైనటువంటి అంతర్గత శక్తిని ప్రయోగాత్మకంగా నిరూపించి ఆత్మ జ్ఞానాన్ని వృద్ధిపరచడానికి వీలైనన్ని పద్ధతులలో విపులంగా బోధిస్తున్నాడు జగద్గురువు. అసాధారణ ప్రజ్ఞతో కూడిన ఈ అంతర్దృష్టిని అలవరచడంలో భగవానుడు చాలా వాడి అయిన వేడి అయిన పదునైన మాటల తూటాలను ప్రయోగిస్తున్నాడు అర్జునుడి మీద.

2అ, 37శ్లో.

హతో వా ప్రాప్స్యసి స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్ |
తస్మాదుత్తిష్ఠ యుద్ధాయ కౌంతేయ కృతనిశ్చయః | 37 |

ఓ అర్జునా! రణరంగమున మరణించినచో నీకు వీరస్వర్గము ప్రాప్తించును. యుద్ధమున జయించినచో రాజ్యభోగములను అనుభవింపగలవు. కృతనిశ్చయుడవై యుద్ధమునకు లెమ్ము.

31వ శ్లోకంలో స్వధర్మాన్ని గురించి వివరించిన జగద్గురువు, ఇక్కడ స్వధర్మాచరణ గావించవలసిన విధానాన్ని తెలియజేస్తున్నాడు. అర్జునునిలో కలిగిన సందేహాలన్నింటిని తొలగించి ఇక్కడ ఒక నిశ్చయానికి రమ్మని పిలుపునిస్తున్నాడు.

తాను యుద్ధం చేయటం మేలా? చేయకుండుట మేలా? చేసినచో విజయం తమకే దక్కునా? లేక శత్రుపక్షమునకు దక్కునా? అను ఊగిసలాటలో పడి అర్జునుడు తనెట్టి నిర్ణయమునకు రాలేకపోతున్నాని ఆరవ శ్లోకములో ప్రకటించియుండెను. దానికి సమాధానముగా యుద్ధం చేయుచుండగా ఒకవేళ మరణించిను లేక విజయం

సాధించినను రెండు విధములుగాను మేలయని తెలుపుతూ అర్జునునకు యుద్ధ వైశిష్ట్యమును భగవానుడు వివరించుచున్నాడు. యుద్ధంలో శత్రువులు నెగ్గి అర్జునుడు మరణించినను అది అతనికి మేలే. ఏలనన యుద్ధంలో వీరమరణం పొందిన వారికి స్వర్గ ప్రాప్తి కలుగును. ఒకవేళ విజయం లభించినచో సంపన్నమైన రాజ్య భోగముల దక్కును. కావున ఏ దృష్టితో చూచినను యుద్ధం చేయుట అన్ని విధములుగా శ్రేయస్కరమే, కనుక యుద్ధానికి నడుము బిగింపుమని భగవానుడు ఆదేశించెను.

అర్జునుడే కాదు మనమందరం కూడా ఈ దేహం అనే కురుక్షేత్రంలో జరుగుతుండే యుద్ధానికి సిద్ధం కావాలి. ఏమిటా యుద్ధం? అజ్ఞానంపై యుద్ధం, జన్మరహిత్యం కొరకు యుద్ధం, స్వ స్వరూప స్థితిని పొందేందుకు యుద్ధం. ఈ అంతరంగిక యుద్ధంలో అప్పుడప్పుడు వెనకడుగు వేస్తుంటాం, సాధనలతో ముందుకు పోవటమా? సాధారణ మానవుల లాగా ప్రపంచ సుఖాలు భోగాలు శాశ్వతమని వాటి కొరకై పరుగులు తీయటమా ? అనే సందిగ్ధంలో ఈ శ్లోకాన్ని అందరూ గుర్తు చేసుకోవాలి.

మహాభారతంలో గీతోపదేశం చేయబడిన ఈ ప్రత్యేక సందర్భంలో యుద్ధానికి సన్నద్ధమవ్వమనే పిలుపు న్యాయమైనదే. శ్రీకృష్ణ భగవానుని పిలుపును అన్ని సందర్భాలకు అన్వయిస్తే జీవితంలోని సవాళ్లు ఎదుర్కొనేటప్పుడు, దుఃఖాన్ని నిరాశను విడనాడాలని విజయం సాధించాలని కృత నిశ్చయంతో జీవితమనే ఆటని తన శక్తి మేరకు ఆడటానికి ముందుకు రావాలని మానవునికి ఇచ్చే దివ్యమైన పిలుపుగా మనం భావించవచ్చు. దీనిని అర్థం చేసుకోగలిగిన వారికి భగవద్గీత యొక్క విశ్వజనీనత స్పష్టమవుతుంది. మానవజాతి ఎంత విస్తృతంగా అనువర్తిస్తుందో తేటతెల్లమవుతుంది.

2అ, 38శ్లో.

సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ |
తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాపమవాప్స్యసి ||

జయాపజయములను, లాభనష్టములను, సుఖదుఃఖములను సమానముగా భావించి యుద్ధ సన్నద్ధుడవు కమ్ము, అప్పుడు నీకు పాపములు అంటనే అంటవు.

సుఖం అనిపించినప్పుడు గర్వించకుండా, కష్టం సంభవించినప్పుడు కుమిలి పోకుండా ఉండాలి. సమస్థితిలో ఉండి సమబుద్ధితో ఉండి యుద్ధం చేస్తే అప్పుడు పాపం సంభవించదని స్పష్టం చేస్తున్నాడు. అలా లేకుండా చేసే ఏ పని అయినా పాపానికి హేతువు అవుతుంది. కాబట్టి మనం మనలో ఆ స్థితిని ఏర్పరచుకున్నాక యుద్ధానికి లేదా ఏ

పనికైనా పూనుకోవాలి. మన జీవితంలో ఈ సుఖదుఃఖాలనే ద్వంద్వాలు చాలా ప్రధాన పాత్ర వహిస్తుంటాయి. పూజలు వ్రతాలు అన్నీ కూడా ఈ ప్రయత్నంలో భాగమే సుఖమైనా దుఃఖమైన ఒక మనో వృత్తి మాత్రమే కదా. ఈ మనోవృత్తితో తాదాత్మ్యం చెందకూడదు. మనలోని ఆ దోషాన్ని గుర్తించి దాని నుండి బయటపడే ప్రయత్నం చేస్తే ఆ సాధనలో మనిషి కృతార్థుడవుతాడు. అలా కృత కృత్యులు కాకుండా ఇంద్రియాలతో తాదాత్మ్యం చెందినప్పుడు మాత్రమే శీతోష్ణాలు, సుఖదుఃఖాలు కలుగుతాయి. ఈ అంశానికి బీజమే ఇదే అధ్యాయంలోని 14వ శ్లోకం మాత్రా స్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణసుఖదుఃఖదాః', 15వ శ్లోకం 'సమదుఃఖసుఖం ధీరం సోఽమృతత్వాయ కల్పతే' మోక్షానికి అర్హులు వీరిని మాత్రాస్పర్శలు ఏవి కూడా బాధించలేవు అనే అంశాల్ని మనం అక్కడే సవివరంగా చర్చించుకున్నాం . ఇలా అక్కడక్కడ మనం నాటుకున్న బీజాలు మళ్లీ ఆయా సందర్భాలలో మొలకెత్తుతూ తరువాతి అధ్యయాల్లో కూడా పెరిగి పెద్దవుతూ మోక్ష సన్యాస యోగం దాకా వెళ్లేటప్పటికీ అవి మహావృక్షాలయి మనలో వేళ్ళూనుకుంటాయి. అంతవరకు మనం ఈ పంటను మనలో జాగ్రత్తగా కాపాడుకోవాలి. కిందటి అంశాల్ని ఎప్పుడూ మననం చేసుకుంటూ ప్రస్తుత శ్లోకాలు అర్థం చేసుకుంటూ ముందుకెళ్లాలి. ఒక్క క్షణం కూడా ఏమరపాటు లేకుండా జగద్గురువు చిటికెన వేలు వదలకుండా గట్టిగా పట్టుకుంటూ ఆయాబీజాలని పంటలను పరిరక్షించుకుంటూ మనం ముందుకెళ్లాల్సి ఉంటుంది. మొదటి అధ్యాయం 35వ శ్లోకంలో మధుసూదన ముల్లోక ఆధిపత్యం కోసం కూడా నేను ఎవరిని చంపను కాబట్టి నాకు రాజ్యపాలన వద్దు అలాగే ముల్లోక ఆధిపత్యం కూడా వద్దు అని చెప్పి ఉన్నాడు. అర్జునుడి ప్రశ్నకు ఈ శ్లోకంలోని ఈ మాట సమాధానంగా నిలుస్తుంది జగద్గురువు యుద్ధం చేయమంటున్నది రాజ్యం కోసం అధికారం కోసమో కాదు స్వధర్మాచరణ కోసమేనని ఇక్కడ రుజువు అవుతుంది కూడా. ఆరోజు అర్జునుడి విడిచిన బాణాలకు ఆయా సందర్భానుసారంగా వాటికి సమాధానంగా ప్రతిబాణాలను వదలుతూనే ఉన్నాడు. ఈ విషయం మనం గమనిస్తూనే ఉన్నాం. నీవు విజయాన్ని పొందినా నీకు సంబంధం లేదు అని చెబుతూ నీ పని ఎంతవరకు దైవం ఆదేశించిన పనిని నీ కర్తవ్యాన్ని దక్షతతో చేయడమే అని శాసిస్తున్నాడు.లాభం, నష్టం జయం, అపజయం పట్ల ఆసక్తిని గాని అనాసక్తిని గాని చూపకుండా రాగ ద్వేషాలకు తావియ్యకుండా మాత్రమే పూనుకోవాలి. అలా చేస్తే ప్రతి పనిలోనూ ప్రశాంతతత ఉంటుంది. ప్రశాంతంగా చేసే ఏ పని అయినా విజయమే కాబట్టి అపజయం ఎరుగని విజయాన్ని, నష్టం ఎరుగని లాభాన్ని పొందాలన్నా కూడా కావలసిన ప్రధాన ఆయుధం ప్రశాంతతే. అప్పుడే మనలో ప్రశాంతత సుభిక్షంగా సుస్థిరంగా ఉండి మనల్ని దైవత్వం వైపుకు నడిపిస్తుంది. యుగాలు మారొచ్చు కానీ ధర్మ స్వరూపం మారదు. ఏ యుగంలో అయినా ఎంతటి వారైనా తప్పు చేసిన వారు ఎప్పటికైనా శిక్ష అనుభవించాల్సిందే. అందుకే మనం చేసే ప్రతి పనిలోనూ ధర్మాధర్మాలను ఎరిగి విచక్షణతో ముందుకెళ్లి శాంతియుతమైన జీవనానికి బాటలు వేయాలి. ఇక ఈ శ్లోకంతో ధర్మ ప్రకరణ ఘట్టం ముగుస్తుంది. ధర్మ ప్రకరణం 31వ శ్లోకంతో ప్రారంభమై 38వ శ్లోకంతో ముగుస్తుంది.

2అ, 39శ్లో.

ఏషా తేఽభిహితా సాంఖ్యే బుద్ధిర్యోగే త్విమాం శృణు |
బుద్ధ్యా యుక్తో యయా పార్థ కర్మబంధం ప్రహాస్యసి | 39 |

ఓ పార్థా! ఈ (సమత్వ) బుద్ధిని ఇంతవఱకును జ్ఞానయోగ దృష్టితో తెల్పితిని. ఇప్పుడు దానినే కర్మయోగదృక్పథముతో వివరించెదను, వినుము. దానిని ఆకళింపుచేసికొని, ఆచరించినచో కర్మ బంధములనుండి నీవు ముక్తుడవయ్యెదవు.

ఈ అధ్యాయంలో మొదటగా మనం ఆత్మ ప్రకరణం, రెండవది ధర్మ ప్రకరణం చెప్పుకున్నాం. ఇప్పుడు కర్మ ప్రకరణం ప్రారంభిస్తున్నాం. కర్మ అంటే మానసికంగా గాని శారీరకంగా గాని చేసినది అంటే పూర్తయిన పనిని కర్మ అని అంటారు. పూర్తికాక జరుగుతున్న పనిని లేదా కర్మను క్రియ అంటారు. అంటే కర్మకు సంబంధించిన బీజం క్రియలోనే ఉంటుంది. సూర్యుడి చుట్టూ భూమి ఎలా నియమిత క్రమంలో తిరుగుతూ ఉంటుందో ప్రకృతి అంతా కూడా అలా ఓ క్రమ పద్ధతిలో ఉల్లంఘించలేని ఓ శాసనం ప్రకారం నడుస్తుంది. వాటి క్రమంతో ఋతువులు వచ్చిపోతూ ఉంటాయి. అలాగే కర్మ ఫలితం కూడా, క్రియ యొక్క ఫలానుభవం కర్మ. ఇప్పుడు మనకు సాంఖ్యం, యోగం, కర్మ అనే మూడు అంశాలు గురించి తెలుసుకున్నాం.

కర్మను యోగంగా భావించిన చోట జీవితం శోభిస్తుంది. లేకపోతే కర్మ అనేది బంధాన్ని ఏర్పరచి అందులోకి నెట్టేసి మనల్ని ముంచి జీవితాన్ని అలజడి పాలు చేసి ఊపిరాడనివ్వదు. నిరాశ నిస్పృహలకు దారితీస్తుంది. ఈ భూమండలం అనే పాఠశాలలో జీవితం అనే వేదికపై మనం యుద్ధం చేయాల్సింది ఎవరి మీదనో కాదు, మన మీదనే మనలోని అంతర శత్రువుల మీదనే. ఓ ఉద్యమంలా మనం వాటి మీద దండెత్తి వాటిని అదుపు చేసి సమస్థితిని సాధించుకోవాలి. అప్పుడే కర్మను యోగంగా భావించే సామర్థ్యం మనకి అలవడుతుంది. మనలోని మానసిక దౌర్బాగ్యానికి స్వస్తి చెప్పాలి, కర్మయోగానికి నాంది పలకాలి. కర్మయోగాన్ని ఆచరించడానికి కావలసిన పునాది అక్కడే 37వ శోకంలోనే ప్రారంభమైంది. ఆ తరువాత 38వ శ్లోకంలో సమబుద్ధితో సంగ్రామాన్ని అంటే యుద్ధ మహాసంగ్రామాన్ని, అలాగే జీవితమనే మహాసంగ్రామాన్ని నిర్వహిస్తే అప్పుడు మోక్షానికి మార్గం సుగమం అవుతుంది అని కర్మ యోగ ఆచరణకు కావలసిన బీజం పునాది అక్కడే అంటే 37, 38 శ్లోకాల్లోనే ఏర్పాటు చేశాడు జగద్గురువు. ఏ కర్మ చేసినా రాగద్వేషాల ప్రేరణతో చేస్తే సుఖదుఃఖాలకు హేతువు అవుతుంది. అందుకే ధర్మాధర్మాలను దృష్టిలో ఉంచుకొని కర్మాచరణ గావించాలి. కర్మలో చలనం, చంచలత్వం ఉంటుంది. శాంతి లో స్థిరచిత్తం ఉంటుంది. కనుక స్థిత చిత్తంతో, స్థిర చిత్తంతో

శాంతియుతంగా చేసే కర్మ యోగం అవుతుంది. అదే కర్మయోగం. ఇవన్నీ మనకు తెలిస్తేనే ఈ శ్లోకం మనకు అర్థమవుతుంది. ఇక్కడ మనకు రెండు అంశాలపై చాలా స్పష్టత రావాలి అప్పుడు ముందుకెళ్లడానికి వీలవుతుంది. ఒకటి సమబుద్ధితో, సమస్థితితో ఆచరించే కర్మ, రెండు అలా కాకుండా బంధములోకి నెట్టేసి కర్మ. మొదటిది యోగం వైపు నడిపిస్తుంది, పురోభివృద్ధికి తోడ్పడుతుంది. రెండోది బంధంలోకి నెట్టేస్తుంది అధోగతి పాలు చేస్తుంది. ఇది ఒక సంధి దశ అని మనం చెప్పుకోవచ్చు. కర్మాపేక్ష లేకుండా అంటే ఫలాపేక్ష లేకుండా జ్ఞానాసక్తే ధ్యేయంగా ముందుకెళ్లాలి. మోక్షమార్గాన్ని ఎంచుకున్న వాళ్ళు కర్మలవైపు అంటే చేసిన లేదా చేస్తున్న పని యొక్క ఫలితం పట్ల ఆసక్తి, అనాసక్తి ఉండకూడదు. కర్మల వైపు వెళ్ళకూడదు. అంటే ఏమి? ఫలితం వైపుకి వెళ్ళకూడదు. జ్ఞానం వైపే వెళ్లాలి.

మనిషి నిత్యం కర్మలు చేస్తూ ఉంటాడు. సంబంధమైన ఫలాలు కూడా అందుతూనే ఉంటాయి, ఫలితం అనుభవించిన తరువాత ఆ ఫలితం కూడా అంతరించిపోతుంది. ఆ ఫలితం అంతరించిపోగానే తద్వారా అంటే ఆ ఫలితం ద్వారా ఆ ఫలానుభవం వల్ల ఏర్పడిన ఆనందం లేదా దుఃఖం ఏదైతే ఉందో అది కూడా దానితోపాటే నశిస్తుంది. కానీ వాటికి సంబంధించిన ఆసక్తి మనసులో నిలిచిపోతుంది అదే వాసనగా పరిణమిస్తుంది. ఆవాసనలే పునఃకర్మలకు కారణం అవుతుంది. అంటే కర్మ, కర్మఫలం కర్మ ఫలానుభవం, వాసన ఇది క్రమం. ఇది ఒక ఆవృతం అంటే వలయం. ఇది ఒక భ్రమణం,చక్ర భ్రమణం అంటే సంసార చక్ర భ్రమణం.ఈభ్రమణం నుండి ఈ బంధనం నుండి చిక్కుముడిని నెమ్మదిగా విప్పుకొని విడివడమే మోక్షం. కర్మయోగం ద్వారానే జ్ఞానం. జ్ఞానం ద్వారానే జ్ఞాని అవ్వడానికి వీలుంటుంది. ఇక్కడ మనం గమనించాల్సిన ప్రధాన అంశం ఏమంటే కర్మ అనేది బంధం కాదు, కర్మఫలం కూడా బంధాన్ని సృష్టించదు. కర్మ ఫలాన్ని స్వీకరించేటప్పుడు మన మనసులో ఏర్పడే ప్రతి చర్యలే బంధాన్ని సృష్టిస్తాయి. ఈ ప్రతి చర్యలకు కారణం రాగద్వేషాలే ఇక్కడి వరకు మనకు స్పష్టత వస్తేనే ఈ శ్లోకం చర్చించుకోవడానికి వీలవుతుంది.

2అ, 40శ్లో.

నేహాభిక్రమనాశోఽస్తి ప్రత్యవాయో న విద్యతే |
స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ | 40 |

ఈ (నిష్కామ) కర్మయోగమును ప్రారంభించినచో దీనికి ఎన్నటికిని బీజనాశము లేదు. దీనికి విపరీత ఫలితములే యుండవు. పైగా ఈ కర్మయోగమును ఏ కొంచెము సాధన చేసినను అది జన్మ మృత్యు రూప మహా భయము నుండి కాపాడును.

కర్మయోగము అనగా శాస్త్రవిహితమైన ఉత్తమ క్రియనే 'కర్మ' యందురు. సమభావమును యోగమందురు. కనుక మమతాసక్తులు, కామ క్రోధములు, లోభమోహములు మొదలగునవి లేకుండా సమ భావముతో తమ వర్ణాశ్రమ స్వభావ పరిస్థితులను అనుసరించి శాస్త్రవిహిత కర్తవ్య కర్మలను అనుసరించుటనే కర్మయోగమందురు. దీనినే సమత్వ యోగము బుద్ధియోగము అనియు అందురు.

మనుష్యుడు తన పొలమునందు గింజలు చల్లి వానిని రక్షింప కున్నను వాటిని నీటితో తడుపకున్నను అవి నష్టమగును. కానీ కర్మయోగ సాధన ఆరంభించిన మానవుడు దానిని పూర్తి చేయకముందే మధ్యలో వదిలివేసినచో ఆ సాధన వృధా కాదు. ఈ సంస్కారములు సాధకుని అంతఃకరణమునందు స్థిరమై మరొక జన్మ యందు మరలా అతనిని సాధనలో నిమగ్నునిగా చేయును. కావున కర్మయోగ సాధనకు ఎన్నడును బీజనాశం లేదు.

సకామకర్మలకు మంచి చెడు బలములు ఉండును. ఈ కర్మ యోగమునందు ఫలేచ్ఛ లేకుండుటచే దానికి విపరీత ఫలములేమాత్రమూ ఉండవు. సకామ భావంతో దేవ పితృ మనుష్యాది సేవల యందు ఏ కారణము వలనైనను లోపము జరిగినచో వారికి అసంతృప్తి కలుగుట వలన సాధకునకు హానియు కలుగువచ్చును. చేయవలసిన కర్మలు చేయకపోవడం, సక్రమంగా చేయకపోవడం వలన వచ్చే ఈ పాపాన్ని వైదిక కర్మకాండలోని పరిభాషలో 'ప్రత్యవాయం' అని అంటారు. కానీ ఈ కర్మయోగ సాధనకు అట్టి విపరీత పరిణామం ఉండదు.

ఈ కర్మయోగమును ఏ కొంచెము సాధన చేసినను అది మహా భయము నుండి రక్షించును. ఈ కర్మయోగ సాధన సంపూర్ణ స్థితికి చేరినప్పుడు అది తక్షణమే సాధకునకు పరబ్రహ్మ పరమాత్మ ప్రాప్తిని కలిగించును. మనుష్యుడు దానిని కొలదిగా సాధన చేసినను అనగా సమత్వము నందు నిశ్చల స్థితిని పొంది ఆ సమభావము తోడనే అంత్యకాలము వరకును ఏ కొంచెముగా కర్తవ్య కర్మలను చేసినను తత్‌క్షణమే అతనికి నిర్వాణ బ్రహ్మ ప్రాప్తి కలుగును. అట్లు కానిచో ఈ సాధన జన్మాంతరమునందు సాధకుని మరలా సాధన యందు ప్రవర్తింపజేసి, పరమ గతిని ప్రాప్తించును. ఈ విధముగా అవకాశం ఉన్నంతలో తప్పక అతడు ఉద్ధరింపబడును.

2అ, 41శ్లో.

వ్యవసాయాత్మికా బుద్ధి: ఏకేహ కురునందన |
బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయోఽవ్యవసాయినామ్ ||

ఓ అర్జునా ఈ కర్మయోగమునందు నిశ్చయాత్మక బుద్ధి ఒకటియే యుండును. కానీ భోగాసక్తులైన వివేక హీనుల బుద్ధులు చంచలములై ఒక దారి తెన్నూ లేక కోరికల వెంట నలువైపులా పరుగులు తీయుచూ అనంతములుగా నుండును.

ఈ కర్మయోగాచరణ అనేటటువంటి శ్రేయో మార్గంలో నిశ్చయ స్వభావమైన బుద్ధి ఒక్కటే ఉంటుంది. యదార్థమైన ప్రమాణంతో కలిగిన ఈ నిశ్చలబుద్ధి మనలో ఉన్న విపరీత బుద్ధుల విపరీత ఆలోచనల శాఖలన్నింటినీ కూడా తొలగించి మనసును పరిశుద్ధం చేస్తుంది, మనిషిని అత్యున్నతమైన పరిపూర్ణత్వపు స్థాయికి చేర్చగలిగినది దృఢ నిశ్చయమే తప్ప వేరే మార్గం లేదు.

39, 40 శ్లోకాలలో కర్మయోగ ఆచరణ గురించి చెప్పినటువంటి జగద్గురువు ఇక్కడ కర్మయోగ ఆచరణకు ఏమి కావాలి అనే అంశాన్ని గురించి చెబుతున్నాడు. అదే నిశ్చయబుద్ధి, వ్యవసాయాత్మిక బుద్ధి అని జ్ఞానం పొందడానికి కావలసిన నిశ్చయబుద్ధిని కర్మయోగమే ప్రసాదించగలదు. కర్మయోగమే నిశ్చయబుద్ధిని మనలో పటిష్టంగా నిర్మించగలదు. నిశ్చలమైన బుద్ధి కర్మయోగం ద్వారానే సాధ్యమవుతుంది కాబట్టి ఇది నువ్వు ఆచరించు అని ఉద్బోధిస్తున్నాడు. నిశ్చలబుద్ధి లేని వారి ఆలోచనలు అనేక భేదాలతో కూడుకొని ఉంటాయి. అవి అనంతాలు.

నిశ్చలబుద్ధికి, చంచల బుద్ధికి ఎంత తేడా చూశారా ఇప్పుడు మనం నిశ్చల బుద్ధులు ఎలా ఉంటారో, చంచల బుద్ధులు ఎలా ఉంటారో చూద్దాం. చంచల బుద్ధుల వారిని మనం సమాజంలో 70 శాతం మందిని చూస్తూనే ఉన్నాం. మన నిత్యజీవితంలో వారు ఏం మాట్లాడుతారో తెలియదు. ఎలా ప్రవర్తిస్తారో కూడా వారికి తెలియదు, కేవలం భౌతిక ప్రపంచపు వ్యామోహం లో పడి కొట్టుమిట్టాడుతూ ఉంటారు వాళ్ళు. వీరు కూడా ఏదో ఒక జన్మలో మేల్కొని తీరాల్సిందే. అప్పుడు వాళ్లే తమను తాము విశ్లేషించుకుంటారు. వ్యవసాయాత్మిక బుద్ధిని నివృత్తి కర్మగాను, అవ్యవసాయాత్మిక బుద్ధిని ప్రవృత్తి కర్మగాను పేర్కొంది యోగశాస్త్రం. నివృత్తి కర్మ ఇది ఎలాంటి ఫలితం పలాపేక్ష లేకుండా చేయడం, నేను ఈ పని చేయడానికి జన్మ తీసుకున్నాను దీన్ని నేను యోగంగా దైవంగా భావించి చేయాలి అని పరిశుద్ధమైనటువంటి మనసుతో చేసేది నివృత్తి కర్మ. ఇదే భగవానుడు బోధిస్తున్నటువంటి కర్మయోగ ఆచరణ. ఇది మనిషిని పురోగతికి తీసుకెళ్తుంది. రెండవది ప్రవృత్తి కర్మ ఇదే అవ్యవసాయాత్మిక బుద్ధి, ప్రయోజనాన్ని ఆశించి చేసేటటువంటి కర్మ. నీకు నేను ఈ పని చేస్తే నాకేంటి ప్రయోజనం అనే ఫలాపేక్షతో చేస్తారు, ఇది మనిషిని అధోగతికి తీసుకెళ్తుంది.   కాబట్టి వారి

వారి పరిస్థితిని మనం ఆలోచించి చూస్తే ఎవరి జీవన మార్గం ఉత్తమమో ఉన్నతమో తెలుస్తుంది. అలా మనలోకి మనం వెళ్లి మనలో మనం చర్చించి, మనతో మనం చర్చించి, ఆలోచనతో నిర్ణయించుకుని, ఉత్తమమైనటువంటి మార్గాన్ని ఎన్నుకొని, ఆ మార్గంలో మనం ప్రయాణించాలి.

మనం వెళ్లే మార్గమే మన గమ్యాన్ని నిర్దేశిస్తుందని మనం గుర్తించాలి. ఇది గమనించాల్సిన అంశం. మనము వెళ్లే మార్గమే మన గమ్యాన్ని నిర్దేశిస్తుంది, కాబట్టి ఆ వెళ్లే మార్గము పూలబాట లేదా ముళ్ళబాట అనేది మనమే గమనించాలి. కర్మయోగమనేది బంధం కాదు. అది మోక్షమార్గమనేది, మోక్షయోగమనేది మనం గుర్తించాలి. గాలివీచడం, నీరు ప్రవహించడం, మొక్క పెరగడం, పువ్వు పూయడం, కాయ కాయడం ఇవన్నీ కర్మే కదా. అంతెందుకు ఈ మహాస్పృష్టి కూడా కర్మ కదా. అయితే అవన్నీ కర్మయోగాచరణలో మునిగి తరిస్తున్నాయి.

మనం కూడా అలాగే కర్మయోగ ఆచరణలో మునగాలి, ఆచరించాలి. కాబట్టి యోగంతో కూడుకున్న కర్మ, బంధం కాదని మనకు నిరూపణ అవుతుంది.

2అ, 42శ్లో.

యామిమాం పుష్పితాం వాచం ప్రవదంత్యవిపశ్చితః |
వేదవాదరతాః పార్థ నాన్యదస్తీతి వాదినః ||

ఓ అర్జునా వివేక హీనులైన జనులు ప్రాపంచిక భోగముల యందే తలమున్కలై యుందురు. వారు కర్మఫలములను ప్రశంసించు వేదవాక్యములయొక్క బాహ్యార్థములయందే ప్రీతి వహింతురు. వాటి అంతరార్థముల జోలికే పోరు.

అర్జునా వికసిత పుష్పంలా అంటే అప్పుడే వికసించిన పువ్వులా పైకి అందంగా కనిపించే మాటల్ని, చెప్తూ, పలుకుతూ తమ తమ ఉనికిని కాపాడుకుంటూ ఉంటారు. వీళ్ళు అవివేకులు, వీరికి వేదవాదాలపై ఆసక్తి ఎక్కువ అంటే వేదాల్ని వెనకేసుకొని వాదించడానికి ఆసక్తి చూపుతుంటారు. వీళ్ళు వేదాలు సూచించిన అంశాలలోకి వెళ్లడం తెలియని వారు, వాటిని పైపైన చదివి అందులో పేర్కొన్న కర్మకాండలపై పూర్తి అవగాహన లేక మిడిమిడి జ్ఞానంతో ఆయా కర్మలపై ప్రీతిని పెంచుకున్న వారు. వీరు వాళ్లకు అర్థమైన అల్పమైన విషయము తప్ప మరి ఏది ఉండదు, లేదు అని వాదిస్తూ ఉంటారు. నిర్ణయ బుద్ధి లేని వారు అవివేకులు, వీరు తమ తమ స్వభావానికి అనుగుణంగా తమ తమ ఆసక్తికి అనుగుణంగా ప్రవర్తిస్తూ ఉంటారు. భౌతిక భోగ ఆసక్తులు వీరు. వీరి వీరి మక్కువలను తీర్చుకోవడానికి వేదాల్ని అడ్డం చూపుతూ ఉంటారు. వేదంలో ఇలా ఉంది, అలా ఉంది అని సమర్థించుకుంటూ ఉంటారు. వేదాల్ని సైతం

వెనకేసుకుంటారు. అందుకోసమే వారి అవసరాలకు వేదాల్ని కూడా అడ్డం పెట్టగలిగిన అల్పులు వీరు. వీరు ఆడిన మాటల్లో ఒక్కటీ నిలబెట్టుకునే సమర్థత లేని అసమర్థులు తాత్కాలిక అవసరాలకు అవకాశాలు అందినంత మేరకు తియ్యగా, కమ్మగా. పరిమళిస్తున్న పువ్వుల్లా చాలా సున్నితంగా, సుతి మెత్తగా పలుకుతూ తమ తమ కోరికల్ని నెరవేర్చుకుంటూ ఉంటారు. నమ్మిన వారిని మోసం చేస్తూ ఉంటారు. నమ్ముకున్న వారు మోసపోతూ ఉంటారు. ఇక ఈ మోసపోయిన వారు, మోసం చేసిన వారు ఇద్దరు కూడా జ్ఞానోదయం అయ్యేవరకు జన్మల చక్రంలో పరిభ్రమిస్తూ ఉంటారు, అది వేరే విషయం. వీళ్ళు కూడా ఏదో ఒకరోజు ఏదో ఒక జన్మలో భగవంతుని గీతా మార్గాన్ని చేరుకొని ఖచ్చితంగా వాళ్ళు మానవ జీవిత పరమార్థాన్ని తెలుసుకోవాల్సిందే. ఇలా అవివేకులు సకామ కర్మల వైపే మొగ్గు చూపుతుంటారు. భౌతిక కోరికలు తీర్చుకోవడం కోసం చేసేటటువంటి వాటిని కామ్య కర్మలు అంటారు. అంటే కోరిక కోసం చేసే కర్మలు సకామ కర్మలు అంటే కోరికలతో కూడుకున్న కర్మలు. ఇవన్నీ కూడా ఫలాపేక్ష కు సంబంధించినవి. ఈనాటి సామాజిక పురోభివృద్ధికి కావలసిన అన్ని అంశాలు అన్నీ వస్తు వాహనాది ఆహార విశేషాలు సమస్త సృష్టి వేదం నుంచి నేర్చుకుని తయారు చేసినవి. సమస్త ఆయుర్వేదానికి మూలం అలాగే సమస్త శాస్త్రాలకు మూలం వేదమే. ఒకటేమిటి శరీర విజ్ఞానం మనోవిజ్ఞానం ఆత్మ విజ్ఞానం పరమాత్మ విజ్ఞానం ఖగోళం నక్షత్రం ఔషధం వనస్పతులు కృషి పక్షి జలవిజ్ఞానం వాహన విజ్ఞానం విమాన విజ్ఞానం గృహవిజ్ఞానం వస్త్రవిజ్ఞానం పదార్థ విజ్ఞానం రసాయన విజ్ఞానం గణిత విజ్ఞానం అక్షర విజ్ఞానం వ్యాకరణ విజ్ఞానం భాష నిర్వచనం స్వర విజ్ఞానం కావ్య విజ్ఞానం అలంకార విజ్ఞానం సంగీత విజ్ఞానం అర్థం రాజనీతి సమాజ విజ్ఞానం నీతి విజ్ఞానం ధర్మ విజ్ఞానం కర్మ కర్మ ఫలం మోక్ష విజ్ఞానం ఇలా ఒకటేమిటి మళ్లీ వీటిలో ఒక్కొక్క విభాగంలో ప్రతి విభాగాలు ఉంటాయి. వేదం అంటే తెలియదగినది అని అర్థం, తెలుసుకోదగినది. కాబట్టి మన జీవితానికి కావలసిన మనం ఎన్నుకున్న అంశాల్ని గురించి నిర్ణయ బుద్ధితో చక్కగా చదువుకొని మనిషి సక్రమ పద్ధతిలో జీవించే విధానాన్ని వేదాల ద్వారా గ్రహించి ప్రశాంతంగా ఈ జీవితాన్ని జీవించాల్సింది వదిలిపెట్టి, అలజడిని అల్లకల్లోలాలని సృష్టించే వాదనలన్నీ ఎందుకు?. వేదాలు సర్వజ్ఞానమయములు, మానవ జీవితానికి కావలసిన సమస్త విషయాలు వేదాల్లో ప్రతిపాదితమై ఉంది.

వేదాలలోకి వెళ్లి తీసిన సారమే వేదాంతాలు, వాటి సారమే ఉపనిషత్తుల జ్ఞానం, ఉపనిషత్తుల సారమే భగవద్గీత. కాబట్టి వేదాలలోకి వెళ్లడం, భగవద్గీత లోతుల్లోకి వెళ్లడం ఒక్కటే మనకు మార్గం. ఇలా వేదం లోతుల్లోకి వెళ్లిన వారు అనవసరపు మాటల్ని మాట్లాడరు, అవివేకంతో వాదించరు. అందుకే ఎవరి ధర్మాన్ని వారు ఎరిగి, ఎవరి పని వారు చేసుకుంటే జీవితం ప్రశాంతంగా ఉంటుంది. గాలి నీరు చెట్టు అదే పని చేస్తున్నాయి. కానీ మనిషి మాత్రం అవివేకి గానే మిగిలిపోతున్నాడు.

2అ, 43శ్లో.

కామాత్మానః స్వర్గపరా జన్మకర్మఫలప్రదామ్ |
క్రియావిశేషబహులాం భోగైశ్వర్యగతిం ప్రతి ||

స్వర్గమునకు మించిన దేదియును లేదనియు, అదియే పరమప్రాప్యమనియు వారు భావింతురు. క్షణికములైన ప్రాపంచిక భోగైశ్వర్యములయందలి ఆసక్తితో వివిధ సకామ కర్మలను ప్రోత్సహించుచు ప్రీతిని గూర్చు ఇచ్చకపు పల్కులు పలికెదరు.

కామాత్ములు అంటే కోరికలపై ఆసక్తి అపారంగా ఉన్న వారు అవి ఎలాంటి కోరికలైనా కావచ్చు, స్వర్గమే పరమ పురుషార్ధంగా భావించేవారు స్వర్గమే వీరికి ప్రధానం అయితే అది ఏంటి, అది ఎలా ఉంటుంది? ఎక్కడ ఉంటుంది? వీరికి తెలియదు. కర్మలకు ఫలం జన్మ అయితే వీరి మాటలు మళ్ళీ జన్మలను ఫలితంగా ఇస్తూ ఉంటాయి. వీరు స్వర్గం పశు పుత్రాది ప్రాప్తి కోసం ఒక్కొక్క కోరికకు ప్రత్యేకంగా ఒక్కొక్క క్రియను ఎన్నుకొని అనేక కార్యకలాపాలు జరుపుతూ అనేక కర్మ ఫలాల కార్యకలాపాలకు కారణమవుతూ ఉంటారు. ఐశ్వర్యం పొందడానికి సాధనాలైన ప్రత్యేక కర్మలు అనేకం చెబుతూ ఉండే ఈ మూఢులు గతి తప్పి సంసార సాగర చక్రంలో మరణిస్తూ, పుడుతూ ఆ జన్మల చక్రాన్ని ప్రతిఫలంగా పొందుతూ ఉంటారు అంటున్నాడు జగద్గురువు. కోరికలే స్వభావంగా కలిగిన వారు అంటే ఈ ప్రాపంచిక బాహ్య విషయాల పట్ల కోరికలతో మునిగితేలుతూ అవే వారి స్వభావంగా అయివున్నవారు వీరు. ఇవి కావాలి అవి కావాలి ఇవి చేస్తే అవి వస్తాయి అవి చేస్తే ఇవి వస్తాయి అంటూ ఏమి చేస్తే ఏమి వస్తాయో అని వెతుకుతూ వాటికోసం వెంపర్లాడుతూ ఉండే వీరు కోరికలకు బానిసలు. ఇహలోకపు భోగాలని ఆశ్రయించేవారు ఇహలోకపు ఇచ్చకపు ఉచ్చులలో చిక్కుకున్న వారు అజ్ఞానపు చీకట్లలోనే ప్రవేశిస్తారు. వీరికి స్వర్గానికి వెళ్ళడమే పరమపురుషార్ధం గా భావిస్తారు. వీరు అనుభవించే భోగాలే వీరికి స్వర్గాలు అందుకే వీరు అలాంటి స్వర్గాలని కోరుతూ ఉంటారు.

వేదోక్తమైన కర్మలను అత్యంత పరిశ్రమతో చేయాలి. అప్పుడు మరణాంతరం స్వర్గంలో ఐహికమైన అతీంద్రియ సుఖ భోగాలు లభిస్తాయి. ఈ ప్రయత్నాలన్నింటిలో మానవుని అంతరంగ వ్యక్తిత్వం సమగ్రంగా సంఘటితమవడానికి వికసించడానికి అవకాశం ఉండదు. ఈ విధంగా సర్వోత్కృష్టము, అనంతము అయిన పరమ సత్యాన్ని వివరించే శ్రీకృష్ణుడు సాధననే సాధ్యంగా పొరపడే వారిని చూసి పరిహసిస్తున్నాడు. కర్మకాండ విభాగం సాధన కాగా, వేదాంత భాగం ధ్యానం ద్వారా పొందే ఆత్మానుభూతి అనే లక్ష్యాన్ని వివరిస్తుంది. కర్మకాండను నిష్కామంగా ఆచరించినప్పుడు మనసుకు ఏకాగ్రత కలుగుతుంది. ఆ రకంగా ఏకాగ్రమైన మనసు మాత్రమే ఉపనిషత్తులను నిశ్చలంగా విచారణ చేసే

అర్హత పొందుతుంది. కోరికలతో సతమతమయ్యేవారు ఎప్పటికీ తమ అంతరంగంలో శాంతిని అనుభవించలేరని జగద్గురువు స్పష్టం చేస్తున్నాడు.

2అ, 44శ్లో.

భోగైశ్వర్యప్రసక్తానాం తయాపహృతచేతసామ్ |
వ్యవసాయాత్మికా బుద్ధి: సమాధౌ న విధీయతే ||

ఆ ఇచ్చకపు మాటల ఉచ్చులలో బడిన భోగైశ్వర్యాసక్తులైన అజ్ఞానుల బుద్ధులు భగవంతుడు లక్ష్యముగా గల సమాధియందు స్థిరముగా ఉండవు.

భౌతిక భోగాలు ఐశ్వర్యాల పట్ల ఆసక్తి గలవారికి పుష్పిత మాటలచే అపహరించబడిన మనసు గలవారికి నిర్ణయాత్మక బుద్ధి అంతఃకరణము నందు ఉండదు. ఇహ భోగాలపై ఐశ్వర్యాలపై ఆసక్తి ఉన్న అంటే అవివేకుల 'పుష్పితం వాచం' పరిమళంగా అనిపించే మాయమాటలకు ఆకర్షితులైన వారు తమ తమ మనోబుద్ధుల్ని జారవిడుచుకునే ప్రమాదం ఉంది. అలాంటివారు జారవిడుచుకున్నాక వారి అంతఃకరణలో నిశ్చయబుద్ధి నిలవదు, జారిపోవడం ఆరంభమయ్యాక అది జారిపోతూనే ఉంటుంది.

సమాజంలోని రెండు రకాల మనుషుల్ని 41 శ్లోకంలో పేర్కొని లోకంలోని అవివేకుల తీరును 41 42 43 శ్లోకాలలో స్పష్టంగా వివరించి చెప్పాడు. అలాంటి వారి అంటే అవివేకుల ఉచ్చులో చిక్కుకోకుండా అప్రమత్తంగా ఉండమని మనల్ని ఈ శ్లోకంలో హెచ్చరిస్తున్నాడు. సత్పురుషులు, సజ్జనులతోనే సహవాసం శ్రేయస్కరం అని అంటున్నాడు జగద్గురువు. అప్పుడు మాత్రమే దైవత్వం వైపుకు మన ప్రయాణం కొనసాగుతుంది. జారిపోతే ప్రమాదం చుట్టుముట్టి ఉక్కిరి బిక్కిరి చేస్తుంది, అందుకే అలాంటి అవివేకుల మాయమాటల్లోని మాయ నెమ్మదిగా మనిషిని బాహ్య సుఖాల వైపు లాగి బహిర్ముఖులను గావిస్తుంది. తద్వారా అశాంతి, అలజడి కాబట్టి సమాధి స్థితి వీరికి సిద్ధించదు. అవివేకుల మాయమాటల ద్వారా నెమ్మదిగా భోగం ఐశ్వర్యాలకు ఆకర్షింపబడిన మనసు కోరికలు అనే దొంగలు వారి బుద్ధిని అపహరిస్తాయి. తద్వారా వారి బుద్ధి జారిపోతుంది. ప్రపంచంలోని రెండు రకాల మనుషుల్ని 41 శ్లోకంలో తెలియజేసిన జగద్గురువు తరువాత అవివేకుల ప్రవర్తనను, వారి తీరుతెన్నులను స్పష్టంగా 41 42 43వ శ్లోకంలో మనకు తెలియజేస్తున్నాడు. అయితే నీవు అపహరింపబడిన వాడివి అవుతావు అని ఈ 44వ శ్లోకం ఉద్బోధిస్తుంది. అలాంటి కామ్యకర్మ భోగాసక్తుల మాయ మాటలు అనేటటువంటి దొంగలు జనుల మనోబుద్ధిల్ని అపహరించడం వల్ల మనం

మన ఉనికిని, సర్వస్వాన్ని కోల్పోతాం, తత్కారణంగా జన్మ పరమార్థాన్ని చేరుకోవాల్సిన దైవ మార్గాన్ని కూడా కోల్పోతాం. బాహ్యపరంగా వస్తు వాహనాదుల్ని బంగారు డబ్బు లాంటి వాటిని దోచుకునే దొంగల వల్ల మనకు ఎలాంటి నష్టం వాటిల్లదు. అవి పోయిన తిరిగి సంపాదించుకోవచ్చు కొంచెం శరీరానికి బాహ్యంగా శ్రమ అనిపిస్తుంది. భౌతిక సౌకర్యాలకు ఇబ్బంది అనిపిస్తుంది అలాంటి బాహ్యపు దొంగల వల్ల.

కానీ ఈ పుష్పితం వాక్కులు అనే దొంగలు అలా కాదు మన జీవితమే అస్తవ్యస్తం అయిపోతుంది వీరి వల్ల, ఆ కారణంగా మనం అలజడి పాలవుతాం, అశాంతి పాలు అవుతాం. మనిషి జీవితం మనోబుద్ధుల మీదనే ఆధారపడి నడుస్తుంది కదా, మరి అవి అపహరించబడితే జీవితం వినాశనం అవుతుంది కదా, ఇటు బాహ్య జీవితం అటు ఆధ్యాత్మిక జీవితం అంతా కూడా కోల్పోతాం. తద్వారా జన్మల చక్రంలో ఇరుక్కుంటాం. అందుకే అలాంటి అవివేకుల మాయమాటలకు లోను కావద్దు, జీవితాన్ని జీవించే విధానాన్ని నిర్ణయాత్మకమైన మనోభం కోల్పోవద్దు అని మనకు హెచ్చరిస్తున్నాడు జగద్గురువు. ఇలా ఈ అంశాలన్నింటినీ మనం దృష్టిలో ఉంచుకొని సజ్జనులతోటి సహవాసం చేసి నిర్ణయాత్మక బుద్ధిని అలవరచుకొని, సమాధి స్థితిలో ఉండి, ధర్మంతో జీవించు, దైవం వైపు ప్రయాణించు అంటూ మేలుకొల్పుతున్న జగద్గురువుకు మనం ప్రణమిల్లుదాం.

2అ, 45శ్లో.

త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున ।
నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ | 45 |

ఓ అర్జునా! వేదములు సత్వ రజస్తమో గుణముల కార్యరూపములైన సమస్త భోగములను గూర్చియు, వాటిని పొందుటకై చేయవలసిన సాధనాలను గూర్చియు ప్రతిపాదించును. నీవు భోగముల యెడలను వాటి సాధనలయందును ఆసక్తిని త్యజింపుము. హర్ష శోకాది ద్వంద్వములకు అతీతుడవు కమ్ము. నిత్యుడైన పరమాత్మ యందే స్థితుడవు కమ్ము. నీ యోగ క్షేమముల కొరకై ఆరాట పడవద్దు. అంతఃకరణమును వశమునందుంచుకొనుము.

వేదాల్లో సంసారిక విషయాలు మానవజీవన విధానానికి సంబంధించిన దిశా నిర్దేశాలు కర్మకాండలకు సంబంధించిన అంశాలు ఉన్నాయి. అయితే నువ్వు మాత్రం త్రిగుణాలకు అంటే సత్వ రజః తమో గుణాలకు అతీతుడవై, నిర్ద్వంద్వంగా ఉండు. యోగక్షేమాల్ని కూడా దాటి అప్రమత్తుడవై నిత్యం శుద్ధసత్వమునందు స్థిరంగా నిలువు. ఆత్మజ్ఞానాన్ని పెంపొందించుకొని ఆత్మజ్ఞానివి కావాలి. స్వధర్మాన్ని అనుష్టించే నీకు నేను ఇస్తున్న ఉపదేశం ఇదే అని భగవానుడు స్పష్టం చేస్తున్నాడు. కర్మకాండను ప్రతిపాదించే వేదాలు త్రైగుణ్య విషయాలు సంసార రూపాలు అయితే నువ్వు ఈ

మూడు గుణాల నుండి ముక్తుడివికా అంటున్నాడు జగద్గురువు. స్థూలంగా చూస్తే వేదంలో ప్రధానంగా రెండు అంశాలు ఉన్నాయని మనం చెప్పుకోవచ్చు, ఒకటి కర్మకాండలకు యజ్ఞ యాగాదులకు సంబంధించిన అంశాలు ప్రతిపాదితమై ఉంది. వీటిని మనం 41వ శ్లోకంలో చెప్పుకున్న ప్రవృత్తి కర్మలు ఇవన్నీ కూడా వేదంపూర్వ భాగంలో ప్రస్తావించి ఉన్నారు. రెండవది ఆత్మ జ్ఞానానికి సంబంధించింది. వీటినే మనం 41వ శ్లోకంలోనే చెప్పుకున్న నివృత్తి కర్మలు. ఇవి వేదం ఉత్తర భాగంలో ప్రతిపాదితమై ఉంది. ఇవి పూర్వభాగంలోని అంశాలకు అతీతమైన ఆత్మజ్ఞాన సముపార్జనకు సంబంధించినవి. మనిషి అంటే దేహం, దేహి అనుకున్నాం కదా. మనం కిందటి శ్లోకాల్లో అలా మనం చూసినప్పుడు పూర్వ భాగం దేహానికి ఉత్తరభాగం దేహికి సంబంధించిన జ్ఞానంగా మనకు తెలియాలి.

ఇప్పుడు పూర్వభాగం అంతా కూడా భౌతిక సౌకర్యాల ఏర్పాట్లకు సంబంధించినవి. మరి ఉత్తర భాగం అంతా కూడా మనలోని దీపం ఆత్మ జ్యోతి వెలిగించుకోవడానికి సంబంధించినది. ఆత్మ జ్ఞాని కావడానికి సంబంధించినది.

వేదాలకు శృతులని పేరు, అవి అపౌరుషేయాలు గా ప్రసిద్ధి. వేదం అంటే విధితం కావడం అని మనం ముందే నేర్చుకున్నాం. వేదం అనే మాటను అర్థం చేసుకోవడానికి కావలసిన కీలక సూత్రం కూడా ఇందులోనే ఈ మాటల్లోనే ఉంది, ఎలానో చూద్దాం. ప్రకృతిలోని శక్తులు రెండు రకాలు ఒకటి ప్రకృతిలోని కంటికి కనిపించే అనిపించే శక్తులు వెలుతురు వాన నిప్పు నీళ్లు సూర్యశక్తి లాంటివి. రెండవది కనిపించని ప్రకృతి అతీత శక్తి ఈ రెండు శక్తుల్ని సమన్వయ పరచే రెండింటికి ఆధారమైన మూలశక్తి ఒకటి ఉంటుంది. అది ఈ రెండు శక్తుల్ని వ్యవస్థీకృతం చేసి ప్రకృతి స్థితిగతులను క్రమబద్ధంగా నడిచేలా చూస్తుంది. అలా రెండు శక్తుల క్రమబద్ధీకరణకు కారణభూతమైన మూల శక్తి సర్వవ్యాపితం. ఈ చైతన్య శక్తిని ఏ చోట ఏ పేరుతో పరిమితం చేసి చూడగలము, అందుకే అది నిర్గుణం, నిరాకారం, బ్రహ్మం, చైతన్యం, అఖండం, అద్భుతం, సర్వవ్యాపకం అయింది. ఆ అఖండ అద్భుత మూల శక్తిలో ఎలాంటి ఆకారంతో ప్రమేయం లేని జ్ఞానచైతన్యం విశ్వమంతా విస్తరించి ఉంది. సర్వత్రా సర్వదా ప్రకృతిలో దాగిన మూలశక్తి లోని లయే, ఆ మూలశక్తి లోని జ్ఞాన చైతన్యాన్ని విస్తరిస్తుంది. ఆ మూలశక్తిలో లయమైతే అక్కడ ఆలయంలో వేదపు శృతి మనకు వినిపిస్తుంది, కనిపిస్తుంది, దర్శనమవుతుంది కూడా. అది శ్రుతులు అంటే అర్థం.

అటు ప్రకృతిలో గాని ఇటు మన పంచభూతాత్మక ప్రకృతి అయిన దేహం లోపలికి గాని వెళ్లి, లయమై శృతిని హృదయంతో అందుకున్న వారికే వేదం విధితమవుతుంది. ఆ అనుసంధానం లేకుండా వుట్టిగా అక్షరాలు చదివి కంఠస్థం చేసుకుంటే సరిపోదు. అక్షరాలతో పాటు చదువుతోపాటు డిగ్రీలతో పాటు పరిపక్వ బుద్ధితో హృదయంతో మనం చెప్పుకున్న ప్రకృతిలోని విశ్వవ్యాప్తమైన జ్ఞానచైతన్యపు లయను గ్రహించాలి, శృతిని అందిపుచ్చుకోవాలి. త్రిగుణాలతో కూడిన ఈ పంచభూతాత్మక ప్రపంచం లేదా దేహం రెండూ కూడా ఆయా గుణాలతో కలసి ప్రవర్తిల్లుతూ ఉంటుంది.

ఇక్కడ ఉన్న చిక్కుముడి ఏమంటే ఆయా గుణాలతో కలిసి ప్రవర్తిల్లుతూ కూడా మనం ఆ గుణాలకు లోబడకుండా వాటికి అతీతంగా ఉండాలి.

త్రిగుణాల్లో ఉంటూ త్రిగుణాతీతంగా ఉండు నాయనా అని అంటే ఏమి? మనలో త్రిగుణాతీత ఆత్మ ఉంది కదా, మనతోనే మనదేహం లోనే అలా జన్మలు కర్మలు అనే గుణాలను దాటి సర్వోన్నతమైన ఆత్మతో స్థితమై వుండు, అప్పుడు నీకు ఈ త్రిగుణాలు అంటవు.

కొన్ని ద్వంద్వ పదాలు సుఖం దుఃఖం, చావు పుట్టుక, యోగం క్షేమం, కరువు కాటకం, కోపం తాపం లాంటివి ఇవన్నీ కూడా భౌతిక అంశాల కోసం ఈ రాకపోకలు గలిగిన వాటితో మనకు సంబంధం లేదు కాబట్టి వీటికి అతీతంగా, నిర్ద్వంద్వంగా ఉండు, ద్వంద్వం లేని రెండుగా లేని స్థితిలో ఉండు. ఆత్మ స్థితిలో ఉండు. నిత్యసత్వస్థః ఇక్కడ చెప్పిన సత్వం ఏమంటే త్రిగుణాల్లో ఉన్న సత్వం కాదు అనే అంశాన్ని ముందుగా గ్రహించాలి. త్రిగుణాలకు అతీతంగా ఉండు అని చెప్పిన భగవానుడే మళ్లీ సాత్విక గుణంలో ఉండు అని చెప్పడు అని గ్రహించాలి. కాబట్టి ఈ శ్లోకంలో చెప్పిన సత్తును విశుద్ధ సత్వస్థితి లేదా ఆత్మస్థితి అని తెలియాలి.

ఇక్కడ యోగం అనే మాటకు ప్రాప్తి అని అర్థం. మనం చాలాసార్లు నాకు పెళ్లి యోగం ఉందా పిల్లల యోగం ఉందా ఇల్లు కట్టే యోగం ఉందా ఉద్యోగ యోగం ఉందా అని అంటుంటాం, అడుగుతూ ఉంటాం ఆ భావాన్ని ఇక్కడ తీసుకోవాలి. ఇక క్షేమమంటే ఆ ప్రాప్తించిన దాన్ని కాపాడుకోవడం ఇవన్నీ కూడా భౌతిక అంశాలే ఇంటిని ఉద్యోగాన్ని పిల్లల్ని అలా ప్రాప్తించిన వాటిని క్షేమంగా చూసుకోవడం ఈ యోగక్షేమాలతో కూడా నీకు సంబంధం లేదు. వీటికి కూడా నీవు అతీతుడవై ఆత్మ జ్ఞానాన్ని పొందు, ఆత్మ జ్ఞానివికా అర్జునా, పూర్వభాగంతో ఆగిపోకుండా ఉత్తరభాగపు లోతుల్లోకి వెళ్ళు, త్రిగుణాల్ని వీడి గుణాతీతుడుగా ఉండు. ద్వంద్వాలకు అతీతమై యోగక్షేమాలతో సంబంధం లేని ఆత్మ జ్ఞానివి కా అంటున్న జగద్గురువుకు ప్రణమిల్లుదాం.

2అ, 46శ్లో.

యావానర్థ ఉదపానే సర్వతః సంప్లుతోదకే |
తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః ||

అన్నివైపులా జలములతో నిండియున్న మహా జలాశయము అందుబాటులో నున్న వానికి చిన్న చిన్న జలాశయములవలన ఎంత ప్రయోజనమో, పరమాత్మ ప్రాప్తినంది పరమానందమును అనుభవించు బ్రహ్మజ్ఞానికి వేదములవలన అంతియే ప్రయోజనము.

మోక్షమంటే శాశ్వత ఆనందమని; అది తనలోనే ఆత్మ స్వరూపంగా ఉన్నదని; అసలు తాను ఆనంద స్వరూప ఆత్మనని తెలియని అజ్ఞాని- సామాన్యుడు తనకు కావలసిన ఆనందాన్ని ఇల్లు వాకిలి భార్యాబిడ్డలు ధన సంపదలు వస్తువులు మొదలైన వాటి ద్వారా పొందాలని బాహ్యంలోకి పరుగెడతాడు. సకామ కర్మల ద్వారా ఆనందాన్ని సుఖసంతోషాలను పొందాలని ప్రయత్నిస్తూ ఉంటాడు.

అదే బ్రహ్మజ్ఞానం గల బ్రహ్మనిష్ఠుడు ఆత్మ నిష్ఠుడు అయిన మహాత్మునికి సర్వత్రా సర్వదా ఆనందంలో నిత్యానందంలో బ్రహ్మానందంలో తెలియాడే ఆత్మజ్ఞానికి ఎక్కడ చూచినా ఎప్పుడు చూచినా ఆనందమే ఆనందం, అసలు తాను ఆనంద స్వరూపుడే. అట్టివాడు అనిత్యమైన, అల్పమైన వస్తువుల ద్వారా ప్రాపంచిక భోగాల ద్వారా వచ్చే అనిత్యమైన, తాత్కాలికమైన సుఖభోగాల కోసం అర్రులు చాస్తాడా? వాటికోసం సకామకర్మలు చేస్తాడా?

కనుక అజ్ఞానంతో, అల్ప జ్ఞానంతో ఉన్న సామాన్యులను సంతృప్తి పరచడం కోసమే సకామ కర్మలతో కూడిన కర్మకాండ వేదాలలో చెప్పబడింది. ఆత్మజ్ఞానం పొంది ఆత్మలో రమించే వాడికి వేదాల్లోని ఆ కర్మకాండతో పనిలేదు. ఎందుకంటే సకామ కర్మల ద్వారా పొందే ఆనందం ఆత్మానందంలో ఒక భాగమే.

కర్మను నిష్కామంగా ఆచరించినప్పుడు అది వ్యక్తిత్వాన్ని సమగ్రం చేస్తుంది. ఆ విధంగా చిత్తం శుద్ధమైనప్పుడు స్పష్టమైన విచక్షణా జ్ఞానం కలుగుతుంది.

ఆ ప్రకాశంలో సత్యం తనకు తానుగా విశదమవుతుంది. ఎటువంటి పరిమితులు సరిహద్దులు లేని అనంతానుభవం కలిగిన తర్వాత కర్మకాండ ఇచ్చే పరిమిత సుఖం వానిని ఆకర్షించలేదు.

వేదం సూచించే జ్ఞానం శుద్ధమైన ఆత్మస్వరూపజ్ఞానంలో అంతర్గతంగా ఉంటుంది. అహంకారం ఉన్నంతవరకు అది వేదాల అనుగ్రహం కోసం ప్రాకులాడుతుంది. అహంకారం అంతరించగానే ఆత్మ తన అనంత దివ్యత్వంతో వేదాలనే ఆశీర్వదించగలిగే స్థాయిలో ఉంటుంది.

2అ, 47శ్లో.

కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన |
మా కర్మఫలహేతుర్భూ: మా తే సంగోஉస్త్వకర్మణి |47|

కర్తవ్య కర్మమునాచరించుటయందే నీకు అధికారము కలదు. ఎన్నటికీ దాని ఫలముల యందు లేదు. కర్మఫలములకు నీవు హేతువు కారాదు. కర్మలను మానుట యందు నీవు ఆసక్తుడవు కావలదు. అనగా పలాపేక్ష రహితుడవై కర్తవ్యబుద్ధితో కర్మల నాచరింపుము.

ఇది జగద్గురువు తెలుపుతున్నటువంటి సుప్రసిద్ధమైనటువంటి నాలుగు అంశాలు ప్రధానంగా మనకు కనిపిస్తుంది. 1. కర్మ చేయడంలో నీకు అధికారం ఉంది. 2. ఫలితం విషయంలో ఎప్పుడూ నీకు అధికారం లేదు, ఉండదు. అలా అని అనుకున్నా అది మన భ్రమే. 3. కర్మ ఫలాలకు నువ్వు కారణం కావొద్దు. 4. కర్మలు చేయకుండా ఉండటానికి ఆసక్తి చూప వద్దు. వీటిలో మొదటిది వేద వాక్యం విధిగా పాటించాలి. మిగిలినవి నిషేధాలు.

ప్రతి ప్రాణి కర్మలో నిమగ్నమై ఉంటుంది. కాకపోతే మనిషికి మాత్రం కర్మలో స్వేచ్ఛ వుంది, పశుపక్షాది జంతువులకు లేదు, ఉండదు. అవి సృష్టి ఆది నుండి ఒకే విధంగా ఉన్నాయి. ఎంత కాలం గడిచినా అవి ఎవరినీ మోసం చేయవు. అలాగే ప్రగతిని సాధించలేవు కూడా. అయితే మనిషికి బుద్ధి ఉంది, ఆలోచించే పరిజ్ఞానం, విచారించే వివేకం.

అధికారం ప్రతి మనిషికి ఉంది, ఫలితం ఆశించే అధికారం కూడా ఉంది. అయితే ఫలితం పై మనకు అధికారం ఉండటం లేదు కదా అది మనం గమనించాలి. రైతు ఫలితాన్ని ఊహించి ఆశించి చేస్తాడు, తనవంతు తాను కృషి చేస్తాడు కూడా. ఎన్నో రకాల ప్రకృతి కారణాలవల్ల పంట చేతికి అందకుండా పోతుంది మరి అయితే ఫలితం పై అధికారం మనకే ఉంటే మరెందుకు తగిన ఫలితం రైతుకు అందడం లేదు. అలాగే ఒక ఆటకు పాటకు ఏదైనా పోటీపడే అందరూ కూడా ఫలితాన్ని ఊహించి ఆశించి కృషి చేస్తారు, ఆ కర్మను చేసే స్వేచ్ఛ ఉంది. కాబట్టి అందరూ పోటీలోకి దిగారు, అయితే పోటీలోకి దిగిన ప్రతి ఒక్కరూ వారు ఆశించిన విజయం అనే ఫలితాన్ని పొందడం లేదు కదా, దీన్ని బట్టి ఫలితం పై మనకు అధికారము లేదని తేలిపోయింది కదా. ఇదే జగద్గురువు చెబుతున్నది. కర్మ ఫలితం పై నీకు ఎన్నడూ

అధికారం ఉండదు, లేని దాన్ని మనదని, నాదని అనుకోవడం భ్రమ. అలా అనుకున్నా అది వీలు కాదు కదా. కర్మ చేసే స్వేచ్ఛ మనకు ఉంది, కాబట్టి ఆచి చూచి విచక్షణతో తగిన విధంగా కర్తవ్యదక్షతతో కర్మలు చేస్తే దాన్నిబట్టి ఫలితం అనేది సిద్ధిస్తుంది. కర్మ మన చేతిలో ఉంది, ఫలితం దైవానిది కదా. అందుకే కర్మ ఫలితానికి నువ్వు కారణం కావద్దు, కావడానికి వీలు లేదు. అలాగని కర్మ చేయుట మానరాదు, కర్మ చేయకుండా ఉండకూడదు. అలా ఆసక్తి లేనప్పుడు కర్మ చేయడం ఎందుకని భావించకూడదు. కర్మ చేయాలి దైవం ఇచ్చిన ఫలాల్ని ప్రసాదంగా స్వీకరించాలి. కాబట్టి కర్మయోగాచరణే ఉత్తమమైన మార్గం, మనకు వేరే మార్గం లేదని తెలియాలి. అందుకే జగద్గురువు నీకు కర్మలయందే అధికారం, కర్మలు చేస్తూ కూడా వాటి ఫలాల పట్ల అధికారం వద్దు, కర్మఫలం పట్ల కోరిక ఎప్పుడూ, ఏ పరిస్థితిలోనూ కలుగకూడదు. ఎందుకంటే కర్మఫలం పట్ల నీకు కోరిక కలిగినప్పుడు కర్మఫల ప్రాప్తికి కూడా నువ్వు కారణమవుతావు, కాబట్టి అలా నువ్వు కారణం కావొద్దు. నీవు కర్మఫలంపై కోరికతో కర్మాచరిస్తే జన్మకు కారణం అవుతావు.సరే అలాగని కర్మఫలం కోరనప్పుడు ఈ కర్మ చేయడం ఎందుకని కర్మలు ఆచరించకుండా ఉండటానికి ఆసక్తి చూప వద్దు, అంటున్న జగద్గురువుకు ప్రాణామాలు.

2అ, 48శ్లో.

యోగస్థ: కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ ।
సిద్ధసిద్ధ్య: సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ।।

ఓ ధనంజయా! యోగ స్థితుడవై ఆసక్తిని వీడి, సిద్ధి అసిద్ధుల యెడ సమత్వ భావమును కలిగియుండి, కర్తవ్యకర్మలను ఆచరింపుము. ఈ సమత్వ భావమునే యోగమందురు.

ఈ జనన మరణ చక్రం నుంచి విముక్తులం కావాలంటే మోక్షం అనేది చేరుకోవాలి, అంటే సాధకుడు కర్మలను యోగంగా భావించాలి. కర్మయోగాచరణే సరైన మార్గం. ఈ సంసారం అనే సాగరంలో జనన మరణ చక్రంలో మునిగిపోయి కొట్టుమిట్టాడే ప్రమాదం ఉంది కదా, కాబట్టి కర్మను ఆచరించు అని జగద్గురువు మనకు ఉద్బోధిస్తున్నాడు. యోగమంటే సమత్వమేయోగం. 37వ శ్లోకంలో కృత నిశ్చయంతో యుద్ధం చేయమని చెప్పిన జగద్గురువు, 38వ శ్లోకంలో సుఖదుఃఖాలను, లాభనష్టాలను, జయాపజయాలను సమానంగా భావించమని ఆజ్ఞాపించాడు. ఇక్కడ ఆ సమస్తితినే యోగం అంటున్నాడు. యోగం అనే మాటకు ఓ వినూత్నమైనటువంటి నిర్వచనం, సిద్ధించిన సిద్ధించకపోయినా రెండింటి విషయంలో నువ్వు సమత్వపు భావనను పెంపొందించుకోవాలి.

ఈ సమస్థితి యోగం వైపుకి, దైవం వైపుకి నడిపిస్తుంది. ఆ కారణంగా సమత్వమే యోగం నాయనా, కాబట్టి యోగస్తుడవై కర్మను చేయి. ఇలా యోగస్తుడవై ఏ కర్మలైన ఎన్ని కర్మలైనా చేసినా ఆసక్తి లేదు కనుక కర్మ బంధించదు. పైగా అతను చేసే కర్మలన్నీ కూడా ఒక క్రమ పద్ధతిలో సరైన మార్గంలోనే ముందుకెళ్తూ ఉంటుంది. అదే మోక్షం వైపుకు తీసుకెళుతుంది. ఫలితం పై కోరిక లేకుండా చేసే కర్మల వల్ల సర్వం శుద్ధి అవుతుంది. అందుకే ఈశ్వరుని ఆశ్రయించి ఈశ్వరార్పణగా కర్మలు చెయ్యి, సమంగా భావించి కర్మలు చేయి.ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలు చేయి, ఆ సమత్వమే యోగం అని ఆదిశంకరాచార్యుల వారు అభివర్ణించారు. ఇలా మనం మనలో సమత్వాన్ని పెంపొందించుకొని యోగస్తులు కావడానికి అలా ఆసక్తిని వీడి కర్మలు చేద్దాం.

2అ, 49శ్లో.

దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగాద్ధనంజయ |
బుద్ధౌ శరణమన్విచ్ఛ కృపణాః ఫలహేతవః | 49 |

ఈ సమత్వ బుద్ధియోగము కంటెను సకామ కర్మ మిక్కిలి నిమ్న శ్రేణికి చెందినది. కావున ఓ ధనంజయా! నీవు సమత్వ బుద్ధియోగమునే ఆశ్రయింపుము. ఏలనన ఫలాసక్తితో కర్మలు చేయువారు అత్యంతదీనులు, కృపణులు.

కామ్యకర్మ జనన మరణములకు హేతువైనది. నిష్కామకర్మ చిత్తశుద్ధి ద్వారా మోక్షమునకు హేతువైనది. కామ్యకర్మ మిక్కిలి అల్పమైనది, దానిని గోరువారు దీనులు, అల్పులు. వారు జనన మరణ రూపమగు సంసార ప్రవాహమున గొట్టుకొని పోవుదురు. అట్టి దీనత్వమును, కృపణత్వమును ఎవరును ఆశ్రయించరాదని భగవానుడు ఇచట హెచ్చరించుచున్నాడు.

కోరికల ప్రేరణతో కర్మలు చేస్తూ కొత్త వాసనలను చేర్చుకుంటూ తద్వారా తమ దివ్యత్వాన్ని కప్పివేసే అజ్ఞానపు పొరను మరింత దట్టంగా చేసుకునే వారిని కృపణులు అంటున్నారు. అంకితభావంతో నిరహంకారంగా చేసే నిష్కామ కర్మ మన వాసనా భాండాగారాన్ని క్షాళనచేసుకునే ఒక రహస్య విధానం. అటువంటి మనస్సు మాత్రమే పరిశుద్ధమై స్పష్టంగా ఆత్మను ప్రతిబింబించి శాశ్వత దివ్యత్వాన్ని కనుగొనగలదు.

బుద్ధియోగం అంటే 'బుద్ధికి కట్టుబడి ఉండడం' విచక్షణ జ్ఞానం కలిగిన బుద్ధికి మనసు పూర్తిగా ఆధీనమై స్థిర నిశ్చయంతో బాహ్య పరిస్థితులను శాసించగలగటమే బుద్ధియోగ మనబడుతుంది. జీవితపు పరమలక్ష్యాన్ని మరచిపోకుండా కర్తవ్యనిర్వహణ చేయటమే బుద్ధి యోగం.

బుద్ధియోగమును ఆశ్రయించి నిలుచున్నను, కూర్చున్నను, నడుచుచున్నను, తిరుగుచున్నను, నిద్రించుచున్నను, మేల్కొని యున్నను, ఇంత ఏల ఏ పని చేయుచున్నను నిరంతరము సమభావ స్థితుడవై ఉండుటకు ప్రయత్నించుమని, అదే కళ్యాణ ప్రాప్తికి సులభమైన ఉపాయమని అర్జునునకు భగవానుడు తెలిపెను.

2అ, 50శ్లో.

బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృతదుష్కృతే |
తస్మాద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్ | 50 | | |

సమత్వ బుద్ధియుక్తుడైన వాడు పుణ్య పాపములను రెండింటిని ఈ లోకమునందే త్యజించును. అనగా కర్మఫలములు వానికి అంటవు. కనుక నీవు సమత్వ బుద్ధి రూపయోగమును ఆశ్రయింపుము. ఇదియే కర్మాచరణమునందు కౌశలము. అనగా కర్మబంధముల నుండి ముక్తుడగుటకు ఇదియే మార్గము.

48వ శ్లోకంలో సమత్వ బుద్ధితో యుద్ధం చేయాలి, లేదా కర్తవ్యకర్మలు నిర్వహించాలి, ఆ సమత్వ బుద్ధి కలిగి ఉండటమే యోగం అని నిర్వచించి నిర్ధారించి ఉద్బోధించాడు జగద్గురువు. నిన్నటి శ్లోకంలో అలా లేని వారిని కర్మ ఫలాపేక్షతో కర్మలు నిర్వహించే వారిని దీనులని, హీనులని, అల్పులని హెచ్చరించాడు. ఇక్కడ ఈ శ్లోకంలో నైపుణ్యంతో అనే అంశాన్ని జోడించాడు. అంటే సమత్వ బుద్ధితో పాటు తగిన నైపుణ్యంతో, నేర్పుతో చేసినప్పుడే అది యోగమవుతుంది అని మరో అడుగు ముందుకు వేయిస్తున్నాడు మన చేత జగద్గురువు. ఈ శ్లోకంలో మనకు అర్థం కావలసిన ప్రధాన అంశం 'సమత్వం' అనేది కర్మలకు సంబంధించింది కాదు, అది మనకు సంబంధించింది. మనలో నిర్మించుకోవాల్సిన వ్యక్తిత్వానికి, స్వభావానికి సంబంధించింది. అయితే ఆ సమత్వం అనేది కర్మ ఫలాలకు సంబంధించినదిగా తెలియాలి. కర్మ అనేది ఒక కర్మ మరొక కర్మ కాలేదు కదా. నిత్యం అనేక కర్మలు చేస్తుంటాం, వంట పంట చదువు ఇలా. కాబట్టి కర్మలు స్థూలమైనవి దేనికదే అన్ని రకాల కర్మలను సమంగా చూడటం సాధ్యపడదు. అయితే ఫలితం పట్ల సమత్వ బుద్ధి అవసరం ఎందుకంటే ఫలితాలు మనసుపై ప్రభావాన్ని చూపుతాయి. కాబట్టి వాటి విషయంలో మనం దైవ ప్రసాదితంగా భావించాలి. అప్పుడు మనకు సమత్వం కుదురుతుంది. ఆ సమత్వం నుంచి పుట్టేదే కౌశలం, అంటే నేర్పు. కర్మసిద్ధాంతం ప్రకారం కర్మలో అక్రమం, అధర్మం, నేరం చోటు చేసుకున్నప్పుడు దాని యొక్క ఫలితం కూడా అదే విధంగా అతన్నే వచ్చి తాకుతుంది. కర్తవ్యకర్మలను, స్వధర్మాచరణకు సంబంధించిన కర్మలను ధర్మబద్ధంగా చేసినవారు సమత్వ బుద్ధితో ఫలాలను స్వీకరించడం వల్ల ఫల సంగం లేని వారవుతున్నారు. అలా సమత్వంతో జీవిస్తే ఫలితం, ప్రభావం మనసు మీద పడకుండా నూతన వాసనలు తయారు కాకుండా, సర్వ సంగాల నుండి విడివడి మోక్షానికి

అర్హుడు అవుతున్నాడు. నేను కర్తను అనే కర్తృత్వభావనతో చేసినప్పుడు పాపపుణ్యాలు కర్తను అంటిపెట్టుకునే ఉంటాయి. కాబట్టి ఫలసంగం త్యజించడమే కాక కర్తృత్వ రహితంగా కర్తవ్య కర్మల్ని నిర్వహించాలి, అప్పుడు అక్రమ అధర్మ కార్యకలాపాలకు తావు ఉండదు,ఇది కర్మశాస్త్రం. కర్తను నేను అనుకోవడం కర్మశాస్త్రానికి విరుద్ధం. కాబట్టి కర్మను అర్చనగా ఆచరించాలి, పనిని పూజగా భావించాలి, చేసే భావనలో భగవంతుడికి సమర్పించాలి, అప్పుడే ధర్మ రూపంలోని దైవం మనల్ని ధర్మబద్ధంగా ముందుకు నడిపించి మోక్షమార్గానికి సుగమం చేస్తుంది. ఇలా కర్మ పూజ అయినప్పుడే ఫలితం ప్రసాదం అవుతుంది. అదే స్వధర్మాచరణ అవుతుంది. కర్మ పూజ కానప్పుడు ఫలితం కూడా ప్రసాదం కావడానికి వీలు ఉండదు. కర్మ సంగం నుండి విడివడిన కర్మయోగి పాపపుణ్యాల నుండి విడువడుతాడు, కర్మలో ధర్మాధర్మాలు ఉన్నాయని తెలుసుకున్నాం. అలా ధర్మబద్ధంగా చేసేది సత్కర్మ. ఈ సత్కర్మే జగద్గురువు చెప్పిన సుకృతం. అధర్మంగా ఆచరిస్తే అది దుష్కర్మ. ఈ దుష్కర్మమే జగద్గురువు చెప్పిన దుష్కృతం. ఈ సుకృతం, దుష్కృతం రెండింటితోను సంగం ఉంటే ఆ సంగమమే, రాగమే మనిషిని బంధిస్తాయి. అయితే కర్మయోగి ఈ సుకృతం, దుష్కృతం రెండింటి నుంచి విడివడిన వాడు కదా! రెండింటితోను సంగం ఉంటే ఆ సంగమమే, రాగమే మనిషిని బంధిస్తాయి. అయితే కర్మయోగి సమత్వ బుద్ధితో పుణ్య పాప కర్మలను రెండింటిని ఇహలోకంలోనే విడిచిపెడతాడు. కర్మను ఈశ్వరార్పణతో, కౌశలంతో, నైపుణ్యంతో చేసి, పనిని యోగంగా మలచుకుందాం, జగద్గురువుకు ప్రణమిల్లుదాం.

2అ, 51శ్లో.

కర్మజం బుద్ధియుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః |
జన్మబంధవినిర్ముక్తా: పదం గచ్ఛంత్యనామయమ్ ||

సమ బుద్ధి యుక్తులైన జ్ఞానులు కర్మఫలములను త్యజించి, జనన మరణ బంధముల నుండి ముక్తులయ్యెదరు. అంతేగాక వారు నిర్వికారమైన పరమపదమును పొందుదురు.

సమత్వ బుద్ధి గల వివేకులు కర్మల వల్ల కలిగే ఫలాన్ని వదిలి జన్మ బంధము నుండి విముక్తులై దుఃఖ రహితమైన మోక్ష పదాన్ని పొందుతారు. కర్మయోగం అనేది కర్మఫలాసక్తికి కర్మ ఫల బంధానికి లొంగనటువంటి మహా మహోన్నతమైనటువంటి శక్తిని, యుక్తిని ప్రసాదిస్తుంది. ఇదే సమత్వం. ఈ సమత్వంలో నుంచి కర్మలలో కౌశలత్వం, నైపుణ్యం ఉద్భవిస్తుంది. ఇలా కౌశలత్వంతో కర్మయోగంతో కొనసాగే వారు ముక్తికి హేతువైన యోగంలో శోభిస్తూ ఉంటారు. సమత్వ బుద్ధిగల కర్మయోగి ఫల సంగాన్ని, కర్మ సంగాన్ని కూడా త్యజిస్తున్నాడు. జన్మ బంధమే బంధము అని జన్మించడంలోనే బంధం తెలుస్తోంది. ఈ శ్లోకంలో జగద్గురువు చెప్పదలుచుకున్నటువంటి ప్రధాన అంశం ఇది.

జన్మ బంధమైనప్పుడు జన్మించగానే మరెన్నో బంధాల్లో చిక్కుకొని తన జన్మకు సంబంధించిన కారణం తెలుసుకోలేకపోతున్నారు. భౌతిక ప్రపంచపు బంధాలే శాశ్వతం అనుకుని ధ్యానం, సత్యాన్వేషణ, గీతా మార్గం వైపు కొనసాగే మార్గాన్ని ఎంచుకోవడం లేదు. ఆదిశగా మనము మన ఆలోచన విధానము కొనసాగడంలేదు. అలా గీతా మార్గంలోకి ప్రవేశించి కర్మయోగాచరణ గావించి మనీషులుగా ఎదగడానికి ప్రయత్నిస్తున్న వారు చాలా అరుదు. మనం అనుభవ జ్ఞానంతో అవగతం చేసుకోవాల్సిన ప్రధానమైనటువంటి అంశం ఏమిటంటే మన జన్మకు ముందున్నటువంటి కారణం ఏమిటి, ప్రస్తుతం మనం చేస్తున్నటువంటి పనులు ఎలా తరువాతి జన్మకు కారణమవుతాయి అనే అంశాలు మనకు అనుభవ పూర్వకంగా తెలియాలి. తన స్వీయ దివ్యత్వాన్ని గ్రహించడం ద్వారా ప్రతి వ్యక్తి సాక్షాత్తు దైవంగా, మనీషిగా రూపాంతరం చెందవచ్చు. మానవ అతీతమైన అంటే సాధారణ స్థాయి మానవుల కన్నా అతీతమైన శక్తిని సంప్రాప్తింప చేసుకున్న వారని చెప్పవచ్చు. ఈ దైవత్వం లేదా మనీషత్వం సిద్ధించాలంటే కర్మ యోగా చరణే సాధనమవుతున్నద ని మనకు తెలియాలి. అందుకే సమత్వం ద్వారా కర్మ సంగాన్ని, ఫల భోగ సంగాన్ని త్యజించిన కర్మయోగులు జనన మరణాలు శరీరానికే గాని, అకర్త అయిన ఆత్మకు కాదని తామే ఆత్మ అనే తత్వ జ్ఞానాన్ని పొందుతారు. అలా కర్మ ఫలాన్ని త్యజించి జ్ఞానవంతులైన వారు జీవించి ఉండగానే జన్మ బంధాల నుండి విడివిడి పరమపదం అనే మోక్షాన్ని పొందుతున్నారు. జన్మ బంధం నుండి విడివడి దుఃఖ రహితమైన పరమ పదాన్ని పొందుతున్నారు. పరమపదం అంటే జీవిత గమ్యాన్ని నిర్దేశించే ప్రామాణికమైనటువంటి పదాలు దీన్నే పరంధామం అని, మోక్షం అని అంటుంటాం. ధామం, స్థలం, ప్రదేశం ఇవన్నీ పర్యాయపదాలు.కాబట్టి నిత్య ముక్తుడవు కావాలి, బంధం అనేది లేనే లేదు, ఇప్పుడు లేదు, ఇంతకు పూర్వము లేదు, ఇకముందు ఉండబోదు, అది లేనిదే. అయితే బంధం అనే భ్రాంతిలో ఉన్నందుకే అది లేనిదని మనం గుర్తించాలి. ఉన్నది ఉన్నట్లుగాను, లేనిది లేనట్లుగానూ తెలియడమే జ్ఞానం కదా. ఈ జ్ఞానం వల్లనే మోక్షం సంప్రాప్తిస్తుంది. కర్మయోగాచరణ గమ్యస్థానం జ్ఞానమే. సమత్వ బుద్ధిగల యోగి చిత్తశుద్ధిని పెంపొందింప చేసుకొని జ్ఞాన ప్రాప్తి ద్వారా మోక్షాన్ని పొందుతాడు.

2అ, 52శ్లో.

యదా తే మోహకలిలం బుద్ధిర్వ్యతితరిష్యతి ।
తదా గంతాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ ॥

మోహమనెడి ఊబి నుండి పూర్తిగా బయటపడినప్పుడే నీవు వినిన వినబోవు ఇహపరలోక సంబంధమైన సమస్త భోగముల నుండి వైరాగ్యమును పొందగలవు.

స్వజనులను, బంధువులను వధించు ఆశంకతో స్నేహ ప్రభావమున అర్జునుని హృదయమునందు మోహము జనించెను. ఈ అధ్యాయము నందలి 2వ శ్లోకమున దీనినే 'కశ్మలం' అని పేర్కొనడం జరిగింది. అదియే ఇచ్చట 'మోహకలిలం' (ఊబి) అని పేర్కొనబడినది. దాని కారణమున అర్జునుడు తన కర్తవ్యం నిశ్చయించు కొనలేకపోయెను. ఇది బుద్ధి యొక్క నిశ్చయాత్మక శక్తిని నశింపజేసి, మనుజుని తన యందే కూరుకొని పోవునట్లు చేయును. సత్సాంగత్య ఫలితముగా వివేకము ద్వారా నిత్యానిత్యములను, కర్తవ్యాకర్తవ్యములను నిశ్చయించి, మమతాసక్తులను, కోరికలను త్యజించి, భగవత్పరాయణుడై, నిష్కామ భావముతో కర్మలు నాచరించుటచే ఈ ఆవరణయుక్త మలదోషము పూర్తిగా తొలగిపోవును. మోహమనెడి 'ఊబి' నుండి బుద్ధి బయటపడుట యనగా ఇదియే.

నేటివఱకును చూసినట్టి, వినినట్టి, అనుభవించినట్టి ఇహ పరలోక భోగైశ్వర్యాదులన్నియును శ్రుతములనబడును. భవిష్యత్తులో చూడబడు, వినబడు, అనుభవింపబడు వానిని శ్రోతవ్యములు అని యందురు. అవి అన్నియును దుఃఖహేతువులనియు, అనిత్యములనియు భావించి వాటి యందలి ఆసక్తిని పూర్తిగా త్యజించుటనే వైరాగ్యమును పొందుట అని అందురు. మోహము నుండి బయటపడినప్పుడే బుద్ధి పూర్తిగా స్వాభావిక స్థితికి చేరుననియు, అప్పుడే ఇహపరలోకములకు సంబంధించిన సమస్త క్షణిక పదార్థముల యెడ నిజమైన వైరాగ్యము కల్గుననియు భగవానుడు తెలిపెను.

2అ, 53శ్లో.

శ్రుతివిప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా ।
సమాధావచలా బుద్ధి: తదా యోగమవాప్స్యసి । 53 |

నానా విధములైన మాటలను వినుట వలన విచలితమైన అయోమయమునకు గురైన నీ బుద్ధి పరమాత్మ యందు నిశ్చయముగా, స్థిరముగా ఉన్నప్పుడే నీవు ఈ యోగమును పొందగలవు. అనగా నీకు పరమాత్మతో నిత్య (శాశ్వత) సంయోగము ఏర్పడును.

అనేకులు అనేక రకాలుగా చెప్పుకునే మాటలు ఇదివరకే విన్నవి, ఇకపై వినబోయేవి వాటి కారణంగా మోహానికి గురవుతూ కలుషితమైపోతుంటారని నిన్నటి శ్లోకంలో హెచ్చరించాడు. ఈ శ్లోకంలో అలాంటి స్థితిని దాటిపోయి ఆత్మస్థుడవైతే సమాధి స్థితికి చేరుకుంటే ఆ స్థితప్రజ్ఞత ద్వారా యోగం సంప్రాప్తిస్తుంది. ఈ సంప్రాప్తి కోసమే కర్మయోగాన్ని ఆచరించు అని ఆజ్ఞాపిస్తున్నాడు జగద్గురువు. ఇందులో మనం రెండు ప్రధానమైనటువంటి అంశాలను గమనించాలి. ఒకటి స్థిరబుద్ధి స్థిత ప్రజ్ఞతతో కూడినట్టి యోగం, రెండు ప్రతిబంధకం లేని జ్ఞానం. ఈ రెండు కూడా

మోహాన్ని దాటినప్పుడు సంప్రాప్తిస్తుంది అంటున్నాడు జగద్గురువు. ఈ రెండే ప్రధానమైనటువంటి సంపద. సందేహాలతో ఉన్న మనసునే శ్రవణాదులు కలతపెడతాయి. సంశయాలు లేని బుద్ధికి విక్షేపాన్ని కలిగించ లేవు కదా, ఎలా అంటే కళ్ళు లేని వ్యక్తిని ఏ రూపం కలత పెట్టగలదు, కోల్పోయిన వ్యక్తిని ఏ శబ్దం బాధించగలదు ఆలోచిద్దాం మనలో మనమే. అలాగే నిశ్చయ జ్ఞానంతో సంశయ నివృత్తి జరిగి స్థితప్రజ్ఞతను సాధించుకున్న మనిషిని, బుద్ధిని ఎవరేమి చేయగలరు. సాంఖ్యయోగం, కర్మయోగం రెండింటి అవగాహనతో సుస్థిరమైన వ్యక్తి, ఆ వ్యక్తి యొక్క మనోబుద్ధుల్ని వేదవాదం లాంటి కర్మకాండలకు సంబంధించిన విషయాలు కూడా కలత పెట్టలేవు. నాయనా అనవసరమైన విషయాలని శ్రవణం చేయడం చేత నిలకడను కోల్పోయిన బుద్ధి ఏ సమయంలో ఎప్పుడు నిశ్చలమవుతుందో లేదా స్థిరపడుతుందో లేదా అచలమై ఉంటుందో అప్పుడు యోగాన్ని పొందుతావు అంటూ ఈ అధ్యాయానికి సంబంధించిన కర్మప్రకరణం కూడా ఇక్కడే ప్రస్తుతానికి పూర్తి చేస్తున్నాడు జగద్గురువు. ఈ శ్లోకంలో ప్రధానంగా మనం గుర్తించాల్సింది మరొక అంశం ఉంది. నిన్నటి శ్లోకంలో 'యదా'' ఎప్పుడు మోహ కాలుష్యాన్ని దాటుతావో 'తదా' అప్పుడు నిర్వేదం పొందుతావు అని. ఇక్కడ ఈ రెండు పదాలు చాలా సూక్ష్మ దృష్టితో ప్రయోగించాడు. అనేక భావాలతో కలత పడిన బుద్ధి వికల్పాలు లేనిదై సంశయ రహితంగా సమాధి యందు సుస్థిరంగా నిలిచినప్పుడు, నీవు యోగాన్ని పొందుతావు, సమాధి యందు అంటే ఆత్మయందు అని అర్థం. యోగం అంటే వివేకంతో కూడినటువంటి ప్రజ్ఞ. అలా బుద్ధి ఆత్మలో స్థితమై యోగాన్ని పొందాలని ఉద్బోధిస్తున్నటువంటి జగద్గురువుకు ప్రణమిల్లుదాం. జగద్గురువు చెబుతున్న సమాధి స్థితిని పొంది ఆ స్థితి ద్వారా యోగం సంప్రాప్తింప చేసుకుందాం.

2అ, 54శ్లో.

అర్జున ఉవాచ,

స్థితప్రజ్ఞస్య కా భాషా సమాధిస్థస్య కేశవ |
స్థితధీః కిం ప్రభాషేత కిమాసీత వ్రజేత కిమ్ ||

అర్జునుడు పలికెను ఓ కేశవా! సమాధిస్థితుడై పరమాత్మ ప్రాప్తి నందిన స్థితప్రజ్ఞుని యొక్క లక్షణము లెవ్వి? అతడు ఎట్లు భాషించును? ఎట్లు కూర్చొనును? ఎట్లు నడుచును?

కేశవ అను పదము-'క' అనగా బ్రహ్మ, 'అ' అనగా విష్ణువు. 'ఈశ' అనగా శివుడు. ఈ ముగ్గురిని 'వ'(వపుః) అనగా స్వరూపముగా గలవాడు-కేశవుడు. అర్జునుడు శ్రీకృష్ణుని "కేశవ" అని సంబోధించి నీవు సమస్త జగత్తునకు సృష్టి, స్థితి, లయకారకుడవు, కావున నీవే నా ప్రశ్నలకు సరియైన సమాధానములను ఇయ్యగలవు అని తెలిపెను.

శ్రీకృష్ణుడు అర్జునునితో పూర్వ శ్లోకమున "నీ బుద్ధి సమాధి యందు అనగా పరమాత్మ యందు నిశ్చయముగా నిలిచి ఉన్నప్పుడు నీకు యోగసిద్ధి కలుగును" అని పల్కియుండెను.

దానిని అనుసరించి పరమాత్మ ప్రాప్తి నంది పరమాత్మ యందే సదా నిశ్చలమైన, స్థిరమైన బుద్ధి కలిగిన అట్టి సిద్ధ పురుషుని లక్షణములను అర్జునుడు తెలియగోరెను. ఈ భావమును స్పష్టపరుచుటకే 'స్థిత ప్రజ్ఞస్య' అను సమాస పదముతో పాటు 'సమాధిస్థస్య ' అను విశేషణము ప్రయోగింపబడినది.

పరమాత్మ ప్రాప్తి నందిన సిద్ధ పురుషుని యొక్క విషయములన్నింటి యందును వైశిష్ట్యమే యుండును. కావున మాట్లాడుట, కూర్చొనుట, నడచుట మొదలగునవి అతనికి సహజక్రియలైనను, వాటిలో విలక్షణత్వము ఉండును. కానీ ఇచ్చట మాట్లాడుట, కూర్చొనుట, నడచుట అను అతని కర్మలు సాధారణార్థములో గ్రహింపరాదు. మాట్లాడుట యనగా అతని వచనములు. మనస్సులోని ఏభావములతో భావితమైనవి? 'కూర్చొనుట' అనగా వ్యవహారరహిత కాలమందు అతని స్థితి ఏమి? అట్లే నడుచుట అనగా అతని ఆచరణములెట్లున్నవి? అను ఈ రీతులలో వాటి అర్థములను గ్రహింపవలెను.

2అ, 55శ్లో.

ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్ |
ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే ||

శ్రీ భగవానుడు పలికెను- ఓ అర్జునా! మనస్సునందలి కోరికలన్నియును పూర్తిగా తొలగిపోయి, ఆత్మ ద్వారా ఆత్మ యందు సంతుష్టుడైన వానిని, అనగా పరమాత్మ సంయోగము వలన ఆత్మానందమును పొందిన వానిని స్థితప్రజ్ఞుడని యందురు.

మనసులో ఉన్న కోరికలన్నింటిని పూర్తిగా త్యజించి తనలో తాను సంతుష్టుడైన స్థితిని పొందిన వారు స్థితప్రజ్ఞులు. హృదయంలో ప్రవేశించిన సమస్త విధాలైన కోరికల్ని నిశ్శేషంగా పరిత్యజించిన వాడు స్థితప్రజ్ఞుడు, సదా ఆనందంగా ఉండేవాడు. ఆనందం అనేది ఒక వస్తువు ఒక ప్రదేశం ఒక కాలం ఒక సన్నివేశం కాదు కదా ఇప్పుడు తీయదనం అనేది

చక్కెర ధర్మం కదా తీయదనం లేని చక్కెర ఉండదు అంటే తీపి అయి ఉంది అది. అలాగే స్థిత ప్రజ్ఞుడు తానే ఆనందం అయి ఉన్నాడు. అది మనకు దర్శనం కావాల్సిన అంశం. అలాంటి మహాత్ములే స్థితప్రజ్ఞులు. అందుకే జగద్గురువు సంతుష్టుడు అనే మాట ప్రయోగించాడు. అతను నిత్యానందంలో ఉంటాడు. కాబట్టి అలాంటి స్థితప్రజ్ఞుణ్ణి ఏ విషయాలు సమీపించినా అతనికి ఇబ్బంది ఉండదు. సుఖదుఃఖాలు లాంటి రాకపోకలకు సంబంధించిన అనేక అంశాలు చోటు చేసుకుంటాయి, అంతమాత్రాన అతని ఆనందం పెరగడం, తరగడం, ఉలిక్కిపడటం, సంతోషపడటం, బాధపడటం ఉండదు. కారణం అతను సమస్తమైన కోరికలు త్యజించాడు అందుకే తృప్తిగా ఉంటున్నాడు. దేన్నీ ఆశించకుండా దేనిపై ఆధారపడకుండా తనలో తాను తనతో తాను సదానందమయిగా ఉంటాడు. ఆనందమయత్వం బయట ఉండదు, దృశ్య ప్రపంచంలో లేదు. ఈ అంశం ఇదే అధ్యాయం 14వ శ్లోకంలో తెలుసుకున్నాం. ఎన్ని చోట్ల గాలించినా కూడా తెచ్చుకోలేం. ఆత్మ అంటేనే ఆనందం అదే ఆనందం అయి ఉంది కాబట్టి ఎప్పుడూ అది అలా ఉన్నది లేనిది కాదు, కాసేపు ఉండి పోయేది కాదు. చక్కెరలో తీపి పోదు కదా అలా సదా అదే అయి ఉంది కదా, అలా మనమే ఆ స్థితికి స్థితప్రజ్ఞత స్థితికి చేరుకోవాలి. దానికి మార్గం కోరికల్ని వేర్లతో సహా పెకలించి వేయాలి. అప్పుడు స్వతఃసిద్ధమైన ఆత్మానందం సంప్రాప్తిస్తుంది, అదే స్థితః ప్రజ్ఞత, అదే జీవన్ముక్త స్థితి.

2అ, 56శ్లో.

దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః ।
వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే ॥

దుఃఖములకు కృంగిపోనివాడును, సుఖములకు పొంగిపోనివాడును, ఆసక్తిని, భయక్రోధములను వీడిన వాడును ఐనట్టి మననశీలుడు (ముని) స్థితప్రజ్ఞుడన బడును.

అర్జునుడి ప్రశ్నలోని ఆంతర్యం ఏమంటే ఈ పంచభూతాత్మక ప్రపంచం ద్వారా దైనందినటువంటి జీవితంలో ప్రాప్తించే సుఖదుఃఖాల విషయంలో స్థితప్రజ్ఞుడు ఎలా వ్యవహరిస్తాడు. ఈ ప్రపంచం ఒకటే అయినా ఆ ప్రపంచం అందరినీ ఒకే విధంగా ప్రభావితం చేయడం లేదు కదా, నిన్న ఇష్టం అనిపించినవి నేటికి వెగటు అనిపిస్తుంది. ఒకరోజు సుఖానికి కారణమైనటువంటి మనిషి మరొకరోజు దుఃఖానికి కారణమవుతున్నాడు కదా, దీన్ని బట్టి సుఖదుఃఖాలు ఎక్కడ ఉన్నట్లు. ఇలా మనం విచారిస్తూ మన లోపలికి మనం ముందుకు వెళ్లాలి. అలా మనం ఆలోచించినప్పుడు అవి ఈ ప్రపంచంలో లేవని లేనిదని మనలో మనకు సమాధానం వస్తుంది. అయితే మరి ఎక్కడ ఉన్నాయి? అవి ఎవరికి అనిపిస్తున్నాయో వారిలోనే అవి ఉన్నాయని నెమ్మదిగా మనకు ఈ విచారణలో నిర్ధారణ అవుతుంది. ప్రపంచం ఉంది,

అయితే ఆ ప్రపంచం ఉందని తెలుసుకుంటున్నది మనమే. ప్రపంచం ఉన్నట్లు మనకే తెలుస్తోంది కదా, మరి మనం ఉన్నట్లు తెలుసుకుంటున్నాము కనుకనే ప్రపంచం ఉన్నట్లు మనకు తెలుస్తుంది. ఇలా మనం మనలోకి వెళ్లి తరచి తరచి చూసినప్పుడు సుఖదుఃఖాలు అనేవి ప్రపంచానికి సంబంధించినవి కాదు అని మనకు అవగాహన అవుతుంది. ఇప్పుడు ప్రపంచం అనేది పరిణామశీలం నిరంతరం మార్పు చెందుతూనే ఉంటుంది, కాబట్టి ఈ ప్రపంచం మనిషికి సమస్య కాదు కానేరదు. అది ఏదైనా ఉంది అంటే అది ఖచ్చితంగా మనిషిలోనే ఉందని గ్రహించాలి. ఇప్పుడు మనిషి దగ్గరికి వద్దాం, మనలో ఉన్నది ఏది సుఖమా?, దుఃఖమా? ఒకటి ఉంటే మరొక దానికి వీలు లేదు కదా, వెలుతురు ఉన్నచోట చీకటి, చీకటి ఉన్నచోట వెలుతురు ఉండవు కదా. ఇలా మనలో మన గురించి మనమే విచారిస్తే కూడా తేలేది ఏంటి? సుఖదుఃఖాలు రెండూ కూడా మనకు సంబంధించినవి కావు అని. అయితే అవి మనల్ని ఉన్నట్లుగా భ్రమింప జేస్తూ ఉంటాయి ఈ మాయ ప్రపంచంలో. ఇక్కడ 'దుఖేషు' అనే మాట ప్రయోగించాడు జగద్గురువు. త్రివిధాలైన దుఃఖాలు ప్రాప్తించినప్పుడు కలత చెందని వాడు అని అర్థం. ప్రతి మనిషిని కూడా మూడు రకాలైన దుఃఖాలు బాధిస్తూ ఉంటాయి. వాటిని ఆధ్యాత్మికం, ఆదిభౌతికం, ఆదిదైవికం అని అంటారు. 1.శరీరంలోని ఉద్వేగాల వల్ల కలిగేటటువంటి రోగాలు అలాగే సోమరితనం, కపటం ఇలాంటి మనలో ఉన్నటువంటి దుర్గుణాల వల్ల కలిగేటటువంటి దుఃఖాలు. 2. పంచభూతాల నుండి శత్రువులు, చోరులు, మృగాలు, కీటకాలు ఇతరత్రా అంశాల వల్ల కలిగేటటువంటి దుఃఖాలు. 3. అతివృష్టి, అనావృష్టి పిడుగుపాటు, గ్రహ బాధలు మొదలైనటువంటి వాటి వల్ల కలిగే దుఃఖాలు. జగద్గురువు అలాంటి త్రివిధాలయినటువంటి దుఃఖాలు సంభవించినప్పుడు కూడా స్థితప్రజ్ఞుడు కలత చెందడు. ఎలా కలత చెందడు అంటే సుఖం ప్రాప్తించినప్పుడు, దుఃఖాలు సంభవించినప్పుడు అతను ఆ ప్రాప్తిస్తుంది అనుకుంటున్నటువంటి సుఖదుఃఖాల పట్ల ఇది నాకు సంబంధం లేదని వాటిపట్ల స్పృహను కోల్పోయిన వాడై ఉంటాడు. అంటే సుఖం, దుఃఖం రెండింటితోను ఇతను ఆ స్పృహ లేని వాడుగా ఉంటూ, ఆ స్పృహ ఇతనికి తెలియదు, తెలియని వాడిగా ఉంటాడు. ఆ స్పృహ ఇతనిని తాకదు. వాటి స్పందనల స్పృహ ఇతనికి ఉండదు. ఎలా వ్యవహరిస్తాడు అని కదా అడిగాడు అర్జునుడు, అందుకు జగద్గురువు ఇంత వివరంగా మనకు తెలియజేస్తున్నాడు. అలాగే రాగం, భయం, క్రోధం వీటివల్ల కూడా అతడు బాధపడడు.ఇవి కూడా అతనిని బాధించలేవు ఎందుకు ఎలా అంటే అవి తొలగినవాడు కాబట్టి. రాగం, భయం, క్రోధం కూడా అతనిని కాదని దానికవే పైదొలగి వెళ్ళిపోయాయి. ఇక రాగం అనే మాటకు కర్మ ప్రకారణంలో మనం వివరంగా చర్చించుకున్నాం. మననశీలుడు అంటే తాను ఆత్మను అనే స్వభావం కలిగి ఉన్నవాడు, అలాంటి వాడినే స్థితప్రజ్ఞుడు, ముని అంటారు.

2అ, 57శ్లో.

యః సర్వత్రానభిస్నేహః తత్తత్ ప్రాప్య శుభాశుభమ్ |
నాభినందతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ||

దేనియందును మమతాసక్తులు లేని వాడును, అనుకూల పరిస్థితుల యందు హర్షము, ప్రతికూల పరిస్థితుల యందు ద్వేషము మొదలగు వికారములకు లోను కాని వాడును అగు పురుషుడు 'స్థితప్రజ్ఞుడు' అనబడును.

నిన్నటి శ్లోకంలో రాగం భయం క్రోధం విడిచిన వాడు, సుఖదుఃఖాలతో స్పృహ లేని వాడు స్థితప్రజ్ఞుడు అని చెప్పిన జగద్గురువు ఇక్కడ దానికి కొనసాగింపుగా 'అనభిస్నేహం' అనే అంశాన్ని చేర్చాడు. 'అభి స్నేహము' అవరోధము అంటున్నాడు, అందుకే 'అనభి స్నేహ' అన్నాడు. రాగం భయం క్రోధం ఏర్పడటానికి కారణమైన అభి స్నేహం ఉండకూడదని, అది అవరోధమని తేల్చి చెప్పాడు. స్నేహం అంటే చెలిమి కదా అభి స్నేహమంటే గట్టి స్నేహం, అంటే సాధారణ స్నేహం కంటే ఈ అభి స్నేహం తీవ్రతరమైనది, సాంద్రత చాలా ఎక్కువ. ఒక్కోసారి మనం తట్టుకోలేనంతగా ఉండి మనల్ని ప్రతి చిన్న విషయానికి ఊపేస్తుంది, విసిరేస్తుంది, మన ఉనికికే ప్రమాదం సంభవిస్తుంది కూడా. అయితే ఇక్కడ చెలిమి అన్నప్పుడు వ్యక్తికి మాత్రమే, మనిషికి మాత్రమే,అని మనము ఆపాదించకూడదు. వేటితో చెలిమి అంటే సమస్త విషయాలు అన్నాడు. స్నేహం ఉండొచ్చు అంతేకానీ అభి స్నేహం ఉండకూడదు అని హెచ్చరిస్తున్నాడు. మానవుడు సంఘజీవి కాబట్టి స్నేహం ఉండాలి ఇవన్నీ చాలా గొప్పవి అద్భుతమైనవి కూడా అయితే అవి మన దుఃఖానికి మన పతనానికి కారణం కాకూడదు కదా. అందుకు జగద్గురువు స్నేహం ఉండొచ్చు అభి స్నేహం ఉండకూడదు, ఎందుకంటే మనం అనేక సందర్భాల్లో చర్చించుకున్న ఈ రాగం, ద్వేషము, క్రోధం ఉన్నాయి కదా, ఇలాంటివి ఏర్పడటానికి ఈ అభి స్నేహమే మూల కారణం అవుతుంది. వస్తువుల పట్ల, ఆస్తుల పట్ల, వ్యక్తుల పట్ల, దేహం పట్ల భౌతిక జీవితానికి సంబంధించినటువంటి అన్నింటి పట్ల తీవ్రమైన స్నేహం ఉండకూడదు. అంటే ఏమి? రాగానికి అవకాశం ఇవ్వనటువంటి స్నేహం. దానికి తావిస్తే అది మనల్ని అమాంతం నిలువునా ముంచేస్తుంది.

జీవితాన్ని నిస్సంగంగా, సమత్వంతో, శాంతితో ఎదుర్కొనేవాడు స్థితప్రజ్ఞుడు. జీవితం సహజంగా మంచి చెడ్డల కలయిక. ఎప్పుడూ దుఃఖాలను తప్పించుకుంటూ సుఖాల కోసం తపనపడడం అనేది అవివేకంగా జీవించడం అవుతుంది.

స్థిత ప్రజ్ఞుడు జీవితంలో ఎదురయ్యే ఉత్తమమైన, ఘోరమైన విషయాలు రెండింటిని సమానమైన నిస్సంగభావంతో అనుభవిస్తాడు. ఎందుకంటే అతడు తన స్వస్వరూపమైన ఆత్మ యందు సదా సుప్రతిష్ఠితుడై యున్నాడు. ప్రతి విషయాన్ని తన మనోభావాలతో మిళితం చేయకుండా విషయాలను ఉన్నదున్నట్లుగా చూస్తాడు.

2అ, 58శ్లో.

యదా సంహరతే చాయం కూర్మోఽఙ్గానీవ సర్వశః |
ఇంద్రియాణీంద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ||

తాబేలు తన అంగములను అన్ని వైపుల నుండి లోనికి ముడుచుకొనునట్లుగా, ఇంద్రియములను ఇంద్రియార్థముల నుండి అన్ని విధముల ఉపసంహరించుకొనిన పురుషుని యొక్క బుద్ధి స్థిరముగా ఉన్నట్లు భావింపవలెను.

ఇంద్రియాలు మన దేహంలో ఉన్నాయి. ఇంద్రియ విషయాలు బయట అంటే దేహానికి వెలుపల ఉన్నాయి. ఇంద్రియాలు మన దేహంలో ఉండి బాహ్యంగా అంటే దేహానికి వెలుపల ఉన్న ఇంద్రియ విషయాలను గ్రహించి మనకు చేరవేస్తాయి. ఈ రెండింటికీ మాధ్యమం మనసు. ఇలా మనసు మనలో నుంచి వెళ్లి మన వెలుపల ఉన్న ఇంద్రియ విషయాల్ని సేకరించి మనకు తెలియజేస్తుంది. దేని ద్వారా? మన దేహంలోని ఇంద్రియాల ద్వారానే వెళ్లి వెలుపలి ఇంద్రియ విషయాల్ని మోసుకొచ్చి మనలో నింపుతుంది. ఈ కారణంగా ఈ మనసుకు ఇటు మన దేహంలోని ఇంద్రియాలతోనూ, అటు వెలుపల ఉన్న ఇంద్రియ విషయాలు రెండింటితోనూ కూడా సంబంధం ఏర్పరచుకొని ఉంటుంది. ఈ సంబంధం మనకు అవసరం కూడా, మనిషి ఉంటే కచ్చితంగా మనసు ఉంటుంది. అలా మనసు వెలుపల ఉన్న ఇంద్రియ విషయాల దగ్గర సేకరించి ఉన్నది ఉన్నట్లుగా విషయాలను మన దేహంలోకి ఇంద్రియాల ద్వారా మనకు స్ఫురింప చేస్తుంది. కాబట్టి వివేక ప్రజ్ఞ ఉన్నప్పుడు వీటి కారణంగా మనకు ఇబ్బంది ప్రమాదం ఉండదు. రాగం, భయం, క్రోధం రాదు. అలా యధాతథంగా మనలోకి చేరిన అంశాల పట్ల కూడా తనకు సంబంధం లేనట్లుగా వ్యవహరించే స్థితి మనలో ఏర్పడుతుంది. ఎందుకు? స్థితప్రజ్ఞుడు కాబట్టి. వచ్చిన ఆ విషయాల పట్ల పెద్ద తేడా ఏమీ అనిపించదు, వాటిని పట్టించుకోడు, వాటిని గురించి స్పందించడు, ఇది మనకు స్పష్టంగా తెలియాలి. ఇలా మనం విచారించి మనలో స్థితప్రజ్ఞతను ప్రతిష్టింప చేసుకోవాలి. ఇందుకు ఉపమానంగా జగద్గురువు తాబేలు ఉదహరించారు.

బాహ్యముగా ఇంద్రియములను నిరోధించి స్థూల విషయముల నుండి ఇంద్రియములను మరల్చినప్పటికిని ఇంద్రియ వృత్తులు విషయముల వైపు పరుగులు తీయుచునేయుండును. ఈ కారణము వలన సామాన్య మానవుడు స్వప్నములో మనఃప్రపంచము నందు ఇంద్రియముల ద్వారా సూక్ష్మ విషయములను అనుభవించుచుండును. ఈ విధముగా విషయోప భోగముల నుండియు ఇంద్రియములను సర్వథా (ఎల్లప్పుడూ) మరియు అన్ని వైపుల నుండి, అన్ని ఇంద్రియములను ఉపసంహరించుకొనవలెనని తెలుపుటకే 'సర్వశః' అను పదము ఉపయోగించడమైనది. విషయ వస్తువుల నుండి ఇంద్రియాలు ఉపసంహరించుకునే శక్తిని యోగశాస్త్రంలో 'ప్రత్యాహారం' అంటారు. యోగి ప్రాణాయామం ద్వారా దీనిని పొందుతాడు.

విచక్షణ ద్వారా ఎప్పుడు బహిర్ముఖం కావాలో ఎప్పుడు అంతర్ముఖం కావాలో తాబేలుకు తెలుసు. మనకు కూడా మనలో ఉన్నటువంటి వివేకం ద్వారా విచక్షణ ద్వారా 'స్థితప్రజ్ఞత' ప్రసాదం సంప్రాప్తిస్తుంది.

తాబేలు ప్రమాదాన్ని గుర్తిస్తే తన అవయవాలను అన్ని వైపుల నుండి తనలోకి మరల్చుకున్నట్లు జ్ఞాననిష్ఠ యందు ప్రవర్తిల్లుతున్న యోగి ఇంద్రియ విషయాలనుండి ఇంద్రియాలు అన్నింటిని ఉపసంహరించుకుంటాడు. అతన్నే స్థితప్రజ్ఞుడు అని అంటారు. మనం మనలో అలా వివేక ప్రజ్ఞతో స్థితప్రజ్ఞతను పొంది అలా ఆసీనులై వుందాం. ఇదే అర్జునుడు అడిగిన ప్రశ్నకు సమాధానం.

2అ, 59 శ్లో.

విషయా వినివర్తంతే నిరాహారస్య దేహినః ।
రసవర్జం రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే ||

ఇంద్రియముల ద్వారా విషయములను గ్రహింపని వానినుండి ఇంద్రియార్థములు మాత్రము వైదొలగును. కాని వాటిపై ఆసక్తి మిగిలియుండును. స్థితప్రజ్ఞునకు పరమాత్మ సాక్షాత్కారమైనందు వలన వానినుండి ఆ ఆసక్తిగూడ తొలగిపోవును.

భోజనం త్యాగము వలన కేవలం జిహ్వేంద్రియమే నివృత్తమగును, కానీ శబ్ద స్పర్శ రూప గంధముల నివృత్తి కాదు. కావున ప్రతి ఇంద్రియ విషయము దానికి ఆహారముగా భావింపవలెను. ఈ దృష్టితో అన్ని ఇంద్రియముల ద్వారా సమస్త ఇంద్రియ విషయములను గ్రహించుట మానివేసిన దేహాభిమానిని ఇచట 'నిరాహారస్య' అను విశేషణముతో పాటు 'దేహినః' అను పదము తెలుపును.

ఇట్టి మనుషుల నుండి కేవలం విషయములు మాత్రమే నివృత్తములగును. కానీ వాటి నుండి ఆసక్తి తొలగిపోదు. విషయ పరిత్యాగము చేయు అజ్ఞానియు తాబేలు వలె తన ఇంద్రియములను విషయముల నుండి పై పైన మాత్రమే మరల్చగలడు కానీ ఆ విషయములందు అతని ఆసక్తి నిలిచి అది తొలగిపోదు. ఈ కారణమున అతని ఇంద్రియ వృత్తులు విషయముల వైపు పరుగులు దీయుచుండును. దానికి కారణం అనేక జన్మల నుండి మన ఇంద్రియాలు విషయాలలో చిక్కుకొని వాసన రూపంలో చిత్తంలో ముద్ర పడి ఉన్నాయి. ఆ వాసనలే మళ్ళీ మళ్ళీ విషయాలు కనిపించగానే ఇంద్రియాలను పరుగులెత్తిస్తూ ఉంటాయి. అందువల్ల విషయాలు దూరంగా ఉన్నా లోపల విషయ వాసన లేదు అని అనుకోరాదు. అది మనసులో ఏ మూలనో నక్కి ఉంటుంది. మరి ఆ వాసనలు తొలగాలంటే పరమాత్మ

(ఆత్మ) దర్శనం అవ్వాలి. అది స్థితప్రజ్ఞునునికే సాధ్యం. ఎందుకంటే అతడు సర్వకాల సర్వావస్థలలో ఆత్మస్థితిలో ఉండి సర్వం బ్రహ్మమయంగా దర్శిస్తూ ఉండడం వలన అతనికి విషయ వాసనలు అంటవు. అతనిలో అవి సంపూర్ణంగా నిర్బీజమవుతాయి, విషయ రసేంద్రియాలు పూర్తిగా తొలగిపోతాయి. మనమందరం ఆ స్థితిని పొందాలంటే భగవద్గీత, ఉపనిషత్తులను సద్గురువుల బోధ ద్వారా శ్రవణం చేసి తర్వాత మనన నిధి ధ్యాసనల ద్వారా అనుభూతి చెందాలి. అలా సాధనల ద్వారా క్రమక్రమంగా స్థితప్రజ్ఞత స్థితిని పొందాలి.

2అ, 60శ్లో,

యతతో హ్యపి కౌంతేయ పురుషస్య విపశ్చితః ।
ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః ॥

ఓ అర్జునా! ఇంద్రియములు ప్రమథనశీలములు. మనుష్యుడు వాటిని నిగ్రహించుటకు ఎంతగా ప్రయత్నించినను, ఆసక్తి తొలగి పోనంతవఱకును అవి అతని మనస్సును ఇంద్రియార్థములవైపు బలవంతముగా లాగికొనిపోవుచునే యుండును.

ఎంత శాస్త్ర జ్ఞానం కల విధ్వాంసులైనా, ఎంత ప్రయత్నం చేస్తున్న వారినైనా, ఎంత మేధావులనైనా ఇంద్రియాలు బలవంతంగా విషయాల వైపుకు లాగి వేస్తున్నాయి కదా అంటున్నాడు జగద్గురువు. ప్రమథన శీలమైనవి అంటే క్షోభ పెట్టడం, కలత పెట్టడం, కలవరింతలకు గురిచేయడం వాటి స్వభావం. అలాంటి స్వభావం గల ఇంద్రియాలు సాధన చేస్తున్న మేధావి మనసును కూడా బలాత్కరించి విషయాల వైపుకు మళ్ళించి కలవరపెడతాయి, ఇబ్బందికి గురిచేస్తాయి, ప్రమాదాన్ని తెచ్చి పెడతాయి. వెలుగును మాత్రమే చూస్తున్న వివేక విజ్ఞానవంతుడిని అయినా సరే వ్యాకులతకు నిస్సహాయతకు గురిచేస్తాయి. ఇంద్రియాలు ఎంతటి శక్తివంతమైనవో, ఎంతటి ప్రమాదకరమైనవో ఆత్మావలోకనం కోసం ప్రయత్నిస్తున్న సాధకుడిని సైతం, శాస్త్రజ్ఞానం తెలిసిన విద్వాంసులను సైతం, మేధావులను సైతం అందరి మనసును కూడా అవి ఎంత బలాత్కారంగా లాక్కుని వెళ్తున్నాయో మరి సామాన్య మనిషి సంగతి ఎలా ఉంటుంది. సామాన్యుడిని ఇంద్రియాలు ఏ పరిస్థితికి తీసుకెళ్తున్నాయో మనకు తెలియనిది కాదు. బలాత్కారంగా లాగేస్తూ ఉంటాయి. నిరంతర సాధకుడు, మేధస్సు శాస్త్ర పరిజ్ఞానం ఉన్నవాళ్లు, విద్వాంసులు ఎవరినైనా సరే అవి లెక్కచేయవు. కాబట్టి ఆత్మానుభవ జ్ఞానం అనివార్యం అని మనకు తేటతెల్లమవుతుంది. కాబట్టి ఆత్మానుభవ జ్ఞానం, పరమార్ధ దర్శనం గల స్థితప్రజ్ఞునికి ఇంద్రియాలు లోబడి ఉంటాయి. కారణం మననశీలుడు కదా అతను. అంటే తానే ఆత్మ అన్న స్థానంలో సుస్థిరంగా సుప్రతిష్టమై ఉంటాడు. కాబట్టి అనుభవ జ్ఞానం మనం సంప్రాప్తించుకోవాలి.

పండితులైన సాధకులు కొందరు శాస్త్ర జ్ఞానంతో పాండిత్య ప్రకర్షతో ఇంద్రియాలు నియమించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తూ ఉంటారు. అలాంటి వారి మనసును కూడా అవి బలాత్కారంగా లాక్కొని వెళ్తాయి, హరించి వేస్తాయి. కారణం ఇంకా అతనిలో రాగం, రసం ఉండటమే. ఒక చిన్న నిప్పురవ్వ అరణ్యాల్ని దహించే శక్తిని కలిగి ఉన్నట్లు మనసులోని విషయ ఆసక్తి ఇంద్రియాలకు మితిమీరిన బలాన్ని సమకూరుస్తాయి. కాబట్టి మనసులో విషయ ఆసక్తి మిగిలి ఉంటే ఆ రాగం ఉంటే ఇంద్రియాలు లొంగదీసుకుంటాయి. ఇలా మనసు, ఇంద్రియాలు రాగాదులకు వశం కాకుండా జాగ్రత్తపడాలి. వివేక ప్రజ్ఞను సుస్థిరం చేసుకోవాలి. కాబట్టి కచ్చితంగా పరమాత్మ దర్శనం అనివార్యం, అత్యవసరం. అందుకే విధ్వాంసుడైన పురుషుడు తీవ్రంగా ప్రయత్నిస్తూనే ఉన్నప్పటికీ అయినా కూడా క్షోభను కలిగించేటటువంటి ఇంద్రియాలు మనసును బలవంతంగా లాక్కొని వెళ్ళిపోతాయి. ప్రయత్నిస్తున్న శాస్త్రజ్ఞానం గల మేధావిని కూడా విద్వాంసులను సైతం మహా శక్తివంతమైనటువంటి ఇంద్రియాలు బలాత్కారంగా లాగుతూ ఉంటాయి అని హెచ్చరిస్తూ మేల్కొలుపుతున్నటువంటి జగద్గురువుకు ప్రణమిల్లుదాం.

2అ, 61శ్లో.

తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః |
వశే హి యస్యేంద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా |61|

సాధకుడు ఇంద్రియములన్నింటిని వశమునందుంచుకొని, సమాహిత చిత్తుడై (చిత్తమును పరమాత్మ యందు లగ్నము చేసినవాడై) మత్పరాయణుడై ధ్యానమునందు కూర్చొనవలెను. ఏలనన ఇంద్రియములను వశమునందుంచుకొనువాని బుద్ధి స్థిరముగా నుండును.

దీన్ని బట్టి సాధకులు మనసు, ఇంద్రియాల వశం కాకుండా జాగ్రత్తపడాలి. ఇంద్రియాలను వశపరచుకోవడం అనేది జీవితంలో చాలా ప్రధానమైనటువంటి అంశం. ఇంద్రియాలపై సంపూర్ణమైనటువంటి పట్టు ఖచ్చితంగా ఉండాలి. ఇంద్రియ విషయ స్పృహ కూడా లేనటువంటి పవిత్రాత్ముడు జ్ఞాని. అతడే స్థితప్రజ్ఞుడు, అతని వివేక బుద్ధి సదా స్థిరంగా ఉంటుంది. ఇక్కడ యుక్తః అన్నాడు. సమాధి స్థితిని పొందిన యోగ యుక్తులు అని భావం. సమాధి స్థితిలో ఉన్నవారు మత్పరః మత్పరుడు అంటే అందరి అంతరాత్మ రూపమైన వాసుదేవుడు నేనే, నేను అతని నుంచి వేరు కాదు అనే అనన్య భావం కలవాడు. ఆ భావంతో మనలో మనం ఆసీనులు కావాలి.

ఇక్కడ మరో అంశం, ఆత్మపరః అనకుండా మత్పరః నాయందే ఇందులో జగద్గురువు చెప్పిన 'నా' ఎవరంటే ఈ దేహంలోని నేను, నాలోని నేను ఆ నాయందే ఆసీనులై ఉండాలి.

తన శరీరాన్ని అడవిగా మలచుకొని అంటే అడవిగా భావించి లోపల కూర్చుని తపస్సు చేయాలి. కూర్చోగలిగిన వాళ్ళు ఎక్కడ ఉన్నా తమలో తాము కూర్చోగలరు. ఎక్కడ ఉన్నా కూర్చోవాల్సింది మనలోనే మనమే అనేది ఆంతర్యం.

మొదటి పాదంలో ఇంద్రియాలను, మనసును ఆత్మయందు సుస్థాపితం చేయాలి అని, రెండవ పాదం అలా సుస్థాపితం చేసుకున్న వారి ప్రజ్ఞ్యే సుస్థిరమైనది. మనలో మనం ఇలా ఆసీనులు కావాలి, కూర్చోవాలి. ఈ దేహంలో దివ్యమై వెలుగొందుతున్న దైవంతో స్థితమై మనలో మనం ఆసీనులై ఉండాలి. భగవానుడే సాక్షాత్తు మనలో ఆత్మ అయి వెలుగొందుతూ ఉన్నాడని జగద్గురువే స్వయంగా ఉద్బోధిస్తున్నాడు. దీన్నిబట్టి మనకు తానే దైవమని దర్శనమవుతుంది. అందుకే జగద్గురువు ఇంద్రియాలన్నింటినీ వశం చేసుకొని సమాహిత చిత్తుడై నాలోని నన్నే పొందాలనేటటువంటి గాఢమైనటువంటి తపస్సును కలిగి ఉందాం, మనలో మనం సుస్థిరంగా సుప్రతిష్ఠంగా కూర్చొని ఉందాం.

2అ, 62&63శ్లో.

ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూపజాయతే |
సంగాత్ సంజాయతే కామః కామాత్ క్రోధోఽభిజాయతే |62|

విషయ చింతన చేయు పురుషులకు ఆ విషయములందు ఆసక్తి ఏర్పడును. ఆసక్తి వలన ఆ విషయములను పొందుటకై కోరికలు కలుగును. ఆ కోరికలు తీరనప్పుడు క్రోధము ఏర్పడును.

క్రోధాద్భవతి సమ్మోహ: సమ్మోహాత్ స్మృతివిభ్రమః ।
స్మృతిభ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్ ప్రణశ్యతి |63 |

అట్టి క్రోధము వలన వ్యామోహము కలుగును. దాని ప్రభావమున స్మృతి చిన్నా భిన్నమగును. స్మృతి భ్రష్టమైనందున బుద్ధి అనగా జ్ఞానశక్తి నశించును. బుద్ధి నాశము వలన మనుష్యుడు తన స్థితి నుండి పతనమగును.

విషయ చింతన ఎంతటి అనర్ధమునకు దారితీయునో ఈ రెండు శ్లోకముల యందు విశదీకరింపబడినది. విషయాల గురించి అనగా ఇంద్రియ విషయములు లేక వస్తువుల పట్ల పదేపదే ఆలోచించటం వలన వాటియందు సన్నిహితత్వం,

సంగ భావం ఏర్పడుతుంది. సంగభావం చివరికి ముదిరి వాటిని పొందవలెనని లేదా అనుభవించవలెనను కోరిక మొదలవుతుంది. ఈ కోరికే కామం. కామం మొలకగా ఉన్నప్పుడే జాగ్రత్త పడాలి.

ఈ కోరిక దేని పట్ల అయితే కలుగుతుందో అది తనకు దొరకనప్పుడు క్రోధం పుడుతుంది. తన దారికి అడ్డుపడ్డ వారిపైనా క్రోధం ఏర్పడుతుంది. క్రోధం వలన యుక్తా యుక్తాలు మరచి పోతాడు. దీని నుండి సమ్మోహం కలుగుతుంది. అంటే ఇది మంచి ఇది చెడు అనే విచక్షణాశక్తిని కోల్పోతాడు. దానివల్ల స్మృతి అంటే జ్ఞాపక శక్తిని కోల్పోతాడు. దానితో అతడి బుద్ధి నాశనమవుతుంది. అంటే యోగ్యమైన బుద్ధి లేకుండా పోతుంది. ఇలా బుద్ధి నశించినవాడు పూర్తిగా నాశనం అయిపోతాడు. చేయరాని పనులు చేసిన వారు ఎంతవరకు పతనం కావాలో అంతవరకు పతనమవుతారు. ఈ రెండు శ్లోకాలలో భగవానుడు విషయచింతన వల్ల మెట్టు మెట్టుగా పతనం చెంది, మానవుడెలా సర్వనాశనమైపోతున్నాడో స్పష్టంగా తెలియజేస్తున్నాడు.

2అ, 64శ్లో.

రాగద్వేషవియుక్తైస్తు విషయానింద్రియైశ్చరన్
ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాదమధిగచ్ఛతి

అంతఃకరణమును వశమునందుంచుకొనిన సాధకుడు రాగద్వేషరహితుడై, ఇంద్రియముల ద్వారా విషయములను గ్రహించుచున్నను మనశ్శాంతిని పొందును.

రాగద్వేషాలనేది ఇంద్రియాలకు స్వాభావికమైన ప్రవృత్తి. అయితే ముముక్షువైన వాడు రాగద్వేషాలు లేకుండా ఉండి తన వశంలో ఉన్న శ్రోత్రాది ఇంద్రియాలతో దేహధారణ అవసరమైన విషయాల యందు చరిస్తూ ఉంటాడు. అంటే దేహధర్మాల్ని పాటించడం కోసం వాటిని ఉపయోగించుకుంటూ ఉంటారు. అలాంటి ప్రసన్నత్వం, స్వస్థత అనే ప్రసాదం కలిగి ఉన్నారు. అంటే అంతఃకరణాన్ని అదుపులో ఉంచుకోగలిగే ప్రసాదాన్ని పొందిన వారని అర్థం. 55వ శ్లోకంలో స్థితప్రజ్ఞుల లక్షణాల్ని స్థూలంగా చెప్పారు. దైనందిన జీవితంలో స్థితప్రజ్ఞులు ఎలా వ్యవహరిస్తారు అన్న ప్రశ్నకు 56 57వ శ్లోకంలో స్పష్టంగా వివరించారు. 58 నుంచి 61 వరకు స్థితప్రజ్ఞులు ఎలా కూర్చొని ఉండాలో తమ తమ సమస్త ఇంద్రియాలను అన్ని వైపుల నుంచి ఎలా సంయమింపజేయాలో స్పష్టంగా తెలియజేశారు. 62 63 శ్లోకాల్లో భౌతిక విషయాసక్తి నుండి ఇంద్రియాలను సంయమింప చేయకపోతే మనిషి ఎలా పతనమవుతాడో అవరోహణ క్రమంలో వివరించి మనల్ని మనం సరిదిద్దుకోవాలని హెచ్చరించాడు. నిర్మలమైన చిత్తాన్ని, ప్రసన్నత్వంతో కూడుకున్న

మనసును ఎలా పొందాలో సూచిస్తున్నాడు. ఆ పొందిన ప్రసన్నత్వం అనే ప్రసాదం ద్వారా స్థితప్రజ్ఞులు చరించే విధానం మనకు బోధపడుతుంది. చరించడం అంటే స్థితప్రజ్ఞులు ఈ భౌతికదేహంతో తిరగడం కాదని తెలియాలి. ఇక్కడ మనకు కనిపించే ప్రదేశాలకు సంబంధించి ఏఏ ఊర్లు లేదా స్థలాలు ప్రదేశాలకు తిరిగే విధానం కాదు ఈ చరించడం. ఈ భౌతిక లోకానికి సంబంధించిన నడక నడిచే విధానం లాంటివి కూడా కాదు. మనదేహంలోని ఇంద్రియాలలోను మనలో మనము ఎలా చరిస్తాము, స్థితప్రజ్ఞుడు తనలో తాను తన ఇంద్రియాలలోతాను ఎలా చరిస్తాడు, ఎలా తిరుగుతాడు అనే అంతర్ముఖత్వానికి సంబంధించినది అనేది గమనించదగిన అంశం. అన్నింటిని మించి తన మనసులో తాను ఎలా చరిస్తూ ఉంటాడు అనేది ఆంతర్యం. గీతాస్వరూపులందరూ ఈ అంశాన్ని ఖచ్చితంగా గమనించాలి. స్థితప్రజ్ఞులు నిత్యం చరించే మనసును నిర్మలంగా ఉంచుకుని ఫలితంగా ప్రసన్నతను పొందే మార్గాన్ని ఈ శ్లోకంలో తేటపరిచారు. దీన్నిబట్టి మనం మన మనసును నిర్మలత్వపు స్థితికి చేరుకునే దిశగా సూచనలిస్తూ జగద్గురువు అనుగ్రహంతో ప్రసన్నత్వం పొందాలి. అలా నిర్మలత్వపు ప్రసాదాన్ని పొందిన వారు దైవకార్యానికి ఉపకరించే దేహ సంరక్షణ నిమిత్తం దేహంతో కార్యకలాపాలు నేర్పుతూ ఉంటారు. భోజనం, స్నానం లాంటి సకల కార్యక్రమాల నిర్వహణలోనూ నిమిత్తమాత్రంగా ఉండి యోగ దృష్టితో ఆయా కర్మలలో చరిస్తూ ఉంటారు. కర్మలతో కాదు, కర్మలలో ఇది గమనించాలి. వీరి భౌతిక కార్యకలాపాల నిర్వహణ కారణంగా వారి వారి మనోనిర్మలతకు, ప్రసన్నత్వానికి ఎలాంటి భగ్నం వాటిల్లదు. కారణం ఏ విషయాల పట్ల వీరికి రాగద్వేషాలు ఉండకపోవడమే. ఎందుకంటే అవే వీరిని వద్దని పైదొలగి వెళ్ళిపోయాయి కదా, అలా రాగద్వేషాలు, సుఖదుఃఖాల స్పృహ వీరికి లేని కారణంగా ఇంద్రియాలు మనసుతో వీరికి ఎలాంటి ఆటంకాలు సంభవించవు. ఈ పంచభూతాత్మక ప్రపంచంలో వ్యవహరించే, చరించే పేటి వల్ల కూడా వీరికి హాని కలగదు. ఇబ్బంది ఉండదు. అందుకే జగద్గురువు ఇంద్రియాలు, మనసు తనకు విధేయాలయి పోయాయి కాబట్టి, అవి అతనికి అనుకూలంగా ఉంటాయి. అతనికి ఉన్న నిర్మలత్వం అనే ప్రసాదం కారణంగా అతను వాటి ఆధీనంలోకి వెళ్ళడు. తత్ఫలితంగా నిత్యం నిర్మలమైన మనసు అనే ప్రసాదంతో ప్రశాంతతను పొందుతూ ఉంటారు. భౌతిక విషయాల పట్ల మనిషికి గల ఆసక్తే రాగద్వేషాలకు కారణమని నిన్నటి శ్లోకంలో చెప్పుకున్నాం. అయితే ఈ శ్లోకంలో ఆయా విషయాల్లో చరిస్తున్నా, తిరుగుతున్నా కూడా ప్రశాంతత అనే ప్రసాదాన్ని పొందుతారని ప్రబోధిస్తున్నాడు జగద్గురువు.

ఈ రెండింటి మధ్య తేడా మనకు తేట తెల్లం కావాలి. అదేమంటే రాగద్వేషాలు విషయాసక్తితో చరిస్తే మనిషి పతనం. వాటన్నింటినీ ఆంతరంగికంగా తెగించి, విడిచిపెట్టి నిమిత్తమాత్రంగా ప్రజ్ఞతతో చరించినప్పుడు అదే తిరుగుడు ప్రసాదమవుతోంది. ఈ కీలకమైన తత్వాన్ని సదవగాహనతో పుణికి పుచ్చుకుంటే సరిపోతుంది.

అలా అంతఃకరణాల్ని వశంలో ఉంచుకొని రాగద్వేషరహితులై ఇంద్రియాల ద్వారా దైనందిన కార్యక్రమాలను నిర్వహిస్తూ అంతర్ముఖులై మనఃశ్శాంతి అనే ప్రసాదాన్ని పొందాలని మనకు బుద్ధి చెబుతున్న జగద్గురువుకు ప్రణమిల్లుదా

2అ, 65శ్లో.

ప్రసాదే సర్వదుఃఖానాం హానిరస్యోపజాయతే |
ప్రసన్నచేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతే ||

మనఃప్రసన్నతను పొందిన వెంటనే అతని దుఃఖము లన్నియును నశించును. ప్రసన్నచిత్తుడైన కర్మయోగియొక్క బుద్ధి అన్నివిషయములనుండి వైదొలగి, పరమాత్మయందు మాత్రమే పూర్తిగా స్థిరమగును.

నిర్మలమైన మనస్సు అనే ప్రసన్నత్వం ప్రసాదము లభించిన వారికి సమస్త దుఃఖాలు అంతరించిపోతాయి. ఆ కారణంగా వారి బుద్ధి ప్రశాంతంగా ఉండి శీఘ్రంగా స్థిరత్వాన్ని పొందుతుంది. అంతఃకరణాన్ని వశపరచుకున్న సాధకులు రాగద్వేషరహితులై ఇంద్రియాల ద్వారా విషయాల్ని గ్రహిస్తున్నా కూడా ఇంద్రియాలలో చరిస్తున్నా కూడా మనశ్శాంతిని పొందగలరు అని నిన్నటి శ్లోకంలో మనకు అర్థమయింది. దైనందిన కార్యక్రమాలన్నింటినీ ఫలాసక్తి లేకుండా రాగద్వేషాల వలలో చిక్కుకోకుండా తటస్థంగా చరిస్తూ ఉంటాడు కాబట్టి అలాంటి వ్యక్తిని ఏ కర్మలు బాధించవు. ఈ శ్లోకంలో ఆ ప్రసాదబుద్ధి, ఏది నిన్నటి శ్లోకంలో జగద్గురువు అనుగ్రహంతో పొందిన ప్రసన్నత్వం ద్వారా శీఘ్రంగా బుద్ధి స్థిరమై పరమాత్మ దర్శనానికి ఉపకరిస్తుంది. విషయాసక్తి నశించడం వల్ల రాగద్వేషాలు అదృశ్యమై మనసు నిర్మలమవుతుంది. ఆ ప్రసాదం ద్వారా సమస్త దుఃఖాలు అంతరిస్తున్నాయి, తద్వారా శీఘ్రంగా స్థిరమైన బుద్ధి పరమాత్మ యందు స్థితం కాగలదు. మనసును సమయమింపజేసి దేహాది కర్మలను ధర్మబద్ధంగా నిమిత్తమాత్రంగా ఆచరిస్తూ ఉండాలి. అప్పుడు పవిత్రమైన ప్రసాద బుద్ధితో పరమాత్మ యందు స్థిరంగా దృష్టిని నిలపగలం. నిజానికి మనం అదే అయి ఉన్నాం కానీ దాన్ని మరచిపోయాం, మన సహజత్వాన్ని కోల్పోయాం, అస్వస్థతకు గురి అయ్యాం. అలా కాక జగద్గురువు చెప్పినట్లు ఆచరించి ప్రసాద బుద్ధిని పొందితే మళ్ళీ మనం స్వస్థితికి మన సహజత్వ స్థితికి చేరుకోగలం. జీవితాన్ని సహజంగా జీవించాలి. మనం మనకు తెలియకుండానే అస్వస్థతకు లోనైపోతున్నాం కదా, కారణం ఇంద్రియాలు బలమైనవి. వాటి బలానికి మనం లొంగిపోతున్నాం. ఏవేవో భౌతికమైన వాటినే ఆశయాలనుకుని ఆ అబద్ధమైన వాటి వెంబడి పరుగులెత్తడం ద్వారా అసలు సిసలైన సహజ స్థితిని కోల్పోయాం. కాబట్టి జీవితం ఉన్నది జీవించడానికి, జీవం కోసం ప్రయత్నించాలి. మనలో జీవశక్తిని నింపిన జగద్గురువుతో మమేకమవడం కోసం సాధన చేయాలి. ఆ మార్గంలో ప్రయాణించాలి. జీవితం ఉన్నది, జీవం ఉన్నది ఆ జీవంతో యోగం చెందడానికి. ఈ మానవ జీవిత అసలు తత్వం తెలియాలి. అలా కాక ఏదో వస్తువుల కోసమో లేదా ఇంకేదో భౌతిక ఆస్తుల్ని కూడపెట్టడానికి జీవశక్తిని జీవితాన్ని ఫణంగా పెట్టకూడదు. జీవితాన్ని ఉన్నదున్నట్లు కలుషితం చేసుకోకుండా జీవిస్తున్న వారే జీవించినట్లు లెక్క. వారు మాత్రమే జీవితపు విలువల్ని అందుకోగలరు. జీవితంలో జీవం అనే ప్రసాదాన్ని పొందగలరు.

జీవిత లక్ష్యాన్ని అందుకోగలిగేది కూడా వీరే. మిగిలిన వారికి ఎండమావుల్లో నీటి కోసం పరుగులెత్తడమే అవుతుంది. బాహ్య ప్రపంచం వైపు ఎండమావుల వైపు పరుగులెడుతూ ఉన్న దృష్టిని వెనక్కు తిప్పితే చాలు జగద్గురువు చెప్పిన ప్రసాదం మన ఎదుటే మనలోనే దర్శనమవుతుంది. ఆ ప్రసాదమే సర్వదుఃఖాల్ని అంతరింపజేసి మనల్ని పరమాత్మ స్థితికి చేర్చుతుంది. కాబట్టి ఈ శ్లోకంలో మనం ప్రధానంగా గమనించాల్సిన అంశాలు రెండు.

జగద్గురువు చెప్పిన ప్రసాద స్థితి పొందడం ద్వారా రెండు అంశాలు మనకు అవగాహన అవ్వాలి. 1.సమస్త దుఃఖాలు నశించడం. 2.బుద్ధి తక్షణమే ఆత్మతో స్థిరమవ్వడం. ఇది ఈ ప్రసాదం ద్వారా మనకు లభించేటటువంటి , మనం పొందేటటువంటి సత్ఫలితాలు. సత్వంతో మనం 16వ శ్లోకంలో నిర్ణయించినటువంటి సత్తు, 24వ శ్లోకంలో నిరూపణ అయినటువంటి సత్తుతో సంగమం, సత్యంతో కలయిక.

ఈ సత్సంగత్వం వల్ల అసత్తు, జగత్తు పట్ల అసంగత్వం ఏర్పడుతుంది. అసంగత్వం ద్వారా మోహభ్రాంతి తొలగుతుంది. మోహం నశించగానే మనసు నిర్మలమవుతుంది. ఆ నిర్మలమైన బుద్ధి జీవన్ముక్తికి కారణమవుతుంది. ఇదే ఆది శంకరాచార్యుల వారు చెప్పినటువంటిది.

దివ్య ఆత్మ స్వరూపులారా ఆరోహణ క్రమంలో ఎలా మనం ఉన్నత స్థితిని పొందాలో మనం అవలోకనం చేయాలి. ప్రసన్న చిత్తంతో సుస్థిరమైన బుద్ధితో దివ్యత్వం వైపు అడుగులు వేద్దాం.

2అ, 66శ్లో.

నాస్తి బుద్ధిరయుక్తస్య న చాయుక్తస్య భావనా |
న చాభావయతః శాంతిః అశాంతస్య కుతః సుఖమ్ | 66|

ఇంద్రియములు, మనస్సు వశమునందు ఉండని వానియందు నిశ్చయాత్మక బుద్ధి ఉండదు. అట్టి అయుక్తమనుష్యుని అంతఃకరణమునందు ఆస్తికభావమే కలుగదు. తద్భావనాహీనుడైన వానికి శాంతి లభింపదు. మనశ్శాంతి లేనివానికి సుఖము ఎట్లు లభించును.

ఇంద్రియ నిగ్రహం, మనస్సు సంయమనం లేని అయుక్తులకు వివేకబుద్ధి, ఆత్మ చింతన కలుగదు. వారికి ఆ భావన కూడా ఉండదు. ఆత్మభావన లేని వారికి శాంతి ఉండదు, మరి శాంతి లేని వారికి సుఖం ఎక్కడిది అని ప్రశ్నిస్తున్నాడు జగద్గురువు. ఇక్కడ అయుక్తులు అంటే మనసు ఏకాగ్రం కాని వారు అని అర్థం చేసుకోవాలి. అలా ఏకాగ్రం కాని వారికి ఆత్మ స్వరూప బుద్ధి ఉండటానికి అవకాశం లేదు కదా, అంటే ఆత్మ జ్ఞాన సాధనలో వారికి అభినివేశం ఉండదు. అలా

ఆత్మజ్ఞానం అనుభవం లేని వారికి శాంతి ఉండదు. శాంతి లేకపోతే సుఖం ఎక్కడిది అంటున్నాడు. ఎందుకంటే ఆత్మజ్ఞాన శూన్యులు బాహ్యంగా చరిస్తూ ఉంటారు. వాటిలో సారం లేదు, సుఖం లేదు. ఇంద్రియాలు బాహ్య విషయాల నుండి నివృత్తి అయినప్పుడే అవి ఉపశమించి సుఖాన్ని పొందుతాయి. అప్పుడే ఆత్మ స్వరూప జ్ఞానంతో సాధనకు ఉపక్రమించి శాంతికి దారితీస్తుంది. అలా లేకుండా బాహ్యపు అంశాలపైనే తిరిగితే అశాంతి చోటు చేసుకుంటుంది. అశాంతి పరులకు సుఖం ఉండదు. తద్వారా మనసు శ్రమిస్తుంది. ఆత్మభావన లేని వ్యక్తిలో విషయ వాంఛనివృత్తి జరగదు. రాగద్వేషాలతో భౌతిక వాంఛలతో నిండిపోయి ఉన్నటువంటి మనసులో ఆత్మ భావన ఉండదు కదా. అంటే ఆ భౌతిక వాంఛలతో నిండిపోయినటువంటి మనసుతో ఏకమై పోయిన కారణంగా ఆ వ్యక్తికి ఆత్మ భావన ఉండదు. ఇది మనం మనలోకి వెళ్లి స్వయం పరిశీలన ద్వారా మనం ఈ అంశాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలి. ఒక్కోసారి అలాంటి వాంఛలలో మునిగిపోయిన వారికి ఇలాంటి హితోపదేశాలు మరింత కోపాన్ని, క్రోధాన్ని కలిగించే అవకాశం కూడా ఉంది. అలజడికి అలవాటు పడిన మనసుకు అలా అనిపిస్తుంది. అందుకని భౌతిక విషయాసక్తిని ఆశ్రయించిన బుద్ధిలో ఆత్మ భావన ఉండదు. అందుకే నెమ్మదిగా భౌతిక విషయ ఆసక్తిని వీడి ప్రసన్నతను పొందితే అప్పుడు ఆత్మ భావన కలుగుతుంది. ఇక్కడ సుఖం అనే పదాన్ని నిత్య సుఖంగా భావించాలి. సుఖం అనేది శరీరానికి సంబంధించింది, సంతోషం అనేది మనసుకు ఆనందం ఆత్మకు సంబంధించినది. ఇక్కడ గమనించాల్సిన అంశం ఏమంటే ఆత్మలో లేదా ఆత్మ స్థితిలో ఉన్నప్పుడు ఆనందం ఉంటుంది, ఎందుకంటే అది ఆనందమే అయి ఉంది కాబట్టి, అది నిత్యమైంది. ఆ స్థితిలో ఉంటే సుఖమైనా, సంతోషమైనా అప్పుడే ఇహ లోకంలో కూడా నిత్యం సుఖంగా ఉండగలరు. లోపల శాంతమే లేకపోతే నిత్య సుఖం ఉండదు కదా. కాసేపు ఉండి వెళ్ళిపోయే సుఖం గురించి కాదు జగద్గురువు చెబుతున్నది. దుఃఖాన్ని వెంట తెచ్చే రాకపోకలు కలిగిన సుఖం గురించి కాదు జగద్గురువు చెబుతున్నది. ఇక్కడ మనం గమనించాలి నిత్యం ఒకే విధంగా ఉండే స్థితిని జగద్గురువు ఇక్కడ సాధారణ స్థాయి మనుషులకు అర్థమయ్యేలా సుఖం అని పేర్కొన్నారు. కాబట్టి నచాభావయతః శాంతిః ఆత్మభావ శూన్యులకు శాంతి ఉండదు. ఆ కారణంగా అశాంతస్య కుతః సుఖం. మనసును ఏకాగ్రం చేసి ఆత్మ భావనతో ఉండాలి, అప్పుడే శాంతి మయమైన జీవితం కొనసాగించగలం. తద్వారానే నిత్య సుఖం ప్రాప్తిస్తుంది. దీన్ని బట్టి ప్రసాద బుద్ధి ద్వారా ఆత్మ భావన, ఆత్మ భావన ద్వారా శాంతి జీవనం, శాంతి జీవనం ద్వారానే సుఖప్రాప్తి ఇది మనకు అర్థం అవ్వాలి. శాంతంగా ఉండటమే మనిషి స్వభావం, సహజ స్థితి. శాంతికి దూరంగా ఉండాలని ఎవరూ భావించరు కదా, శాంతి వల్ల మనిషికి బాధ కలుగుతుందా? ప్రశాంతత వల్ల మనిషికి అస్వస్థత ఉంటుందా? శాంతియుతంగా ఉండటమే మనిషి స్వరూపం, స్వభావం. ఈ స్వరూప స్వభావాలు ఎప్పుడూ ఎవరినీ బాధించవు. అశాంతితో అలజడితో కొట్టుమిట్టాడుతూ ఉన్నటువంటి ప్రతి వ్యక్తి ఆ అశాంతి నుంచి శాంతి వైపుకు, తన నిజ స్థితికి, తన స్వస్థితికి వెళ్లాలని కోరుకుంటాడు, కాకపోతే దారి తెలియదు అనే పద్మవ్యూహంలో

చిక్కుకొని బాధకు గురి అవుతూ ఉంటారు. అందుకే జగద్గురువు శాంతి లేని వారికి సుఖం ఎక్కడ అనే ప్రశ్నను మన పైకి విసిరి ఆలోచించమంటున్నాడు.

2అ, 67శ్లో.

ఇంద్రియాణాం హి చరతాం యన్మనోఽను విధీయతే |
తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావమివాంభసి ||

నీటిపై తేలుతున్న నావను గాలి నెట్టి వేయును. అట్లే ఇంద్రియార్థముల యందు సంచరించు ఇంద్రియములలో మనస్సు ఏ ఒక్క ఇంద్రియముతో కూడియున్నను, ఆ ఒక్క ఇంద్రియమే మనోనిగ్రహము లేని మనుజుని బుద్ధిని అనగా విచక్షణా శక్తిని హరించి వేయును.

బుద్ధిని నావతోడను, ఇంద్రియములతో కూడిన మనస్సును గాలి తోడను, సంసార సముద్రమును జలాశయం తోడను, సమస్త విషయ సముదాయము నీటితోడను పోల్చుట జరిగినది. నీటి యందు తన గమ్యస్థానము వైపు పయనించు నౌకను ప్రబలమైన వాయువు రెండు విధములుగా విచలితమొనర్చును. భయంకరమైన నీటి తరంగములలో దానిని పక్క దారి పట్టించును. లేదా ఆగాధమైన నీటిలో ముంచి వేయును. కానీ చతురుడైన నావికుడు ఆ వాయుప్రసారమును తన కనుకూలముగా మలచుకున్నచో ఆ వాయువు ప్రక్కదారి పట్టింపజాలదు. పైగా దానిని గమ్యస్థానమునకు చేర్చుటకై అది సహాయపడును. అట్లే మనస్సు, ఇంద్రియములు వశములో లేని మనుష్యుడు తన బుద్ధిని పరమాత్మ స్వరూపమునందు నిశ్చయముగా నుంచగోరినను, అతని ఇంద్రియములు మనస్సును ఆకర్షించి అతని బుద్ధిని విచలితమొనర్చును.

కానీ మనస్సు, ఇంద్రియములు వశములోనున్న వాని బుద్ధిని ఇంద్రియములు విచలితమొనర్చజాలవు.

మనస్సుకు తనను తాను పరిశీలించుకునే శక్తి ఉంది. మనిషికి ఉపయోగపడుతున్న ప్రధాన సాధనం మనస్సే. అపారమైన ఆత్మ పరిశీలనా శక్తి ఉన్నది మనస్సుకే. మనం మన మనస్సును పరిశీలించాల్సింది కూడా మనస్సు సహాయంతోనే, దాని ఆలోచన విధానాన్ని గమనించేది మనస్సుతోనే. మనిషి మనుగడకు ప్రధాన ఇంద్రియ సాధనం మనస్సే. మనసు పరిశుద్ధ స్థితిలో ఉంటే అది మహా చైతన్యాన్ని సూచించగలదు. ఆత్మవాన్ స్థితికి తీసుకెళ్లగలదు. అందుకే రామకృష్ణుల వారు పరిశుద్ధమైన మనస్సే పరిశుద్ధమైన బుద్ధి అన్నారు. అయితే గమనికతో నిశితంగా పరిశీలిస్తే దాన్ని మనం పరివర్తింప చేయవచ్చు. బాగా మొండికేసే దానికి సిద్ధంగా ఉండేది మనస్సే, తక్షణం మారేందుకు

కుతూహలంగా ఉంటూ క్షణంలోనే మారగలిగేది మనస్సే. ఈ క్షణం ఇక్కడే ఇప్పుడే ముక్తిని పొందగల శక్తి ఉన్నది మనస్సుకు. పూర్తిగా బంధంలో చిక్కుకొని విడివడ లేక కొట్టుమిట్టాడుతున్నది ఈ మనస్సే. అంతటి అనుకూలమైన ప్రతికూలమైన మనస్సును ఏ ఒక్క ఇంద్రియం వెంట వెళ్లకుండా చూసుకుందాం. ఇంద్రియాలు బుద్ధిని నీటిలో పోతున్న నావను గాలి పక్కకు లాగినట్లు లాగి మన జీవితం తలకిందులయ్యే పరిస్థితి సంభవించకుండా జాగ్రత్తగా మెలగుదాం. మనస్సును దైవం పై నిమగ్నం చేసి వివేకంతో ప్రవర్తిద్దాం.

2అ, 68శ్లో.

తస్మాద్యస్య మహాబాహో! నిగృహీతాని సర్వశః |
ఇంద్రియాణీంద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా |68 |

ఓ అర్జునా! ఇంద్రియములను ఇంద్రియార్థములనుండి అన్ని విధములుగా, పూర్తిగా నిగ్రహించిన పురుషుని యొక్క బుద్ధి స్థిరముగా నుండును.

స్థితప్రజ్ఞుని లక్షణాలు ఏవి అని అర్జునుడు ప్రశ్నించినప్పటి నుంచి భగవానుడు బోధించిన ఘట్టాన్ని మనం ఇంద్రియ సంయమన ప్రకరణంగా చెప్పుకోవచ్చు.అంటే 58వ శ్లోకం నుండి ఈ 68వ శ్లోకం వరకు ఉన్న మొత్తం 11 శ్లోకాలను కూడా కలిపి ఇంద్రియ సంయమన ప్రకరణంగా భావించాలి, గుర్తించాలి కూడా. జగద్గురువు అనేక ఉపమానాలతో ఉపపత్తులతో మనకు మనలోని ఇంద్రియాలు మనల్ని ఎలా ప్రభావితం చేస్తున్నాయో స్పష్టంగా విప్పి,విడమరచి చెప్పాడు.

మనిషి ప్రయాణం కొనసాగడానికి రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి ఇంద్రియాల వెంట అధోముఖంగా ప్రయాణిస్తూ ఆనిత్యమైన భౌతికపుమాయలో చిక్కుకొని వలలో చిక్కిన పిట్టలా రెపరెపలాడుతూ అధోగతి పాలు కావడం. రెండు బుద్ధి ద్వారా ఆత్మ చింతనను పుణికి పుచ్చుకొని ఊర్ధ్వంగా ప్రయాణించి మహోన్నతమైన ఆత్మానందంతో మానవ జీవితాన్ని సార్థకం చేసుకోవడం, జీవంతో కూడి జీవన్ముక్తులు కావడం. అధోముఖమైతే మనిషి ఎలా పతనమై దుర్గతి పొందుతాడో 62 63 శ్లోకాలు చూసాం. అంతకంటే ఎక్కువ నేటి ప్రపంచంలో మనం చూస్తూనే ఉన్నాం. ఉర్ధ్వంగా ప్రయాణించి సద్గతిని పొంది సార్ధకత చేసుకోవాల్సిన విధానం ఇదే అధ్యాయం అంతా మనం చూస్తున్నాం, అభ్యసిస్తున్నాం, పరిశీలిస్తున్నాం.

మనస్సు నిరంతరం చలిస్తూ, చరిస్తూ ఉంటుంది. ఆ చలనాన్ని, ఆ చరించడాన్ని సన్మార్గంలోకి పంపాలి. ఆ మార్గంలో దానిని పంపించి సద్గతికి కారణం కావాలి. ఇంద్రియాలు మనసుకు లోబడి ఉండాలి, చరించాలి. మనసు ప్రయాణం బుద్ధి నిర్ణయం మేరకే కొనసాగాలి. బుద్ధి ఆజ్ఞాపించినట్లు ఆయా ఇంద్రియాలు ఆయా ఇంద్రియ విషయాలతో మనస్సు సహాయంతో ప్రవర్తిల్లాలి. వివేక ప్రజ్ఞ బుద్ధి ఆదేశాల మేరకే ఇంద్రియాలు ముందుకు సాగాలి. లేకపోతే కర్మచట్టం, కర్మచట్రం తన అదుపులోకి మనిషిని తీసుకుంటుంది. మనిషి కర్మ యొక్క అదుపులోకి వెళ్లాల్సి ఉంటుంది అని తనకు తాను హెచ్చరిక చేసుకోవాలి. అప్పుడే మనం సన్మార్గం వైపు పయనించగలం.

అందుకే విచక్షణతో ఆలోచిద్దాం. ప్రేయస్సు మార్గం వైపు చరించే బుద్ధికి వివేక ప్రజ్ఞ కుదరదు. శ్రేయస్సు వైపు చరించే బుద్ధికే స్థిరత్వం కుదురుతుంది. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని మన మనసు ప్రయాణాన్ని అనుక్షణం బుద్ధి గమనిస్తూ దారి తప్పుతుందన్నప్పుడు దారిలో పెడుతూ జీవితాన్ని ముందుకు తీసుకెళ్లాలి. అప్పుడు మోక్షానికి అర్హత సిద్ధిస్తుంది. అర్జునుడు అలా ఇంద్రియాలు సంయమించిన మనసును నియమించిన మహా బుద్ధిమంతుడు. ఈ స్థిర బుద్ధే మోక్షానికి అర్హత. అందుకే జగద్గురువు ఈ గీతా బోధలో అర్జునుడి పేరును సంబోధిస్తున్నాడు. మోక్షమార్గాన్ని బోధిస్తున్నాడు. అర్జునుడు ఇంద్రియాలను సంయమించాడు, అనడానికి నిరూపణ యుద్ధానికి సన్నద్ధమైన క్షణం కూడా, ఆ తరుణంలో కూడా వెంటనే అపారమైన యుద్ధ విద్య, దైవ అనుగ్రహం ఉండి కూడా యుద్ధానికి ఆవేశంతో ఉరకలేదు. ఆ భావావేశం ఎక్కడ కూడా అతనిలో లేదు. ఇది అర్జునుడి యొక్క వివేక ప్రజ్ఞ. అలాగే ప్రతి మనిషి కూడా అన్ని ఇంద్రియాలను సర్వ విధాల నుండి సంయమనం చేద్దాం. సుస్థిరమైన వివేక ప్రజ్ఞను మనలో మనం సుస్థిరం చేసుకుందాం.

2అ, 69శ్లో.

యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ |
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునే: । 69।

నిత్య జ్ఞాన స్వరూప పరమానంద ప్రాప్తియందు స్థితప్రజ్ఞుడైన యోగి మేల్కొని యుండును. అది ఇతర ప్రాణులన్నింటికిని రాత్రి తో సమానం. నశ్వరమైన ప్రాపంచిక సుఖ ప్రాప్తికై ప్రాకులాడుచు ప్రాణులన్నియు మేల్కొని ఉండును. అది పరమాత్మ తత్వమెరిగిన మునికి రాత్రి తో సమానము.

ఈ మేల్కొనడం ఏంటంటే అజ్ఞానం అంధకారము నుండి మేల్కొన్నవాడని తెలియాలి. అలా మేలుకొన్న వారికి కాల పరిధితో సంబంధం లేదు. నిరంతరం ఎరుకతో ఉంటారు. సాధారణ మనిషికున్నట్లు వీరికి భౌతిక చూపు ఉండదు.

పారమార్థిక స్ఫురణతో పరమాత్మ దర్శనంతో నిరంతరం మేల్కొని ఉంటారు. సర్వభూతాలకు అన్ని ప్రాణులకు రాత్రి అయినది సంయమీ అయిన యోగికి పగలే, అతను మేలుకొని ఉంటాడు. ఎందుకంటే స్థితప్రజ్ఞతను ప్రతిష్టించుకున్న యోగి కనుక మేల్కొన్న తర్వాత నిద్రపోవడం జరగదు. ఈ నిద్రపోవడం అనేది శరీర సంబంధి కాదు, ఎరుక సంబంధి. పైగా రాత్రి అయింది, పడుకోవాలి నిద్రపోవాలి అని కూడా వీరు ఆలోచించరు. దైవ ఆజ్ఞ మేరకు లోక కళ్యాణ కార్యకలాపాలలో భౌతికతకు అతీతంగా ఉంటూ లోక శాంతికి సంబంధించిన దైవిక కార్యకలాపాలలో నిమగ్నమై ఉంటారు. ఆది శంకరాచార్యుల వారే దీనికి ఉదాహరణ. భౌతిక శరీరానికి తగిన ఏ రెండు గంటలు మూడు గంటలు విశ్రాంతిని ఇస్తే ఇచ్చి ఉండవచ్చు గాక అంతేకానీ సాధారణ స్థాయి మనిషిలా గడియారం ప్రకారం నిద్రపోయే ప్రసక్తే వీరికి ఉండదు. ఇది అన్ని ప్రాణులకు రాత్రి అనిపిస్తున్నప్పుడు యోగి ఉంటున్న స్థితి. మనం 45వ శ్లోకంలో చర్చించిన అంశాన్ని మరోసారి విని లేదా పూర్తిగా పునఃశ్చరణ చేసుకోగలిగితే, ఆ పునఃశ్చరణ గావించుకున్నప్పుడు ఈ స్థితిని మనం అనుభవంలోకి తెచ్చుకోవచ్చు. విశ్వమంతా వ్యాపించి ఉన్న జ్ఞాన చైతన్యంతో మమేకమై లయమై అందులోని శ్రుతుల్ని వింటూ దైవిక అంశాల్ని భౌతిక లోకంలో లోక కళ్యాణార్థం ఆవిష్కరిస్తూ ఉంటున్న యోగికి కాలమెక్కడ, నిద్ర ఎక్కడ ఇది మనకు అవగతం కావాలి. ఈ కారణంగా యోగి రాత్రి మెలకువగానే ఉంటారు. ఇది అనుభవేద్యమే గాని మాటలకు అందదు. కాబట్టి సాధారణ స్థాయి మనిషికి సర్వప్రాణులకు అనిపిస్తున్నటువంటి రాత్రి యోగికి రాత్రి కాదు. జాగ్రతి అది మెలకువ స్థితి. ఇక రెండో పాదం చూద్దాం సర్వభూతాలకు సర్వ ప్రాణులకు పగలు అనిపిస్తున్నది పరమార్థాన్ని దర్శిస్తున్న యోగికి అది రాత్రి అన్నారు జగద్గురువు. పరస్పర విరుద్ధమైనవి అంటే పగలు సర్వప్రాణులు పరుగులెత్తినట్లు యోగి వాటికోసం తపించడం, వెంపర్లాడటం వాటి వెంబడి పోవడం ఉండదు. పగలు సర్వప్రాణుల దృష్టి ఆలోచన వేటి వైపు ఉంటుందో పరమాత్మ దర్శనంలో ఉన్న యోగి కి అలాంటి పరిస్థితి ఉండదు. అందుకే జగద్గురువు సాధారణ స్థాయి మనిషికి అనిపించే పగలు మునికి రాత్రి అని స్పష్టం చేశాడు. ఎందుకంటే మునియొక్క ఇంద్రియాలు సాధారణ స్థాయి మనిషికి కనిపిస్తాయి. కానీ వారి ఇంద్రియాలు వారి అదుపులోనే చరిస్తుంటాయి. కాబట్టి పగలు అనే కాల పరిధి వైపు తిరిగి చూడవు. వారి కళ్ళు తెరచి ఉన్నా వారి దృష్టి పరమాత్మ దర్శనమే. లోక కళ్యాణ కార్యకలాపాల ఆవిష్కరణ పైనే. అందుకే జగద్గురువు మనకు అనిపిస్తున్న పగలును మునికి రాత్రిగా చెప్పారు. ఇది స్థితప్రజ్ఞుని వైభవం. కాబట్టి జగద్గురువు విద్యార్థులైన మనం కూడా ఇప్పటివరకు చర్చించుకున్న అభ్యసించి అధ్యయనం చేసిన జ్ఞానంతో ఈ ముని, యోగి స్థితి స్థితప్రజ్ఞుని వైభవాన్ని అనుభవేద్యం చేసుకోవాలి.

2అ, 70శ్లో.

ఆపూర్యమాణమచలప్రతిష్ఠం సముద్రమాపః ప్రవిశంతి యద్వత్ ।
తద్వత్ కామా యం ప్రవిశంతి సర్వే స శాంతిమాప్నోతి న కామకామీ । 70 ।

సమస్త దిశల నుండి పొంగి ప్రవహించుచు వచ్చి చేరిన నదులన్నియును పరిపూర్ణమై నిశ్చయముగానున్న సముద్రమును ఏమాత్రము చలింప చేయకుండగనే అందులో లీనమగును. అట్లే సమస్త భోగములును స్థిత ప్రజ్ఞునియందు ఎట్టి వికారములను కలిగింపకయే వానిలో లీనమగును. అట్టి పురుషుడే పరమ శాంతిని పొందును. భోగాసక్తుడు శాంతిని పొందజాలడు.

నిన్నటి శ్లోకంలో స్థితప్రజ్ఞుని వైభవాన్ని ప్రారంభించినటువంటి జగద్గురువు ఈ శ్లోకంలో అలాంటి స్థితప్రజ్ఞుణ్ణి మహాసముద్రంతో పోల్చుతున్నాడు. ఇతనిని ఈ పంచభూతాత్మక సంబందించిన విషయాలు ఏవి కూడా ఏమాత్రం కలత చెందించలేవు. స్థితప్రజ్ఞత ద్వారా నిరంతరం మెలకువతో ఉంటున్న యోగిని సముద్రంతో పోల్చుతూ చెప్తున్న ఉపమాన శ్లోకంగా ఈ అంశాన్ని మనం గ్రహించాలి. ఏ స్థితిలో ఉంటే పరమ శాంతిని పొందగలమో ఈ శ్లోకం మనకు స్పష్టం చేస్తుంది. అలాగే ఈ స్థిత ప్రజ్ఞత అనే ఉపకరణం ద్వారా యోగ స్థితిని పొందినటువంటి యోగికి ఎట్టి పరిస్థితుల్లోనూ భోగాల వైపు గాని, కామ్యకర్మల వైపు గాని, లేదా సిద్ధుల వైపు గాని దృష్టి మరల కూడదు. అలా ఒకవేళ సిద్ధులను పొందాలని యత్నించి ప్రయోగాలు చేస్తే అతను శాంతిని పొందలేడు గాక పొందలేడు అని కూడా ఇక్కడ హెచ్చరించాడు. నిరంతరం ఎరుక అంటే మెలకువ స్థితి ఈ స్థితిలో ఉన్న జ్ఞాని యోగి అయిన ఆత్మనిష్ఠుడిని ద్రష్టగా మనం గుర్తించాలి. ఈ ద్రష్టను ఈ శ్లోకంలో మహాసముద్రంతో పోల్చడం అనేది ఓ అద్భుతమైన అంశం. అనేక విధాలుగా అన్ని వైపుల నుంచి అన్ని రకాల తో కూడుకున్న ప్రవాహం కదా మరి ఆ అంతటి అన్ని రకాల ప్రవాహం వచ్చి అన్ని వైపుల నుంచి అందులో చేరుతున్నా కూడా అది ఏమాత్రం చలించకుండా నిశ్చలంగా ఉంటుంది. అదే విధంగా యోగాన్ని సిద్ధింప చేసుకున్న మెలకువతో వున్న యోగి కూడా అంటే నిన్నటి శ్లోకంలో చెప్పుకున్న స్థితికి చేరుకున్న యోగి అని అర్థం చేసుకోవాలి. అలాంటి ద్రష్ట అయినటువంటి యోగి యొక్క శబ్దాది ఇంద్రియాలకు ఈ పంచభూతాత్మక ప్రపంచంలో నుండి అనేక అంశాలు కనిపిస్తున్నా, వినిపిస్తున్నా వాటితో అతనికి ఏ మాత్రం సంబంధం లేదనే భావనలో నిర్వికారంతో అతను సుస్థిరమై, సుప్రతిష్టమై ఉంటాడు. సమస్త దిశల నుండి ఉప్పొంగి ప్రవహిస్తున్న సముద్రం ఆ మహాజలంతో పరిపూర్ణంగా ఉంటుంది. అలా జ్ఞాని నిత్య సత్యమైన బ్రహ్మానందంతో పరిపూర్ణుడై విరాజిల్లుతూ ఉంటాడు. సముద్రం మనకు తెలియనిది కాదు కదా, మరి అన్ని వైపుల నుంచి అన్ని రకాల నీరు చేరుతున్నా సముద్రం నిండుగా, నిశ్చలంగా ఉంటోంది కదా, అందులో ఏ మార్పులు ఉండదు కదా. అలాగే మనం

కూడా నిన్నటి శ్లోకం ఆధారంగా ఈ శ్లోకంలో నిర్ధారించుకున్న ద్రష్ట స్థితికి చేరుకోవాలి. మన ఎదుట ఉంటూ ఉంది అని మనకు అనిపిస్తున్న విషయ వాంఛలన్నీ కూడా ద్రష్ట అయిన యోగి యొక్క మహాసముద్రంలో కలిసిపోయిన నీటిలా లీనమైపోవాలి.అవి ద్రష్టను ప్రభావితం చేయనట్లుగానే మనల్ని కూడా ప్రభావితం చేయని స్థితికి మనము చేరుకోవాలి. ద్రష్ట అయిన యోగి ఆయా భౌతిక విషయ వాంఛలన్నింటిని వశం చేసుకొని మహాసముద్రంలా నిశ్చలంగా ఉన్నట్లు మనం కూడా ఆయా విషయాలు నిర్వీర్యమైపోయేలా వశం చేసుకోవాలి.

మన ఆత్మ శక్తితో ఆత్మ నిష్ఠతో వాటిని నిర్వీర్యం చేయాలి. యోగి వాటిని వివశుల్ని చేసినట్లు మనం కూడా వాటిని వివశుల్ని చేసి ఆత్మ నిష్ఠలోనే స్థితం కావాలి. అప్పుడే అవి పట్టు తప్పి వశం తప్పి నిర్వీర్యమై లొంగిపోతాయి. ఇది ఒక సంధి దశ అని చెప్పవచ్చు. ఎందుకంటే ద్రష్టస్థితి నుంచి కూడా ఈ శ్లోకంలో మనం మరో అడుగు ముందు చేయాల్సి ఉంటుంది. ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవాలి కదా, అందుకే జగద్గురువు మహాసముద్రాన్ని మన ముందు ఉంచాడు. ఈ ఉన్నత స్థితి అవగతం అయితేనే తరువాత శ్లోకం అర్థం చేసుకొని చిట్టచివర జగద్గురువు చెప్పి ఉన్న 72వ శ్లోకం అవగాహన చేసుకోగలం. అదేమంటే మనం 68వ శ్లోకంలో చెప్పుకున్న స్థితప్రజ్ఞుడు ఆ దశ నుంచి 69వ స్లోకంలో చెప్పుకున్న మెలకువ స్థితికి, ఎరుకస్థితికి చేరుకుంటాడు. అక్కడి నుండి ఆ ఎరుకస్థితి నుంచి అంటే ఏమి? ఉనికికి సంబంధించినది ఎరుక అనేది, ఎరుక ఉనికి సంబంధి. దీన్ని మనం ఎలా అర్థం చేసుకోవాలి అంటే నేను నాలో అంటే నాలోని నేను అనే ద్రష్టదశ. అంటే ఇది కూడా ఓ సూక్ష్మ రూపమైనటువంటి ఆత్మిక స్థితి ఎరుక స్థితి. మనకు 68వ శ్లోకం వరకు తెలిన అంశం ఏంటి? దేహం వేరు, దేహి వేరని, శరీరం వేరు, ఆత్మ వేరని. ఆ కారణంగా పూర్తిగా ఇంద్రియాలు సంయమించి దేహాదుల విషయాలకు ప్రభావితం కానీ స్థిత ప్రజ్ఞ దశ. 69లో నిరంతరం మెలకువతో ఉంటూ దైవ ప్రణాళికలో భాగమై ఉంటూ ఉన్న ఎరుక మెలకువ స్థితి. ఇతనికి రాత్రి పగలు సంబంధం లేదు. బాహ్య విషయాలతోనూ సంబంధం ఉండదు. నిరంతర ఎరుకస్థితి నిరంతరం మెలకువ స్థితి, జాగ్రదావస్థా జాగృతి అన్నారు కదా జగద్గురువు. ఆ దశ ఇక్కడ ఈ శ్లోకంలో ఆ సూక్ష్మ రూపమైన ఎరుక ఆ జాగ్రద దశ నాలోని నేను అనే ఉనికి ఎరుక స్థితిని కూడా దాటుకుంటూ ముందుకెళ్లిపోయిన ఓ సంపూర్ణ లయావస్థస్థితి మనం 68 లో చెప్పుకున్న స్థిత ప్రజ్ఞదశ, 69 లో చెప్పుకున్న నిరంతరం మెలకువతో ఉన్న ద్రష్ట యోగి దశ కూడా మటుమాయమవుతుంది ఈ 70వ శ్లోకంలో. మనం 68 వరకు నేర్చుకున్న అంశాలు ఒక ఎత్తు. ఈ రెండు అధ్యాయాల ఆశాంతం మనం చర్చించితే తేలినటువంటిది ఏదైతే ఉందో మనం చేరుకున్న స్థితి ఏదైతే ఉందో అది ఒక ఎత్తు. అయితే 69 లో యోగి యొక్క వైభవం దీన్ని కూడా మనం ఊహించగలం, ఖచ్చితంగా 68వ శ్లోకంలోని స్థితికి చేరుకున్నవారు 69వ శ్లోకంలోని యోగి యొక్క వైభవాన్ని అవగాహన చేసుకుని ద్రష్ట స్థితికి చేరుకోవచ్చు. అయితే ఇక్కడ కాస్త ఆచి తూచి అడుగులువేయాలి. చాలా నెమ్మదిగా ముందుకెళ్లాలి. ఈ మూడు శ్లోకాలు మూడు లోకాలకు సంబంధించినది. ఈ మూడు శ్లోకాల్లో ఒక్కో లోకాన్ని ఒక్కో

స్థితిని మనం దాటుకుంటూ ముందుకెళ్లాల్సిన అవసరం ఉంది. 68 దాకా మనకు ఈ పరిస్థితి లేదు 68 దాకా చర్చించుకున్న అన్ని అంశాలు కూడా ఒకే ఒక్క స్థితప్రజ్ఞ దశ కోసమే కానీ ఇక్కడ అలా కాదు. కాబట్టి చాలా అవగాహనతో ఆలోచనతో చాలా చాలా లోతులలోకి వెళ్లి మనం దర్శించవలసినటువంటి 69లో స్థితప్రజ్ఞుని వైభవం, ద్రష్ట యొక్క మెలకువ స్థితిని చూసాం, మెలకువ స్థితిని చూసాం, దర్శించాం. ఇక్కడ ఆత్మీక అంశానికి కూడా ఆ సూక్ష్మ రూపమైన ఉనికికి సంబంధించిన ఎరుక స్థితిని కూడా దాటడం అంటే అనుభవ జ్ఞానం ఇంకా ఇంకా అపారంగా పెంపొందించుకోవాలి. ఎలాంటి అనుభవ జ్ఞానం? ద్రష్ట స్థితిలో యోగి దశలో అపారమైన, అపూర్వమైన అనుభవ జ్ఞానంతో ఆ దృష్ట స్థితిలో నిలవగలగాలి. ఆ నిలుపుకున్న నిలకడను ద్రష్ట స్థితిని నిలుపుకున్నప్పుడు అపూర్వమానం, అచల ప్రతిష్టం సంప్రాప్తిస్తుంది. ఇదే జగద్గురువు చెప్తున్నటువంటి సంపూర్ణ లయావస్థపు సముద్రం స్థితి. నేను శరీరం అనే భావన నేను ఈ శరీరంలో ఉన్న నాలోని నేను అనే భావన 69 లో చర్చించుకున్న యోగిక స్థితి లేదా ఆత్మీక స్థితి లేదా ఎరుక స్థితి లేదా మెలకువ స్థితి అవగాహన కోసం సవివరంగా చెప్పుకుంటున్నాం.ఆ స్థితప్రజ్ఞుడు చేరుకున్న స్థితప్రజ్ఞపు వైభవ స్థితి అయినటువంటి సూక్ష్మ రూపమైన ఆత్మిక స్థితికి కూడా తావుండని సంపూర్ణ లయావస్థస్థితి మహాసముద్రం. ఇది వెంటనే అవగాహన కాకపోయినా మళ్లీ మళ్లీ విని కాస్త సమయం గడిచాకైనా ఈ సముద్రం స్థితికి చేరుకోగలం. అయితే ఎప్పుడు ద్రష్ట స్థితిలో ఎలాంటి సిద్ధులకు లొంగిపోకుండా మళ్ళీ భౌతికతపు వైపుగా తిరిగి చూడకుండా ద్రష్ట స్థితిలోనే యోగిక స్థితిలోనే సుస్థిరమై అచల ప్రతిష్టమైనప్పుడు మనకు ఈ మహా సముద్రం స్థితి సంపూర్ణ లయావస్థ స్థితి ద్రష్టగా యోగిగా కూడా కొన్ని జన్మల తరువాత పొందిన అనుభవం ద్వారా మనకు ఈ నిలకడ లయావస్థ స్థితి ప్రతిష్టమవుతుంది. అనేక సాక్షాత్కారపు దశల నుండి కూడా విడివడిన స్థితి ఇది. బహురూపాలలో గోచరమయ్యే భిన్నత్వంలోని ఏకత్వానికి ప్రతీక అయిన స్థితి. ఉత్తమం తత్వచింతనం, మధ్యమం మంత్రచింతనం, అధమం శాస్త్రచింతనం, అధమాధమం యాత్ర చింతనం అని ఆవిష్కరించింది, వివేక చూడామణి. ఈ దృష్టితో మనం చర్చించుకున్న మహాసముద్రం స్థితిని అంచనా వేసి అనుభూతి చెందాలి. నిండుగా నిశ్చలంగా నిలిచిన మహా సముద్రంలోకి నీరు వచ్చి చేరినట్లు సమస్త ప్రపంచ విషయాలు నిర్వీర్యమై అవే వశం తప్పి అతనికి వశమై అతనిలో లీనం అవుతాయి. అందుకే అతను శాంతిని పొందుచున్నాడు. అలా లేనివారు సిద్ధుల వైపు వెళ్లినవారు మళ్లీ వెనక్కు తిరిగి చూసిన వారు ఎన్నటికిని శాంతిని పొందలేర

2అ, 71శ్లో.

విహాయ కామాన్ యః సర్వాన్ పుమాంశ్చరతి నిఃస్పృహః |
నిర్మమో నిరహంకారః స శాంతిమధిగచ్ఛతి ।71 |

ఏ పురుషుడు సమస్తమైన కోరికలను త్యజించి మమతారహితుడై, అహంకార రహితుడై, స్పృహారహితుడై చరించునో అతడే శాంతిని పొందును.

స్థితప్రజ్ఞుని గురించి 54వ శ్లోకంలో అర్జునుడు అడిగిన నాలుగవ ప్రశ్న, కిం వ్రజేత (స్థితప్రజ్ఞుడుఎలా నడుచుకుంటాడు) కు సమాధానంగా ఈ శ్లోకంలో జగద్గురు వివరిస్తున్నాడు.

తనలోనే నిజమైన శాంతిని కనుగొన్న వాని మానసిక స్థితిని ఈ శ్లోక మొదటి పాదం వివరిస్తున్నది. కోరికలన్నింటినీ త్యజించిన వానికి ఏ విధమైన ఆసక్తులు ఉండవు. అటువంటి వానికి ఏ విధమైన అహంకారం, మమకారం ఉండవు అని రెండవ పాదం వివరిస్తున్నది. ఇంద్రియ తాదాత్మ్యానికి కోరికలకు అహంకారమే కారణం. గాఢ నిద్రలో వలె అహంకారం లేని చోట వ్యక్తిలో కోరికలు ఉండవు లేక కనీసం అవి అజ్ఞాతంగా ఉండిపోతాయి. ఈ విధంగా శ్లోక మొదటి పాదం అజ్ఞాన కార్యాలను నిరాకరించగా రెండో పాదం ఆ కోరికలకు ఆందోళనలకు గల మూల కారణాన్ని (మమత. అహంకారం) నిరాకరిస్తున్నది.

మనో బుద్ధీంద్రియములతో గూడిన శరీరముల యందు దానితో సంబంధము గల భార్యాభర్తలు, సోదరులు బంధుపరంపర యందును, అట్లే గృహము, ధనము, ఐశ్వర్యము మొదలగు వస్తువుల యందును తనచే చేయబడు కార్యముల యందును, ఆ కర్మ ఫల రూపములైన సమస్త భోగముల యందును సామాన్య మానవులకు మమత్వ ముండును. అనగా వీటన్నింటిని తమవిగా భావింతురు. ఈ భావమునే మమత అని యందురు. ఈ భావమును ఏ విధముగను కల్గియుండని వానిని 'నిర్మమః' అనగా మమతా రహితుడు అని అందురు.

ఏదైనా ఒక అనుకూల వస్తువు లేనప్పుడు ఆ ప్రత్యేక వస్తువు అవసరమనియు అది లేనిచో పనులు నడువవనియు భావించి దాని కొఱకై ఆపేక్ష పడుట జరుగును. అట్టి ఆపేక్షనే 'స్పృహ' అని అందురు. ఇట్టి ఆపేక్ష ఏమాత్రమూ లేని వానిని 'నిఃస్పృహ' అనగా స్పృహారహితుడు అని యందురు. స్పృహ కోరికల యొక్క సూక్ష్మరూపం. అందువలన సమస్త కోరికల త్యాగము కంటెను ఈ స్పృహాత్యాగము వేరుగా చూపబడినది.

ఈ విధముగా అహంకార, మమతా స్పృహారహితుడై తన వర్ణాశ్రమ ప్రకృతి పరిస్థితులను అనుసరించి, కేవలం లోకహితము కొరకే ఇంద్రియ విషయములయందు సంచరించుట అనగా చూచుట, వినుట, తినుట, త్రాగుట, నిద్రించుట,

మేల్కొనుట మొదలగు శాస్త్రవిహిత చేష్టలను చేయుటయే కోరికలన్నింటిని త్యజించి, అహంకార మమతా స్పృహారహితుడై సంచరించుట యగును.

శ్రీ శంకరాచార్యులు ఈ శ్లోక వ్యాఖ్యానంలో ఈ విషయాన్ని చాలా చక్కగా వివరించారు- సమస్తమైన కోరికలను త్యజించి శరీర ధారణకు అవసరమైన కనీస వస్తువులతో సంతోషంగా జీవిస్తూ అవి కూడా తనవి కాదనే భావాన్ని మరువక తన జ్ఞానం పట్ల అహంకారం లేని వాడు, బ్రహ్మమును తెలిసినవాడు, స్థితప్రజ్ఞుడైన వాడు (నిర్వాణమును) శాంతిని పొంది, సమస్తమైన సంసార దుఃఖాలనుండి విముక్తుడవుతాడు. సంక్షిప్తంగా అతడే బ్రహ్మమవుతాడు.

2అ, 1శ్లో నుండి 71శ్లో వరకు

పునరావలోకనం.

మొదటి అధ్యాయం చివరన గాండీవం విడిచిపెట్టి యుద్ధ స్థలం నుంచి పక్కకు తప్పుకున్నాడు అర్జునుడు. రెండవ అధ్యాయం రెండవ శ్లోకంలో భగవానుడు అతన్ని పలకరించాడు. ఆ మహాత్ముని పలకరింతలోనే చూపులోనే తనలో తాను ఆరవ శ్లోకం దాకా చర్చించుకున్న అర్జునుడు ఒక నిర్ణయానికి వచ్చాడు. ఏడవ శ్లోకంలో మనం చర్చించుకున్న రెండు మార్గాలలో ఒక మార్గాన్ని ఎంచుకున్నాడు. ఆ నిర్ణయంతో అంతటి ధీరుడు అయిన, ఇంద్రియాలు సంయమించిన అర్జునుడు సద్గురువును ఆశ్రయించాడు. నేను నిర్ణయం తీసుకోలేని పరిస్థితిలో ఉన్నానని చెప్పి నువ్వే నాకు గురువు నీవు చెప్పిన మార్గాన్ని అనుసరిస్తాను అని శరణాగతి పొందాడు. తరువాత కూడా 8 వ శ్లోకం నుండి 10 వ శ్లోకం వరకు నాకు ఎలాంటి అధికారం ముల్లోకాల ఆధిపత్యం సంపదలు వద్దు అని స్పష్టంగా తన అభిప్రాయాన్ని చెప్పి అక్కడ నుండి 11వ శ్లోకం నుండి జగద్గురువు మనకు బోధ ప్రారంభించాడు. ఈ బోధ ఎవరికి సంబంధించింది ఏముంది అందులో అంటే మనకు సంబంధించింది, మనిషికి సంబంధించింది, మనిషి శరీర ప్రక్రియకు సంబంధించింది, దీన్నే అనాటమీ అంటారు వైద్యశాస్త్రంలో. ఇలా మనం దేహంలో జరిగే దైవిక ప్రక్రియను మనిషి అంటే ఏంటి అనే అంశాల్ని సవివరంగా చర్చించుకున్నాం. 30వ శ్లోకం వరకు చేసిన చర్చ ఇది.31నుండి 38 వరకు ధర్మ ప్రకరణం, ఇందులో స్వధర్మం, క్షాత్ర ధర్మం మొదలైన అనేక అంశాల్ని చాలా కూలంకషంగా చర్చించుకున్నాం. 39వ శ్లోకంతో కర్మ ప్రకరణం ప్రారంభమైంది. ఈ ప్రకరణంలో కర్మ, కర్మ జన్మ, కర్మ, కర్మ చక్రం, కర్మ చట్టం మొదలైన అనేక అంశాల్ని చర్చించుకున్నాం. అలాగే వేదాలకు సంబంధించిన అనేక అంశాల్ని చర్చించుకుని అందులోనే శరీరం విడిచి పెడితే చేసే కర్మకాండలతో సహా సవివరంగా అన్ని అంశాలను సంపూర్ణంగా సందేహాలకు తావు లేకుండా చర్చించుకుందాం. ఈ చర్చ 48 వరకు కొనసాగింది. 49 నుంచి 53 వరకు కూడా కర్మ ప్రకారణానికి తోడుగా బుద్ధియోగాన్ని చేర్చి అంటే

మనస్తత్వ శాస్త్రాన్ని కూడా ఇక్కడ చేర్చి స్థితప్రజ్ఞత స్థాయి దాకా సంపూర్ణంగా అనేక అంశాలను చర్చించుకున్నాం. ఈ చర్చ తరువాత శిష్యుడికి అంటే మనకు సందేహం కలిగింది. స్థితప్రజ్ఞుడు ఎలా ఉంటాడు, అతని లక్షణాలు ఏవి? అని 54వ శ్లోకంలో నాలుగు ప్రశ్నలు అడిగాడు. ఈ 54వ శ్లోకానికి సమాధానం 68వ శ్లోకం దాకా కొనసాగింది. అందులోనే స్థితప్రజ్ఞ దశకు ఎలా చేరుకోవాలో లేకపోతే మనిషి ఎలా పతనమవుతాడో విపులంగా తెలుసుకున్నాం. ఈ స్థితప్రజ్ఞతను సాధించడంలో ప్రధానమైన ఇంద్రియ ప్రకరణంలో మనం మనల్ని ఎలా తెలుసుకోవాలో అనే తత్వ శాస్త్రాన్ని, ఫిలాసఫీ మనం మనలోకి మన ప్రయాణం గురించి స్పష్టంగా చర్చించుకున్నాం. ప్రతి మనిషి తానంటే ఏంటో తనకు తెలియకుండానే తనలోని శరీర శాస్త్రాన్ని, మనస్తత్వ శాస్త్రాన్ని, తత్వశాస్త్రాన్ని తెలుసుకోలేక తమ జీవితాల్ని అల్లకల్లోలం చేసుకుంటున్న నేటి మనిషి స్థితిగతుల్ని అంచనా వేయగలిగాం, గ్రహించగలిగాం కూడా. ఇవన్నీ అవలోకనం చేసుకొని స్థితప్రజ్ఞతను సాధించుకోవాల్సిన మార్గాలు పొందాల్సిన ప్రసాదం ఏంటో తెలుసుకొని 68వ శ్లోకంతో స్థితప్రజ్ఞ స్థితికి, దశకు చేరుకున్నాం. ఇక అక్కడ నుండి అంటే 69 నుండి 71 వరకు ఇప్పుడు మనం పునరావలోకనం చేసి తరువాత చిట్టచివరి 72వ శ్లోకాన్ని పరిశీలిస్తాం. ఎందుకంటే ఈ స్థితప్రజ్ఞ వైభవ ఘట్టం ఇప్పుడే ముగుస్తుంది కాబట్టి. స్థితప్రజ్ఞ స్థితికి చేరుకున్న తరువాత యోగత్వం వైపు ప్రయాణించి 69 వ శ్లోకంలోని నిరంతరం మెలకువ స్థితికి చేరుకున్నాం. కాల పరిధితో స్థల పరిధితో భౌతిక దృష్టితో సంబంధం లేని సూక్ష్మ రూపమైన ఆత్మిక స్థితి ఇది. ఇలా సుప్రతిష్టమైన స్థితప్రజ్ఞ దశ నుండి సూక్ష్మ రూపమైన ఆత్మిక స్థితికి చేరుకున్న వారిని సముద్రంతో పోల్చుతూ ఉపమానంగా 70వ శ్లోకంలో చర్చించుకున్నాం. ఇక్కడ ఒక్క క్షణం ఆగి పరిశీలించాం. స్థితప్రజ్ఞ స్థితి అంటే అన్ని వైపుల నుంచి ఇంద్రియాలు సంయమించిన స్థితి అక్కడ దేహం వేరు, దేహి వేరనే నిర్ణయం అనుభవానికి వచ్చిన స్థితి. 69 వ శ్లోకంలో కాస్త ఆచి తూచి అడుగు వేస్తూ నిరంతరం మెలకువతో ఎరుకతో ఉన్న యోగిని యౌగిక స్థితిని దర్శించగలిగాం. 70వ శ్లోకంలో దేహం, దేహి వేరనే స్థితి నుంచి కూడా మరింత ముందుకెళ్లి నాలోని నేను అనే ఆత్మిక స్థితిని కూడా అంటే 69 వ శ్లోకంలోకి చేరుకున్నటువంటి ఆత్మిక స్థితిని కూడా దాటుకుంటూ సంపూర్ణ లయావస్థస్థితికి, మహాసముద్రం స్థితికి చేరుకున్నాం. 71 వ శ్లోకంలో ఆ సంపూర్ణ లయావస్థస్థితి లోని యోగి, మననశీలుడు ఉన్న స్థితిలో ఎలాంటి అష్టైశ్వర్యాలకు ఆధ్యాత్మిక సంపదకు సిద్ధులకు ఆకర్షితులై వెనక్కి తిరిగి చూడకుండా ఉన్న స్థితి నుండి జారిపోకుండా సుసంపన్నంగా సుప్రతిష్టంగా ఉండాలని జగద్గురువు హెచ్చరించిన అనేక అంశాల్ని ఉదాహరణలతో సహా చర్చించుకున్నాం. అలా స్థిరంగా, అచల ప్రతిష్టంగా ఆపుర్యమానంగా ఉండే విధానాన్ని దాదాపుగా మూడు పద్యాలు ఉపమానంగా చెప్పుకొని అన్నింటికి అతీతమైన సంపూర్ణ లయావస్థ స్థితికి చేరుకున్నాం, దర్శించగలిగాం.అలా సంపూర్ణ లయావస్థ స్థితిలో సుప్రతిష్టమైన స్థితే72వ శ్లోకంలో జగద్గురువు ప్రబోధిస్తున్న బ్రాహ్మిస్థితి.

2అ, 72శ్లో.

ఏషా బ్రాహ్మీ స్థితి: పార్థ నైనాం ప్రాప్య విముహ్యతి ।
స్థిత్వాస్యామంతకాలేఽపి బ్రహ్మనిర్వాణమృచ్ఛతి ।।

ఓ అర్జునా! బ్రాహ్మీస్థితి యనగా ఇదియే. (ఇదియే బ్రహ్మ ప్రాప్తి కలిగిన పురుషుని స్థితి.) ఈ బ్రాహ్మీస్థితిని పొందిన యోగి ఎన్నడును మోహితుడు కాడు. అంత్య కాలమునందును ఈ బ్రహ్మీస్థితి యందు స్థిరముగానున్నవాడు బ్రహ్మానందమును పొందును.

అన్ని కోరికలను పూర్తిగా విడిచి భోగ్యవస్తువులపై ఆశలు వీడి నిష్కామ కర్మయోగం ద్వారా సమత్వ బుద్ధిని అసంగ బుద్ధిని అలవరచుకొని విషయవాసనలన్నింటినీ హృదయము నుండి పారద్రోలి దేహమే నేను అనే అహంకారాన్ని విడిచి దేహానికి సంబంధించినవి నావి అనే మమకారాన్ని విడిచి ఎవరు తన నిజ స్వరూపాన్ని ఆత్మస్థితిని ఒక్క క్షణం కూడా మరువకుండా ఉంటారో అట్టి స్వరూప జ్ఞాన స్థితిని బ్రాహ్మీస్థితి అన్నారు. ఇదే జీవుడు బ్రహ్మముతో ఏకమైన జీవబ్రహ్మైక్య స్థితి. ఇప్పుడు జీవుడు, దేవుడు అని ఇద్దరు లేరు, ఏకం- అద్వయం, ఇట్టి బ్రాహ్మీస్థితిని పొందటం కొరకే మానవ జన్మ వచ్చింది. ఒక్కసారి ఈ స్థితిని పొందితే మళ్ళీ ఎప్పటికీ ఎట్టి కోరికలు ఉండవు. అసలు తాను ఒక వ్యక్తినని భావించడు. తన స్వస్వరూపంలోనే తానుంటాడు. కోరికలు, వాసనలు అతణ్ణి చేరి అణగారి పోతాయి. శరీరాన్ని వదిలే సమయంలో కూడా అతడు చలించడు.

శరీర అవయవాలు బాగా పనిచేస్తున్నప్పుడే సాధన ప్రారంభించాలి. అప్పుడే అతడు లక్ష్యాన్ని చేరుకోగలడు. ఇలా సాధనలు సాగించి ఆత్మ స్వస్థితిలో నిలిచి మరణ సమయంలో కూడా ఆ స్థితిలో నిలిస్తే లేదా తన అంత్యకాలములోనైనా బ్రాహ్మీస్థితిని పొందగలిగితే అతడికి అప్పుడైనా మోక్షం ప్రాప్తిస్తుంది లేదా జన్మరాహిత్యం సిద్ధిస్తుంది. అదే బ్రహ్మానంద స్థితి అదే బ్రహ్మ నిర్మాణం అదే మానవ జీవిత పరమ లక్ష్యం.

నిష్కామ కర్మయోగం ద్వారా చిత్తశుద్ధి కలిగి తద్వారా ఆత్మ జ్ఞానాన్ని పొంది ఆత్మలో నిలిచిపోవటం ద్వారా స్థితప్రజ్ఞుడై చివరకు బ్రహ్మ నిర్వాణాన్ని - మోక్షాన్ని పొందాలి.

3అ, 1శ్లో.

అర్జున ఉవాచ,

జ్యాయసీ చేత్ కర్మణస్తే మతా బుద్ధిర్జనార్దన |
తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి కేశవ ||

ఓ జనార్ధనా! కర్మ కంటెను జ్ఞానము శ్రేష్టమైనదని నీ అభిప్రాయమైనచో అట్టిస్థితిలో ఓ కేశవా! నన్ను భయంకరమైన ఈ యుద్ధకార్యము నందు ఎందుకు వినియోగించుచున్నావు?

ధీరుడైనటువంటి అర్జునుడు యోగత్వం వైపుగా దైవత్వం వైపుగా ప్రయాణించే సంధి దశలో నిర్ణయం తీసుకోలేని దశలో సద్గురువును ఆశ్రయించాడు. పూర్తిగా బ్రహ్మ నిర్వాణం వరకు పరిపూర్ణంగా బ్రహ్మ తత్వాన్ని మోక్షమార్గాన్ని ప్రబోధించాడు జగద్గురువు. ఉపదేశాన్ని అందుకున్న వెంటనే యుద్ధానికి పూనుకోబోతున్న అర్జునుడికి మళ్ళీ సందేహం కలిగింది. ఇప్పటివరకు నిశ్చలంగా పరిపూర్ణంగా జ్ఞాన బోధను అందుకున్నాక ఇప్పుడు ఆచరణ ఆరంభం కావాలి కదా. అలా ఆచరణకు యుద్ధ సన్నద్ధుడైన అర్జునుడికి కలిగిన సందేహాన్ని నివృత్తి చేయమని గురువుగారిని ప్రశ్నించాడు. పరమాత్మలో విలీనం అయ్యేవరకు విన్న బోధలు మెదిలిన సందేహాల్ని ఇకపైన సూచనప్రాయంగా సంక్షిప్తంగా తెలుసుకుంటూ మనం ముందుకెళ్లాలి. బోధనలో చర్చ సుదీర్ఘంగా ఉంటుంది కానీ ఆచరణలో అలా కాదు. కర్మయోగం అంటేనే ఆచరణ కదా. జగద్గురువు చేసే సూచనతోనే సూక్ష్మదృష్టితో అవగాహన చేసుకునేటట్లు మనలో మనం పరిపక్వతను కలిగి ఉండాలి.

ఇంద్రియాల్ని సంయమించి సమస్త కోరికల్ని విడిచి జ్ఞానమార్గంలో ప్రయాణిస్తే సరిపోతుంది మోక్షం సంప్రాప్తిస్తుంది, అలాంటప్పుడు కర్మ ఎందుకు చేయాలి. అసలు కోరిక లేకపోతే కర్మకు అవకాశం లేదు కదా అనేది అర్జునుడి అభిప్రాయం. మనకు అలా అనిపిస్తుంది కూడా ఆ సందేహంతోనే ఇప్పుడు యుద్ధం అనే కర్మను చేపట్టకపోవడం శ్రేయోదాయకం కదా అని ఆలోచించాడు అర్జునుడు. మనం యావత్ ప్రపంచాన్ని పరిశీలిస్తే సూర్యోదయం కావించే సూర్యుడుతో సహా ప్రాణులే కాకుండా ప్రకృతి కూడా కర్మ వలయంలోనే పరిభ్రమిస్తూ ఉంటుంది. అందుకే కర్మభూమి కురు భూమి కురుక్షేత్రం అయింది భూలోకం. యావత్ విశ్వము కర్మచక్రంలో ప్రవర్తిల్ల వలసిందే కదా అలాంటప్పుడు వ్యక్తి కర్మ నుంచి తప్పించుకోవడం వీలుకాదు. దేహాన్ని ధరించడం కర్మ దేహాన్ని వదిలిపెట్టడమూ కర్మే, ప్రాణం విడిచిన దేహం కూడా కర్మ ప్రభావం చేతనే పంచభూతాలలో విలీనం అవుతుంది. కాబట్టి కర్మ తన పనిని తాను చేసుకుంటూ పోతుంది. అందుకే దాన్ని కర్మ అంటున్నాం. కాబట్టి ఆ విషయంలో మనం చేయగలిగింది ఏమీ లేదు అది ప్రకృతి

నియమం. అలాంటి ప్రకృతి నియమానుసారమైన కర్మయోగంలో కర్మయోగ ఆచరణలో అర్జునుడికి అదే మన సహ విద్యార్థికి కలిగిన సందేహం ఏంటో చూద్దాం.

కర్మయోగం సాధనం, జ్ఞాన యోగం సాధ్యం. ఈ రెండింటి మధ్య ఉన్న వ్యత్యాసం స్పష్టంగా గ్రహించాలి. లేకపోతే ఆచరణలో సంశయాలు తలెత్తే అవకాశం ఉంది. ఆ కారణంగానే అర్జునుడు ఇలాంటి సున్నితమైనటువంటి సందేహాన్ని మన ముందు ఉంచాడు.

3అ, 2శ్లో.

వ్యామిశ్రేణేవ వాక్యేన బుద్ధిం మోహయసీవ మే |
తదేకం వద నిశ్చిత్య యేన శ్రేయోఽహమాప్నుయామ్ ||

కలగాపులగము వంటి నీ మాటలతో నా బుద్ధి భ్రమకు లోనగునట్లు చేయుచున్నావు. కనుక నాకు శ్రేయస్కరమైన ఒక మార్గమును నిశ్చయముగా తెల్పుము.

భగవానుని వచనముల ఆంతర్యమును సరిగా గ్రహింప లేని కారణమున అర్జునునకు భగవద్వచనములు 'వ్యామిశ్ర' వచనములు (కలగాపులగపు మాటలు) గా గోచరించెను. అర్జునునకు ఈ సందేహము 50వ శ్లోకమునందే కలిగి యుండెను. కనుక అతడు అప్పుడే ప్రశ్నించి ఉండవలసినది. కానీ 53వ శ్లోకమున భగవానుడు "'నీ బుద్ధి మోహపంకిలము' నుండి బయటపడి పరమాత్మ స్వరూపమునందు స్థిరముగా ఉన్నప్పుడు నీవు పరమాత్మ యందు సంయోగరూప యోగమును పొందెదవు" అని పలికెను. అది వినగానే అర్జునుడి మనసు నందు పరమాత్మ స్థిర బుద్ధి కలిగిన పురుషుని లక్షణమును, ఆచరణములను తెలుసుకొనవలెనను కోరిక కలిగెను. ఈ కారణము న తన సందేహమును ప్రక్కన బెట్టి స్థితప్రజ్ఞుని విషయమును ప్రశ్నించెను. దానికి సమాధానం లభింపగానే ఈ సందేహం వెల్లడించెను. కనుక బాగుగా ఆలోచించి తనకు శ్రేయస్కరమైన ఏదో ఒక మార్గమును తెలుపుమని అర్జునుడు శ్రీకృష్ణుని ప్రార్థించెను.

3అ, 3శ్లో.

శ్రీభగవాన్ ఉవాచ,

లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ |
జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేవ యోగినామ్ 1 3 |

శ్రీ భగవానుడు పలికెను- పాప రహితుడా! ఈ లోకము నందు రెండు విధములగు నిష్ఠలు నా చేత ఇంతకుముందే చెప్పబడినవి. సాంఖ్యయోగులకు జ్ఞాన యోగము ద్వారా మరియు యోగులకు కర్మయోగము ద్వారా నిష్ఠ కలుగును.

తన శిష్యుడులోని అస్పష్టతకు తన సంబోధనతోనే జవాబు ఇచ్చాడు జగద్గురువు. 'అనఘ' అని సంబోధించడంలోనే అర్జునుడికి ఎంతో ఊరట కలిగింది. అదే మహామంత్రం అయింది. ఆ మంత్రంతోనే అతనిలోని అస్పష్టత, వ్యాకులత పటాపంచలై భగవానుడు చెప్తున్న సమాధానం సంపూర్ణంగా అవగాహన చేసుకోవడానికి సంసిద్ధమయ్యాడు. అదే దైవిక సూత్రం, 'అనఘా' అనే సంబోధనే జగద్గురువు సూచన. ఎందుకు? ఒకటి ఆత్మ విమర్శకు, రెండు అంతరంగిక చర్చకు, మూడు అస్పష్టత తొలగడానికి, స్పష్టమైన అవగాహన రావడానికి. ఈ మూడు ప్రారంభమైతే అస్పష్టత కలగాపులగం అంతా కూడా మటుమాయం అయిపోతుంది, అలా ఉంటుంది జగద్గురువు యొక్క సూత్రప్రాయమైనటువంటి సూచనలు.

ధర్మమే ఊపిరిగా జీవించిన పవిత్రాత్ముడు అర్జునుడు. అందుకే ఇంత గొప్ప బ్రహ్మ నిర్వాణ విద్యను సాక్షాత్తు భగవానుడి దగ్గర నుండి అందుకోగలిగాడు. కిందటి శ్లోకాల్లో అర్జునుడు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఈ శ్లోకంతో ప్రారంభమవుతుంది. ఈ లోకంలో రెండు నిష్ఠలు ఉన్నాయి. సాంఖ్యులకు అంటే జ్ఞాన యోగులకు జ్ఞాననిష్ట , కర్మయోగులకు కర్మయోగనిష్ట. ఈ అంశాన్ని నేను పూర్వమే చెప్పి ఉన్నాను అంటున్నాడు కదా. ఈ పూర్వం అనే అంశాన్ని మనం సూక్ష్మ దృష్టితో పరిశీలిస్తే సృష్టి ఆరంభం నుంచి అని అవగాహన అవుతుంది. జ్ఞాన సముపార్జన లోనే నిమగ్నమై అదే మార్గంలో తదేకంగా అదే చింతనతో మరింత జ్ఞానాన్ని పొందడం జ్ఞాన యోగం, అంటే ఆ జ్ఞాన సముపార్జనా మార్గంలో చేసేటటువంటి చింతన అనే కర్మ ద్వారా వారు జ్ఞానాన్ని వృద్ధి చేసుకుంటారు. ఇదే 'జ్ఞానయోగేన సాంఖ్యానాం'. వీరు భక్తి జ్ఞానం అనే రసంలో మునిగి ఆ ఆస్వాదనలో జ్ఞానం పొంది మోక్షాన్ని సంప్రాప్తించుకుంటారు. అంటే ఇక్కడ కర్మలను విడిచి జ్ఞానం పొందమని కాదని అర్థం చేసుకోవాలి. ఇంకా రెండవది కర్మయోగం, కర్మలను యోగంగా భావించి ఆచరిస్తూ ఆయా పనుల ద్వారా పొందే జ్ఞానం. 'కర్మయేవయోగం కర్మయోగః' కర్మయోగాచరణ ద్వారా కలిగే అనుభవ జ్ఞానం. వీరు ఈ కర్మయోగం మార్గం లో వీరికి చిత్తం పరిశుద్ధమై ప్రసన్నత్వం పొందుతారు. ఈ ప్రసన్నత్వం ద్వారా మోక్ష ప్రాప్తి. కాబట్టి రెండూ శ్రేష్ఠమే. జ్ఞాన యోగానికి అర్హులైన వారికి జ్ఞాన యోగ

ఆచరణ, కర్మయోగానికి అర్హులైన వారికి కర్మయోగ ఆచరణ. సూచన ఏమంటే ఈ రెండు మార్గాల్లో దేనిని ఆచరించాలో ఎవరికి వారు స్వీయ పరిశీలన ద్వారా తెలుసుకోవడం ఒక పద్ధతి. అలా స్వయం పరిశీలన చేసుకోలేనప్పుడు సద్గురువులను ఆశ్రయించాలి. సద్గురువుల సూచనతో ముందుకెళ్లాలి. అర్జునుడు కూడా ఇక్కడ జగద్గురువును అదే ప్రశ్నిస్తున్నాడు. ఎందుకంటే అతనికి అస్పష్టంగా ఉంది కాబట్టి నిర్ణయం తీసుకోలేడు కాబట్టి గురువును అడుగుతున్నాడు. మనమూ అదే మార్గంలో ప్రయాణించాలి.

3అ, 4శ్లో.

న కర్మణామనారంభాత్ నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే ।
న చ సన్న్యసనాదేవ సిద్ధిం సమధిగచ్ఛతి ।।

మనుష్యుడు కర్మలను ఆచరింపకయే నైష్కర్మ్యము అనగా యోగనిష్ఠసిద్ధి అతనికి లభింపదు. అట్లే కేవలం కర్మలను త్యజించినంత మాత్రమున సిద్ధిని అనగా సాంఖ్యనిష్ఠను అతడు పొందజాలడు.

ఇందులో ఉన్న కొత్త పదం నైష్కర్మ్యం, నిష్క్రియాత్మ స్థితి లేదా నైష్కర్మ్య సిద్ధి అని అర్థం. అదే మనం గతంలో చెప్పుకున్న ఆత్మ నిష్ఠ స్థితి. కర్మ నిష్ట తనకు తానుగా స్వతంత్రంగా మోక్ష హేతువు కాదు ఈ అంశాన్ని రమణ మహర్షి చాలా స్పష్టంగా చెప్పారు. అందుకే మనం కర్మయోగం ప్రారంభంలో రెండవ అధ్యాయంలో కర్మచక్రం గురించి తెలుసుకున్నాం. అలా ఈశ్వరార్పణ బుద్ధితో ఆచరించిన నిష్కామ కర్మలు మనసును పరిశుద్ధం చేసి ముక్తికి సాధనమవుతుంది. ఇదే మనం ఇదే అధ్యాయం రెండవ శ్లోకంలో చెప్పుకున్న సూత్రం. కర్మసాధనం జ్ఞానం సాధ్యం అని. దీనికి తోడు నిన్నటి శ్లోకం సాంఖ్యులకు జ్ఞాన యోగం కర్మయోగులకు కర్మయోగ ఆచరణ అని. ఈ రెండు మార్గాలు ఈ లోకంలో సృష్టి ఆరంభం నుంచి ఉన్నాయని జగద్గురువు నిన్నటి శ్లోకంలో పేర్కొన్నారు. కర్మనే చేయకపోతే కర్మ లేకుండా పోవడం అనే ఫలం లభించదు కదా. అలా కర్మలనే చేయకపోతే ఇక నైష్కర్మ్యం ఎలా సిద్ధిస్తుంది. నడక మెల్లగా తప్పటడుగులతోనైనా ప్రారంభిస్తేనే కదా వెళ్లాలనుకున్న చోటికి చేరగలము. అలా కాక నడకే ప్రారంభం కాకపోతే ఎలా? కర్మే లేని స్థితి నైష్కర్మ్యం కదా. కర్మచేత నిషేధించనిది నైష్కర్మ్యం. అదే ఆత్మస్థితి, అదే నైష్కర్మ్యసిద్ధి. జ్ఞాన యోగం నైష్కర్మ్య రూపం. ఇది ఆత్మ స్వరూప సంబంధి. దీనికి ఉపాయమే కర్మయోగ ఆచరణ. ఉపాయమైన కర్మయోగం లేకుండా ఉపేయమైన జ్ఞానయోగనిష్ట ఎలా వీలవుతుంది? నైష్కర్మ్యం ఎలా సిద్ధిస్తుంది.

ఇది మనలో మనం చర్చించుకోవాల్సిన అంశం. ఈ దృష్టితో ఈ సూత్రంతో మనలో చర్చ జరిగితే ఈ శ్లోకంలో జగద్గురువు ప్రతిపాదించిన అంశం అనుభవేద్యం అవుతుంది. జ్ఞాన యోగానికి అంటే జ్ఞాననిష్టకు అర్హత పొందక ముందే

కర్మయోగాచరణ త్యజించడం చాలా ప్రమాదం. అందుకే జగద్గురువు సన్యాసం స్వీకరించినంత మాత్రాన జ్ఞానం సిద్ధించదు అని అన్నారు. ఇక్కడ సన్యాసం అంటే కర్మను సన్యసించినంత మాత్రాన అని అర్థం చేసుకోవాలి. కాషాయ వస్త్రాలు కట్టుకున్న వారే సన్యాసులు అనే అర్థాన్ని మనం మొదటగా సన్యసించాలి. అంటే విడిచి పెట్టాలి.

మనలో అరిషడ్వర్గాలను విడిచిపెట్టడం కర్మలలో సన్యాస భావం కలిగి ఉండడం సన్యాసం అని అర్థం చేసుకోవాలి. ధర్మం విడిచినంత మాత్రముననే సిద్ధిని పొందలేరు. కర్మ చేసేటప్పుడు నేను చేస్తున్నాను అనే భావనే కర్తృత్వభావం. ఫలం ప్రాప్తించినప్పుడు నేను అనుభవిస్తున్నాను అనే భావనే భోక్తృత్వభావం. ఈ రెండు లేకపోతే కర్మలలో సన్యాస మనస్తత్వం ఏర్పడుతుంది. కర్తృత్వం లేనప్పుడు కర్త ఉండడు. భోక్తృత్వం లేనప్పుడు భోక్త ఉండడు. ఇదే జగద్గురు ప్రతిపాదిస్తున్నటువంటి నైష్కర్మ్యస్థితి. మరి ఈ స్థితి కర్మలను విడిస్తే కలుగుతుందా లేదు కదా. మనసును సమత్వస్థితికి తీసుకొచ్చేది కర్మయోగమే గాని కర్మ సన్యాసం కాదు. కాబట్టి సన్యాసం అనేది వేషధారణకు సంబంధం లేని మన ఆంతరంగిక అంశం. అదో అద్భుతమైన స్థితి మనలో మనం కర్మలలో సన్యసించి ఉంటే అదే నైష్కర్మ్యసిద్ధి అని అవగాహన చేసుకోవాలి. కర్మలు మానడం వల్ల నిష్క్రియమైన ఆత్మ స్వరూప స్థితిని పొందలేరు. కర్మను సన్యసించడం వల్ల కూడా ఆత్మసిద్ధిని పొందడానికి వీలు లేదు. కర్మను సన్యసించడం వల్ల కూడా ఆత్మసిద్ధిని పొందడానికి వీలుకాదు.

3అ, 5శ్లో.

వ హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్ |
కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః

ఏ మనుష్యుడైనను ఏ కాలము నందైనను క్షణమాత్రము గూడా కర్మను ఆచరింపకుండా ఉండలేరు. ఇందు ఎట్టి సందేహమునకు తావులేదు. ఏలనన మనుష్యులందఱును ప్రకృతి జనితములైన గుణములకు లోబడి కర్మలను చేయుటకు బాధ్యులగుదురు. ప్రతి వ్యక్తియు కర్మను ఆచరింపవలసియే యుండును.

కర్మ చేయకుండా ఎవ్వరూ క్షణం కూడా ఉండలేరు. ప్రకృతి స్వభావం వల్ల పుట్టిన గుణాలు మానవుని ప్రేరేపిస్తున్నాయి. వాటికి అనుగుణంగా అస్వతంత్రుడై మానవుడు కర్మలను ఆచరిస్తున్నాడు. మనిషి కర్మ ప్రపంచంలో నిర్విరామంగా కూరుకుపోయినటువంటి కర్మ జీవి, కర్మ చేయకపోతే జీవనం కొనసాగదు. ప్రతి మనిషి దేహంలోనూ మనకు తెలిసి ప్రత్యక్షంగా కొన్ని కర్మలు నడుస్తుంటాయి. మన ప్రమేయం లేకుండానే పరోక్షంగా ఎన్నో కర్మలు మనలో అనేక విధాలుగా కర్మలు జరుగుతూనే ఉంటాయి. ఊపిరి పోసుకోవడం కర్మ. ఊపిరి పీల్చుకోవడమూ కర్మ. కర్మ

చలనాత్మకం, ఈ విషయం మనం రెండవ అధ్యాయంలో సుదీర్ఘంగా చర్చించాం. విత్తు నాటడం, మొలక రావడం, పువ్వు పూయడం, కాయ కాయడం,పండు పండటం, పండిరాలడం, మళ్లీ భూమిలో కలసిపోవడం అంతా కర్మే కదా. ఇలా కదులుతున్న కాలంతో సాగే కాలంలో క్షణక్షణం కర్మే. ఈ పంచభూతాత్మక ప్రపంచంలో ఏ ప్రాణి కర్మ నుండి తప్పుకోలేదు. కర్మతోనే ఆరంభమై, కర్మతోనే అంతరించి, అదృశ్యమై తరువాతి కర్మకు కూడా కారణమవుతూ ఉంటుంది. దేహంలో కూడా దేహంలోని అణువణువు తమ తమ కర్మలలో లీనమై ఉంటుంది, కణం కణం లోనూ చలనం ఉంటుంది. గుండె కొట్టుకోవడం, గుండె ఆగిపోవడం రెండూ కర్మే కదా. శ్వాస ప్రక్రియ, రక్తప్రసరణ అంతా కర్మే కదా. ఇలా నిద్రపోవడం, నిద్ర మేలుకోవడం కర్మ కానిది ఏముంది ఈ ప్రపంచంలో ఇది మనకు అర్థం కావాలి. సృష్టి కర్మ, సృష్టికర్త కార్యమే సృష్టి కదా. ఇలా అలాంటి సృష్టిలో ఉన్న మనం ప్రతి ఒక్కరం ప్రకృతి సిద్ధమైన గుణాలచేత అస్వతంత్రులై కర్మలను చేస్తున్నాం. అయితే ఇక్కడ ఒక విషయం మనం గమనించాలి. రెండవ అధ్యాయం 45వ శ్లోకంలో ఈ త్రిగుణాలు అజ్ఞానికి, మాయకు బంధీ అయినవారికి మాత్రమే. వారిని మాత్రమే ఇవి చలింప చేయగలవు. కానీ జ్ఞానిని, ఆత్మస్థుని చలింప చేయలేవు. ఈ గుణాలకు సంబంధించి ఇంకా వివరంగా మనకు 14వ అధ్యాయం గుణత్రయ విభాగంలో స్పష్టంగా కనిపిస్తుంది. అలా సర్వప్రాణులు ప్రకృతి గుణాలచేత అస్వతంత్రులై కర్మలు చేస్తూ ఉంటారు. గుణాల ప్రభావానికి లోను కాని వారు చలించరు. కనుక అలాంటి జ్ఞానులకు స్వతఃచలనం ఉండదు. తద్వారా వీరికి కర్మలతో బంధం ఉండదు. ఎవ్వరూ క్షణం కూడా కర్మ చేయకుండా ఉండలేరు, ప్రకృతి గుణాలు అందర్నీ వివశుల్ని చేసి పనులు చేయిస్తాయి. అయితే జ్ఞాని వాటినే వివశుల్ని చేస్తాడు. ఇది మనం గుర్తించాల్సిన అంశం. కర్మలు జరుగుతున్నా కర్మలలో, కర్మఫలాలో, కర్తృత్వంలో, భోక్తృత్వంలో లీనం కాకుండా విడివడి ఉంటారు. మూడు నాలుగు శ్లోకాలలో చెప్పినట్లు నైష్కర్మ్యసిద్ధి పొంది మోక్షస్థితికి చేరుకుంటారు. అలా మనం కూడా నైష్కర్మ్యసిద్ధిని పొంది ఈ నిరంతరం జరుగుతూ ఉన్నటువంటి కర్మలలో సంబంధం లేకుండా, కర్మలతో సంబంధం లేకుండా విడివడి ఉండాలి.

3అ, 6శ్లో.

కర్మేంద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్ |
ఇంద్రియార్థాన్ విమూఢాత్మా మిథ్యాచారః స ఉచ్యతే ||

బలవంతముగా, బాహ్యముగా ఇంద్రియ వ్యాపారములను నిగ్రహించి, మానసికముగా ఇంద్రియ విషయములను చింతించునట్టి మూఢుని మిథ్యాచారి అనగా దంభి అనియందురు.

కపటమైన ఆచరణ కలవారు వివేక శూన్యులు. కేవలం కర్మేంద్రియాలను అణచిపెట్టి తన మనసులో మాత్రం ఇంద్రియ విషయాలని చింతిస్తూ ఉంటారు. మనకు మన పట్ల క్షుణ్ణమైనటువంటి పరిశీలన అవగాహన ఖచ్చితంగా ఉండాలి. మనం రెండవ అధ్యాయంలో చూసాం మనిషికి అంటే తన గురించి తనకు తనంటే ఏంటో తనకు స్పష్టమైనటువంటి ఓ స్పష్టమైన అవగాహన ఉండాలి. అప్పుడే మనం ప్రయాణించే మార్గం సరైనదిగా ఉంటుంది. లేకపోతే ధర్పంతో డాంబికంతో కూడిన వ్యవహారాలు బతుకును, జీవితాన్ని చీకటిలోకి నెట్టిపేస్తాయి. అందుకే జగద్గురువు ఈ శ్లోకాన్ని ప్రతిపాదిస్తున్నాడు. ఎవరు కూడా దారి తప్పకుండా గీతా మార్గంలోనే ప్రయాణించాలి. కర్మ జడం అని మనం ఇదే అధ్యాయం నాలుగవ శ్లోకంలో నిర్ధారించుకున్నాం. అలాగే ఇంద్రియాలు కూడా జడమే. మన దేహానికి వెలుపల ఉంటున్న ఇంద్రియ విషయాలు కూడా జడమే. వీటిని గతంలో మనం వివరించుకున్నాం. వాటిని పునాదిగా చేసుకుని ఈ అంశాన్ని పరిశీలించాలి. దీన్నిబట్టి మనోనిగ్రహం లేకుండా ఇంద్రియాల్ని నియమంలో పెట్టడం నిగ్రహం కిందికి రాదు. అవి తనంతట తాను విషయాలలో రమించలేవు కదా. మనసు దానితో సంగమిస్తేనే విషయానుభవం కలుగుతుంది. అలాంటప్పుడు మూర్ఖంగా, మౌఢ్యంగా జడ మైనటువంటి ఇంద్రియాల్ని మాత్రమే నిగ్రహించి మనసును నిగ్రహించలేని వ్యక్తులు నిగ్రహవంతులు కాలేరు. అలాంటి వారిని జగద్గురువు మిథ్యాచారులుగా డాంబికులుగా చెప్పబడుతారని తేల్చారు. అలాంటి డాంబిక ప్రదర్శన అధోగతి పాలు చేస్తుంది. నైష్కర్మ్యం అంటే నిష్కామకర్మే ప్రశాంతతను ప్రసాదిస్తుంది. అలాగే ఇంద్రియాలు సమయమించి దైవం పై నిలకడగా దృష్టిని నిలిపితే ప్రశాంతత సిద్ధిస్తుంది. అలాకాక ఢంబాలు ప్రదర్శించే మిద్యాచారులకు మిగిలేది అశాంతే, అధోగతే. కాబట్టి ఎక్కడైనా ఏ మూలైన మనలో ఆడాంబికత్వం మిగిలి ఉంటె కూడా ఇక్కడే ఈ శ్లోకం దగ్గరే దాన్ని సన్యసించాలి. అధోగతివైపు గాక పురోగతివైపు మనం మన ప్రయాణాన్ని కొనసాగించాలి. ఇక్కడ మిథ్య అంటే సత్యం కానిది అంటే ఏమి? సత్యానికి వ్యతిరేక పదం అసత్యం. మిథ్యాచార్యులు అంటే అసత్యాన్ని ఆచరించేవారు అసత్య ప్రవర్తకులు. కర్మేంద్రియాలను స్తంభింపజేసి ఇంద్రియ విషయాలను మాత్రం మనసులో స్మరిస్తూ స్పందిస్తూ ఉండే మూఢుడు కాబట్టి పాపాచారుడు అని పేర్కొన్నారు. చూసారా దివ్యాత్మ స్వరూపులారా ఇంద్రియాలు బాహ్య ఉపకరణాలు, మనసు అంతఃకరణం. అంతఃకరణలో మూఢత్వం కలవాన్ని జగద్గురువు మూఢుడు, మిథ్యాచార్యుడు కపటుడు అంటున్నాడు. వీరు జ్ఞానిగా అభినయిస్తూ ఉంటారు. మీరు బాహ్య విషయాల పట్ల ఆసక్తి లేనివారుగా వ్యవహరిస్తూ ఉంటారు, మనసులో మాత్రం వాటినే తదేకంగా ధ్యానిస్తూ, స్మరిస్తూ ఉంటారు. ఇంద్రియాలను అరికట్టి, బిగబట్టి మనసులో కోరికలను అదుపు చేయలేనప్పుడు నిగ్రహం అనే మాటకు అర్థం ఎక్కడ ఉంది. ఇంద్రియాల్ని నిగ్రహించినా మనసులో అవే ఆలోచనలను సాగించే వ్యక్తికి నైష్కర్మ్యం ఎలా సిద్ధిస్తుంది. ఇది ఇంతకూ పొందాల్సిన అంశమా? అభినయించాల్సిన అంశమా? ఆలోచిద్దాం. కాబట్టి అజ్ఞాన ప్రదర్శనలిస్తూ కాలం వెళ్లగొచ్చేటటువంటి మిథ్యాచార్యుల్ని విమూఢుల్ని విడిచి జగద్గురువు చిటికెన వేలు వదలకుండా పట్టుకుని పురోభివృద్ధికి మనం కారణం కావాలి. మన పురోభివృద్ధిని మనమే గావించుకోవాలి. మందబుద్ధుల్ని ఊరించే

మిథ్యాచార్యుల ఊబిలో పడకుండా జాగ్రత్తపడాలి. ఆధ్యాత్మిక జీవనం దారితప్పి మనిషి అధోగతి పాలు కాకుండా జాగ్రత్త వహించాలని జగద్గురువు బోధిస్తున్నాడు. మనకు 2అ, 62 63 శ్లోకాల్లో మనిషి పతనమయ్యేటటువంటి విధానాన్ని ప్రత్యక్షంగా మన కళ్ళ ముందుంచాడు జగద్గురువు. ఈ శ్లోకంలో మిథ్యాచార్యులని మూఢంగా నమ్మితే అలా నమ్మిన వారు కూడా వారితోపాటు విమూఢులై మిథ్యాచార్యులై అధోగతి పాలవుతారని హెచ్చరిస్తున్నాడు. ఇక్కడ మూఢత్వం అని చెప్పలేదు జగద్గురువు. విముఢాత్మ అన్నారు. అంటే ఏమి ఈ మూఢత్వం కంటే మౌఢ్యం కంటే ఇంకా తీవ్రమైనటువంటిది.

3అ, 7శ్లో.

యస్త్వింద్రియాణి మనసా నియమ్యారభతేஉర్జున |
కర్మేంద్రియైః కర్మయోగమ్ అసక్తః స విశిష్యతే ||

కాని, అర్జునా! మనస్సుతో ఇంద్రియములను వశపఱచుకొని, అనాసక్తుడై ఇంద్రియములద్వారా కర్మయోగాచరణమును కావించు పురుషుడు శ్రేష్ఠుడు.

శ్రేష్టులు ఇంద్రియాలను మనసుతో నియమిస్తారు. ఫలాసక్తి లేకుండా కర్మేంద్రియాల చేత కర్మయోగాన్ని ఆరంభిస్తారు. అర్జునా మనసుతో ఇంద్రియాలను వశపరచుకొని అనాసక్తుడై ఇంద్రియాల ద్వారా కర్మయోగాచరణ గావించువారు శ్రేష్టులు. కేవలం కర్మేంద్రియాలను నిగ్రహించి మనసుతో ఇంద్రియ విషయాసక్తితో వ్యాపారం సాగించే అవివేకుల్ని మిథ్యాచారులని క్రిందటి శ్లోకంలో చూసాం. ఈ శ్లోకంలో మనసుతో ఇంద్రియాల్ని సంయమించిన కర్మయోగి ఎలా ప్రగతిని సాధిస్తున్నారో స్పష్టంగా తెలియజేస్తున్నారు. పరమ పురుషార్థ ప్రాప్తికి వీరు ఎలా అర్హులో కూడా జగద్గురువు ఈ శ్లోకంలో స్పష్టంగా చెప్పారు. వీరిని పవిత్రులని శ్రేష్టులని కూడా పేర్కొన్నారు. కర్మయోగి ఇంద్రియాల్ని మనసుతో నియమిస్తున్నాడు. అది ఎలా అంటే వివేకం మనసుకు తోడై వివేకం అనేది మనసు సహాయంతో ఇంద్రియాల్ని ఆయా ఇంద్రియ విషయాల నుండి సంయమింప జేస్తుంది. అదే వివేక బుద్ధి, కారణం, ఫలం ఏదైనా అది అశాశ్వతం అని స్పష్టంగా వివేక బుద్ధితో గ్రహించినవారు కాబట్టి. మనకు ఆరవ శ్లోకంలో ఈ అంశాన్ని గ్రహించలేని మిద్యాచారుల్ని, అవివేకుల్ని గూర్చి స్పష్టంగా చెప్పాడు. ఇక్కడ దానికి భిన్నంగా శ్రేష్టుల్ని, వివేక బుద్ధి గల వారిని గురించి వివరిస్తున్నాడు. దీన్ని బట్టి మనం ఏ స్థాయిలో ఉన్నామో మనల్ని మనమే ప్రశ్నించుకోవాలనేది, పరిశీలించుకోవాలనేది జగద్గురువు సూచన. వివేక బుద్ధిగలవారికి నిత్యా నిత్య వస్తువివేకం ఉంటుంది కాబట్టి వీరిలో భోగాశక్తి నశిస్తుంది. వాటి పట్ల వీరు అసక్తులై ఉంటారు. అందుకే ఆధ్యాత్మిక ప్రయాణంలో సాధనాచతుష్టయం అనేది

ప్రధానమైనటువంటి పాత్ర వహిస్తుంది. అందులో మొదటి అంశం నిత్యా నిత్య వివేకం, ఏది నిత్యం, అనిత్యం అనే ఆలోచన చేసి వివేక ప్రజ్ఞతో నిత్యమైనదాన్ని నిత్యం గాను, అనిత్యమైన దాన్ని అనిత్యంగాను గ్రహించే వివేక ప్రజ్ఞ్యను మనం పెంపొందించుకోవాలి. విషయాలనేవి పరిచ్చేదమైన రూపాలు, ఇక ఇంద్రియాలు అంటే అవి పరికరాలుగా మనం చెప్పుకోవచ్చు. ఇక మనసు చలనాత్మకం, ఇలా ఒక్కో అంశాన్ని వాటి పనితీరును మనలో మనం విశ్లేషిస్తూ గమనిస్తూ ముందుకు వెళ్లాలి. ఈ స్వీయ పరిశీలనలో తేలే అంశం ఏది నిత్యం ఏది అనిత్యం అనేది మనకు అనుభవేద్యం అవుతుంది.

కాబట్టి మనసును చక్కగా సంయమించి ఆయా ఇంద్రియాలు వాటి వాటి స్థానాల్లో ఉండి వాటి బాధ్యతను అవి నిర్వహించేటట్లుగా మనమే మన మనస్సు ద్వారా వివేక ప్రజ్ఞ యొక్క ఆధ్వర్యంలో వాటికి సంకేతాలు ఇస్తూ ఉండాలి. ఆయా ఇంద్రియాలను ఫలాసక్తి లేకుండా కర్మలను ఆచరించేటట్లు చూడాలి. ఆయా ఇంద్రియ విషయాలు ఆయా ఇంద్రియాలకు లోబడి పనిచేయాలి. ఆయా ఇంద్రియాలు మనసుకు లోబడి ప్రవర్తించాలి. మనసు బుద్ధి నిర్ణయం మేరకే కొనసాగాలి. ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించడానికి వీలు లేదు. ఇది వరుసక్రమం. అలా ప్రవర్తిల్లడమే కర్మయోగాచరణ అంటే. ఈ సంగం లేని కర్మయోగం ఆచరించిన వారే శ్రేష్టులు, పవిత్రులు, ఉత్తములు అని ఆజ్ఞాపిస్తున్నాడు జగద్గురువు. అందుకే జ్ఞానేంద్రియాలను (చెవులు, చర్మము, కన్ను, నాలుక, ముక్కు) వివేక బుద్ధితో, మనసు చేత నియమించి ఫలం కోరకుండా కర్మేంద్రియాల చేత (నోరు, చేతులు, కాళ్లు, గుహ్యాము, గుదము) కర్మయోగం అనుష్టించేవారు, ఆచరించేవారు, శ్రేష్టులు, ఉత్తములు. ఆ మార్గంలోనే మనమూ ప్రయాణిద్దాం.

3అ, 8శ్లో.

నియతం కురు కర్మ త్వం కర్మ జ్యాయో హ్యకర్మణః |
శరీరయాత్రాఽపి చ తే న ప్రసిద్ధ్యేదకర్మణః ||

నీవు శాస్త్రవిహిత కర్తవ్య కర్మలను ఆచరింపుము. ఏలనన కర్మలను చేయకుండుటకంటెను చేయుటయే ఉత్తమం. కర్మలను ఆచరింపనిచో నీ శరీర నిర్వహణము కూడా సాధ్యము కాదు.

ఏది నాకు శ్రేయస్కరమో నీవే నిశ్చయించు చెప్పు అని కదా అర్జునుడు అడిగింది. సద్గురువుకే నిర్ణయాన్ని వదిలిపెట్టాడు. అందుకే ఆ బాధ్యత తీసుకున్న జగద్గురువు ఇక్కడ అతని మాటతోనే అతనికి సమాధానం చెబుతున్నాడు. దైవం ఈ కార్యాన్ని నీకోసమే నిర్ణయించింది, ఇది నీ కర్తవ్యం నాయనా కాబట్టి ఈ యుద్ధాన్ని నీవు చేయడమే శ్రేయస్కరం. అదే మాటతోనే జగద్గురువు సమాధానాన్ని, నిర్ణయాన్ని, దిశ నిర్దేశాన్ని చేస్తున్నాడు. ఇది

మనం గమనించవలసినటువంటి అంశం. నీవు నీ కర్తవ్యకర్మలను చెయ్యి అని స్పష్టంగా మార్గాన్ని ఓవైపు నిర్దేశిస్తూనే మరోవైపు నీ నియత కర్మను నువ్వు చేయకపోతే ఏం జరుగుతుందో కూడా హెచ్చరిస్తున్నాడు. కర్తవ్య కర్మలు అంటే దైవం ఏర్పాటు చేసిన పనిని చేయకపోతే శరీర నిర్వహణ కూడా సాధ్యం కాదు. ఇది మనం మనలోకి వెళ్లి ఆలోచించి 25 మహాతత్వాల్ని (అంతరేంద్రియములు, ప్రాణేంద్రియములు జ్ఞానేంద్రియములు, విషయేంద్రియములు, కర్మేంద్రియములు) అంటే మన గురించి మనం తెలుసుకొని మన కర్తవ్యకర్మలను మనం గుర్తించగలగాలి. మనం ఒకటవ అధ్యాయంలో చాలా అంశాలు చెప్పుకున్నాం. మనలో మనకు ఏర్పడుతున్న సంఘర్షణలకు ఆవేదనలకు అలజడికి అనేక రకాల ఇబ్బందులకు కూడా కారణం మనం మన కర్తవ్యకర్మలను గుర్తించి ఆచరించకపోవడమే. ఇది ఖచ్చితంగా గీతా స్వరూపులందరూ గమనించాలి. మనం లోకంలో లోకుల్ని అనుసరిస్తాం, కానీ మనల్ని మనం తెలుసుకొని మనలోని అంతర్వాణిని విని దైవ సందేశాన్ని అందుకుని దైవాన్ని అనుసరించాలి. అదే మోక్షమార్గం. ఈ అంశాన్ని గుర్తించడానికి స్వయంగా వీలుకానప్పుడు ఆరవ శ్లోకంలో చెప్పుకున్నటువంటి ఢాంభికుల్ని లేదా మిథ్యాసారులని కాకుండా అర్జునుడు లాగా అనుభవజ్ఞులైన సద్గురువును ఆశ్రయించి ఆ గుర్తించే మార్గాన్ని తెలుసుకోవాలి. ఇది మనకు జగద్గురువు ఇస్తున్న సూచన. భగవద్గీత కథ కాదు వినడానికి, ఇది అనుష్టాన వేదాంతం, ఆచరించాల్సిన అంశాలు ఇవి. కాబట్టి జగద్గురువు చేస్తున్న ప్రతి సూచనను మనం గమనించి ఆచరించాలి. దైవం నియమించిన కర్మను మనం గుర్తించి చేయడానికి మనకు దైవం కర్మ స్వేచ్ఛనిచ్చింది ఇష్టం వచ్చిన పనులు చేయడానికి కాదు. ఇది గ్రహించడం కోసమే నిన్నటి శ్లోకంలో మనం నిత్యా నిత్య వివేకం ఉండాలి అని తెలుసుకున్నాం. అలా ధర్మమే దైవమనే వివేకం ఉన్నవారు తన కర్తవ్యాన్ని, తన ధర్మాన్ని గుర్తించి అనుసరిస్తారు. ఫలితం ఏదైనా ప్రసాదమే, అలా ప్రసాదంగా భావిస్తే అదే మనశ్శాంతి కదా. ఆ మనశ్శాంతే జ్ఞాననిష్టకు, మోక్షమార్గానికి రాజబాట. అలా కర్మయోగాచరణ ద్వారా చిత్తం పరిశుద్ధమై జ్ఞాననిష్టను పొందాలి. దైవం నియమించిన కార్యం మనం నిర్వర్తిస్తే ఇక మనం చేసేదేమీ ఉండదు కదా. ప్రశాంతంగా ఆనందంగా యోగంతో దైవ కార్యములో నిమగ్నం కావడం. ఇది ఎంత సులభం. ఇది సహజంగా మనలో జరిగిపోవాలి.

3అ, 9శ్లో.

యజ్ఞార్థాత్ కర్మణోఽన్యత్ర లోకోఽయం కర్మబంధనః |
తదర్థం కర్మ కౌంతేయ ముక్తసంగః సమాచర ||

ఓ అర్జునా యజ్ఞార్థము చేయబడు కర్మలలో గాక ఇతర కర్మల యందు నిమగ్నులగుట వలన మనుష్యులు కర్మబంధములలో చిక్కుపడుతురు. కనుక నీవు ఆసక్తి రహితుడవై యజ్ఞార్థమే కర్తవ్య కర్మలను చక్కగా ఆచరింపుము.

క్రిందటి శ్లోకంలో మనం చెప్పుకున్న నియత కర్మను కాకుండా ఇతరమైన కర్మలు అన్నీ కూడా బంధాలకు కారణం అవుతాయి. కాబట్టి కర్మలు సంగం లేకుండా చక్కగా ఆచరించు అంటున్నాడు జగద్గురువు. 'యజ్ఞార్థాత్' అంటే దైవసమర్పణ అని అర్థం, దైవానికి సమర్పించేది యజ్ఞం. మనం సాధారణంగా యజ్ఞం అంటే ఓ పెద్ద యాగశాల నిర్మించి ఋత్విక్కుల ఆధ్వర్యంలో చేసే యజ్ఞాలు దేవాలయాల్లో హోమ ద్రవ్యాలు తెప్పించుకొని వేదమంత్రాలతో చేసేటటువంటి యజ్ఞాలు అని అనుకుంటాం. అయితే వాటితోపాటు యజ్ఞం అనే మాటకు విస్తృతమైనటువంటి అర్థం ఉంది, పరిధి లేదు యజ్ఞానికి. ఇప్పుడు మనం చెప్పుకున్నవి కాకుండా మనం మన జీవిత కాలాన్ని నిన్న చెప్పుకున్న దేహి యాత్రను కూడా యజ్ఞంగా భావించాలి కదా. మానవ జన్మ ఒక యజ్ఞం కదా. దేహి యొక్క యాత్ర దేహి ప్రయాణం గమ్యాన్ని చేరుకోవడానికి మహా యజ్ఞం కదా. ఈ మానవుడు బ్రహ్మనిర్వాణం శ్లోకంలో 2- 72 చెప్పుకున్నటువంటి 4 వేదాల సారాన్ని కూడా గ్రహించి మరింత ముందుకెళ్లి పరిపూర్ణ బ్రాహ్మీస్థితికి చేరుకునే దాని కంటే మించిన యజ్ఞం ఏముంటుంది. దివ్యాత్మ స్వరూపుల్లారా ఈ హృదయాన్ని ఈ మనసుని దైవంపై నిత్యం నిమగ్నం చేసి దైవ కార్యములో నిరంతరం మునగడం కంటే వేరైన యజ్ఞం ఏముంటుంది. ఈ ఆత్మను పరమాత్మ స్థితికి దైవంలో విలీనం అయ్యే స్థితికి దైవంతో సాయుజ్యం పొందే స్థితి కంటే మరో యజ్ఞం ఏముంటుంది.ఇది మన అంతరంగంలో జరగాల్సిన పరిశీలన. మనం ఒక గంట లేదా ఒకరోజు లేదా ఒక 41 రోజులు లేదా నిర్ణీత సమయంలో నిర్ణీత ప్రదేశంలో చేసి ముగించేది యజ్ఞమా ఆలోచిద్దాం. అక్కడ చేసిన యజ్ఞంలోని ఆంతర్యాన్ని గ్రహించి అదే విధంగా నిరంతరం దైవ సమర్పణతో జీవితాన్ని జీవించడం యజ్ఞమా?. యజ్ఞంలో రుత్వికులు సమర్పయామి అని చెబుతారు, అంటే దాన్ని మనం అందిపుచ్చుకొని నిత్యం సమర్పణ భావంతో ఆ దృష్టితోనే కదా మనం ప్రతి కార్యాన్ని యజ్ఞంలా కొనసాగించాలి. మరి అలా ఎందుకు జరగటం లేదు. ఇలాంటి లోతైన పరిశీలన ఎప్పుడు మనకు అలవడుతుంది. ఇప్పుడు యజ్ఞం అనే మాటను మనం చర్చించుకున్నాం కదా, ఈ దృష్టితో జగద్గురువు చెప్పిన వాక్యాన్ని మనం మనలోకి వెళ్లి ప్రశ్నిద్దాం, పరిశీలిద్దాం. మనం ప్రతిక్షణం ప్రతి అడుగు ప్రతి కార్యం జగద్గురువు చెప్పినట్లుగా యజ్ఞార్థమే దైవ సమర్పణ తోనే

చేస్తున్నామా గుడిలోనూ యాగశాలలోనూ ఆ యజ్ఞాన్ని అక్కడే విడిచిపెట్టి వస్తున్నామా, అక్కడ యజ్ఞంలో మనం పాల్గొంటే మనం నిజంగా యజ్ఞం చేసినట్లా, ఆ యజ్ఞాన్ని అందిపుచ్చుకొని మనలో మనం నిరంతరం ఈ దేహం అనే యాగశాలలో యజ్ఞాన్ని కొనసాగిస్తే అది దైవ కార్యమవుతుందా. యజ్ఞం అంటే మనలో నిత్యం జరగాలి, మన చూపు మన వినికిడి, మన ప్రతి శ్వాస, ధ్యాస, పని అన్నీ దైవ సమర్పితం కావాలి కదా. సమాధానం ఎవరి నుంచి వారే గ్రహించాలి. ఇక ఆలా గ్రహించిన సమాధానం ద్వారా మనం ఏ స్థితిలో ఉన్నామో మనకు తెలుస్తుంది. అలా నిత్యం దైవ సమర్పణతో ప్రవర్తిల్లుతున్న వారు సాక్షాత్తు జగద్గురువు చెబుతున్నటువంటి యోగులు. అలా లేని వారు ఈ లోకపు మాయలో చిక్కుకొని, బంధంలో చిక్కుకున్నట్లుగా ఎవరిని వారే తమ తమ అంతరంగపు అద్దంలో చూసుకోవచ్చు. మన అంతరంగపు అద్దంలో చూస్తే మనమే కనిపిస్తాం. మనం దైవ సమర్పణతో ఉన్నామా, లేదు బంధంలో చిక్కుకొని ఉన్నామా. ఇప్పటికైనా యజ్ఞం అనే మాటకు అర్థాన్ని ఆంతర్యాన్ని అందులోని సత్యాన్ని దర్శిస్తే ఈ క్షణం నుంచైనా మనలో ఆచరణ ఆరంభం కావాలి కదా. లేకపోతే ఈ శ్లోకం విని ప్రయోజనం లేదు. ఎందుకంటే భగవద్గీత, గీతా మార్గం ఆచరణీయం కదా అందుకని. రెండో పాదంలో ఇప్పటిదాకా మనము యజ్ఞము అనే మాటకు అర్థం తెలుసుకున్నాం కదా, ఆ యజ్ఞార్థమై 'ముక్తసంగహః కర్మ స్సమాచర', రాగాన్ని, సంగాన్ని విడిచి కర్మను యజ్ఞార్థమై దైవ సమర్పణ దృష్టితో ప్రారంభించు. ముడిపడితే బంధం, విడివడితే మోక్షం.ఇలా మనలో మనం చర్చ చేసుకోవాలి. మనలో మనం యజ్ఞం ఆరంభించాలి. భగవంతునికి సమర్పణతో కాకుండా దానికి వ్యతిరేకంగా చేసే కర్మలన్నీ కూడా లోకానికి బంధాలు. బంధంలో చిక్కుకుంటాం. అందుకే భగవదర్థం, దైవార్థం ముక్త సంగుడవై సంగాన్ని విడిచినవాడై కర్మను ఆచరించు. మనం కూడా ధర్మ స్పృహతో, ధర్మచింతనతో దైవంపై తదేకంగా దృష్టిని నిలకడ చేసి యజ్ఞార్థమే కర్మలో యోగమై కర్మ యజ్ఞాన్ని ఆచరిద్దాం. ఈ మానవుడిని మధుసూదనుడిగా తయారు చేద్దాం. ఈ దేహాన్ని దేవాలయంగా యజ్ఞశాలగా యాగశాలగా మలచుకుందాం.

3అ, 10శ్లో.

సహయజ్ఞా: ప్రజాః సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః |
అనేన ప్రసవిష్యధ్వమ్ ఏష వోఽస్త్విష్టకామధుక్ ||

కల్పాదియందు బ్రహ్మదేవుడు యజ్ఞ సహితముగా ప్రజలను సృష్టించి మీరు ఈ యజ్ఞముల ద్వారా వృద్ధి చెందుడు, ఈ యజ్ఞములు మీకు కామధేనువు వలె కోరిన కోర్కెలనెల్ల తీర్చును అని పల్కెను.

సృష్టికర్త ఈ సృష్టిని సృష్టించినప్పుడే సృష్టి తో పాటు మాయ కూడా తనకు తానుగా తనను సృజించుకుంటుంది. మనిషితో పాటే నీడ ఉన్నట్లు సృష్టిలో సృష్టితో పాటే మాయ ఉంటుంది. అయితే మనం మనిషిని వదిలిపెట్టి నీడను మాయను పట్టుకున్నట్లు మనం మన నియమిత కర్మ అయినటువంటి మహా యజ్ఞాన్ని మరచి మాయని చూస్తూ, భ్రమిస్తూ, మాయలో చిక్కుకొని మహా యజ్ఞాన్ని మరచిపోయాం. ఏంటి ఆ మహా యజ్ఞం అంటే క్రిందటి శ్లోకంలో మనం చెప్పుకున్న మనలో మనం చేయాల్సిన యజ్ఞం. దేహాన్ని యాగశాలగా మలుచుకొని మానవుడు మాధవుడుగా వృద్ధి నొందే యజ్ఞం. ఇది జగద్గురువు చెబుతున్నటువంటి వృద్ధి చేయండి, ఏమి వృద్ధి? జీవిత పరమార్థమైనటువంటి ఆత్మను పరమాత్మలో సాయుజ్యం పొందించే యజ్ఞం. యజ్ఞం అంటే భగవద్ విశేషమైన కార్యం, క్రియ లేదా పని లేదా కర్మ. సృష్టికర్త సృష్టి తో పాటు యజ్ఞం కూడా సృష్టి చేశాడు. మనం 45వ శ్లోకంలో చర్చించాం. మనకు ప్రకృతిలో రెండు శక్తులు ఉన్నాయని ఒకటి కనిపించే వెలుతురు ఎండగాలి లాంటి శక్తి, రెండు కనిపించని శక్తి. తర్వాత ఈ రెండింటిని వ్యవస్థీకృతం చేసి నడిపిస్తున్న మరో మూలశక్తి, ఆ మూల శక్తిని ఇక్కడ జగద్గురువు బ్రహ్మ అని ప్రజాపతి అని అంటున్నాడు. సృష్టితోపాటు యజ్ఞం కూడా సృష్టితో కొనసాగుతూనే ఉంటుంది, ఉంది. మనమే దాన్ని గుర్తించం, గుర్తించినా పట్టుకోం పట్టించుకోం. మాయ వైపుకి మనం మక్కువ చూపుతూ ఉంటాం. ఉదాహరణకు యావత్ విశ్వాన్ని సూర్యుడు తన వెలుగుతో నింపుతున్నాడా లేదా, సూర్యుడు మనలా తన యజ్ఞాన్ని విస్మరిస్తే మన పరిస్థితి ఏంటి. ఒక్కసారి వాయుదేవుడు తన యజ్ఞాన్ని విరమిస్తే మన బ్రతుకేంటి. గంగాదేవి తన యజ్ఞం నుండి పక్కకు తప్పుకుంటే నీరు మనకు దాహాన్ని తీర్చే గుణాన్ని మనకందించే యజ్ఞాన్ని విరమిస్తే మన పరిస్థితి ఏంటి. ఇలాగే అన్నీ కూడా. మరైతే మనిషి మాత్రమే తన దేహాన్ని యజ్ఞానికి ఉపయోగించడం లేదు. దేహాన్ని కూడా సృష్టికర్త దీనిచే వృద్ధినొందండి అని చెప్పాడు. దీనిచే అంటే ఈ దేహాన్ని ధరించడంచే ఈ దేహంలో ఉండి మీరు యజ్ఞం చేసి వృద్ధి పొందండి అప్పుడు ఇది ఏది? ఈ దేహం ద్వారా చేసేటటువంటి మహా యజ్ఞం ఇష్టమైన కోరికల్ని ఇస్తుంది అని పూర్వం సృష్టికర్త ప్రజలను సృష్టించిన లేదా ఈ లోకాన్ని మనల్ని సృష్టించిన సృష్టికర్త అన్నాడు. సృష్టిని సృష్టిలోని మాయను మనం తెలుసుకోవాలి. మాయవైపు కాకుండా సృష్టి వైపు మన ప్రయాణం కొనసాగాలి. సృష్టికర్తయేమో మనకు సరిగ్గా సూచన ఇచ్చాడు. ఎప్పుడు? పూర్వం అంటే సృష్టి ఆరంభంలోనే. ఏమని పూర్వ ప్రజాపతి ప్రజలను సృష్టించినప్పుడే, యజ్ఞాన్ని సృష్టించి వారితో దీనివలన అంటే ఈ యజ్ఞం ద్వారా వృద్ధి పొందండి అది మీకు కామధేనువు అవుతుంది అని స్పష్టంగా చెప్పాడు కదా. సత్య దృష్టితో చూస్తే కదా ఈ అంశం మనకు బోధపడడానికి. మనం మాయ దృష్టితో చూస్తే మాయ కనిపిస్తుంది. కాబట్టి మనం మనలో మన నియమిత కర్మయోగ ఆచరణ అని యజ్ఞంలో నిమగ్నం అవుదాం. అదే కామధేనువై మనల్ని ముందుకు తీసుకెళుతుంది. సూర్యుడు వాయువు లాంటి పంచభూతాలు సైతం సృష్టికర్త చెప్పినట్లు నడుస్తున్నాయి. మరి మనం ఈ పంచభూతాల కంటే గొప్ప కాదు, ఇతరమైన వాళ్ళమూ కాదు. వారి బిడ్డలం మనం వాటితో తయారై వాటి ద్వారానే పుట్టి జీవించి, పెరిగి వాటిలోనే కలిసిపోయేవారం. మరి అలాంటప్పుడు వాటిలాగే

మనము మన నియమిత కార్యము అనే యజ్ఞంలో ఉంటే వాటిలాగా మనము జీవనం శోభాయ మానంగా కొనసాగించవచ్చు. ఎవరైతే తన హృదయంలో బ్రహ్మాన్ని దర్శిస్తారో వారే బ్రహ్మా స్వరూపుడగుచున్నాడు. మరి మనలో బ్రహ్మాని దర్శిస్తే మనలో బ్రహ్మా తత్వాన్ని దర్శిస్తేనే సృష్టికర్త అంటే ప్రకృతిలోని రెండు శక్తులను నడిపించే మూల శక్తిని మనం దర్శించగలం. సృష్టికర్తను అంటే ప్రకృతిలోని రెండు శక్తుల్ని వ్యవస్థీకృతం చేసి నడిపిస్తున్న మూల శక్తిని మనం దర్శించాలని మనం మనలోని మహా యజ్ఞాన్ని కొనసాగించాలి. అదే జగద్గురువు చెబుతున్నటువంటి మానవుడు దైవంగా వృద్ధి చెందాలని యజ్ఞాన్ని విస్మరించరాదని ప్రబోధిస్తున్న జగద్గురువుకు ప్రణమిల్లుదాం.

3అ, 11శ్లో.

దేవాన్ భావయతానేన తే దేవా భావయంతు వః |
పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ | 11 |

"ఈ యజ్ఞముల ద్వారా మీరు దేవతలను తృప్తి పఱచుడు, మరియు ఆ దేవతలు మిమ్ములను అనుగ్రహింతురు. నిస్వార్థ భావంతో మీరు పరస్పరము సంతృప్తి పఱచుకొనుచు పరమ శ్రేయస్సును పొందగలరు" అని పలికెను.

ఇక్కడ గౌరవం అంటే ఏంటి మనకు వెలుతురునివ్వడం వలన సూర్యుడు, ప్రాణశక్తి నిస్తున్నందువల్ల పంచ ప్రాణహిత వాయుదేవుడు, మనలో మనం తిన్న ఆహారాన్ని జీర్ణింప చేయడం వల్ల అగ్నిపంచాత్మకమైన అగ్నిదేవుడు, పరిశుభ్రతకు స్వచ్ఛతకు ప్రతీక అయినటువంటి నీటి ద్వారా జల పంచకాలు. పై అన్నింటినీ దేహంలో ఇముడ్చుకొని వున్న ఈ రక్త మాంసాలతో కూడిన ఈ దేహాన్ని మోయడం ద్వారా ఉన్న భూమి పంచకం. ఇలా మనం ప్రకృతిని పరిరక్షించడం వల్ల సకాలంలో వర్షాలు కురిపించడం లాంటివన్నీ కూడా దేవతలు మనకు తగిన సమయంలో మనకు తగినట్లు దైవ సంపదను సమకూరుస్తారు అని అర్థం చేసుకోవాలి. ఇది దేవతలు మనల్ని గౌరవించడం అనే మాటకు అర్థం. అందుకే ఇక్కడ ప్రజాపతి ఎలా దేవతలు మనల్ని గౌరవిస్తారు, సంతుష్టినొందిస్తారు గాక అని అర్థం. నిన్న చెప్పుకున్న నియత కర్మ యోగాచరణ అనే మహా యజ్ఞం ద్వారా మీరు దేవతలను పోషించండి, ఆ దేవతలు మిమ్మల్ని పోషిస్తారు. పరస్పరం పుష్టి కలిగించుకొని పరమ శ్రేయస్సును పొందండి, కానీ ఈ శ్లోకం యొక్క భావం. ఈ మాట ఎవరన్నారు?, సృష్టికర్త, బ్రహ్మా, ప్రజాపతి. ఈ శ్లోకంలో మనం గమనించి, గుర్తించాల్సిన అంశాలు మనిషి అంటే ఎవరు? దేవతలు ఎవరు? వీరిద్దరి మధ్య ఉన్న సంబంధం ఏంటి? అనేది సంక్షిప్తంగా చూద్దాం. జీవుడికి దేవుడికి ఉన్న బంధం ఓ అద్భుతమైన సూత్రం.గురు శిష్య బంధాన్ని మనం 2-7 శ్లోకంలో చూసాం. అక్కడ దాంపత్య జీవితం గురించి చాలా సవివరంగా చర్చించుకున్నాం, నిరూపించుకున్నాం కూడా. రాజు- ప్రజలు, మానవుడు- దేవుడు, భూమి- ఆకాశం

వీరిని మనం దంపతులుగా చర్చించాం. ఆ శ్లోకాన్ని మనం ఇక్కడ పునఃశ్చరణ గావించుకోవాలి. అందుకే మూడవ అధ్యాయం ప్రారంభంలోనే మనం క్రిందటి రెండు అధ్యాయాల పైన పట్టు ఉంటేనే తర్వాతి అధ్యాయాలు మనకు దర్శనమవుతాయి అని చెప్పుకున్నాం. ఆ 2-7 శ్లోకంలోని మానవుడు దేవుడు లేదా జీవుడు దేవుడు వీరిద్దరూ పరస్పరం, ఒకరినొకరు పరస్పరం గౌరవించుకుంటూ జ్ఞానం పెంపొందించుకొని పరమ శ్రేయస్సును పొందాలి కదా. ఇప్పుడు మనకు ఈ శ్లోకంలోని కీలకమైనటువంటి అంశం అర్థం కావాలంటే ఒకసారి మళ్ళీ మనం 2-45 శ్లోకం గుర్తు తెచ్చుకోవాలి. ఆ వివరణలో ప్రకృతి శక్తులను గురించి చెప్పుకున్నాం. సృష్టికర్త అంటే ప్రజాపతి కదా ఆ ప్రజాపతే మూలశక్తి. అతని ఉద్యోగం పేరు సృష్టించడం. ఈ సృష్టికర్త కాకుండా మరో రెండు శక్తులు ఉన్నాయి. ఆ రెండు శక్తుల గురించే మనం ఇప్పుడు చెప్పుకోవాలి. మొదటి పాదంలో దేవతల్ని మనం సంతృప్తి పరచడం, దేవతలు మనల్ని పోషించడం అనేటటువంటిది కార్యం అంటే సాధన. ఇక రెండవ పాదం సాధ్యం అంటే సాధనలో జీవుడు దేవుడు అనే దంపతులు ఒకరితో ఒకరు మమేకమై ఒకరి కోసం ఒకరు ఒకరితో ఒకరు తమ బాధ్యతల్ని నిర్విరామంగా, నిర్విఘ్నంగా కొనసాగిస్తే సృష్టి అంటే ఈ భూమి సమస్థితిలో ఉంటుంది. ఈ కార్యం ఇలా పరస్పరం మానవుడు దేవుడు అనే దాంపత్య జీవితంలో కొనసాగితే ఈ కార్యం జరిగితే అప్పుడు రెండవ పాదంలో అందాల్సిన సాధ్యం అనే ఫలంతో సృష్టి నడుస్తుంది. ఇక్కడ ఈ దాంపత్య జీవనం సరిగా లేదు కదా, ప్రకృతిలోని దేవతలందరూ కూడా తమ తమ నియమిత యజ్ఞాన్ని నిర్వహిస్తున్నారు అని. ఇప్పుడు మన మూలశక్తి కాకుండా ఉన్నటువంటి ప్రకృతిలో రెండు శక్తులను గుర్తుతెచ్చుకుందాం. కనిపించని శక్తి, కనిపిస్తున్న శక్తి ఇవి తన బాధ్యతను నిర్వహిస్తున్నాయి. వాటిని అందిపుచ్చుకుంటున్న, కంటికి కనిపిస్తున్న మానవుడు మాత్రం వాటి వైపు తిరిగి చూడటం లేదు. వాటి గురించి ఆలోచించడం లేదు. నేను లేకపోతే ఈ లోకానికి దిక్కులేదు అని సూర్యుడు అహంకారం ప్రకటించుకోడు. నేను లేకపోతే ఈ ప్రజలందరికీ, ఈ ప్రాణులన్నిటికీ అన్నం లేదని భూదేవి తల్లి కాని, వర్షాన్ని ఇచ్చే వరుణ దేవుడు కానీ అహంకరించరు, అలాగే మిగిలిన దేవతలు కూడా. మనిషి మాత్రం తాను లేకపోతే సృష్టే జరగనట్లు, ఆ దేవతల కన్నా తానే గొప్ప అయినట్లు క్షణక్షణం ప్రతి చోటా తన అహంకారాన్ని ప్రకటించుకుంటూ, విర్రవీగుతూ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ ఉంటారు. ఇది దైవం నిర్వహిస్తున్న కార్యానికి, మానవుడు నిర్వహిస్తున్న కార్యానికి తేడా. ఇక్కడ దాంపత్యం చిన్నాభిన్నమయింది. తద్వారా సృష్టిలో నిత్య నూతనమై చైతన్యవంతంగా విరాజిల్లాల్సిన మనిషి నీరసంగా శుష్కించిపోయి అనేక రోగాలకు పాపాలకు కారణమవుతున్నాడు. ఎక్కడ కూడా మనం గమనిస్తే చెట్టు గట్టు మట్టి పుట్ట భూమి ఆకాశం సూర్యుడు చంద్రుడు ఎవరు కూడా మనిషిలాగా గాడి తప్పలేదు. కాబట్టి జీవుడికి దేవుడికి ఉండాల్సిన సత్సంబంధాన్ని గుర్తించి తగిన విధంగా ప్రవర్తించాల్సిన అవసరం ఉంది. ప్రకృతిని దేవతలను పోషించాలి ఎలా? మనం మనలోని మహా యజ్ఞం ద్వారా. ఆ పోషణ ద్వారానే దైవం మనల్ని పోషించడానికి వీలుంటుంది. ఆ మహా యజ్ఞం లేకపోతే దైవం మనల్ని పోషిస్తున్నా మన దేహం అనే దేవాలయపు యాగశాల

సంసిద్ధంగా లేకపోతే మానవ జీవితం అడవి కాచిన వెన్నెల అవుతుంది. దానివల్ల దేవతలకు ఏమీ ఇబ్బంది లేదు మనకే ఇబ్బంది. ఇది మానవుడికి దేవుడికి ఉన్నటువంటి అవ్యక్త అద్భుత దైవిక సూత్రం. కాబట్టి 2-7, 2-45 ఈ రెండు శ్లోకాల్లోని అంశాలను పునఃశ్చరణగావించుకొని సంపూర్ణంగా అవగాహన చేసుకుని ఆ రెండింటి యొక్క సూత్రంతో ఈ శ్లోకాన్ని సమన్వయం చేసుకోవాలి. ఇది విద్యార్థులు అయినటువంటి బ్రహ్మవిద్యను అభ్యసిస్తున్నటువంటి మనందరి బాధ్యత. ఈ సూత్రంతో ఈ మానవజన్మ అనే మహా యజ్ఞం మోక్ష సాధనం అని గ్రహించాలి. ఈ దేహం అనే యాగశాలలో బలమైనటువంటి అరిషడ్వర్గాలనే అజ్ఞానపు శత్రువులను బంధించి వైరాగ్యం అనే కత్తితో మనలోని అజ్ఞానాన్ని ఖండించి మనం జ్ఞానాగ్నిలో విరాజిల్లుదాం. ఇక్కడ వైరాగ్యం అంటే ఎక్కడికో పారిపోవడం కాదని రాగం లేకుండా ఉండటమే విరాగం అని గ్రహించాలి, అదే జగద్గురువు భోధిస్తున్నటువంటి అంశం.

3అ, 12శ్లో.

ఇష్టాన్ భోగాన్ హి వో దేవా దాస్యంతే యజ్ఞభావితాః |
తైర్దత్తానప్రదాయైభ్యో యో భుంక్తే స్తేన ఏవ సః ||

యజ్ఞముల ద్వారా సంతృప్తిని పొందిన దేవతలు మీకు (మానవులకు) అయాచితముగనే ఇష్టములైన భోగములను ప్రసాదించెదరు. ఈ విధముగ దేవతలచే అనుగ్రహింపబడిన ఈ భోగములను ఆదేవతలకు నివేదన చేయక తానే అనుభవించువాడు నిజముగా దొంగయే.

ఈ శ్లోకంలో మొదటిది మీరు దేవతలను సంతృప్తి పరచండి, గౌరవించండి. రెండో పాదం వారు మిమ్మల్ని సంతృప్తి పరుస్తారు, గౌరవిస్తారు, మీకు అవసరమైనది ఇస్తారు. మూడవ పాదం ఇద్దరూ అన్యోన్యంగా ఉండి ఒకరినొకరు గౌరవించుకొని సంతృప్తి చెందుతూ పరమ సాధనమైన మోక్షాన్ని పొందగలరు. అలా యజ్ఞాల ద్వారా సంతృప్తి చెందిన దేవతలు అయాచితంగానే, ఉచితంగానే మీకు భోగాలు ప్రసాదిస్తారు. అలా దేవతలచే అనుగ్రహింపబడిన ఈ భోగాలను ఆ దేవతలకు నివేదన చేయకుండా తానే అనుభవించేవాడు నిజంగా దొంగే. ఇక్కడ భోగాలు అంటే మనకు మన జీవన మనుగడకు అవసరమైనవి. అది స్త్రీ పురుష పసుపుత్రాది ఆహారాదులు అన్నీ అని కూడా అర్థం చేసుకోవాలి. ఇలా దైవ ప్రసాదితమైన వాటిని తిరిగి దేవతలకు సమర్పించకుండా దేహేంద్రియాలను తృప్తి పరచేవాడు దేవధనాన్ని, దైవిక సంపదను అపహరిస్తున్న దొంగ అవుతాడు అని అర్థం. సృష్టిలో మానవుని మనుగడ మహిమాన్వితమైనది, ధర్మంతో ముడిపడి ఉంది. నియమిత కర్మలతో నియంత్రితమై ఉంది. పరమేశ్వరుని దర్శనం కావాలని ఎంతగానో పరితపించేది

మనమే. కానీ ప్రతిరోజూ ప్రతిక్షణం ప్రకృతి రూపంలో పరమేశ్వర దర్శనం ప్రాప్తిస్తూనే ఉంది అనే సత్యాన్ని అర్థం చేసుకోలేకపోతున్నది మనమే. మోక్ష ప్రయత్నం భూలోకంలోనే, కర్మభూమిలోనే, ధర్మక్షేత్రంలోనే జరగాలి. మరోచోట వీలు కాదు. కాబట్టి మనం నియమిత కర్మయోగాచరణను యజ్ఞ భావనతో చేస్తే ఆ యజ్ఞ కర్మలే కామధేనువులై సత్ఫలితాలను అందిస్తాయి. సత్ప్రవర్తన, ధర్మ జీవనం మనిషిని అభ్యుదయం వైపు, ప్రగతి పదం వైపు నడిపిస్తాయి. అలాగే మనిషి దుష్ప్రవర్తన, అధర్మ జీవనం మనిషి వినాశనానికి దారితీస్తాయి. మనిషి ఈ అంశాన్ని గుర్తించి యజ్ఞ భావంతో దైవంతో అనుసంధానమై ఒకరినొకరు గౌరవిస్తూ దివ్యమైన జీవితాన్ని కొనసాగించాలి. ఇది సామాజిక ధార్మిక శాస్త్రం. అప్పుడే ప్రతి మనిషి దైవికమైన జీవనంతో ప్రశాంతతను పొందగలరు. ప్రకృతిని మనం ఆరాధించాలి గౌరవించాలి అదే పూజ అదే ఆరాధన అదే గౌరవం అదే ప్రేమ అన్నీ కూడా. మనలో ఎంతమంది మన శరీర నిర్వహణకు మూలాధారమైనటువంటి ప్రకృతి సహజ సిద్ధమైనటువంటి శ్వాసను పూజిస్తాం, ధ్యానిస్తాం, ఆరాధిస్తాం. శ్వాస లేనిదే బతుకు లేదు. మానవజాతికి ముక్తే లేదు. శ్వాసే మనకు ప్రాణాధారం, మూలాధారం. నిత్యం మనం శ్వాసిస్తున్న గాలిని మనం ధ్యానించాలి కదా. ఇలాంటి భావంతో మనం ప్రవర్తించినప్పుడు క్రిందటి శ్లోకంలోని పరస్పర గౌరవం ఉంటుంది. మనిషి అలా ప్రవర్తించలేక పోతే ఈ శ్లోకంలో చెప్పుకున్న దొంగ అవుతాడు, చోరుడే అవుతాడు. క్రిందటి శ్లోకంలో మనిషికి దేవుడికి ఉన్న సత్సంబంధాన్ని తెలియజేసి ఇద్దరూ ఎలా మెలగాలో స్పష్టంగా పేర్కొన్నాడు. ఈ శ్లోకంలో అలా ప్రవర్తిల్లక పోతే మనిషి దొంగని చోరుడని తేటతెల్లం చేస్తున్నాడు జగద్గురువు. జగద్గురువు ప్రతిపాదించినటువంటి ఈ సూత్రం ద్వారా ఇప్పుడు మనల్ని మనం ప్రశ్నించుకుందాం

3అ, 13శ్లో.

యజ్ఞశిష్టాశినః సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః |
భుంజతే తే త్వఘం పాపా యే పచంత్యాత్మకారణాత్ | 13 |

యజ్ఞశిష్టాన్నమును తిను శ్రేష్ఠ పురుషులు అన్ని పాపముల నుండి ముక్తులయ్యెదరు. తమ శరీర పోషణ కొరకే ఆహారమును సిద్ధపరచుకొను పాపులు పాపమునే భుజింతురు.

జీవించాలంటే మనిషి భోజనం తీసుకోవాలి లేకపోతే జీవించడం వీలుకాదన్న విషయం మనందరికీ తెలియనిది కాదు. అయితే మనకు కర్మస్వేచ్ఛ ఉంది కదా, భావన చేసే శక్తి ఇచ్చాడు కదా భగవంతుడు. కాబట్టి పాపాన్ని భుజించాలా అమృతాన్ని భుజించాలా అనే వివేకం మనకే ఉండాలి. అలా యజ్ఞ శేషాన్ని భుజించేవారు విముక్తులు అవుతున్నారు. ఇక్కడ సాధారణంగా మనం అనుకోవడం ఎక్కడో యజ్ఞం జరిగిన చోట పంచే ప్రసాదమనో, లేదా దేవాలయంలో పెట్టే

ప్రసాదమనో, లేదు మనం దేవుడి ముందు పండుగల సందర్భంగా పెట్టి భుజించే ఆహారమనో అనుకుంటాం. నైవేద్యంగా పెట్టి భుజించే ఆహారమనో అనుకుంటాం. కానీ అలా కాదు, మనం నిరంతరం మహా యజ్ఞంలో ఉంటాం కనుక మనం వండుకునే ఆహారం కూడా యజ్ఞమే కదా. మనం ప్రస్తుతం తింటున్న పని కూడా యజ్ఞమే కదా. ఇది మనం గమనించాల్సిన సున్నితమైన అంశం. మానస సరోవరం నుంచి వచ్చిన తీర్థమే కాదు, మన మనసు అనే మానస సరోవరంలో కూడా మనం ఆ యజ్ఞాన్ని నిర్విరామంగా కొనసాగించాలి. ఈ దేహం అనే దేవాలయంలో ఉన్న దైవాల నిధిని గుర్తించాలి. వారికి ఈ మనసు అనే మానస సరోవరాన్ని సమర్పించాలి. అప్పుడు మనలో మెదిలే ప్రతి ఆలోచన, మన ప్రతి కదలిక మానససరోవరపు తీర్థంతో సమానం అవుతుందని గ్రహించాలి. అప్పుడు మనం ఎక్కడో జరిగే యజ్ఞాలలో పంచిన ప్రసాదంతో మనం మన దేహం అనే యాగశాల ద్వారా మానస సరోవరం లాంటి స్వచ్ఛమైన మనసుతో వండిన భోజనం కూడా అంతే ప్రసాదం అవుతుంది. మనం ఎవరికైనా మనం వండుకున్న ప్రసాదం పంచినా కూడా మనం మహా యజ్ఞ శిష్టాహారం పంచినట్లు అవుతుంది . ఈ దేహానికి మనసుకు ఎంత శక్తి ఉందో అప్పుడు మనం పంచ అమృత ఆహారం ద్వారా వారికి కూడా బంధ విముక్తికి అవకాశం ఉంటుందని గమనించాలి. చూశారా ఈ దేహానికి మనసుకు ఎంతటి శక్తి ఉందో. అప్పుడు మనం పంచే అమృత ఆహారం ద్వారా వారికి కూడా బంధ విముక్తికి అవకాశం ఉంటుందని గమనించాలి. మనం ఇంతకంటే చేసే సేవ ఇంకేమైనా ఉంటుందా. మనిషికి బంధ విముక్తిగావించే మార్గం మన ద్వారా మరొకరికి సూచించడం మన బాధ్యత కదా. ఇదే పెద్దలు చెప్పే పంచ మహా యజ్ఞం.1. దేవ యజ్ఞం 2. పితృయజ్ఞం 3.ఋషి యజ్ఞం 4.మనుష్య యజ్ఞం 5.భూత యజ్ఞం. ఇవి శాస్త్రం చెప్పే పంచ మహా యజ్ఞాలు. ఇప్పుడు మనం చర్చించుకున్నటువంటి భావనతో వంటచేసి దేవుడికి పెట్టి భుజిస్తే అది దేవయజ్ఞం. అదే భావనతో వంటచేసి పెద్దల పేరుతో పెట్టి భుజిస్తే అది పితృ యజ్ఞం. ఋషులకు, యోగులకు పెట్టి భుజిస్తే అది ఋషి యజ్ఞం. సాటి మానవులకు పెట్టి భుజిస్తే బంధ విముక్తి అన్నాం కదా అదే మనుష్యయజ్ఞం. ఇతరత్రా మనకు అందుబాటులో ఉండే మన ఇంట్లో పెంపుడు జంతువులు, పక్షులు లేదా మనకు అనిపించిన కనిపించిన పశుపక్షాదులు వీటికి పెట్టడం భూత యజ్ఞం. అంతేకానీ ఎక్కడో ఏ ఒకరోజో లేదా నిర్ణీత రోజులోనో చేసుకునేది మాత్రమే యజ్ఞం కాదని గ్రహించాలి. ఒక్క మానవ దేహం అనే యాగశాలలో జరిగే యజ్ఞం ద్వారానే పంచయజ్ఞాలు మనం నిర్వహించగలం. భౌతికంగా చేసే పంచయజ్ఞాలు ఏ దేవుణ్ణి ఏ పితృదేవతల్ని, ఏ ఋషిని, ఏ మనిషిని, ఏ ప్రాణిని చేరగలదు, ఇది మనలోకెళ్ళి మనమే ఆలోచిస్తే మనకే ఇది అర్థం అవుతుంది. భావశుద్ధియే జ్ఞాన సిద్ధి కదా. కాబట్టి భావం పరిశుద్ధమై చేసే యజ్ఞమే మహా యజ్ఞం. అసలైన పంచ మహాయజ్ఞాలకు అదే మూలం. ఈ భావనతో మనలోని మహా యజ్ఞం ద్వారా ఇలా పంచ యజ్ఞాల విధుల్ని నిర్వర్తిస్తూ యజ్ఞ శిష్టాహారాన్ని భుజించడమే అమృతాహారం. చాలామంది ఆహారాన్ని బ్రహ్మార్పణం గావించి ఆ పరమేశ్వరార్పణం చేసి భోజనం చేయడం మనకు తెలుసు. దీని అర్థం కూడా అదే, అయితే ఆ క్షణం మాత్రమే కాకుండా అనునిత్యం ఆ భావనతోనే మనం మెలగాలి. మాట సహాయమైనా, చేత సహాయమైనా కూడా

పరమేశ్వరార్పణ భావంతోనే, యజ్ఞ భావంతోనే మనం చేయాలి. మార్పు చెందే స్వభావంగల ఈ లోకంలో ఉన్న సమస్తమూ భగవంతుని త్యాగ భావంతో ఈశ్వరార్పణ భావంతో ఈ లోకాన్ని మనం అనుభవించాలి. ఎవరి ధనాన్ని ఆశించకూడదు. ఈ లోకంగాని దాని ఐశ్వర్యాలు గాని, అవి అందించే సుఖభోగాలు గాని మార్పుకు లోనయ్యేవే కదా. అంటే అవి అనిత్యాలు. ఇదే లోకంలోనే మనం శాశ్వత ఆనందాన్ని, ప్రశాంతతను ఈ మహా యజ్ఞం భావనతో చేస్తే ప్రతి ఒక్కరు అది పొందగలం. సమస్తాన్ని భగవంతునితో నింపాలి. మనం ఇప్పటిదాకా ఈ శ్లోకంలో చర్చించుకున్నట్లు యజ్ఞశిష్టాహారం ద్వారా భగవదర్పణం ద్వారా ఈ లోకాన్ని భగవంతుని భావనతో నింపాలి. సర్వత్రా నిండి ఉన్న ఈశ్వర తత్వాన్ని మనం అదే తత్వంతో భావించాలి, పంచి పెట్టాలి. సృష్టి చక్రంలో యజ్ఞం అనేది ప్రధాన పాత్ర వహిస్తుంది. ఇది సర్వపాపాల నుండి విముక్తులను గావిస్తుంది. మనం కూడా

పాపాహారాన్ని వీడుదాం, యజ్ఞశిష్టామృతాన్ని భుజిద్దాం. యజ్ఞ జీవనంతో మనలోని జీవశక్తిని పెంపొందించుకుందాం. అదే శక్తిని పంచి లోక కళ్యాణానికి దోహదం చేద్దాం.

3అ, 14శ్లో.

అన్నాద్భవంతి భూతాని పర్జన్యాదన్నసంభవః
యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మసముద్భవః | 14 |

ప్రాణులన్నియు అన్నము (ఆహారము) నుండి జన్మించును. అన్నోత్పత్తి వర్షముల వలన ఏర్పడును. యజ్ఞముల వలన వర్షములు కురియును.

అన్నం వల్లనే అంటే ఆహారం వల్లనే ప్రాణులు పుడుతున్నాయి. ఆహారం మేఘం వల్లనే కలుగుతూ ఉంది. ఆ మేఘాలకు కారణం యజ్ఞం. యజ్ఞానికి కారణం కర్మ. మనం13వ శ్లోకంలో యజ్ఞశిష్టాహారం అమృతతుల్యమని తెలుసుకున్నాం. ఈ శ్లోకంలో ఆహారం పుట్టుపూర్వోత్తరాల గురించి స్పష్టంగా వివరిస్తున్నాడు. మనం ఇదే అధ్యాయం ఏడవ శ్లోకంలో పరిచయం చేసుకున్న పంచభూతాలు, 25 తత్వాలు పునఃశ్చరణ గావించుకొని పరిశీలిద్దాం. ఒకటి భూమి పంచాత్మక భూతాంశం ద్వారా మన శరీరంలోని అస్థులు అంటే ఎముకలు, మాంసము, నరాలు, చర్మం, రోమాలు లాంటివి తయారవుతాయి. రెండు జల పంచాత్మక భూతాంశం ద్వారా రక్తం, చెమట, శుక్లం, శోణితం లాంటివి తయారవుతాయి. అగ్ని పంచాత్మక భూతాంశం ద్వారా ఆకలి, దప్పిక, అలసట, నిద్ర, సంగమం లాంటివి అనిపిస్తాయి. నాలుగు వాయుపంచాత్మక భూతాంశం ద్వారా చలనం, గమనం, నడవటం, పరుగెత్తడం లాంటివి చేయగలుగుతున్నాం. ఐదు ఆకాశ పంచాత్మక భూతాంశం ద్వారా కామ, క్రోధం, లోభం, అహం, భయం లాంటివి ఏర్పడుతాయి. ఇలా మన శరీర

నిర్మాణానికి ఈ శరీరంలో కలిగే వివిధ ప్రక్రియలకు కారణం ఈ పంచభూతాత్మక అంశాలే అని మనకు తెలియాలి. ప్రాణి పుట్టుకకు కారణం మనకు కనిపిస్తున్న, అనిపిస్తున్న భూమి పంచకం. ఇలా పుట్టిన ప్రాణికి ఇదే భూమి ద్వారా ఉత్పన్నమైన ఆహారం ద్వారానే మనుగడ. ఇక్కడ మనకు ఒక సందేహం కలుగవచ్చు. అన్నం వల్ల ఆహారం వల్ల మనిషి లేదా ప్రాణి పుట్టడం ఏంటి అని. మనం భుజించే ఆహారమే శుక్ల శోణితంగా, రక్త వీర్యాలుగా పరిణమించి ప్రాణి పుట్టుకకు కారణమవుతుందని గమనించాలి. అన్నాత్ అనే మాటకు భుక్తాత్ అనే అర్థం కూడా ఉంది. అంటే భుజించేది అని. ఇలా మనం పరిశీలించినప్పుడు సర్వభూతాలు పుట్టుకకు కారణం ఆహారం అని మనకు స్పష్టంగా తెలుస్తుంది. తైత్తిరీయోపనిషత్ ప్రకారం ఆహారమే దైవం, అందులో నుండే జీవజాలం అంతా ఉద్భవిస్తోంది. అలా ఉద్భవించినది మళ్ళీ ఆహారం వల్లనే జీవిస్తున్నాయి. మరణానంతరం ఆహారానికి ఆధారమైన భూమిలోనే లయమవుతున్నాయి. ఈ ఆహారానికి మూలం మేఘం, వర్షం. ఇలా ప్రాణుల ఆవిర్భావానికి హేతువైన అన్నం పర్జన్యాత్ అన్నసంభవః మేఘం వల్లనే పుడుతోంది. పర్జన్యః అంటే వర్షం. వర్షం మేఘమని, వర్షరూపుడైన వరుణ దేవుడని కూడా అర్థం ఉంది. పర్జన్యుడు అనే మాటకు సూర్యుడు అనే అర్థం కూడా ఉంది. అగ్నికి అర్పించిన ఆహుతి సూర్యుని చేరుతుంది. సూర్యుని వల్ల వర్ష మేఘం కలుగుతుంది. ఈ 'పర్జన్యః' అనే పవిత్రమైన పదం విష్ణు సహస్రనామంలో కూడా ఉంది. ఇలా మనం గమనిస్తే ప్రాణి పుట్టుకకు కారణం ఆహారం, అయితే ఈ ఆహారం ఏర్పడడానికి కారణం వర్ష మేఘం అని మనకు అవగాహన అవుతుంది. ఈ వర్షానికి కారణం యజ్ఞం. యజ్ఞ జీవనం గురించి మనం తొమ్మిదవ శ్లోకం నుంచి ఇప్పటిదాకా తెలుసుకున్నాం. ఈ మహా యజ్ఞానికి కారణం కర్మ. కాబట్టి కర్మ చేయకపోవడం కాదు, కర్మలలో యోగం చెందడమే ప్రధానం. అలా యోగంతో కూడుకున్న కర్మ చేయడమే యజ్ఞ కార్యం.

<u>3అ, 1శ్లో నుండి 14శ్లో వరకు అవలోకనం.</u>

15వ శ్లోకంతో మనకు యజ్ఞ ప్రకరణం ముగుస్తుంది, కాబట్టి ఒకసారి ఈ అధ్యాయంలో ఇప్పటివరకు చర్చించుకున్న అంశాన్ని అవలోకనం చేసుకొని ఈ 15వ శ్లోకాన్ని పరిశీలిద్దాం. బ్రహ్మ నిర్వాణం పొందే విధానాన్ని జగద్గురువు బోధ ద్వారా విన్న అర్జునుడిలో మెదిలిన సందేహంతో ఈ అధ్యాయం ఆరంభమైంది. ఈ భయంకరమైన, ఘోరమైన యుద్ధంలో నన్నే ఎందుకు నియోగిస్తున్నావు, నాకు కలగా పులగంగాను, అస్పష్టంగాను అనిపిస్తోంది. నాకు ఏది శ్రేయస్కరమో నిర్దేశించు అని ఒకటి రెండు శ్లోకాలలో శరణు వేడాడు. మూడవ శ్లోకంతో జగద్గురువు సమాధానం ప్రారంభమైంది. సృష్టి ఆరంభంలోనే చెప్పాను ఈ లోకంలో రెండు నిష్ఠలున్నాయి అది ఒకటి సాంఖ్యయోగము అంటే జ్ఞాన యోగము రెండు కర్మయోగము అని చెప్పాడు. నాల్గవ శ్లోకంలో నైష్కర్మ్య సిద్ధిని పొందాలంటే కర్మ యోగాచరణే మార్గమని స్పష్టం చేశాడు. ఐదవ శ్లోకంలో ఏ ప్రాణి కూడా క్షణమాత్రమైనా ప్రత్యక్షంగా గానీ పరోక్షంగా గాని కర్మను

ఆచరించకుండా ఉండలేరని తెలుసుకున్నాం. ఆరవ శ్లోకంలో బలవంతంగా ఇంద్రియ వ్యాపారాల్ని నిగ్రహించి మానసికంగా వాటితో వ్యాపారం చేసే వారిని మూఢులని, ఢాంబికులని పేర్కొన్నారు. ఏడవ శ్లోకంలో మనసుతో ఇంద్రియాలను వశపరచుకుని అనాసక్తుడై అంటే రాగ రహితుడై విరాగిగా కర్మయోగాచరణను గావించువారు శ్రేష్ఠులు అని చర్చించుకున్నాం. ఎనిమిదవ శ్లోకంలో భగవంతుడు నీకు నియమించిన నియమిత కర్మలను చేయాలని, అలా చేయకపోతే దేహంలోని దేహి ప్రయాణం కూడా కొనసాగదని చర్చించుకున్నా. తొమ్మిదవ శ్లోకంలో ఆ దేహి ప్రయాణం కొనసాగడానికి నియమిత కర్మలను ఈ శరీరాన్నే యాగశాల, యజ్ఞశాల అని భావించి కర్మలను చేయాలి అని తెలుసుకున్నాం. అలా కాక ఇతర కర్మలను చేయడం ద్వారా కర్మబంధంలో, కర్మ చక్రంలో, కర్మ చట్రంలో చిక్కుకుంటారని తెలుసుకున్నాం. 10వ శ్లోకంలో కల్పాది యందు బ్రహ్మదేవుడు యజ్ఞ సహితంగా ప్రజలను సృష్టించి మీరు యజ్ఞాల ద్వారా వృద్ధి చేయండి అదే మీకు కామధేనువులా మనకు అవసరమైనవి తీర్చుతుంది అని చర్చించుకున్నాం. అలాగే సృష్టి కార్యం మహా యజ్ఞం అని కూడా తెలుసుకున్నాం. 11వ శ్లోకంలో అలాంటి యజ్ఞాల ద్వారా మీరు దేవతలను తృప్తి పరచండి వారు మిమ్మల్ని గౌరవిస్తారు, నిస్వార్ధ భావంతో మీరు పరస్పరం గౌరవించుకోండి పరమ శ్రేయస్సును పొందండి అని సూచించడం ద్వారా మానవుడికి దేవుడికి, దేవుడికి జీవుడికి ఉన్న సత్సంబంధాన్ని మనం తెలుసుకున్నాం. 12వ శ్లోకంలో యజ్ఞాల ద్వారా సంతృప్తిని పొందిన దేవతలు మనకు అవసరమైన భోగాల్ని ప్రసాదిస్తారు. అలా ఈశ్వరానుగ్రహం ద్వారా పొందిన ప్రసాదాలను ఆ దేవతలకు నివేదన చేయక తానే అనుభవించువారు దొంగలు అని తేల్చి చెప్పారు. 13వ శ్లోకంలో అలా ఈశ్వరార్పణతో ఈ దేహం అనే యాగశాలలో దైవాల నిధిని గుర్తించి మనసును మానస సరోవరంలా స్వచ్ఛంగా ఉంచుకోవాలని తెలుసుకున్నాం. అలా స్వచ్ఛమైన మనసుతో, భావ శుద్ధితో ఈ దేహం అనే యాగశాల ద్వారా వంటచేసి భగవదర్పితంగా భోజనం చేయాలని, అలా చేయనివారు పాపులని తెలుసుకున్నాం. ఇలా పరమాత్మ ప్రసాదించిన వాటిని మనం భుజిస్తూ మనం మనలోని మహా యజ్ఞాన్ని ఎలా కొనసాగించాలో తెలుసుకున్నాం. 14వ శ్లోకంలో ఆహారమే ప్రాణి పుట్టుకకు కారణం, ఆహారం సిద్ధం కావడానికి కారణం మేఘం, మేఘం యజ్ఞం ద్వారానే కలుగుతుంది, యజ్ఞానికి కారణం కర్మ అని తెలుసుకున్నాం.

3అ, 15శ్లో.

కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షరసముద్భవమ్ |
తస్మాత్ సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్ | 15 |

వేదములు విహిత కర్మలకు మూలములు. వేదములు నిత్యుడైన పరమాత్మ నుండి ఉద్భవించినవని తెలుసుకొనుము. అందువలన సర్వవ్యాపియు, అవ్యయుడును ఐన పరమాత్మ సర్వదా యజ్ఞములయందే ప్రతిష్ఠితుడైయున్నాడు.

కర్మ బ్రహ్మం నుండి ఉద్భవించింది, అంటే సృష్టికర్త నుండి. బ్రహ్మం అంటే వేదం అని మనకు తెలియాలి. బ్రహ్మం అంటున్న వేదం అక్షర రూపమైన పరబ్రహ్మం నుండి పుడుతుంది. ఇప్పుడు ఈ శ్లోకంలోని మొదటి అంశం కర్మకు కారణం వేదం, బ్రహ్మం. ఇది మనకు అవగాహన కావాలంటే 2-45వ శ్లోకం దగ్గరకు వెళ్లాలి. నిరంతరం విశ్వమంతా వ్యాపించి ఉన్న జ్ఞాన చైతన్యంలో లయమై శ్రుతుల్ని వినడం వేదం కదా, ఆ వేదం అక్షర రూపుడైన పరబ్రహ్మం నుండే ఉత్పన్నమైంది. అంటే ఆ శ్లోకంలో చెప్పుకున్న వ్యవస్థీకృత శక్తి ఉంది కదా, మూలశక్తి సృష్టికర్త అక్కడి నుండి ఉద్భవించింది. అలా సర్వవ్యాపకమైన బ్రహ్మం, మనం ఇదే అధ్యాయం 13వ శ్లోకంలో చెప్పుకున్నట్లు నిత్యం మహాయజ్ఞంలో సుప్రతిష్టితమై ఉండాలి. అంటే మనం దేహం అనే యాగశాలలో నిరంతరం చేయాల్సిన యజ్ఞం. అలా మనం చేసే యజ్ఞమే తిరిగి ప్రాణి పుట్టుకకు, సృష్టి పరిపుష్టంగా కొనసాగడానికి కారణం. ఇదే యజ్ఞ చక్రం, ధర్మచక్రం. బ్రహ్మం నుండి వేదం, వేదం నుండి కర్మ, కర్మ నుండి యజ్ఞం, తిరిగి యజ్ఞం నుండి బ్రహ్మం. అలా ఉన్నవారు బ్రహ్మ, సృష్టికర్త అయి ఉంటారు అదే తత్వమసి. అది నువ్వే అయి ఉన్నావు. ఈ యజ్ఞ చక్రం, ధర్మచక్రం మనకు అవగతం కావాలి. మనతో పాటు యజ్ఞం పుట్టింది కాబట్టి మన జీవితం అనేది ఈ సృష్టి అనే మహా యజ్ఞంలోని భాగమే అని మనం గుర్తించాలి. అదే మన జీవిత యజ్ఞం. ఇలా మానవుణ్ణి, దేవుణ్ణి అనుసంధానించగలిగిన కార్యం ఈ ఒక్క యజ్ఞమే. ఈ యజ్ఞ కర్మ అటు దైవంతోనూ ఇటు సమాజంతోనూ అన్యోన్యమైన జీవన విధానానికి దోహదం చేస్తుంది ఇదే జగద్గురువు చెప్తున్నటువంటి కర్మ వేదం వల్లనే పుట్టిందని తెలుసుకో. వేదం పరబ్రహ్మం నుండే పుట్టింది. యజ్ఞకర్మకు ప్రమాణం వేదం. వేదంకు ప్రమాణం బ్రహ్మం. బ్రహ్మకు ప్రమాణం పరబ్రహ్మం. వేదమంటే తెలుసుకోదగినది, తెలియదగినది, తెలియబడేది అని మనం 2- 45వ శ్లోకంలో చెప్పుకున్నాం. వేదం అంటే జ్ఞానం, జ్ఞానాన్ని సృష్టించలేం. అయితే అది గ్రహించాలి, తెలియాలి అది ఉన్నదే. కావున ఉన్నదాన్ని తెలుసుకోవడమే జ్ఞానం. బ్రహ్మం బ్రహ్మ యొక్క జ్ఞానం పేరు కాదు. బ్రహ్మ జ్ఞానం పొందితే బ్రహ్మం అంటే ఏంటో తెలిసినట్లే. బ్రహ్మజ్ఞానం వేదమందే ప్రతిష్టితమై ఉంది. వేదం బ్రహ్మస్వరూపం. కాబట్టి వేద రూపమైన కర్మలోనూ ఉన్నది బ్రహ్మమే. వేద ప్రతిపాదిత కర్మ నుండి యజ్ఞం

ఆవిర్భవించింది కాబట్టి యజ్ఞంలో ఉన్నదీ బ్రహ్మమే. యజ్ఞం వల్లనే వర్షం ఉత్పన్నమవుతుంది కాబట్టి వర్ష రూపంలో ఉన్నది కూడా బ్రహ్మమే. ఆ వర్షమే ఆహారానికి కారణం కాబట్టి ఆహారంలో ఉన్నదీ బ్రహ్మమే. ఆహారం వల్లనే ప్రాణులు ఉద్భవిస్తున్నాయి కాబట్టి సర్వప్రాణులూ బ్రహ్మమయమే. ఇలా బ్రహ్మం సర్వవ్యాపకమై సర్వత్రా ప్రతిష్ఠితమై ఉంది. అలా మన జన్మ యజ్ఞంలోనూ, ఈ సృష్టి అనే మహా యజ్ఞంలోనూ సర్వగతమైన బ్రహ్మం సదా ప్రతిష్ఠితమై ఉంది. ఆ యజ్ఞం నిర్వహించాల్సింది మనమే. విశ్వమంతా వ్యాపించి ఉన్నటువంటి సర్వగతమైనటువంటి బ్రహ్మాన్ని మనం అనుభవ పూర్వకంగా తెలుసుకుందాం.

3అ, 16శ్లో.

ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయతీహ యః ।
అఘాయురింద్రియారామో మోఘం పార్థ స జీవతి ।।

ఓ అర్జునా ఇట్లు పరం పరాగతముగా కొనసాగుచున్న సృష్టి చక్రమునకు అనుకూలముగా ప్రవర్తింపనివాడు అనగా తన కర్తవ్యములను పాటింపక ఇంద్రియ సుఖలోలుడైన వాడు పాపి. అట్టివాని యొక్క జీవితము వ్యర్థము.

అర్జునా మనం ఈ విధంగా తిరుగుతున్న అంటే 15వ శ్లోకం దాకా చెప్పుకున్నట్లు తిరుగుతూ ఉన్నటువంటి యజ్ఞచక్రాన్ని, కర్మచక్రాన్ని, ధర్మ చక్రాన్ని అనుసరించి ప్రవర్తించాలి. అలా ప్రవర్తించని వారు పాప జీవనం గడుపుతున్నారు. ఇంద్రియలోలులై వ్యర్థంగా బ్రతుకుతుంటారు. బతకడం వేరు, జీవించడం వేరు అని మనం అనేక సందర్భాల్లో చర్చించుకున్నాం. ఈ ధర్మబద్ధమైన విశ్వచక్రం ఈ విశ్వంలో విశిష్టంగా తిరుగుతూనే ఉంటుంది. ఈ చక్రం ధర్మంపైనే ఆధారపడి ధర్మం ప్రధానంగా చేసుకొని తిరుగుతూ ఉంటుంది. కాబట్టి దీన్ని ధర్మ చక్రం అంటాం. ఇది త్యాగభావనతో యోగంలో చరిస్తూ యజ్ఞంతో, యజ్ఞంలో నిమగ్నమై ఉంటుంది. కాబట్టి దీన్ని యజ్ఞచక్రం అంటాం. ఈ తిరగడమనేది కర్మ కాబట్టి దీన్ని కర్మ చక్రం అని కూడా చెప్పుకోవచ్చు. ఈ ధర్మచక్రంలో ప్రతిక్షణం నిత్యం నూతన సృష్టి జరుగుతూనే ఉంటుంది. మనం ఈ చక్రంలో భాగమై ఉన్నాం. నియతితో సాగే ఈ చక్రంలో మన కర్తవ్యాన్ని అంటే మనకు దైవం నియమించిన కర్తవ్యాన్ని ఖచ్చితంగా నిర్వహించుకుంటూ ముందుకెళ్లాలి. అలా చేయాల్సిన బాధ్యత ఉంటేనే మనం ఈ విశ్వంలో ఉంటాం, అందుకే ఉంటున్నాం, ఉన్నాం కనుక నియమిత కర్తవ్యకర్మ యోగాచరణ అనివార్యం. అలా లేకపోతే దారి తప్పి పోతాం. మనందరం ఒకే చక్రంలో ఇమిడి తిరుగుతుంటాం. ఏ ఒక్కరు దారి తప్పినా యావత్ ప్రపంచానికే ఇబ్బంది అని గ్రహించాలి. అందువలన ప్రతి ఒక్కరూ లోపాలకు తావు ఇవ్వకుండా 100కు 100% ఈ సృష్టి చక్రాన్ని అనుసరించి ప్రవర్తిల్లాలి, కొనసాగాలి. లేకపోతే ఒకరి తప్పిదం యావత్ ప్రపంచం

తప్పిదమై ధర్మచక్రానికి అడ్డు తగిలి దారి తప్పిస్తుంది. ఇది మనం గమనించి ధర్మచక్రానికి అనుగుణంగా కచ్చితంగా ప్రవర్తించాలి. ఇది ధర్మ చట్టం, ఈ చట్టంలో భాగమైన మనమంతా ఈ చట్టాన్ని ధర్మాన్ని అతిక్రమించకూడదని గమనించాలి. ఈ చట్ట పరిధిలో లేని వారు ప్రత్యేకంగా వెళ్లి అధర్మానికి పాల్పడాల్సిన అవసరం లేదు. ధర్మంలో లేనివారు ధర్మచక్రాన్ని అనుసరించి ప్రవర్తించని వారు అధర్మపరులే కదా. అందుకే జగద్గురువు ధర్మం పరిధిలో లేని వారిని పాపులు వారు వ్యర్థమైనవారు, వ్యర్థమైన బతుకును బతుకుతున్న వారు పాపులు వారు బతికి ఉన్న ప్రయోజనం లేదు అని తేల్చి చెప్పాడు. పాప జీవితాన్ని కొనసాగిస్తున్న వారు అంటే తన ఆయువునంతా పాపపు పనులకే ఉపయోగిస్తూ ఆయువును, జన్మను దుర్వినియోగం చేసుకుంటున్నవారు అని అర్థం చేసుకోవాలి. మరి వీరు ఎక్కడ తిరుగుతూ ఉంటారు? అంటే ఇంద్రియాలలో, ఎండమావుల్లో తాడును పాము అనుకునే భ్రాంతిలో ఇంద్రియాల సుడిగుండంలో పరిభ్రమిస్తూ ఉంటారు. ఇంద్రియాలతో కూడి ఉండేవారు ఇంద్రియలోలురు. అందుకే వీరిని ఇంద్రియారామః అన్నారు జగద్గురువు. ఈ అధ్యాయం ప్రారంభంలో ఒకటి రెండు శ్లోకాలలో అర్జునుడు శ్రేయోమార్గాన్ని చూపమన్నాడు. మూడవ శ్లోకంలో నుంచి కర్మయోగ మార్గాన్ని బోధిస్తున్న జగద్గురువు మధ్యలో 9వ శ్లోకం దగ్గర నుంచి 15వ శ్లోకం వరకు ఏడు శ్లోకాల్లో యజ్ఞ ప్రకరణం ప్రస్తావించాడు. అందులో సృష్టి కార్యం అనే మహా యజ్ఞాన్ని ఆ మహా యజ్ఞంలో వ్యక్తి యొక్క ధర్మ యజ్ఞాన్ని విశేషంగా వివరించి యజ్ఞ ప్రకరణం ముగించాడు. ఈ శ్లోకంతో తిరిగి మళ్ళీ తన కర్మయోగ మార్గాన్ని బోధించడం కొనసాగించాడు. ఈ బోధను అందుకుని ఈ విశ్వచక్రంలోని మనం ధర్మచక్రాన్ని అనుసరించి మన నియమిత కర్మ అయినటువంటి మహా దైవ యజ్ఞాన్ని కాలచక్రంతో పాటుగా కొనసాగించి దివ్యమైన అనుభూతులను పొంది దైవంగా విరాజిల్లాలి. ఈ విధంగా ఈశ్వరుని చేత ప్రవర్తితమైన వేద యజ్ఞ పూర్వకమైన జగత్ చక్రపు కర్మయోగంలో ఉంటూ ఉన్నటువంటి మనం నియమిత కర్మలను కర్మ యజ్ఞాన్ని అనుసరించాలి. అలా లేనివారు ఇంద్రియ లోలులు అధర్మపరులు వారు జీవించడం వ్యర్థం, వృధా అని హెచ్చరిస్తున్న జగద్గురువుకు ప్రణమిల్లుదాం.

3అ, 17శ్లో.

యస్త్వాత్మరతిరేవ స్యాత్ ఆత్మతృప్తశ్చ మానవః |
ఆత్మన్యేవ చ సంతుష్టః తస్య కార్యం న విద్యతే |17|

సచ్చిదానంద ఘన పరమాత్మ ప్రాప్తి నందిన జ్ఞానియైన మహాత్ముడు నిత్యమైన ఆత్మయందే రమించును. అతడు పూర్ణ కాముడు, కనుక ఆత్మయందే తృప్తి నొందును. అతడు ఆత్మయందే నిత్యసంతృష్టుడు. అట్టివానికి ఎటువంటి కర్తవ్యమును ఉండదు.

ఇంద్రియ విషయాలలో తిరిగేవారు తమ తమ జీవితాల్ని జన్మను వృధా చేసుకుంటారని ముందు శ్లోకంలో తెలుసుకున్నాం. ఇక్కడ సదా విషయాల యందు కాకుండా ఆత్మ యందే రమించేవారు ఆత్మరతులు, ఆత్మజ్ఞాన నిష్ట కలిగిన సాంఖ్యయోగుల గురించి ఈ శ్లోకంలో వివరించాడు జగద్గురువు. ఆహారాదులలోని రసాదులలో కాకుండా ఆత్మతో తృప్తి చెందే వారు ఆత్మతృప్తులు, అలాంటివారు బాహ్య విషయాలతో కాకుండా ఆత్మయందే ఆనందిస్తారు. ఇలాంటి ఆత్మవేత్త ప్రత్యేకంగా చేయవలసిన కార్యమేది కూడా ఉండదు అని ప్రభోధిస్తున్నాడు. ముందు శ్లోకంలో ఇంద్రియాలతో రమిస్తున్న వారి పరిస్థితిని స్పష్టంగా వివరించారు. ఈ శ్లోకంలో ఆత్మతో రమించే వారి గురించి స్పష్టంగా చెప్పి ఏ మార్గం కావాలో నిశ్చయించుకోవాలనే బాధ్యతను కర్మ స్వేచ్ఛ ఉన్న, వివేకం ఉన్న మనిషికే వదిలేసాడు భగవానుడు. ఆత్మారాములు, ఆత్మ తృప్తులు, ఆత్మసంతుష్టులు అయిన మహనీయులు వీరు చాలా అరుదుగా ఉంటారు. ప్రతి మనిషి యొక్క జీవిత పరమార్ధం ఆత్మస్థులై ఉండటమేనని ఇహలోకపు కార్యాలను ఆత్మసంతుష్టులై ఉంటూ కొనసాగించాలని ప్రబోధిస్తున్నారు జగద్గురువు. ఆత్మస్థులై ఉండటం ఎలాగో, ఆత్మ సంతుష్టులు ఎవరో మనం రెండవ అధ్యాయంలోనే సుదీర్ఘంగా చర్చించుకున్నాం. ప్రారబ్ధపరంగా కదులుతూ ఉన్నటువంటి దేహం ఆత్మజ్ఞానిని నీడలాగా వెంబడిస్తూ ఉంటుంది. ఆత్మసంతుష్టుడైన ఆత్మ జ్ఞాని చేయవలసిన కార్యం ఏమీ ఉండదు. వీరు కర్మలు చేసినా, చేయకపోయినా వీరిలోని ఆత్మజ్ఞానం కర్తను అదృశ్యం చేస్తుంది కనుక వీరు సదా అకర్తలే. ఈ భావానికి అనుగుణంగా తర్వాతి శ్లోకం ఉంటుంది.

3అ, 18శ్లో.

నైవ తస్య కృతేనార్థో నాకృతేనేహ కశ్చన ।
న చాస్య సర్వభూతేషు కశ్చిదర్థవ్యపాశ్రయః । 18 ।

అట్టి మహాత్ముడు ఈ జగత్తునందు కర్మలు చేయుట వలనను, చేయకుండుట వలనను అతనికి ఎట్టి ప్రయోజనమూ ఉండదు. అతనికి సర్వప్రాణుల తోడను స్వార్థపరమైన సంబంధము ఏ విధముగను ఏమాత్రము ఉండదు.

ముందు శ్లోకంలో చెప్పుకున్నటువంటి ఆత్మజ్ఞానికి ఈ లోకంలో కర్మలు చేయడం వలన చేయకపోవడం వలన తేడా ఉండదు. వీరు సమస్త ప్రాణుల నుండి ఆశించేది కూడా ఏమీ ఉండదు. ఎందుకంటే సమస్త ప్రాణుల నుండి తాను వేరుగా ఉండడు కాబట్టి అతనికి ప్రత్యేకంగా చేయాల్సింది ఏమీ ఉండదు. కర్మ ఉంది అంటే కచ్చితంగా ప్రయోజనం ఉంటుంది. ఫలితం లేకుండా కర్మ ఉండదు. కర్మ లేకుండా ఫలితం ఉండదు. కర్మ జరిగింది అంటే ఫలం ఉండి తీరాలి. అయితే ఇక్కడ మనం ఒక విషయం గమనించాలి. అదేమంటే ఇప్పటివరకు మనం చర్చించిన అంశాల్ని మనం కూలంకషంగా అవగాహనతో గమనిస్తే, స్వీయ పరిశీలన చేస్తే మూడు అంశాలు మనకు స్పష్టంగా తెలుస్తుంది. ఒకటి కర్మఫలం ఆశించి చేసేవారు కర్మి అవుతారు. రెండు కర్మ ఫలాసక్తి లేకుండా చిత్తశుద్ధి కోసం కర్మలు ఆచరించే కర్మయోగులు. మూడు అసలు కర్మలకు అంటక నైష్కర్మ్యస్థితిలో ఉండే మహాత్ములు జ్ఞానులు.

కర్మ యొక్క ఫలం రెండు విధాలుగా మనకు తెలుస్తుంది. ఒకటి బాహ్య ప్రపంచంలో లభించే కర్మలను ఆచరించి కర్మబంధంలో చిక్కుకోవడం. రెండు మనసులో ప్రాప్తించే అంతఃకరణ శుద్ధి కోసం కర్మయోగంతో కర్మను ఆచరించడం. అయితే జ్ఞాని ఈ రెండింటికీ అతీతం. అందుకే వారు సదా ఆత్మ యందే ఆనందాన్ని పొందుతూ ఉంటారు. తత్కారణంగా ఆత్మ జ్ఞానులకు కర్మ ప్రత్యేకించి చేయాల్సిన అవసరం లేదు, వీరు ఎలాంటి ప్రయోజనాన్ని ఆశించరు. వీరికి కర్మ జన్యమైన సుఖం అనిత్యము అని తెలుసు. వీరు నిరంతరం బ్రహ్మానంద రసానుభూతిలో అఖండంగా అలరారుతున్న ఆత్మవిధులు. ఆత్మ అకర్త కదా. కనుక జ్ఞాని కర్మలో కూడా అకర్మనే చూస్తాడు. అలాంటి జ్ఞాని నుండి అనాయాసంగా కర్మలు లోక కళ్యాణార్థం దొర్లుతూ ఉంటాయి. సూర్యుని ప్రకాశం లాగా, చంద్రుని వెన్నెలలాగా ప్రపంచానికి ఆశీస్సులు అవుతాయి, శాంతిని చేకూరుస్తాయి. అంతేగాని కర్మలలో ఆత్మజ్ఞానికి ఏమీ అంటదు. వీరు నిస్సంగులు, వీరికి కర్మలు చేసినా చెయ్యకపోయినా ఎలాంటి దోషం అంటదు. ఉన్నది ఆత్మ ఒక్కటే కదా ఈ జ్ఞానం ఆత్మవిధునిలో సుస్థిరమై ఉంటుంది. ఈ ద్వైత ప్రపంచం అంతా కూడా మాయామాత్రం అనే సంపూర్ణ జ్ఞానం ఉంటుంది. ఈ జగత్తు పట్ల అంటే ఈ జా అంటే పుట్టడం కదా జన్మించడం, గతి అంటే గతించడం అందుకే ఇది జగత్తు. ఈ మూడు అక్షరాలలో ఉన్న పరమార్థం ఇది. ఇలా జన్మించడం గతించడంతో కూడినటువంటి మాయా స్వరూప జగత్తుకు సంబంధించిన జ్ఞానం

జ్ఞానిలో అపారంగా ఉంటుంది. ఇదే ఆ పరమాత్మునికి కర్మ చేసినా చేయకపోయినా తేడా ఉండదు. ఆ పరమాత్మ రతిలో బ్రహ్మ మొదలుకొని బండరాయి వరకు సర్వభూతముల యందు తానే అయి ఉంటారు. మనం కూడా కర్మ యోగా చరణతో అంతఃకరణ శుద్ధిగావించుకొని జ్ఞాన యోగులుగా, ఆత్మ జ్ఞానామృతాన్ని పానం చేస్తూ సాదాతృప్తితో ఉంటున్న ఆత్మ విధులుగా విరాజిల్లుదాం.

3అ, 19శ్లో.

తస్మాదసక్తః సతతం కార్యం కర్మ సమాచర |
అసక్తో హ్యాచరన్ కర్మ పరమాప్నోతి పూరుషః |19|

అందువలన నీవు నిరంతరము ఆసక్తిరహితుడవై కర్తవ్య కర్మలను చక్కగా ఆచరింపుము. ఏలనన ఆసక్తిని వీడి కర్మలను సదా ఆచరించు మనుష్యునకు పరమాత్మ ప్రాప్తి కలుగును.

దీన్ని బట్టి నాకు ఏది శ్రేయస్కరమో సూచించమన్న అర్జునుడికి యోగంతో కర్మను నిర్వహించాల్సిందేనని ఆదేశిస్తున్నాడు. క్రిందటి శ్లోకంలో భౌతిక ఫలాపేక్షతో భౌతిక సంపదల కోసం కర్మ చేసేవారికి చిత్తశుద్ధి కోసం చేసే కర్మయోగులకు గల తేడా స్పష్టంగా వివరించి సాంఖ్య యోగుల లేదా ఆత్మ జ్ఞానుల వైభవాన్ని స్పష్టంగా తెలియజేశారు. కర్మయోగాచరణ గావించాల్సిన వాడవు నీవు అందువల్ల కర్మ ఫలాసంగం లేనివాడై నీ నియమిత కర్మను ఆచరించు అని తన కర్తవ్యం నిర్ధారించాడు. మనం చేస్తున్న ప్రతి పని మీద ప్రతి ఆలోచన మీద స్పష్టమైన అవగాహన ఉండాలి. సందేహాలు అనిపించినప్పుడు సద్గురువుల దగ్గర లేదా స్వయం పరిశీలన ద్వారా నివృత్తి చేసుకుంటూ బ్రహ్మవిద్యను అధ్యయనం చేస్తూ ముందుకు వెళ్లాలి. ఈ శరీరాది ఉపాధుల వలన జీవేశ్వరులలో భేదం అనిపిస్తుంది మనకు అయినా ఇద్దరూ సస్వరూపులే కదా ఒకే వస్తువై ఉన్నారు. ఈ విషయం ఇదే అధ్యాయం 15వ శ్లోకంలో అన్ని ప్రాణులలో ఉన్న బ్రహ్మం ఒక్కటే అని నిరూపించుకున్నాం కూడా. ఈ ఉపాధులకు అతీతంగా ఆలోచిస్తే అంటే ఈ దేహాలకు అతీతంగా ఆలోచిస్తే జీవుడు ఈశ్వర తత్వాన్ని దర్శిస్తాడు. ఇదే ఆత్మ సాక్షాత్కారం. ఇతడే మనం చెప్పుకున్న ఆత్మజ్ఞాని. ఈ మహాసముద్రం స్థితిలో స్థిరం కావడానికి కర్మయోగాచరణ. ఇదే ఈ శ్లోకంలో జగద్గురువు మనకు ప్రభోధిస్తున్నది. అలాంటి సాక్షాత్కారం పొందిన జ్ఞాని నిత్యతృప్తుడు, నిరాశ్రయుడు, నిత్యానంద స్వరూపుడు. తన ఆనందానికి తానే కారణమైన వాడు. వీరు పొందాల్సిన ప్రయోజనం ప్రత్యేకంగా ఏదీ లేనందున వీరు ఆశించి చేయదగిన పని కూడా ఏమీ ఉండదు. అయితే ఈ ఆత్మ జ్ఞాని గురించి విని నేను ఆ జ్ఞానమార్గాన్ని అనుసరించి కర్మలు విడిచి పెడతాను, కర్మలు చేసి సాధించేది ఏమీ లేదు కనుక జ్ఞాననిష్ఠుడు కర్మలు త్యజించినట్లు నేనూ త్యజిస్తాను అంటే వాడు

మూఢుడు అవుతాడు, అంతేకానీ జ్ఞాని కాలేడు. జ్ఞాని కర్మలను ఆచరించవచ్చు, విరమించవచ్చు. వీరు జగద్గురువు చేతిలో పరికరం. జగద్గురువు ఆదేశాల మేరకే వీరి అడుగులు, నడక, ప్రయాణం కొనసాగుతుంది. కాబట్టి ఆ స్థితిని పొందాలంటే ఖచ్చితంగా కర్మయోగాచరణ తప్పదు. అలా కాక విడిచి పెడితే అలాంటివారు కర్మలను విడిచినవారు అవుతారు, అంతేగాని బంధాలను విడిచినవారు కాలేరు. కాబట్టి భగవద్గీతలో జగద్గురువు ప్రబోధిస్తున్న ప్రతి సూత్రాన్ని అవగాహన చేసుకుని ఆచరించాలి. అంతేకాని జ్ఞాని కర్మలు చేయడం లేదని జ్ఞాని కాని వారు కర్మలను మానేస్తే ఎటువంటి పురోగతి ఉండదు. కాబట్టి కర్తవ్య కర్మలు చేయాల్సిందే. జ్ఞానోదయం జరగకుండా జ్ఞాన దీపాన్ని వెలిగించుకునే ప్రక్రియను ప్రయత్నాన్ని విరమించుకోవడం అవివేకం. అందువల్ల ఎందువల్ల నీవు జ్ఞానివి కానందున కర్మను ఆచరించి తీరాలి, నీకు యుద్ధం అనివార్యం నాయనా అని ప్రబోధిస్తున్నాడు. కర్మ జడం అని బంధాన్ని సృష్టించదని కర్మలలో ఆసక్తే బంధాన్ని సృష్టిస్తుందని మనం ముందే తెలుసుకున్నాం. అందుకే చేయాల్సిన కర్మను చక్కగా రాగద్వేషాలతో సంబంధం లేకుండా ఈశ్వరార్పణ బుద్ధితో ఆచరించు. అప్పుడు మోక్షాన్ని పొందుతావు. నాయనా నీవు మాత్రం అంతటా నిండి ఉన్న జలాశయం వంటి 2-46 శ్లోకంలో చెప్పుకున్నట్లు సంయగ్ దర్శనం అనే ఆత్మ జ్ఞాని స్థితికి చేరుకోలేదు. అందువల్ల నీవు చేయాల్సిన కర్మలను ఆసక్తి లేకుండా సదా నిర్వహిస్తూ ఉండు. తద్వారా మోక్షం పొందుతావు. మనం కూడా కర్మయోగంతో ధర్మ జీవనాన్ని కొనసాగించి చిత్తశుద్ధితో ఆత్మజ్ఞానాన్ని సిద్ధింప చేసుకుందాం.

3అ, 20శ్లో.

కర్మణైవ హి సంసిద్ధిమ్ ఆస్థితా జనకాదయః |
లోకసంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి ||

జనకుడు మొదలైన వారు కర్మ చేతనే సిద్ధిని పొందారు కదా నీవు కూడా లోకహితాన్ని దృష్టిలో ఉంచుకొని జనులను సన్మార్గంలో నడిపించడానికైనా నీవు కర్మను ఆచరించడమే సముచితం అని ప్రబోధిస్తున్నాడు జగద్గురువు. మనకు కర్మల విషయంలో చక్కగా అవగాహన ఉండాలి.

జ్ఞాననిష్టకు అర్హులు కాని వారు కర్మలను సన్యసించి సాధించేది ఏమీ ఉండదు. అలా అని కర్మల్లో కూరుకుపోయినా ప్రయోజనం ఏమీ ఉండదు. అందుకే జగద్గురువు కర్మల ద్వారా శుద్ధిపడే కర్మ యోగంలో లీనం కావడమే శ్రేయోమార్గం అని సూచించాడు. క్షత్రియుడైన అర్జునుడు చేయాల్సిన కర్మ నిరీక్షిస్తూ ఉంది. దాన్ని చేయాల్సిన బాధ్యత అర్జునుడిదే. అందుకే జగద్గురువు తన క్షాత్ర ధర్మాన్ని కర్మయోగంతో నిర్వర్తించమని ప్రబోధిస్తున్నాడు. క్రిందటి శ్లోకంలో

కర్మయోగాన్ని ఆచరించమని ఉద్బోధించిన జగద్గురువు ఈ శ్లోకంలో అలా కర్మ యోగాన్ని ఆచరించి తరించిన ఆదర్శ మూర్తులను ఉదహరిస్తున్నాడు. అందులో భాగంగా జనక మహారాజు మొదలైన వారు అని చెప్పి వీరిని మార్గదర్శకంగా తీసుకొని వారి అడుగుజాడల్లో నడవాలని సూచిస్తున్నాడు. జనకాదులు అని చెప్పడం వల్ల ఆ జనకమహారాజునే కాకుండా ఇంకా అలాంటి మరికొందరిని కూడా ఉదహరించుకోవాలి అని మనం అర్థం చేసుకోవాలి. అశ్వపతి, భగీరథుడు, ప్రహ్లాదుడు, అంబరీషుడు, ఇక్ష్వాకుడు మొదలైన వారిని మనం ఆదర్శంగా తీసుకోవచ్చు. వీరందరూ కూడా తమ తమ స్వధర్మాన్ని కర్తవ్య కర్మలను విస్మరించలేదు కదా. అలాగని కర్మల్లో కూరుకుపోలేదు కదా. యోగ భావంతో కర్తవ్యకర్మలను ఈశ్వరార్పణ బుద్ధితో నిర్వహించి చిత్తశుద్ధితో బంధ విముక్తులయ్యారు కదా. ఇలా మనం ఈ శ్లోకాన్ని చూస్తే మొదటి పాదం లోని అంశాన్ని మనం రెండు కోణాల్లో దర్శించవచ్చు. ఒకటి జనకుడు మొదలైన వారు కర్మయోగాచరణ ద్వారా సిద్ధిని పొందారా, రెండు లేదా సిద్ధిని పొంది, ఆత్మ జ్ఞానంతో జగద్గురువు చేతులో పరికరంగా కర్మ యోగాచరణ గావించారా, ఈ రెండు అంశాల పైన మనకు స్పష్టత ఉండాలి. క్షత్రియ ఉపాధితో క్షాత్ర ధర్మాన్ని నిస్సంగులై కర్మాచరణ గావించారు. వీరు జగద్గురువు చేతిలో పరికరం లాంటివారు. అందుకే వీరు ఎక్కడ కూడా తమ తమ కర్తవ్య నిర్వహణలో సందేహం లేకుండా జగద్గురువు ఆదేశాల మేరకు తమ తమ ధర్మాన్ని నిర్వర్తిస్తూ ముందుకెళ్లిన రాజులు వీరంతా. ఆత్మజ్ఞానాన్ని సిద్ధింప చేసుకున్న వారు జగద్గురువు చేతిలో పరికరంగా ఉంటూ లోక కళ్యాణర్థం కార్యక్రమాలను, కర్తవ్య కర్మలను నిర్వర్తిస్తూ ఉంటారని మనకు తెలియాలి. కానీ అర్జునుడు కర్మయోగాచరణ గావించి ఆత్మ జ్ఞానాన్ని సిద్ధింప చేసుకోవడానికే జన్మ తీసుకున్నాడు. అది అతని ధార్మిక బాధ్యత. ఈ స్థితిని దాటాక మళ్ళీ అవసరమైతే లోక కళ్యాణార్థం అవసరమైనప్పుడు వీరు దేహధారులవుతారు. అప్పుడు నిస్సందేహంగా జగద్గురువు ఆదేశాలను అందుకొని కర్తవ్యకర్మలను నిర్వహిస్తూ ఉంటారు. అక్కడ సందేహాలకు తావు ఉండదు. ఈ సున్నితమైన అంశం మనకు అవగాహన కావాలి. జనాకాదులకు అర్జునుడికి ఉన్న తేడాను మనం గమనించాలి. ఇందుకు ఉదాహరణగా మనం శ్రీకృష్ణ పరమాత్మనే చెప్పుకోవచ్చు. రథాన్ని నడుపుతున్నది కర్మ కదా అది అతని కర్తవ్యం. అందుకే అతను తన ఉద్యోగాన్ని తన కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నాడు. ఆత్మ జ్ఞాని కర్మలు చేయొచ్చు, చేయకపోవచ్చు రెండింటి పట్ల వారికి సంబంధం లేదు. అవి అలా దొర్లుతూ ఉంటాయి లోకళ్యాణార్థం అని మనం 17,18 శ్లోకాలలో చర్చించుకున్నాం, ఆ దృష్టితో ఈ శ్లోకాన్ని మనం పరిశీలించాలి. మొదటి పాదాన్ని 17, 18 శ్లోకాలను దృష్టిలో ఉంచుకొని పరిశీలిస్తే ఈ రెండు కోణాల్లోనూ మనము దర్శించి సమన్వయం చేసుకోవడానికి సరిపోతుంది. కర్మయోగి ఆత్మ జ్ఞాని అవ్వచ్చు, కాకపోవచ్చు కానీ ఆత్మజ్ఞాని చేసే ప్రతీది కచ్చితంగా యోగంతో కూడిన కర్మయే అయి ఉంటుందని గ్రహించాలి. జ్ఞానికి విధి నిషేధాలు ఉండవు. అతను కర్మ చేయొచ్చు, చేయకపోవచ్చు. కాబట్టి జ్ఞానులైన జనకాదులే లోకసంగ్రహార్థం, లోకకళ్యాణార్థం సమాజాన్ని సన్మార్గంలో నడిపించాలని కర్మలని ఆచరించినప్పుడు నీవు జ్ఞానివి కాకనే కర్మలని త్యజించాలని అనుకోవడం కుదరదు నాయనా అని స్పష్టంగా ప్రబోధిస్తున్నాడు. ఇక్కడ లోక

కళ్యాణం అంటే దారి తప్పుతున్నటువంటి సమాజాన్ని దారిలో పెట్టడం కోసం చేసే పని అని గ్రహించాలి. యుద్ధం కావాలని నీవు కోరుకున్నావా లేదు కదా, అయినా పరిస్థితి సంభవించింది. ఒకవేళ నువ్వు ఆత్మజ్ఞానివే అని నువ్వు అనుకున్నా కూడా లోక కళ్యాణార్థం ఈ బాధ్యతను నువ్వు నిర్వర్తించాల్సిందే కదా అని ఎంత వివరంగా మనకు ఉద్బోధిస్తున్నాడు జగద్గురువు. ఎందుకంటే సర్వ ధర్మాలు రాజుని ఆశ్రయించుకుని ఉంటాయి. రాజధర్మం అంటే లోకధర్మం. కాబట్టి లోక ధర్మాన్ని లోకం లోని మనం కచ్చితంగా పాటించాలి. ఆత్మజ్ఞానిలో అయినా ఉచ్వాస, నిశ్వాస లు అనే కర్మ జరుగుతూనే ఉంటుంది కదా. అది దేహధర్మం. కాబట్టి ఎటొచ్చినా కర్తవ్య కర్మలు అనివార్యం. జనక మహారాజు అపారమైన జ్ఞాన సంపన్నుడు అనేకమంది బ్రాహ్మణులు ఇతని దగ్గర వచ్చి ధర్మ విచారణ చేసి బ్రహ్మవిద్యను అభ్యసించి జ్ఞానోదయం పొందారు. కాబట్టి జ్ఞానం పొందడానికి బ్రహ్మవిద్యను అభ్యసించడానికి ఎలాంటి కుల మత లింగ వర్ణ వయోభేదాలతో సంబంధం లేదని ఈ సందర్భంగా మనం తెలుసుకోవాలి. బ్రహ్మవిద్యను అభ్యసించాలంటే ఆ విద్య ఎవరిలో ఉందో ఆ ఆత్మ సౌందర్యం ఎవరిలో తొణికిసలాడుతూ ఉందో వారిని గుర్తించి అన్నింటికీ అతీతమై బ్రహ్మ విద్యను అభ్యసించి జ్ఞానోదయం పొందాలి. ఆత్మజ్ఞాన సంపన్నులు చాలా బాధ్యతాయుతంగా తమ తమ దైవ నిర్దేశిత కార్యాలను దైవదృష్టితో యోగంతో నిర్వహిస్తారు. లోక కళ్యాణార్థం జనకుడు, అశ్వపతి, అంబరీషుడు మొదలైన రాజులు ఎలా తమ తమ కర్తవ్యాలను దక్షతతో నిర్వహించారో నీవు కూడా అలాగే కర్తవ్య కర్మలు నిర్వర్తించాల్సిందేనని రాజ్యపాలన గావించిన రాజులను ఉదాహరణగా చూపిస్తూ స్వధర్మాన్ని నిర్వహింపమని ఆదేశిస్తున్నాడు జగద్గురువు.

3అ, 21శ్లో.

యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః |
స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే ||

శ్రేష్టులు, గొప్పవారు ఏ కర్మను చేస్తారో దాన్నే లోకం లోకంలోని జనులు ప్రమాణంగా తీసుకొని ఆ ప్రమాణాలను అనుసరిస్తారు, ఆచరిస్తారు అంటున్నారు జగద్గురువు.

ఈ శ్లోకంలో జగద్గురువు ఆచరణ అనే మాటకు ప్రాధాన్యం ఇచ్చాడు. నిజ జీవితంలో మనం చదువుకున్న అంశాల్ని లేదా మన నియమిత కర్మలను విని లేదా చదువుకొని వదిలిపెట్టకుండా కర్మలను ఆచరణలో పెట్టాలి. ఆచరణ అనుష్టానం లేనటువంటి పూజ అయినా, జపమైనా, పారాయణం అయినా, చదువు అయినా బోధించడం అయినా ఏదైనా సరే ఏ ప్రక్రియ చేసినా సరే ప్రయోజనం సూన్యం కదా. జీవితంలో ఒక పదంలో ఉన్న సారమైనా సరే గ్రహించి అవగాహనతో ఆచరిస్తే అదే చాలు. వేమన పుస్తకాలు చదివితే సరిపోదు హృదయం అనే పుస్తకాన్ని విప్పి

చదువుకోవాలి. మనసును పరిశుద్ధంగా ఉంచుకుంటేనే ఆ పరిశుద్ధతే పరమాత్మ దగ్గరకు చేర్చుతుంది. కర్మయోగం ద్వారా పొందే అంతఃకరణ శుద్ధి అని అర్థం చేసుకోవాలి. అంతేకాదు వేషధారణ మార్చినంత మాత్రాన కాషాయ వస్త్రాలు ధరించినంత మాత్రాన ముక్తి కలుగదు కదా. మనసును శూన్యం చేయాలి, పరిశుద్ధం చేయాలి అప్పుడే అసలైన సన్యాసి అన్నారు. మనం సన్యాసం అనే మాటకు మనలోని అరిషడ్ వర్గాలను సన్యసించడం అని తెలుసుకున్నాం. కాబట్టి వస్త్రధారణతో మతాలతో సంబంధం లేకుండా మనసును పరమాత్మ పైన దృష్టిని నిలపగలిగిన వారికే మోక్షమని వేమన చాలా స్పష్టంగా చెప్పారు. జగద్గురువు మనం ఉత్తముల దగ్గర నుంచి మార్గదర్శకుల నుంచి గ్రహించిన అంశాన్ని మనం విని చదివి వదిలిపేయకుండా ఆచరించి చూపాలి. అందుకే జగద్గురువు ప్రత్యేకంగా ఆచరణ అనే అంశంపై ఈ శ్లోకాన్ని నిర్మించాడు. చెట్టుకు రెమ్మలు, పువ్వులు కాయలు పండ్లు ఎన్ని ఉన్నా ఇవన్నీ నిలబడటానికి ప్రధానం కాండం, ఈ కాండం నిలబడటానికి ప్రధాన కారణం వేర్లు, వేర్లు నిలబడటానికి ప్రధాన కారణం భూమి, వీటన్నింటి ఆధారంగా చెట్టు జీవిస్తుంది. అలా ఇంట్లో పెద్దవారు లేదా రాజ్యంలో పెద్దవారు ప్రధానమైన వారు. వీరు మార్గంలోనే సభ్యులు ప్రవర్తిస్తూ ఉంటారు. శ్రేష్ఠులు అంటే ప్రధానమైన వారు అని అర్థం. శ్రేష్ఠులు మార్గదర్శకులు, వీరి మార్గంలో నడవాలని ఇతరులు అభిలషిస్తారు. శ్రేష్టులైన వారి ప్రవర్తనను ఇతరులు అనుసరిస్తారు. అందువల్ల శ్రేష్టులు సమాజానికి మార్గదర్శకులుగా ఉండాలి. వీరి ప్రవర్తన సమాజం మీద తీవ్రమైనటువంటి ప్రభావాన్ని చూపుతుంది. శ్రేష్టులు దారి తప్పితే సమాజం దారి తప్పిపోయే ప్రమాదం ఉంది. అందుకే శ్రేష్టుడైనటువంటి అర్జునుడు క్షాత్ర ధర్మం కలిగి ఉన్న క్షాత్ర ధార్మిక దేహధారి ఆయిన అర్జునుని సమాజానికి మార్గదర్శకంగానూ ఉత్తముడిగాను ఉండి శ్రేష్టత్వాన్ని నిలపమని జగద్గురువు ఉద్బోధిస్తున్నాడు. శ్రేష్టులైన వారి ప్రవర్తనే ఇతరులు అనుసరిస్తారు కదా. అతడు నిలిపిన ప్రమాణాలనే లోకులు అందరూ పాటిస్తారు. కాబట్టి కర్మయోగిగా చూసినా ఆత్మ జ్ఞానిగా చూసినా క్షత్రియుడుగా చూసినా ఎటొచ్చి అర్జునునికి కార్యం తప్పదు, కర్తవ్య నిర్వహణ అనివార్యం. ఈ శ్లోకం సమాజంలోని నైతిక ధార్మిక ఆధ్యాత్మిక స్పృహకు సంబంధించినటువంటి అంశం. సామాజిక స్థిరత్వం అనేది ఈ అంశాలపైనే ఆధారపడి ఉంటుంది. ఈ అంశం శ్రేష్టతపై ఆధారపడి ఉంటుంది. శ్రేష్టత శ్రేష్టులపై ఆధారపడి ఉంటుంది. అందుకే జగద్గురువు 3-20వ శ్లోకంలో జనకుడు మొదలైనటువంటి మహారాజులను ఉదహరించాడు. అలాంటి శ్రేష్ఠుల మార్గదర్శకాలను మనం ఆచరించాలి. అదే ప్రమాణం అవుతుంది, ప్రామాణికమైనది అవుతుంది. ప్రామాణికమైనది అంటే శ్రేష్టతతో కూడుకున్నది, జ్ఞానంతో కూడుకున్నది అని అర్థం. శ్రేష్టులు రాజ్యపాలన చేసిన కాలంలోనూ సందర్భాల్లోనూ ధర్మం నాలుగు పాదాలతో నడిచింది. నాలుగు పాదాలు అంటే ఏమి? ధర్మం సంపూర్ణంగా ఆచరించబడింది. ధర్మాన్ని ఆ కాలంలో అందరూ సంపూర్ణంగా ఆచరించారు అని అర్థం. ప్రజలు కూడా సుఖశాంతులతో వర్ధిల్లేవారు. అప్పుడు ప్రతి మానవ హృదయం సదనమై, ఉద్యానవనమై, ఆధ్యాత్మిక క్షేత్రమై విరాజిల్లింది. అదే హిందూ ధర్మం. హిందూ ధర్మం అనేది మతం కాదు,

హిందూ మతం అనేది ధర్మాచరణ, శ్రేష్టమైనది అని గమనించాలి. శ్రేష్టులు ఆచరించినవే లోకానికి ప్రమాణం కాబట్టి నువ్వు అదే మార్గంలో వెళ్లి నీ ధర్మాన్ని నిర్వర్తించు అని శ్రేష్టతను గురించి ప్రబోధిస్తున్న జగద్గురువుకు ప్రణమిల్లుదాం.

3అ, 22శ్లో.

న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన |
నానవాప్తమవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి | 2 |

అర్జునా ఈ ముల్లోకాల యందు నాకు కర్తవ్యం అనేది ఏదీ లేదు. అలాగే పొందదగిన వస్తువులలో నేను పొందనిది ఏదీ లేదు. అయినా నేను కర్మలయందే ప్రవర్తిల్లుతున్నాను కదా.

కర్మ అనేది వేదరూప బ్రహ్మం నుండి పుట్టింది, అని 15వ శ్లోకంలో తెలిపిన జగద్గురువు ధర్మబద్ధమైన కర్మ చక్రంలో నిత్యం ప్రవర్తిల్లాల్సిన విధానాన్ని ఈ శ్లోకంలో బోధిస్తున్నాడు. అది ఎలా లోకానికి ప్రామాణికంగాను, శ్రేష్టంగాను ఉండేటట్లు మనం నియమిత కర్మలలో ప్రవర్తిల్లాలి. లోకసంగ్రహార్థం లోక కళ్యాణం కోసం చేయాల్సిన పని నాకేం ఉంటుంది అని నువ్వు అనుకోవచ్చు. అలా అయితే నన్ను చూడు ఈ మూడు లోకాల్లో కూడా నాకంటూ కర్తవ్యం ఏమీ లేదు. నేను పొందనిది గాని పొందాల్సింది గాని ఏదీ లేదు. అయినా నేను కూడా కర్మలను ఆచరిస్తూనే ఉన్నాను కదా. జగద్గురువు తనను తానే ఉదాహరణగాను, ఆదర్శంగానూ చూపుతున్నాడు. నన్ను చూడు క్షణం తీరిక లేకుండా పని చేస్తూనే ఉన్నాను కదా అలాగే నువ్వు కూడా చెయ్యి. సాధారణంగా ఎవరు ఏ పని చేసినా లేని దాన్ని పొందడానికి, ఉన్న దాన్ని వదిలించుకోవడానికి చేస్తారు. కానీ భగవంతుడు అలా కాదు ఆయనకు ఏ కర్తవ్యమూ లేదు, ఎక్కడా పని లేదు, ఎప్పుడూ పని లేదు. అంతేకాదు ముల్లోకాలలోనూ నాకు పని లేదు. ఇక్కడ ముల్లోకాలు అంటే మూడు గుణాలు. మూడు గుణాలు మూడు లోకాలుగా భావించి నేను ముల్లోకాల లాంటి మూడు గుణాలలోనూ పొందాల్సింది లేదు, పొందినది లేదు. అంటే నేను గుణాలతో కూడి ఉండలేదు. గుణాలకు లోబడలేదు. ఇక్కడ జగద్గురువు చెప్తున్న ముల్లోకాలు, మూడు గుణాలు. చెప్పడం వేరు, చేయడం వేరు అని లోకులు అనుకుంటారని వారి కోసం భగవానుడు నీకు నేనే ఆదర్శం, నన్ను చూసి నేర్చుకో, నేను చూడు నిరంతరం ఎన్ని కార్యాలు చేస్తున్నాను అంటూ క్షణం కూడా తీరిక లేకుండా చేస్తున్నటువంటి తన యొక్క కార్యాల సమగ్ర స్వరూపాన్ని ఒక్కమాటలో దర్శింపజేస్తున్నాడు. సాక్షాత్తు భగవానుడైన దేహదారి అయినప్పుడు కర్మలలో ప్రవర్తిల్లడం తప్పదు. కాబట్టి సాధారణ స్థాయి మానవులు ఆచరించకపోతే ఎలా అనే ప్రశ్నను స్ఫూర్తిని మనలో నింపడం ఈ శ్లోకం ఉద్దేశం. అదే జగద్గురువు చెప్తున్నటువంటి ముల్లోకాల లాంటి మూడు గుణాలలోనూ కూడా నాకు కర్తవ్యం లేదు. వాటిలో నేను పొందినది గాని, పొందాల్సింది గాని

ఏమీ లేదు. అయినా నేను కర్మలని ఆచరిస్తూనే ఉన్నాను. మనం కూడా త్రిగుణాలలో ప్రవర్తిల్లుతున్న ఆయా గుణాలలో కూరుకు పోకుండా కర్తవ్యం ఆచరించి గుణాతీతులు అవుదాం.

3అ, 23శ్లో.

యది హ్యహం న వర్తేయం జాతు కర్మణ్యతంద్రితః |
మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః । 23 |

నాయనా నేను చాలా అప్రమత్తుడనై కర్మల్ని ఆచరిస్తూ ఉంటాను. నేను సావధాన చిత్తుడనై కర్మలలో ప్రవర్తిల్లకపోతే లోకానికి గొప్ప హాని సంభవిస్తుంది. ఎందుకంటే మనుష్యులందరూ అన్ని విధాలా నా మార్గాన్నే అనుసరిస్తారు కాబట్టి అంటున్నాడు జగద్గురువు.

మూడు గుణాలలో సంచరిస్తున్న గుణాతీతులై కర్తవ్య కర్మల్ని అనుసరించాలని చెప్పిన జగద్గురువు ఈ శ్లోకంలో తాను ఎలా కర్తవ్య కర్మలని అప్రమత్తంగా ఉండి ఆచరిస్తున్నాడో మనకు దర్శింపజేస్తున్నాడు. అలాగే నేను అలా చేయకపోతే లోకానికి ప్రమాదం సంభవిస్తుందని హెచ్చరిస్తున్నాడు. అంటే సామాన్యులు శ్రేష్టులైన వారిని అనుసరిస్తారనే న్యాయాన్ని బట్టి శ్రేష్ఠులు సామాన్యులకు మార్గదర్శకులుగా ఉండాలని ప్రబోధిస్తున్నారు. భగవానుడే స్వయంగా అవతరించి శ్రేష్టత్వానికి పరిపూర్ణతనిచ్చి లోకంలోని జనులు ఎలా నియమిత కర్తవ్య కర్మలను ఆచరించాలో చేసి చూపుతున్నాడు. ఇక్కడ అప్రమత్తుడై అన్నాడు అంటే ఏమాత్రం సోమరితనం, అలసత్వం లేకుండా సదా అప్రమత్తులై అంటే ఎరుకతో ఉండి స్వధర్మాచరణ గావించాలని అర్థం చేసుకోవాలి. అంటే పొరపాటున కూడా గుణాలలో కూరుకుపోకూడదు. నాకు మూడు లోకాల లాంటి మూడు రకాల సత్వ,ర జో,తమో గుణాలతో పని లేదు వాటి నుండి నేను పొందాల్సింది గాని ఏమీ లేదు. ఎందుకంటే అవి జడమే కాబట్టి అయితే భగవంతుడు చైతన్యమూర్తి ఈ చైతన్యం వల్లనే వాటికి కదలిక అంతేగాని అవి మనల్ని కదిలించి ఇబ్బంది పెట్టకూడదు కదా. వాటికి మనం లోబడటం ఏంటి అనేది జగద్గురువు సూచన. ఈ మూడు గుణాలతో ఏకమైపోయి దారి తప్పితే ప్రమాదమని అలా దారి తప్పకుండా ఉండటానికి అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నాడు. అలా ఎరుకతో లేకపోతే ఆ మూడు గుణాలు మనల్ని దారి తప్పిస్తాయి. ఆ కారణంగా మనం ఇంద్రియాలకు, గుణాలకు అతీతమై అప్రమత్తంతో నిత్యం కర్మల యందు ప్రవర్తిల్లాలి. క్షణమైనా ఏమరుపాటు పనికిరాదు. ఈ అలసత్వం, సోమరితనం, అజాగ్రత్త లాంటి అప్రమత్తత లేని స్థితిని చావు కంటే హీనమైనది. కాబట్టి ఆధ్యాత్మిక మార్గంలో బ్రహ్మవిద్య అధ్యయనం చేస్తున్న సాధకులైన మనం గుణాలతో కూరుకుపోయి ప్రమాదంలో పడకూడదని ఈ శ్లోకం మనకు హెచ్చరిస్తుంది. ఎందుకంటే అలసత్వం అజాగ్రత్తగా ఉన్నవారు ఇక

ఆచరించేదేముంటుంది అనేది ఈ శ్లోకంలో జగద్గురువు ఇస్తున్న సూచన. ఈ సూచన దృష్టిలో ఉంచుకొని ఈ శ్లోకాన్ని మనం స్వీయ పరిశీలన ద్వారా అవగాహన చేసుకుందాం. ఎప్పుడు గాని నేను అలసిపోవడం అనేది లేకుండా కర్మలు ఆచరిస్తూ ఉండకపోతే శ్రేష్టుడనైన నామార్గాన్నే సామాన్య జనులు అనుసరిస్తారు అంటున్న జగద్గురువుకు ప్రణమిల్లుదాం.

3అ, 24శ్లో.

ఉత్సీదేయురిమే లోకా న కుర్యాం కర్మ చేదహమ్ ।
సంకరస్య చ కర్తా స్యామ్ ఉపహన్యామిమా: ప్రజా: ।।

నేను కర్మలను ఆచరించుట మానినచో ఈ లోకములన్నియును నశించును. అంతేగాదు. లోకములందు అల్లకల్లోలములు (సాంకర్యములు) చెలరేగును. ప్రజానష్టము వాటిల్లును. అప్పుడు అందులకు నేనే కారకుడనయ్యెదను.

3-20వ శ్లోకంలో శ్రేష్టుల్ని పరిచయం చేసి 3-21వ శ్లోకం లో అలాంటి శ్రేష్ఠులని మార్గదర్శకంగా తీసుకొని వారి అడుగుజాడల్లో నడవాలని తెలుసుకున్నాం. 3-22లో నన్ను చూడు ముల్లోకాల లాంటి మూడు గుణాలతో సంబంధం లేకపోయినా వాటిలో ప్రవర్తిల్లుతూ కర్తవ్యకర్మలను ఆచరిస్తున్నానని తనను ఆదర్శంగా చూపాడు. 3-23 లో నేను అప్రమత్తంగా ఉంటూ కర్తవ్యకర్మల్ని ఆచరిస్తున్నానని చెప్పాడు. ఇక్కడ నాలోని నేను అని అర్థం అంటే శరీరం అనే నేను కాకుండా నాలో ఉన్న నేను అనే స్పృహతో నాలో నేను అనే భావనతో కూడిన అప్రమత్తత అని మనకు తెలియాలి. ఆ అప్రమత్తత లేకపోతే అందరూ కూడా దారి తప్పి పోతారు అని స్పష్టంగా చెప్పాడు. ఈ అప్రమత్తత లేకపోతే ఏమవుతుందో ప్రస్తుత శ్లోకంలో తెలియజేశారు. ఈ అప్రమత్తతను మనం రెండు కోణాల్లో దర్శించాలి. ప్రతి అంశానికి రెండు పార్శ్వాలు ఉంటాయి. ఇప్పుడు శరీరం అనే నేను, నాలోని నేను అలాగే ప్రకృతిలో కనిపిస్తున్న శక్తి, కనిపించని ప్రకృతి అతీత శక్తి. ఈ రెండు పార్శ్వాలతో మనం అప్రమత్తత అనే అంశాన్ని ఆత్మ పరిశీలన గావిస్తే ఒకటి నాలోని నేను అనే అప్రమత్తత లేకుండా నేను ఈ శరీరం మాత్రమే అని భ్రమించి ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తే 3-7 వ శ్లోకంలో చెప్పుకున్న 25 మహా తత్వాలలోని ఆకాశ పంచకం లోని మొదటిది జ్ఞాత మినహా మిగతా 24 తత్వాలకు సంబంధించిన అంతరింద్రియాలు, ప్రాణేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, విషయేంద్రియాలు, కర్మేంద్రియాలు ఇవి అన్నీ కూడా తమ తమ స్థానాల నుండి దారి తప్పి మనసు నిలకడలేక బుద్ధి స్థిరత్వం లేక ఏ ఒక్క ఇంద్రియము మన మాట వినక మనిషి వినాశనానికి కారణమవుతాడు. తద్వారా లోక వినాశనానికి తనే కారకుడు అవుతాడు. ఎలా అంటే నీటిపై వెళ్తున్న

నావను ప్రతికూల వాయువు దారి మళ్లించినట్లుగా 2-67 శ్లోకం గుర్తు చేసుకుంటే అలా అవుతారు. తద్వారా దారి తప్పి అలజడి ఆందోళనకు గురై స్వస్తిని కోల్పోయి అశాంతి పాలవుతారు. ఆ కారణంగా వ్యక్తి, కుటుంబం సమాజం లోకం వినాశనానికి మనమే కారకులవుతాం ఇది ఒక పార్శ్వం. రెండు నాలోని నేను అనే అప్రమత్తతను మనం కోల్పోతే 3-8వ శ్లోకంలో జగద్గురువు చెప్పినటువంటి దేహయాత్ర కూడా కొనసాగదు. ఈ రెండూ సంభవిస్తే జీవితం, జన్మ రెండూ వృధా కదా ఇలా మనం పరిశీలించాలి. ఇందులో జ్ఞాతను మినహాయించాం అని చెప్పాం, ఎందుకు ఆ తత్వాన్ని మినహాయించాలి మనం ఇప్పటిదాకా చెప్పుకున్న ప్రశ్నకు కారణం అప్రమత్తత, ఆ అప్రమత్తతే ఎరుక, ఆ ఎరుకే ఈ జ్ఞాత. ఈ జ్ఞాతే మిగిలిన 24 తత్వాలకు ప్రభువు. ఈ జ్ఞాతతో కూడి ఉండటమే 23లో జగద్గురువు చెబుతున్నటువంటి అప్రమత్తపు స్థితి. ఈ స్థితిలో లేకపోతే ఏమవుతుందో ప్రస్తుత శ్లోకంలో చెప్తున్నాడు. ముందు శ్లోకంలో అప్రమత్తంగా లేకపోతే అలసత్వం, సోమరితనంగా ఉంటే అది చావు కన్నా హీనమైంది అని చెప్పాడు. ఈ శ్లోకంలో అప్రమత్తంగా లేకపోతే శ్రేష్టమార్గంలో నడిచి శ్రేష్టత్వాన్ని నిలుపుకోకపోతే శ్రేష్టుల మార్గాన్ని అనుసరించకపోతే వాటిల్లే నష్టం, దోషం ఎలా ఉంటుందో ఈ శ్లోకంలో వివరిస్తున్నాడు. నాయనా అకర్మ కారణంగా లోకాలు నశిస్తాయి లోకులు కూడా నశించిపోతారు కాబట్టి జగత్తు యొక్క స్థితికి కర్మ అత్యంత అవశ్యమై ఉంది. అలాంటి కర్మ విషయంలో ఉపేక్షిస్తే నేను చేయకపోతే లోక వినాశనానికి కారణం అవుతాను. అప్రమత్తంగా లేకపోతే జీవితం జన్మ వృధా చేసుకుంటావు నాయనా అని చెప్పి నన్ను చూడు అప్రమత్తుడనై కర్మలని ఆచరిస్తూ ఉంటాను. నేను అప్రమత్తంగా లేకపోతే ప్రజల్ని పాడుచేసిన వాడిని అవుతాను అని తనను తాను ఉదాహరణగా చూపుతున్నాడు. 24 ఇంద్రియాలు మన జ్ఞాత అదుపులో లేకపోతే అంటే అప్రమత్తతతో లేకపోతే మనం అయోమయంలో పడతాం. కాబట్టి మనం మనలో ఉన్న మనం ఈ దేహం మాత్రమే కాదు ఈ దేహంలో ఉన్న దేహి కూడా అనే అప్రమత్తత లేకపోతే ప్రమాదంలో చిక్కుకుంటాం అని జగద్గురువు చెప్పడంలోని ఆంతర్యం ఇదే. అందుకే జగద్గురువు 23వ శ్లోకంలో అప్రమత్తులై ఉండాలి అని చెప్పడంలోని ఆంతర్యం. ఇలా మనం లోతులలోకి వెళ్లి అర్థం చేసుకోవాలి. ఇదే మనం ఈ అధ్యాయం ప్రారంభంలోనే చెప్పుకున్న విధానం. విద్యార్థులే ఎక్కువ శ్రమ చేయాల్సి ఉంటుంది అని. అలా పలక బలపం పట్టి అంతరంగంలో ఆధ్యాత్మిక ప్రగతికి సంబంధించిన ఆత్మిక అక్షరాలు దిద్దే ప్రక్రియ. ఈ విధానాన్ని ఎంతమంది ప్రారంభించారో ఎవరిని వారే ప్రశ్నించుకోవాలి. మనలోని 24 తత్వాలను నియంత్రణ లేకపోతే మనిషి వినాశనమయ్యే విధానాన్ని అర్థం చేసుకున్న దృష్టితో ప్రస్తుత శ్లోకాన్ని సమన్వయం చేసుకోవాలి. నేను కర్మ చేయడం మానేస్తే ప్రజలు కూడా కర్మలు చేయకుండా చెడిపోతారు. కర్మ సంకరానికి నేను కర్తనవుతాను ప్రజల్ని పాడుచేసిన వాడిని కూడా అవుతాను, నేను కర్మలని ఆచరించడం మానేస్తే ఈ లోకాలన్నీ నశిస్తాయి. అంతేకాదు లోకంలో అల్లకల్లోలం చెలరేగుతుంది. ప్రజా నష్టం వాటిల్లుతుంది. అప్పుడు వాటికి కూడా నేనే కారణం అవుతాను అని చెప్పి ప్రజల సంక్షేమం కోసం నేను కర్మలను చేస్తూనే ఉంటానని కర్మయోగం ఆవశ్యకతను నిరూపిస్తున్నాడు. మనం కూడా భగవానుని అడుగుజాడల్లో నడుస్తూ కర్తవ్య కర్మలు ఆచరించి మన

క్షేమం, కుటుంబ క్షేమం లోకక్షమానికి కారణభూతులం కావాలి అదే జగద్గురువు ఈ శ్లోకంలో చెప్తున్నటువంటి అంశం. నేను కర్మ చేయడం మానేస్తే ప్రజలు కూడా కర్మలు చేయకుండా చెడిపోతారు. కర్మ సంకరానికి నేను కర్తనవుతాను ప్రజల్ని పాడు చేసిన వాడిని అవుతాను అంటూ మన కర్తవ్యం గుర్తుచేసి మనకి ప్రబోధిస్తున్నటువంటి జగద్గురువుకు ప్రాణమిల్లుదాం.

3అ, 25శ్లో.

సక్తాః కర్మణ్యవిద్వాంసో యథా కుర్వంతి భారత |
కుర్యాద్విద్వాంస్తథాఽసక్తః చికీర్షుర్లోకసంగ్రహమ్ ||

ఓ అర్జునా అజ్ఞానులు కర్మలయందు ఆసక్తులై వాటిని ఆచరించినట్లుగా విద్వాంసుడు (జ్ఞాని) కూడా లోక హితార్థమై ఆసక్తిరహితుడై కర్మలను ఆచరింపవలెను.

నాయనా అజ్ఞానులు కర్మల పట్ల ఆసక్తితో ఆచరిస్తారు. జ్ఞానులు లోకోపకారం కోసం ఫలాపేక్ష లేకుండా కర్మలు ఆచరించాలి. 3-23లో అప్రమత్తులై కర్మలను ఆచరించాలని 3-24లో అలా లేకపోతే మనిషికి లోకానికి వినాశనం సంభవిస్తుందని చెప్పారు. 3-23లో అప్రమత్తులై కర్మలను ఆచరించాలని 24 లో అలా లేకపోతే మనిషి, లోకం వినాశనానికి దారితీస్తాయని చెప్పిన జగద్గురువు ఈ శ్లోకంలో కర్మలను సక్తులు ఎలా చేస్తారో అసక్తులు ఎలా చేస్తారో తెలియజేస్తున్నారు. మోక్షమార్గానికి కర్మ ఒక గొప్ప సాధన ఆ సాధన చేసే విధానాన్ని రెండు మార్గాలని ఈ శ్లోకంలో సూచించి నిర్ణయాన్ని ఎవరికి వారికే వదిలేసాడు భగవానుడు. కర్మ ఫలాపేక్ష ఉంటే అజ్ఞానులు కర్మలకు అంటుకొని పోతారు. జ్ఞానికి ఫలాపేక్ష లేనందున ఆసక్తి లేకుండా కర్మలను ఆచరిస్తారు. అజ్ఞాని ఆచరించే కర్మ మార్గం బంధాన్ని కలిగించి జన్మ బంధాల్ని అందిస్తుంది. జ్ఞాని ఆచరించే కర్మ బంధాలను తొలగించి మోక్షాన్ని అనుగ్రహిస్తుంది. అజ్ఞానులు తమ తాత్కాలిక విలాసాల కోసమే ఈ ప్రపంచం ఉన్నట్లు భావించి కర్మలలో కూరుకు పోతుంటారు, ఉక్కిరిబిక్కిరి అవుతుంటారు. కర్తృత్వ భావనతో కర్మబంధంలో చిక్కుకుంటూ ఉంటారు. భోక్తృత్వం వల్ల కర్మ ఫలాలతో సంగత్వం కలిగి ఉంటారు. జ్ఞానులు సృష్టి నియతిని, క్రమాన్ని అర్థం చేసుకుంటూ లోకహితం కోసం 3-23లో జగద్గురువు సూచించినట్లు 3-24 లో మనం ఆత్మ పరిశీలన కావించుకున్నట్లు చేయాల్సిన కర్మలని అప్రమత్తంగా ఉండి నిర్వహిస్తూ ఉంటారు. వీరికి కర్తృత్వ భావన, భోక్తృత్వ భావన లేకుండా నిష్కామంగా ఉండి చేయడం వల్లనే జ్ఞానులు కర్మలను అప్రమత్తంగా నిర్వహించగలుగుతారు. అలా లోకానికి మేలు చేసే ఆత్మవేత్తలకు గాని నాకు గాని లోక సంగ్రహం తప్ప కర్తవ్య కర్మ ఏది లేదు.

3అ, 26శ్లో.

న బుద్ధిభేదం జనయేత్ అజ్ఞానాం కర్మసంగినామ్ |
జోషయేత్ సర్వకర్మాణి విద్వాన్ యుక్తః సమాచరన్ | 26 |

పరమాత్మస్వరూపమునందు నిశ్చలస్థితిని పొందిన జ్ఞాని శాస్త్రవిహిత కర్మలను ఆసక్తితో (ఫలాసక్తితో) ఆచరించు అజ్ఞానులబుద్ధులను భ్రమకు లోను చేయరాదు. అనగా కర్మలయందు వారికి అశ్రద్ధను కలిగింపరాదు. పైగా తానుకూడ శాస్త్రవిహితములైన సమస్తకర్మలను చక్కగా చేయుచు వారితోగూడ అట్లే చేయింపవలెను.

జ్ఞానులు కర్మల యందు ఆసక్తిగల అజ్ఞానుల బుద్ధితో విభజించకూడదు. అజ్ఞానులు కర్మ యందు ఆసక్తితో ఉంటారు, అయినా కూడా జ్ఞానులు స్వయంగా తమ కర్తవ్య కర్మలను శ్రద్ధతో ఆచరిస్తూ ఆ ఆచరణ ద్వారా ఇతరుల చేత ఆచరింప చేయాలి. అంటే జ్ఞాని ఆ పరిపక్వతను వారిలో రప్పించాలి గాని వారితో విభేదించకూడదు. అజ్ఞాన దశలోని వారి ఆలోచన, అభ్యర్థనలు ఎలా ఉన్నా జ్ఞానులు అర్థం చేసుకోవాలేగాని అభ్యంతరం చెప్పకూడదు. అజ్ఞానులు ఫలాసక్తులే కానీ ధర్మాసక్తులు కారు కదా. ధర్మాసక్తి లేని చోట ధార్మిక అవగాహన ఉండదు. అలాంటి అవగాహన కలిగే వరకు వారిని కర్మయోగాచరణలో కొనసాగేటట్లు చూడాలి. అంతేగాని వారితో వాద ప్రతివాదాలకు తావియ్యకూడదు. జ్ఞానులు ఆదర్శం కోసం చేసే కర్మల వెనుక జ్ఞానం ఉంటుంది. ఆ జ్ఞానం అజ్ఞానులకు ఆదర్శం కావాలి, వారితో కర్మ యోగాచరణ అలవాటు చేయించాలి. అలా సామాన్య ప్రజలను సన్మార్గంలో నడపడానికే ఎందరో జ్ఞానులు, యోగులు అజ్ఞానులతో విభేదించకుండా కర్మయోగం వైపుకు దారి మళ్ళించారు. అలా జ్ఞానుల ఆదర్శంతో మొదటగా కర్మయోగిగా మారితే వివేకం పెరిగి ఆ తర్వాత నెమ్మదిగా జ్ఞానార్థియై జ్ఞాన సమూపార్జన గావించి మోక్షాన్ని పొందుతారు. అజ్ఞాని ఆసక్తితో కర్మలను ఆచరిస్తాడు. జ్ఞాని అసక్తుడై లోకోపకార నిమిత్తం కర్మలాచరించాలి. అందుకే జ్ఞానులు అజ్ఞానుల బుద్ధితో విభేదించకుండా యోగయుక్తులై సమస్త కర్మలను నేర్పుతో ఆచరించి ఇతరులు కూడా ఆచరించేటట్లు చూడాలి అని ఉపదేశిస్తున్నటువంటి జగద్గురువుకు ప్రణమిల్లుదాం.

3అ, 27శ్లో.

ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః ।
అహంకారవిమూఢాత్మా కర్తాఽహమితి మన్యతే | 27 |

వాస్తవముగా కర్మలన్నియును అన్నివిధముల ప్రకృతిగుణములద్వారానే చేయబడుచుండును. అహంకార విమూఢాత్ముడు (అహంకారముచే మోహితమైన అంతఃకరణముగల అజ్ఞాని) 'ఈ కర్మలకు నేనే కర్తను' అని భావించును.

కర్మలన్నీ ప్రకృతి వల్ల పుట్టిన సత్వ రజస్తమో గుణాల ద్వారా సమస్త కార్యాలు జరుగుతూ ఉంటాయి. కానీ అహంకారంతో కూడుకున్న మూఢుడు తనే చేస్తున్నానుకుని భ్రమిస్తుంటాడు. జ్ఞాని, అజ్ఞాని ఇద్దరూ కర్మలు ఆచరిస్తూ ఉంటారు. జ్ఞాని చేసే కర్మ మోక్షమార్గాన్ని సుగమం చేస్తుంది. అజ్ఞాని చేసే కర్మ బంధాల సుడిగుండంలో చిక్కుకోవడానికి కారణమవుతుంది. ఈ భావ భేదాన్ని మనం ఇదివరకే తెలుసుకున్నాం. అయితే ఈ శ్లోకం అజ్ఞానపు మనిషి ఎలా కర్మల చేత బందీ అవుతున్నాడో వివరిస్తుంది. ప్రకృతి వల్ల పుట్టిన సత్వ రజస్తమో గుణాలే మనం ముందు శ్లోకంలో చెప్పుకున్న 24 తత్వాలుగా ఏర్పడ్డాయి అని మనకు తెలియాలి. వీటి పేర్లు మనం 3-7 లో 3-14 లో 3-24 లో తెలుసుకున్నాం. కాబట్టి ఈ మనకు అనిపిస్తున్న, కనిపిస్తున్న దృశ్య ప్రపంచం దేహం, మనసు, బుద్ధి మొదలైన సమస్తమూ ప్రకృతి నుండి పుట్టినవే. ఈ పుట్టుకకు సాక్షి జ్ఞాత, ఎరుక అదే ఆత్మ స్వరూపం. కాబట్టి ప్రకృతి జన్యమైన త్రిగుణాల ద్వారా ఏర్పడిన దేహేంద్రియపు ఉపాధి ద్వారానే సమస్త కర్మలు జరుగుతున్నాయి. అంతేగాని వీటికి సాక్షిభూతమైన ఆత్మ చేత కాదు. అయితే ఈ మనం చేసే పనులన్నింటినీ కూడా ఆత్మ సాక్షిగా వీక్షిస్తూ ఉంటుంది. స్వయంగా తానే కర్మ చేయదు. ప్రకృతే అంతా నడిపిస్తూ ఉంటుంది. దేహేంద్రియాలతో కూడిన మనసు మొదలైన సంయోగం ద్వారా ఏర్పడిన ఉపాధే స్వయంగా చేస్తూ ఉంది. అయితే దేహాదులపై అభిమానం ఉన్న అవివేకి నేను చేస్తున్నాను, నేనే చేస్తున్నాను, ఆహా నేనే లేకపోతే ఈ కార్యం ఎలా జరుగుతుంది, నా అంతటివారు ఎవరున్నారు, నేనే అన్ని పనులూ చేస్తున్నాను అని గర్వం ప్రదర్శిస్తూ ఉంటారు. కారణం ఏమంటే ఆకాశ భూతంలోని చివరిదైన అహం అనే అంతరింద్రియం నివాసస్థలం వక్షస్థలం. ఈ అహం అనే అంతరింద్రియం వక్షస్థలంలో నివాసం ఉంటూ ఆహా నేనే లేకపోతేనా అంటూ నిరంతరం నేనే అంతా చేస్తున్నానని విమూఢత్వంతో విర్రవీగుతూ ఉంటుంది. అయితే ప్రకృతి ద్వారా పుట్టిన కార్యాలన్నింటిలో ప్రకృతి గుణాలే ఉంటాయి కదా. ఈ దృశ్య ప్రపంచం అంతా త్రిగుణ మిళితమైన ప్రకృతి కార్యమే కాబట్టి ఈ సత్వ రజస్తమో గుణాలనే ఇటుకలపైనే ఈ విశ్వం నిర్మితమై ఉంది. బాహ్యంలో ఉన్నవి మనలో ఉన్నవి గుణాలే. అందుకే మనం ఎప్పుడూ గుణం మంచిగా ఉండాలి అని మంచి గుణగణాలు ఉన్న వారిని అభినందిస్తూ

ఉంటాం. కులమతాలు వారి బాహ్య సంపద కన్నా కూడా గుణమే మిన్న అని అనుకుంటూ ఉంటాం. కారణం బాహ్యంలోని గుణ సముదాయం, వ్యక్తిలోని గుణ సముదాయం పరస్పరం ఆకర్షించుకోవడమే. దీన్ని బట్టి విషయాల కోసం పాకులాడేది ఇంద్రియాలూ కాదు, దేహమూ కాదు. మనలోని గుణాలే బాహ్యములోని గుణాల వైపు పరిగెత్తుతూ ఉంటాయి. ఇవన్నీ అవగాహన లేని విమూఢులు, అవివేకులు అహంకారంతో తామే కర్మలు చేస్తున్నానని భ్రమిస్తూ కర్మల్లో బంధీ అవుతూ ఉంటారు. ప్రకృతి యొక్క గుణాలే ఈ విశ్వంలో అన్ని విధాలైన కార్యాలన్నీ సాగిస్తున్నాయని గ్రహించిన వారు జ్ఞానులు. అందుకే వీరు కర్మచేత బద్ధులు కారు. ఈ సత్యం దర్శించని అజ్ఞానులు అవివేకులు. కార్యకరణ సమూహమైన దేహేంద్రియ ప్రాణమనో బుద్ధుల యందు అహంభావన లేదా నేను అనే భావన కలిగి ఉండడం వల్ల తామే కర్తలని భావిస్తారు. దేహేంద్రియాదికమైన అనాత్మ యందు నేను అనే బుద్ధి ఏదైతే ఉందో అదే అహంకారం, అహం అంటే నేను అనే వ్యక్తిత్వ భావన. అయితే ఈ వ్యక్తిత్వ భావన పరిధి దాటి తీవ్రమైతే వచ్చేదే అహంకార గర్వం. ఈ సున్నితమైన తేడాను ఈ సందర్భంగా గీతా స్వరూపులందరూ ఖచ్చితంగా గుర్తించాలి. అలాంటి అహంకారంతో మూఢమైన బుద్ధి కలవాడు అహంకార విమూఢుడు. ఈ విముఢాత్మ అనే మాటను మనం 3-6 లో చర్చించుకున్నాం. ఈ అహంకార విమూఢుడు గుణాలను తనకు ఆరోపించుకొని ఆవేదన చెందే అజ్ఞాని. ఇలా అజ్ఞాని కర్మచేత బద్ధుడు అవుతున్నాడు. కాబట్టి నేను దేహం అనే భావనే దుఃఖమయమైన సంసారం. నేను కార్యకరణ సంబంధాన్ని కలిగి ఉన్నాననే భావనే నరకబాధలకు కారణం అని తేజోబిందోపనిషత్ పేర్కొంది. మనం అనేక సందర్భాల్లో ప్రకృతి, పురుషుడు అని చెప్పుకుంటూ ఉంటాం. ఈ ప్రకృతి అంటే త్రిగుణ జన్య మిళితమైన మాయమయమైన ప్రకృతి. ఈ ప్రకృతి పురుషుని మాయ అంటే మనిషి యొక్క నీడ అని భావిస్తే సరిపోతుంది. ఆ పురుషుని మాయ నుండి త్రిగుణాలు, ఈ త్రిగుణాల ద్వారా 24 తత్వాలు. అదే మనం చూస్తున్న మనకు అనిపిస్తున్న దృశ్య ప్రపంచం. ఈ దృశ్య ప్రపంచానికి మూలం పురుషుడు. అదే ఆపురుషుడే బ్రహ్మం. దీన్నిబట్టి ఈ త్రిగుణాత్మక మిళిత ప్రకృతి బ్రహ్మం అంటే పురుషుణ్ణి ఆశ్రయించి ఉంటుంది. అదేవిధంగా కార్యకరణ సమూహమైన దేహేంద్రియ ప్రాణ మనోబుద్ధులు ప్రకృతి పుట్టుకకు సాక్షి అయిన ఆత్మను ఆధారం చేసుకుని ఉంటాయి. ఇంతకు నీవు ఎవరు అంటే నీవు ఆత్మవే గాని త్రిగుణాత్మక కార్యకరణ సమూహం కాదని రెండవ అధ్యాయంలో అనేక సందర్భాల్లో చర్చించుకున్నాం. అప్పుడు దృశ్య ప్రపంచంలో నడుస్తున్న గుణ సమన్వయ కార్యాలకు నువ్వు కర్త ఎలా అవుతావు. మనం శ్లోకం ప్రారంభంలో చెప్పుకున్న 24 తత్వాలకు ప్రభువుగా ఉంటున్న, అదేవిధంగా మాయామయ ప్రకృతి పుట్టుకకు సాక్షిగా ఉన్న, 'జ్ఞాత' 'ఎరుక' ఆత్మ స్వరూపం ఇదే. ఈ సాక్షినే కార్యకరణమైన దేహేంద్రియ ప్రాణ మనోమయ బుద్ధులు ఆశ్రయించి ఉంటాయి. ఈ సాక్షి అయిన ఆత్మను సాక్షాత్కరించుకున్నప్పుడే తాను ఆత్మ అనే జ్ఞానోదయం కలిగి తద్వారా ఆత్మే పరబ్రహ్మం అన్న సత్యం అనుభవైకవేద్యం అవుతుంది. ఇదే జగద్గురువు ఈ శ్లోకంలో మనకు ప్రబోధిస్తున్నది. ఈ సత్యం తెలియక పోవడం వల్ల కర్మలన్నీ ప్రకృతి గుణాల చేత చేయబడుతున్నా అహంకారం చేత మూఢుడైనవాడు తానే చేస్తున్నానని

భావిస్తుంటాడు. కాబట్టి ఈ అజ్ఞానానికి స్వస్తి చెప్పి అటు ప్రకృతి పుట్టుకకు మూలమైనటువంటి పురుషుణ్ణి, బ్రహ్మంను, ఇటు మనలోని దేహేంద్రియ ప్రాణ మనోబుద్ధులకు సాక్షిగా ఉన్నటువంటి ఆత్మసాక్షిని దర్శనం గావించి ఆత్మే పరబ్రహ్మం అనే సత్యాన్ని అనుభవైకవేద్యం చేసుకుందాం.

3అ, 28శ్లో.

తత్త్వవిత్తు మహాబాహో గుణకర్మవిభాగయోః |
గుణా గుణేషు వర్తంత ఇతి మత్వా న సజ్జతే | 28 |

ఓ మహాబహూ!(అర్జునా!) గుణవిభాగ తత్త్వమును, కర్మవిభాగ తత్త్వమును తెలిసికొన్న జ్ఞానయోగి గుణములే గుణముల యందు ప్రవర్తిల్లుచున్నవని భావించి వాటి యందు ఆసక్తుడు కాడు.

ముందు శ్లోకంలో అజ్ఞాని భ్రమకు లోనై కర్మలలో బందీ అవుతున్న విధానాన్ని తెలుసుకున్నాం. ఆత్మసాక్షిని దర్శించాం.ఈ శ్లోకంలో జ్ఞాని వాటి యందు బంధీ కాకుండా ఉండే విధానాన్ని వివరిస్తుంది. ఇక్కడ గుణకర్మ విభాగయోహు అంటే త్రిగుణాత్మక మాయ యొక్క కార్యరూపాలైన పంచ మహాభూతాలు అంటే ఆకాశం వాయువు అగ్ని జలము భూమి మనసు బుద్ధి చిత్తం అహంకారమనే అంతరింద్రియాలు ఇంకా ఐదు జ్ఞానేంద్రియాలు,ఐదు విషయేంద్రియాలు ఐదు కర్మేంద్రియాలు వీటి సముదాయం ఉంది కదా 24, వీటిని గుణ సముదాయం అని అంటారు.24 ఇంద్రియాల పరస్పర చేష్టలనే గుణకర్మ విభాగం అని జగద్గురువు చెబుతున్నది. ప్రకృతిలో నుండే త్రిగుణాలు పుట్టాయని తెలుసుకున్నాం.అవే పరిణామం చెంది సూక్ష్మ, స్థూల భూతాలుగాను,శ్రోత్రాధి సూక్ష్మ, స్థూల ఇంద్రియాలు గాను జనించాయి.కాబట్టి దృశ్య ప్రపంచమంతా కూడా పంచభూతాల సమ్మేళనం. అలాగే మానవ దేహం ఇంద్రియ మనోబుద్ధులు కూడా ఆయా గుణాల నుండి పుట్టినా లేదా కలిగినా లేదా పొటమరించిన భావనే, అంటే గుణ వికారాలే. అందువల్ల బాహ్య ప్రపంచంలోని గుణాలు వ్యక్తి లోని గుణాన్ని ఆకర్షిస్తూ ఉంటాయి. ఈ యదార్ధ స్వరూపం తెలియక తానే కర్త అని భావించి విమూఢుడు బద్ధుడు అవుతున్నాడని మనం తెలుసుకున్నాం.దీనికి భిన్నంగా తత్త్వవిత్తు అంటే తత్త్వ విధుడు తన తత్త్వం తనకు తెలిసిన వాడు,జ్ఞాని కర్మల యందు ఆసక్తి లేకుండా ముక్తుడవుతున్నాడు.ఇతను గుణకర్మ విభాగాల నుండి విడిగా ఉన్న తానైన ఆత్మసాక్షి అని తెలుసుకున్నవాడు. అందుకే ఇతను తత్త్వవిత్తు అంటే దాని తత్త్వాన్ని తెలిసి ఉండటం. ఇక్కడ ఏ తత్త్వం అంటే మన దేహ తత్త్వం, మన దేహంలోని దేహి తత్త్వం. ఇలా మన పట్ల మనకు సంపూర్ణ అవగాహన ఉన్న తత్త్వవిధులం కావాలి. మనకు అన్ని వస్తు వాహనాల పట్ల బాహ్య ప్రపంచంలోని ప్రతి విషయాల పట్ల అవగాహన ఉంటుంది. కానీ మనిషి అంటే ఏంటి మనిషి

పుట్టుకకు కారణం ఏంటి లాంటి విషయాలు పట్ల మనకు అవగాహన ఉండటం లేదు. అందుకే ఆ అవగాహన మనలో కల్పించాలని జగద్గురువు మన శరీర తత్త్వాన్ని, ప్రకృతి తత్త్వాన్ని మన ముందుంచాడు.నాయనా మీరు భ్రమలకు లోను కావద్దు, నీ స్వస్వరూపాన్ని తెలుసుకో. నీవంటే ఈ శరీరం కాదు, నీవంటే ఈ గుణాలు కాదు, ఈ పంచభూతాత్మక దేహం మాత్రమే కాదు, నీపై ఉన్న నీవెవరో దర్శించు బిడ్డా అని ఆత్మ సాక్షిని దర్శింపజేస్తున్నాడు. అందుకే గుణాల కర్మల యదార్థ స్వరూపం తెలిసి వాటి నుండి తనను తాను వేరు చేసుకుని తన తత్త్వజ్ఞానంతో శోభిల్లేవాడు జ్ఞాని.గుణాలు గుణాల లోనే ప్రవర్తిల్లుతాయి. ఇంద్రియ మనో బుద్ధులు అనే గుణాలు లేదా కరణాలు ఆయా గుణాల లేదా విషయాల యందు ప్రవర్తిస్తూ ఉంటాయనే వాస్తవాన్ని గ్రహిస్తాడు.ఆ కారణంగా వీరిలో కర్తృత్వ,భోక్తృత్వ భావన ఉండదు.అందుకే వీరికి కర్మలలో సంగత్వం ఉండదు. ఇంద్రియాలకు ఇంద్రియ విషయాలతోనే సంబంధం. గుణాలకు గుణ విషయాలతోనే సంబంధం. ఆత్మ సాక్షికి ఇటు ఇంద్రియాలతో గాని ఇంద్రియ విషయాలతో గాని గుణాలతో గాని గుణ విషయాలతో గాని సంబంధం లేదు, సంగత్వం లేదు.ఆత్మ అసంగం అందుకే ఆత్మసాక్షి. ఇలా తత్త్వవిత్తు గుణకర్మల విభాగ వాస్తవం తెలిసిన వాడు,అందుకే మోక్షాన్ని పొందుతున్నాడు. ఇది ముందు శ్లోకంలోని గుణకర్మల చేత తాను కర్త అని భావించే అజ్ఞానికి ప్రస్తుత లోకంలోని గుణకర్మల విభాగ వాస్తవం స్థితిని తెలుసుకున్న జ్ఞానికి తేడా.ఉదాహరణ మనం ఓ సరస్సు దగ్గర నిలబడి చూస్తే సూర్యుడో, చంద్రుడో మనకు ఆ నీటిలో ప్రతిబింబిస్తుంది. అంతమాత్రాన సూర్యచంద్రులకు ఆ నీటితో సంగం,సంబంధం ఉంటుందా? లేదు కదా కానీ ఉన్నట్టు కనిపిస్తుంది,అనిపిస్తుంది. వాస్తవానికి లేదు,అయితే ఎందుకు అలా అనిపిస్తుంది. దృక్కు యొక్క చైతన్యం అంటే మన చూపు యొక్క చైతన్యం బుద్ధిలో ప్రతిఫలించడం వల్ల ఆత్మసాక్షికి, లేదా పరబ్రహ్మమైన పురుషునికి బుద్ధితో సంబంధం ఉన్నట్లు అనిపిస్తుంది,కనిపిస్తుంది. అంటే మనకు మనోబుద్ధుల ద్వారా తెలియబడుతూ ఉంది. కాబట్టి అలా లేని సంగం, సంబంధం ఉన్నట్లు తెలుస్తుంది.ఈ వాస్తవాన్ని తరచి తరచి చూస్తే తానే గ్రహించవచ్చు.ఇంద్రియాల, గుణాల బాహ్య పోకడలను నిరోధించి వాటి వాస్తవాలను అన్వేషించి, సత్యాన్ని గ్రహించాలి, దర్శించాలి. ప్రాపంచిక అనుభవాలు ఏవీ మనలో లేవని అర్థం చేసుకోవాలి.ఈ ప్రపంచంలో జరిగిన,జరుగుతున్న, జరగబోయే వేటితోనూ మనం తాదాత్మ్యం చెందకూడదు. వీటన్నిటికీ అతీతమైన ఆత్మసాక్షితోనే తాదాత్మ్యం చెందాలి.ఆత్మసాక్షినే దర్శించాలి.స్వప్న జాగ్రత్ సుషుప్తి అనే మూడు స్థితుల్లో మనం సంచరిస్తూ ఉంటాం. అయితే ఈ మూడు స్థితులకు సంబంధాన్ని కల్పిస్తూ ఉన్న వస్తువే ఆత్మ అని కఠోపనిషత్తు చెబుతుంది. ఉదాహరణ స్వప్నలోకం వేరు, జాగ్రదావస్థలో మనం జీవించే లోకం వేరు, సుషుప్తిని అనుభవిస్తున్న లోకం వేరు. కానీ ఈ మూడింటిలోనూ నేను అనే భావన ఉంది.అందుకే నేను కలగన్నాను, నేను మేల్కొన్నాను,నేను గాఢంగా నిద్రపోయాను అని అంటూ ఉంటాం.కలలో జాగ్రత్ ప్రపంచం మాయమవుతుంది. జాగ్రదావస్థలో స్వప్నలోకం మాయమవుతుంది, సుషుప్తిలో రెండు లోకాలు మాయమైపోయాయి. మరి ఈ రాక పోకలలాంటి మాయమైపోయేది ఏదైతే ఉందో ఆ మూడు కూడా మాయే కదా.నిజమే అయితే అవి మాయం కాకుండా

ఉండాలి కదా.కాబట్టి ఈ మూడు స్థితులను సాక్షిగా చూస్తూ ఉంటుంది ఆత్మసాక్షి. అందుకే అది సాక్షి అయింది. ఆత్మ సాక్షి తత్త్వంతో ఉండడమే తత్త్వవిత్తు. ఇంద్రియరూపాలైన గుణాలు, విషయరూపాలైన గుణాల యందు ప్రవర్తిలుతాయి.ఇలా గుణకర్మ విభాగం యొక్క తత్వం తెలిసినవారు గుణాలు గుణాలయందే ప్రవర్తిస్తున్నాయని తత్త్వ విధులు వాటి యందు ఆసక్తి చూపరు.మనం కూడా ఈ సత్యాన్ని దర్శించి తత్వవిధులుగా, ఆత్మసాక్షిగా, జ్ఞానులుగా ఉందాం.

3అ, 30శ్లో.

మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మచేతసా |
నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః | 30 |

అంతర్యామిని, పరమాత్మను ఐన నాయందే నీ చిత్తమును ఉంచి, కర్మల నన్నింటినీ నాకే అర్పించి, ఆశా మమతా సంతాపములను వీడి యుద్ధము చేయుము.

కర్మలను ఆచరించకుండా నైష్కర్మ్యసిద్ధిని పొందలేరు. కర్మలను త్యజించినా మోక్షాన్ని పొందలేరు అని 4వ శ్లోకంతో ప్రారంభించిన జగద్గురువు మధ్యలో 9వ శ్లోకం నుండి 15వ శ్లోకం వరకు యజ్ఞ ప్రకరణాన్ని చొప్పించి మళ్ళీ 16 నుండి కర్మ ప్రకరణాన్ని కొనసాగించాడు. 30 వ శ్లోకంతో కర్మ ప్రకరణం ముగించాడు. నాకు ఏది శ్రేయస్కరమో అని ప్రశ్నించిన అర్జునుడికి జగద్గురువు తగిన ప్రమాణాలను సూచించి ఆంతర్యాన్ని సవివరంగా తెలియజేసి ఆ పరిపక్వతను తెప్పించి, ఈ ముగింపు శ్లోకంలో యుద్ధం చేయి అని ఆదేశిస్తున్నాడు. కర్మ ప్రకరణం ఉపసంహారణలో జగద్గురువు ఆదేశం నియమిత కర్మ యోగాచరణే గాని యుద్ధం కాదని మనకు తెలియాలి. అర్జునుడు యుద్ధ క్షేత్రంలో ఉన్నాడు కాబట్టి యుద్ధానికి పూనుకో అంటున్నాడు. మనం ప్రతి ఒక్కరూ కూడా మనకు కేటాయించిన నియమిత కర్మలను కర్మయోగాచరణతో కొనసాగించాలని జగద్గురువు ఆజ్ఞాపిస్తున్నాడు. ఇక్కడ సమస్తమైన కర్మలను నాయందు ఉంచి 'మయి సర్వాణి కర్మాణి' అన్నారు కదా అదే కర్మయోగం అంటే. మనం చేస్తున్న ప్రతి కర్మ భగవంతుని కార్యంగాను మనకు కేటాయించిన కర్మగాను భావించి సర్వకర్మల్ని దైవానికి సమర్పించి చేయాలి అని అర్థం చేసుకోవాలి. అంటే కర్మనే దైవానికి సమర్పిస్తే ఇక ఫలితం గురించిన ఆలోచన ఎక్కడ ఉంటుంది. కర్మ ఫలితం కూడా అక్కడ ఉండటానికి అవకాశం లేదు కదా. ఇది జగద్గురువు చెప్తున్నటువంటి 'మయి సర్వాణి కర్మాణి' అనడంలో ఆంతర్యం. అలా కర్మలను ఆధ్యాత్మ చిత్తంతో దైవం మీద ఉంచి ఆశా మమకారాలను విడిచిపెట్టి భక్తి శ్రద్ధలతో ఆత్మచింతనతో యుద్ధం చేయమని 'మయి సర్వాణి కర్మాణి' అంటున్నారు. ఇక్కడ మనిషి ఆశాజీవి కదా అయితే ఆశ అంటే ఏంటో మనిషికి అర్థం కావడం

లేదు అందుకే నిరాశకు లోనవుతున్నాడు. ఒకప్పటి ఆశ నేటి నిరాశ అవుతోంది, నేటి ఆశే రేపటి నిరాశ తద్వారానే నిస్పృహ. దేహ యాత్ర నడవడానికి ఆహారం, దేహి యాత్ర నడవడానికి ఆత్మ చింతన, ఆహారం ఇవి సమృద్ధిగా మెండుగా ఉంటే చాలు. ఇలా ఉండాలనుకోవడం ఆశ అవుతుంది. అంతకు మించిపోతే అది అత్యాశ అవుతుంది. ఆ అత్యాశ ద్వారానే నిరాశ చోటు చేసుకుంటుంది. ఆ నిరాశ ద్వారానే నిస్పృహ. కాబట్టి జగద్గురువు ఇక్కడ నిరాశను వీడండి అంటున్నాడు. ఆశను వీడమని కాదని ఇక్కడ మనం జాగ్రత్తగా గమనించి గుర్తించాలి. మన నిస్పృహకు కారణమైన నిరాశను వీడమంటున్నారని మనకు తెలియాలి. మనం ఈ నిరాశకు కారణం పరిశీలిస్తే అత్యాశ అని తేలింది కదా. కాబట్టి ఆశ ఉండొచ్చు అత్యాశ ఉండకూడదు అని మనం గ్రహించాలి. ఇక మమకారం, ఇది లేదా ఈ వస్తువు లేదా ఈ సంపద నాది అని అనుకోవడంలో తప్పులేదు. కానీ ఈ నాది కాని నాది అనే మాయకు లోనై దైవ దృష్టిని విస్మరించరాదు కదా. దైవదృష్టిని విస్మరించి ప్రవర్తించే తీరు అంటే భౌతికతవైపు మాత్రమే దృష్టి పెట్టి, అవే శాశ్వతం అనుకొని అవే నావి, నాది అనే భావనతో ఉండిపోవడమే మమకారం అంటే. అలా భౌతికత ముసుగులో ఉండిపోయి దైవనియమిత కర్మల నిర్వహణలో స్పష్టత లేకపోవడం. మన దేహం అనే ముసుగులో పొసగి ఉన్నటువంటి దైవాన్ని దర్శించ లేకపోవడం. ఈ భౌతిక తాపం అనేటటువంటి వేడి నుండి విడివడితేనే దుఃఖం మటు మాయమవుతుంది. లేకపోతే జీవితాన్ని దుఃఖం ఆవహిస్తుంది. మానసిక అయోమయ స్థితే దుఖం. ఈ దుఃఖం అనే జ్వరం పూర్తిగా సమూలంగా తొలగించుకోవాలి. ఇవన్నీ విడిచిపెట్టి మనం కర్మలను సమర్పించడం ఎలా అని మనం ఆలోచిస్తే కర్మ అనేది వస్తువు కాదు, పదార్థం కాదు, పండు కాదు మరి ఎలా దేవునికి సమర్పించాలి?, దేవుని దగ్గర ఉంచాలి? అందుకని మన ఇంద్రియ మనోబుద్ధుల్ని మనం ఇప్పటిదాకా ఈ అధ్యాయంలో చర్చించుకున్న 24 ఇంద్రియ తత్త్వాలను వీటికి కారణమైన త్రిగుణాలను మొత్తాన్ని కలిపి దైవం దగ్గర ఉంచాలి. అది దైవం మీద దృష్టి ఉంచడం. అది సర్వ సమర్పణ అవుతుంది. అలా త్రికరణ శుద్ధితో సర్వ సమర్పణ గావించి కర్మలను ఆచరించాలి. అంటే వీటి పుట్టుకకు సాక్షి అయిన ఆత్మసాక్షికే సమర్పిస్తే ఆత్మే పరబ్రహ్మం కదా, ఆ పరబ్రహ్మమే జగద్గురువు, అలా మనం త్రికరణ శుద్ధిగా సమర్పిస్తే సరిపోతుంది. అలా సమర్పించాక ఇక ఆశకు, మమకారానికి తావు ఎక్కడ? చూశారా దివ్య ఆత్మ స్వరూపులారా జగద్గురువు ఈ శ్లోకంలో ఎంతటి సత్యాన్ని మన ముందు మనతో దర్శింపజేస్తున్నాడు. ఇవన్నీ జరిగాక ఇక సంతాపం ఎక్కడ ఉంటుంది, అవకాశం లేదు కదా. ఇది జగద్గురువు మనకు పట్టి ఉన్నటువంటి, మనల్ని ఆవహించి ఉన్నటువంటి మాయామయ భౌతిక ప్రాపంచిక విషయాల జ్వరాన్ని పారద్రోలడం అంటే. ఇక ఆశ లేదు, మమకారం లేదు, సంతాపం లేదు. జగద్గురువు అనుగ్రహంతో మనం కూడా ఈ స్థితికి చేరుకుందాం.

సమస్త కర్మల్ని వివేక బుద్ధితో భగవంతునికి సమర్పించి ఆశను, మమకారాలను విడిచిపెట్టి ప్రశాంతంగా నియమిత కర్మలను ఆచరిద్దాం.

3అ, 31శ్లో.

యేమే మతమిదం నిత్యమ్ అనుతిష్ఠంతి మానవాః |
శ్రద్ధావంతోఽనసూయంతో ముచ్యంతే తేఽపి కర్మభిః |31|

దోషదృష్టి లేకుండ శ్రద్ధాయుక్తులై నా ఈ మతమును అనుసరించు మానవులు గూడ సమస్త కర్మబంధముల నుండి ముక్తులయ్యెదరు.

ముందు శ్లోకంలో కర్మ ప్రకరణం ముగించిన జగద్గురువు ఈ శ్లోకంలో ఇప్పటివరకు అందించిన బోధను అందిపుచ్చుకొని ఆచరించాల్సిన విధానాన్ని ప్రబోధిస్తున్నారు. 3-21లో మతం అనే మాటను సుదీర్ఘంగా చర్చించుకున్నాం. ఒకసారి అది పునఃశ్చరణ గావించుకుంటే సరిపోతుంది. ఈ అవగాహనతో ఈ శ్లోకాన్ని పరిశీలించాలి. కర్మ కర్తవ్యం అనే యదార్థాన్ని సత్ ప్రమాణంగా నిరూపించి నాయనా ఈ మార్గం అంటే జగద్గురువు చూపుతున్న కర్మయోగ మార్గం అనుసరించిన వారందరూ మోక్షాన్ని పొందారు అని ఉద్బోధిస్తున్నాడు జగద్గురువు. కాబట్టి జనకాదులు కూడా ఆచరించిన ఈ పవిత్రమైనటువంటి మార్గాన్ని శ్రద్ధతో అనుసరించాలి, ఆచరించాలి. భధ జీవులకు జ్ఞాన బిక్ష పెట్టే అద్భుత మార్గం గీతా మార్గం. ఈ మార్గాన్ని శ్రద్ధావంతులై అసూయ లేని వారై ఆచరించాలి. ప్రయత్నంతోనైనా అసూయను తొలగించుకొని శ్రద్ధా భక్తులతో భగవంతుని మతాన్ని అంటే అభిప్రాయాన్ని, మార్గాన్ని ఆచరించాలి. శాస్త్రీయమైన గీతాశాస్త్రం, మోక్షశాస్త్రంపై, సద్గురువుపై అకుంఠితమైన విశ్వాసాన్ని కలిగి ఉండాలి. నిత్య ఆత్మధ్యానం వల్ల మనసులోని భౌతిక కోరికలన్నీ మరణిస్తాయి అని వివేక చూడామణి పేర్కొంది. అందుకే ఆచరణ అన్నది ఒక సచేతనపు ఎరుక, నిత్య జాగృతి. నిష్కామంగా ఉంటూ సాక్షి భూతంగా సచేతనమైన జాగ్రదావస్థలో స్థితం కావడం అని దీని అర్థం. ఇలా స్థితమై కర్తవ్య కర్మలు నిర్వహిస్తే ఎలాంటి బిగువులు, ఉద్విగ్నతలు లేని ఓ ప్రశాంత స్థితి మనలో స్థిరీకృతమవుతుంది. ఈ స్థితిలో బాహ్య అంతరాలు రెండూ మాయమై నిర్మలమైన ఉనికి మాత్రమే ఉంటుంది. ఈ నిర్మలమైన సంపూర్ణత్వమే దైవ స్థితి, ఇదే జీవించే స్థితి. జీవితం ఉన్నది జీవించేందుకు మాత్రమే ఏవేవో లేనిపోని భౌతిక ఆశయాల కోసం అని అనుకుని పొరపడుతూ ఉంటాం. అలా కాక జీవితాన్ని గీతా సూత్రంలో ఇమిడి ఉన్నటువంటి ఆయా సూక్ష్మాలను అర్థం చేసుకొని జీవితాన్ని జీవించడమే మన ధ్యేయం కావాలి. మనం బాహ్యంగా ఏవేవో ఆశయాల కోసం తీస్తున్న పరుగులే సర్వాన్ని విషపూరితం చేస్తున్నాయి. మన జీవితపు సంగీత నాదాన్ని ధ్వంసం చేస్తున్నాయి. నిత్యం జీవితం కోసమే జీవించాలి అందుకున్న ఏకైక మార్గం గీతా మార్గం. ఈ గీతా మార్గం మనం అనుసరించకపోతే జీవితాన్ని బలవంతంగా సాగించాలి, అతి కష్టంతో నెట్టాల్సి వస్తుంది. కాబట్టి జగద్గురువు మార్గంలో ఉంటూ మన నిజజీవితంలో సంభవిస్తున్న

వాటిని గమనిస్తూ ఉన్న దాన్ని ఉన్నట్లు ఉండనివ్వాలి. ఆ ఉన్న వాటిపై మనం వ్యతిరేకత చూపకూడదు. నిశ్శబ్దంగా, ప్రశాంతంగా, సంభవిస్తున్న విషయాన్ని గమనిస్తూ త్రికరణశుద్ధిగా జగద్గురువుకు సర్వ సమర్పణ గావించి కర్తవ్య కర్మలలో నిమగ్నం కావాలి. అప్పుడే ప్రతి మనిషి తన జీవిత లక్ష్యాన్ని అందుకోగలడు. కాబట్టి మన దృష్టిని, చూపును అన్యమైన వాటి వైపు మరల్చకూడదు. అలా వెళ్ళినా ఆ దృష్టిని వెనక్కి మళ్లిస్తే, అన్యం వైపు మన మనసు ఉండనప్పుడు ఖచ్చితంగా దైవం పైన నిలుస్తుంది. అలా అంతర్ దృష్టిలోనే, లోచూపులోనే దైవం పై చూపు నిలపడానికి కావలసినటువంటి పునాది దొరుకుతుంది. కాబట్టి లోచూపుతో ఆత్మసాక్షి దర్శనానికి పునాది ఏర్పాటు చేయడమే మన కర్తవ్యం, అదే జీవిత లక్ష్యం. అప్పుడే ముక్తి, సమాధి అంతా కూడా. ఈ చూపు శ్రద్ధతో నిలపకపోతే జీవితం పూర్తిగా వృధా అవుతుంది. ఆ చూపును మనసుతో నిలిపే ఆచరణ మార్గాన్ని ఈ శ్లోకం ద్వారా ప్రారంభించి అనుగ్రహిస్తున్నటువంటి జగద్గురువుకు ప్రణమిల్లుదాం. శ్రద్ధతో నిత్యం దృష్టిని నిలిపి అనుసరించేవారు కర్మల నుండి విముక్తులవుతారు. మనం కూడా నిత్యం శ్రద్ధా భక్తులతో సాధనతో మన బాహ్య చూపులు వెనక్కి తిప్పి లోచూపు ద్వారా నిత్యం భగవంతుని మతంతో ఏకమై కర్తవ్య కర్మలను నిర్వహిస్తూ పరమపదం చేరుకుందాం.

3అ, 32శ్లో.

యే త్వేతదభ్యసూయంతో నానుతిష్ఠంతి మే మతమ్ |
సర్వజ్ఞానవిమూఢాంస్తాన్ విద్ధి నష్టానచేతసః | 32 |

కానీ నాయందు దోషారోపణ చేయుచు, నా ఈ ఉపదేశమును అనుసరింపని మూర్ఖులు సమస్త జ్ఞాన విషయములయందు మోహితులై (విపరీత జ్ఞానోపహతులై) భ్రష్టులై కష్టనష్టముల పాలయ్యెదరని ఎఱుంగుము.

ముందు శ్లోకంలో జగద్గురువు చెప్పిన దైవ మార్గాన్ని శ్రద్ధతో అసూయా రహితులై జగద్గురువు సూచనకు అనుగుణంగా ప్రవర్తించేవారు జ్ఞానులై మోక్షాన్ని పొందుతున్నారని తెలుసుకున్నాం. ఈ శ్లోకంలో దానికి భిన్నంగా అలా దైవమార్గాన్ని అనుసరించకపోతే ఏమవుతారో స్పష్టంగా తెలియజేస్తున్నారు.

అలాంటి అద్భుతమైన మానవ జన్మలో దైవాన్ని అనుసరించే మార్గాన్ని జారవిడుచుకున్న వారిని చెడిపోయిన వారుగా, అవివేకులుగా ప్రకటిస్తున్నాడు. అంటే నస్వరమైన దృశ్య వస్తువులందే వారి మనోబుధులు ప్రవర్తిల్లడం వల్ల వారు దైవ మార్గంలో ఉండలేరు. అలా ఆ మనిషి వినాశనానికి అతనే కారణమవుతున్నాడని మనకు తెలియాలి.

ఇలాంటి వారికి భగవంతుడు కూడా సహాయపడడానికి వారే అవకాశం ఇవ్వడం లేదు. ఆ కారణంగా వారికి వారే నష్టపోతున్నారు. వీరికి బాహ్యంగా ఈ చర్మచక్షువులకు కనిపించే వాటి పట్ల ఎంత తెలివి, పాండిత్యం, బాహ్య సంపదలు ఉన్నా కూడా వారిని సర్వజ్ఞానం లేని మూఢులు గానే ప్రకటిస్తున్నారని గమనించాలి. ఇక్కడ సర్వుడు అంటే సర్వవ్యాపి అయిన భగవంతుడు, పరబ్రహ్మ అని అర్థం. ఆ జ్ఞానం పొందని వారిని మూఢులని తేల్చారు. ఈ అంశాన్ని మనం ఒకటవ అధ్యాయంలోనే చూసాం. దుర్యోధనాథులు ఎలా తమ వినాశనానికి తామే కారణమయ్యారో మనకు తెలియనిది కాదు. మనం అనేక సందర్భాల్లో ఈ అంశాన్ని చర్చించాం. 2-42లో ఇచ్చకపు మాటలు పుష్పితాం వాచం పలికే అవిపశ్చితులు, అవివేకులు ఎలా ఉంటారో తెలుసుకున్నాం. అలాంటి వారి ఊబిలో చిక్కుకోవద్దని 2-52లో హెచ్చరించాడు. 2-53లో అలాంటి వారిని అనుసరిస్తే బుద్ధి స్థిరంగా ఉండదు విచలితమవుతుంది అని మనకు బుద్ధి చెప్పాడు. మనిషి ఎలా తన వినాశనానికి తానే కారణం అవుతున్నాడు అనే అంశాన్ని 2-62, 2-63 శ్లోకాలలో చాలా వివరంగా తెలుసుకున్నాం. మూడవ అధ్యాయంలో మూడవ శ్లోకం నుండి కూడా కర్మలు ఆచరించాల్సిన విధానంలోని మెలకువలను ప్రామాణికమైన శాస్త్రీయ దృష్టి కోణంలో తగిన ఉపపత్తులతో మన కళ్ళ ముందు ఉంచాడు. అంతేకాకుండా అలా ఉండకపోతే ప్రజలకు నష్టం వాటిల్లుతుందని హెచ్చరించాడు. సాధారణ మనుషులు, సాధనలో ఉన్నవారు తెలిసీ తెలియక మిడిమిడి జ్ఞానంతో వాదించినా వారితో విభేదించకూడదని 3-26 లో తెలుసుకున్నాం. అలాగే పూర్తిగా మందగించిన బుద్ధితో భౌతిక ప్రపంచపు మాయలో కూరుకున్న మందమతులతో కూడా వ్యవహరించాల్సిన విధానాన్ని పండుటాకుల ఉదాహరణలతో 3-29లో జగద్గురువు ప్రబోధం ద్వారా గ్రహించాం. 3-30 వ శ్లోకంలో నిరాశ నిస్పృహల్ని వీడి నిమిత్తమాత్రులై నాపైనే దృష్టిని నిలిపి నియమిత కర్మాచరణ గావించాలని ఉద్దేశించి కర్మ ప్రకరణం ముగించాడు. ఇన్ని విధాలుగా మనకు ప్రబోధిస్తూ మన చిటికెన వేలు వదలకుండా నడిపించుకు తీసుకెళుతున్న జగద్గురువు 31వ శ్లోకంలో శ్రద్ధా భక్తులతో అసూయ లేనివారై నన్నే అనుసరించాలని ఆదేశించాడు. మరి ఇంత దూరం నడిపించిన జగద్గురువు మాటను, గీతను తప్పితే ఇకదానికి అర్థం ఏముంది అనేది ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సిన అంశం. అందుకే ఈ శ్లోకంలో స్పష్టంగా ప్రకటించాడు. ఇప్పటికైనా మనలోని అజ్ఞానాంధకారం ఇంకా ఎక్కడైనా అట్టడుగు పొరల్లో కూరుకుపోయి ఉంటే ఈ క్షణానికైనా వేర్లతో సహా వాటిని పెకలించివేయాలి. ఈ క్షణమే వాటిని పారద్రోలాలి. అలా లేకపోతే ఆ అజ్ఞానమే అతని వినాశనానికి కారణం. ఇది మనం ప్రస్తుత శ్లోకంలో గ్రహించి ఆచరించాల్సిన ప్రధాన అంశం. అత్యంత దుర్లభమైన మహోన్నతమైన మానవ జన్మ పొంది వేదాంత శాస్త్ర విచారాదులకు అవసరమైన పురుషత్వం కూడా పొందిన తర్వాత మానవ జన్మకు అత్యంత ఆవశ్యకమైన, కర్తవ్యమైన మోక్ష ప్రాప్తిని నిర్లక్ష్యం చేసే వారి కంటే మూఢులు ఎవరుంటారు ఈ లోకంలో. బాహ్య విషయాల మాయకు లోనై ఆత్మసాక్షిని గుర్తించలేని మనలోనే ఉన్న దైవాన్ని విస్మరించడం కంటే దారుణం మరేం ఉంటుంది మనిషికి. అలాంటివారు చెడిపోయిన వారు కాక ఏమవుతారు. దైవానుగ్రహం వల్ల లభించినటువంటి మనుష్య జన్మలో వేద

వేదాంతాలలో నిష్ణాతుడై తన ముక్తి కోసం ప్రయత్నించక అనిత్యాలైనటువంటి పుత్ర ధార గృహాదుల ఆర్జనలో ఎవరైతే తల మునకలవుతుంటారో అలాంటి మూఢులు తమను తామే చంపుకునే ఆత్మఘాతకులు. గీతా సద్గురు మార్గాన్ని అనుసరించకపోతే జగద్గురువు వారిని భ్రష్టులవుతారని వారి వినాశనానికి వారే కారణం అవుతారని చెబితే శంకర భగవత్ పాదులు అలాంటి మూఢుల్ని ఆత్మఘాతకులు అని తేల్చి చెప్తున్నారు. అందుకే నా మతాన్ని నిందించేవారు, అనుసరించి ప్రవర్తించని వారు, ఏ జ్ఞానం లేని మూఢులు వారి అవివేకం వల్ల వారే నశిస్తారని తెలుసుకో. కాబట్టి జగద్గురువు మార్గాన్ని అనుసరించకపోతే జనన మరణాల ఊబిలో చిక్కుకొని తన అజ్ఞానం కారణంగా తామే కష్టనష్టాలపాలై తాము చెడి తమ వినాశనానికి తామే కారణమవుతారని తెలియజేస్తున్న ఈ శ్లోకాన్ని గమనించి జగద్గురువు మార్గాన్ని, దైవ మార్గాన్ని అనుసరిద్దాం, ఆచరిద్దాం.

3అ, 33శ్లో.

సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతేః జ్ఞానవానపి |
ప్రకృతిం యాంతి భూతాని నిగ్రహః కిం కరిష్యతి ||

సమస్త ప్రాణులును తమ తమ ప్రకృతులను అనుసరించి (స్వభావములకు లోబడి) కర్మలు చేయుచుండును. జ్ఞానియు తన ప్రకృతిని (స్వభావమును) అనుసరించియే క్రియలను ఆచరించును. ఎవ్వరైనను పట్టుబట్టి కర్మలను ఎట్లు త్యజింపగలరు?

జగద్గురువు ఓ మంచి ప్రశ్నను మన ముందు ఉంచాడు. మనల్ని మనం మలుచుకోవడానికి ఓ గొప్ప మహామంత్రం ఈ శ్లోకం. మాయమయ ప్రకృతిలోని మానవుడు ప్రకృతి స్వభావానికి అనుగుణంగా ప్రవర్తిల్లుతూ ఉంటాడు. అది వారి స్వభావం అయితే ప్రకృతి సహజంగా వారి వారి స్వభావానికి లోనై ప్రవర్తిల్లుతున్నా కూడా సద్గురువును ఆశ్రయించి జగద్గురువు సూచనలను అనుసరించి మోక్షాన్ని పొందాల్సిన బాధ్యత, కర్తవ్యం మనిషిదే అని ఈ శ్లోకం స్పష్టం చేస్తుంది. ప్రకృతి స్వభావాన్ని నిగ్రహించడం ఎవరికీ సాధ్యం కాదు. పూర్వజన్మలోని ప్రవర్తనా తీరును బట్టి ఏర్పడినటువంటి సంస్కారమే నేటి జన్మలో మానవుని స్వభావంగా ఉంటుంది. అదే మానవ ప్రకృతి, ప్రతి మనిషి తన ప్రకృతికి అనుగుణంగానే ప్రవర్తిస్తూ ఉంటాడు. దానికి భిన్నంగా ప్రవర్తించడం వీలుకాదు. గత జన్మ సంస్కారజనిత వాసనలకు అనుగుణంగానే ఈ జన్మ ఉంటుంది. ఈ జన్మలో మానవులు అనుభవించే సుఖదుఃఖాలు గత జన్మల కర్మ ఫలితాలను బట్టి ఉంటాయి. సంస్కారజనిత స్వభావమే మనిషి చేత కర్మలు చేయిస్తూ ఉంటుంది. ప్రకృతి స్వభావసిద్ధాలైన గుణాల చేత నెట్టబడి ప్రతి వ్యక్తి అస్వతంత్రులై కర్మల్లో ప్రవర్తిల్లుతూ ఉంటారని 3-5వ శ్లోకంలోనే మనం చాలా వివరంగా

చెప్పుకున్నాం, ఒకసారి ఆ శ్లోకం పునఃశ్చరణ గావించుకుంటే సరిపోతుంది. అలా జనన మరణాల ఊబిలో చిక్కుకుని జన్మలకు కారణమవుతూ అస్వతంత్రులై కర్మలలో ప్రవర్తితో ఉక్కిరిబిక్కిరి అవుతున్న మానవాళికి ఈ గీతా మార్గం ఓ దివ్యమైనటువంటి ఔషధం. ఇంద్రియాలు నిగూఢంగా ఉన్న పూర్వజన్మ సంస్కారపు వాసనల్ని బయటకు లాగుతూనే ఉంటాయి. ఈ ప్రవాహాన్ని ఆపడం ఎవరికీ సాధ్యం కాదు. స్వభావాన్ని నిగ్రహించడం ఎవరికీ సాధ్యం కాదు. ప్రకృతి వేగాన్ని, మనోవేగాన్ని ఎవరు ఆపగలరు. ఒకవేళ ఆపే ప్రయత్నం చేసినా గాలిని బంధించే ప్రయత్నం చేసినట్లే. కాబట్టి వాటిని ఆపడం అసంభవం అని తేటతెల్లం చేస్తున్నాడు జగద్గురువు. చివరికి భగవంతుడు కూడా ఆపలేను అని స్వయంగా చెబుతున్నాడు. ఎందుకంటే ప్రకృతి స్వభావానికి అంటే పూర్వజన్మల సంస్కారం ద్వారా సంక్రమిస్తున్న స్వభావాలతో కూడి ప్రవర్తిల్లుతున్నప్పుడు భగవంతుడైనా ఏమీ చేయలేడు కదా. మానవుడే స్వయంగా జగద్గురువును ఆశ్రయిస్తే అప్పుడు జగద్గురువు దారి మళ్లించి గత జన్మల సంస్కారాలన్నింటినీ తొలగింపచేసి దైవమార్గంలోకి చిటికెనవేలు పట్టుకొని తనతో పాటు తీసుకెళ్లగలరు. మనం కూడా సద్గురువును ఆశ్రయించి, జగద్గురువు మార్గాన్ని అనుసరిస్తే తప్ప మన జన్మల బంధం నుండి ప్రకృతి స్వభావం నుండి విడిపడటం సాధ్యం కాదని మనకు తెలియాలి. అందుకే ప్రకృతి స్వభావం చేత ఉక్కిరి బిక్కిరి అయిన మనిషి ఎన్నెన్నో జన్మలు వాటి స్వభావం చేత చిక్కుకొని కష్టాలు పాలైన జీవుడు అలసట చెంది ఒకానొక స్థితిలో సద్గురువును ఆశ్రయించాల్సిందే. కాబట్టి ప్రతి మనిషికి ఈ స్థితి ఏదో ఒక జన్మలో ఏదో ఒక క్షణం సద్గురువు ఆశ్రయం, జగద్గురువు మార్గం తప్పదు. ఈ అంశాన్ని ఈ శ్లోకం స్పష్టంగా హెచ్చరిస్తుంది. ఈ శ్లోకంలోని మరో అంశం జ్ఞాని కూడా తన స్వభావానికి అనుగుణంగానే ప్రవర్తిల్లుతూ ఉంటాడు. ప్రకృతి స్వభావం అందరికీ సమానంగానే వర్తిస్తుంది. అయితే జ్ఞాని యొక్క పూర్వజన్మల సంస్కారం పవిత్రమైనవిగా ఉంటాయి కనుక వారి పవిత్ర మార్గానికి అనుగుణంగానే వారి జన్మ పరంపర ద్వారా సంక్రమించినటువంటి పవిత్రమైన లోక కళ్యాణ కార్యక్రమాల్లో వారు ప్రవర్తిల్లుతూ ఉంటారు. అది జ్ఞాని స్వభావం. తాను అకర్తగా శోభిస్తున్నా జ్ఞాని ఆచరించేవి కూడా ప్రకృతి స్వభావాన్ని అనుసరించే కొనసాగుతాయి. వారి ప్రకృతి స్వభావం ఏమై ఉంటుంది సద్గురువు మార్గమే కదా జగద్గురువు మార్గమే కదా. కాబట్టి అదే వారికి జన్మల ద్వారా సంక్రమిస్తుంది. ప్రహ్లాదుడికి, ధ్రువుడికి, సతీసావిత్రికి సంభవించినట్లు. మరి మనం మన స్వభావాన్ని ఎలా స్థిరీకృతం చేసుకోవాలంటే ఏమి చేయాలి. ముందు శ్లోకంలో మనిషి ఎలా చెడిపోతున్నాడు దానికి గల కారణాలు ఏవో ఇప్పటివరకు చర్చించిన అనేక శ్లోకాల సంఖ్యతో సహా గుర్తు చేసుకున్నాం. అలా మనిషి చెడిపోతున్నందుకు అన్ని కారణాలు తెలిసి కూడా అదే మార్గంలో వెళ్తే అలాంటి వారిని భగవంతుడు కూడా కాపాడలేడని స్పష్టంగా తెలుసుకున్నాం. ఆయా గుణాలు గుణాలలో, ఇంద్రియాలు ఇంద్రియాలలో ప్రవర్తిల్లడం ప్రకృతి స్వభావం. అయితే మార్గం ఏది? ఈ ప్రకృతి గుణాలు ఇంద్రియాల వైపా, వీటన్నింటినీ పరిపాలిస్తున్న ఆత్మసాక్షి వైపా, ఎటువైపు నీ పయనం, ఏమిటి నీ గమ్యం అని తమకు తామే ప్రశ్నించుకొని ముందుకు సాగాలి. నాది కాని ఈ లోకంలో నాకేమీ కాని ఈ ప్రదేశంలో నేనెందుకు ఉన్నాను అని తమను తాము ప్రశ్నించుకోవాలి. అందుకే

మనిషికి ప్రశ్నించే తత్త్వం ఇచ్చింది భగవంతుడు. మనం మనలోని ఆత్మసాక్షి వైపుగా దృష్టిని నిలిపి ప్రశ్నించు కోవాలి. మనల్ని మనమే ప్రశ్నించుకుంటే అప్పుడు మనకు మనలోనే మనతోనే చర్చ జరుగుతుంది. బాహ్య విషయాల వైపు వెళ్లే మనసు దారి మళ్లించుకుని ఆత్మవైపు ప్రయాణిస్తుంది. అప్పుడు మనసు దైవంలో లయమవుతుంది. మనసును హృదయంలో స్థిరపరచడమే కదా కర్మ భక్తి జ్ఞాన యోగ మార్గాల సారం. ఇవన్నీ మనలోనే జరగాలి, అలా జరిగి మనం ప్రకృతి గుణాల్ని, స్వభావాన్ని అర్థం చేసుకొని మనం మనలోని స్వభావాన్ని, ప్రకృతిని సన్మార్గం వైపుగా అడుగులు వేసే దిశగా స్థిరీకృతం చేసుకోవాలి. ఇది జగద్గురువు ఈ శ్లోకం ద్వారా మనకు ఇస్తున్న సందేశం. ప్రతి ప్రాణి తమ తమ ప్రకృతిని అనుసరించి స్వభావసిద్ధంగా ప్రవర్తిస్తుంటాయి. ఇక్కడ స్వభావంలో మార్పు రావాలి గాని నిగ్రహం ఏమీ చేయలేదు అంటూ మనకు కనువిప్పు చేస్తున్నటువంటి జగద్గురువుకు ప్రణమిల్లుదాం.

3అ, 34శ్లో.

ఇంద్రియస్యేంద్రియస్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ |
తయోర్న వశమాగచ్ఛేత్ తౌ హ్యస్య పరిపన్థినౌ । 34 |

ప్రతి ఇంద్రియార్థము నందును (ప్రతి ఇంద్రియ విషయమునందును) రాగద్వేషములు దాగియున్నవి. మనుష్యుడు ఈ రెండింటికిని వశము కాకూడదు. ఏలనన ఈ రెండే మానవుని శ్రేయస్సునకు విఘ్నకారకములు, మహా శత్రువులు.

ఏ వ్యక్తీ తన ప్రకృతికి లేదా స్వభావానికి భిన్నంగా ప్రవర్తించలేరని తెలుసుకున్నాం. ఆయా స్వభావాలే వారి వారి జీవితాన్ని నడిపిస్తూ ఉంటుందని మన కర్మల్ని మన స్వభావమే నిర్ణయిస్తూ ఉందని గ్రహించాం. స్వభావం కర్మల్ని నిర్ణయించవచ్చు. కానీ స్వభావసిద్ధమైన కర్మలు బంధాన్ని కలిగించవు. మరి బంధానికి కారణం ఏంటి? రాగద్వేషాలు, మనం రాగద్వేషాలతో కూడినప్పుడే కర్మలు బంధిస్తాయి. ఈ విషయంలో జాగ్రత్తగా ఉంటే స్వభావజనిత కర్మలు బంధ హేతువులు కాలేవు. స్వభావాన్ని మనం నిగ్రహించలేమని ముందు శ్లోకంలో చూశాం. కానీ వివేకంతో ముందు శ్లోకంలో ఒక ప్రశ్న వేసుకున్నాం. మన పయనం ఎటు ఆత్మసాక్షి వైపా, ఇంద్రియాలలో చరిస్తున్న ఇంద్రియార్థాల వైపా అని. ఈ ప్రశ్నకు జవాబు మనలోంచి వస్తే అది మనం ఆచరిస్తే సరిపోతుంది. ఇంద్రియార్థాల వైపు వెళ్లడానికి ఇంద్రియాలు ఉన్నాయి. దానికి మనం అవసరం లేదు. ఈ సున్నితమైన అంశం మనం గమనించాలి. ఇంద్రియాలు, ఇంద్రియార్థాలు వీటి స్వభావం యొక్క పూర్తి వివరాలు 2-58లో చర్చించాం. అది పునశ్చరణ గావించుకుని ఈ శ్లోకాన్ని సమన్వయం చేసుకోవాలి. ప్రతి ఇంద్రియానికి ఆయా సంబంధిత ఇంద్రియ విషయాల పట్ల రాగం కాని ద్వేషంగాని ఉంటుంది. శబ్దం స్పర్శం రూపం రసం గంధం అన్నింటి పట్ల ఇష్టమైతే రాగం, లేకపోతే ద్వేషం ఈ రెండింటిలో ఏదో ఒకటి ఉండనే

ఉంటుంది. విషయాలను గుర్తించడానికి మనకు ఇంద్రియాలు మనకు అవసరం అందుకే అవి ఉపకరణాలుగా ఉంటున్నాయి. అంతేకానీ ఇంద్రియాలు రాగద్వేషాలను కదిలించలేవు కదా. అయితే ఈ రాగద్వేషాలకు కారణం స్వభావం. అదే ముందు శ్లోకంలో చెప్పుకున్న స్వభావం, ప్రకృతి. ఇవే రాగ ద్వేషాన్ని కదిలిస్తున్నాయి, తదనుగుణంగా అస్వతంత్రులై మనిషి ప్రవర్తిస్తుంటారు. ఈ కిటుకు మనకు తెలియడానికి ఇప్పటిదాకా చెప్పుకున్న కర్మయోగ మంత్రం. తద్వారా మనం నెమ్మదిగా మన స్వభావాన్ని మార్చుకోవచ్చు. స్వభావం కర్మలను నిర్ణయించవచ్చు, నియంత్రించవచ్చు. కానీ కర్మ స్వేచ్ఛను నిషేధించ లేవు కదా. కాబట్టి పూర్వజన్మ సంస్కార జనిత వాసనలు ఒకవైపు ప్రవాహంలా మనల్ని ప్రేరేపిస్తున్నా ప్రస్తుత జన్మలో మనలోని పురుష ప్రయత్నంతో పరబ్రహ్మం ఆత్మసాక్షి ఉంది కదా దానితో ఏకమైతే ఈ పరమార్థ సాధనంతో మన స్వభావం నియమిత కర్మయోగాచరణ వైపుకు మరలి దైవంతో అనుసంధానమై మోక్షమార్గానికి సుగమం అవుతుంది. అందుకే మన ప్రయాణం ఇంద్రియాల ద్వారా వెళ్లి ఇంద్రియార్థాలనే శత్రువులతో చరించి అధోగతి పాలు కావడమా, సద్గురు చూపిన మార్గం ద్వారా ఆత్మసాక్షి సహాయంతో పరమపదం చేరడమా మీరే నిర్ణయించుకోండి అని జగద్గురువు మనకే వదిలి పెట్టాడు. 2-47వ శ్లోకం అనే చట్టం ప్రకారం మనకు కర్మ స్వేచ్ఛ ఉంది కాబట్టి మన మోక్షం మన చేతుల్లోనే మన వినాశనం మన చేతుల్లోనే. ఇది మనం ఈ శ్లోకపు మహా మంత్రం ద్వారా గ్రహించాల్సిన అంశం. రాగద్వేషాలకు వశం కాకూడదు అవే మనకు మహా శత్రువులు. మన శ్రేయస్సుకు ఇవే అవరోధాలు మనకు మహా శత్రువులుగా ఉంటున్నాయి. సాధారణంగా బాహ్య ప్రపంచం లోని ఇతరులపై శత్రుత్వం పెంచుకోవడంలో తల మునకలై మనలోని మహా శత్రువులు మనలోనే ఉండి మన జీవిత వినాశనానికి కారణం అవుతున్న సంగతి మనం తెలుసుకోలేకపోతున్నాం.

మనం మనలోని ఆత్మసాక్షిని పరబ్రహ్మాన్ని గురువుగా భావిస్తే మనసు శిష్యుడు ఈ మనసు అనే శిష్యుడు మనల్ని పరిపాలించేటటువంటి ఆత్మ సాక్షితో కలిసి ఏకమైతే అప్పుడు మనం పారమార్థికత వైపుగా ప్రయాణం చేయగలం. అప్పుడే సంఘంలో సుఖశాంతులు వర్ధిల్లుతాయి. ఈ అంశాన్ని గీతా స్వరూపులందరూ ఖచ్చితంగా గుర్తించాలి. మన మనస్సనే శిష్యుడు నెమ్మదిగా ఆత్మ సాక్షి వైపు నిత్యసత్యమైన ప్రత్యక్ష దైవం వైపుగా ప్రయాణాన్ని కొనసాగించాలి. అప్పుడే మనలో మనకు నిత్య సత్యమైన సుఖం శాంతి సంప్రాప్తిస్తుంది. ప్రతి ఇంద్రియార్థాలలోనూ రాగద్వేషాలు దాగి ఉన్నాయి మనిషి శ్రేయస్సుకు ఇవే విఘ్నకారకాలు, మహా శత్రువులు.

3అ, 35శ్లో.

శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్ |
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః | 35 |

పరధర్మమునందు ఎన్నో సుగుణములు ఉన్నను స్వధర్మమునందు అంతగా సుగుణములు లేకున్నను చక్కగా అనుష్ఠింపబడు ఆ పరధర్మముకంటెను స్వధర్మాచరణమే ఉత్తమము. స్వధర్మాచరణమునందు మరణించుటయు శ్రేయస్కరమే. పరధర్మాచరణము భయావహము.

1-1వ శ్లోకం, 2 31వ శ్లోకంలో ఈ ధర్మానికి సంబంధించిన అనేక అంశాలు మనం చర్చించుకున్నాం. ప్రత్యేకించి రెండవ అధ్యాయం ధర్మ ప్రకరణం విభాగంలో చాలా అంశాలను సుదీర్ఘంగా చర్చించుకున్నాం. ఆ అంశాల అవగాహనతో ఈ శ్లోకాన్ని సమన్వయం చేసుకోవాలి. పునరుక్తి లేకుండా అక్కడ చర్చించుకున్న అంశాల్ని పునాదిగా చేసుకుని మరికొన్ని ఆచరణీయమైనటువంటి అంశాలను ఈ శ్లోకంలో చూద్దాం. ధర్మమనేది సమస్త జీవకోటికి జీవనాడి. తనదైన ధర్మమే స్వధర్మం. మనిషి యొక్క సర్వ సమస్యలకు కారణం మనిషికి స్వధర్మ స్వభావమెరిగే సంస్కారం లేకపోవడం. స్వధర్మాన్ని రక్షించిన వారిని ఆ ధర్మమే రక్షిస్తుంది. విస్మరించిన వారిని అదే నశింపజేస్తుంది. ఇది విశ్వ చట్టం. గుణ హీనంగా ఉన్నా కూడా స్వధర్మమే శ్రేయస్కరం. ఈ సృష్టిలో ఏ జీవికి కూడా స్వధర్మ, పర ధర్మాల పట్ల ఎలాంటి సందేహాలు ఉండవు. ప్రతి జీవి వాటివాటి ధర్మానుసారం ప్రవర్తిస్తూ ఉంటాయి. మట్టి గట్టు చెట్టు పుట్ట కుక్క ఏదైనా సరే వాటి వాటి పరిధిలో స్వధర్మాచరణలో నిమగ్నమై ఉంటాయి. గోవు పులిని చూసి పులిలా ఉండాలని అనుకోదు. పులి కూడా ఆవును చూసి అలా మెలగాలని అనుకోదు. ఇలాగే అన్ని జీవులు కూడా. కానీ ఒక్క వివేకం ఉన్న మనిషి మాత్రం స్వధర్మాన్ని విస్మరించి పర ధర్మాన్ని ఆచరించాలని వెళ్లి అదీ సరిగ్గా ఆచరించలేక, ఎందుకంటే అది పర ధర్మం కనుక వీలు కాదు ఆచరించడానికి. అలా స్వధర్మం, పర ధర్మాల మధ్య కొట్టుమిట్టాడుతూ నలిగిపోతుంటాడు. కాబట్టి స్వధర్మాన్ని ఆచరించినప్పుడే స్వచైతన్యంతో జీవించి స్వస్థితిలో ఉండగలం, లేకపోతే వీలు కాదు కదా. పాలకులు పాలితులు ఎవరైనా సరే తమ తమ ధర్మాన్ని అతిక్రమించడం, ఇతరులను అధర్మం వైపుకు మరలించడం లాంటివి చేస్తే ప్రకృతిలోని వాయు జల కాంతి మొదలైన వాటిల్లో విషమమైన ప్రాణాపాయకర మార్పులు ఏర్పడి ఆ మార్పు వాయు జలాధుల అంతటా వ్యాపిస్తుందని అని ఆత్రేయ సంహితలో ఉంది. తద్వారా రక రకాల అంతుపట్టని ప్రాణాపాయకరమైన వ్యాధులు ప్రజా నష్టాన్ని కల్పిస్తాయి కదా. అందుకు నేడు సమాజంలో ప్రబలుతున్నటువంటి దారుణ సంఘటనలు మనకు ప్రత్యక్ష నిదర్శనాలు. ధర్మ స్వరూపమైనటువంటి శ్రీరాముడు లాంటి వారెందరో మార్గదర్శకులు ఉన్నారు. ఈ

భూమండలం మీద జీవకోటిని మోస్తున్నది ధర్మమే. ధారణమంటే మోయడం. ఈ లక్షణాన్ని బట్టే ధర్మ శబ్దానికి ధర్మం అనే పేరు సార్థకమయింది. అలా అశేష భూమండలం నిలకడకు ఇటు సర్వ జీవరాశి మనుగడకు మూలాధారమైందే ధర్మం. అందుకే శ్రేయాన్ స్వధర్మో విగుణః స్వధర్మే నిధనం శ్రేయః అన్నారు జగద్గురువు. సమస్త ప్రపంచపు నిలకడకు ధర్మమే మూలాధారం. ధర్మమే ఆధారస్తంభం అంటోంది మహాభారతం.మరి ఇలాంటి ధార్మిక మార్గాన్ని విడిచిపెడితే అదే పర ధర్మో భయావహః పర ధర్మంలో బతకడం కన్నా స్వధర్మం లో మరణించడమే శ్రేయస్కరం. స్వధర్మాచరణ లోనే 3-33 శ్లోకంలో చెప్పుకున్న పూర్వజన్మ సంస్కార జనిత వాసనలన్నీ కూడా ప్రక్షాళన అవుతాయి. పర ధర్మాచరణ కూడదు. ఇక్కడ అర్జునుడికి యుద్ధం అనేది తన ప్రకృతి సహజసిద్ధమైనది, అంతేగాని భిక్షాటన స్వధర్మం కాదు కదా. అతను క్షాత్ర ధర్మ లక్షణ యుతుడు కావడం వల్ల అరణ్యంలో కూడా అస్త్ర శస్త్రాలు సాధించుకోవడానికి తపస్సు చేశాడు. మహాతపస్వి అర్జునుడు. అపారమైన నైపుణ్యం కలవాడు యుద్ధ విద్యలో. దేశకాల పరిస్థితులలో వచ్చే మార్పుల ప్రభావం వల్ల స్వధర్మంలో కొన్ని దోషాలు ఇబ్బందులు అనిపించినా మనకు శ్రేయస్సు నిచ్చేది అదే. అది చావైనా శ్రేయస్కరమే. తరువాతి ఉన్నతమైన జన్మకు, దేహి యాత్రకు కూడా అనుకూలంగా ఉండేది స్వధర్మమే. పర ధర్మాచరణ సత్ఫలితాన్ని ఇవ్వదు. అదో అస్తవ్యస్తమైన అవ్యవస్థకు మూలమవుతుంది. తమ తమ నియమిత కర్మలలో నిమగ్నం కాకుండా సంబంధం లేని అనవసరపు కర్మలలో ప్రవర్తిల్లడం పర ధర్మం. ఇతరులను అనుకరించడం పర ధర్మం. పక్కింటివారో, తోటి ఉద్యోగస్తులో, తోటి తరగతి గదిలోని వారో ప్రవర్తించడం చూసి నేను అలా ఉండాలనుకోవడం పర ధర్మం. ఇది చాలా భయంకరమైనది, చాలా హానికరమైనది కూడా. స్వధర్మాన్ని వీడి పరులను అనుసరించడం లాంటివి చేయడం వల్లనే మనిషి జీవితంలో అలజడికి ఆందోళనకు గురి అవుతున్నాడు. అవగాహనతో అర్థవంతంగా మన నియమిత కర్మ యోగాచరణకు అవసరమైనవి మార్గదర్శకుల నుండి నేర్చుకోవాలి ఆచరించాలి కూడా. మనం ఎంతో మందిని గొప్ప వాళ్లను ఆదర్శవంతులను ఉదాహరణలుగా చెప్పుకుంటూ ఉన్నాం, ఆచరిస్తూ ఉన్నాం కూడా వాళ్ళ మార్గాన్ని. అయితే ఎదుటివారు సంపాదించినట్లు మనం సంపాదించాలనుకోవడం, ఇతరులకు ఉన్నటువంటి భౌతిక సంపదలన్నీ మనకూ ఉండాలనుకోవడం లాంటి అనుకరణలు, అనుసరణలు ప్రమాదకరం అంటున్నాడు జగద్గురువు. అందుకే మనం మార్గదర్శకుల దగ్గర నుంచి, ధర్మపరుల దగ్గర నుంచి, ఇతర జీవకోటి నుంచి నేర్చుకోవాల్సింది స్వధర్మాచరణ. అందుకే జగద్గురువు పర ధర్మం కంటే స్వధర్మాచరణమే ఉత్తమం. స్వధర్మాచరణలో మరణించినా శ్రేయస్కరమే. కానీ పర ధర్మాచరణం భయంకరమైనది. ధర్మం అమృతం వంటిది అది మనిషికి ప్రాణం పోస్తుంది. అధర్మం విషం లాంటిది అది మనిషి ప్రాణం తీస్తుంది. అందుకే బ్రహ్మ నిర్వాణం దాకా గురు బోధను విన్న మన సహవిద్యార్థి అర్జునుడికి కలిగినటువంటి సందేహంతో మూడవ అధ్యాయం ప్రారంభమైంది. మొదటి రెండు శ్లోకాలలో తన ప్రశ్నను సంధించాడు. మన సందేహాన్ని నివృత్తి చేయడానికి జగద్గురువు మూడవ శ్లోకం నుంచి బోధను ప్రారంభించాడు. అలా ప్రారంభించినటువంటి జగద్గురువు 35వ శ్లోకం వరకు ఎక్కడికక్కడ ఎలాంటి సందేహాలకు

తావు లేకుండా స్పష్టంగా సవివరంగా బోధించాడు. ఈ శ్లోకంతో ఇలా స్వధర్మాన్ని వివరించి కర్తవ్యకర్మలను ఆచరించే దిశగా అడుగులు వేయాలని ఆదేశించి జగద్గురువు తన బోధన ముగించాడు.

3అ, 36శ్లో.

అర్జున ఉవాచ,

అథ కేన ప్రయుక్తోఽయం పాపం చరతి పూరుషః |
అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలాదివ నియోజితః |36|

అర్జునుడు పలికెను – ఓ కృష్ణా! మానవుడు తనకు ఇష్టము లేకున్నను ఇతరులు బలవంతము చేసినట్లు దేని ప్రభావముచే ప్రేరితుడై పాపములను చేయు చుండును?

మనం సహవిద్యార్థి అయిన అర్జునుడి సందేహంతో ప్రారంభమైన ఈ అధ్యాయంలో జగద్గురువు 3వ శ్లోకం నుంచి 35వ శ్లోకం వరకు తన సమాధానం మనకు వినిపించాడు. ఇందులో 3నుంచి 8వరకు నిష్కామ కర్మయోగంతో ఆసక్తి రహితంగా నియత కర్మాచరణం ద్వారానే శ్రేష్ఠత్వమని నిరూపించుకున్నాం. 9నుండి 15వ శ్లోకం వరకు మనం చేసే ప్రతి పని యజ్ఞమే అనే భావనతో చేయాలని యజ్ఞ ప్రకరణంలో తెలుసుకున్నాం. 16 నుండి 24వ శ్లోకం వరకు ధర్మ చక్రాన్ని, కర్మ చక్రాన్ని దృష్టిలో ఉంచుకొని మానవజన్మ అనే మహా యజ్ఞ చక్రంలో పాల్గొనాలని తెలుసుకున్నాం. అలాగే లోక సంగ్రహార్థం జ్ఞాని ఆచరించే కర్మలను గురించి సాధారణ మనిషి ఆసక్తితో చేసే కర్మలను గురించి సవివరంగా స్పష్టంగా చర్చించుకున్నాం. 25 నుండి 34వ శ్లోకం వరకు జ్ఞానుల అజ్ఞానుల లక్షణాలు, ప్రకృతి గుణాలు పుట్టుక, పంచభూతాలు మొదలైన సృష్టి ఆవిర్భావ విధానమంతా తెలుసుకున్నాం. స్వభావసిద్ధమైన పూర్వజన్మ సంస్కారజనిత స్వస్వరూప స్వభావ ప్రకృతిని కూడా తెలుసుకున్నాం. అలాగే మహా శత్రువులైన ఇంద్రియాలతో ఎలా రాగద్వేషాలు లేకుండా మెలగాలో వాటికి ఎలా వశం కాకుండా ఉంటూ కర్మలను ఆచరించాలో తెలుసుకున్నాం. 35వ శ్లోకంలో స్వధర్మాచరణ గావించాల్సిన విధానాన్ని ధార్మిక లక్షణాల్ని స్పష్టంగా చర్చించుకున్నాం. ఇలా అనేక అంశాల్ని తన సమాధానంలో చొప్పించి మనకు కనువిప్పు కలిగించాడు జగద్గురువు. ఈ 35వ శ్లోకంతో జగద్గురువు కర్తవ్యకర్మకు పూనిక వహించాలని ఆదేశించి తన సమాధానాన్ని ముగించాడు. ఇవన్నీ విన్న అర్జునుడికి కలిగిన సందేహంతో మళ్లీ మన ముందుకు వచ్చాడు. అలా అర్జునుడి సందేహాన్ని మనకు సంబంధించినటువంటి సందేహాన్ని చూద్దాం.

కృష్ణా! మనిషి తనకు ఇష్టం లేకున్నా ఎవరో బలవంతంగా ఆజ్ఞాపించినట్లు పాపం చేస్తున్నాడు కదా, మనిషిని అలా ప్రేరేపిస్తున్నది ఏది? ఇది అర్జునుడికి, మనకు కలిగినటువంటి సందేహం.

ఇష్టం లేకపోయినా ఏ కారణం చేత ఈ ఉత్తమమైనటువంటి జన్మ తీసుకున్న మనిషి పాపానికి ఒడిగడుతున్నాడు. రాజాజ్ఞను పాటించే సేవకుడిలా బలవంతంగా నియోగించబడిన వాని వలె, నెట్టివేస్తున్న వాని వలె చేయిస్తున్న, ప్రేరేపిస్తున్నది ఏది? ఇది మన సందేహం. మనుషులు స్థూలంగా చూస్తే మూడు రకాలుగా కనిపిస్తారు. ఒకటి పాపం జోలికి వెళ్ళని వారు. అంటే పాపం అసలు చేయరు వీరు. వీరికి పాపం అంటే ఏంటో తెలియదు. రెండు పాపం చేయాలనే ఉద్దేశం లేకనే ఏదో ప్రేరణ చేత బలాత్కారంగా తమకు తెలియకుండానే తాము పాపం చేస్తుంటారు. మూడు కావాలని పాపం చేసేవారు. వీరికి పాపం చేయకూడదని తెలిసినా చేస్తున్నది పాపం అని తెలిసినా నేను అదే చేస్తానని మరీ పాపం చేయడానికి పూనిక వహిస్తారు. ఇందులో మొదటి వారు సత్వగుణం కలవారు, ఉత్తములు ప్రకృతి మాయకు త్రిగుణాలకు అతీతులు వీరు. ఇక రెండో రకం మనుషులు దైవం వైపు మరలాలి, మంచి పనులు చేయాలి ఇది చేస్తే పాపం ఇది చేస్తే పుణ్యం అని తెలిసినవారు. అయినా వారు ప్రకృతి ప్రేరణతో వారికి తెలియకనే బలాత్కారంగా పాపపు పనులలోకి నెట్టబడతారు. ప్రస్తుతం వీరిని గూర్చే మన సందేహం. మూడో రకం మనుషులు రాక్షసత్వం కలిగిన వారు. ఇప్పుడు మనం ముగ్గురిని దృష్టిలో ఉంచుకొని చర్చిస్తే ఇందులో రెండవ రకం వారిని గురించి మనం చర్చించుకోవాల్సిన అవసరం ఉంది మధ్యతరగతి వారు. ఎవరు తప్పు చేసినా తెలిసే చేస్తారు తెలియకుండా చేయరు కదా. ఒకవేళ అలా తెలియకుండా చేస్తే చిన్న చిన్న పొరపాట్లు అది పిల్లల్లో జరగాలి, అధర్మపరులు ధర్మాధర్మాలు తెలియని వారు కారు. ఉదాహరణకు దొంగతనం చేసేవారి గారి తప్పు అని తెలియక కాదు కదా. అది తప్పు కాదనే వారి అభిప్రాయమైతే రహస్యంగా, దొంగగా చేయరు కదా. బహిరంగంగానే చేసేవారు అది నిషిద్ధమని పాపమని తెలిసినా చేస్తుండటానికి కారణమేమి. అలా చేయడంలో వారు ఘర్షణకు గురవుతారు కూడా. మనం ఈ మధ్య తరగతి రెండవ తరగతి వారిని గమనిస్తే ఇష్టం లేనిది చేయాల్సి వస్తోంది అని తమలో తాము సంఘర్షణకు లోనవుతూ ఉంటారు కూడా. అంటే దాని వెనుక ఎవరి ప్రోద్బలమో ఉండాలి, లేదా ఎవరి ప్రేరణో అయి ఉండాలి. దేవుడా ఇది ప్రారబ్దమా, అజ్ఞానమా, కామమా అని తమలో తాము విమర్శించుకుంటూ ఉంటారు కూడా. కామము అంటే కోరిక ఇక్కడ, ఎవరి చేత లేదా దేనిచేత ఆజ్ఞాపించబడి బలవంతంగా నెట్టబడినట్లు మనిషి అలాంటి ఇష్టం లేని పనులు చేస్తున్నారనేది అర్జునుడి ప్రశ్న . మొదటిగా మనం బాగా ఆలోచించి ఈ అర్జునుడి ప్రశ్నను స్పష్టంగా అర్థం చేసుకోవాలి. కేనోపనిషత్తులో తెలిపినట్లుగా, మనసు అనేది ఒకటి ఉందని మనకు తెలుసు. మనకు తెలిసిన వాటిలో వేగవంతమైనది మనసు. దానికి వేగాన్నిచ్చింది ఎవరు? సర్వవ్యాపియై లోకాన్ని నడిపించే శక్తే ప్రాణం. ఆ ప్రాణం అంశే మనలో పని చేస్తుంది. మన శరీరం దాని కార్యకలాపాలు, మనసు దాని కార్యకలాపాలు అన్నీ కూడా ప్రాణం అనే శక్తి మూలంగానే పనిచేస్తాయి. ఈ

ప్రాణాన్ని నడిపించేది ఎవరు? మాట దేనివల్ల ప్రేరేపితమై పనిచేస్తుంది. కళ్ళు చెవులు అనే ఈ రెండింటి ద్వారా పంచేంద్రియాలు సూచించబడుతున్నాయి. అయితే ఈ ఇంద్రియాలు ఎవరి ద్వారా పనిచేస్తున్నాయి. ఇలా శరీరము మనసు పంచేంద్రియాలు ప్రాణం ఇవన్నీ ఎవరి మూలంగా పనిచేస్తున్నాయి. ప్రస్తుతం అర్జునుడి ప్రశ్న కూడా ఇదే. మనందరి సందేహం కూడా ఇదే. ఎవరి ప్రేరణతో మనిషి అస్వతంత్రుడై తప్పులు చేస్తున్నాడు, ఇది తప్పు అని తెలిసి కూడా. దుర్యోధనుడు తాను చేసేది పాపమని అధర్మమని తెలుసు. ధర్మమేమిటో తెలియక అధర్మానికి పాల్పడలేదు దుర్యోధనుడు. ఈ విషయం అతని మాటల్లోనే మనకు తెలుస్తుంది. ధర్మం నాకు తెలుసు కానీ అనుసరించాలని నేను అనుకోలేదు. నాకు అధర్మం కూడా తెలుసు, కానీ విడిచి పెట్టాలని నాకు అనిపించలేదు. ఎవరో నన్ను నియమిస్తూ, నడిపిస్తూ ఉంటే నేను అలా నడిచాను. ఆ నడిపించేదేదో నా మనసులోనే ఉండి ఉండాలి అన్నాడు దుర్యోధనుడు. పాపం అనర్థమని, వినాశ హేతువని అర్జునుడికి దుర్యోధనుడికి ఇద్దరికీ తెలుసు. కాకపోతే ఆ అనర్థానికి మూలం ఏమిటో తెలుసుకొని దాన్ని పరిహరించుకోవాలి అనే ఆలోచన దుర్యోధనుడికి లేదు. అర్జునుడికేమో కొంత సందిగ్ధత అనిపించినప్పటికీ నిర్ణయం తీసుకోలేని పరిస్థితిలో నేను ఇలా యుద్ధం చేస్తే ఒకవేళ అది పాపానికి దారి తీస్తుందేమో అని సందేహం కలిగింది. ఆ వివేచనతో సందేహ నివృత్తికి సద్గురువును ఆశ్రయించాడు. అసలు చేయకూడదు అని ఉంటే యుద్ధరంగం దాకా రాడు కదా, ఇంటి దగ్గరే ఆగిపోయేవాడు. కానీ స్వధర్మాచరణ, కర్తవ్య కర్మాచరణ ఓవైపు అతనిని ప్రేరేపిస్తూనే ఉంది. మనం ఏది ఏది అని ఇప్పటిదాకా ప్రశ్నించుకున్నామో ఆ ఏదో ప్రేరేపిస్తేనే అర్జునుడు కూడా ఇక్కడికి వచ్చాడు యుద్ధ రంగం దాకా. అయినా బలం బలగం ఓవైపు, సారథి సాక్షాత్తు దైవానుగ్రహం ఉన్నా నిత్యానిత్య వివేకంతో తొందరపడకుండా ధీరుడైనటువంటి అర్జునుడు సద్గురువును ఆశ్రయించాడు. అందులో భాగంగా యోగత్వం వైపుకు ప్రయాణిస్తూ జ్ఞాన సముపార్జన గావిస్తున్నాడు. సందేహం అనిపించినప్పుడు నివృత్తి చేసుకునే దిశగా మళ్లీమళ్లీ ప్రశ్నల్ని సంధిస్తూ సమాధానాన్ని పొందుతూ మోక్షమార్గం వైపుగా అడుగులు వేస్తున్నాడు. అలా యోగత్వం వైపుకు ప్రయాణించే భాగంగా ఎందుకు మనిషి అస్వతంత్రంగా, అనివార్యంగా పాపం చేస్తున్నాడు అనే సందేహాన్ని సంధించాడు. అందుకే 'వార్ష్ణేయ' అని సంబోధించి మరీ ప్రశ్నిస్తున్నాడు. బ్రహ్మానందాన్ని వర్షింపజేసేవాడు వార్ష్ణేయుడు అని దానార్థం. ఈ ప్రశ్నకు జగద్గురువు సమాధానం తరువాతి శ్లోకంలో చూద్దాం.

3అ, 37శ్లో.

శ్రీభగవాన్ ఉవాచ,

కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః |
మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్ ||

శ్రీ భగవానుడు పలుకుచున్నాడు- రజోగుణము నుండి ఉత్పన్నమగునదే కామము. ఇదియే క్రోధ రూపమును దాల్చును. ఇది మహాశనము. భోగానుభవములతో ఇది చల్లారునది కాదు. పైగా అంతులేని పాపకర్మాచరణములకు ఇదే ప్రేరకం. కనుక ఈ విషయమున దీనిని పరమ శత్రువుగా ఎఱుంగుము.

ఈ కోరికలు ఎంత అనుభవించినా ఇంకా కావాలనే స్వభావం కలిగినవి వీటికి సంతృప్తి తెలియదు. కోరికలకు అంతం లేదు నాయనా అనేక రకాల మహా పాపాలకు కారణం ఇవే ఈ కామాన్ని క్రోధాన్ని మహాశత్రువు అని తెలుసుకో అని మనకు ఉద్బోధిస్తున్నాడు. అర్జునుడు యుద్ధ విద్యలోనూ విలువిద్యలోనూ అపారమైన నైపుణ్యం కలవాడు ఆ అనుభవంతో సరిగ్గా ఎక్కు పెట్టిన బాణాల ప్రశ్నలను సంధిస్తున్నాడు. ఎక్కడ ఏ కార్యం జరిగినా దానికి కారణంగా కోరిక ఉంటుంది. అది పాపమైనా పుణ్యమైనా అర్జునుడి ప్రశ్న పాపం ఎవరు చేయిస్తున్నారని కదా. పాపం అనే కార్యం జరగాలంటే పాపపు సంకల్పం మనసులో కదలాలి కదా అదే కోరిక. ఎవరు ఏ పాప కార్యం చేసినా అది కామం యొక్క కార్యమే అంటుంది వేదం. వివేక ప్రధానమైన సత్వ గుణం ప్రచ్ఛన్నమైనప్పుడు క్రియాశీలమైన రజోగుణం ఉత్పన్నమవుతుంది. రజస్సు గుణం రాగం. రజోగుణం వల్ల రాగం ఏర్పడుతుంది. ఆ తర్వాత భోగేచ్ఛ కదలడం ప్రారంభమవుతుంది. అదే కామం కోరిక. దీన్నిబట్టి కోరిక అనేది రజోగుణం నుండి పుడుతుంది. కామం అనేది సర్వప్రాణికి సహజం. కోరిక లేనివారు కోరిక తెలియని వారు ఎవరుంటారు. అందుకే ఇది అందరికీ తెలిసినవి ఈ కామం, కోరిక. ఈ కామ క్రోధం అంటే కోరిక తీవ్రమైతే అది క్రోధంగా పరిణమిస్తుంది. ఈ కామం అనే కోరిక లేకపోతే క్రోధానికి తావు ఉండదు. ఈ కోరికకు తృప్తి అనేది చాలు అనేది తెలియదు. అది తెలిస్తే దానిని కోరిక అని అనం. దానికి కోరిక అనే పేరు ఎందుకు సార్ధకమవుతుంది. దానికి చాలు అనేది తెలియదు కాబట్టి. ఉదాహరణకు కోరిక అనేది భోగం కోసమే అనుభవించడం కోసమే అయితే అలా అనుభవించిన తరువాత భోగించిన తరువాత కోరిక లేకుండా పోవాలి కదా. కానీ మన అనుభవం దానికి భిన్నంగా ఉంటోంది కదా. ఇలా ఓవైపు అనుభవించినా తీరలేదని తెలిసినా మరోవైపు కోరికను తీర్చే ప్రయత్నంలోనే ఉంటాడు మనిషి. ఇలా తృప్తిని దూరం చేసి శాంతిని కాలరాసి పాప కూపంలోకి నెట్టేసే కోరికల్ని మహాశత్రువుగా పేర్కొన్నారు జగద్గురువు. ఎవరైనా సరే శత్రువుల్ని నిశ్శేషంగా సంహరించి భూ మండలాధిపత్యం వహించినప్పుడే రాజు అనిపించుకోగలరు. కానీ నేనే రాజు నేనే రాజు అని చెప్పుకునే వాడు ఎన్నటికి రాజు కాలేడు

కదా. అంటే కోరిక అనే శత్రువును ఓడించి మనస్సు అనే సామ్రాజ్యానికి అధిపతి అయి తానే పరబ్రహ్మం అని తెలుసుకున్నవాడే బ్రహ్మవేత్త. అంతేకానీ నేను బ్రహ్మను నేనే బ్రహ్మను అని చెప్పుకునే వారు కాదు. ఇలా మనిషి జీవిత వినాశనానికి హేతువుతున్నటువంటి కోరిక అనే రోగం ఆవహించి ఉన్న రోగి స్వయంగా గీతామృతం అనే దివ్య ఔషధాన్ని సేవించి తన రోగాన్ని పోగొట్టుకోవాలి. మనం మన బయట ఉన్న వారిని శత్రువులుగా భావిస్తూ అనవసరంగా మనకంటే బలహీనమైన వారిపైకి లేదా మన క్రింది వారి పైకి ఉరుకుతూ ఉంటాం. అది ఆ రసాయనం ఏర్పడేది మనలోనే అని ఆ రసాయనం మనలోనే తయారు కావడం వల్ల ఆ రోగం మనల్నే తాకుతోందని తద్వారా మన శరీరానికే ఇబ్బంది అనే సత్యాన్ని గ్రహించలేని వాళ్ళు ఈ కామం యొక్క పరిణామ క్రమం ఎలా ఉంటుందో మనిషి వినాశనం ఎలా జరుగుతుందో 2-62, 63 లో చూసాం. జగద్గురువు దాని చిరునామాను ఇక్కడ మనకు సూచిస్తున్నాడు. నాయనా కామం పుట్టుక రజోగుణం అదే క్రోధంగా పరిణమిస్తుంది. అది మహా పాపి అదే నీకు మహా శత్రువు అని తెలుసుకో అని మనకు ఉద్బోధిస్తున్నాడు. కాబట్టి ఇలాంటి మనలోని కామం అనే భయంకరమైనటువంటి శత్రువు చిరునామా తెలుసుకున్నాం. దాన్ని మనం మట్టుపెట్టే దిశగా అడుగులు వేయాలి.

3అ, 38శ్లో.

ధూమేనావ్రియతే వహ్నిః యథాదర్శో మలేన చ |
యథోల్బేనావృతో గర్భః తథా తేనేదమావృతమ్ |38|

పొగచే అగ్నియు, ధూళిచే అద్దము, మావిచే గర్భము కప్పి వేయబడినట్లు, జ్ఞానము కామముచే ఆవృతమై యుండును.

అర్జునుడి ప్రశ్నకు సమాధానంగా ముందు శ్లోకంలో మహా శత్రువు చిరునామాను చెప్పిన జగద్గురువు అది ఎలా మనకు కనిపించకుండా అంతుచిక్కకుండా మనతో మనల్ని కప్పివేసి ఉందో ఈ చక్కటి ఉపమతో చెప్తున్నాడు. సర్వ అనర్థాలకు కారణమైన మహా శత్రువు కామమని తెలుసుకున్నాను, దీని చిరునామా ఎక్కడ అంటే రజో గుణ సముద్భవం కదా ఇది ఎలా ఆ చిరునామాలో దాగి ఉందో మూడు ఉపమలతో మన ముందు ఉంచాడు.

ఒకటి అగ్ని, పొగ ఎక్కడినుండి వస్తుంది నిప్పునుండే కదా. నిప్పునుండే పుట్టిన పొగ నిప్పునే కప్పేస్తుంది. నిప్పుకు ప్రకాశం ఉంది. కానీ ధూమం అప్రకాశం. నివురు కప్పినప్పుడు నిప్పు కూడా ప్రకాశం లేనట్లే ఉంటుంది. మన నిజ జీవితంలో ఈ మాట వాడుకలో ఉంది. నివురు కప్పిన నిప్పు అని. ఇది నివురు కప్పి ఉన్నా మనం తాకితే కాలిపోతుంది. అలా నిప్పును పొగ కమ్మినట్లు మనిషి వివేకం కామం చేత కోరికల చేత కప్పి ఉంటుంది. ధర్మాధర్మాల్ని,

నిత్యా నిత్యాన్ని గ్రహించే వివేకం కామం వల్ల మరుగున పడిపోతుంది. అది తొలగిపోతే జ్ఞానం బుద్ధిలో యధావిధిగా ప్రకాశిస్తుంది. రెండు అద్దం, ధూళిచేత అద్దం, నిప్పును పొగ కప్పేనట్లే ఇక్కడ దుమ్ము మురికి ధూళి అద్దాన్ని కప్పేస్తుంది. కాకపోతే నిప్పును పొగ కమ్మినప్పుడు నిప్పు కంటికి కనిపించదు. కానీ అద్దాన్ని దుమ్ము ధూళి ఆవరిస్తే అద్దం మనకు కనిపిస్తుంది గాని మనం అద్దం ముందు నిలబడితే మన ప్రతిబింబం మనకు కనిపించదు, దుమ్ము చేరడం వలన మనం అందులో కనిపించం, అంత మాత్రాన అద్దం తన దర్శన శక్తిని కోల్పోలేదు. దుమ్ము దులిపితే అద్దం మళ్ళీ రూపాన్ని ప్రతిబింబిస్తుంది కదా. ఇలా మనలో దుమ్ము ధూళి ఉండడం వల్ల మనల్ని మనం అద్దంలో చూసుకోవడానికి ఎలా ప్రతిబంధకమో అలా కామం వల్ల మనం మన ఆత్మ సాక్షితో ఏకం కావడానికి దుమ్ము ధూళి ప్రతిబంధకమై ఉందని మనకు తెలియాలి. కాబట్టి అద్దంపై మురికిని శుభ్రం చేసినట్లు మనం కూడా భగవత్ ధ్యానంలో, భగవద్గీత మార్గంలో మనలోని కామాన్ని శుభ్రం చేస్తేనే మనలోని జ్ఞానం దివ్యమై సత్య దర్శనానికి ఉపకరిస్తుంది.

మూడు శిశువు మావి. నిప్పును పొగ అద్దాన్ని దుమ్ము ధూళి కప్పి ఉన్నట్లు గర్భస్థ శిశువును మావి కప్పి ఉంటుంది. మావి చేత కప్పబడిన గర్భస్థ శిశువు తల్లి గర్భంలో ఉంటుంది. మావి కనిపించదు, తొలగించే అవకాశం ఇవ్వదు. బిడ్డ జననం వరకు నిరీక్షించ వలసిందే. కానీ నిప్పు పైన నివురును అద్దం పై దుమ్ము ధూళిని తొలగించినట్లు శిశువును ఆవరించి ఉన్న మావిని తొలగించడానికి సాధ్యపడదు. అది భగవంతుని అనుగ్రహంతోనే తొలగాలి. గర్భస్థ శిశువును మావి కప్పినట్లు మనలోని కామం వివేకాన్ని దట్టంగా ఆవరించి ఉంది కాబట్టి అది ఎలా తొలగించనూ వీలుకానంతగా కప్పి వేసి ఉందో మనకు తెలియజేస్తున్నాడు జగద్గురువు. అది జగద్గురువు అనుగ్రహంతో భగవధ్యానంతోనే తొలగాలి. దానికి సాధన సమయం దైవ అనుగ్రహం అత్యంత ఆవశ్యకమై ఉంది. నిప్పును కప్పిన నివురును ఊదినా విసన కర్రతో విసిరినా పోతుంది. అద్దం మీద చేరిన దుమ్ము ధూళి అయితే కడిగితే పోతుంది. కానీ శిశువును కప్పిన మావిని ఏం చేయగలం. అందుకే జగద్గురువు కామం మనలో ఏపుగా పెరిగిపోయి దట్టంగా శిశువును కప్పిన మావిలా ఆవరించి వివేకాన్ని విచక్షణను కప్పేసి ఉన్న తీరును మన కళ్ళ ముందు ఉంచుతున్నాడు. కాబట్టి ఖచ్చితంగా భగవధ్యానం,

గీతా మార్గం అనివార్యం. తద్వారా జగద్గురువు అనుగ్రహంతో ఆ సమయం రాగానే కామం అదృశ్యమై జ్ఞానం ఉదయిస్తుంది. ఇలా మనం స్థూలంగా చూసినప్పుడు మనిషిలో కామం మూడు రకాలుగా ఆవరించి ఉందని తెలుసుకున్నాం. కొందరిలో కామం నివురులా ఉంటుంది. సద్గురు ఉపదేశంతో ఊదగానే నివురు అదృశ్యమైనట్టు కామం కనుమరుగవుతుంది. మరికొందరిలో కామం అద్దంపై దుమ్ము ధూళిలాగా ఉంటుంది. వీరికి సద్గురుపదేశంతోపాటు తన ప్రయత్నంతో సాధన తో నిత్య అభ్యాసంతో నిత్య అనుష్టానంతో అది పరిశుద్ధమవుతుంది. ఇంకొందరులో కామం గర్భస్థ శిశువును ఆవరించినట్లు దట్టంగా కప్పి ఉంటుంది. వీరు ఎంత ప్రయత్నించినా సత్ఫలితం వెంటనే రాదు. అలాంటివారు

సద్గురుపదేశంతో పాటు సద్గురు సాంగత్యం, సాధన, అభ్యాసం, సద్గురు సేవ చేస్తూ నిరీక్షించాలి. శిశువుకు సమయం వచ్చినట్లు ఈ కామం కప్పి ఉన్న శిశువులు కూడా సమయం కోసం ఆగాల్సిందే. అయితే మధ్యలో మార్గాన్ని తప్పకుండా ప్రయత్నాన్ని వీడకుండా ముందుకెళుతూ ఉండాలి. కొన్నిసార్లు మావిని తొలగించడానికి చేసే ప్రయత్నం విఫలమైనట్లు మనకు కనిపిస్తుంది. ఎంత ప్రయత్నించినా నిగ్రహించలేక సాధకుని నిస్సహాయకునిగా మార్చేస్తుంది కూడా. అయితే ఆ సందర్భంలోనే సాధకుని విశ్వాసానికి పరీక్ష, అప్పుడు కూడా సాధకుడు తన మార్గాన్ని తప్పకుండా తట్టుకొని నిరీక్షించాలి. ఎందుకంటే అది సాధకుడికి దిగులు పుట్టించి ఉక్కిరిబిక్కిరి చేసి దానికున్న బలంతో దారి తప్పించడానికి తన ప్రయత్నం తాను చేస్తూనే ఉంటుంది. కారణం కామం క్రోధంగాను, మోహం గాను ఎదిగిపోయి బుద్ధిని చెడగొట్టి తన ఆధీనంలో మనిషిని ఉంచుకొని ఉంటుంది కాబట్టి దీనికి బలం ఎక్కువ. ఇక్కడ ఒక విషయం గమనించాలి, దానికి బలాన్నిస్తున్నది మనమే. అది ఉపయోగించుకుంటున్నది కూడా మన బలాన్నే అని మనకు తెలియాలి. అది మనల్ని తన అధీనంలో ఉంచుకొని అది మన బలంతోనే విర్రవీగుతూ మన వినాశనానికే కారణమవుతోందని మనం గుర్తించాలి. ఎందుకంటే దానికి స్వయం ప్రకాశం లేదు కదా అది జడమే. ఇప్పుడు మనం కామ శత్రువును మూడు దశలుగా చూసాం కదా. ప్రతి ఒక్కరూ కూడా ఎవరు ఏ దశలో ఉన్నామో మనమే ఆత్మ పరిశీలన చేసుకుందాం. అందుకే జగద్గురువు దాని చిరునామాను దాని విశ్వరూపాన్ని మన ముందు ఉంచాడు. నిప్పుతో పాటు చీకటిని కలిగించే పొగ కూడా అందులోనే పుట్టి దాన్నే కప్పేస్తుంది. అలా పొగ చేత నిప్పు, మురికి చేత దుమ్ము ధూళి చేత అద్దం, మావిచేత గర్భస్థ శిశువు కప్పి ఉన్నట్లు జ్ఞానం కామం చేత కప్పి ఉంది. కాబట్టి మనం మన లోపలికి వెళ్లి మనస్థితిగతుల్ని అర్థం చేసుకొని భగవధ్యానంతో మనలోని కోరికలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకొని ఎలా ఉన్నా ఏ స్థాయిలో ఉన్నా కూడా సమూలంగా వేర్లతో సహా పెకలించి వేసే దిశగా మన ఆలోచనలు ఆచరణ కొనసాగాలి. దీనికి సద్గురువు ఆశ్రయంతో జగద్గురువు సూచనతో మనం మనలోని కోరికలను త్యజించే దిశగా అడుగులు వేసి జ్ఞానోదయం పొందుదాం.

3అ, 39శ్లో.

ఆవృతం జ్ఞానమేతేన జ్ఞానినో నిత్యవైరిణా ।
కామరూపేణ కౌంతేయ దుష్పూరేణానలేన చ ।39।

నాయనా అర్జునా కామం ఎప్పటికీ నిండనిది అంటే సంతృప్తి చెందని స్వభావం కలది. అది అగ్ని లాంటిది అత్యాశకు కారణం అయినది. ఇది జ్ఞానికి నిత్య శత్రువు. దానితోనే అంటే ఆ కోరికలతోనే జ్ఞానం కప్పబడి ఉంది. తీరని ఆరని దాహం లాంటి కామమే జ్ఞానాన్ని కప్పి ఉంది. కాబట్టి అదే జ్ఞానికి మహా శత్రువు అని అర్జునుడు సంధించిన బాణానికి ధీటుగా సూటిగా సమాధానమిస్తున్నాడు జగద్గురువు.

మనం 3-37లో సత్వగుణం ప్రచ్ఛన్నమైనప్పుడు క్రియాశీలమైన రజోగుణం ఉత్పన్నమవుతుంది అని చెప్పుకున్నాం. అందుకే జగద్గురువు దాని మూలస్థానం అయినటువంటి చిరునామాను సూటిగా మనకు దర్శింపజేశాడు. ఇంకేముంది శత్రువు స్థానం తెలిసిపోయాక మట్టు పెట్టడం ఎంతసేపు మనకు. మనకు మన దేహం అనే రథాన్ని నడపడానికి దేహి అనే సారధి ఉన్నాడుగా కాబట్టి ఆ సర్వవ్యాపి అనుగ్రహంతో మనలోనే ఉంటూ మన వినాశనానికి కారణమవుతూ మనలోని జ్ఞానాన్ని నిప్పు పై నివురులా, అద్దంపై ధూళిలా గర్భస్థ శిశువు పై మావిలా ఆవరించి ఉన్నటువంటి ఆ మహాశత్రువును జగద్గురువు అనుగ్రహంతో అవలీలగా ఛేధించగలం. మనం త్రిగుణాల గురించి ముందే తెలుసుకున్నాం. అందులో క్రియా రూపాన్ని దాల్చేది రజోగుణం అని మనకు తెలుసు. దీన్నే మాయ యొక్క విక్షేపకశక్తి అంటారు. సర్వ సృష్టి ఉద్భవించింది దీని నుంచే. ఈ విక్షేపశక్తి యొక్క కార్యాలే మనోవికారాలైన రాగద్వేషాలు, సుఖదుఃఖాలు. ఈ అవగాహనతో పరిశీలిస్తే మొదటగా ఆవృతం జ్ఞానమేతేనా, ఆవృతం అంటే ఆవరించి ఉంది, కప్పి ఉంది దీన్నే ఆవరణ శక్తి అంటాం. ఇది జీవాత్మను జనన మరణ సంసార చక్రంలో పడవేస్తుంది. క్రియా శీలమైన రజోగుణంతో అంటే విక్షేపశక్తి యొక్క కామ క్రోధాదుల ప్రవాహంలో కొట్టుకుపోవడానికి కారణభూతం అవుతోంది. ఈ ఆవరణ శక్తి యొక్క పని ఏమంటే వస్తువు యొక్క యధార్థ స్వరూపాన్ని కప్పివేసి ఎలా నివురు చేత నిప్పును దుమ్ము ధూళి చేత అద్దాన్ని మావి చేత గర్భస్థ శిశువును కప్పి ఉందో అదే విధంగా మన స్వస్వరూపాన్ని కప్పి వేరే విధంగా మనకు కనిపించేటట్లు చేస్తుంది. ఇలా ఒకదాన్ని మరోదానిగా అనిపించేటట్లు చేసే శక్తికి సహాయం చేసేటటువంటిది తమో గుణం. ఈ తమోగుణంతో కూడుకున్న ఈ ఆవరణ శక్తి, ఆవృత శక్తి యధార్థాన్ని కప్పివేస్తుంది. అంటే నిప్పును నివురు కప్పినట్లు ఈ దేహిని కప్పి ఉన్న దేహం కూడా అంతే. అయితే మనోవికారాలకు గుణవికార కార్యాలను కలిగించే విక్షేపశక్తి అసత్య విషయాలపై మోహం కలిగించేటట్లు చేసి దుఃఖసాగరంలోకి నెట్టివేస్తుంది. అంటే ఆత్మసాక్షిని విస్మరించే స్థితికి దారితీస్తున్నది ఈ రజోగుణపు మాయ అయినటువంటి విక్షేప శక్తే. ఇది మనం కాస్త

నెమ్మదిగా ఆలోచించి తెలుసుకోవాలి. ఇక రెండవ అంశం 'జ్ఞానినో నిత్య వైరిణా' ఇందులో మనం ఒక సున్నితమైన అంశాన్ని గమనించాలి. జ్ఞానికి మాత్రమే శత్రువు స్పష్టంగా చెప్పాడు. అంతేకానీ విమూఢులకు మిద్యాచారులకు అకృత్స్న విధులకు కాదని తెలియాలి. ఎందుకంటే వారికి అదే మిత్రుడు కదా ఆ మిత్రత్వంతో వారు దానితో చేతులు కలిపి వెంటనే దాని వెనుకనే దుఃఖం సంభవించినప్పుడు దాన్ని శత్రువుగా భావిస్తూ వెంటనే మళ్ళీ సుఖం అనిపించినప్పుడు దానితో చేతులు కలిపి మిత్రుడిగాను భావిస్తూ భౌతిక సుఖదుఃఖాల మధ్య రాకపోకలు గలిగిన భౌతికతపై మమకారం పెంచుకుంటూ ఉంటారు. అలా అలసిపోయిన జీవి ఏదో ఒక రోజు జ్ఞానమార్గాన్ని, ముముక్షత్వాన్ని కోరుకుంటారు. అప్పుడు వారు కూడా దాన్ని నిత్య శత్రువుగా భావిస్తారు. అంతవరకు వారు కాసేపు శత్రుత్వంతోను కాసేపు మిత్రత్వంతోను దానితో మెలుగుతూ ఉంటారు. ఈ కారణంగా జగద్గురువు చాలా జాగ్రత్తగా ఈ పదాన్ని 'జ్ఞానినః నిత్య వైరిణా' జ్ఞానికి మాత్రమే శత్రువు అని స్పష్టంగా పేర్కొన్నారు. మరి ఈ శత్రువుకు రూపం ఉందా అంటే ఉంది అదే కామం. దాని చిరునామా ఏది అంటే ఏది అంటే రజోగుణం. ఈరోజు గుణం పుట్టుకకు మూలం ఏది అంటే ప్రకృతి. ఇక్కడ ఒక విషయం మనం గమనించాలి. కామం అనే మాటకు కోరిక అని అర్థం కదా. మనం ఈ అంశాన్ని చాలా సార్లు చర్చించాం. 3-30 వ శ్లోకంలో కూడా ఆశపరిధి దాటిపోతే అత్యాశకు దారితీసి నిరాశ నిస్పృహలకు కారణమవుతోంది అని. ఆ దృష్టితో మనం కామం అనే పదాన్ని అర్థం చేసుకోవాలి. అంతేగాని అసలు కోరిక లేకుండా ఉండటం కాదని మనకు తెలియాలి. కోరికే జీవితమని కోరికలు తీర్చడంలోనే నిమగ్నమై దైవాన్ని, సన్మార్గాన్ని విస్మరించే దుస్థితికి దారి తీసే కోరిక ఉండద్దని అర్థం. ఎందుకంటే మనం పదేపదే కామాన్ని అంటే కోరికను మహాశత్రువు అంటున్నప్పుడు కచ్చితంగా ప్రతి ఒక్కరికి సందేహం కలిగే అవకాశం ఉంది. కోరిక లేకపోతే మనిషికి మనిషి జీవితం ఎలా కొనసాగుతుంది అని. ఆ కారణంగా ఇక్కడ ఆ కోరిక కామం అనేటటువంటి అంశాన్ని స్పష్టంగా అర్థం చేసుకొని శ్లోకాలను సమన్వయం చేసుకోవాలి. కామం క్రోధంగాను, క్రోధం మోహం గాను, మోహం లోభం గాను, లోభం మదం గాను, మదం మాశ్చర్యంగాను అంచెలంచెలుగా ఏపుగా ఎదిగిపోయి ఆమాంతం మనిషిని అమానవీయుడు గాను అక్రమాలకు పాల్పడే స్థితికి దిగజార్చే కామం వద్దని దాన్నే శత్రువు అని మనం చర్చించుకుంటున్నామని గమనించాలి. ఈ స్పృహతో మనం కామం కోరిక అనే పదాలను స్వీకరించాలి. మన వినాశనానికి కారణమయ్యే తీవ్రతరమైన కోరికను ఇక్కడ మహాశత్రువుగా నిత్య శత్రువుగా మనం పరిగణిస్తున్నాం. అది మన అనుపాజ్ఞనలలో ఉండేవిధంగా దాన్ని మనం వినియోగించుకునేలా ఉండాలే గాని అది మన మీద ఆధిపత్యం చేసి బుద్ధిని చెడగొట్టి జ్ఞానాన్ని సైతం కప్పివేసి అవకాశం దానికి ఇవ్వకూడదని మనం తెలుసుకోవాలి. అందుకే జగద్గురువు 37వ శ్లోకంలో మహాపాపాలకు కారణభూతమవుతున్నది మహా శత్రువు అది అని పేర్కొన్నాడు. అది ఎలా శత్రువో మూడు విధాల రూపంలో ఉపమలు చెప్పి మనకు కనువిప్పు కలిగించాడు. అది కూడా మన నిత్యజీవితంలో నిత్యం ఉపయోగించే వస్తువులతోనూ తల్లి గర్భంలోని మావితోను పోల్చి స్పష్టంగా మన ముందు ఉంచాడు. ఇక్కడ నిత్య

వైరినా అది తాత్కాలిక శత్రువు కాదు నిత్య శత్రువు. కాబట్టి మనం నిత్య జాగరూకత వహించాలి దీని పట్ల. అంటే మనం 3-23లో చెప్పుకున్న అప్రమత్తత 3-24 లో ఆత్మ పరిశీలన గావించుకొని అప్రమత్తత అంటే ఏంటో తెలుసుకున్నాం కదా ఆ అవగాహనతో మనం ఇక్కడ ముందుకెళ్లాలి. అప్రమత్తత అనే ఆయుధంతోనే ఈ మహా శత్రువుకు చిరునామా లేకుండా చెరిపి వేయాలి. దాని స్థావరాన్ని ఖాళీ చేయించాలి, దాని నివాసానికి స్థానం ఇవ్వకూడదు. ఈ నిత్య శత్రువు అనే మాటను మనం ఇంతటితో వదలడానికి వీలులేదు, ఎందుకంటే అది నిత్యం అంటున్నాడు కదా జగద్గురువు. మరి మనము ఆత్మ నిత్యము, సత్యము అనుకుంటున్నాం కదా మరి ఇది ఎలా మరి ఆత్మ నిత్యమైతే మరి ఈ కామం కూడా నిత్య శత్రువు అంటున్నారు కదా ఎలా నిత్యం అవుతుంది. అంటే శరీరాన్ని విడిచేంత వరకే ఉండి శరీరం విడిచాక అది తొలగిపోయేటట్లుగా ఉంటే దానికి జగద్గురువు రాకపోకలు కలవిగా పేర్కొని ఉంటాడు. కానీ అలా చెప్పడం లేదు ఇక్కడ అది నిత్యము అంటున్నాడు. మనం ఇక్కడ ఒక క్షణం ఆగి పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే మహాశత్రువును మట్టు పెట్టాలంటే ఆ మాత్రం సమయం మనం కేటాయించక తప్పదు లేకపోతే అది మన సమయాన్నే కాదు మనల్ని ఆవరించి ఉక్కిరిబిక్కిరి చేసి మనల్ని మట్టు పెడుతుంది. కాబట్టి దీని సంగతి ఏంటో మనం కచ్చితంగా ఆలోచించి తీరాల్సిందే. ఈ కాలం మనల్ని చంపుతుందే గాని మనం శరీరాన్ని విడిచినా అది మనల్ని వీడదని మనకు తెలియాలి. అది మనకు దూరం కాదు. మరణం అనేది శరీరానికి కానీ కామానికి తెలియదు. అందుకే జగద్గురు దాన్ని నిత్యం అంటున్నాడు. మనం ఈ కామం అనే మహా శత్రువు స్థావరాన్ని కనిపెట్టి మట్టు పెట్టకుండా మనం మన శరీరాన్ని విడిచినా అది అంతటితో ఆగదు మనల్ని విడిచిపెట్టదు, జన్మజన్మలకు అదే స్థాయిలోనే విజృంభించి మనల్ని విడిచి పెట్టకుండా ఆవరించి తనకున్నటువంటి ఆవరణ శక్తితో ఆవరించి మన జ్ఞానాన్ని కప్పివేస్తూనే ఉంటుందని మనకు తెలియాలి. దీనికి ఉదాహరణలు కోకొల్లలు, రజో గుణంతో రాలిపోయిన రాజులు ఎందరో, కామం యొక్క వేగంతో పరాజయం పొందిన మహా పండితులు ఎందరో వాటి బలానికి గురి అయి తనువును చాలించినటువంటి బలహీనులు ఎందరో. కామం చేతిలో ఓడిపోయిన పిల్లలు యువకులు వృద్ధులు ఎందరో, ఇది మనం ఆలోచించాల్సినటువంటి విధానం. ఈ కామం మళ్లీ వాసనా రూపంలో జన్మజన్మంతరాలుగా వెంటాడుతూనే ఉంటుంది. అందుకే జగద్గురువు దీన్ని నిత్యం అని తెల్పాడు. ఆ కారణంగా కామం కదిలితేనే శత్రువు కదులుతుంది, అది కదలక పోతే శత్రువు కదలడానికి వీలు లేదు కదా ఇది గుర్తించగలిగిన వాళ్లే జ్ఞానులు. నన్ను కదిలించి నాకు అనర్థాన్ని తెచ్చిపెడుతున్న ఈ కోరికను నా అదుపులో ఉంచాలే తప్ప దాని అదుపులోకి నేను వెళ్ళకూడదని వివేచనతో ఆలోచించి నెమ్మదిగా దాన్ని అంతమొందిస్తారు జ్ఞానులు. దాన్ని అంతమొందించాలంటే దాని బలాబలాలేమిటో దాని స్వరూప స్వభావం ఏమిటో మనం తెలుసుకోవాలి కదా. ఒకటి కోరిక అనే రూపం కలిగినది. ఇది కోరుతూనే ఉంటుంది విరామం లేకుండా కోరుకుంటుంది. సాధ్యాసాధ్యాలను కూడా పట్టించుకోకుండా కోరుకుంటుంది. యుక్తాయుక్త విశ్లేషణను విడిచి కోరుకుంటుంది. రెండవ రూపం నింప శక్యం కానిది అంటే అపూర్ణం. పూర్ణం అంటే ఏంటో దానికి తెలియదు. నిండడం

అంటే ఏంటో దానికి తెలియదు. ఇది ఎంత నింపినా నిండదు. జల్లెడలో నీళ్లు పోసినట్లు దీని పరిస్థితి. ఎంత వర్షించినా సముద్రం నేను నిండానని నాకు చాలని చెప్పదు కదా. అందుకే ఇది 'దుష్పూరేణా' నింపశక్యం కానిది. మూడవ రూపం 'అనలేన చ'. ఈ కామం యొక్క మూడవ రూపం. అనలం అంటే అగ్ని నిప్పు. అలం అంటే చాలు అని అర్థం, అలం అనే పదానికి వ్యతిరేక పద స్వరూపం అనలం. దీని స్వరూప స్వభావమేమంటే చాలు అనేది లేనిది. దీనికి చాలు అనేది తెలియదు. ఎన్ని కట్టెలు వేసినా అగ్ని ఎలా కాల్చి భస్మం చేస్తుందో అలా ఇది కూడా చాలు అని చెప్పదు, అనుకోదు. అదే దాని స్వరూప స్వభావం. అందుకే అది అలం కాకుండా అనలం అయింది. కామం కూడా అలాంటిదే అందుకే అది అనలేనచ. ఇది ఈ మూడు విధాలైనటువంటి కామరూపేణ, దుష్పూరేణా, అనలేన చ,. నాయనా అర్జునా కామము అగ్నితో సమానమైనది అది ఎన్నటికీని చల్లారదు. జ్ఞానులకు నిత్య వైరి అది. మనిషి యొక్క జ్ఞానాన్ని కప్పివేసి ఉంది. జగద్గురువు దాని యొక్క చిరునామాన్ని చెప్పడమే కాకుండా దాని యొక్క స్వరూప స్వభావాలను కూడా మన ముందు ఉంచాడు. మనం కూడా మన లోపలి కెళ్ళి మనల్ని పరిశీలన చేసి దాని చిరునామా దగ్గరకు వెళ్లి అక్కడ దాని స్థావరాన్ని మనం జగద్గురువు అనుగ్రహంతో ఖాళీ చేయిద్దాం. మన ఆత్మసాక్షిని కప్పి ఉన్నటువంటి కామ శత్రువును చేదిద్దాం.

3అ, 40శ్లో.

ఇంద్రియాణి మనో బుద్ధి: అస్యాధిష్ఠానముచ్యతే |
ఏతైర్విమోహయత్యేష జ్ఞానమావృత్య దేహినమ్ | 40 |

ఇంద్రియములు, మనస్సు, బుద్ధి ఈ కామమునకు నివాసస్థానములు. ఇది (ఈకామము) మనోబుద్ధీంద్రియముల ద్వారా జ్ఞానమును కప్పివేసి, జీవాత్మను మోహితునిగా చేయును.

ఇంద్రియాలు, మనసు, బుద్ధి ఈ కామానికి నివాస స్థానాలు. ఈ కామం మనో బుద్ధింద్రియాల ద్వారా జ్ఞానాన్ని కప్పి వేసి జీవుడ్ని మోహింపజేస్తున్నది. మనం 37వ శ్లోకంలో అంతులేని పాపాలకు ప్రేరకం కామం అని దాని చిరునామాను తెలుసుకున్నాం. 38వ శ్లోకంలో అది ఎలా ఆవరించి ఉంటుందో మూడు రకాల ఉపమలతో తెలుసుకున్నాం. 39 వ శ్లోకంలో ఈ కామానికి చాలు అనేది తెలియదు నింపశక్యం కానిది అగ్నితో సమానమైనది ఇది మనిషిలోని జ్ఞానాన్ని కప్పి వేస్తుందని తెలుసుకున్నాం. ఈ శ్లోకంలో ఇంద్రియాలు మనసు బుద్ధి ఈ కామానికి నివాస స్థానాలని ఇది మనోబుద్ధి ఇంద్రియాల ద్వారా జ్ఞానాన్ని కప్పి వేసి మనిషిని మోహింపజేస్తోందని వివరిస్తున్నాడు జగద్గురువు. ఇప్పుడు మనం ఒకటి ఇంద్రియాలు అంటే ఈ పంచేంద్రియాలు, రెండు మనసు మూడు బుద్ధి ఈ కామానికి ఎలా

నివాసస్థానాలో మరి ఎలా వాటిని చేధించాలో మనం మనలోకి వెళ్లి అంటే వాటి నివాస స్థానాలకు వెళ్లి వాటిని వాటిపై దాడి చేస్తేనే అప్పుడు మనకు అనుభవేద్యం అవుతుంది. కాబట్టి మనం జగద్గురువు అనుగ్రహంతో మనతో మనం యుద్ధం చేయడానికి పూనిక వహిద్దాం. ఈ యుద్ధమే అసలైన యుద్ధం. ఇప్పుడు మనం వీటి స్థావరాలను పరిశీలిద్దాం. సంఘు విద్రోహశక్తులు, బందిపోట్లు, తీవ్రవాదులు ఎలా అయితే వారి కంటూ కొన్ని దుర్భేధ్యమైన స్థావరాలు ఏర్పాటు చేసుకొని విచ్ఛిన్నకరమైన కార్యకలాపాలు దేశంలో కొనసాగిస్తారో అలాగే కామక్రోధాది శత్రువులు కూడా ఈ దేహం అనే దేశంలోనే ప్రత్యేకమైన స్థావరాలను ఏర్పరచుకొని తన కార్యకలాపాలు కొనసాగిస్తుంటాయి. ఆ స్థావరాలే ఇంద్రియ మనోబుద్ధులు. అందుకే మనం ఆయా స్థావరాల్ని ధ్వంసం చేయాలి. అప్పుడు శత్రువులకు స్థానం ఉండదు కదా. ఇప్పుడు మనం చేసే కార్యాలన్నింటి వెనుక ఉన్నది కామమే కదా. కామం ఎప్పుడైతే నిరాశ్రయం అవుతుందో అప్పుడు కామ ప్రేరిత కార్యాలు ఉండవు. ఇవి అదృశ్యమైతే అశాంతి కూడా అదృశ్యమై శాంతి నెలకొంటుంది. ఇప్పుడు మనం ఒకసారి అన్నింటిని వీక్షిద్దాం. మొదటగా మనం ఆత్మసాక్షిని, ఆత్మ జ్యోతిని దర్శిస్తున్నాం. ఆత్మసాక్షి సచ్చిదానంద స్వరూపం. దానికి ప్రకాశమే తెలుసు. ఇక దేహమేమో జడము దేహం వల్ల మనకు ఎలాంటి ప్రమాదం లేదు. ఇక ఇంద్రియాలు విషయాలను తెలియజేసే మాధ్యమాలు, ఇవి జడమే. ఇక మనసు విషయానికి వస్తే అది మనిషి చేతిలో పరికరమే. బుద్ధి కూడా నిర్ణయానికి ఉపయోగపడే ఉపకరణం. ఇది చెడైనా మంచైనా దానికి సంబంధం లేకుండా నిర్ణయిస్తుంది. వీరందర్నీ చూశాక ఇప్పటికీ మనకు మన శత్రువు ఎవరో అంతుచిక్కడం లేదు కదా. ఏమి చేద్దాం ఇంకా ఇంకా నెమ్మదిగా మనం మనలోనే పరిశీలిద్దాం. ఇప్పుడు ఇలా మనం పరిశీలిస్తే ఈ బుద్ధి నిశ్చయం వెనుక ఉన్నది ఎవరు. ఓహో ఇక్కడ ఉన్నావా ఇదే ఈ కామమే మన మహా శత్రువు. ఈ కామ శత్రువు ప్రేరణ వల్లనే మనిషికి ఇష్టం లేని దాన్ని కూడా బుద్ధి కర్తవ్యం గానే నిశ్చయించడం, మనిషి ఆచరించడం జరిగిపోతాయి. అలా చేయకూడదని ఓవైపు అర్థమవుతున్నా ఈ మహాశత్రువు కామం ప్రేరణ చేత మనిషి వివసుడై చేసి తీరుతాడు. ఈ కామం అదే మహాశత్రువుకు మూడు ఆశ్రయ స్థానాలు ఉన్నట్లు మన పరిశీలనలో మనకు తెలియ వస్తోంది. అందులో మొదటి స్థావరం ఇంద్రియాలు, వీటికి ముందు చూపే గాని వెనుక చూపు, లోచూపు ఉండవు. ఇవి ప్రపంచాన్ని చూస్తాయి, కానీ మనసును చూడలేవు. ఇంద్రియాల ముందున్న ప్రపంచాన్ని చూడటానికి ఏర్పాటు చేసినవి ఇవి. కానీ మనసు అనేది ఇంద్రియాల వెనుక ఉంటుంది కదా కాబట్టి అవి చూడలేవు. ప్రపంచంలో కనిపించే విషయాలను దృశ్యాలను ఇవి మనసుకు చేరవేస్తాయి. అంతేకానీ ఇంద్రియాలు వాటికి ఆశ్రయ స్థానమైన మనసు వైపు తిరిగి చూడలేవు. మనసు నుండి చేతనత్వాన్ని పొందిన ఇంద్రియాలు నిరంతరం బాహ్య ప్రపంచం వైపు పరుగులు తీయగలవు గాని మనసును ఎట్టి పరిస్థితిలోనూ చూడలేవు గాక లేవు. ఎందుకంటే వీటి అమరిక అలాంటిది. అయితే మనసు మాత్రం ఈ ఇంద్రియాల ద్వారానే బాహ్య ప్రపంచాన్ని స్పర్శించగలవు, చూడగలవు, వినగలవు. మరో మార్గం లేదు. ఇంద్రియ ద్వారాలను మూసేస్తే మనసు బాహ్య ప్రపంచపు భౌతికత వైపు పరుగులు తీయాలని ఉబలాటపడినా దానికి మార్గం

ఉండదు కదా. ఈ విధంగా మన మహా శత్రువు ప్రధమ నివాస స్థావరమైన ఇంద్రియాల్ని మూసేద్దాం. ఇంద్రియాల్ని మూయడానికి ఆయుధం కావాలి. ఇప్పుడు మనం స్థిర సుఖ ఆసనంలో కూర్చొని వేళ్ళలో వేళ్ళు కలుపుకొని రెండు కళ్ళు మూసుకుని ప్రకృతి సహజ సిద్ధంగా జరుగుతున్న ఉచ్ఛ్వాస, విశ్వాసాలను గమనించడం ద్వారా ఈ ప్రక్రియ ద్వారానే ఈ మహాశత్రువు ప్రధమ నివాస స్థావరాన్ని ఖాళీ చేయించాలి. మరో మార్గం లేదు గాక లేదు. ఈ ప్రక్రియను గురించి సవివరంగా ఆరవ అధ్యాయంలో జగద్గురువు తెలియజేసి ఉన్నారు. ఇలా బాహ్య ప్రపంచం వైపు పరుగులెత్తే ఇంద్రియాల యొక్క మార్గాన్ని మనం మూసేశాం కదా. ఇక కామ శత్రువు యొక్క రెండవ నివాస స్థావరం మనసు. పైన మనం చెప్పుకున్న పద్ధతిలో ఇంద్రియాలన్నీ తమ తమ స్థానాల్లోనే సంయమిస్తాయి. అప్పుడు పరుగులెత్తడం మానేస్తాయి కదా. ఇప్పుడు ఏం జరుగుతుందంటే ఈ కామం తన స్థావరాలుగా ఏర్పరచుకున్న ఇంద్రియాల నుంచి ఖాళీ చేసుకుని మరో దారి కోసం వెతుక్కుంటూ వెళ్లి మనసును స్థావరంగా మార్చుకుంటుంది. మనసు లేకపోతే ఇంద్రియ వ్యాపారాలు సాగవు కానీ ఇంద్రియాలు లేకపోయినా మనసు తనకు తానుగా వాటి సహాయం లేకుండానే స్వయంగా చింతించగలదు, విషయచింతనతో రమించగలదు. తన మనో వ్యాపారం తను చేసుకోగలదు. దేశ కాల పరిస్థితులను అధిగమించి మనసు వ్యవహరించగలదు. కానీ ఇంద్రియాలు దేశ కాల పరిస్థితుల పరిధిలో మాత్రమే సంచరించగలవు. ఆ కారణంగా ఈ వస్తు ప్రపంచంలో సంచరించడానికి మనస్సే ఇంద్రియ రూపంలో వ్యక్తం అవుతుంది. ఈ ప్రకారం విషయాన్ని మనస్సే స్వయంగా మనసుతో విషయాన్ని సంగ్రహించుకుంటుంది. ఇలా మనసును ఆవరించిన కామం మనసును రెచ్చగొట్టి ఇంద్రియాల ద్వారా విషయ ప్రపంచంలోకి నెట్టుతుంది. కానీ ఆ సమయంలో దృశ్యాధుల నుండి మనసును విరమింప చేయాలి. ఎలా? పైన చెప్పిన ప్రక్రియ ద్వారా చేసి శ్వాస పైనే ధ్యాస ఉంచేలా నియమించాలి. అంటే ఈ సద్విషయం పైకి తన చింతనను మరలిస్తున్నాం. మనసుకు ఏదో ఒక వ్యాపారం ఉండాలి కదా అందుకని మనం దాని యొక్క వ్యాపార విధానాన్ని మరలుస్తున్నాం. ఇంకేముంది ఈ ప్రక్రియ ద్వారా మనం మరింత శ్వాస శక్తిని, ప్రాణ శక్తిని పొందుతాం. ఇలా దాన్ని భౌతికత నుండి దారి మళ్లించి మనం సద్వినియోగపరచుకుంటే మనకేం లాభం. అంటే ప్రాణ శక్తి సంపూర్ణంగా నిండి సంపూర్ణ ఆరోగ్యం అనే లాభం పొందుతాం. రెండు అలా మనసు ముళ్ళబాటలోకి వెళ్లి మనకు తెచ్చి పెట్టేటటువంటి ప్రమాదం నుంచి కూడా మనం తప్పించుకున్న వారమవుతాం. అంటే ఆ ప్రమాదం నుంచి మనం క్షేమంగా నిశ్చింతగా ఉండిన వారం అవుతాం. మనసును ఆ ముళ్లబాట నుండి ఆ మార్గంలో వెళ్లడం ద్వారా కలిగే ప్రమాదం నుండి తప్పించడం అద్భుతమైనటువంటి లాభం. కాబట్టి ఈ పరిస్థితుల్లో అంటే ఏ పరిస్థితుల్లో కామం మనస్సును ఆమాంతం రెచ్చగొట్టి ఇంద్రియాలు సంయమించి ఉన్నా వాటిపైకి దండెత్తే సందర్భంలోనే మనకు ఉండాల్సింది అప్రమత్తత. అందుకే సాధకుడు ప్రత్యేకంగా సమయం కేటాయించి ఆ స్థితిని సాధించుకుంటారు. ఇలా దాన్ని ఎదుర్కొని దాని సంగతిని తేల్చి దాని స్థావరాన్ని కూడా ఖాళీ చేయించాలి. ఇక్కడ దేని స్థావరం మహా శత్రువు అయినటువంటి కామం మనస్సు అనే దాన్ని కదా స్థావరం గా చేసుకొని ఉంది. ఇంద్రియాల

నుంచి ముకుమ్మడిగా పరుగులెత్తి ఆ స్థావరాన్ని కూడా మనం ఖాళీ చేసి పరిశుద్ధం చేయాలి. ఇక మనం పొందిన రెండు లాభాలను దృష్టిలో ఉంచుకొని ఎలాగో మనం ప్రమాదం నుంచి తప్పించుకున్నాం అనే అంశాన్ని దృష్టిలో ఉంచుకొని ఇకపై మనం ఏ పద్ధతిలో మెలగాలి అని సద సద్వివేక దృష్టితో సరైన లాభాలు పొందే దిశగా అడుగులు వేయాలని ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. లేకపోతే రాకపోకలు కలిగిన సుఖదుఃఖాల వైపు అత్యాశతో వెళ్లడం వల్ల 3-30 వ శ్లోకంలో చెప్పుకున్నట్లు నిరాశ నిస్పృహలు తప్ప మరేం ప్రయోజనం లేదనే వివేకాన్ని మనసుకు బాగా పట్టించాలి. ఇలా మనసును ఇంద్రియాలను కామంచేతి నుండి తప్పించి మనం మన చేతుల్లోకి తీసుకోవాలి. ఇంకేముంది కామ శత్రువు నివాస స్థావరం అయినటువంటి మనసు నుండి కూడా దాన్ని ఖాళీ చేసి పరిశుద్ధం చేసేసాం. ఇక ఆ కామానికి అవకాశం ఎక్కడ ఉండవచ్చు ఇది కూడా ఇంకా నెమ్మదిగా పరిశీలిద్దాం. ఇంకా ఎక్కడైనా దానికి అవకాశం ఉందేమో. ఇలాగే మనం లోతుల్లోకి వెళ్లి పరిశీలన చేస్తూ చేస్తూ ఉండగా 3-33 వ శ్లోకం మనం పునఃశ్చరణ గావించుకుంటే చిత్తమనేటటువంటి అంతరంగ అంతర్జాలంలో నిల్వ ఉన్న పూర్వజన్మల గత జన్మల సంస్కార ప్రభావ జనిత ప్రకృతి. సమస్త ప్రాణులు తమ తమ పూర్వజన్మల సంస్కారజనిత ప్రభావాలకు లోబడి జ్ఞానులు అజ్ఞానులు కూడా ప్రవర్తిల్లుతుంటారు. ఇక అది చేసేదేమీ లేక ఇంద్రియాల స్థావరం ఖాళీ అయింది. మనసు స్థావరం ఖాళీ అయింది. ఇక తన స్థావరాన్ని ఎక్కడ ఏర్పాటు చేసుకోవాలి అని ఆలోచనలో పడ్డటువంటి మహాకామ శత్రువు తన స్థావరాన్ని బుద్ధిలో ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. అర్జునుడి ప్రశ్న 3-36వ శ్లోకంలో ఇదే కదా, ఏమని ప్రశ్నించాడు. కృష్ణా మానవుడు తనకు ఇష్టం లేకున్నా ఇతరులు బలవంతంగా నెట్టివేసినట్లుగా రాజు సేవకులను నియోగించినట్లుగా దేని ప్రభావంతో ప్రేరితుడై పాపాలు చేస్తున్నాడు కృష్ణా అని సూటిగా ప్రశ్నించాడు. సంపూర్ణ చిరునామా తెలిసింది ఈ మూడవ స్థావరంలో మనకు. ఈ కామేచ్ఛ ఇంద్రియాల నుండి, మనసు నుండి నిలవడానికి నీడ లేక వెతుక్కుంటూ వెళ్లి బుద్ధిలో స్థిరమై నెమ్మదిగా రూపుదిద్దుకుంటుంది. ఈ విషయాలు కోరదగినవి గానే ఉన్నాయి అనే ఒక బలమైన నిశ్చయాన్ని అధికారాన్ని హక్కును కూడా ఇక్కడ పొందే అవకాశం ఉంది. ఆ కారణంగా ఇక్కడ దానికి వెయ్యింతలై తిష్ట వేసుకుంటుంది. ఈ బుద్ధి ఇది మంచిదే అయినా ఆలోచిద్దాంలే అనుకుంటుంది. అప్పుడు ఆలోచించడానికి దానికి మనసు సహాయం కావాలి కదా. మనసును తోడు తీసుకోవడానికి ప్రయత్నిస్తుంది. అప్పుడు ఆ బుద్ధికి ఆలోచనకు సహాయపడేటటువంటి మనసు సహకరించదు కదా. అందుకని అది తేల్చుకోలేక చేసేదేమీ లేక స్థిరంగా నిశ్చయంగానే ఉంటుంది. అది దాని స్వభావం. ఎందుకంటే అది చేయాలంటే, అది కదలాలంటే దానికి తోడు మనసు, మనసుకు తోడు ఇంద్రియాలు కదలాలి కదా. అందుకే మనం ముందే వాటి స్థావరాలను ఖాళీ చేసేసాం. ఈ కోణంలో బుద్ధిని ఆలోచింపజేస్తే రాగద్వేషాలు సుఖదుఃఖాలు అన్నీ రాలిపోతాయి. వాటి స్థానంలో ధర్మాధర్మాలు మొగ్గ తొడుగుతుంది. ఇక స్వధర్మాచరణలో కామం ఆటలు సాగవుగాక సాగవు. అక్కడ అంతా నియమిత కర్మే కదా. అందులో తల దూర్చే సాహసం గాని, దాన్ని అధిగమించే స్థాయి గాని బుద్ధికి ఉండదు. ఎందుకంటే బుద్ధి వివేకం కలిగినది కాబట్టి స్వధర్మం

మొగ్గ తొడి గాక బుద్ధి యొక్క ఓటు స్వధర్మాచరణకే గాని కామానికి కాదు. ఇంతటితో ఈ బుద్ధి స్థావరం కూడా ఖాళీ. ఎప్పుడు పంచేంద్రియాలు, మనసు విశ్రాంతి స్థితిలో ఉంటాయో బుద్ధి ప్రయత్న రహితమై ఉంటుంది. ఆ స్థితి పరమపదానికి దారి తీస్తుంది. ఈ విధంగా మనలోని మహా శత్రు నివాస స్థావరాలపై వివేకపూరితంగా దాడి చేసి మోహానికి గురి చేస్తున్నటువంటి మహాశత్రువు అయినటువంటి కామాన్ని మట్టు పెట్టాలి. ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి ఈ కామానికి నివాస స్థానాలు ఇది మనో బుద్ధి ఇంద్రియముల ద్వారా జ్ఞానాన్ని కప్పివేసి మనిషిని మోహింప చేస్తోంది.

3అ, 41శ్లో.

తస్మాత్ త్వమింద్రియాణ్యాదౌ నియమ్య భరతర్షభ |
పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞానవిజ్ఞాననాశనమ్ ||

అర్జునా! అందువల్ల నువ్వు మొదటగా ఇంద్రియాలను వశపరచుకో తరువాత కామాన్ని పూర్తిగా పరిశుద్ధం చెయ్యి. జ్ఞాన విజ్ఞానాన్ని హరిస్తున్నటువంటి మహా పాపి అది అంటున్నాడు జగద్గురువు.

ఇక్కడ మనం 2-61లో ఇంద్రియాల్ని సమాహిత చిత్తంతో వశపరచు కొన్నవాని బుద్ధి స్థిరంగా ఉంటుందని అక్కడ బోధించిన జగద్గురువు ఇక్కడ మనకు దాని ఆచరణ మార్గాలను తెలుసుకోమని చెబుతున్నాడు. అలాగే 'పాప్మానం' అని చెప్పడంలో ఆంతర్యం ఏమంటే సర్వసాధారణ మనుషులకు అర్థమయ్యే రీతిలో చెప్పాలని ఈ పదాన్ని ప్రయోగించాడని మనం అర్థం చేసుకోవాలి. కోరిక పరిధి దాటితే అది 3-37 'మహాపాప్మా', ప్రస్తుత శ్లోకంలో 'పాప్మానం' అంటే పాప స్వరూపం గలది అని అర్థం. అయినా జగద్గురువు ఎందుకు ఇలాంటి పదాన్ని ప్రయోగించాడంటే మనం బాహ్య సంపదలు నశించినా మళ్ళీ కొంత శ్రమతో ప్రయత్నంతో వాటిని ఏర్పాటు చేసుకోగలం. కానీ సంవత్సరాల తరబడి జన్మజన్మలుగా శ్రమించి సాధించుకున్న జ్ఞాన విజ్ఞానాన్ని సైతం క్షణంలో పాడు చేస్తుంది కదా. ఇలా ఎంతో సాధనతో పొందిన జ్ఞాన విజ్ఞానాన్ని క్షణంలో నాశనం చేస్తున్నందువల్ల దీనిని మహా పాపిగాను, మహాశత్రువు గాను, జ్ఞానికి నిత్య శత్రువు గానూ పేర్కొన్నాడు. ఇంకా 'ప్రజహి'' అని చెప్పడం వల్ల పూర్తిగా సమూలంగా వేర్లతో సహా పెకలించాలి. 2-55వ శ్లోకంలో 'ప్రజహాతి' అన్నప్పుడు దీని అర్థం అక్కడ సవివరంగా చెప్పుకున్నాం. ఇలా సర్వ అనర్థహేతువైనటువంటి నిత్య శత్రువు అయిన తీవ్రమైన కోరిక యొక్క ఆశ్రయ స్థానాన్ని చిరునామాతో సహా గుర్తించాం. దాని కార్యకలాపాలు ఎలాంటివో మనం ప్రత్యక్షంగా వాటి నివాస స్థావరాలకు ఆత్మ పరిశీలన ద్వారా ప్రయాణించి అక్కడకు చేరుకొని వీక్షించాం. అందువల్ల తక్షణమే 'నియమ్య వశీకృత్యా' దాన్ని మనం వశపరచుకోవాలి. గీత సాధకులైన మనం గీతా

సాధకులైన మనం ఇంద్రియ మనోబుద్ధుల్ని నియమించే ప్రయత్నంలో ముందుగా వాటిని అనవసరమైన భౌతిక విషయాలు నుండి దూరం చేయాలి. ఏ క్షణమైనా అవి ఆయా విషయాలలోకి జారిపోవచ్చు. కాబట్టి చాలా అప్రమత్తంగా ఉంటూ మనం జారిపోకుండా వాటిని చూడాలి. దీనికి మనం ముందు శ్లోకంలో తెచ్చుకున్న ఆనాపాన సతి ప్రక్రియ అనే ఆయుధం సంపూర్ణంగా దోహదం చేస్తుంది. అంతేకాకుండా ఈ ఆనాపాన సతి ప్రక్రియలో మన మహా శత్రువును మట్టు పెట్టడానికి కావలసిన శక్తిని సంపూర్ణ ఆరోగ్యాన్ని అప్రమత్తతను కూడా సంప్రాప్తింప చేస్తుంది. ఈ ఆయుధంతో మన విజయానికి నాంది. ఈ విజయం అనే ఉపకరణంతో నెమ్మదిగా రాగద్వేషాలు సుఖదుఃఖాల లాంటి రాకపోకలు గలిగిన వాటిపై ఆసక్తిని మనసు నుండి దూరం చేస్తాం. ఇలా మనసును వాటి నుండి తప్పించి మనసును జయించిన వారు మహిని జయించవచ్చు అనే సూత్రంతో మనం ఈ కామ శత్రువును జయించవచ్చు. ఇక దానికున్న ఏకైక అవకాశం పూర్వజన్మ సంస్కారజనిత వాసనల ద్వారా ప్రేరేపింపజేయడం, తద్వారా బుద్ధిలో రూపుదిద్దుకోవడం. అయితే మనం పై రెండింటి విజయంతో దాన్ని కూడా అవలీలగా ఛేధించి అధిగమించగలం. తద్వారా మనతో మనం చేసే మహాయుధంలో మహా విజయాన్ని పొంది మనల్ని మనమే పరిపాలించుకునే స్థితికి 3-39 లో చెప్పుకున్న రారాజు స్థితికి చేరుకుంటాం. ఇలా మనం ఇంత కాలంగా వాటికి బానిసలుగా బతుకుతూ బతుకును అతి కష్టంతో ఈడుస్తూ కష్ట సుఖాలలో కన్నీరు కారుస్తూ ఆవేదనకు ఆందోళనకు గురై మన జీవిత వినాశనానికి మనమే కారణమవుతున్న దుస్థితికి స్వస్తి పలుకుదాం. అసలు జీవంతో కూడుకున్న జీవితంలోని జీవశక్తితో కూడి జీవించే నిత్యానందకరమైన నిత్యసత్యమైన ఆధ్యాత్మిక జీవితానికి నాంది పలుకుదాం. ఇంద్రియాలు మనసు బుద్ధి కోరికకు నివాసస్థావరాలు , అది వాటిని ఆశ్రయించుకుని మనిషి యొక్క జ్ఞానాన్ని తప్పివేసి నానా విధాలుగా మోహింపజేస్తూ జ్ఞాన విజ్ఞాన వినాశనానికి హేతువుతున్న కారణంగా తక్షణమే దాన్ని అధిగమిద్దాం, ఛేధిద్దాం.

3అ, 42శ్లో.

ఇంద్రియాణి పరాణ్యాహుః ఇంద్రియేభ్యః పరం మనః |
మనసస్తు పరా బుద్ధి: యో బుద్ధే: పరతస్తు సః ||

దేహం కంటే ఇంద్రియాలు గొప్పదని, ఇంద్రియాల కంటే మనసు గొప్పదని మనసు కంటే బుద్ధి గొప్పదని అంటారు. బుద్ధి కన్నా పైనున్నదేదో అదే ఆత్మ అని చెబుతారు.

తీవ్రమైన కోరిక అనే మహాశత్రువును పేర్కొని వాటిని వశం చేసుకోవాలని చెప్పిన జగద్గురువు ఈ శ్లోకంలో వాటి యొక్క బలాబలాలను వరుసగా తెలియజేస్తున్నాడు. దేహం అప్రకాశం, దేహి ప్రకాశం. దేహం ఓ వాహనం లాంటిది. అలా మనం చూస్తే దేహం కంటే ఇంద్రియాలు ప్రకాశవంతమైనవిగా కనిపిస్తుంది. ఎందుకంటే ఎవరైనా మనల్ని పిలిస్తే వెంటనే మనం వారి వైపు తిరిగి చూస్తాం, అలాగే ముందుకు నడిచి వెళుతూ ఉన్నప్పుడు ఎవరైనా వెనుక నుండి పిలచినా వెంటనే మనం వెనక్కి తిరిగి చూస్తాం. వాసనలు ఎటువైపు ఉన్నా మనం తెలుసుకుంటున్నాం. అలాగే అన్ని విషయాల్లో కూడా. ఉదాహరణకు దేహం తనను తాను దర్శించలేదు కదా తనకు తాను దృశ్యమానం కాదు కూడా. ఇంద్రియాలు దేహాన్ని దర్శిస్తాయి స్పృశిస్తాయి, ఆఘ్రాణిస్తాయి. ఇవి దేహం కన్నా సూక్ష్మంగా ఉంటాయి. ఎక్కడో ఉన్న ఆకాశాన్ని ఆకాశంలోని చంద్రుణ్ణి కూడా కళ్ళు ఇక్కడి నుంచే చూస్తున్నాయి కదా అలా. వ్యక్తం అయ్యే స్థూల పంచభూతాల నుండి దేహం ఉద్భవిస్తే, అవ్యక్త అపంచీకృత సూక్ష్మభూతాల నుండి ఇంద్రియాలు ఆవిర్భవిస్తాయి. ఈ అంశం మనకు 3-7లో 3-14లో 3-24 లో పరిచయం చేసుకున్నాం. పరబ్రహ్మం లేదా పురుషుని మాయ ద్వారా ఏర్పడినటువంటి ప్రకృతి, అందులో అవ్యక్త మాయమయ ప్రకృతి తద్వారా త్రిగుణాలు అని తెలుసుకున్నాం. 3-28లో ఆ త్రిగుణ జనిత మాయమయ ప్రకృతి పరిణామం చెంది స్థూల సూక్ష్మ భూతాలుగా ఏర్పడ్డాయని తెలుసుకున్నాం. ఆ సూక్ష్మ భూతాంశం నుండి శ్రోత్రాది సూక్ష్మఇంద్రియాలు జయించాయని తెలుసుకున్నాం. అందుకే మనం అక్కడ ఇంద్రియ మనోబుద్ధులు ఆయా గుణాల నుండి పుట్టినా లేదా కలిగినా లేదా పొటమరించినా లేదా అంకురించిన భావనే అని అక్కడ చర్చించుకున్న అంశాన్ని ఒకసారి గుర్తు తెచ్చుకోవాలి. ఆ భావన ద్వారా జనించినవే ఈ అపంచీకృత అవ్యక్త సూక్ష్మేంద్రియాలు. అలాగే ఇంద్రియాలు ఇంద్రియాలలో, గుణాలు గుణాలలో ప్రవర్తిల్లుతుంటాయని తెలుసుకున్నాం. ఈ అవగాహనతో మనం ప్రస్తుత శ్లోకంలోని అంశాల్ని అర్థం చేసుకోవాలి. ఇలా చూస్తే స్థూలదేహం కన్నా సూక్ష్మ ఇంద్రియాలు గొప్పవి,శక్తివంతమైనవి కూడా. ఆ కారణంగా దేహం కంటే ఇంద్రియాలు ఇంద్రియాల కంటే మనసు శక్తివంతమైనది గొప్పది కూడా. అందుకే దేహం చేరుకోలేని ఆకాశంలోని చంద్రుణ్ణి కళ్ళు చేర గలుగుతున్నాయి. అయితే కనిపించని అనేక దృశ్యాల్ని శబ్దాల్ని మనసు చూడగలదు వినగలదు. ఎక్కడో ఎప్పుడో చూసినవి విన్నవి మళ్ళీ మనకు కనిపిస్తాయి, వినిపిస్తాయి. అందుకే ఇది పంచేంద్రియాల కన్నా సూక్ష్మమైనది వాటికన్నా శక్తివంతమైనది. ఇంద్రియాలు చూడలేనివి వినలేనివి మనసుతో చూడటం వినటం సాధ్యపడుతుంది. ఇంద్రియాల్ని ప్రేరేపింపజేసేది, ప్రవర్తింపజేసేది మనస్సే. ఆజ్ఞాపించి నడిపించేది కూడా మనస్సే. మనసు చేతనత్వం తోనే ఇంద్రియాలు పని చేస్తాయి. మనసు వాటితో చేరకపోతే అవి అచేతనాలవుతాయి. కానీ ఇంద్రియాలు లేకపోయినా మనసు తనతో తాను వ్యవహరించగలదు ఊహించగలరు సంకల్పించగలదు వికల్పించగలదు. ఇంద్రియాలన్నీ ఆదమరచి చలించని చెట్టు కొమ్మల్లాగా నిశ్చలంగా ఉన్న నిద్రావస్థలో కూడా మనసు స్వప్నాన్ని సృష్టించుకుని క్రీడించగలదు. తానే నేత్రమై చూడగలదు. అలాగే శ్రోత్రమై వినగలదు కూడా. ఇలా పంచేంద్రియాలు చేసే అన్ని వ్యాపారాలను మనసు ఒక్కటే తనలో

తాను తనతో తాను నిర్వహించుకోగలదు. కాబట్టి అలా కంటే బలమైనది శక్తివంతమైనది మనస్సు. తరువాత మనస్సు కంటే బుద్ధి ఇంకా ఇంకా సూక్ష్మమైనది శక్తివంతమైనది గొప్పది. అది ఎలా చూద్దాం, సంకల్ప వికల్పాల మధ్య చలించడమే కాక ఇంటాబయట అంటే దేహం లోపలా దేహం వెలుపలా చరించే మనసును నిశ్చయించి నిలిపేది బుద్ధి కదా. మనస్సేమో తనతో తాను గాని లేదా ఇంద్రియాలతో గాని చేరి వ్యవహరించగలదు. అంతేగాని లోపల ఉన్న చైతన్యం వైపుకు పయనించలేదు కదా. కానీ బుద్ధి అలా కాదు, అటు మనసుతో తద్వారా ఇంద్రియాలతో చేరి ప్రపంచంలోకి పోగలదు. ఇటు వెనక్కు తిరిగి ఆత్మ వైపు కూడా పయనించగలదు. ఆత్మతో కూడా అనుసంధానమై ఉండగలదు. మనసు ఇది అని తెలుస్తుందే గాని అహం లేకుండా అంటే 3-27 లో చెప్పుకున్న అహం అనే భావన, నేను అనే భావనను బుద్ధి లేకపోతే అది గ్రహించలేదు. అంటే బుద్ధి ద్వారానే బుద్ధి సహాయంతోనే మనసుకు ఉనికి లేకపోతే లేదు. ఎందుకంటే ఈ అహం అనే వృత్తి బుద్ధిలోనే జనిస్తుంది. అంటే బుద్ధికి మనసు ఇదంగా తెలుస్తుంది. మనసుకు ప్రేరణను ఇచ్చేది అహం, నేను అనే వృత్తి. తద్వారా ఇదం అయిన మనసు ప్రవర్తిస్తుంది. దీన్నిబట్టి ప్రవర్తించే దానికన్నా ప్రేరేపించేది బలమైనది కదా. ఈ కారణంగా బుద్ధి మనసు కంటే బలమైనది, శక్తివంతమైనది, సూక్ష్మమైనది. ఇక బుద్ధి కంటే పైనున్నది ఆత్మ, ఇది బుద్ధి కంటే గొప్పది బలమైనది శక్తివంతమైనది. బుద్ధిలో కదిలే అహం వృత్తిని ఈ అహం వృత్తి ద్వారా దృశ్యమానమయ్యే ఇదం అనే మనసు వృత్తులను, తద్వారా ఇంద్రియ మనో బుద్ధుల్ని, ఇలా వీటన్నింటి ద్వారా దేహాన్ని ఇలా వీటన్నింటికీ చేతనత్వాన్ని కలిగించేది ప్రకృతి, త్రిగుణాలు, స్థూల సూక్ష్మ భూతాంశాలైన దేహేంద్రియాదులన్నింటి పుట్టుకకు కదలికకు కారణభూతమైనది బుద్ధి కంటే సూక్ష్మాతి సూక్ష్మమైనది ఆత్మ సాక్షి. ఇదే సర్వవ్యాపి, సర్వకారణమైనది, సదా ప్రకాశించేది. తత్కారణంగా ఆత్మ సాక్షి బుద్ధి కంటే సూక్ష్మాతి సూక్ష్మమైనది, బలమైనది, గొప్పది, శక్తివంతమైనది. ఇలా ఇంద్రియాలు ఐదు, మనసుతో కలిపి ఆరు, బుద్ధితో కలిపి ఏడు వీటన్నింటికీ రారాజు అష్టమ స్థానమైన జ్ఞాత ఆత్మసాక్షి అదే జగద్గురువు స్వరూపం ఓం నమో భగవతే వాసుదేవాయ. కఠోపనిషత్తు ప్రకారం ఇంద్రియాల కన్నా మనసు మనసు కన్నా బుద్ధి బుద్ధి కన్న ఆత్మ శ్రేష్టమైనది. శ్రేష్టమైన ఆత్మ కన్నా అవ్యక్తం శ్రేష్టమైనది. అవ్యక్తాని కన్నా భగవంతుడు 3-27లో చర్చించుకున్న నిరూపించుకున్న పురుషుడు, భగవంతుడు. అదే 2-72లోని బ్రాహ్మీస్థితి. ఇలా ఇంద్రియాల కార్యకలాపాలు ప్రత్యేకమైనవి వాటితో ఆత్మకు ఏ సంబంధం లేదన్న విషయం గ్రహించి మనసు ఆత్మతో ఏకమైతే ఇంద్రియాలు సహజంగానే తమ వేగాన్ని కోల్పోతాయి. అలా ఆత్మసాక్షితో ఏకమై అవ్యక్తం అర్థం చేసుకొని పురుషుణ్ణి భగవంతుణ్ణి అనుభవైకవేద్యం చేసుకుంటే మనిషి అమరత్వ స్థితిని పొందవచ్చు. స్థూల శరీరం కంటే ఇంద్రియాలు, ఇంద్రియాల కంటే మనసు, మనసు కంటే బుద్ధి, బుద్ధి కంటే ఆత్మ అత్యంత శ్రేష్టమైనది, సూక్ష్మమైనది.

3వ అధ్యాయం, కర్మయోగం అవలోకనం.

కర్మయోగం ప్రారంభించిన అర్జునుడు మొదటి రెండు శ్లోకాలలో జనార్ధనా కేశవా కర్మ కంటే జ్ఞానం శ్రేష్ఠమని మీ అభిప్రాయం అయితే ఈ ఘోరమైన యుద్ధానికి నన్నే ఎందుకు నియోగిస్తున్నావు నాకు అర్థం కావడం లేదు అస్పష్టంగా ఉన్న నా బుద్ధికి అంతా కలగాపులగంలా అనిపిస్తోంది నాకు శ్రేయోదాయకమైన మార్గాన్ని నీవే నిశ్చయించి చెప్పు అని సందేహాన్ని వ్యక్తం చేస్తాడు. ఈ ప్రశ్నకు 3వ శ్లోకంతో తన సమాధానం ప్రారంభించిన జగద్గురువు 35వ శ్లోకంతో తన సమాధానాన్ని ముగించాడు. పూర్వం నేను జ్ఞానులకు జ్ఞాననిష్ఠ, కర్మలు చేసే వారికి కర్మయోగులకు కర్మ నిష్ఠ అనే రెండు మార్గాలను ఈ లోకంలో సృష్టి ఆదిలోనే వేద సంప్రదాయాన్ని ఆవిష్కరిస్తూ చెప్పి ఉన్నానని మూడవ శ్లోకంలో పేర్కొన్నాడు. కర్మలు మానినంత మాత్రాన ఆత్మ స్వరూపంలో నిలిచి ఉండే స్థితి జ్ఞాననిష్ఠ కలగదని 4వ శ్లోకంలో స్పష్టంగా తెలుసుకున్నాం. భూమి మీదనున్న ఏ ప్రాణి కర్మలు చేయకుండా క్షణం కూడా ఉండలేరని ప్రకృతి గుణాలు అందర్నీ వివసుల్ని చేసి ప్రతి ప్రాణిలోనూ కర్మలను చేయిస్తాయని 5వ శ్లోకంలో తెలుసుకున్నాం. కర్మేంద్రియాలను నిరోధించి ఇంద్రియ విషయాలని మనసులో స్మరిస్తూ ఉండే మూఢుల్ని మిధ్యాచారులని కపటులని అవివేకులని పాపాచారులని 6వ శ్లోకంలో తెలుసుకున్నాం. 7వ శ్లోకంలో జ్ఞానేంద్రియాలు మనసుచే నియమించి ఫలాసక్తి లేక కర్మయోగం అనుసరించేవారు శ్రేష్టులని తెలుసుకొని ఈ పంచభూతాత్మక శరీరంలోని 25 తత్త్వాల్ని పరిచయం చేసుకొని ఆయా పంచభూతాత్మక అంశాలన్నీ కూడా ఆయా స్థానాల నుండి స్థానవృత్తిని తప్పడమే వ్యాధి పుట్టుకకు, దారి తప్పుటకు కారణమని తెలుసుకున్నాం. కర్మయోగాచరణ గావించకపోతే ఈ దేహంలోని దేహి యాత్ర కూడా కొనసాగక జన్మ వృధా అవుతుందని 8వ శ్లోకంలో తెలుసుకున్నాం. మనం చేసే ప్రతి కర్మ యజ్ఞార్థమై దైవ సమర్పణ దృష్టితోనే కర్మ యజ్ఞాన్ని నిర్వహించాలని 9వ శ్లోకంలో తెలుసుకున్నాం. 10వ శ్లోకంలో బ్రహ్మ కల్పాదిలో అంటే సృష్టి ఆరంభంలో యజ్ఞాలతో సహా ప్రజల్ని సృష్టించాడని ఈ యజ్ఞాల చేతనే మానవుడు వృద్ధి పొందుతాడని మనం చేసే యజ్ఞమే కామధేనువై మన అవసరాలను తీరుస్తుందని జీవితమనే మహా యజ్ఞం గురించి తెలుసుకున్నాం. మానవుడికి దేవుడికి ఉన్న అవ్యక్త అద్భుత దైవిక సూత్రాన్ని ప్రతిపాదించే అంశాల్ని 11వ శ్లోకంలో తెలుసుకున్నాం. ఈ సూత్రాన్ని అనుసరించి ప్రవర్తించక కర్తృత్వ భావన భోక్తృత్వ భావనతో కర్మలు చేసేవారు దొంగలని 12వ శ్లోకంలో తెలుసుకున్నాం. ఈ సృష్టి చక్రంలో యజ్ఞ చక్రం ప్రధాన పాత్ర వహిస్తుందని చర్చిస్తూ యజ్ఞ భావనతోనే కర్మల్ని నిర్వహిస్తూ మనం తినే ఆహారాన్ని దైవం కోసమే చేసే నైవేద్యంగా భావించి వంట యజ్ఞాన్ని నిర్వహించాలని అలా వండిన అమృత ఆహారాన్ని బ్రహ్మార్పణంగావించి ఆ యజ్ఞశేషాన్ని మహా ప్రసాదంగా స్వీకరించాలని పంచ మహా యజ్ఞాల గురించి సమగ్రంగా 13వ శ్లోకంలో చర్చించుకున్నాం. మన శరీర నిర్మాణాన్ని అందులో పంచభూతాంశాల పనితీరును ఈ దేహానికి అవసరమైన ఆహారం ఉత్పత్తిని గురించి ఆహారమే ప్రాణి పుట్టుకకు కారణం అవుతున్న విధానాన్ని చాలా స్పష్టంగా

చర్చించుకున్నాం. అలాగే ప్రాణులు అన్నం వల్ల, అన్నం వర్షం వల్ల, వర్షం యజ్ఞం వల్ల, యజ్ఞం కర్మ వల్ల, కర్మ బ్రహ్మం వల్ల ఉద్భవించిందని తెలుసుకున్నాం. అంటే ఈ దేహం అనే యాగశాలలో నిరంతరం చేయాల్సిన యజ్ఞం అలా మనం చేసే యజ్ఞమే తిరిగే ప్రాణి పుట్టుకకు, సృష్టి పరిపుష్టంగా కొనసాగడానికి కారణమని చాలా స్పష్టంగా 14,15 శ్లోకాలు తెలుసుకొని ఇందులో యజ్ఞచక్రం, కర్మచక్రం, ధర్మచక్రం లాంటి అనేక అంశాల్ని సమగ్రంగా చర్చించుకున్నాం. 16వ శ్లోకంలో ఈశ్వరుడిచేత ప్రవర్తితమైన వేదయజ్ఞ పూర్వకమైన జగత్ చక్రపు కర్మయోగంలో సృష్టి చక్రపు పనితీరును తెలుసుకొని దారి తప్పకుండా ధర్మచక్రాన్ని అనుసరించాలని విశ్వచక్రం ప్రవర్తిల్లే తీరును సవివరంగా చర్చించుకున్నాం. అలా లేని వారు ఇంద్రియాల సుడిగుండంలో చిక్కుకొని పరిభ్రమించే ఇంద్రియ లోలులని తెలుసుకున్నాం. ఆత్మవేత్తలు, ఆత్మవిధులు నిరంతరం దైవ కార్యములోనే నిమగ్నమై ఉంటారని వారికి ప్రత్యేకంగా ఎలాంటి కర్తవ్యం ఉండదని 17, 18 వ శ్లోకంలో తెలుసుకున్నాం. అందువల్ల మనం ఆసక్తి రహితంగా కర్మయోగాచరణ గావించాలని అలాంటి మనిషికి పరమాత్మ స్థితి ప్రాప్తిస్తుందని 19వ శ్లోకంలో తెలుసుకున్నాం. ఉపమాన శ్లోకంగా జనకాదులు సిద్ధి పొందిన విధానాన్ని తగిన ఉపపత్తులతో సమగ్రంగా చర్చించుకుని అలాంటి శ్రేష్ఠుల్ని లోకం అనుసరిస్తుందని 21వ శ్లోకంలో తెలుసుకున్నాం. 22వ శ్లోకంలో ముల్లోకాల లాంటి మూడు గుణాలలోనూ నా కర్తవ్యం లేదు, ఈ మూడు గుణాలలోనూ నేను పొందాల్సింది గాని పొందదగింది గాని ఏమీ లేదు అయినా నేను కర్మలయందే ప్రవర్తిల్లుతుంటానని జనకాదులు, భగీరథులు అంబరీషుడు లాంటి వారి సరసన నిలబడి నన్ను చూడు అంటూ తనను తానే ఉదాహరణగా చూపిస్తూ లోక సంగ్రహం కోసం నేను కర్మలాచరిస్తున్నానని చేసిన జగద్గురువు ఉద్బోధను చాలా స్పష్టంగా తెలుసుకున్నాం. 23వ శ్లోకంలో కర్మల్ని అలసత్వం లేకుండా ఎలా అప్రమత్తంగా ఉంటూ నిర్వహించాలో చెప్పి సామాన్యులు అనుసరిస్తారని న్యాయాన్ని బట్టి శ్రేష్ఠులు సామాన్యులకు మార్గదర్శకులుగా ఉండాలని ప్రబోధించాడు. 24వ శ్లోకంలో నేను కర్మలు ఆచరించడం మానేస్తే లోకాలన్నీ నశిస్తాయని లోకంలో అల్లకల్లోలం చెలరేగుతుందని చెప్పిన తీరును మనం మన ఆత్మ పరిశీలనతో అవగాహన చేసుకున్నాం. 25వ శ్లోకంలో తమ విలాసాల కోసమే ఈ ప్రపంచం ఉన్నట్లు భావించి కర్మలలో కూరుకు పోతుంటారు కానీ జ్ఞానులు లోక కళ్యాణం కోసమే కర్మలు ఆచరిస్తూ ఉంటారని తెలుసుకున్నాం. 26వ శ్లోకంలో పరమాత్మ స్వరూపం యందు నిశ్చల స్థితిని పొందిన జ్ఞాని అజ్ఞానులతో విభేదించకూడదని తెలుసుకున్నాం. ప్రకృతి గుణాలను అనుసరించి జరిగే కర్మలకు విమూఢులు తానే కారణమని కర్త అని అహంకారంతో భ్రమిస్తుంటారని 27వ శ్లోకంలో తెలుసుకున్నాం. 28వ శ్లోకంలో గుణకర్మ విభాగ సముదాయపు తత్త్వాన్ని తెలిసిన జ్ఞానులు గుణాలు గుణాలలో ప్రవర్తిల్లుతున్నాయని తెలియడం వల్ల వారు కర్మలపై ఆసక్తి లేకుండా ఉంటారని తెలుసుకున్నాం. 29వ శ్లోకంలో ప్రకృతి గుణాలకు పూర్తిగా మోహితులైనటువంటి మనుషులు మందమతులని అకృత్స్నవిదులని వీరు గుణాలలోనూ కర్మలలోనూ ఆసక్తితో ప్రవర్తిస్తుంటారని అలాంటి అకృత్స్న విదులతో మందబుద్ధులతో జ్ఞానులు విభేదించకూడదు అని పండుటాకుల ఉదాహరణతో తెలుసుకున్నాం. 30వ శ్లోకంలో అంతర్యామే పరమాత్మ అయిన

న్యాయం దృష్టి నిలిపి కర్మలన్నింటినీ నాకే సమర్పించి ఆశ మమత సంతాపాలు వీడి యుద్ధం చేయాలని పిలుపునిస్తూ కర్మ ప్రకరణ ముగించాడు. 31వ శ్లోకంలో శ్రద్ధతో అసూయ లేకుండా దైవం పైనే దృష్టిని నిలిపి దైవాన్ని అనుసరించిన వారు సమస్త కర్మ బంధాల నుండి విముక్తులు అవుతారని తెలుసుకున్నాం. 32వ శ్లోకంలో అలా అనుసరించని వారు తమ వినాశనానికి తామే కారణమవుతున్న విధానాన్ని తెలుసుకున్నాం. 33వ శ్లోకంలో ప్రాణులన్నీ తమ తమ పూర్వజన్మ సంస్కార జనిత స్వభావం చేత అస్వతంత్రులై ప్రకృతి గుణాల చైత నెట్టబడి ప్రతి వ్యక్తి కర్మల్లో ప్రవర్తిస్తూ ఉంటాడని సవివరంగా చర్చించుకున్నాం. 34వ శ్లోకంలో ఇంద్రియాలకు ఆయా ఇంద్రియార్థాల పట్ల రాగద్వేషాలు ఉంటాయి కానీ మనిషి వాటికి వశం కాకూడదు అవే మనిషికి శత్రువులు అని తెలుసుకున్నాం. 35వ శ్లోకంలో ఏది స్వధర్మమో, ఏది పర ధర్మమో తెలుసుకొని స్వధర్మాన్ని రక్షించిన వారిని ఆ ధర్మమే రక్షిస్తుందని, విస్మరించిన వారిని అదే నశింపజేస్తుందని విశ్వాసనాన్ని స్వధర్మాచరణ మార్గాన్ని చాలా స్పష్టంగా తెలుసుకొని ఈ శ్లోకంతో జగద్గురువు తన సమాధానాన్ని ముగించాడు. ఇవన్నీ విన్న అర్జునుడికి మనిషి ఇష్టం ఉన్నా లేకున్నా ఎవరో బలవంతంగా ఆజ్ఞాపించినట్లు మనిషి ఎందుకు పాపం చేస్తున్నాడు మనిషిని అలా ప్రేరేపించేది ఏది? ఈ సందేహాన్ని 36వ శ్లోకంలో జగద్గురువు పైకి సంధించాడు. మనం ఈ శ్లోకంలోనే మనుషులు స్థూలంగా మూడు రకాలుగా ఉంటారని పేర్కొని ఈ ప్రశ్నలోని ఆంతర్యాన్ని గ్రహించాం. అర్జునుడి ప్రశ్నకు దీటుగా సూటిగా జగద్గురువు సమాధానం ప్రారంభమైంది. ఇందులో మనలోని తీవ్రమైన కోరికలు రజోగుణంలో నుంచే ఉత్పన్నమవుతాయి ఇదే క్రోధ రూపాన్ని దాలుస్తుంది అని చెప్పి మనిషి పాపానికి కారణం అవుతున్న దాని చిరునామాను స్పష్టంగా పేర్కొన్నాడు జగద్గురువు. 38వ శ్లోకంలో ఆ కామం ఎలా మనలో దాగి ఉందో మూడు ఉపమానాల ద్వారా వివరించాడు. 40 వ శ్లోకంలో వాటి నివాస స్థావరాలు ఇంద్రియాలు మనసు బుద్ధి అని చిరునామాతో సహా తెలుసుకున్నాం. అందుకని నాయనా మనిషిలోని జ్ఞాన విజ్ఞానాల్ని నాశనం చేస్తున్నది ఈ కామమేనని ఆ మహాపాపిని సర్వశక్తులతో చేధించాలని 41వ శ్లోకంలో తెలుసుకున్నాం. 42వ శ్లోకంలో స్థూల శరీరం కంటే సూక్ష్మంగా ఉన్న ఇంద్రియాలు బుద్ధి కంటే సూక్ష్మాతి సూక్ష్మమైన ఆత్మ వరుసగా ఒకటి కంటే ఒకటి బలీయమైనవి గొప్పవి శక్తివంతమైనవి అని వాటి బలాన్ని వరుస క్రమంలో సవివరంగా తెలుసుకున్నాం. అవి ఎలా ఒకదానికంటే ఒకటి బలీయమైనవో శాస్త్రీయ కోణంలో తగిన ప్రమాణాలతో నిరూపించుకున్నాం.

3అ, 43శ్లో.

ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్తభ్యాత్మానమాత్మనా |
జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్ ||

ఈ విధముగా బుద్ధికంటెను ఆత్మ పరమైనదని అనగా సూక్ష్మము, బలీయము, మిక్కిలి శ్రేష్ఠము ఐనదని తెలిసికొని, ఓ మహాబాహూ! బుద్ధిద్వారా మనస్సును వశపఱచుకొని, దుర్జయశత్రువైన కామమును నిర్మూలింపుము.

నాయనా అర్జునా! ఈ విధంగా ఆత్మను బుద్ధి కంటే శ్రేష్టమైనదిగా తెలుసుకో. బుద్ధి చేత మనసును నియమించు. ఈ కామ శత్రువును జయించుట సుసాధ్యం కాదు. దాన్ని ఎలాగైనా నీవు జయించు అనే ఉద్బోధతో కర్మయోగాన్ని ముగించాడు జగద్గురువు. బుద్ధి కంటే ఉన్నతంగా అతీతంగా పరమాత్మ స్వరూపం ఉంది. దేహేంద్రియాలకు మనసుకు బుద్ధికి చేతనత్వం కల్పిస్తున్నది ఇదే. ఇవన్నీ కూడా చేతనత్వాన్ని శక్తిని ఆత్మనుండే గ్రహిస్తున్నది కదా. కానీ ఆత్మను మరుగుపరచి అవే పైకి కనిపిస్తూ ఉన్నాయి. దీనికి కారణం మనం బాహ్య ప్రపంచపు వ్యామోహంతో ఆత్మను విస్మరించడమే, అజ్ఞానమే. కాబట్టి జగద్గురువు మార్గంలో ప్రయాణించి మనం మన యధార్థ స్వరూపాన్ని స్వస్థిని తిరిగి పొందాలి. అప్పుడే దేహేంద్రియాలు ఇష్టారాజ్యంగా ప్రవర్తిల్లకుండా తమ తమ స్థానాల్లో అణగి ఉండి తమ తమ కార్యాల్ని సరిగ్గా నిర్వహిస్తాయి. ఈ మార్గమే కామ శత్రువును జయించడానికి బంధరాహిత్యానికి కూడా తోడ్పడుతుంది. మనం మన కళ్ళ ముందు కనిపించే శత్రువు నైతే మనం చక్కటి ప్రణాళికతో అవలీలగా పోరాడి జయించవచ్చు. కానీ ఈ కామ శత్రువు మనకు కనిపించదు, అర్థం కాదు కూడా. దానికి రూపం లేదు. ఒక్కోసారి ఒక్కో విధంగా అనిపిస్తుంది, కనిపిస్తుంది. ఒకసారి కనిపించినట్లు అనిపించినట్లు మరోసారి కనిపించదు, అనిపించదు. అందుకే జగద్గురువు 'దురాసదమ్' అన్నాడు. జన్మజన్మలుగా ఇది బలం సంపాదించుకొని మహావటవృక్షపు వేళ్ళు దృఢంగా భూమిలోకి పాతుకుపోయినట్లు బలంగా మనలో పెళ్ళూనుకుని ఉంది కదా. కాబట్టి దీన్ని ఛేదించాలంటే గీతామార్గం, జగద్గురువు అనుగ్రహం అనివార్యం. కామరూపంలో క్రోధరూపంలో మోహరూపంలో మదమాశ్చర్య రూపంలో ఇంకా అనేక విధాలుగా ఇది మనలో బలంగా పాతుకొని మన జ్ఞాన విజ్ఞానాల వినాశనానికి కారణమవుతుందని మనం గ్రహించి ఈ మహా శత్రువును చేధిద్దాం. ఈ మహా శత్రువు మనలో విజృంభించడానికి కారణం వివేకవంతమైనటువంటి బుద్ధిని ప్రయోగించలేకపోవడమే. కామాన్ని జయించలేక పోవడానికి ఇదే ప్రధాన ప్రతిభంధకం. కాబట్టి మనసును వివేక బుద్ధి చేత చక్కగా స్తంభింపజేసి కామ శత్రువును జయించాలి. ఆత్మ నిత్యం, బుద్ధం, ముక్తం. బుద్ధికి పరమైన ఈ ఆత్మను తెలుసుకుంటే అంటే బుద్ధి కంటే సూక్ష్మాతి సూక్ష్మమైనటువంటి ఆత్మను తెలుసుకుంటే అప్పుడు బుద్ధి జ్ఞానంతో

ప్రకాశిస్తుంది. బుద్ధిలో కలిగే జ్ఞానం అజ్ఞానాన్ని తొలగిస్తుంది అని గ్రహించిన తరువాత దేహేంద్రియ మనో బుద్ధులన్నీ సమస్థితిలో ఉండి దైవనియమిత కార్యంలో నిమగ్నం అవుతాయి. ఇవంతా మనం చర్చించుకున్న తరువాత మనం ఒక విషయం గమనించాలి. కామం మనకు మిత్రుడు కాదు శత్రువు కాదు. కామం మిత్రుడు అయితే దుఃఖాన్ని కలిగించదు కదా. అలాగే శత్రువు అయితే మనలో ఆత్మజ్ఞాన ఇచ్ఛను కలిగించదు కదా. కాబట్టి ప్రపంచంలో ఎవరూ మనకు శత్రువులు కారు, ఏది మనకు శత్రువు కాదు. మన అవగాహన లోపం వల్ల అలా మనకు అనిపిస్తుంది. అయితే మనకు అర్థం కావడం కోసం ఆ పేరును ప్రయోగించాడు జగద్గురువు. వివేకంతో ఉన్నతంగా ఆలోచిస్తే అంతా సవ్యంగానే అనిపిస్తుంది. వివేక ప్రజ్ఞతో ప్రకృష్టమైనటువంటి ఆత్మ శక్తిని అనుభూతించి ప్రశాంతంగా మన జీవితాన్ని కొనసాగిధాం. ప్రతి మనిషి జయించాల్సిన తనలోని తీవ్రమైన కోరికలు అనే కామాన్ని మహాశత్రువుగా అభివర్ణిస్తూ ఈ జయింప శక్యంకాని శత్రువుపై విజయాన్ని సాధించి ఆత్మ సామ్రాజ్యాన్ని అధిరోహించమని ఆదేశిస్తూ కర్మయోగాన్ని ముగిస్తున్న జగద్గురువుకు ప్రణమిల్లుదాం. ఈ విధంగా బుద్ధి కంటే శ్రేష్టమైన ఆత్మను తెలుసుకొని జయంప శక్యం కాని కామరూప శత్రువును సంహరించు. ఇలా మనం ఇప్పటివరకు సమగ్రంగా చర్చించుకున్న అనేక అంశాల ఆధారంగా మనలోని కామరూప శత్రువును జయిద్దాం.

4 వ అధ్యాయం - జ్ఞాన యోగము

4అ, 1శ్లో.

ఇమం వివస్వతే యోగం ప్రోక్తవాన్ అహమవ్యయమ్
వివస్వాన్ మనవే ప్రాహ మనురిక్ష్వాకవే బ్రవీత్

శ్రీ భగవానుడు ఇట్లు పలికెను - నేను నిత్య సత్యమైన ఈ యోగమును సూర్యునకు తెలిపితిని. సూర్యుడు తన పుత్రుడైన వైవస్వత మనువునకు దీనిని బోధించెను. ఆ మనువు తన కుమారుడైన ఇక్ష్వాకునకు ఉపదేశించెను.

అర్జున విషాద యోగంతో ప్రారంభమైంది భగవద్గీత. అంటే మనిషి విషాదంతో యోగం చెందడం వల్ల మనిషి విషాదానికి గురి అవుతాడు. విషాదం అంటే తనలోని అంతర్గత సంఘర్షణ లేదా సందిగ్ధత. ఈ సంఘర్షణలో ఎటూ తేల్చుకోలేని అర్జునుడు తన అభిప్రాయాల్ని అంటే మనలోని సందిగ్ధతను సంఘర్షణను వ్యక్తం చేస్తూ వచ్చాడు. రెండవ అధ్యాయంలో రెండవ శ్లోకంలో భగవానుడు మనల్ని మన సహవిద్యార్థిని పలకరించాడు. తరువాత సంఘర్షణ ఇంకా తీవ్రమై స్వయంగా నిర్ణయం తీసుకోలేని పరిస్థితిలో రెండవ అధ్యాయం ఏడవ శ్లోకంతో జగద్గురువును ఆశ్రయించాం. మన పరిస్థితిని వివరించి మనల్ని సన్మార్గంలో నడిపించమని శరణు వేడుతూ 10వ శ్లోకంతో త్రికరణ శుద్ధిగా మనల్ని మనమే జగద్గురువుకు సమర్పించి మనల్ని వేలు పట్టుకొని నడిపించైనా తన దగ్గరకు తీసుకెళ్ళమని ప్రాధేయపడ్డాం. మనకు బోధ చెయ్యడానికి మనల్ని సంఘర్షణలో నుండి సందిగ్ధతలో నుండి తప్పించి ప్రశాంతతను ప్రసాదించాలని జనన మరణ చక్రం నుండి దిక్కుతోచని దారి తెలియని పరిస్థితి నుండి దారి మళ్లించి దైవ మార్గంలో నడిపించి జనన మరణాల సమస్య అనే వ్యాధి నుండి కాపాడి మోక్షమార్గాన్ని తెలియజేయాల్సిందిగా జగద్గురువును శరణు వేడుకున్నాం. అలాగే మోక్షం పొందే వరకు కూడా మీ చిటికెన వేలు వదలకుండా మీ వెంటే నడుస్తామని ప్రమాణం చేశాం. మన తపస్సుకు భక్తికి మెచ్చిన భగవంతుడు 2-11 వ శ్లోకంతో తన బోధన ప్రారంభించాడు. 2-39 వ శ్లోకం వరకు ఏకధాటిగా మనిషి జీవన విధానంలోని వాస్తవాల్ని తెలియజేసి సత్తు, అసత్తులను నిర్ణయించి రాకపోకలు గలిగినవి ఏవో నిత్య సత్యమైన అవ్యయమైన బ్రహ్మవిద్య ఏదో విశదపరచాడు. అలాగే మనిషిని సంఘర్షణకు సందిగ్ధత లోకి నెట్టి వేస్తున్న భయభ్రాంతులకు గురికావడానికి గల కారణాలు ఏవో స్పష్టంగా వివరించాడు. మనిషి అజ్ఞాన అంధకారంలో మునిగిపోవడానికి గల కారణాలను మన కళ్ళ ముందు ఉంచాడు. మనిషి ఆలోచనా విధానం ఎలా ఉండాలో మనం శరీరంలోనే ఉంటూ మన శరీర నిర్మాణం పట్ల మన దైహిక ప్రక్రియల పట్ల మనకు అవగాహన లేని

దైన్యస్థితిని మనం ఇక్కడ గ్రహించాం. అలాగే స్వధర్మాచరణ గావించాల్సిన అనేక అంశాల పట్ల అవగాహన కల్పించుకున్నాం. 2-39 వ శ్లోకంతో కర్మ ప్రకరణం ప్రారంభించాడు. అక్కడ 39 నుండి 72 వరకు కర్మయోగాచరణ గావించాల్సిన విధానాన్ని, ఇంద్రియాల్ని సంయమించాల్సిన విధానాన్ని, స్థితప్రజ్ఞతను సంప్రాప్తించుకోవాల్సిన పద్ధతులను సవివరంగా తెలుసుకున్నాం. మళ్లీ స్థితప్రజ్ఞుడు ఎలా వ్యవహరిస్తాడని 2-54 వ శ్లోకంలో అడిగిన ప్రశ్నకు 55వ శ్లోకం నుంచి 68వ శ్లోకం వరకు తెలుసుకున్నాం. 2-69 లో స్థితప్రజ్ఞుని వైభవంతో ప్రారంభమై 2-72 తో బ్రాహ్మీస్థితి అంటే బ్రహ్మనిర్వాణం వరకు మోక్షం పొందే స్థితి దాక సవివరంగా జగద్గురువు ఉద్బోధను విన్నాం. 2వ అధ్యాయంలో కర్మ ప్రకరణంలో కర్మను ఆచరించాల్సిన మార్గాలు, పద్ధతులు అన్ని కూడా చక్కగా విని అర్థం చేసుకున్నాం. ఆ బ్రహ్మవిద్య బోధన విన్న మనకు కలిగిన సందేహంతో కర్మయోగం ప్రారంభమైంది. మూడవ అధ్యాయంలో అక్కడ విన్నవి ఇక్కడ ఆచరణ గావించాల్సినటువంటి సందర్భం ఏర్పడింది. ఈ మూడవ అధ్యాయం అంతా కూడా అనేక ఉపపత్తులతో ఒక్క అక్షరం విడవకుండా ఎక్కడా సందేహానికి తావు లేకుండా సమగ్రంగా కర్మయోగాన్ని ఆచరించాల్సిన విధానం గురించి చర్చించుకుని కర్మయోగాన్ని ముగించుకున్నాం. ప్రస్తుతం ఈ కర్మ యోగాన్ని దాని పుట్టుపూర్వోత్తరాలను తెలుసుకోవడంతో ఈ జ్ఞాన యోగం ప్రారంభమవుతుంది. అసలు ఈ కర్మయోగ విధానం ఎప్పుడు ప్రారంభమైంది. ప్రస్తుతం మనం నేర్చుకుంటున్నటువంటి విద్య మనకు మాత్రమేనా లేదా ఇంతకు పూర్వం నుంచే ఉందా, ఉంటే దాని చరిత్ర ఏంటి? ఎలా ఆవిర్భవించింది. ఈ బ్రహ్మ విద్య యొక్క పుట్టుపూర్వోత్తరాలు ఏవి. ఈ కర్మయోగాచరణ విధానం ఎప్పటి నుంచి అమలులో ఉంది అనేటటువంటి జ్ఞానాన్ని అంటే జ్ఞానము అంటే తెలుసుకోవలసిన అంశాల్ని ఈ జ్ఞాన యోగంలో బోధించడం ప్రారంభిస్తున్నాడు జగద్గురువు. అందుకే ఇది జ్ఞాన యోగం. జ్ఞా అంటే కచ్చితంగా తెలుసుకోదగినది. ఎందుకంటే ఒక పద్ధతిని విధానాన్ని మనం ఆచరిస్తున్నప్పుడు దాని ఆవిర్భావ వికాసాలు తెలుసుకోవడం ప్రాథమిక ధర్మం. ఇందులో భాగంగా ఎందుకు మనం కర్మయోగాచరణ గావించాలి అనే అంశాల్ని మనం జ్ఞానంతో యోగమై జ్ఞాన యోగాన్ని అధ్యయనం చేద్దాం. మనం ప్రస్తుతం మన జ్ఞాన యోగ విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్నాం. ప్రతి మనిషి ధ్యేయం పరమపదమైన మోక్ష పదం, ఇది జ్ఞానం ద్వారానే సాధ్యం. జ్ఞాన యోగాన్ని పొందటానికి కావలసినటువంటి యోగ్యత కర్మయోగ ధ్యానం. దీన్నిబట్టి కర్మయోగ ధ్యానం ద్వారా జ్ఞానం, జ్ఞానం ద్వారా మోక్షం ఇదే వేద నిర్ణయం, వేదోక్త ధర్మం. ఇదే వ్యక్తి ధర్మం. కర్మయోగం ఉపాయం, జ్ఞానయోగం ఉపేయం. కర్మయోగ ఉపాయం ద్వారా పొందే జ్ఞానయోగం సాక్షాత్తు మోక్ష సాధనం. కర్మయోగం ప్రవృత్తి అయితే జ్ఞానయోగం నివృత్తి. ఈ బ్రహ్మ విద్యను అంటే మన నిజ జీవిత ధర్మాల్ని యుక్తాయుక్త విచక్షణతో కూడిన జీవన విధానాన్ని ఇంతకుముందే ఎవరెవరు గురు స్థానంలో ఉండి బోధించారో ఆ వివరాలు ఏవో అనేటటువంటి అంశంతో ఈ అధ్యాయం ప్రారంభిస్తున్నాడు జగద్గురువు. సృష్టి ప్రారంభంలోనే సృష్టి కొనసాగాల్సిన సృష్టి ధర్మాలను తెలిపే వేదం కూడా ఆవిర్భవించింది. ఒక వస్తువును తయారు చేస్తే ఆ వస్తువు వాడకం విధానాన్ని తయారు చేయడం మనకు తెలియనిది కాదు. అలాగే ఇది కూడా సృష్టి

ఆవిర్భావంతోనే సృష్టిలోని మనం పాటించాల్సిన ప్రవర్తించాల్సిన తీరును తెలిపేదే వేదం. ఇది మనిషికి ప్రాణికి సంబంధించిన విషయమే గాని ఇందులో కుల మత లింగ వర్ణ వర్గ వయోభేదాలకు తావు లేదని గమనించాలి. వేదం అపౌరుషేయం, సృష్టికి ముందే ఉందని 2-45లో సవివరంగా చెప్పుకున్నాం. ఆ అవగాహనతో ఈ అధ్యాయాన్ని ఆరంభించాలి. కర్మయోగాచరణ విధానం కర్మయోగ ధ్యానం యొక్క పుట్టుపూర్వోత్తరాల నిర్ధారణ అలాగే ఈ బ్రహ్మవిద్యను బోధించిన వారి గురువుల చరిత్ర మనకు ఈ శ్లోకంలో తెలుస్తుంది. అంటే కర్మయోగ ధ్యానం ఉపాయంగా గల మోక్ష సాధనమైన గీతా మార్గం శ్రీకృష్ణుడు అర్జునుడి కోసమే ప్రత్యేకంగా బోధించాడా లేక అంతకుముందే ఉందా అనేది ప్రశ్న. అయితే మనకు ప్రశ్నించే అవకాశం ఇవ్వకుండానే జగద్గురువు తన బోధన కొనసాగిస్తున్నాడు. జ్ఞానమే ప్రధానంగా ఉన్న ఈ అధ్యాయంలో ఒకటి జ్ఞాన తపస్సు, జ్ఞానాగ్ని. రెండు జ్ఞాన యజ్ఞం, మూడు జ్ఞాన నౌక. నాలుగు జ్ఞానమనే మహా ఖడ్గం, జ్ఞాన ఖడ్గం. ఈ నాలుగు అంశాలే ప్రధానంగా ఈ అధ్యాయం కొనసాగుతుంది. ఈ అంశాల దృష్టితో మనం ఈ జ్ఞాన యోగాన్ని అభ్యసించాలి. ఈ దైవ మార్గాన్ని, గీతా మార్గాన్ని నేను సృష్టి ఆరంభంలోనే సూర్యుడికి ఉపదేశించాను అన్నాడు. అంటే సృష్టి ఆదిలో ఉన్నది ఎవరు? మనం చెప్పుకున్న 2-45వ శ్లోకం ప్రకారం భగవంతుడు మాత్రమే కదా నామరూపాత్మకమైన ఈ దృశ్యమాన ప్రపంచం పుట్టకముందు ఏకం అద్వితీయం అప్పుడు బ్రహ్మమే సత్తు రూపంగా ఉండేదని చాందోగ్య ఉపనిషత్తు. అందుకే జగద్గురువు ఈ అధ్యాయం ప్రారంభంలోనే ఇమం యోగం, ఈ యోగం ఈ గీతా మార్గం అని ప్రస్తావించాడు. ఇమం యోగం నేను వివస్వతునికి అంటే ఆదిత్యునికి సూర్యుడికి బోధించాను. ఎప్పుడు బోధించాడు అంటే సృష్టి ఆదిలో వివస్వతుడు అంటే సూర్యుడు అని అర్థం చేసుకోవాలి. వివస్ అంటే వెలుగు, వెలుగునిచ్చేవాడు సూర్యుడు. జగత్తును ఈ లోకాన్ని పాలించేవాడు సూర్యుడు కదా ఈ జగత్ చక్రం తిరగడానికి ఏకైక మూలాధారం కంటికి కనిపించే ప్రకృతి శక్తి సూర్యుడు. మనం 2-45 లో ప్రకృతిలోని మనకు కనిపించే శక్తి, కనిపించని శక్తి రెండు విధాలు ఉన్నాయని చర్చించుకుందాం. అలా ఆ కనిపించే శక్తి సూర్యుడు ద్వారానే ఈ లోకం నడుస్తుంది. అతనే ఈ లోకానికి శక్తిని సమకూర్చాలి. కాబట్టి ఈ లోకాన్ని సృష్టించిన సూర్యుడికి ముందుగా భగవంతుడు ఈ యోగాన్ని ఈ గీతా మార్గాన్ని బోధించాడు. అందుకే మనం కర్మయోగంలో సూర్యుని ఉదహరించుకున్నాం. నేను వెలుతురుని ఇవ్వకపోతే ఈ లోకానికి ఎవరు దిక్కు అని అహంకారం ప్రకటించుకోడు సూర్యుడు అని. అలాగే అన్నీ మిగిలిన నీరుగాలి భూతాలు అన్నీ కూడా. కాబట్టి భగవంతుడి దిశా నిర్దేశం మేరకే కర్మయోగాచరణను గావిస్తున్న కర్మసాక్షి సూర్యుడు. ఆ కారణంగా సూర్యుని ప్రవేశపెట్టక ముందే అంటే సృష్టి ఆదికి ముందే సూర్యుడికి బోధించి సృష్టిలో నీ బాధ్యత ఇది నువ్వు ఎలా ఈ పని చేయాలి అని సూర్యుణ్ణి ఈ లోకాన్ని సృష్టించాడు. కాబట్టి మనం కర్మయోగమంతా చెప్పుకున్న దైవ నియమిత కర్మయోగాచరణ ప్రకారం సూర్యుడు తనదైన దైవ నియమిత కర్మలో నిమగ్నమై ఉంటాడని మనకు తెలియాలి. ఇది సూర్యుడికి భగవంతుడు గీతామార్గాన్ని బోధించాను అని చెప్పడంలో ఉన్న ఆంతర్యం. సూర్యుడు కాంతి ప్రదాత, జీవశక్తి ప్రదాత అన్నీ కూడా. అందుకే వేదం సూర్యుణ్ణి ప్రత్యక్ష దైవంగా అభివర్ణించింది. ఈ సందర్భంగా కర్మసాక్షి అయిన

సూర్యదేవుడికి నమస్సుమాంజలి. సూర్యుడు కర్మ కర్తే గాని అతనిలో కర్మ లేదు కదా కర్మఫలంపై ఆసక్తి అతనికి ఉండదు. అలా అని కర్మను త్యజించడు, తన ప్రకాశాన్ని అందిస్తూనే ఉన్నాడు. ప్రపంచంలో ప్రాణుల ఉత్పత్తికి ప్రాణుల పెరుగుదలకు ప్రాణుల మరణానికి కారణం సూర్యుడే కదా. సృష్టి స్థితి లయకు కారణంగా మనకు కనిపిస్తున్నది సూర్యుడే కదా. మనకున్న 108 ఉపనిషత్తులలో సూర్యోపనిషత్తు కూడా ఉంది. భగవంతుడు సూర్యుడికి గీతా మార్గం బోధించడం వల్ల జగద్గురువు సృష్టికి సంబంధించిన జ్ఞానం సూర్యుడిలో నిక్షిప్తం చేసినట్లే కదా. అంటే జగద్గురువు బోధ సృష్టిలో తెలియాలి అంటే సృష్టిని నడిపిస్తున్నటువంటి సూర్యుని ద్వారానే తెలియాలని ఉద్దేశంతో జగద్గురు జ్ఞానాన్ని సూర్యునిలో సంపూర్ణంగా నింపి మనకు సూర్యుని ద్వారా తెలియజేస్తున్నాడు. జగద్గురువు ద్వారా సూర్యుడు పొందిన జ్ఞానాన్ని సూర్యుడు తన పుత్రుడైన మనువుకు అందించాడు. మను అంటే మన గలిగేవాడు, అంటే ఎదిగేవాడు, జ్ఞానాభివృద్ధిని గావించుకునే వాడు అని అర్థం. అలా సకల జీవకోటిలో జ్ఞానాభివృద్ధిని గావించుకునే విచక్షణ ఉన్నటువంటి మానవుడిగా ఆవిర్భవించిన మనిషికి మొదటగా అందించాను అని చెప్తున్నాడు. మానవజాతిలోని మనువుకు ఈ విద్యను బోధించాను. బోధించడం మాత్రం సరిపోదు ఆ విద్యను అందిపుచ్చుకొని సంపూర్ణంగా స్వీకరించి గ్రహించి ఆచరించగలిగిన వారై ఉండాలి. అది ఒక మనిషికి మాత్రమే సాధ్యమని సూర్యుని ద్వారా మనిషికి ప్రబోధింపజేశాడు. అలా ఆచరించగలిగిన వారిని గుర్తించి ఒకానొక మనిషికి చెప్పాడు అని అర్థం. ఆ వైవస్వత మనువైనటువంటి మనిషి తన పుత్రుడైన ఇక్ష్వాకునకు ఉపదేశించాడు. ఇక్ష్వాకువు అనే అతను రాజు, యధా రాజా తథా ప్రజా కదా. కాబట్టి రాజుకు విద్య బోధిస్తే రాజు ద్వారా ప్రజలకు చేరుతుందని భావించి ఇక్ష్వాకువు అనే రాజుకు బోధించాడు. కాబట్టి భగవంతుడి నుంచి సూర్యుడికి, సూర్యుడి నుంచి వైవస్వత మనువుకు, మనిషికి ఆ మనిషి నుంచి రాజు అయిన ఇక్ష్వాకునకు బోధించానని జగద్గురువు స్వయంగా ఈ శ్లోకంలో మనకు స్పష్టం చేస్తున్నాడు. ఇంతటి మహత్తరమైనటువంటి భగవంతుని మార్గాన్ని తెలిపే బ్రహ్మ విద్య నాటి ఇక్ష్వాకువు దగ్గర నుంచి ఈరోజు మనదాకా ఈ విద్య ఎలా సంక్రమించిందో తెలియాలంటే మనం మూడవ శ్లోకం దాకా వేచి చూడాల్సిందే. మనం 3-20, 3-21 శ్లోకాల్లో జనకాదుల్ని శ్రేష్ఠుల్ని గురించి చెప్పుకున్నప్పుడు ఇక్ష్వాకు వంశంలో పుట్టినటువంటి వారిని మనం శ్రేష్ఠులుగా ఉదహరించుకున్నాం. సమగ్రంగా చర్చించుకున్నాం.

4అ, 2శ్లో.

ఏవం పరంపరాప్రాప్తమ్ ఇమం రాజర్షయో విదుః |
స కాలేనేహ మహతా యోగో నష్టః పరంతప | 2 |

ఓ పరంతపా! (అర్జునా!) ఈ విధముగ పరంపరా ప్రాప్తమైన ఈ యోగమును రాజర్షులు ఎఱింగిరి. కాని అనంతరము ఈ యోగము కాలక్రమమున భూలోకమునందు లుప్తప్రాయ మయ్యెను.

భగవంతుని దగ్గర నుంచి సూర్యుడి ద్వారా వైవస్వత మనువుకు ఆ తరువాత ఈ పురాతనమైన యోగాన్ని ఇక్ష్వాకువు మొదలైన రాజర్షులు తెలుసుకున్నారు. రాజత్వం, ఋషిత్వం రెండింటినీ పుణికి పుచ్చుకున్న వారు రాజర్షులు. పూర్వం ఈ ఆధ్యాత్మిక విద్యను సంపూర్ణంగా ఆచరించే మహర్షులు మాత్రమే రాజ్యపాలనకు అర్హులుగా పరిగణించేవారు. అలా రాజ్యాన్ని పరిపాలించిన రాజర్షులే ఇక్ష్వాకువు, భరతుడు, హరిచంద్రుడు, దిలీపుడు, భగీరథుడు, రఘుమహారాజు, దశరధుడు, శ్రీరామచంద్రుడు లాంటి వారంతా కూడా. వీరంతా రాజులుగా రాజత్వాన్ని ఋషులు గారు ఋషిత్వాన్ని కలిగి ఉండి ధర్మ దృష్టితో జ్ఞానపూరిత ధర్మ పాలనను ఆచరించారు. ఇలా చాలా కాలం కొనసాగింది. ఆచరణ పూర్వకంగా కొనసాగినటువంటి బ్రహ్మవిద్య యోగశాస్త్ర సంప్రదాయం ద్వాపర యుగాంతంలో ఆచరించే వారు లేకపోవడం వల్ల ఒకపేళ ఒకరిద్దరు ఆచరించినా వారు ఎక్కడో మౌనంగా ఉండాల్సిన పరిస్థితులు సంభవించడం వల్ల ఈ యోగవిద్య బ్రహ్మవిద్య విచ్ఛిన్నమైంది. ఇక్ష్వాకువు దగ్గర నుంచి ధర్మరాజు దాకా కూడా అధికారంలో ఉన్న వారు ఎక్కడా వ్యామోహానికి గురికాకుండా ధర్మాన్ని అంటిపెట్టుకొని ఉన్నారు. కానీ ద్వాపర యుగాంతంలో పరిస్థితి విషమించింది. ధర్మానుష్టానం దూరమయింది. రాజ్యపాలన స్థానంలో ధర్మం లేకపోవడం వల్ల ధర్మపరులు రాజ్యాన్ని పరిపాలించకపోవడం వల్ల ఈ పరిస్థితి సంభవించింది. ధర్మం నిలవడానికి చోటు లేని పరిస్థితి ఏర్పడింది. భీష్ముడు, విదురుడు, సంజయుడు లాంటి ధర్మపరులు ఆ రోజుల్లో వారితోపాటు ఉన్నా కూడా శాసక స్థానంలో లేరు కదా వారు. అలా దుర్బలులు రాజ్యమేలడం వల్ల సమస్థితి లోని పరిస్థితి చేయి జారిపోయింది. ధర్మం నిలవడానికి నీడలేని పరిస్థితి. పరంపరా ప్రాప్తంగా సంక్రమిస్తున్న ధార్మిక పాలన లేకపోవడమే ఇందుకు కారణం. ఇంద్రియ నిగ్రహం లేని ఇంద్రియ వశులైన దుర్బలుల చేతిలో పడి యోగం ఆచరణకు నోచుకోలేకపోయింది. తరతరాలుగా ఆచరిస్తూ వచ్చినటువంటి బ్రహ్మవిద్య ఆధ్యాత్మికవిద్య అంతా కూడా అంతరించి పోయినటువంటి విధానాన్ని జగద్గురువు ఈ శ్లోకంలో మనకు తెలియజేస్తున్నారు.ఈ విధంగా పరంపరా ప్రాప్తమైన ఈ యోగం రాజర్షులు ఆచరిస్తూ రాజ్యపాలన కావించడం వల్ల ధర్మబద్ధంగా సృష్టి కొనసాగేది. ఇంద్రియ నిగ్రహం లేని బ్రహ్మ విద్య తెలియని వారు రాజ పాలన గావించడం వల్ల అధర్మం లోకాన్ని ఆవహించింది. ఆ కారణంగా విద్య, ధర్మం కనుమరుగయింది. ధర్మమే దైవం కనుక దైవిక లక్షణాలు మనిషిలో మరుగునపడి అజ్ఞానపు అంధకార రాక్షస రాజ్యం ప్రబలిపోయింది అని ధర్మ పాలన కనుమరుగవడానికి గల కారణాలని స్పష్టంగా మన ముందు ఉంచినటువంటి జగద్గురువుకు నమస్సుమాంజలి.

4అ, 3శ్లో.

స ఏవాయం మయా తేఽద్య యోగః ప్రోక్తః పురాతనః
భక్తోఽసి మే సఖా చేతి రహస్యం హ్యేతదుత్తమమ్ | 3 |

ఈ యోగం ఉత్తమమైనది. రహస్యంగా ఉంచదగినది. నీవు నాకు భక్తుడవు, ప్రియ సఖుడవు అందుకే మిక్కిలి పురాతనమైన ఈ యోగాన్ని నీకు బోధిస్తున్నాను.

ఇందులో 'పురాతనః' అన్నారు అంటే సనాతనమైనది, పురాతనమైనది సృష్టికి ముందు నుంచే ఉంది అని అర్థం. ఈ శ్లోకంలో ఒకటి పురాతనమైంది రెండు ఉత్తమమైనది మూడు రహస్యమైంది అనే మూడు పదాలు ప్రయోగించాడు. ఒకటి పురాతనమైనది బ్రహ్మం అనంతం అనంతమైన బ్రహ్మం జ్ఞానం కూడా అనంతమే కదా. సృష్టికి ఆది ఉండొచ్చు సృష్టికి కారణమైన బ్రహ్మము ఉంది కదా దీనికి ఆది లేదు కదా. మరి ఆది లేనప్పుడు అంతం ఉండదు. ఆది అంతం లేనిది పరబ్రహ్మం కనుక ఈ బ్రహ్మవిద్య పురాతనం. సృష్టికి ముందే సృష్టి ఆదిలోనే సూర్యుడికి చెప్పాను అంటూ ఈ అధ్యాయం మొదటి శ్లోకంలో మనం తెలుసుకున్నాం. అందులో సృష్ట్యాదికి సంబంధించిన అనేక అంశాలను కూడా చర్చించుకున్నాం. 2-45లో సృష్టికి కారణమైన బ్రహ్మం, బ్రహ్మం ద్వారా సృష్టి ఆవిర్భావం ఏ ఏ శక్తులు ఎలా ఎలా సృష్టిని నడిపిస్తున్నాయో ఈ వివరాలను కూడా అక్కడ చూసాం. ఈ 2-45, 4-1 ఈ రెండు శ్లోకాల సమన్వయంతో మనకు ఈ బ్రహ్మ విద్య పురాతనమైనది, సృష్ట్యాదికి ముందే ఉందని నిరూపణ అవుతుంది. రెండు ఉత్తమమైనది. క్లిష్ట పరిస్థితులో సందిగ్ధతలో సంఘర్షణలో జనన మరణాల ఊబిలో ప్రాపంచిక వ్యామోహం లో చిక్కి ఉక్కిరిబిక్కిరవుతున్న మనిషిని సన్మార్గంలో పయనింప చేయటానికి ఉన్న ఏకైక దివ్య సాధనం, ఔషధం, మార్గం గీతా మార్గమే. ప్రపంచంలో ఉన్నదేదైనా అది గీత లోనిదే. అందులో లేనిది ప్రపంచంలో ఎక్కడా ఉండదు. ప్రతి మనిషిని ఉత్తమమైన మార్గంలో నడిపించి ఉత్తములుగా తీర్చిదిద్దే ఏకైక విద్య ఇదే. ఎంతమంది చెప్పిన ఎన్ని రకాలుగా చెప్పుకున్నా అది గీత మార్గమే అయి ఉంటుంది. ఎవరు అవునన్నా కాదన్నా ఇదే సత్యం, ఇదే జీవితపు మూల విజయ సూత్రం. మరో అంశం మనిషి జన్మ సకలకోటి జీవరాశిలో ఉత్తమమైనది. ఈ విద్యను అభ్యసించి ఆచరించగలిగిన జీవి కూడా మానవజీవి మాత్రమే. ఇతర ప్రాణులకు వీలు కాదు. అలాగే ఉత్తమం తత్త్వచింతనం అలా చూసినా మన తత్త్వాన్ని మనకు తెలిపే గ్రంథం కూడా ఇదే. ఇలా విభిన్న కోణాల్లో మనం పరిశీలించినప్పుడు గీతా మార్గం ఉత్తమోత్తమమైనదిగా మనకు నిర్ధారణ అవుతుంది. రహస్యం అంటే దాచిపెట్టిన లేదా పెట్టాల్సిన అంశమూ విషయము కాదని మనకు తెలియాలి. మన చర్మచక్షువుకి కనిపించనిది అనిపించనిది అంటే సూక్ష్మాతి సూక్ష్మ దృష్టికి మాత్రమే గోచరించేది అని అర్థం. అది రహస్యంగా ఉంటుంది ఉంది కూడా. ఎందుకు రహస్యం అయింది మన చర్మ చక్షువుకు కనిపించదు కాబట్టి. కనిపించనిది రహస్యమే కదా మనం ఏంటి రహస్యం అని అడుగుతూ ఉంటాం. ఎందుకంటే అది మనకు వినిపించలేదు,

కనిపించలేదు కాబట్టి తెలుసుకోవాలని ఉత్సుకతతో రహస్యం ఏంటి అని అడుగుతూ ఉంటాం. అలా మనం ఆలోచిస్తే ధర్మ దృష్టితో జ్ఞాన దృష్టితో సూక్ష్మాతి సూక్ష్మ దృష్టితో త్రికరణ శుద్ధిగా అణువణువు ఏకమై గమనించి ఆలోచించి సరైన అవగాహనతో అర్థం చేసుకొని ఆచరించగలిగింది కాబట్టి అది రహస్యం. అంతేగాని దాచి పెట్టింది కాదు, దాచి పెట్టాల్సిన అవసరం ఉన్నది కాదని మనకు తెలియాలి. ప్రాపంచిక వ్యామోహపు దృష్టితో చూసినా అలాగే 3-38 లో చెప్పుకున్నటువంటి నిప్పును నివురు కప్పినట్లు అద్దం పై దుమ్ము ధూళి చేరి అద్దాన్ని కప్పినట్లు, గర్భస్థ శిశువును మావి కప్పినట్లు, అజ్ఞానం చేత జ్ఞానం కప్పి ఉన్నవారికి అసలు అర్థం కాదు కదా అందుకే అది రహస్యం అయింది. ఈ భగవద్గీత సూత్రాలను అనుసరించి నెమ్మదిగా ఆ మాయను తొలగించుకుంటే అప్పుడు రహస్యం బోధపడుతుంది. అదే ఈ బ్రహ్మ విద్య రహస్యమైనది అని జగద్గురువు చెప్పడంలోని ఆంతర్యం. ఉదాహరణకు కొందరు భగవద్గీతను వెయ్యి సార్లు చదివామని చెప్తూ ఉంటారు. కానీ వారు ఈ గీతా సూత్రాలను అనుసరించడం కానీ ఆచరించడం కానీ చేయలేకపోతుంటారు. కారణం వాళ్ళు అందులోని నిగూఢంగా రహస్యంగా దాగి ఉన్న అంశాల్ని దర్శించలేకపోవడమే. ఎందుకంటే దర్శిస్తే ఆ వెలుగును చూస్తే మళ్ళీ వారిలో చీకటి ఉండదు కదా ఇది విశ్వ సూత్రం. కాబట్టి ధర్మ దృష్టితో చూస్తేనే రహస్యమైన విద్య మనకు అవగతం అవుతుంది, దర్శనమవుతుంది. అందుకే జగద్గురువు ఈ బ్రహ్మ విద్యను రహస్యం అంటున్నారు. ఇప్పుడు మనం ఈ మూడు పదాలలోని రహస్యాన్ని తెలుసుకున్నాం కదా ఇక అలాంటి రహస్యమైన ఉత్తమమైన పురాతనమైన బ్రహ్మవిద్యను అర్జునుడికి బోధించడంలో అర్థం ఏంటి ఆంతర్యమేంటి అది ఈరోజు మనదాకా ఎందుకు వచ్చింది ఎలా వచ్చింది. నేను ఈ రహస్యమైన ఉత్తమమైన పురాతనమైన విద్యను నీకు అందిస్తున్నాను అని సాక్షాత్తు జగద్గురువే స్వయంగా చెప్తున్నాడు. ఈ అంశాన్ని జాగ్రత్తగా మనం ఒక్కక్షణం ఆగి అవలోకిస్తే జ్ఞాన దృష్టితో అంటే చర్మచక్షువుకు అతీతమైన దృష్టితో ఆలోచిస్తే నీవు నాకు భక్తుడవు, సఖుడవు అయి ఉన్నావు, మరి అర్జునుడి అర్హత ఏంటి అర్జునుడి రూపము కులము ధనము బలము బలగము కాదు కదా. మరి అయితే ఏంటి అతనిలోని భక్తి శ్రద్ధ గుణాతీతమైనటువంటి తత్త్వం. తత్త్వవిధుడు కాబట్టి. అలాంటి భక్తి ప్రపత్తులు ఎవరిలో ఉన్నా వారందరికీ ఈ విద్య అందుతుందని గ్రహించాలి. అంటే ఇది విన్నంతమాత్రాన చదివినంత మాత్రాన సరిపోదు. వినడంతో పాటు చదవడంతో పాటు అపారమైన అఖండమైన అజేయమైన భక్తి శ్రద్ధ ఆచరణ ఉన్నప్పుడే అందులోని రహస్యం దర్శనమవుతుంది ఇలా మనం అర్థం చేసుకోవాలి. ఇక ఇందులో చర్చించాల్సిన చివరి అంశం ఈ అధ్యాయం ప్రారంభంలో చర్చించుకున్న గురువుల చరిత్ర, వంశపరంపరగా వచ్చిన బ్రహ్మ విద్యను గురించి. మరి ఆనాడు దుర్యోధనుడి పాలనతో విద్య కుంటుపడిందని కనుమరుగైందని నిలవడానికి నీడ లేకపోయిన పరిస్థితి సంభవించిందని ఇదే అధ్యాయం ఒకటవ శ్లోకంలో తెలుసుకున్నాం. ధర్మమే దైవం కాబట్టి ద్వాపర యుగాంతం లోని అస్తవ్యస్త పరిస్థితి పరిస్థితుల్ని గమనించిన దైవం ఈ లోకానికి బ్రహ్మ విద్యను తిరిగి మళ్ళీ బోధించాలని నిర్ణయించింది. అందులో భాగంగా కురుక్షేత్ర సంగ్రామాన్ని వేదికగా చేసుకొని యుద్ధారంభంలో అందరూ ఓ వైపు యుద్ధాన్ని వీక్షించడానికి

మరోవైపు యుద్ధం చేయడానికి మహా సైన్యం అంతా సిద్ధంగా ఉన్న సంఘర్షణ సంక్లిష్ట సందిగ్ధ సంశయ దశలో ఆ దశ యొక్క దిశను మార్చడానికి జగద్గురువు పన్నిన ఉపాయమే ఈ వేదిక. లోకంలో అంతరించిపోయిన ఆచరణకు నోచుకోకుండా కనుమరుగైపోయిన బ్రహ్మవిద్యను ప్రజల్లోకి చొప్పించాలని అదే యుగాంతంలో తిరిగి అర్జునుడి ద్వారా ఈ లోకానికి బ్రహ్మవిద్యను అందించాడు. ఒకటి దుర్యోధనుడి పాలనలా ఉండకూడదని హెచ్చరిక, రెండు ప్రజలు అనుష్టించాల్సిన ఆచరించాల్సిన ఆచరణీయుత మార్గాలు. ఈ రెండు అంశాల్ని కూడా ఆ సంధి దశలో ఈ లోకానికి గీతా రూపంలో అందించాడు జగద్గురువు. అలా కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుడికి బోధించిన బ్రహ్మ విద్య చాలావరకు నాటి నుండి కూడా గ్రంథాలకు పూజ గదులకు దేవాలయాలకు పరిమితమైపోయింది. ఎందుకంటే మనిషి మనసు అపమార్గం వైపు భౌతికతవైపుగా దాని ప్రయాణం కొనసాగుతూ ఉండడమే దీనికి కారణం. కురుక్షేత్ర సంగ్రామం నాటి నుండి నేటి వరకు ఎందరో పెద్దలు గురువులు బోధిస్తూ వచ్చారు. కానీ అందుకున్న వారు ఆచరించిన వారు చాలా తక్కువ మంది మాత్రమే. అయితే ఇది ఎవరికి దర్శనం అవుతుంది అంటే అర్జునుడిలా భక్తిశ్రద్ధలు అర్జునుడిలా శరణాగతత్వం సర్వ సమర్పణా భావం ఉన్నవారికి అర్థమవుతుంది. ఈ విషయం స్వయంగా జగద్గురువే చెప్తున్నాడు. ఈ శరీరమే నేను నేను పెద్ద ఉద్యోగి ని నేను పెద్ద వ్యాపారవేత్తను నేను పెద్ద శాస్త్రవేత్తను లాంటి భౌతికత ముసుగు వేసుకున్న వారు ఎవ్వరికి అర్థం కాదు. నేను అంటే ఈ శరీరం అనే నేను కాదు నాలో ఉండి నన్ను నడిపిస్తున్న కంటికి కనిపించని ఆ మానవ అతీత శక్తి ఏది అని ఆత్మచింతన చేయగలిగిన వారికి లేదా సద్గురువును ఆశ్రయించి సద్గురువు సూచనలు సలహాల మేరకే ప్రవర్తించే వారికే అవగతం అవుతుంది. అలా ఆనాడు ద్వాపర యుగంలో సాక్షాత్తు భగవంతుడే మానవ రూపంలో అర్జునుడిని పరికరంగా చేసుకుని అతని ద్వారా ఈ లోకానికి ఈ బ్రహ్మ విద్యను అందించాడు. అలా నాడు అంతరించిపోయిన విద్యను పునర్ బోధనతో ఈ లోకానికి చేరిన విద్యను నేడు మనం జగద్గురువు అనుగ్రహంతో అర్జునుడి స్థానాన్ని అధిరోహించి భగవద్గీత రహస్యాన్ని అందులోని నిగూఢమైన అంశాల్ని చర్చించుకుంటున్న మనం ధన్యులం. కాబట్టి ఈ సందర్భంగా పూజ్యులు జగద్గురువులు శ్రీకృష్ణ పరమాత్మ మన స్నేహితుడు మనల్ని ఇలాగే చిటికెన వేలు వదలకుండా నడిపించాలని సంకల్పిద్దాం. పరమ పూజ్య శ్రీకృష్ణ పరమాత్మకు పాదాభివందనాలు.

4అ, 4శ్లో.

అర్జున ఉవాచ,

అపరం భవతో జన్మ పరం జన్మ వివస్వతః |
కథమేతద్విజానీయాం త్వమాదౌ ప్రోక్తవానితి | 41

అర్జునుడు పలికెను - కృష్ణా! నీ జన్మ ఇటీవలిదే. సూర్యుని జన్మ కల్పాదియందు జరిగినది. అనగా అతి ప్రాచీనమైనది. కనుక నీవు సూర్యనకు దీనిని ఉపదేశించుట ఎట్లు సాధ్యపడును? దీనిని నేను విశ్వసించుట యెట్లు?

ఈ అధ్యాయం ప్రారంభంలో జగద్గురువు సృష్టి ఆదిలోనే ఈ విద్యను సూర్యుడికి బోధించాను అన్న మాట అర్జునుడిలో బాగా వేళ్ళూనుకుంది. ప్రస్తుతం నా కళ్ళ ముందున్నావు నాకు నువ్వు గీతను బోధిస్తున్నావు ఇది వాస్తవం. మరి సృష్టి ప్రారంభంలో నువ్వు సూర్యుడికి బోధించడం ఎలా వీలవుతుంది అంటే నాకు కనిపిస్తున్న నాకు బోధిస్తున్న దేహం అప్పటినుండి ఇన్ని వేల సంవత్సరాలు ఉండడానికి వీలవుతుందా అది ఎలా సాధ్యం. ఒకవేళ అలా అనుకుంటే శ్రీకృష్ణుడి పుట్టుకను గురించి అర్జునుడికి తెలియంది కాదు కదా మరి ఎలా ఎక్కడ పుట్టాడో ఎలా పుట్టాడో తిథి నక్షత్రాలతో సహా పూర్తి వివరాలు అర్జునుడికి తెలుసు. పైగా శ్రీకృష్ణుడు పుట్టకముందే శ్రీకృష్ణుడు తండ్రి అయినటువంటి వసుదేవుడు సూర్యుణ్ణి పూజించడం కూడా తెలుసు కాబట్టి కృష్ణుడు పుట్టక ముందే ప్రకాశిస్తున్న సూర్యుడికి కృష్ణుడు బోధించడం ఎలా వీలవుతుంది. సూర్యుడికి బోధించింది ఈ రూపం ఈ దేహంతో నేనా లేదా వేరే దేహం, వేరే రూపంతోనా. అయితే ఈ దేహం పుట్టుకకు కారణం దేవకీ వసుదేవులైనట్లు ఆదేహం పుట్టుకకు కారణం ఎవరు ఉంటారు. ఒకవేళ ఇదే నిజమైతే జనన మరణాలలో తిరుగుతున్న ఇతను కూడా జనన మరణ చక్రంలో ఉన్నట్లే కదా అలా తిరుగుతున్నప్పుడు సాధారణ స్థాయి మనిషే కదా కృష్ణుడు కూడా. సూర్యుడికి బోధించడం వీలు కాదు కదా. అలా ఒకవేళ వీలైనా గత జన్మలలో చేసిన పనులు తరువాతి జన్మలో జ్ఞాపకం ఉంటాయా. ఇలాంటి సాధారణ స్థాయి మనుషులకు అనిపించే సందేహాలను ఇక్కడ పటాపంచలు చేస్తూ మనం మన విద్యాభ్యాసాన్ని కొనసాగించాలని ఇలాంటి వాడి అయినటువంటి బాణాన్ని జగద్గురువు పైకి సంధిస్తున్నాడని మనకు తెలియాలి. మనం ఆలోచిస్తే మన సహవిద్యార్థి మనకు పునర్జన్మ సిద్ధాంతానికి సంబంధించిన విషయ విశేషాలను సవివరంగా అందించాలనే ఉద్దేశంతోనే ఇలాంటి ప్రశ్నలు సంధించాడని మనకు తెలుస్తోంది. జనన మరణంలో తిరుగుతున్నటువంటి వారికి గతం గుర్తుండదు, ఉంది అంటే వారు జనన మరణాలను జయించారనే నిర్ణయానికి రావాలి. అలాంటి స్థాయి మానవతీతమైనటువంటి మధుసూదనుడికి వీలవుతుంది. అంటే ప్రస్తుతం భగవద్గీతను బోధిస్తున్నటువంటి శ్రీకృష్ణుడిది జన్మా, అవతారమా మనలో మనమే ఆలోచించాలి. మన మిత్రుడు అయినటువంటి శ్రీకృష్ణ పరమాత్మను భగవంతునిగా

భావించి భాషించినప్పుడు ప్రత్యక్షంగా చూసిన సాక్షి అర్జునుడు. అరణ్యవాసంలో అడుగడుగునా పాండవుల్ని రక్షించిన తీరు అర్జునుడికి తెలియనిది కాదు. అయితే అంతరించి పోయినటువంటి బ్రహ్మ విద్యను అదే సమయంలో అదే స్థలంలో ఎక్కడైతే అంతరించిపోయిందో అదే స్థలంలో వారి ఎదురుగానే బ్రహ్మ విద్యను నేర్పడం బోధించడం కురుక్షేత్ర సంగ్రామం అనే వేదిక యొక్క ఉద్దేశం. ఇందులో భాగంగా పునర్జన్మ సిద్ధాంతాన్ని జన్మల చక్రాన్ని కూడా సవివరంగా తెలుసుకుంటూ ముందుకు పోవడం అనేది బ్రహ్మవిద్య అధ్యయన పాఠశాలలోని పాఠాల్లో అంతర్భాగం. ఆకారణంగా మన గురించి అధ్యయనం చేస్తున్న మనం మొదటి పాఠంగా విషాదం అంటే ఏంటి? అందుకు గల కారణాలు ఏవి?, రెండవ పాఠంగా శరీరం, శరీర ప్రక్రియ, శరీరంలోని వివిధ భూతాంశాలు, శరీర వ్యవస్థ, శరీర వ్యవస్థ పనితీరు. ఇవంతా తెలుసుకున్నాక మూడోపాఠంగా కర్మయోగ అనుష్టాన విధానము, ఈ మూడు పాఠాలు అధ్యయనం చేసిన తరువాత బ్రహ్మవిద్య అధ్యయన పాఠ్యాంశాలలో పొందుపరచి ఉన్న పునర్జన్మ సిద్ధాంతం నాలుగవ పాఠంగా మనకు తెలియాలి. అందుకే ఈ ప్రశ్నతో మన ముందుకు వచ్చాడు మన సహవిద్యార్థి అయినటువంటి అర్జునుడు. భగవద్గీతామతల్లికి ప్రణామాలు.

4అ, 5శ్లో.

శ్రీభగవాన్ ఉవాచ,

బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున |
తాన్యహం వేద సర్వాణి న త్వం వేత్థ పరంతప | 5 |

శ్రీ భగవానుడు తెలిపెను - ఓ పరంతపా! అర్జునా! నాకును నీకును పెక్కు జన్మలు గతించినవి. కాని వాటిని అన్నింటిని నేను ఎఱుంగుదును. నీ వెఱుగవు.

దేహానికి పరిమితమైన వారు జీవులు, జీవుడవుతాడు. జీవుడు ఈశ్వర జ్ఞానంతో ఉండడు, సర్వజ్ఞులు కారు. సర్వజ్ఞత్వంతో కూడిన ఈశ్వర భావం లేని వారికి తమ తమ జన్మలను గురించిన అవగాహన ఉండదు. అందుకని వారు జీవుని స్థితికే పరిమితమై ఉంటారు. కనిపించే భౌతికతకు మించి వీరి ఆలోచన విధానం సాగదు. జీవస్థితి నుంచి విశ్వవ్యాపక ఈశ్వర స్థితికి ఆలోచన చేయగలిగినప్పుడు విశాలమైన దృష్టిని అలవరుచుకొని విశ్వంతో విలీనమయ్యే స్థాయి ఏర్పడుతుంది. 4-3వ శ్లోకంలో చెప్పుకున్నట్లు అణువులు పరమాణువుల కంటే కూడా సూక్ష్మాతి సూక్ష్మమైన స్థాయి అలవడుతుంది. ఇది యంత్రాలకు ప్రయోగశాలలకు అందనిది. అది ఆధ్యాత్మికత. అలా ఉన్నతోన్నతంగా తమను తాము ఉన్నతీకరించుకున్నప్పుడు ఉత్తములవుతారు. అప్పుడే రహస్యమైన ప్రాచీనమైన అంటే సృష్టి ఆదిని గురించి అంశాన్ని విపేచించగలరు. అలా తమను తాము ఉన్నతీకరించుకుంటే ఈశ్వర భావం, సర్వవ్యాపకత్వం దర్శనమవుతుంది. అలా లేనప్పుడు భౌతికత ముసుగుతో

కొట్టుమిట్టాడుతూ ఉంటారు. ఆ కారణంగా మనిషి ఈ పునర్జన్మ సిద్ధాంతం అధ్యయనం చేయాల్సిన అవగాహన చేసుకోవాల్సిన ప్రధానమైనటువంటి అంశంగా ఉంది. లేకపోతే గమ్యం తెలియని ప్రయాణం అవుతుంది. మనం 2-45 లో చెప్పుకున్నట్లు సృష్టి ఆరంభం గురించిన సృష్టి ఆదిని గురించిన వివేచన చేయగలిగినప్పుడే మనిషి తన ఆది గురించి తన అంతం గురించి తెలియ వస్తుంది. అప్పుడే ఆది అంతం లేనిదేదో అవగతం అవుతుంది. అలా వివేచన చేస్తూ ముందుకెళ్ళినప్పుడు 2-16లో నిర్ణయించుకున్న 2-24లో స్థిరీకృతం గావించుకున్న సత్తు దర్శనమవుతుంది. ఆ సత్తు దర్శనం ద్వారానే 2- 72 లోని బ్రాహ్మిస్థితి సంప్రాప్తిస్తుంది. అప్పుడే మనం పరమాత్మ కన్నా వేరు కాదన్న పరమ సత్యం గోచరమవుతుంది. తద్వారా సృష్ట్యాది విషయాలు సృష్టికి సంబంధించిన సమస్త విషయాలు మనకు గోచరమై సృష్టి అంటే ఏంటో మనకు తెలుస్తుంది. అప్పుడు ఈ శ్లోకంలో భగవానుడు చెప్తున్న నాకు తెలుసు, నీకు తెలియదు అనే మాట అవగతం అవుతుంది. ఇది తెలియడానికి తెలియకపోవడానికి ఉన్న తేడా ఈ వ్యత్యాసం మనం గుర్తిస్తేనే పునర్జన్మ సిద్ధాంతం అర్థం కావడానికి. పునర్జన్మకు సంబంధించి మనకు ఇప్పుడు అవగతం కావాలంటే మనం ఏ ఉపనిషత్తులో ఇతర అనుభవాలో పేర్కొంటే అది వారి వారి అనుభవం అవుతుంది, వారి వారి జ్ఞానం అవుతుంది. మన దైనందిన జీవితంలోని అంశాలను మనకున్న ప్రస్తుత దృష్టితోనే అంటే భౌతికత దృష్టితోనే కూడా పరిశీలిద్దాం. మనం ప్రతిరోజు మన కళ్ళ ముందు చూస్తున్న ప్రతి మనిషి ఒకే విధమైన జ్ఞానాన్ని పొంది ఉన్నారా? ఆలోచిద్దాం గీతా స్వరూపుల్లారా. ఉదాహరణకు ఒక సంవత్సరం లేదా పది సంవత్సరాలు ఏ వయసు వారైనా సరే ఒకే వయసు గల వారి జ్ఞానం ఒకే విధంగా ఉండాలి కదా. ఒకే వయసు గల వారిలో ఒకే విధమైన జ్ఞానం ప్రవర్తన నడక నడత ఉండాలి కదా. మరి అలా ఉండటం లేదే, ఒకరేమో 10 సంవత్సరాలకు అన్ని గ్రంథాల్ని అవపోసన చేసి లేదా చదవకపోయినా సర్వజ్ఞులుగా మనకు కనిపిస్తున్న వారు సమానంగా తల్లి గర్భంలో పుట్టిన ఆది శంకరులు తల్లికి నమస్కరించి వెళ్ళిపోయాడు. ఇలాంటి వారు ఎందరో. ప్రస్తుతం మన కంటి ముందు కనిపిస్తున్న అంశాలకు వస్తే ఐదు సంవత్సరాలు 10 సంవత్సరాలు వయసు ఉన్న పిల్లలు భగవద్గీతలోని 702 శ్లోకాలు అప్పజెప్తున్నారు, వివరిస్తున్నారు కూడా. 12 ఏళ్ల పిల్లవాడు గణితావధానం చేస్తున్నాడు. సంగీతంలో అపారమైన అభినివేశం ఉన్న పిల్లలు ఊహ తెలిసినప్పటి నుంచి గానం చేయడం మనం చూస్తూనే ఉన్నాం. ఇలా మనం మన స్వీయ అవగాహనతో మనకున్న భౌతిక దృష్టితోనే పరిశీలించినా ఖచ్చితంగా మనకు జన్మలో ఏదో రహస్యం ఉందని తెలియ వస్తుంది. మనకు స్వయంగా ఈ పరిశీలన అలవడిన దృష్టితో ఇప్పుడు మనం తగిన ప్రమాణాలను చూద్దాం. 3-33లో పూర్వజన్మ సంస్కార జనిత వాసన వల్ల మనిషి అస్వతంత్రుడై ప్రకృతి కర్మలలో ప్రవర్తిల్లుతుంటాడని నేర్చుకున్న అంశాన్ని మన నిజ జీవితంలో జరుగుతున్న అంశాలకు సమన్వయం చేసుకోవాలి. ఆత్మ జ్ఞానం అంటే ఇప్పుడు మనం చెప్పుకున్న నిశిత పరిశీలన వల్లనే అవిద్యాపాశాల నుండి అజ్ఞానం నుండి మనకు విమోచనం కలుగుతుంది. కానీ జ్ఞానోదయం అంటే ఈ పరిశీలన చేయకుండా యాంత్రికంగా జీవించినంత వరకు శతకోటి జన్మలెత్తినా బంధ విముక్తులు కాజాలరు అని మనకు తెలియాలి. ఈ అవగాహనతో మనం చూస్తే మనకు జన్మలు ఉన్నాయని

బోధపడుతుంది. అలా ఉన్నాయి కాబట్టి పూర్వజన్మ సంస్కారం చేత వ్యక్తులు విభిన్నమైన జ్ఞానంతో మనకు కనిపిస్తున్నారు. లేకపోతే ఒకే వయసు ఉన్న ప్రతి ఒక్కరిలోనూ ఒకే విధమైన జ్ఞానం ఉండాలి అలా ఉండటం లేదు. కాబట్టి మనకు జన్మలు ఉన్నాయని నిరూపణ అవుతుంది. అర్జునా నీకు నాకు అనేక జన్మలు గడిచాయి నాకు అవన్నీ తెలుసు నీకు అవేవీ తెలియదు అని భగవంతుడు ఇప్పుడు స్పష్టంగా ఇక్కడ చెప్తున్నాడు. కానీ 2-12వ శ్లోకంలో నువ్వు నేను ఈ రాజులు అందరూ గతంలో లేని వారం కాదు భవిష్యత్తులో లేకుండా పోయే వారము కాదు. ఈరోజున మనం చర్చించుకుంటున్న ఈ పునర్జన్మ సిద్ధాంతానికి అక్కడే బీజం వేశాడు. ఆ బీజం 2-22లో మొలకెత్తింది. ఇన్ని శ్లోకాలు చర్చించుకున్న అవగాహన సారంతో ఇక్కడ మనకు పాఠ్యాంశంగా అధ్యయన అంశంగా పరిణమించింది. నాకు తెలుసు, నీకు తెలియదు అనడంలోని ఆంతర్యం ఏమంటే ఈ భౌతికత అజ్ఞానంతో ఈ జ్ఞానం 3- 38వ శ్లోకంలో చెప్పుకున్నట్లు నిప్పు పై నివురులా కప్పి ఉంది. కారణం ఆవరణ దోషమని 3-39 వ శ్లోకంలో చర్చించుకున్న పరిస్థితి. ఈ ఆవరణ దోషం కారణంగా జీవుడు గత జన్మలలోని విషయాలు తెలుసుకోలేకపోతున్నాడు. ఈ ఆవరణ దోషం లేని సర్వజ్ఞులకు భగవానుడు అంటున్న నాకు తెలుసు అనే అంశం తెలిసి ఉంటుంది. ఎందుకంటే సర్వజ్ఞులు ఎరుకే తప్ప మరపు వీరికి ఉండదు. ఇక్కడ జీవుడు వేరు, ఈశ్వరుడు వేరా అనే సందేహం కలిగే అవకాశం ఉంది. అయితే ఇక్కడున్న తేడా ఏమంటే ఆవరణ దోషం ఉన్నవాళ్లు జీవులు. వీరికి గత జన్మస్మృతులు ఉండవు. ఆ దోషం లేని వారు ఈశ్వరుడు సర్వజ్ఞులు. అంటే జీవభావన తొలగితే సర్వజ్ఞత్వాది లక్షణాలతో శోభించేది ఈశ్వరుడు. జీవభావమే అహం, నేను అనే భావన. అది పరిధి దాటి నేనే అనే అహంతో మనిషి అజ్ఞానంలో కూరుకు పోతుంటాడు. ఈ అహంభావాన్ని దర్శించే అహం స్వరూపమే ఈశ్వర చైతన్యం. జీవభావన పరిమితం కాబట్టి సర్వం తెలియదు. ఈశ్వర చైతన్యం అపరిమితం, పూర్ణం. అందువల్ల తనను దర్శించే మరో ద్రష్ట లేనిదై సర్వజ్ఞత్వంతో శోభిస్తూ ఉంటుంది. జన్మ అనేది గత జన్మ కర్మను బట్టే ఉంటుంది. ఈ జన్మలో మన ప్రవర్తన తీరు తరువాతి జన్మను నిర్దేశిస్తుంది. ఇది కర్మకు జన్మకు ఉన్న అవినాభావ సంబంధం. ఎవరు అంగీకరించినా అంగీకరించక పోయినా. ఈ విషయం సశాస్త్రీయంగా ప్రామాణికంగా తెలియడానికి మనతో మనం చర్చిద్దాం. ఈ పునర్జన్మ సిద్ధాంతం మనకు అవగాహన కావడానికి మనం మన దేహ నిర్మాణాన్ని ఐదు విధాలుగా విభజించుకొని పరిశీలించి అర్థం చేసుకోవాలి.

ఒకటి అన్నమయ కోశం లేదా అన్నమయ శరీరం. అన్నమంటే ఆహారం, మనం తింటున్న ఆహారపరమైన మనకు కనిపించే శరీరం. ఇందులోని స్థూల సూక్ష్మ భూతాలు శరీర నిర్మాణం అంతా మనకు తెలుసు. గతంలో మనం అనేక సందర్భాల్లో మనం ఈ అంశాలను సమగ్రంగా చర్చించుకున్నాం.

రెండు మనోమయ శరీరం. దీని స్వరూప స్వభావాలు గడచిన అధ్యాయాల్లో సవివరంగానూ సమగ్రంగాను ప్రామాణికంగానూ చర్చించుకున్నాం.

మూడు ప్రాణమయ శరీరం అంటే శక్తి సమన్విత శరీరాన్ని ప్రాణ శక్తికి సంబంధించిన శరీరాన్ని ప్రాణమయ శరీరం అంటాం. ఇది శ్వాసక్రియతో కూడినది. మొదటి అన్నమయ, మనోమయ శరీరాలు రెండు భౌతికమైనవి. భౌతిక శరీరం స్థూలంగా కనిపిస్తుంది. మానసిక శరీరం కొంత సూక్ష్మమైనది. అయితే ప్రాణమయ శరీరం మరింత సూక్ష్మాతి సూక్ష్మమైనది. ఈ మూడు కూడా భౌతికమైనవే. ఉదాహరణకు ఒకటి బల్బు, రెండు తీగ ద్వారా ప్రయాణించే ఎలక్ట్రాన్ల ప్రవాహంతో కూడుకున్న విద్యుత్ శక్తి. మూడు బల్బు నుంచి ప్రసరించే కాంతి. ఈ మూడు కూడా భౌతికమైనవే కదా. కానీ మనకు భౌతికమైనవే ఉదాహరణకు ఒకటి బల్బు రెండు తీగ ద్వారా ప్రయాణించే ఎలక్ట్రాన్ల ప్రవాహంతో కూడుకున్న విద్యుత్ శక్తి మూడు బల్బు నుంచి ప్రసరించే కాంతి. ఈ మూడు కూడా భౌతికమైనవే కదా కానీ మనకు కనిపించేది బల్బు మాత్రమే. అలాగే దేహం కనిపిస్తుంది. మనోమయ ప్రాణమయ శరీరం కనిపించదు అంతే. మనిషి స్థూల శరీరం మీద మనోమయ శరీరం మీద ప్రాణమయ శరీరం మీద కర్మ అంటే మనం చేసే పనుల జాబితా కర్మ సంబంధమైనటువంటి అంశాలు నిర్మితమై ఉంటుంది. ఈ కర్మ సంబంధిత నిర్మాణాలే, వాసనలే మనిషిని ఈ భౌతిక శరీరాన్ని అంటుకొని ఉంటాయి. తద్వారానే మనం 3-5లో 3-33 లో చెప్పుకున్న సూత్రం సమన్వయం కుదురుతుంది. ఇక మిగతా రెండు అంశాలు విజ్ఞానమయ శరీరం, ఆనందమయ శరీరం ఇందులో విజ్ఞానమయ శరీరం అనేది అభౌతికమైనది. కానీ భౌతికతతో సంబంధం కలిగి ఉన్నటువంటిది. విజ్ఞానం అంటే పరిధిని దాటినది పరిధికి అందనిది విశేషమైన జ్ఞానం కలిగింది అని అర్థం. అంటే జ్ఞానేంద్రియాలకు అందనిది. దీన్నే ఆకాశమయ శరీరం అని కూడా అంటాం. ఇది భౌతికతకు అభౌతికతకు మధ్యలో ఉన్న అంశం. ఇది భౌతికమైనది కాదు అభౌతికమైనది కాదు. ఇది భౌతికతకు, అభౌతికతకు మధ్యలో ఉన్న వారధి, ఒక లింకు అని చెప్పవచ్చు. పెద్దలు ఆకాశ రికార్డ్స్ అంటుంటారు. ఈ లింకు ద్వారానే మన ప్రవర్తనా ఫలితం యొక్క సాఫ్ట్ కాపీ ఆకాశ రికార్డ్స్ లో నిరీక్షిప్తమవుతుంది. ఇక ఆనందమయ శరీరం ఇది పూర్తిగా అభౌతికం తనకంటూ ఒక రూపం లేదు. మనలోనే మొదటి మూడు అన్నమయ, మనోమయ, ప్రాణమయ శరీరాల ప్రవర్తన లేదా కర్మ తీరును బట్టి ఈ నాలుగవ శరీరమైన ఆకాశ రికార్డ్స్ లో ఉన్న మనం దాచుకున్న నిధిని బట్టి మంచిగాని చెడుగాని ఆనందమయ శరీరపు తీరు ఉంటుంది. ఈ ఐదు శరీరాల్ని అర్థం చేసుకొని మొదటగా మనం చర్చించుకున్న స్వీయ పరిశీలన అంటే నిజజీవితంలో మన కళ్ళ ముందు జరుగుతూ ఉండేటటువంటి అంశాల పట్ల మనకు కలిగిన అవగాహన ఈ రెండింటిని సమన్వయం చేసుకొని జన్మల విధానాన్ని తెలుసుకోవాలి. వీటన్నింటినీ అంటే ఒక నాలుగవ శరీరంలో చెప్పుకున్నాం కదా. ఆకృతి మాత్రమే మరణిస్తుంది.. అంటే మానవ ఆకారాన్ని మాత్రమే పోగొట్టుకుంటుంది. అయితే జీవితపు లేదా ఆ జన్మ యొక్క విషయాల సాఫ్ట్ కాపీ ప్రాణమయ శరీరంలో నిక్షిప్తమై శరీరాన్ని విడిచాక విజ్ఞానమయ లేదా ఆకాశమయ శరీరం అనే తీగ లింకు ద్వారా పయనిస్తుంది. మనం ఈ మూడు శరీర స్థితుల్ని దాటితే ఆ తీగ ఓ తిన్నని శక్తి క్షేత్రాల శ్రేణిగా ఉన్న ప్రజ్ఞను పునస్మృతిలోకి తెచ్చుకునే స్వాతంత్రాన్ని ఇస్తుంది. ఈ పరిశీలనను అర్జునుడికి అంటే మనకు నేర్పడానికి జగద్గురువు నీకు తెలియదు నాకు తెలుసు అంటున్నాడు. అంటే సూటిగా నీకు తెలియదు

కాబట్టి ఈ అంశాన్ని నువ్వు తెలుసుకోవాలని ఉద్బోధిస్తున్నాడు, సూచిస్తున్నాడు, హెచ్చరిస్తున్నాడు. నేను నిత్య శుద్ధ బుద్ధ ముక్త స్వభావం కలవాడిని నా జ్ఞాన శక్తిని ఏదీ కప్పబడలేదు. కాబట్టి నాకు తెలుసు నీకు అంటే మనకు నిప్పు మీద నివురులా అద్దం మీద దుమ్ములా గర్భస్థ శిశువును కప్పిన కప్పబడి ఉండటం వల్ల నీకు తెలియలేదు అని తేల్చి చెప్తున్నాడు జగద్గురువు. కాబట్టి ఈ ఐదు విధాలా శరీరాన్ని వివేచనతో చూసి మొదటి మూడు స్థితుల్ని దాటి ఆకాశమయ శరీరము స్థితికి చేరుకున్నప్పుడు మన జ్ఞానం విస్తృతం అవుతుంది. అప్పుడు ఈ వివేచనతో విశ్వంలో ఉన్న శక్తి క్షేత్రాల సర్వస్వపు సంక్షిప్త సమస్య స్వరూపమే మనిషి అని తెలియ వస్తుంది. మొదటి మూడు అధ్యాయాల్లో పొందిన అవగాహనతో ఈ పంచ శరీర విధానాన్ని దర్శించాలి. అలా ఆ అవగాహనతో దర్శించినప్పుడు 2- 12, 2-16, 2-22, 2-24, 2-72లో చర్చించిన అంశాలు అనుభవేద్యం అవుతాయి. పునర్జన్మ సిద్ధాంతం అవగతమై సర్వజ్ఞతను పొందడానికి మార్గం సుగమం అవుతుంది. నాకు నీకు కూడా అనేక జన్మలు గడిచాయి అవన్నీ నాకు తెలుసు నీకు తెలియవు అంటూ పునర్జన్మ సిద్ధాంతాన్ని మన ముందుంచినటువంటి జగద్గురువుకు ప్రణమిల్లుదాం.

4అ, 6శ్లో.

అజోఽపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్ |
ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా ||

నేను జన్మరహితుడను, నిత్యుడను, సమస్త ప్రాణులకు ఈశ్వరుడను. అయినను నా ప్రకృతిని అధీనములో నుంచుకొని, నా యోగ మాయచే అవతరించుచుందును.

పుట్టుక ఉంటే గిట్టడం ఉంటుంది కాబట్టి ఇక్కడ జగద్గురువు నేను పుట్టుక లేని వాడిని కాబట్టి పుట్టని దానికి నాశనం లేదు కనుక వినాశనం తెలియని వాడిని ప్రాణులకు ప్రభువును. అంటే మనలోని 24 తత్త్వాలకు వాటి పుట్టుకకు సాక్షిగా ఉంటూ మనల్ని నడిపించే ప్రభువు, అలాగే ప్రకృతిలోని కనిపించే కనిపించని రెండు శక్తుల్ని వ్యవస్థీకృతం చేసి నడిపిస్తున్న మూలశక్తి కాబట్టి నేనే ప్రభువుని ఈశ్వరుణ్ణి అంటున్నాడు జగద్గురువు. ఆ కారణంగా ప్రకృతిని తన ఆధీనంలో ఉంచుకొని మాయమయ ప్రకృతికి అతీతంగా ఉండి తన మాయతో తానే అవతరించాడు. కర్మ వల్లనే ప్రాణి పుడుతుంది, మరణిస్తుంది. అయితే భగవంతుడు అర్జునా నీకు నాకు అనేక జన్మలు గడిచాయి అని చెప్పాడు. మరైతే మనలాగే భగవానుడికి కూడా జన్మలు ఉన్నాయా అనే సందేహాన్ని నివృత్తి చేస్తూ భగవానుడు నా మాయ చేత నేనే నా ప్రకృతిని ఆధీనంలో ఉంచుకొని నామాయ శక్తి చేత అవతరిస్తుంటానని మనకు సంశయానికి తావు లేకుండా రెండో పాదంలో సంపూర్ణ సమాధాన సందేశం మన ముందు ఉంచాడు. ఇది పరమాత్మ అవతార వైభవం కాబట్టి నేను పుట్టుక లేనివాడిని అయినా పుట్టిన వాని వలె

తెలుస్తునాను. కార్యము అంటూ ఏదైనా ఉంటే దాని వెనుక కారణం ఉంటుంది, ఉండాలి కూడా. కార్యరూపం దేహమైతే దేహం పుట్టుక వెనుక కారణం ఉంటుంది. మనం ముందు శ్లోకంలో చెప్పుకున్న విజ్ఞానమయ కోశం అనే ఆకాశమయ శరీరపు లింకు ద్వారా పాపపుణ్యాల కారణంగా జన్మలు సంభవిస్తూ ఉంటాయి. ఇక్కడ శ్రీకృష్ణ పరమాత్మ జన్మ ఏ విధమైన కార్య కారణ కోవకు సంబంధించింది కానందున అతడు పుట్టేవాడు కాడు. కనుక అజుడు, జన్మ రహితుడు, పుట్టుక లేనివాడు, వినాశనం లేని వాడు అందుకే అవ్యయాత్మ. నశించని అజేయమైన జ్ఞాన శక్తి కలవాడు. అలా అవ్యయం, అజం, అనంతం అయినా సత్తురూప చైతన్య స్వరూపానికి జన్మ ఎలా కలుగుతుంది. అంటే ఈశ్వరుడు తన మాయను తానే సృష్టించుకుని తన మాయను తన ఆధీనంలో ఉంచుకొని తనకు వశపడిన మాయాశక్తి చేత ప్రకృతిని అధిష్టించి లోక సంగ్రహర్థం లోకకళ్యాణం కొరకు అవతరిస్తూ ఉంటారని మనకు నిరూపణ అయింది. శ్రీరాముడు శ్రీకృష్ణుడు ఆయా కాలాల్లో లోక సంగ్రహార్ధం ఈ భూలోకాన్ని సందర్శించారు. ప్రజలు కూడా వారిని దర్శించగలిగారు. సృష్టి కార్యం అవసరమైన చోట ప్రకృతిని అదుపులో ఉంచుకొని ప్రకృతికి అతీతంగా ఉండి అవతరించి నియమిత కార్యాలు పూర్తి చేసి విరమిస్తూ ఉంటారు. వీరు ముందు శ్లోకంలో చెప్పుకున్న ఐదవదేహం ఆనందమయ శరీరంలోనే ఉంటారు. అంటే మొదటి మూడు శరీరాలు వీరికి సంబంధం ఉండదు. అవి నామమాత్రంగా వస్తువుల్లా ఉంటాయి. అంతేగాని ఆ మూడు దేహాలు వీరి మీద పెత్తనం చలాయించదు. ప్రాణశక్తితో సహా వీరు అవతరించాలనుకున్నప్పుడు ప్రాణశక్తిని నింపుకుంటారు. విరమించాలనుకున్నప్పుడు ప్రాణ శక్తిని విశ్వవ్యాప్తం చేస్తారు. అంటే వీరు అన్నమయ, మనోమయ, ప్రాణమయ శరీరాల స్పృహను, స్పర్శను అధిగమించి ఆకాశమయ శరీరపు లింకుతో మాత్రమే ఉంటూ ఆనందమయ శరీరంలో విశ్వవ్యాప్తమై వ్యవహరిస్తుంటారు. ఈ ఆనందమయ శరీరంతో విశ్వ విస్తృతిని పొంది విశ్వంలో ఒక భాగమై ఉంటూ తమ నియమిత కార్యకలాపాలను నిర్వర్తిస్తూ ఉంటారు. ఇందుకు మనం ఉదాహరణగా చెప్పుకోవాలి అనుకున్నప్పుడు ఆదిపర్వం లో గంగాదేవి పాత్రను మనం గమనిస్తే ఆమె అడుగడుగునా ఎంతో చైతన్యంతో ప్రవర్తించిన తీరు ఈ భూలోక మాయకు ఎక్కడా కూడా ఆమె ఆకర్షితురాలు కాకుండా ఉన్న వైనం మనకు స్పష్టంగా కనిపిస్తుంది.

4అ, 7శ్లో.

యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత |
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ |7 |

ఓ భారతా! (అర్జునా) ధర్మమునకు హాని కలిగి నప్పుడును, అధర్మము పెచ్చుపెరిగిపోవుచున్నప్పుడును నన్ను నేను సృజించుకొందును. అనగా సాకార రూపముతో ఈ లోకమున అవతరింతును.

ముందు శ్లోకంలో నాకు పుట్టుక లేదు, మార్పు లేదు ప్రాణులందరికీ ప్రభువును అయినా నా ప్రకృతిని వశం చేసుకుని నా మాయ చేత పుడుతున్నాను అన్న జగద్గురువు ఈ శ్లోకంలో తానెప్పుడు అవతరిస్తాడో ఆ సందర్భాలను ఈ శ్లోకంలో వివరిస్తున్నాడు. అక్కడ అవతరించేటటువంటి విధానాన్ని ఉదాహరణతో సహా చర్చించుకున్నాం. ఎప్పుడెప్పుడు ధర్మానికి హాని జరుగుతుందో అధర్మం వృద్ధి చెందుతుందో అప్పుడు నన్ను నేను సృష్టించుకుంటూ ఉంటాను అంటున్నాడు జగద్గురువు. ప్రపంచాన్ని సృష్టించినట్లు సర్వజీవుల్ని సృష్టించినట్లు తాను సృష్టించిన ప్రపంచంలోనే తనను తాను సృష్టించుకుంటాడు. అదే భగవంతుని అవతారం. ఇలా అవతరించడం వెనుక ధర్మ పరిరక్షణే తప్ప ఈ లోకపు త్రిగుణాలతో గాని ఈ లోకపు బంధాలతో గాని వారికి ఎలాంటి కార్యము ఉండదు. మానవాళికి నడతను నడకను నేర్పడం ధర్మాన్ని ఆచరింపజేయడం అందులోని పరమార్థం. ఈ విషయం మనం గ్రహించాలి. ధర్మం అనేది శ్రేష్టమైనది, సమున్నతమైనది, పవిత్రమైనది ధర్మం వల్లనే భూమి తిరుగుతోంది. ధర్మాన్ని అనుసరించి భూమి నడుస్తుంది. ధర్మమంటే ధరించేది. లోకాన్ని ధరించేది ధర్మం. ధారణ, పోషణ అనే రెండు లక్షణాలు ధర్మం అనే శబ్దంలోనే ఇమిడి ఉంటాయి. ప్రపంచాన్ని ధరిస్తూ ప్రపంచ మనుగడకు కారణమై ఉంది ధర్మం మాత్రమే. జీవుల్ని నిరంతరం పాలించేది రక్షించేది కూడా ధర్మమే. ఈ విశ్వమనే దేహానికి ధర్మం వెన్నుముకలా నిలిచి ఉంటుంది. ఆ కారణంగా ప్రాణుల శ్రేయస్సుకు అభ్యుదయానికి మోక్షానికి కూడా సాధనమైన ధర్మం ఆచరణకు నోచుకోనప్పుడు ఆధర్మం వృద్ధి చెంది లోకాన్ని అల్లకల్లోలం చేస్తుంది. అంటే ధర్మాన్ని ఆచరించలేదంటే దాని అర్థం అధర్మంలో ఉన్నట్లే. అదే ధర్మ గ్లాని అధర్మంతో సృష్టి ధర్మంగా కొనసాగదు కదా. ఈ సున్నితమైన అంశాన్ని అర్థం చేసుకోగలిగితే మనిషి తన దృష్టిని సన్మార్గం వైపుకు, ధర్మం వైపుకు మరల్చుకోవడానికి వీలుంటుంది. ఈ అధర్మపరుల చేతిలో చిక్కుకొని ధర్మపరులు కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి సంభవిస్తుంది. కాబట్టి ధర్మాచరణకు హాని జరిగినప్పుడల్లా భగవంతుడు తనను తాను సృష్టించుకొని ధర్మాన్ని పరిరక్షిస్తుంటాడు. 1-1వ శ్లోకంలో ధర్మమే దైవమని 2-31 నుండి 2-38 వరకు గల ధర్మ ప్రకరణంలో 3-35 లో కూడా స్వధర్మం యొక్క విశేషాలను విశిష్టతను చాలా స్పష్టంగా తెలుసుకున్నాం. ఈ మూడు అంశాల అవగాహనతో ఈ శ్లోకాన్ని పరిశీలించాలి. ధర్మానికి హాని జరిగిన సందర్భాల్లో ధర్మాన్ని పరిరక్షించడానికి భగవంతుడు అవతరించిన విషయం మనకు తెలియనిది కాదు. సృష్టిలోని నియతి ప్రకారం మనిషి కొనసాగాలి. ధర్మముంటేనే సృష్టి క్షేమంగా కొనసాగుతుంది. భగవంతుడు ధార్మిక బుద్ధిని మనిషిలో నిక్షిప్తం చేశాడు. ఆ బుద్ధి అనే నాడి వికసించని కారణంగా జంతువులు ఇతర ప్రాణులు సహజత్వాలతో బతుకుతూ ఉంటాయి కర్మ స్వేచ్ఛలేని కారణంగా జంతువుల్లో ఇతర ప్రాణుల్లో ధర్మాధర్మాల ప్రసక్తి కానీ మనిషికి మనసు ఉంది బుద్ధిని వికసింపజేసుకుని వివేచన ఉంది. కర్మ స్వేచ్ఛ ఉంది. అందువల్ల ధర్మంగా జీవించి ధర్మాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉంది. ధర్మాన్ని అనుసరిస్తే ధర్మబద్ధమైన ఫలితాలు ఉంటాయి. ధర్మాన్నికరిస్తే దుష్ఫలితాలు సంభవిస్తాయి. కానీ ఈ హాని ధర్మానికి కాదు మనకే అనే వాస్తవం మనకు తెలియాలి ఇక్కడ జగద్గురువు గ్లానిర్భవతి కానీ సంభవిస్తే అంటున్న మాటను మనం ఎలా అర్థం చేసుకోవాలి

ఇక్కడ హాని ఎవరికి సంభవిస్తుంది మనిషికి మనకే ఎందుకు అంటే ధర్మచరణను విస్మరిస్తే ఒక ఉదాహరణ చెప్పుకుందాం. భూమిలోకి బాగా ,వేళ్లూనుకున్న కున్న మొక్కల్లో ఆకులన్నీ సజీవంగా ఉంటాయి. పచ్చగా మెరుపులేనితో చల్లటి గాలితో ఊగుతూ పరవశింపజేస్తూ ఉంటాయి. అన్ని వైపుల నుంచి మనకు ఆనంద పరవశాన్ని వెదజల్లుతూ శోధిస్తూ ఉంటాయి. కూడా అలాంటి మొక్కల దరిదాపులకు వెళ్ళినప్పుడు అవి మనకు జీవన మాధుర్యాన్ని తలపిస్తాయి. అలాంటి మొక్కలకు వేర్లు కదిలిపోయి దాని పునాదికి ఇలాంటి సంభవిస్తే హాని సంభవిస్తే దాని మూలాలు కదిలిపోయి తెగిపోవడం వల్ల అవి నిర్జీవమైపోయి దాని మెరుపును కాంతిని చల్లదనాన్ని ఆనందపరవస్యాన్ని మనకు ఇవ్వలేవు కదా భూమిలోని వేర్లు స్థానభ్రంశం చెందితే జరిగేది అదే కదా దాని సర్వ వైభవానికి ఆ మూలాలే ఆధారం కావు కానీ అవి తన సంపూర్ణ జీవిత రహస్యాన్ని అక్కడ పొందుపరచుకొని ఉంటాయి సరిగ్గా అలాగే మనకు మూలాలు ఉంటాయని మనకు తెలియాలి మొక్కలాగే మానవుడికి జీవిత తలం ఉంటుంది మొక్కలు ఎండిపోయినట్లు మనిషి తన మూలాలను పెంచాలి మన జీవితపు పునాదులు ధర్మము యొక్క పునాదులు కదిలిపోయాయి అందుకే అధర్మం మనిషిని అటు ఇటు ఊపుతోంది. జీవితం అంటే జీవశక్తితో కూడి ఉండటం అని చెబుతున్నటువంటి మాట అలా మనం మన జీవ శక్తితో కూడి ఉండడం లేదు జీవితపు జీవనపు జీవించే జీవం యొక్క మూలం కదిలిపోయి ఉంది అందుకే మనిషికి జీవిత ధ్యేయం కనిపించడం లేదు. అన్ని విషయాలు అర్థరహితంగానే వ్యర్థంగానే తయారైపోయాయి తద్వారా జీవితాలు నిరర్థకమైన నిస్సహాయపరిస్థితి దాపురించింది. కాబట్టి భూమిలో మొక్కలకు వేళ్ళు బాగా పాదుకున్నట్లు తిరిగి మనలో మన మూలాలు బలంగా వేళ్ళూనుకునేటట్లుగా మనమే చేయాలి. ఆ మూలమే ధర్మం ఇది మనం చేయగలిగితే మన జీవితం ధన్యమైనట్లే మన శరీరానికి అతీతంగా ఉంటున్న ఉనికి యొక్క జ్ఞానాన్ని అంతరావలోకనంతో ప్రత్యక్షంగా అనుభూతించాలి. దీనికి మనం చేయాల్సింది మన దృష్టిని మరల్చడమే కనిపిస్తున్న వాటి వైపు ఉన్న దృష్టిని దర్శిస్తున్న వాడి వైపుకు మళ్ళిస్తే సరిపోతుంది. దర్శనం మీద నుంచి దర్శి మీదకు మళ్ళిస్తే ఆత్మ జ్ఞాన ప్రాప్తి సంప్రాప్తిస్తుంది. అదే ధర్మాచరణ మనం మళ్లీ ఆత్మమూలలను సాధారణ స్థాయి మనిషికి అందించగలగాలి. జీవనతలాల్ని అందించాలి ఆ మూలమే జీవనతలమే ధర్మం అప్పుడే అభ్యర్థనం అధర్మస్య అధర్మం అభివృద్ధి చెందకుండా ఉంటుంది. ధర్మానికి హాని జరగకుండా ఉంటుంది ధర్మాన్ని విస్మరించిన మనిషికే సంభవిస్తుందని మనిషి తెలుసుకోవాలి కాబట్టి ధర్మ పరిరక్షణ దిశగా ప్రతి మనిషి అడుగులు వేయాల్సిన అవసరం ఉంది.

4అ, 8శ్లో.

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ |
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ||

సత్పురుషులను పరిరక్షించుటకును, దుష్టులను రూపుమాపుటకును, ధర్మమును సుస్థిరమొనర్చుటకును నేను ప్రతియుగమునందును అవతరించుచుందును.

ముందు శ్లోకంలో ధర్మానికి హాని జరిగినప్పుడల్లా నేను అవతరిస్తూనే ఉంటానని చెప్పిన జగద్గురువు ఈ శ్లోకంలో అవతరించాక అతని కార్యాచరణ ప్రణాళికను గురించి స్పష్టంగా వివరిస్తున్నాడు. మనం ముందు శ్లోకంలో పునాదులు కదిలిపోయాయి అందుకే మనం ఊగిసలాడుతూ ఊగుతూ ఉన్నాం అని చెప్పుకున్నాం. ఆ కారణంగా ఆ పునాదుల్ని పటిష్టంగా స్థాపించడానికి ధర్మసంస్థాపనార్థాయ ఆ కదిలిపోయిన పునాదుల్ని బలోపేతం చేయడానికి నేను అవతరిస్తానని చాలా స్పష్టంగా ఇందులో తెలియజేస్తున్నాడు. అధర్మం ప్రబలి పోయినప్పుడు ధర్మాత్ములు కూడా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి సంభవిస్తోంది. అందుకు ఉదాహరణ ప్రహ్లాదుడు కన్నతండ్రి ద్వారా ఎన్ని ఇబ్బందులు పడ్డాడో మనకు తెలియనిది కాదు. ధర్మాన్ని గట్టిగా అంటిపెట్టుకున్న శ్రీరామ లక్ష్మణులు, పాండవులు లాంటి వారెందరో అనేకరకాల ఇబ్బందులకు గురైన సంగతి మనకు తెలుసు. నేటికీ మనం ఎంతోమందిని సమాజంలో మన కళ్ళారా చూస్తూ ఉన్నాం. ధర్మబద్ధంగా నడుచుకుంటున్న వారికి కడుపు నింపుకోవడం కూడా క్లిష్టతరమైనటువంటి పరిస్థితులు. ఎంతోమంది ధర్మాత్ములు ధర్మంగా జీవించి చివరి రోజుల్లో భోజనానికి కట్టుబట్టలకు కూడా నోచుకోని అనేకమందిని అనేక సంఘటనలను మనం చూస్తూనే ఉన్నాం .అలాంటి సజ్జనులు ఇబ్బంది పడకూడదని ఎందుకంటే ఈ లోకానికి దిక్కు సాధు సజ్జనులే కాబట్టి వారి మనుగడ కూడా ప్రశ్నార్థకమయ్యే సందర్భాల్లో దైవం తనను తాను సృజించుకోవడం అనివార్యం. అందులో భాగంగానే సాధు సజ్జనులను సంరక్షించుకోవడానికి దైవం అవతరించడం. సత్యం, ధర్మం సృష్టి మనుగడకు మూల స్తంభాలను మనం తెలుసుకున్నాం. కాబట్టి ఆ మూల స్తంభాలు కదిలిపోతున్నప్పుడు ధర్మసంస్థాపనకు దైవం అవతరణ తప్పనిసరి. ఈ శ్లోకంలో ప్రధానంగా మూడు అంశాలు మనకు కనిపిస్తుంది. ఒకటి సాధు సజ్జనుల పరిరక్షణ, రెండు అధర్మాన్ని రూపుమాపడం, మూడు ధర్మ సంస్థాపనం. ఇవి భగవంతుని అవతారం ద్వారా జరిగే కార్యకలాపాలు.

ఇక్కడ సాధువులు అంటే సత్ప్రవర్తన గలవారు అని అర్థం. సజ్జనులు అంటే మనం 2-16, 2-24, 2-72లో చెప్పుకున్న సత్తును నిర్ణయించుకొని అందులోనే స్థిత ప్రజ్ఞతను పొంది బ్రాహ్మిస్థితిలో జీవిస్తున్న వారని అర్థం చేసుకోవాలి. భగవంతుని అవతార ప్రయోజనాల్లో మొదటిది సాధు సజ్జనుల పరిరక్షణ కదా సత్ప్రవర్తనతో ఉంటూ సన్మార్గంలో ప్రయాణించేవారు సాధు సజ్జనులు. కనుక అలాంటి సాధు సజ్జనుల పరిరక్షణ భగవంతుని

అవతారంలో మొదటి కార్యక్రమం. ఏది సన్మార్గం అన్నప్పుడు ధర్మమే దైవం కనుక ధర్మ మార్గంలో ఉన్న వారందరూ దైవ మార్గంలో ఉన్నట్టే. దీనికి కులమత లింగ వర్ణ వర్గ వయోభేదాలు ఉండవు. ప్రతి మనిషికి సంబంధించిన అంశం. మనిషి ఈ సృష్టిలోని నియతి ప్రకారం ప్రవర్తించాలి. మనం ధర్మచక్రం, సృష్టి చక్రం గురించి విపులంగా చర్చించుకున్నాం. ఆ అంశాల దృష్టితో సృష్టి నియతిని అర్థం చేసుకొని ధర్మాచరణతో జీవించాలి. అలాంటివారికి అధర్మపరుల ద్వారా హాని సంభవించే అవకాశం ఉన్నందున ముందుగా సన్మార్గులకు సాదు సజ్జనులకు పరిరక్షణ అవసరం కాబట్టి నా అవతారంలో మొదటి కార్యక్రమం సాధు సజ్జనుల పరిరక్షణ అంటున్నాడు జగద్గురువు. ఇది ఒక్క మాట చాలు మనం సన్మార్గాన్ని గట్టిగా పట్టుకోవడానికి. ఎందుకంటే అదే దైవం. కాబట్టి దైవ శక్తికి మించిన తోడు రక్షణ ఇంకేముంటుంది ఈ లోకంలో. ఇంకెవరు రక్షిస్తారు మనల్ని. దైవమార్గంలో ఉండటం అంటే సాక్షాత్తు సృష్టిని నడిపిస్తున్న మనకు జీవం పోసి పంపిన మూలశక్తితో ఏకమై ఉండటమే అని మనకు తెలియాలి. అదే దైవ మార్గం, సన్మార్గం, ధార్మిక మార్గం. అదే మనం ముందు శ్లోకంలో చెప్పుకున్న మన మూలాలు తెలుసుకోవడం అంటే.

రెండు అధర్మాన్ని రూపుమాపడం అంటే పాపులను శిక్షించడం. ధర్మపరుల జీవనం కుంటుపడితే సమాజం కుదురుగా ఉండలేదు కాబట్టి అధర్మాన్ని రూపుమాపినప్పుడే ధర్మం సుభిక్షంగా ఉండే సమాజాన్ని శాంతియుతంగా నడిపించగలదు. అందుకని ఈ భగవంతుని అవతారం లో రెండవ కార్యక్రమంగా అధర్మాన్ని రూపుమాపడం. మూడు ధర్మాన్ని సంస్థాపించడం. అంటే పటిష్టంగా ధర్మాన్ని స్థాపింప చేయడం అని అర్థం. భూమిలోకి బాగా పాతుకుపోయిన వేర్ల లాగా ధర్మాన్ని మనలో, ప్రజలలో సంస్థాపితం చేయాలి. అదే దైవ అవతారంలోని మూడవ కార్యక్రమం. కాలక్రమంలో ఆయా దేశంలో కాలంలో నిరుపయోగంగా మారిన ధర్మాన్ని ఆయా కాలానుగుణంగా సవరించి స్థాపించడమే ధర్మసంస్థాపనం. ధర్మాన్ని సద్వినియోగం చేసుకోలేని ధర్మ జీవనానికి దూరమైన సమాజాన్ని ధర్మాన్ని ఆచరించేలా సంస్కరించడమే అంటే ప్రజలు ధర్మాన్ని ఆచరించేలా చేయడమే ధర్మసంస్థాపన.

తరువాత సంభవామి యుగేయుగే. ప్రతి యుగంలోనూ నేను పుడుతుంటాను. యుగం అంటే కాలం, క్రియ యొక్క అవధి కాలం, ఇది భూమి తన చుట్టూ తాను తిరగడం అనే క్రియ వల్ల సమయం జరిగిపోతూ ఉంటుంది. ఈ కాలం ఈ భూలోకానికి మాత్రమే వర్తిస్తుంది. ఈ కాల గణనను బట్టి ఒకరోజు ఒక వారం ఒక సంవత్సరం ఒక దశాబ్దం శతాబ్దం ఇలా. ఈ క్రమంలో సమయానికి సంబంధించిన నియమిత కాల గణనను యుగం అంటారు. మనం యుగాలను గురించి కాల క్రమం ప్రకారం మనం పరిశీలించినప్పుడు ఈ నాలుగు యుగాలు కలిపి ఒక మహా యుగం అవుతుంది. ఇలాంటి 1000 మహాయుగాలు సృష్టికర్తకు ఒక పగలు. మరో వెయ్యి మహాయుగాలు ఒక రాత్రి. అంటే ఒక మహాయుగం 43 నిమిషాల రెండు సెకండ్ల కాలం మాత్రమే. ఇలా మనం చూస్తే దివ్యాత్మ స్వరూపులారా మన జీవితకాలం ఎంత చిన్నదో అల్పాతి అల్పమైనదో అని మనకు తెలుస్తుంది. ఈ రెప్పపాటు

కూడా లేని జీవితకాలంలో మనం పడుతున్న పాట్లు మనలోని స్వార్థం ఆవేశం అన్నీ నాకే కావాలి, మొత్తం ప్రపంచంలోని పనులు అధికారాలు డబ్బు అన్ని నా సొంతం కావాలి అని అనే అల్పమైన భావన మనిషిని ఏ స్థాయికి తీసుకెళ్తుందో మనం చూస్తూనే ఉన్నాం. ఇలాంటివి అధ్యయనం చేసినప్పుడు ఈ సృష్టిలో ఇసుక రేణువులో రేణుపైన మన పరిస్థితిని గురించి మనం తెలుసుకుంటాం. ఈ యుగాన్ని అర్థం చేసుకున్న అవగాహనతో ధర్మానికి, యుగానికి సమన్వయం చేసి మనం మిగిలిన అంశాలను పరిశీలించాలి. ఇక ధర్మం అనే మాటను మనం ఇప్పటికే సమగ్రంగా వివరించుకున్నాం చాలా సందర్భాల్లో. ధర్మం అనే మాటను అర్థం చేసుకున్న దృష్టితో ఈ యుగం అనే మాటను సమన్వయం చేసి యుగ ధర్మాన్ని మనం చూడాల్సిన అవసరం ఉంది. కృతయుగంలో ధర్మం నాలుగు పాదాలపై, త్రేతా యుగంలో మూడు పాదాలపై, ద్వాపరయుగంలో రెండు పాదాలపై నడిచిందని పెద్దలు చెప్తుంటారు. కలియుగంలో ఒకే పాదం పై నడుస్తున్న విషయం మనకు తెలియనిది కాదు. ఇక చాలామందిలోని సందేహం యుగయుగానికి ధర్మం మారుతుందా ఒక్కో యుగంలో ఒక్కో ధర్మం ఉంటుందా ఫలానా యుగంలో ఎలాంటి ధర్మాన్ని ఆచరించేవారు అప్పటి ధర్మం ఎలా ఉండేది అని చాలా మంది ప్రశ్నిస్తూ ఉంటారు. కానీ యుగాల పేర్లు మారుతూ ఉంటాయి అది కాలగణనకు సంబంధించిన విషయం అంతేగాని యుగాలు మారినా యుగ ధర్మం మారదు. ధర్మం ఎప్పటికీ మారనిదేనని మనం గ్రహించాలి. మారేదే అయితే అది ధర్మం కాదు, మారనిది కనుక అది ధర్మం. ధరించేది ధర్మం అదే దైవం. కృతయుగం లో ధర్మం నాలుగు పాదాలపై నడిచింది. అంతే అర్థమేమంటే అక్కడ ఆ యుగంలో నివసించిన జన సమూహం అంతా కూడా ధర్మబద్ధంగా ప్రవర్తించారని సృష్టి నీతి ప్రకారమే తమ జీవితాల్ని ధర్మాన్ని తప్పకుండా కొనసాగించారని అర్థం చేసుకోవాలి. ఎక్కడో ఒకరిద్దరూ ఆధర్మపరులు ఉండి ఉండవచ్చు, వారు కూడా అభివృద్ధి చెంది తమను తాము మార్చుకునే ప్రయత్నం చేసి ఉంటారు. ఎందుకంటే ధర్మం అలాంటిది అది అందరినీ ఆచరింపజేసే ప్రయత్నంలోనే ఉంటుంది. ధర్మం మూడు పాదాలపై నడిచింది అనుకున్నాం కదా అంటే కృతయుగంలో ఆచరించినట్లుగా ఎక్కువమంది జన సమూహం కాకుండా వందకు 75% మంది మాత్రమే ఆచరించడం వల్ల ధర్మం మూడు పాదాలపై నడిచింది. ధర్మాచరణ గావించే వారి సంఖ్య తగ్గిందని అర్థం చేసుకోవాలి. అది ద్వాపర యుగానికి వచ్చేసరికి రెండు పాదాలు వందకి 50 శాతం మంది మాత్రమే ఆచరించే పరిస్థితి సంభవించింది. కలియుగంలో ఒకే పాదం పైన నడుస్తున్నదంటే 25 శాతం మంది మాత్రమే ధర్మపరులుగా ఉంటున్నారు. మిగిలిన 75 శాతం మంది అధర్మానికి పాల్పడుతున్నారని అర్థం. ఈరోజు గురించి మాట్లాడుకుంటే ప్రస్తుతం 100కు 10 శాతం మంది మాత్రమే ధర్మపరులున్నట్లు మనకు తెలుస్తోంది. అలాంటి ధర్మపరులు కూడా ఎక్కడో మౌనంగా దూరంగా ఉండాల్సిన పరిస్థితి. అలా ఒక పాదం పైన నడవటానికి కారణం మూలం మనం ముందు శ్లోకంలో చెప్పుకున్న సాధు సజ్జనులు. అందుకే ఈ లోకానికి ఎవరు దిక్కు అని యక్ష ప్రశ్నలలో ఆకాశవాణి అడిగినటువంటి ప్రశ్నకు సమాధానంగా ధర్మరాజు ఏమాత్రం తడుముకోకుండా సజ్జనులే ఈ లోకానికి దిక్కు అని సమాధానం ఇస్తాడు. అలాంటి సాధు సజ్జనులు కూడా కరువైతే అధర్మం వీరిని కూడా ఇబ్బంది పెట్టి నిలవడానికి

నీడ లేకుండా చేస్తే యుగం సృష్టి కొనసాగదు. కాబట్టి 'పరిత్రాణాయ సాధునాం' సృష్టికర్త అయిన జగద్గురువు 'పరిత్రాణాయ' అన్నాడు కదా. ఇక్కడ త్రాణం అంటే రక్షించడం అని అర్థం. పరి అనేది ఉపసర్గ అంటే సంపూర్ణమైన రక్షణ అని అర్థం. విశేషంగా పరిరక్షణ జరుగుతుంది అని అర్థం. ఇక్కడ పరిత్రాణాయ, వినాశాయ, సంస్థాపనార్థాయ అని అన్నింటికీ ఉపసర్గ చేర్చాడు. ధర్మాన్ని స్థాపిస్తానని చెప్పి ఉండవచ్చు కానీ సంస్థాపనాయా విశేషంగా స్థాపిస్తాను. అలాగే నాశాయ కాకుండా వినాశాయ అన్నాడు. అధర్మాన్ని సంపూర్ణంగా ఏమాత్రం మిగలకుండా శేషం లేకుండా రూపుమాపుతానని అర్థం. అలాగే సాధు సజ్జనులను కూడా విశేషంగా పరిరక్షించుకుంటానని అర్థం చేసుకోవాలి. అంటే జగద్గురువు నిర్వహించే ఆయా కార్యక్రమాలు సంపూర్ణంగా సమూలంగా విశేషంగా జరుగుతుందని అర్థం చేసుకోవాలి. అందుకోసం అలాంటి పదాల్ని ప్రయోగించాడు. ధర్మానికి గ్లాని, అధర్మానికి వృద్ధి సంభవించినప్పుడు తనకు తానుగా అవతరించిన భగవానుడు చరిత్రను రక్షించడానికి దుష్టులను శిక్షించడానికి ధర్మాన్ని చక్కగా స్థాపించడానికి ప్రతి యుగంలోనూ అవతరిస్తాను అని మనందరికీ భరోసా ఇస్తున్నటువంటి జగద్గురువుకు ప్రణమిల్లుదాం.

4అ, 9శ్లో.

జన్మ కర్మ చ మే దివ్యమ్ ఏవం యో వేత్తి తత్త్వతః |
త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున ||

ఓ అర్జునా! నా జన్మ (అవతారము)లు, కర్మములు, దివ్యములు. అనగా నిర్మలములు, అలౌకికములు. ఈ తత్త్వ రహస్యమును తెలుసుకొనినవాడు తనువును చాలించిన పిమ్మట మఱల జన్మింపడు సరి కదా! నన్నే చేరును.

మనం భగవంతుని అవతరణ, కార్యాచరణ అన్నీ కూడా సవివరంగా సమగ్రంగా ముందు శ్లోకంలో చూశాం. అయితే ఇవన్నీ తెలుసుకోవడం వల్ల మనం పొందే ప్రయోజనం ఏంటి అనేది ప్రధానం, ఆ కోణంలో మనం చూస్తే మన గమ్యానికి మార్గం మనం సుగమం చేసుకోవడానికి. అంటే గీత ఉన్నది గీత మార్గం ఉన్నది మన సంస్కరణ కోసమే వ్యక్తి సంస్కరణే గీతా మార్గం యొక్క లక్ష్యం, లోకధర్మాన్ని అనుష్ఠింప చేయడమే గీత పరమావధి. మనిషికి ప్రయోజనాన్ని లోకానికి శాంతిని సంప్రాప్తింప చేయడమే భగవద్గీత ఉద్దేశం. ఇప్పటివరకు 4వ అధ్యాయం ప్రారంభం నుంచి కూడా చర్చించిన భగవంతుని అవతార విధానం విశేషం ఏమంటే అవన్నీ చూసిన అధ్యయనం చేసిన మన దృష్టి మన సంస్కరణ వైపుగా మారలి సజ్జనులుగా పరివర్తన చెంది ఈ లోకానికి దిక్కుగా ఉండాలనేది గీత యొక్క పరమార్థం మనలోని ధార్మిక పునాదుల్ని పటిష్టంగా బలపరుచుకోవడానికి. ఈ శ్లోకం అవతార విధానాన్ని తెలుసుకోవడంలోని ప్రయోజనాన్ని ఫలశ్రుతిని స్పష్టంగా సూటిగా తెలియజేస్తుంది. ఈ

అంశాన్ని మనం ఈ శ్లోకంలో గమనించి గ్రహించి లోకోద్ధరణ గావించాలి. రూపమైన భగవంతుని పుట్టుక, అవతారం సాధు సజ్జనుల సంరక్షణ మొదలైన దైవిక కార్యక్రమాలు లోకసామాన్యమైనవి కావు, ఈశ్వర లక్షణయుతమైనవి. కాబట్టి భగవంతుని తత్త్వం, జన్మ కర్మలు తెలుసుకున్న వారు మాత్రమే జనన మరణాన్ని జయించిన వారు మాత్రమే దేహం విడిచాక ముక్తులు కాగలరు. సృష్టికర్తతో విలీనం కాగలరు అదే జగద్గురువు చెబుతున్న నన్నే చేరుకుంటారు అన్నమాట లోని ఆంతర్యం. ఇక్కడ ఒక అంశం మనం జాగ్రత్తగా గమనించాలి దేహం విడిచాక అన్నారు కదా మరణించిన లేదా దేహాన్ని విడిచిన తరువాత కాదని మనకు తెలియాలి. దేహ భావం, జీవభావం నేను ఈ శరీరమే అనే భౌతిక దృష్టి తొలగిపోవాలి అని అర్థం. అవి తొలగిపోయాక జీవన్ముక్తులు అవుతారని అర్థం చేసుకోవాలి. అంతేగాని మరణానంతరం మోక్షం ముక్తి అని కాదు. జ్ఞానం ఏదైనా బుద్ధిలోనే కలగాలి, ప్రకాశించాలి. అది బతికున్న వారిలో అజ్ఞానపు అంధకారం నుంచి మేలుకొన్న నిరంతరం మెలకువ స్థితి. 2-69 లో చెప్పుకున్న స్థితిలో కలిగేదే గాని మరణించాక కాదు. ప్రాణ శక్తి దేహం నుండి నిష్క్రమించాక కాదు. అలా మరణించిన తర్వాత దేహం గాని, నిష్క్రమించిన ప్రాణ శక్తి గాని చేయగలిగినది ఏమీ ఉండదు. అందుకే దీపం ఉన్నప్పుడే మన ఇంటిని మనం చక్కబెట్టుకోవాలి. శ్వాస ఈ దేహంలో ఉన్నప్పుడే మోక్షస్థితికి ముక్త స్థితికి చేరుకోవాలి. అంటే జీవించి ఉన్నప్పుడే పొందేది మోక్షం, ముక్తి. ఏదైనా అదే జీవన్ముక్తులు అంటే. జన్మ కర్మలు దివ్యమైనవి అంటున్నారు. ప్రకృతిని స్వాధీన పరచుకొని తన మాయ చేత తానే లోక కళ్యాణార్థం యుగయుగంలో అన్నారు కదా అంటే యుగంలో ఒక్కసారి అని కాదు సర్వవ్యాపి సర్వాంతర్యామి అయిన జగద్గురువు సృష్టికర్త ప్రతిక్షణం ఎక్కడ అవసరమైతే అక్కడ ఏ రూపం అనుకుంటే ఆ రూపంలో అది క్రిమి రూపం కావచ్చు, నరరూపం కావచ్చు, నరసింహ రూపం కావచ్చు. అందుకే దివ్యం అంటే మానవాతీతమైనది, దివ్యమైనది అని అర్థం. అధర్మ ప్రక్షాళనే ప్రధానం కానీ రూపము స్థానము దేశము కాలము కాదు. ఇది మనిషికి స్పష్టంగా తెలియాలి, మనిషిలో స్థిరీకృతం కావాలి అప్పుడే ధార్మిక స్థాపన మనిషిలో సుస్థిరంగా వేళ్ళూనుకుంటుంది ఇదే అవతార ప్రయోజనం. ఇలా భగవంతుని తత్త్వాన్ని ధార్మిక తత్త్వాన్ని ఎరిగిన వాడు పునర్జన్మను పొందడు తిరిగి నన్నే పొందుతాడు. అంటే సృష్టికర్త స్థాయికి బ్రహ్మస్థాయికి మనం చెప్పుకున్న ఆత్మే పరబ్రహ్మం స్థాయికి చేరుకుంటాడని అర్థం చేసుకోవాలి.

4అ, 10శ్లో.

వీతరాగభయక్రోధా మన్మయా మాముపాశ్రితాః |
బహవో జ్ఞానతపసా పూతా మద్భావమాగతాః |10 |

ఇదివరలోగూడ సర్వథా రాగభయక్రోధ రహితులైన వారు, దృఢమైన భక్తి తాత్పర్యములతో స్థిరబుద్ధి గలిగి, నన్ను ఆశ్రయించిన భక్తులు పెక్కుమంది జ్ఞాన తపస్సంపన్నులై పవిత్రులై నాస్వరూపమును పొంది యుండిరి.

రాగం భయం క్రోధం విడిచి నన్నే తమ స్వరూపంగా భావిస్తూ నన్ను ఆశ్రయించి జ్ఞాన తపస్సులో పవిత్రులై నన్ను చేరుకున్న వారు ఎందరో ఉన్నారు. ముందు శ్లోకంలో స్వకర్మ ప్రారబ్దం లేకుండా అవతరించిన చైతన్య స్వరూపుడైన దివ్యుడు అకర్త అయినా కర్మలలో చరిస్తుంటాడు అయితే ఈ అవతార మూర్తి ఆచరించే కర్మలు కేవలం లోక కళ్యాణాన్నే ఆవిష్కరిస్తాయి. దివ్యమైన భగవంతుని కర్మలు వాంఛా ప్రేరితాలు కావు అవి ధర్మ స్వరూపాలు, సాధు సజ్జన సంరక్షకాలు, దుష్ట జన శిక్ష కాలు, ధర్మసంస్థాపకాలు. ఆ కారణంగా అతని జన్మలాగానే పరిత్రాణాధి కర్మలు కూడా దివ్యమైనవి అని తెలుసుకున్నాం. ఈ శ్లోకంలో రాగం భయం క్రోధం విడిచి మన్మయులై అంటే నాయందే మనసును నిలిపిన వారు నా అంతటివారై అన్నారు అంటే బ్రహ్మవిధుల స్థాయికి సృష్టికర్త స్థాయికి చేరుకున్న వారు ఎందరో ఉన్నారు. వారంతా కూడా నన్నాశ్రయించి జ్ఞాన తపస్సుతో పరమ శుద్ధిని మోక్షాన్ని పొందిన మహానుభావులు అని పూర్వం భగవంతుని ఆశ్రయించి మోక్షాన్ని పొందిన వారిని ఇందులో ఉదాహరణగా సూచిస్తున్నారు. జ్ఞానం అనేది కాలానికి పరిమితం కాదు. కాలం జ్ఞానంలోనే ఉంటుంది. జ్ఞానము ద్వారానే కాలం మనకు తెలియబడుతుంది. భగవంతుడు అనంత జ్ఞాన స్వరూపుడు కాబట్టి కాలానికి పరిమితుడు కాడు. అందుకే మనం భగవంతుని జ్ఞానం పురాతనమైందని ఈ అధ్యాయం ప్రారంభంలోనే ప్రస్ఫుటంగా నిరూపించుకున్నాం. మనసుకు ఇంద్రియాలకు ఏర్పడే ఏకాగ్రతే తపస్సు అంటోంది స్మృతులు. అలా ఏకాగ్రతతో తపస్సు ద్వారా జ్ఞానం పొందిన వారు అనేకులు ఉన్నారు. ఆ జ్ఞానమే దేహాన్ని శుద్ధి చేసి వ్యక్తిని పవిత్రంగా తయారు చేస్తుంది. అలా తపస్సు ద్వారా పొందిన జ్ఞానం సృష్ట్యాది నుండి అందరితో మోక్షాన్ని ప్రసాదించింది అని ఈ శ్లోకం ద్వారా మనం స్పష్టంగా తెలుసుకోవాలి. భౌతిక విషయాసక్తిని భయక్రోధాదులను వీడిన వారు అయిన మననశీలురు స్థితప్రజ్ఞులు. రాగద్వేష రహితులు మనశ్శాంతిని పొందుతారని 2-64లో సమగ్రంగా తెలుసుకున్నాం. దీన్నిబట్టి రాగం నుండి భయం నుండి క్రోధం నుండి విడివడిన వారే భగవత్ స్వరూపులయ్యారు. ఎలా అంటే మన్మయ భగవంతున్ని ఆశ్రయించడం వల్లనే జ్ఞానం సంప్రాప్తిస్తుంది. అందుకే రాగ భయ క్రోధాల నుండి విడివడి పరమేశ్వరుని ఆశ్రయించుకొని తన్మయులైన భక్తులు జ్ఞానమనే తపస్సు చేత పరిశుద్ధమవుతారు అని మనం ఈ శ్లోకం ద్వారా స్పష్టంగా తెలుసుకోవాలి. ఈ మోక్షమార్గం నేడు ప్రత్యేకంగా రూపొందించింది కాదు. సన్మార్గం అభిలషించే ముముక్షువులైన ఎందరో పూర్వం ఈ దైవ మార్గంలోనే పయనించి తరించిన విధానాన్ని మనకు ఈ శ్లోకం తెలియజేస్తుంది. రాగం భయం క్రోధం విడిచి నన్నే తమ స్వరూపంగా భావిస్తూ నన్ను ఆశ్రయించిన అనేకులు జ్ఞాన తపస్సులో పవిత్రులై నా స్వరూపాన్ని మోక్షాన్ని పొంది ఉన్నారు.

ఇందులో జగద్గురువు ప్రతిపాదించిన అంశాలు ఒకటి భౌతిక విషయాలపై రాగ భయ క్రోధాలను విడిచిపెట్టడం, రెండు భగవన్మయులై ఉండటం, నిత్యం మనసును భగవంతునిపైనే లగ్నం చేసి ఉంచడం, మూడు భగవంతుని ఆశ్రయించడం. ఈ మూడింటిటి ఫలితం చిత్తశుద్ధి, తద్వారా పరమాత్మ స్వరూప ప్రాప్తి. ఈ అంశాలన్నింటినీ కూడా ఇప్పటివరకు మనం చర్చించిన అనేక అంశాల ఆధారంగా ఈ శ్లోకాన్ని సమన్వయం చేసుకుందాం.

4అ, 11శ్లో.

యే యథా మాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహమ్ |
మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః ।11।

నన్ను ఎవరు ఎలా సేవిస్తే నేను వారిని అలాగే అనుగ్రహిస్తాను. మానవులు అన్ని విధాలా నా మార్గాన్నే అనుసరిస్తారు.

భగవంతుని అవతార వైభవాన్ని యధాతధంగా గ్రహించిన వారు తననే పొందుతారని తొమ్మిదవ శ్లోకంలో రాగం క్రోధ భయాల నుండి విడివడి తననే ఆశ్రయించుకొని తన స్వరూపాన్నే పొంది జ్ఞానమనే తపస్సు చేత పవిత్రులై చాలామంది తరించారని పదవ శ్లోకంలో తెలుసుకున్నాం. ఈ శ్లోకంలో జ్ఞాన తపస్సు చేత పవిత్రులైన వారు మాత్రమే మోక్షాన్ని పొందగలరు అని సుస్పష్టం చేశాడు. భక్తులు భగవంతుని ఆశ్రయించి భౌతిక పరమైన అనేక విధమైన కోరికలు కోరుతూ ఉంటారు, మన కోరికలే మనకు ఇబ్బందిని కలిగిస్తూ ఉంటాయి. అనేటటువంటి అంశాన్ని ఇక్కడ సున్నితంగా స్పష్టంగా తెలియజేస్తున్నారు. అందుకే జగద్గురువు యధా తధా అనే పద ప్రయోగాన్ని మన పైకి విసిరాడు. ఎవరు ఏది కోరుకుంటే అదే. ఎవరు ఏ ప్రకారం ఫలం కాని ప్రయోజనం కానీ కోరి సేవిస్తే వారిని అదే విధంగానే వారు కోరినట్లే వారికి కోరిన ఫలమిచ్చి అనుగ్రహిస్తాను అనడంలోని ఆంతర్యం ఏదైనా ఫలాన్ని కోరినప్పుడు ఫలమే పొందుతాం ఫలితం కోరినప్పుడు ఫలితమే వస్తుంది గాని మోక్షం ప్రసాదించడం వీలు కాదు కదా. మోక్షం ప్రసాదం కోరేవారు ఫలితం కోరరు కదా. కాబట్టి ఏ ఫలమూ కోరని ముముక్షులకు జ్ఞానం సంప్రాప్తిస్తుంది. కోరికలు కోరేవారికి కోరికలు తీరుతాయి. అందుకే జగద్గురువు ఎవరు ఏ విధంగా కోరితే వారిని అదే విధంగా అనుగ్రహిస్తాను. అంతేగాని ప్రత్యేకించి ఎవరిమీద రాగద్వేషం గానీ మోహం గానీ నాకు లేదు అనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాడు. కర్మ స్వేచ్ఛ కోరుకునే స్వేచ్ఛ మనిషిదే కాబట్టి నిర్ణయం మీదే మీరు ఏది కావాలనుకుంటే అదే పొందుతారు. ఈరోజు మనం అనుభవించే సమస్త విషయాలకు దుఃఖాలకు మనమే కారణం అని ఈ శ్లోకంలో మనకు ప్రధానంగా రుజువు అవుతుంది. కర్మచక్రంలో మనం చూసాం ఆ అవగాహనతో ఈ కోరడం అనే అంశాన్ని పరిశీలించాలి. కర్మను ఫలాసక్తి లేకుండా చేస్తే మరి దైవ కార్యమవుతుంది. ముక్తికి మార్గం సుగమం అవుతుంది. అలా కాక ఫలాపేక్షతో చేస్తే దానికి సంబంధించిన మంచి చెడు లాభనష్టాలు అన్నీ కూడా మళ్లీ మనకే చేరుతాయి. వాటి యొక్క ఫలితం మనం అలజడి ఆందోళన రూపంలో అనుభవించాల్సి ఉంటుంది. కర్మ చేసే అధికారమే కాక కోరుకునే అధికారం కూడా మనిషిదే. అయితే ఎలా కర్మ చేయాలో ఏం కోరుకోవాలో అనే నిర్ణయాన్ని కూడా మనిషినే తీసుకోమని మనిషికే వదిలిపెట్టాడు జగద్గురువు. భౌతికత వైపు మన ఆలోచనలు సాగితే మనకు దాని వెనకనే వెన్నంటే ఉన్న దుఃఖం దక్కుతుంది. అలా కాకుండా మన ఆలోచనలు ఆత్మచింతన వైపుగా సాగితే ఆనంద సింధువులు బిందువై విరాజిల్లుతాం.

మనిషి అనేక రకాల కోరికలతో జీవితమంతా పరుగులెత్తుతూనే ఉంటాడు. కానీ జీవితపు అంతిమ దశలో మనిషికి జీవితమంతా పరుగులెత్తినా నేనెక్కడికి చేరుకోలేకపోయానే అని అనిపిస్తుంది. దేహం పరుగులు ఆగిపోయి అంటే భౌతికతవైపుగా పరుగులు ఆగిపోయి దేహివైపుగా అంటే తన ఆత్మ మూలాల వైపుగా ఆలోచన చేసే దిశగా మనసు తన నడకను ప్రారంభిస్తుంది. కానీ ఆ నడక పరుగులు అయ్యేటప్పటికీ ప్రాణ శక్తి దేహం నుంచి నిష్క్రమిస్తుంది. ఇదే మనం నిత్యజీవితంలో చూస్తున్న వాస్తవం. ఎందుకంటే మానవుడు చైతన్యంతో ఉండటం లేదు. తన ఆత్మను గురించి దేహి తత్త్వాన్ని గురించి తెలియకుండా ఉండటమే ఆ అచైతన్యానికి కారణం. అలా అచైతన్యంతో చేసే మానవుడి కర్మలన్నీ కూడా యాంత్రికాలే అవుతాయి. ఆత్మసాక్షి ఎరుకలేని స్థితిలో మానవుడు దేన్నీ చేరుకోలేకపోతున్నాడు. ఒడ్డున కట్టేసిన పడవ ఎక్కడికీ చేరుకోనట్లే అచైతన్యపు స్థితిలోనే మానవుడు అనేక రకాల భౌతికపు కోరికల్లో బంధింపబడి ఉంటున్నాడు. ఆ కోరికలే బంధం అంటోంది ధర్మశాస్త్రం. మనిషి ఆ కోరికలతో బంధింపబడి బ్రహ్మానందాన్ని సమీపిస్తున్నానని నేను ఏదో సాధించేస్తున్నానని భ్రమలోనే కొనసాగుతూ ఉంటాడు. చివరి దశలో తన పరుగులంతా ఓ ఎండమావి కోసమేనని రుజువు అవుతుంది. అడియాసల తీరాన నుంచి ఎన్నటికీ తమ పయనాన్ని ప్రారంభించే ప్రసక్తే లేదు. చివరికి ఆ మనిషి ఏ సార్ధకతను పొందకుండానే జీవితంలో నుంచి నిష్క్రమించాల్సిన దుర్భర పరిస్థితి. అలా అంతమైపోయిన జీవితం మరో తీరాన్ని చేరుకోలేదని జీవితమంతా వృధా అయిపోయిందనే నిరాశ నిస్పృహలతోనే నిష్క్రమిస్తుంది. తన జీవితపు పడవ ఈ జన్మలో అసలు కదలనే లేదని అప్పుడు ఆ చివరి క్షణాల్లో అర్థమవుతుంది. తీరానికి బంధించి ఉన్న ఒక కట్లు విప్పాలని ప్రతి నావికుడికి తెలిసే ఉంటుంది. మనిషి కూడా బ్రహ్మానంద పరిపూర్ణత్వ కాంతి సాగరంలోకి తన జీవితపు పడవ ప్రయాణాన్ని ప్రారంభించే ముందే తీరానికి తన పడవను బంధిస్తూ ఉన్న భౌతికపు కోరికలనే గొలుసులను విప్పి తీరాల్సిందే. ఆ తరువాత మనకు తెడ్లు వేయాల్సిన అవసరం కూడా కలగకపోవచ్చు. గొప్ప విషయాన్ని జగద్గురువు యథా తథా అనే పదాల్లో నిబిడీకృతం చేసి ఎవరు ఎలా కోరుకుంటే వారికి అలానే అనుగ్రహిస్తాను అని మనకు చాలా సున్నితంగా తెలియజేశాడు. ఇదే ఈ శ్లోకంలో నిగూఢంగా దాగి ఉన్న ఆంతర్యం. అర్జునా నాయనా భక్తులు నన్ను సేవించిన రీతిలోనే నేను వారిని అనుగ్రహిస్తాను. మనుషులందరూ వివిధ రీతుల్లో నా మార్గాన్నే అనుసరిస్తూ ఉంటారు. మనసు భౌతిక విషయ శక్తి వైపు వెళ్తే వినాశనం, దైవం వైపు వెళ్తే మోక్షం. ఎందుకంటే రాకపోకలు గల కోరికలలో దుఃఖం చాప కింద నీరులా కనిపించకుండా ఉంటుంది. అదే మనిషి దుఃఖానికి కారణం అవుతుంది. వాటిని మనకు మనమే కోరుకొని మనకు మనమే మనకు తెలియకుండానే దుఃఖాన్ని పొందుతున్నాం. ఆలోచనను బట్టి అనుగ్రహం కదా అలా కర్మ స్వేచ్ఛతో పాటు కోరుకునే స్వేచ్ఛ కూడా ఉన్న మానవుడు ఏమి కోరుకోవాలో కూడా సమాలోచన చేయమనే ధార్మిక సూక్ష్మాన్ని సూచిస్తున్న జగద్గురువుకు ప్రణమిల్లుదాం.

4అ, 12శ్లో.

కాంక్షంతః కర్మణాం సిద్ధిం యజంత ఇహ దేవతాః |
క్షిప్రం హి మానుషే లోకే సిద్ధిర్భవతి కర్మజా | 12 |

ఈ లోకంలో కర్మ ఫలములను ఆశించువారు ఇతర దేవతలను పూజింతురు. ఏలనన అట్లు చేయుటచే కర్మల వలన కలుగు సిద్ధి వారికి శీఘ్రముగా లభించును.

మనిషి అల్ప సుఖాలు స్వల్ప విషయాల వెంటే తన నడకను కొనసాగిస్తూ ఇంద్రియ జనిత సుఖాలను దాటి పయనించలేక పోతున్నాడు. అయితే నేత్రదృష్టి కంటే అతీతమైన సూక్ష్మ దర్శిత శక్తి కలిగిన మనోదృష్టితో అవగాహన పెంచుకుంటే వీటిని అధిగమించవచ్చు. మానవులు శీఘ్ర ఫలితాలను ఆశించి ప్రత్యక్షంగా అనుభవానికి అందుతున్న కర్మజనిత ఫలాలను అందుకోవడానికి అన్య దేవతల్ని ఆరాధిస్తారు. ఆ కారణంగా వారు నిష్కాములు కారు కనుక అలాంటి వారు కూడా రాగం కలిగిన వారే. వీతరాగభయ క్రోధ పదవ శ్లోకంలో చెప్పుకున్న వాటిని విడిచినవారు కారు. దీన్నిబట్టి మన భౌతికమైన కోరికల్ని కోరుతూ అన్య దేవతలను పూజించే వారు కూడా ముక్తిని పొందలేరని ఈ శ్లోకం స్పష్టం చేస్తుంది. ఇక్కడ అన్య దేవతల్ని అనేటటువంటి మాటని ఎలా అర్థం చేసుకోవాలి అంటే ఆత్మసాక్షిని గుర్తించకుండా ఎక్కడో బాహ్యంగా వివిధ రూపాల్లో కనిపించేవారు మాత్రమే దేవతలు అని భావించేవారు అని అర్థం చేసుకోవాలి. పరమాత్మ వేరు, నేను వేరు అనే భేద భావం ఉండకూడదు. అతనే నేను నేనే అతను అనే అభేద జ్ఞానం పావనమైనది. ఈ భేదభావాన్ని మౌఢ్యంగా పాటించేవారు అనేక రకాల కోరికలతో పూజిస్తారు. ఈ విషయాన్ని ఈ శ్లోకంలో స్పష్టంగా మనం తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. అంటే నాలోని నేనును ఆత్మసాక్షిని గుర్తించని వారు అన్య దేవతలను ఉపాసించేవారు అని జగద్గురువు ఈ శ్లోకంలో స్పష్టంగా పేర్కొన్నాడు. అతను వేరు, నేను వేరు, వారు వేరు, వీరు వేరు అనేటటువంటి భావన కలవారు అన్య దేవతారాధన చేసేవారని గుర్తించాలి. కర్మ జనిత ఫలాలు ప్రత్యక్షంగా కనిపించినట్లు జ్ఞానఫలం భౌతికంగా కనిపించదు. జ్ఞానం వివేకానికి సంబంధించింది. అంతఃకరణకు సంబంధించింది. విషాయాసక్తులైన మానవులు శీఘ్ర ఫలితాల నాశించి అన్య దేవతల్ని ఆరాధిస్తూ కర్మ మార్గంలో చరిస్తూ ఉంటారు. వీరు దారి తప్పి ప్రయాణిస్తూ ఉంటారు. ఇక్కడ మానవలోకంలో అని చెప్పడం వల్ల మనం 1-1 లో చెప్పుకున్నాం కురుక్షేత్రం అంటే ఈ లోకం కార్య లోకం, కర్మ లోకం, కర్మభూమి అని. ఈ లోకంలో మాత్రమే కర్మ ఫలితాలు కంటికి అగుపిస్తూ ఉంటాయి. ఆ కనిపించే ఇంద్రియ జనిత విషయాలపై, ఫలాలపై ఆసక్తితో కర్మలు చేస్తుంటారని అన్య దేవతలు అనే మాటను ప్రయోగించాడు జగద్గురువు. ఆల్బర్ట్ ఐన్స్టీన్ రాసిన 'Out of my later years' పుస్తకంలో విషయాలను గురించిన భౌతిక శాస్త్ర విజ్ఞానం జీవితంలోని కొన్ని లక్ష్యాలను సాధించడానికి కావలసిన శక్తివంతమైన పనిముట్లను మనకు సమకూర్చగలదు. కానీ జీవితపు పరమ

గమ్యాన్ని గురించి దాన్ని చేరుకోవాలనే కోరికను గురించిన పరిజ్ఞానం వేరొక మూలం నుంచి రావాలి అన్నాడు. ఆ మూలమే ఆత్మిక మూలం. అదే మనలోని ఆంతరంగిక దైవిక మూలం. ఈ మూలాన్ని పట్టుకున్నప్పుడు మాత్రమే మనం చేసే ఏ పూజ అయినా ప్రార్ధన అయినా శక్తివంతం అవుతుంది, పవిత్రతను చేకూరుస్తుంది. ఆ పవిత్రతే జ్ఞాన తపస్సుకు మూలం. ప్రతి మనిషికి మానవతీతమైనటువంటి అద్భుత శక్తి, సృష్టి శక్తి ఒకటి ఉందని తెలుసు. దాన్ని సర్వసాధారణ స్థాయి మనిషి యొక్క మనసు అర్ధం చేసుకోలేకపోయినా పరిశుద్ధమైనటువంటి మనసుతో అవలీలగా క్రమంగా దాన్ని సాక్షాత్కరించుకోగలం. మనం చూస్తున్న నివసిస్తున్న ఈ విశ్వానికి మానవుడికి మధ్య ఉన్న అవ్యక్త అద్భుత సూత్రాన్ని గుర్తెరగాలి. ఆ దిశగా ఆలోచించాలి. ఇది ఓ క్రమబద్ధమైన అవగాహనను పునాదిగా చేసుకుని మనలో మనం తత్వీకీకరణ దృష్టితో తత్వీకరించుకుంటే నెమ్మదిగా ఈ విశ్వం గురించి ఈ విశ్వాన్ని సృష్టించే శక్తి గురించి తర్వాత భగవంతుడి గురించి సశాస్త్రీయమైన అనుభవ పూర్వక జ్ఞానం మనకు ఉదయిస్తుంది. ఇలాంటి లోతైన పరిశీలన ద్వారా ఒక విశ్వజనీయమైన ధార్మిక దృక్పథం మనలో ఏర్పడి పరమ గమ్యాన్ని అర్థం చేసుకోవడానికి వీలవుతుంది. ఆ మూలాలను తెలుసుకున్నప్పుడు మాత్రమే ముందు శ్లోకంలో చెప్పుకున్న 'యధాతధా' ఎవరు ఎలా కోరుకుంటే అలా అన్నమాటకు మనకు ఓ సమగ్రమైనటువంటి అవగాహన అందుతుంది. తద్వారా ఈ శ్లోకంలోని భౌతికపు ఇచ్చకపు కోరికల ఉచ్చులో చిక్కుకునేటట్లుగా దేవతలను ఉపాసించకుండా ఆత్మమూలాలను దర్శించే దిశగా మోక్షేచ్ఛ దిశగా దైవాన్ని ఉపాసించగలరు. ఈ మానవలోకపు శీఘ్ర ఫలితాలను ఆశించకుండా జగద్గురువు ఉద్బోధిస్తున్న, ఆదిశంకరులు హెచ్చరిస్తున్న, వేమన వివరిస్తున్న ఆత్మసాక్షి ఉపాసన వైపుగా మనిషి తన దృష్టిని సారించగలడు. ఈ లోకంలో కర్మ ఫలాలను ఆశించేవారు ఇతర దేవతలను పూజిస్తారు. అలా చేయడం వల్ల కర్మ వల్ల కలిగే సిద్ధి వారికి శీఘ్రంగా అందుతుంది. అందుకే ఫలాపేక్షతో అన్య దేవతల్ని ఆరాధిస్తారనే విషయాన్ని ఈ శ్లోకం చాలా స్పష్టంగా మన ముందుంచింది. దీన్నిబట్టి కర్మ ఫలాసక్తిని త్యజించి కర్తవ్య కర్మల్ని ,లోక కళ్యాణ కర్మల్ని నిర్వహించాలని మనకు నిరూపణ అవుతుంది.

4అ, 13శ్లో.

చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మవిభాగశః |
తస్య కర్తారమపి మాం విద్యకర్తారమవ్యయమ్ ||

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణముల వారిని వారి గుణకర్మల ననుసరించి వేర్వేరుగా సృష్టించితిని. ఈ సృష్టి కార్యక్రమమునకు నేనే కర్తనైనను, శాశ్వతుడను పరమేశ్వరుడను ఐన నన్ను వాస్తవముగ 'అకర్తను'గా తెలిసికొనుము.

మనం 2-31లో క్షత్రియస్యన విద్యతే 2-32లో ఈ క్షత్రియ అనే మాటను కులమతాల కతీతంగా చూడాలని నాలుగవ అధ్యాయంలో వివరంగా చర్చించుకుందాం అని చెప్పుకున్నాం. ఆ మాటను ఈ శ్లోకంలో సవివరంగా చూద్దాం. ఈ భూలోకపు జీవన వ్యవస్థలో కర్మభూమిలో కర్మ చాలా ప్రధాన పాత్రను పోషిస్తుంది. దైవ నియమిత కర్మాచరణే స్వధర్మాచరణ అని మనం చెప్పుకున్నాం. ధర్మాచరణ ద్వారానే దైవ దర్శనం. దైవం ధర్మం రూపంలో ఉండటమే దీనికి కారణం. ధర్మ జీవనం అన్నప్పుడు ధార్మిక కర్మాచరణ అందులో స్ఫురిస్తుంది. ఈ కర్మాచరణ వారి వారి గుణాలపై ఆధారపడి ఉంటుంది. 3-28లో 3-29లో గుణకర్మ సముదాయాన్ని గురించి సమగ్రంగా చర్చించాం. గుణకర్మ సముదాయం అంటే త్రిగుణాలు, 24 తత్త్వాలు కదా. వీటి పరస్పర చేష్టలను లేదా ప్రవర్తనను కర్మ విభాగం అంటారు. ఈ కర్మ విభాగం గుణాన్ని అనుసరించి ఉంటుంది. ఈ అంశాన్ని 3-33లో సమగ్రంగా చర్చించాం. వాటన్నింటినీ మనం చర్చించుకున్న అవగాహనతో ఈ శ్లోకాన్ని పరిశీలించాలి. కర్మాధికారం మనుష్య లోకంలో మాత్రమేనని ముందు శ్లోకంలో చూశాం. ఇక్కడ చతుర్వర్ణ్యం అంటే నాలుగు వర్ణాలు లేదా నాలుగు విభాగాలు అని అర్థం. ఈ విభాగాలు వారి వారి గుణాన్ని అనుసరించి చేశానని స్వయంగా జగద్గురువే చెప్తున్నాడు. ఈ విభాగం కూడా సృష్ట్యాది నుంచే ఉంది. ఈ కర్మభూమిలో మనుషుల్ని స్థూలంగా బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అనే నాలుగు విధాలుగా విభజించి చూడాలి. అయితే మనిషి ఈ విభాగాన్ని అర్థం చేసుకోవడం తెలియక కుల వ్యవస్థను సృష్టించుకుని అధోగతి పాలవుతున్నాడు. భగవంతుడికి ఏ కులాన్ని మతాన్ని సృష్టించాల్సిన అవసరం లేదు కదా. అన్ని కులాలు మతాలు మానవులే సృష్టించారు. కుల మతాల పేరిట ప్రపంచ చరిత్రలో ఎన్నో దారుణాలు జరిగాయి, జరుగుతూనే ఉన్నాయి. వీటిని పరిశీలించినప్పుడల్లా కులమతాలను అర్థం చేసుకోవడంలో వాటిని అనుష్టించడంలో మనం ఎక్కడో పొరపాటు చేస్తున్నామని మనకు సుస్పష్టమౌతూనే ఉంటుంది. కులమతాన్ని ఆధ్యాత్మిక భావనతో చూడకపోవడం వల్ల జరుగుతున్న తప్పిదాలివి. ఒకరిపై మరొకరు ఆధిపత్యాన్ని ప్రదర్శించాలనుకునేంత వరకు వారు ఆధ్యాత్మిక పరులు కాలేరు, ఆత్మవైపుగా ప్రయాణించలేరు. అటు ధార్మిక గ్రంథాల పరంగాను ఇటు శాస్త్రీయ గ్రంథాల ప్రకారం కూడా చూస్తే అంతటా ఏకత్వమే నిండి ఉన్నట్లు మనకు తెలుస్తోంది. నేను అంతటా అందరిలో నెలకొని ఉన్నాననే భావన ఉంటే ఇక వైరమన్న మాటే రాదు కదా. అయితే మన సంకుచితమైన అవగాహనతో మన కులమే మతమే గొప్పని ఇతర కులమతాలు లోప భూయిష్టమైనవి అనే భావనతో భేదాలను సృష్టించుకుంటూ ఉన్నాం. కల్లోలాలకు కారణమవుతూ ఉన్నాం. వ్యక్తుల మధ్య వర్గాల మధ్య వైరుధ్యాలను పెంచుకుంటున్నాం. పైగా మనం ఏర్పరుచుకున్న చిన్నచిన్న చట్టాల మధ్య జీవిస్తూ అవే సమున్నతమైనవిగా మనం భ్రమ పడుతూ ఉంటున్నాం. పూర్వం నుంచి కూడా కులం అంటే సంఘం, సమూహం అని అర్థంలోనే వాడేవారు. సృష్టికర్త అభిప్రాయం కూడా ఇదే. మన భారత దేశంలో వృత్తుల వల్ల కులాలు ఏర్పడ్డాయి. ఒక వృత్తిగాని కులంగాని ఎక్కువ తక్కువ అని చెప్పడానికి వీల్లేదు కదా. ఒక వృత్తిపై మరొక వృత్తి ఆధారపడి ఉంటుంది. అటువంటప్పుడు అన్నీ కులాలు సమానమే. ఇందులో ఒకరిని ఏ ఒక్కరూ తక్కువ అని భావించినా అది అందరికీ వర్తిస్తుంది.

అలాంటి అహంకారం వదిలిపెట్టి వారి వారి స్వధర్మాన్ని ఆచరించడమే ముక్తికి సాధనం అనే విషయాన్ని మనం ఇప్పటివరకు అనేక అంశాల ఆధారంగా చర్చించుకున్నాం. ప్రతి మనిషి వారు వారు ఆచరించే కర్మలను బట్టి తమను తాము విభజించుకోవాలి. ఈ కర్మ గుణాన్ని బట్టే ఉంటుంది. గుణమనేది అంతఃకరణానికి సంబంధించింది. ఈ దృష్టితో మనం పరిశీలిస్తే గుణాలు అంటే సత్వ రజః తమో గుణాలు కదా. సాత్విక ఆహారం తీసుకుంటూ సాత్విక స్వభావాలను కలిగి ఉండేవారి నుండి సత్వకర్మలే వ్యక్తం అవుతాయి. అలాంటివారు నిర్గుణానికి దగ్గరలో ఉంటారు. ఆత్మసాక్షివైపుగా పయనిస్తూ ఉంటారు. బ్రహ్మ విధులుగా తమను తాము ఉన్నతీకరించుకునే ప్రయత్నంలో ఉంటారు. అలా ఉన్న ప్రతి మనిషి బ్రాహ్మణ వర్ణానికి వర్గానికి చెందుతారు. దీన్ని బట్టి సాత్విక గుణం కలవారు బ్రాహ్మణులు. బ్రాహ్మణత్వం అనేది గుణ ప్రధానమే గాని కుల ప్రధానం కాదు. క్షత్రియత్వమంటే కొంత సాత్విక గుణం కలిగి అధిక భాగం రజోగుణం కలిగిన వారు. వీరిలో సత్వగుణం అప్రధానంగా ఉండి రజో గుణం ప్రధానంగా ఉంటుంది. శౌర్యం తేజం వీరిలో నిండి ఉండి అలాంటి కర్మలే వీరి నుండి వ్యక్తం అవుతూ ఉంటాయి. ఇక అతి స్వల్పంగా మాత్రమే సాత్విక గుణం కలిగి అధికంగా రజో తమో గుణాలు కలవారు వైశ్యులు. రజో గుణం అప్రధానంగా తమస్సు ప్రధానంగా వ్యక్తం అయ్యే కర్మలు వ్యాపారం, వాణిజ్యం మొదలైనవి. ఇలాంటి కర్మలు వైశ్యుల గుణం నుండి వ్యక్తమౌతూ ఉంటాయి. ఇక కేవలం రజో తమోగుణాలు కలిగిన వారు శూద్రులు. ఈ రజోగుణం రెండూ కూడా అప్రధానంగా ఉండే వారిలో వ్యక్తం అయ్యేవి శూద్ర కర్మలు. మూడు గుణాలు 24 తత్వాలు ప్రతి మనిషిలో ఉన్నా ఏ గుణం ప్రకారము వారు ప్రవర్తిల్లుతారో దాన్ని బట్టి వారు ఆయా విభాగానికి చెందినవారుగా మనం గమనించాలి. అయితే సమాజంలో అన్ని రకాల కర్మలు సమాన పాత్రను పోషిస్తాయి కదా. సృష్టి చక్రం కొనసాగాలంటే అన్నీ రకాల కర్మలు జరగాలి. అంతేగాని కుల ప్రసక్తే ఇక్కడ లేదు ఉండదు. కులమనేది మనిషిలోని భ్రాంతే కానీ వాస్తవం కాదు. ఉన్నది మనుష్య కులం మానవజాతి మాత్రమే. సమాజాన్ని సరిదిద్దే వారు సజ్జనులు అని ముందు శ్లోకాల్లో మనం చెప్పుకున్నాం. అలాంటి ఆత్మ సాక్షి వైపుగా ప్రయాణిస్తూ సత్తుతో సంగమించే బ్రాహ్మణ వర్గం వారు ఈ లోకానికి దిక్కు కదా. ధార్మిక వ్యవస్థను ప్రతిపాదించే బోధించేవారు కావాలి కదా. అంతేగాని అలాంటి గుణగణాలు లేకుండా నేను బ్రాహ్మణ కులంలో పుట్టాను అంటే సరిపోదు కదా. ప్రవర్తన, నడక, నడత బ్రహ్మ తత్త్వం వైపుగా కొనసాగాలి. అలాంటి వారే బ్రాహ్మణులు. ఇక దేశంలోని శాంతిభద్రతల్ని పరిరక్షిస్తూ ధార్మిక మార్గంలో కొనసాగేలా చూస్తూ సమాజాన్ని కాపాడేవారు క్షత్రియులు. క్షాత్ర ధర్మం మనం ధర్మ ప్రకరణలో చూసాం. అలాంటి వారే క్షత్రియులు గాని క్షత్రియత్వపు గుణాలు ప్రవర్తన లేకుండానే నేను క్షత్రియుడుగా అని చెప్పుకుంటే సరిపోదు కదా. అదే విధంగా సమాజంలో పాడిపంటలు గోసంపద వాణిజ్యం వ్యాపారం లాంటి వాటిని ధర్మబద్ధంగా సాగించి ఆర్థిక సంక్షోభం లేకుండా చూసేవారు కావాలి కదా. అలాంటి వారే వైశ్యులు. ఇవన్నీ జరగాలంటే నిరంతరం శారీరక శ్రమ అవసరం. అహర్నిశలు శ్రమించే తత్త్వం, గుణం ఉన్నవారే శూద్రులు. ఈ నాలుగు రకాల మనుషులు కలిసి వారి వారి స్థాయిలో శ్రమిస్తేనే సమాజం, సృష్టి కొనసాగుతుంది. ఇందులో అందరూ సమానులే. ఎవ్వరూ ఎక్కువ

తక్కువ కాదు. అందరిలోని ఆత్మ సాక్షి సృష్టికర్త నుంచి ఆవిర్భవించిందే కదా. అలాగే విశ్వంలోని రూపాలు అన్నీ కూడా సృష్టికర్తవే కదా. కాబట్టి ఇక్కడ ఉన్నది గుణభేదమే. గుణకర్మ విశేషం చేత కర్మాచరణలో జీవన విధానంలో భేదం కనిపించినా అందరిలో అభేదమే దివ్యంగా ప్రకాశిస్తూ ఉంటుందని మనకు తెలియాలి. ఈ అవగాహన బుద్ధికి అందితే చాతుర్వర్ణ్య వ్యవస్థ సరైన కోణంలో అర్థమవుతుంది. సృష్టి ఆదిలోనే సృష్టి కర్తే మనుషుల్ని వారి వారి స్వభావానికి అనుగుణంగా నాలుగు రకాలుగా విభజించారు. అంతేగాని ఈ విభజన పుట్టుకకు సంబంధించింది కాదు కదా. అలాగే జీవితంలో మార్చలేనిది కాదు. స్వభావం కర్మాచరణ మారినప్పుడు వారు ఆయా స్వభావానికి అనుగుణమైన వర్గానికి విభాగానికి చెందుతారు. స్వభావానికి సంబంధించిందే గాని సమానత్వపు భావనకు ఏకత్వానికి వ్యతిరేకమైంది ఎక్కువ తక్కువలను నిర్ణయించి ఒకరిపై ఒకరు అధికారం ఆధిపత్యం చెలాయించేది కూడా కాదని గ్రహించాలి. సృష్టి కర్తే నేను సృష్టించాను కానీ నేను అకర్తను అంటున్నాడు కదా. అలాంటప్పుడు మనం మాత్రం ఈ భౌతిక భావనతో భ్రాంతిలో ఈ కుల మతాల ఊబిలో చిక్కుకోవడం మనల్ని మనం అగాధంలోకి నెట్టుకోవడమే. గీతా స్వరూపలందరూ ఈ విశాలమైన దృక్పథాన్ని గమనించాలి. ఉదాహరణ సాత్విక గుణం కలవారు సత్తువైపుగా ప్రయాణిస్తున్న వారు లోకంలో మనం భ్రమిస్తున్న ఏ కులంలో మతంలో జాతిలో ఉన్నా వారందరూ కలిసి బ్రాహ్మణ వర్గానికే వర్ణానికే విభాగానికే చెందుతారనే సూక్ష్మాన్ని గ్రహించగలగాలి. ఇలాగే మిగిలిన మూడు విభాగాలు కూడా. మనందరం పూజిస్తున్నటువంటి వేద వ్యాసమహర్షి ఏ కులంలో పుట్టాడు. మనందరం చదువుకుంటున్న పాటిస్తున్న నీతి వాక్యాలు రచించినటువంటి విదురుడు ఏ కులంలో పెరిగాడు. కర్ణుడు ఏ కులంలో గొప్పవాడు అయ్యాడు. వశిష్ఠుడు ఎక్కడ పుట్టాడు. వాల్మీకి ఏ కులం లోని వాడు. శుక యోగీంద్ర మహర్షి ఏ కులంలో పుట్టాడు. శబరి ఏ కులంలో జన్మించింది. వీరంతా ఏ కులంలో పెరిగి పెద్దవారయ్యారు. దైవ మార్గాన్ని గీతా మార్గాన్ని అనుసరించడానికి భగవంతుని కృపా కటాక్షాలకు పాత్రులు కావడానికి కుల మతాలకు గోత్రాలకు సంబంధం ఏమిటి. సనాతన భారత దేశంలో సమాజ వ్యవస్థీకరణకు మరో పేరు కుల వ్యవస్థ. ప్రపంచంలో మరెక్కడా కనిపించని భారతీయ సమాజానికే విలక్షణమైన వ్యవస్థ ఇది. క్రీస్తు శకం ఆరవ శతాబ్ది నుంచి క్రమంగా మారడం మొదలుపెట్టినా వర్ణ జాతి వ్యవస్థ 9 10 శతాబ్దాల మధ్య సామాజిక ఆర్థిక ఉత్పత్తి సూత్రాలతో నియంత్రితమైన కుల వ్యవస్థగా పరిణమించింది. 16వ శతాబ్దానికి తామరతంపరగా పెరిగి శాఖోప శాఖలై ప్రతి శాఖ ఒక కులంగా కుల మత జాతీయ వ్యవస్థల సంకీర్ణరూపంగా అవతరించింది. శతాబ్దాల తరబడి భారతీయుల మనః స్థితిని శాసించడానికి ఈ విలక్షణ పరిస్థితే కారణం. దాని చాటులో సంప్రదాయం పేరిట శ్రమ దోపిడీ విధానంతో పాటు మనిషిని మనిషి ఎడంగా అస్పృశ్యంగా చూసే అతి దయనీయ స్థితికి కూడా ఇది కారణమైంది. ప్రాచీన కాలంలో ఆనాటి అవసరాలకు సామాజిక శాస్త్ర పరిజ్ఞానాన్ని శ్రమ విభజన సూత్రాలను ఆధారం చేసుకుని కుల వ్యవస్థ రూపుదిద్దుకున్నప్పటికీ రాను రాను చారిత్రక గతిలో అనూహ్యమైన పరిణామాలకు లోనవుతూ స్వార్థ శక్తుల వల్ల జీవం కోల్పోతూ మనిషి మనిషికి మధ్య కూల్చలేని ఇనుప గోడలను సృష్టిస్తూ మానవజాతిలో ఐక్యత భావ

వికాసాన్ని గగనకుసుమంగా మిగిల్చివేసింది. తద్వారా మానవజాతి మనుగడకే అతి ప్రమాదకారిగా మారింది. చారిత్రక గతిలో చోటు చేసుకున్న భిన్న కులాలే సామాజిక ఆర్థిక వ్యవస్థలోని కనిష్ట విభాగాలు. ప్రాచీన శ్రమ విభజన అన్ని దేశాలలోనూ ఉన్న ఆర్థిక సూత్రమే చివరికి కుల వ్యవస్థగా కరుడుగట్టి ఘనీభవించింది. ఒక్క మనదేశంలోనే మనదేశ సంస్కృతి వికాసంలోనే ఇది ఒక గొప్ప వైచిత్రి. ఆలోచనలకు ఆచరణలకు మధ్య అంతరానికి ఇదే నిదర్శనం. భారతీయ సంస్కృతికి సంప్రదాయానికి శిరస్సు వంచి నమస్కరించే విదేశీయులు సైతం ఈరోజు భారతీయ వ్యవస్థను భారతీయ కుల వ్యవస్థను చూసి ఆలోచించడం ప్రారంభిస్తున్నారు. మరి నేటి సమాజంలోని కుల మతాలకల్లోలాలకు కారణం ఏంటి? వీటి పరిష్కారం ఏంటి? వీటన్నింటినీ సమూలంగా నిర్మూలించగల ఏకైక మార్గం కుల మతాల కతీతంగా ప్రతి ఒక్కరూ భగవద్గీతను శాస్త్రీయ కోణంలో అధ్యయనం చేయడమే తప్ప మరో మార్గం లేదని గమనించాలి. ప్రతి మనిషి శ్రీమద్భగవద్గీతను సశాస్త్రీయంగా అధ్యయనం చేసి ఆచరించిన నాడు ఈ కుల మతాల చట్రాలలో నుండి విశాలమైనటువంటి విస్తృతమైనటువంటి స్వేచ్ఛా వాయువులు పీల్చుకునే సమయం ఆసన్నమవుతుంది. అప్పటివరకు భగవద్గీత అధ్యయనంలో ఆచరణలో నిమగ్నమవుదాం.

4అ, 14శ్లో.

న మాం కర్మాణి లింపంతి న మే కర్మఫలే స్పృహా |
ఇతి మాం యోఽభిజానాతి కర్మభిర్న స బధ్యతే ||

నాకు కర్మ ఫలాసక్తి లేదు. కాబట్టి నన్ను కర్మలు అంటవు. ఈ విధంగా నా తత్త్వాన్ని తెలుసుకున్నవారు కర్మ బద్ధులు కారు.

ముందు శ్లోకంలో నాలుగు విభాగాల గుణకర్మలను నేను సృష్టించినా నేను అకర్తను అని చెప్పి ఆ అంశాన్ని ఈ శ్లోకంలో నిరూపిస్తున్నాడు. నాకు కర్తృత్వ భావన, భోక్తృత్వ భావన నేననే అహం లేదు కాబట్టి నన్ను కర్మలు అంటవు. ఏ మనిషి అయినా సరే నన్ను తన ఆత్మగా తెలుసుకుంటారో అంటే నేను కర్తను కాదు నాకు కర్మ ఫలాసక్తి లేదు అనే తత్త్వం అనుభవ జ్ఞానం అయితే అలాంటి వారెవ్వరూ కూడా కర్మల చేత బంధింపబడరు. ఈ శ్లోకం ద్వారా జగద్గురువు చాలా చక్కటి తాళపు చెవిని కీని మన దగ్గర ఇస్తున్నాడు. తానే దైవమనే అనుభవ జ్ఞానాన్ని అందరిలో దైవ ప్రకాశం ఉంటుందనే అనుభవ జ్ఞానాన్ని పెంపొందించుకున్న వారు కర్మల చేత బంధితులు కారు అని చాలా స్పష్టంగా సూటిగా ఈ శ్లోకంలో పేర్కొన్నాడు. ఉదాహరణ ఏ చిన్న కెరటం శబ్దం చేసినా వాస్తవానికి అది కడలి యొక్క శబ్దమే కదా అది అర్థమైతే కెరటం కడలిగా శోభిస్తుంది. అర్థం కాకపోతే

తాను వేరు, కడలి వేరు అనుకుంటుంది. తన ద్వారా ఏర్పడిన సవ్వడి మరొక కెరటం యొక్క సవ్వడి కన్నా భిన్నమని భావిస్తుంది. అంటే పూర్ణత్వం నుండి విడిపోయి పరిమితంగా బతుకుతూ ఉంటుంది, ఇదే బంధం. అలకు అస్తిత్వం ప్రత్యేకంగా లేదు. అబ్ధి నుండి అల ఎప్పుడూ వేరు కాదు కాలేదు వేరుగా లేదు కూడా. ఇది అర్థమైతే ప్రత్యేక అస్తిత్వం లేని అలకు ప్రత్యేకంగా కర్మ లేదు కదా. ఈ సత్యం అర్థం కాకపోవడం వల్ల మనిషిని కర్మ భయపెడుతుంది, బంధిస్తోంది. కర్మ జడం దానికి అస్తిత్వం లేదని మనం అనేక సందర్భాల్లో చెప్పుకున్నాం. ఆ అంశాన్ని ఇక్కడ మనకు అనుభవైకవేద్యం చేస్తున్నాడు జగద్గురువు. చీమ కర్మ చీమది, బ్రహ్మ కర్మ బ్రహ్మది. ఇక్కడ కర్మ ప్రధానం కాదు అకర్తగా శోభించడమే ప్రధానం. అనంత ఆకాశంలో అఖండతేజో విరాజమానంతో మనకు నిత్యం కనిపిస్తున్న కర్మ సాక్షి ఆదిత్యుడు. వినూత్నంగా మెరుస్తూ రాత్రిపూట చంద్రుడు ఆనంద విహారియై విహరిస్తుంటాడు. ఇవన్నీ మనం అవలోకిస్తే సృష్టికర్త విశ్వకర్త అసమాన అవ్యక్త అవ్యయ అద్వితీయ స్రష్ట అద్భుత ద్రష్ట మూలశక్తి ఇంతటి మహోన్నతమైన విశ్వాన్ని ఎంత చక్కగా సృష్టించి నేను అకర్తను అంటున్న వైనం ఈ శ్లోకం మనల్ని బంధనాల నుండి విడిపించే అద్భుత అవ్యక్త మంత్రం. ఒకవేళ గర్భస్థ శిశువును మావికప్పినట్లు అజ్ఞాన అంధకారం మనల్ని కప్పి ఉన్నా అలాంటి బంధం కూడా ఈ శ్లోకంతో విడిపడాలి. అందుకు సమయం ఆసన్నమైంది కాబట్టే జగద్గురువు ఎవరు నన్నే తన ఆత్మగా భావిస్తారో వాళ్లు కర్మల చేత బధులు కారు. కర్మ ఉండాలి ఉంటుంది కానీ కర్త లేదు ఉండడు ఉండకూడదు. అసమానంగా అనితర సాధ్యంగా సృష్టి కార్యాన్ని నిర్వహిస్తున్న సృష్టికర్త పరమేశ్వరుడు. కానీ సృష్టిలో కర్త లేడు కదా. అందుకే సృష్టికర్తకు కర్మ ఫలాల పట్ల స్పృహ లేదు. ఇక్కడ జానాతి అనకుండా అభిజానాతి ఎవరు నన్ను తెలుసుకుంటారో అంటే ఎవరు నన్ను తన ఆత్మగా గుర్తిస్తారో, అనుభూతిస్తారో. మనం ఇప్పటికే ఆత్మీయ పరబ్రహ్మం తత్త్వమసి లాంటి అంశాల్ని సమగ్రంగా నిరూపించుకున్నాం. ఆ నిరూపణలు ఈ శ్లోకం లో వివేక జాగృతం కావాలి. ఎందుకంటే జగద్గురువు మనల్ని చిటికెన వేలు పట్టుకొని నడిపిస్తున్నాడు కనుక ఈ శ్లోకంలో బ్రహ్మవిద్య తాళపు చెవి మన చేతికి అందించాడు. ఈ తాళపు చెవితో మనం మన ఆంతరంగిక తలుపులు తెరచుకోవాలి. అంతర్ముఖత్వపు ప్రయాణం ప్రారంభం కావాలి. ఈ దేహం అనే ముసుగులోని సృష్టికర్త పరమేశ్వరుని ఆత్మమూల విరాట్ స్వరూపాన్ని దర్శించాలి. అదే మనం నాలుగు అధ్యాయాలుగా చెప్పుకుంటున్న నాలోని నేను. ఇది మానవుడి ప్రతి కణంలోనూ నిక్షిప్తమై ఉంది. ఆ ఉన్నదే దైవం. ఆ ఉంది అంటున్నదే ఉనికి. ఉనికికి నామవాచకమే సృష్టి. సృష్టి పేరే దైవం. ఇంకా బాగా మనకు అర్థం కావడానికి ఒక చేప కథ చెప్పుకుందాం సముద్రం గురించి విని విని ఓ చేపకు విసుగు వచ్చింది. చివరికి ఓ రోజు చేపల రాణి దగ్గరికి వెళ్లి ఇలా అడిగింది. ఎంతో కాలంగా నేను సముద్రం పేరు వింటున్నాను ఇంతకు సముద్రం అంటే ఏమిటి? అది ఎక్కడుంటుంది అని. చేపల రాణి నీ జననం సముద్రంలోనే నీ జీవితం అందులోనే అదే నీ ప్రపంచం సముద్రమే నీ ఉనికి. ఆ సముద్రం నీ లోపలా ఉంది నీకు బాహ్యంగా కూడా ఉంది. సముద్రంలోనే నువ్వు జన్మించావు సముద్రంలోనే నీ మరణం కూడా. ఎల్లవేళల్లోనూ ఆ సముద్రంతోనే నువ్వు చుట్టబడి ఉన్నావు అని జవాబిచ్చింది. దైవం ప్రతి ఒక్కరి లోపల బాహ్యంగా కూడా ఉంది.

అనుక్షణం మనల్ని పర్యవేక్షిస్తూనే ఉంది. కానీ ఆ ఎరుక మనకు లేదు. మనం అచేతనత్వంలోనే అజ్ఞానంలోనే బాహ్యపు బంధనాలతోనే ఉంటున్నాం. అందువల్ల మనం దర్శించలేకపోతున్నాం. అచేతనత్వమే బాహ్య ప్రపంచం. అగోచరంగా ఉన్న సచ్చైతన్యమే దైవం. నన్ను కర్మలు అంటవు నాకు కర్మ ఫలాలపై ఆశ లేదు. ఇలా నన్ను తెలుసుకున్న వారిని కర్మలు బంధించలేవు. భగవద్గీతామ తల్లికి ప్రాణామాలు.

4అ, 15శ్లో.

ఏవం జ్ఞాత్వా కృతం కర్మ పూర్వైరపి ముముక్షుభిః |
కురు కర్మైవ తస్మాత్ త్వం పూర్వైః పూర్వతరం కృతమ్ | 15 |

ఓ అర్జునా! ప్రాచీనులైన ముముక్షువులు ఈ విధముగ (నా తత్త్వ రహస్యమును) దెలిసికొని కర్మల నాచరించిరి. కావున నీవును ఆ పూర్వులవలెనే నిష్కామ భావముతో కర్మల నాచరింపుము.

ముందు శ్లోకంలో కర్మ ఫలాసక్తి లేని అకర్తనైన నా తత్త్వాన్ని తెలుసుకున్నవారు కర్మ బద్ధులు కారు అని చెప్పిన జగద్గురువు ఈ శ్లోకంలో ఇదే పద్ధతిని పూర్వం కూడా ఆచరించారు ఇది ఇప్పటిది కాదు సృష్ట్యాది నుండి ఉన్నది. నిత్యం కొనసాగాల్సిన విధానం ఇది నేను కొత్తగా ప్రతిపాదిస్తున్నది కాదు అంటూ ఏదైతే తన సద్గురువు సాందీప మహర్షి దగ్గర అభ్యసించిన బ్రహ్మ విద్యను పూర్వం నుండి పరంపరగా వస్తున్న ఆత్మ విద్యను బోధిస్తున్నాను కానీ ఇది నాకు సంబంధించింది కాదు అంటూ బోధనలో కూడా అకర్తగానే మన ముందు నిలుస్తున్నాడు.

ఈ 4వ అధ్యాయం ప్రారంభంలోనూ ఈ బ్రహ్మవిద్య గాని కర్మయోగాచరణ గాని నేను ప్రతిపాదిస్తున్నది కాదు పురాతనంగా వస్తున్నది అంటూ అధ్యాయాన్ని ప్రారంభించి ఆయా సందర్భాల్లో నేను ఇది భోధించడం లేదు సృష్ట్యాది నుండి ఆచరణలో ఉన్నది అనే అంశాన్ని మనకు గుర్తు చేస్తూనే ఉన్నారు. ఈ సందర్భంగా 3-20, 3-21 లోను జనకుడు మొదలైన వారు ఆచరించిన విధానాన్ని శ్రేష్ఠులు అనుసరించిన ప్రమాణాలను మన ముందుంచిన సంగతిని మనం గుర్తించాలి. ఈ శ్లోకంలో రెండు ప్రధాన అంశాల్ని మనం సంక్షిప్తంగా చూసి శ్లోకాన్ని పరిశీలించుకోవాలి. మోక్షేచ్ఛ గలవారు ముముక్షువులు. ఆత్మజ్ఞానం లేనివారు అందుకే ప్రయత్నిస్తున్న వారని అర్థం చేసుకోవాలి. అయితే ఆత్మ జ్ఞానులు ముక్త పురుషులు, జీవన్ముక్తులు అంటే ఆత్మస్థితిని ఆత్మ తత్త్వాన్ని గుర్తెరిగిన ఆత్మ విధులు. కాబట్టి ఆత్మజ్ఞానులు వేరు, మోక్షేచ్ఛ గలిగిన ముముక్షువులు వేరు అని మనకు తెలియాలి. అయితే ఇక్కడ ముముక్షువులు ఆత్మజ్ఞానాన్ని పొందడానికి అనువైన అంతఃకరణ శుద్ధి కోసం కర్మల్ని ఫలాసక్తి లేకుండా ఆచరిస్తారు. ఆత్మజ్ఞానం ఉన్న ఆత్మవిధులు లోక సంగ్రహార్థం కర్మాచరణ గావిస్తూ ఉంటారు. అందుకే జగద్గురువు ఇక్కడ నాయనా నువ్వు కూడా పూర్వీకుల మార్గంలో కర్మనే ఆచరించు. ఇక కర్మయోగాచరణకు సంబంధించిన మనం గ్రహించాల్సిన మరో ప్రధానమైన సున్నితమైన అంశం, బంధం

భావనలో ఉందే గాని భౌతికంగా లేదు కదా. బంధం, భావనా ప్రధానమైనప్పుడు బంధం నుండి విడివడటానికి జడ పూర్వకమైన కర్మలను విడిచి పెట్టాల్సిన అవసరం లేదు. విడిచి పెట్టాలని భావించడం కూడా కర్మే కదా. అలా మనం ఆలోచిస్తే కర్మను మానేస్తే కర్మ చేయకుండా ఉన్నాననే భావన కర్మను మానేశాననే భావన కూడా ఆ కర్మ కూడా మనల్ని తొలిచివేస్తూనే ఉంటుంది. అలా అయినా నైష్కర్మ్యం సిద్ధించడానికి వీలు లేదు గాక లేదు. మనం నైష్కర్మ్య సిద్ధిని గురించి సమగ్రంగా చర్చించుకున్నాం. నైష్కర్మ్యం అంటే కర్మలని త్యజించడం కాదు ఆత్మ అకర్త అని గుర్తెరగడమే. ఈ సూక్ష్మార్ధం మనకు అవగాహన కావాలి. ఈ అవగాహన లేకుండా ఖాళీగా కర్మలను మాని కూర్చున్నంత మాత్రాన నిష్కామసిద్ధిని పొందలేరు. ఆత్మ అకర్త అని గుర్తించలేరు. ఇక్కడ కర్మ అంటే కర్తృత్వ భావనా బుద్ధిలేని కర్మ అని అర్థం. కర్మైవ అనే శబ్దాన్ని ప్రయోగించడంలో కర్మను త్యజించడం గాని కర్మ సన్యాసం గాని ఆచరణీయం కాదనే అంశాన్ని మనకు జగద్గురువు సూచిస్తున్నట్లు మనం గ్రహించాలి. ఈ విశ్వం వెనుక దాగి ఉన్న మహత్తులోని బ్రహ్మానందం అంతా అప్రయత్నంగా అనుక్షణం వ్యక్తం అవుతూ ఉంటుందన్న సంగతి గుర్తించలేని గుడ్డి వారిలా బధిరులలా మొద్దు మనిషిలా ఉండకుండా నిశిత పరిశీలనతో అంతః చైతన్యాన్ని అవలోకించే ఆత్మవిధులుగా విరాజిల్లుదాం.

4అ, 16శ్లో.

కిం కర్మ కిమకర్మేతి కవయోఽప్యత్ర మోహితాః |
తత్తే కర్మ ప్రవక్ష్యామి యద్ జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్ | 16 |

కర్మ అనగానేమి? అకర్మ యనగానేమి? ఈ విషయమును నిర్ణయించుటలో విద్వాంసులు సైతము భ్రాంతికి లోనగుచున్నారు. (తికమక పడుచున్నారు) కావున కర్మ తత్త్వమును నీకు చక్కగా విశదపరచెదను. దానిని తెలిసికొని నీవు అశుభముల నుండి అనగా కర్మబంధముల నుండి ముక్తుడవయ్యెదవు.

అగోచరమైన రహస్యమైన పురాతనమైన కర్మయోగాచరణను ఆచరించడంలో పండితులు, శాస్త్రజ్ఞులు సైతం సందేహానికి గురవుతుంటారు. ఎందుకంటే అది నిగూఢంగా ఉంటుంది కాబట్టి. మనం రహస్యం నిగూఢం అంటే అర్థం 4-3 వ శ్లోకంలో సమగ్రంగా చర్చించుకున్నాం. ధర్మచక్షువుకు మనోచక్షువుకు మాత్రమే అందేదని. అలా మనం చూస్తే నిగూఢమైన కర్మయోగ రహస్యం మనకు స్పష్టంగా అర్థం కావడానికి జగద్గురువు ఈ శ్లోకాన్ని మనం ముందు ఉంచాడు. ఈ శ్లోకం ద్వారా కర్మ ఏదో అకర్మ ఏదో స్పష్టంగా తెలుసుకొని వ్యవహరించడమే మన జీవిత పరమార్థం. నా తత్త్వాన్ని తెలుసుకున్నవారు కర్మ బద్ధులు కారు. ప్రాచీనులైన ముముక్షువులు సైతం ఈ తత్త్వాన్ని తెలుసుకొని ఆచరించారు. కాబట్టి నీవు ఆ పూర్వుల వలెనే నిష్కామ భావంతో కర్మల నాచరించు అని ప్రబోధించిన జగద్గురువు ఈ శ్లోకంలో కర్మయోగంలో నిగూఢంగా దాగి ఉన్న అంశాల్ని మనకు అనుభవేద్యం

గావిస్తూ ఉన్నాడని మనం గ్రహించాలి. ఈ కర్మకు సంబంధించి అనేకులు అనేక రకాలుగా బోధిస్తుంటారు అందువల్ల ఇందులో దాగి ఉన్న నిగూఢమైన సత్యాన్ని దర్శించడంలో ఒకటి మరొకటిగా తెలిసే ప్రమాదం ఉంది. కారణం మనం 3-39 లో చెప్పుకున్న ఆవరణ దోషం, విక్షేప దోషం. ఇలాంటి పరిస్థితుల్లో కర్మ అకర్మ గాను, అకర్మ కర్మగాను తెలిసే ప్రమాదం లేకపోలేదు. ఈ కారణంగా శాస్త్ర పరిజ్ఞానం మేధ కలిగిన వారు కూడా కర్మ, అకర్మ తత్త్వ నిర్ణయంలో దారి తప్పుతూ ఉంటారు. అలాగే ఆ విధమైన మోహానికి గురవుతూ ఉంటారు. అందుకే కర్మ, అకర్మల తత్త్వాన్ని స్వీయ పరిశీలన ద్వారా సశాస్త్రీయంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. బ్రహ్మవిద్య అధ్యయనంలో ఇదో ప్రధానమైన ఘట్టం. అందుకే జగద్గురువు కర్మ అకర్మల తత్త్వాన్ని నీకు ఆమూలాగ్రంగా బోధిస్తున్నానని హామీ ఇస్తున్నాడు. జగద్గురువు విద్యార్థులమైన మనకు సందేహాన్ని సంధించే అవకాశం కూడా ఇవ్వకుండానే జగద్గురువు తనే ప్రశ్నను తెలియజేసి సందేహాన్ని కూడా తానే నివృత్తి చేస్తున్నాడు. తద్వారా కర్మ అకర్మల పట్ల ఉన్న సంశయాలను కూడా సమూలంగా పటాపంచలవుతుంది. అప్పుడు కర్మ అకర్మల వలయంలో నుంచి కర్మచక్రంలో నుంచి విడి పడతాం. ఈ సందర్భంగా జగద్గురువు తరువాతి శ్లోకంలో చెప్పబోతున్న కర్మ అకర్మల రహస్యం తెలుసుకోవడానికి ముందు మనం ఈ శ్లోకంలో కర్మ ఫలాలకు సంబంధించిన అదనపు సమాచారం కొంత స్పష్టంగా తెలుసుకొని ఆ సందేహాన్ని నివృత్తి చేసుకోవడానికి సంసిద్ధులం కావాల్సిన అవసరం ఉంది. కర్మ ఫలాలు మూడు విధాలుగా మనల్ని తాకుతూ ఉంటాయి.

ఒకటి సంచిత కర్మ, రెండు ప్రారబ్ధ కర్మ, మూడు ఆగామి కర్మ.

సంచిత కర్మ అంటే మనం గడిచిపోయిన అనేక జన్మలలో చేసి కూడబెట్టుకున్న కర్మ ఫలాల నిల్వ మొత్తం. ప్రారబ్ధం అంటే పూర్వజన్మలలో చేసి నిల్వ ఉంచుకున్న కర్మ ఫలాల మొత్తంలో ప్రస్తుత జన్మలో అనుభవించాల్సిన భాగం. ఆగామి కర్మ అంటే రాబోయే జన్మలలో అనుభవించాల్సిన భాగం. ప్రస్తుత జన్మలలోని మన ప్రవర్తన ద్వారా పొందుతూ ఉన్న కర్మఫలం మరియు సంచిత కర్మఫలం, ఈ మొత్తం కలిపి తర్వాతి రాబోయే జన్మలలో అనుభవించడానికి అవి రాశులు రాశులుగా తయారవుతూ ఉంటాయి. అయితే ఈ మూడింటికి అతీతంగా అకర్తగా ఉండి ఆత్మజ్ఞానం పొందాలని మనల్ని సంసిద్ధం చేస్తున్నటువంటి జగద్గురువుకు ప్రణమిల్లుదాం.

4అ, 17శ్లో.

కర్మణో హ్యాపి బోద్ధవ్యం బోద్దవ్యం చ వికర్మణః |
అకర్మణశ్చ బోద్ధవ్యం గహనా కర్మణో గతి: ||

కర్మ తత్త్వాన్ని తెలుసుకోవాలి. అట్లే అకర్మ స్వరూపాన్ని కూడా గుర్తించాలి. వికర్మ లక్షణాల్ని తెలుసుకోవడం చాలా అవసరం. ఎందుకంటే కర్మ తత్త్వం అతి నిగూఢమైనది. కర్మ వికర్మ అకర్మ ఈ మూడింటి తత్త్వాన్ని తెలుసుకోవాలి.

ముందు శ్లోకంలో కర్మ అనగానేమి అకర్మ అనగానేమి అని ప్రశ్నించిన జగద్గురువు ఈ శ్లోకంలో అందుకు సమాధానం ఇస్తున్నాడు. ఈ శ్లోకంలో రెండు పదాల ప్రయోగంలోని వివరణ తెలుసుకొని శ్లోకాన్ని పరిశీలిద్దాం. ఒకటి 'కర్మణో గతిః' అన్నచోట కర్మ వికర్మ అకర్మ అని అర్థం చేసుకోవాలి. రెండు గతి అంటే యధార్ధ స్వరూపం అని అర్థం. ఇక ఈ శ్లోకంలో మూడు పదాల తత్త్వం చూసి సమన్వయం చేసుకుందాం. ఒకటి కర్మ అంటే సహజమైనది, శాస్త్ర విహితమైనది, సశాస్త్రీయమైనది, సాధారణమైనది, చేయదగినది. ఇదే దైవ నియమిత కర్మ అని అర్థం. ఇది స్వధర్మాచరణకు సంబంధించింది. రెండు వికర్మ అంటే శాస్త్రం నిషేధించింది, నిందార్హమైనది, చేయకూడనిది ఇది నిషిద్ధం. ఇలా నిషిద్ధమైన కర్మ చేయడం వల్లనే మనం కర్మచక్రంలో జనన మరణ చక్రంలో ఇరుక్కుంటున్నాం. మనం ముందు శ్లోకంలో చెప్పుకున్న సంచిత, ప్రారబ్ధ, ఆగామి మూడు విధాల కర్మలకు కారణమైనది కూడా ఇదే. మూడు అకర్మ అంటే కర్మను మానేసి సోమరిగా ఖాళీగా ఉండటం. ఇదే మూడు పదాల్ని మరికొందరు చెప్పుకునేటటువంటి పద్ధతి ఏమంటే కర్మ అంటే సామాన్య కర్మ అని. వికర్మ అంటే కామ క్రోధాలు లేకుండా నిష్కామంతో దైవార్పణ బుద్ధితో ఆచరించేవని. అకర్మ అంటే కర్మ వికర్మల సంయోగం ద్వారా కలిగే కర్తృత్వ రహిత నిష్క్రియ ఆత్మ స్థితి అని చెప్పుకుంటారు. ఏదిఏమైనా మన ధర్మం స్వధర్మాచరణే కాబట్టి ఈ కర్మల నిగూఢ తత్త్వాన్ని మనిషి సహజంగా తన స్వీయ చైతన్యంతో గ్రహించగలగాలి. కానీ అజ్ఞాన ఆవరణ కారణంగా ఈ అంశాన్ని మనం గ్రహించలేకపోతున్నాం. 3-8వ శ్లోకంలో నియతం కురు కర్మత్వం అని మనం దైవ నియమిత కర్మాచరణ గురించి చెప్పుకున్నాం. ఆ అంశాన్నే ఇక్కడ సవివరంగా ఉద్బోధిస్తున్నాడు. చిన్నపిల్లలు తెలియకుండా నిప్పునో పేడినో తాకితే ఎంత ప్రమాదమో నడకరాని శిశువు తెలియకుండా నిరంతరం రద్దీగా వాహనాలు వెళ్తున్న రోడ్డుపైకి దోగులాడుతూ వెళ్లిపోవడం వల్ల ఎంత ప్రమాదమో ఊహిస్తే మన కర్మ కాని వాటిని ఆచరించడం కూడా అంతే ప్రమాదం అని మనం గ్రహించాలి.

అలాంటి ప్రమాదకరమైన నిందార్హమైన కర్మల జోలికి వెళ్లకుండా ఉండాలంటే ఖచ్చితంగా బ్రహ్మ విద్య అధ్యయనం తెలిసి ఉండాలి. ఇలా మనం కర్మ వికర్మ అకర్మల నిగూఢమైన సత్యాన్ని దర్శించాక మన దైవ నియమిత స్వధర్మాచరణకు సంబంధించిన కర్తవ్య కర్మల్ని కర్తృత్వ భావన లేకుండా కర్మఫల స్పృహ లేకుండా కర్మాచరణ

గావించాలని మనకు నిరూపణ అవుతుంది. అంతేగాని సోమరితనమైన అకర్మనో మనది కానిది పైగా మనకు ప్రమాదాలను తెచ్చి పెట్టేది అయినటువంటి వికర్మనో ఆశ్రయించడం వల్ల ముందు శ్లోకంలో చెప్పుకున్న సంచిత ప్రారబ్ధ ఆగామీ కర్మల చక్రంలో చిక్కుకోవడమే తప్ప మరొకటి కాదు. ఈ విషయాన్ని గ్రహించిన మనం ఏ మార్గాన్ని ఆశ్రయించాలో అని మనమే నిర్ణయించుకోవాలి. ఈ సందర్భంగా మన నిజజీవితంలోని ప్రధానమైనటువంటి అంశాన్ని గురించి ఆలోచిద్దాం. వివేక జాగృతి తెలియక మనలో చాలామంది సమాజం సంఘం సంబంధాలు ఉండటం వల్ల మనం ఈ కర్మలు చేయాల్సి వస్తుంది వీటన్నింటినీ వదిలి పెట్టాలి. గృహస్థాశ్రమాన్ని త్యజించాక ఎప్పుడో ఇవన్నీ ఆచరించాలి అనుకుంటూ అసమర్ధతతో కాలయాపన చేస్తూనే ఉంటారు. అలా సంఘాన్ని సమాజాన్ని సంబంధాలను ఆత్మ జ్ఞాన సముపార్జనకు ఆత్మ ప్రాప్తికి ప్రతిబంధకాలుగా ఊహిస్తూ భ్రమిస్తూ ఉంటారు. అదే ఊహలే ఆ భ్రమలే ఆత్మ విద్యను బ్రహ్మవిద్యను మనిషి నుంచి మానవ జీవితం నుంచి దూరం చేస్తాయి. అయితే నిజానికి సమాజం సంబంధాలు ఓ అద్దం లాంటివి ఉన్న వాటిని ప్రతిబింబిస్తాయి అంతే. అంతకుమించి అద్దం చేయగలిగింది ఏమీ లేదు కదా. ఉచ్వాస నిశ్వాస లు కూడా కర్మే అని మనం ముందు శ్లోకాల్లో తెలుసుకున్నాం. గాలివీచడం నీరు పారడం ఏదైనా. ఈ అంశాన్ని మనం ఏ మనిషి కూడా క్షణమాత్రమైనా కర్మలు ఆచరించకుండా ఉండలేరని 3-4,3-5 శ్లోకాలలో సమగ్రంగా చూసాం. ఆ అంశాలన్నింటినీ కూడా దృష్టిలో ఉంచుకొని ఈ శ్లోకాన్ని సమన్వయం చేసుకోవాలి. ఈ కర్మ వికర్మ అకర్మల తత్త్వం సంపూర్ణంగా బోధపడాలంటే ఉదాహరణకు ఒక పిచ్చి పట్టిన ఆవిడ తనకు ఉన్నది భౌతిక శరీరం కాదు అని ఓ దివ్యమైన కాయమే తనదని ఆమెకు అర్థమైంది. తన శరీరం కన్నా మరింత అందమైన శరీరం ఈ భూమిపైన లేదు అంటూ ఉండేది. ఓ రోజు ఆమె ఓ నిలువెత్తు అద్దం ముందు నిలుచుకోవడం తటస్థించింది. అద్దంలో తన ప్రతిరూపాన్ని చూసుకొని మండిపడింది. ఆవేశంతో ఓ కుర్చీని అద్దం మీదకు విసిరి కొట్టింది. అద్దం ముక్కలైపోయింది.

ఆమె వెంటనే కుదుట పడి ఓసారి నిట్టూర్చింది. గమనించిన వారెవరో అద్దాన్ని ఎందుకు విరగొట్టావని అడిగితే ఆవిడ ఈ అద్దం నా శరీరాన్ని భౌతికంగా చూపిస్తోంది నా దివ్యమైన అందమైన కాయాన్ని అది వికృతం చేస్తోంది అన్నదట. ఇలా చూస్తే సంఘం సంబంధాలకు మించి మరేవీ కాదు కదా. అవి కేవలం భౌతికంగా కనిపించే వాటిని మాత్రమే ప్రతిబింబిస్తాయి. నస్వరమైన కనిపిస్తూ ఉన్నదాన్నే ప్రతిబింబిస్తాయి. ఓ అద్దాన్ని విరగొట్టడం ఎంత అవివేకమో అలాగే సమాజమో సంఘమో కుటుంబమో సంబంధాలో మన ఆత్మ ప్రగతికి ఆత్మ అభ్యున్నతికి ఆత్మజ్ఞాన సంప్రాప్తికి అడ్డు అనుకోవడం కూడా అలాంటిదేనని గ్రహించాలి. ఎదగాల్సింది మనమే మార్చుకోవాల్సింది మనల్నే మన స్వయాన్నే అద్దాన్ని కాదు కదా. ఆ మార్పు మానవుడికి సరిగ్గా తనున్న స్థితిలోనే కలుగుతుంది. ఆ పరివర్తన కేంద్రంలోనే ప్రారంభమవుతుంది. పరిధి మీద సాగించే భౌతిక కార్యాలన్నీ కూడా కాలహరణలు చేసేవే తప్ప మరేది కాదు. ఇవన్నీ కూడా అనవసర చర్యలే. ప్రయత్నాలన్నీ కూడా సూటిగా ఆత్మలోనే జరగాలి. అందుకు సంఘం సమాజం సంబంధాలు ఏ విధంగానూ ప్రతిబంధకాలు కానేకావు

కాలేవు కూడా. అవి ఏవైనా ఉంటే అది మనలోనే ఉండాలి. ఈ ఉదాహరణలోని సత్యం మనం అవలోకించగలిగితే ఈ శ్లోకంలోని కర్మ వికర్మ అకర్మల తత్త్వరహస్యం మనకు సంపూర్ణంగా బోధపడినట్లే. కర్మ రహస్యం తత్త్వం మనకు దర్శనమైనట్లే. మనకు బ్రహ్మ విద్య అధ్యయనంలో ప్రధానమైన పాఠ్యాంశం కర్మయోగాచరణ. అందుకని మనం నిగూఢమైన కర్మ తత్త్వాన్ని దర్శించి ఆత్మ జ్ఞానాన్ని సంప్రాప్తించుకునే దిశగా అడుగులు వేద్దాం.

4అ, 18శ్లో.

కర్మణ్యకర్మ యః పశ్యేత్ అకర్మణి చ కర్మ య: |
స బుద్ధిమాన్ మనుష్యేషు స యుక్తః కృత్స్న కర్మకృత్ | 18 |

కర్మ యందు అకర్మను అకర్మ యందు కర్మను దర్శించువాడు మానవులలో బుద్ధిశాలి. అతడు యోగి మరియు సమస్త కర్మలు చేయువాడు.

ముందు శ్లోకంలో కర్మ వికర్మ అకర్మలను గురించి వివరించుకొని కర్మ తత్త్వాన్ని తెలుసుకున్నాం. ఈ శ్లోకంలో కర్మ యందు అంటే కర్తృత్వంలో అకర్తృత్వాన్ని చూడటం కర్తృత్వంలో ఫలాసక్తి లేకుండా కర్మ చేయడం. ఇలాంటివి బంధానికి హేతువు కావడానికి అవకాశం లేదు. కాబట్టి అలా చేసే ఏ కార్యమైన నైష్కర్మ్య సిద్ధిని ప్రసాదిస్తుంది. ఇదే అకర్మలో కర్మను చూడటం. ఇక్కడ చాలా సంక్లిష్టంగా మనకు అనిపిస్తుంది ఈ శ్లోకం. అయితే లోతుల్లోకి వెళ్లి తరచి చూసినప్పుడు మాత్రమే ఈ శ్లోకంలోని ఆంతర్యం మనకు అవగతం అవుతుంది. 2-39 తో కర్మ ప్రకరణం ప్రారంభమైంది. అక్కడ నుండి ఆ కర్మ ప్రకరణ నేపథ్యం నుండి ఈ ముందు శ్లోకం వరకు చర్చించిన అంశాల్ని ఆమూలాగ్రంగా నిశిత పరిశీలన చేసి ఉంటేనే ఈ శ్లోకం మనకు అర్థమవుతుంది. ఈ శ్లోకం మనకు అర్థమైతేనే తరువాతి శ్లోకాలు మనకు అవగాహన కావడానికి. ఈ దృష్టితో మనం ఈ శ్లోకాన్ని పరిశీలించాలి. లోకంలో మనిషి యొక్క మౌఢ్య దృష్టికి వాస్తవంలో అకర్మ అయినది కర్మగా అలాగే కర్మ అయినది అకర్మగా కనిపిస్తోంది కదా. మనం బస్సులోనో రైలులోనో ప్రయాణిస్తుంటే చెట్లు పరిసరాలు కదిలినట్లు కనిపిస్తుంది. కదిలే వాహనం కదలనట్లు కదలని చెట్లు పరిసరాలు కదులుతున్నట్లు తెలుస్తుంది. కానీ అవి కదులుతున్నాయా లేదు కదా. ఆ కారణంగా ఉన్న దానిని ఉన్నట్లు చూడటం కోసం కర్మ యందు అకర్మ, అకర్మ యందు కర్మ అంటున్నాడు. పైగా కర్మ యందు అకర్మను అకర్మ యందు కర్మను చూసేవారు బుద్ధి శీలురు వారే యోగులు సమస్త కర్మలు చేసిన వారు అంటున్నాడు. మనం కదులుతున్న వాహనంలో ఉంటూ ఉన్నప్పుడు చెట్లు పరిసరాలు కదలడం లేదు కదా. ఈ వాస్తవాన్ని గ్రహించలేకపోవడం ఎంత భ్రమో, మౌఢ్యమో మన దైనందిన జీవితంలోని ప్రతి దానికి నేనే కర్తననే అహాన్ని మనం కలిగి ఉండడం ప్రకటించుకోవడం కూడా అంతే భ్రమ అని మనం అర్థం చేసుకోవాలి. మనలోని ఈ విధమైన మౌఢ్య దృష్టిని తొలగించి వాస్తవిక దృష్టిని

అలవరచడం ఈ శ్లోకం ప్రధాన లక్ష్యం. మనకు కర్మ అకర్మగా, అకర్మ కర్మగా అర్థమవుతోందని గ్రహించిన జగద్గురువు ఇలా అనిపిస్తున్న వాటి వల్ల ఏర్పడే సంశయాలను పటాపంచలు చేసి ఖచ్చితంగా ఆ చెట్లు కదలడం లేదు అనే వాస్తవాన్ని నిరూపించి మనకు అర్థం చేయించి మనకు గుణపాఠం చెప్పి కనువిప్పు కలిగించాలని ఈ నిగూఢార్థం దాగి ఉన్న తార్కికమైన, తాత్వికమైన శ్లోకం మన ముందు ఉంచాడు. ఈ అంశానికి పునాది బీజం 3-18వ శ్లోకంలో స్పష్టంగా సమగ్రంగా చూసాం. సృష్టికర్త సైతం స్వయంగా నేను కర్త అయినా అకర్త అనే మాట 4-13 లోనూ చూశాం. అయితే ఈ వాస్తవిక దృష్టి లేక ప్రతి మనిషి తమను తాము కర్తగా చూస్తున్నారే గాని తమ తమ అహంకారాలను ప్రకటించుకుంటున్నారే గాని తమలో దేదీప్యమానంగా వెలుగొందుతున్న ఆత్మను చూడటం లేదు. ఆత్మసాక్షికి కర్తృత్వం లేదు కాబట్టి నిష్క్రియమైన ఆత్మలో కర్మ లేదు. దేహేంద్రియ మనోబుద్ధుల సంఘాతమే కర్మకు కారణం అని ముందు శ్లోకాల్లో చర్చించాం. కర్మలో అకర్మను, అకర్మలో కర్మను చూడడాన్ని అక్షరాలుగా పదాలుగా మనం అభ్యసిస్తే సరిపోదు. లోతైన అధ్యయనంతో అనుభవ జ్ఞానంగా మనలో రూపాంతరం చెందాలి. మనిషి నిరంతరం ప్రతిక్షణం కర్మలు ప్రత్యక్షంగా పరోక్షంగా చేస్తూనే ఉంటాడని మనం చర్చించుకున్నాం. అలా మనం అనేక కార్యక్రమాలు లేదా పనులు లేదా ఈ శ్లోకం పరిభాషలో అయితే కర్మలు నిర్వహిస్తూ ఉంటాం. అందులో భాగంగానే మనం నిత్యజీవితంలో పూజ, ప్రార్థన, మంత్రం, జపం, అభిషేకం ఇలా ఎన్నో విధాలుగా మనం దైవాన్ని కొలవడానికి ప్రయత్నిస్తూ ఉంటాం. కొలుస్తున్నామని భావిస్తూ ఉంటాం కూడా. ఆ దృష్టితో చూస్తే ఉదాహరణకు పూజ లేదా ప్రార్థన అనే కర్మను నిర్వహిస్తున్నాం. ఇంతకూ ప్రార్థన అంటే ఏంటి? అని లోతుల్లోకి వెళ్లి గమనిద్దాం. ఆత్మసాక్షిని స్వీయ ఉనికిని మరచిపోవడమా కాదు కదా. ఆత్మవిస్మరణ కానే కాదు లేదా ఏదో ఒక పనిలో మునిగిపోవడమా లేదా ప్రార్థన లేదా పూజ అనే ఒక విధమైన కర్మలో మునిగి మిగతా కర్మలను మరిచిపోవడమా, లేదు నన్ను నేను ఇంతసేపు మరచిపోయాను అంటూ మనల్ని మనం కాసేపు ఇతర కర్మల నుండి మరచి పోవడం అనే కర్మలో లీనమవడమా, లేదు ఓ విధమైన మత్తులోకి జారి కూరుకుపోవడమా ఇవన్నీ మనం చూసినప్పుడు ఇది ఓ పద్ధతి ఓ ప్రక్రియ అంతేగాని ఇక్కడ ఎక్కడ కూడా అసలైన ఆత్మసాక్షి దర్శనం మనకు అనిపించిందా? అలా మనకు అవగతం కానిదేదీ కూడా అసలైన ప్రార్థన పూజ కాదని మనకు అర్థమవుతుంది. అయితే మనం చేస్తున్నది ఏదో మనం గమనించాలి. ప్రార్థన అన్నది నిజానికి సచేతనపు ఎరుక నిత్య జాగృతి కదా. ఇది ఓ కార్యక్రమం కాదు ఓ సచేతనపు జాగృత స్థితే ప్రార్థన పూజ. దీన్నిబట్టి సచేతనమైన జాగ్రదావస్థలో స్థితం కావడమే పూజ, ప్రార్థన. ఇదే నిష్కర్మం. ఈ మాటకు అర్థం తెలియక మనం అనేక విధాలుగా నైష్కర్మ్య సిద్ధి పొందాలని అనుకుంటూ ఉంటాం. సాక్షిభూతంగా సచేతనమైన జాగ్రదావస్థలో స్థితం కావడమే ప్రార్థన పూజ. అంటే ఇది ఆచరణను సూచిస్తుంది. అంతేగాని దానికి చలనం లేదు. అక్కడ కర్మ లేదు అది నిష్కర్మం. ఓ నిశ్శబ్దంలో ఓ శూన్య స్థితిలో స్థిరపడి ఉండటమే. ఉనికిలో కొనసాగడమే ప్రార్థన పూజ ఏదైనా. ఆ నిర్మలమైన సంపూర్ణమైన సచేతనమైన ఎరుకే జాగృతే దైవం. ఆత్మసాక్షి అకర్త కనుక ఈ జ్ఞానంతో జ్ఞాని జగద్గురువు చెబుతున్నటువంటి కర్మలో ఆకర్మను అ కర్మలో కర్మను చూస్తాడు. ఆ అకర్మ నుండే

కర్మలు జరుగుతుంటాయి. ఉదాహరణకు సుడులు తిరుగుతూ పెద్ద ఎత్తున దుమ్ము తెర గాలిలోకి అలా అలా ఆకాశంలోకి వెళుతూ ఉంటుంది. కానీ ఆ సుడి కేంద్రం మాత్రం ప్రశాంతంగా నిశ్చలంగా ఉంటుంది. మనం తరచి చూస్తే ఈ సంకేతంలో ఉన్న మౌలిక సృష్టి సత్యం ప్రకటితమవుతుంది. ఈ దృష్టితో మనం చూస్తే యావత్ సృష్టి వెనుక దాగి ఉన్న కర్మలోని కర్మ రాహిత్యం మనకు కనిపించడం లేదా. మనలో మనం చర్చిద్దాం మనోదృష్టితో దర్శిద్దాం. చూస్తున్న స్వరూపం కర్మ ఉనికి మాత్రమే. చూస్తున్న దర్శికి రూపం ఉండదు కర్మ ఉండదు శూన్యత్వమే ఉంటుంది. శూన్యత్వమే కేంద్రంగా ఆత్మ సాక్షే ఉనికిగా ఉంటుంది కదా. మనం సాధించాల్సింది అదే, మనం ఉండాల్సింది అక్కడే. అదే మన నిజమైన వ్యక్తిత్వం అదే మన సహజత్వం. మనిషి కూడా ఆ కేంద్రంలో నిబిడీకృతమై ఉన్న సాక్షి లాగా మనలో మనంగానే ఉండేట్లుగా మనం పరిణతి చెందాలి. ఇరుసు చుట్టూ బండి చక్రాలు తిరుగుతూ ఉంటాయి. స్వయంగా ఏ చలనము లేకుండా స్థిరంగా ఉన్న దానిమీద ఆ చక్రాలు మళ్లీ మళ్లీ దొర్లుతూనే ఉంటాయి. వాటి యొక్క ప్రతి చలనం వెనుక నిశ్చలతే ఉంది. అదేవిధంగా ప్రతి కర్మ వెనుక నిష్కర్మే ఉంటోంది ఉండాలి కూడా. చూడబడుతున్నది ఎప్పుడూ రెండవదే అశాశ్వతమైనదే, భౌతిక ప్రపంచమే, బంధమే అది ఎప్పుడూ పరిభ్రమిస్తూ ఉండేదే. అయితే దర్శిస్తున్నవాడే ఆత్మ, బ్రహ్మం అదే ముక్తి, నిర్వాణం. కాబట్టి దర్శనం నుండి దర్శిస్తున్న వాడి దగ్గరకు మనం పయనించాల్సిన అవసరం ఉంది.

4అ, 19శ్లో.

యస్య సర్వే సమారంభాః కామసంకల్పవర్జితాః |
జ్ఞానాగ్నిదగ్ధకర్మాణం తమాహుః పండితం బుధాః | 19 |

ఎవని కర్మలన్నియును, శాస్త్రసమ్మతములై, కామ సంకల్ప వర్జితములై జరుగునో, అట్లే ఎవని కర్మలన్నియును జ్ఞానాగ్నిచే భస్మమగునో అట్టి మహాపురుషుని జ్ఞానులు పండితుడని అందురు.

ఇక్కడ సమారంభాలు అంటే చేయడానికి పూనుకున్న కర్మలు అని అర్థం. భౌతిక పరమైన కోరికలు లేకుండా చేయడానికి పూనుకున్న పనులన్నీ జ్ఞానాగ్నిలో కాలిపోతాయి. ఆ విధంగా కర్మలు చేసే వారిని పండితులని జ్ఞానులని అంటారు. ముందు శ్లోకం 4-18 లో కర్తలో అకర్తను, అకర్తలో కర్తను దర్శించి ఆ అంశాన్ని అనుభవ జ్ఞానంగా మలచుకున్నాం. కర్మ యందు అకర్మను, అకర్మ యందు కర్మను చూసేవారు అకర్మాది దర్శన మాత్రం చేత కర్మ రహితులు. ఇలాంటి మనిషి మాత్రమే వస్త్ర వేషధారణతో సంబంధం లేని నిజమైన సన్యాసి. వీరు జ్ఞానం కలగకముందు కర్మలయందు ప్రవృత్తులై ఉండినా జ్ఞానం కలిగిన తరువాత జీవించి ఉండడానికి మాత్రమే తప్ప ఎలాంటి కర్మలు చేయడంలోనూ ప్రవృత్తి లేనివారుగా ఉంటారు. కర్మలు ప్రారంభించిన తరువాత ఆత్మసమ్యక్ దర్శనం కలిగితే కర్మలన్నీ నిష్ప్రయోజనం అని తెలుసుకొని కర్మను కర్మ సాధనాలను వదిలివేస్తారు. ఏ కారణం

చేతనైనా కర్మను వదలకపోయినా చేసే కర్మలో దాని ఫలం లో స్వప్రయోజనం లేదు కనుక ఆసక్తి లేకుండా లోక కళ్యాణం కోసం పూర్వం వలనే కర్మ చేస్తూ ఉన్నా అతని కర్మ కర్త రెండూ కూడా జ్ఞానాగ్నిలో దగ్ధం కావడం చేత అతని కర్మ అకర్మే అవుతుంది. అలా కర్మలో అకర్మను అకర్మలో కర్మను దర్శించగలిగిన అనుభవ జ్ఞానంతో ఆ జ్ఞానాగ్నిలో సర్వసమారంభాః ముందు శ్లోకంలో చెప్పుకున్న అనుభవ పూర్వక జ్ఞాన జ్యోతి ప్రజ్వలన మనలో జరిగితే ఇక్కడ శుభమా అశుభమా లాంటి వాటితో సంబంధం లేకుండా ఆ జ్ఞానమనే అగ్నిలో సర్వకర్మలు కూడా దగ్ధమయిపోతాయి. అలా ఎవరి సర్వ కర్మలు తమ తమ ఆత్మ జ్యోతి, జ్ఞాన జ్యోతి ప్రజ్వలనలో కాలి బూడిదైపోతాయో వారు జ్ఞానులు, పండితులు, బ్రహ్మ వేత్తలు. ఎందుకంటే కర్తృత్వ అభిమానం లేకుండా కర్మఫలాపేక్ష నుండి విడివడి తాను అకర్త అనే ఆత్మ వైభవంలో సుస్థిరపడి 2-69, 2-70లో మనం చెప్పుకున్న ఆత్మజ్ఞాని స్థితిలో ఉండడం వల్ల అక్కడ కర్తృత్వ భావన ఉండదు. అలా అక్కడ కర్తృత్వ భావన ఉండని కారణంగా కర్త ఉండడు. కర్త లేనప్పుడు కర్మ జరిగినా లేనట్లే. కర్త లేనప్పుడు కర్మలు ఎలా ఉంటాయి? ఏమైపోయాయి అంటే కాలిపోయాయి, జ్ఞానం అనే ఆహుతికి దగ్ధమైపోయాయి. నేను చేస్తున్నాను అనే కర్త మన ఇంద్రియ మనోబుద్ధిల్లో లేనప్పుడు కర్మలన్నీ కూడా ఆయా ఇంద్రియ మనోబుద్ధిలే నిర్వహిస్తాయి. తద్వారా కర్మలన్నీ కూడా అక్కడే చిత్తంలో కాలి భస్మం అయిపోతాయి. ఇందుకు మనం మన పూర్వీకుల్ని శ్రేష్టుల్ని అనేక ఉపపత్తులతో ఉదహరించుకున్నాం. అలాంటి వారి అడుగుజాడల్లోనే పయనించాలని నిర్ణయించుకున్నాం కూడా. జ్ఞాని అయిన మహాత్ములు నిత్యమైన ఆత్మయందే రమిస్తారు కానీ కర్మల్లో కాదు అని అలాంటివారికి కర్తవ్యం ఉండదని 3:17 లో తెలుసుకున్నాం. అలాంటి మహాత్ములు ఈ జగత్తులో కర్మలు చేయడం వల్ల చేయకుండా ఉండటం వల్లనూ వారికి ఎలాంటి ప్రయోజనం ఉండదు. అలాంటి వారికి సర్వ ప్రాణులతోనూ స్వార్థపరమైన సంబంధం ఏ విధంగానూ ఉండదు అని 3-19 లో తెలుసుకున్నాం. అలాంటి జ్ఞానులనుండి కర్మలు లోకకళ్యాణర్థం దొర్లుతూ ఉంటాయి కానీ వారికి ఆయా కర్మలపట్ల ఆసక్తిగాని అనాసక్తిగాని ఉండదని మనం తెలుసుకున్నాం. వీటన్నింటినీ సంగ్రహించుకున్న జ్ఞానంతో మనం కర్మలో అకర్మ, అకర్మలో కర్మ, కర్తృత్వంలో అకర్తృత్వం, అకర్తృత్వంలో కర్తృత్వం అనే అంశాన్ని అర్థం చేసుకుంటే అలాంటి కర్తలో అకర్తను, అకర్తలో కర్తను దర్శించే జ్ఞానుల జ్ఞానంలో సర్వకర్మలు కాలి బూడిదై పోతాయనే అంశం మనకు తెలిసి ఈ అంశం మనలో అనుభవ జ్ఞానం గా రూపొంది మనలో నిత్యమై వెలుగొందగలదు. ఈ జ్ఞానోదయంతో చీకటి సూర్యోదయం కాగానే పటాపంచలైనట్లు దృశ్యమాన ప్రపంచం మొత్తం బ్రహ్మంలో లయమవుతుంది. మనం ఆధ్యాత్మిక మార్గంలో జగద్గురువు చిటికెన వేలు పట్టుకొని నడుస్తున్నప్పుడు మనలో కలిగే జ్ఞానోదయం ద్వారా మనం 4-16వ శ్లోకంలో చెప్పుకున్న సంచిత, ప్రారబ్ధ, ఆగామి ఈ మూడింటి మొత్తం కర్మలు అన్నీ కూడా ప్రక్షాళన అవుతాయి. ఉదాహరణకు ఈ మొత్తం కర్మ ఫలాలు అన్నీ కూడా ఒక బుడగ లాంటిది. బుడగపై పొర అనేది కర్మ నిర్మాణం. లోపల ఉన్నది గాలి. మనం ఈ జ్ఞానంతో ఆ బుడగను పగలగొట్టగలిగితే ఛేదించగలిగితే ఆ గాలి ఎక్కడికి పోయినట్లు. అక్కడ మన గాలి అంటూ ఏమీ ఉండదు. విశ్వంలో కలిసిపోయి మనమూ విశ్వంలో ఒక భాగమై

విశ్వ మానవుడిగా విరాజిల్లుతాం. మనం కర్మ నిర్మాణంలో చిక్కుకోవడం వల్ల ఈ అపరిమిత తత్వాన్ని తెలుసుకోలేక ఆ బుడగపై పైపొరను ఛేదించలేకపోతున్నాం. కాబట్టి ఈ కర్మ నిర్మాణాన్ని జ్ఞానంతో ఛేదించి కర్మచక్రం నుండి విడివడ గలగాలి. అయితే దీనికి సంబంధించిన తాళపు చెవి 4 -14 లోనే జగద్గురువు మన చేతికి ఇచ్చాడు. దీన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఆ తాళపు చెవిని ఉపయోగించుకొని కర్మ నిర్మాణాన్ని ఛేదించి ఈ కర్మల చక్రం నుండి విడివడాలి. అప్పుడు 2-16, 2-24 లో చెప్పుకున్న ఉన్నదే ఉంటుంది, లేనిది ఉండదు.

4అ, 20శ్లో.

త్యక్త్వా కర్మఫలాసంగం నిత్యతృప్తో నిరాశ్రయః |
కర్మణ్యభిప్రవృత్తోఽపి నైవ కించిత్ కరోతి స: ||

సమస్త కర్మల యందు వాటి ఫలాల యందు సర్వదా ఆసక్తిని వీడి భౌతిక విషయాశ్రయ రహితుడై పరమాత్మ యందే నిత్యతృప్తుడైన పురుషుడు కర్మలలో ప్రవృత్తుడు అయినప్పటికీ వాస్తవానికి అతను కర్మలకు కర్త కాడు.

ముందు శ్లోకంలో పేర్కొన్న సర్వకర్మలు తమ తమ జ్ఞానాగ్నిలో దగ్ధమైన జ్ఞానులు ఎలా ప్రవర్తిల్లుతారో జగద్గురువు ఈ శ్లోకంలో వివరిస్తున్నాడు. ఇందులో మనం ప్రధానంగా మూడు అంశాలను చూడాలి. ఒకటి కర్మ ఫలాలపై ఆసక్తి లేనివారు. వీరు కర్మలను చేస్తారు కాని వీరికి కర్మఫలాలపై ఆసక్తి ఉండదు. కారణం వీరు ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలు నిర్వహిస్తారు. రెండు నిరంతరం తృప్తితో ఉండేవారు, నిత్య తృప్తః అని చెప్పడం వల్ల వీరు కొంతసేపు సంతృప్తి పొంది మరికొంతసేపటికి అసంతృప్తికి లోను అయ్యే పరిస్థితి ఉండదు. వీరు సర్వకాల సర్వ విషయ సర్వావస్థల్లోనూ సదా సంతృప్తులై ఉంటారు. మూడు దృశ్య వస్తువుల్ని ఆశ్రయించకుండా ముందు శ్లోకంలో చెప్పుకున్న దర్శిని ఆశ్రయించి ఆ మార్గంలో ప్రయాణించేవారు. వీరు నస్వరమైన భౌతికపు దృశ్యపదార్ధములను ఎప్పటికీ ఆశ్రయించరు. నిత్య సత్యమైన వస్తువులలోనే నిత్య తృప్తి ఉంటుంది అని గ్రహించిన జ్ఞాని నిత్య సత్యమైన ఆత్మసాక్షిని తప్ప అన్య వస్తువులను ఆశ్రయించడు. శాశ్వతమైన నిత్యసత్యమైన సచ్చిదానంద స్వరూపమైన ఆత్మసాక్షినే దర్శినే ఆశ్రయించి ఉంటారు. దృశ్య వస్తువుల నుండి దృష్టిని దర్శి వైపుకు మరల్చి సచ్చిదానంద స్వరూపాన్ని ఎరుగుటయే తత్వ దర్శనం. ఈ కారణాలవల్ల వీరికి కర్మలలో అకర్మత్వమే ఉంటుంది. ఈ మూడు లక్షణాలను సంపూర్ణంగా కలిగి ఉన్నవారు ఆచరించే కర్మలన్నీ కూడా లోక సంగ్రహార్ధమే అవుతుందని జగద్గురువు ఈ శ్లోకంలో తేల్చి చెప్పారు. పైగా ప్రవృత్తోపి అని చెప్పకుండా అభిప్రవృత్తోపి అని చెప్పడం వల్ల వివిధ రకాల లోక కళ్యాణ కార్యక్రమాల్లో వీరు నిమగ్నం అవుతారని తెలుస్తుంది. దీన్నిబట్టి జ్ఞానులు కర్మలను వాటి సాధనాలను వదిలిపెట్టి శరీర యాత్రకు మాత్రమే అవసరమైన పనులు లోక కళ్యాణకరమైన పనులూ చేసుకుంటూ ముక్త స్థితిలో ఉంటారు. వీరు చేసే ప్రతి కర్మ కూడా లోక కళ్యాణార్ధమే.

కర్మ అనేది చలనాత్మకం ఎక్కడ ఏది చలించినా కర్మే. జ్ఞానికి దేహం ఉంది. ఆ దేహానికి చలనం ఉంది ఉంటుంది. కానీ జ్ఞానిలో కర్మలు లేని కారణంగా అతను కర్మలు చేసినా చేయనివాడే అవుతున్నాడు. ఆ కారణంగా అతడు కర్మాచరణలో ఉన్నా కర్మలు చేయనివాడు. ఈ ఆత్మ జ్ఞానంతో జ్ఞానులు కర్మలు ఆచరించినా వీరికి కర్మఫల స్పృహ లేనందున కర్మలకు అంటుకోకపోవడమే కాక తరువాతి జన్మలకు కూడా హేతువయ్యే అవకాశం వీరికి ఉండదు. జన్మవిచ్ఛేదనం జరుగుతూ ఉంటుంది. వీరికి పునర్జన్మ అవకాశం ఉండదు. అంటే బంధరాహిత్య స్థితికి చేరుకుంటారు. వీరు జన్మ రాహిత్య స్థితికి మోక్షస్థితికి ముక్తస్థితికి చేరుకున్న వారు అవుతారు. ఆత్మజ్ఞాని సర్వ స్వతంత్రుడు కర్మ అవసరం లేని వాడు. ఫలాసక్తి కూడా తెలియనివాడు. అందుకని అతను చేసే కర్మ వల్ల అతని పూర్ణత్వానికి భంగం కలగదు. కారణం కర్తగా లేడు కనుక కర్మలలో అకర్మనే దర్శిస్తున్నాడు. కాబట్టి లోక దృష్టిలో తాను కర్మాచరణ గావిస్తున్నట్లు అనిపించినా వాస్తవానికి అతను కర్మ చేయని వాడే. అకర్మాది దర్శనం ద్వారా అతని కర్మలన్నీ దగ్ధం అయిపోయాయి. పైగా సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మ ఫలాలు కూడా శూన్యమైపోతాయి. కారణం ముందు శ్లోకంలో చెప్పుకున్న నీటి బుడగపై ఉన్న కర్మ నిర్మాణ పొరను వీరు జ్ఞానాయుధంతో ఛేదించడమే. ఈ కారణంగా కర్తలేని స్థితిలో ఉపాధి ద్వారా ఆచరించే కర్మలకు జ్ఞాని కర్త కాడు. అదేవిధంగా ఉపాధి ద్వారా అనుభవించే విషయాలలో కూడా తాను భోక్తగా లేడు. గుణాలు గుణాలలో ఇంద్రియాలు ఇంద్రియ విషయాలలో నామమాత్రంగా చరిస్తుంటాయి. వీరు కర్మలలో చరిస్తున్నట్లు మనకు గోచరించినా వాస్తవానికి వీరు అకర్తలు అభోక్తలే. నేను అకర్తను అభోక్తను అవికార రహితుణ్ణి కేవలం జ్ఞాన స్వరూపుడ్ని సదాశివుడ్ని. ఇదే ఆత్మ జ్ఞాని లో భాసించే అద్వైత అనుభూతి. అందుకే పూర్ణానంద స్వరూపుడైన ఆత్మ జ్ఞాని నిత్యతృప్తుడు, నిరాశ్రయుడు. కర్మలలో చరిస్తున్నా కర్మ చేయనివాడే అవుతున్నాడు. సాధారణ మనిషి కోరికను ఆశ్రయించి అది ఎలాంటి కోరికైనా కావచ్చు గాని కోరికల్ని ఆశ్రయించే కర్మలు చేస్తుంటారు. కానీ జ్ఞానులు దర్శిని ఆశ్రయించి జ్ఞానంతో లీనమై సదా సంతృప్తులై నిరాశ్రయంగా నిత్యతృప్తంతో ఫలాసక్తి లేకుండా చక్కగా కర్మలను నిర్వర్తిస్తారు.

4అ, 21శ్లో.

నిరాశీర్యతచిత్తాత్మా త్యక్తసర్వపరిగ్రహః |
శారీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ | 21 |

అంతఃకరణమును, శరీరేంద్రియములను జయించినవాడు, సమస్త భోగ సామాగ్రిని పరిత్యజించినవాడు, ఆశా రహితుడు ఐన సాంఖ్యయోగి కేవలము శారీరిక కర్మలను ఆచరించుచును, పాపములను పొందడు.

మనం నివసిస్తున్నది విషయ ప్రపంచంలో విషయాలు బాహ్యంలో ఉంటాయి. వాటికి సంబంధించిన కోరికలు వాసనలు వ్యక్తుల మనస్సులో ఉంటాయి. విషయాలు మనసులోని వాసనలను చలింపజేసినా లేదా వాసనలు

విషయాల వెంటపడినా వ్యక్తి విషయ ప్రపంచానికి లోనవుతాడు. అలా కాకుండా ముందు శ్లోకంలో చెప్పుకున్న జ్ఞానే సదా సంతృప్తుడు నిరాశ్రయుడు సర్వ కర్మల పట్ల ఆసక్తిని విడిచినవాడు. అలాంటి విషయాల వెంట పడకుండా విలక్షణంగా ఆత్మజ్ఞానంలో శోభిస్తాడు. అంతరింద్రియ దేహేంద్రియ ప్రలోభాలకు జ్ఞాని లొంగడు. జ్ఞాని చిత్తం లోని విషయ వాసనలను నిశ్శేషంగా నిర్మూలించిన కారణంగా ధ్యాని నిరాశీహి గా విరాజిల్లుతాడు. ఈ శ్లోకంలో మనం గ్రహించాల్సిన అంశాలు ఒకటి నిరాశీహి చిత్తాత్మ చిత్తము అంటే అంతఃకరణం, ఆత్మ అంటే కార్యాకారణ సంఘాతం. కార్యం అంటే దేహం. కరణం అంటే ఇంద్రియ సముదాయం. దేహేంద్రియాలు అంతఃకరణము రెండింటిని తన వశంలో ఉంచుకున్న వాడు యత చిత్తాత్ముడు. యతములు అంటే వశమైనవి అని అర్థం. నిరాశీహి అంటే ఆశలే అతన్ని వద్దని అతన్ని వదిలి వెళ్ళిపోయాయి. బాహ్య విషయాలు చిత్తంలోని వాసనలను ఆధారం చేసుకుని అయస్కాంతం ఇనుప ముక్కను ఆకర్షించినట్లు ఇంద్రియ మనస్సులను బాహ్యానికి ఈడుస్తాయి. అలా ఆకర్షణకు లోనైన ఇంద్రియ మనస్సులు విషయాల వైపుకు పరుగులెత్తి అలసిపోయి అసక్తకు లోనవుతాయి. చివరకు సాధించేది నిస్సారమైన నిరాశ నిస్పృహలే. ఈ స్పృహ జ్ఞానం ఉన్నటువంటి వారు యత చిత్తాత్ములై ఉంటారు. రెండు త్యక్త సర్వ పరిగ్రహః ఇందులో పరిగ్రహః అంటే సమస్త వస్తు విషయాల పట్ల మమకారం ఉండటం. అవన్నీ తనకే కావాలి అనుకోవడం, తనవిగా ఉండాలి అనుకోవడం. ఎంత సంపాదించినా ఇంకా ఇంకా కావాలి అనుకోవడం. బాహ్యపు నస్వరమైన ఆస్తుల సేకరణ లోనే నిమగ్నమవడం. అయితే జ్ఞాని వీటిని త్యజించిన వాడు కాబట్టి త్యక్తుడు. మూడు జ్ఞాని సర్వ పరిగ్రహ వర్జితుడు అలాంటివారు ఆచరించే కర్మలు కేవలం శరీర యాత్రార్థమై ఉంటాయి. దేహాన్ని నడపటానికి దేహయాత్ర కోసం మాత్రమే కర్మనాచరించే వారు కాబట్టి అలాంటి జ్ఞాని కర్మచేత ఏ విధమైన పాపాన్ని పొందడు. ఈ మూడు అంశాలను మనం పరిశీలించాక ఇహలోకంలో గాని పరలోకంలో గాని ఏదో ప్రయోజనం కోసం గాని ఈ ఇతర కర్మను మనసుతో గాని వాక్కుతో గాని శరీరంలో కానీ చేయక శరీరం నిలచి ఉండటానికి మాత్రమే చేయాల్సిన తగిన మనోవాక్కాయ కర్మలు చేసేవాడు పాపం పొందడు అని అర్థమవుతుంది. నేను చేస్తున్నాను అన్న అభిమానం లేకుండా దేహయాత్రకు మాత్రమే చేయడం అని అర్థం. అలాంటి వారు చేసే శరీరాది చేష్టలు లోక దృష్టికి పనులు చేయడంగా కనిపిస్తాయి గానీ అలాంటి వారి దగ్గరకు పాపం కూడా రాలేదు. అతను మళ్లీ పాపంలో చిక్కుకునే ప్రసక్తే ఉండదు. అతని కర్మలన్నీ కూడా 4-19 లో చెప్పుకున్నట్లు జ్ఞానాగ్ని దగ్ధకర్మాణామ్ జ్ఞానం అనే అగ్నిలో కాలి భస్మం అయిపోతాయి. మనం పుట్టినప్పటి నుండి గిట్టేదాకా జరిగిందే మన జీవిత కథ అని అనుకుంటుంటాం. కానీ ఓ జీవి కథ అనంతంగా సాగిపోతోందన్న సంగతి మనకు తెలియడం లేదు. మన జీవిత గాధను స్థూలంగా చూస్తే ఖనిజ సామ్రాజ్యం, వృక్ష సామ్రాజ్యం, జంతు సామ్రాజ్యం, మానవ సామ్రాజ్యం, చిట్ట చివరిది మోక్ష సామ్రాజ్యం లేదా దైవ సామ్రాజ్యం. ఇలా కొనసాగే జీవిత గాథ లోని సకల కోటి జీవరాశులలో వివేకం ఉన్న మనిషిగా తీసుకునే మొదటి జన్మ నుంచి చివరి జన్మదాక అంటే ముక్తస్థితి దాకా జరిగిందే ఏ జీవి పూర్తి కథ అయినా ఓ జన్మ యొక్క జీవితం ఈ బృహత్ప్రయాణంలో ఓ ఇసుకరేణువుతో సమానమైన ఓ

అధ్యాయం మాత్రమే అనే వాస్తవిక సత్యం మనకు అవగతం కావాలి. వశిష్ట మహర్షి శ్రీరాముడితో ఓ సందర్భాల్లో ఓ రామా మేరు పర్వత శిఖరం నుంచి దాని పాదాల దాకా ప్రవహించే గంగా ప్రవాహంలో ఎన్ని ఇసుక రేణువులు ఉన్నాయో లెక్క పెట్టవచ్చు కాని లోకంలోని లోక విషయాల వెంటపడే జీవుడు పొందిన శరీరాల సంఖ్య మాత్రం లెక్క పెట్టలేము అంటాడు. ఇది మనకు అర్థం కావాలంటే మానవ జీవితం అనే పడవ ప్రయాణాన్ని ప్రారంభించినప్పుడే అనంతమైన అఖండమైన అజేయమైన అపరిమిత తత్వాన్ని అందుకొని తద్వారా ఏకత్వాన్ని సాధించగలరు. అలాంటి జ్ఞానులు శరీరం నిలిచి ఉండటానికి మాత్రమే అవసరమైన పనులు అది కూడా అభిమానం లేకుండా చేస్తూ ఉంటారు. అలాంటివారు ఎలాంటి పాపాన్ని పొందరు.

4అ, 22శ్లో.

యదృచ్ఛాలాభసంతుష్టో ద్వంద్వాతీతో విమత్సరః |
సమః సిద్ధావసిద్ధౌ చ కృత్వాపి న నిబద్ధ్యతే ||

తాను కోరకుండగనే లభించిన పదార్థములతో (అప్రయత్నముగా అమరిన లాభములతో) సంతుష్టుడైన వాడు, అసూయలేనివాడు, హర్షశోకాది ద్వంద్వములకు అతీతుడు అయినవాడు, సిద్ధియందును, అసిద్ధి యందును సమదృష్టి కలిగియుండును. అట్టి కర్మయోగి కర్మల నాచరించుచున్నను వాటి బంధములలో చిక్కుపడడు.

ముందు శ్లోకంలో ఏ కోరికలు లేకుండా మనసును దేహేంద్రియాలను వశంలో ఉంచుకొని తనదంటూ ఏదీ లేకుండా వదిలేసి కేవలం శరీర కర్మ మాత్రమే చేస్తూ ఉండేవారు పాపం పొందరని అర్థం చేసుకున్నాం. అలా జ్ఞానంతో లీనమై సదా సంతృప్తులై నిరాశ్రయంగా నిత్య తృప్తంతో ఫలాసక్తి లేకుండా చక్కగా కర్మల్ని నిర్వర్తించే సంతుష్టుడి లక్షణాన్ని వైభవాన్ని ఈ శ్లోకం స్పష్టం చేస్తుంది. ఇందులో మనం చూడాల్సింది నాలుగు అంశాలు ఒకటి కోరకుండా యాదృచ్ఛికంగా అయాచితంగా అందేదని అర్థం. అలా తానేమి కోరుకోకుండా అందిన దానితో అప్రయత్నంగా లభించిన దానితో సంతుష్టులు అలా సంతృప్తి నొందేవారు. ఇలాంటి జ్ఞానులు శరీరం నిలిచి ఉండటానికి అవసరమైన భోజనాధులు కూడా దొరికినా దొరకక పోయినా సమానంగా భావిస్తారు. కర్మ యందు అకర్మను చూస్తారు కాబట్టి హర్షం సుఖం విషాదం లాంటివి వీరికి తెలియదు. అంటే వారు ఏమీ కోరుకోరు కాబట్టి ఏమి ఉన్నా లేకపోయినా ఒకే విధంగా ఉంటారు. రెండు ద్వంద్వాతీతులు వీరిని శీతోష్ణాధులు పీడిస్తున్నా కూడా వీరు లెక్క చేయరు. అందుకే వీరు ద్వంద్వాతీతులు. మనం 2-14 లో అనిత్యాలైన శీతోష్ణ సుఖదుఃఖాలను గూర్చి 2-15 లో అలాంటి శీతోష్ణాధుల ప్రభావానికి లోను కాని వారు సుఖదుఃఖాల్లోను సమంగా ఉండే నిత్యా నిత్య వివేకం గలవారు మోక్షానికి సమర్థులని తెలుసుకున్నాం. అలాగే 2-38 లో సుఖదుఃఖాలను లాభనష్టాలను సమంగా చూడాలని సమగ్రంగా చర్చించుకున్నాం. ఈ ద్వంద్వాలనేవి ఒకదానితో ఒకటి కలిసే ఉంటాయి వీటిని

అధిగమించిన వారే ద్వంద్వాతీతులు. మూడు మాత్సర్యం లేనివారు. మనం 2- 62, 63 లో కామ క్రోధ లోభ మద మాత్సర్యాలు జ్ఞానానికి ఎలా అవరోధమో చూశాం. తద్వారా మనిషి పతనమయ్యే విధానాన్ని చర్చించాం కూడా. ఈ అరిషడ్వర్గాలలో చిట్టచివరిది మాత్సర్యం. వీటికి మనిషి వశం కాకుండా ఉండాలి. అలా వశం కాని వారు విమత్సరులు. అందుకే జ్ఞానిని విమత్సరుడు అంటున్నాడు జగద్గురువు. అలా 4-21 లో చెప్పుకున్న నిరాశీహి గా ఉన్న వారు విమత్సరులు అంటే వైరం అసూయా లాంటివి తెలియని వారు. నాలుగు కార్యం యొక్క సిద్ధి ఆసిద్ధుల యందు సమభావం ఉండేవారు. 2-48లో సిద్ధి ఆసిద్ధుల యందు సమత్వభావంతో ఉంటూ కర్తవ్య కర్మలను ఆచరించాలని అదే యోగమని తెలుసుకున్నాం.

ఈ నాలుగు అంశాల్ని మనం పరిశీలిస్తే వీరిది ఆత్మసాక్షి దర్శన స్థితి. అంటే ఉన్నది ఉన్నట్లు సాక్షిగా చూసే స్థితి కదా. అందువల్ల బంధకారణమైన కర్మ జ్ఞానాగ్నిలో దాని కారణాలతో సహా కాలిపోయింది కాబట్టి వీరు సాక్షిగా సంతుష్టిగా ఉంటారు. ఈ సమస్థితి ఆత్మసాక్షి స్థితి అనేది ఒక అపూర్వమైన అనుపమానమైన స్థితి. ఈ స్థితి నుండే జీవశక్తి సృజనాత్మక శక్తి, ప్రజ్ఞ అనేది నదీ ప్రవాహంలా మన అంతరంగం నుండి ఆవిర్భవిస్తాయి. ఈ పరిపూర్ణ స్థితిలో ఆత్మ ఔన్నత్యం బోధపడుతుంది. ఈ స్థితిలో ద్వంద్వాలు ఉండవు, అనుభవాలు మాత్రమే ఉంటాయి. తద్వారా సముపార్జించిన అనుభవ జ్ఞానం మనల్ని ముందుకు నడిపిస్తుంది. ఆత్మశక్తి యొక్క అనంత తత్వాన్ని అనుభూతి చెందాలంటే ఇలా వర్తమానంలోని ప్రతి క్షణాన్ని సంపూర్ణంగా ఆస్వాదించి జీవించడం నేర్చుకోవాలి. మనలోని అనంతత్వాన్ని అంతరింద్రియాలతో దర్శించినపుడు మాత్రమే మన అంతఃశక్తి లోని మహా చైతన్యం అవగతం అవుతుంది. వీరు ఆత్మసాక్షిని దర్శిస్తూ శరీరాన్ని మనసుని గమనిస్తూ ఉంటారు. వీరికి నేను శరీరం కన్నా మనసు కన్నా విభిన్నమైన విలక్షణమైన మహాతేజం అనే అవగాహన ఉంటుంది. మృత్యువును దర్శించగలిగిన వారు మృత్యులు కాలేరు కదా. నాకు మరణం లేదు మరణం అంటే శరీరాన్ని మార్చుకోవడం మాత్రమే నేను శాశ్వతుడ్ని నేను అమరుడ్ని అనే భావంతో వారు ఉంటారు కదా. మనిషి ఇలా ఉండలేకపోవడానికి కారణం తనకున్న అజ్ఞాన అంధకారంతో తనను తానే స్వయంగా ఒక కారాగారంగా మలుచుకుంటున్నాడు. ఆ నిర్బంధంలోని నైరాశ్యాన్ని అనుభవిస్తూనే ఉన్నా కూడా ఆ స్థితికి మూల కారణాన్ని గుర్తించడంలో విఫలమవుతూ ఉంటాడు. ఏమీ తోచని అయోమయానికి అస్వస్థతకు గురి అవుతూ తనదైన తన మూలాలను తెలుసుకోవడంలో వెనుకబడి ఉన్నాడు. తద్వారా వినువీధుల్లో స్వేచ్ఛగా విహరించే ఆనందాన్ని అనుభవించేందుకు బదులు పరిధి పంజరంలో బంధీగా ఉండి మృతుడిగా కదులుతున్న పరిస్థితి. దృఢమైన అజ్ఞానపు పరిధి గోడలను ఛేధించినప్పుడే స్వేచ్ఛాకాశం ప్రాప్తిస్తుంది. అప్పుడే అలాంటి పరిధి బంధనాల నుండి విడివడతారు. అలా విడివడిన వారి వైభవ స్థితే కోరకుండా దొరికిన దానితో సంతుష్టుడు, ద్వంద్వాతీతుడు, మాత్సర్యం లేనివాడు, సిద్ధి అసిద్ధుల యందు సమస్థితి. ఇలాంటి లక్షణాలున్న జ్ఞాని కర్మలు చేసినా అవి అతన్ని బంధించవు అంటూ జ్ఞాని లక్షణాలను జ్ఞాని వైభవాన్ని మన ముందుంచినటువంటి జగద్గురువుకు ప్రణమిల్లుదాం.

4అ, 23శ్లో.

గతసంగస్య ముక్తస్య జ్ఞానావస్థితచేతసః |
యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే |23 |

ఏలనన ఆసక్తి, దేహాభిమానము, మమకారము ఏ మాత్రమూ లేనివాడును, పరమాత్మజ్ఞానమునందే నిరంతరము మనస్సును లగ్నమొనర్చినవాడును,కేవలము యజ్ఞార్థమే కర్మలను ఆచరించువాడును అగు మనుష్యుని యొక్క కర్మలన్నియును పూర్తిగా విలీనములగును. అనగా మిగిలియుండవు.

కర్మ బంధరాహిత్యం ద్వారా నైష్కర్మ్య సిద్ధిని పొందే మహోన్నతమైన ఆత్మ జ్ఞాన స్థితి ప్రాప్తించే విధానాన్ని ఈ శ్లోకం స్పష్టం చేస్తుంది. ఇందులో మనం చూడాల్సిన అంశాలు ఒకటి 'గతసంగస్య' గతసంగుడు కర్మల యందు అకర్మను దర్శించే జ్ఞాని కర్తృత్వ అభిమాన రహితుడు కావడం వల్ల పేటితోను సంబంధం లేని వాడు కాబట్టి గతసంగుడు సంగం అంటే కోరిక ఆసక్తి కదా ఇవే అతన్ని వదిలి వెళ్ళిపోయాయని మనం ముందు శ్లోకాల్లో చర్చించుకున్నాం. 3-19 లో నీవు నిరంతరం ఆసక్తి రహితుడై కర్తవ్యకర్మలను ఆచరించాలని అలా ఆసక్తిని వీడి కర్మల్ని ఆచరించే మనిషికి పరమాత్మ ప్రాప్తి కలుగుతుందని తెలుసుకున్నాం. అలాగే 3-25 లో లోకహితార్థమై జ్ఞాని ఆసక్తి రహితుడై కర్మలు ఆచరిస్తాడని అర్థం చేసుకున్నాం. దేని కారణంగా మనిషి కర్మలలో చిక్కుకుంటున్నాడో అదే సంగం. వీటన్నింటినీ అర్థం చేసుకున్న అవగాహనతో ఈ మాటను అవగతం చేసుకోవాలి. అలాంటి సంగాన్ని, ఆసక్తిని వీడిన వాడు గతసంగుడు. అలాంటి గతసంగులు కర్మలను ఆచరించినా, త్యజించినా సంగత్వం లేని వారు కావడం వల్ల కర్మలలో చిక్కుకోరు. కర్మలేపం లేనందున వీరు కర్మకు బద్ధులు కారు. అలా కర్మకు బద్ధులు కారు కనుక వీరు గతసంగులు. అదే జగద్గురువు చెప్తున్న గతసంగస్య రెండు ముక్తస్య అంటే జీవన్ముక్తుడు భౌతిక ప్రాపంచిక వ్యామోహం నుండి విడిపడిన వాడు.. గత సంగుడు కర్మకు బద్ధుడు కాడు కనుక అతను జీవన్ముక్తుడు. కర్మల యందు అకర్మను దర్శించే ఆత్మ జ్ఞానంలో అతని బుద్ధి స్థిరపడి ఉండటం వల్ల అతను జీవన్ముక్తుడు అవుతున్నాడు. మూడు నిరంతరం పరమాత్మ జ్ఞానమందే స్థిరంగా చిత్తము నిలిపినవారు జ్ఞానావస్థిత చేతసులు. వీరి బుద్ధి నిరంతరం జ్ఞానంలోనే పాదుకొని ఉంటుంది. వీరిలో జ్ఞాత, జ్ఞానం, జ్ఞేయం ఈ మూడింటి పట్ల ఏమాత్రం సంశయం ఉండదు. సంపూర్ణ అనుభవ స్వరూప జ్ఞానంతో నిండిన వారై ఉంటారు. నాలుగు జ్ఞాని యజ్ఞార్థమే కర్మలను ఆచరిస్తుంటాడు. 3-9 లో యజ్ఞార్థం చేసే కర్మలలో మనిషి కర్మబంధంలో చిక్కుకోడు కాబట్టి వీరు ముక్తసంగులై కర్తవ్య కర్మలు ఆచరిస్తారు. ఆత్మజ్ఞానిలో తాను అకర్త అనే స్పృహ స్థిరపడి ఉంటుంది. అందుకనే జ్ఞానిని 'జ్ఞానావస్థితచేతసః' అన్నారు జగద్గురువు. ఐదు 'సమగ్రం ప్రవిలీయతే' కర్మలు, కర్మ ఫలాలు వీరి దృష్టిలో నిష్ప్రయోజనాలు కాబట్టి జ్ఞానోత్పత్తి అనంతరం వీరు కర్మలు త్యజించినా లేదా యజ్ఞ నిమిత్తం ఆచరించినా ఆయా కర్మల ఫలితాలతో వీరికి సంబంధం ఉండదు. అవన్నీ కూడా

అంటే ఆయా కర్మలు ఫలితాలతో సహా జీవన్ముక్తుని పురుషునిలో విలీనం అవుతాయి. దేనిమీద ఆసక్తి లేనివారు గత సంగులు, ముక్తులు అయిన వారు జ్ఞానమందే మనసు నిలిపి యజ్ఞార్థమే చేసే కర్మ సమగ్రంగా నశిస్తుంది. అగ్రం అంటే ఫలం సమగ్రం అంటే ఫలంతో సహా అని అర్థం. అలా ఫలంతో సహా కర్మ నశిస్తుంది. అందుకే లీయతే, విలీయతే అనకుండా ప్రవిలీయతే అనడం వల్ల సమగ్రంగా విలీనం అవుతుందని అర్థం. ఇలా ఈ శ్లోకంలోని ఐదు అంశాలను మనం పరిశీలించాక మనిషికి భగవంతుడి మీద విశ్వాసం ఉందా లేదా అటుంచితే మనిషి మనిషితనాన్ని, మానవత్వాన్ని గుర్తెరగాల్సిన కనీస బాధ్యత మనిషిది. అది గుర్తెరగలేక తనను తాను కలుషితం చేసుకుంటున్న వైనం మనం అనేక సందర్భాల్లో చర్చించాం. స్వార్థాన్ని వదిలిపెట్టి పేరు ప్రతిష్టలపై భ్రాంతిని విడచి సహజంగా ఆనందంగా జీవించే దిశగా మనం అడుగులు వేయాలి. ఈ కర్మ తత్త్వాన్ని గ్రహించినప్పుడే మనం ఆదిశగా ముందుకు వెళ్లగలం. అసమగ్రమైన ప్రయోగశాలల శాస్త్ర విజ్ఞానాన్ని మాత్రమే వంట పట్టించుకొని నిజమైన శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకుంటున్నామని గొప్పగా భావిస్తుంటాం, భ్రమిస్తుంటాం. ఒక చెట్టుకు వేర్ల లాంటిది ఆత్మశాస్త్రం అయితే ఆ చెట్టుకు పైన కనిపించే కొమ్మలు రెమ్మలు లాంటివి కంటికి కనిపించే యంత్రాలకు అందే యాంత్రిక భౌతిక శాస్త్రం. కాబట్టి పైన కనిపించే శాస్త్ర విజ్ఞానమే కాకుండా లోలోపల భూమిలోకి పాతుకుపోయి ఉన్న ఆత్మశాస్త్రాన్ని దైవిక శాస్త్రాన్ని అందులోనూ ప్రధాన అంశాలైన దైవనియమిత కర్తవ్య కర్మ శాస్త్రాన్ని అధ్యయనం చేసి అవగతం చేసుకోవాలి. మూడవ అధ్యాయంలో చర్చించిన దేహం అనే యాగశాలను దర్శించాలి. యజ్ఞశాస్త్ర ప్రకరణం అర్థం చేసుకొని ఆచరించాలి. అప్పుడు ఈ భౌతికంగా మనం ప్రయోగశాలలో చేసే ప్రయోగాల్లో సమగ్రత్వం చేకూరి నిర్మాణాత్మకమైన పటిష్టమైన ఫలితాలు మనకు అందుతాయి. మనిషి చేసే కర్మలు, కర్మ ఫలితాలతో సహా సమగ్రంగా విలీనమై జీవన ప్రమాణాలు మెరుగుపరచుకోవడానికి అవకాశం ఉంటుంది. అప్పుడు జగద్గురువు బోధిస్తున్న ఈ శ్లోకం యొక్క పరమార్థానికి మనం సార్థకతను చేకూర్చినట్లు భావించాలి.

4అ, 24శ్లో.

బ్రహ్మార్పణం బ్రహ్మ హవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ |
బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మసమాధినా ||

యజ్ఞ కార్యముల యందు ఉపయుక్తమగు స్రువాది సాధనములు బ్రహ్మము. హోమము చేయబడు ద్రవ్యము బ్రహ్మము. అగ్నియు బ్రహ్మము, యజ్ఞము నాచరించు కర్తయు బ్రహ్మము. హవన క్రియయు బ్రహ్మము. ఈ బ్రహ్మ కర్మ యందు స్థితుడై యుండు యోగి ద్వారా పొందదగిన యజ్ఞ ఫలము గూడా బ్రహ్మమే.

ముందు శ్లోకంలో జ్ఞాని ఆచరించే జ్ఞానంలో తన కర్మలన్నీ కూడా ఫలితాలతో సహా సమగ్రంగా సమూలంగా విలీనమైపోతాయన్న జగద్గురువు ఈ శ్లోకంలో జ్ఞాని ద్వారా జరిగే కర్మలన్నీ కూడా యజ్ఞ స్వరూపాలేనని ఆ కర్మలలో ఉన్నది సర్వమూ బ్రహ్మమే అని సుస్పష్టం చేస్తున్నాడు. కర్మలలో అకర్మను దర్శించే జ్ఞాని బ్రహ్మాత్మ జ్ఞాన సంపన్నుడు కావడం వల్ల బ్రహ్మజ్ఞాని ఆచరించే కార్యం కర్మ కాదు. అది సాక్షాత్తు యజ్ఞమే, బ్రహ్మార్పణమే. మనం భగవద్గీత రచనాకాలం మానవ గణన ప్రకారం సరిగ్గా నేటికి 5159 సంవత్సరాల క్రితం గీత ఆవిర్భవించిన విధానాన్ని 4-8 లో సవివరంగా తెలుసుకున్నాం. ఆ కాలంలో యజ్ఞ యాగాదులు అనే ప్రక్రియలు విరివిగా నిర్వహించేవారు. ఆ కారణంగా జగద్గురువు ఇక్కడ హోమం అనే యజ్ఞ ప్రక్రియను ఉదాహరణగా తీసుకొని సమస్తమూ బ్రహ్మమే అనే అంశాన్ని ఈ హోమ ప్రక్రియతో పోల్చి మనకు అర్థమయ్యేలా మన కళ్ళ ముందు ఉంచారు. చాందోగ్య ఉపనిషత్తు తృతీయ అధ్యాయం చతుర్దశ ఖండంలో మనందరికీ సుపరిచితమైన 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అనే అంశం కూడా ఇదే. హోమయజ్ఞ కార్యాన్ని దాని యొక్క విధివిధానాల్ని వివరిస్తూ జ్ఞాని ఆచరించే కర్మలు ప్రతిదీ ఎలా బ్రహ్మస్వరూపాలు అవుతాయో ఈ శ్లోకం నిరూపిస్తుంది. ఇది సుప్రసిద్ధమైన విశిష్టమైన శ్లోకం. ప్రపంచ స్థాయిలో చాలామంది భోజన సమయంలో దోష నివారణార్థం ఈ శ్లోకాన్ని పఠించడం ఆచారంగా ఉంది. శరీర స్థితి ప్రయోజనార్థం గ్రహించే ఆహారాన్ని సైతం బ్రహ్మవిధుడు బ్రహ్మంగానే వీక్షిస్తాడు. భుజిస్తున్న మనలోని బ్రహ్మస్వరూప తత్త్వం ఆహారంలోనూ బ్రహ్మంగానే దర్శితమవుతుంది. అప్పుడు భోజనం చేసే క్రియ కూడా అకర్మ యుత బ్రహ్మమే అవుతుంది. ఎలాంటి అభేదం లేని జ్ఞానచక్షువు గల బ్రహ్మవిధునికి అవన్నీ కూడా బ్రహ్మంగానే కనిపిస్తాయి. అయితే సర్వసాధారణ స్థాయి మనిషికి మాత్రం హోమ సాధనాలు ద్రవ్యాలు ఇతర రూపాలతో కూడినవి గాను వాటి వాటి పేర్లు వివరాలతో సహా తెలిసినవిగాను తాను హోమం రెండు కూడా వేరు వేరుగాను అనిపిస్తుంటాయి. ఆత్మ జ్ఞాని లో కర్మ జ్ఞాన స్వరూపంగా భాసించడం వల్ల ఆ దివ్యాత్ముని నుండి కదిలే ప్రతి కార్యం యజ్ఞమే బ్రహ్మ స్వరూపమే అవుతుంది. ఈ యజ్ఞ కర్మ బ్రహ్మ స్వరూపాన్ని ఎలా పొందుతుందో చూద్దాం. ఈ శ్లోకం మనం పరిశీలించాలంటే 3వ అధ్యాయంలోని 9 నుంచి 15 వరకు మనం చర్చించిన యజ్ఞప్రకరణంలోని ప్రతి అక్షరం పదం వెనుక ఉన్న ఆంతర్యం మనకు తెలిసి ఉండాలి. ప్రత్యేకించి యజ్ఞ ప్రకరణం పై సంపూర్ణమైన సమగ్రమైన అవగాహన పట్టు ఉంటేనే ఈ శ్లోకం యొక్క పరమార్థం ప్రామాణికంగా పరిపూర్ణంగా మనం దర్శించగలం. ముందుగా ఈ శ్లోకంలోని పదప్రయోగాన్ని చూసి తరువాత విశ్లేషించుకుందాం. బ్రహ్మం అనే మాట మొదటి పాదంలో నాలుగు సార్లు రెండవ పాదంలో రెండుసార్లు మొత్తం ఆరుసార్లు ప్రయోగించాడు. ఈ ఒకే విధంగా మనకు అనిపించే ఆరు పదాలు కాక మిగిలిన పద ప్రయోగం చూద్దాం. ఒకటి అర్పణం, ఏమి అర్పిస్తున్నావో అది అర్పించే తత్త్వం, అర్పించే భావన రెండు హవిహిః బ్రహ్మమనే హవిస్సు యజ్ఞంలో సమర్పించే హోమ ద్రవ్యాలు, అన్నంలో పోయదగినది నెయ్యి, అగ్ని యందు పొందింపబడునది. అగ్ని నుండి వెలువడునది అని అర్థాలు ఉన్నాయి. మూడు అగ్ని బ్రహ్మమనే అగ్ని, అగ్ని యందు చేయదగినది, సర్వం అగ్నిమయం హవ్యవాహనుడు అనే పేరు అగ్నికి ఉంది. అంటే హవిస్సును

తీసుకెళ్లేవాడు, సూర్య భగవానుడు కూడా అగ్ని అంశమే. మొత్తం విశ్వమంతా వ్యాపించి ఉన్నది అగ్ని. మన ఆలోచన, ప్రేరణ అన్నింటికి కారణం అగ్ని. అగ్ని అంశ అయిన సూర్య దేవుని నుంచి ప్రజ్వరిల్లుతున్న సూర్యకిరణాలు అగ్ని. నాలుగు 'బ్రహ్మణా' బ్రహ్మస్వరూపుడు బ్రహ్మతత్త్వం ఎరిగిన వాడు, బ్రహ్మవిధుడు, తానే బ్రహ్మం అయివున్నవాడు. ఐదు 'బ్రహ్మ కర్మ సమాధినా' బ్రహ్మకర్మ సమాధి నిష్టుడైన 2-70లో చెప్పుకున్న ఆపూర్యమానం స్థితిలో నిలిచి 2-72లో చెప్పుకున్న బ్రాహ్మిస్థితిలో సుప్రతిష్టమైనవాడు. ఆరు 'తేన గంతవ్యం బ్రహ్మైవ' అలాంటి బ్రహ్మ నిష్టుని చేత పొందే ఫలం కూడా బ్రహ్మమే అయి ఉంటుంది. ఈ పదాల యొక్క అర్థం భావం తెలుసుకున్న అవగాహనతో ఈ శ్లోకాన్ని సమన్వయం చేద్దాం. బ్రహ్మర్పణం అంటే ఇక్కడ బ్రహ్మం అర్పణం అనేవి విడదీయరాని పదం. బ్రహ్మర్పణం ఒకే పదం గా చెప్పుకున్నప్పుడే ఈ శ్లోకానికి భావం సమకూరుతుంది. యజ్ఞ సంబంధమైన అర్పణాధులు పరమార్థ దర్శికి ఆత్మసంబంధిగానే బ్రహ్మంగానే కనిపిస్తాయి. 'సర్వం హేతత్ బ్రహ్మ' అని మాండూక్యోపనిషత్తు ఈ సమస్తమూ బ్రహ్మమే. ఒక వస్తువు దేని నుండి ఉత్పన్నమవుతుందో అందులో ఆ వస్తువు స్వభావం ఉంటుంది. అలాగే భగవంతుని నుండి ఆవిర్భవించిన సమస్త లోకం భగవదంశంగానే ఉంటుంది. ఆ కారణంగా భగవత్ స్థితిలో ఉన్న ఆత్మ జ్ఞానికి సమస్తమూ భగవత్ స్వరూపంగానే దర్శితమవుతుంది. ఇందులో అర్పణం అర్పించేది అని అర్థం కదా. సామాన్యులకు బ్రహ్మం వేరుగా అర్పించే హోమ సాధనాలు వేరుగా తెలిస్తే ముందు శ్లోకం వరకు మనం చర్చించుకున్న బ్రహ్మవిధునికి జీవన్ముక్తుడైన ఆత్మజ్ఞానికి హోమ సాధనం కూడా బ్రహ్మంగానే కనిపిస్తుంది. ఇక్కడ ఓ సున్నితమైన తేడాను మనం గమనించాలి. అర్పణం బ్రహ్మమే కానీ బ్రహ్మం అర్పణ కాదని తెలియాలి. అర్పణం బ్రహ్మం అయినప్పుడు మాత్రమే హవిస్సు బ్రహ్మమవుతుంది. తద్వారా హోమాగ్ని, హోమం చేసేవాడు సర్వమూ బ్రహ్మస్వరూపంగానే అర్థమవుతాయి. ఈ అర్పిత బుద్ధి లేకపోతే అర్పణమే బ్రహ్మం కాకపోతే మిగిలినవన్నీ కూడా బ్రహ్మం కావడానికి అవకాశం లేదు కదా. దీన్ని బట్టి ఏది అర్పణమో మనలో అర్పిత బుద్ధి ఏదైతే ఉందో మనలో అర్పించడానికి తగిన ఆత్మజ్ఞాని స్థితి ఏదైతే ఉందో అది బ్రహ్మం. మన సమర్పణం బ్రహ్మస్వరూపంగా వెలుగొందాలంటే అతను ఖచ్చితంగా ఆత్మసాక్షి అయి ఉండాలి. అదే బ్రహ్మర్పణం. ముందు శ్లోకం దాకా మనం చెప్పుకున్న ఆత్మజ్ఞాని లక్షణాలు సమగ్రంగా ఉన్నప్పుడు మాత్రమే అది సాధ్యం. 4-23లో చెప్పుకున్న ఐదు అంశాలు 4 -22 లో చర్చించిన నాలుగు అంశాలతో సహా ఇప్పటివరకు రెండవ అధ్యాయంలో చెప్పుకున్న స్థితప్రజ్ఞుని లక్షణాలు మొదలైన అంశాలన్నీ కూడా మూడవ అధ్యాయంలోని అన్ని శ్లోకాలకు సంబంధించిన విశేషాలను సవిమర్శనాత్మకంగా అర్థం చేసుకుంటేనే ఈ శ్లోకంలోని నిగూఢార్థం మనకు బోధపడుతుంది. ఇవన్నీ మనకు అవగతం కావాలంటే 3-39లో మనం చర్చించుకున్న ఆవరణ శక్తిని నిర్మూలించి తద్వారా విక్షేపశక్తిని జయించి ముందుకెళ్లాలి. అందుకు దృక్ దృశ్య వివేకం ఉండాలి. ద్రష్ట లేదా ద్రుక్కు అంటే చూసేవాడు, దృశ్యం అంటే చూడబడేది, ఈ రెండింటి ఆత్మ అనాత్మ నిజ తత్త్వ జ్ఞానం తెలిసి ఉండాలి. అలాగే ముందు శ్లోకంలో చెప్పుకున్న సర్వసాధారణ స్థాయి మనిషికి అనిపించే జ్ఞాత, జ్ఞేయం, జ్ఞానం ఈ మూడింటి తేడాలు అధిగమించిన ఆత్మసాక్షి

పరబ్రహ్మ తత్త్వాన్ని పొంది ఉండాలి. స్థితప్రజ్ఞుడై అప్రతిహతమైన ధారలాగా సుస్థిరమైన బ్రహ్మానందాన్ని అనుభవిస్తూ ప్రపంచ స్మృతి, స్పృహ లేనివాడై ఉండాలి. సదా ఇంద్రియ వ్యాపారాలనుండి విముక్తుడై పరబ్రహ్మంలో లీనమైన నిత్య జాగృతిని పొంది ఉండాలి. అలాంటి స్థితిలో ఉండి చేసేది అర్పణమే బ్రహ్మార్పణం. మనం 3-14, 15 లో సృష్టికార్యం అనే మహా యజ్ఞం కర్మ యజ్ఞం మొదలైన అంశాల గురించి విశేషంగా సమగ్రంగా వివరించుకున్నాం. ప్రాణులు అన్నం వల్ల, అన్నం వర్షం వల్ల, వర్షం యజ్ఞం వల్ల, యజ్ఞం కర్మ వల్ల, కర్మ అక్షర రూపుడైన బ్రహ్మం నుండి ఆవిర్భవించిందని తెలుసుకున్నాం. కర్మ చక్రం, యజ్ఞ చక్రం, విశ్వ చక్రం సంపూర్ణంగా సందేహానికి తావు లేకుండా చర్చించుకున్నాం. తద్వారా తిరిగి ఆయజ్ఞమే ప్రాణి పుట్టుకకు కారణమవుతుందని సర్వగతమైన బ్రహ్మం సదా యజ్ఞం నుండే ప్రతిష్టితమైన సత్యాన్ని గ్రహించాం. 'తస్మాత్ సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితం' శ్లోకంలో బ్రహ్మం సర్వవ్యాపకమై సర్వత్రా ప్రతిష్టితమై జన్మ యజ్ఞంలోనూ, సృష్టి యజ్ఞంలోనూ సదా వ్యాప్తి చెందిన విధానాన్ని చూసాం. జగత్ చక్రంలో నిబిడీకృతమై ఉన్న దైవ నియమిత కర్మ యజ్ఞాన్ని అనుసరించాలని అవగాహన చేసుకుని 3-27లో ఆత్మే పరబ్రహ్మం అని నిరూపించుకున్నాం కూడా. ఈ దృష్టితో మనం పరిశీలిస్తే బ్రహ్మం జ్ఞాన స్వరూపం. కనుక అంతా జ్ఞానమే. బ్రహ్మవిధునిలో అంతా జ్ఞానమయమే. అన్ని జ్ఞాన స్వరూపాలే. అందువల్ల బ్రహ్మవిధుడు ఆచరించే కర్మ ఏదైనా జ్ఞాన హేతువే. ఆకర్మే. ఆత్మజ్ఞాన స్థితిలో ప్రతిష్ఠితమై అర్పించే అర్పణం బ్రహ్మం అవుతుంది. అప్పుడు తద్వారా వెలువడే హవిస్సు బ్రహ్మమవుతుంది. అది కూడా బ్రహ్మవిధునకు బ్రహ్మంగానే దర్శనమిస్తుంది. అన్నం నెయ్యి లాంటి హోమ ద్రవ్యాలన్నీ కూడా ఆత్మవిధునికి బ్రహ్మ స్వరూపంగానే అనిపిస్తాయి, కనిపిస్తాయి. అదే 'బ్రహ్మహవిహిః'. తరువాత 'బ్రహ్మగ్నౌ'. ఇదీ సమస్త పదమే. హోమం దేని ద్వారా చేయబడుతుందో అలాంటి అగ్ని కూడా బ్రహ్మమే. అలాగే ఆత్మసాక్షి స్థితిలో బ్రహ్మవిధుడైన 4 -13 లో చెప్పుకున్న గుణ విభాగం చేత బ్రాహ్మణుడైన బ్రహ్మ తత్త్వం సంతరించుకున్న బ్రహ్మవిధుడు, అకర్త అయిన కర్త చేసే హవన క్రియ హుతం కూడా బ్రహ్మమే. అలా అకర్త అయిన కర్త చేసే హవన క్రియ ద్వారా పొందే ఫలం ఏదైతే ఉందో అది కూడా బ్రహ్మమే. దీన్నే సోమరసం అంటాం. అయితే ఏది సోమరసం అనేది మనకు అర్థం కావాలి. యజ్ఞం అంటే పూజించుటే యజ్ఞం అని అర్థం. ఇంతకూ యజ్ఞం అంటే ఏది తెలుసుకోవాలో దాన్ని తెలుసుకోవడం యజ్ఞం. ఈ యజ్ఞంలో ఇందులో సోమరసం ఉద్భవిస్తుంది. ఈ సోమరసమే వేద మార్గానికి, దైవత్వానికి దారి చూపిస్తుంది. మనం 2-45లో వేదం అంటే విధితమయ్యేది తెలియదగినది అని అర్థం చేసుకున్నాం. ఈ సోమరసం మనకు వేద మార్గాన్ని దైవ మార్గాన్ని విధితం చేస్తుంది, సూచిస్తుంది. అదే దిక్సూచి అని మనకు తెలియాలి. ఈ క్రియను ఈ యజ్ఞాన్ని బ్రహ్మణాధులు ఎవరైనా చేయవచ్చు. సృష్టికర్త సృష్టించిన గుణాల సముదాయంచే వారు ఏ గుణంలో ఉన్నా కూడా వారు బ్రహ్మ తత్త్వ విధుని ద్వారా బ్రహ్మార్పణ భావంతో యజ్ఞం చేసి సోమరసాన్ని పొంది దైవమార్గాన్ని బ్రహ్మత్త్వ స్థితిని తెలుసుకొని దైవంగా ఆత్మ సాక్షిగా విరాజిల్ల వచ్చు. ఇలా సోమరసాన్ని సృజించే బ్రహ్మవిధుని కర్మ అంతా కూడా బ్రహ్మమే అవుతుంది. ఇలాంటి బ్రహ్మ కర్మలో సుస్థిరమైన బుద్ధి కలిగి ఉండటమే

బ్రహ్మ కర్మ సమాధి. ఈ విధంగా యజ్ఞరూపమైన వేద రూపమైన కర్మ బ్రహ్మ విధునికి జ్ఞానం ప్రధానంగా ఉందే గాని కర్మ ప్రధానంగా లేదు. వీరికి సర్వత్రా సర్వదా బ్రహ్మ దర్శనం జరగడం చేత కర్మ అకర్మగా భాసిస్తూ ఉంటుంది. కర్త అకర్తగా శోభిస్తూ ఉంటాడు. అలాంటి బ్రహ్మవిధులు ఎప్పుడూ శూన్యంలోనే ఉంటారు. వీరు లోకహితార్థం, దేహయాత్రార్థం ఏ వస్తువు చూసినా ఆ వస్తువుకు సంబంధించిన జ్ఞానం ఆత్మ ప్రకాశము ద్వారా బుద్ధిలో జనిస్తుంది. బుద్ధిలోని జ్ఞానం చైతన్యం కన్నా అన్యంగా లేదు. బుద్ధి వృత్తే జ్ఞాత. ఈ జ్ఞాత జ్ఞేయాన్ని జ్ఞానం ద్వారా తెలుసుకుంటూ ఉంటాడు. సామాన్యులకు ఈ జ్ఞాత, జ్ఞానం, జ్ఞేయం భేదం వారి వారి చైతన్య పరిధిని ఆశ్రయించి ఉంటుంది. కానీ జ్ఞాని చైతన్యంలో ఈ మూడింటి భేదం ఉండదు. ఆ చైతన్యమే నేను అని తెలిసిన ఆత్మవిధుడు జ్ఞేయం, జ్ఞానం, జ్ఞాతలను ఆత్మ కన్నా అన్యంగా చూడలేడు. ఇక్కడ జ్ఞాత అంటే తెలుసుకునే వాడు, జ్ఞానం అంటే తెలుసుకోదగినది, జ్ఞానం అంటే తెలుసుకున్న విషయం అని గమనించాలి. ఇలా మనం పరిశీలిస్తే బ్రహ్మవిధునికి తెలిసేదంతా బ్రహ్మమే అయి ఉంటుంది. బ్రహ్మ విధుల ద్వారా జరిగేదంతా బ్రహ్మ క్రియే అవుతుంది. మీరు జాగ్రద, స్వప్న, సుషుప్తి ఈ మూడింటికి అతీతమైన ఆత్మస్థితిలో ఉంటారు. ఈ మూడు అవస్థ స్థితులను సంక్షిప్తంగా తెలుసుకొని ముందుకెళ్దాం. మనం జాగ్రదావస్థలో ఉన్నప్పుడు ఈ జగత్తును అనుభవించే స్థితి వైస్వానరస్థితి. మనం పని చేస్తూ చదువుతూ తిరుగాడే స్థితి ఇది. రెండు ఈ మనః శరీరాలనే పరికరాలకి విశ్రాంతి అవసరం కాబట్టి అలా మనః శరీరాలు విశ్రాంతి తీసుకోవడమే నిద్ర, అదే స్వప్నావస్థ. ఈ అవస్థలో బాహ్య జగత్తుతో సంబంధం లేకుండా సుప్త చేతన మనసులోనే అన్ని జరుగుతుంది. ఈ సుప్త చేతన మనసు ఒక నూతన లోకాన్ని రూపొందించుకుంటుంది. అదే కల. అలా ఈ స్వప్నలోకాన్ని అనుభవించే స్థితి తైజస స్థితి. మూడు సుషుప్తి అవస్థ. ఇక్కడ జాగ్రదావస్థ కానీ సుప్తచేతనతో కూడిన స్వప్నావస్థ కాని ఉండదు. ఈ అవస్థలో ఏమి తెలియదు, మేలుకున్న తరువాత నేను గాఢంగా నిద్రపోయాను అనిపిస్తుంది. ఇది ప్రాజ్ఞావస్థ ఈ స్థితిలో అనుభవాలు ఏమీ ఉండవు. ఇలా ఈ మూడు స్థితులలో మనం మారి మారి సంచరిస్తూ ఉంటాం. ఈ మూడింటికి అతీతమైనది ఆత్మస్థితి. ఇక్కడ జాగ్రద స్వప్న సుషుప్తి మూడు అవస్థలలోనూ ఉండే నేను అనే స్థితి ఆత్మస్థితి. ఇక్కడ జాగ్రద స్వప్న సుషుప్తి మూడు కూడా ఆత్మలో లయమై తాను ఆత్మ మాత్రమేనన్న వివేక జాగృత ఆత్మానుభూతి స్థితి. ఇదే ఆత్మసాక్షి స్థితి. ఈ స్థితిలో సమస్తము ఒక్కటిగా తెలుస్తుంది. అలా ఆత్మ కన్నా అన్యంగా ఏదీ లేదు అని గ్రహించడమే జ్ఞానం. కాబట్టి స్వప్నగత దృశ్యాలన్నీ స్వప్న ద్రష్ట కన్నా అన్యంగా లేక దృశ్యాలన్నీ ద్రష్ట రూపంగా భాసించినట్లు విశ్వంలో తెలియబడుతున్నదంతా కూడా ఆత్మవిధుని కన్నా అన్యంగా ఉండదు. ఇదే ఆత్మ దర్శనం. ఆత్మే బ్రహ్మం కాబట్టి ఆత్మ దర్శనం అంటే బ్రహ్మ దర్శనం అని అర్థం. ఇంతకూ మనం చేసే యజ్ఞ కర్మలో గానీ హోమంలో గాని జరిగే ప్రక్రియ ఏంటి? మనం చేసే యజ్ఞ కార్యం హోమకార్యం అన్నీ కూడా దేవతలకు ఎలా చేరుతుంది అని మనం పరిశీలిస్తే మన దివ్య దృష్టికి మనకే స్వయంగా సత్య దర్శనం అవుతుంది. మనం హోమంలో స్థూల వస్తువులను హోమ ద్రవ్యాలను అగ్నిదేవునికి సమర్పిస్తాం. మనలోని అర్పిత బుద్ధి లేదా ఆ భావన అనే సూక్ష్మాంశం ఆయా వస్తువుల ద్వారా అగ్నికి చేరుతుంది. అలా

మనం సమర్పించిన స్థూల వస్తువుల ద్వారా అగ్నికి చేరిన మన యొక్క అర్పిత బుద్ధిలోని భావన ఆయన సూక్ష్మ అంశాన్ని అలాగే ప్రకృతి సహజ సిద్ధంగా అందిన శ్రేష్టతతో కూడుకున్న దైవిక సంపద అయినటువంటి హోమ ద్రవ్యాలు అగ్నిదేవునిలో కలయడం ద్వారా అగ్ని నుండి వెలువడే సూక్ష్మ అంశాన్ని కలిపి దైవానికి చేర్చుతుంది, అంటే బ్రహ్మకు చేర్చుతుంది. అలా మనం చేసే బ్రహ్మార్పణం బ్రహ్మకు చేరుతుంది. ఇది హోమం క్రియలో జరిగే సూక్ష్మమైన అద్వితీయమైన అఖండమైన అవ్యక్తమైన కర్మ. ఆ స్థిత ప్రజ్ఞతా భావన ప్రవర్తన మనలో సుస్థిరంగా లేకపోతే ఆ కార్యం జరగదు కదా. కనుక బ్రహ్మ తత్త్వంలో సుస్థిరమైన భావం ఉన్నప్పుడే అది బ్రహ్మాన్ని చేరుతుంది. యద్భావం తద్భవతి అంటే పరిశుద్ధమైన పరమాత్మ భావంతో చేసే అర్పణ సమర్పణ. అలాంటి బ్రహ్మార్పణమే యజ్ఞమే బ్రహ్మాన్ని చేరుతుంది. అదే 'బ్రహ్మ కర్మ సమాధినా' అలాంటి హోమమే యజ్ఞ కార్యమే మనిషి జీవితం పరిపుష్టం కావడానికి ప్రకృతి శక్తులను పరిపుష్టం చేయడానికి దోహదపడుతుంది. సృష్టిలోని సమస్త ప్రాణులకు అవసరమైన ఆహారం జీవశక్తి వసతులు కల్పించడానికి సృష్టికర్త, ప్రకృతి తల్లి ఇద్దరూ సిద్ధంగానే ఉంటారు. మనమే బ్రహ్మ భావంతో ప్రకృతి శక్తులతో, సృష్టికర్తతో కలిసిమెలిసి జీవించడం లేదు. ఎందుకంటే బ్రహ్మంతో ప్రకృతితో స్నేహం చేయాలంటే బ్రహ్మ విద్య తెలిసి ఉండాలి కదా. అది బ్రహ్మమయమైన భగవద్గీతా అధ్యయనం ద్వారానే సాధ్యం కదా. అలా మనం ప్రకృతితో బ్రహ్మతో సహజీవనం చేస్తే ప్రకృతి శక్తి సృష్టి కార్యం పరిరక్షితమవుతుంది. అప్పుడు మానవజీవన మనుగడ పరిపుష్టంగా ప్రశాంతంగా కొనసాగుతుంది. మనం మనం జీవించే లోకం ఈ రెండింటికి ప్రాతిపదిక అయిన భగవంతుడు ఈ మూడు మౌళికమైన సత్యాలు. వీటిని గురించి చేసే అధ్యయనమే బ్రహ్మవిద్య. శక్తి ఉన్నప్పుడే సృష్టి జరుగుతుంది, కర్మ జరిగినప్పుడే జ్ఞానం ఉదయిస్తుంది. ఈ సూత్రాన్ని అనుసరించి పరిశీలన చేస్తే ఈ మౌళికమైన మూడు విషయాలు మనకు విదితమవుతాయి. మనిషి తల్లి గర్భంలో ఊపిరి పోసుకున్న నాటి నుండి క్షణమైనా శక్తి సంబంధిత శ్వాస లేకుండా బతకలేడు, జీవించలేడు. ఈ సకలకోటి జీవరాసులకు ప్రాణవాయువు నింపుతున్నది దాహం తీరుస్తున్నది దైవసంపదతో ఉన్న పంచభూతాత్మక ప్రకృతి. వెలిగించని అగురవత్తి లాంటివాడు మనిషి. వెలిగించని దీపం వంటి వాడు మనిషి. తనకు తానుగా వెలుగు పొందుతున్న దివ్య జ్యోతి ఈ మానవ దేహం. ఈ శరీరపు పనితీరును అంటే మెకానిజాన్ని నిర్వహణను రెండవ అధ్యాయం మూడవ అధ్యాయంలో సమగ్రంగా చర్చించాం. వాటన్నింటినీ అధ్యయనం చేసిన అవగాహనతో దివ్య జ్యోతిలా వెలుగొందాల్సిన బాధ్యత ధర్మం మనిషిదే. అధర్వణ వేదం ప్రకారం ఈ విశ్వం బ్రహ్మం వేరు కావు. బ్రహ్మమే ఈ విశ్వానికి ఆధారం. ఆధారం లేకుండా ఏ వస్తువూ నిలవనట్లే బ్రహ్మం అనే ఆధారం లేకపోతే ఈ సృష్టికి ఉనికి లేదు. ఆ కారణంగా బ్రహ్మవిద్యను బ్రహ్మ తత్త్వాన్ని ఖచ్చితంగా అధ్యయనం చేసి అవగతం చేసుకుంటేనే మన ఉనికిని మనం పొందగలం. మన స్వస్తితికి మనం చేరుకోగలం. ఇదే నేను నాది అనే అహంభావం లేనటువంటి మానవుడు దేవుడు జీవాత్మ పరమాత్మ సృష్టికర్తల భావాన్ని సాక్షాత్కరించుకున్న స్థితి. ఈ స్థితిని సంప్రాప్తించుకున్నప్పుడే మనం బ్రహ్మార్పణం గావించగలం. అదే ఈ శ్లోకం పరమార్థం.

4అ, 25శ్లో.

దైవమేవాపరే యజ్ఞం యోగినః పర్యుపాసతే |
బ్రహ్మాగ్నావపరే యజ్ఞం యజ్ఞేనైవోపజుహ్వతి ||

కొందరు యోగులు దైవ పూజా రూప యజ్ఞమును చక్కగా అనుష్ఠింతురు. మరికొందరు యోగులు బ్రహ్మాగ్నియందు అనగా పరబ్రహ్మ పరమాత్మ రూపాగ్నియందు అభేద దర్శన రూప యజ్ఞము ద్వారా ఆత్మరూప యజ్ఞమును ఆచరింతురు.

మనం మూడవ అధ్యాయంలోని యజ్ఞ ప్రకరణం పునాదిని ఆధారంగా చేసుకుని 4-23వ శ్లోకంతో యజ్ఞం అనే మాటను పరిచయం చేసుకున్నాం. అక్కడ భగవత్ ప్రీత్యర్థం సర్వప్రాణి హితం కోసం ధర్మాచరణ కోసం చేసే ప్రతీది యజ్ఞమే అని తెలుసుకున్నాం. అందుకు ఉదాహరణగా 4-24 లో హోమం అనే యజ్ఞాన్ని పోల్చి ఆ హోమంలో సర్వమూ ఎలా బ్రహ్మమయం అవుతుందో నిరూపించుకున్నాం. ఈ దేహం అనే యాగశాలలోని జఠరాగ్నికి మనం సమర్పించే హోమ ద్రవ్యం భోజనం. అందుకే భోజనాన్ని ఆత్మ జ్ఞాన తత్త్వంతో బ్రహ్మ తత్త్వంతో బ్రహ్మార్పణ గావించుకొని స్వీకరిస్తాం. అలా భుజించడం అనే యజ్ఞ కర్మ ద్వారా వెలువడే బ్రహ్మమయ హవిస్సు బ్రహ్మాన్నే చేరుతుంది. మనలో బ్రహ్మ తత్త్వం లేకపోతే బ్రహ్మం కానిది బ్రహ్మాన్ని చేరుకోదు కదా. దీన్ని బట్టి బ్రహ్మ తత్త్వాన్ని ఆత్మైక స్థితిని పొందడం బ్రహ్మార్పణంలో ప్రధానమైన అంశం. అదే మన జన్మ యజ్ఞానికి సార్థకత. ఈ దృష్టితో ఈ శ్లోకాన్ని పరిశీలించాలి. ఇందులో రెండు అంశాల్ని ప్రతిపాదించారు. ఒకటి దేవయజ్ఞం, రెండు బ్రహ్మయజ్ఞం. దేవ యజ్ఞం అంటే దైవ పూజారి యజ్ఞ కార్యాలు దేవతారాధన దేవతా ఉపాసన మొదలైన విధంగా ఆయా రూపాన్ని నామాన్ని కొలుస్తూ చేసే పూజ యజ్ఞం. మనం ప్రార్థన పూజ అనే అంశాన్ని వాటి యొక్క అసలైన నిజ తత్త్వాన్ని అందులోని ధార్మిక దృష్టిని 4-18 లో సమగ్రంగా చూసాం. ఆ అవగాహనతో ఈ అంశాన్ని అర్థం చేసుకోవాలి. ఆయా రూపాలను ఆరాధించి చేసే ఈ దైవ యజ్ఞాన్ని ఆచరించేవారు యోగినః అంటే కర్మయోగులు. ఇక్కడ ఏవా శబ్దం ఆయా రూపాది ఇంద్రాది దేవతలను ఆరాధించే విధానాన్ని సూచిస్తుంది. తానే బ్రహ్మం అనే భావన వీరిలో ఉండదు. వీరు దేవతలను వేరుగా తమను వేరుగా భావిస్తారు. అందుకని వీరు చేసే పూజాదికాలన్నీ కూడా దేవ యజ్ఞం అవుతుంది. అదే 'దైవం యజ్ఞం ఏవ పర్యుపాసతే'. రెండు బ్రహ్మయజ్ఞం మనం ముందు శ్లోకంలో సుదీర్ఘంగా చర్చించిన అభేద దర్శన ప్రధానమైన బ్రహ్మ యజ్ఞమే జ్ఞాన యజ్ఞం. ఇది ఆత్మ విచారణ చేత పరిశుద్ధ మనస్కులై క్షణం కూడా ఏమరుపాటు లేకుండా సర్వదా చిత్తమును బ్రహ్మమందే నిలిపిన పవిత్రత చేత సమకూరుతుంది. అంటే ఆత్మను పరమాత్మతో విలీనమొనర్చే తత్త్వం ద్వారా యజ్ఞం చేయడం. బ్రహ్మవిద్య అధ్యయనం ద్వారా బ్రహ్మజ్ఞానం పొందిన జ్ఞాన యజ్ఞం ద్వారానే బ్రహ్మార్పణం సాధ్యం. అలా అర్పించిన భావనతోనే సర్వం బ్రహ్మమయం అవుతుందని మనకు ముందు శ్లోకంలో నిర్ధారణ అయింది. అలా

బ్రహ్మ భావనతో బ్రహ్మాగ్నిలో సమర్పించేది బ్రహ్మయజ్ఞం. సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ అనే ఉపనిషత్తుల సారం కూడా ఇదే. మన సర్వ కర్మలను మనలోని జ్ఞానాగ్నిలో దగ్ధమైన బ్రహ్మత్త్వపు జ్ఞాన స్థితిలో చేసేదే జ్ఞాన యజ్ఞం. ఇక్కడ యజ్ఞ శబ్దం ఆత్మస్థితిలో ఉండటాన్ని సూచిస్తుంది. అందుకని యజ్ఞం అనే మాటను ఆత్మసాక్షి అనే అర్థంలో కూడా తీసుకోవచ్చు. యజ్ఞానికి పర్యాయపదంగా ఆత్మ అనే అర్థం కూడా ఉంది. అంటే ముందు శ్లోకంలో మనం చర్చించిన జ్ఞాతృ జ్ఞేయం జ్ఞానం మూడింటి బేధం అఖండాత్మ జ్ఞానంలో విలీనం అవుతున్నందున ఈ అర్థం సార్థకం అవుతుంది. అలా ఆత్మజ్ఞానంతో బ్రహ్మ తత్త్వాన్ని పొందడం వల్ల ఆత్మ అనే యజ్ఞంలో హోమం చేయడమే బ్రహ్మ తత్త్వం. ఇదే 'యజ్ఞేనైవోపజుహ్వతి' అగ్నిలో పడిన వస్తువు అగ్ని రూపాన్ని పొంది శోధించినట్లే బ్రహ్మాగ్నిలో ఆహుతి చేసిన జీవభావం బ్రహ్మత్త్వాన్ని పొందుతుంది. ఇదే మోక్షానికి సాధనమైన జ్ఞానమార్గం. దైవాది యజ్ఞాల కంటే సర్వోన్నతమైనదని సర్వోత్కృష్టమైనదని పెద్దలు శాస్త్రాలు ఉపనిషత్తులు, ఉద్భోధిస్తున్నాయి.

4అ, 26శ్లో.

శ్రోత్రాదీనీంద్రియాణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వతి |
శబ్దాదీన్ విషయానన్య ఇంద్రియాగ్నిషు జుహ్వతి | 26 |

కొందరు యోగులు శ్రోత్రాది- ఇంద్రియములను సంయమన రూపాగ్నుల యందు హోమము చేయుదురు. మరికొందరు యోగులు శబ్దాది సమస్త విషయములను ఇంద్రియ రూపాగ్నుల యందు హవనము చేయుదురు. అనగా యోగులు మనో నిగ్రహము ద్వారా ఇంద్రియములను అదుపు చేయుదురు. ఫలితముగా శబ్దాది విషయములు ఎదురుగా లేకున్నను వాటి ప్రభావం వాటి ఇంద్రియములపై ఏమాత్రము ఉండదు.

సాధారణ స్థాయి మనిషి ఎన్ని విధాలుగా మోక్ష సాధనా మార్గాన్ని అన్వేషిస్తూ వివిధ ప్రక్రియల ద్వారా ముందుకెళుతుంటాడో అనే అంశాన్ని మనకు వివరిస్తున్నాడు. అందులో భాగంగా ముందు శ్లోకంలో దేవ యజ్ఞం, బ్రహ్మయజ్ఞం రెండింటిని విశ్లేషణాత్మకంగా చూశాం. ఈ శ్లోకం ఒకటి ఇంద్రియాల్ని నిగ్రహం అనే అగ్నిలో హోమం చేసే విధానం, రెండు శబ్ధాధి విషయాల్ని ఇంద్రియాలనే అగ్నిలో హోమం చేసే విధానాన్ని విశదీకరిస్తుంది. మనం 2-58 నుండి 2-68 వరకు స్థితప్రజ్ఞుడి లక్షణాలలో భాగంగా చెప్పుకున్న ఇంద్రియ ప్రకరణం పునాదిగా చేసుకున్నప్పుడు ఈ రెండు అంశాలు మనకు విధితమవుతుంది. ఆ పునాదిపై మనం నిర్మించుకున్న 3-34, 3-37, 3-40 నుంచి 3-43 వరకు మొత్తం మూడవ అధ్యాయంలోని ఈ ఆరు శ్లోకాలను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే ఈ శ్లోకం మనకు అనుభవైక జ్ఞానంగా రూపొందగలదు. ఇలా మూడు నాలుగు అధ్యాయాల్లోని అంశాల్ని సంపూర్ణంగా పరిశీలించిన దృష్టితో ఈ రెండు అంశాలను చూద్దాం. ఒకటి శ్రోత్రాది ఇంద్రియాలను సంయమాగ్నియందు హోమం చేయడం అంటే ఇంద్రియాల్ని నియమించడమే. ఇంద్రియాలకు శుద్ధత, శాంతి

అవసరం. ఇంద్రియ నిగ్రహంలో శుద్ధత జరిగి అవి సంయమించిన తరువాత శాంతిస్తాయి. ఇంద్రియాలను నిగ్రహించడం ద్వారా సంయమ స్థితికి చేరుకుంటే అప్పుడు ఎలాంటి బాహ్య విషయాలను మనసు తీసుకోదు. శబ్ద స్పర్శ రూపాధి దృశ్య వస్తువుల్ని భావించే చిత్తం ఆయా విషయాకారమై మారుతూ ఉంటుంది. అంటే అక్కడ ఆయా ఇంద్రియాలు ఆయా విషయాలతో తాదాత్మ్యం పొంది దానిలో తీవ్రంగా కూరుకుపోవడం జరుగుతుంది. అదేవిధంగా సతతం భగవత్ స్మరణ, ఈశ్వర జ్ఞానం, బ్రహ్మచింతన చేసే మనస్సు కూడా భగవత్ ఈశ్వర బ్రహ్మాకార వృత్తి గలదై అందులో విశేషంగా లీనమైపోతుంది. బురద నీటి అడుగు భాగంలో వస్తువులు ఏమీ కనిపించవు కదా, అదే ఆ నీరు శుద్ధంగా నిశ్చలంగా ఉంటే దాని అడుగు భాగంలో ఉన్న వస్తువులు మనకు స్పష్టంగా కనిపిస్తాయి. అలా హృదయం నిర్మలంగా నిశ్చలంగా ఉండే స్థితి ఏర్పడితే మనం మనసు యొక్క వృత్తులను తెలుసుకోవచ్చు. అప్పుడు వాటి వృత్తుల ద్వారా అనిపించే కష్టాల లాంటివి మనవి కానివిగా తెలిసి మనం స్థితప్రజ్ఞ స్థితికి చేరుకుంటాం. దేనితో హోమం చేస్తామో అది యజ్ఞం. ఇక్కడ మనం చేసేది ఇంద్రియ సంయమ యజ్ఞం. ఈ సంయమ యజ్ఞంలో నిగ్రహం అనే అగ్ని యందు ఇంద్రియాల్ని ఆహుతులుగా సమర్పిస్తూ హోమం చేయడం. ఇది ఇందులో జరిగే ప్రక్రియ. అలా ఆహుతులుగా ఇంద్రియాలు చెప్పినప్పుడు శ్రోత్రాది జ్ఞానేంద్రియాల్ని , కర్మేంద్రియాలను సంయమాగ్నుల యందు సమర్పించడం జరుగుతుంది. అంటే చెవి మొదలైన జ్ఞానేంద్రియాలు శబ్దాది విషయాల నుంచి వెనుకకు మరలించి వాటి వాటి స్వస్థానాల్లో ఉంచడం అని అర్థం. ఇదే ఇంద్రియ నిగ్రహం అంటాం. ఈ ప్రత్యాహారం వల్లనే ధారణ శక్తి పెంపొందుతుంది. అందుకే జ్ఞాన యోగానికి సాధన రూపమైన ఇంద్రియ నిగ్రహం కూడా యజ్ఞంగా భావించాలి. ఈ ప్రక్రియలో శ్రోత్రాది ఇంద్రియాల్ని నిగ్రహం అనే అగ్నిలో హోమం చేయడం వల్ల శ్రోత్రాది ఇంద్రియాల్ని స్వస్థితిలో ఉంచగలుగుతాం. తద్వారా మనసు శమిస్తుంది. దీన్నే శమం అంటాం. వాటిని స్వస్థితిలో ఉంచితేనే శమం సాధ్యపడుతుంది. అలా ఇంద్రియాల్ని ఆహుతులుగా గ్రహించి నిగ్రహం అనే అగ్ని యందు హోమం చేయడమే 'శ్రోత్రాదీ నీంద్రియాణ్యన్నే సంయమాగ్నిషు జుహ్వతి' అనే యజ్ఞం. ఈ శ్లోకంలోని మరో యజ్ఞం శబ్దాది విషయాల్ని ఇంద్రియాలనే అగ్ని యందు హోమం చేయడం. ఇందులో ఇంద్రియ విషయాల్ని హవిస్సులుగా గ్రహించి ఇంద్రియాలనే అగ్ని యందు హోమం చేయడం. ఇంద్రియాలు అంటే శ్రోత్రాదులు, చెవి మొదలైనవి కదా. ఇంద్రియ విషయాలు అంటే శబ్దాదులు. ఈ శబ్దాదులను శ్రోత్రాదులలో వేయడం అనేది అనుక్షణం మనలో జరిగే జీవనక్రియ. ఇంద్రియాలు దేహంలో ఉంటాయి. విషయాలు బాహ్యంలో ఉంటాయి. ఈ విషయాలన్నీ మనం ఇంద్రియ ప్రకరణలో సమగ్రంగా చూసాం. ఉదాహరణకు చెవి దేహంలో ఉంటుంది. శబ్దం బయట ఉంది కదా. ఈ బాహ్యంలోని శబ్దాలు సాధారణ స్థాయి మనిషికి అప్రయత్నంగా చెవిలో పడతాయి. అయితే దీనివల్ల మనకు ప్రమాదం లేదు కానీ మనసు వాటి వైపుకు మరల కూడదు. అలా పోనివ్వకుండా శబ్దాది విషయాల్ని ఇంద్రియాలనే అగ్ని యందు అంటే ఇంద్రియాలలోనే ఆపడం లేదా హోమం చేయడమే ఈ శ్లోకం పేర్కొంటున్న రెండవ యజ్ఞం. ఇక్కడ ఒక సున్నితమైన అంశం గమనించాలి. మొదటి పాదం లో చెప్పుకున్న ఇంద్రియ నిగ్రహ యజ్ఞంలో ఇంద్రియాలు

హవిస్సులుగా సమర్పించినప్పుడు విషయాలను కూడా సమర్పించినట్లే అయింది కదా. ఇంద్రియాలను సంయమాగ్నిలో హోమం చేసినప్పుడు ఇంద్రియ విషయాల్ని కూడా సమర్పించడం జరిగినా అక్కడ విషయాలని మాత్రమే సంయమాగ్నిలో సంపూర్ణంగా సమర్పిస్తాం. మనం ఒకటవ పాదంలోని 'శ్రోత్రాదీ నీంద్రియాణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వతి' అనే యజ్ఞం ద్వారా పొందవలసినటువంటి శమం ఏదైతే ఉందో దాన్ని మనం సాధించాలంటే ఈ ఇంద్రియ విషయాలైన శబ్దాదులను ఆహుతి చేస్తేనే సాధ్యమవుతుంది. అయితే ఏ విషయాల్ని సమర్పించాలనేది వివేకజాగృతం నుంచే జనిస్తుంది. ఉదాహరణ మనం భగవద్గీత శ్లోకాలను వినడం కూడా శబ్దాధి విషయాలని శ్రోత్రాది ఇంద్రియాల్ని చేరడం ద్వారానే కదా. ఆ వివేచనతో మనకు అవసరం లేని మన ఆధ్యాత్మిక ఉన్నతికి అవరోధం అనిపించేలాంటి అనవసరమైన విషయాల్ని హవిస్సులై ఇంద్రియాలనే అగ్నిలో ఆహుతి చేయాలి.

4అ,27శ్లో.

సర్వాణీంద్రియకర్మాణి ప్రాణకర్మాణి చాపరే |
ఆత్మసంయమయోగాగ్నౌ జుహ్వతి జ్ఞానదీపితే | 27 |

మరికొందరు యోగులు ఇంద్రియముల క్రియలను, ప్రాణముల క్రియలను అన్నింటిని జ్ఞానముచే ప్రకాశితమైన ఆత్మ సంయమ యోగ రూపాగ్నిలో హవనము చేయుచుందురు. అట్టివారు పూర్తిగా పరమాత్మ యందే స్థితులై యుందురు. అపుడు ప్రాణ ఇంద్రియముల స్వభావము వారిపై ఏమాత్రము ఉండదు. ఏలనన వారి బుద్ధియందు పరమాత్మ మాత్రమే నిలచి యుండును.

ఆత్మసంయమనంలో మనసును నిలపడమే ప్రధానమైన అంశం దీన్నే మనం ధ్యానం అంటాం. అయితే వీటికి సంబంధించిన పూర్తి వివరాలు ఆత్మసంయమయోగం ఆరవ అధ్యాయంలో చూద్దాం. మనసును ఆత్మయందు నిలిపే ఆత్మసంయమనం ద్వారా బాహ్య ప్రపంచం వైపు పరుగులెత్తే మనసును ఆత్మవైపుగా పరుగులెత్తించడం. పరుగులెత్తే స్వభావం ఉన్న మనసును ఆగమంటే ఆగదు కదా. అది దాని సహజ స్వభావం కాకపోతే దాని దిశను మనం మారుస్తున్నామని అర్థం చేసుకోవాలి. అదే ఆత్మ సంయమ యోగాగ్ని, ఈ యోగాగ్నిలో సర్వేంద్రియ వ్యాపారాలను అలాగే సర్వ ప్రాణ క్రియలను హోమం చేయడం. ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు కలిపి బాహ్యేంద్రియాలు పది, మరియు అంతరింద్రియాలైనటు వంటి మనసు, బుద్ధి ఈ 12 ఇంద్రియాల కర్మలను ధ్యానంలో నిలపడం. అంటే ఆత్మవైపు మరల్చడమే బాహ్యంలో చరించకుండా అంతర్ముఖం చేయడం. వీటి వివరాలు సంక్షిప్తంగా చూద్దాం. శ్రోత్రాది ఇంద్రియాలు అంటే జ్ఞానేంద్రియాలు కదా. చెవి ముక్కు కళ్ళు నాలుక చర్మం, వినడం వాసన చూడటం దృశ్య ప్రపంచాన్ని చూడటం రుచి చూడటం స్పృశించడం అనేది

వీటి కార్యాలు. వాక్కు హస్తం పాదం గుహ్యం గుదం అనేవి వాగాది కర్మేంద్రియాలు. మాట్లాడటం వస్తు గ్రహణం గమనం విషయానందం విసర్జనం అనేవి వీటి కార్యాలు. మొత్తం ఐదు జ్ఞానేంద్రియాలు వాటి కర్మలు, ఐదు కర్మేంద్రియాలు వాటి కార్యాలు పెరసి పది. ఇక అంతరింద్రియాలైన మనసు బుద్ధి వాటి కార్యాలు. ఈ మొత్తం బాహ్య అంతర ఇంద్రియ సర్వ కర్మలే ఈ శ్లోకంలో చెప్పినటువంటి 'సర్వాణీంద్రియ కర్మాణి' వీటన్నింటినీ ఆత్మయందు సంయమించడమే ఆత్మ సంయమం. ఇంద్రియాలు చేసే పనులు ఇంద్రియ కర్మలు, ప్రాణమంటే ఈ దేహంలోని ఆధ్యాత్మిక వాయువు. సంకోచం వ్యాకోచం లాంటి పద్ధతిలో చేసే క్రియలు ప్రాణ కర్మలు. వీటిని ఆత్మసంయమమనే యోగాగ్నిలో ఆహుతి చేస్తారు. నూనె ద్వారా అగ్ని ప్రజ్వలించినట్లు ధ్యాన ధారణ సమాధి రూపం అయినటువంటి వివేక విజ్ఞాన జాగృతి చేత యోగాగ్ని ప్రజ్వలమవుతుంది. అలాంటి ఆత్మ సంయమ యోగాగ్నిలో ప్రాణ ఇంద్రియ కర్మల్ని హోమం చేస్తారు. అంటే విలీనం చేస్తారు. 'ప్రాణకర్మాణి' ప్రాణ అపాన వ్యాన సమాన ఉదాన వాయువులే శరీరంలోని ప్రాణవాయువులు. వీటినే ప్రాణేంద్రియాలు అంటాం. ఈ అంశాలన్నింటినీ మూడవ అధ్యాయంలో సమగ్రంగా చూశాం. ఈ ప్రాణ శక్తుల సహాయంతో జరిగే సర్వ ప్రాణక్రియలను కూడా ఆత్మ యందే సమయమింప చేస్తాం. ఈ విధంగా సర్వేంద్రియాలు వాటి కార్యాలు సర్వప్రాణాలు వాటి కర్మలు కలిపి ఆత్మ సంయమం అనే యోగాగ్నిలో, ధ్యానాగ్నిలో హోమం చేయడం. ఇందులో ధ్యానం అగ్ని, సర్వేంద్రియ ప్రాణమనో బుద్ధులు హవిస్సులు వీటిని వివేకంతో జ్ఞానంతో హోమం చేయడం. ఇదే ఆత్మసంయమ యజ్ఞం. ఇవన్నీ కూడా వివేకజనిత జ్ఞానంలోనే జరుగుతుంది. ఇదే జ్ఞాన ప్రజ్వలనం, 'జ్ఞాన దీపితే'. ఇలా హోమం చేయడం 'జుహ్వతి'. ఈ యజ్ఞం మనిషికి ఎంత ప్రధానమో ఉదాహరణ రావణబ్రహ్మ యొక్క బలం, బలగం అతని భౌతిక ఆధ్యాత్మిక శక్తులు మనకు తెలియనివి కావు. అయితే ఈ ఆత్మ సంయమ యోగాగ్ని యజ్ఞం మాత్రం అతను చేయలేకపోయాడు. ఈ విషయాన్నే శ్రీమద్భాగవతం ఏడవ స్కంధం ప్రహ్లాద చరిత్ర ఘట్టం లో మనకు తెలుస్తుంది. ప్రహ్లాదుని తండ్రి అయిన హిరణ్యకశిపుడు ఎంత బలవంతుడైనా బలగం ఉన్నవాడైనా తనను తాను జయించలేని స్థితిని ప్రహ్లాదుడు ఇలా అంటాడు. దానవేశ్వరా లోకాలన్నీ క్షణంలో జయించావు. కానీ నీలోని మనసును ఇంద్రియాలను గెలువ లేకపోయావు. వాటి ముందు నీవు ఓడిపోయావు. నిన్ను కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలనే ఆరుగురు శత్రువులు బందీ చేశారు. భయంకరమైన శత్రువులను జయించి నశింపజేసినట్లయితే ప్రాణికోటిలో నీకు విరోధి ఎవ్వరూ ఉండరు. నా విన్నపం మన్నించు అని సవినయంగా తన తండ్రికి ఉద్బోధిస్తాడు. మనం కూడా తక్షణమే ఈ ఆత్మ సంయమ యోగాగ్ని అయినటువంటి మహా యజ్ఞానికి ఉపక్రమిద్దాం.

4అ,28శ్లో.

ద్రవ్యయజ్ఞాస్తపోయజ్ఞా యోగయజ్ఞాస్తథాపరే |
స్వాధ్యాయజ్ఞానయజ్ఞాశ్చ యతయః సంశితవ్రతాః | 28 |

కొందరు ద్రవ్య సంబంధ యజ్ఞములను, మరికొందరు తపో - రూప యజ్ఞములను, కొందరు యోగ రూప యజ్ఞములను చేయుదురు. మరికొందరు అహింసాది తీక్ష్ణ వ్రతములను చేపట్టి, యత్న శీలురై స్వాధ్యాయ రూప జ్ఞాన యజ్ఞములను ఆచరింతురు.

ఈ శ్లోకంలో నాలుగు అంశాలను పరిశీలించాలి. ఒకటి ద్రవ్య యజ్ఞం, ద్రవ్య శబ్దం మంచి పదార్థానికి గుణాశ్రయమైన వస్తువునకు పేరు. ద్రవ్యం భవ్యం గుణాశ్రయే, ద్రవ్యం అంటే పొందదగినది వినియోగించదగినది. వినిమయమైన భూదానం గోదానం వస్త్రదానం పుస్తకదానం డబ్బు దానం అన్నదానం ఇలా నిత్యజీవిత అవసరాలకు సంబంధించిన వినియోగ కరమైన సమస్తమైనవి కూడా ద్రవ్యంగానే పరిగణించాలి. మన దగ్గర మన అవసరానికి మించి ఉన్న వాటిని యోగ్యత గల వారితో పంచుకోవడం సత్కార్యం అవుతుంది. అయితే వీటిలో ఏవైనా కూడా భగవత్ ప్రసాదితంగా భావించి ఈశ్వరార్పణ భావనతో ఇతరులకు వితరణ చేస్తే అది ద్రవ్య యజ్ఞం అవుతుంది. అంటే దాత దాన గ్రహీతను ఈశ్వరునిగా భావించి సమర్పించాలి. ఇవన్నీ కూడా ద్రవ్యానికి సంబంధించింది. అందుకే పెద్దలు ఈ ద్రవ్య యజ్ఞ పూరిత దానాన్ని పవిత్ర నదీ తీరాలలో పుణ్యప్రదేశాలలో ఆలయ ప్రదేశాలలో నిర్వహిస్తారు. ఇందుకు పవిత్రమైన పుష్కర ఉత్తరాయణ ఏకాదశి లాంటి కాలాలను ఎంచుకొని మరీ దానం చేస్తారు. ద్రవ్యం అనేది వితరణ జరగకపోతే అది విపరీతానికి దారితీస్తుంది. ఖచ్చితంగా అది మార్పు చెందుతూ ఉండాలి. అది వాటి స్వభావం. మనం స్థూలంగా చూస్తే ఈ మార్పు మూడు రకాలుగా మనకు కనిపిస్తుంది. ఒకటి వినియోగం, రెండు వితరణం, మూడు వినాశం.

ద్రవ్యమనేది వినియోగించదగినది కదా కాబట్టి వినియోగించదగిన దాన్ని మనం ఉపయోగించకపోతే అది నిరుపయోగం అవుతుంది. అలా నిరుపయోగమైంది ఏదైనా నశించిపోతుంది. ఈ దృష్టితో మనం చూస్తే ద్రవ్యాన్ని వినియోగించాలి లేదా పరులకు వినియోగపడేలా వితరణ చేయాలి. తాను వినియోగించక ఇతరులకు వితరణ చేయకపోతే అట్టి ద్రవ్యం ఒక దశలో నశించిపోతుంది. ఇలా ద్రవ్యం యొక్క పరిణామ దశ వినియోగం వితరణ వినాశంగా మనకు తెలుస్తుంది. ఈ సత్యం అర్థం అయితే ద్రవ్య యజ్ఞం దివ్యంగా శోభిస్తుంది. రెండు తపోయజ్ఞం, తపస్సును యజ్ఞంగా భావించి చేయడం తపో యజ్ఞం. తపస్సు అనేది ధర్మార్థం నిర్వహించే పవిత్ర కార్యం. తపింప చేయునది తపస్సు. తపింప చేసే తపస్సులో పరిశుద్ధమైన సాధకుడు అంతఃకరణ శుద్ధిని పొంది జ్ఞానార్హుడై శోభిస్తాడు. అలా జ్ఞాన సముపార్జనతో మోక్ష సాధనకై తపస్సును యజ్ఞంగా భావించి చేయడమే తపోయజ్ఞం.

మూడు యోగ యజ్ఞం, యోగాభ్యాసం కూడా యజ్ఞమే. ప్రాణాయామ ప్రత్యహారాధి లక్షణమైన యోగాన్ని యజ్ఞంగా భావించి చేస్తే అది యోగ యజ్ఞం. అయితే కేవలం శారీరక వ్యాయామంగా మాత్రమే భావిస్తే అది ఆరోగ్యప్రదాయని అవుతుంది. అది శరీరి సంబంధి మాత్రమే అవుతుంది. అలా కాక ఈ యోగాభ్యాసం ద్వారా దేహేంద్రియ ప్రాణాలలో కూడా ప్రగతిని సాధిస్తే అది ఆధ్యాత్మిక సాధనకు దోహదం చేస్తుంది. అలా ఈశ్వరార్పణ బుద్ధితో యోగాభ్యాసాన్ని కొనసాగించినప్పుడు అది యోగ యజ్ఞం అవుతుంది. 4 స్వాధ్యాయ జ్ఞాన యజ్ఞం, తమ వేదాన్ని తామే అధ్యయనం చేయడం స్వాధ్యాయం. దీన్నిబట్టి ప్రతి మనిషి తమ తమ వేదాన్ని అంటే తన గురించి తానే స్వయంగా చేసే అధ్యయనం స్వాధ్యాయం. మనం ఈ నాలుగు అధ్యాయాలుగా కూడా అనేక సందర్భాల్లో స్వయం పరిశీలన విధానం గురించి చెప్పుకున్నాం అదే స్వాధ్యాయం. వేదాధ్యయనం, శాస్త్ర పఠనం, సద్గ్రంథపఠనం లాంటివి కూడా స్వాధ్యాయమే అయితే వట్టి గ్రంథ పఠనంగా కాకుండా వాటితో పాటు తమను తాము స్వీయ పరిశీలనతో అధ్యయనం చేసి ఆ అధ్యయన సారం ఆచరణీయం అయితే అప్పుడు అది స్వాధ్యాయం అవుతుంది. ఈ దిశగా స్వాధ్యాయం జరిగితే అది స్వాధ్యాయ యజ్ఞంగా రూపొందుతుంది. లేకపోతే పఠనం మాత్రమే అవుతుంది కానీ యజ్ఞం కానే కాదు. ఈ స్వాధ్యాయ యజ్ఞానికి అనుబంధమైనది జ్ఞాన యజ్ఞం. తనను తాను తెలుసుకునే అవకాశాన్ని కలిగించేది స్వాధ్యాయ యజ్ఞం అయితే తనను తాను అర్థం చేసుకోవడానికి తనపై తాను పట్టు సాధించడానికి సహకరించేది జ్ఞాన యజ్ఞం. ఈ యజ్ఞమే ముందు శ్లోకంలో చెప్పుకున్న ఆత్మ సంయమ యోగాగ్ని యజ్ఞం చేయడానికి తనను తాను సిద్ధింప చేసుకోవడానికి ఉపకరిస్తుంది. కాబట్టి ఇది జ్ఞాన యజ్ఞం. ఈ రెండు పెరసి స్వాధ్యాయ జ్ఞాన యజ్ఞం. ఇక ఈ శ్లోకంలో మనం చూడాల్సింది నిరంతరం స్వాధ్యాయ జ్ఞాన యజ్ఞలలో నిమగ్నం కావడంలో యత్నిస్తూ ఉండేవారు యతయః అంటే 'యతుడు'. అలా ప్రయత్నించేవారు దృఢమైన వ్రతం దీక్ష అపారమైన పట్టుదల కలవారై ఉంటారు. అందుకని వీరిని జగద్గురువు 'సంశిత వ్రతాః' అని పేర్కొన్నారు. సితములు అంటే తీక్షణమైన వాడి అయిన అని అర్థం. సంశితములు అంటే చక్కని పదునైనవి. వ్రత నియమములను తదేకంగా తీక్షణంగా పాటించేవారు అని అర్థం. ఇప్పుడు ఈ నాలుగు అంశాల్ని పునరావలోకనం చేద్దాం.

1. వినియోగార్థం యజ్ఞ బుద్ధితో చేసేది ద్రవ్య యజ్ఞం. 2 తపస్సునే యజ్ఞంగా భావించి చేయడం తపోయజ్ఞం. 3. ప్రాణాయామాది ప్రత్యహారాదులతో యోగాన్ని యజ్ఞంగా భావించి ఈశ్వరార్పణ బుద్ధితో చేసేది యోగ యజ్ఞం. 4. తమను తాము యజ్ఞ భావంతో అధ్యయనం చేస్తూ వేదాధ్యయనం శాస్త్ర పురాణాది సద్గ్రంథ అధ్యయనాన్ని కూడా యజ్ఞంగా భావించి చేయడం. అలాగే తమను తాను సిద్ధింప చేసుకునే యజ్ఞం చేయడం స్వాధ్యాయ జ్ఞాన యజ్ఞం. నిరంతర ప్రయత్నమే స్వభావంగా కలవారు తీక్షణమైన వ్రతాలు చేసేవారు సంశిత వ్రతులు.

4అ,29శ్లో.

అపానే జుహ్వతి ప్రాణం ప్రాణే పానం తథాపరే |
ప్రాణాపానగతీ రుద్ధ్వా ప్రాణాయామపరాయణాః ||

కొందరు ప్రాణాయామ యజ్ఞ పరాయణులు ప్రాణాపాన గతులను నిరోధించి అపానంలో ప్రాణాన్ని ప్రాణంలో అపానాన్ని హోమం చేస్తారు.

ఈ శ్లోకాన్ని పరిశీలించే ముందు ఈ శ్లోకానికి నేపథ్యంగా మనం మనలోని పంచప్రాణాలకు సంబంధించిన ప్రాణాపాన వివరాలను సంక్షిప్తంగా చూస్తేనే ఈ శ్లోకం మనకు అర్థమవుతుంది. మనలోని పంచప్రాణాలు ఒకటి సమాన వాయువు, ఇది అన్నా శయంలో జఠరాగ్నికి సమీపంలో ఉంటుంది. ఇది నాభి స్థానమందుండి మనం తిని తాగిన అన్నరసాధుల్ని పచనం చేసి శుభ్రపరచి శరీరంలో ఉండే 72 వేలనాడులకు రక్తాన్ని సమానంగా పంచి పెడుతుంది. ఇది నేను అనే అహం కు తోడ్పడుతూ కింది భాగంలో ఉంటుంది. రెండు వ్యాన వాయువు శరీరమంతా వ్యాపించి ఉండేది వ్యాన వాయువు ఇది శరీరాన్ని పులకింపజేస్తూ రోమాలకు గగుర్పాటు కలుగజేస్తూ శరీరమందంతటా వ్యాపించి శీతోష్ణ స్పర్శలను నాడి ద్వారా ఇతరులకు తెలియపరుస్తూ ఉంటుంది. మూడు ఉదానవాయువు ఇది కంఠ స్థానమందుండి నానా వైఖరులతో మాటలాడడానికి సహకరిస్తూ కర్మేంద్రియాలకు తెలియజేస్తూ ఉంటుంది. నాలుగు ప్రాణవాయువు ఇది వక్షస్థలంలో ఉండి అధోముఖస్థురాలై గుద స్థానము నంటి వెనుక వెన్నుపూస యందలి నడినాళం ద్వారా పైన సహస్రారం ఎండిపోకుండా పైకెక్కి అక్కడ రెండుగా విడివడి తారక ధ్వనితో కలిసి హం సోం అనే రెండూ బీజాలను పట్టుకొని ఇడ పింగళ అనే కుడి ఎడమ ముక్కు రంధ్రాల ద్వారా సోం అన్నప్పుడు లోపలికి హం అన్నప్పుడు వెలుపలికి ఇలా ఉఛ్వాస నిశ్వాసలు దాదాపుగా రోజుకు 21,600 హంసలను ఇది నడిపిస్తూ ఉంటుంది. ఇది ఏ తత్త్వంతో సంబంధం లేకుండా ఏకో నారాయణుడై స్వయంగా బ్రహ్మజీవనంలో తన పనిని తాను చేసుకుంటూ ఉంటుంది. 5 అపానవాయువు ఇది గుద స్థానంలో ఉండి గర్భమంతా శోధించి ప్రాణవాయువుకు ఎదురుగా వెళ్లి మలబంధాలను తుడిచిపెట్టి అధో శ్వాసై వెళ్ళిపోతుంది. ఇందులో ప్రాణవాయువుకు సంబంధించి చర్చించుకున్న అంశంలో తారకం అనే పదం ఇదివరకు మనకు పరిచయం లేనిది కనుక ఒకసారి ఆ అంశాన్ని వివరంగా తెలుసుకుని శ్లోకాన్ని పరిశీలిద్దాం. మన మనోదృష్టికి మాత్రమే దర్శనమయ్యే శివస్వరూపమయమైన పరబ్రహ్మం మనలో పై నుండి తారక దీపమై ప్రకాశిస్తూ ఉంటుంది. ఆ పరబ్రహ్మన్ని దర్శించే ఆధ్యాత్మిక ప్రకియ తారకం. స్థిర సుఖ ఆసనంలో కూర్చొని వాయువేగాన్ని అధిగమించే మనస్సును నిలకడగా ఉంచి ఆ పరబ్రహ్మ జ్యోతి యందు మనస్సును ఏకాగ్రం చేస్తే పరమాత్మ సాక్షాత్కారం సిద్ధిస్తుంది. ఆ వెలుగే పరిపూర్ణ మోక్ష పదం. ఈ వెలుగును దర్శించమని చేసే ఉపదేశమే తారకోపదేశం. ఆ పరమాణు స్వరూప తేజస్సు నుండి కోటి భాను ప్రకాశం ఆవిర్భవించింది. దానియందే సమస్త సృష్టి పుడుతూ లయిస్తూ ఉంటుంది. ఈ సందర్భంగా తారక దీపమై

వెలుగొందుతున్న దివ్య జ్యోతి పరబ్రహ్మానికి ప్రణమిల్లుతూ శ్లోకాన్ని పరిశీలిద్దాం. మనం దృశ్య ప్రపంచంలో భౌతికంగా కనిపించే ప్రతి వస్తు విషయాదుల నుండి దృష్టిని మెల్లగా మరలించి చైతన్యరూపుడైన ద్రష్ట వైపుకు మళ్లించే ఏ కార్యమైనా పవిత్రతను సంతరించుకుంటుంది. ఇంద్రియాలను సంయమ స్థితిలో ఉంచడం యజ్ఞం కదా. ఈ సంయమించడానికి ఉపయోగపడే ప్రాణాయామం అనే యోగ సాధన కూడా యజ్ఞమే. మన దేహంలో జరిగే ప్రాణ సంచారాన్ని పూరకం రేచకం కుంభకం ప్రక్రియల ద్వారా క్రమబద్ధం చేయడం వల్ల ప్రాణ నిరోధం తద్వారా సంయమ స్థితి ఏర్పడటం వల్ల ప్రాణాయామం కూడా యజ్ఞం గానే పరిగణించాలి. మనోప్రాణాలు పరస్పరాధీనాలై ఉండటమే కాక సన్నిహిత సంబంధాన్ని కలిగి ఉంటాయి. ఈ ప్రాణాయామం అష్టాంగ యోగంలో నాలుగవది ప్రాణహః అంటే వాయువు లేదా శ్వాస, యమహః అంటే సంయమనం. ప్రాణాయామం అంటే ప్రాణాన్ని సక్రమంగా నియమించడం అని అర్థం. ఈ ప్రక్రియపై ఆసక్తి ఉన్నవారు ప్రాణాయామ పరాయణులు. ఈ ప్రాణాయామం మూడు విధాలుగా తెలుస్తుంది. ఒకటి పూరకం గాలిని పూరించడం అంటే లోపలికి పీల్చడం అంటారు. బాహ్యంలో ఉండే వాయువును శరీరంలో ప్రవేశపెట్టి నియమించేది పూరకం. 2 రేచకం అంటే గాలిని బయటికి విడవటం దీన్నే అపానం అంటారు. శరీరస్తమై ఉన్న వాయువును బాహ్యానికి విడచి నియమించేది రేచకం. మూడు ఈ రెండింటితో సంబంధం కలిగి ఉండేది కుంభకం. ఈ ప్రాణాపానాలు రెండూ జరగకుండా ఊపిరిని బంధించడం, నిలిపి ఉంచడం కుంభకం. ఈ కుంభకంలో రెండు విధాలు ఉంటాయి. ఒకటి అంతఃకుంభకం శక్తి మేరకు గాలిని లోనికి పీల్చి శ్వాస ప్రస్వాసలను నిరోధించడం. రెండు బాహ్య కుంభకం, శరీస్థ వాయువ్యాలను వెలుపలకు వదిలిపెట్టి తిరిగి లోపలికి రాకుండా నిరోధించడం. ఇది బాహ్య కుంభకం. ఈ అంశాన్ని అవగాహన చేసుకున్న దృష్టితో ప్రస్తుత శ్లోకంలోని అంశాన్ని సమన్వయం చేద్దాం. ఇందులో అపానం యందు ప్రాణాన్ని ప్రాణం నందు అపానాన్ని హోమం చేయడం జరుగుతుంది. అపానం యందు ప్రాణాన్ని హోమం చేయడం పూరకం, ప్రాణంలో అపానాన్ని హోమం చేయడం రేచకం. ఈ ప్రాణాపాన గతులను నిరోధించి ప్రాణాయామం చేయడం కుంభకం. ఇదే 'ప్రాణాపాన గతి రుద్ధ్వా' ఇలా పూరకంలో ప్రాణగతి నిరోధం రేచకంలో అపాన గతి నిరోధం కుంభకంలో ప్రాణాపాన గతుల నిరోధం జరుగుతుంది. కాబట్టి ప్రాణ సంచారం అనేది సహజంగా అందరిలోనూ జరుగుతూ ఉంటుంది. అయితే ప్రయత్నంతో ప్రాణాయామం చేస్తే తద్వారా మనసు సంయమిస్తుంది. ఈ క్రియకు ఈశ్వరార్పితం తోడైతే ప్రాణాయామం కూడా యజ్ఞమై అలరారుతుంది. లేకపోతే శరీర ప్రక్రియే అవుతుంది. కానీ యజ్ఞం కానేరదు. ఈ ప్రాణాయామ విద్యలన్నీ తెలిసినవారు సమగ్రంగా అధ్యయనం చేసిన వారు రావణబ్రహ్మ లాంటి వారంతా. వీరి మనస్సుకు ఏకాగ్రత నిశ్చలత బాగా తెలుసు. కాబట్టే కఠోర తపస్సు చేయగలిగారు. కానీ చిత్తశుద్ధి లేదు, ఈశ్వరార్పణ బుద్ధి లేదు. అందుకే అది యజ్ఞం కాలేదు. అందుకే మనం 4- 27వ శ్లోకంలోని ఆత్మసంయమ యోగాగ్ని యజ్ఞం మాత్రం వీరు చేయలేకపోయారని మనం చెప్పుకున్నాం. ఇది ఈశ్వరార్పణ పూరిత బ్రహ్మార్పణ యజ్ఞానికి అర్పణ భావం లేని క్రియకు తేడా. ఆ అర్పిత బుద్ధిలో ఉండే తేడాను మనం

గమనించాలి. అందుకే బ్రహ్మార్పణం అనే శ్లోకాన్ని ఆ మాటను సుదీర్ఘంగా చర్చించుకుని విభిన్న కోణాల్లో దర్శించి బ్రహ్మార్పణం గావించుకున్నాం. కాబట్టి ప్రాణాయామ యజ్ఞాన్ని ఈశ్వరార్పణ బుద్ధితో బ్రహ్మార్పణం గావించాలి.

4అ,30శ్లో.

అపరే నియతాహారాః ప్రాణాన్ ప్రాణేషు జుహ్వతి |
సర్వేఽప్యేతే యజ్ఞవిదో యజ్ఞక్షపితకల్మషాః ||

కొందరు నియమితాహార నిష్ఠితులై, ప్రాణాయామ పరాయణులైన వారు ప్రాణాపాన గమనములను నిలిపి, ప్రాణములను ప్రాణముల యందే హవనము చేయుదురు. యజ్ఞ విధులైన ఈసాధకులందరును యజ్ఞముల ద్వారా పాపములను రూపుమాపుదురు.

మనం చాలామంది ఆహారం తీసుకోవడం అనేది ఓ భౌతికమైన అవసరంగానే భావిస్తాం. కానీ అలా భావించకూడదు అని భగవంతుని చేరే మార్గం చూపే భగవద్గీత మాత్రం ఓ విభిన్నమైన వినూత్నమైన కోణంలో ఆహార నియమాన్ని కూడా యజ్ఞంగా అభివర్ణించడం విశేషం. మన ఆరోగ్యం అనేది మనం తీసుకునే ఆహారంపై ఆధారపడి ఉంటుంది. అంతేకాక మన వ్యవహారంపై కూడా ఆహారం ప్రభావం ఉంటుంది. అందుకే పెద్దలు ఆహారాన్ని బట్టే వ్యవహారం అంటారు. మనలోకి అంటే శరీరంలోకి వెళ్ళేది ఏదైనా ఆహారమే. అలా చూస్తే నోటితో తీసుకునేది మాత్రమే కాదు చెవుల ద్వారా వినిపించే శబ్దాహారం, చర్మం ద్వారా తెలిసే స్పర్శాహారం, కళ్ళకు కనిపించే అందం రంగు లాంటి రూపాహారం, నాలుక ద్వారా గ్రహించే రసాహారం, నాసికం ద్వారా తెలిసే గంధాహారం, ఇవన్నీ కూడా ఆహారాలే. ఈ అంశాన్ని 2-59లో సమగ్రంగా చర్చించాం. ఆ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ శ్లోకాన్ని పరిశీలించాలి. ఈ శబ్దాది విషయాలకు సంబంధించిన ఆహారాన్ని ఇంద్రియాలతో నియమించడం కూడా యజ్ఞం గానే భావించాలి. అలాగే మనం తీసుకునే గాలి నీరు కూడా ఆహారమే. బాహ్యంలోని నాసికం ద్వారా లోనికి వెళ్తుంది. ఈ ప్రాణవాయువు ఆహారాన్ని ప్రాణాయామం ద్వారా క్రమబద్ధం చేసే ప్రక్రియను యజ్ఞం గా భావించాం. ఈ నియమాన్ని ఆహారం విషయంలో కూడా పాటిస్తే ఆహార సేవనం కూడా యజ్ఞం గా శోభిస్తుంది. ఈ దృష్టితో ఇప్పుడు ఆహార యజ్ఞం చూద్దాం.

మనం తీసుకునే ఆహారంలోని స్థూలాంశం స్థూల దేహంగా పరిణమిస్తుంది. సూక్ష్మాంశం సూక్ష్మదేహంగా అంటే మనస్సుగా పరిణమిస్తుంది. ఆహారం తయారు చేసే విషయంలో కూడా మనం పాటించాల్సిన సూక్ష్మాలను మూడవ అధ్యాయం యజ్ఞ ప్రకరణంలో స్పష్టంగా చర్చించాం. ఇలా మనం చూస్తే ఆహారం ఆకలి తీర్చుకోవడమే అనే భావంతో భుజిస్తే అది శరీర అవసరం అవుతుందే కానీ యజ్ఞం కాదు. అలా కాక ఆరోగ్యంతో పాటు అవసరంతో పాటు అపారమైన భక్తి శ్రద్ధ ఆరాధన బ్రహ్మార్పణ భావన ఉన్నప్పుడే అది యజ్ఞం అవుతుంది. ఈ

దృష్టితో పరిశీలించి ఆహార యజ్ఞాన్ని ఆచరించాలి. ఇక్కడ నియత హారః అన్నారు జగద్గురువు. నియతం అంటే మితం లేదా పరిమితం అని అర్థం. ఆహారాన్ని మితంగా పరిమితంగా సముచితంగా స్వీకరించేవారు నియతాహారులు. ఆహారాన్ని మితంగా హితంగా సముచితంగా బ్రహ్మార్పణ భావంతో స్వీకరిస్తే అది జగద్గురువు పేర్కొన్నటువంటి నియతాహారః అవుతుంది. ఇక్కడ సముచితం అంటే ఉచితమైనది అంటే సాత్వికతతో కూడుకున్న ఆధ్యాత్మిక సాధనకు అర్హమైన శాఖాహారం అని అర్థం. సాధకులు ఆహారంలో రుచిని విస్మరించి ఔషధంగా స్వీకరించడం నేర్చుకోవాలి. ఈ సందర్భంగా మనం నిత్యం తీసుకునే అన్నపానాదుల ఆహార నియమాన్ని గమనిద్దాం. మన కడుపులో ఆహారానికి కేటాయించిన ఖాళీ ప్రదేశాన్ని నాలుగు భాగాలుగా విభజిస్తే అందులో రెండు భాగాల్ని ఆహారంతో నింపాలి. ఒక భాగం నీటితో నింపి మిగిలిన ఒక భాగాన్ని వాయువు సంచారానికి విడిచిపెట్టాలి. శరీర నిర్మాణ శాస్త్రం చెప్పేది కూడా ఇదే. అలా ఆహార నియమాన్ని పాటిస్తూ వివిధ కర్మలు యజ్ఞంగా భావించినట్లే ఈ ఆహార యజ్ఞాన్ని కూడా ఈశ్వరార్పణ బుద్ధితో యజ్ఞంగా రూపొందించుకోవాలి. మరో కోణంలో మనం చూస్తే 3 -14, 15లో ప్రాణి పుట్టుకకు కారణం ఆహారమేనని తెలుసుకొని ఆహారాన్ని దైవంగా నిరూపించుకున్నాం. ఒకటి ఆహారం పుట్టుక విశేషాలు, రెండు బ్రహ్మార్పణంతో కూడిన అర్హమైన సాత్వికమైన నియమిత ఆహారం. ఈ రెండు అంశాలను దృష్టిలో ఉంచుకొని మనం ఆహార స్వీకరణను యజ్ఞంగా భావించాలి. అలా పవిత్ర భావనతో స్వీకరించి శరీరానికి మనసుకు పవిత్రతను చేకూర్చాలి. ఇలా నియతాహారులైన సాధకులు ప్రాణాది వాయువులను ప్రాణాలయందే హోమం చేస్తారు. ఇక్కడ నియతాహారానికి ప్రాణాధి వాయువునకు సంబంధం ఏంటి అనే సందేహం కలిగే అవకాశం ఉంది. మనం నియమిత ఆహారంలో మన కడుపులోని ఖాళీ ప్రదేశాన్ని ఒక భాగం నీటికి చివరి మరో భాగాన్ని ప్రాణాదులకు విడిచిపెట్టడం ద్వారా ప్రాణాలు ప్రాణాలయందు హోమం చేయడం జరుగుతుంది. ఇదే ఇప్పటివరకు మనం చెప్పుకున్న 12 యజ్ఞాలను ఆచరించే యజ్ఞ విధులంతా కూడా యజ్ఞంతో యజ్ఞప్రభావం చేత సమస్త పాపాల నుండి విడివడిన వారు యజ్ఞక్షపిత కల్మషులు అవుతున్నారు.

4అ,31శ్లో.

యజ్ఞశిష్టామృతభుజో యాంతి బ్రహ్మ సనాతనమ్ |
నాయం లోకోఽస్త్యయజ్ఞస్య కుతోఽన్యః కురుసత్తమ | 31 |

ఓ అర్జునా! యజ్ఞ పూత శేషమైన అమృతమును అనుభవించు యోగులకు సనాతనుడును, పరబ్రహ్మమును ఆగు పరమాత్మ యొక్క లాభము కలుగును. యజ్ఞము చేయని వారికి ఈ మర్త్య లోకమే సుఖ ప్రదము కాదు. ఇంక పరలోక విషయము చెప్పనేల?

మనం బ్రహ్మార్పణం గావించాల్సిన విధానాన్ని 4- 24వ శ్లోకంలో సమగ్రంగా చూసాం. ఆ శ్లోకం పునాదిగా 1. దేవ యజ్ఞం, 2. బ్రహ్మయజ్ఞం, 3. శ్రోత్రాది ఇంద్రియాలు సంయమించడం, 4. శబ్దాది విషయాలను ఇంద్రియాలలో హోమం చేయడం, 5. సర్వ ఇంద్రియాలు వాటి కార్యాలు, 6. సర్వప్రాణాలు వాటి కార్యాలు వెరసి రెండింటిని ఆత్మ సంయమ యోగాగ్నిలో హోమం చేసే ఆత్మ సంయమ యోగాగ్ని యజ్ఞం, 7. ద్రవ్య యజ్ఞం, 8. తపోయజ్ఞం , 9. యోగ యజ్ఞం, 10. స్వాధ్యాయ యజ్ఞం దీనికి అనుబంధమైన జ్ఞాన యజ్ఞం, 11. ప్రాణాయామ యజ్ఞం, 12. నియమిత ఆహారం పాటిస్తూ ప్రాణాలను ప్రాణాలయందే హోమం చేసే యజ్ఞం.

ఇలా మొత్తం 12 యజ్ఞాలను పేర్కొని సమగ్రంగా చర్చించుకున్నాం. ఈ 12 యజ్ఞాల అవగాహనా దృష్టితో ఈ శ్లోకాన్ని పరిశీలించాలి. యజ్ఞంలో శేషించిన దాన్ని యజ్ఞశిష్టం అంటారు. ఈ విషయాన్ని 3-13లో యజ్ఞం శేషామృతాన్ని భుజించే శ్రేష్టులు సర్వపాపాలనుండి విముక్తులవుతారని తెలుసుకున్నాం. ఈశ్వరార్పితం, బ్రహ్మార్పితం గావించి శేషించిన దాన్ని భుజిస్తే అది అమృత ఆహారం. ఇలా జగద్గురువు పేర్కొన్న మొత్తం 12 యజ్ఞాలలో సాధారణ స్థాయి మనిషి ఆలోచించే హోమ గుండాలు, ఋత్వికుల మంత్రాలు, కృతహవిస్సులు కనిపించవు. అయితే మన భావనే సాధన యజ్ఞం గా పరిగణించడం ఈ యజ్ఞ శిష్టామృతాన్ని భుజించమని చెప్పడం ఓ అసాధారణ ఆధ్యాత్మిక అద్వైత సూత్రం. ఈ యజ్ఞాలను సక్రమంగా ఈశ్వరార్పణ బుద్ధితో నిర్వహిస్తే కాలక్రమంలో చిత్తశుద్ధి ఏర్పడి తద్వారా ఆత్మజ్ఞానం సంప్రాప్తిస్తుంది. ఆత్మే బ్రహ్మం కనుక సనాతనమైన బ్రహ్మాన్ని పొందడం జరుగుతుంది. అలా పొందిన జ్ఞాన ప్రాప్తి ద్వారా మోక్షసిద్ధి, ఇదే యజ్ఞ ఫలం. అయితే వీటిలో ఏ పద్ధతిని ఏ విధమైన యజ్ఞాన్ని ఆచరించని వారిని జగద్గురువు అయజ్ఞులుగా పేర్కొన్నారు. అలాంటి అయజ్ఞులకు దైవదృష్టి, ఈశ్వరార్పణ బుద్ధి లేని వారికి ఇహమే లేదు, ఇక పరలోక ప్రాప్తి ఎక్కడిది అని ప్రశ్నిస్తున్నాడు. ఇక అలాంటి వారిని గురించి 3-13 లో హయాగ్నులు పాపాన్నే భుజిస్తారని పంచభూతాత్మక దైవం ద్వారా సిద్ధించిన ఆహారాన్ని వారికి నివేదన చేయకుండా భుజించేవారు దొంగ అని 3-12 లో చూసాం. ఆ విషయాన్ని శ్లోకంలోని రెండవ పాదం సూచిస్తుంది. శ్రమ చేయని వారు సోమరులు ప్రగతిని సాధించలేరు కదా. అలా శ్రమ, సాధన చేయని చూసేది లోకం, కంటికి కనిపించేది లోకం కనిపించే చోటే నువ్వు అప్రయోజకుడిగా ఉంటే ఇక కనిపించని చోట ప్రగతి ఎలా సాధిస్తావు? అని జగద్గురువు హెచ్చరిస్తున్నాడు. శ్రమకు వెనుకాడే సోమరులకు ప్రగతి ఎలా సాధ్యం? ఈ భూలోకం కార్య లోకం కార్మిక లోకం అని 1-1లో అలాగే చాలా సందర్భాల్లో చెప్పుకున్నాం. అలా కర్మ చేసే ఈ శ్రేష్టమైన లోకంలో జన్మ తీసుకున్న శ్రేష్టుడా శ్రేష్టత్వం సంతరించుకునే అవకాశం ఉన్న ఓ మనిషి నీవు దైవం పై దృష్టిని నిలిపి చిత్తశుద్ధిని పొంది ఆ శ్రేష్టత ద్వారా ఆత్మ జ్ఞానం సంప్రాప్తించుకొని బ్రహ్మత్వాన్ని సిద్ధింప చేసుకో అని ఈ కురు భూమి పై జన్మ తీసుకున్న మనందరికీ పిలుపునిస్తూ అందుకు తగిన అత్యున్నతమైన మార్గాలను 12 యజ్ఞాల ద్వారా మనకు సూచించిన జగద్గురువుకు ప్రణమిల్లుదాం.

4అ,32శ్లో.

ఏవం బహువిధా యజ్ఞా వితతా బ్రహ్మణో ముఖే |
కర్మజాన్ విద్ధి తాన్ సర్వాన్ ఏవం జ్ఞాత్వా విమోక్ష్యసే | 32 |

ఈ ప్రకారముగనే ఇంకను బహువిధములైన యజ్ఞములు వేదములలో విస్తృతముగా వివరింపబడినవి. ఈ యజ్ఞములన్నింటిని త్రికరణశుద్ధిగా ఆచరించినప్పుడే అవి సుసంపన్నములగునని తెలుసుకొనుము. ఇట్లు ఈ కర్మ తత్త్వమును తెలుసుకొని, అనుష్టించుటవలన నీవు ప్రాపంచిక (కర్మ) బంధముల నుండి సర్వదా విముక్తుడవయ్యెదవు.

ముందు శ్లోకానికి కొనసాగింపు భాగంగా ఈ శ్లోకాన్ని గమనించాలి. మనం 2-45లో వేదాల ఆవిర్భావ వివరాలను గురించి ఆమూలాగ్రంగా చర్చించాం. ఆ అవగాహనతో ఈ శ్లోకాన్ని చూడాలి. ఈ 12 విజ్ఞాన విధాలన్నీ కూడా మనకు వేదాల్లో ఉన్నాయి వేదాల ఉపనిషత్తుల సారమే కదా భగవద్గీత అందుకే ఈ ప్రకారంగా మనం చర్చించుకున్న యజ్ఞాల వివరాలన్నీ కూడా సవిస్తారంగా అందులో ఉన్నాయనే అంశాన్ని జగద్గురువు ఇక్కడ మనకు స్పష్టంగా సూచిస్తున్నాడు. ఈ యజ్ఞ విధానాలన్నీ కూడా వేదప్రోక్తాలు, ప్రమాణాలు. ఈ విధంగా జగద్గురువు బోధిస్తున్న బహు విధాలైన యజ్ఞలన్నీ కూడా సృష్టి ఆరంభంలోనే సృష్టికర్త అంటే బ్రహ్మ ముఖం ద్వారా వివరించడం జరిగింది. ఇవన్నీ కూడా వేద జనితాలే అనే విషయం సుస్పష్టం, పైగా మనం వేదాన్ని పూర్వభాగం, ఉత్తరభాగం అని రెండు విధాలుగా తెలుసుకున్నాం. అందులో ప్రారంభంలోనే అని చెప్పారు కాబట్టి పూర్వభాగంలోనే ఈ యజ్ఞాల విశేషాలు విస్తారంగా ఉన్నాయని ఈ శ్లోకార్థం. ఇప్పటివరకు మనం నేర్చుకున్న 12 రకాల యజ్ఞాలు వాటన్నింటినీ కూడా కర్మజాలుగా తెలుసుకో అంటున్నారు. కర్మజాలు అంటే కర్మ సంబంధమైనవి, ప్రయత్నంతో కూడుకున్నవి అని అర్థం. కర్మలనుండి జన్మించినవి కాయక కర్మలు, వాచక కర్మలు, మానస కర్మలు అని అర్థం. ఇలా కర్మల నుండే యజ్ఞాలన్నీ ఆవిర్భవిస్తున్నాయి కనుక ఇవి కర్మజాలు అన్నారు. ఇవి మోక్ష సాధనమైన జ్ఞానాన్ని పొందడానికి కావాల్సిన అంతఃకరణ శుద్ధిని, చిత్తశుద్ధిని ప్రసాదిస్తాయి. ఈ కర్మజాలైన యజ్ఞాలు ఆత్మ జ్ఞానానికి సహకరిస్తాయి. ఇవి యత్నశీలురులకే గాని సోమరులకు కాదు.ఇలా మనం తెలుసుకొని ఆచరిస్తే విముక్తులవుతాము, దేని నుండి అంటే అజ్ఞానపు అంధకార మత్తు నుండి. 18వ శ్లోకము నుండి ఇంతవరకును భగవంతునిచే వివరింపబడిన కర్మల తత్త్వమును చక్కగా తెలుసుకుని వాటిని అనుసరించి యజ్ఞముల నాచరించువాడు కర్మబంధముల నుండి ముక్తుడగును. ఏలనన ఈ తత్త్వమును గ్రహించి కర్మల నాచరించు పురుషుని కర్మలు బంధహేతువులు కావు. పైగా పూర్వ సంచిత కర్మలను నశింపజేసి ముక్తిదాయకములగును.

4అ,33శ్లో.

శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః పరంతప |
సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే | 33 |

ఓ పరంతపా! అర్జునా! ద్రవ్యమయ యజ్ఞము కంటెను జ్ఞాన యజ్ఞం మిక్కిలి శ్రేష్టమైనది. కర్మలన్నియును జ్ఞానమునందే పరి సమాప్తమగును.

ద్రవ్యమయ యజ్ఞాదులన్నీ కూడా చిత్తశుద్ధిని ప్రసాదిస్తుందని మనం తెలుసుకున్నాం. ఆ విషయాన్ని ఇక్కడ ప్రస్తావిస్తూ ఈ ద్రవ్యమయ యజ్ఞాదులన్నిటికంటే సాక్షాత్తు జ్ఞాన యజ్ఞం మోక్ష సాధనంగా శోభిస్తుందని స్పష్టంగా చాలా సూటిగా ఈ శ్లోకంలో మన ముందు ఉంచారు. ఇప్పటివరకు మనకు 12 యజ్ఞాల గురించి బోధించినటువంటి జగద్గురువు 31వ శ్లోకంలో యజ్ఞ శేషమైన అమృతాన్ని భుజిస్తే నిత్యమైన సనాతనమైన బ్రహ్మాన్ని పొందుతామని తెలుసుకొని 32లో ఈ విధంగా బహువిధాలైన యజ్ఞాలు వేదంలో సవివరంగా ఉన్నాయి అవన్నీ కర్మవల్లే పుట్టాయని తెలుసుకోవాలి అని చెప్పిన జగద్గురువు ఇక్కడ ఈ 12 యజ్ఞాల కంటే జ్ఞాన యజ్ఞం శ్రేష్టమైనదని సూటిగా చాలా స్పష్టంగా మనం ముందు ఉంచాడు. ఇదే జ్ఞానం యొక్క శ్రేష్టత్వం. జ్ఞానం యొక్క స్వరూప స్వభావం చూశాం ఈ ద్రవ్య యజ్ఞాదులన్నీ కూడా కర్మ ప్రధానమైనవి సాధనా సాధ్యరూపమైనవి. మంత్ర తంత్ర యంత్ర క్రియాది శ్రమల చేత చేసే కర్మ యజ్ఞాలే ద్రవ్యమయాదులు. అయితే జ్ఞాన ప్రాప్తిలో ఈ సర్వ కర్మలన్నీ కూడా విలీనం అవుతున్నాయి. ఈ యజ్ఞల్ని ఫలాసక్తితో ఆచరిస్తే అనిత్య ఫలాలను అందిస్తాయి. కానీ అవే యజ్ఞాలను ఫలాకాంక్ష లేకుండా అంతఃకరణ శుద్ధికై ఆచరిస్తే వారి వారి సామర్థ్యాన్ని అర్హతను బట్టి జ్ఞానోత్పాదనకు సహకరిస్తాయి. శక్తి ఉన్నప్పుడే సృష్టి జరుగుతుంది కర్మ జరిగినప్పుడే జ్ఞానం ఉదయిస్తుంది అనే సూత్రం 4 -24 లో చెప్పుకున్నాం. జ్ఞానమే సర్వకర్మల పరాకాష్ట. అందుకని ఈ శ్లోకం సాధన సాధ్యరూపమైన కర్మ యజ్ఞల కంటే మోక్ష సిద్దే ప్రసిద్ధిగా కలిగిన జ్ఞాన యజ్ఞం పవిత్రమని ప్రశస్తమని మోక్ష సాధనంగా శోభిస్తుందని మనకు తెలుస్తోంది. యజ్ఞం అంటే ఏది తెలుసుకోవాలో అది తెలుసుకోవడం అని, ఇదివరకే చర్చించుకున్నాం. నదీ ప్రవాహం సాగి సాగి సముద్రాన్ని చేరగానే దానంతట అదే ఆగిపోతుంది. నది సాగరంలో విలీనమైన తరువాత ఇక ప్రవాహం ఉండదు. అలా శుభ కర్మలు సమస్త జ్ఞానంలో పరిసమాప్తమవుతున్నాయి. ఖిలం అంటే శూన్యము నిచ్చునది. ఇక్కడ కిలం అంటే శేషం లేనిది. కానీ అఖిలం అంటున్నారు ఇంకా సంపూర్ణంగా పూర్తి శూన్యం అంటే మహా పరిశూన్యమని చెప్పవచ్చు. సర్వకర్మలు ఫలాలతో సహా నిశ్శేషంగా విశేషంగా విలీనమై మన కర్మల జాబితా మహాపరి శూన్యం అవుతుందని అర్థం. నదులు సాగరంలో అంతర్భాగమైనట్లు సర్వకర్మలు 4-19 లో చెప్పుకున్నట్లు జ్ఞానంలో విలీనం అవుతాయి. సర్వ కర్మలు చిత్తశుద్ధితో జ్ఞానస్థితికి చేరినప్పుడు సంపూర్ణ ఆధ్యాత్మిక స్థాయికి చేరుకోగలం. దీన్ని బట్టి సర్వకర్మల అంతిమ లక్ష్యం జ్ఞానమే అనే శ్రేష్టతను మనం గమనించాలి. 24 లో ప్రారంభమైన యజ్ఞ

ప్రకరణం ఈ 33 వ శ్లోకంతో అన్నింటికంటే జ్ఞాన యజ్ఞం శ్రేష్ఠమైనదని నిర్ణయించి ప్రకటిస్తూ ఈ అధ్యాయంలోని యజ్ఞ ప్రకారణాన్ని ఈ శ్లోకం పరిసమాప్తి చేస్తోంది.

4అ,34శ్లో.

తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా |
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః ||

నీవు తత్త్వమును దర్శించిన జ్ఞానుల కడతేగి ఆ జ్ఞానమును గ్రహింపుము. వారికి దండ ప్రణామము లాచరించుటవలనను, సేవ లొనర్చుట వలనను, కపటము లేకుండా భక్తిశ్రద్ధలతో సముచిత రీతిలో ప్రశ్నించుట వలనను పరమాత్మ తత్త్వమును చక్కగా నెఱింగిన జ్ఞానులు సంప్రీతులై, నీకు ఆ పరమాత్మ తత్త్వ జ్ఞానమును ఉపదేశించెదరు.

ముందు శ్లోకంలో 12 యజ్ఞాల కంటే జ్ఞాన యజ్ఞమే శ్రేష్టమని నిర్ణయించి ప్రకటించిన జగద్గురువు జ్ఞానం పొందే మార్గాన్ని ఈ శ్లోకంలో సూచిస్తున్నారు. మనం 2-7లో జ్ఞాన సముపార్జనకు స్వాధ్యాయ జ్ఞాన యజ్ఞం, సద్గురు ఆశ్రయం, రెండు మార్గాలని చెప్పుకున్నాం. ఆ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ శ్లోకాన్ని పరిశీలించాలి. మొదటి మార్గాన్ని 4-28 లో చూసాం. ఈ రెండవ మార్గం గురించి ఈ శ్లోకం స్పష్టం చేస్తుంది. యధార్థతత్త్వం తెలిసిన జ్ఞానులు తత్త్వదర్శినులు చాలా అరుదుగా ఉంటారు. భగవద్గీత సృష్టికర్త యొక్క సిద్ధాంతాన్ని గురుపరంపర వారసత్వాన్ని అంటే భగవంతుని గీతా తత్త్వాన్ని దర్శించిన తత్త్వవిదుల జ్ఞానుల దగ్గరే ఆధ్యాత్మిక విద్యను అభ్యసించాలి. తత్త్వదర్శనం ప్రధానం కాని ఇతర భౌతిక అంశాలతో సామాజిక భేదాల దృష్టితో చూడకూడదు. గీతా భావాన్ని గీతా మూలాన్ని జగద్గురు పరంపర వారసత్వాన్ని తెలుసుకొని ఉండాలి. సృష్టికర్త ఆంతర్యాన్ని దర్శించి ఉండాలి. ఆ దర్శించిన దాన్ని వింటున్న వారి స్థాయికి వెళ్లి వారిలోనూ తననే దర్శించి తనతో సమానంగా భావించి గురు శిష్యులు వేరు కాదు ఒకరికొకరు ఎక్కువ తక్కువ కాదు అనే సమ భావనతో వారికి అర్థమయ్యే రీతిలో విధితమయ్యే విధంగా బ్రహ్మ విద్యా బోధన గావించే సమర్థత తాత్త్విక దృష్టి దార్శనికత ఉన్న సద్గురువు దగ్గర గీతాభ్యాసం గావించాలి, ఆధ్యాత్మిక విద్యను అభ్యసించాలి. మనం శ్రేష్టుల గురించి 3-20, 21 లో చూసాం. మనం మన స్వీయ చైతన్యంతో మన బుద్ధితో ఆలోచిస్తే మనం సద్గురువును దర్శించవచ్చు. పాలసముద్రంలో తోడు వేస్తే పెరుగు సముద్రం అవుతుందని మౌఢ్యంగా వెళ్లకుండా సద్గురువును, సత్తుతో సంగమిస్తున్న సద్గురువును గుర్తించి జగద్గురువు సూచిస్తున్న విధంగా జ్ఞాన సముపార్జన గావించాలి. ఇందుకు కావలసిన ఉపకారణాలన్నీ మనం 2,3 అధ్యాయాలలో చూసాం. 2-42 లో పుష్పితాం వాచం మాట్లాడేవారు, 2-44 లో

భోగైశ్వర్యాల మోజుతో కామ్యకర్మలను ప్రోత్సహించేవారు, 3-6 లో జగద్గురువు చెప్పిన మిధ్యాచార్యులు, డాంబికులు మొదలైన వారిని మౌఢ్యంగా అనుసరించడం వల్ల తమ తమ పతనానికి తామే కారుకులవుతారని తెలుసుకున్నాం. ఇవన్నీ మనం చూశాక గురువు అంటే ఎవరు అనే ప్రశ్నను మన లోపలికి మనం సంధిస్తే మన అంతరాత్మ నుండి సమాధానం పొందగలం. మనలోని జీవశక్తిని గుర్తించి నువ్వు ఈ మార్గంలో వెళ్తే ప్రకాశించగలవు నీలో ఉన్న జీవశక్తి ఇది నాయనా అని చెప్పి నడిపించేవారు గురువు. ఆధ్యాత్మిక మార్గానికి తగిన దిశా నిర్దేశం చేయగలిగిన వారు గురువు. ఆత్మిక అనుభూతిని దర్శింపజేయగలిగిన వారు గురువు. వెలుగుతున్న దీపమే మరో దీపాన్ని వెలిగించగలదు. అలా తత్త్వదర్శి మాత్రమే మరో తత్త్వదర్శిని తయారు చేయగలరు. కాబట్టి అలాంటి తత్త్వదర్శి లోని జ్ఞాన దీపం మాత్రమే శిష్యుని హృదయ ప్రమిదలో జ్ఞాన దీపాన్ని వెలిగించగలదు. అలా కాకపోతే జగద్గురు చెప్పిన మిద్యాచారి లేదా డాంబికుల్ని చేరితే వారు మరో మిద్యాచార్యుని డాంబికుల్ని తయారుచేస్తారు. కనుక తగిన జాగురూకత అవసరం. అలా తత్త్వదర్శి అయిన సద్గురువు బోధించిన అంశాన్ని జ్ఞానాన్ని విద్యార్థి తన హృదయంలో నిక్షిప్తం చేసుకోవాలి. జ్ఞాన సముపార్జన విషయంలో స్పష్టతను కలిగి ఉండాలి. అలాంటి సద్గురువులను, శ్రేష్ఠులను చేరి, ఒకటి ప్రణిపాతేనా అంటున్నారు జగద్గురువు. ప్రణిపాతం అంటే దీర్ఘ నమస్కారం. ప్రణిపాతేన సద్గురువుకు సాష్టాంగ నమస్కారం ఆచరించాలి అని అర్థం. అయితే ఇక్కడ ఈ నమస్కారం కేవలం దేహ ప్రక్రియ కాదు, అర్పిత భావన, బ్రహ్మార్పణ భావన. భక్తిశ్రద్ధలు లేకుండా మనలోని మిద్యాహంకారాలను తొలగించుకోకుండా కేవలం దేహాన్ని పూర్తిగా కింద సాష్టాంగంగా పడుకోబెట్టి నమస్కరించడం వల్ల ప్రయోజనం లేదు. మనకున్న ప్రాపంచిక భౌతిక అంశాలతో పాండిత్యం గొప్ప కీర్తి, ప్రతిష్టలతో అధికారం లాంటి వాటితో సంబంధం లేకుండా వినయ విధేయతలతో జ్ఞాన సముపార్జన ఆధ్యాత్మిక పురోభివృద్ధి దృష్టితో సద్గురువుకు నమస్కరించాలి. ఇక్కడ ప్రణీపాతేన అనే మాటకు సరైన అర్థం చూస్తే నిపాతం అంటే పూర్తిగా పడుట ప్రణిధి అంటే ప్రార్ధన అభివాదం అనే అర్థాలు ఉన్నాయి. కానీ మరింత లోతుల్లోకి వెళ్లి చూస్తే మనం తత్త్వదర్శి దృష్టితో దర్శిస్తే నేను ఎరుగదగిన వస్తువు వీరి యందు ధరించగలను నీ దీని భావం ఆంతర్యం. ఈ భావం, ఆంతర్యం తీసుకుంటే మనకు సరిగ్గా సరిపోతుంది. శిష్యుడు ఎరుగదగినది ఏదైతే ఉందో అది వీరి యందు అంటే తత్త్వదర్శి అయిన సద్గురువు ద్వారా ధరించగలను, పొందగలను అనే భావన ప్రధానం. ఈ భావనతో సాష్టాంగ నమస్కారం గావించాలి. అప్పుడే బ్రహ్మార్పణంలో అర్పిత భావన ఎంత ప్రధానమో ఇక్కడ కూడా అంతే. దేహాన్ని మాత్రమే సాష్టాంగంగా పడుకోబెట్టి లేదా పూర్తిగా శరీరాన్ని పడుకోబెట్టి చేసే నమస్కారం కాకుండా ఈ ఎరుగదగిన దాన్ని వీరి ద్వారా నేను ధరించగలను, ధరించడమే ధర్మం కదా ఆ ధార్మిక దృష్టిని ధర్మచక్షువును వీరి ద్వారా పొందగలను అనే భావనతో ప్రణిపాతం చేస్తే అది ప్రణిపాతేనా ఈ భావన ఉంటే చాలు దేహం మొత్తం సాష్టాంగంగా నమస్కరించకపోయినా ఫర్వాలేదు. ఇక్కడ మనం నమస్కరిస్తున్నది ఎవరికి అనే అంశంపై కూడా మనకు అంటే విద్యార్థికి తగిన అవగాహన ఉండాలి. సప్త ధాతువులతో కూడుకున్న దేహానికో, రూపానికో కాదు కదా. పరమానంద స్వరూపులు వాక్కుకు అతీతమైన జ్ఞానానికి మాత్రమే గోచరమయ్యే తన

అజ్ఞానాన్ని తొలగించే జ్ఞానాగ్నికి ఆ పరబ్రహ్మస్వరూపానికే గాని పంచభూతాత్మక దేహానికి కాదు అనే ఆంతర్యం తెలియాలి. ఈ భావన తత్త్వదర్శి అయిన సద్గురువులో సహజంగానే ఉంటుంది. విద్యార్థిలో కూడా నెమ్మదిగా ఈ భావనను పుణికి పుచ్చుకోవాలి. ఇదే ప్రణిపాతేనా తరువాత పరి ప్రశ్న. మనం చర్చించిన విధంగా ప్రణిపాతం చేసి శరణాగతుడైన విద్యార్థికి గురువు శాస్త్రాన్ని బోధిస్తూ జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. విద్యార్థి బంధం ఎలా కలుగుతోంది ఎలా మనిషి బంధనాల్లో చిక్కుకుంటున్నాడు విద్య అంటే ఏది అవిద్య అంటే ఏది మనిషి అంటే ఏంటి మనిషి పుట్టుకకు కారణం ఏంటి ఇలాంటి ఆధ్యాత్మిక పురోభివృద్ధికి తోడ్పడే ప్రశ్నలను సద్గురువును ప్రశ్నించి తెలుసుకోవాలి. అలాగే అర్థరహితమైనవి కాకుండా అర్థవంతమైన ప్రశ్నలనే అడిగి తెలుసుకోవాలి. అర్జునుడు సద్గురువును ప్రశ్నలు సంధిస్తున్న విధానం మనం చూస్తూనే ఉన్నాం. ప్రశ్న వేస్తున్నది కూడా జ్ఞానానికే. ఆ జ్ఞానాన్నే మనం ప్రశ్నిస్తున్నాం అనే స్పృహ ఉంటే ఇక దాదాపుగా భౌతిక దృష్టి పటాపంచలవుతుంది. అలా సంశయాలకు తావు లేకుండా సందేహాలను అర్జునుడిలా సంధిస్తూ జ్ఞాన సమూపార్జన దిశగా ముందుకెళ్లాలి. ఈ పరి ప్రశ్న నుండి వెలసినవే మనం చదువుకుంటున్న భారతం, భగవద్గీత గ్రంథాలన్నీ కూడా. వివేక చూడామణి అలాంటిదే. ఉపనిషత్తులు అలాంటివే. ఆయా ప్రశ్నలకు తత్త్వదర్శి బోధించే సమాధానాలే అవన్నీ కూడా. ఈ పద్ధతిలో సద్గురు శిష్యుల విద్యా బోధనా విద్యార్జన కొనసాగాలి.

మూడవది సద్గురు సేవ. సద్గురువును సవినయంగా సేవించి జ్ఞాన సముపార్జన గావించాలి. అలా శరణాగతి, సేవ లేకుండానే గురువును ప్రశ్నిస్తే అవి నిష్ప్రయోజనాలై శక్తి హీనమవుతుందని పెద్దలు చెబుతారు. సేవ అనేది చాలా పవిత్రమైన కార్యం, ఇది చాలా విశాలమైనది నిస్వార్థంగా త్యాగపూరితంగా హృదయ స్పందనతో జరిగే అతి సున్నితమైన సూక్ష్మాతి సూక్ష్మమైన కార్యం సేవ. సృష్టిలో మౌనంగా కదులుతున్న సేవను మనం గమనిస్తే పంచభూతాలన్నీ మనకు చేస్తున్నది సేవే కదా. సూర్యుడు, గాలి, నీరు, భూమి ఇవన్నీ మనకు ఎంత సేవ చేస్తున్నాయి. వీటి ముందు మనం చేస్తున్నాం అదీ ప్రకృతి సహకారంతో చేస్తూ నేను చేస్తున్నాను అనుకుంటున్న సేవ ఏపాటిదో ఆలోచిద్దాం. అయితే సేవలో ఓ కృతజ్ఞతా భావం నిండుకొని ఉంటుంది. మన జీవితం సేవతో మిళితమైనది. సేవ నుంచి మానవ జీవితాన్ని వేరు చేయలేము. సేవను మరచి సేవను వీడి మానవ జీవన మనుగడ క్షణం కూడా కొనసాగదు. అన్నీ నావే నేనే చేస్తున్నాననే అహంకరిస్తూ ఘీంకరించే వారిని మనం చేయగలిగింది ఏమీ లేదు. ఎవరు అంగీకరించినా అంగీకరించకపోయినా భూమిపై ఉన్న ప్రతి ప్రాణి ప్రకృతి సేవను పొందుతున్న మాట సత్యం. ప్రతి ప్రాణి ఏదో ఒక రూపంలో సేవిస్తూ సేవలు పొందుతూ జీవనాన్ని కొనసాగించాలి. సేవ అనేది మన జీవితం నుంచి అవిభాజ్యమైన అనుబంధం గలది. చాలా మంది నేను ఎవరినుంచి ఆశించను, నేను ఎవరిపై ఇప్పటివరకు ఆధారపడలేదు, నేనే అందరికీ అన్నీ చేస్తుంటాను అని భ్రమిస్తూ ఉంటారు. పుట్టినప్పటినుంచి తల్లిదండ్రుల నుంచి మొదలుకొని చాలామంది దగ్గర సేవలు పొందాము కదా. ప్రతిరోజు పనిమనిషితో కావచ్చు పాలవారితో కావచ్చు లేదా మనం నడిచే రోడ్లు ఊడ్చే వారితో కావచ్చు నిత్యం ప్రత్యక్షంగా పరోక్షంగా మనం సేవలు అందుకోవడం అందించడం అనివార్యం. కాబట్టి ఆయా దశలలో ఆయా

పరిస్థితులలో తగిన సేవలు పొందుతాం, అందిస్తాం. మనిషి శాశ్వతం కానీ సేవ అజరామరం. ఈ ప్రపంచం అనేది ఒక ఆదాన, ప్రధాన చాలా అని చెప్పవచ్చు. ఆదానం అంటే పొందడం, ప్రధానం అంటే మనం మరొకరికి ఇవ్వడం. అలాగే అన్ని విధాల సేవలకు ఆధారమైన ఆశ్రయమైన దేహానికి కూడా అనుక్షణం సేవ చేస్తూనే ఉంటాం. కాబట్టి సేవ అనే మాట చాలా విస్తృతమైనది, చర్చకు అతీతమైనది. మచ్చుకు మనం సేవ అనే మాటను పరిచయం చేసుకున్నందుకు నిరాటంకంగా కొనసాగే అవిభాజ్య అద్వితీయమైన సేవకు ఈ సందర్భంగా ప్రణామాలు. ఈ ఆంతర్యాన్ని మనం దృష్టిలో ఉంచుకొని ఈ సేవా భావాన్ని మనలో పెంపొందించుకోవడమే సద్గురువును సేవించడమంటే. ఇక్కడ సద్గురువు అందించే జ్ఞానాన్ని తదేక దృష్టితో ఆమూలాగ్రంగా అర్థం చేసుకొని శ్రద్ధా భక్తులతో తాను కూడా తత్త్వదర్శిగా తానూ ఒక ప్రకాశంగా ఎదగడమే గురువుకు చేసే సేవ. అదే శుశ్రూష, అదే సద్గురు సంకల్పం కూడా. ఇదే పవిత్రమైన గురు సేవ. గురువు వెలిగించిన జ్ఞాన దీపం మనలో దేదీప్యమానంగా ప్రకాశించేటట్లు మనం ఎదగగలిగితే అదే మనం సద్గురువుకు చేసే పవిత్రమైన గురు సేవ. ఉదాహరణకు రామకృష్ణుల వారి జ్ఞాన దీపమైన వివేకానందుని ప్రకాశం మనకు తెలియనిది కాదు అదే గురు సేవ. సద్గురువు ద్వారా అందుకున్న జ్ఞానాన్ని వెలుగును సద్గురువు అనంతరం కూడా ప్రపంచానికి వెలుగును అందివ్వగలగాలి. ఇదే నిత్య సత్యమైన గురు సేవ. వెతకి వెతకి తరచి తరచి తెలుసుకోవాల్సింది తనలోనే ఉంది అందుకు తనలోని తత్త్వాన్ని దర్శించి వెలిగించే ఏకైక గురువు చాలు. విశ్వంలోని చీకటిని పారద్రోలడానికి ఒక ఆదిత్యుడు చాలు. అలా మన జ్ఞాన దీపం వెలిగించగల ఒక సద్గురువు చాలు మనం ప్రకాశించడానికి. తాను బోధిస్తున్న పదా వాక్యాల ఆంతర్యాన్ని తగిన ప్రమాణాలతో ధార్మిక దృష్టితో బోధించి శిష్యుడి బుద్ధిని వికసింప జేసేవారు సద్గురువు. నాయనా నువ్వు ఎలా ఆలోచించాలి, నీ ప్రవర్తన ఎలా ఉండాలి అని మనలోని జీవశక్తిని గుర్తించి నువ్వు ఈ మార్గంలో వెళితే దేదీప్యమానంగా ప్రకాశించగలవు బిడ్డా నీలో జీవశక్తిని ప్రకాశాన్ని ఇలా అభివృద్ధి చేసుకో, జీవితమంటే ఇది నాయనా అని చెప్పి తన శక్తిని శిష్యుని జీవశక్తితో మమేకం చేసి తనలో కలుపుకోగలిగిన తత్త్వం సద్గురువుది. అందుకే గురు శిష్యులది విడదీయరాని అవిభాజ్యమైన దాంపత్యం అని మనం అనేక సందర్భాల్లో చర్చించాం. ఇలా మనం ఎరుగదగినది వీరి ద్వారా ధరించగలం పొందగలం అనే భావనతో

నమస్కరించడం, లోకహితాన్ని ఆత్మోద్ధరణం గావించే విధంగా ప్రశ్నించడం అవిభాజ్యమైన సేవను సేవా తత్త్వాన్ని దర్శించడం. ఈ దృష్టితో తత్త్వదర్శి అయిన సద్గురువును చేరి ఆత్మదీపాన్ని వెలిగించుకుందాం.

4అ,35శ్లో.

యద్ జ్ఞాత్వా న పునర్మోహమ్ ఏవం యాస్యసి పాండవ |
యేన భూతాన్యశేషేణ ద్రక్ష్యస్యాత్మన్యతో మయి ||

ఓ అర్జునా! ఈ తత్త్వజ్ఞానము నెఱింగినచో మరల ఇట్టి వ్యామోహములో చిక్కుకొనవు. ఈ జ్ఞాన ప్రభావముతో సమస్త ప్రాణులను నీలో సంపూర్ణముగా చూడగలవు. పిమ్మట సచ్చిదానంద ఘన పరమాత్ముడనైన నాలో చూడగలవు.

ఇక్కడ మోహం అన్నారు, మనం ఈ అంశాన్ని 2-16 లోనే సమగ్రంగా చూసాం. ఉన్నది లేనట్లు లేని దాన్ని ఉన్నట్లు చూడటమే మోహం. దీనికి కారణమైన ఆవరణ, విక్షేపాల గురించి కూడా ఆమూలాగ్రంగా చర్చించాం. ఆ అన్నీ అంశాల పట్ల అవగాహన దృష్టితో ఉన్నది ఉన్నట్లుగా లేనిది లేనట్లుగా గ్రహించాలి. మనం నివసించే ప్రపంచం రాకపోకల కూడలి కదా, జా అంటే జనించడం, గతి అంటే గతించడం అందుకే ఇది జగత్తు అయింది. కాబట్టి ఈ కూడలిలో ఉన్న మనకు వాస్తవిక దృష్టి కోణం అలవాడాల్సిన అవసరం ఉంది. అజ్ఞానం పోతే రాదు, జ్ఞానం వస్తే పోదు. జ్ఞానోదయం జరిగితే అజ్ఞానం తానంతట అదే తప్పుకుంటుంది. అందుకే జగద్గురువు నీవు పొందాల్సిన జ్ఞానం పొందాక తిరిగి మోహం పొందవు అని అంటున్నాడు. అందుకే జ్ఞానం శాశ్వతం మారేది దేహం, మారనిది నిత్యమైనది జ్ఞానం, ఆత్మ. నీవు మారే దేహానివా? నిత్య సత్యమైన, సనాతనమైన శాశ్వత ఆత్మవా? నీవు కర్తవా?, భోక్తవా?, వీటికీ అతీతమైన సాక్షిగా? ఇవన్నీ జగద్గురువు ఉపదేశంతో మనలో మధనం జరిగి నిత్య సత్యమైన జ్ఞానం ప్రకాశితం కావాలి, తత్త్వ దర్శినులం కావాలి. ఈ తత్త్వ దర్శి అనే మాటను ముందు శ్లోకంలో సమగ్రంగా చర్చించాం. ఆ దృష్టితో ఈ శ్లోకాన్ని పరిశీలన చేయాలి. వైశ్వానర, స్వప్న, సుషుప్తి ఈ మూడు అవస్థలకు అతీతమైన ఆత్మ స్థితిని చూసాం. అలాగే దృక్ దృశ్య వివేకం చూశాం. జ్ఞాతృ, జ్ఞానం, జ్ఞేయం మూడింటి యందు ఉన్నదంతా ఆత్మ చైతన్యమే అనే విషయాన్ని చర్చించుకున్నాం. ఈ అవగాహన ఉన్నప్పుడు సర్వభూతాలను తనలోనే దర్శిస్తారు. అలాగే సర్వభూతాలలోనూ తననే చూస్తారు. మనం ఇప్పటివరకు నాలుగు అధ్యాయాలుగా 47, 72, 43, 35 మొత్తం 197 శ్లోకాల్లో విభిన్న కోణాల్లో దర్శించిన సమస్త అంశాలను దృష్టిలో ఉంచుకొని ఈ శ్లోకాన్ని సమన్వయం చేసుకుంటే సరిపోతుంది.

నాయనా జ్ఞానం కలిగితే తిరిగి మొహం దరికి రాదు. జ్ఞానంతో సర్వ ప్రాణులను నీలోనూ, నీ యందు నన్ను దర్శించగలవు నాయనా, ఆ పరబ్రహ్మ జ్ఞానం నిర్మలం, నిర్వికల్పం, నిస్సీమం, ఎల్లలు లేనిది, నిస్పందనం,

నిశ్చలం, అద్వితీయం, అఖండం, అనంతరం, అజరామరం అదే మనలోని అంతరాత్మ. అక్కడ ఆ అంతరాత్మలో సుస్థిరంగా నిలిచి పొందేది ఆత్మ జ్ఞానం. అట్టి జ్ఞానాన్ని దార్శనిక శక్తి కలిగిన తత్త్వవిదుల, తత్త్వదర్శినుల కడకేగి జ్ఞానాన్ని పొందు అంటూ మనకు ఉద్బోధిస్తున్న జగద్గురువుకు ప్రణమిల్లుదాం.

4అ, 36,37శ్లో.

అపి చేదసి పాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః |
సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సంతరిష్యసి ||

ఒకవేళ నీవు పాపాత్ములందరి కంటే మహాపాపి అయినా కూడా జ్ఞానమనే నౌక సహాయంతో పాప సముద్రం నుండి నిస్సందేహంగా దాటగలవు.

మహా పాపాత్ముడైనా జ్ఞానం అనే నౌకతో పాప రహితుడై తరించిపోగలడనే అంశాన్ని ఈ శ్లోకం స్పష్టంగా వివరిస్తుంది. మనం ముందే చెప్పుకున్న సంచిత, ప్రారబ్ధ, ఆగామి ఈ మూడింటితో కూడుకున్న కర్మల రాశిని అయినా కూడా జ్ఞానం అనే నౌక అవలీలగా దాటించగలదు. ఇప్పటికే మనం ఆత్మే బ్రహ్మం, జీవుడే దేవుడు, దేహమే దేవాలయం, తత్త్వమసి లాంటి ఉపనిషత్ వాక్యాల జ్ఞానాన్ని జ్ఞానం స్వరూప స్వభావాలను ఆమూలాగ్రంగా చర్చించాం. ఆజ్ఞాన నౌక చేత మహా పాపి కూడా అవలీలగా పాపపు సముద్రాన్ని దాటే అవకాశం ఉందనే సత్యాన్ని ఈ శ్లోకం ఉద్బోదిస్తుంది. ఈ భావానికి కొనసాగింపుగా ఆత్మజ్ఞానం పాపాన్ని ఎలా నశింపజేస్తుందో ఉపమగా తరువాత శ్లోకంలో వివరిస్తున్నారు. ఈ భావానికి అనుగుణంగా ఆ శ్లోకం కూడా ఇక్కడే చూడాల్సిన అవసరం ఉంది.

37వ శ్లోకం.

యథైధాంసి సమిఽద్ధోగ్నిః భస్మసాత్కురుతేర్జున |
జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా ||

ఓ అర్జునా! ప్రజ్వలించుచున్న అగ్ని సమిధలను భస్మముచేసినట్లు జ్ఞానమను అగ్ని కర్మల నన్నింటిని భస్మమొనరించును.

ఇక్కడ ప్రారబ్ధాధీనమైన దేహం కార్యరూపంలో కనిపిస్తుంది. కాబట్టి దానికి కారణమైన అజ్ఞానం కూడా ఉంటుంది కదా అనే సందేహం సాధారణ స్థాయి మనిషికి కలిగే అవకాశం ఉంది. కార్యం ఉన్నంత మాత్రాన కారణం మిగిలి ఉండాలనే నియమం ఉండదు. జ్ఞానోదయం అనంతరం జ్ఞాని సర్వవ్యాపక అఖండంగా శోభిస్తుంటాడు. ఎలా అంటే ఎండమావిలో నీరు ఉన్నట్లు మనకు కనిపిస్తుంది. ఇందులో నీరు కార్యం, ఎండమావి కారణం అయితే ఈ వాస్తవాన్ని గ్రహిస్తే ఎండమావికి సంబంధించిన జ్ఞానం మనకు ఉదయిస్తే అది ఎడారే గాని ఎండమావి కాదని తెలిసిపోతుంది. కానీ అప్పుడు కూడా ఎండమావిలో నీరుగానే కనిపించిన అనిపించినా సత్య దర్శనంలో దానికి కారణమైన ఎండమావి మాత్రం నిరస్తమయ్యింది. కార్యం కనిపిస్తున్నా కారణం లేనిదే అయింది కదా. అలా ప్రారబ్ధాధీనంగా జ్ఞాని శరీరం మనకు కనిపిస్తున్నా దేహానికి కారణమైన అజ్ఞానం మాత్రం లేనిదే అవుతుంది. నా ఆత్మ జ్ఞానం ఉదయించాక సర్వకర్మలకి దగ్ధమైపోతాయి. అలా కట్టెలన్నీ కాలిపోయాక భస్మమే మిగులుతుంది. అదే విభూతి, అఖండ అద్వయ అనుభూతి స్వరూపం ఇది జ్ఞాన వైభవం. ఈ శ్లోకం ఉపమ శ్లోకం కనుక ఈ అంశానికి మరో ఉదాహరణ అవసరం లేకపోయినా మనం అర్థం చేసుకోవడానికి మనకు మనం సమన్వయం చేసుకొని చూద్దాం. మనం ఓ మట్టి ప్రమిదలో వెలిగించిన దీపాన్ని ఉదాహరించుకుందాం. ఆ దీపశిఖ, ఆ దీపకళిక స్థిరంగా ఊర్ధ్వ ముఖంగా వెలుగుతూ ఉంది. ఆ దీపం భౌతికానికే సంబంధించినది అయినా ఆ దీపశిఖ మాత్రం సదా అలౌకికాన్ని స్పర్శిస్తూనే మనకు స్ఫురింపజేస్తూనే వెలుగుతూ ఉంటుంది. మనిషి ప్రజ్ఞ కూడా ఈ దీపశిఖ వంటిది. మానవ శరీరం భౌతికత్వం లో సుఖంగా సర్దుకుని తృప్తితో ఉన్నట్లు అనిపిస్తూ ఉంటుంది కానీ ఆ శరీరం లోపల ఉన్న మరొకటి ఏదో శరీరాన్ని అధిగమించి సాగేందుకు సదా తీవ్రమైన కృషి చేస్తూనే ఉంటుంది. ఈ ప్రజ్ఞే ఈ నర్తిస్తున్న దీపశిఖే మానవుని ప్రాణం. అనంతంగా ఊర్ధ్వముఖంగా కొనసాగుతూ ఉండాలన్న తీవ్ర సంకల్పమే మానవుడి ఆత్మ. దీపశిఖ కాంతినిస్తూనే ధూమాన్ని వెలువరిస్తూ ఉంటుంది. అలా ఆత్మకు నిలయమైన దేహం కూడా కొంత ఆవరణతో కలిసి ఉంటుంది. అంతరంగంలో ఆ దివ్య జ్యోతి వెలుగుతూ ఉన్నందువల్లే మానవుడు మానవుడిగా ఉంటున్నాడు. అందుకే మనం వెలిగించని దీపం లాంటివాడు మనిషి తనకు తానుగా వెలుగొందే వాడు మనిషి అని చెప్పుకున్నాం. అది లోపిస్తే మనిషి ఒక బంక మట్టి ముద్దే. ఈ అంతర్జ్యోతి తీవ్రంగా జ్వలిస్తూ వెలుగుతున్నప్పుడు ఉనికిలో ఓ పరివర్తన వస్తుంది. ఈ జ్యోతి ఓ మంట లాగా ఎగిసినప్పుడు ఈ బంకమట్టి సైతం తనను తాను అధిగమించవచ్చు. మనిషి ఓ దీపపు ప్రమిద, అతడిలో బంకమట్టి ఉంటుంది. దానితోపాటు అక్కడ ఓ వెలుగు కూడా ఉంది. బంకమట్టిలోనే కొనసాగుతున్నంతవరకు మానవుడి జీవితం వృధాయే అవుతుంది. వెలుగును గురించిన శ్రద్ధ కూడా మనిషికి ఉండి తీరాలి. ఆ వెలుగును గురించిన ఎరుకే సర్వస్వాన్ని

పరివర్తింపజేస్తుంది. కారణం మనిషికి భౌతికంలో దైవాన్ని దర్శించే వీలును అది కలిగిస్తుంది. కాబట్టి ఈ శ్లోకంలోని అంశాన్ని లోతుల్లోకి వెళ్లి అర్థం చేసుకొని ఆత్మజ్ఞాన సముపార్జన గావించే దిశగా అడుగులు వేద్దాం. మనం కూడా ఈ బంక మట్టి లాంటి మానవదేహపు ప్రమిదలో వెలుగుతూ ఉన్నటువంటి ఆ జ్ఞానజ్యోతిని గమనించి, ఆ దివ్య జ్యోతి వైపుగా మన ఆలోచనా దిశలు కొనసాగితే ఆ జ్ఞాన నౌకతో సర్వకర్మలు భస్మమవుతాయని తెలుసుకుందాం.

4అ, 38శ్లో.

న హి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే |
తత్స్వయం యోగసంసిద్ధః కాలేనాత్మని విందతి ||

ప్రపంచమున జ్ఞానముతో సమానముగ పవిత్రమైనది మరియొకటి లేనేలేదు. శుద్ధాంతః కరణముగల సాధకుడు బహుకాలమువరకు కర్మయోగాచరణము చేసి, ఆత్మయందు అదే జ్ఞానమును తనంతటతానే పొందగలడు.

ముందు శ్లోకంలో సర్వపాపాలను జ్ఞానం అనేటటువంటి నౌక దాటిస్తుంది, అలాగే ప్రజ్వలిస్తున్న అగ్ని సమిధల్ని భస్మం చేసినట్లు జ్ఞానం అనే అగ్ని కర్మలన్నింటినీ భస్మం చేస్తుందని తెలుసుకున్నాం. ఇక్కడ జ్ఞానంతో సమానమైనది పావనం చేయగలిగేది, శుద్ధి చేసేది ఈ లోకంలో మరొకటి లేదు అని స్పష్టం చేస్తున్నారు. ఆ జ్ఞానం ముముక్షులకు కర్మయోగం వల్ల, సమాధి యోగం వల్ల సంస్కరింపబడి యోగ్యతను పొంది కాలక్రమంలో తమలోనే పొందుతారు. ఆత్మ జ్ఞానానికి సాటి ఏదీ లేదని విజ్ఞానానికి జ్ఞానమే సాటి అని ఈ శ్లోకం స్పష్టం చేస్తుంది. ఆత్మజ్ఞాన సిద్ధి పొందాలంటే అంతఃకరణ శుద్ధి ఉండాలి. స్థూల దేహాన్ని, వస్తువుల్ని శుద్ధి చేయడానికి సాధనాలు ఉంటాయి. అలాగే చిత్తశుద్ధికి అవసరమైన కర్మయోగ సాధన అని మనం చాలా సుదీర్ఘంగా చర్చించుకున్నాం. అంతేగాక దాదాపు పది శ్లోకాలలో 12 యజ్ఞాలను పేర్కొని యజ్ఞశిష్టామృతాన్ని భుజించి చిత్తశుద్ధిని గావించుకోమని పిలుపునిచ్చాడు. ఈ శ్లోకంలో జ్ఞానంతో సమానమైనది, పవిత్రమైనది ఇక వేరే లేదని చాలా స్పష్టంగా నిరూపిస్తున్నాడు. యజ్ఞ యాగాది కర్మలు పాపాల్ని పోగొట్టగలవని అశ్వమేధ యాగం చేస్తే అన్నీ పాతకాలు తొలగుతాయని శాస్త్రం చెప్పినా అవి పాపాలను ప్రక్షాళన చేయగలవేమోగానీ చిత్తశుద్ధిని ప్రసాదించలేవు కదా. తిరిగి మళ్లీ పాపాల వైపు వెళ్లే పయనాన్ని ఆపలేవు కదా. కాబట్టి ఎన్నిసార్లు గంగలో మునిగి పోగొట్టుకున్నా తిరిగి రాకుండా మాత్రం నివారించలేవు కదా. ఇలా మనం సున్నితమైన ఆధ్యాత్మిక అంశాల్ని గమనించి ఆలోచిస్తే మనకు కర్మయోగాచరణే శరణ్యమని తెలుస్తుంది. మనం ముందు శ్లోకాల్లో

చెప్పుకున్నట్లు కర్మలను కర్తృత్వ బుద్ధి లేకుండా ఆచరిస్తూ కర్మఫలాన్ని భోక్తృత్వ భావన లేకుండా ప్రసాదంగా స్వీకరిస్తూ, కర్మను పూజగా, యజ్ఞంగా నిర్వహిస్తూ ముందుకెళ్లాలి. అప్పుడు చిత్తశుద్ధి కలిగిన జ్ఞానాన్ని పొందవచ్చు. అలాంటి జ్ఞానంతో సమానంగా తులతూగ గలిగినవి, పవిత్రమైనవి మరొకటి లేదు ఉండదు. ఇప్పుడు మనం చిత్తశుద్ధిని గావించే సాధనాలు గమనిస్తే ఈ చిత్తశుద్ధిని గావించే సాధనాలు మార్గాలు కొన్ని దేహాన్ని శుద్ధి చేస్తాయి, కొన్ని ఇంద్రియాల్ని శుద్ధి చేస్తాయి, కొన్ని ప్రాణాన్ని శుద్ధి చేస్తాయి, మరికొన్ని చిత్తాన్ని శుద్ధి చేస్తాయి. కానీ జ్ఞానం, జ్ఞానయజ్ఞం మనిషి సర్వకర్మల్ని భస్మం చేసి మనిషినే ఆమాంతం శుద్ధి చేస్తుంది. అందుకే జ్ఞానంతో సమానమైంది, పవిత్రమైనది మరొకటి లేదు.మనం ఏమిటో మనకు తెలిసేట్లు చేసేది జ్ఞానం. ఇక్కడ కర్మయోగం ద్వారా చిత్తశుద్ధిని పొంది జ్ఞానానికి అర్హతను సంపాదించిన వారు స్వయం యోగ సంసిద్ధులు. బహిరంగ సాధ్యమైన కర్మయోగం, అంతరంగ సాధనమైన తపోధ్యానాదులు మొదలైన వాటి ద్వారా చిత్తశుద్ధిని, చిత్తనైశ్చల్యాన్ని సాధించి జ్ఞానం పొందడానికి యోగ్యతను సంపాదించుకున్న వారు యోగ సంసిద్ధులు. అలాంటివారు కాలక్రమంలో తత్త్వ దర్శినులు అయిన సద్గురువు ప్రబోధించే జ్ఞానాన్ని అందుకొని తరించి సిద్ధులు, జ్ఞాన సిద్ధులు అవుతారు. ఎక్కడ ఎలా పొందుతారు అంటే తరచి తరచి చివరకు పొందాల్సింది తనలోనే, తన బుద్ధిలోనే పొందుతారు. ఆ జ్ఞానం తన బుద్ధిలోనే వికసిస్తుంది, ప్రకాశిస్తుంది. ఎప్పుడు అంటే ఆ సమయం ఆసన్నమైనప్పుడు ఆ మాటనే ఇక్కడ జగద్గురువు 'కాలేనా' కాలక్రమంలో అన్నారు. అలా మనం కూడా చిత్తశుద్ధి గావించుకొని యోగ సంసిద్ధిని పొంది పవిత్రమైన జ్ఞానమార్గంలో పైనుంచి స్వయంగా ఆత్మ జ్ఞాన సిద్ధిని మనలోనే సంప్రాప్తింప చేసుకుందాం.

4అ,39శ్లో.

శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరః సంయతేంద్రియః |
జ్ఞానం లబ్ధ్వా పరామ్ శాంతిమ్ అచిరేణాధిగచ్ఛతి ||

జితేంద్రియుడు, సాధన పరాయణుడు శ్రద్ధాళువైన మనుజునకు ఈ భగవతత్త్వ జ్ఞానము లభించును. ఆ జ్ఞానము కలిగిన వెంటనే (ఏమాత్రము విలంబము లేకుండ) అతడు భగవతత్త్వ రూపమైన పరమ శాంతిని పొందును.

ముందు శ్లోకంలో జ్ఞానంతో సమానమైనది పవిత్రమైనది ఈ లోకంలో మరొకటి లేదు దాన్ని నీవు యోగ సంసిద్ధుడవై కాలక్రమంలో నీలోనే పొందుతావు అని చెప్పిన జగద్గురువు ఎలా జ్ఞానం నిశ్చయంగా కలుగుతుందో

ఆ ఉపాయాన్ని ఈ శ్లోకంలో ఉపదేశిస్తున్నారు. మనం 34వ శ్లోకంలో చర్చించిన ప్రణిపాతేనా, పరిప్రశ్న, సేవ ఈ మూడు కాకుండా ప్రధానంగా జ్ఞానికి ఉండాల్సిన మరో మూడు లక్షణాలను ఈ శ్లోకంలో వివరిస్తున్నారు. ఒకటి శ్రద్ధను కలిగి ఉండటం. రెండు తదేక నిష్ఠాపరులుగా ఉండటం. మూడు సంయతేంద్రియః ఇంద్రియాలను సంయమించిన వారై ఉండటం.

ఒకటి శ్రద్ధ, శ్రద్ధ గలవారే జ్ఞానం పొందగలరు. ఏ కార్యమైనా అపారమైన శ్రద్ధా భక్తులు ఉన్నప్పుడే సత్ఫలితాన్ని చేకూరుస్తాయి. సద్గురువు పట్ల దైవం పట్ల, శాస్త్రం పట్ల అధికమైనటువంటి శ్రద్ధ అవసరం. అందుకే శ్రద్ధ కలవాడిగా ఉండాలి. సద్గురువు బోధిస్తున్న శృతి వాక్యముల యందు అంటే వినదగిన అంశాల యందు అని అర్థం. సద్గురువు బోధించే వినదగినటువంటి సత్యత్త్వ బుద్ధిని కలిగి ఉండటమే శ్రద్ధ. అట్టి శ్రద్ధ కలవారు మాత్రమే శ్రద్ధావంతులు. జ్ఞానాన్ని పొందే శాస్త్రాన్ని అధ్యయనం చేస్తున్నప్పుడు తగిన శ్రద్ధాసక్తులు లేకపోతే జ్ఞానం సంప్రాప్తించదు కదా. అందువల్ల అపారమైన శ్రద్ధ పరమ ఆసక్తి కలిగి ఉండాల్సిన అవసరం జ్ఞానిది. రెండు తత్పరత్వం, తదేక నిష్ఠ గలవారు. అభిమత వస్తువునకు అధీనమైనవాడు అని అర్థం. అభిమత వస్తువు నందు మనసు నిలపగలిగిన వాడు. తాను శ్రద్ధ పెట్టాలనుకున్న అంశంపై నిరంతరం తదేక నిష్ఠతో మనసును నిలుపగలిగినంతగా తనను తాను ఆధీనంలో ఉంచుకోగలిగినవాడు. మూడు జ్ఞాన ప్రాప్తికి ఉండాల్సినటువంటి మూడవ లక్షణం ఇంద్రియ నిగ్రహం. ఇంద్రియాలన్నీ విషయాల వైపు నుండి తన దృష్టిని జ్ఞానం పొందే దిశగా మరల్చడమే ఇంద్రియ నిగ్రహం. మనసు ఇంద్రియాల ద్వారా బాహ్య ప్రపంచం వైపు పరుగులెత్తితే ఆంతరంగిక పరివర్తనం జరగదు కదా అవి అంతఃర్ముఖత్వం కానప్పుడు జ్ఞాన సముపార్జన కొనసాగదు కాబట్టి జ్ఞానం పొందాలంటే సర్వ ఇంద్రియాలు జ్ఞాత వైపుకు మరల్చినప్పుడే సాధ్యమవుతుంది. అందుకే ఇంద్రియాలు అనిత్య విషయాల వెంట పరుగులెత్తకూడదు. మనం రెండు మూడు నాలుగు అధ్యాయాల్లో చర్చించిన విధంగా మనో బుధ్యాది అంతఃకరణాల్ని సంయమించి దర్శి వైపుకు దృష్టిని మరల్చినప్పుడు సంయతేంద్రియుడు అవుతాడు. సామాన్య నిగ్రహం సరిపోదు సంపూర్ణంగా ఇంద్రియాల్ని సంయమించిన స్థితిని పొందాలని సద్గురువు సంయతేంద్రియః అంటున్నారు. ఈ విధంగా జ్ఞానం పట్ల, సద్గురువు పట్ల అపారమైన శ్రద్ధతో తదేక నిష్ఠా తత్పరతతో సంయతేంద్రియులైనప్పుడు జ్ఞానం పొందగలరు. అలా పొందిన జ్ఞానం ద్వారా మాత్రమే పరమ శాంతిని శీఘ్రంగా వెనువెంటనే పొందగలరు. దీన్ని బట్టి శ్రద్ధ తత్పరత ఇంద్రియజయం జ్ఞానలబ్ధికి ప్రధానమైనటువంటి ఉపకరణాలు. జ్ఞాని ఈ లక్షణాలను పుణికి పుచ్చుకొని ఈ ఉపాయంతో ఆత్మజ్ఞానం పొంది శీఘ్రంగా పరమ శాంతిని పొందగలరు.

4అ, 40శ్లో.

అజ్ఞశ్చాశ్రద్ధధానశ్చ సంశయాత్మా వినశ్యతి ।
నాయం లోకోఽస్తిన పరో న సుఖం సంశయాత్మనః | 40 |

అవివేకియు, శ్రద్ధారహితుడును అయిన సంశయాత్ముడు పరమార్థ విషయమున ఆవశ్యము భ్రష్టుడే యగును. అట్టి సంశయాత్మునకు ఈ లోకమునందు గాని, పరలోకమునందు గాని ఎట్టి సుఖమూ ఉండదు.

ముందు శ్లోకంలో శ్రద్ధ గలవారు, తత్పరులు ఇంద్రియ విజయులైన జితేంద్రియలు జ్ఞానం పొంది త్వరలోనే పరమ శాంతిని పొందుతారు అన్న జగద్గురువు అలా లేకపోతే వారికి ఇహలోకంలో గాని పరలోకంలో గాని సుఖశాంతులు లేదు అంటూ మూడు నిషిద్ధ అంశాల్ని సూచిస్తున్నాడు, అంటే ఇవి చేయకూడనివి. ముందు శ్లోకంలో ఆచరణీయమైనటువంటి ఉపాయాలు విధానాలు ఉద్బోధించాడు. అలా ఆచరణీయమైనటువంటి అంశాలను ఆచరించి పరమ శాంతిని పొందే విధానాన్ని తెలుసుకున్నాం. ఇక్కడ అలా ఉండకపోతే 4-17వ శ్లోకం ప్రకారం మనం కర్మ అకర్మ వికర్మ గురించి సమగ్రంగా చర్చించాం. 4-31 లో యజ్ఞ శేషామృతాన్ని భుజించేవారు నిత్యమైన సనాతనమైన బ్రహ్మాన్నే పొందుతున్నారు. ఏ యజ్ఞములను ఆచరించని వారికి ఇహ,పర లోకాలు లేవు అని అక్కడ చూశాం. అలాగే అది పాపం కూడా అని 3-13 లో తెలుసుకున్నాం. అలాంటివారు దొంగలని 3-12 లో సెలవిచ్చారు జగద్గురువు. ఈ అంశాలన్నింటి దృష్ట్యా ఈ శ్లోకం పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఇందులో సద్గురువు పేర్కొన్న నిషిద్ధ అంశాలు మూడు. అందులో ఒకటి అజ్ఞానం. రెండు అశ్రద్ధ గలవారు, అశ్రద్ధా పరులు. మూడు సంశయం కలవారు.

ఒకటి జ్ఞానం లేని వారు ఆత్మజ్ఞానం లేని వారు అనాత్మజులు అని అర్థం. దీనికి కారణం ఆత్మానాత్మ వివేకం లేకపోవడం. వివేకం లోపించడం నేరం కాదు అయితే వివేకానికి ప్రయత్నించకపోవడం నేరం, దోషం. ఇక్కడ మరో అంశం కూడా మనం గుర్తించాలి. ఔషధం పేరు ఉచ్చరించినంత మాత్రాన కూడా రోగం నయం కాదు, మందులు తాగినప్పుడే ఉపశమనం లభిస్తుంది. అదే విధంగా బ్రహ్మ సాక్షాత్కారము లభించినప్పుడే భౌతిక బంధనాల నుంచి విముక్తులు అవుతాము. మనం పరమాత్మలో విలీనమై ఐక్యమయ్యే అనుభూతి చెందకుండా కేవలం అహం బ్రహ్మాస్మి అని శబ్దోచ్చారణ చేయడం వల్ల అహం బ్రహ్మాస్మి అనుభవంలోకి రాదు కదా. కాబట్టి ఆత్మజ్ఞానం అనే దివ్య ఔషధంతోనే అజ్ఞానాన్ని తొలగించుకోవాలి. రెండు శ్రద్ధ లేనివాడు, శ్రద్ధ లేని వారు దైవం పై దృష్టిని

ఎలా నిలపగలరు. పరమార్థ తత్త్వాన్ని ఎలా అనుభూతించగలరు. వారికి లౌకిక విషయాలే వాస్తవాలుగా కనిపిస్తుంటాయి, అనిపిస్తుంటాయి. వారు కలనే నిజం అని భ్రమిస్తూ ఉంటారు. నశించే దేహాదుల్ని వారు శాశ్వతం అనుకుంటారు. కాబట్టి దేహాదులతో పాటు అలా భ్రమించే అశ్రద్ధా పరులు కూడా నశించి పోవడం జరుగుతుంది. అందుకే ఇది రెండవ నిషిద్ధమైనటువంటి అంశం. మూడు సంశయాత్ముడు. ఎప్పుడూ వీరికి అనుమానమే. వీరు సందేహాల పుట్ట వీరికి సందేహం రావడానికి కారణం 2-16 లో చర్చించినట్లు ఉన్నది ఉన్నట్లు లేనిది లేనట్లు తెలియకపోవడం. 2-24 లోని సత్తుతో స్థిరీకృతం కాకపోవడం. ఏది సత్యమో ఏది అసత్యమో తెలియక సత్యాసత్య వివేకం లోపించడం. వీరిని సంశయచిత్తులు అంటారు. వీరికి ప్రతి విషయంలోనూ అస్పష్టత, అయోమయం. తద్వారా జీవితమే ఓ గందరగోళం. అయోమయంగా అస్పష్టంగా తయారవుతుంది. వీరి వ్యవహారం కూడా అలాగే ఉంటుంది. ఈ సందేహం వల్ల ఉన్నది ఉన్నట్లు తెలియకపోగా, లేనిదాన్ని కూడా ఉన్నట్లు చూడటం వల్ల వీరు ఆవరణ, విక్షేప దోషాలు కలిగి ఉంటారు. ఆ కారణంగా అజ్ఞాని అశ్రద్ధదానుడు నశించినట్లే సంశయాత్ముడు కూడా అస్పష్టతతో నశిస్తాడు. కాబట్టి ఈ మూడు నిషిద్ధాంశాల్ని గమనించి సన్మార్గంలో నడవకపోతే అలాంటి వారికి ఈ లోకం లేదు, పరలోకమూ లేదు, సుఖమూ లేదు.

4అ,41శ్లో.

యోగసన్న్యస్తకర్మాణం జ్ఞానసంఛిన్నసంశయమ్ |
ఆత్మవంతం న కర్మాణి నిబధ్నంతి ధనంజయ | 41 |

ఓ ధనంజయా! (ఓఅర్జునా!) విధిపూర్వకముగా కర్మలను ఆచరించుచు, కర్మఫలములను అన్నింటిని భగవదర్పణము చేయుచు, వివేకము ద్వారా సంశయములన్నింటిని తొలగించుకొనుచు, అంతఃకరణమును వశమునందుంచుకొనిన వానిని కర్మలు బంధింప జాలవు.

అర్జునా కర్మలను యోగంచే సన్యసించిన వారు జ్ఞానం ద్వారా సంశయాలను ఛేదించిన వారు ఆత్మ నిష్టులు అయిన జ్ఞానుల్ని కర్మలు బంధించడానికి వీలులేదు. ఆత్మజ్ఞానం కలిగితే సంశయాలు సమూలంగా నశిస్తాయి. అలా సంశయాన్ని నివృత్తి చేసుకోగలిగితే వారు జ్ఞాన సంచిన్న సంశయులు. వారే జ్ఞాన యోగులు ఆత్మజ్ఞానయోగులు. నేను అనే ఆలోచనా మూలాన్ని అన్వేషించడం ప్రారంభిస్తే మన అభిప్రాయం మారిపోతుంది. భౌతిక ఆలోచన రహిత స్థితి ఆత్మానుభవాన్ని కలిగిస్తుంది. స్వస్థితిలో స్థిరంగా ఉంటే భయానికి సంశయానికి

అవకాశం ఉండదు. స్వస్థితిని వీడితేనే భయము సంశయము. మనకంటే భిన్నంగా బాహ్యంలో ఏదో ఉంది అనుకున్నప్పుడే మనల్ని భయం, సంశయం ఆవహిస్తుంది. మనలో కోరికలు ఆందోళన అలజడి లాంటి అవలక్షణాలు ఉంటేనే భయాలు సంశయాలు అనిపిస్తాయి. ఈ అవలక్షణాలన్నీ కూడా అహం చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటాయి. కుండలోని నీరు ఎంతో పెద్దదైనటువంటి సూర్యుడిని తన పరిధిలోనే ప్రతిబింబింప చేస్తుంది కదా. అలాగే హృదయం నుంచి వచ్చే విశ్వవ్యాప్తము, అనంతము అయిన ఆ చైతన్యపు కాంతిని మనిషి మనసులోని వాసనలు ప్రతిబింబింప చేయడానికి ఒక మాధ్యమం అవుతాయి. ఈ ప్రతిబింబాల యొక్క రూపాన్నే మనసు అంటాము. ఆ ప్రతిబింబాన్ని చూసి మనిషి తాను అపరిమితుడనని, జీవుడని అజ్ఞానినని కేవలం మానవుడని భ్రమిస్తుంటాడు. లేదా అహంకారాన్ని ప్రకటించుకుంటూ ఉంటాడు. మనసును స్వాధీనం చేసుకోవడం అనేది ఆధ్యాత్మిక సాధకులకు మాత్రమే సంబంధించిన ప్రత్యేకమైన సమస్య కాదు ప్రతి మనిషికి వారి వారి జీవితాలలో వృత్తులలో అభివృద్ధి చెందడానికి అది అవసరం. సంశయాలతో కూడుకున్న తన మనసును పరిశుద్ధం చేసి తన స్వాధీనంలో ఉంచుకోలేని వ్యక్తి గాని అటువంటి వ్యక్తులతో నిండిన సమాజం కానీ అభివృద్ధి చెందలేదు కదా. కాబట్టి ఖచ్చితంగా ప్రతి మనిషి మనసు తత్త్వాన్ని తెలుసుకొని సంశయాన్ని వీడి దాన్ని స్వాధీన పరచుకోవాలి. బంధానికైనా మోక్షానికైనా కారణం మనసే, అందుకే జగద్గురువు అజ్ఞానులు అశ్రద్ధాపరులు సంశయాత్ములు నశిస్తారని ప్రత్యేకించి ముందు శ్లోకంలో స్పష్టం చేశారు. కర్మ యోగానుష్టానం వల్ల అశుద్ధి క్షయమై జ్ఞానం కలిగి సంశయ ఛేదనం చేసిన వారిని కర్మలు బంధించవు అని దీని అర్థం. అంటే సర్వకర్మలు జ్ఞానాగ్నిలో దగ్ధమైన కారణంగా జ్ఞానకర్మానుష్టాన విషయంలో సంశయాన్ని ఛేదించినవారు జ్ఞాననిష్టులు బ్రహ్మనిష్టులుగా విరాజిల్లుతారు. ఈ విధంగా కర్మఫలాల నుండి విడివడినవారు సర్వసంశయ విముక్తులు, ఆత్మవిధులు ఇలాంటి అశరీరులకు తన నుండి జరిగే కర్మలన్నింటినీ సాక్షిగా గమనిస్తూ ఉండడం వల్ల గుణాలు గుణాలలో ఇంద్రియాలు ఇంద్రియాలలో ప్రవర్తిల్లుతూ ఉంటాయని విధితమవుతుంది. కాబట్టి ఆత్మవిధులు దేహ సంబంధమైన సహజ కర్మలు గాని లోక సంగ్రహార్థం చేసే దైవ నియమిత కర్మలు గాని వీరిని బంధించవు. 4-18 ప్రకారం కర్మలో అకర్మను దర్శిస్తుండడం వల్ల తత్సంబంధమైన కర్మ ఫలాలు వారిని బంధించవు. కారణం అందించడానికి కర్త లేకపోవడమే. 2-39 నుండి కర్మ ప్రకరణం మూడవ అధ్యాయంలో కర్మయోగ వైశిష్ట్యం మనం చూశాం. అలాగే ఈ అధ్యాయంలో 23వ శ్లోకం వరకు చర్చించిన అంశాల ఆధారంగా ఈ శ్లోకాన్ని సమన్వయం చేసుకుంటే మరింత స్పష్టంగా మనకు ఈ అంశం అనుభవైకవేద్యం అవుతుంది. అప్పుడు అన్నింటి అంతరార్థాన్ని గ్రహించిన వారు సంశయాలను ఛేదించి మనసును వశం చేసుకున్నవారు యావత్తు

జ్ఞానాన్ని తనలో పదిలపరచుకున్నవారు సకల వస్తువుల యదార్థ నైజాన్ని సర్వ వేళలా అవగతం చేసుకున్న వారు అయినటువంటి తత్త్వదర్శిని కర్మలు బంధించవు అనే అంశాలు ఆచరణీయం అవుతాయి.

4వ అధ్యాయం, అవలోకనం-1.

మన గీతా అధ్యయనం విషాద యోగంతో ప్రారంభమైంది అందులో విషాదాన్ని అందుకు కారణమైన అజ్ఞానాన్ని మొదటి అధ్యాయంలో గుర్తించాం. రెండవ అధ్యాయంలో వాటికి సంబంధించిన పాఠ్యాంశాల్ని సూత్రాలను సేకరించిన బ్రాహ్మీ స్థితికి చేరాల్సిన విధానాన్ని అందుకు కావాల్సిన ఉపకరణాలను తెలుసుకున్నాం. మూడవ అధ్యాయంలో మనం ఏర్పాటు చేసుకున్న ఉపకరణాలతో ఆయా సూత్రాలకు అనుగుణంగా ఆచరణ గావించడం అమలు పరిచాం. ఆ ఆచరణలో మధ్యలో కలిగే సందేహాలను సంధిస్తూ సంపూర్ణంగా జ్ఞాన సముపార్జన గావిస్తూ గీతా చరణను గీతా ఆచరణ ద్వారా వ్యక్తి ఉద్ధరణ, తద్వారా లోకోద్ధరణ గావించాల్సిన విధానాన్ని కర్మయోగ సామ్రాజ్య విస్తరణను ఆమూలాగ్రంగా తెలుసుకొని కర్మయోగం అధ్యాయాన్ని ముగించుకున్నాం. నాలుగవ అధ్యాయం సృష్టి ఆవిర్భావ వికాస విధానం, కర్మయోగ ఆవిర్భావ వికాసాల్ని, పూర్వపరాల్ని వంశపారంపర్యంగా కొనసాగుతున్న కర్మయోగాచరణను ఆత్మజ్ఞానం బోధించే గురువుల చరిత్ర, గీత ఆవిర్భావం, గీత ఆవిర్భావ కాలం, నేపథ్యం పునర్జన్మ సిద్ధాంతం కర్మయోగ సిద్ధాంతం లాంటి విభిన్న కోణాలతో వినూత్న అంశాలతో స్వయంగా జగద్గురువే ఈ జ్ఞాన యోగాన్ని ప్రారంభించాడు. ఒకటవ శ్లోకంలో సృష్టి ఆరంభం సూర్యుడికి గీతా మార్గాన్ని బోధించడం, సూర్యుడి ద్వారా గీతా జ్ఞానం వంశపారంపర్యంగా మనిషికి అందిన విధానం, గీత జ్ఞాన ఆచరణ విధానం, గీతా అజ్ఞానం పుట్టుపూర్వోత్తరాల నిర్ధారణ, గీత జ్ఞానం బోధించిన గురువుల చరిత్ర, మొదలైన అంశాల్ని సందేహాలకు తావు లేకుండా ఆమూలాగ్రంగా చర్చించాం. 2వ శ్లోకంలో అలా వంశపారంపర్యంగా వచ్చిన గీతాజ్ఞాన మార్గం కాలక్రమంలో అర్హత లేని ఇంద్రియ లోలురు రాజ్యాన్ని పరిపాలించిన కారణంగా బ్రహ్మవిద్య అంతరించిపోయిన విధానం దానికి గల కారణం సవిర్శనాత్మకంగా చూశాం. మూడవ శ్లోకంలో అలా అంతరించిపోయిన పురాతనమైన మహోత్తమమైన రహస్యమైన బ్రహ్మవిద్య మళ్ళీ కురుక్షేత్రాన్ని వేదికగా చేసుకుని మనకు చేరిన విధానాన్ని వాటి మూలాలతో సహా దర్శించాం. ఇలా సృష్ట్యాదికి సంబంధించిన అనేక అంశాల్ని చర్చించిన కారణంగా మనకు కలిగిన సందేహాన్ని నాలుగవ శ్లోకంలో చూశాం. ఈ సందేహంతో మనలోని అనేక సందేహాలకు సమాధానం అందింది. ఐదవ శ్లోకంలో పునర్జన్మ సిద్ధాంతాన్ని సశాస్త్రీయంగా సప్రామాణికంగా విశ్లేషించుకున్నాం. దేహ నిర్మాణాన్ని ఐదు విధాలుగా విభజించుకొని ప్రాణశక్తి శరీరంలోకి ప్రవేశిస్తూ నిష్క్రమిస్తూ ఆయా జన్మల సూక్ష్మ అంశాల్ని జన్మజన్మలకు ఎలా తీసుకెళ్తుందో ఒక జన్మ మరెన్నో

జన్మలకు ఎలా కారణమవుతుందో విశ్లేషించుకొని పునర్జన్మల సిద్ధాంతాన్ని విధానాన్ని ఆ మూలాగ్రంగా పరిశీలించాం. ఆరవ శ్లోకంలో పుట్టుకకు అవతారానికి గల తేడాలను గమనించి అజ్ఞానవశంతో జీవుడి దృష్టి వర్తమాన జన్మకే పరిమితం కాకుండా మరపు లేని ఎరుకతో స్థిరీకృతం కావాల్సిన ఆవశ్యకతను విధానాన్ని నేర్చుకున్నాం. ఏడవ శ్లోకంలో ధర్మానికి హాని అధర్మానికి వృద్ధి సంభవించినప్పుడల్లా భగవంతుడు తనను తాను తన ప్రకృతితో ఎలా సృజించుకుంటాడో చూశాం. ప్రస్తుతం మనం భౌతిక లోకంలో అనుభవిస్తున్నాం కూడా. అడ్డు అదుపు లేక ప్రవర్తిస్తున్న మనిషిని మనిషిలో తాండవిస్తున్న అజ్ఞానపు ప్రళయతాండవాన్ని ఏ రూపంలో అడ్డుకట్ట వేస్తుందో ప్రతి ఒక్కరూ ప్రస్తుత కాలంలో ప్రతిక్షణం దర్శిస్తూనే ఉన్నాం. అలా తనను తాను సృజించుకున్న అవతారం యొక్క కార్యాచరణను ఎనిమిదవ శ్లోకంలో సాధు సజ్జనుల సంరక్షణ అధర్మాన్ని రూపుమాపడం ధర్మసంస్థాపనం ఈ మూడు కార్యక్రమాలతో కూడుకున్న దైవ ప్రణాళికను అలాగే యుగ ధర్మాన్ని ఆయా యుగాలలో మానవుడు ప్రవర్తిల్లిన తీరును సమగ్రంగా సందేహాలకు తావు లేకుండా వివరించుకున్నాం. తొమ్మిదవ శ్లోకంలో ఈ చర్చించిన అంశాలను తాత్విక దృష్టితో అర్థం చేసుకొని ఆచరించి నా తత్వాన్ని దర్శించిన వారు మళ్లీ పుట్టరని ప్రబోధించిన విధానం చూశాం. పదవ శ్లోకంలో రాగ, భయ క్రోధాదులను వీడి భగవంతుని తమ స్వరూపంగా భావిస్తూ గీతా మార్గాన్ని ఆశ్రయించి జ్ఞాన తపస్సుతో పవిత్రులై భగవంతుని చేరిన ఎందరినో ఉదహరించుకున్నాం, చూసాం. 11వ శ్లోకంలో మనం భగవంతుని ఎలా సేవిస్తే ఏ దృష్టితో భావిస్తే పూజిస్తే మనకు అవే ఫలాలు అందుతాయని ధార్మిక సూక్ష్మాన్ని సూచిస్తూ నిర్ణయాన్ని మనకే వదిలేసింది దైవం. 12 వ శ్లోకంలో ఈ లోకంలో మానవులందరూ తమ తమ కర్మలు ఫలించాలని భౌతిక కోరికలతో శీఘ్రమైన అంటే తాత్కాలికమైన ప్రయోజనాన్ని ఆశించి దేవతలను పూజిస్తున్న వైనాన్ని మన కళ్ళ ముందు ఉంచారు. ఈ అంశాన్ని విశ్లేషించుకుని అలా తాత్కాలిక కోరికల జోలికి వెళ్లకుండా ఆత్మమూలాల్ని దర్శించే దిశగా మోక్షేచ దిశగా మన ఆలోచనలు కొనసాగాల్సిన విధానాన్ని తెలుసుకున్నాం. 13వ శ్లోకంలో ఇప్పటికీ లోకంలో జరుగుతున్న కులమతాల కొట్లాటలు గొడవలు మొదలైన అనేక సంఘర్షణలకు అలజడికి కారణం అజ్ఞానమే తప్ప మరొకటి కాదని తెలుసుకున్నాం. మానవుల్ని గుణకర్మలను బట్టి ఆయా విభజనను మనకు అర్థం కావడానికి మనల్ని మనం పరిశీలించుకొని ఆత్మ అభ్యున్నతి గావించుకోవడానికే సృష్టించానని సృష్టికర్త పేర్కొన్న అంశాన్ని ఆమూలగ్రంగా చూసాం.14వ శ్లోకంలో మనిషి కర్మల చేత బంధీ కాకుండా ఉండాలని అసంపూర్ణత్వము నుండి పూర్ణత్వం వైపుకు ప్రయాణించాలని తెలుసుకున్నాం. అలా పూర్ణత్వాన్ని పొందిన పూర్వుల్ని 15వ శ్లోకంలో ఉదహరించుకున్నాం. 16వ శ్లోకంలో కర్మ అనగానేమి అకర్మ అనగానేమి అని ప్రశ్నించుకొని

సమాధానాన్ని పొంది అశుభాలనే కర్మ బంధాల నుండి విముక్తులవ్వాల్సిన పద్ధతిని నేర్చుకున్నాం. 17వ శ్లోకంలో కర్మ తత్త్వాన్ని తెలుసుకొని అకర్మ స్వరూపాన్ని వికర్మ లక్షణాలను సూత్రీకరించుకొని కర్మ చక్రంలో జనన మరణ చట్రంలో చిక్కుకొని భిక్కరించకుండా అవలీలగా ఆత్మజ్ఞానం పొందే మార్గాన్ని నేర్చుకున్నాం. 18వ శ్లోకంలో కర్మ యందు అ కర్మను, అకర్మ యందు కర్మను దర్శించే విధానాన్ని తెలుసుకొని అలాంటి వారిని సమస్త కర్మల్ని నిర్వహించే వారిని కృస్న విధులుగా, జ్ఞానులుగా పరిగణించాం. మనం నిత్య జాగురకతో సచేతన ఎరుకతో నిత్యం కొనసాగాల్సిన ఆవశ్యకతను తెలుసుకొని నిజమైన ప్రార్థన పూజ అంటే ఏంటో దర్శించాం. 19వ శ్లోకంలో నిష్కామంగా సమస్త కర్మల్ని తమ జ్ఞానాగ్నిలో భస్మం చేసేవారు పండితులు, జ్ఞానులు అని చూసాం. కర్మ నిర్మాణంలో చిక్కుకోకుండా జ్ఞానంతో నీటి బుడగ పై పొర లాంటి సున్నితమైన కర్మ నిర్మాణాన్ని ఛేదించి కర్మల చక్రం నుండి విడిపడాల్సిన విధానాన్ని రూపొందించుకున్నాం.20వ శ్లోకంలో సమస్త కర్మలయందు వాటి ఫలాల యందు ఆసక్తిని వీడి దృశ్య వస్తువుల నుండి మన దృష్టిని దర్శి వైపుకు మరల్చి సచ్చిదానంద రూపాన్ని ఎరుగుటే తత్త్వ దర్శనమని తెలుసుకున్నాం. 21వ శ్లోకంలో జ్ఞానులు కర్తవ్యకర్మ నిర్వహణ చేత పాపాల్ని పొందరని తెలుసుకున్నాం. అలాగే మన జీవితం ఒక సరి ఇసుక రేణువుతో సమానమైన అధ్యాయం మాత్రమేనన్న వాస్తవాన్ని దర్శించాం.

4వ అధ్యాయం, అవలోకనం-2.

22వ శ్లోకంలో సదా జ్ఞానంతో లీనమై సదా సంతృప్తులై నిరాశ్రయంగా నిత్యతృప్తంతో ఫలాసక్తి లేకుండా కర్తవ్య కర్మలను నిర్వహించే సంతుష్టుడి లక్షణాలను వైభవాన్ని చూశాం. 23వ శ్లోకంలో గతసంగులు, విముక్తులు, జ్ఞానావస్థిత చేతసులు, యజ్ఞార్థమై కర్మలను ఆచరించేవారు అనే ఐదు అంశాలను ఆమూలగ్రంగా చర్చించుకుని యజ్ఞ భావంతో కర్మలనాచరిస్తే ఆయాకర్మలు ఫలాలతో సహా సంపూర్ణంగా తమ తమ జ్ఞానాగ్నిలో విలీనమైపోతాయని తెలుసుకున్నాం. 24వ శ్లోకంలో బ్రహ్మార్పణ భావంతో అర్పితం గావించాల్సిన విధానాన్ని ఈ శ్లోకంలోని ప్రతి అక్షరం యొక్క ఆంతర్యాన్ని మూలాలని చర్చించి బ్రహ్మార్పణ గావించుకున్నాం. 25 నుండి 30 వరకు వివిధ రకాల యజ్ఞాల్ని పేర్కొని ఆయా యజ్ఞాల్ని నిర్వహించాల్సిన విధానాన్ని నేర్చుకున్నాం. 31వ శ్లోకంలో అలా యజ్ఞ భావంతో కర్మలను నిర్వహిస్తూ యజ్ఞ శేషాన్ని భుజించే వారే నిత్య సత్యమైన సనాతనమైన బ్రహ్మాన్ని పొందుతారు అలా ప్రవర్తించని వారికి ఇహలోకం కానీ పరలోకం కానీ ఎక్కడి నుంచి ప్రాప్తిస్తుందని ప్రశ్నించి ఆలోచింపజేశారు. 32వ శ్లోకంలో ఈ 12 రకాల యజ్ఞాల నిర్వహణ విధానాలన్నీ కూడా వేదాల్లోనే ఉన్నాయి ఇవి కూడా ఇప్పటిది కాదు సృష్టి ఆది నుంచే ఉన్నాయని పేర్కొన్న విధానాన్ని 2-45వ శ్లోకంలో

వివరించుకున్న అంశాన్ని సూచించుకుని ఆమూలాగ్రంగా చర్చించుకున్నాం. 33వ శ్లోకంలో ద్రవ్యమయాదుల యజ్ఞాల కంటే జ్ఞాన యజ్ఞమే శ్రేష్ఠమని సూచించారు. సర్వ యజ్ఞాలన్నీ కూడా జ్ఞాన యజ్ఞంలోనే పరిసమాప్తమవుతాయని ఉద్బోధించిన అంశాలను గ్రహించి యజ్ఞ విభాగాన్ని ఈ శ్లోకంతో సమాప్తి చేసుకున్నాం. ఈ యజ్ఞాన్ని ఆచరించాల్సిన విధానాన్ని 34వ శ్లోకంలో ప్రణిపాతేన, పరిప్రశ్నేనా అనే మూడు అంశాలను ప్రధానంగా చేసుకొని చర్చించుకున్నాం.

సద్గురు సేవ అనే మూడు అంశాలను ప్రధానంగా చేసుకొని గురుశిష్యుల బంధం మరియు ఆంతర్యాన్ని ఇద్దరూ సంతరించుకోవాల్సిన సమానత్వపు భావాన్ని దర్శించాం. 35వ శ్లోకంలో ఏ జ్ఞానం పొందితే తిరిగి మోహానికి గురికాకుండా ఉండగలమో ఆ జ్ఞానాన్ని 34 లో చెప్పుకున్న విధంగా తత్త్వదర్శుల ద్వారా తెలుసుకోమని సెలవిచ్చారు. 36వ శ్లోకంలో ఎంతటి మహా పాపాత్ములైనా జ్ఞానం అనే నౌక సహాయంతో పాప సముద్రాన్ని అవలీలగా దాటవచ్చని తెలుసుకున్నాం. దీనికి ఉపమానంగా 37వ శ్లోకంలో ప్రజ్వలించే అగ్ని ఇంధనాల్ని భస్మం చేసినట్లు జ్ఞానమనే అగ్ని సర్వ కర్మలను భస్మం చేసి కర్మ ఫలితాలను నిర్బీజం చేస్తుందని తెలుసుకున్నాం. 38వ శ్లోకంలో జ్ఞానంతో సమానమైనది, పవిత్రమైనది ఈ లోకంలో మరొకటి లేదని దాన్ని యోగసంసిద్ధులై కాలక్రమంలో స్వయంగా మనలోనే పొందుతామని తెలుసుకున్నాం. 39వ శ్లోకంలో ఆత్మజ్ఞానం పొందటానికి మనకు ఉండాల్సిన ప్రధానమైన లక్షణాలైన శ్రద్ధ, తదేకనిష్ఠ, ఇంద్రియ సంయమం మొదలైన వాటిని పేర్కొని విశ్లేషించుకున్నాం. 40 వ శ్లోకంలో అలాంటి లక్షణాలు లేని అజ్ఞానులు, అశ్రద్ధాపరులు, సంశయాత్ములు వినాశనమవుతారని వీరికి వీరికి ఇహ పర లోకాల్లో సుఖశాంతులు లేవని తెలుసుకున్నాం. 41వ శ్లోకంలో ఈశ్వరార్పిత బుద్ధితో కర్మయోగంలో నిమగ్నమైన వారిని సంశయాల్ని ఛేదించిన ఆత్మ నిష్ఠుని బ్రహ్మజ్ఞానిని కర్మలు బంధించవని ప్రబోధించారు జగద్గురువు.

4వ అ, 42వ శ్లోకం.

తస్మాదజ్ఞానసంభూతం హృత్ స్థం జ్ఞానాసినాత్మనః |
ఛిత్త్వైనం సంశయం యోగమ్ ఆతిష్ఠోత్తిష్ఠ భారత | 42 |

కావున ఓ భారతా! (అర్జునా!) నీ హృదయము నందుగల అజ్ఞానజనితమైన ఈ సంశయమును వివేకజ్ఞానమను ఖడ్గంతో రూపుమాపి, సమత్వరూప కర్మయోగమునందు స్థితుడవై యుద్ధమునకు సన్నద్ధుడవగుము.

సంశయం, మోహాదులు అన్నీ కూడా అజ్ఞానం నుండే పుడతాయి. అజ్ఞానం హృదయగతం, సంశయం కూడా హృదయ గతమే. వ్యక్తి వినాశనానికి కారణం అవుతున్న అజ్ఞాన జనిత సంశయం బాహ్యంలో లేదు, మనలోనే ఉంది. హృదయాన్నే ఆవరించుకుని ఉంది. అందుకే దాన్ని ఆవరణగా మనం చెప్పుకున్నాం. ఈ నివారణకు పరిష్కారం కూడా స్వాశ్రయమే. స్వాశ్రయం అంటే మనమే ఆశ్రయంగా గలది అని అర్థం. మనలో ఉంటూ శోక మోహాదులను సృష్టించి మనల్ని కలుషితం చేస్తున్న హృత్ స్థం. ఈ సంశయ భూతాన్ని హృదయము నుండి జనించిన జ్ఞానం అనే ఖడ్గం చేతనే ఖండించాలి. అలా శోక మోహాదులను హరించే ఆత్మ దర్శనమే జ్ఞానం, అదే ఖడ్గం, అదే జ్ఞానాసి. తద్వారా ఆత్మసంబంధమైన సంశయాలను ఛేదించాలి. ఈ సంశయం ఆత్మకు సంబంధించిన అజ్ఞానం వల్ల సంభూతం అయింది కాబట్టి మనలోని హృదయ గతమైన సందేహాలను మనమే జ్ఞాన ఖడ్గాన్ని సముపార్జించి తొలగించుకోవాలి వేరే మార్గం లేదు. ఎందుకంటే ఎవరి సందేహం వారిదే, ఎవరి జ్ఞానం వారిదే, ఎవరి అజ్ఞానం ద్వారా సంభూతమైన సంశయాలను వారి వారి జ్ఞానం వల్ల కలిగే వివేకంతోనే నశింప చేసుకోవాలి. కర్తను కర్మయోగమే శుద్ధి చేయగలదు గాని మరొకరికి సాధ్యం కాదు. అలాగే అకర్తగా దర్శించడానికి సహకరించేది జ్ఞానయోగమే తప్ప మరొకటి కాదు. అందుకే 'ఉత్తిష్ట' మేలుకో. మనం 'ఉత్తిష్ట' అనేటటువంటి మాటను రెండవ అధ్యాయంలో 37వ శ్లోకంలో సమగ్రంగా చర్చించాం. ఆ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని ఇప్పటివరకు ఈ అధ్యాయమంతా అవలోకనం చేసుకున్నటువంటి అంశాల అవగాహనతో ఈ శ్లోకాన్ని సమన్వయం చేసుకుంటే సరిపోతుంది.

5 వ అధ్యాయం, కర్మసన్యాస యోగము

5అ, 1శ్లో.

అర్జున ఉవాచ,

సన్న్యాసం కర్మణాం కృష్ణ పునర్యోగం చ శంససి |

యచ్ఛ్రేయ ఏతయోరేకం తన్మే బ్రూహి సునిశ్చితమ్ || 1 ||

అర్జునుడు పలికెను-
ఓ కృష్ణా! ఒకసారి కర్మ సన్యాసమును, మరియొక సారి కర్మయోగమును ప్రశంసించుచున్నావు. నిశ్చయముగా ఈ రెండింటిలో నాకు ఏది శ్రేయస్కరమో చెప్పుము.

సన్యాసం అనే మాటకు కామ్యకర్మల విడుపు అని అర్థం, సమర్పించబడినది అని అర్థం చేసుకోవాలి. కృష్ణా! కర్మలు చేయడాన్ని వదలడాన్ని రెండింటిని స్తుతిస్తున్నావు, ఈ రెండింటిలో ఏది నాకు శ్రేయస్కరమో చెప్పు అని ప్రశ్నిస్తున్నాడు. నాలుగవ అధ్యాయంలో జ్ఞాన యోగాన్ని జ్ఞానం వైభవాన్ని అత్యద్భుతంగా అనితరసాధ్యంగా ప్రబోధించిన జగద్గురువు చివరగా ధనంజయా విధి పూర్వకంగా కర్మలను ఆచరిస్తూ కర్మ ఫలాన్ని భగవదర్పణం గావించి వివేకంతో సంశయాలన్నింటినీ తొలగించుకుంటూ అంతఃకరణాన్ని వశపరచుకున్న వారిని కర్మలు బంధించవని ముగిస్తూ కావున భారతా నీ హృదయంలోని అజ్ఞానాన్ని వివేక జ్ఞానం అనే ఖడ్గంతో రూపుమాపి సమత్వ రూప కర్మయోగంలో సుస్థితుడై యుద్ధానికి లే అని పిలుపునిచ్చాడు.
ఇందులో జ్ఞాన యోగాన్ని జ్ఞాన ప్రాభవాన్ని స్తుతించి వివరించి చివరకు మళ్లీ కర్మయోగాన్ని ఆచరించమంటున్న కారణంగా అర్జునుడికి సందేహం కలిగింది. తన సందేహాన్ని సంధిస్తూ ఐదవ అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నాడు అర్జునుడు.
కర్మానుష్టాన, కర్మ సన్యాసాలలో ఏది శ్రేయస్కరమో చెబితే దాన్ని ఆచరిస్తాను అంటున్నాడు అర్జునుడు. ఆత్మ జ్ఞానం చేత కర్మలనుండి సన్యసించిన వారు విడిపడిన వారు కర్మలకు బంధీ కారు అనే **4-41** లో చెప్పి వెంటనే కర్మయోగాన్ని ఆచరించు అని పిలుపు నిచ్చి తన బోధను అధ్యయాన్ని ముగించాడు. ఈ మాటను ఎలా అర్థం చేసుకోవాలో అర్జునుడికి స్పష్టత లేదు. గురు వాక్యాన్ని శ్రద్ధతో తదేక దృష్టితో విన్నప్పుడు సందేహాలు కలగడం సాధారణం. అందులో భాగంగానే నిష్ఠాగరిష్టుడైన మన సహవిద్యార్థైన అర్జునుడి మదిలో మెదిలిన సందేహమే భగవద్గీత ఐదవ అధ్యాయం కొనసాగింపు కారణమైంది. **3-3** లో సాంఖ్యయోగులకు అంటే జ్ఞాన యోగులకు జ్ఞాన యోగ నిష్ట, కర్మయోగులకుకర్మయోగ నిష్ఠ అని **3-4** లో కర్మను ఆచరించకపోతే నైష్కర్మ్య సిద్ధిని పొందలేము, కర్మను

త్యజించినంత మాత్రాన సిద్ధిని పొందలేరని సవివరంగా సమగ్రంగా తెలుసుకున్నాం. ఇంకా ఆ అంశం మీద పరిపక్వత చెందని కారణంగా అందులో దాగి ఉన్న ఆంతర్యం ఏదైతే ఉందో ఆ మూలాన్ని పట్టుకోలేకపోతున్నాడు అర్జునుడు. ఆ యొక్క మూలం అవగాహనకు అందని కారణంగా అదే ప్రశ్నను మరింత లోతుల్లోకి వెళ్లి ప్రశ్నిస్తున్నాడు. ఆత్మ స్వరూపాన్ని దర్శింపజేసే సందర్భాల్లో కర్మయోగం ప్రతిపాదితమయింది. కాబట్టి ఆత్మవిధునికి కర్మయోగం అసంభవం అని చెప్పడానికి వీలులేదు. అయితే అందులోని మూలాన్ని గుర్తించి గ్రహించాలి. దానికి కావలసిన లోతైన అవగాహన ఆంతరంగిక పరిశీలన మనలో మనం పెంపొందించుకోవాలి. అందుకని అర్జునుడు ఇలాంటి ప్రశ్నలు సంధిస్తున్నాడు.

5అ,2శ్లో.

శ్రీభగవాన్ ఉవాచ,
సన్న్యాసః కర్మయోగశ్చ నిఃశ్రేయసకరావుభౌ |
తయోస్తు కర్మసన్న్యాసాత్ కర్మయోగో విశిష్యతే ॥ 2

జ్ఞాన యోగాన్ని ప్రశంసిస్తున్నావు, కర్మయోగాన్ని ఆచరించమంటున్నావు, రెండింటిలో నాకు ఏది శ్రేయస్కరమో నిర్ణయించి నిశ్చయించి ఒక్కదానినే నాకు సూచించు అని ప్రశ్నించిన అర్జునుడికి సమాధానంగా జగద్గురువు ఈ శ్లోకాన్ని వివరిస్తున్నాడు.

సన్యాసం, కర్మయోగం రెండూ మోక్షమిచ్చేవే అయితే రెండింటిలోకర్మయోగం మేలు. ఇక్కడ అర్జునుడికి రావలసిన స్పష్టత ఒకటి ఉన్నది. ఇక్కడ జగద్గురువు ప్రశంసిస్తున్నది సన్యాసాన్ని అయితే ఎలాంటి సన్యాసం అంటే కర్మ సన్యాసాన్ని, మరి జ్ఞానార్థులైన విద్యార్థులు ఇందులో ఉన్న ఆంతర్యాన్ని గ్రహించగలగాలి. కర్మను అంటే కర్మలోని కర్తను, కర్తృత్వ భావాన్నే కానీ విద్యుక్త దైవనియమిత కర్మను కాదని మనకు తెలియాలి. ఆ మాటలోని చిక్కుముడిని ఇలా విప్పి సూక్ష్మ దృష్టితో విద్యార్థి అర్థం చేసుకోగలిగితే అప్పుడు దైవం సూచించే దిశా నిర్దేశం మనకు అవగతం అవుతుంది. అలాంటి పరిపక్వత మనలో కలగాలి. ముందు శ్లోకంలోని ప్రశ్నలో ప్రశంసిస్తున్నది కర్మ యోగాన్ని, సన్యసించమంటున్నది కర్మ లోని కర్తను. ఇలా స్థూలమైన మాటల్లోంచి అంటే పదార్థంలోని సూక్ష్మమైన సున్నితమైన యదార్థాన్ని మనం గ్రహించగలగాలి. అమ్మ హృదయాన్ని మించినది సద్గురు హృదయం. జ్ఞానార్థి అయిన విద్యార్థికి ఏది శ్రేయస్కారమో నిశిత పరిశీలన కలిగిన తత్త్వదర్శికి తెలుసు. కనుక శిష్యుని మానసిక ఆధ్యాత్మిక స్థితిగతులను గమనించి తన స్థాయికి తగిన మార్గాన్ని తగిన పద్ధతిలోనే వారు నిర్దేశిస్తారు. అందులో భాగంగా జగద్గురువు కర్మయోగమే శ్రేయస్కరమనే దిశను నిర్దేశిస్తున్నాడు. అర్జునుడు కూడా నాకు మోక్షానికి ఏది హేతువు అవుతుంది అని ప్రశ్నించకుండా వినయంగా నాకు శ్రేయస్కరమైనది ఏదో ఆ మార్గాన్ని సూచించు అని ప్రశ్నించాడు. ధర్మక్షేత్రం నుండి విడిపడటం చాలా సంక్లిష్టతతో కూడుకున్నది. జ్ఞానపూరితంగా కర్మలను ఆచరిస్తూ ప్రశాంతమైన మార్గంలో పయనించడం కర్మయోగం. కర్మను యోగంగా మార్చుకోవడమే కర్మయోగం కదా. ఈ యోగత్వపు భావన కర్మ

ఫలాలని ఈశ్వరార్పణంలో లయం చేస్తుంది. జ్ఞాన యోగం అనేది జ్ఞానమే సాధనంగా కలదు. నిరంతరం సత్యంలో యదార్థంలో సత్తులో జ్ఞానంలో నిమగ్నం కావడమే జ్ఞాన యోగం కదా, అదే జ్ఞాన తపస్సు జ్ఞాన సాధన. ఇది మహోన్నతమైనది. జ్ఞాన యోగంలో శోభించాలంటే కర్మయోగాచరణ దశను దాటిన వారై ఉండాలి. కర్మ యోగాచరణ కావించాలంటే కర్మ చేయడం, కర్మ సన్యాసం రెండింటిని దాటిన స్థితిని కలిగి ఉండాలి. ఆలోచించి కర్మను విడిచిపెట్టడం కాకుండా కర్మ చేస్తున్నానంటూ కర్మ చేయడం కాకుండా ఈ రెండింటికి అతీతమైన కర్మను యోగంగా భావించి కర్మయోగాచరణ స్థితిలో కొనసాగాలి. తద్వారా జ్ఞాన యోగిగా రూపాంతరం చెందగలం. ఇది జగద్గురువు కర్మయోగోవిశిష్యతే అని చెప్పడంలోని ఆంతర్యం. అలాగే సాధారణ స్థాయి మనిషి నిర్విషయ స్థితిని పొందక ముందే కర్మలను విడిచి పెడితే సోమరులయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి ప్రత్యేకంగా శ్రేష్ఠతకు శ్రేయస్సును సమకూర్చే కర్మ యోగాన్ని జగద్గురువు సూచిస్తున్నారు. జ్ఞానాన్ని సంతరించుకున్న జ్ఞానుల గురించిచెప్పాల్సిన అవసరం లేదు. వారికి సూచనలు సలహాలు దిశా నిర్దేశాలు కూడా అవసరం లేదు. ఇప్పటిదాకా ఈ శ్లోకంతో జ్ఞాని వైభవాన్ని **2-69** నుంచి ఇప్పటిదాకా ఈ శ్లోకంతో కలిపి **206** శ్లోకాల్లో అనేక సందర్భాల్లో చూశాం. వారు సృష్టికర్త సలహాల సూచనల మేరకు తమ తమ దైవ నియమిత కర్తవ్య కర్మలను అకర్తగా ఉంటూ నిర్వహిస్తూ శోభిస్తూ ఉంటారు. ఈ జ్ఞానయోగం స్వయంగా సిద్ధించేదే కానీ సూచించేది సలహా ఇచ్చేది కాదని ఖచ్చితంగా మనకు తెలియాలి. అందుకే సామాన్యమైన సాధారణ స్థాయి ప్రజానీకాన్ని ఉద్దేశించి జగద్గురువు కర్మయోగమే శ్రేయస్కరమని తేల్చి చెప్పాడు.

5అ,3శ్లో.

జ్ఞేయః స నిత్యసన్న్యాసీ యో న ద్వేష్టి న కాంక్షతి ।
నిర్ద్వంద్వో హి మహాబాహో సుఖం బంధాత్ ప్రముచ్యతే ॥ ౩ |

ఏమీ కోరని వారు వేటిని ఎవరినీ ద్వేషించని వారు నిత్య సన్యాసి అనితెలుసుకో అర్జునా ఇటువంటి ద్వంద్వాలకు అతీతులైన వారు బంధాల నుండి అవలీలగా బయటపడతారు.

5-1 లో కర్మలు చేయడాన్ని సన్యాసించడాన్ని ప్రశంసిస్తున్నావు నాకు శ్రేయస్కరమైన మార్గాన్ని సూచించమని ప్రశ్నించిన అర్జునుడికి **5-2** లో రెండూ శ్రేష్టమైనవే అని తెలియజేసి నీకు సాధారణ స్థాయి మనిషికి మనకు కర్మయోగమే శ్రేయోదాయకమని నిర్దేశించారు. ఇక్కడ అసలు సన్యాసి ఎవరు అని అంశాన్ని ఈ శ్లోకంలో నిరూపిస్తున్నారు. ఇప్పుడు మనం ఈ పదానికి ముందున్న 'జ్ఞేయః' అనే మాటను అర్థం చేసుకొని రెండింటిని కలిపి 'జ్ఞేయః స నిత్యసన్యాసీ' అంటే ఎవరో అర్థం చేసుకుందాం. 'జ్ఞేయం' అనే మాటకు తెలియదగిన తెలుసుకోదగిన అంశమని ఇది వరకే చూశాం. స్థూల, సూక్ష్మ ప్రపంచాలను అర్థం చేసుకుని జ్ఞాతృ, జ్ఞేయం, జ్ఞానం మనం నాలుగు **24** లో చర్చించిన అంశాలను అర్థం చేసుకొని వీటిని జ్ఞాన స్వరూపంగా సాక్షాత్కరింప చేసుకున్నవారు 'జ్ఞేయః'. భౌతికత్వపు ప్రపంచంలోని యదార్థాన్ని వివేచించి జీవాత్మ పరమాత్మ ఐక్యతను అనుభూతించాలని వివేక చూడామణి ద్వారా

తెలుసుకున్నాం. ఇలా మనం ఈ పదాన్ని అర్థం చేసుకోవాలి ఉదాహరణకు జీవుడే దేవుడు అనే వేదవాక్కును మనం అర్థం చేసుకోవాల్సిన విధానం చూద్దాం. మానవుడే దేవుడని దీని అర్థం కదా. మానవత్వపు స్పృహను, చైతన్యాన్ని అర్థం చేసుకున్నవారు ఆ లక్షణాలను సంతరించుకున్న వారు మానవులవుతారు. అలాంటి మానవుడు దైవత్వం వైపుగా ప్రయాణించి **2-72** లోని బ్రాహ్మీస్థితికి చేరుకున్న మానవుడు దేవుడని అర్థం. మానవరూపంలో ఉన్నా కూడా అలా ఆస్థితిని చేరుకోని వారు దేవుడు కాలేరు కదా. అలాగే మానవ రూపంలో ఉన్నంత మాత్రాన ఈ మానవత్వపు స్పందన లక్షణాలు లేకపోతే వారు మానవులు కాలేరు కదా. అలా పదాల పదార్థంలోని యదార్థాన్ని ఆయా సందర్భాల్లో జగద్గురువు శృతి వాక్యాలలోని ఆంతర్యాలను శ్రద్ధా భక్తులతో వివేకంతో వివేచించి యదార్థాన్ని గ్రహించాలి. ఇంతటి లోతైన అవగాహనతో సన్యాసి అనే మాటను తరచితరచి చూద్దాం. ఈ పదం మనకు **3-4** లో పరిచయమయ్యింది. ఈ పదాన్ని పదస్వరూపాన్ని అక్కడ సమగ్రంగా చూశాం. నన్నే ఎందుకు ఈ ఘోరమైన యుద్ధానికి నియోగిస్తున్నావని అర్జునుని ప్రశ్నకు జగద్గురువు సమాధానం చెప్పే సందర్భంలో కర్మలను త్యజించినంత మాత్రాన జ్ఞాన నిష్టను, సిద్ధిని పొందలేరని 'సన్యసనాత్ ఏవ' అనే పదాన్ని ప్రయోగించాడు.

3-30 లో అంతర్యామినీ పరమాత్మను అయిన నాయందే చిత్తముంచి నాకే సమర్పించి ఆశ మమత సంతాపాన్ని వీడి యుద్ధం చేయి అని అన్నారని అర్థం చేసుకున్నాం. ఇందులో సన్యస్య అనే మాటకు సమర్పించి అని అర్థం. **4-41** లో కర్మయోగం ద్వారా కర్మల నుండి విడివడిన వారు అంటే యోగం చేత విద్యుక్త కర్మలను భగవంతునికి సమర్పించిన వారు. అలాగే ఇక్కడ ఈ శ్లోకంలో నిత్య సన్న్యాసీ అనే పదాన్ని ప్రయోగించాడు. వారు సదా నిత్య సన్యాసులు. **4-39** శ్లోకంలోని తదేక జ్ఞాన నిష్టతో ఉంటే నిత్య సన్యాసి అవుతారు. కర్మలయందు ఆ కర్మను దర్శిస్తూ తాను అకర్తను అనే సత్యానుభూతితో ప్రకాశించేవాడు జ్ఞాని. వీరే ఆత్మ జ్ఞానులు, వీరే నిత్య సన్న్యాసులు. ఇప్పటివరకు ఈ పదం పట్ల మనకున్న అవగాహనతో ఈ పద స్వరూపాన్ని ఆంతర్యాన్ని వెంబడిస్తూ మరింత లోతుల్లోకి వెళ్లి చూస్తే అన్నింటికీ లేదా సర్వ సృష్టికి మూలమైనది 'సత్'. దాని యందు సన్యాసం. మనం మూలంలో స్థిరంగా నిలవడం నిలపడం ఉంచడం సమర్పించడం అనే భావం మనకు స్ఫురిస్తుంది. సనాతనమైన దానితో, పురాతనమైన దానితో మూలంతో స్థిరమై ఉండటం. సత్తుతో సుస్థిరమై సుప్రతిష్టమై ఉండటం.

మన దేహం అనే సంపదను ధనాన్ని అంటే దేహంలోని **24** తత్త్వాల ద్వారా జరిగే దేహపు క్రియలన్నింటినీ జాగ్రత్తగా భద్రంగా దైవం సంరక్షణలో ఆత్మికసంరక్షణలో ఉంచడం అని అర్థం చేసుకోవాలి. అలా ఉంచకపోతే అవి ఇష్టారాజ్యంగా ప్రవర్తించి మనకు ప్రమాదాన్ని తెచ్చిపెట్టి మన జీవితాన్ని అల్లకల్లోలం చేసి అస్తవ్యస్తానికి గురిచేస్తుంది. ఇది మనం నాలుగు అధ్యాయాలుగా చెప్పుకుంటున్న దైవం పై దృష్టిని నిలపాలనుకోవడంలోని ఆంతర్యం. మనం దైవం పై దృష్టిని నిలపడం మనల్ని మనం సంరక్షించుకోవడం కోసమే, మన శ్రేయస్సు కోసమే, మన పురోభివృద్ధికే గాని దైవం కోసం కాదని మనకు తెలియాలి. ఆత్మ అనే దైవానికి నిలయమైనటువంటి ఈ పాంచ భౌతిక దేహం అనే దైవ ప్రసాదిత సంపద అయిన దేహపు దేవాలయాన్ని అలాగే దైహికక్రియలన్నింటిని దైవం సంరక్షణలో పదిలంగా భద్రపరచుకోవాలి. అలా సనాతనమైన మూల శక్తితో సృష్టికర్తతో సమస్త జ్ఞానంతో సుస్థిరీకృతమై **2-16** లో చర్చించిన సత్తు అసత్తును వివేక ప్రజ్ఞతో తెలుసుకొని అసత్తును ఆనందంగా విడిచి పెట్టేవారు నిత్య సన్న్యాసులు. ఇలా నెమ్మదిగా మనలో మనం

యథార్థ తత్త్వాన్ని గుర్తించే విధానాన్ని పెంపొందించుకోవాలి. ఈ దృష్టితో మనం పరిశీలిస్తే నిత్య సన్న్యాసి అనే మాట మనకు సంపూర్ణంగా సమగ్రంగా దర్శితమవుతుంది. మూడు 'యహః న ద్వేష్టి' ఎవ్వరినీ ద్వేషించని వారు. **2-56**లో **2-64** లో, **3-34**లో, చాలా అంశాలను సవివరంగా తెలుసుకున్నాం. నాలుగు 'యహః న కాంక్షతి' ఏదీ కోరని వారు. **4-22**లో తాను కోరకుండానే లభించిన దానితో సంతృప్తి చెందేవారని తెలుసుకున్నాం. అయిదు 'నిర్ద్వందో' ద్వంద్వాతీతులు. **2-14**లో **2-18**లో ఈ అంశాన్ని సమగ్రంగా చూశాం. **2-45**లో హర్ష శోకాల ద్వంద్వాలకు అతీతంగా నిత్య సత్యమైన పరమాత్మ యందే స్థిరమై ఉండాలని **2-56**లో సుఖదుఃఖాలకు అతీతంగా ఉండే మనన శీలుడు స్థితప్రజ్ఞుడు అని తెలుసుకున్నాం. **4-22**లో ద్వంద్వాతీతులు కర్మబంధంలో చిక్కుకోరు. ఇవన్నీ మనం చర్చించుకున్న అవగాహనతో ఈ అంశాలను సమన్వయం చేసుకుంటే సరిపోతుంది. అలా తెలియదగిన సత్యాన్ని తెలుసుకొని ఏమీ కోరకుండా ఎవరినీ ద్వేషించకుండా ద్వంద్వాలకు అతీతంగా ఉండే వారిని నిత్య సన్న్యాసి అని తెలుసుకో అని ప్రబోధిస్తున్నారు. ఇటువంటి అతీతులైన నిత్య సన్న్యాసులు సంసార బంధాల నుండి సుఖంగా విముక్తులవుతారు. అలాంటివారు బంధానికి కారణమైనకర్మను, కర్మకు కారణమైన అజ్ఞానంతో సహ్ జ్ఞానమనే అగ్ని చేత దగ్ధం చేసిన వారు, సర్వం త్యజించిన వారు, సమస్తాన్ని తనలోనే దర్శించేవారు. వీరు బాధ్యతలను వహిస్తూ చాలా అవగాహనతో కార్యాచరణతో ప్రవర్తిల్లుతూ ప్రతి పనిని పూజగా మార్చుకొని కర్మను యోగంగా తీర్చిదిద్దుకుంటూ కర్మయోగిగా శోభిస్తుండటమే. అలాంటి నిత్యా సన్న్యాసి గృహస్తు అయినా ఎక్కడ ఉన్నా అది ఆశ్రమమే, తపోవనమే. వారు నిత్య సన్యాసులే. కర్మలు బంధం లేదు కదా రాగద్వేషాలతో కూడినప్పుడే కర్మలు బంధిస్తాయి. కాబట్టి రాగద్వేషాలు మనసులో ఉండి బాహ్యంగా కర్మలు త్యజించినంత మాత్రాన వస్త్రధారణ, వేషధారణ వేసుకున్నంత మాత్రాన వారు సన్యాసులు కాలేరు. సన్యాసం అనేది జ్ఞాన నిష్టకు సంబంధించిన ఆంతరంగిక పరిణితికి సంబంధించిన విధానమే గాని అసమర్ధతతో ప్రపంచం నుండి ఫలాయనాన్ని కాంక్షించేది కాదని మనకు తెలియాలి. ఆత్మానుభూతి పొందిన వారు ఇలా సుఖదుఖాలు జయ అపజయాలు మంచి చెడు లాంటి ద్వంద్వాలకు ద్వేషం మోహం దిగులు లాంటి వాటికి అతీతులై ఉంటారు.

5అ,4శ్లో.

సాంఖ్యయోగౌ పృథగ్బాలాః ప్రవదంతి న పండితాః
ఏకమప్యాస్థితః సమ్యక్ ఉభయోర్విందతే ఫలమ్ ॥ 4

సాంఖ్య, కర్మయోగములు వేర్వేఱు ఫలములను ఇచ్చునని మూర్ఖులు పలికెదరు. పండితులట్లు పలుకరు. ఆ రెండింటిలో ఏ ఒక్కదానినైనను బాగుగా (విధివిధానముగ) ఆచరించినవాడు, ఈ రెండింటి ఫలస్వరూపమైన పరమాత్మను పొందును.

జ్ఞాన యోగులు, కర్మయోగులు ఇద్దరి గమ్యం ఒకటే, అయితే అనుష్టించే పద్ధతులు వేరుగా ఉన్నప్పుడు ఫలితాలలో తేడా ఉంటుందేమో అనే సందేహం సాధారణ స్థాయి మనిషికి కలుగుతుంది. ఈ సందేహాన్ని పటాపంచలు చేస్తూ రెండింటి ఫలితం ఒక్కటే అనే అంశాన్ని ఇక్కడ నిర్ధారిస్తున్నాడు. అభేదం లేని వారే జ్ఞానులు కదా అందుకే 'న పండితాః' జ్ఞానులు అలా చెప్పరు అన్నారు. జ్ఞాని అయినా లోకంలోని మనిషి అయితే భావంలో భేదం. ఈ కర్మభూమిలో కర్మ చేయని వారు ఎవరూ ఉండరు. క్షణమాత్రం కూడా కర్మ చేయని జీవి ఉండదు. ఈ విషయం మనం మూడవ అధ్యాయంలో చూశాం. ప్రత్యేకించి **3-5**లో ఈ అంశాన్ని సుదీర్ఘంగా చర్చించుకున్నాం కూడా. అలా మనం చూస్తే జ్ఞాని లోనూ నిరంతరం దైవ నియమిత కర్మలు ప్రవర్తిల్లుతూనే ఉంటాయి. అయితే వారు కర్తగా ఉండక సాక్షిగా ఉంటారు. కర్మ యోగులు కూడా కర్తృత్వ భావనను విడిచి కర్మయోగంలో ఉంటారు. తద్వారా పరిణతి చెంది చిత్తశుద్ధి సంప్రాప్తించి జ్ఞాన సముపార్జన గావిస్తూ కాలక్రమంలో జ్ఞానులుగా విరాజుల్లుతారు. కాబట్టి ఒకటి ఎక్కువ, ఒకటి తక్కువ అనేవారు అవివేకులు మూర్ఖులు. ఈ బాలా అనే శబ్దానికి మూర్ఖులు అనే అర్థం కూడా ఉంది. వీరు వాస్తవాన్ని గ్రహించలేని వారు. వీరి అవివేకానికి ఆలోచనల కారుమబ్బులే కారణం. వీరు తమ తమ ఊహాకల్పనల్లో స్వప్నాల్లో పేక మేడలు నిర్మించుకుంటూ ఉంటారు. వీరు అహంకారపు బిందువుగానే ఆగిపోతూ వుంటారు. అనంత జీవన ప్రవాహం నుంచి వేరైపోయిన వారు. సూర్యకాంతిని వదిలిపెట్టి స్వీయ అభిప్రాయాలతో యథేచ్ఛగా ప్రవర్తించి వృథాప్రయాసకు లోనవుతూ ఉంటారు. వీరు ఎప్పటికీ సంతృప్తిని పొందలేరు. ఆ ఊహా సౌధాలన్నీ గాలి వీచినంతనే నేలమట్టమవుతూ ఉంటాయి. పరిపూర్ణమత్వమనేది అరుదుగా సంభవించే విషయం. వీరు కూడా నెమ్మదిగా కొంతకాలం తరువాత అవి పేకమేడలే అని గ్రహించే సమయం ఆసన్నమవుతుంది. అప్పుడు ఆ అంశాన్ని వారు గ్రహిస్తే వారు కూడా జ్ఞానులు పండితులు పరిపూర్ణులు అవుతారు. అలా వారు పరిణితి చెందిన తర్వాత కూడా అలాంటి మేడలను నిర్మించవచ్చు కానీ అప్పుడు జరిగేది కేవలం అభినయం మాత్రమే. తద్వారా జీవిత సత్యం తెలిసి ప్రపంచ బంధం నుంచి విముక్తిని సంప్రాప్తింప చేసుకుంటారు. అహంకారం అంతరించి అహం బ్రహ్మామైనప్పుడే జీవిత సాఫల్యం సాధ్యమవుతుంది. ఈ సాఫల్యతే ముక్తి ప్రాప్తిని కలిగిస్తుంది. కాబట్టి మనం ఈ రెండింటి పట్ల అభేదం చూపరాదు. సాధనా మార్గాలు వేరుగా అనిపించినా సాధ్యం ఒకటే కదా. కర్మ సాధనం, జ్ఞానం సాధ్యం. కర్మయోగాచరణ బుద్ధిని చైతన్యవంతం చేసి మోక్ష మార్గంలో పయనించడానికి ఉపకరిస్తుంది. సాంఖ్య కర్మ యోగాలలో ఏ ఒక్కటి ఆచరించినా రెండింటి ఫలితం ఒక్కటే. అందులో బేధం ఉండదు అని అర్జునుని ప్రశ్నకు సమగ్రంగా సమాధానంఇచ్చినటువంటి జగద్గురువుకు ప్రణమిల్లుదాం.

5అ,5శ్లో.

యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగైరపి గమ్యతే |
ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి || 5 ||

జ్ఞానయోగులు పొందు పరంధామమునే కర్మయోగులును పొందుదురు. జ్ఞానయోగఫలమును, కర్మయోగఫలమును ఒక్కటిగా చూచువాడే యథార్థమును గ్రహించును.

సాంఖ్యులు పొందే స్థానాన్ని యోగులు కూడా పొందుతారు. సాంఖ్యము యోగము ఒకటే అని తెలుసుకున్న వారే నిజముగా తెలుసుకున్న వారు, జ్ఞానులు అవుతారు. సాంఖ్యయోగం కర్మయోగం రెండింటిని ఒకటే అని భావించే వారే తెలియదగిన దాన్ని తెలుసుకున్న వారవుతారు, **5-3** లో ప్రతిపాదించిన వారు అవుతారు. తమకై ఫలాన్ని కోరకుండా కర్మను ఈశ్వరఅర్పితం చేయడమే కర్మయోగం కదా. ఈ కర్మయోగం జ్ఞాన ప్రాప్తికి ఉపాయం కదా. ఇందులో జరిగేది ఏమంటే మనసు బాహ్య విషయాల వైపు పోకుండా ఉండాలంటే అంతరంగంలో అది నెలకొని ఉండటానికి ఒక స్థానం కావాలి. ఆ స్థానం బాహ్య ప్రపంచం కన్నా సత్యమైనది, సుఖమైనది మధురమైనది, నిత్యమైనది అనే నమ్మకం మనసుకు కలగాలి. అప్పుడు మాత్రమే అది బాహ్యమైన కోరికలను వదిలిపెడుతుంది, తన దృష్టిని అంతర్ముఖత్వం చేసుకుంటుంది. అందుకే ఆత్మ అనేది ఒకటి ఉందని భగవంతుడు అనే వారు ఒకరు ఉన్నారని భావన, చింతన చేస్తే ఆ భగవంతుని స్థానం ఆత్మ స్థానం బాహ్య విషయాల కంటే మహోన్నతమైనదని గుర్తించి మనసు నెమ్మదిగా ఆత్మస్థమవుతుంది. అలా నెమ్మదిగా తనదైన స్థానానికి దాన్ని చేర్చడమే యోగం. అలా నెమ్మదిగా కర్మయోగాచరణ ద్వారా మనసును దైవం పైకి నిమగ్నం చేసి తన స్వస్థానానికి దాన్ని చేర్చి స్వస్థితిని పొందడమే కర్మయోగాచరణ గమ్యం. భగవంతుని పై చిత్తము ఉంచి కర్మాచరణ గావించడం అంటే ఇదే. ఇలా ఆధ్యాత్మిక ఉన్నతి కాంక్షించేవారు మొదట మనసును ఆ తరువాత బుద్ధిని కూడా నెమ్మదిగా బాహ్యంలోనికి పోనీయకుండా అంతరంగంలో స్థిరీకృతం చేస్తారు. ఇలా కర్మయోగులు కూడా చివరికి జ్ఞాన ప్రాప్తి ద్వారా మోక్షాన్ని పొందుతారు. కాబట్టి రెండింటికి భేద భావం లేకుండా ఏకత్వభావంతో దర్శించగలగాలి. ఉదాహరణకు ప్రవహించే రెండూ జీవనదులకు సముద్రమే గమ్యస్థానం కదా ఏ ఒక్క నదిలో ప్రయాణం సాగించినా చేరేది మాత్రం మహా సముద్రాన్నే. ప్రయాణం కొనసాగించడమే ప్రధానమని భావించాలి. జీవ నదులన్నీ ప్రవహించి సాగరాన్ని చేరినట్లు జీవులందరూ కూడా సాంఖ్యయోగం, కర్మయోగం అనే రెండు నదులలో ప్రయాణం చేసి జ్ఞాన సాగరాన్ని చేరుకోవాలి. ఇక్కడ స్థానం అంటే మూలమని అర్థం. మూలం అంటే **2-45** లో చెప్పుకున్న కనిపించే కనిపించని రెండు శక్తుల్ని వ్యవస్థీకృతం చేసి నడిపిస్తున్న మూలశక్తి. ఆ మూలస్థానమే మోక్షం. ఆస్థానాన్ని చేరుకోమని ఇక్కడ జగద్గురువు ప్రాప్యతే స్థానం గమ్యస్థానం అన్నారు. ఇక్కడ పశ్యతి అంటే చూడటం అని అర్థం. అయితే తెలుసుకోవడం అనే భావాన్ని తీసుకోవాలి. ఇద్దరినీ ఒకే భావంతో చూడటం

భావించడం తెలుసుకోవడం. ఆత్మే సకల జీవరాసులుగా అభివ్యక్తమైందని గ్రహించి ఏకత్వ భావన ఏర్పరచుకున్న నిత్య సన్న్యాసికి భేదం ఎక్కడ ఉంటుంది. ఈ అభేద భావం ఒక ఆంతరంగిక అనుభవం. భావనలో ఒక మార్పు పరిణితి అని మనకు తెలియాలి. ఉదాహరణకు బాలుడు, యువకుడు, వృద్ధుడు ఒకే ప్రపంచంలో జీవిస్తున్నా వారు గాంచే ప్రపంచం ఒకటిగా ఉండదు కదా. వారికి కనిపించే దృశ్య ప్రపంచం విభిన్నంగా ఉండటానికి కారణం బాహ్యప్రపంచం కాదు, వారి భావన యొక్క విస్తృతి. అదే తెలియదగినది.

5అ,6శ్లో.

సన్న్యాసస్తు మహాబాహో దుఃఖమాప్తుమయోగతః ।
యోగయుక్తో మునిర్బ్రహ్మ నచిరేణాధిగచ్ఛతి ||6 ||

కాని, ఓ అర్జునా! కర్మయోగమును అనుష్ఠింపక సన్న్యాసము అనగా మనస్సు, ఇంద్రియములు, శరీరముల ద్వారా జరుగు కర్మలన్నింటియందును కర్తృత్వమును త్యజించుట కష్టము. భగవత్స్వరూపమును మననముచేయు కర్మయోగి - పరబ్రహ్మపరమాత్మను శీఘ్రముగ పొందగలడు.

జ్ఞాన నిష్ఠ ప్రాప్తికి మూలం చిత్తశుద్ధిని ప్రసాదించే కర్మయోగ నిష్ఠ అని మనం చూశాం. కర్మయోగం ద్వారా ప్రాప్తించే జ్ఞాన యోగం స్వతంత్రంగా మోక్షహేతువు అవుతుంది. కానీ కర్మయోగాచరణ లేకపోతే జ్ఞానయోగం సజావుగా కొనసాగదు. ఇక యోగ యుక్తులు మాత్రమే శీఘ్రంగా బ్రహ్మాన్ని పొందుతారు అంటున్నారు. ఇక్కడ యోగ యుక్తుడు అంటే ఈశ్వరార్పణ బుద్ధితో ఫలాపేక్ష లేకుండా కర్మలను ఆచరిస్తూ చిత్తశుద్ధిని పొందిన వారు. వీరు బాహ్యకరణాలు కర్మలలో కదులుతూ ఉన్నా వారి అంతఃకరణంలో బ్రహ్మాన్ని ప్రతిష్టింప జేసుకుని బ్రహ్మత్వంలో విరాజిల్లుతూ ఉంటారు. అలాంటివారు యోగ యుక్తులు. ఇలాంటి ముని శీఘ్రంగా బ్రహ్మాన్ని పొందుతారు, ఎందుకంటే సత్యం, జ్ఞానం, అనంతం బ్రహ్మ ఇది బ్రాహ్మీ స్థితి లక్షణం. ఈ సత్యమైన జ్ఞానంతో కూడుకున్న అనంతమైన, అఖండమైన బ్రహ్మాన్ని శీఘ్రంగా పొందాలంటే ఖచ్చితంగా యోగ యుక్తులు కావాలి. అలా లేని వారికి యోగ యుక్తులు కాని వారికి జ్ఞాన ప్రాప్తి కష్టతరమవుతుంది. అందుకే పునాది లేని సౌధం లాగా సరిగమలు తెలియని సంగీతం లాగా వ్యాకరణం, వైదుష్యం లేని పాండిత్యం లాగా ఉండకూడదు కదా. కాబట్టి చిత్తశుద్ధిని ప్రసాదించే కర్మయోగం లేకుండా జ్ఞానప్రాప్తి సంపూర్ణత్వాన్ని చేరుకోదు. చిత్తశుద్ధి లేకుండా కర్మలను విడిచిపెడితే జ్ఞానఫలం అందకపోవచ్చు. కార్యం సిద్ధించడం అనేది కారణం పై ఆధారపడి ఉంటుంది. జ్ఞాన నిష్ఠ అనే కార్యానికి కారణం చిత్తశుద్ధిని ప్రసాదించే కర్మయోగ నిష్ఠ. అందుకే చిత్తశుద్ధి లేకుండా జ్ఞాననిష్ఠ కుదరదు. **2-56** లో ముని అనే మాటకు మనన శీలుడు స్థితప్రజ్ఞుడు అని తెలుసుకున్నాం. యోగయుక్తులైన మనన శీలురు శీఘ్రంగా బ్రహ్మాన్ని పొందుతారు. అయితే ఇక్కడ ఒక సందేహం రావచ్చు, జ్ఞాన నిష్ఠలో తరించిన జ్ఞాన యోగులైన మహాత్ములు కూడా ఉన్నారు కదా వారి సంగతేమిటి అని అలాంటి మహాత్ములు

కూడా కర్మయోగాచరణ ద్వారా జ్ఞాననిష్టను పొందిన వారేనని మనకు తెలియాలి. అయితే మనకు ప్రస్తుతం ఈ భౌతిక చక్షువుకు కనిపించకపోవచ్చు. వారు ఈ జన్మలో కర్మానుష్టానం చేసినట్లు మనకు కనిపించక పోయినా జ్ఞాన ప్రాప్తికి కావలసిన చిత్తశుద్ధిని ఖచ్చితంగా వారు ఎన్నెన్నో జన్మల నుంచి సంప్రాప్తింప చేసుకొని ఉంటారు. అంతేగాని చిత్తశుద్ధి లేకుండా జ్ఞానం ప్రాప్తించడం అసంభవం. కాబట్టి గత జన్మల నుండి సంక్రమించిన చిత్తశుద్ధి ప్రసాదం జ్ఞాన ప్రాప్తం ద్వారా అలాంటి మహాత్ములు జ్ఞాన యోగులుగా విరాజుల్లుతుంటారు. కాబట్టి కర్మ యోగానుష్టానం లేకుండా బ్రహ్మనిష్ఠ కలిగి ఉంటే అది ఖచ్చితంగా జన్మజన్మల ఫలమేనని మనకు తెలియాలి.

5అ,7శ్లో.

యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేంద్రియః |
సర్వభూతాత్మభూతాత్మా కుర్వన్నపి న లిప్యతే ॥ *7*

మనస్సును వశమునందుంచు కొనినవాడు, జితేంద్రియుడు, అంతఃకరణశుద్ధి కలవాడు, సర్వప్రాణులలో ఆత్మస్వరూపుడైన పరమాత్మను తన ఆత్మగా కలవాడు అగు కర్మయోగి కర్మలను ఆచరించుచున్నను ఆ కర్మలు వానిని అంటవు.

యోగ యుక్తులు, పరిశుద్ధమైన హృదయం కలవారు, తనను తాను నిగ్రహించుకున్న వారు, సర్వప్రాణుల లోని ఆత్మ తన ఆత్మ ఒక్కటేనని తెలిసినవారు కర్మలు చేస్తున్నా కర్మల చేత అంటరు.

కర్మయోగం అనుష్టించే వారికి అంతఃకరణం విశుద్ధమవుతుంది. విశేషంగా శుద్ధి జరుగుతుంది. తద్వారా దేహం, ఇంద్రియాలు వశమవుతాయి. బ్రహ్మ మొదలు గడ్డి పరక వరకు సమస్త భూతాలలోనూ తమనే చూసినవారు 'సంయగ్దర్శి' అవుతారు. అలాంటివారు లోకసంగ్రహం కొరకు కర్మలు చేస్తూ ఉన్నా కూడా కర్మలలో చిక్కు పడరు. వీరిని కర్మలు బంధించవు. ముందు శ్లోకంలో కర్మయోగం ద్వారా జ్ఞాన నిష్టను సంప్రాప్తింప జేసుకున్న వారు శీఘ్రంగా బ్రహ్మను పొందుతారని చెప్పిన జగద్గురువు ఈ శ్లోకంలో యోగ యుక్తులు కర్మ బంధాల నుండి ఎలా విడివడతారో క్రమంగా కాలాతీత స్థితిని ఎలా పొందుతారో వరుసగా నాలుగు లక్షణాల ద్వారా చాలా స్పష్టంగా పేర్కొన్నారు.

ఒకటి విశుద్ధాత్ముడు, మూలాధారం, స్వాధిష్టానం, విశుద్ధం, ఆగ్నేయం అనేవి షట్చక్రాలు. ఇందులో ఒకటి ఐదవది విశుద్ధం. విశుద్ధ చక్రం ఉండే చోటు కంఠం. ఇది పంచభూతాల్లో ఒకటైన ఆకాశం యొక్క తత్త్వం. మానవ శరీరంలో ఈ ఆరు చక్రాల స్థానాలు చాలా విశేషమైనవి. ఇవేవీ కూడా మన శరీరంలో నిజంగా భౌతిక కళ్ళకు కనిపించే అవయవాలు కావు. ఇవి ఓ అద్భుతమైన శక్తి కేంద్రాలు. ఇక్కడ విశుద్ధాత్ముడు అంటే ఈ షట్చక్రాలలోని ఐదవ స్థానమైన విశుద్ధ స్థానపు జ్ఞాన స్థితిలో ఉన్నవారు అని అర్థం చేసుకోవాలి. వేదంలో వీటి చర్చ చాలా విస్తృతంగా ఉంది. రాగద్వేషాలనే

అశుద్ధం నుండి అజ్ఞానపు అంధకారం నుండి ఇంద్రియ ప్రభావం నుండి సంపూర్ణంగా విడిపడిసత్త్వ శుద్ధిని పొందిన స్థితి. ఈ స్థితి నుండి కూడా ఎదిగి మరింత పరిపక్వతను సంతరించుకొని విశేషంగా శుద్ధిపడిని శుద్ధ చక్రం స్థితికి చేరుకున్నవారు విశుద్ధాత్ములు అదే జగద్గురువు చెప్తున్న విశుద్ధాత్మ. ఇలా విశుద్ధాత్ములైన వారు సాక్షాత్తు జ్ఞాన సాధనమైన విద్వత్ సన్యాస ప్రాప్తికి అర్హులు. అందుకనే జగద్గురువు ఐదవ శ్లోకంలో యోగ యుక్తులైన మునులు శీఘ్రంగా బ్రహ్మాన్ని పొందుతారని స్పష్టంగా తేల్చి చెప్పారు. దీన్ని బట్టి విశుద్ధాత్మ అనేది జ్ఞాన ప్రాప్తికి చాలా ప్రధానమైనదని మనకు తెలియ వస్తుంది. రెండు విజితాత్ముడు, విజితుడు అంటే తనను తాను విశేషంగా జయించినవాడు, విజితదేహుడు అని అర్థం. దేహాన్ని జయించిన వారు అంతరింద్రియాలు, కర్మేంద్రియాలతో సహా దేహాన్ని దేహపు భావాన్ని కూడా ఆత్మస్థం చేసి తాను ఆత్మగా భావించి శోభించేవారు విజితాత్ములు. యోగ యుక్తులు విజితాత్ములై ఉంటారు. మూడు జితేంద్రియులు వీరు దేహంలోని బాహ్యేంద్రియాలైన జ్ఞానేంద్రియాలపై సంపూర్ణంగా పట్టు కలిగిన వారు. యోగయుక్తులు కావడానికి మొదటగా సంయమింపజేయాల్సింది కూడా వీటినే, వీరే జితేంద్రియులు. నాలుగు సర్వభూతాత్మభూతాత్మ, సర్వభూతాలలో ఆత్మగా ప్రకాశిస్తున్నది తానేనని తన ఆత్మేనని తెలుసుకున్నవారు సర్వభూతాత్మభూతాత్ములు. ఇదే మనం మూడవ అధ్యాయంలో నిరూపించుకున్న తత్త్వమసి అది నువ్వే అయి ఉన్న స్థితి. ఈ అఖండమైన అనంతాత్మ స్థితి అనేది అద్వైతానుభూతికి సంబంధించిన విషయం. సర్వభూతాత్మభూతాత్ముడు సర్వం తానై ప్రకాశిస్తూ ఉంటాడు. సమస్తంలో వ్యాపించిన వారై ఉంటారు. ఇలాంటివారు ఆచరిస్తున్న కర్మలు ఆచరిస్తున్నా కర్మబంధం వీరిని అంటదు. కర్మ చేస్తున్నా కర్మకు లిప్తులు కారు.

5అ,8&9శ్లో.

నైవ కించిత్ కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్ ।
పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్ అశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ || 8 ||

ప్రలపన్ విసృజన్ గృహ్ణన్ ఉన్మిషన్ నిమిషన్నపి ।
ఇంద్రియాణీంద్రియార్థేషు వర్తంత ఇతి ధారయన్ ॥ 9 ||

తత్త్వజ్ఞుడైన సాంఖ్యయోగి చూచుచు, వినుచు,స్పృశించుచు, ఆఘ్రాణించుచు . భుజించుచు, నడుచుచు నిద్రించుచు, శ్వాసక్రియలను నడపుచు, భాషించుచు, త్యజించుచు, గ్రహించుచు, కనులను తెరచుచు, మూయుచు ఉన్నను ఇంద్రియములు తమతమ విషయములయందు వర్తించుచున్నవనియు, తానేమియు చేయుటలేదనియు భావించును.

పరమార్థ తత్త్వం తెలిసిన యోగ యుక్తులు చూస్తూ, వింటూ, తాకుతూ, వాసన చూస్తూ, తింటూ, నడుస్తూ, నిద్రిస్తూ, శ్వాసిస్తూ, మాట్లాడుతూ, విడుస్తూ, గ్రహిస్తూ, కళ్ళు తెరుస్తూ, మూస్తూ కూడా ఇంద్రియాలు ఇంద్రియ విషయాలలో ప్రవర్తిస్తున్నాయి గాని నేనేమీ చేయడం లేదు అని భావిస్తారు.

కర్మయోగం లేకుండా సన్యాసం పొందడం కష్టం. యోగ యుక్తుడైన మనన శీలుడు శీఘ్రంగా బ్రహ్మను పొందుతాడని ఐదు ఆరవ శ్లోకంలో తెలుసుకున్నాం. ముందు శ్లోకంలో యోగ యుక్తుడు కర్మ బంధాల నుండి విడిపడి క్రమంగా కాలాతీత స్థితిని పొందే విధానాన్ని సోపాన క్రమంగా జ్ఞాన లక్షణ సహేతుకంగా నాలుగు అంశాల ఆధారంగా చూశాం. అందులో సర్వభూతాత్మభూతాత్ములు కర్మలు చేస్తున్నా వాటికి అంటరని తెలుసుకున్నాం. ఎందుకంటే అవి తమకు సంబంధించినవిగా వారు భావించరు కాబట్టి వారికి అంటవు కదా. అయితే ఇక్కడ సాధారణ స్థాయి మనిషికి సందేహం కలిగే అవకాశం ఉంది. ఎలా జ్ఞానుల్ని కర్మలు అంటవు, వారు మనలాగా పనులు చేయరా మాట్లాడరా ఇతర కార్యాలన్నీ నిర్వహించరా మరి వారికి నాకు తేడా ఏంటి? జ్ఞానులు నడుస్తారు భోం చేస్తారు అన్ని చేస్తారు అతను జ్ఞాని అయితే, నేను భోం చేస్తాను, అన్ని కార్యాలు చేస్తాను కదా నాకు జ్ఞానికి తేడా ఏంటి అని సందేహించే అవకాశం లేకపోలేదు. అందుకే జగద్గురువు ఆ సందేహాన్ని పటాపంచలు చేస్తూ ఈ శ్లోకాలను మనం ముందు ఉంచారు. ఇందులో ప్రధానంగా **18** క్రియలు మనకు కనిపిస్తున్నాయి. ఇవి ప్రతి నిమిషం ప్రతి మనుషిలో నిరంతరం జరిగేది. జ్ఞానం అజ్ఞానంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరిలో చాలా సహజంగా జరిగే ప్రక్రియలు. ఇందులో మొదటగా పేర్కొన్న దర్శన, శ్రవణ, స్పర్శన, ఘ్రాణ అశనంబులనే అయిదు కార్యాలు జ్ఞానేంద్రియ వ్యాపారాలు. శ్రోత్రాది జ్ఞానేంద్రియాలు, శబ్దాది విషయాలలో వాటి వాటి కార్యాలను నిర్వర్తిస్తూ ఉంటాయి. తరువాత పేర్కొన్న ఐదు కూడా గమన, ప్రలాప, కర్మేంద్రియ వ్యాపారాలు. వాఘాది కర్మేంద్రియాలు, ప్రలాపాది విషయాలలో వాటి వాటి కార్యాలను నిర్వహిస్తూ ఉంటాయి. ఇక శ్వాసించడం అనే కార్యాన్ని 'శ్వసన్' గా పేర్కొన్నారు. ఈ పదం ప్రాణ క్రియకు సంబంధించిన ప్రాణాది ఐదు కార్యాలకు అంటే ప్రాణ అపాన వ్యాన సమాన ఉదాన అనే ఐదు ప్రాణేంద్రియలకు సంబంధించిన కార్యాలకు ఈ 'శ్వసన్' అనే పదం వర్తిస్తుంది. ఇప్పటికీ **15** కార్యాలు పూర్తయ్యాయి. ఇక కళ్ళు తెరవడం కళ్ళు మూయడం అనే రెండు కార్యాలు. ఇక్కడ మళ్ళీ ఒక సందేహం కలిగే అవకాశం ఉంది. 'పశ్యన్' అనే జ్ఞానేంద్రియ కార్యం చూశాం కదా, మళ్లీ ఇక్కడ కళ్ళు తెరవడం ఏంటి అని. అయితే చూడటం వేరు కళ్ళు తెరవడం వేరని మనకు తెలియాలి. కళ్ళు తెరిచి ఉన్నంత మాత్రాన చూడాలనేదేమీ ఉండదు. కళ్ళు తెరిచి ఉన్నంత మాత్రాన వారు చూశారు అని మనం అనుకోవడానికి వీలు లేదు. కళ్ళు తెరవడం వేరు, తెరిచిన తర్వాత చూడటం వేరు. చూడాల్సిన పని లేకపోయినా చూడాలని అభిప్రాయం లేకపోయినా కళ్ళు తెరవడం అనేవి సహజంగా అసంకల్పితంగానే జరిగిపోతూ ఉంటాయి. అయితే చూడటం అనేది సంకల్పిత కార్యం. ఇక్కడితో ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు, ఐదు ప్రాణేంద్రియాలు, కళ్ళు మూయడం, తెరవడం, ఇంతటితో **17** కార్యాలు పూర్తయ్యాయి. చివరిది**18**వ ప్రక్రియ 'స్వపన్'. నిద్రపోవడం ఈ క్రియ ప్రత్యేకమైనది విశిష్టమైనది కూడా కాబట్టి ఓ వినూత్నమైన దృక్కోణంలో దీన్ని పరిశీలిస్తే ఈ అంశం మనకు బోధపడుతుంది. నిద్ర

కూడా ఒక కార్యమే నిద్రపోవడం అంటే విరామం పనుల నుండి విరమించడం, విరామం కదా. ఈ క్రియ ద్వారా శరీర అలసట తీరి విశ్రాంతిని కూడా కనుక ఇది ఓ ప్రత్యేకమైన విశిష్టమైన కార్యంగా మనం పరిగణించాలి. సాధారణ స్థాయి మనుషులు చేసేవారు చూస్తున్నాం అని వినేవారు వింటున్నాం అని అనుకుంటారు. కానీ వీటన్నింటికీ భిన్నంగా ఈ కార్యాలన్నీ సహజంగా జరుగుతూ ఉన్నా కూడా తానేమీ చేయడం లేదు అని భావిస్తూ విలక్షణంగా వినూత్నంగా ఉండే సాక్షిభూతులు సర్వభూతాత్మలు జ్ఞానులు మీరే తత్త్వవిధులు, వీరే ఆత్మతత్త్వం యదార్థంగా తెలిసినవారు. పరమార్థాన్ని దర్శించిన వారు, తత్త్వంఅసి అది నీవే అయి ఉన్నావు అని **3-15**లో మనకు నిర్ధారణ అయింది. **3-27**లో మనం నిరూపించుకున్న ఆత్మీయ పరబ్రహ్మం **3 -28** లో మనం దర్శించిన తత్వవిత్తు. ఈ మూడు అంశాల ఆధారంగా ఇప్పుడు ఈ శ్లోకాన్ని చర్చించిన అంశాలతో సమన్వయం చేసి ఈ శ్లోకాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవాలి. ఈ దృష్టితో చూస్తే నేను ఏమీ చేయడం లేదు అనే మాట సాక్షిభూత స్థితి మనకు అనుభవేద్యం అవుతుంది. దీన్నిబట్టి సర్వ కార్యాలు, ఆయా ఇంద్రియాలకు ప్రాణాలకు అంతఃకరణానికి సంబంధించినవే గాని ఆత్మ సాక్షిగా జీవిస్తున్న ఆత్మకు కాదని మనకు తెలియ వస్తుంది. ఆయా ఇంద్రియాలు ఇంద్రియాలలో, గుణాలు గుణాలలో ప్రవర్తిస్తున్న అంశాల్ని దర్శించగలిగిన తత్త్వవిధుడు జరుగుతున్న క్రియలకు కర్త కాదని తెలుసుకుని నిర్ణయించుకున్న నిశ్చయంతో భావిస్తున్నారు. వాటిని సాక్షిగా దర్శిస్తూ ఆత్మస్వరూపంతో వెలుగొందుతూ ఉంటారు. అందుకే వీరు జ్ఞానులు, తత్త్వవిదులు. తాను ఉండటం వలన ఇంద్రియాలు ప్రవర్తిస్తున్నాయి, జన ప్రకాశాన్ని అనుసరించే ఇంద్రియాలు సర్వకార్యాలను నిర్వర్తిస్తున్నాయి, వాటి ప్రవర్తనకు ఆధారమైన ప్రకాశం తానే కానీ ఆ కర్మలు ఏవి కూడా తనను అంటవు, తాను ప్రకాశకుడే కానీ ప్రవర్తకుడు కాదని మనకు తెలియాలి. సూర్యుని ప్రకాశంలో ఎందరో ఎన్నో కార్యాలు నిర్వర్తించుకుంటూ ఉంటారు. ఆ కార్యాలు వాటి ఫలితాలు నిర్వాహకులకే సంబంధించినవిగా ఉంటాయి గాని ప్రకాశాన్ని ప్రసాదిస్తున్న కర్మసాక్షి అయినటువంటి సూర్యదేవునికో, ఆదిత్యునికో అంటవు కదా. అలా దీపపు వెలుగులో ఎవరు ఏ పనులు చేసినా వాటి ఫలాలు చేసిన వారికే చెందుతాయి గాని దీపానికి కాదు. సూర్యుడైనా దీపమైనా ప్రకాశాలే గాని ప్రవర్తకాలు కావు. అదే యోగాయుక్తులైన తత్త్వవిధులు ఈ విధంగా భావిస్తారు. ఈ శ్లోకంలోని అన్ని అంశాలను మనం సంగ్రహించుకున్న తరువాత మనకు అర్థమయ్యేది మన దేహంలోని సర్వ ఇంద్రియాల ప్రవర్తన అంతా కూడా ఆయా ఇంద్రియాలకే చెందుతాయి కానీ ప్రకాశిస్తున్నటువంటి ఆత్మసాక్షికి కాదని మనకు తెలియ వస్తుంది.

5అ,10శ్లో.

బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః |
లిప్యతే న స పాపేన పద్మపత్రమివాంభసా || 10 ||

కర్మలనన్నింటిని భగవదర్పణము గావించి, ఆసక్తిరహితముగ కర్మలనాచరించు వానిని తామరాకుపై నీటిబిందువులవలె పాపములు అంటవు.

ఫలాపేక్ష లేకుండా ఈశ్వరార్పణంగా కర్మలను ఆచరించే వారిని తామరాకును నీరు అంటనట్లు పాపం వీరిని అంటదు. ఆత్మవిధుడు, పరమార్ధాన్ని దర్శించిన జ్ఞానులు నిరంతరం కర్మల్లో చరిస్తున్నా వారిని కర్మలు అంటవని తెలుసుకున్నాం. ఈశ్వరార్పణ బుద్ధితో కర్తవ్య కర్మల్ని నిర్వహించే కర్మయోగి కూడా కర్మల చేత అంటరనే విషయాన్ని మరియు కర్మయోగి కర్మల్లో ప్రవర్తించే తీరును ఈ శ్లోకం నిర్ధారణ చేస్తుంది. ఫలాన్ని ఆశించి కర్మ చేసేవాడు కర్త, కర్త ఆచరించిన కర్మ యొక్క ఫలం కర్తకే చెందుతుంది.
కర్మ సంగం, ఫల సంగం ఉండటం చేత కర్మలు కర్తను బంధిస్తాయి. కర్మల చేత కర్త బద్ధుడు అవుతాడు. అయితే కర్మయోగి తాను చేసే కర్మలను పరమేశ్వరుని యందే ఉంచుతాడు, సమర్పిస్తాడు. ఈ విషయంపై ధృఢనిశ్చయాన్ని కలిగి ఉంటాడు కూడా. కర్మలను పూజగా మలచుకుని సేవకుడు యజమాని కోసం కర్మ చేసినట్లు ఈశ్వరునికి దాసుడై కర్తవ్యకర్మలను ఆచరించేవాడు కర్మయోగి. ఈ కర్మ యోగమనేది మోక్షసాధనకు ఒక అద్భుతమైన ప్రక్రియ. ప్రతి పనిని పూజగా మార్చుకోగలిగే ఆరాధన భావం ప్రతి కార్య క్షేత్రాన్ని ఆలయంగా మలచుకోగలిగే అసమాన వైభవం కర్మయోగం. మనం దేవాలయంలోకి పూజ గదిలోకి ప్రవేశించినప్పుడు మనకు మనమే ఇతరత్రా ఆలోచనలను పక్కకు నెట్టి దైవం పైనే దృష్టిని నిలపడానికి ప్రయత్నిస్తాం. కర్మయోగంలోజరిగేది ఇదే. ప్రతి కార్యము వెనుక ఈశ్వరార్పిత భావన, ప్రతీ కర్మ దైవం కోసమే అనే భావన జీవితాన్ని చాలా అద్భుతంగా ప్రశాంతంగా తీర్చిదిద్దుతుంది. కర్మలను కైంకర్యంగా మలచుకునే గొప్ప అవకాశం నాకంటూ ఏమీ లేదు, నాదంటూ ఏదీ లేదు అనే స్థిర చిత్తంతో విశ్వవ్యాపకవిశ్వాలయంలో ఒక పూజారిగా ఒక సేవకుడిగా ఒక దాసుడిగా ఉంటూ కర్మలను బ్రహ్మంలో నిక్షిప్తం చేయడం. కర్మ నాది అనుకుంటే అది నాది అవుతుంది, కాదు అనుకుంటే కాకుండా పోతుంది. తాను ఆచరించే కర్మే అయినా తత్త్వవిధుడు కర్మలో అకర్మను దర్శించడం వల్ల **5-3** లో చెప్పుకున్నట్లు, కర్మయోగి కూడా కర్మసంగం, ఫలసంగం లేకుండా చేయడం వల్ల కర్మబద్ధుడు కాడు. కర్మలు కర్మయోగిని అంటవు, ఎలా అంటదో ఉపమానాన్ని ఉదహరించి మరీ చెప్పారు. నీటిలోని తామరాకును ఎలా నీటి చేత అంటుకోదో అలాగే కర్మలను ఆచరిస్తున్నా యోగ యుక్తుడైన కర్మయోగి కూడా కర్మల చేత అంటుకోడు. మన భారతీయ సంప్రదాయంలో తామర పువ్వుకు తామరాకుకు ఓ విశిష్టమైన స్థానం ఉంది. ఆ విశిష్టత ఏమంటే ఆ తామరాకును చూసిన మనం కూడా అదే స్వచ్ఛతను జ్ఞానాన్ని కలిగి ఉండాలి అని. ఆ ఆకుకు వున్న జ్ఞానం మనకూ కలగాలని విశ్వ సృష్టికర్త ఆ ఆకును ప్రకృతిలో మన కళ్ళ ముందు ఉంచాడు. ఎగిరే పక్షిని చూసి గాలిలో ప్రయాణించే విమానాన్ని కనుక్కోవాలనే జ్ఞానం వైమానిక శాస్త్రవేత్తకు ఉదయించింది. అలా ప్రకృతి మనకు జ్ఞాన

ప్రసాదిత గురువు అయితే పరిశీలనతో చూసినవారు జ్ఞానం పొందుతారు. అయితే ప్రకృతిని పట్టించుకోక ప్రకృతి తన అవసరాలకే ఉందనే అహంభావంతో ప్రకృతిని వాడుకునే వారు అజ్ఞానులు. నిరంతరం మనకు కనిపించే తామరాకును ఉపమానంగా ఉదహరించి కర్మయోగాన్ని కర్మయోగాచరణ విధానాన్ని మనకు అనుభవేద్యం చేయిస్తున్న జగద్గురువుకు ప్రణమిల్లుదాం.

5అ,11శ్లో.

కాయేన మనసా బుద్ధ్యా కేవలైరింద్రియైరపి |
యోగినః కర్మ కుర్వంతి సంగం త్యక్త్వాత్మశుద్ధయే || 11 ||

కర్మయోగులు మమతాసక్తి రహితులై కేవలము ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, శరీరముల ద్వారా అంతఃకరణ శుద్ధికై కర్మలను ఆచరింతురు.

ఫలాపేక్షతో కాక ఆత్మశుద్ధి కోసం కర్మయోగులు కేవలం శరీరంతో మనసుతో బుద్ధితో ఇంద్రియాలతో వట్టిగా ఎలాంటి ఫలాపేక్ష లేకుండా కర్మలు ఆచరిస్తారు. ముందు శ్లోకంలో తత్త్వవిధులు జ్ఞానులలాగే కర్మయోగికి కూడా కర్మలు అంటవు అని చెప్పిన జగద్గురువు ఈ శ్లోకంలో కర్మయోగి తన దేహంతో కర్మయోగాన్ని ఆచరించే విధానాన్ని వివరిస్తున్నారు. ఇందులో కల్మషం లేని ఇంద్రియాలు మోహాభిమాన రహితంగా ఆయా కారణాలచే కార్యాలు చేయడమని అర్థం చేసుకోవాలి. ఈ కర్మ ప్రపంచంలో మనం ఉన్నప్పుడు మనం వ్యవహరించాల్సిన విధానం ఇందులో కనిపిస్తుంది. అందుకే దేహం మనసు బుద్ధి ఈ మూడింటి పట్ల మనం వ్యవహరించాల్సిన విధానం వీటి అర్థం, ఆంతర్యం మనకు ఈ శ్లోకంలో స్పష్టంగా తెలుస్తుంది. ఈ శరీరం మనసు బుద్ధి వాటి యొక్క పరిమితుల్ని బాధ్యతల్ని గుర్తెరిగి కర్మయోగంలో మనం ఈ కర్మ ప్రపంచంలో ప్రవర్తించినప్పుడు అలాంటి కర్మయోగులకు లోకానుభవం కానీ కర్మానుభవం కానీ ఉండదు. ఆకాశంలో పక్షి విహరించినట్లు అదో అద్భుత ప్రపంచం అలా విహరించిన పక్షి తన యొక్క ప్రయాణ మార్గపు ఆనవాళ్లను కూడా ఆ పక్షి గుర్తెరగదు, ఆలోచించదు. అదేవిధంగా నీటిలో వెళ్లే నావ కూడా అది ప్రయాణించే దారికి సంబంధించినటువంటి ఆనవాళ్లు కనిపించదు. అలా కర్మలలో అకర్మను చూసే కర్మయోగి అద్భుత, అవ్యక్త, అలౌకిక, స్వేచ్ఛాయుత పక్షి స్థితిలో కొనసాగుతూ ఉంటాడు. ఇలా కర్మల పట్ల ఇలాంటి అవగాహన, వివేకం ఉన్నవారు కర్మయోగులు, విశుద్ధాత్ములు, విజితాత్ములు, జితేంద్రియులు అని **5-7** లో చూశాం. వీరు కర్మలను ఆచరించే వారే గాని కర్మకు దూరమై ఫలాయనాన్ని కాంక్షించేవారు కాదు. కర్మలను ఆచరించే యోగులు కేవలం దేహం చేత మనసు చేత బుద్ధి చేత ఇంద్రియాల చేత మాత్రమే కర్మలు చేస్తుంటారు. ఇక్కడ కర్మయోగుల కర్మాచరణకు అయోగుల కర్మాచరణకు తేడా ఏమంటే కర్మయోగులకు నిత్యానిత్య వివేకం ఉంది, అనిత్య ఫలాలపై ఆశ, ఆసక్తి ఉండదు. అయోగులు ఫలాపేక్షతో ఉంటారు, నిత్యా నిత్య వివేకం వల్ల కర్మయోగి మనసుతో సంకల్పించి చేయవలసింది ఏదో గుర్తించి ఆ గుర్తించిన దాన్ని బుద్ధితో నిశ్చయించి మమత్వం లేకుండా ద్వంద్వాతీతమై రాగద్వేష రహితంగా కేవలం

ఇంద్రియాల మనోబుద్ధుల ద్వారా వివేకంతో విహిత కర్మలను ఆచరించి కర్మ యోగిగా శోభిస్తాడు. కాబట్టి ఇక్కడ ధర్మ దృష్టి దైవదృష్టి ధర్మాచరణే ఉంటుంది. తద్వారా చిత్తశుద్ధి ఈ పరిశుద్ధాత్మ ద్వారా మోక్షసిద్ధి. దీన్నిబట్టి మనం యోగులు, అయోగులు ఇద్దరిలోనూ కర్మాచరణ ఒకే విధమైన వాటి ద్వారానే జరుగుతున్నా కర్మాచరణ భావనలో ఉన్న తేడాను సుస్పష్టంగా గ్రహించవచ్చు. యోగి ఫలసంగమే లేకుండా కర్మలను ఆచరించి శాంతిని పొందుతుంటే అయోగి అదే దేహేంద్రియాల ద్వారా ఫలాసక్తితో కర్మలను ఆచరించి బద్ధుడవుతున్నాడు.

5అ,12శ్లో.

యుక్తః కర్మఫలం త్యక్త్వా శాంతిమాప్నోతి నైష్ఠికీమ్।
అయుక్తః కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే ||12 ||

నిష్కామ కర్మయోగి కర్మఫలములను త్యజించి, భగవత్ప్రాప్తి రూపమైన శాంతినిపొందును. కర్మఫలాసక్తుడైనవాడు ఫలేచ్ఛతో కర్మలనాచరించి బద్ధుడగును.

ఈశ్వరునిపై మనసు నిలిపి ఫలం కోరకుండా కర్మలు చేసే యోగి ఆ నిష్ట వల్ల శాంతిని పొందుతాడు. అయితే ఫలాసక్తి గల అయోగి కోరికల ద్వారా కర్మబంధంలో చిక్కుకొని బద్ధుడు అవుతున్నాడు.

ముందు శ్లోకంలో కర్మయోగి కర్మలాచరించి శాంతిని పొందే విధానాన్ని వివరించిన జగద్గురువు ఈ శ్లోకంలో యోగుల కర్మాచరణకు అయోగులకర్మాచరణకు ఉన్న తేడాను స్పష్టంగా మనముందు ఉంచాడు. నీవు యోగివిగా ఉంటావో అయోగివిగా ఉంటావో అనే ఆలోచనను ప్రశ్నను నిర్ణయాన్ని కూడా కర్మ స్వేచ్ఛ ఉన్న మనిషికే వదిలి పెట్టాడు జగద్గురువు. కర్మ ఫలాన్ని విడిచిన ఆత్మ యోగారూఢుడు తాను ఆచరించే కర్మలు ఈశ్వరుని కోసమే గాని తనకోసం కాదు అనే భావన గలవారు కర్మ యోగులని చూశాం. వారే యోగయుక్తులని కూడా తెలుసుకున్నాం. కర్మఫలాపేక్ష లేని కర్మయోగి మాత్రమే శాంతిని పొందగలడు. ఈ శాంతిని ఇక్కడ 'నైష్టికీమ్' అంటున్నారు. ఇక్కడ నిష్ట అంటే కర్మ యోగ నిష్ట అని అర్థం. నిష్ట ద్వారా ప్రాప్తించేది కర్మయోగ నిష్ట లో కలిగిన అంతఃకరణ శుద్ధిచేత ప్రాప్తించే ప్రశాంత చిత్తమే ఇక్కడ 'నైష్టికీమ్' గా తెలియజేస్తున్నారు. అందుకనే కర్మయోగ నిష్ట ద్వారా చిత్తశుద్ధి తద్వారా జ్ఞాన ప్రాప్తి. కారణం కర్మయోగ నిష్ఠలో రాగద్వేషాలు గాని, ఇష్టా అయిష్టాలు గాని ద్వంద్వాలు కానీ ఉండవు. అప్పుడు కల్లోలానికి గురయ్యే అవకాశం లేదు. కర్మఫలాలపై ఆందోళన అలజడి అస్సలు ఉండదు. ఏదో రావాలని కావాలని కర్మ చేస్తే అశాంతి కదా ఇక్కడ లేదు కాబట్టి చిత్తం పరిశుద్ధమవుతుంది. ఇదే జ్ఞాన సంప్రాప్తికి కారణం. ఇది యోగయుక్తుని జీవన విధానం. కర్మయోగ నిష్ఠ ద్వారా కర్మ ఫలాసక్తిని వీడిన వారు ఆ నిష్ఠ ద్వారా శాంతిని పొందుతున్నారు. అయోగులు అవివేకులు, అవిపస్త్యుతులను గురించి మనం ముందు శ్లోకాల్లో అనేక సందర్భాల్లో చూశాం. వీరు ఫలాసక్తి కారణంగా

సుఖశాంతులను తమకు తాము స్వయంగా కోల్పోతున్నారు. తమ అశాంతికి అలజడికి వారు ఎదుర్కొంటున్న అనేక రకాల ఇబ్బందులకు కారణం స్వయంగా వారే తప్ప మరొకరు కాదని తెలియాలి. ముందుగా అయోగులు ఈ అంశాన్ని ఖచ్చితంగా గుర్తించాలి. ఆ ఫలాసక్తి బంధంలో చిక్కుకోవడం వల్ల వారు నిరంతరం దుఃఖానికి గురవుతూ ఉంటారు. ఈ దుఃఖానికి కారణం ఫలాసక్తే అని స్పష్టంగా జగద్గురువు ఇక్కడ వివరించాడు. అంటే మన సర్వ సమస్యలకు కారణాన్ని కూడా ఈ శ్లోకంలో మన ముందు ఉంచాడు. ఎందుకంటే మన చిటికెన వేలు పట్టుకొని నడిపించి తనతో పాటు తన దగ్గరికి తీసుకెళుతున్న తరుణంలో ఎక్కడా కూడా సందిగ్ధతకు సందేహాలకు తావు ఉండకూడదు అని ఏ కారణం చేతనూ మళ్ళీ మన మనసు ఫలాసక్తి వైపు భౌతికపు ఇచ్చకపు కోరికల వైపు మన దృష్టి మరలకూడదనే ఉద్దేశంతో ఈ శ్లోకాన్ని పేర్కొన్నారు. పొరపాటున కూడా ఫలాసక్తి జనిస్తే వెంటనే దాన్ని వెంబడిస్తూ దుఃఖం మనల్ని ఆవహించి ఉక్కిరిబిక్కిరి చేస్తుందనే ఎరుకను కూడా మనం మరువరాదు. ఈ బ్రహ్మవిద్య అధ్యయన విధానంలో ఈశ్లోకంలో మనకు మరపు తెలియని ఎరుక కూడా మనలో నిక్షిప్తం కావాలి. ఇదే సర్వ సమస్యలకు సమాధానం ఈ ఫలాసక్తి అనేది 'కామ కారేణఅయుక్తః' అన్నారు. అంటే కామ ప్రేరణ ద్వారా అయోగులకు ఈ పరిస్థితి సంభవిస్తుంది. ఈ విషయం **2-62, 2-63** లో చూశాం. ఈ ప్రేరణ ద్వారా మనిషి పతనమయ్యే విధానాన్ని అక్కడ చూశాం. ఇక్కడ అది మనలో ఆచరణ జరిగిపోవాలి. మనిషి ఆ పతనమయ్యే విధానాన్ని తెలుసుకొని ఆ మార్గంలో వెళ్లకుండా జగద్గురువు మార్గంలో ప్రయాణం చేసి అలా ఫలాసంగం లేకుండా అయోగత్వం నుంచి యోగత్వంలోకి ప్రవేశించాలి. ఖచ్చితంగా మన నిజజీవితంలో నిత్యం ఆ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని **2-62, 2-63** లోని ఆ సమస్యకు ఈ శ్లోకం సమాధానం అని మనం గుర్తించి ఎరుక స్థితిలో స్థిరీకృతం కావాలి. జగద్గురువు చెప్పిన కామ కారేణ అంటే అర్థం అవసరం లేని కోరిక ద్వారా ప్రేరేపింపబడిన వారు, కోరికల ప్రేరణకు గురి అయిన వారు, కర్మల సుడిగుండంలో చిక్కుకొని కర్మ చట్రం, చట్టంలో దిక్కుతోచక దారి తెలియక కొట్టుమిట్టాడుతూ ఉండేవారు. అందుకని జగద్గురువు నువ్వు యోగివికా, కర్మ బంధాల నుండి విముక్తులు కావడానికి ఇదే రాజబాట అని **2-50** లోనే పిలుపునిచ్చిన సంగతి మనకు తెలుసు. ఆ అంశాలన్నీ దృష్టిలో ఉంచుకొని ఇప్పుడు చర్చించుకున్న అంశాలతో సమన్వయం చేసి యోగులకు, అయోగులకు తేడాను గమనించి యోగత్వం వైపు పయనించాలనే ఎరుక ఆచరణను మనలో మనం కొనసాగించి యోగులుగా విరాజిల్లాలి. ఈ అంశం మనలో మరింత పటిష్టంగా వీళ్ళూనుకోవాలి. భగవంతుని చేరడం కోసమే అనే వాస్తవిక సత్యం మనకు దర్శనం అవ్వాలి. ఆ దర్శనం పొందగలిగితే మనిషి ధన్యుడవుతాడు. మనం కూడా ఇటువంటి అంశాలను గమనించి పొట్టకూటి కోసమే కర్మ అనుకోకుండా కర్మలో దైవాన్ని దర్శించి జ్ఞానాన్ని పొందగలగాలి.

5అ,13శ్లో.

సర్వకర్మాణి మనసా సన్న్యస్యాస్తే సుఖం వశీ |
నవద్వారే పురే దేహీ నైవ కుర్వన్ న కారయన్ || 13 ||

అంతఃకరణమును అదుపులోనుంచుకొని, సాంఖ్యయోగమును ఆచరించు పురుషుడు కర్మలను ఆచరింపకయే, ఆచరింపజేయకయే, నవద్వారములు గల శరీరమునందు సమస్త కర్మలను మానసికముగా త్యజించి, సచ్చిదానంద ఘనపరమాత్మ స్వరూపమున స్థితుడై, ఆనందమును అనుభవించును.

ఇంద్రియాలను సంయమింప చేసిన పురుషులు సమస్త కర్మల్ని విడిచిపెట్టి అంటే ఇక్కడ కర్మ ఫలాలను విడిచిపెట్టి అని అర్థం చేసుకోవాలి. ఏమి చేయని వారై చేయించని వారై తొమ్మిది ద్వారాలు గల ఈ దేహం అనే పట్టణంలో సుఖశాంతులతో హాయిగా ఉంటున్నారు.
మనిషికి ప్రధానమైనది చిత్తశుద్ధి అందుకు ఆచరించాల్సింది కర్మయోగ నిష్ఠ, తద్వారా జ్ఞాన ప్రాప్తి మోక్షసిద్ధి ఇది కర్మ నిష్ఠ ప్రయోజనం. ఇక జ్ఞాన యోగి విషయానికి వస్తే వీరు కూడా గత జన్మల సుకృతం ద్వారా మనకు జ్ఞాన యోగులుగా దర్శనమిస్తారు. భౌతికమైన పనులను వీరు సన్యసించినట్లు మనకు కనిపిస్తుంది కానీ వారు ముందు జన్మల్లో సంప్రాప్తించిన చిత్తశుద్ధితో జ్ఞాన సముపార్జన గావిస్తూ బ్రాహ్మీ స్థితిలో విరాజిల్లుతూ లోక కళ్యాణ కార్యక్రమాల్లో నిమగ్నమై ఉంటారు. ఇది జ్ఞాననిష్టకు జ్ఞానులకు సంబంధించిన విషయం. **5-11** లో కర్మయోగాచరణ విధానం చూశాం. అయితే ఈ శ్లోకంలో జగద్గురువు ప్రతిపాదిస్తున్న ప్రధానమైన అంశం ఏమంటే ఈ దేహంలో ఉంటూ కూడా దేహి స్థితిలో ఉండి జ్ఞానులు ఎలా తమ జీవితాన్ని కొనసాగిస్తున్నారు, ఎలా సుఖశాంతులతో ఉంటున్నారు అని. మనం ముందు అధ్యాయాలలో ఈ అంశాన్ని చూశాం. ఈ శ్లోకంలో వాటిని ఆచరించే విధానాన్ని మన ముందు ఉంచారు. ఈ అధ్యాయం అంతా కూడా ఆచరణ పూర్వకమైనదిగా మనం భావించాలి. **5-3** లో మనం 'జ్ఞేయః స నిత్య సన్న్యాసీ' అనే మాటను సమగ్రంగా చూశాం ఆ అవగాహన ఉంటేనే ఈ శ్లోకం మనకు అనుభవేద్యమవుతుంది. సత్తుతో మూల శక్తితో కూడి ఉన్నవారు కదా. బ్రహ్మం బ్రహ్మ జ్ఞానం వేరు కాదనే స్థితిలో ఉండటం ఇది జ్ఞాన నిష్ఠ యొక్క ఫలం. ఇంద్రియ సంయమం ఫలితం చిత్తశుద్ధి దాని ఫలితం జ్ఞానం అయితే జ్ఞాననిష్ఠ ఫలితం ఈ శ్లోకంలో ప్రతిపాదించిన అంశం. ఈ బ్రహ్మజ్ఞానంతో స్థితమై ఉన్న జ్ఞాన కర్మ సన్యాసి సుఖశాంతులతో ఉంటాడు. జ్ఞాన కర్మ సన్యాసి అంటే తాను జ్ఞాని అన్న భావాన్ని కూడా శూన్యం చేసిన వారు అని అర్థం. ఎందుకంటే తనకు తాను తాను జ్ఞాని అనుకున్నప్పుడు కూడా అహం పరిపాలనలోకి వచ్చే అవకాశం ఉంది అది కూడా ఉండకూడదని జగద్గురువు ఇక్కడ అప్రమత్తం గావిస్తున్నాడు. సర్వ కర్మల ద్వారా పొందిన జ్ఞానాన్ని కూడా సన్యసించినవారు అంటే ఆ జ్ఞానాన్ని కూడా మూలంలో మూలశక్తిలో ఐక్యం చేసిన వారు, విలీనం చేసిన వారు. నిజానికి మనం ఆలోచిస్తే మనం చేయగలిగిన సుసాధ్యమైన సున్నితమైన

అంశం ఇది. అంటే గాలిని నీటిని సూర్యుణ్ణి చంద్రుని ప్రకృతి శక్తుల్ని కాదు కదా మనం సంయమించాల్సింది ఇలాంటి తార్కికత మన బుద్ధికి తెలియజేస్తే మనల్ని మనం సంయమింప చేసుకోవడం తద్వారా క్రమంగా ఈ శ్లోకంలో జగద్గురువు ప్రతిపాదించిన స్థితిని పొందడం చాలా సులభతరం అని మనకు అనుభవేద్యమవుతుంది. అనవసరమైన పనుల్లోకి వెళ్లి స్వధర్మాచరణను విడిచిపెట్టి అల్లకల్లోలానికి గురై అవస్థలను అనుభవించడం కంటే ఇది చాలా అనువైన సులువైన సులభతరమైన మార్గం కదా ఇది ఈ సత్యం మనకు తెలిసి రావాలి. అందుకే ఇక్కడ జగద్గురువు 'వంశీ దేహీ' అన్నారు అంతేగానివశీ గాలి వశీ నీరు అని మనకు సాధ్యం కాని పనిని బాధ్యతను మనకు అప్పజెప్పలేదు కదా. కాబట్టి ప్రతి మనిషి 'వసీదేహీ' అనే కార్యానికి అర్హులేనని గుర్తించాలి. దేహంలో ఉండే ఆత్మ సాక్షి ఆధారంగా దేహాన్ని 24 తత్త్వాలతో సహా వశం చేసుకున్న వారు. అలాంటివారు సుఖశాంతులతో ఉంటారు. 'సర్వకర్మాణి మనసా' వివేక బుద్ధిని ఉపయోగించి సర్వకర్మలను మనసు నుంచి త్యజించినవారు. కారణం మనసు ఒక్కటే అన్ని ఇంద్రియాలకు రారాజని మనం మూడవ అధ్యాయం **40** నుంచి **43** వరకు గల శ్లోకాలలో చూశాం. ఆ అవగాహనతో ఈ అంశాన్ని అర్థం చేసుకోవాలి. ఇలా సర్వకర్మ సన్యాసి, జ్ఞాన కర్మ సన్యాసి అయినా బ్రహ్మ స్థితిని పొందిన వారు ఎక్కడ ఉంటారు అంటే దేహంలోనే, అందుకే దేహం దేవాలయం. ఇదో అద్భుతమైన పురం పట్టణం ఇందులో అన్నీ అందాలే ఉంటాయి. అయితే ఈ దేహం అనే పట్టణంలోని అన్నీఅందాలను ఆధ్యాత్మిక అవగాహనతో బ్రాహ్మీస్థితితో ఉండి సాక్షిగా ఆస్వాదించాలి. ఈ నవద్వారపురం అనే దేహపు పట్టణం విశేషాలను ఉపనిషత్తులు చాలా విశేషంగా వివరించాయి. పదకొండు ద్వారాలు గల దేహం జన్మ రహితమైన ఆత్మ యొక్క గర్భం ఈ విధంగా ధ్యానించిన వ్యక్తి దుఃఖం నుంచి విడివడతాడు. స్వతంత్రుడై జన్మల నుంచి విముక్తుడు అవుతాడు. దేహాన్ని ఒక అవరోధంగా భావించాను కానీ దేహంలో భగవంతుడు కొలువు తీరి ఉన్నాడని చూశాక దానిని ఒక దేవాలయం గా భావించి జాగ్రత్తగా కాపాడుతున్నాను అని ఒక మహాత్ముడు చెప్పాడు. అలాగే ఉపనిషత్తులు కూడా దేహాన్ని గర్భంగా వచించాయి. దేహాన్ని ఎలా పోషించాలో అన్నదానికి ఈ మంత్రాలు చాలా స్పష్టంగా దారి చూపుతాయి కూడా. దేహాన్ని ఎన్నడూ ద్వేషించరాదు ఒక అవరోధం కూడా భావించరాదు. ఆత్మను గ్రహించడానికి భగవంతుడు మనకు ప్రసాదించిన పరికరమే దేహం అనే భావన మనలో ఉండాలి. ఇందులో మానవదేహాన్నినవరంధ్రాలతో పాటు పైభాగాన నడి నెత్తిన ఉన్న బ్రహ్మరంధ్రం దిగువ భాగాన ఉన్న నాభితో కలిసి **11** ద్వారాలుగా పేర్కొంది కఠోపనిషత్. ఇలా ఈ దేహేంద్రియాల్ని దేహాన్ని వశం చేసుకున్న వారిని వశీదేహి అని భగవద్గీత చెప్తే శ్వేతాశ్వతర ఉపనిషత్తు చరాచర ప్రపంచాన్ని వశపరచుకున్న వారు వశీ అని చెప్పి ఆత్మ యొక్క సర్వవ్యాపకత్వపు శక్తిని స్పృశించింది. నవ ద్వారములు గల ఈ శరీరంలో నివసించేది ఆయనే. ఈ బాహ్య ప్రపంచంలో క్రీడించేది ఆ ఆత్మయే. చరాచర సకల ప్రపంచానికి ప్రభువు ఆయనే అని దీనర్థం. పురం రాజు ఆధీనంలో ఉంటుంది. కానీ పురం పేరు రాజు పేరు కదా, రాజు స్వతంత్రుడై శోభిస్తాడు. అదేవిధంగా దేహమనే పురం పట్టణం దేహి అయిన రాజు ప్రభువు వశీ ఆధీనంలో ఉండాలి. అందుకే మనం ఒకటవ అధ్యాయం ఒకటవ శ్లోకం నుంచి మనిషి అంటే ఇద్దరని ఒకటి దేహం రెండు దేహిఅని చెప్పుకున్నాం. రాజు సర్వకార్యాలను స్వయంగా చేయక పురవాసులతో తన

సన్నిధిలో ఉంటూనే వారిని తన వశంలో ఉంచి సర్వకార్యాలు జరిపించినట్లు ఈ దేహపు కార్యకలాపాలు కూడా మనలోని ఆత్మిక రాజు యొక్క ప్రకాశంతోనే కదులుతూ ఉంటాయి, జరుగుతూ ఉంటాయి. ఆత్మ దేహంలో ఉండటం వల్లనే నవద్వార పురమైన దేహంలో సమస్త కార్యాలు జరుగుతూ ఉంటాయి. కాకపోతే పురవాసులు రాజు ఆజ్ఞ మేరకు నడుచుకున్నట్లు దేహి ఆజ్ఞ మేరకు దేహంలోని సర్వ ఇంద్రియాలు ప్రవర్తిల్లాల్సిన అవసరం ఉంది. అవన్నీ కూడా ఆ ప్రభువును సేవించే పౌరులు మాత్రమే. అయినా కూడా ఆత్మ అకర్తే. ఎలా అకర్తవుతాడనే అంశాల్ని ముందు అధ్యాయాల్లో సవివరంగా చూశాం. దేహం దేహికి పరిమితం కానీ దేహి మాత్రం దేహానికి మాత్రమే పరిమితం కాదని అది విశ్వవ్యాపక శక్తిని కలిగి ఉందని మనం గ్రహించాలి.

5అ,14శ్లో.

న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః ।
న కర్మఫలసంయోగం స్వభావస్తు ప్రవర్తతే ॥ 14 ||

పరమేశ్వరుడు మానవుల యొక్క కర్తృత్వమునుగాని, వారి కర్మలనుగాని, కర్మఫల సంయోగమును గాని సృజింపడు. ఈ యన్నింటిలో ప్రకృతియే ప్రవర్తిల్లును. అనగా గుణములే గుణములయందు ప్రవర్తిల్లుచుండును.

భగవంతుడు లోకానికి కర్తృత్వం కలిగించడు. కర్మను కర్మ ఫల సంబంధాన్ని కలిగించడు. స్వాభావికమైన ప్రకృతే అలా చేయిస్తూ ఉంటుంది. ప్రభువు అంటే ఆత్మ ఇది చేయి అని ఆత్మ లోకానికి కర్తృత్వం కలిగించడం లేదు. దేహం జడం, దేహి చైతన్యం. ఈ చైతన్య స్వరూపమైన దేహి ఉండడం వలన దేహంలో చలనాదులు జరుగుతున్నాయి. ఇంద్రియాలు కదులుతున్నాయి, బుద్ధిలో ఆలోచనలు పుట్టుకొస్తున్నాయి. ఇవన్నీ సంయోగమై బాహ్య అంతరాలలో కర్మలను ఆవిష్కరిస్తూ ఉన్నాయి. అయితే ఈ కర్మలను చేసేది ఎవరు?, చేయించేది ఎవరు? అనేది ప్రశ్న. దేహి ఆత్మే కాబట్టి అకర్త అయిన ఆత్మ చేసేది కాదు, చేయించేది కాదు. దేహాదులు జడం కాబట్టి స్వయంగా అవి కర్మలను చేయలేవు. పోనీ దాని ఆదేశంతో దేహాదులు కర్మలలో చరిస్తున్నాయి అనుకుంటే ఆత్మ చైతన్య స్వరూపం కనుక ఆత్మకు కర్తృత్వం లేదు. దేహాదుల చలనానికి ఆత్మ కారణమే అయినా ఆత్మ ఆధారంతోనే అవి కదులుతూ ఉన్నా అలాంటి కర్తృత్వ భావన ఆత్మకు లేదు కదా. ఇలా మనం ఆలోచిస్తే ఆదేశ పూర్వకంగా ఆత్మ కర్తృత్వాన్ని సృజించనట్లే కర్మలను కూడా సృజించదు. మరైతే చేసేదెవరు? చేయించేది ఎవరు? అనే ప్రశ్నకు జవాబు ఏమిటి. అంటే స్వభావం అంటే స్వీయ భావం, తన భావం అని అర్థం. తనకు తానే కల్పించుకోవడం, స్వయంభావయతి స్వభావం, స్వయంకృతాపరాధం దీనినే ప్రకృతి అంటారు. అవిద్యా లక్షణమైన ప్రకృతే ఇక్కడ స్వభావం అదే మాయ. మాయ ప్రభావం చేత జన్మాంతర సంస్కారాలను తయారు చేసుకున్న జీవులు వారి వారి సంస్కారాలకు సంబంధించిన కార్యాలను ఆచరిస్తూ నేను చేస్తున్నాననే కర్తృత్వ భావనలో కర్మలు ఆచరించి తత్ఫలితాలను పొంది అనుభవిస్తూ ఉంటారు. గుణాలు మాయా

కార్యాలు కదా కాబట్టి కర్మలన్నీ కూడా మాయా ప్రేరితాలే. కర్మలు, కర్తృత్వాలు, ఫల సంయోగాలు అంతా కూడా మాయ కార్యాలే. అంతేకానీ ఆత్మ సంబంధమైనవి కాదు. కానీ లేని వాటిని ఆరోపించుకోవడం వల్ల మనం అజ్ఞానంలో ఉంటున్నాం. కాబట్టి జీవులు అనుభవించే పుణ్య పాపాలకు స్వభావమే కారణం గాని పరమాత్మ కాదు. దీన్ని బట్టి దేహిగా దేహంలో సుఖశాంతులతో ఉన్న ఈ దేహం అనే పుర ప్రభువు తాను ఏమీ చేయడం లేదని ఇతరులతోనూ ఏమీ చేయించడం లేదనే వాస్తవం మనకు తెలియాలి. దేహంలోని సర్వ వ్యాపారాలను మనతో చేయిస్తున్నది స్వభావం, స్వయంకృతాపరాధం అని ఈ శ్లోకంలో స్పష్టీకరించిన అంశాన్ని మనం **3-33** వ శ్లోకం సహాయంతో గుర్తించి సమన్వయం చేసి అవగాహన చేసుకుంటే సరిపోతుంది.

5అ,15శ్లో.

నాదత్తే కస్యచిత్ పాపం న చైవ సుకృతం విభుః |
అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యంతి జంతవః || 15 ||

సర్వవ్యాపియైన భగవంతుడు ప్రాణుల పుణ్యపాప కర్మలలో దేనికిని భాగస్వామి కాడు. అజ్ఞానముచే జ్ఞానము కప్పబడియుండుటవలన ప్రాణులు మోహితులగుచుందురు.

భగవంతుడు ఎవరి పాప పుణ్యాలను గ్రహించడు. జ్ఞానం అజ్ఞానంతో కప్పి ఉండటం వల్ల జనులు మోహాన్ని పొందుతున్నారు.
ముందు శ్లోకంలో ప్రభుః అన్నారు ఈ శ్లోకంలో విభుః అంటున్నారు. లోకానికి కర్తృత్వం కానీ కర్మలను కానీ ఆత్మ కలిగించడం లేదు. కర్మఫలంతో సంయోగమూ కల్పించడం లేదు. స్వభావమే ప్రవర్తిస్తున్నది అని ముందు శ్లోకంలో తెలుసుకున్నాం. అంటే నీ స్వయంకృత అపరాధమే నీ పాపానికి పుణ్యానికి కారణం కానీ వాటిని భగవంతుడు గ్రహించడని ఇక్కడ తేల్చి చెప్తున్నారు. అందుకు కారణం కూడా సూచించారు. **3-38,39** లో చెప్పుకున్న ఆవరణం, విక్షేపం అనే అజ్ఞానమే. ఈ అజ్ఞానపు ప్రభావం చేత ప్రకృతి కార్యాలను వ్యక్తిగా తన మీద సమిష్టిగా భగవంతుని మీద ఆరోపించడం జరుగుతోంది. లేని దాన్ని ఉన్నట్లు చెప్పడం ఆరోపణ. స్వస్వరూపం తెలియని దశ ఇది. అలాగే భగవంతుడు చేసేవాడని చేయించేవాడని భావిస్తూ ఉంటాం. మనం మన వాస్తవానికి మనమే సృష్టికర్తలం అన్న సత్యాన్ని విస్మరించాం. కానీ మనల్ని బట్టే మనకు ఫలితాలు ఉంటాయి. ఇటు ఆత్మసాక్షి అటు పరమాత్మ, ఇద్దరూ కూడా ఎవరి పాపాన్ని, పుణ్యాన్ని గ్రహించరు. వీరు కర్తలే గాని వీరికి కర్మలు లేవు కర్తృత్వాలు లేవు. అయితే ఉన్నట్లు మనం ఆరోపించు కుంటున్నాం. వివేకం లోపించి పరిపక్వత చెందని మనస్సులు ఇలాంటి అలజడి కలతలను సృష్టిస్తాయి. ఉన్నది ఉన్నట్లు తెలియనప్పుడు లేనిది కూడా ఉన్నట్లు తెలిసే ప్రమాదం ఉంది. దట్టమైన అజ్ఞానంలో

కూరుకుపోయి ఉంటే నిజమైన జ్ఞానం దర్శితం కాదు కదా. సూర్యుడు స్వప్రకాశం, ఆత్మ స్వప్రకాశం అయితే మేఘం సూర్యుడ్ని కప్పితే సూర్యుడు కనిపించడు కదా ఆ మేఘం తొలగిపోతే సూర్యుడు కనిపిస్తాడు. అలాగే అజ్ఞాన మేఘమనే ఆ రూపం తొలగిపోతే స్వస్వరూపం దర్శితమవుతుంది.

5అ,16శ్లో.

జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశితమాత్మనః |
తేషామాదిత్యవత్ జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్ || 16 ||

కాని, వారి(ప్రాణుల) అజ్ఞానము పరమాత్మ తత్త్వజ్ఞానప్రాప్తి ద్వారా తొలగిపోవును. అప్పుడు జ్ఞానము వారికి సచ్చిదానంద ఘనపరమాత్మను సూర్యునివలె (సూర్యప్రభవలె) దర్శింపజేయును.

ఎవరి అజ్ఞానం ఆత్మజ్ఞానం చేత నశిస్తుందో అలాంటి వారికి జ్ఞానం సూర్యునిలా పరబ్రహ్మ స్వరూపాన్ని పరతత్త్వాన్ని ప్రకాశింప చేస్తుంది.

ముందు శ్లోకంలో అజ్ఞానం ద్వారా ప్రాణులు మోహం చెందుతున్నారని చెప్పుకున్నటువంటి అజ్ఞానాన్ని తొలగించుకోవడానికి తగినటువంటి మార్గాన్ని ఈ శ్లోకం సూచిస్తుంది. ఆ అజ్ఞానాన్ని ఆత్మికమైన వివేక జ్ఞానంతో నశింపజేస్తే అప్పుడు సూర్యుడు సమస్త వస్తువులను ప్రకాశింపజేసినట్లు జ్ఞానం జ్ఞేయాన్ని అంటే పరమాత్మ తత్త్వాన్ని ప్రకాశింప చేస్తుంది. ఈ సూర్యకాంతి జ్ఞాన సత్యాలనే జ్యోతిస్సు అనేకత్వం నుండి ఏకత్వ మార్గానికి ప్రేరేపించి ఆవరణ విక్షేపాల్ని ఛేదింపజేసి సత్యోన్ముఖంగా పయనింప చేస్తుంది. అప్పుడు పరిమితత్వం నుంచి అనంతత్వ స్వరూపంగా పరిఢవిల్లగలడు. అజ్ఞాన వృత్తి ఏదైనా జ్ఞాన అభివృద్ధి చేతనే నశించాలి. అలా ఆత్మకు సంబంధించిన వాస్తవాన్ని అజ్ఞానం కప్పి వేసింది. కాబట్టి మనకు ఆత్మకు సంబంధించినటువంటి అజ్ఞానపు వృత్తి ఉంది, ఇది నశించాలంటే జ్ఞాన మార్గమే తప్ప వేరే మార్గం ద్వారా వీలు కాదు. ఈ శ్లోకంలో 'యేషాం', 'తేషాం' అనే రెండు మాటలు చాలా స్పష్టంగా ప్రయోగించాడు. ఎవరి అజ్ఞానం నశిస్తుందో వారి జ్ఞానం సూర్యునిలా ప్రకాశింపజేస్తుంది. కాబట్టి ఆవరణ విక్షేప దోషాలే బంధ హేతువులని తెలుస్తోంది. ఇదే సర్వ అనర్థాలకు మూలం అని తెలిసి వాటిని తొలగించుకోవాలి. ఉన్నది ఉన్నట్లు తెలియకుండా కప్పిపుచ్చేది ఆవరణ శక్తి, ఉదాహరణకు దివ్య తేజోమయమైన ఆత్మను ఆత్మగా తెలియకుండా కప్పిపుచ్చేది ఆవరణ శక్తి. ఇక లేని దాన్ని కల్పించి చూపేది విక్షేపశక్తి. అనాత్మ అయిన దేహమే ఆత్మ అని తాను దేహమేననే అభిమానాన్ని కల్పించి దుఃఖానికి గురిచేస్తుంది. ఈ రెండూ కూడా మనోబుద్ధులకు సంబంధించిందే గాని ఆత్మకు సంబంధించింది కాదు. రెండింటినీ ప్రకాశింపజేసేది స్వప్రకాశమైన ఆత్మ చైతన్యమే, అంతేగాని మన ప్రవర్తనతో ప్రకాశానికి సంబంధం లేదు. మనం ఎలా ప్రవర్తించినా దానితో సంబంధం లేకుండా ప్రకాశం నీకు ఆధారంగానే ఉంటుంది. అయితే ప్రకాశం ఆధారంతో ప్రవర్తించాల్సిన విచక్షణ మనిషికి ఉండాలి. అయితే మన ప్రవర్తనను బట్టి మనకు ఫలితం ఉంటుంది కదా. సత్యం, జ్ఞానం, అనంతం అన్న అవగాహనతో ఆలోచిస్తే ఈ అంశం అనుభవేద్యమవుతుంది. ఆ జ్ఞానం

ఈ అజ్ఞాన వృత్తిని తొలగిస్తుంది. అప్పుడు ఆవరణ శక్తి నశిస్తుంది. ఆవరణ శక్తి నశించగానే ఆవరణాన్ని ఆశ్రయించుకుని విజృంభిస్తూ ఉన్నటువంటి విక్షేపశక్తి కూడా నశించిపోతుంది. అలా బుద్ధిలో కలిగే ప్రమాణ జనిత జ్ఞానం వల్లనే బుద్ధిలో భ్రాంతి చేత ఏర్పడిన అజ్ఞానం నశిస్తుంది. తద్వారా ఉదయించే ఆత్మజ్ఞానం సమస్తాన్ని ప్రకాశింప చేస్తుంది. అప్పుడు సర్వవ్యాపిత పరబ్రహ్మ స్వరూపం మనకు దర్శితమవుతుంది.

5అ,17శ్లో.

తద్బుద్ధయస్తదాత్మానః తన్నిష్ఠాస్తత్పరాయణాః ।
గచ్ఛంత్యపునరావృత్తిం జ్ఞాననిర్ధూతకల్మషాః ॥ 17 ||

తద్రూపమును పొందిన మనోబుద్ధులుగలవారై, సచ్చిదానంద ఘనపరమాత్మ యందే నిరంతరము ఏకీభావములో స్థితులై, తత్పరాయణులైన పురుషులు జ్ఞానసాధనతో పాపరహితులై, పునరావృత్తిరహితమైన పరమగతిని పొందుదురు.

పరమాత్మ యందే బుద్ధి మనసు గలవారు పరమాత్మ యందే నిష్ఠతో పరమాత్మే పరమగతి అని భావించేవారు జ్ఞానాగ్ని ద్వారా పాపాన్ని పోగొట్టుకుని జన్మ రహితమైన మోక్షాన్ని పొందుతారు.

ముందు శ్లోకంలో చెప్పుకున్న ఆదిత్యునిలా ప్రకాశించే స్థితిని పరమతత్త్వాన్ని పొందిన వారి వైభవాన్ని ఈ శ్లోకం వివరిస్తుంది. పునరావృతమయ్యే కర్మల జన్మల చక్రంలో ఇరుక్కోకుండా పునరావృత్తి రహితమైన పరమపదం పొందుతారని అర్ధం. మృత్యు స్థితి నుండి అమృత స్థితికి చేరుకోవడం. మనసు మనసుగా బుద్ధి బుద్ధిగా ఉండక వ్యక్తి భావన నుంచి ఆత్మ భావనలో స్థిరం కావడం. ఈ శ్లోకంలో నాలుగు లక్షణాలను స్పష్టంగా వివరంగా తెలియజేశారు. ఒకటి 'తద్బుద్ధయః' తద్బుద్ధులు అంటే దాని యందే బుద్ధి గలవారు దేనియందు అంటే జ్ఞానం చేత ప్రకాశితమైనది అని మనం ముందు శ్లోకంలో గ్రహించిన విధంగా ఆ పరమార్థం నందే బుద్ధిగలవారు అని తెలుసుకోవాలి. అది నిత్యమైనదే గాని కొత్తగా పుట్టేది, కలిగేది కాదు కదా. అయితే ఆ నిత్యసత్యమైన దాని యందు బుద్ధిని నిలపడం అని మనం అర్ధం చేసుకోవాలి. అంటే బుద్ధి బ్రహ్మను తెలుసుకోవడం బ్రహ్మతత్త్వాన్ని ఆత్మిక చైతన్యాన్ని గ్రహించడం. అలాంటి వికసించిన బుద్ధి ఉన్నవారు తద్బుద్ధులు ఇక్కడ ఒక విషయం గమనించాలి, ఆత్మే బ్రహ్మం ఇదే బ్రహ్మాత్మ జ్ఞానం అని తెలిసినా తెలియకపోయినా అందరూ బ్రహ్మస్వరూపులే. అయితే ఈ సత్యం గ్రహించిన వారు తద్బుద్ధులు తెలియని వారు అతద్బుద్ధులు. రెండు 'తదాత్మానః', తదాత్ములు. మనం ఇంతవరకు చర్చించిన పరమార్థ తత్త్వాన్ని పరబ్రహ్మమని ఆ బ్రహ్మం తనలోని ఆత్మిక బ్రహ్మమే అని జ్ఞానం కలవారు తదాత్ములు. బ్రహ్మాత్మజ్ఞానం కలవారు బ్రహ్మాన్ని ప్రత్యేకించి పొందేది కాదు తానే అది అని క్షుణ్ణంగా ఎరిగినవారు తదాత్ములు, ఆత్మతో తాదాత్మ్యం చెందిన వారు.

బ్రహ్మస్వరూపమందే స్థిరపడి ఉన్నవారు. కాబట్టి తద్బుద్ధులు తదాత్ములు అవుతారు. మూడు 'తన్నిష్ఠాః' తన్నిష్ఠులు. బ్రహ్మమందే నిష్ఠ గలవారు, సర్వ కర్మలను త్యజించిన జ్ఞాన కర్మ సన్యాసులు. బ్రహ్మం అకర్త గనుక అదే నిష్టలో తాము అకర్తగా అభోక్తగా శోభించేవారు. తానే బ్రహ్మమనే జ్ఞానం తన్నిష్ఠులకు సుస్పష్టంగా ఉంటుంది. వీరిని ఈ ప్రపంచంలో ఏవీ చలింప చేయలేవు. వీరికి ప్రపంచం విస్మృత ప్రాయం దేహం కేవలం ఛాయా మాత్రం. అందుకే వీరు తన్నిష్ఠులు. నాలుగు 'తత్పరాయణాః' పరం అంటే ఉన్నతమైనది. అయనం అంటే స్థానం, తత్ అంటే అది కదా. ఏది అంటే మనం ఇప్పటివరకు చర్చించిన బ్రహ్మం, ఆ స్థితిలో స్థిరం కావడమే పరమగతిగా కలవారు తత్పరాయణులు. తన యందే తాము ఆనందించే ఆత్మ పరాయణుడు. ఈ నాలుగు లక్షణాలను తనలో పొదుగు కున్నవారు పుణికి పుచ్చుకున్నవారు తిరిగి రాకపోకలు గలిగిన జన్మను పొందరు. వీరేయతులు, యతివరేణ్యులు, జీవన్ముక్తులు.

5అ,18శ్లో.

విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని |
శుని చైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః || 18 ||

జ్ఞానులు విద్యావినయ సంపన్నుడైన బ్రాహ్మణునియందును, గోవు, ఏనుగు, కుక్క మొదలగు వానియందును, చండాలునియందును సమదృష్టినే కలిగి యుందురు.

విద్యా వినయం కలిగినటువంటి బ్రాహ్మణుని పట్ల గోవు, ఏనుగు, కుక్క కుక్కమాంసం వండుకు తినే వారి పట్ల కూడా సమదృష్టి కలవారిని జ్ఞానులు అన్నారు.

ఇక్కడ ఈ అంశాన్ని క్షుణ్ణంగా ఆలోచించి అర్థం చేసుకోవాలి. అంటే అలాంటి వాటిని జగద్గురువు ప్రోత్సహించినట్లు కాదు వారి పట్ల కూడా ద్వేష భావం లేకుండా కరుణను కలిగి ఉండాలి. ఎందుకంటే **3-26** వ శ్లోకంలో చర్చించిన అంశాన్ని ఆధారంగా చేసుకుని వారి పట్ల కూడా విభేదించకుండా వారిని సన్మార్గంలోకి ఆహ్వానించే విధంగా మన ఆలోచనలు కొనసాగాలి గాని ద్వేష భావం ఉండకూడదు. ఇందులో విద్యా వినయ సంపన్నే అంటే ఆత్మబోధ ఆత్మవిద్య చదువు సంస్కారం తెలిసిన బ్రాహ్మణుని లోనూ వీటికి భిన్నమైన రాజస స్వభావం గల మధ్యమమైన ఆవులోనూ కేవలం తామస స్వభావం గల అధమమైన ఏనుగు వంటి వాటిలోనూ కుక్క లోనూ కుక్కలు వండి తినే వారిని కూడా సహదృష్టితో చూసేవారే సమదర్శినులు. ఎందుకంటే తేడా ఉంటే వారిలో ఉండాలి కానీ సమత్వం ఉన్న వారిలో భేదభావం రావడానికి అవకాశం లేదు కదా. ఆత్మజ్ఞానం ద్వారా అజ్ఞానం పోగొట్టుకున్న జ్ఞాన పండితులు అంతటా బ్రహ్మదర్శనం చేసే సమదర్శులు కదా. వీరు సర్వత్రా ఏకాత్మ దర్శన భావంతో ఉంటారు. సమం అంటే ఇక్కడ బ్రహ్మం, సమదర్శనం అంటే బ్రహ్మ దర్శనం. సర్వత్రా అంటే అన్నింటి యందు సమానత్వాన్ని దర్శించే చూపు కలిగి ఉండాలి.

అలా ఉన్నవారే జ్ఞానులు. జ్ఞానులు అలా కలిగి ఉంటారు అనే విషయాన్ని ఈ శ్లోకంలో స్పష్టంగా ప్రతిపాదిస్తున్నాడు. ప్రపంచంలో దోషము ఉన్నా ప్రకాశంలో దోషం ఉండదు కదా. అది అఖండానంద స్వరూపంగా ప్రకాశిస్తూ ఉంటుంది. దృశ్యమైన ఈ ప్రపంచం నానా విధాలుగా మిధ్యత్వంతో తెలుస్తూ ఉంటే బ్రహ్మం నిత్యత్వంతో సత్యత్వంతో భాసిస్తూ ఉంటుంది. అందరూ మనుషులే అయినా అందరి మనసులు ఒకే విధంగా లేవు కదా. అందరూ ఆలోచించేవారే అయినా ఒకే అంశాన్ని గూర్చి అందరి ఆలోచనలు కొనసాగవు కదా. ఈ ఆలోచనా విధానాన్ని మనం స్థూలంగా విభజించాలనుకుంటే కొందరివి సత్వగుణమైన ఆలోచనలు, కొందరివేమో రజోగుణ ప్రేరితమైనవిగా ఉంటాయి. మరి కొందరివి తమోగుణ ప్రధానమైన ఆలోచనలుగా ఉంటాయి. అయితే ఇవి వారి వారి స్వభావాన్ని నిర్ణయిస్తూ ఉంటాయి. కానీ అందరివీ అన్ని విధాల ఆలోచనలు కూడా ప్రకాశం యొక్క ఆధారంగానే కొనసాగుతాయి అనే ప్రత్యేకమైనటువంటి ప్రధానమైనటువంటి అంశాన్ని మనం గమనించాలి. వీరందరినీ సమదర్శినులు సమభావంతోనే చూస్తారు. మట్టి పాత్రలు నామరూపాలతో విభిన్నంగా మనకు కనిపించినా వాటన్నింటికీ ఆధారం మట్టే కదా. ఎలా మలచుకోవాలో తయారు చేసే వారిపై ఆధారపడి ఉంటుంది అయితే అన్నింటికీ ఆధారమైంది మట్టేనని దర్శించడమే సమదర్శనం సత్యదర్శనం. గుణ రూప జాతి సంస్కార కర్మల ప్రాణుల భేదంతో ఈ నామరూపాత్మక ప్రపంచం విభిన్నంగా కనిపిస్తుంది. అయితే మట్టి పాత్రలన్నింటికీ మట్టి ఆధారమైనట్టు వీటన్నింటికీ ఆధారము బ్రహ్మమే కదా. కాబట్టి సమదర్శనయోగి చరాచర ప్రపంచం లో బ్రహ్మాన్నే దర్శిస్తాడు. ఇదే సమదర్శనం అంటే మనోబుద్ధులలోని భేదాలు మిధ్యాపరమైనవి తాత్కాలికమైన రాకపోకలు కలిగినది. కాబట్టి వాటితో సంబంధం లేకుండా సమదర్శి ప్రతి ఒక్కరిలో మూలాన్ని దర్శిస్తాడు. దీపం సహాయం లేకుండా ప్రపంచాన్ని చూసినప్పుడు అని కొందరు మనుషుల్ని చూసినప్పుడు వారు స్త్రీల పురుషుల గుర్తించగలిగే అంత వెలుతురు ఉన్నప్పుడు అని కొందరు ఇలా వివిధ రకాలుగా జవాబు ఇస్తారట స్త్రీ అయినా పురుషులైనా ఎవరిని చూసినా కూడా వారిలోని వారి కదలికకు మూలమైన భగవంతుడు బ్రహ్మం దర్శనీయమైనప్పుడు అంటే ఇంకా మనం నిద్రిస్తూనే రాత్రిలోనే చీకటిలోనే అజ్ఞానపు అంధకారంలోనే ఉన్నట్లు అర్థం చేసుకోవాలి. ఇంకా వారికి పగలు కాలేదు ఉదయించలేదని అర్థం మనకు అలాంటి వారికి ఇంకా ఉదయం కాలేదనే గమనించాలి. అంటే అర్థం మనం చెప్పుకున్న వివిధ మట్టి పాత్రలను చూసిన మూలమైన మట్టి దర్శితమైనట్లు సర్వత్రా మూలశక్తిని దర్శించే చూపులు మనం పొందాలి.

5అ,19శ్లో.

ఇహైవ తైర్జితః సర్గో యేషాం సామ్యే స్థితం మనః ।
నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మాద్ బ్రహ్మణి తే స్థితాః || 19 ||

సర్వత్ర సమభావస్థిత మనస్కులు ఈ జన్మయందే సంపూర్ణజగత్తును జయించిన వారగుదురు. అనగా- ప్రాపంచిక విషయాతీతస్థితికి చేరుదురు. సచ్చిదానంద ఘనపరమాత్మ దోషరహితుడు, సముడు. సమభావస్థిత మనస్కులైన జ్ఞానులు సచ్చిదానంద ఘనపరమాత్మయందు స్థితులు. కనుక, వారు త్రిగుణాతీతులు. జీవన్ముక్తులు.

ముందు శ్లోకంలో చెప్పిన సర్వత్రా సమదర్శి గలవారు ఈ జన్మయందే జనన మరణాలను జగత్తును సంపూర్ణంగా జయించిన వారు. బ్రహ్మ దోషం లేనిది బ్రహ్మమందే వారు ఉంటారు కాబట్టి వారికి ఎలాంటి దోషం అంటదు. సమత్వ స్థితిని పొందిన వారు బ్రహ్మమందున్న వారే అవుతారు. జనన మరణ రూప సాగరాన్ని దాటడానికి ప్రాపంచిక బంధాల నుండి విడిపడటానికి ఉపాయంగా మనం ఈ శ్లోకాన్ని గమనించాలి. మనసును అనవసరమైన దోషపూరిత ఆలోచనలతో కలుషితం చేసుకోకుండా నిశ్చల స్థితిని కలిగి ఉండి సర్వభూతాలయందు సమదృష్టిని కలిగి ఉండాలనే విధానాన్ని ఇందులో చాలా స్పష్టంగా తెలియజేశారు. అంటే మనసు నిర్మలమైన క్షణమే మనసులో సమస్థితి స్థిరమవుతుంది. ఆ క్షణమే మోక్ష ప్రాప్తి అని దీనర్థం. మోక్షం అనేది ఆకాశంలో గానీ పాతాళంలో గానీ భూతలంలో గాని లేదు. సంయక్ దృష్టి, సంయక్ జ్ఞానము ద్వారా కలిగే నిర్మల చిత్తమే మోక్షం అని ఉద్బోధిస్తుంది వశిష్ట గీత. ఆవరణ విక్షేపాలకు తావు లేకుండా దేహ మనోభావనలు లేకుండా ఆత్మ దృష్టిని కలిగి ఉన్నప్పుడు ఇది సంప్రాప్తిస్తుందని అర్థం చేసుకోవాలి. 'ఇహైవ' అంటే ఎక్కడో పొందేది కాదు ఈ లోకంలోనే ఈ జన్మలోనే ఇప్పుడే అని అర్థం. ఈ సమదృష్టి ఎక్కడో పొందేది కాదని అర్థమైతే అది ఎప్పుడో **60** ఏళ్లలో లేదా వృద్ధాప్యంలోనూ పొందేది కాదు ఇప్పుడే ఈ క్షణమే అనే సున్నితమైన అవగాహన మనలో తక్షణమే కలుగుతుంది. అలా అజ్ఞానం ఆత్మజ్ఞానం ద్వారా నశిస్తే తానే నిత్యాత్మ అనే జ్ఞానంతో శోభిస్తాడు. ఇక్కడే ఈ లోకంలోనే పొందేది ముక్తి, దేహాన్ని విడిచే వరకో ఫలానా వయసు వచ్చేవరకో వేచి ఉండాల్సిన అవసరం లేదు. ఆత్మ యొక్క అఖండత్వాన్ని పొందడానికి దేహం మరేవి కూడా అవరోధాలు కావు. అనంత ఆకాశపు విశాలత్వాన్ని కుండ తనలో పరిమితం చేయగలదా**?** అందుకే అందులో స్థితమైన వారు బ్రహ్మమందే ఉంటారు, బ్రహ్మంగానే ఉంటారు. ఇది సమదర్శన బ్రహ్మ దర్శన వైభవం. మనం ఈ శ్లోకంలో ప్రధానంగా గ్రహించాల్సిన అంశాలు ఒకటి సమదర్శులు జీవించి ఉన్నప్పుడే జన్మను జయిస్తారు. రెండు సర్వభూతాలయందు ఒకే విధంగా ఉన్న బ్రహ్మమందు స్థిరమై సమభావంతో మనసును నిశ్చలం చేసుకొని ఉంటారు. మూడు మూఢుల అల్పులయందు దోష యుక్తంగా కనిపించినా ఆదేశాలు బ్రహ్మమందే స్థిరమై ఉన్న వారిని అంటవు. నాలుగు ఆత్మలో విభేదాలకు తావు లేదు.

ఇందులో భేదాలను కల్పించే ఇతర విశేషాలేవీ ఉండవు. ఆది ప్రకాశం మాత్రమే. ఈ నాలుగు అంశాలను స్పష్టంగా అర్థం చేసుకొని మనం ముందుకెళ్లాలి.

5అ,20శ్లో.

న ప్రహృష్యేత్ ప్రియం ప్రాప్య నోద్విజేత్ ప్రాప్య చాప్రియమ్ ।
స్థిరబుద్ధిరసమ్మూఢో బ్రహ్మవిద్బ్రహ్మణి స్థిత: || 20 ||

ప్రియలాభములకు పొంగిపోనివాడును, అప్రియములు ఎదురైనప్పుడు క్రుంగి పోనివాడును, స్థిరమైన బుద్ధిగలవాడును, మోహవివశుడు కానివాడును అయిన బ్రహ్మవేత్త సచ్చిదానందఘనపరబ్రహ్మపరమాత్మయందు సదా ఏకీభావస్థితి యందుండును.

బ్రహ్మ విధులు స్థిర బుద్ధి కలవారు, మోహం లేనివారు బ్రహ్మమందే మనసును సుస్థిర పరచి నిలకడగా ఉన్నవారు. వీరు అప్రియమైనవి లభించినా కృంగిపోరు, ప్రియమైనవి లభించినా పొంగిపోరు. బ్రహ్మ వేత్తలు సచ్చిదానంద ఘన పరమాత్మ యందే సదా ఏకీభావ స్థితి యందు ఉంటారు.

మనం ఇష్టమైనవి దొరికినప్పుడు సంతోష పడకూడదు, ఇష్టం కానివి దొరికినా బాధ పడకూడదు. దేహాన్నే తానుగా భావించే వారికే ప్రియం అప్రియం అనిపిస్తాయి. హర్ష విషాదాలు కలుగుతాయి. ఆత్మ దృష్టి ఉన్నవారు అన్ని భూతాల యందు సమంగా ఉన్నది ఒకే ఆత్మ అనే జ్ఞానంలో స్థిరమై ఉంటారు. వీరు సంశయ రహితమైన బుద్ధితో మోహం చెందకుండా బ్రహ్మవేత్తలు బ్రహ్మమందే నిలిచి ఉంటారు. సాధారణ స్థాయి మనిషిలాగా ఎండమావుల్లో నీటికి పరుగెత్తే లాంటి అజ్ఞానం వీరికి ఉండదు. బ్రహ్మవేత్తల బుద్ధి మేరు పర్వతం లాగా స్థిరంగా ఉంటుంది. ఈ గారడీ ప్రపంచంలో ఎప్పుడైనాఎక్కడైనా శాశ్వత సుఖం కనిపించదు ఒకవేళ కనిపించినా అది స్వల్పంగానో అల్పంగానో క్షణకాలమే ఉంటుంది. కారణం ఈ ప్రపంచం కాదు ఈ లోకపు బలం కూడా కాదు వ్యక్తిలోని బలహీనత. స్థిరత్వం లేని ప్రపంచానికి స్థిరత్వం ఆపాదించడం అస్థిరత తెలియని జీవుడికి అస్థిరత్వాన్ని ఆరోపించడం మనిషి ఆలోచనా విధానము బలహీనతకు అర్థం పడుతుందే గాని మరొకటి కాదు. అన్ని అందాలు శాశ్వత సుఖశాంతులు ఈ ప్రపంచంలోనే ఉన్నాయి. ఈ ప్రపంచానికి అలాంటి స్థిర చిత్తాన్ని ఇచ్చే శక్తి ఉంది అయితే మనిషే అది పొందలేని అసమర్థుడిగాఅసక్తతగలవాడుగా తయారయ్యాడు. అయితే ఈ అజ్ఞాన భ్రాంతికి కారణం ప్రపంచపు మాయాశక్తి కానే కాదు. మనిషి యొక్క అసక్తతే బలహీనతే అని ఖచ్చితంగా తెలియాలి. ఎవరు అంగీకరించినా అంగీకరించకపోయినా ఇది సత్యం. మనిషి అనుభవించే సుఖదుఃఖాలకు కారణం వాస్తవానికి ఈ ప్రపంచం కాకపోయినా ఈ ప్రపంచమే కారణమని మనిషి భ్రమిస్తుంటాడు. ప్రపంచంలో విషయాలు అందాలు సన్నివేశాలే ఉంటాయి కానీ మనిషిని దుఃఖంలోకి

నెట్టేంత శక్తి ఈ ప్రపంచానికి ఉండదు. ప్రపంచం కంటే మనిషే శక్తివంతుడు ఈ సత్యం అవగాహన అయితే మనిషి స్వశక్తిని గుర్తిస్తాడు. ప్రపంచమే సమస్య అనుకుంటే మరి పరిష్కారం కూడా అదే ప్రపంచంలో ఉండాలి కదా. అలా కాకుండా సమస్య అనేది మనిషి మీదనే కేంద్రీకృతమై ఉంది కదా కాబట్టి పరిష్కారం కూడా మనిషిదే మనిషిలోనే ఉంది కానీ ప్రపంచానిదో విశ్వానిదో కాదు ఇది తెలియడమే వివేకం. ఇది లోపించినప్పుడే బుద్ధిలో అస్థిరత చోటు చేసుకుంటుంది. అలా ఉండకూడదు అని జగద్గురువు అంటున్నారు. వీరు ఉన్నది ఉన్నట్లుగా తెలియడం వల్ల అందులో నిలిచి ఉన్న కారణంగా బ్రహ్మ వేత్త ఆ బ్రహ్మమందే స్థిరపడటం వల్ల స్థిర బుద్ధి కలవారు మోహం లేని వారు అయిన వారు బ్రహ్మవిధులు. వీరు ప్రియమైనది లభించిందని సంతోషించరు, అప్రియమైనది దుఃఖించరు. మనిషి పొందే సుఖదుఃఖ అనుభవాలలో ప్రియాఅప్రియాలు ఉంటాయి గాని జ్ఞానులు సమస్థితిలో ఉండటం వల్ల ఇవి వారిని చలింప చేయలేవు. ఇలా వైరుధ్యపు పరిస్థితుల మధ్య జ్ఞాని ప్రవర్తించే తీరును అంతటా ఏకమై భాసించే ఆత్మ యొక్క సమస్థితిని ఆ స్థితిలో స్థిరమైన సమదర్శిని గురించి ఈ శ్లోకం చాలా స్పష్టంగా తెలియజేస్తుంది.

5అ,21శ్లో.

బాహ్యస్పర్శేష్వసక్తాత్మా విందత్యాత్మని యత్సుఖమ్ |
స బ్రహ్మయోగయుక్తాత్మా సుఖమక్షయమశ్నుతే ॥ 21 ||

ప్రాపంచిక విషయములయందు అనాసక్తమైన అంతఃకరణముగల సాధకుడు ఆత్మస్థిత ధ్యానజనితమైన సాత్త్వికాత్మానందమును పొందును. పిదప, అతడు సచ్చిదానంద ఘనపరబ్రహ్మ పరమాత్మ ధ్యానయోగమునందు అభిన్న భావస్థితుడై అక్షయానందమును అనుభవించును.

ప్రాపంచిక విషయములయందు అనాసక్తమైన అంతఃకరణము గల సాధకుడు ఆత్మస్థిత ధ్యాన జనితమైన సాత్త్వికాత్మానందమును పొందును. పిదప అతడు సచ్చిదానంద ఘనపర బ్రహ్మ పరమాత్మ ధ్యాన యోగము నందు అభిన్నభావస్థితుడై అక్షయానందమును అనుభవించును.

ఇలాంటి శబ్దాది విషయాల యందునిరాసక్తులైన వారు తాత్కాలిక బాహ్య స్పర్శల పట్ల ఆసక్తి లేకుండా వుండేఆత్మజ్ఞానులకువుండేటటువంటి నిత్య సుఖాన్ని ఈ శ్లోకం వివరిస్తుంది. మనిషి సుఖ ప్రాప్తి కోసం సంతోష ప్రాప్తి కోసం అనుక్షణం ప్రయత్నిస్తూ పరితపిస్తూ ఆరాట పోరాటాలతోనే తన జీవిత యాత్రను కొనసాగిస్తూ ఉంటాడు. తాత్కాలిక భోగాలతో సుఖించడానికి అనుకూల పరిస్థితుల్ని కీర్తి ప్రతిష్టల్ని ప్రోగు చేసుకోవడంతోనే మనుషులు పూర్తిగా నిమగ్నమై జీవితాన్ని జన్మను వృధా చేసుకుంటూ ఉంటారు. అలా ఆశించే కీర్తి ప్రతిష్టలు భౌతిక సౌకర్యాలు సుఖాల కోసం మనిషి లోపభూయిష్టమైన విధానాన్ని అనుసరించడానికి కూడా వెనుకాడటం లేదు. అంతేగాక ఆ అమానవీయ

చర్యలను కొనసాగించడమే ధ్యేయంగా పెట్టుకుంటున్న పరిస్థితి అందుకని జగద్గురువు అలాంటి వారికి జ్ఞానోదయం కలిగించాలని ఈ శ్లోకం మన ముందు ఉంచారు. ఇందులో మొట్టమొదటి అంశం ఇంద్రియాల ద్వారా తెలుసుకోగలిగిన విషయాలు బాహ్యస్పర్శలు కదా ఈ శబ్దాది విషయాల యందు ఆసక్తి లేని అంతఃకరణం కలిగిన వారు బాహ్య విషయాల యందు ప్రీతిని విడిచినవారు. రెండవది, అంతరాత్మయందున్న అనంతమైనటువంటి శాశ్వత సుఖాన్ని పొందుతారు. ఇక 'బ్రహ్మయోగయుక్తాత్మ', యోగమంటే కలయిక కూడి ఉండటం బ్రహ్మంలో యోగమై ఉండటం బ్రహ్మతో కూడి ఉండటం బ్రహ్మయోగం. మనం ఇప్పటివరకు అయిదు అధ్యాయాలుగా చర్చించుకుంటూ ఉన్నటువంటి బ్రహ్మ తత్త్వంలో కూడి ఉండటమే బ్రహ్మ యోగమని మనకు తెలియాలి. అలా సదా బ్రహ్మంతో కూడి ఉన్న వారు బ్రహ్మ సమాధి స్థితిలో ఏకాగ్రమైన చిత్తం గలవారు బ్రహ్మయోగయుక్తాత్ములు. దీన్ని బట్టి మనం కూడా బాహ్య శబ్దాది విషయాలపై ఆసక్తిని ఆకర్షణను వీడాలని అర్థం చేసుకోవాలి. అలా ఆసక్తిని వీడిన వారు నిత్యానంద బ్రహ్మ సుఖాన్ని పొందుతున్నారు. ఎలా పొందుతున్నారో చర్చిద్దాం. తాత్కాలికమైన విషయంలో ఖచ్చితంగా ద్వంద్వాలు ఉంటాయి. మనం తాత్కాలిక సుఖాన్ని సంతోషాన్ని మరే వస్తువులోనో మరెక్కడో ఉందని అనుకుంటూ ఉంటాం. అది ఏదైనా కావచ్చు దాన్ని మనం ఆశించి వెళ్తూ ఉంటాం. అయితే ఖచ్చితంగా మనం భ్రమిస్తున్న సుఖంతో పాటు దాని వెన్నంటే దుఃఖం కూడా ఉంటుంది. ఈ వాస్తవం తెలియక మన చేతుల్లో మనమే మోసపోతూ ఉంటాం. అదే సుఖసంతోషాన్ని ఇంద్రియాలతో కాక ఇంద్రియాలను ఉపయోగించి ఆత్మతో మమేకమై పొందితే ఆత్మానుసంధానంతో పొందగలిగితే అదే జీవితం అదే జీవించడం. మనకు నిండైన జీవశక్తిని నింపేది కూడా ఇదే. ఈ జీవశక్తితో ప్రపంచాన్ని అనుభూతించ గలిగితే అదే అక్షయ సుఖం. ఇలా ఆత్మిక స్పర్శ తెలియకుండా మనం కేవలం ఇంద్రియ స్పర్శతో మాత్రమే వస్తువులతో విషయాలతో పొందు చేయడం వల్ల మనం ఆ తాత్కాలిక నిర్ణీత సమయం గడచాకా నిరాశ నిస్పృహలకు అలజడికి లోనవుతున్నాం. అయితే మనం ఆత్మిక స్పర్శతో ధార్మిక దృష్టితో చూస్తే అప్పుడు ఆత్మానందంతో ఉండి ఆనందమయమైన బ్రహ్మ సమాధి స్థితి అయినటువంటి అక్షయానందమును పొందును.

ఉదాహరణకు మనకు అర్థం కావడానికి ప్రపంచంలో మనకు కనిపిస్తున్న ఎన్నో వస్తువులు ఉన్నట్లే విషయాలు సన్నివేశాలు కూడా ఈ ప్రపంచంలో ఉన్నాయి అవి ఎలా అయితే పరిమితమో ఎలా అయితే క్షయమవుతున్నాయో అలాగే విషయాలు సన్నివేశాలు మనం అనుభవిస్తున్నాం అనుకుంటూ భ్రమిస్తూ ఉన్నటువంటి భౌతిక సుఖం కావచ్చు సంతోషం కావచ్చు అవి కూడా వాటితో పాటే నశిస్తున్నాయి క్షయమవుతున్నాయి. ఇది మనం గ్రహించవలసినటువంటి అంశం. అలా నశించిపోయేవి ఏవీ కూడా అక్షయ సుఖాన్ని ఇవ్వలేవు కనుక అక్షయ సుఖం అనేది ఈ ప్రపంచానికి సంబంధించింది కాదు అది మన అంతరంగానికి ఆత్మకు మనలోని ప్రకాశానికి సంబంధించినది అని మనకు తెలియాలి. ఇంద్రియాలు ఇంద్రియ విషయాలతో సంయోగం చెందడం స్పర్శలు అని మనం **2-14**లో తెలుసుకున్నాం. ఈ స్పర్శలు ఆయా ఇంద్రియాలను స్పృశిస్తూ ఉండటంవల్ల తత్సంబంధమైన అనుభవాల్ని మనసు పొందుతూ ఉంటుంది. ఉదాహరణకు బాహ్యంలో ఒక వస్తువును లేదా విషయాన్ని ప్రగాఢంగా వాంఛించిన వారు దాన్ని పొందగానే ఆ

ప్రత్యేకమైన కోరిక నుండి తాత్కాలికంగా విడిపోతున్నారు కదా. ఇక్కడ జరిగిందేంటి అని మనం మన లోపలికెళ్ళి మనతో ఆలోచిస్తే అంతవరకు ఏ రజోగుణ ప్రవృత్తి అయితే మనసును చలింపజేసిందో ఆ తాత్కాలిక కోరిక తత్కాలికంగా తీరడం వల్ల ఆ సమయానికి అది పలుచబడి ఆ సమయంలో ఆ క్షణంలో మనసు అంతర్ముఖం అవుతుంది. మనం బాగా గమనిస్తే ఈ స్థితి ఎలాంటి కోరికలు లేని ఓ శూన్యస్థితి దాని ఫలితమే మనసులో సత్వస్థితి ఏర్పడి ఆ క్షణ సుఖం బుద్ధిలో ప్రతిఫలిస్తుంది. ఇక్కడ మనిషి ఓ సాత్వికమైన సుఖాన్ని అనుభవిస్తాడు. అయితే ఈ సుఖం స్వీయమైనది స్వప్రకాశమైనది కోరికలు లేని ఈ శూన్యస్థితిని ఆత్మిక స్థితిని నిరంతరం పొందాలని ఈ శ్లోకంలోని ఆంతర్యం. మనం తాత్కాలిక విషయ సుఖాలు బాహ్యంలోని వస్తువుల నుండి కలుగుతున్నాయని భ్రమిస్తూ ఉంటాం కానీ మనం తరచితరచి చూసినప్పుడు బాహ్య వస్తువుల నుండి సుఖం మనసులోకి వెళ్లడం లేదు ఆత్మిక సుఖమే ఆంతర్యంలో ఊరడం జరుగుతోంది. అది ఆత్మిక స్వభావం ప్రకాశం యొక్క లక్షణం అని మనకు అనుభవేద్యం అవుతుంది. అజ్ఞానవసుడైన జీవుడు ఈ సత్యాన్ని గ్రహించలేక ఆయా వస్తువుల్లో విషయాల్లో వాహనాల్లో సుఖముందని పొరపడుతూ శ్రమిస్తూ వాటి చుట్టూ తిరుగుతూ ఉన్నాడని మనిషికి తెలియాలి. దీనికి కారణం కూడా లేని దాన్ని ఉన్నట్లు తెలిపే విక్షేప దోషమే. అయితే ఈ వాస్తవాలను గ్రహించిన జ్ఞాని విషయాల యందు అనాసక్తుడవుతాడు. బాహ్యతృష్ణా రహితుడై విరాగి అంటే రాగం లేని వాడు అవుతాడు. ఈ వివేకజనిత ఫలం ద్వారా బాహ్య విషయాల యందు ఆపేక్ష క్రమంగా తొలగిపోయి బుద్ధిలో ఉపశమనం కలుగుతుంది. ఇదే చిత్త ప్రశాంతత, కర్మయోగికి ప్రాప్తించే ప్రసాదచిత్తం అంతర్ముఖమైన ఆత్మానుభూతి ఇదే. మనం ఈ బాహ్య సుఖాన్ని రెండు విధాలుగా చెప్పుకోవచ్చు. ఒకటి ప్రపంచంలో విషయాల వెంట పరుగులెత్తి అలసిపోయి ఊరట చెందే సుఖం ఇది ప్రవృత్తి రూప సుఖం. రెండు సమస్త ఆలోచనల నుండి వ్యాపారాల నుండి మనసును మరలించి బుద్ధిలో మనసును విలీనం చేసి నిద్రించడం వల్ల కలిగేది నివృత్తి రూప సుఖం. అయితే ఈ రెండు కాకుండా ఆత్మికసుఖమనేది అక్షయ సుఖం. ఇది సదా ఆత్మతో కూడి ఉండటం వల్ల సదా ఆత్మతో యోగమై ఉండటం వల్ల పొందేది. ఇది అనుభవ జనితం కాదు, స్వస్వరూపాను సంధానం ఆత్మే బ్రహ్మం అని తెలియడమే తానే బ్రహ్మమనే యోగంతో కూడి ఉండటమే బ్రహ్మయోగం. వీరే బ్రహ్మయోగయుక్తాత్ములు. ఇలాంటి బ్రహ్మ యోగ యుక్తాత్ములు అక్షయ సుఖాన్ని పొందుతారు. దీన్ని బట్టి సుఖం యొక్క ప్రధాన కేంద్రం అనేది మన అంతరంగంలోని అంతరాంతరాళలోనే ఉందని మనకు తెలియ వస్తుంది. ఆత్మిక సుఖమే వస్తువులలో విషయాలలో ప్రతిబింబించి విషయ సుఖంగా వ్యక్తం అవుతోంది. ఒకవేళ వస్తువులోనో విషయంలోనూ సుఖముంటే అది అందరికీ ఒకే విధమైన సుఖాన్ని ఇవ్వాలి కదా. అలా జరగటం లేదే ఇలా మనం మనలోకి వెళ్లి ఆలోచించుకోవాలి. అప్పుడే మనం బాహ్యంలో గల శబ్దాది విషయాల యందు మనసును మరల్చి అంతర్ముఖమై ఆత్మయందు స్థిరత్వాన్ని పొంది అక్షయ సుఖంలో తాదాత్మ్యం చెందగలం. బాహ్య ప్రపంచం కన్నా అంతః ప్రపంచమే మిన్న అంతర్ ప్రపంచం అంతుచిక్కనిది అలాంటి అంతుచిక్కని అంతరంగంలోకి వెళ్లి అంతరాంతరాళలోని ఆత్మిక సుఖాన్ని పొంది అక్షయ సుఖంతో పరమాత్మలో విలీనం అవుదాం. తద్వారా బాహ్య సుఖం క్షయమైనదని

అంతఃసుఖం, ఆత్మికసుఖం అక్షయమైనదని మనకు అనుభవేద్యమవుతుంది. ఈ శ్లోకంలో మనం గ్రహించాల్సిన అంశాలు ఒకటి ఆత్మిక సుఖం అక్షయమైనది, రెండు అది పొందాలంటే శబ్దాది విషయాల యందు ఆసక్తిని వీడి బ్రహ్మయోగంలో బ్రహ్మనిష్ఠలో స్థిరం కావడం. మూడు సుఖం బాహ్యంలో లేదని అంతరంగంలోని అంతరాంతరాళలోనే ఉందనే సత్యాన్ని అనుభవ పూర్వకంగా మనలో దర్శించాలి. నాలుగు బాహ్య సుఖం క్షయమైనది నశ్వరమైనది అని తెలియాలి. ఈ నాలుగు అంశాల్ని గుర్తించి మనం మన జీవిత పరమార్థాన్ని పొంది జీవితాన్ని జన్మను సార్థకం చేసుకుందాం.

5అ,22శ్లో.

యే హి సంస్పర్శజా భోగా దుఃఖయోనయ ఏవ తే।
ఆద్యంతవంతః కౌంతేయ న తేషు రమతే బుధః || 22 ||

విషయేంద్రియ సంయోగము వలన ఉత్పన్నములగు భోగములన్నియును భోగలాలసులకు సుఖములుగా భాసించినను అవి నిస్సందేహముగా దుఃఖహేతువులే. ఆద్యంతములు గలవి, అనగా అనిత్యములు. కావున, ఓ అర్జునా! వివేకి వాటియందు ఆసక్తుడు కాడు.

ఇంద్రియాలు విషయాలతో కలిసినప్పుడు కలిగే భోగాలు దుఃఖ హేతువులు అవి రాకపోకలు కలిగినవి అందుకని జ్ఞాని అయిన పండితుడు వాటియందు రమించడు.

విషయేంద్రియ సుఖం వల్ల కలిగే సుఖం వాస్తవం కాదని మనం తెలుసుకున్నాం అది ఎందుకు కాదో అందుకు గల కారణం ఏమిటో నిరూపిస్తూ భౌతిక విషయ భోగాల నుండి సాధకుడు తన మనసును మరలించి తీరాలని ఈ శ్లోకం ఉద్బోధిస్తుంది.

రవ్వంత సుఖం అనిపించినా దాని వెంట పర్వతమంత దుఃఖం మనల్ని చుట్టుముట్టుతుంది. ఎందుకంటే అవి ఆది అంతం కలిగినవి తాత్కాలికమైనవి కాబట్టి అందుకని బాహ్య విషయపు తాత్కాలిక సుఖాలను కూడా 'దుఃఖయోనయ' అని చాలా స్పష్టంగా పేర్కొన్నారు. అంటే విషయ సుఖమనేది తన గర్భంలో దుఃఖాన్ని కలిగి ఉన్నది అనిదానార్థం. అందుకని భౌతిక తాత్కాలిక విషయ సుఖం మనం అభిలషిస్తే దాని గర్భంలోని మేరు పర్వతం లాంటి దుఃఖాన్ని కూడా ఖచ్చితంగా అనుభవించి తీరాల్సిందే. కాబట్టి మనం మన వివేక ప్రజ్ఞపు వెలుగుతో ప్రకాశంతో విషయ సుఖం గర్భంలో దాగి ఉన్న దుఃఖాలన్నింటినీ తెలుసుకుని దాని పట్ల రాగం లేకుండా ఉండాలి. మన దేహంలోని ఇంద్రియాలకు బాహ్యంలోని విషయాలకు గల పరస్పర సంయోగాలే స్పర్శలు కదా ఈ స్పర్శల వల్లే మనిషికి భోగ్య భావన అంటే కర్తృత్వభోక్తృత్వ భావన కలుగుతుంది. మనిషి వీటి పట్ల సాక్షిగా ఉండకుండా వాటితో రమించడం వల్లనే ఇబ్బంది

కలుగుతుంది. ఈ భోగ్యాలుఏవైనా వాటి పట్ల జ్ఞాని ఎరుకుతో ఉండి ఆత్మతో రమిస్తూ నిత్య సుఖాన్ని పొందుతాడు. ఇంద్రియాలు ఇంద్రియ విషయాలతో చక్కగా కలిసిపోవడం సంస్పర్శజాలు అదే వాటి ప్రకృతి అదే వాటి సహజం కూడా. వీటివల్ల మనిషికి ఇబ్బంది లేదు అయితే అది నాది అనుకున్నప్పుడే మనకు దుఃఖం మొదలవుతుంది. ఈ సున్నిత అంశాన్ని గ్రహించి గమనిస్తే సరిపోతుంది, ఇదే మెలకువ. ఈ మెలకువే జీవితాన్ని ఆనందమయం చేస్తుంది. ఎరుక లేకపోతేనే జీవితం దుఃఖమయం. ఈ అంశాన్ని వివేక ప్రజ్ఞతో గుర్తెరిగి అవి అనిత్యాలు ఆద్యంతాలు అర్ధవంతాలు అని తెలుసుకోమని జగద్గురువు మనకు ప్రబోధిస్తున్నారు. మన దుఃఖానికి గల మూల కారణం ఈ శ్లోకం మనకు స్పష్టంగా తెలుపుతోంది. దుఃఖాన్ని గర్భంలో దాచుకున్న అనిత్యాలైన ఆద్యంతాలైన విషయ సుఖాలు అజ్ఞానపు మనిషిని అమాంతం మింగేస్తుంది. అటు ఇటు ఊపి అస్వస్థతకు గురిచేస్తుంది. అవి మనిషికి దగ్గరై స్వల్ప సుఖాన్ని, దూరమై దుర్భరమైన మేరు పర్వతం లాంటి దుఃఖాన్ని కలిగిస్తుంది. అందుకే అవి ఈ లోకంలోని బాహ్య విషయాలను గాని లేదా ఎవరినైనా ఏదైనా పేటినైనా అభిలషించినా ఆశించినా చివరకు మిగిలేది దుఃఖమే అనేది మనందరికీ అనుభవేద్యమే. అందుకే జగద్గురువు వీటిని సంస్పర్శజాలు దుఃఖ హేతువులు అని మనకు బుద్ధి చెబుతున్నాడు. మనం ఈ అంశాలన్నింటినీ మన నిజ జీవితంతో సమన్వయం చేసి చర్చించుకున్న అనుభవ జ్ఞానంతో మనం గ్రహించాల్సిన అంశాలు ఒకటి భౌతిక విషయ సుఖాల గర్భంలో దుఃఖం ఉంటుంది. రెండు భౌతిక విషయసుఖాలు అనల్పమైనవి అల్పాతి అల్పమైనవి. మూడు ఆది అంతం కలిగినటువంటి మొదలు నడుమకు మధ్య క్షణకాలం కనిపించి దుఃఖాన్ని కలిగించి వెళ్లేటటువంటి వాటిని మనం వెంబడించకూడదు. అందుకే అలాంటి నస్వరమైన వాటి పట్ల పరుగులెత్తకూడదు. వాటితో రమింపకూడదు. నాలుగు ఆత్మిక సుఖంతోనే బ్రహ్మయోగ యుక్తులై ఉండాలి. ఈ అంశాల్ని మనం ఆలోచించి ప్రశాంతమైన జీవన మనుగడకు నాంది పలుకుదాం.

5అ,23శ్లో.

శక్నోతీహైవ యః సోఢుం ప్రాక్శరీరవిమోక్షణాత్ ।
కామక్రోధోద్భవం వేగం స యుక్తః స సుఖీ నరః ॥ 23 ॥

ఈ శరీరమును విడువకముందే అనగా జీవించియుండగానే కామక్రోధాదుల ఉద్వేగములను అదుపులో నుంచుకొనగల సాధకుడే నిజమైన సుఖి, నిజమైన యోగి.

ఈ జన్మలోనే ఇప్పుడే జీవించి ఉన్నప్పుడే మనిషి తనలోని కామ క్రోధాల వేగాన్ని అదుపు చేయగలిగిన వారే యోగ యుక్తులు వారే సుఖవంతులవుతున్నారు.

మనం **2- 62, 63** లో కామం అంటే అవసరం లేని కోరికలు అని తెలుసుకున్నాం అలాగే వాటి తీవ్రతను వాటి స్వరూప స్వభావాల్ని కూడా అక్కడ సమగ్రంగా చూసాం. తద్వారా మనిషి పతనమయ్యే విధానాన్ని కూడా తెలుసుకున్నాం.

3-37 లో దీన్ని పరమ శత్రువుగా ఎరుగుము అని హెచ్చరించిన విధానం కూడా తెలుసుకున్నాం. **3-39** లో జ్ఞానులకు అది నిత్య వైరి అది మనిషి జ్ఞానాన్ని కప్పి వేస్తుందని తెలుసుకున్నాం. అంతేకాదు జ్ఞానం లేకపోయినా తెలివిని సొంతం చేసుకున్నటువంటి మనిషి శరీరాన్ని విడిస్తే ఈ కామం తొలగిపోతుంది అని భ్రమిస్తారేమోనని జన్మ జన్మలైనా అది మనల్ని విడిచి పెట్టదని జగద్గురువు హెచ్చరించిన తీరును అక్కడ మనం గ్రహించాలి. ఈ శ్లోకం మనిషిలో కామ క్రోధాల వల్ల కలిగే వేగాన్ని జీవించి ఉన్నప్పుడే దైవ దృష్టితో అదుపు చేసి జీవితాన్ని సుఖవంతం చేసుకోవాలని ఉద్బోధిస్తుంది. 'ఇహైవ' **5-19** లోనూ ప్రయోగించారు. ఇక్కడే ఈ జన్మలోనే ఇప్పుడే మోక్ష సాధన మార్గానికి ఉపక్రమించాలని దీని అర్థం. అంటే భూలోకం కర్మభూమి కదా ఈ దేహం మోక్ష సాధనకు అనువైన ప్రదేశం. ఇది ఎక్కడో స్వర్గాది ఊర్ధ్వ లోకాలలోనో పాతాళాది అధో లోకాలలోనో ఉండి పొందేది కాదని మనకు తెలియాలి. అవన్నీ కూడా కర్మానుభవ లోకాలే కాబట్టి ఈ జన్మలోనే ఇప్పుడే మనం ఈ సన్మార్గానికి నాంది పలకాలి. ఆ దిశగా మన ఆలోచన విధానం కొనసాగాలి అదే ఆచరణాయుతం కావాలి. శరీరాన్ని విడుచుటకు పూర్వమే అంటే మనిషి మరణించక ముందే తనలోని కామ క్రోధాదులపై విజయం సాధించాలని హెచ్చరిస్తున్నారు. కామ క్రోధాలు అనేవి మనిషిని జీవించి ఉన్నంతకాలం ప్రేరేపిస్తూనే ఉంటాయి. ఈ ప్రేరణ విధానాన్ని ఇక్కడ వేగం అన్నారు. ఈ కామ క్రోధాలు అనేక కారణాల వల్ల మనిషి మనసులో ప్రవేశించి క్షోభకు గురి చేసే ప్రమాదం ఉంది. అందుకే ఇది విజృంభించినప్పుడల్లా ఆ వేగానికి మనం అడ్డుకట్ట వేసే విధంగా అప్రమత్తులై ఉండాలి. ఎందుకంటే అది వేగమైంది కాబట్టి అది నదీ ప్రవాహ వేగం లాగా ఉధృతంగా ఉంటుంది. ఈ వేగాన్ని నిలువరించే సమర్థత మనిషికి ఉండాలని ఈ శ్లోకం ద్వారా అర్థం చేసుకోవాలి. అలాంటి నిలువరించే సమర్థత కలిగి ఉన్నవారే యోగ యుక్తులు. ఆ సమర్థతను సహించుటకు సమర్థుడైన నరుడే యోగ యుక్తుడు, అతడే ఆత్మానందం పొందగలడు. ఈ శ్లోకం ప్రబోధించే అంశాలు ప్రధానంగా ఒకటి ఈ జన్మలోనే ఇప్పుడే మోక్షమార్గాన్ని గురించి ఆలోచించాలి. రెండు మోక్షం అనేది శరీరం పతనం కాకముందే జీవించి ఉండగానే పొందేదే గాని మరణించాక పొందేది కాదు. మూడు అందుకే మనం మోక్షం పొందడానికి ప్రధానంగా మనలోని కామ క్రోధాదుల వేగాన్ని అదుపు చేసి ఆత్మవైపుగా దృష్టిని సారించాలి. నాలుగు అలాంటి ఆత్మవైపుగా దృష్టిని సారించగలిగిన సమర్థులే పూర్ణత్వాన్ని పొంది నిత్య సుఖాన్నిపొందుతున్నారు.

5అ,24శ్లో.

యోఽంతఃసుఖోఽంతరారామః తథాంతర్జ్యోతిరేవ యః |
స యోగీ బ్రహ్మనిర్వాణం బ్రహ్మభూతోఽధిగచ్ఛతి || 24 ||

(సమష్టి) అంతరాత్మయందే సుఖించువాడును, ఆత్మయందే రమించువాడును, ఆత్మజ్ఞానియైన వాడును అగు సాంఖ్యయోగి, సచ్చిదానంద ఘనపరబ్రహ్మ పరమాత్మయందు ఏకీభావస్థితుడై, బ్రహ్మనిర్వాణమును పొందును.

తమ అంతరాత్మతో సుఖించేవారు తమతో తామే క్రీడించేవారు తమ అంతర్జ్యోతి వెలుగుతో తమకు తాముగా స్వయంగా ప్రకాశించేవారు అయినటువంటి యోగులు తామే బ్రహ్మమై వుండి బ్రహ్మమందు మోక్షాన్ని పొందుతున్నారు.

అజ్ఞానాన్ని జ్ఞానం చేత నశింపజేసుకున్న వారు పండితులు సమదర్శినులు అని 5-18లో చూసాం. జనన మరణాలను ఈ లోకంలోనే జయించిన జీవన్ముక్తులు బ్రహ్మమందే బ్రహ్మంగానే ఉంటారని 5-19 లో చూసాం. ముందు శ్లోకంలో కామక్రోధాదులు వల్ల కలిగే వేగాన్ని శరీరం విడవక ముందే జీవించి ఉన్నప్పుడే అదుపు చేయాలని చెప్పిన జగద్గురువు ఈ శ్లోకంలో బ్రహ్మసాయుజ్యానికి కావలసిన లక్షణాలను పేర్కొంటున్నారు. సూర్యుని లోని ప్రకాశంలాగా బ్రహ్మవేత్తలో బ్రహ్మవిధుని లక్షణాలు సహజంగానే దర్శనమిస్తూ ఉంటాయి. ఈ శ్లోకంలో ప్రధానంగా మూడు లక్షణాలను మనకు తెలియజేశారు. ఒకటి అంతః సుఖం, రెండు అంతఃక్రీడ లేదా ఆత్మ రతి మూడు అంతర్జ్యోతి. ఈ మూడు లక్షణాలు కూడా అంతః అనే శబ్దాన్ని కేంద్రంగా కలిగి ఉందని గమనించాలి. ఈ మూడింటిని సంక్షిప్తంగా చూసి ఈ మూడు లక్షణాలను పుణికి పుచ్చుకున్న వారు బ్రహ్మ సాయుజ్యాన్ని పొందుతున్నారు. మనం ఐదు అధ్యాయాలుగా చర్చించుకున్న అవగాహనతో ఈ అంశాల్ని సమన్వయం చేసుకోవాలి. ప్రత్యేకించి 5-21 శ్లోకాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ శ్లోకాన్ని అర్థం చేసుకోవాలి. ఒకటి అంతఃసుఖం, అంతరాత్మ యందే సుఖాన్ని అనుభూతించేవారు. అల్పాతి అల్పమైన బాహ్య పదార్థాలలోని ప్రతిబింబ సుఖాలతో సంబంధం లేకుండా వాస్తవాలను వివేచించి సుఖం యొక్క ప్రధాన కేంద్రం అంతరంగమే అని గుర్తించి అంతఃసుఖులైన వారు అచిరకాలంలోనే బ్రహ్మభూతులై వెలుగొందుతారు. 'అంతరారామః' అంటే అంతః క్రీడ అంటే రమించే స్థలం ఆత్మే అని గ్రహించిన వారు అంతరాత్మతో రమించేవారు, దృశ్య పదార్థాలన్నీ కూడా చంచలమని గ్రహించి ఆత్మ ధ్యానంలో నిమగ్నమయ్యే వారు, 5-21 లో చెప్పుకున్నట్లు బాహ్యస్పర్శల యందు కాకుండా ఆత్మిక స్పర్శను గుర్తించి దానితో రమించి సదా ఆత్మతో ఆనందించువారు. వీరు ఆంతరంగిక సత్తును తెలుసుకొని అందులోనే క్రీడిస్తూ అనంతమైన శాంతిని పొందుతారు. మూడు అంతర్జ్యోతి మనం సాధారణంగా బాహ్యంగా వెలిగించే దీపం లాంటివి మాత్రమే జ్యోతి అని కనిపిస్తున్న సూర్య చంద్రాదుల నుంచి మాత్రమే వెలుగు అందుతుందని అనుకుంటూ ఉంటాం. కానీ మనిషి వెలిగించని దీపం వంటివాడని ముందు శ్లోకాల్లో చెప్పుకున్నాం. అలా మనిషిలో వెలుగుతున్న ఆత్మ ప్రకాశం సహాయంతోనే మనం బాహ్యంగా కనిపిస్తున్న సూర్యచంద్రాదుల ప్రకాశాన్ని కూడా చూడగలుగుతున్నాం అనే సత్యాన్ని ముందుగా మనం గుర్తించాలి. మనలో ప్రకాశం లేకపోతే ఈ బాహ్య వెలుగులన్నింటిని కూడా మనం గుర్తించే ప్రసక్తే లేదు, చూసే ప్రసక్తే లేదు. ఈ వాస్తవాన్ని మనిషి గుర్తిస్తే సర్వ సమస్యలకు పరిష్కారం ఇది అవుతుంది. ఉదాహరణకు మనం సూర్యుని ప్రకాశాన్ని గుర్తిస్తున్నందుకు కారణం మన నేత్రేంద్రియం కదా కన్ను ఎవరి ప్రకాశంతో ఏప్రకాశంతో సూర్యుని ప్రకాశాన్ని, వెలుగుని గుర్తిస్తోంది ఆలోచిద్దాం గీతాస్వరూపుల్లారా. మనం మూడవ అధ్యాయం అంతా చర్చించుకున్నాం ప్రాణికి మూలం ఏమిఅని. అంశాలన్నీ అవగాహన ఉన్న దృష్టితో మనం చూస్తే ఆత్మిక ప్రకాశమే బుద్ధి ద్వారా ప్రకాశితమై ఆ ప్రకాశపు వెలుగుతో మనం మన కళ్ళ ద్వారా బాహ్య వస్తువులోని వెలుగును చూడగలుగుతున్నాం. మన నేత్రేంద్రియానికి కావలసినటువంటి వెలుగుతో

కూడుకున్నటువంటి కదలిక శక్తి లేకపోతే మనం బాహ్యపు వెలుగుని చూడలేం కదా. ఈ అవగాహనతో మనం మనలోని అంతర్జ్యోతిని దర్శించగలిగితే అప్పుడు వారు స్వయం ప్రకాశ స్వరూపులై జీవన్ముక్తులవుతారు. సత్తు చిత్తు ఆనందం వీటికి సారభూతమైన పరబ్రహ్మం ఒక్కటే కానీ అనేకం కాదు. సత్య స్వరూపము, స్వయం ప్రకాశము, స్వతఃసిద్ధము, పవిత్రము, చైతన్య స్వరూపము, అసమానము అయినటువంటి పరబ్రహ్మము ఒక్కటే గాని అనేకం కాదు. దీన్నిబట్టి మనం ప్రధానంగా గ్రహించాల్సిన అంశాలు బాహ్యంలో కాకుండా అంతరంగమందే సుఖం ఉంది బాహ్య క్రీడలపై కాకుండా అంతఃక్రీడలందే మనం రమించగలగాలి. బాహ్య ప్రపంచాన్ని మనం గుర్తించగలగడానికి మూలం మనలోని ప్రకాశమేనని అంతర్జ్యోతి సహాయపు వెలుగుతోనే మనం సమస్త ప్రపంచాన్ని దర్శించ గలుగుతున్నామని తెలుసుకోవాలి. ఈ లక్షణాలను పొందువుకున్న జీవన్ముక్తుని దేహంలోని సర్వేంద్రియాలుఉపసమించి తన దేహం దేవాలయంగా శోభిస్తూ ఉంటుంది. మనం **2-16, 2-24** లోని సత్తును అక్కడ చర్చించుకున్న అంశాలకు కొనసాగింపుగా ఈ అంశాన్ని అర్థం చేసుకుంటే సరిపోతుంది. ఉన్నది ఉన్నట్లు లేనిది లేనట్లు తెలియాలి. ఎలాంటి ఆవరణ విక్షేప దోషాలకు ఇక్కడ తావు ఉండకూడదు. ఉంది అంటున్నాము కదా ఆ ఉన్నదానికి లేమి లేదు కదా. అయితే ఈ ఉంది అంటున్నది ఒక ప్రదేశానికి ఒక కాలానికి మాత్రమే సంబంధించింది కాదు ఇది ఓ రూపంగా నామంగా తెలిసేది కాదు. ఎలా ఉంది అంటే జ్ఞాన పూరితంగా ఉంది. సత్ ఉండటం, చిత్తు తెలియడం ఈ రెండూ వేరు వేరు కాదు. చిత్తు లేని సత్తు ఆనందం లేని సత్తు ఉండదు. ఇది పూర్ణం సదా ఉంది అందుకే అది సదాత్మ, సచ్చిదానంద స్వరూపం. ఆ సచ్చిదానంద స్వరూపం తానేఅని తెలిసిన ఆత్మవిధులు బ్రహ్మాత్మ జ్ఞానం కలిగిన బ్రహ్మభూతులు. అంతఃసుఖులు, అంతరారాములు, అంతర్జ్యోతి స్వరూపులు మరో బాహ్యపు వెలుగును ఆశ్రయించక తమ స్వప్రకాశంతో స్వయంగా వెలుగొందుతారు.

5అ,25శ్లో.

లభంతే బ్రహ్మనిర్వాణమ్ ఋషయః క్షీణకల్మషాః ।
ఛిన్నద్వైధా యతాత్మానః సర్వభూతహితే రతాః || 25 ||

పాపరహితులును, జ్ఞానప్రభావమున సమస్తసంశయముల నివృత్తిని సాధించిన వారును, సర్వప్రాణుల హితమును గోరువారును, నిశ్చలస్థితితో మనస్సును పరమాత్మయందు లగ్నముచేసిన వారును అగు బ్రహ్మవేత్తలు బ్రహ్మనిర్వాణమును పొందుదురు.

కల్మషాలను తొలగించుకున్నవారు, సంశయాలను ఛేదించిన వారు జితేంద్రియులు అయిన ఋషులు సర్వభూతాలకు హితాన్ని చేకూర్చడంలోనే ఆసక్తిని చూపిస్తారు, వారే బ్రహ్మానందాన్ని పొందుతున్నారు.

ముందు శ్లోకంలో బ్రహ్మ స్వరూపాన్ని దర్శించాం అలాంటి ఋషుల యొక్క ఆలోచన విధానం ఎలా ఉంటుంది, వారి పనులు ఎలా ఉంటాయి అనేటటువంటి ఋషుల యొక్క తత్త్వాన్ని ఈ శ్లోకం వివరిస్తుంది. అలాగే బ్రహ్మ స్వరూపాన్ని

ఋషిగా దర్శింప చేస్తుంది. బ్రహ్మభూతుల, జ్ఞానుల లక్షణాలు దివ్యంగా ప్రకాశిస్తూ ఉంటాయని ముందు శ్లోకాల్లో చూశాం. ఆ అంశాన్నే ఇక్కడ ఈ శ్లోకం అనుభవైకవేద్యం చేయిస్తుంది. ఋషుల సిద్ధత్వ వైభవాన్ని వివరిస్తూ జ్ఞాన ప్రాప్తిని సాధించుకోవడంలోని మెలకువలను కూడా ఈ శ్లోకం సూచిస్తుంది. ఋషిత్వాన్ని పొందాలంటే అనితర సాధన అత్యంత ఆవశ్యకమని తెలుస్తోంది. ఇందులో నాలుగు లక్షణాలను పేర్కొన్నారు. ఒకటి క్షీణకల్మషులు, ప్రతి మనిషిని జన్మజన్మలాఆగామి సంచిత ప్రారబ్దాలు వెన్నంటుతూనే ఉంటాయని చూశాం. వాటితో పాటు బాహ్య ప్రపంచపు విషయాలపై అనురక్తి, ఈ రెండు వైపులా ఉన్నటువంటి కలుషితాలను కూడా తమ జ్ఞానంతో సమూలంగా తొలగించుకున్నవారు క్షీణ కల్మషులు. రెండు ఛిన్నద్వైధా, సంశయ రహితులు సంశయాలను ఛేదించిన వారు, వివేక జ్ఞానంతో సంశయాన్ని తొలగించుకున్న వారిని కర్మలు బంధించవని **4-41** లో చూశాం, ఆ అవగాహనతో ఈ అంశాన్ని అర్థం చేసుకుంటే సరిపోతుంది. మూడు యతాత్మానః, యతం అంటే సంయమించటం అని అర్థం, యతాత్మానః అంటే ఆత్మ సహాయంతో దేహేంద్రియాలను సంయమింపజేసిన జితేంద్రియులని అర్థం చేసుకోవాలి. యతాత్మ స్థితిని, సిద్ధిని సహజంగానే కలిగి ఉంటారు జ్ఞానులు. ఇలా యతాత్మానులు కాకపోతే మోక్ష మార్గం వైపు ఒక్క అడుగు కూడా కదలదు. అందుకని సాధకులు తపోనిష్ఠులు నెమ్మదిగా దానిని సాధించుకోవాలి. నాలుగు సర్వభూతహితేరతాః, సర్వభూతాలను అంటే సర్వప్రాణులకు ఏది హితమో ఆ కార్యాన్ని నిర్వర్తించడమే ఆసక్తిగా కలిగినవారు, ఆ కార్యంలోనే రమించేవారు, ఆనందించేవారు. సర్వప్రాణులకు హితమైనటువంటి ఆత్మిక స్పర్శను సర్వప్రాణులు తెలుసుకోవాలని దర్శించాలని దర్శింపజేయాలని ఆ దిశగా అలాంటి కార్యాచరణ యందే నిమగ్నమై ఉంటారు. అంటే భౌతిక ప్రపంచపు విషయాసక్తిలో ఇరుక్కుని కొట్టుమిట్టాడుతున్న జనసమూహంపై కరుణతో దయతో వారిని దారి మళ్ళించి దైవం పై ఆత్మపై దృష్టిని సాధించే విధంగా కార్యాచరణకు పూనుకోవడం లాంటి పనిలోనే జ్ఞానులు ఆనందం అనుభూతిస్తారు. అదే సర్వభూతేహితేరతాః. మానవాళికి అంతా కూడా ఆత్మజ్ఞానాన్ని చేకూర్చడానికి అనుకూలమైన కార్యక్రమాలు నిర్వహించడం లోనే వీరు లీనమై ఉంటారు. వీరు ఒక్కోసారి ఈ ప్రపంచానికి పిచ్చివారిలా కనిపిస్తారు కూడా, వీరి చర్యలు సామాన్యులకు అర్థం కావు వీరు నిస్వార్థపరులు. అయితే జ్ఞానులు అలాంటి లోక కళ్యాణ కార్యక్రమాలకు పూనుకోవడంలోని రహస్యం ఏమంటే వారు సర్వాత్మ భావనలో ఉంటారు కదా. అంతయూబ్రహ్మమే అనే భావన వీరిది కదా, అందరిలోనూ తమనే చూసుకుంటారు. అందుకని తన తోటి ప్రాణికి ఆత్మిక స్పర్శ తెలియకపోతే ఎలా అనేటటువంటి భావంతో తమలో భాగమైన వారికి తెలియజేయడం తమ బాధ్యతగా భావిస్తారు. కాబట్టి ప్రతి ప్రాణిలోనూ ఆ చైతన్యం నింపాలనే దిశగా వారు కొనసాగుతూ ఉంటారు. సర్వప్రాణులు తమ నుండి వేరు కాదు కదా అందుకని సర్వప్రాణులకు హితము చేకూర్చే కార్యక్రమాలలోనే వీరు నిమగ్నమై ఉంటారు. ఇలా సమస్త ప్రాణికోటిపై దయే సర్వభూతహితేరతాః. ఈ నాలుగు లక్షణాల్ని తమలో పొదుగుకున్న జ్ఞానులు సర్వభూత సంరక్షణలో ఉన్న ఋషులు సంయగ్దర్శులై బ్రహ్మానందాన్ని పొందుతున్నారు. నిర్వాణం అంటే ఆనంద స్వరూపం **2-72** లో మనం చెప్పుకున్నటువంటి బ్రహ్మనిర్వాణమృచ్ఛతి. ఈ నాలుగు లక్షణాలను గమనించి ఆ దిశగా మనం అడుగులు వేయాలి.

5అ,26శ్లో.

కామక్రోధవియుక్తానాం యతీనాం యతచేతసామ్ |

అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనామ్ || 26 ||

కామక్రోధరహితులును, చిత్తవృత్తులను జయించినవారును అయి, పరబ్రహ్మ, పరమాత్మసాక్షాత్కారమును పొందిన జ్ఞానులకు అంతటను శాంతపరబ్రహ్మ పరమాత్మయే గోచరించును.

కామ క్రోధాదులు లేని వారు, మనోనిగ్రహంకలవారు, ఆత్మ తత్త్వాన్ని ఎరిగినవారు అయినటువంటి యత్నశీలురులకు అంతటా బ్రహ్మ సాయుజ్యమే, మోక్షమే వెలుగొందుతూ ఉంటుంది.

మోక్షరూపులైన జ్ఞానుల తత్త్వాన్ని లక్షణాన్ని ఈ శ్లోకం చాలా స్పష్టంగా వివరిస్తుంది. ఒకటి 'కామ క్రోధవియుక్తానాం, ఈ కామ క్రోధాదులు మన బుద్ధిని కలత పెట్టి కలుషితం చేయడానికి నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటాయి. తద్వారా బుద్ధి విచలితమవుతూ ఉంటుంది. ఇవి జ్ఞానానికి ప్రతిబంధకాలు అందుకే సాధకుడు వీటిని ఖచ్చితంగా సంయమింప జేయాల్సిందే, వేరే మార్గం లేదు. అందుకే మనం రెండవ అధ్యాయంలో వాటి స్వరూప స్వభావం చూసి మూడవ అధ్యాయంలో వాటి పనితీరును సంయమించాల్సిన ఆవశ్యకతను చాలా సమగ్రంగా చూశాం. మళ్లీ **5-23**లో ఖచ్చితంగా వాటిని అరికట్టాల్సిందే అని తెలుసుకున్నాం. ఈ శ్లోకంలోనూ అదే అంశాన్ని గుర్తు చేస్తున్నారు అంటే మన మోక్ష సాధన మార్గం సుగమం కావటానికి వీటిని సంయమింప చేయటం అని మనం అర్థం చేసుకోవాలి. అయితే ఈ అంశాన్ని ఇక్కడ చెప్పడానికి కారణం లేకపోలేదు, తరువాతి శ్లోకంలో వీటిని సంయమింప చేయాల్సిన విధానాన్ని మార్గాలను బోధించడానికి ఇక్కడ అందుకు తగిన పాదులు సెలకొల్పుతున్నారని మనం గ్రహించాలి. రెండు 'యతీనాంయతచేతసామ్' అంటే చిత్తమును నిగ్రహించిన వారు, జన్మజన్మల నుండి తెచ్చుకుంటున్న కర్మఫలాల వాసనను క్షయం చేసుకున్నవారు, మనసు స్వాధీన పడినవారు. మనసు కదిలితే ప్రపంచం కదులుతుంది, మనస్సు శమిస్తే ప్రపంచం శమిస్తుంది. అందుకే పెద్దలు మనశ్శాంతే ప్రపంచశాంతి అన్నారు. 'మనోనాశం' మనసును నశింపజేసి వశం చేసుకున్న వారు 'యతీనాంయతచేతసామ్'.

మూడు 'వర్తతేవిదితాత్మనామ్'', ఆత్మను విదితం చేసుకున్నవారు, ఆత్మ తత్త్వం ఎరిగిన వారు యతులు అంటే ఆత్మ తత్త్వం తెలుసుకున్నవారు విదిదాత్ములు. శరీరం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి కాకుండా వాటన్నింటికీ సాక్షిగా ఉండే ఆత్మ ప్రజ్ఞతో, సాక్షి స్థితిలో నిలకడగా ఉండటమే ఆత్మ తత్వజ్ఞానం. ఈ విధంగా తెలుసుకొని తాను ఆత్మ అని గ్రహించి ఆత్మే బ్రహ్మముగా అనుభవైకవేద్యం కావడం. ఆవరణ, విక్షేపం లేని జ్ఞాన, జ్ఞాతృ, జ్ఞేయం భేదం లేని అఖండాత్మ

జ్ఞానం కలిగి ఉండటం. వీరేవిదితాత్ములు. ఈ మూడింటిని కలిపి సాధనాత్రయం అంటారు. ఈ సాధనాత్రయం గలవారు మోక్ష రూపానికి అర్హులు. ఈ లక్షణాలు ఉన్నవారు యతులు, ఋషులు. మనం ఈ మూడు లక్షణాలను గమనిస్తే ఈమాటకు అర్థం తెలియవస్తుంది. ఋషి, యతి అనే మాటలు ఈ లోకంలో బాగా వాడుకలో ఉన్న మాటని మనకు తెలుసు, అయితే వాటికి సరైన అర్థాలను ఆపాదించి అవగాహన చేసుకోవడంలో కొంత ఆలోచించాల్సిన అవసరం ఉంది. అందుకే వాటి ఆంతర్యం తెలియ చెప్పాలని జగద్గురువు ఇక్కడ ఈ పదాలను ప్రయోగించారు. ఈ శ్లోకంలో యతి అంటే ఎవరు అని మనం గమనిస్తే ఈరెండు పదాల స్వరూప స్వభావాన్ని మనిషిలోని తత్వమే జ్ఞానమే నిర్ధారిస్తుంది గానీ ఇతరత్రా భౌతిక కళ్ళకు కనిపించే వస్త్ర వేషాధారణాధులతో సంబంధం లేదని మనకు నిరూపణ అవుతుంది. దీన్నిబట్టి ఋషుల యతుల లక్షణాలు, కామ క్రోధాదులను తొలగించుకోవడం, మనసును వశం చేసుకోవడం, ఆత్మ తత్వాన్ని ఎరిగి విదితాత్ములు కావడం. అలాంటి జ్ఞానులకు, ఆత్మవిదులకు అంతటా బ్రహ్మ సాయుజ్యమే. మన లోపల బయటా, ఇహ పరంలో, జీవించి ఉన్నప్పుడు తదనంతరం కూడా అనంత స్వరూపంగా విరాజిల్లుతూ ఉండటమని అర్థం చేసుకోవాలి. కామ క్రోధాదులు లేకుండా మనసును వశంలో ఉంచుకున్న సంయగ్దర్శులు, ఋషులు, యతులకు అంతటా అన్నివేళలా బ్రహ్మ సాయుజ్యమే, మోక్షమే.

5అ,27,28శ్లో.

స్పర్శాన్ కృత్వా బహిర్బాహ్యాన్ చక్షుశ్చైవాంతరే భ్రువోః ।
ప్రాణాపానౌ సమౌ కృత్వా నాసాభ్యంతరచారిణౌ || 27 ||

యతేంద్రియమనోబుద్ధి: మునిర్మోక్షపరాయణః |
విగతేచ్ఛాభయక్రోధో యః సదా ముక్త ఏవ సః || 28 ||

బాహ్యవిషయభోగములను చింతనచేయక వాటిని పారద్రోలవలెను. దృష్టిని భ్రూమధ్యమునందు స్థిరముగా ఉంచవలెను. నాసికయందు ప్రసరించుచున్న ప్రాణాపానవాయువులను సమస్థితిలో నడుపవలెను. ఈ ప్రక్రియల ప్రభావమున మనస్సు, బుద్ధి, ఇంద్రియములు సాధకుని వశములోనికి వచ్చును. ఇట్టి సాధనవలన మోక్షపరాయణుడైన ముని ఇచ్ఛ భయ క్రోధ రహితుడై సదా ముక్తుడగును.

బాహ్య విషయాలను బాహ్యంలోనే ఉంచి కనుబొమ్మల మధ్య దృష్టిని సారించి ప్రాణాపాన వాయువులను సమం చేసి ఇంద్రియ మనోబుద్ధులను నియమించి కోరిక, భయం, క్రోధం మొదలైన వాటిని విడిచిపెట్టి మోక్షమే ప్రధానంగా భావించేవారు ఎల్లప్పుడూ ముక్తులే.

మనం ఇప్పటివరకు ఐదు అధ్యాయాలుగా చర్చించుకున్న అంశాల ఫలితం పొందాలంటే ఏమి చేయాలి అనేటటువంటి మార్గాన్ని ఓ మహోన్నతమైన ప్రక్రియను మనకు ఇక్కడ జగద్గురువు పరిచయం చేస్తున్నాడు. ఈ రెండూ కూడా ఆరవ అధ్యాయానికి బీజ శ్లోకాలు. ఈ రెండు శ్లోకాలు అవగాహన అయితేనే తరువాతి అధ్యాయం అర్థమవుతుంది. ఈ పునాది పైనే ఆరవ అధ్యాయం అంతా కూడా నిర్మితమై ఉంది. అందుకని ఈ రెండు శ్లోకాలను జాగ్రత్తగా గమనించి అర్థం చేసుకోవాలి. బాహ్య స్పర్శలు అంటే శ్రోత్రాదుల ద్వారా వెలుపల నుండి బుద్ధి లోపలికి ప్రవేశించే శబ్దాది విషయాలు వాటిని వెలుపలే ఉంచాలి, వాటిని గూర్చి చింతించకూడదు అని అర్థం. చూపును అంటే మన దృష్టిని కనుబొమ్మల మధ్య నిలపాలి. మన నాసికలో సహజంగా అంటే ప్రకృతి సహజ సిద్ధంగా జరుగుతూ ఉన్నటువంటి ప్రాణాపాన వాయు సంచారాన్ని అంటే ఉచ్ఛ్వాస, నిశ్వాసలను సమం చేసి వాటిని గమనిస్తూ ఉంటే అదే సమస్థితిలో ఉంచడం, సమానం చేయడం. మనం మన ఉచ్ఛ్వాస, నిశ్వాసాలను ప్రశాంతంగా గమనిస్తే అవి సమ స్థితికి చేరుకుంటాయి. ఇది అద్భుత సనాతన ప్రక్రియ. మనల్ని నిత్యం సత్తుతో నిలిపించే ప్రక్రియ. ఇది చాలా సులభమైనటువంటి విధానం. శిశువు దగ్గర నుండి తుది శ్వాస వరకు అందరూ చేయతగ్గది. అందరూ ఆచరించదగ్గ ఆమోద యోగ్యమైన ప్రక్రియ. దృష్టిని ఒకే చోట నిలపడం అనేది ధారణకు సంబంధించినది. దీన్నే కేచరీ ముద్ర అని కూడా అంటారు. ఇలా దృష్టిని ఒకచోట నిలిపాక ఉచ్వాస నిశ్వాసలను గమనిస్తూ సమం చేయాలి అన్నారు. దీని పేరు ప్రాణాయామం, అయితే ఈ రెండింటిని కలిపి ధ్యానం అని చెప్పవచ్చు. పూర్తి వివరాలు ఆరవ అధ్యాయంలో చూస్తాం. **4-29, 30** శ్లోకాల్లో ఈ పదాలకు సాంకేతిక పరమైనటువంటి అర్థాలను మనం సశాస్త్రీయంగా చూశాం. ఈ ప్రక్రియ ప్రాణాధీనంగా ఉంటుంది. మనం ప్రాణశక్తిని సమం చేస్తే మనసు సంయమించడం ఆరంభమవుతుంది. మనసు కలత చెందితే ప్రాణం కూడా అంటే ప్రాణ శక్తి కూడా కలతకు గురవుతుంది. అందువల్ల ప్రాణం మనస్సులు పరస్పర ఆధీనాలు. మనకు బాగా ఇష్టమైన వారి పట్ల మనకు ఏదైనా తేడా అనిపిస్తే ప్రాణం విలవిల పోతుంది, ఈ విషయం మనందరికీ అనుభవేద్యమే కాబట్టి ఈ ప్రాణ శక్తిని సమం చేస్తే అలాంటి పరిస్థితుల్ని అధిగమించవచ్చు. మన సర్వ సమస్యల పరిష్కారమంతా, మూలమంతా కూడా ఇక్కడే ఉంది. ఈ ప్రక్రియలో నెమ్మదిగా ప్రాణశక్తిని సాక్షిగా వీక్షించే స్థితికి చేరుకుంటాం. పూరకం, రేచకంరెండింటిని కూడా సాక్షిగా వీక్షించడం ప్రాణ వీక్షణం. మనసును ప్రశాంతంగా ఉంచడానికి ఈ ప్రక్రియ ఉపయోగపడుతుంది. అందుకే జగద్గురువు ఈ ప్రక్రియను మనకు నేర్పుతున్నాడు. ఈ ప్రక్రియ ద్వారా మన వివేకాన్ని అజ్ఞానాన్ని కప్పి వేసి ఉన్న ఆవరణ, విక్షేపాలు, కర్మవాసనలుతమ తమ సాధన విధానాన్ని బట్టి అన్నీ కూడా నెమ్మదిగా క్షయమైపోతాయి. ఇలా చేయడం వల్ల మనం ఐదు అధ్యాయాలుగా చెప్పుకున్న ఇంద్రియ మనోబుద్ధులను సులభంగా సంయమించవచ్చు. వాటిని సమయమింప చేయగల శక్తి మన ఉచ్ఛ్వాస నిశ్వాసాల సమస్థితికి ఉంది. అలా చేయడం వల్ల కోరికలు భయం క్రోధం దేహము నుండి వాటికవేపీగిపోతాయి. తద్వారా ఇంద్రియ మనో బుద్ధులు నియమితమవుతాయి. ఇంద్రియాలను తమ తమ విషయాల నుండి విరమింపజేస్తాయి, అలా విరమింప చేసిన వారే యతులు. అలాంటి వారే మునిర్మోక్షపరాయణః తద్వారా కామ క్రోధాదుల భయం నుండి విడి పడగలుగుతారు. అలా విడిపడిన వారు నిత్యముక్తులు అవుతారు. అలా

ఈ ప్రక్రియ పరికరాన్ని పట్టుకొని ఈ మార్గంలో పట్టు విడవకుండా వెళ్ళగలిగిన ప్రతి ఒక్కరికీ మోక్షమార్గం సుగమమే అవుతుంది. వీరు సదా ముక్తులే. మనిషి అంతిమ లక్ష్యం జీవిత పరమార్థం ఇదే.

5అ,29శ్లో.

భోక్తారం యజ్ఞతపసాం సర్వలోకమహేశ్వరమ్ |
సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాంతిమృచ్ఛతి || 29 ||

భగవంతుడు యజ్ఞములకును, తపస్సులకును భోక్త. సమస్తలోకములకును లోకేశ్వరులకును అధిపతి. సమస్తప్రాణులకును ఆత్మీయుడు. అనగా అవ్యాజదయాళువు. పరమప్రేమస్వరూపుడు. ఈ భగవత్తత్త్వమును ఎఱిగిన భక్తునకు పరమ శాంతి లభించును.

అర్జునా! నేను యజ్ఞాల తపస్సుల ఫలాలను అనుభవించే భోక్తను, సర్వలోకాలకు ప్రభువును, సమస్త ప్రాణులకు మిత్రుడను. ఇలా తెలుసుకున్నవారు శాంతిని పొందుతున్నారు.

ఈ అధ్యాయములోని చివరి శ్లోకం ఇది, అందుకని ఒకసారి ఈ అధ్యాయానంతా కూడా అవలోకనం చేసుకొని శ్లోకాన్ని సంక్షిప్తంగా పరిశీలిద్దాం.

మనం అర్జున విషాద యోగంలో విషాదానికి గల కారణాలను చాలా విపులంగా తెలుసుకున్నాం. సాంఖ్యయోగంలో ప్రామాణికంగా సశాస్త్రీయంగా బ్రహ్మవిద్య అధ్యయనం చేయాల్సిన విధానాన్ని నేర్చుకున్నాం. కర్మయోగంలో కర్మయోగాచరణ వైశిష్ట్యాన్ని కర్మ యోగ ఆచరణ విధానాన్ని సమగ్రంగా చూసాం. జ్ఞాన యోగంలో భగవద్గీత ఆవిర్భావ వికాసాల దగ్గర నుంచి సృష్టి ఆవిర్భావం నుంచి అనేక అంశాల ఆధారంగా జ్ఞాన సముపార్జన విధానాన్ని చూసాం. కర్మ సన్యాసయోగం కర్మను చేయడాన్ని వదలడాన్ని రెండింటినీ స్తుతిస్తున్నావు ఈ రెండింటిలో ఏది శ్రేయస్కరమో చెప్పు అనే అర్జునుని సందేహంతో ప్రారంభమైంది. అర్జునుని సందేహాన్ని నివృత్తి చేస్తూ రెండవ శ్లోకాన్ని ప్రారంభించాడు జగద్గురువు. ఇందులో సన్యాసించాల్సింది కర్మను కాదు కర్మలోని కర్తను అని మనం చాలా స్పష్టంగా సవివరంగా తెలుసుకున్నాం. మూడవ శ్లోకంలో అనేక ప్రమాణాలతో ఉపపత్తులతో సశాస్త్రీయమైన కోణంలో ఈ శ్లోకంలోని ప్రతి అంశాన్ని ఆంతర్యాన్ని కూడా సమగ్రంగా చూసాం. నాలుగవ శ్లోకంలో సాంఖ్యయోగుల కర్మయోగుల గమ్యం ఒకటే అని తెలుసుకొని కర్మసాధనం జ్ఞానం సాధ్యం అనే అంశాన్ని నిరూపించుకున్నాం. ఐదవ శ్లోకంలో సాంఖ్యులు పొందే స్థానాన్ని కర్మయోగులు కూడా పొందుతారు రెండింటిని గౌరవించే వారే జ్ఞానులని అనేక ఉపనిషత్ వాక్యాల సహాయంతో

తెలుసుకున్నాం. ఆరవ శ్లోకంలో జ్ఞాన నిష్ట ప్రాప్తికి మూలం గత జన్మల నుండి సంక్రమించిన చిత్తశుద్ధిని ప్రసాదించే కర్మయోగ నిష్టే యని స్పష్టం చేసుకున్నాం. ఏడవ శ్లోకంలో కర్మయోగం అనుష్టించే వారికి అంతఃకరణం విశుద్ధమవుతుందని ఇది షట్ చక్రాలలోని విశుద్ధ చక్రపు స్థాయిని తెలియజేస్తుందని తెలుసుకున్నాం. ఇందులో విశుద్ధాత్ములు, విజితాత్ములు, జితేంద్రియులు, సర్వభూతాత్మభూతాత్ములు అనే నాలుగు అంశాల్ని సమగ్రంగా వివరించుకున్నాం. **8,9** జంట శ్లోకాలు ఇందులో మనిషిలో జరిగే **18** రకాల ప్రక్రియల్ని వాటి కార్యాల్ని సమగ్రంగా నేర్చుకున్నాం. పదవ శ్లోకంలో ఫలాపేక్ష లేకుండా ఈశ్వరార్పణంగా కర్మలను ఆచరించే వారిని తామరాకును నీరు అంటనట్లు పాపం వీరిని అంటదు అనేటటువంటి అంశాన్ని అనేక ఉదాహరణలతో చాలా స్పష్టంగా చూసాం. **11**వ శ్లోకంలో ఆకాశంలో విహరించే పక్షిని మనం ఉపమగా తీసుకొని కర్మలలో అకర్మను చూసే కర్మయోగి అద్భుత అవ్యక్త అలౌకిక స్వేచ్ఛాయుత పక్షి స్థితిలో కొనసాగుతారని తెలుసుకున్నాం. **12**వ శ్లోకంలో ఫలం కోరకుండా ఈశ్వరునిపై మనసు నిలిపి పనిచేసే యోగి ఆ నిష్ఠ వల్ల శాంతిని పొందుతాడని అలా లేనివారు కర్మబంధంలో చిక్కుకొని బద్ధులవుతున్నారని యోగుల అయోగ్యుల కర్మాచరణలోని తేడాలను చాలా స్పష్టంగా చూసాం. **13**వ శ్లోకంలో ఈ నవద్వారపురం అనే దేహపు పట్టణంలోని సౌందర్యాన్ని వేదాలు ఉపనిషత్తుల ప్రమాణాలతో దర్శించాం. ఈ దేహమే దేవాలయం అని నిరూపించుకున్నాం కూడా. **14**వ శ్లోకంలో పరమేశ్వరుడు మానవుల యొక్క కర్తృత్వానికి గాని కర్మలకు గాని కారణం కాదని కర్మఫల సంయోగాన్ని కూడా సృజింపడని తెలుసుకున్నాం. ఈ అన్నింటిలో కూడా స్వాభావికమైన ప్రకృతే అలా చేయిస్తూ ఉంటుందనే సత్యాన్ని గ్రహించాం. **15**వ శ్లోకంలో నీ స్వయంకృతాపరాధమే నీ పాపానికి పుణ్యానికి కారణం కానీ వాటిని భగవంతుడు గ్రహించడని తెల్చి చెప్పిన విధానం చూశాం. **16**వ శ్లోకంలో ఎవరి అజ్ఞానం ఆత్మ జ్ఞానం చేత నశిస్తుందో అలాంటి వారి జ్ఞానం సూర్యునిలా పరబ్రహ్మ స్వరూపాన్ని పరతత్వాన్ని ప్రకాశింపజేస్తుందని, సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ అనే వేదవాక్కు సహాయంతో సమగ్రంగా తెలుసుకున్నాం. **17**వ శ్లోకంలో పరమాత్మ యందే బుద్ధి, మనస్సు గలవారు పరమాత్మ యందే నిష్టతో పరమాత్మే పరమ గతి అని భావించేవారు జ్ఞానాగ్ని ద్వారా పాపాన్ని పోగొట్టుకొని జన్మరహితమైన మోక్షాన్ని పొందుతున్నారని చూసాం. ఇందులో తద్బుద్ధులు, తధాత్ములు, తన్నిష్టులు,, తత్పరాయణులు ఈ నలుగురి లక్షణాలను సమగ్రంగా చూసి సమన్వయం చేసుకున్నాం. **18**వ శ్లోకంలో విద్యా వినయము కలిగిన బ్రాహ్మణుని పట్ల గోవు ఏనుగు కుక్క కుక్క మాంసం వండుకొని తినేవారి పట్ల కూడా సమదృష్టిని కలిగిన వారు జ్ఞానులని అందరిలోనూ ఒకే తత్వాన్ని దర్శించే విధానాన్ని గ్రహించాం. **19**వ శ్లోకంలో సర్వత్రా సమదర్శినులైన వారు ఈ జన్మలోనే జనన మరణాలను జగత్తును సంపూర్ణంగా జయించిన వారని చూశాం. ఇందులోనే బ్రహ్మ దోషం లేనిది కాబట్టి వారు బ్రహ్మమందే నిరంతరం ఉండటం వల్ల వారికి ఎలాంటి దోషం అంటదని తెలుసుకున్నాం. అలా సమత్వ స్థితిని పొందిన వారు బ్రహ్మమందున్న వారే అవుతారని గ్రహించాం. **20**వ శ్లోకంలో బ్రహ్మ వేత్త స్థిర బుద్ధి కలిగి మోహము చెందక బ్రహ్మమందే నిలిచి ఉండే విధానాన్ని అందువల్ల వారు ప్రియం ప్రాప్తించినా హర్షం చెందరు, అప్రియం ప్రాప్తించినా ఉద్వేగం చెందరని తెలుసుకున్నాం. **21**వ శ్లోకంలో తాత్కాలిక

బాహ్య స్పర్శల యందు ఆసక్తి లేకుండా ఉండే ఆత్మ జ్ఞానులు పొందేటటువంటి నిత్య సుఖాన్ని చూసాం. నాలుగు అంశాలుగా విభజించుకొని సవివరంగా ఇందులోని అంశాల్ని గ్రహించాం. బ్రహ్మ సమాధిలోనే నిత్యం ఏకాగ్రమైన చిత్తం గల వారు పొందే సుఖం అక్షయమైనది, అఖండమైనది, అనంతానంతమైనది అదే బ్రహ్మానందం అని సమగ్రంగా తెలుసుకున్నాం. **22**వ శ్లోకంలో భౌతిక ఇంద్రియ స్పర్శల వల్ల కలిగే క్షణకాలపు రాకపోకలు గలిగిన ఆద్యంతాలతో కూడిన భోగాలు దుఃఖమే కలిగిస్తాయి అవి అనిత్యమైనవి అందుకే వివేకం గల జ్ఞానులు వాటి యందు రమించరు, కూడి ఉండరు అని తెలుసుకున్నాం. **23**వ శ్లోకంలో దేహం రాలిపోక ముందే కామ క్రోధాదుల వల్ల ఏర్పడే ఆవేశాన్ని అదుపు చేయగల సమర్ధులే యోగులు, సుఖవంతులు అలాంటి వారే పూర్ణత్వాన్ని పొందుతారని తెలుసుకున్నాం. **24**వ శ్లోకంలో బ్రహ్మసాయిజ్యానికి కావలసిన బ్రహ్మవిధుల లక్షణాలైనా అంతఃసుఖం అంతరారామం, అంతర్ జ్యోతి అనే అంశాల్ని వివరంగా తెలుసుకున్నాం. **25**వ శ్లోకంలోకల్మషాలను తొలగించుకున్న వారు సంశయాలను ఛేదించినవారు జితేంద్రియలు అయినటువంటి ఋషులు సర్వప్రాణులకు హితాన్ని చేకూర్చడంలోనే ఆసక్తిని చూపిస్తారని వారు లోక కళ్యాణ కార్యాలలోనే బ్రహ్మానందాన్ని అనుభూతిస్తారనిచూసాం. **26**వ శ్లోకంలో కామ క్రోధాదులను తొలగించుకొని మనసును వశం చేసుకొని ఆత్మ తత్త్వాన్ని ఎరిగిన విదిదాత్ములు కావాలని సంకల్పించుకున్నాం. **27, 28** జంట శ్లోకాల్లో వెలుపల విషయాల్ని వెలుపలే ఉంచి చూపును కనుబొమ్మల మధ్య నిలిపి మన నాసిక లోపల సంచరించే ప్రాణవాయువులను సమం చేస్తే మోక్షానికి మార్గం సుగమం అవుతుందని ధ్యాన యోగానికి ఇక్కడే నాంది పలికాం. ఇప్పుడు **29**వ శ్లోకాన్ని సంక్షిప్తంగా చూసి ఈ అధ్యాయాన్ని ముగించుకుందాం. యజ్ఞాలకు తపాలకు కూడా కర్త రూపంలో దేవతా రూపంలో ఉన్న భోక్తను అన్ని లోకాలకు నేనే మహాప్రభువును అన్ని ప్రాణులకు ప్రత్యుపకారం కోరకుండా, ఏమీ ఆశించకుండా ఉపకారం చేసే మిత్రుడిని, అన్ని కర్మ ఫలాలకు స్వామిని సాక్షిని నేనే ఇలా నన్ను తెలిసినవారు శాంతిని పొందుతున్నారు. దేవతలు వారి వారి లోకాలకు మాత్రమే ప్రభువులు కానీ పరమేశ్వరుడు జగద్గురువు సర్వలోకాలకుసర్వలోక అధిపతులకు ప్రభువు అందుకే సర్వలోకమహేశ్వరం. దేవతలలోని శక్తి పరమేశ్వరుడే, అలాగే యజ్ఞాలలో మనం సమర్పించేవన్నీ కూడా దేవతల ద్వారా దేవదేవుడైన పరమేశ్వరునికేచెందుతాయి. ఈ సత్యాన్ని దర్శించగలిగిన వారు శాంతి స్వరూపులవుతున్నారు.

6అ,1శ్లో.

అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ కరోతి యః |
స సన్న్యాసీ చ యోగీ చ న నిరగ్నిర్నచాక్రియః ||

ఐదవ అధ్యాయం ముగింపులో ధ్యానయోగం ఆవశ్యకతను సూచించి ముగించిన జగద్గురువు ఆ అంశానికి కొనసాగింపుగా ఆరవ అధ్యాయమైన ధ్యాన యోగాన్ని ప్రారంభిస్తున్నారు. ఈ అధ్యాయం అంతా కూడా ధ్యానం అనే పునాదిపైనే నిర్మితమై ఉన్నందున మనం ధ్యాన యోగానికి సంబంధించినటువంటి కొన్ని అంశాలను మన అవగాహన కోసం చర్చించుకుని ముందుకు వెళ్దాం. మోక్షమార్గానికి బహిరంగ సాధనం కర్మయోగమైతే అంతరంగ సాధనం ధ్యానయోగం, బుద్ధివైపుగా ప్రయాణించి దైవాన్ని చేరుకోవడానికి చేసే మహా ప్రయాణం అని అర్థం లో పనిని దైవంగా భావించి ఫలితం ఆశించకుండా నిష్కామంగా చేయాలని కర్మయోగంలో నేర్చుకున్నాం. ఇది మనం చేస్తున్న కంటికి కనిపించే పనికి సంబంధించినటువంటిది. అయితే ధ్యానయోగంలో మనసును పూర్తిగా ఆత్మ వైపు పయనింపజేయడం ఇది ఆంతరంగిక సాధన. మనం మనిషి అంటే ఇద్దరని ఒకటి శరీరం రెండు ప్రాణం అని ముందు శ్లోకాల్లో చూసాం, ఆ అవగాహనతో ఈ అంశాన్ని అర్థం చేసుకోవాలి. మోక్షమార్గానికి శరీరం ద్వారా చేసే కర్మ యోగాచరణ ఎంత ప్రాధాన్యమో ప్రాణశక్తికి సంబంధించిన ప్రాణ యోగా చరణ కూడా అంతే ప్రాధాన్యతను వహిస్తుంది. శరీరానికి శ్రమ, ప్రాణ శక్తికి ధ్యానం రెండూ కూడా సమ స్థితిలో ప్రాతినిధ్యం వహిస్తాయి. ఈ ఐదు అధ్యాయాలు కూడా మనల్ని ధ్యాన యోగానికి సమాయత్తం చేయడానికి చేసినటువంటి ఉద్బోధగా మనం గమనించాలి .ఈ ధ్యానం అనే నావను ఎక్కి మనం మన గమ్యస్థానానికి చేరాల్సి ఉంటుంది. ప్రతి ఒక్కరూ జీవితంలో ఏదో ఒక సమయంలో బాహ్య ప్రపంచంతో అలసిపోయిన ప్రాణం అక్కడనుండి విడిపడి మనం మనలో మన హృదయంలో ఒదిగిపోవాలి అని ప్రయత్నం చేయడం మనకు తెలియనిది కాదు. ఈ అంశం ప్రతి ఒక్కరికి అనుభవేద్యమే ఆ సమయమే ఆ క్షణమే ధ్యాన యోగానికి మనం నాంది పలికినట్లుగా భావించాలి. ఆ క్షణమే జీవించే జీవితం ఆరంభమైనట్లు మనం భావించాలి. ఈ విశ్వ ప్రణాళికలో మన కార్యపు ప్రణాళిక ప్రారంభమైనటువంటి క్షణం కూడా అదే, ఆ క్షణానికి ముందు గడిపినటువంటి జీవితం లేదా జన్మలు అన్నీ కూడా వృథాప్రాయాసే తప్ప మరొకటి కాదు. ఇది విశ్వసత్యం ఎవరు అంగీకరించిన అంగీకరించకపోయినా అయితే గత జన్మల్లో ఈ క్షణం జరిగిపోయి ఉన్నా సరే ఈ జన్మలో ఆ సంస్కారంతో సహజంగానే వారు నిత్య జీవన సాధకులు గానే ఉంటారు. ఈ జన్మ వరకు ఆ అవకాశం లేకపోయినా భవిష్యత్తులో ఏదో ఒక జన్మలోనైనా ఆ శుభవేళ ఆ శుభ గడియ కచ్చితంగా ఆసన్నమై తీరుతుంది. ఆ ధ్యాన స్పృహతో ధ్యానం అనే నావ ఎక్కి ప్రయాణం చేసి శాంతి తీరాన్ని చేరే అవకాశం ప్రతి జీవికి కలిగి తీరుతుంది. జన్మ ఎత్తిన ప్రతి ప్రాణికి జన్మ రహిత్యం తప్పదు ఎప్పుడు ఎక్కడ ఎలా అనే ప్రశ్నలకు మన సంస్కారాలే మనకు మనలోంచి సమాధానాన్ని ఇస్తాయి. ధ్యానం అనేది జ్ఞానం కాదు అయితే ధ్యానం ద్వారా పొందేది జ్ఞానం. ధ్యానం అనేది ఒక మానస కర్మ అయితే మరికొంత లోతుల్లోకి వెళ్తే కర్మ కాని కర్మ ధ్యానం అని మనకు తెలుస్తుంది. ధ్యానం చేయాలి అన్నప్పుడు అదో మానసిక కర్మ అయితే ధ్యానంలో ఉండడం ధ్యానంలోనే నిత్యం ఉండడం జరిగితే అది అకర్మే.

మనం ఏదైనా కర్మ చేస్తే అలసట తెలుస్తుంది కానీ ధ్యానంలో ఉంటే మనం అనేక రకాల అలసట అలజడుల నుండి ఉపశమనం పొందుతాం. పనిలో శక్తి క్షీణిస్తుంది ధ్యానంలో మనిషికి అపారమైన శక్తి ప్రాప్తిస్తుంది. పనిచేసిన తరువాత మనిషికి విశ్రాంతి అవసరం ఆ విశ్రాంతి మనకు ధ్యానంలో అందుతుంది. ధ్యానమనే మానస ప్రక్రియలో ఓ అలౌకిక ఆత్మానందం అనుభూతిస్తాం. ఈ అధ్యాయం అంతా కూడా ధ్యానం అనే అంశాన్ని చర్చిస్తుంది. ఈ ధ్యాన ప్రక్రియను మనం శాస్త్రీయంగా సాహేతుకంగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ధ్యానం అనేది మనలో మనం స్థితమయ్యే ప్రక్రియ. మనం చేసే ప్రతి పనికి మనలోంచి ఎంతో కొంత శక్తి ఖర్చు అవుతూ ఉంటుంది కానీ ధ్యాన ప్రక్రియలో మన సాధన స్థాయిని బట్టి ఎంతో కొంత శక్తి ప్రవాహం వృద్ధి చెందుతూనే ఉంటుందని మనం గమనించాలి. చాలామంది నేను ధ్యానం చేస్తాను లేదా చేయాలి అనుకుంటూ ఉంటారు మంచి విషయమే అయితే అందులో స్థిరంగా ఉండేవారు చాలా అరుదుగా ఉంటారు. మనిషి ఎందుకోసం పరుగులెత్తుతున్నాడో తెలియదు మనిషి ఎక్కడి నుండి ఎక్కడికి పరుగులెత్తుతున్నాడో కూడా తెలియదు. ఈ ప్రశ్న మనలో ఉదయిస్తే ఈ ప్రశ్న మనకు అర్థమైతే అప్పుడు ఆ పరుగులు మాని మనసు స్థిరమవుతుంది. మనం ధ్యానంలోకి వెళ్లాలని కళ్ళు మూసినా బాహ్య విషయాలు కళ్ళను తెరిపించి మరి మనసును బయటకి ఈడుస్తూ ఉంటాయి. నాకు నేను అంకితమై ఉన్నాను నేను స్వేచ్ఛా జీవిని అనేటటువంటి నిర్ధారణ మనసులో ఏర్పడాలి. అప్పుడే ధ్యానం కుదురుతుంది అప్పుడే నిజమైన జీవితం ప్రారంభమవుతుంది. మరో అంశం, మనం శరీరానికి అవసరమైన భోజనం ఎవరు చెప్పినా చెప్పకపోయినా తీసుకుంటాం, ఎందుకంటే అది అవసరం అన్నం నీరు నిద్ర మనకు అవసరం అవి లోపిస్తే ప్రాణం పోతుందని వాటిని అనివార్యంగా ఆచరిస్తాం. అయితే ధ్యానం అలాంటి అవసరం కాదు, ధ్యానం చేయనంత మాత్రాన మనలో జరిగే నష్టం మనకు కనిపించదు. ధ్యానం అనేది అన్నం నీరు నిద్ర లాంటి అవసరమే కాదు, అత్యవసరం అన్న సంగతి మనకు తెలియాలి. వాటన్నిటి కన్నా ఇది ఎక్కువ అనే సత్యం మనిషికి దర్శితం కావాలి. అది అర్థమైనప్పుడు ధ్యాన ప్రక్రియ పై ఆసక్తి కలుగుతుంది. అప్పుడు మనసు ధ్యానానికి సిద్ధమై ధ్యానం ఆ మనిషికి సిద్ధిస్తుంది. మోక్ష ప్రాప్తికి జ్ఞాన యజ్ఞమే ప్రధానమని మనం జ్ఞాన యోగంలో చూసాం. చిత్తశుద్ధికి కర్మ యోగా చరణ బహిరంగ సాధన అయితే ధ్యానం ఆంతరంగిక సాధన అని మనకు స్పష్టంగా అవగాహన కావాలి. మోక్ష ప్రాప్తికి అవసరమైన జ్ఞానసిద్ధికి మూలం చిత్తశుద్ధి అని మనం మూడవ అధ్యాయం అంతా చూసాం. ఆ చిత్తశుద్ధి ప్రాప్తికి ఈ అంతరంగ బహిరంగ సాధన అనివార్యం అని మనం గుర్తించాలి. భగవద్గీతలో ఈ ఆరవ అధ్యాయం అయినటువంటి ధ్యాన యోగానికి ఓ ప్రత్యేకత ఉంది. ఇది చాలా కీలకమైనది విశిష్టమైనది. భగవద్గీతకు హృదయం లాంటిది ఈ ధ్యానయోగం. మనకు ఐదవ అధ్యాయం ముగింపులో చివరి మూడు శ్లోకాలు ఈ ధ్యాన యోగానికి నాంది శ్లోకాలు. అందులో 27, 28 శ్లోకాలు ధ్యాన యోగాన్ని సూత్రప్రాయంగా ప్రస్తావించి చిట్టచివరి శ్లోకంలో సర్వలోకాలకు అధిపతి అయినటువంటి నన్ను సర్వేశ్వరుడుగా తెలుసుకున్న వారు శాంతిని పొందుతారు అని చెప్పారు. నిష్కామ కర్మయోగం గురించి మొదటి నాలుగు శ్లోకాలు. 5 నుండి 10 వరకు ఉన్నటువంటి శ్లోకాలలో యోగారూఢిని లక్షణాలను చూస్తాం. 11 నుండి 32 వరకు ఆత్మధారణ గావించుకోవాల్సినటువంటి విధానం, భగవత్ ప్రాప్తిని పొందిన వారి లక్షణాలు, ధ్యాన యోగానికి సంబంధించినటువంటి పూర్తి వివరాలు లక్షణాలు ధ్యాన యోగానికి సంబంధించినటువంటి పూర్తి వివరాలు చాలా విపులంగా ఇందులో చూస్తాం. 33 నుండి 36

వరకు ఉన్నటువంటి శ్లోకాలలో మనసును సంపూర్ణంగా సంయమించాల్సినటువంటి విధానం చూస్తాం. 37 నుండి 47 వరకు యోగ భ్రష్టులైనటువంటి వారి పరిస్థితి ఏంటి? ధ్యాన యోగి యొక్క మహాత్మ్యం, వైభవం ఎలా ఉంటుంది అనేటటువంటి అంశాలను ఈ అధ్యాయంలో మనం చూడబోతున్నాం. ఈ అంశాలన్నింటినీ మనం జగద్గురువు కృపా కటాక్షాలతో అభ్యసిస్తూ ముందుకు వెళ్దాం. ఈ అంశాలను మనం దృష్టిలో ఉంచుకొని చాలా నెమ్మదిగా ఎరుకతో ఈ ధ్యాన యోగాన్ని అభ్యసించడానికి సంసిద్ధులవుదాం. చక్కగా అర్థం చేసుకుని ఆలోచన దిశగా ముందుకెళ్దాం.

ఒకటవ శ్లోకం.

కర్మ ఫలాలను ఆశ్రయించకుండా కర్తవ్యం కర్మలను గుర్తెరిగి ఆచరించేటటువంటి వారే నిజమైన సన్యాసి, నిజమైన యోగి అవుతారు. అంతేగాని కేవలం అగ్ని కార్యాలను త్యజించినంత మాత్రాన వారు సన్యాసులు కాలేరు. అట్లే కేవలం క్రియలను త్యజించినంత మాత్రాన కూడా యోగులు కాలేరు. ఈ అధ్యాయాన్ని అర్జునుడి ప్రశ్నకు అవకాశం ఇవ్వకుండానే నాలుగవ అధ్యాయంలో జ్ఞాన యోగం స్వయంగా జగద్గురువే ప్రారంభించినట్లు ఇక్కడ కూడా మనిషి జీవితానికి మోక్ష మార్గానికి ప్రధానమైనటువంటి ఈ ధ్యాన యోగాన్ని కూడా స్వయంగా జగద్గురువే ప్రారంభిస్తున్నాడు. సన్యాసి అంటే ఎవరు? యోగి అంటే ఎవరు? అనే అంశాన్ని ఈ శ్లోకం నిర్ధారణ చేస్తుంది. ఐదు అధ్యాయాలను మనం క్షుణ్ణంగా అభ్యసించిన తరువాత మనకు మళ్ళీ ఒక్కసారి ఎవరు యోగులు ఎవరు సన్యాసులు గ్రహించండి అని గుర్తుచేసి నిర్ధారించి మనకు ధ్యాన యోగాన్ని ఉద్బోధించాలని మనల్ని ధ్యాన సాధనకు సంసిద్ధం చేస్తున్నారు. సాధారణంగా వస్త్ర వేషధారణను చూసి వారి వ్యక్తిత్వాన్ని నిర్ధారించే మన భౌతిక దృష్టిని మనం ఉపసంహరించుకోవాలని ఆరంభంలోనే మనకు జగద్గురువు ఈ అంశాన్ని ప్రబోధిస్తున్నారు. ఏ వేషాలు చిహ్నాలు యోగిని గాని సన్యాసిని గాని నిర్ధారించలేవని మనకు తెలియాలి. రామాయణంలో పంచవటి దగ్గర సీతమ్మను అపహరించినప్పుడు రావణబ్రహ్మ వేషం మనకు తెలియనిది కాదు కాబట్టి మనం ఈ వేష వస్త్రధారణలను బట్టి వ్యక్తిత్వాన్ని నిర్ణయించకూడదు. ఇదో ఆంతరంగిక నిర్మాణాత్మకమైనటువంటి అమూల్యమైనటువంటి అంశం. ఇది వారి వారి వ్యక్తిత్వపు నిర్మాణం పై ఆధారపడి ఉంటుంది, వారి వారి జ్ఞానంపై ఆధారపడి ఉంటుంది. ఎవరైతే కర్మ యొక్క ఫలాన్ని ఆశించని వారై ఆశ్రయించని వారై చేయాల్సినటువంటి దైవనియమిత కర్మయోగాచరణను కర్మ ఫలాపేక్ష లేకుండా బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తారో వారు సన్యాసులు వారే యోగులు. అంతేగాని భౌతికంగా మనకు కంటికి కనిపించే పనులను విడిచిపెట్టిన వారు కాదు, ఓ ప్రత్యేక వేషధారణకు పరిమితమైన వారు కాదు, వలువలతో కాకుండా విలువలతో కూడి ఉన్నవారు అని మనకు తెలియాలి. ఈ అంశంపై మనకు స్పష్టత ఉండాలి. దీన్ని బట్టి కర్మ ఫలాలను ఆశ్రయించని వారు అనాశ్రితులు. ఈ అనాశ్రితులే సన్యాసులు, యోగులు అని నిర్ధారిస్తున్నారు జగద్గురువు. ఎందుకంటే కర్మ సన్యాసం అనేది వీలుకాదు, మనిషి కర్మ చేయకుండా ఉండటం అనేది జరగదు. అందుకని కర్మలను త్యజించడం, త్యజించానని చెప్పుకోవడం వీలుకాని పని. కర్మ ఫలాన్ని మాత్రమే మనకు త్యజించడానికి వీలవుతుంది. అదే యోగ లక్షణం కూడా అందుకని కర్మ ఫలాన్ని త్యజించిన వారు అనాశ్రితులు అని ఇక్కడ నిరూపిస్తున్నారు. కర్మలను త్యజిస్తే దేహయాత్ర కూడా కొనసాగదని

మనం 3-8 లో చూసాం. కాబట్టి కార్యం కర్మ, కర్తవ్యం కర్మ అందుకని కర్మ ఫలాలపై ఆసక్తి లేకుండా దైవ నియమిత కర్మలనే ఆచరించడమే యోగం, సన్యాసం. మళ్లీ అగ్నిహోత్రాది కార్యక్రమాలు, క్రియలు అన్నారు. ఈ కార్యక్రమాల క్రియల నిర్వహణలో కూడా అకర్తగానే శోభించాలి నేను అనే కర్తృత్వ భావన ఈ కార్యక్రమాలు నిర్వహించే వారిలో ఉండకూడదు. ఈ అంశాలపై మనకు స్పష్టత ఉంటేనే ధ్యానయోగం మనకు అవగాహన అవుతుంది. అందుకని అనాశ్రితులే రాగద్వేషాలు లేకుండా ధర్మాధర్మాలు గుర్తెరిగి కర్మయోగంలో పూర్ణత్వంలో శోభించగలరు. మనకు ఈ సన్యాసి, యోగి అనే మాట బాగా వాడుకలో ఉన్న పదాలు అయితే వాటి ఆంతర్యం మనకు తెలియదు అందుకని ఈ రెండు పదాలకు అర్ధ నిర్ధారణ చేసి ఈ శ్లోకాన్ని అనుభవ జ్ఞానంతో అవగాహన చేసుకోవాలని జగద్గురువు ఈ శ్లోకాన్ని మనం అందించాడు.

6అ,2శ్లో.

యం సన్న్యాసమితి ప్రాహుః యోగం తం విద్ధి పాండవ |
న హ్యసంన్యస్త సంకల్పో యోగీ భవతి కశ్చన ||. 6.2

అర్జునా! సన్యాసం అని దేనిని అంటున్నారో అదే యోగమని తెలుసుకో. కోరికల్ని కర్మ ఫలాలను ఎరుగని వారు ఎవ్వరూ కూడా యోగులు కాలేరు.

కర్మానుష్టాన లక్షణమైన యోగమే నిజమైన సన్యాసం. నిజమైన సన్యాసి సర్వకర్మ సాధనాలను ఆ సాధనాలతో చేయదగిన కర్మలను, ఆ కర్మఫలం యొక్క ఆలోచనలను, ఆ ఆలోచనల వల్ల కలిగే ఫలం పై కోరిక వీటన్నింటినీ సన్యసించి ఉంటారు. కర్మ యందు ప్రవృత్తి కలిగించేది కోరిక, ఆ కోరిక వదిలినప్పుడే కర్మల యందు ప్రవృత్తి కూడా విడివడుతుంది. అలా లేనప్పుడు చిత్త విక్షేపం జరుగుతుంది. తద్వారా యోగి కావడానికి వీలుకాదు, అందుకని చిత్త విక్షేప కారణమైన ఫల సంకల్పాన్ని సన్యసించడం వల్ల వారు యోగిగా భాసిస్తారు. దీన్ని బట్టి ఫలాపేక్ష లేని కర్మయోగం ధ్యాన యోగానికి బాహ్య సాధనం. ఈ కర్మయోగం ద్వారా అంతరంగ సాధనమైన ధ్యాన యోగ సాధనను అభ్యసించాలి. సందేహానికి సంక్లిష్టతకు తావు లేకుండా మనం జ్ఞాన యోగి, కర్మయోగి, ధ్యాన యోగి ఈ మూడు అంశాల గురించి చూసి ముందుకెళ్దాం. గత జన్మల ద్వారా సంక్రమించిన చిత్తశుద్ధి ప్రసాద ఫలితంగా జ్ఞాన యోగి ఆత్మానాత్మ వివేచనచే దేహాది దృశ్య పదార్థాలతో సంబంధం లేకుండా సర్వకాల సర్వవిషయ సర్వావస్థలలో సాక్షిగా ఉంటాడు. ఫలాపేక్ష లేకుండా ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలు చేసేవారు కర్మ యోగులు. బహిర్ముఖ వృత్తులను త్యజించి అంతర్ముఖులై ఆత్మవైపు ప్రయాణించేవారు ధ్యానయోగులు. దేనినయితే ముందు శ్లోకంలో సన్యాసంగా మనం నిర్ధారించుకున్నామో దాన్ని యోగం అని తెలుసుకో. ఇక్కడ సంకల్పాలు అంటే ఆలోచనలు ఇవి మనసులో పుడతాయి. అక్కడి నుండి కదిలి బాహ్యంలో కర్మలుగా వ్యక్తం అవుతాయి. అయితే మనం మనకు అవసరం లేనటువంటి బాహ్య సంబంధపు కోరికలను

లేకుండా చేయడం అంటే మనసే లేని స్థితిని చేరుకోవడం. కామ్య కర్మలకు సంబంధించిన ఆలోచనలు సమూలంగా మనసు నుండి తొలగిపోవాలి. అవి పుట్టడానికి అవకాశం లేకుండా చేయాలి. అలా కామ్య కర్మల్ని త్యజించిన కర్మయోగులు చిత్తశుద్ధి నిమిత్తమే కర్మలు ఆచరిస్తారు. అలా లేని వారు యోగి కాలేరు అని నిశ్చయించి మరీ జగద్గురువు ఉద్బోధిస్తున్నారు. కర్మయోగి యొక్క కర్మానుష్టానంలో ఆయా కర్మల యొక్క స్వధర్మాచణే ఉంటుంది. అంటే దేహ నిర్వహణకు దైవనియమిత కర్మాచరణకు సంబంధించినవి మాత్రమే ఉంటుంది. అక్కడ రాగద్వేషాలు ఉండవు, అందుకని అక్కడ కార్యం కర్మ, కర్తవ్యం కర్మ మాత్రమే ఉంటుంది ఫలాసక్తి ఉండదు. అలా కామ్య కర్మల్ని త్యజించకపోతే వారు యోగి కాలేరు అని ఖచ్చితంగా ఈ శ్లోకంలో తేల్చి చెప్తున్నారు. ధ్యాన యోగం అనేది మానస కర్మ కదా, మనసు అందుకు సిద్ధం కావాలి. కర్మయోగం బుద్ధిని శుద్ధి చేస్తుంది, ధ్యానానికి అర్హతను ప్రసాదిస్తుంది. అప్పుడే బుద్ధిలో ధ్యానం కుదురుతుంది. అంతరంగ యోగ సాధనమైన ధ్యాన యోగానికి ఉపకరించేదే బహిరంగ సాధనమైన కర్మయోగం. ఈ రెండూ సమపాళ్లలో జరిగినప్పుడే మోక్షమార్గం సుగమమం అవుతుంది. బాహ్యంలో కర్మ యోగాచరణ ద్వారా చిత్తశుద్ధి, అంతరంగంలో ధ్యాన యోగాచరణ ద్వారా చిత్తశాంతి, ఇది మనకు స్పష్టంగా అర్థం అవ్వాలి. కర్మలలో ధ్యానం కుదరదు. ధ్యానంలో కర్మలు ఉండవు. కర్మయోగంలో శుద్ధిపడిన వారే ధ్యానంలో శాంతి సిద్ధిని పొందగలరు. ఈ కారణంగానే జగద్గురువు మనకు ఈ ధ్యాన యోగారంభంలో కూడా కర్మయోగ ప్రస్తావన మన ముందుంచి ధ్యాన బోధను ప్రారంభించబోతున్నారు. మనం ధ్యాన యోగ ఆవశ్యకతను గుర్తించి అభ్యసిస్తూ ముందుకెళ్లాలి.

6అ, 4శ్లో.

యదా హి నేంద్రియార్థేషు న కర్మస్వనుషజ్జతే |
సర్వసంకల్పసన్న్యాసీ యోగారూఢస్తదోచ్యతే || 6.4

ఇంద్రియ విషయాల పట్ల కర్మలలో కర్తృత్వం పట్ల సమస్త కోరికల పట్ల ఆసక్తిని వీడి సమస్త కోరికల్ని సన్యసించిన వారు యోగారూఢులు అవుతారు.

మనం ఈ శ్లోకాన్ని పరిశీలించే ముందు శమం, దమం అనే మాటలకు అర్థాలను చూసి ముందుకెళ్దాం. ఈ శమ దమాదులు ఆరు, ఒకటి శమం, రెండు దమం, మూడు ఉపరతి నాలుగు తితీక్ష ఐదు శ్రద్ధ ఆరు శాంతి సమాధానం. ఇప్పుడు శమం, దమం అనే రెండు అంశాల గురించి అవసరం కనుక వీటిని గురించి మాత్రమే సంక్షిప్తంగా చూసి శ్లోకాన్ని సమన్వయం చేసుకుందాం. మిగిలినవి సందర్భానుసారంగా తెలుసుకుందాం. శమం అంటే అంతరింద్రియ నిగ్రహం అంతఃకరణ వృత్తులైన సంకల్ప వికల్పాలకు రాజు మనసు కదా కాబట్టి మనసును శూన్యం చేసి పరిశుద్ధం చేయాలి. అలా మనసును ఏకాగ్రతగా నిలిపి అంతరంగా వృత్తుల్ని అధిగమించాలి. అందుకే ముందు శ్లోకంలో ధ్యానయోగం ఆరోహించిన వారికి శమం సాధనం అవుతుంది అని మనం చెప్పుకున్నాం.

ధ్యాన యోగ ఆరోహణకు ప్రధాన సాధనం ఈ శమమే అంతరింద్రియ నిగ్రహమే అని మనకు తెలియాలి దమం అంటే బాహ్యేంద్రియ నిగ్రహం. స్థూల శరీర వ్యవహారాలకు ప్రధానమైనది బుద్ధి అందువల్ల బుద్ధితో మనసును స్థాన చలనం చెందనివ్వకుండా బాహ్యేంద్రియ నిగ్రహం కలిగి నిశ్చలంగా ఉండటం దమం. చిత్తం సమాధాన పరచుకున్న యోగి శబ్దాదులైన అయిన ఇంద్రియ విషయాల యందు తనకేమీ ప్రయోజనం లేదని తెలుసుకొని వాటినుండి విడిపడినవారు యోగారూఢులు. అప్పుడు వారు సర్వసంకల్ప సన్యాసులు ఇహపర కామ్య కారణాలన్నింటినీ పరిత్యజించినవారు. కర్మయోగాన్ని దాటి ధ్యానయోగంలో స్థిరపడిన వారు ధ్యాన యోగాన్ని సంప్రాప్తింప చేసుకున్న వారు యోగారూఢులు. కర్మ కారణమైన ఆరు రుక్షువు గురించి ముందు శ్లోకంలో చూశాం. ఇక్కడ శమమే సాధనమైన యోగారూఢుని విలక్షణమైన లక్షణాలను ఈ శ్లోకం ఉద్బోధిస్తుంది. ఆరు రుక్షువు అంటేనేమో ప్రయత్నానికి సిద్ధమైన వారు, ధ్యాన యోగాన్ని అధిరోహించడానికి సంసిద్ధతను కలిగి ఉన్న వారు ఆరు రుక్షువు. వీరు తమ ప్రయత్నంలో ఎదురయ్యే అనేక ప్రతిబంధకాలను దాటి యోగారూఢ స్థితికి చేరుకోవాలి. ఇందుకు విషయ సంగం, కర్మ సంగం కోరికలపై సంగం ఈ మూడింటి నుండి విడిపడి విలక్షణంగా శోధించేటటువంటి యోగారూఢుని స్వరూపస్థితే యోగారూఢత్వ స్థితి. యోగంలో ప్రతిబంధకాల నుండి విడివడిన యోగారూఢుని చిత్తం సమస్తమైన కోరికలు కలతల నుండి విడిపడి పోయి ఉంటుంది. అవే ఆ మనసును వీడిపోయి వెళ్లిపోయి ఉంటాయి. కాబట్టి విషయ సంగం, కర్మ సంగం కోరికలపై సంగం విడిచినప్పుడే పూర్ణత్వం సిద్ధిస్తుంది, ఇదే ఆత్మ లక్షణం. ఈ లక్షణంతో తానే ఆత్మ అని ఎరిగినవారు యోగారూఢులు, సర్వసంకల్పాలు త్యజించి సాక్షిమాత్రంగా వీక్షిస్తూ ఉంటారు. ఇది యోగారూఢుని వైభవం, ఆత్మవైభవం. ఇలా సాధకుడు అంటే ఆరు రుక్షుడు యోగారూఢునిగా ఎదిగే విధానాన్ని ఈ శ్లోకం నిర్ధారిస్తుంది. ఇందులో యదా తదా అన్నారు ఈ ప్రయోగాలు మనం ముందు శ్లోకాల్లో కూడా చూసాం అంటే ఈ శ్లోకంలో చెప్పిన మూడు లక్షణాలు మనిషి ఎప్పుడైతే పుణికి పుచ్చుకోగలరో అప్పుడు వారికి యోగారూఢత్వం సిద్ధిస్తుందని భావించాలి. అందుకే మనం కూడా ఇందులో తెలిపిన యోగారూఢులోని లక్షణాలను గుర్తించి ఆచరించాలి. అప్పుడే మనలోని ప్రజ్ఞాన రూపమైన ఆత్మచైతన్యం మేలుకొని ఉంటుంది. తద్వారా చిత్తం అందులో లయమై అంతర్వీతమౌతుంది. ఈ శ్లోకంతో నిష్కామ కర్మ యోగ ప్రకరణం ముగిసింది. ఒకసారి ఈ నాలుగు శ్లోకాలను పునరావలోకనం చేసుకుందాం. ఒకటవ శ్లోకంలో కర్మఫలం కోరకుండా మనం చేయాల్సినటువంటి దైవ నియమిత కర్మలు చేసేవారు సన్యాసి, యోగి అవుతారు కానీ కర్మలను క్రియలను మారిన వారని తెలుసుకున్నాం. రెండవ శ్లోకంలో సన్యాసమే యోగమని నిర్ధారించి కోరికల్ని సన్యసించని వారు కూడా యోగులు కాలేరని చూశాం. మూడవ శ్లోకంలో కర్మయోగం ఆచరించే వారికి కర్మయోగం సాధనమవుతుంది. ధ్యానయోగం ఆచరించే వారికి శమం సాధనం అవుతుంది అని మనం తెలుసుకున్నాం. ఈ మూడు అంశాలతో పాటు ఈ నాలుగవ శ్లోకంలో నిష్కామ కర్మ యోగ విధానం యోగారూఢుని లక్షణాలను వివరించుకుని ఈ నాలుగు శ్లోకాలతో ఈ నిష్కామ కర్మ యోగాన్ని సమాప్తి చేసుకుంటున్నాం.

6అ, 5శ్లో.

ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మానమవసాదయేత్ |
ఆత్మైవ హ్యాత్మనో బంధుః ఆత్మైవ రిపురాత్మనః || 6.5

అర్జునా! మనిషి తనను తానే ఉద్ధరించుకోవాలి. తనను తాను పాడు చేసుకోకూడదు, ఎందుకంటే తనకు తానే బంధువు తనకు తానే శత్రువు.

మనల్ని మనం ఉద్ధరించుకోవాలి అన్నప్పుడు మనకు అవగాహన అవ్వాల్సిన ప్రధానమైనటువంటి అంశాలు మనిషికి సంబంధించిన మనకు సంబంధించిన అంశాలు, ఒకటి ఆత్మసిద్ధాంతం, రెండు పునర్జన్మ సిద్ధాంతం, మూడు కర్మ సిద్ధాంతం, నాలుగు ధ్యాన యోగ సిద్ధాంతం, ఐదు పురోగమన సిద్ధాంతం, ఇది పురోభివృద్ధికి సంబంధించినది, ఆరు విశ్వవ్యాపక సిద్ధాంతం దీనినే అనేకత్వపు సిద్ధాంతం అని కూడా చెప్పుకోవచ్చు. వీటిలో మొదటిది మనం శరీరం మాత్రమే కాదు ఆత్మపదార్థం కూడా, ఉన్నది శాశ్వత ఆత్మే అనే అంశాన్ని మనం ఇప్పటికే సమగ్రంగా చర్చించాం ఇది ఆత్మ సిద్ధాంతం.

రెండు పునర్జన్మ సిద్ధాంతం, నాలుగవ అధ్యాయం ఆరంభ శ్లోకాల్లో ఈ అంశం మనకు నిర్ధారణ అయింది. ఈ అంశం మీద చాలా విస్తృతమైనటువంటి లోతైనటువంటి చర్చ చేసినటువంటి అవగాహన మనకు ఉంది, ఆ కారణంగా ఈ పునర్జన్మ సిద్ధాంతమనే అంశాన్ని సమన్వయం చేసుకోవాలి. మూడు కర్మసిద్ధాంతం, రెండవ అధ్యాయం 39వ శ్లోకంతో మనకు కర్మ ప్రకరణం ప్రారంభమైంది. అక్కడ మనం ఏర్పాటు చేసుకున్నటువంటి పునాదిపై ఆరవ అధ్యాయం నాలుగవ శ్లోకం వరకు నడిచింది. ఈ అంశం కూడా మనం ఈ రెండు నుంచి ఆరు అధ్యాయాలుగా చర్చించుకున్నటువంటి సమగ్రమైనటువంటి విషయ విశ్లేషణ ఆధారంగా మనం కర్మసిద్ధాంతపు స్వరూప స్వభావాన్ని అవగాహన చేసుకోవాలి. నాలుగు ధ్యాన యోగ సిద్ధాంతం, మనకు ఈ అధ్యాయంలోని పదవ శ్లోకంతో ప్రారంభమవుతుంది. అందుకు ఆరూఢులవుతున్న సందర్భంలో ధ్యాన యోగాన్ని అధిరోహిస్తున్న సందర్భంలో మనల్ని మనం ఉద్ధరించుకోవాలి అనేది ఓ శాస్త్రీయమైన అంశంగా మనం పరిగణించాలి. మనల్ని మనమే ధ్యాన యోగానికి సంసిద్ధం చేసుకోవాలి.

ఇక పురోగమన సిద్ధాంతం మనం మొదటి మూడింటిని ఆచరించి నాలుగవ అంశం అయినటువంటి ధ్యాన యోగాన్ని అధిరోహించాక ఈ ఆధ్యాత్మిక సిద్ధాంతంలో మనం పురోగమనం దిశగానే కొనసాగుతూనే ఉంటాం. ఈ సత్యం మనకు దర్శితం కావాలి అంటే అభివృద్ధి పదం దిశగా మనం అడుగులు వేస్తూ ముందుకు వెళ్తున్నామనేటటువంటి ఎరుక మనలో ఉండాలి. ఆరు అనేకానేక సిద్ధాంతం, దీనినే సర్వవ్యాపక సిద్ధాంతం అని చెప్పుకున్నాం. ఇన్ఫినిటీ, అనంతం అదే సర్వవ్యాపకం, ఆత్మజ్ఞానం అనంతం ఆనందం ఆనంతం. ఇలా మనం పరిణితి చెందుతున్నాం అనేటటువంటి అంశాలను గమనికతో క్షణక్షణం ఎరుకతో ముందుకెళ్లాలి. ఈ ఆరు అంశాల్ని అవగాహన చేసుకున్నటువంటి అనుభవ జ్ఞానంతో ఈ శ్లోకాన్ని పరిశీలిద్దాం.

ప్రతి మనిషి తనను తానే ఉద్ధరించుకోవాలనే అంశాన్ని ఈ శ్లోకం ప్రతిపాదిస్తుంది. మనం మన అంతరాంతరాలలోకి వెళ్లి మునిగిపోగలిగితే అప్పుడు మన మూలాలు మనకు తెలుస్తాయని దీని అర్థం. అలా మన మూలాల్ని మనం తెలుసుకున్నప్పుడే మనల్ని మనమే ఉద్ధరించుకోవాలనే సత్యం మనకు అవగతం అవుతుంది. సంసార సాగరంలో భౌతిక ప్రపంచపు భ్రాంతిలో ఉన్నవారు ఎవరికి వారుగా ఎదగాలి, యోగారూఢతను పొందాలి. అంతేగాని తమకు తాముగా అధోగతి పాలు కాకూడదు. ఈ భ్రాంతిలో నుండి విడిపించగల బంధువు మరొకరు ఉండరు, ఎందుకంటే తనకు తానే బంధువు ఏ బంధువు కూడా ఆధ్యాత్మిక పురోభివృద్ధిని కాంక్షించరు. ప్రత్యేకించి వారంతా కూడా మోక్షరూప సాధనకు ప్రతికూలురు గానే ఉంటూ అడ్డు తగులుతూనే ఉంటారు. అందుకని మోక్ష సాధన మార్గాన్ని అవలంబించడానికి తనకు తానే బంధువు. అలా లేనప్పుడు ఖచ్చితంగా తనకు తానే శత్రువు అవుతారు. ఆధ్యాత్మిక పురోగతికి బాటలు వేయకపోతే అప్పుడు తనకు తాను శత్రువే అవుతారు కదా ఎందుకంటే తన పతనానికి తానే కారణం అవుతున్నారు కాబట్టి. ప్రతి మనిషిలో సహజంగా రెండు ఆలోచనలు ఎప్పుడూ కూడా ఉరకలేస్తూ ఉంటాయి. ఒకవైపు అనంత ఆనందాన్ని ఆస్వాదించాలని అంతరంగ ప్రగతివైపు ఎదురుచూస్తూ ఉంటాం. మరోవైపు దేహేంద్రియ మనోబుద్ధులను ఉత్తేజపరచి తృప్తి పరచే తాత్కాలిక సుఖాలను బాహ్య విషయంలో పొందాలని మనసు లాగుతూ ఉంటుంది. మనిషి అనంతానంతం వైపుకు పయనిస్తే తనను తాను ఉద్ధరించుకుంటాడు. అలా కాక విషయ సుఖాల వైపు దృష్టిని మరలిస్తే వినాశనాన్ని కొని తెచ్చుకుంటాడు. అందుకే జగద్గురువు నీకు నువ్వే బంధువు అన్నారు. ఎప్పుడు పురోభివృద్ధి దిశగా అడుగులు వేస్తే అప్పుడు మనకు మనమే బంధువులం అవుతాం, లేకపోతే బాహ్య విషయాల వైపు తన దృష్టిని సారిస్తే తనకు తానే పతనం చేసుకుంటాడు. ఈ ప్రపంచంలో మనకు శత్రువు ఎవరు బంధువు ఎవరు అని ఆలోచిస్తే రెండూ కూడా మనకు మనమే అనే విషయం తేలిపోతుంది. మన ఉద్ధరణకు మనమే కారణమని మన పతనానికి మనమే కారణమని అన్నారు. ఈ వాస్తవాన్ని మనం గుర్తించాలి. అలా గుర్తించినప్పుడు గురువైనా శాస్త్రమైనా భగవద్గీత అయినా దైవమైనా మనల్ని నడిపించగలదు. మన ఆకలికి మనమే అన్నం తినాలి వేరొకరు తింటే మన ఆకలి తీరదు కదా, అలాగే తనను తానే ఉద్ధరించుకోవాలి ఇందులో ఇతరుల పాత్ర ఏమాత్రం ఉండదు. అలాగే తన పతనానికి కారణం తానే కానీ ఇతరుల పాత్ర అందులో ఉండదు. అందుకని తన వినాశనానికి పతనానికి తానే కారణమవుతున్న పరిస్థితిని జగద్గురువు ఈ శ్లోకంలో చాలా స్పష్టంగా మన ముందు ఉంచారు. మనం ఎప్పుడు కూడా మన పతనానికి మరొకరిని కారణంగా చూపుతూ ఉంటాం కానీ మన ఉద్ధరణకైనా మన పతనానికైనా మనమే కారణం అని మనకు తెలియాలి. శత్రువు ఎవరు అంటే హాని చేసేవారు అయితే తనకు తాను ఉద్ధరించుకునే ప్రయత్నం చేయకుండా తనకు తానే అనిత్యమైన విషయాల వైపు వినాశనమొందే దిశగా వెళుతూ ఉన్నప్పుడు ఏ శత్రువు అందుకు కారణమవుతున్నారు? ఇలా ఆలోచిస్తే తన భౌతిక కోరికలనే శత్రువే తనకు తానే కారణం అని తేలిపోయింది కదా. దైవం తనను తాను ఉద్ధరించుకోవాలనుకునే వారికి సహాయం చేస్తుంది అంతేగాని సోమరులై ఏమాత్రం ఇంద్రియ నిగ్రహము, విరాగము లేకుండా నిరంతరం బాహ్య ప్రపంచపు విషయాల వైపు ఆరాట పోరాటాలతో అహర్నిశలూ పరుగులెడుతూ ఉంటే అలాంటి వారిని కైవల్య ధామానికి దైవం ఎలా తీసుకెళ్తుంది. ఎప్పుడో వారికి ఇష్టం వచ్చినప్పుడు ఏ గుడికో వెళ్లి మొక్కు తీర్చుకుంటే సరిపోతుందా? ఒక క్షణం పాటు

కొబ్బరికాయ కొట్టి ఏదో పూజ చేసి మళ్లీ యధావిధిగా తన బాహ్య ప్రపంచపు ఆరాటాన్ని అంటుకొని అల్లలాడుతూ ఉంటే దైవం ఏమి చేయగలదు? అందుకే మనల్ని బాహ్య ప్రపంచంలోని ఏ బంధు మిత్రులూ ఉద్ధరించలేరు. మన నిర్మల చిత్తమే మన కర్మ యోగాచరణే మన ధ్యాన యోగ సాధనే మనల్ని ఉద్ధరించగలదు. అందుకని మనం మన పతనానికి కారణం కాకుండా ఉద్ధరించుకోవడానికి కంకణబద్ధులం కావాలి. ఈ క్రమంలో నీకు నువ్వే బంధువు ఒకవేళ అలా కాక పతనమైనా కూడా దానికి కూడా కారణం నువ్వే, నీకు నువ్వే శత్రువు అని తెలుసుకో. ఇది జగద్గురువు చెప్తున్నటువంటి సందేశం.

6అ, 6శ్లో.

బంధురాత్మాత్మనస్తస్య యేనాత్మైవాత్మనా జితః |
అనాత్మనస్తు శత్రుత్వే వర్తేతాత్మైవ శత్రువత్ || 6.6

ఆత్మశక్తితో ఆత్మను జయించిన వారికి ఆత్మ బంధువు అవుతుంది. అలా జయించలేని అజ్ఞానులకు తమ ఆత్మే శత్రువు వలె ప్రవర్తిస్తుంది.

ఆత్మను ఆత్మ చేతనే నశింప చేసుకోకూడదు అని మనం ముందు శ్లోకంలో చూశాం ఆ భావానికి కొనసాగింపుగా ఇక్కడ ఏ ఆత్మచేత ఆత్మ జయింపబడిందో అలాంటి వారికి ఆత్మే బంధువు అంటే తనను తాను జయించిన వారికి తానే బంధువు, జయించని వారికి తనకు తానే శత్రువు అని అర్థం. అలా జయించిన వారికి అదే దేహేంద్రియాలు బంధువుగా ప్రవర్తిల్లుతాయి అలా వశపడని వారికి శత్రువుగా ప్రవర్తిల్లుతాయి.

అది ఎలానో చూద్దాం. ఒకటవ అధ్యాయంలో ఈ అంశాల్ని చాలా వివరంగా చూశాం కాబట్టి ఇక్కడ సంక్షిప్తంగా చూద్దాం. కార్య కారణ సంఘాతమైన శరీర రూప ఆత్మను వశం చేసుకున్న వారు జితేంద్రియులు అలాంటివారికి ఆత్మే బంధువు అవుతుంది. అలా ఇంద్రియ సమూహ నిగ్రహం లేని వారికి తమ ఆత్మే శత్రువు వలె ఉండి అపకారం చేస్తుంది. బంధుమిత్రులు శత్రువులు అనేవారు బాహ్యంలో లేరు మనకు బంధువు శత్రువు ఆ ఇద్దరూ మనలోనే ఉన్నారు. మనం ఎవరితో కలిస్తే అలానే మన జీవితం కొనసాగుతుందని మనకు తెలియాలి. మనలో ఏ భావన ఉంటే అదే మనం అవుతాం. బాహ్య శత్రువుల వల్ల మనకు కీడు కలగదు, మనలో ఏపుగా పెరిగిపోయినటువంటి మనలోని శత్రుత్వపు భావన అయినటువంటి శత్రువుల వల్ల మాత్రమే మనకు కీడు కలుగుతుంది. తద్వారా ఒక్క క్షణం కూడా అవి మనల్ని ప్రశాంతంగా ఉంచవు ఆ కారణంగా అలాంటి వారికి ధ్యానయోగం కూడా కుదరదు అందుకని ఇక్కడ ప్రత్యేకంగా ఈ శ్లోకంలో ఈ అంశాన్ని వివరిస్తున్నారు. ఒకవేళ ప్రపంచంలో మనకు ఎవరైనా కీడు చేయాలని అనుకున్నా పరిస్థితుల ప్రభావం వారి అసమర్థత అసక్తత వల్ల వారు విరమించుకునే అవకాశం ఉంది. అలాగే వారిని మనం నివారించే ప్రయత్నం కూడా చేయవచ్చు. అయితే అంతః శత్రువును అలా చేయలేం కదా. కాబట్టి మనం మనలో అలాంటి

ప్రమాద భరితమైనటువంటి అంతః శత్రువు భావనను మనం వేర్లతో సహా సమూలంగా తొలగించుకోవాలి. మనలో ఆ భావనే లేకపోతే మనకు బాహ్యంలో కూడా ఎవ్వరూ శత్రువులు ఉండే అవకాశమే లేదు. ఇదే పద్ధతిలోనే మిత్రత్వము లేదా బంధుత్వము మనకు ఎంతో మేలు చేసి బాహ్య ప్రపంచంలో కూడా అందరి పట్ల మిత్రత్వాన్ని బంధుత్వాన్ని పెంపొందింప చేస్తుంది. కాబట్టి మనలో శత్రుత్వానికి తావివ్వకుండా మిత్రత్వానికి బంధుత్వానికి మాత్రమే స్థానమిస్తే ఇక మనకు బాహ్యంలో కూడా ఎవ్వరూ శత్రువులు ఉండరు. ఇంద్రియాదులు నియమించబడి బంధువులుగా మారితే ఆ తరువాత అన్వేషించినా కూడా బాహ్యంలో విరోధి మనకు కనిపించరు. వశపడిన దేహేంద్రియ సమూహం మనిషికి శాంతిని చేకూర్చి సంసార సాగరాన్ని అవలీలగా దాటిస్తుంది. మన దృష్టిని జ్ఞానమయం చేసి సృష్టిని బ్రహ్మమయంగా దర్శింపజేస్తుంది.

6అ, 7శ్లో.

జితాత్మనః ప్రశాంతస్య పరమాత్మా సమాహితః |
శీతోష్ణసుఖదుఃఖేషు తథా మానావమానయోః ||6.7

మనసును జయించి పరమ శాంతితో కూడి ఉన్నవారు శీతోష్ణ సుఖదుఃఖాలందును అట్లే మాన అవమానములందును పరమాత్మ భావాన్ని కలిగి ఉంటారు.

రెండవ పాదంలోని శీతోష్ణ సుఖదుఃఖాలను గురించి రెండు మూడు నాలుగు అధ్యాయాల్లో సమగ్రంగా చూసాం కాబట్టి ఈ శ్లోకంలో మనం పరిశీలించాల్సిన అంశాలు మాన అవమానాలు అనే మాటను చూసి మొదటి పాదాన్ని పరిశీలిద్దాం. మాన అవమానాలు అన్నారు కదా మానః అంటే గౌరవం స్తుతి పూజ పొగడ్తలు ఇలాంటివి ప్రాప్తించినప్పుడు మనిషి సంబరపడిపోతూ ఉంటారు. అవమానాలు అంటే అమర్యాద, నింద, తిరస్కారం లాంటివి ఎదురైనప్పుడు కృంగిపోతూ ఉంటారు అయితే మనం ముందు శ్లోకంలో చెప్పిన మిత్రత్వ బంధుత్వానికి మనలో స్థానం ఇచ్చి శత్రుత్వపు భావాన్ని తొలగించినప్పుడు మనకు ఈ పరిస్థితులు దాదాపుగా దూరమైపోతాయి. ఒకవేళ అలాంటి పరిస్థితులు ఎదురైనా మనం బాధకు లోనుకాకుండా మనలో లోపం ఉంటే ఆత్మ విమర్శ చేసుకొని సరిదిద్దుకోవాలి. మనలో లోపం లేనప్పుడు సాక్షిగా ఉండాల్సిన అవసరం ఉంది. అలా కాక బాధకు లోనైతే మన ఆరోగ్యానికే ఇబ్బంది. అలాగే తాత్కాలిక సన్మానాలకు పొగడ్తలకు కూడా లోను కాకూడదు అది కూడా ఓ విధమైనటువంటి బలహీనత అందుకే జగద్గురువు సమస్థితిలో ఉండాలని చాలా స్పష్టంగా పేర్కొన్నారు. మనకు మన మనుగడకు మూలమైనటువంటి ఆత్మ శక్తిని దర్శించాక ఈ బాహ్యపు వాక్కులతో చేసేటటువంటి పొగడ్తలు, నిందలు మనల్ని ప్రభావితం చేయలేవు కదా, అది ఎలానో చూద్దాం. జీతాత్మనః ప్రశాంతస్య పరమాత్మా సమాహితః, బాహ్య అంతర ఇంద్రియాలను జయించిన సదా ఆత్మ స్థితిలో ఉన్నవారు ఆత్మస్థులు, జీతాత్ములు అంటే తనను తన ఆధీనంలో ఉంచుకున్న వారు అని అర్థం. వీరే ప్రసన్నంగా

ఉండే యోగులు, సన్యాసులు అందుకని వీరికి పరమాత్మ జ్ఞానం అనుభవైకవేద్యం అంటే ఆత్మనే పరమాత్మగా తెలుసుకుంటారు. అందుకని మాన అవమానాలు పొగడ్తలు తెగడ్తలు కూడా వీరికి సమానమే. ఈ స్థితికి సాధకుడు చేరేవరకు కూడా దారి తప్పకూడదు ఇక్కడ ముఖ్యంగా గమనించ వలసినటువంటి అంశం ప్రతి ఒక్కరూ నా దేహం అని భావిస్తారు తాననే అహంభావాన్ని కలిగి ఉంటారు కూడా. మరి మన దేహం అయితే మన మాట వినాలి కదా మనకు వశమై ఉండాలి కదా, మరి మన మాట వినని దేహం మనది ఎలా అవుతుంది? మన మాటను పాటించి మన పట్ల విధేయతతో మెలగాలి కదా ఉదాహరణకు మనం ఆరోగ్యంగా ఆనందంగా ఉండాలి అని అనుకుంటాం ఇది మన ఉద్దేశం అయితే మరి అలా అందరూ ఉండటం లేదు కదా పోనీ ఎవరైనా సరే ఇవి వద్దు అనుకునే వాళ్ళు ఉంటారా ఉండరు మరి అలాంటప్పుడు తమ దేహం తమ మాట వింటే తమ తమ అభీష్టం మేరకే తమ తమ దేహం తమ ఆధీనంలోనే ఉండాలి. కానీ అలా జరగడం లేదు కదా, మరి కారణం ఏంటి? ఇంతకు మన దేహం మనదా కాదా? ఆలోచిద్దాం, మనది అని అనుకుంటున్న ఈ దేహం మన పట్ల విధేయతతో మెలగి మనకు అనుగుణంగా ఉందా, దీన్ని బట్టి మనకు అర్థమయ్యేది ఏంటంటే మనం ఈ దేహం అనే వాహనాన్ని సక్రమంగా నడపడంలో, ఉపయోగించడంలో విఫలమవుతున్నాం. ఒకటి రెండవ అధ్యాయాలలో ఈ అంశాన్ని ఆయా సందర్భాల్లో సవివరంగానే చూసాం. అందుకని ఇక్కడ సంక్షిప్తంగా చూస్తే సరిపోతుంది. మనం ఎంతసేపు బాహ్యంగా కనిపించే భౌతిక రంగో, అందమో అందరికీ ఆకర్షణీయంగా కనిపించాలనో పరిమిత భావంలో సంకుచిత దృష్టితో కుచించుకపోవడం వల్ల దాపురించినటువంటి పరిస్థితి. ఈ బాహ్యపు అంశాలపై పెట్టిన దృష్టిని అదే సమపాళ్లతో ఆంతరంగికత పై కూడా మన దృష్టిని సారించగలిగితే అప్పుడు అది మనకు వశపడి మనమాట విని మనకు అభీష్టంగా ప్రవర్తిల్లి మన ఉద్దేశమైన ఆరోగ్యం ఆనందం సంప్రాప్తింప చేస్తుంది. ప్రస్తుతం ఉండే ప్రపంచంలోని సమస్త సమస్యలకు కారణం ఈ లోకమే, ఈ బలహీనతే, ఈ అసమర్థతే అని మనం గమనించాలి. ఆత్మను జయించిన ఈ పరిస్థితి నుండి ఈ అస్వస్థత మనం స్వస్తితికి చేరుకోవడానికే ఈ భగవద్గీత సాధన. అందుకే ఇదో శాస్త్రీయమైనటువంటి అంశం. మన దేహ నిర్మాణం ఒక సైన్స్, ప్రతి వాహనానికి ఓ శాస్త్రీయ కోణం ఉంటుంది ఆ పద్ధతిలో దానికి అన్నీ సక్రమంగా సమకూర్చితేనే అది పనిచేస్తుంది, అది సక్రమంగా నడుస్తుంది. పెట్రోలుతో నడవాల్సిన వాహనం నీటితో నడవదు కదా అలా శాంతితో ప్రసన్న చిత్తంతో కొనసాగాల్సిన శరీర నిర్మాణం అశాంతి పాలు కావడం వల్ల ఇబ్బంది. అందుకని ఈ దేహపు నిర్మాణపు సమాహారంలో ఉన్నటువంటి ఈ శాస్త్రీయతను అధ్యయనం చేసి ఆ పద్ధతిలోనే మనం మన దేహాన్ని నడపవలసి ఉంటుంది. ఇది ప్రకృతి అయితే మనం అందుకు విరుద్ధంగా వికృతంగా ప్రవర్తిస్తున్నాం. అందుకని అది కూడా మనకు వ్యతిరేకమై మన దేహం మనది కాకుండా పట్టాలు తప్పిన రైలులా గమ్యం తెలియని ప్రయాణం చేస్తుంది. ఈ పరిస్థితి నుండి మనం సరైన దిశగా మన దేహాన్ని నడపాలని నిర్ణయించుకున్న ప్రతి మనిషి గీతా శాస్త్రాన్ని అర్థం చేసుకొని ఈ గీతా ప్రమాణాలతో గీతా సూత్రాలతో తమ దేహాన్ని నడిపించాలి. అలా సద్వినియోగ దృష్టితో దేహాన్ని నడిపించినవారే జితాత్ములు. ఈ జితాత్ములు కావడానికే మనం కూడా గీతాధ్యయనం చేస్తున్నాం. అందులో భాగంగా ఒకటవ అధ్యాయము నుండి ఇప్పటివరకు చెప్పుకున్న ప్రమాణాలను శాస్త్రీయ దృక్కోణాలను ఖచ్చితంగా పాటిస్తూ ముందుకెళ్లాలి. ఈ మార్గంలో మనం ఇప్పుడు ధ్యాన యోగాన్ని అధిరోహించే దశలో ఉన్నాం. ఎందుకంటే మనం ఎక్కడ నుండి మన ప్రయాణాన్ని ప్రారంభించామో మనం ప్రస్తుతం

ఎక్కడ ప్రయాణిస్తున్నామో మన భవిష్య గమ్యమేమిటో మనకు స్పష్టంగా తెలియాలి కదా. అందుకని ఈ సందర్భంగా ఒకసారి మన స్థానాన్ని గుర్తు చేసుకుంటున్నాం. మనం సాధన చేయబోయే ధ్యాన యోగానికి సంసిద్ధతను చేకూర్చే అంశాల్ని తొమ్మిదవ శ్లోకం వరకు చూసి పదవ శ్లోకంతో మనం ధ్యాన యోగాన్ని అధిరోహించి ఆరూఢులు కావడానికి ముందుకు వెళ్తాం. అలా ఆరంభించే ధ్యాన యోగం యొక్క గమ్యం ఏమిటంటే పరమాత్మ సమాహితః ప్రశాంతమైన చిత్తం ప్రసన్నమైనటువంటి అంతఃకరణం. ప్రాపంచిక విషయాల సంగంతో అనిత్య విషయాలతో పెనవేసుకుపోయే మనసు ఎల్లప్పుడూ ఆ శాంతితో అలమటిస్తూ మనల్ని అస్వస్థతకు గురిచేస్తుంది అయితే రాగద్వేషాల నుండి విడిపడి మన స్వాధీనంలో ఉన్న దేహం సంపూర్ణ ఆరోగ్యంతో ప్రశాంతమైన మనసుతో ఉండి మనల్ని జీతాత్మలుగా తయారు చేస్తుంది. మనకు జగద్గురువు పేర్కొన్న యోగరూఢ స్థితిని కలిగించి మనల్ని సదా శాంతి స్వరూపులుగా పరిణమింప చేస్తుంది. తద్వారా ఆత్మే పరమాత్మ స్వరూపంగా భాసిస్తుంది. చిత్త విక్షేపం లేని బుద్ధికి బ్రాహ్మమే విదితమవుతూ ఉంటుంది. దేహ స్థాయిలో తెలిసే శీతోష్ణాలను మనో స్థాయిలో చలింప చేసే సుఖదుఃఖాలను, బుద్ధిస్థాయిలో తాండవించే మానవమానాలను, అదిగమిస్తూ ఈశ్వర భావ యుక్తమైన కర్మయోగత్వం నుంచి ధ్యాన యోగత్వాన్ని అధిరోహించి ఆత్మభావంలో పరమాత్మ స్వరూపంగా విరాజిల్లాలి. ఇది ఈ శ్లోకం యొక్క ఆంతర్యం.

6అ, 8 శ్లో.

జ్ఞానవిజ్ఞాన తృప్తాత్మా కూటస్థో విజితేంద్రియః |
యుక్త ఇత్యుచ్యతే యోగీ సమలోష్టాశ్మకాంచనః || 6.8

యోగానిష్టులు ఆత్మ గానే ఉంటూ జ్ఞానంతో విజ్ఞానంతో సంతృప్తితో ఉంటారు. వీరు విజితాత్ములు, యోగ యుక్తులు కాబట్టి రాతిని బంగారాన్ని ఒకే విధంగా చూస్తారు. వీరే యోగారూఢులు, జ్ఞాన విజ్ఞాన తృప్తాత్ములు.

ఇందులో నాలుగు పదాలు ఉన్నాయి జ్ఞానం, విజ్ఞానం, తృప్తి, ఆత్మ. ఈ నాలుగు యోగారూఢుల్లో స్పష్టంగా కనిపిస్తాయి. జ్ఞానం అంటే శాస్త్ర ప్రతిపాదిత విషయాన్ని గ్రహించడం అని అర్థం, శాస్త్రం నుండి గ్రహించిన జ్ఞానాన్ని అనుభవంలోకి తెచ్చుకోవడం విజ్ఞానం. ఈ జ్ఞాన, విజ్ఞానాల వల్ల సంతృప్తి పడి ఇక ఏమీ అక్కరలేదు అనే అంతఃకరణం కలుగుతుందో అలాంటివారు జ్ఞాన విజ్ఞాన తృప్తాత్ములు. వీరికి ఆత్మే బ్రహ్మ అనేటటువంటి విశేషమైనటువంటి జ్ఞానం అనుభవైకవేద్యం అవుతుంది. ఉదాహరణకు ధ్యానం చేస్తే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చు అని సమాచారం తెలుసుకోవడం జ్ఞానం, అయితే ధ్యానం చేసి సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందితే ఆ అంశం అనుభవైకవేద్యం అయితే అది విజ్ఞానం. ఏడవ అధ్యాయం జ్ఞాన విజ్ఞాన యోగం కాబట్టి ఈ అంశాన్ని మరింత విశేషంగా అక్కడ తెలుసుకుందాం. కూటస్థుడు అంటే చలనం లేనివారు, నిశ్చలమైన వారు, నిర్వికారులు ఎట్టి పరిస్థితిలోనూ చలింప జేయడానికి సాధ్యం కాని వారు. పరమాత్మ సమాహితులైన యోగారూఢులు తానే ఆత్మ అనే జ్ఞానం కలిగి ఉంటారు కనుక వారు

కూటస్థులు, ఆత్మతో ఏకమైన వారు అని అర్థం. ఆత్మను ఆధారంగా చేసుకొని ఉన్నప్పుడు దేహంలో ఎన్ని ఇబ్బందులు అలజడులు జరిగిపోతున్నా కూడా వీరిలో ఆత్మ సదా నిశ్చలంగానూ నిర్వికారంగానూ ఉంటుంది. అందుకని వీరు కూటస్థులు, ఇక 'సమలోష్టాశ్మకాంచనులు', మట్టిని రాయిని బంగారాన్ని కూడా ఒకే విధంగా సమస్థితిలో చూసేవారు. ఎందుకంటే బాహ్య ప్రపంచపు వస్తు విషయాలను వీరు త్యజించడం వల్ల వీరికి వాటిపై మమకారం గాని భేద అభిప్రాయాలు గాని లేనందున వీరు సమలోష్టాశ్మకాంచనులు. మట్టి పాత్రలన్నింటిలోనూ మట్టే ఉన్నట్లు సృష్టిలోని ప్రతి వస్తువులోనూ పరమేశ్వరుడే ఉన్నాడని వీరు భావిస్తారు. అన్నీ పంచభూతాత్మకాలే కదా అలాగే వ్యక్తుల పట్ల కూడా సమ భావాన్ని కలిగి ఉంటారు, ఇది 'సమలోష్టాశ్మకాంచనః'. ఇలా శాస్త్ర విషయ పరిజ్ఞానం జ్ఞానం, శాస్త్రం ద్వారా తెలుసుకున్న విషయాన్ని స్వానుభవం చేసుకోవడం విజ్ఞానం. ఈ జ్ఞాన విజ్ఞానాలతో తృప్తి చెందినవారు కూటస్థులు, ఈ పదానికి అర్థం చలించని వారు. ఇక విజితేంద్రియులు అనే మాటను 5-7 లో సమగ్రంగా చూసాం. అలాంటి కూటస్థులైన యోగులు మట్టిని రాతిని బంగారాన్ని సమానంగా చూస్తారు.

6అ, 9 శ్లో.

సుహృన్మిత్రార్యుదాసీనమధ్యస్థద్వేష్యబంధుషు |
సాధుష్వపి చ పాపేషు సమబుద్ధిర్విశిష్యతే ||

సుహృదులయందును, మిత్రులయందును, శత్రువులయందును, ఉదాసీనులయందును, మధ్యస్థులయందును, ద్వేషింపదగినవారియందును, బంధువులయందును, ధర్మాత్ములయందును, పాపులయందును సమబుద్ధి కలిగియుండువాడు మిక్కిలి శ్రేష్ఠుడు.

ఈ శ్లోకంలో తొమ్మిది రకాల మనుషులు కనిపిస్తారు. ఈ తొమ్మిది రకాల మనుషులు మనలోనే ఉంటారు మన ఎదుటా ఉంటారు వీరందరూ కూడా మనకు తెలిసిన వాళ్ళు మన అనుభవంలో ఉన్న వాళ్లు. ఒకసారి మనకు తెలిసిన తొమ్మిది రకాల మనుషుల్ని గురించి సంక్షిప్తంగా చూసి శ్లోకాన్ని సమన్వయం చేసుకుందాం. ఒకటి సుహృత్ భావం, ప్రత్యుపకారం ఆశించకుండా ఉపకారం చేసేవారు వీరు ఉదార స్వభావులు ఇది దైవ లక్షణం తెలిసినవారికి మాత్రమే లేదా ప్రత్యుపకారాన్ని ఆశించి మాత్రమే ఉపకారం చేస్తే అది సుహృత్భావం కిందకు రాదు. మనకు పూర్వం ఎలాంటి పరిచయము స్నేహబంధమూ లేనటువంటి అపరిచితులకు కూడా ప్రత్యుపకారం ఆశించకుండా ఉపకారం చేయడం సుహృత్భావం అవుతుంది.

రెండు మిత్ర భావం, స్నేహభావం స్నేహమనేది ఓ ఔన్నత్యం అయినటువంటి భావజాలం కలిగినటువంటిది భౌతిక వస్తువు విషయాదులతో లేదా ఎటువంటి అవసరాలతో సంబంధం లేకుండా స్వచ్ఛమైనటువంటి స్నేహభావాన్ని కలిగి ఉంటే అది స్నేహ తత్వం అవుతుంది. వారే స్నేహాన్ని స్వభావంగా కలిగిన వారు అవుతారు.

మూడు అరి అంటే శత్రువు వీరు పరోక్షంగా గాని ప్రత్యక్షంగా గాని కీడును హానిని తలపెట్టాలనే భావన ఉన్నవారు ఎదుటి వ్యక్తికి హాని చేయడమే వీరి స్వభావం అంటే మేలు చేయడం తెలియదు వీరికి. ఇందుకు కారణాలు పెద్దగా ఉండాల్సిన అవసరం లేదు కానీ వారి స్వభావమే అలా అయి ఉండడం వల్ల వీరు ఎదుటివారికి కీడు తలపెడుతూ ఉన్నామని భావిస్తూ తమకు తామే కీడును తలపెట్టుకునేవారు. ఎందుకంటే తమలో ఎలాంటి భావన ఉంటే ఆ భావం వారికే వర్తిస్తుంది కానీ ఎదుటివారిని ప్రభావితం చేయలేదు. ఒకవేళ ఆ శత్రుత్వం వల్ల ఎదుటి వ్యక్తులు తాత్కాలికంగా ఇబ్బంది పడినా ఆ భావం ఉన్న వారికే ఎక్కువ ఇబ్బంది, ఈ విషయం ప్రతి మనిషికీ తెలియాలి. మనం ముందు శ్లోకాల్లో చాలా సందర్భాల్లో చూసాం ఎవరిలో శత్రుత్వపు భావన ఉంటే అది తమ పతనానికి కారణం అవుతుంది కానీ మరొకటి కాదు.

నాలుగు తటస్థ భావం, వీరు ఉదాసీన స్వభావంతో ఉండి తటస్థంగా ఉంటారు, సాక్షి మాత్రంగా ఉంటారు, కేవలం ప్రేక్షక పాత్ర వహిస్తారు. ఐదు మధ్యస్థం, వీరు మధ్యమ మనస్తత్వ స్వభావం కలవారు. ఎవరికైనా ఇద్దరి మధ్య వివాదం వస్తే ఆ ఇద్దరి గురించి ఆలోచించి ఇద్దరి క్షేమం కోరేవారు ఉభయులకు ఉపకారం చేస్తారు. వీరినే మధ్యస్తులు అంటారు, అంటే మద్యస్థ మైనటువంటి స్వభావం కలిగిన వాళ్ళు అందరూ కూడా సహజంగా మంచిగా కలిసిమెలిసి ఉండాలి అనేటటువంటి భావాన్ని కలిగి ఉంటారు.

ఆరు ద్వేష్యా, ద్వేష స్వభావం కలిగిన వారు వీరు ప్రియత్వం, ప్రేమ తత్వం, మధ్యస్థతత్వం అన్నింటిని కూడా కోల్పోయిన వారు ఇవన్నీ లోపించినటువంటి వారు. సర్వులపై ద్వేషంతో ప్రవర్తిస్తూ ఉంటారు, ఆ ద్వేషం వారిలోనే ఉందని అది తొలగించుకోకపోతే వారికే ఇబ్బంది అని గుర్తించని వారు. వారిలో ద్వేషానికే గాని మంచికి మమతకు తావు ఉండదు. ఏడు బంధుప్రీతి, చుట్టరికం ద్వారా ఉపకారం చేసేవారు, బంధుప్రీతి అనే ఆసక్తిని పుట్టించి బంధువు అనే చక్రంలో బంధించేవారు బంధువులు. బంధువు సంబంధాన్ని గుర్తించి ఆ ఆసక్తితో ప్రియమొనరించేవారు, ఉపకారం చేసేవారు, బంధు ప్రీతిని ఆశ్రయించి వ్యవహరించేవారు.

ఎనిమిది సాధుభావం, శాస్త్ర విషయాల్ని వివేచించి సన్మార్గంలో ప్రవర్తించేవారు, సాధువులు ధర్మయుతంగా ధర్మబద్ధంగా జీవించేవారు. ప్రాణాపాయ స్థితిలో కూడా ధర్మాచరణను వీడని వారు. సదాచార జీవనంతో కూడుకున్న వారు. వీరి జీవనం ఆదర్శనీయంగా ఉంటుంది.

తొమ్మిది పాప బుద్ధి, ప్రకృతి విరుద్ధంగా సహజ స్వభావానికి వికృతంగా సన్మార్గానికి వ్యతిరేకంగా ప్రవర్తించేవారు దైవదృష్టి లేనివారు. ఈ తొమ్మిది రకాల మనుషులను గమనించి మనం సుహృద్భావంతో మెలగాలి. ఈ తొమ్మిది రకాల మానవుల యందు కూడా సమ బుద్ధి కలవారే శ్రేష్టులు. సర్వదా సదా సమరూపులైన బ్రహ్మాన్ని మాత్రమే గ్రహించునట్టి బుద్ధిని కలిగి ఉన్నవారు. సమాజంతో మనిషికి మనిషితో సమాజానికి ఓ అవిభాజ్యమైనటువంటి విడదీయరానుటువంటి అనుబంధం ఉంటుంది. మనిషి మనిషికి గుణ దోషాలు పరస్పరం భిన్నంగా ఉంటాయి. విభిన్న ప్రవృత్తులతో విరుద్ధ స్వభావాలతో వ్యక్తులు జీవిస్తూ ఉంటారు. కొందరు సత్వగుణం ప్రధానంగా ఉంటారు, వీరు సాత్వికులు. రజోగుణం ప్రధానంగా ఉండేవారు రాజసులు. తమోగుణం ప్రధానంగా ఉండేవారు

తామసులు. ఈ గుణ భేదం స్వభావాన్ని నిర్ణయిస్తుంది. గుణాలు మారేకొద్దీ స్వభావాలు కూడా మారిపోతూ ఉంటాయి. అందుకే ఒకే వ్యక్తి ఒకప్పుడు ప్రవర్తించినట్లు మరొకప్పుడు ప్రవర్తించరు. ఈవిధమైన భిన్న ప్రవర్తనలన్నీ కూడా గుణదోషాలకు సంబంధించినవి. ఇవన్నీ కూడా తాత్కాలికమైనవి, రాకపోకలు కలిగినవి. అందుకని ఈ భేదాలన్నీ ఈ ఉపాధి స్థాయికి అంటే దేహ స్థాయికి సంబంధించినవే గాని చైతన్య స్థాయికి సంబంధం లేనివి. అఖండంగా భాసిస్తున్న ఆత్మలో ఈ భేదాలేవీ ఉండవు అలాంటి ఆత్మే తానని గ్రహించిన జ్ఞాన విజ్ఞాన దృక్తాత్ములైన యోగారూఢులు తనను చైతన్య స్వరూపంగా దర్శించినట్లే అందరినీ ఆత్మ స్వరూపులుగా చైతన్య స్వరూపులుగా భావించి అందరిలోనూ ఆ పరమాత్మ స్వరూపాన్నే దర్శిస్తూ ఉంటారు. గుణ దోష భేదాల్ని విస్మరించి ఆత్మ సంబంధాన్ని కొనసాగిస్తారు. భిన్న ప్రవృత్తులు గల వ్యక్తుల మధ్య జీవిస్తున్నా అభేద భావ దర్శనంతో ఉంటారు. అందుకే సమబుద్ధి గల యోగారూఢులు సర్వులలో శ్రేష్ఠులు, విశిష్టమైన వారు. యోగారూఢుని దివ్య దృష్టిలో అందరూ ఆత్మ స్వరూపులే అంటే భిన్న ప్రవృత్తులు కనిపిస్తున్నా కూడా వాటిని దాటి ఆత్మ దర్శనం చేసే మహాత్ములే యోగారూఢులు. సర్వజీవుల పట్ల అలాగే అన్ని రకాల మనుషుల పట్ల సమబుద్ధి కలిగి ఉండేవారే శ్రేష్ఠులు. వీరికి వ్యక్తుల దేహంపై గాని మనసుపై గాని దృష్టి ఉండదు, ఆత్మ దృష్టితో ఉంటారు. ఈ విభక్త ప్రపంచంలో అవిభక్త తత్వాన్ని దర్శించే వారు సర్వ శ్రేష్ఠులు.

6అ, 10శ్లో.

యోగీ యుంజీత సతతమాత్మానం రహసి స్థితః ।
ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీరపరిగ్రహః ।। 6.10

శరీరేంద్రియమనస్సులను స్వాధీనపఱచుకొనినవాడు, ఆశారహితుడు, భోగసామగ్రిని ప్రోగుచేయనివాడు అయిన యోగి ఒంటరిగా నిర్జన (ఏకాంత) ప్రదేశమున కూర్చొని, ఆత్మను నిరంతరము పరమాత్మయందు లగ్నము చేయవలెను.

మనం ధ్యాన యోగానికి సంసిద్ధమై ప్రయత్నించే ఆరురుక్షువును గురించి యోగంలో స్థిరపడిన యోగారూఢుని గురించి తెలుసుకున్నాం. ఇప్పుడు ఈ శ్లోకం నుంచి ఆ తెలుసుకున్న దాన్ని అనుభవైకవేద్యం చేసుకుంటూ మనం ఆచరించాల్సినటువంటి అంతరంగ సాధనను గమనించాలి. ధ్యానం అంటే సాధకునికి భగవంతునికి మధ్యగల సంబంధం లేదా భక్తునికి భగవంతునికి మధ్య ఉన్న సంబంధం ఈ ధ్యాన యోగాన్ని అభ్యసించాల్సిన పద్ధతి ఈ శ్లోకం నుంచి చాలా స్పష్టంగా మనకు తెలియ వస్తుంది. ఆరురుక్షువు యోగారూఢులు కావాలంటే ఇందులో ఐదు నియమాలు లేదా విధానాలు పేర్కొన్నారు. ఒకటి 'రహసి' ఏకాంత స్థలం ఎన్నుకోవడం రెండు ఒంటరిగా ధ్యానించడం మూడు 'యతచిత్తాత్ములు' ఇంద్రియాలను, మనసును, దేహాన్ని నిగ్రహించడం. నాలుగు ఆశ లేకుండటం, ఐదు అపరిగ్రహ భావన కలిగి ఉండటం. ఈ నియమాన్ని పాటిస్తూ ఏకాంతస్థలంలో ఉంటూ ఏకాకి మనసును దేహాన్ని వశం చేసుకొని ఆశను వీడి దేనినీ పరిగ్రహించక మనసును ఏకాగ్రం చేసుకొని సర్వదా ధ్యానయోగంలో స్థిరమై ఉండాలి. ఇక్కడ ఏకాంత స్థలంలో ఏకాకి అనే మాటకు మనసును ఇతర బాహ్యపు ఆలోచనల

వైపు వెళ్ళనివ్వకుండా ఉండాలని దీని అర్థం. నేను ఏకాకిని అనే భావనను పెంపొందించుకుంటే అప్పుడు మనసు త్వరగా ధ్యాన యోగంలో కుదుట పడుతుందని ఈ పదం వాడటంలోని ఆంతర్యం. ఇంతకు ధ్యానయోగం ఆవశ్యకత ఏంటి మనకు దేవుడికి మధ్య ఈ ధ్యానయోగం యొక్క పని ఏంటి అనే ప్రశ్న వేసుకుంటే మన గురించి మనకు తెలియడం లేదు, మనమేమిటో మనకు అర్థం కావడం లేదు, మన చిరునామాను కూడా మనం మరచిపోయి విచ్చలవిడిగా వికృతంగా బాహ్య ప్రపంచపు ముసుగులో కూరుకుపోయి ఉన్నాం. తిరిగి రాలేని పరిస్థితి, మన స్వస్థిని కోల్పోయిన దుస్థితి, దిక్కుతోచని దారి తెలియని పరిస్థితి, అంతా గందరగోళం కోరికలమయం వీటిలో తిరిగి తిరిగి అలసిపోయి ఉన్నాం, అశాంతికి అమ్ముడుపోయాం. అందుకని మనల్ని మనం గుర్తెరిగి మనమేంటో తెలుసుకొని మనం ఎందుకు పుట్టామో అర్థం చేసుకొని అప్పుడు ఎక్కడికి వెళ్లాలో అనే గమ్యం కూడా మనకు తెలియ వస్తుంది. మనల్ని మనం చదువుకోవడమే ధ్యానయోగం, మనలోకి మనం ప్రవేశించడమే ధ్యానయోగం. మనం మనకు మన మూలాలు మనకు తెలిసిన క్షణం ఖచ్చితంగా మనకు దైవం ఏంటో దేవుడు ఎవరో అవగాహన అవుతుంది. ఈ శ్లోకం నెమ్మదిగా ప్రశాంత చిత్తంతో మనం గమనిస్తే మనల్ని జగద్గురువు యోగి అని సంబోధిస్తూ శ్లోకాన్ని ప్రారంభించాడు. నీవు యోగివిగా ధ్యాన యోగివిగా ఉండి అంతఃకరణాన్ని ఏకాగ్రంగా ఉంచుకో అని మనకు మార్గ నిర్దేశం చేస్తున్నారు. ధ్యాన యోగానికి సిద్ధంగా ఉన్న మనకు ఈ పదంతో సంబోధించి యోగానికి ఉపక్రమించమని పిలుపునిస్తున్నారు. ఈ అంశం మనకు అనుభవేద్యం కావాలంటే సతతం అని చెప్పడం వల్ల మనసును నిత్యం ఏకాగ్రంగా ఉండేటట్లు ధ్యానయోగి జాగురూకుడై ఉండాలి, ధ్యాన యోగానికి శ్రీకారం చుట్టాలి. ఎలా అంటే ఒకటి 'రహసి' ఏకాంత స్థలాన్ని అంటే ఇంట్లో కావచ్చు, ఆశ్రమంలో కావచ్చు, కొండ గుహల్లో కావచ్చు, పర్వత శిఖరాల్లో కావచ్చు ఎక్కడైనా సరే కొంత మరుగుగా ఉండే స్థలాన్ని ఎన్నుకోవాలి. కారణం అందరూ నడయాడుతూ తమ తమ పనుల్లో ఉంటే మనం ధ్యానం చేసుకునే సందర్భంలో ప్రతిబంధకం కలుగుతుందని రహసి అంటున్నారు. పదే పదే తిరుగుతూ ఉండే ప్రదేశంలో కాక పూజ గది లాంటి స్థలాల్లో కూర్చుంటే మనకు మన తోటి వారికి కూడా ఇబ్బంది లేకుండా ఉంటుంది. మనం కూడా ధ్యాన సమయంలో అంతరాయం కలగకుండా తాత్కాలికంగా చేయాల్సిన పనులను చక్కబెట్టుకొని ప్రశాంతంగా కాసేపు ధ్యానంలో గడిపేటట్లు భగవంతునిలో మమేకమయ్యే విధంగా చూసుకొని ధ్యాన యోగంలో కూర్చోవాలి. ఇవన్నీ కూడా ధ్యానయోగం ప్రారంభంలోని మెలకువలు. అలాగే ధ్యానయోగంలో పొందిన సుస్థిరమైనటువంటి మనసును నిరంతరం కూడా అలాగే ఉంచుకోవడానికి ప్రయత్నించాలి. మనసును కలతకు గురి కానీయకుండా ఉంచడానికి యత్నిస్తూ నిరంతర అభ్యాసాన్ని కొనసాగించాలి.

రెండు 'ఏకాకి' అంటే ఒంటరి వారు అని అర్థం. ధ్యానం అనేది వ్యక్తిగతమైన అంశం మన మానసిక ప్రక్రియ మనకు దేవుడికి మధ్య జరిగే ప్రక్రియ అందుకని ఏకాకి అనే పదాన్ని ప్రయోగించారు. మూడు 'యతచిత్తాత్ముఁలు' ఆత్మను ఆధారంగా చేసుకుని అంతఃకరణాన్ని నియమించేవారు 'యతచిత్తాత్ముఁలు'. యతములు అంటే నిగ్రహించినవి, దేహ మనసులు సంయమిస్తేనే ధ్యానం ఆటంకం లేకుండా కొనసాగుతుంది. అయస్కాంతం ఇనుప ముక్కను ఆకర్షించినట్లు విషయాలు ఇంద్రియాల ద్వారా మనసును

ఆకర్షిస్తాయి. అయస్కాంతం శక్తివంతమైంది కాబట్టి మనసు ఇనుముగా మారి అయస్కాంతపు ఆకర్షణకు లోనవుతుంది, అందుకని యతచిత్తాత్ములై ఉండాలి. ఇక్కడ మనకు ఓవైపు ధ్యానం చేయాలని మరోవైపు చిత్త వాసనలు విషయ సుఖ అనుభవానికి ప్రేరేపిస్తూ ఉంటాయి. ఈ సంఘర్షణ ద్వారా మనసు మళ్ళీ మళ్ళీ బహిర్ముఖమవుతూ ఉంటుంది. ఈ అంశాన్ని మనం గమనించి అవగాహనతో దారి మరల్చి పదేపదే అంతర్ముఖం చేస్తూ ఉండాలి. ధ్యానంలో ఇలా మన లోలోపల కొనసాగుతూ ఉంటుంది. యతచిత్తాత్ములు లోలోన ఈ ప్రక్రియలో నిమగ్నమై ఉంటారు. నాలుగు 'నిరాశి' ఆశ లేకుండా కోరికల వలలో చిక్కుకొని బిక్కరించే పరిస్థితిని తెచ్చుకోకుండా ఉండేవారు, పరమానంద పరమాత్మను పొందే మార్గాన్ని ఆశ్రయించిన వారు. ఈ అంశాన్ని 4-21 లో సమగ్రంగా స్పష్టంగా చర్చించాం ఒకసారి పునఃశ్చరణ గావించుకొని సమన్వయం చేసుకుంటే సరిపోతుంది. అయిదు 'అపరి గ్రహః' భౌతిక వస్తువులను సమపార్జించుకోవడంపై ప్రీతి ఉంటే పరిగ్రహం అవుతుంది. చాలామంది వస్తువులను కావచ్చు, డబ్బు కావచ్చు ఏదైనా కూడా అవసరానికి మించి కూడబెట్టుకోవాలి అనుకోవడం మనకు తెలియనిది కాదు ఈ పరిగ్రహగుణం లేకుండా ఉండటం 'అపరిగ్రహం'. ఎందుకంటే వీరు అదేపనిగా వాటి సేకరణలోనే నిమగ్నమై దైవదృష్టిని సైతం విస్మరించి ఉంటారు. వాటినే ప్రియమైనవిగా భావిస్తూ వాటిని పోగు చేసుకుంటూ వాటిని కాపాడుకుంటూ ఉంటారు. అలా సంగ్రహణ, సంరక్షణ తద్వారా సంతాపం ఇది పరిస్థితి. ఇదే అంశాన్ని మరో అడుగు ముందుకేసి ధ్యాన యోగ దృష్ట్యా ఆలోచిస్తే అపరిగ్రహం అనేది కేవలం వస్తు విషయాది వాటిలోనే కాక శరీరపు భావాన్ని కూడా వీడిన వారు అపరిగ్రహులు. అప్పుడే తాను కనిపిస్తున్నటువంటి ఈ శరీరం మాత్రమే కాదనే నిర్ధారణకు వచ్చి ఆత్మ దర్శనం ఆరంభమవుతుంది. తద్వారా తన జన్మ మూలాలు కూడా అవగాహన అవుతుంది. ఆత్మజ్ఞానానికి హేతువైనటువంటి జన్మాంతర జ్ఞానం కూడా కలగడానికి ఈ అపరిగ్రహం అనేది ప్రధాన పాత్ర వహిస్తుంది. ఈ అపరిగ్రహం అనేటటువంటి అంశాన్ని కూడా మనం 4-21 లో సవివరంగా చూసాం. ఒకసారి గుర్తు తెచ్చుకొని సమన్వయం చేసుకుంటే సరిపోతుంది. ఈ ఐదు అంశాల్ని అవగాహన చేసుకుని ధ్యాన యోగాన్ని ప్రారంభిద్దాం.

6అ, 11&12 శ్లో.

శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసనమాత్మనః |
నాత్యుచ్ఛ్రితం నాతినీచం చైలాజినకుశోత్తరమ్ ||6.11

పరిశుభ్రమైన ప్రదేశమున క్రమముగా దర్భాసనమును, జింక చర్మమును, వస్త్రమును ఒకదానిపై ఒకటి పఱచి, అంత ఎక్కువగాకాని, తక్కువగాకాని కాకుండ సమానమైన ఎత్తులో స్థిరమైన స్థానమును ఏర్పఱచుకొనవలెను.

తత్రైకాగ్రం మనః కృత్వా యతచిత్తేంద్రియక్రియః |
ఉపవిశ్యాసనే యుంజ్యాత్ యోగమాత్మవిశుద్ధయే || 6.12

ఆ ఆసనముపై కూర్చొని, చిత్తేంద్రియ వ్యాపారములను వశమునందుంచుకొని, ఏకాగ్రత గల మనస్సుతో అంతఃకరణ శుద్ధికై ధ్యాన యోగమును సాధన చేయవలెను.

ముందు శ్లోకంలో ధ్యానయోగభ్యాసాన్ని బోధించడం ఆరంభించిన జగద్గురువు ఈ శ్లోకంలో ధ్యాన యోగ సాధనకు కావాల్సిన బాహ్యమైన ఆసనా విధానాన్ని గూర్చి వివరిస్తూ విశేషమైనటువంటి ధ్యాన యోగ అభ్యాసాన్ని ఉపదేశిస్తున్నారు. 'శుచౌ దేశే' అనే పదంలోని ఆంతర్యం ధ్యాననిష్టకై ఏ దేశానికి వెళ్లాల్సిన అవసరం లేదని శుభ్రమైన ఏకాంతమైన అనువైన పవిత్రమైనటువంటి ప్రదేశం ఉంటే సరిపోతుంది అని గమనించాలి. స్థిర సుఖ ఆసనం అంటే పద్మాసనంగాని సిద్ధాసనంగాని ఏదైతే తాము స్థిరంగా చాలాసేపు కూర్చోవడానికి వీలుగా ఉంటుందో ఆ ఆసనంలో కూర్చొని ధ్యాన యోగంలో నిమగ్నం కావచ్చని చాలా స్పష్టంగా తెలియజేస్తున్నారు. ఎత్తు పల్లాల గురించి చెప్పడంలోని ఆంతర్యం మనం కాస్త ఎత్తుగానో పల్లంగానో ఉండే ప్రదేశంలో కూర్చుంటే, స్థిరంగా ఒకచోట కదల కుండా కూర్చోవడం వీలుకాదు కదా అందుకని చదరంగా సమంగా ఉన్న చోట అయితే కాసేపు స్థిర సుఖ ఆసనంలో హాయిగా కూర్చొని ఆత్మతో యోగం చెందవచ్చు అని అర్థం. ఇక 'చైలాజినకుశోత్తరమ్' చైలము అంటే మెత్తని వస్త్రం, ఆజినం అంటే చర్మం, కుశలు అంటే దర్భలు, దర్భతో చేసిన చాపలు ఈ దర్భ చాపపై చర్మం ఆపైన మెత్తటి వస్త్రం ఇది 'చైలాజినకుశోత్తరమ్'. పూర్వం ఇప్పటి లాంటి భవనాలు అందరికీ అందుబాటులో ఉండేది కాదు, సాధారణంగా మట్టితో కూడుకున్నటువంటి గృహాలు మాత్రమే ఉండేవి. ఒకవేళ భూమిలోని తేమ ఏదైనా ఉంటే ఎక్కువసేపు మనం ధ్యానంలో కూర్చొని ఉండిపోతే ఆ తేమను శరీరం పీల్చుకుంటే మంచిది కాదని పైగా ధ్యానంలో కూర్చున్నంతసేపు ఎలాంటి అవరోధం కూడా కలగకుండా ఉండాలని ఈ పద్ధతిని బోధించారు. అంతేకాక మనసుకు మనం ధ్యానంలో ఉన్నాం ఎలాంటి ఆలోచనలు మనకు రాకూడదు అనే ఒక విధమైనటువంటి ఎరుకను ధ్యానయోగంపై ఓ విధమైనటువంటి శ్రద్ధా భక్తులు కలగడానికి ఈ పద్ధతిని ప్రబోధిస్తున్నారు. సాధారణ స్థాయి మనుషులకు ధ్యానంలో తమ శరీరాన్ని చలనం లేకుండా నిలకడగా కూర్చోబెట్టడం అంత సులభమైన పని కాదు. అందుకని ధ్యాన యోగానికి మన శరీరాన్ని సంసిద్ధం చేసే విధానంగా ఈ అంశాన్ని భావించాలి. అంతేగాని దర్భ చర్మం వస్త్రం ఉండాలనే నియమం ఏమీ ఉండదు. అయితే శరీరానికి ఇబ్బంది కలగకుండా ఆరోగ్యకరంగాను సుఖంగాను ఉండేటట్లు స్థిర సుఖ ఆసనాన్ని ఏర్పాటు చేసుకుంటే సరిపోతుంది. ధ్యానయోగంలో స్థిరత్వం పొందడానికి ప్రధానమైనది ఆసనం, స్థిర సుఖ ఆసనం ఎందుకు స్థిర సుఖ ఆసనం అంటే ఆసనం కుదరకపోతే మనసు అంగీకరించదు, అలసట ఆయాసం లాంటి అవరోధాలతో ధ్యానంలో కొనసాగడం వీలుకాదు కాబట్టి ఇక్కడ స్థిర సుఖ ఆసనం అనే అంశాన్ని ప్రత్యేకించి ప్రధానంగా ప్రబోధిస్తున్నారు. ఈ ధ్యానయోగం అభ్యసించని మనిషి పరిమళం లేని పువ్వుతో సమానం. ప్రతి మనిషి

సంకుచిత ధోరణి వీడి విస్తృత దృష్టి అలవర్చుకోవాలని తన మీద తాను పట్టు సాధించాలని ఈ ధ్యాన యోగ అభ్యాసాన్ని మన ముందు ఉంచారు. మనలోని శక్తి జ్ఞానం చైతన్యం ఉద్దీపనం కావడానికి ధ్యానయోగం తప్పనిసరి. మనలో శక్తి అనేది ధ్యానం ద్వారానే పుంకుంటుంది. ప్రతి మనిషి విధిగా దైనందిన కార్యక్రమాలతో పాటు ధ్యాన యోగ అభ్యాసం ఖచ్చితంగా చేయాలి. మనిషి అల్పజ్ఞత నుంచి మహావిజ్ఞతకు చేరుకోవాలంటే మనకున్న రాజమార్గం ధ్యాన యోగ అభ్యాసం. మనం స్థూలంగా చూడాలంటే ప్రపంచంలో మూడు రకాల మనుషులు కనిపిస్తారు. ఒకటి ధ్యాన యోగ అభ్యాసం చేయనివారు, రెండు ధ్యాన యోగాభ్యాసంలో ఉన్నవారు, మూడు ధ్యాన సిద్ధిని పొందిన వారు. ఒకటవ రకం వారు ధ్యాన యోగాభ్యాసం చేయనివారు తక్షణమే ధ్యాన యోగాభ్యాసకులుగా మారాలి. ధ్యానయోగంలో ఉన్నవారు వారి వారి సాధన స్థాయిని బట్టి కొంతకాలానికి సిద్ధులవుతారు. సిద్ధిని పొందినవారు అందరినీ ధ్యానయోగ అభ్యాసం చేసే విధంగా వారికి తగిన శిక్షణ ఇవ్వాలి. ప్రతి మనిషి మనీషిగా సిద్ధత్వాన్ని పొందిన వారుగా ఎదగాలి. ఇది జగద్గురువు ఈ శ్లోకంలో మనకు ఉద్బోధిస్తున్న అంశం. ధ్యాన యోగం అనేది వ్యక్తిగతం, ఆత్మగతం ఇందులో ఇతరుల ప్రమేయం ఉండదు, మనల్ని మనం తెలుసుకోవడం ధ్యానయోగ లక్ష్యం. మనలోని శక్తుల్ని మనం ఉపయోగించుకోగలడమే ధ్యానయోగ పరమార్థం. అందుకు మనం మనలోకి అంతర్ముఖంగా చొచ్చుకుపోవడం ఒక్కటే ఉపాయం. ప్రతి మనిషిలోను ఒక శక్తి కేంద్రం ఉంటుంది, ఆ శక్తి నిద్రిస్తూ అజ్ఞాతంగా ఉంటుంది. మనం మన తోటి వారితో గాని మన ఇంట్లో వారితో గాని వ్యంగ్యంగా గాని సరదాకు గాని అనేక సందర్భాలను పురస్కరించుకొని నువ్వేమైనా నిద్రపోతున్నావా అని అంటూనే ఉంటాం. ఆ నిద్రలో ఉన్న అజ్ఞాత శక్తిని తట్టి లేపే వరకు దాని యొక్క ఉనికి మనకు తెలియదు. పూర్వజన్మల సాధన సంస్కారాలను బట్టి ఆ శక్తి బయటపడుతూ ఉంటుంది. అదే దైవ శక్తి ఆ శక్తి పరమాత్మ దినంలో ఉంటుంది, పరబ్రహ్మ అనుగ్రహంతో అది చైతన్యవంతం అవుతుంది, అందుకు మార్గమే ఈ ధ్యానయోగ అభ్యాసం.

6అ, 13&14 శ్లో.

సమం కాయశిరోగ్రీవం ధారయన్నచలం స్థిరః|
సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్ ||6-13

శరీరమును, మెడను, శిరస్సును, నిటారుగ నిశ్చలముగా స్థిరముగానుంచి చూపులను ఏ దిక్కునకును పోనీయక తన నాసికాగ్రభాగమునందే దృష్టిని నిలుపవలెను.

ప్రశాంతాత్మా విగతభీః బ్రహ్మచారివ్రతే స్థితః
మనః సంయమ్య మచ్చిత్తో యుక్త ఆసీత మత్పరః 6-14

ధ్యానయోగి ప్రశాంతాత్ముడై, భయరహితుడై బ్రహ్మచర్యవ్రతమును పాటించుచు, మనోనిగ్రహముతో మత్పరాయణుడై నిశ్చలుడై యుండవలెను.

ముందు శ్లోకంలో ఎంతో శ్రేష్టత విశిష్టత కలిగినటువంటి దర్భచాప మీద ఏర్పరచుకున్నటువంటి స్థిర సుఖ ఆసనం పై ఆసీనులై ధ్యాన యోగాభ్యాసం ఆరంభించాల్సిన విధానాన్ని ప్రాణ శక్తిని పెంపొందించుకోవాల్సిన విధానాన్ని కూలంకషంగా చర్చించుకున్నాం. ఈ శ్లోకం అలా ఏర్పాటు చేసినటువంటి శ్రేష్టమైన ఆసనం మీద కూర్చొని ధ్యానంలో నిమగ్నం కావాల్సిన అంతరంగపు తీరును స్పష్టంగా వివరిస్తుంది. శరీరాన్ని శిరసును కంఠాన్ని చలనం లేకుండా సమంగా ఉంచి కూర్చున్న తరువాత మనం మన శ్వాసపై నాసికాగ్రంపై మన ధ్యాసను ఉంచాలి. మనం పంచప్రాణాలను గురించి ముందు శ్లోకాల్లో చూసాం, అందులో ఒకటైన ప్రాణం, శ్వాస మనలో నెరపే ఉచ్ఛ్వాస నిశ్వాసలను గురించి వివరంగా చెప్పుకున్నాం. అలా ప్రకృతి సహజ సిద్ధంగా మనలో జరుగుతున్న ఉచ్ఛ్వాస నిశ్వాసలపై దృష్టిని సమంగా నిలిపి గమనిస్తూ ఆసీనులు కావాలి. ఈ నాసికాగ్రమే భ్రూమధ్యం. అలా మనం విధిగా ప్రతిరోజు సుఖ స్థిర ఆసనంలో కూర్చుని మన దృష్టిని స్థిరంగా ఏకాగ్రంగా నిలిపి వ్రేళ్లలో వ్రేళ్ళు కలుపుకొని రెండు కళ్ళు మూసుకొని ప్రకృతి సహజమయ ఉఛ్వాస నిశ్వాసలను గమనిస్తూ మనసును ఆత్మస్థం చేసి ధ్యాన యోగంలో లీనం అవ్వాలి. ఇప్పుడు శరీరాన్నేమో చక్కటి స్థిర సుఖ ఆసనంలో అచలంగా కూర్చోబెట్టాం, కాని ఇప్పుడే మనసు మరింతగా విజృంభిస్తుంది, అన్ని ప్రాపంచిక విషయాలు అప్పుడే గుర్తుకొస్తుంది. అప్పుడు ఆ మనసును ఆత్మస్థం చేయడానికి మనం ఈ శ్వాస అనే బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తున్నాం, తద్వారా మనసు తన మనోవ్యాపారాలకు నెమ్మదిగా స్వస్తి చెప్పి పూర్తిగా ఆత్మస్థం అవుతుంది. ఇది ఎలా సాధ్యం అనే సందేహం మనకు కలగవచ్చు మనలో జరిగే ప్రకృతి సహజ సిద్ధమైన ఉచ్ఛ్వాస నిశ్వాసలు సశాస్త్రీయమైనటువంటి విధానం. ఎప్పుడైతే మనం శరీరం మొత్తాన్ని కదలనివ్వకుండా స్థిర సుఖ ఆసనంలో స్థితం చేసామో అక్కడితో దేహానికి కళ్లెం సరిపోయింది. దాన్ని కదలకుండా ఉంచాం, తరువాత ఈ పరుగులెతె ఈ పరుగులెత్తే మనస్సును దారిలో పెట్టడానికి ఈ శ్వాస మీద ధ్యాస అనేటటువంటి సశాస్త్రీయమైన ప్రక్రియలో మనం శ్వాసను గమనించడం ఆరంభించగానే

ఒక్కసారిగా విజృంభించిన ఆలోచనల ప్రవాహం కొంత సమయానికే క్రమంగా తగ్గుముఖం పట్టడం జరిగి అది కొద్ది సమయంలోనే క్రమంగా ఆలోచన రహిత స్థితికి చేరుకుంటాం అంటే బాహ్య ప్రపంచపు అవసరం లేని విషయాల వైపు పరుగులెత్తే మనసు కుదుటపడి నెమ్మదిగా ఆలోచనలు లేని స్థితికి చేరుకుంటుంది. అయితే ఇక్కడ ఓ సూక్ష్మమైనటువంటి అంశాన్ని మనం గమనించాలి. మనసు అనేది ఆలోచించకుండా ఉండలేదు ఎందుకంటే ఆలోచనే దాని స్వభావం. అయితే ఇప్పుడు ఇక్కడ మనసు ఎలా ఆలోచనా రహిత స్థితికి చేరుకుంది అంటే మనసు చేసే పని ఎలా ఉంటుందంటే బాహ్య ప్రపంచపు విషయాలకు స్వస్తి చెప్పింది కదా ఇక అంతే వేగంగా శ్వాస సహాయంతో అంతర్ముఖం అవుతుంది. తద్వారా నేనెవరు, నేనెందుకు పుట్టాను, నా పుట్టుకకు కారణం ఏంటి, మనిషంటే ఏంటి, మన కర్తవ్యం ఏంటి, ఈ సృష్టిని మనం ఎలా అర్థం చేసుకోవాలి లాంటి మనకు ఆధారమైనటువంటి ఆత్మిక మూలాలను తెలుసుకోవడానికి దర్శించడానికి అనుగుణమైన ఆలోచనలు ప్రారంభమై మనసు మరింత వేగంగా ఆ పనిలో నిమగ్నం అవుతుంది. దానికి ఏ విషయం ఆలోచిస్తున్నాం అనేదానితో పనిలేదు ఆలోచించడం తన స్వభావం కాబట్టి ఆలోచించాలి అంతే అయితే ఈ రకమైన అంతర్ముఖ ఆలోచనలతో నిమగ్నం కావడం ద్వారా ముందు శ్లోకంలో మనం చెప్పుకున్న మనలోని దైవ శక్తిని పరబ్రహ్మాన్ని మనం దర్శించడానికి మార్గం సుగమం అవుతుంది. ఈ క్రమంలో ప్రధానమైనవి ఒకటి స్థిర సుఖ ఆసనం, రెండు ఉచ్ఛ్వాస, నిశ్వాసాలను గమనించడం తద్వారా మనసు తన సరి కాని మార్గాన్ని ఉపసంహరించుకొని తన ఆలోచనా విధానాన్ని సరైన మార్గంలో మరల్చుచుకుంటుంది. అలా మరల్చుకోవడం ద్వారా విశ్వశక్తి, ప్రాణశక్తి మనలోకి ఆవాహనం జరుగుతుంది. ఈ ప్రక్రియలో నెమ్మదిగా మన శరీరానికి ప్రాణ శక్తి నిండుగా మెండుగా నిండుకుంటుంది. మనలోని సర్వరోగాలకు సర్వ అనర్థాలకు కారణం ప్రాణశక్తి లోపమే కదా అలా శ్వాస మీద ధ్యాస ద్వారా మనలో నిండుకున్న ప్రాణశక్తి నెమ్మదిగా శరీరంలోని రుగ్మతలన్నీ కూడా తొలగిస్తుంది. అనేక రకాల బాహ్య ఒత్తిడులను కూడా అధిగమించి శరీరం స్వస్థితికి చేరుకుంటుంది. ఈ స్వస్థితిలో నెమ్మదిగా దేహం స్వాంతన పొందుతుంది. అలా దేహంలోని నాడీమండలమంతా నిండుకున్నటువంటి ప్రాణశక్తితో దేహం పరిశుద్ధమై స్వస్థితికి చేరుకుంటుంది. ఈ ధ్యాన యోగంలో ఇదంతా కూడా దేహంలో సహజంగా జరిగేటటువంటి ప్రక్రియ తద్వారా సంపూర్ణ ఆరోగ్యమైనటువంటి శరీరాన్ని మనం పొందగలుగుతాం. ఇదంతా ఒక ఎత్తు ఇది పూర్తిగా శరీరానికి సంబంధించిన అంశం, ఇక మనసేమో తన వేగవంతమైనటువంటి ఆలోచన అన్వేషణను వీడదు. అలా మరోవైపు ఈ మనసు చేసే అన్వేషణలో మనం ఇందాక వేసుకున్న ప్రశ్నలన్నింటికీ కూడా సమాధానం మనలోనే దొరుకుతుంది. మనలోనే ఉండి మనకు సమాధానం అందించేది ఏంటి అంటే మనం ఆరవ అధ్యాయం దాకా చెప్పుకున్న నిర్ధారించుకున్న ఆత్మసాక్షి నుంచి ఈ అన్వేషణలో మనసు అత్యంత వేగంగా లోలోపలికి అంతర్ముఖంగా చొచ్చుకు పోతుంది కదా మనకు తెలియకుండానే ఈ అన్వేషణలో ఆత్మతో అనుసంధానించి ఆత్మస్థం

అవుతుంది. ఇదే మనసు ఒకప్పుడు బాహ్యంలోకి వెళ్లి ఇంద్రియాలు ద్వారా విషయాల్ని మనకు అందించింది ఇప్పుడు అదే విధంగా ఆత్మతో అనుసంధానించి ఆత్మిక అంశాల్ని ఆత్మ మూలాల్ని జన్మ కారణాల్ని ఆత్మగత సమస్త విషయాలను మనకు

అందిస్తుంది. ఇక్కడ తేడా ఏమిటంటే ప్రయాణం ప్రారంభించిన స్థానంలోనే గీత లోనే తేడా. గీత అంటే మార్గం ఏ మార్గాన్ని ఏ పదాన్ని పట్టుకుంటున్నామో ఆ పథం లోనే మనం ముందుకు వెళ్తాం. మనం గీతను అంటే భగవద్గీతను భగవంతుని దర్శింపజేసే మార్గాన్ని పట్టుకున్నప్పుడు మనం సాక్షాత్తు భగవంతునే చేరుకుంటాం. పరబ్రహ్మం దగ్గరికి వెళ్లి మనల్ని అనుసంధానం చేయగలిగిన శ్వాస అనే గీతను పట్టుకుంటే అదే మనసును అక్కడికి తీసుకెళ్లి దర్శింప చేస్తుంది. శ్వాసతో కలిసి మనసు వెళ్లి ఆత్మను దర్శించి మన ఆత్మిక మూలాలను మనకు సమగ్రంగా వివరిస్తుంది. ఇది ధ్యానయోగం యొక్క పరమార్థం. ఇదంతా కూడా ఒక సశాస్త్రియమైన ప్రక్రియ, ఎందరో శాస్త్రవేత్తలు అంగీకరించిన ప్రక్రియ. ఇది ప్రతి మనిషికి సాధ్యమైన, సులువైన ప్రక్రియ. ఆత్మ విద్యాభ్యాసం అనేది ఆత్మతో కూడుకున్న ప్రాణంతో ఉన్నటువంటి అందరికీ అనువైన ప్రక్రియే గాని ఏ కొంతమందికో పరిమితమైనది కాదు. ప్రాణంతో శ్వాసతో ఉన్న ప్రతి మనిషి కూడా ఈ శ్వాస మీద ధ్యాస మార్గంలో పరమ పదాన్ని చేరుకోవచ్చని మనకు నిర్ధారించి తెలిపే తలమానికమైన కీలకమైన జంట శ్లోకాలు ఇవే. మనం సదా సత్య చైతన్య స్ఫూర్తితో జీవించడానికి అలా జీవిస్తూ హృదయాన్ని జ్ఞానచైతన్యంతో నింపుకోవడానికి ఈ ప్రక్రియ ఎంతగానో దోహదపడుతుంది. అందుకే ఈ అధ్యాయం గీతకు భగవద్గీతకు హృదయం వంటిదని చెప్పవచ్చు. 5-27, 28 శ్లోకాల్లో ఈ అంశానికి సంబంధించిన బీజం ఉంది. బాహ్య విషయాలను చింతన చేయకుండా వాటిని పారద్రోలి దృష్టిని అంతర్ముఖం చేసి భ్రూమధ్యమందు స్థిరంగా ఉంచి నాసికలో ప్రసరిస్తున్న ప్రాణాపాన వాయువులను అంటే ఉచ్ఛ్వాస నిశ్వాసలను గమనించాలి. ఈ ప్రక్రియ ద్వారా మనిషి సదా ముక్తస్థితికి చేరుతాడు అని అక్కడే చూసాం. ఈ జంట శ్లోకాలు ఇలా అద్భుత సౌధంగా నిర్మితమయ్యాయి. ఇక ఈ అంశాన్ని మనం ముందు అధ్యాయాల్లో అనేక సందర్భాల్లో చర్చించాం. ఈ ప్రకర్షమైన, విశేషమైన శాంతిని మనం ఈ ప్రక్రియ ద్వారా అనుభూతిస్తాం. నెమ్మదిగా పూర్వజన్మ వాసనలు తద్వారా కలిగే భయం కూడా ఈ ధ్యాన యోగంలో ప్రక్షాళన చెంది నిర్భయ అపారమైన ఆత్మవిశ్వాసం మన స్వంతమవుతుంది తానే ఆత్మ అని దర్శించిన ధ్యానయోగి నెమ్మదిగా ప్రాణికోటిలోనూ ఏకాత్మని దర్శింపజేసే పరబ్రహ్మాన్ని దర్శించే స్థితికి చేరుకుంటాడు అంటే అందరిలో మానసికంగా ఆత్మీకంగా చరిస్తాడు. కనుక అలాంటి బ్రహ్మచారి వ్రతంలో స్థితమైన వీరు నిత్యం అదే తపస్సులో ఉంటారు. ఇక స్థిర సుఖ ఆసనంలో కూర్చొని మనం ధ్యానాభ్యాసం ప్రారంభించగానే మనలోని రాగద్వేషాధివృత్తులు మనసులో విజృంభిస్తాయి, మనసును సంయమించి సర్వజగత్తులో ఏకాత్మను దర్శించడమే మనః సంయమనం. పరమేశ్వరుని చేరడాన్ని మించిన ధ్యేయం మరొకటి లేదని గ్రహించి ఆ ధ్యానంలో నిమగ్నం కావడమే మత్పరత. అలా పరమాత్మే పరమావధిగా ధ్యాన యోగాభ్యాసం చేసేవారు మత్పరులు, ఆత్మచిత్తులు. ఇలా ఈ ధ్యానయోగం మోక్ష సాధనమైన జ్ఞానాన్ని పొందడానికి మనల్ని సిద్ధం చేస్తుంది.

6అ, 15శ్లో.

యుంజన్నేవం సదాత్మానం యోగీ నియతమానసః |
శాంతిం నిర్వాణపరమాం మత్సంస్థామధిగచ్ఛతి ||6.15

చిత్తమును పూర్తిగా వశమునందుంచుకొని, దానిని పరమాత్మయందే స్థిరముగా నిల్పినప్పుడు పురుషుడు సర్వభోగములయందును స్పృహారహితుడగును. అప్పుడతడు యోగయుక్తుడనబడును.

యోగి తనను తాను నిరంతరం ధ్యాననిష్ఠలో ఉంచుకోవాలని 'యోగీ యుంజీత సతతమ్' అని పదవ శ్లోకంలో చెప్పి ధ్యానయోగారోహణం చేయాల్సిన విధానాన్ని ప్రారంభించి ఈ శ్లోకంలో ధ్యానయోగం ఫలితాన్ని పేర్కొన్నారు. మనం 11 &12 శ్లోకాల్లో ధ్యానయోగ అభ్యాసానికి తగిన శ్రేష్టమైన ఆసనం గురించి 13&14 శ్లోకాల్లో ధ్యానంలో యోగి ఎలా దృష్టిని నిలపాలో చూసి ధ్యానం అభ్యసించాల్సిన విధానాన్ని సమగ్రంగా చర్చించాం. అందులోనే ధ్యాన యోగ అభ్యాసంలో మన శరీరంలోని నాడీ మండలమంతా కూడా పరిశుద్ధమై తద్వారా మన శరీరం పొందే సంపూర్ణ ఆరోగ్యం చూశాం. అలాగే మానసికంగా మనసులో విజృంభించే కోరికలు ఆలోచనలు వాటిని ఎలా అధిగమించి ఆ మనసును ఆత్మస్థం చేసామో, అలా చేసిన దాని ప్రయోజనం ఏంటో చూసాం. అందుకు కొనసాగింపుగా ధ్యానయోగ ఫలాన్ని ఈ శ్లోకంలో వివరిస్తున్నారు. పరమానందానికి పరాకాష్ట అయిన పరమ శాంతే ధ్యానయోగాభ్యాసం లక్ష్యం. అదే మనం ఎప్పుడూ అనుకునే అనుకుంటున్న మోక్షం. 10 నుంచి 14 వరకు గల ఐదు శ్లోకాల సారం ఫలితమే ఈ శ్లోకం. ఇందులో రెండు అంశాలు మనకు కనిపిస్తాయి, ఒకటి 'నియత మానసః' సంయమించిన మనసు గల యోగి, రెండు 'సదాయుంజన్' నిరంతర అభ్యాసం. మనోవృత్తులు ఉపరమించి నియతము లయ్యాక అదే స్థితిలో సదా ఉండేట్లు చూడాలి. అందుకు ప్రతిరోజు విధిగా ధ్యాన యోగంలో లీనం అవ్వాలనే అంశాన్ని ప్రత్యేకంచి పేర్కొనేటటువంటి శ్లోకం ఇది. ఏ విద్యకైనా నిరంతర అభ్యాసం అనేది ప్రధానమైనది, ప్రకృష్టమైనది. ధ్యానయోగ అభ్యాసంలో మనలో జరిగే ఆంతరంగిక పరిణామాల్ని కొన్ని వాటిని మనం ముందు శ్లోకంలో చూసాం, ఇప్పుడు మరికొన్నింటిని చూద్దాం. ఈ ధ్యాన యోగంలో బాహ్యపు ఆలోచనలు తగ్గించుకున్న మన మనసు ఆంతరంగికపు ఆత్మస్థపు ఆలోచనలతో రెట్టించిన వేగంతో అంతర్ముఖమై ఆత్మతో అనుసంధానిస్తుంది. విశ్వమంతా వ్యాపించి ఉన్న విశ్వశక్తి మన బ్రహ్మరంధ్రం ద్వారా మనలోకి ప్రవేశించి విశ్వశక్తిని మనలో నింపుతుంది. అప్పుడు మనలోని ప్రాణ శక్తితో కలిసిన మన మనసు బాహ్య ఆలోచనలకు స్వస్తి చెప్పి ఆత్మస్థం కావడం వల్ల మనలోని అంతర్గతంగా కేంద్రీకృతమైన దైవ శక్తి ఉద్దీపనం అవుతుంది. ఇలా ఆంతరంగిక ప్రాణశక్తి విశ్వశక్తితో మమేకం కావడమే ఆత్మ పరమాత్మతో అనుసంధానించడం అంటే. మనలోని ప్రాణ శక్తి విశ్వశక్తితో ఏకమై మనలోని శక్తిని సుసంపన్నం చేస్తుంది, విస్తృతం చేస్తుంది, విశ్వవ్యాప్తం చేస్తుంది. సృష్టి యావత్తూ కూడా ఒక శక్తిచాలనం ఆ శక్తి విస్తరించి

ఘనీభవించి పదార్థంగా మారింది. కనుక ప్రాణిలోనూ ఖనిజంలోనూ ఉన్నది శక్తే. అందుకే సృష్టికి ఆది అంతం ఉండదు. మన శరీరాలు అణువులతో కణాలతో ఏర్పడి మరల విడిపోయి మరలా కలుస్తూ కొత్త సమీకరణలతో కొత్త రూపాలు ఏర్పడుతూ ఉంటాయి. విశ్వశక్తితో మన ఆత్మశక్తి అనుసంధానించినప్పుడు మనకు ఇలాంటి అనేక అంశాల పట్ల అవగాహన అవుతుంది. అలా అవగాహనకు అందిన అనేక అనుభవాల్ని గ్రహించగలిగినటువంటి ప్రజ్ఞ మనలో ఉంటుంది కానీ వాటిని కూడా వ్యక్తీకరించడానికి భాష భావం సరిపోదు. మనం మన కంటికి కనిపించకుండానే మన చుట్టూ ఉన్నటువంటి జీవశక్తిని సంగ్రహిస్తూ బతుకుతున్నామనే సంగతి చాలామంది గమనించరు. ఈ పనికి దోహదం చేస్తున్నది మనలోని శ్వాస ప్రక్రియ. అందుకే జగద్గురువు ప్రత్యేకించి 'ప్రాణాపానౌ సమౌ కృత్వా' అని 5-27లో, 'సంప్రేక్ష్య నాసికాగ్రం' అని 6-13 లో నొక్కి వక్కాణించారు. మనలో ఉన్న శక్తిని మన చుట్టూ ఉన్న విశ్వంలోని మహాశక్తితో సంధానపరిచేదే ధ్యానయోగ చర్య. ఇది మనలో జరిగే సశాస్త్రీయమైనటువంటి విధానం. ఇలాంటి ఎన్నో ఎన్నెన్నో అద్భుతాలను మనం ధ్యానయోగంలో పొందవచ్చు. ఇలా మనం ధ్యానయోగ ఫలాన్ని తెలిపే ఈ శ్లోకాన్ని విభిన్నమైన కోణాల్లో విస్తృతంగా అవగాహన చేసుకుని పరమ శాంతిని పొందవచ్చు .

6అ, 16శ్లో

నాత్యశ్నతస్తు యోగోఽస్తి న చైకాంతమనశ్నతః ||
న చాతిస్వప్నశీలస్య జాగ్రతో నైవ చార్జున || 6.16

అర్జునా! అతిగా భుజించువానికిని, ఏ మాత్రము భుజింపనివానికిని, అతిగా నిద్రించువానికిని, ఎల్లప్పుడు (ఏమాత్రము నిద్రింపక) మేల్కొనియుండువానికిని ఈ యోగసిద్ధి కలుగదు.

మనం తీసుకునే ఆహారం జీవం ఉండే విధంగా చూసి గమనించి ఆహారం తీసుకోవాల్సిన అవసరం ఉంది. నిద్ర, ఆహారాలు మన జీవితంలోని ఓ ప్రధానమైన పార్శ్వం ఈ శ్లోకానికి బీజం 'అపరే నియతాహారాః' అని 4-30 లోనే మనం చూసాం. అధిక ఆహారం, ఆహారలేమి, అధిక నిద్ర, నిద్రలేమి ఇలా కాకుండా మితాహారం మితమైన నిద్ర అంటే నిద్రాహార విషయంలో మధ్యే మార్గాన్ని ఆశ్రయించాలి. ఆహారం నిద్ర ఇవి రెండూ మనిషి పురోగతికి అలాగే అధోగతికి కూడా కారణం అవుతుంది. ఆహార స్వీకరణలో ప్రాధాన్యం ఆకలికి ఆరోగ్యానికే గాని రుచులకు కాదని మనం గ్రహించాలి. ఆహారం తద్వారా ఆరోగ్యం అందరికీ అవసరమే అయినా అవసరాన్ని ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆహారాన్ని తీసుకునేవారు చాలా అరుదుగా ఉంటారు. కొందరు అధికంగా తీసుకోవడం కొందరు అతి తక్కువ తీసుకోవడం మరికొందరు అసలే తీసుకోకుండా ఉండటం ఇంకొందరు అదే పనిగా తీసుకోవడం ఈ నాలుగు రకాల వారి కంటే విభిన్నమైన వారు యోగులు. హితమైన మితమైన ఆహార జీవనమే యోగ జీవనం అవుతుంది, అంతేగాని 'అతి అశ్నతః' 'అనశ్నతః' రెండు కూడా యోగ యుక్తం కాదు. ఆహారం నిద్ర అనేది మన శరీర మనుగడకు కావాల్సిన

ఇంధనం. మన పనితీరు మేధస్సు లక్షణాలు వీటన్నింటి మీద నిద్రాహార ప్రభావం ఖచ్చితంగా ఉంటుంది. ధ్యానం చేయాలన్నా జ్ఞానం పొందాలన్నా ఆరోగ్యం ప్రధానం, శారీరక ఆరోగ్య ప్రాప్తికి మనం తీసుకునే ఆహారం మనం నిద్రకు కేటాయించే సమయం ఈ రెండింటి ప్రధానం ఎంతగానో ఉంటుంది. మనకు దొరికే వాటిలో మనకు అందుబాటులో ఉన్నంతలో సరైన ఆహారాన్ని మితాహారాన్ని తీసుకోవాలి. నిద్రకు తగినంతగా మితంగా సమయాన్ని కేటాయించాలి. యౌగికకోణంలో మనం ఆలోచించినప్పుడు అవసరం కంటే తగిన సమయం కంటే ఎక్కువగా నిద్ర పోవడం తమోగుణ ప్రభావంగా కనిపిస్తుంది. దీనివల్ల అవివేకం సోమరితనం లేని పోని భ్రాంతులు జడత్వం అలసత్వం ఇవన్నీ వీరి లక్షణాలుగా వ్యవహారాలుగా మనకు తెలుస్తుంది. రజోగుణం ప్రభావం ఉన్న వారిలో తమ తమ కార్యాలు వారు నెరవేర్చుకోగలిగినా వారిలో సమతుల్యత లేకపోయిన కారణంగా ప్రాపంచిక భోగాలపై ఆసక్తి తద్వారా అశాంతి. సత్వగుణ ప్రభావం ఉన్నవారిలో నిలకడతో కూడుకున్న మనసు బుద్ధి ఉంటుంది. వీరు తగిన నిద్రను తగిన ఆహారాన్ని తీసుకుంటూ క్షేమకరమైన శాంతియుతమైన నిర్మలమైన జీవితాన్ని కొనసాగిస్తారు. శరీరానికి తగిన సమయాన్ని మాత్రమే నిద్రకు కేటాయించాలి. అతిగా నిద్రపోవడం వల్ల భుజించడం వల్ల శరీరం బరువెక్కి మత్తెక్కి ధ్యానంలో కూర్చోవడం సాధ్యపడదు. సమంకాయం శిరోగ్రీవం అనే సూత్రానికి వీలుపడదు. ధ్యానంలో మనం దేహేంద్రియాల స్థితిని, మనసు స్థితిని, బుద్ధి స్థితిని దాటి ఆత్మతో అనుసంధానించాల్సి ఉంటుంది. అందుకు శరీరం సహకరించాలంటే హితమైన మితాహారం, మితమైన నిద్ర ఖచ్చితంగా పాటించాలి. అలా లేకపోతే దేహ భావనతో ముడిపడి దేహస్థితిని దాటి ముందుకు వెళ్లలేము.ఇలా అధిక ఆహారం నిద్ర ధ్యానానికి ఆటంకం కలిగిస్తోంది. ఇక అసలు ఆహారమే లేకపోతే ఆహారం వల్లనే శరీరం మనసు ఏర్పడుతుంది ఆహారమే ప్రాణి పుట్టుకకు కారణం అని 'అన్నాద్భవంతి భూతాని' అనే శ్లోకంలో 3-14లో చూసాం. అసలు ఆహారమే తినకపోతే వారికి ధ్యానయోగం కుదరదు, వారి శరీరం ఆసనానికి సహకరించదు. అలా నిద్ర కూడా శరీర నిర్మాణాన్ని అనుసరించి ఈ ఉపాధికి కావాల్సిన సమయం కేటాయించి విశ్రాంతి తీసుకోవాలి, అయితే అది అతిగా కాకుండా ఉండాలి, అసలు లేకుండా ఉండకూడదు, మితంగా ఉండాలి. అప్పుడే ఆధ్యాత్మిక సాధనకు పురోగతికి మన దేహం సహకరిస్తుంది. అతినిద్ర అలసత్వాన్ని ఆయాసాన్ని అనారోగ్యాన్ని తెచ్చిపెడుతుంది. అల్పనిద్ర అసక్తతను, అసమర్ధతను కలిగిస్తుంది. ఈ కర్మభూమిలో శ్రమించే దేహం విశ్రాంతి పొంది ఆరోగ్యంగా ఉండటానికి భగవంతుడు ప్రసాదించిన ఓ దివ్యమైన ఔషధం నిద్ర. ఆహారం మితిమీరి తింటే అజీర్ణాది రోగాలు సంక్రమించి మనిషి వ్యాధిగ్రస్తులవుతారు. అలా అయితే రోగి అయిన మనిషి యోగి కావడానికి వీలు ఉండదు కదా, అలాగని అసలు తినకపోయినా మనిషిలో కార్య దక్షత లోపిస్తుంది, కార్యనిర్వహణ సామర్థ్యం క్షీణిస్తుంది. అలా అయిన అశక్తుడు యోగి కాలేడు కదా. దీన్నిబట్టి అవసరానికి మించి తిన్న ఆహారం మనల్ని హింసిస్తుంది, అవసరమైనంత తినక తగ్గించి తింటే అది మనల్ని రక్షించలేందు. కాబట్టి ధ్యాన యోగాభ్యాసానికి స్వధర్మాచరణకు ఉపకరించే విధంగా మనకున్న వివేకంతో విజ్ఞతతో అవసరమైన తగిన హితమైన మితమైన ఆహార నిద్రలనే స్వీకరించాలి. ఈ విచక్షణే ఈ వివేకమే ప్రాణికోటి నుంచి మనిషిని వేరు చేసేది. ఇక ఆహారం తీసుకోవాల్సినటువంటి పరిమాణం, తీసుకోవాల్సిన విధానం గురించి 4-30 లో చూసాం, ఆ అవగాహనతో సమన్వయం చేసుకుంటే సరిపోతుంది. మనిషి జీవితాన్ని నిద్ర ఆహారం

అనే ఇద్దరు దొంగలు అపహరిస్తున్నారు అంటారు విద్యా ప్రకాశానందగిరి స్వామి. దీనిబట్టి పరమాత్మ చింతనకు జీవిత నిర్వహణకు అవసరమైనంత వరకే ఆహార నిద్రలను స్వీకరించాలని మనకు నిర్ధారణ అవుతుంది.

6అ, 17శ్లో.

యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు |
యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా ||

ఆహారవిహారాదులయందును, కర్మాచరణములయందును, జాగ్రత్స్వప్నాదుల యందును యథాయోగ్యముగ ప్రవర్తించు వానికి దుఃఖనాశకమగు ధ్యానయోగము సిద్ధించును.

మనం 10 నుండి 14 వరకు ధ్యాన యోగ విధానాన్ని 15లో ఫలస్కృతిని తెలుసుకున్నాం. 16వ శ్లోకంలో నిద్ర ఆహారం రెండు అంశాలు మనిషి జీవితంలో అలాగే ధ్యానయోగ అభ్యాసంలో ఎలాంటి పాత్రను పోషిస్తున్నాయో స్పష్టంగా చూసాం. ఈ శ్లోకంలో ఒకటి యుక్త ఆహారం విహారం, రెండు యుక్త కర్మాచరణ, మూడు యుక్తమైన నిద్ర మెలకువ. ఈ మూడు అంశాల్లో మనిషి జీవితపు సమస్త క్రియలను కర్మలను పొందుపరచి జగద్గురువు మన ముందు ఉంచారు. ఈ మూడు అంశాల్లో యుక్తిగా ప్రవర్తించినప్పుడు మాత్రమే సంపూర్ణ ఆరోగ్యం ధ్యానయోగభ్యాసం సిద్ధిస్తుంది. యుక్తమైన ఆహారం విహారం అన్నప్పుడు ఆహార విహారాలు ధ్యాన యోగానికి అనుకూలంగా ఉండేట్లు జాగ్రత్త వహించాలి. ఆహారం అంటే మనం మన పంచేంద్రియాల ద్వారా లోపలికి తీసుకునే ఆహారం. యుక్తః అని చెప్పడం వల్ల మనం మరింత లోతుల్లోకి వెళ్లి మనకున్న ఆరు అధ్యాయాల అవగాహనతో ఆలోచించాలి. ఇక్కడ ఆహారం అంటే ఒక్క నోటి ద్వారా తీసుకునే అన్నపానాదులు మాత్రమే కాదు దానికి తోడు కంటికి కనిపించే అందం రంగులు లాంటి ఆహారం, చెవికి వినిపించే శబ్దాహారం, ముక్కు ద్వారా తెలిసే వాసనాహారం, చర్మానికి తెలిసే స్పర్శాహారం ఇవన్నీ కూడా ఆహారాలే అని ఈ అంశానికి 2-59 లోనే బీజం వేశారు అది మూడవ అధ్యాయంలో మొలకెత్తి ఇప్పుడు ఇక్కడ మహావృక్షంగా మన ముందు కనిపిస్తోంది. యుక్తాహారం అనే మాటను నోటితో తినే ఆహారం అనే పరిమితార్థంలో చూడకూడదని ఖచ్చితంగా గ్రహించాలి. ధ్యాన యోగ అభ్యాసంలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ కీలకమైన శ్లోకాన్ని మనం మన బుద్ధికి అందినంతలో పరిశీలిద్దాం. ఆహారం అంటే స్వీకరించేది శరీరం కోసం లోపలకు తీసుకునే ఆహారం. ఆహారం తీసుకోవడం అంటే శరీరానికి పోషక పదార్థం ఇవ్వడం. ఇది ప్రతి ప్రాణీ చేస్తుంది. మరి విచక్షణతో కూడుకున్న మనిషిగా మనం ఆలోచిస్తే ఆహారాలు నాలుగు రకాలుగా తెలుస్తుంది. ఒకటి శారీరకపరమైన ఆహారం, రెండు మానసికపరమైన ఆహారం, మూడు బుద్ధి పరమైన ఆహారం, నాలుగు ఆత్మ పరమైన ఆహారం. ఒకటి శారీరకమైన ఆహారం సమతుల పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

సాధ్యం. ఆరోగ్యంగా ఉంటే ఒత్తిడి మొదలు సంక్షోభం వరకు దేనినైనా ఎదుర్కొనే శక్తి మనిషికి ఉంటుంది. శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా ఉత్సాహంగా ఉండొచ్చు. అందుకే అన్ని రకాల ప్రోటీన్లు సమపాళ్లలో ఉండే శాఖాహారం తీసుకోవడం శ్రేయస్కరం. శాఖాహారం ఎంతో ఆరోగ్యకరమని వైద్యులు శాస్త్రజ్ఞులు సూచిస్తూనే ఉన్నారు. మనం ఏ రకమైన ఆహారం తినాలి అన్నది మన విచక్షణతో మనమే ఆలోచించి నిర్ణయించుకోవాలి. ఆహారం విషయంలో ఏ రకమైన ఆహారం తింటే మన శరీరం సౌకర్యంగా ఉంటుందో మనకు మనమే గమనించాలి. మన శరీరం చురుకుగా శక్తివంతంగా తేలికగా ఉండే మన శరీర వ్యవస్థకు అనుకూలమైన ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. మన శరీరం మందకొడిగా ఉన్నట్లు గమనిస్తే అలాంటి వాటిని వదిలిపెట్టాలి. ఈ అంశాలన్నీ మన శరీరమే మనకు స్పష్టంగా చెబుతుంది. కానీ మనం ఆ విషయాన్ని గమనించం ఎందుకంటే మన ధ్యాస మన మీద మాత్రం కాకుండా మిగతా అన్నింటి పైనా ఉంటుంది. ఏమి తినాలో ఏమి తినకూడదో ప్రతి జీవికి ప్రతి జంతువుకు తెలుసు. మానవజాతి అత్యంత తెలివైన మహోన్నతమైన జాతి కాబట్టి మనం కొద్ది శ్రద్ధతో మన శరీరం మాట వింటే మనకు ఈ విషయాలన్నీ అవగాహన అవుతుంది. అనేక రకాల జీవం లేని జీవచ్ఛవమైన మృతకణాలను మనం మన శరీరంలోనికి నింపి మనలోని అణువణువుల్లో ఉన్న శక్తిని మనమే నిర్వీర్యం చేసుకుంటున్నామనే సంగతిని మనం గుర్తించాలి, గమనించాలి, సరిదిద్దుకోవాలి. ఆ నిర్వీర్యతే మన అస్వస్థతకు మన అనారోగ్యానికి కారణం. ఈగ ఇల్లు అలుకుతూ తన పేరు మరచిపోయినట్లు మనం బాహ్య ప్రపంచపు మోజులో పడి మనల్ని మన సంపూర్ణ ఆరోగ్యాన్ని యుక్తాహార విహారాలను మరచిపోయాం. ఆయా కాలానుగుణంగా మనకు అందుబాటులో ఉండే పండ్లు కూరగాయలు మొలకలు లాంటివి సజీవంగా ఉన్నవి తీసుకుంటే ఆ జీవాన్ని మన అణువులు తనలో పొందుపరచుకుంటాయి. అలా సజీవంగా ఉన్నవి తీసుకున్నప్పుడు మనకు ఓ విధమైనటువంటి సంపూర్ణ ఆరోగ్యకర భావన అనుభవేద్యం అవుతుంది. ఇక మన శరీరానికి తగిన యుక్తమైన ఆహార విధానంతో పాటు యుక్తమైన సత్ప్రవర్తనతో కూడిన విహారాలను పాటించాలి. విహారమంటే మనం తిరిగే చరించే స్థలాలు ప్రదేశాలు ఇవన్నీ నియతమైనవిగాను యుక్తమైనవిగాను ఉండాలి. మనం చేసే ప్రయాణాలు మనం ఏర్పాటు చేసుకున్న స్నేహపూరిత సంబంధాలు మొదలైన వాటి ప్రభావం మన జీవితంపై ఖచ్చితంగా ఉంటుంది. కాబట్టి మనం చూసే చూపు మనం చూస్తున్న వింటున్న ప్రతి అంశం మనం వేసే ప్రతి అడుగు మనం చేసే ప్రతి విహారం పట్ల తగిన జాగ్రత్తలు వహించాల్సిన అవసరం ఉంది. రెండు మానసికపరమైన ఆహారం అంటే సూర్యోదయం సూర్యాస్తమయం పండువెన్నెల కొండ కోనలు వాగు వంకలు, ప్రకృతి అందాలు ఇవన్నీ మనసుకు అత్యంత ఆహ్లాదాన్ని ఆనందాన్ని ఇస్తాయి. మన మనసు వాటిలో నిమగ్నమైనప్పుడు దాని యొక్క ఆరోగ్యం ద్విగుణీకృతం అవుతుంది, మరింత శక్తిని చేకూర్చుకుంటుంది. మూడు బుద్ధి పరమైన ఆహారం అంటే బుద్ధి పరిశుద్ధంగా కావడానికి అవసరమైన అసలైన ఆధ్యాత్మిక గ్రంథాలు భగవద్గీత, భారతం, రామాయణం లాంటివి విరివిగా చదువుకోవాలి. గొప్ప గొప్ప వాళ్లను గురించి పదేపదే చదవటం వల్ల ఆ గొప్పతనాన్ని మనలో కొంతైనా నింపుకోగలుగుతాం. ఇక అత్యున్నతమైన ఆత్మ పరమైన ఆహారం ఇదే ధ్యానయోగ అభ్యాసం. ధ్యానం ద్వారా మనం ప్రాణశక్తిని విశ్వజ్ఞానాన్ని విజ్ఞాన సంపత్తిని విశేషంగా పొందటమే ఆత్మ పరమైన ఆహారం. ఈ సమగ్రమైన పరిపూర్ణమైన చతుర్విధ ఆహార స్వీకరణ విధానం వల్ల

మన జీవితం పరమాద్భుతంగా తయారవుతుంది. అప్పుడు మన చేష్ట నుండి వచ్చే వ్యవహారం సదా మన మనసులో ఉండే ఆహారంపైనే ఆధారపడి ఉంటుంది ఇదే 'యుక్తాహార విహారస్య'. ఇలా శారీరక మానసికపరమైన బుద్ధిపరమైన ఆత్మపరమైన ఆహారాలు మనం అందించినప్పుడు మనం ఆరు అధ్యాయాలుగా స్మరిస్తున్న దేహేంద్రియ మనోబుద్ధులు మనకు తెలియకుండానే మన వశం అవుతాయి. దానివల్ల మన మాట సరిగ్గా వస్తుంది, మన మాట సరిగ్గా ఉన్నప్పుడు చేత చేష్ట తనంతట తానే మరమ్మత్తు జరిగి సత్ప్రవర్తనతో కూడుకొని ఉంటుంది. అందుకని ఆహార విహారాల్లోనే తగిన జాగ్రత్తలు వహించాలి. ప్రతిరోజు సదా ధ్యానం ద్వారా ఆత్మకు ఆహారం ఇవ్వాలి. శరీరానికి నీళ్లు పోసుకుంటే అది స్నానం, ఆత్మకు ప్రాణం పోసుకుంటే అది ధ్యానం. కాబట్టి కేవలం శరీరానికి మాత్రమే ఆహారం అనుకోకుండా యుక్తాహార విహారాన్ని పాటించి ప్రతి వ్యక్తి ప్రతిరోజు ధ్యానం తప్పనిసరిగా ఆచరించి ఈ క్షణం నుంచైనా శారీరక మానసిక బుద్ధి, ఆత్మ పరమైన ఆరోగ్యాలను పొందుతాం. ఉదాహరణకు మనిషి ముఖ్యం గాని నీడ ముఖ్యం కాదు కదా. మన నీడ మన వెంట వస్తుందో రాదో అని మనం భయపడటం ఆలోచించడం అవసరం లేదు. ఎందుకంటే మన నీడ మనలను ఎప్పుడూ వీడదు. మన ఆహార విహారం సరిగ్గా ఉంటే మన చేష్ట వ్యవహారం అన్నది మన నీడ లాంటిదని మనం గ్రహించాలి. యధా ఆహారం తధా వ్యవహారం, అదే మన ప్రవర్తనం. 'యుక్తచేష్టస్య కర్మసు' పంచకర్మేంద్రియాల ద్వారా మనం చేసే చేష్టలే మన ప్రవర్తన ఇదే మన వ్యవహారం, మన చేష్టలు లేదా వ్యవహారం ఇతరులకు ఆహారమవుతుంది. ఇతరుల వ్యవహారం చేష్ట మనకు ఆహారం అవుతుంది. ఆహార విహారం యుక్తంగా ఉన్నప్పుడే మన నుంచి నడిచే వ్యవహారం ప్రవర్తన యుక్తంగా ఉంటుంది. అదే 'యుక్తచేష్టస్య కర్మసు'. ఇందులో అందరికీ ఒకే మార్గాన్ని నిర్ణయించడం సాధ్యం కాదు. వ్యక్తి చేసే శారీరక శ్రమను శరీర స్థితిని ఆరోగ్య పరిస్థితిని వారి వారి ఆలోచన స్థాయిని బట్టి ఆహారం తీసుకుంటూ విహారాలు నెరపుతూ తమ తమ విచక్షణతో యుక్త ప్రవర్తకులుగా వర్ధిల్లాలి. అందుకనే జగద్గురువు అందరికీ వర్తించేటట్లుగా యుక్తః అని కర్మ స్వేచ్ఛను మనకే విడిచిపెట్టినట్లు యుక్తాహారవిహార చేష్టను కూడా మనకే విడిచిపెట్టారు, మన విచక్షణకే వదిలేశారు. ఈ రెండూ యుక్తమైతే 'యుక్తస్వప్న బోధస్య' అలాంటి వారి నిద్ర మెలకువలు రెండూ కూడా యుక్తంగా తగిన నియతితో సమపాళ్లలో సహజంగానే జరిగి తీరుతుంది. ఈ స్వప్న జాగ్రదల గురించి ముందు శ్లోకంలోనూ మనం స్పష్టంగా చూసాం. ఇలా ఆహార విహారం ధ్యానయోగ అభ్యాసం స్వాధ్యాయ సజ్జన సాంగత్యాధుల ద్వారా నాలుగు ఆహారాలను పొందుతూ రోజురోజుకు క్షణ క్షణం శక్తివంతులు కావాలి. అప్పుడు మనమే కాకుండా యావత్ జగత్తు మొత్తం మనలాగే తయారవుతుంది. ప్రతి ఒక్క వ్యక్తి సకల ప్రాణికోటి నుండి అన్నీ నేర్చుకోవాలి. నిరంతరం నేర్చుకునే గమనిక మనకు ఉండాలి. ఏ విధమైన వినయ విధేయతల్ని విస్మరించకూడదు. అప్పుడే 'యోగో భవతి దుఃఖహా'.

6అ, 18శ్లో.

యదా వినియతం చిత్తమాత్మన్యేవావతిష్ఠతే |
నిఃస్పృహః సర్వకామేభ్యో యుక్త ఇత్యుచ్యతే తదా ||

చిత్తమును పూర్తిగా వశమునందుంచుకొని, దానిని పరమాత్మయందే స్థిరముగా నిల్పినప్పుడు పురుషుడు సర్వభోగములయందును స్పృహారహితుడగును. అప్పుడతడు యోగయుక్తుడనబడును.

ధ్యాన ఆరోహణ విధానాన్ని అందుకు కావలసిన యుక్తాహార విహారం, యుక్త ప్రవర్తన యుక్తనిద్ర, మెలకువ లాంటి ఉపకరణాలు అందించిన జగద్గురువు సాధకులు ఎప్పుడు యోగాన్ని సాధించిన వారు అవుతారు అనే అంశాన్ని ఈ శ్లోకంలో వివరించారు. 'నియతం' అంటే నిగ్రహించిన, 'వినియతం' అంటే విశేషంగా నిగ్రహించిన, 'యదా' ఎప్పుడైతే ఇలా విశేషమైన ఏకాగ్రచిత్తం, నిగ్రహ మనస్తత్త్వం ఏర్పడుతుందో 'తదా' అప్పుడు వారు సమస్త బాహ్య విషయాల్ని త్యజించి యోగాన్ని అధిరోహించి యోగయుక్తులవుతున్నారు. మనసు ఏకాగ్రతను సాధించడంలో ఉన్న ఇబ్బంది ఏంటంటే ఒకటి తన సమస్య ఏమిటో తనకు తెలియకపోవడం, సమస్యలన్నీ తనకే ఉన్నట్లు భ్రమించడం. రెండు సమస్యే అర్థం కాని మనసుకు బాహ్య ప్రపంచంలో పరిష్కారం ఉందని భావించి ఆ వైపుగా పరుగులు తీయడం ఇదీ పరిస్థితి. ఈ కారణంగా ఏకాగ్రతను సాధించుకోలేకపోతున్నాం, దీన్ని చిత్తవిభ్రమం అంటారు. ఉదాహరణకు ఓ ఖగోళ శాస్త్రం ఓ అంతరిక్ష శాస్త్రం ఓ జ్యోతిష్య శాస్త్రం భాషా శాస్త్రం రసాయన శాస్త్రం ఇలా ఆయా శాస్త్రాలలో మహాపాండిత్యాన్ని సంపాదించినటువంటి ఒక్కో మేధావుల్ని మనం చూస్తే అందరూ కూడా తమ తమ శాస్త్రాల్లో పాండిత్యం పుష్కలంగా ఉన్నవారే కానీ ఈ బాహ్య విషయాల దగ్గరకు వచ్చేసరికి సమస్య అందరికీ సమానంగా ఒకే విధంగా అనిపిస్తుంది. అందరి మేధస్సు ఇలాంటి ఆరాట పోరాటాల లోనే ఉంటున్నాయి. ఈ సత్యం గోచరమైతే అప్పుడు ఎంతటి మేధావులకైనా ప్రాథమికంగా తనపై తాను పాండిత్యాన్ని పెంపొందించుకోవాలని తన దేహానికి తాను పండితులమవ్వాలని తెలియ వస్తుంది. ఇది గ్రహించలేక పోతే విభిన్నమైన అంశాల్లో పాండిత్యం ఉన్న ఎన్ని మేధలైనా సరే చివరకు విషయాల చుట్టూ విషయ ప్రపంచంలోనే ఆరాట పోరాటాలలోనే పరిభ్రమిస్తూ ఉంటుంది. నేను ప్రత్యేకమైన వ్యక్తిని నేను ఎంతో గొప్ప వ్యక్తిని నేను ఇంత బాగా చదువుకున్నాను నా హోదా ఇది నా స్థాయి ఇది నా సంపద ఇంత నేను ఇలా అనుకున్నప్పుడే మనకు సమస్య. ఏ స్థాయిలో ఏ పదవిలో ఏ హోదాలో ఉన్నా కూడా నేను సాధారణంగా అందరిలో ఒక వ్యక్తిని అందరూ గొప్పవారు ప్రతి ఒక్కరిలో ఏదో ఒక విషయంలో గొప్పతనం ఖచ్చితంగా ఉంటుంది. కాబట్టి ఈ ప్రపంచంలో ఉండే మానవాళి నుంచి నేనొక్కడినే ప్రత్యేకం కాదు గొప్ప కాదు అనే సమస్థితిని మనం మన మనసుకు అందించాలి. గడ్డిపరకనుంచి బ్రహ్మదాకా ఉండే అన్ని జీవులలో నేను ఓ దివ్యాగ్ని కణం, ఓ ఇసుక రేణువు మాత్రమే. మనం నాలుగవ అధ్యాయం ఆరంభంలో ఈ సృష్టి సమస్తపు జీవిత అధ్యాయంలో మన జీవితపు అధ్యాయం ఏ పాటిదో చూసాం. ఈ సమానత్వపు భావన మనలో సుస్థిరమై పోతే మనకు ఎలాంటి సమస్య లేదు,

ఉండదు. భౌతిక స్థాయిలోని హోదాలతో సంపదలతో పదవులతో పోల్చుకొని మన గురించి మనకు మనమే ఎక్కువగా భావించుకొని ఊహల్లో తేలిపోయి చివరకు దుఃఖాన్ని తెచ్చుకుంటున్నాం. ఓ మాటకు ఓ చేష్టకు మనం భరించరాని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ బాహ్యపు అసమానతల ఆలోచనలు పోగొట్టుకోగలిగితే అప్పుడు 'యదా వినియతం చిత్తం' మన సొంతమవుతుంది. బాహ్య ప్రపంచపు ఆలోచనలకు ప్రేరణలకు మన మనసు కదల కూడదు. మనసు ఎప్పుడూ ఆత్మతో 'అవతిష్టతే ఆత్మని ఏవ' అలా ఉండాలి. అప్పుడే "నిఃస్పృహః' బాహ్యపు విషయాలు లేదా కోరికలు మనం అనుకుంటున్న భ్రమిస్తున్న తాత్కాలిక హోదాలు పదవులు వీటన్నిటి పట్ల మనం స్పృహలేనివారై వాటికి అంటని వారై ఉండగలుగుతాం. అది సమస్త విషయాల పట్ల ఉన్న తీవ్రమైన ప్రీతి పట్ల సుముఖత చూపకూడదు. వాటి నుండి ఉపశమించినవారై ఉండాలి. ఈ విధమైన మానసిక స్థితి ఉన్నవారికి యోగం సిద్ధించిందని నిర్ధారణ అవుతుంది. సర్వ విషయాల కామనారాహిత్యమే సంపూర్ణ యోగ స్థితి ఫలం. విశేషంగా సంయమించిన ఏకాగ్రతను పొందిన చిత్తం బాహ్య విషయ చింతనను విడిచి కేవలం ఆత్మయందే నిలిపిన వారిని యోగ యుక్తులు అంటారు.

6అ, 19శ్లో.

యథా దీపో నివాతస్థో నేంగతే సోపమా స్మృతా |
యోగినో యతచిత్తస్య యుంజతో యోగమాత్మనః ||

వాయుప్రసారములేనిచోట నిశ్చలముగానుండు దీపమువలె యోగికి వశమైయున్న చిత్తము పరమాత్మధ్యానమున నిమగ్నమైయున్నప్పుడు నిర్వికారముగా నిశ్చలముగా నుండును.

ధ్యాన యోగాన్ని అధిరోహించిన యోగారూఢులు ఎవరో, యోగసిద్ధులు ఎలా ఉంటారో నిర్ధారించిన జగద్గురువు అందుకు ఉపమను ఈ శ్లోకంలో ఉదహరించారు. ఒక అంశాన్ని మనకు అర్థం చేయించడానికి నిత్యజీవితంలో మనకు తెలిసిన మరో అంశాన్ని తీసుకొని పోల్చి చెప్పడం మన జగద్గురువుకు వెన్నతో పెట్టిన విద్య. అందుకే యోగసిద్ధిని నిర్ధారణ చేయడమే తడవుగా ఉపమను ఉద్బోధిస్తున్నారు. ఉపమ అనేది విషయాన్ని అర్థం చేయించడానికి చక్కగా సహకరిస్తుంది. వాతం అంటే గాలి నివాతం అంటే గాలి లేని చోటు అలాంటి 'నివాతస్థో' గాలి లేని చోట ఉంచిన దీపం అని అర్థం. వెలిగే దీపం కదలటం మనం చూస్తూ ఉంటాం, ఆ కదలటం అనే కార్యానికి హేతువు గాలి. గాలి వీచకపోతే దీపం చలించదు కదా గాలి వీచినప్పుడే దీపం కదులుతుంది. ఇంట్లో దీపం కదిలితే గాలి ఏ వైపు వస్తుందో చూసి గమనించి రానివ్వకుండా కిటికీలు తలుపులు మొదలైన వాటిని జాగ్రత్తగా మూసేస్తాం. అలా గాలిని లోనికి రానివ్వకపోతే అప్పుడు దీపం చలించదు. 'నఇంగతే నచలతి' నిశ్చలంగా ఉంటుంది. అదే నివాతస్థ దీపం అంటే గాలి లేని చోట ఉన్నది. ఇప్పుడు ఇదే అంశాన్ని మనకు సమన్వయం చేసుకుందాం.

ఇంట్లో బయట గాలి చొరబడనప్పుడు దీపం ఎలా చలనం లేకుండా ప్రకాశిస్తూ ఉంటుందో యోగి అంతఃకరణంలో చిత్త దీపం బాహ్యపు గాలులు తగలకుండా ఆత్మే లక్ష్యంగా ప్రకాశిస్తూ ఉంటుంది. దీపాన్ని బాహ్యంలోని గాలి చలింప చేస్తుంది మన చిత్తాన్ని బాహ్యంలోని అవసరం లేని విషయాలు విషయ వాసనలు చలింపజేస్తూ ఉంటాయి. ఇంట్లో దీపం కదిలితే బయట ఉన్న గాలి ఇంట్లోకి రాకుండా మనం ఎలా అయితే జాగ్రత్తగా మన తలుపులు కిటికీలు మూసుకున్నామో అలా బయట ఉన్న బాహ్య ప్రపంచపు అవసరం లేని విషయాలను, విషయ వాసనలను మనసు లోనికి ప్రవేశించనివ్వకుండా ఇంద్రియాల్ని నియమించడమే యోగాభ్యాసం చేస్తున్నటువంటి యోగి చేసేటటువంటి కార్యం. మనకు 6-12 శ్లోకంలో చెప్పినటువంటి యోగాభ్యాస విధానం ఇదే. అలా గాలి లేని చోట ఉన్న నిశ్చలమైన దీపం లాగా బాహ్య విషయాల గాలి సోకని చోట ఉన్న చిత్త దీపం నిశ్చలంగా 'యధావినియతం చిత్తం' లాగా ఉంటుంది. విషయ వాసనా గాలులు ఆగినప్పుడే ఆత్మ యోగంలో చిత్త దీపం చలించకుండా ఉంటుంది. చిత్త దీపం చలిస్తూ ఉంటే ఆత్మ యోగం అభ్యసించడం కుదరదు. అందువల్ల ఆత్మ యోగాన్ని అనుష్టిస్తున్న యోగికి గాలిలేని చోట నిశ్చలంగా ప్రకాశిస్తున్న దీపం దృష్టాంతంగా మనకు ఉదహరించారు.

6అ, 20శ్లో.

యత్రోపరమతే చిత్తం నిరుద్ధం యోగసేవయా |
యత్ర చైవాత్మనాత్మానం పశ్యన్నాత్మని తుష్యతి ||

ధ్యానయోగసాధనచే నిగ్రహింపబడిన చిత్తము ఉపరతిని పొంది, పరమాత్మను ధ్యానించుట ద్వారా పవిత్రమైన సూక్ష్మబుద్ధితో, ఆ భగవానుని సాక్షాత్కరింపజేసికొని, యోగి ఆ సచ్చిదానందఘనపరమాత్మయందే సంతుష్టుడగుచున్నాడు.

ధ్యానయోగం యొక్క స్వరూప స్వభావం ఈ శ్లోకం ద్వారా మనకు స్పష్టంగా తెలియ వస్తుంది. ధ్యాన యోగాభ్యాస బలం చేత ఏకాగ్రమై గాలి లేని చోట ఉన్న దీపంలా ప్రకాశించే చిత్తం గల యోగి బుద్ధి చేత సత్యజ్ఞానానంద స్వరూపమైన ఆత్మను సాక్షాత్కరించుకుని తన ఆత్మ యందే ఆనందాన్ని పొందుతున్నాడు. ధ్యానయోగభ్యాసంలో చిత్తం సర్వవృత్తులను వాటి సంస్కారాలను కూడా దగ్ధం చేసి సంపూర్ణ శాంతిని పొందుతుందని చూశాం. ఇదే యోగ శాస్త్రం ప్రతిపాదిస్తున్న 'నిరుద్ధం యోగ సేవయా' నిరుద్ధావస్థ, ఈ అవస్థతోనే మోక్ష ప్రాప్తి. ఇక్కడ మనం ఓ సూక్ష్మర్ధాన్ని అవగాహన చేసుకోవాలి. సర్వ వృత్తి రహిత స్థితిలో శుద్ధ చైతన్యం స్వప్రకాశమై శోభిస్తూ ఉంటుంది. అయినా ఇది బుద్ధికి సంబంధించిన జ్ఞానం కాదు, ఈ నిరుద్ధావస్థలో కొనసాగుతూ సదా అభ్యాసం చేస్తే అప్పుడు ధ్యానయోగం నెమ్మదిగా నిశ్చలమైన బుద్ధిని తయారు చేస్తుంది. అలా విశేషంగా శుద్ధి జరిగి విశుద్ధమైన నిశ్చలమైన బుద్ధిలో ఆత్మసాక్షాత్కరిస్తుంది. అంటే ఆత్మే అనంతమైనదిగా అఖండమైనదిగా సర్వకారణంగా మనకు తెలియ వస్తుంది. ఈ విధమైన జ్ఞానం మనకు కలగడానికి ధ్యానయోగం మొదటగా చిత్తాన్ని పరిశుద్ధం

చేసి ప్రతిబంధకాలను నిర్మూలించి తరువాత బుద్ధిలో నిశ్చలత్వాన్ని పెంపొందిస్తుంది. అలా విశుద్ధమైన బుద్ధి ఆత్మానుభూతికి సిద్ధమై ఆత్మసాక్షాత్కారాన్ని పొందుతుంది. చిత్తవృత్తులు పుడుతాయి లయిస్తాయి వీటికి రాకపోకలు ఉన్నాయి కాని ఆత్మకు అవేవీ లేవు అలాంటి ఆత్మను సాక్షాత్కరించుకోగలడమే మానవ జీవిత పరమార్థం. ఉదాహరణకు సముద్రంలో కెరటం లేస్తుంది పడిపోతుంది కెరటం లేవకముందు పడిపోయిన తరువాత కూడా సముద్రం ఉంది పోనీ కెరటం లేచిన క్షణంలో సముద్రం లేదా, సముద్రం లేకపోతే కెరటం లెయ్యదు కదా కెరటంలో ఉన్నది కూడా కెరటానికి ఆధారమైన కడలియే కదా. లేచిన ప్రతి అలకు సముద్రమే ఆధారం అయితే ఏ అల మీద కూడా సముద్రం ఆధారపడి లేదు కదా. తరంగాల తాండవంలోనూ అలలు ఆగిన దశలోనూ నిస్తరంగా తటస్థంగా దివ్యంగా శోభిస్తూనే ఉంది. ఇదే అంశాన్ని ఇప్పుడు మనకు మనం సమన్వయం చేసుకుందాం. మనలో వృత్తి పుడుతుంది లయిస్తుంది వీటికి రాకపోకలు ఉన్నాయి ఆత్మకు అలాంటి రాకపోకలు లేవు వృత్తి పుట్టిన దశలోనూ ఆగిన దశలోనూ పుట్టకముందు లయానంతరం కూడా ఆత్మ ఉంది. కాబట్టి సముద్రంలా ఆత్మ కూడా సర్వాధారమై నిరాధారంగా మనలో దివ్యంగా శోభిస్తూ ఉంటుంది. ఇది రాదు కనుక పోదు, పోదు కనుక రాదు, అందుకే అది స్వతఃసిద్ధం, సత్ స్వరూపం, సదాత్మ స్వరూపం, ఆనంద స్వరూపం సదా ఉంటుంది. సాధకుని స్వరూపం ఇదే, సాధకుడు సదా ఆత్మ అయి ఉంటాడు అయితే ఆత్మకు సంబంధించిన జ్ఞానం లేకుండా ఉన్నాడు. ఆ జ్ఞానం అందితే తానే ఆత్మ అని దర్శించి అఖండాత్మగా శోభిస్తాడు.

6అ, 21శ్లో.

సుఖమాత్యంతికం యత్తత్ బుద్ధిగ్రాహ్యమతీంద్రియమ్
వేత్తి యత్ర న చైవాయం స్థితశ్చలతి తత్త్వతః ||

బ్రహ్మానందానుభవము ఇంద్రియాతీతమైనది. పవిత్రమైన సూక్ష్మబుద్ధి ద్వారా మాత్రమే గ్రాహ్యమైనది. ఆ బ్రహ్మానందమును అనుభవించుచు దానియందే స్థితుడైయున్న యోగి పరమాత్మ స్వరూపము నుండి ఏమాత్రమూ విచలితుడు కానేకాడు.

ఆద్యంతాల మధ్య సాగే కర్మల ద్వారా కలిగే సుఖాలు కూడా ఆద్యంతాలు కలిగి ఉండటం వల్ల మనం కర్మల నుండి విడిపడలేకపోతున్నాం. దీనికి భిన్నంగా జ్ఞానం గల యోగులు శాశ్వత సుఖ సాగరంలో ఓలలాడుతూ ఆ స్థితి నుండి చలించకుండా ఉంటారు. శాశ్వత ఆత్మిక సుఖాన్ని సంప్రాప్తింపచేసుకోలేని వారు బ్రహ్మవిద్యను అభ్యసించని వారు కర్మల నుండి వేరు కాలేక కర్మలలోనే ఉంటూ అనేకరకాల దుఖాలకు లోనవుతూ ఉంటారు. ఆ శాశ్వత సుఖం ఎటువంటిది అంటే ఇంద్రియాలకు అతీతమైనది, బుద్ధి చేతనే గ్రహించగలిగేది, అనంతమైనది. ఇంద్రియాలకు అందనిది అంటే విషయేంద్రియాల వల్ల కలిగేవి కాదని అర్థం చేసుకోవాలి. అతీంద్రియం ఏ ఇంద్రియమునకు గోచరం కానిది. ఇంద్రియాలు ఐదు వాటి విషయాలు ఐదు కదా, శ్రోత్రాది జ్ఞానేంద్రియాలకు శబ్దాదులు విషయాలై ఉన్నాయి. ఆయా ఇంద్రియాలకు ఆయా విషయాలతో సంబంధం

ఏర్పడినప్పుడు కలిగే సుఖం అని అర్థం. ఈ విషయాలన్నీ మనం రెండవ అధ్యాయంలోని ఇంద్రియ ప్రకరణంలోనూ మూడవ అధ్యాయంలోనూ చూశాం. ఐదు ఇంద్రియాలు ఐదు విషయాలు అయినా సుఖం ఐదు రకాలుగా ఉండదు కదా సుఖం ఒక్కటే ఉంది ఈ శ్లోకంలో జగద్గురువు చెప్తున్న 'ఆత్యంతికం సుఖం' వీటి కంటే భిన్నమైనది. పరిమితమైన పరిణామ శీలమైనా మనసుచే నిర్ణయింపబడే అనిత్య విషయేంద్రియ సుఖాలు అత్యంత సుఖం ఎలా అవుతుంది. అందుకని ఆత్యంతిక సుఖం అంతం తెలియని సుఖం, అనంతమైనది. ఇంద్రియాలకు కలిగే విషయానుభవానికి ఆరంభం ఉంటుంది, అంతమూ ఉంటుంది. అలా ఒక ప్రదేశంలో లేదా ఒక కాలంలో ఒక వస్తువు ద్వారా కలిగే విషయేంద్రియ సుఖం కంటే విభిన్నమైనది అతీంద్రియమైనది, 'ఆత్యంతికం సుఖం'. ఇక బుద్ధి గ్రాహ్యం అన్నారు కదా మనం 3-42లో స్థూల శరీరం కంటే ఇంద్రియాలు, వీటి కంటే మనసు బుద్ధి ఒకదానికంటే ఒకటి సూక్ష్మమైనవి శ్రేష్టమైనవి అని చూశాం. ఆ బుద్ధి కంటే సూక్ష్మమైనది శ్రేష్టమైనది ఆత్మ అనే అంశాన్ని సమగ్రంగా అక్కడ చర్చించాం. ఆ అంశాన్ని ఇక్కడ సమన్వయం చేసుకుంటే సరిపోతుంది. ఆ సమన్వయం చేసుకున్న అవగాహనతో ఒక ఉదాహరణ చూసి ఈ శ్లోకాన్ని మనం అర్థం చేసుకుందాం. మనం ఒక వస్తువును లేదా ఒక రూపాన్ని చూసినప్పుడు ఆ వస్తువు ఇది అని గుర్తిస్తాం, చూసేది కన్నే అయినా మనసు గుర్తిస్తేనే దాని రూపం గాని ఆ వస్తువు ఇది అని గాని మనకు తెలుస్తుంది. ఆ వస్తువు లేదా ఆ రూపం కంటి ద్వారా మనసును చేరి మనసులో దానికి సంబంధించిన గుర్తింపు ఏర్పడి మనకు ఆ వస్తువు పేరు తెలియ వస్తుంది. అలాగే ఓ శబ్దాన్ని వింటే ఆ శబ్దం దేనికి సంబంధించిందో తెలుస్తుంది. ఇలా ఆయా విషయాల వివరాలు ఆయా ఇంద్రియాల ద్వారా మనం గుర్తిస్తాం. ఆ జ్ఞానంతో ఆ అవగాహనతో చూస్తే ఆత్మ సత్తుగా, చిత్తుగా, ఆనందంగా ఉండటం వల్ల ఆత్మ సంబంధమైన వృత్తి బుద్ధిలో కలుగుతూ ఉందేగాని ఆయా విషయాల విషయేంద్రియాల ద్వారా కాదనే సంగతి మనకు అవగాహన అవుతుంది. అందుకే అతీంద్రియమైన ఆత్మ బుద్ధి గ్రాహ్యం అంటున్నారు జగద్గురువు. ఇంద్రియాలతో సంబంధం లేకుండా కేవలం బుద్ధి చేత మాత్రమే జ్ఞానంతో మాత్రమే గ్రహించగలిగేది బుద్ధి. అందుకే ఆత్మ బుద్ధి గ్రాహ్యం, బుద్ధితో గ్రహించగలిగేది. ఆత్యంతిక సుఖరూపుడైన యోగి ఆత్మ స్వరూపమందే సుప్రతిష్టమై ఉంటాడు.

6అ, 22శ్లో.

యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః |
యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాపి విచాల్యతే ||

పరమాత్మప్రాప్తిరూపలాభమును పొందినవాడు (అనగా భగవత్సాక్షాత్కారమును పొందినవాడు) మఱేయితర లాభమునుగూడ దానికంటె అధికమైన దానినిగా తలంపడు. బ్రహ్మానందానుభవస్థితిలోనున్న యోగిని ఎట్టి బలవద్దుఃఖములును చలింపజేయజాలవు.

ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ప్రతి ఒక్క విషయంలో లాభం కోసమే ప్రయత్నిస్తూ ఉంటారు. తాను ఆశించిన లాభం వచ్చినా అంతకన్నా ఎక్కువ లాభం రావాలని అభిలషిస్తారు. లాభాలు సుఖ పెడతాయని భావించడం వల్ల భ్రమించడం వల్ల వాటిని వెంబడిస్తూ వాటికోసం పరితపిస్తూ ఉంటారు. పోనీ ఆశించిన ఫలితం వచ్చినా మనిషిలో లాభాలపై ఆసక్తి తగ్గడం లేదు, ఎందుకంటే ఈ దృశ్యమాన ప్రపంచంలో ఏ లాభం వచ్చినా నష్టాన్ని వెంటబెట్టుకునే వస్తుంది. కాబట్టి ఈ ప్రపంచంలో మనం పొందేవన్నీ నష్టాలే గాని లాభాలు కావు, మనం అనుభవించేవన్నీ దుఃఖాలే కాని సుఖాలు కావని మనకు తెలియాలి. మరి ఏది లాభం ఏది సుఖం అంటే ఆత్మే లాభం, ఆత్మే సుఖం. ఏ లాభాన్ని గడించినా అది అంతమైపోతూనే ఉంటుంది కనుక ఒకదాని తరువాత మరొకటి పరంపరగా లాభాలను గడించే ప్రయత్నంలో మనిషి తలమునకలవుతూ ఉన్నాడు. అయితే ఏ లాభాన్ని పొందితే అంతకుమించిన లాభాన్ని ఆశించడం ఉండదో అలాంటి లాభాన్ని గురించి మనం ఆలోచించాలి, అన్వేషించాలి, ఆశ్రయించాలి. ఇంద్రియాలకు గోచరం కాని అత్యంత సుఖాన్ని ఇచ్చే బుద్ధి మాత్రమే గ్రహించగలిగినది ఆత్మిక లాభం. దేన్ని పొందితే మరొక లాభాన్ని పొందాలని మనిషి అభిలషించడో అలాంటిది ఆత్మిక లాభం. ఇది నిత్య లాభమే గాని అనిత్య లాభం కాదు. ఆత్మిక లాభం రాకపోకలు కలిగినది కాదు, అది అనంతమైన ఆత్మిక లాభాన్ని ప్రసాదిస్తుంది. ఆత్మిక లాభం ఆత్యంతికమైనది, అనంతమైనది కాబట్టి దాన్ని పొందిన తరువాత అంతకంటే అధికమైన మరొకదాన్ని పొందాలనే భావనే మనకు స్ఫురించదు. అది పూర్ణ రూపమైన ఆత్మను పొందడంలో ప్రాప్తించే అనంతమైన సంతృప్తి. ఆత్మ లాభం కన్నా మించిన లాభం మరొకటి లేదు అని భగవద్గీత శాస్త్రం నిర్ణయించింది, నిర్దేశించింది, ఆజ్ఞాపిస్తోంది. చెయ్యాల్సిన ధ్యానయోగ అభ్యాసం మనం చేస్తున్నప్పుడు పొందవలసిన లాభం ఖచ్చితంగా పొంది తీరుతాం. ఆత్మ లాభాన్ని పొందిన వారికి సర్వ లాభాలు సిద్ధించినట్లే మరొక లాభాన్ని ఆశించే అవకాశమే లేదు అందుకే జగద్గురువు 'యం లబ్ద్వాచ అపరం లాభం' అన్నారు. అట్టి ఆత్మిక లాభంలో స్థితులైన వారు ఎంత పెద్ద దుఃఖం చేత కూడా చలించరు. గురు శబ్దానికి అనే కారణాలు ఉన్నాయి ఇక్కడ పెద్దది బరువైనది భరించలేనిది దుర్భరమైనది అని అర్థాల్ని తీసుకోవాలి. అలాంటి దుర్భరమైన దుఃఖం కూడా ఆత్మవిధుని ఆత్మస్థులైన వారిని చలింప చెయ్యలేవు. దుఃఖం అనేది అంతఃకరణ లక్షణమే గాని ఆత్మ లక్షణం కాదు అందుకే ద్వంద్వాలు ఆత్మను అంటలేవు. దుఃఖం అనేది సమస్య కాదు తాను ఆత్మ అన్న జ్ఞానం లేకపోవడమే సమస్య. కాబట్టి కర్మయోగ ధ్యాన యోగాలలో క్రమంగా పరిపక్వతను సాధించి ఆత్మజ్ఞానంతో ఆత్మసాక్షాత్కారం అనే అనంత లాభాన్ని సిద్ధింప చేసుకుందాం. ఆత్మ లాభానికి మించిన లాభం మరొకటి ఉండదు.. ఇది పరమానంద స్థితి కావడం వల్ల ఎంత గొప్ప దుఃఖమైనా ఆత్మ జ్ఞానిని చలింప చెయ్యలేవు.

6అ, 23శ్లో.

తం విద్యాద్దుఃఖసంయోగవియోగం యోగసంజ్ఞితమ్ |
స నిశ్చయేన యోక్తవ్యో యోగో నిర్విణ్ణచేతసా ||

దుఃఖరూపసంసారబంధములనుండి విముక్తిని కలిగించు ఈ స్థితిని (భగవత్సాక్షాత్కారరూపస్థితిని) యోగము అని తెలియవలెను. అట్టి యోగమును దృఢమైన, ఉత్సాహపూరితమైన అనిర్విణ్ణ (విసుగులేని) చిత్తముతో నిశ్చయముగా సాధన చేయవలెను.

20వ శ్లోకంలో ధ్యాన యోగ అభ్యాసం ద్వారా శాంతించిన చిత్తం యొక్క స్వరూప స్వభావాన్ని వివరించి 21 నుండి 23 వరకు కూడా ధ్యానయోగి యొక్క స్థిర చిత్తం వైభవాన్ని విశేషంగా వివరించారు. అలాంటి యోగాన్ని తెలుసుకో అని ఈ శ్లోకంలో ఆదేశిస్తున్నారు. దుఃఖంతో సంయోగం దుఃఖ సంయోగం దాని నుండి విడిపడటమే వియోగం దానికే యోగం అని పేరు. దుఃఖం అనేది యోగ లక్షణం కాదు కాబట్టి దాన్ని వీడాలి, వియోగం చెందాలి అని ఈ శ్లోకం వివరిస్తుంది. అంటే ఈ అంశాన్ని సంయోగ వియోగం అనే విపరీత లక్షణ సూత్రం ద్వారా తెలుసుకోమని మనకు అర్థమయ్యేటట్లు పేర్కొన్నారు. వియోగాన్ని కూడా యోగంగా చెప్పడం అనేది విపరీత లక్షణం. దృక్ దృశ్య సంబంధమే దుఃఖానికి కారణం, బ్రహ్మవిద్య అధ్యయనం లేకపోవడమే అందుకు కారణం. దుఃఖాలతో సంబంధం కలిగి ఉండటం సంయోగం, దాని నుండి విడిపడిపోవడం వియోగం. ఇదే దుఃఖ సంయోగ వియోగం దీన్నే జగద్గురువు 'యోగసంజ్ఞితమ్' అంటున్నారు. మనం ధ్యాన యోగంలో స్థిర చిత్తంతో కొనసాగాలని ఇన్ని విధాలుగా మనకు ఉద్బోధిస్తున్నారని మనం గమనించాలి. ఇంతకూ విపరీత లక్షణం అంటే అర్థమేంటి ఉదాహరణకు కొబ్బరి చెట్టులోనూ మామిడి చెట్టులోనూ ఏదైనా సరే అబ్బో ఎంత కాయలు కాశాయో చెట్లనిండా కాయలే ఆ చెట్టులో ఎన్ని కాయలు ఉన్నాయో లెక్క పెట్ట అలవికానన్ని కాయలు కాసింది ఆ చెట్టు అని అంటూ ఉంటాం. అలాగే ఒక పువ్వు కూడా పూయని చెట్టును చూసి ఈ చెట్టు ఎంత నిండుగా పూలు పూశాయో అంటూ ఉంటాం. దీని అర్థం కాయలు కాయాల్సిన చెట్టు అసలు కాయలు కాయ లేదని పువ్వులు పూయాల్సిన చెట్టు అసలు పువ్వులు పూయలేదని చెప్పడానికి ఇలాంటి భావాల ద్వారా మనం వ్యక్తపరుస్తూ ఉంటాం. ఇది విపరీత లక్షణం. ఇలా జగద్గురువు వియోగాన్ని కూడా యోగం అని విపరీత లక్షణార్థం లో ఉటంకించారు. ఈ శ్లోకంలో చెప్పిన వియోగాన్ని కూడా యోగంగా అభ్యసించాలి. ఎలా అంటే నిశ్చయైన నిశ్చయ జ్ఞానంతో ప్రామాణికమైన గురువు ఆధ్వర్యంలో గాని స్వీయ అధ్యయనం ద్వారా గాని సంశయానికి అవకాశం లేకుండా నిశ్చయింపబడిన జ్ఞానంతో సశాస్త్రీయమైన సద్గురుపదేశ జనిత జ్ఞానాన్ని అభ్యసించాలి. ఏ విధంగా అంటే నిర్వేదం చెందని చిత్తంతో అంటే నిరాశ నిస్పృహ నిరుత్సాహం విసుగు లాంటి వాటిని నిర్వేదం అంటాం. ధ్యాన యోగాభ్యాసానికి ఈ నిర్వేదం లేని మనసు ఉండాలని జగద్గురువు ప్రతిపాదన. అలాగే మరో అంశం ఏమంటే చాలామంది నేను ఇంత కాలంగా ధ్యాన యోగాన్ని అభ్యసిస్తూనే ఉన్నాను

అయినా ఫలితం సిద్ధించలేదని నిరాశ నిస్పృహ భావాన్ని వ్యక్తం చేస్తుంటారు ఇదే నిర్వేదం అంటే. ఇలాంటి నిర్వేదం లేకుండా నిత్యోత్సాహంతో సదా అభ్యసించడమే అనిర్వేద చిత్తం. అలాంటి నిశ్చయం, అనిర్వేదం మనలో ఉన్నప్పుడే మన బుద్ధి ఉత్సాహంగా ధ్యానయోగాభ్యాసంలో ఉంటుంది. మనం సాధనలో ఎంతటి క్లిష్ట పరిస్థితులు సంభవించినా నిర్వేదం చెందకుండా పట్టు విడవకుండా ధ్యానతపస్సులో ముందుకెళ్లాలి.

6అ, 24శ్లో.

సంకల్పప్రభవాన్ కామాన్ త్యక్త్వా సర్వానశేషతః ।
మన సైవేంద్రియగ్రామం వినియమ్య సమంతతః ||

సంకల్పములవలనకలిగిన కోరికలనన్నింటిని నిశ్శేషముగా త్యజించి, ఇంద్రియ సముదాయములను అన్నివిధములుగ మనస్సుతో పూర్తిగా నిగ్రహింపవలెను.

6అ, 25శ్లో.

శనైః శనైరుపరమేత్ బుద్ధ్యా ధృతిగృహీతయా ।
ఆత్మసంస్థం మనః కృత్వా న కించిదపి చింతయేత్ ॥

క్రమక్రమముగా సాధనచేయుచు ఉపరతిని పొందవలెను. ధైర్యముతో బుద్ధిబలము మనస్సును పరమాత్మయందు స్థిరమొనర్చి, పరమాత్మను తప్ప మఱి ఏ ఇతర విషయమును ఏ మాత్రమూ చింతన చేయరాదు.

ధ్యానయోగాన్ని అనుష్టించే వారి ఆసనం మొదలైన అంశాలు ధ్యాన యోగాన్ని పొందిన వారి లక్షణం ధ్యానయోగం యొక్క ఫలం యోగం యొక్క స్వరూప స్వభావాలు తెలుసుకున్నాం. ఈ శ్లోకంలో ధ్యానయోగాభ్యాసంలో అవలంబించాల్సిన విధానాన్ని బాహ్య ప్రపంచం వైపుగా పరుగులెత్తే మనసును నెమ్మదిగా ఎలా దారిలోకి తెచ్చుకోవాలో మనకు ఈ శ్లోకం వివరిస్తుంది. బాహ్య సంబంధపు సమస్తమైన కోరికల్ని నిశ్శేషంగా విడిచి పెట్టాలి. 'సంకల్ప ప్రభవాన్ కామాన్' ఇదే అంశాన్ని మనం 'ప్రజహాతి యధా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్' అని 2-55లో, 'సర్వసంకల్పసన్న్యాసీ యోగారూఢస్తదోచ్యతే' అని 6-4 లో చూశాం. ఇక్కడ నిశ్శేషంగా త్యజించాలి. కోరికలు మనలో మిగిలి ఉంటే తిరిగి అవి ప్రభవించే అవకాశం ఉన్నందున ఈ అంశంపై ప్రత్యేక దృష్టి నిలిపి నిశ్శేషంగా తొలగించాలనే అంశాన్ని మనం ముందుగా గ్రహించాలి. మనసైవేంద్రియ గ్రామం అన్నారు ఇక్కడ గ్రామం అంటే సమూహం అని అర్థం. 'వినియమ్య సమంతతః' అన్నారు వివేకయుక్తమైన మనసుతో అన్ని వైపుల నుండి వెనక్కు తిప్పి

ఇంద్రియ సమూహానంతటిని ఆత్మస్థం చేయాలి. అలా మెల్లమెల్లగా ఇంద్రియాలను ఆయా విషయాదుల నుంచి బాహ్యం వైపుగా పరుగులెత్తే వాటిని సమ్యమింపజేసి ఆత్మలో స్థాపితం చేయగల శక్తి బుద్ధికి ఉంది. 3-42లో 'మనసస్తు పరా బుద్ధిః' అని బుద్ధి యొక్క స్వరూప స్వభావాన్ని సమగ్రంగా చూశాం. అజ్ఞానులు మనసు చెప్పినట్లు వింటారు వారిలో బుద్ధి నాడి చైతన్యవంతం కాలేదు కాబట్టి. కానీ యోగులు బుద్ధి చెప్పినట్లు మనసు ఇతర ఇంద్రియాలు కూడా వింటాయి. అందుకే జగద్గురువు ఇక్కడ 'బుద్ధ్యా ధృతిగృహీతయా' అంటున్నారు. అంటే ధైర్యంతో కూడిన బుద్ధితో మనసును స్వాధీనపరచుకోవాలి. అయితే ఈ కార్యంలో తొందరపాటు లేకుండా శనైః శనైః మెల్లమెల్లగా మనసును లాలిస్తూ బుద్ధి చెబుతూ వివేకంతో ఆయా ఇంద్రియాల నుంచి విరమింపజేసి బాహ్య ప్రపంచం నుండి అంతర్ముఖం చేయాలి. ఎలా అంటే మనందరికీ తెలిసిన స్లో అండ్ స్టడీ విన్ ది రేస్ అన్న ఆంగ్ల సామెతను అనుసరించి వాటిని సాధించుకోవాలి. అలా నెమ్మదిగా మెల్ల మెల్లగా ఆత్మయందు మనసును నిలిపి అన్యమైన వాటిని చింతించకుండా ఆత్మసంస్థం అంటే మనసును ఇంద్రియ సమూహాన్ని ఆత్మలో ఉంచడం. అలా ఉంచితే మనసు ఆంతర్యంలో తన మూలమేమిటో అన్వేషిస్తూ ఆ వైపుగా పయనిస్తుంది. ఇది చాలా జాగ్రత్తతో అవధానంతో అర్థం చేసుకోవాల్సిన అంశం. ఇది జ్ఞాతృ జ్ఞానం జ్ఞేయం భేదం లేని అఖండ ప్రకాశిక స్వరూప జ్ఞానం. ఈ స్థితిలో మనసును లయం చేయించడమే "ఆత్మ సంస్థం'. ఇందులో మనం గ్రహించాల్సిన అంశాలు మనలోని బాహ్యపు కోరికలను వాసన కూడా మిగలకుండా నిర్బీజం చేసి వివేకం కలిగిన మనసుతో ఇంద్రియ సముదాయాన్ని అన్ని వైపుల నుండి సమ్యమింప చేయాలి. ధైర్యమైన బుద్ధితో నెమ్మది నెమ్మదిగా ఉపరతిని పొందాలి. ఆత్మే సర్వమని నమ్మి దానికంటే అన్యమైనది మరొకటి ఏదీ లేదని మనసును ఆత్మస్థం చేయాలి.

6అ, 26శ్లో.

యతో యతో నిశ్చరతి మనశ్చంచలమస్థిరమ్ |
తతస్తతో నియమ్యైతత్ ఆత్మన్యేవ వశం నయేత్ ||

సహజముగా నిలుకడలేని చంచలమైన మనస్సు ప్రాపంచిక విషయములయందు విశృంఖలముగా పరిభ్రమించుచుండును. అట్టి మనస్సును ఆయా విషయములనుండి పదేపదే మఱల్చి, దానిని పరమాత్మయందే స్థిరముగా నిల్పవలెను.

మనం ధ్యాన యోగాభ్యాస విధానాల్లో శ్వాస మీద ధ్యాసను ఉంచాలని మధ్యలో ఆలోచనలు వస్తే మళ్లీ మళ్లీ మన ధ్యాసను శ్వాస మీదకు మరల్చాలని చెప్పుకున్నాం, ఆ అవగాహనతో ఈ శ్లోకాన్ని సమన్వయం చేసుకోవాలి. యోగమంటే భౌతిక శరీరాన్ని అనుకున్న విధంగా ఆసనం వేసి కూర్చోబెట్టడం మాత్రమే కాదు, యోగం అంటే ఐక్యం చెందడం, మనతో మనం మనలోకి మనం ఐక్యం కావడం. మనం నిత్యం ఈ ప్రపంచంతో వ్యవహారం కొనసాగించాలి, కొనసాగిస్తూ ఉన్నాం కూడా ఇది అనివార్యం. మన మనుగడ ఈ ప్రపంచం తోనే ముడిపడి ఉంటుంది, ఉంది కూడా అయితే మన మనసు అందుకు అనుగుణంగా

ఉండిపోతే ఇబ్బంది లేదు మన మనసు ఈ ప్రపంచానికి ఈ విశ్వానికి వ్యతిరేకంగా ఉండకూడదు కదా. మనం ప్రతి చిన్న విషయానికే కృంగిపోతూ ఉంటాం మన ఆలోచన భావాన్ని మనమే నిర్దేశించుకోవాలి. ఈ భౌతిక ప్రపంచంతో ఈ విశ్వంతో తలపడటం అన్నది అర్థం లేని ఆలోచన కాబట్టి మనం అన్నింటినీ సాక్షిగా గమనిస్తూ ఉండాలి. మనకు వీలైతే సహాయం చేయాలి లేదా మౌనం వహించాలి అంతేగాని ప్రకృతికి వ్యతిరేకంగా ప్రకృతి సహజ సిద్ధమైన జీవన విధానానికి వ్యతిరేకంగా మనం ఉండకూడదు. మనకు ప్రాణాధారమైన శ్వాసతో కూడి ఉండటం అనేది నిరంతరం మనం ఉండవలసినటువంటి సహజ స్థితి. అయితే మనం అందుకు భిన్నంగా వ్యతిరేకంగా వ్యవహరిస్తూ ఉంటాం కారణం బాహ్య ప్రపంచం పై ఉన్నటువంటి భ్రాంతితో కూడుకున్నటువంటి ఆలోచన. స్వాభావికంగా మనసు చంచలమైనది అందుకే అది అస్థిరం, ఇది శబ్దాది విషయాల వైపు ఎటుపడితే అటు వెళ్లిపోతూ ఉంటుంది. వాటిని మనం గమనించి అటువైపు నుండి నియమించి వాటికి ఆయా విషయాల అసలు స్వరూపం బోధించి నిరూపించి అవి భ్రమే కాని వాస్తవం కాదనే యదార్ధాన్ని వివరించి చూపించి అది వెళుతున్నటువంటి దారి నుంచి వెనక్కు మళ్ళించి ఆత్మస్థం చేయాలి. అయితే అది మనసు స్వభావం కదా కాబట్టి స్వభావాలు మనం అనుకున్నంత తేలికగా మారవు, స్వభావాన్ని అతిక్రమించడం కష్టమే అందుకే అనేకమంది మనుషుల స్వభావాలను చూసి మనం చింతిస్తూనే ఉంటాం. మనలో నిశ్చలంగా ప్రకాశించాల్సిన ఆత్మ దీపం చలిస్తూ ఉంటుంది, అంటే అలా చలించడం వెనుక కారణం ఉంది. గాలి వీస్తూ ఉంటే దీపం చలించకుండా ఉండలేందు కదా అలా మనసులో కూడా విషయ వాసనా గాలులు వీస్తూ ఉండటం వల్ల మనసు చలిస్తుంది అందుకే ధ్యానయోగ అభ్యాసం తప్పనిసరి. అలా మనం ధ్యానంలో ఉన్నప్పుడు మనసు తనకు తానుగా బయటకు వెళ్ళదు కానీ అలవాటుగా పూర్వ వాసనలు బలవంతంగా బాహ్యానికి ఈడుస్తున్న కారణంగా అలా మనసు పరుగులెత్తుతూ ఉంటుంది. అది ఆంతర్యంలో ఉండలేని పరిస్థితిని కల్పిస్తుంది. అందుకని మనం ఆయా విషయాల వాస్తవ స్వరూపాన్ని మనసుకు దర్శింపజేసి విచారణతో నిరూపించాలి. అవి నిస్సారమైనవని సశాస్త్రీయంగా మనం మన మనసుకు అర్ధమయ్యేలా బోధించాలి. అలా మెల్ల మెల్లగా మనసును ఆయా విషయాల నుండి విరమింపజేసి మన లక్ష్యమైన ఆత్మలో స్థిర పరచాలి, ఆత్మసంస్థం చేయాలి. ఈ ప్రపంచం ఎప్పుడూ కూడా మన మనసును హరింపజేస్తూనే చలింపజేస్తూనే ఉంటుంది. కాబట్టి నిత్య జాగురూకత అవసరం మనసుకు స్థిరత లేదు, దానికి సుస్థిరత తెలియదు. అయితే అలాంటి మనసుకు విషయాల యదార్థ స్వరూపాన్ని తెలియజేయడం మన బాధ్యత, ఓ మనసా ఈ ప్రపంచం మనం రాకముందే ఉంది, మనం పోయిన తర్వాత కూడా ఉంటుంది, మనం వచ్చినప్పుడు ఏమి తీసుకురాలేదు కదా, మనం వెళ్లేటప్పుడూ అంతే. ఎవరికి సంబంధించని ఈ ప్రపంచాన్ని అందరూ తనదేనని భావించడం హాస్యాస్పదం, అందుకని మళ్లీ మళ్లీ మన మనసుకు గుణపాఠం చెప్తూనే ఉండాలి. మనం అద్దంలో చూసి ఎంత మురిసిపోయినా మనం అద్దంలో లేమనేది వాస్తవం. అద్దంలో ఉన్నది మన ప్రతిబింబమే గాని మనం కాదుగా మరి అయితే అద్దానికి అలంకరించాలనుకోవడం మన అజ్ఞానమే. అందుకని అనిత్యాలను వాటేసుకుంటే అవి మనల్ని కాటేస్తాయి. మనం కొన్ని క్షణాలు ఈ భూమి పై ఉండి మాయమవుతాం, అలా అవుతున్న అందరినీ చూస్తూనే ఉన్నాం కూడా, కానీ మనం జీవితాన్ని మనమే నరకప్రాయం చేసుకుంటున్నాం. మనం ఉన్నది స్వర్గంలోనే ఇది సత్యం, గీతా

స్వరూపులారా గీతా సాధకులారా ఈ భూమండలమే స్వర్గం ఇక్కడ ఉన్నన్ని అందాలు భూమి, ఆకాశం, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, పర్వతాలు, జలపాతాలు కొండలు, కోనలు, వాగులు, వంకలు, పక్షుల రావాలు, సేలలు, నదులు ఎన్నో ఎన్నెన్నో ఇంతటి అందమైన ప్రకృతి మరే తలంలో లేదు. అలాగే మనకున్న అత్యద్భుతమైన శక్తులు మరెవ్వరికీ ఉండవు. ఇంతటి భూతల స్వర్గం మరే లోకంలోనూ లేదు, ఓ మనిషి కంప్యూటర్ కనిపెట్టావు ఖగోళాన్ని గాలించావు ఈ ప్రపంచంలో ఉన్న సకల వస్తువులను నువ్వే తయారు చేశావు, చేస్తున్నావు అంతరిక్షమంతా శోధిస్తున్నావు రోజురోజుకు ఎదుగుతున్నావు అలాంటి మేధ గల నువ్వు నీ శక్తిని మరచిపోయి అనిత్యాల వెంట వెళ్ళకు, నీ శక్తి అపారం, నీ యుక్తి అనంతం, అందుకే నువ్వు వెనక్కు రా, ధ్యానంలో నిమగ్నమవ్వు, ధ్యాన యోగంలో ధన్యత పొందుతావు. లోకాగానం వద్దు, గీతాగానం ముద్దు. అందుకే నువ్వు ఆత్మలోనే ఆత్మతోనే రమించు, గీత తోనే కూడి ఉండు. గీతా సాధన చెయ్యి, గీతను వదలకుండా గట్టిగా పట్టుకున్నప్పుడు ఆ భగవంతుడే మనల్ని ఆ గీతామార్గంలో భగవంతుని దగ్గరకు చేర్చుకుంటాడు. నా మనసుకు ఉద్బోధించి ఆయా విషయాల నుంచి విరమింపజేసి యోగంలో ఆత్మస్థం చేసే అభ్యాసం చేయాలి. ఇలా మనం మన మనసుకు బుద్ధి చెప్పాలి.

6అ, 27శ్లో.

ప్రశాంతమనసం హ్యేనం యోగినం సుఖముత్తమమ్ |
ఉపైతి శాంతరజసం బ్రహ్మభూతమకల్మషమ్ ||

ప్రశాంతమైనమనస్సు కలవాడును, పాపరహితుడును, రజోగుణము శాంతమైనవాడును, అనగా ప్రాపంచిక కార్యములయందు ఆసక్తి తొలగినవాడును, సచ్చిదానంద ఘనపరమాత్మయందు ఏకీభావమును పొందినవాడును అగు యోగి బ్రహ్మానందమును పొందును.

ప్రశాంతమైన మనస్సు గల యోగి నిరతిశయ సుఖం పొందుతారు. ఇక్కడ విశేషం ఏమంటే ఆ నిరతిశయమైనటువంటి శ్రేష్టమైనటువంటి సుఖమే యోగిని పొందుతూ ఉంది అని చెప్పడం యోగి యొక్క వైభవాన్ని చాటుతూ ఉంది. ఆత్మానందం అనేది తాత్కాలిక కోరిక లాంటి వృత్తి రూపమైనవి కావు. ఇది స్వరూపానికి సంబంధించింది, అపరిమితమైనది, నిత్యమైనది, అఖండమైనది. సమస్త సుఖాలకు కారణం, ఆధారం ఆత్మే. అలాంటి ఆధారమైన ఆత్మ సుఖం ధ్యానయోగ అభ్యాసంలో మనలో మనమే పొందుతాం. అంటే ధ్యాన యోగ అభ్యాసం ద్వారా ఆత్మ దర్శనం అయినటువంటి యోగిని ఆ ఉత్తమ సుఖమే వరిస్తుంది. ఈ శ్లోకంలో మనం నాలుగు అంశాలను సంక్షిప్తంగా చూస్తే సరిపోతుంది. ఎందుకంటే మనం ఆరు అధ్యాయాలుగా చర్చించుకున్నటువంటి సమగ్రమైన ఆత్మిక అవగాహన మనకు ఉండడం వల్ల మనం ఈ శ్లోకంలోని నాలుగు అంశాలను సంక్షిప్తంగా సూక్ష్మ దృష్టితో పరిశీలిస్తే మనకు అవగాహన అవుతుంది.

ఒకటి ప్రశాంత మనసం, రెండు శాంత రజసం, మూడు అకల్మషులు, నాలుగు బ్రహ్మభూతులు. ప్రశాంత మనసం అంటే ధ్యాన యోగ అభ్యాసంలో శాంతించిన మనసు ఆత్మ సంబంధమైన ఉత్తమమైన నిరతిశయమైన సుఖాన్ని అనుభూతిస్తుంది. రెండు శాంత రజసం, నిరంతర ధ్యాన అభ్యాసం అనిర్వేదంతో నిశ్చయంతో నిత్యం చేసే అభ్యాసం. అలా సదా నిత్య ధ్యాన యోగంలో మనలోని రజోగుణం, తమోగుణం తొలగిపోయి కామ, క్రోధ, లోభ మోహాదులనుండి ఉపశమించిన వారు శాంత రజసులు. శుద్ధ సాత్విక స్వభావులు.

మూడు అకల్మషులు, అకల్మషులు అంటే ఎలాంటి కల్మషాలు లేనివారు, అధర్మానికి పాపాలకు పాల్పడని వారు, రాగద్వేషాధిత్వాలను నిశ్శేషంగా త్యజించినవారు వాటి నుండి విడిపడిన పవిత్రమైన మనస్సు కలవారు. బాహ్య ప్రపంచపు ఆలోచనలు శూన్యమైన ప్రశాంతమైనటువంటి చిత్తం కలవారు, బ్రహ్మభూతులు, సర్వం బ్రహ్మమే అనే నిశ్చయ జ్ఞానం కలవారు. బ్రహ్మం లేదా దైవం మన నుంచి వేరు కాదనే సంగతి మనకు అనుభవేద్యం కావాలి. బ్రహ్మమనేది మన నుంచి అన్యమైనది కాదు, మానవుడి యొక్క మనిషి యొక్క ప్రతి కణంలోనూ ప్రతి కదలికలోనూ ఉన్నది దైవమే, బ్రహ్మమే. నిజానికి ఉన్నది దైవమే మనం కాదు ఏది ఉందో అదే దైవం, ఏది లేదో అదే మనం. సృష్టికి కారణం దైవం అనడం కంటే సృష్టే దైవం అని మనం గ్రహించాలి. ఈ సృష్టే దైవంలో ఉంది ఆ ఉన్న దాని పేరే సృష్టి, అదే దైవం. ధ్యాన యోగాభ్యాసం ద్వారా అర్హత పొందిన ఎవరైనా దైవంలో లీనం కావచ్చు. అలా లీనం కావడమే దైవాన్ని పొందడం అంటే. అలా లీనమైన వారు, బ్రహ్మన్ని పొందినవారు బ్రహ్మభూతులు. బ్రహ్మం అంటే ఏమిటో మనం సర్వ ప్రాణులలో ఉన్న బ్రహ్మన్ని ఎలా దర్శించాలో అనే అంశాలు మూడవ అధ్యాయంలో ప్రమాణ పూర్వకంగా నిరూపించుకున్నాం కూడా. ఆ అవగాహనతో ఈ శ్లోకాన్ని అర్థం చేసుకోవాలి. అలా తానే బ్రహ్మ అయివుండి విశ్వవ్యాపక దైవ శక్తిని పొందిన బ్రహ్మభూతులు ఉత్తమమైనటువంటి సుఖం పొందుతారు.

6అ, 28శ్లో.

యుంజన్నేవం సదాత్మానం యోగీ విగతకల్మషః |
సుఖేన బ్రహ్మసంస్పర్శమ్ అత్యంతం సుఖమశ్నుతే ॥

పాపరహితుడైన ఆ యోగి పూర్వోక్తరీతిగా నిరంతరము ఆత్మను పరమాత్మయందే లగ్నమొనర్చుచు, పరబ్రహ్మపరమాత్మప్రాప్తిరూపమైన అపరిమితానందమును హాయిగా అనుభవించును.

ఆత్మను తెలియడమే ఆత్మను పొందటం అదే మోక్షం అని ఆరు అధ్యాయాలుగా మనం చూస్తున్నాం. ఆత్మ సాధ్యం అయితే జ్ఞానం సాధనం, ఇది ఆత్మ అన్వేషణ విశ్లేషణ ద్వారానే జరగాలి. అందుకు కావలసిన ఉపకరణాలు సూత్రాలు మనం నెమ్మదిగా

అభ్యసిస్తూ ఉన్నాం. అలా మనం ఆయా సూత్రాలకు అనుగుణంగా ఆయా ఉపకారణాలతో ధ్యానయోగాభ్యాసం చేసి అంతఃకరణం శుద్ధి చేసుకోవాలి. సదా మనసును ఆత్మయందే ఉంచి ఆత్మసాక్షాత్కారాన్ని పొందాలి. అప్పుడు తానే ఆత్మ అని దర్శితమవుతుంది. అందుకు మనలో కొనసాగే ధ్యానయోగ సాధన అంతరాయం లేకుండా కొనసాగాలి. అందుకు రెండు అంశాల్ని ప్రబోధిస్తున్నారు, ఒకటి విగత కల్మషః, పాప రహితులు కావాలి. రెండు సదా అంటే నిరంతరాయంగా మనసును ఆత్మయందే ఉంచాలి. ఈ రెండు అంశాలను మనం మనకున్న ఆరు అధ్యాయాలు సమగ్రంగా చర్చించిన అనేక అంశాల ఆధారంగా సంక్షిప్తంగా చూస్తే సరిపోతుంది. ఓ ప్రవాహంలా కొనసాగాల్సిన ధ్యానయోగ సాధనలో అంతరాయాలు ఉంటే ధ్యాన యోగ అభ్యాసం కొనసాగదు, ప్రతిబంధకాలు ఉన్నప్పుడు సాధన కుంటుపడుతుంది. ఈ ప్రతిబంధకాలు ఏ విధంగా ఉంటాయో స్థూలంగా కొన్నింటిని చూద్దాం.

ఒకటి అనారోగ్యం , శరీర వ్యవస్థను మనం సరైన దిశగా కాకుండా అపసవ్య దిశలో నడిపినప్పుడు తగిన ఆహార విహారాధులు దానికి అందివ్వనప్పుడు శరీర వ్యవస్థ, పరిస్థితి విషమిస్తుంది, అది మనల్ని వ్యతిరేకిస్తుంది. అందుకే మనం ప్రత్యేకించి యుక్తాహార విహారాలను గురించి చాలా సమగ్రంగా చర్చించాం. అలాగే మన శరీరం అనే అద్భుతమైన యంత్రాన్ని ఆపరేట్ చేసే విధానం అంటే నడిపే విధానం మనకు తెలియకపోవడం. అందుకే మనం సాంఖ్యయోగంలో మన శరీర వ్యవస్థకు పని తీరును అనేక ప్రమాణాలతో చర్చించాం. శరీరం పుట్టుక విధి విధానాల్ని చూశాం. త్రిగుణాలు, 24 తత్త్వాలు ఆయా తత్త్వాల పనితీరును సమగ్రంగా చర్చించాం. అలా ఖచ్చితంగా మనకు మనం నడుపుతున్న మనం వాడుకుంటున్న శరీరపు వాడకం దాని పనితీరు తెలియాల్సిందే, లేకపోతే అది సాధనకు సహకరించదు. మనం అనుగుణమైనటువంటి ఆహారం అందిస్తే అది మనకు ఆత్మానందాన్ని పొందడానికి అనుగుణంగా సహకరిస్తుంది. శరీర వ్యవస్థను పటిష్టంగా ఉంచుకోవడం ఓ ప్రధానమైనటువంటి పార్శ్వం. ఆరోగ్యం పట్టుదప్పితే మనిషిలోని ప్రజ్ఞ నశించిపోతుంది, కాబట్టి ఈ దేహాన్ని నడిపే విద్యను స్వీయ అధ్యయనం ద్వారా ఖచ్చితంగా మనం మన అనుభవంలోకి తెచ్చుకోవాలి, మన దేహం మీద మనం పట్టు సాధించాలి. జీవంపై దృష్టి పెడితేనే జీవితం అంటే ఏమిటో మనకు అర్థమవుతుంది. శక్తివంతమైనటువంటి అధునాతనమైనటువంటి పరికరం యంత్రం శరీరంవ్యవస్థ ఇదొక క్లిష్టమైన పరికరం. మనం ఎప్పటికైనా ఈ మానవ శరీరపు వినియోగపు విధాన సూత్రాన్ని ఖచ్చితంగా తెలుసుకోవాల్సిందే, అది మనిషి ధర్మం. మనం సత్యం అని చెప్తున్నటువంటి దాని లక్షణం ఏంటి ఎక్కడుంది అని మనం ఆలోచిస్తే మన జీవితపు పరమోత్తమ సత్యం మన నాసికాగ్రం లోనే ఉంది. మన దగ్గర ఉన్న పరికరాలన్నీ కూడా బాహ్య విషయాలను మనకు తెలిపే విధంగానే ఉంటాయి. వాటికి సంబంధించిన అనుభవాలను మనకు అందిస్తుంది. అయితే అనుభవం చెందాల్సిన ప్రాథమిక స్థానం మనలోనే ఉంది. మన జీవితంలో ఏదైనా పొందాలంటే తగిన కృషి అవసరం అదే ధ్యానయోగ అభ్యాసకృషి. మన శరీరంలో ఉండే అమరిక అంతా కూడ మన గ్రాహ్యత కోసం, మనం వాటిని అర్థం చేసుకోవడం కోసం మన ఇంద్రియాలన్నీ వాటికి లోబడి పని చేస్తూ ఉంటాయి. అయితే ఇది ఎలా పనిచేస్తుందో మనకు తెలిసిపోతే అప్పుడు ఎలా వాడాలి అనే విషయం కూడా మనకు

అవగాహన అవుతుంది. అందుకని ఖచ్చితంగా మనం మన శరీర నిర్మాణం వ్యవస్థ గురించి అది పనిచేసే విధానం గురించి దాన్ని నడపాల్సినటువంటి నైపుణ్యతను ఖచ్చితంగా నేర్చుకుని తీరాలి.

రెండు సంశయం , భగవద్గీత ప్రమాణ విషయాలను స్వీయ అధ్యయనం ద్వారా గానీ సద్గురువు ద్వారా గానీ సంశయాలకు, సందేహాలకు తావు లేకుండా అభ్యసించి నిశ్చయమైన బుద్ధిని కలిగి ఉండాలి. అందుకే జగద్గురువు 4-40 సంశయాత్ములకు ఈ లోకంలో గానీ పరలోకంలో గానీ సుఖం ఉండదు అని, 4-41లో వివేకం ద్వారా సంశయాన్ని తొలగించుకున్న వారిని కర్మలు బంధించలేవు అని చెప్పిన విధానం చూశాం. ఈ అవగాహనతో మనం భగవంతుని చేరే గీతను సప్రామాణికంగా అధ్యయనం చేసి అభ్యసించి నిశ్చయబుద్ధిని మనలో కలిగి ఉండాలి.

మూడు ఉదాసీనత , సాధనలో క్షణక్షణం ఉత్సాహంతో మనం చెప్పుకున్న టిట్టిభ పక్షిలాగా అనిర్వేద అనిర్విన్న సదా ధ్యాన సాధనలో కొనసాగాలి గాని ఉదాసీనంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే అసమర్థులుగా ఉండకూడదు. ఉదాసీనత అనేది ఓ ప్రమాద భరితమైన స్థితి, ఈ పరిస్థితిని మనం మనలో కలిగి ఉండకూడదు. అలసత్వాన్ని అధిగమించి ఉదాసీనతను పోగొట్టుకుని సాధనలో ముందుకు వెళ్లాలి. భౌతిక పరిస్థితులకు భయపడి మన సాధనా మార్గం కుంటుపడటానికి మనమే కారణం కాకూడదు. ఎప్పుడో పిల్లలకు పెళ్లి అయ్యాక శరీరం శుష్కించిపోయాక చేసుకోవచ్చని అలసత్వం ప్రపంచాన్ని ఆవహించిన విషయం మనకు తెలియనిది కాదు. అందుకని ఇలాంటి ఉదాసీనపు అలసత్వపు నోమరితనపు అంతరాయభావాల్ని తక్షణమే విడిచి పెట్టాలి. లేకపోతే తమోగుణ ప్రభావంతో దేహేంద్రియ చిత్తం బరువెక్కి అలసత్వంతో ఉదాసీనతతో వ్యాధిగ్రస్తులవుతారు, ఇదొక అంతరాయం.

నాలుగు భ్రాంతి దర్శనం , సత్యాన్ని అసత్యంగా, అసత్యాన్ని సత్యంగా చూడడం. వేదనకు దారి తీసే వాదాలు పెడార్థాలు, విపరీతార్థాలు విడిచిపెట్టి శాస్త్రాన్ని ఉన్నదున్నట్లుగా లోతైన దర్శనంతో అభ్యసించి యదార్థాన్ని దర్శించగలగాలి, భ్రాంతిని వీడాలి.

ఈ నాలుగూ విఘ్న కారకాలైనటువంటి నిషిద్ధాంశాల్ని గమనించి ఇవి ఒకవేళ మనలో ఉంటే వాటిని అధిగమించి ధ్యానయోగభ్యాసంలో అంతరాయాలకు తావియ్యకుండా సదా ధ్యానంలో శ్వాస మీద ధ్యాసలో కొనసాగాలి. ఈ అంతరాయాలను తొలగించుకొని ఆత్మ యందు సుస్థిరులైన యోగులు విగతకల్మషులు పాపరహితులు అవుతారు. ఇక్కడ పాపం అంటే ధర్మానుసరణలో ధర్మాచరణలో లేని ఎవ్వరైనా పాపులే. నేను నాది అనే భావన ఉన్న వారందరూ పాపులే. ఈ అంశం మనం మూడవ అధ్యాయంలో యజ్ఞప్రకరణంలో చూశాం. బ్రహ్మవిద్యను అభ్యసించని ఆచరించని స్వధర్మాచరణలో లేని వారందరూ కూడా ఈకోవకు చెందిన వారే. అందుకని అవిద్య నుండి విడిపడి విద్యాభ్యాసాన్ని కొనసాగించాలి, విగత కల్మషులు కావాలి. ఈ రెండు అంశాల్ని అధిగమించిన వారు బ్రహ్మను సంస్పర్శిస్తారు. అంటే జ్ఞానంతో బ్రహ్మతత్త్వాన్ని దర్శిస్తారు అని అర్థం. బ్రహ్మత్వం

అంటే విశ్వవ్యాపకత్వం కదా కాబట్టి ఈ సమస్త ప్రపంచాన్ని బ్రహ్మంగానే దర్శిస్తూ అభేద జ్ఞానంతో బ్రహ్మ సంస్పర్శంతో విరాజుల్లుతారు. దైవంతో గల దివ్యమైన బంధంతో బ్రహ్మజ్ఞానంతో అఖండంగా శోభిస్తారు.

6అ, 29శ్లో

సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని |
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః ||

సర్వవ్యాప్తమైన అనంతచైతన్యమునందు ఏకీభావస్థితిరూపయోగయుక్తమైన ఆత్మగలవాడును, అంతటను అన్నింటిని సమభావముతో చూచువాడును అగు యోగి తనయాత్మను సర్వప్రాణులయందు స్థితమైయున్నట్లుగను, ప్రాణులన్నింటిని తన ఆత్మయందు కల్పితములుగను భావించును (చూచును).

మనం 5-7లో సర్వభూతాత్మ భూతాత్మ అనే అంశాన్ని చూశాం ఆ అవగాహనతో బ్రహ్మాత్మ దర్శనాన్ని వివరించే దర్శింపజేసే ఈ శ్లోకాన్ని పరిశీలిద్దాం. 'త్వం' అంటే నీవు 'అసి' అంటే ఉన్నావు నీవు ఉన్నావు, నీవు ఉన్నావు అనడంలో నీవున్నదే మనం 2-16లో నిరూపించుకున్న ఆత్మ లేదా శక్తి లేదా సత్తు ఏ పేరు పెట్టుకున్నా మన ఇష్టం ఏది ఏమైనా ఏ పేరు పెట్టుకున్నా మనం ఉన్నట్లు మనకు తెలుస్తోంది కదా మరి సమస్తమూ సకల ప్రాణికోటి ఉంది అని కూడా మనకే తెలుసు. కాబట్టి ఆ ఉన్నది ఏదో మనమే కాదు మనకే కాదు మనలోనే కాదు సమస్త ప్రాణికోటిలో ఉంది అనేది మనకు నెమ్మదిగా ఇప్పటివరకు మనం చర్చించిన నిరూపించిన నిర్ధారించిన అనేక ప్రామాణికమైన అంశాల ఆధారంగా మనం గ్రహించవచ్చు. దీన్నిబట్టి ఆ ఉన్నది మనలో అలాగే ప్రాణికోటిలో కూడా ఉంది. అంటే మనల్ని మనం సమస్త ప్రాణికోటి నుండి వేరు చేయడం వీలు కానే కాదు, అదే విధంగా సమస్త ప్రాణికోటి నుండి మనం వేరుగా ఉన్నాం అని అనుకోవడానికి అవకాశం లేదు గాక లేదు ఇది విశ్వ సూత్రం. ఇలా మనకు ప్రాణికోటికి భేదం లేదని అనుభవ జ్ఞానంతో తెలిసే స్థితిని సమస్థితి అంటాం. సంయక్ దర్శనం సమదర్శనః అని యోగారూఢులు సమదృష్టి కలవారని చూశాం. అలాగే 6-9 లో 'సమబుద్ధిర్విశిష్యతే' అని తెలుసుకున్నాం ఈ అంశాన్నే ఇక్కడ 'సర్వత్ర సమదర్శనః' ఆలాంటి యోగ యుక్తులు తామే సర్వత్రా అంతటా అన్నింటిలో 'సర్వభూతస్థం' సర్వభూతాలలో ఉన్న సమస్తమైన బ్రహ్మాన్నే దర్శిస్తారు. తమలో కూడా 'సర్వభూతాని' సర్వభూతాన్ని తనయందే ఉన్న వాటివిగా ఆత్మనిగా 'ఈక్షతే' దర్శిస్తారు. ఇలా దర్శించే వారు సమదర్శనులు, ఆత్మను దర్శిస్తున్నారు. మనం దేహేంద్రియ మనోబుద్ధుల సంఘాతము కాము,

అంతటా ఉన్నది మనమే. మనమే అన్నింటిలో ఉన్నాం అందరిలో ఉన్నది మనమే అని సర్వాత్మ దర్శనం కలిగి ఉండటం సర్వాత్మ భావం. తనను ఆత్మగా తెలుసుకున్న యోగారూఢుడు ఆత్మకన్నా అన్యమైనది లేదనేటటువంటి జ్ఞానం భావం కలిగి ఉన్నందున సమస్త ప్రాణికోటిని తనలోనే వీక్షిస్తాడు, సర్వాన్ని ఆత్మగానే దర్శిస్తాడు. అన్ని రకాల రూపాల్లోని మట్టి పాత్రలన్నింటికీ ఆధారం మట్టే అని మనం చూశాం, అర్థం చేసుకున్నాం కాబట్టి ఈ దృశ్యమయ జగత్తుకు ఆధారం బ్రహ్మ, ఆత్మే బ్రహ్మ. ఇది సర్వవ్యాపకమైన అనంత చైతన్యంలో ఏకీభావస్థితి యుక్తమైనవారు అంతటా సమభావంతో దర్శించేవారు తన ఆత్మను సర్వప్రాణుల యందు స్థితమై ఉన్నట్లు అలాగే సర్వప్రాణులు తనలోనే స్థితమై ఉన్నట్లు బ్రహ్మాత్మ దర్శనాన్ని అనుభూతిస్తారు.

6అ, 30శ్లో

యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి
శతస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి ||

సకల ప్రాణులయందును ఆత్మరూపముననున్న నన్ను (వాసుదేవుని) చూచు పురుషునకు, అట్లే ప్రాణులన్నింటిని నాయందు అంతర్గతములుగా ఉన్నట్లు చూచువానికి నేను అదృశ్యుడను కాను. అతడును నాకు అదృశ్యుడు కాడు.

ముందు శ్లోకంలో యోగయుక్తుడు సర్వత్రా ఆత్మ దర్శనం చేస్తున్న బ్రహ్మాత్మ దర్శన విధానం చూశాం అలాంటి బ్రహ్మాత్మ దర్శనం గల బ్రహ్మభూతులపై దైవం దృష్టి సారించే విధానం ఈ శ్లోకంలో మనకు స్పష్టంగా తెలుస్తుంది.

మూడవ అధ్యాయంలో సర్వప్రాణికోటికి మూలాధారమైనది జీవం, ప్రాణం అని మనం చాలా స్పష్టంగా చూశాం బ్రహ్మం ఎలా ప్రాణికోటిలో ఉందో లాంటి ప్రాణి పుట్టుకకు కారణం మొదలైన అన్ని అంశాలను ప్రామాణికంగా సశాస్త్రీయంగా నిరూపించుకున్నాం, ఆ అవగాహనతో ఈ శ్లోకాన్ని పరిశీలించాలి. ఆత్మ దర్శనం చేస్తున్న సమదర్శనయోగికి అజ్ఞానం ఉండదు, కాబట్టి అతను పూర్ణజ్ఞానంతో ఉన్నాడు కనుక ఆ ఆత్మ జ్ఞానంతో సమస్తాన్ని ఆత్మలోనూ, ఆత్మనే సమస్తంలోనూ దర్శిస్తున్నాడు. ఈ దర్శనం జరిగితే జీవుడికి పరమాత్మ దర్శనం ప్రాప్తించిన తరువాత ఒకరినొకరు తెలియకపోవడం ఉండదు కదా. అందుకు జగద్గురువు ఇక్కడ 'తస్యాహం న ప్రాణశ్యామి స చ మే న ప్రణశ్యతి', నేను అతనికి కనబడకుండా ఉండను, 'న ప్రణశ్యతి' నాకు అతడు కనబడకుండా పోడు. అతనికి నేను నాకు అతను ఒకరికొకరం దూరంగా లేము, కాబట్టి ఒకరికొకరు కనిపించకపోవడం అనేది జరగదు. ఈ అంశాన్ని జగద్గురువు ఈ శ్లోకంలో మనకు నిర్ధారిస్తున్నారు. దీన్నిబట్టి ఇద్దరూ ఒకటేనని ఇదే ఆత్మ పరమాత్మల లీనమని మనకు తెలియాలి. భగవంతుని కృపాకటాక్షాలు ఎలా మనల్ని అనుగ్రహిస్తాయి అనడానికి నిలువెత్తు సాక్ష్యం, నిదర్శనం

ఈ ఏకత్వాన్ని ప్రబోధించే శ్లోకం. భక్తుని భగవంతుని జీవుడి దేవుడి సమైక్యతను దర్శింపజేసే తలమానికమైన శ్లోకం. దీన్నిబట్టి భగవంతుని చేరుకోవాలంటే 'యో మాం పశ్చతి సర్వత్ర సర్వంచ మయి పశ్యతి' స్థితిని మనం సదా ధ్యాన యోగాభ్యాసం ద్వారా పొందాలి. చైతన్యం ఒక్కటే అయినా ఉపాధులు అనేకంగా ఉండటం చేత మనం చైతన్యాన్ని కూడా అనేకంగా చూస్తున్నాం. ఆత్మ అనేది చైతన్య స్వరూపం కదా కాబట్టి భేదాలు ఉపాధులలోనే గాని చైతన్యంలో కాదు. ఉపాధులు అనేకమైనా అంటే శరీరాలు అనేకమైనా ఆత్మ ఒక్కటే. ఉదాహరణకు ఆకాశం ఒకటే కదా అంతటా ఉండే ఆకాశం అనంత ఆకాశం. అయితే కుండలోనూ బిందెలోను సరసుల్లోనూ గుంటల్లోనూ ఇలా అన్నింటిలో ప్రతిబింబించే అన్ని ఆకాశాలు లేవు కదా. అలా దేహం అనే ఉపాధి ఉండటం వల్ల ఉపాధి గత చైతన్యాన్ని జీవ శబ్దంతో పిలుస్తున్నాం. ఒకే దేహానికి పరిమితమైనది జీవుడు సర్వ ఉపాధి గత చైతన్యం ఈశ్వరుడు, అందుకని చైతన్యం ఒక్కటే. భేధాలనేవి ఉపాధి స్థాయిలోనే గాని శరీరపు స్థాయిలోనే గాని చైతన్యం స్థాయిలో లేవు. ఈ కోణంలో మనం విచారిస్తూ ముందుకెళ్తే ఉన్నది ఉంది అంటున్నదంతా కూడా చైతన్యమే, ఆత్మే. ఇదే సత్యం ఇదే బ్రహ్మం అని మనకు అనుభవ పూర్వకంగా అవగతం అవుతుంది. ఈ స్థితి అనుభవైకవేద్యం అయితే వారే ఆత్మజ్ఞాన సంపన్నులు అదే 'తత్'. మనకు ముందు శ్లోకంలో త్వం అనే శబ్దానికి నిరూపణ అయింది, ఈ శ్లోకంలో 'తత్' అనే శబ్దానికి నిరూపణ అవుతోంది. అన్నింటా నన్ను, నాయందే అన్నింటినీ చూసే ఆత్మైకత్వం దర్శించిన వారితో నేను లేకపోవడం అన్నది లేదు, నాలో వారు లేకపోవడం కనిపించకపోవడం అన్నది కూడా లేదు, వారు నేను ఒక్కటే అని జగద్గురువు ఈ శ్లోకంలో మనకు చాలా స్పష్టంగా భరోసా ఇస్తున్నారు.

6అ, 31శ్లో.

సర్వభూతస్థితం యో మాం భజత్యేకత్వమాస్థితః
సర్వథా వర్తమానోఽపి స యోగీ మయి వర్తతే ||

భగవంతునియందు ఏకీభావస్థితుడైన పురుషుడు సర్వభూతముల యందును ఆత్మరూపముననున్న సచ్చిదానందఘన వాసుదేవుడవైయున్న నన్ను భజించును. అట్టి యోగి సర్వథా నాయందే ప్రవర్తించుచుండును. సర్వవ్యవహారముల యందు ప్రవర్తించుచున్నను నాయందే ప్రవర్తించుచుండును.

ఈ శ్లోకంలోని మొదటి పాదం ముందు శ్లోకాల్లో చర్చించిన అంశాల ఆధారంగా మనకు అవగాహన అవుతుంది. యోగి స్థితి, యోగి వైభవం, సదా నిలిచి ఉండే దైవిక స్థితి ఇది. ఈ స్థితిలో ఉన్నవారు సర్వదా అన్ని విధాలుగా ప్రవర్తిల్లినా నా యందే ఉన్నారు అన్న అంశాన్ని కొంత నిశితంగా పరిశీలించి మనం అవగాహన చేసుకోవాలి, లేకపోతే ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. ఆత్మ జ్ఞాని అయిన యోగికి ఆత్మిక జ్ఞానం ఉన్నందున అతని ప్రవర్తనలో లోపం ఉండదు వారి ఆంతర్యంలో అభేద జ్ఞానమే

ఉంటుంది, అందుకని వారి ప్రతి ప్రవర్తనా దైవ కార్యమే. అయితే వాస్తవంగా ఆత్మజ్ఞానం అనుభవేద్యమైనటువంటి దైవిక స్థితిలో ఉన్న యోగి ప్రవర్తన కూడా దైవికచర్యే అయి ఉంటుంది కదా అందుకని జగద్గురువు ఈ అంశాన్ని ప్రతిపాదిస్తున్నాడు. వారి కరచరణాలు దైనందిన కార్యకలాపాలలో ప్రవర్తిల్లినా అంటే వారిదేహం దైనందిన కార్యకలాపాలలో ప్రవర్తిల్లినా వారి జ్ఞానం నిశ్చితమై ఉండటం వల్ల అది దైవిక కార్యంగానే పరిగణన అవుతుంది. ఉదాహరణకు ప్రహ్లాదుడు లాంటి వారు మనకు తెలియనిది కాదు. మనం మూడవ అధ్యాయంలో చర్చించిన శ్రేష్ఠులు ఏ కార్యంలో ఉన్నా వారు దైవ ధ్యానంలో ఉండిన విధానం చూశాం. ఈ ప్రపంచం పట్ల త్రిగుణాలు, ఇతర ఇంద్రియాల పట్ల వారు విగత స్పృహతో ఉంటారు. 5వ అధ్యాయం 8, 9 శ్లోకాలలో దేహంలో జరిగే 18 క్రియలను సమగ్రంగా చర్చించి ఆత్మ జ్ఞాని ప్రవర్తించే తీరును చూశాం. ఈ అనుభవ జ్ఞానంతో ఈ అంశాన్ని పరిశీలించాలి. సమస్త భూతాలలో ఉన్న నన్ను ఎవరైతే సర్వత్రా ఒకే పరమాత్మ భావంతో సేవిస్తున్నారో అలాంటి యోగి ఏ విధంగా ప్రవర్తిస్తూ ఉన్నా కూడా అని చెప్పడంలో అర్థం ఏమంటే సమాధి నిష్టలో ఉన్నా లేదా స్వధర్మాచరణలో కర్తవ్యకర్మలను నిర్వహిస్తున్నా కూడా వారు నాయందే అంటే ఆత్మయందే ఉన్నవారవుతారు అని అర్థం చేసుకోవాలి. ఇక్కడ 'సర్వథా వర్తమానోపి' అనే పదం లోని భావం యధేచ్ఛగా ఇష్టం వచ్చినట్లు ప్రమాద భరితంగా ప్రవర్తించమని కాదు, దుష్ప్రవర్తనకు లోను కావచ్చని కాదు. అలా ప్రవర్తించేవారు అసలు ఆత్మజ్ఞానులుకారు, కాలేరు. ఒకవేళ ఎవరైనా అలాంటి తమో రజో గుణాలను ఆశ్రయించి ఆ స్థాయికి దిగి ప్రవర్తించినా ఖచ్చితంగా వారు ఆత్మజ్ఞాని అనే ముసుగు వేసుకున్న వారే గాని నిజమైన అనుభవేద్యమైన ఆత్మసాక్షాత్కారాన్ని పొందిన ఆత్మజ్ఞాని కాదని మనకు మనం నిర్ధారించుకోవాలి. ఆత్మ జ్ఞాని అంటే సాక్షాత్తు నేనే అని పరమాత్మ ఇస్తున్న భరోసాను బట్టి ఈ విషయం మనకు నిరూపణ అవుతుంది. దైవసాక్షాత్కార స్థితిలోని బ్రహ్మాత్మ జ్ఞాని నిశ్చిత జ్ఞానంతోనే ప్రవర్తిస్తారు కనుక వారు దైవంలోనే అంటే తనలోనే బ్రహ్మంలోనే ఉంటారని జగద్గురువు ఆత్మజ్ఞానిని తాను గానే ప్రకటించుకుంటున్నాడు. అఖండ బ్రహ్మాత్మ స్థితి వీరి బుద్ధిలో స్థిరంగా ప్రకాశిస్తూ ఉండటం వల్ల జగద్గురువు అలాంటి ఆత్మ జ్ఞాని నేనే అని తానే స్వయంగా పేర్కొంటున్నారు. మనం 29వ శ్లోకంలో త్వం అనే శబ్దాన్ని అన్వయించుకున్నాం. 30వ శ్లోకంలో తత్ శబ్దాన్ని అన్వయించాం, ఈ శ్లోకంలో 'అసి' ఆ ఆత్మజ్ఞాని నేను అయి ఉన్నాను అని చెప్పి అది ఎలానో కూడా ఈ శ్లోకంలో నిరూపిస్తున్నారు. సర్వభూతాలలో ఉన్న నన్ను అభేద జ్ఞానంతో సర్వత్రా సమదర్శనంతో చూసే సంయక్ దర్శి నేనే అని, మూలవిరాట్ స్వరూప జగత్ సృష్టికర్తను నేనేనని తన స్వస్థానాన్ని మూలస్థానాన్ని మనం ముందు ఉంచారు. ఇక మనం మనలోకి వెళ్లి అంతర్ముఖమై ఆ మనలోని మూలస్థానాన్ని ధ్యాన యోగాభ్యాసం ద్వారా ఈ దేహపు దేవాలయంలో సుస్థిర పరచుకోవడం మన చేతుల్లోనే ఉంది. దీన్నిబట్టి 'త్వం' శబ్దం ఆత్మను 'తత్' శబ్దం బ్రహ్మ లేదా ఈశ్వరుని, 'అసి' శబ్దం అయి ఉన్నావు అని జీవేశ్వరుల ఐక్యాన్ని ఈ అసి శబ్దం నిర్ధారిస్తుంది. ఈ అంశాన్ని మనం మూడవ అధ్యాయంలో చాలా సమగ్రంగా అనేక ప్రమాణాలతో నిరూపణలతో నిర్ధారించుకున్నాం. జీవుడు అంటే భౌతిక బంధంతో చిక్కుకున్నవారు, ఈశ్వరుడు అంటే దానికి అతీతంగా ఉన్నవారు. జీవుడు ఈశ్వరుడు గా విశ్వవ్యాపకుడిగా తెలిసి ప్రవర్తిల్లేవారు. జగద్గురువు చాటుతున్న ప్రతి ఆత్మజ్ఞాని లోనూ నేనున్నాను తన కార్యాలన్నీ కూడా నాయందే వుండి నా సమక్షంలోనే ప్రవర్తిల్లుతున్నాయని తాను, ఆత్మజ్ఞాని ఒక్కటే అని చెప్పిన స్థితికి మనం

కూడా చేరుకున్నప్పుడు అది నువ్వే అయి ఉన్నావు అనేటటువంటి జీవేశ్వరుల అభేద భావమైన 'తత్వమసి' మహా వాక్యం అనుభవేద్యమవుతుంది. ఈ అనుభవైకవేద్యంతో చేసే ప్రతి కార్యం దైవ కార్యమే అవుతుంది. వారి ప్రతి ఆలోచన ప్రతి శ్వాస ప్రతిధ్యాస దైవానికి సంబంధించినదే అయి ఉంటుంది. ఇలా వారి శ్వాస, ధ్యాస దైవం పైనే ఉన్నప్పుడు అలాంటి ఆత్మజ్ఞానులు దైవ కార్యములోనే నిమగ్నమై ఉంటారు. అందుకని జగద్గురువు ఆత్మజ్ఞానిలో ఉన్నది నేనే వారు నాయందే ఉంటారని తేల్చి చెప్పారు. ఆ కారణంగా ఆత్మజ్ఞాని అనుభవజ్ఞులకు ఈశ్వరుడికి అభేదం లేదని తెలియాలి. అయితే ఈ అంశం నిశిత పరిశీలనతో దర్శితమై అది మనమే అయి ఉన్నామని అనుభవ జ్ఞానంతోనే తెలియాలి.

6అ, 32శ్లో.

ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున ।
సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః ||

ఓ అర్జునా! సర్వప్రాణులను తనవలె (తనతో) సమానముగా చూచువాడును, సుఖమునుగాని, దుఃఖమునుగాని సమముగా (సమానముగ) చూచువాడును (ఇతరుల సుఖదుఃఖములను తన సుఖదుఃఖములుగా భావించువాడును)అయిన యోగి పరమశ్రేష్ఠుడు.

ముందు శ్లోకంలో యోగసిద్ధులు, ఆత్మజ్ఞానులు అయినటువంటి వారి ప్రవర్తన ఎలా ఉన్నా వారు నాయందే ఉంటారని చెప్పిన జగద్గురువు అర్ధ రహితమైన వాదనలకు, సంశయాలకు తావు లేకుండా వెంటనే ఈ శ్లోకంలో ఆత్మజ్ఞాని లక్షణాన్ని పునరావలోకనం చేస్తున్నాడు. 29, 30, 31 ఈ మూడు శ్లోకాల ఫలితం, సారం ఈ శ్లోకం. ఆత్మౌపమ్యం ఇతరుల సర్వప్రాణుల సుఖదుఃఖాలను తనదిగా గ్రహించడం స్వీకరించడం అనేది చాలా గొప్పదైనటువంటి తాత్విక స్ఫురణకు సంబంధించింది. ఇది అనుభవైకవేద్యమే గాని వర్ణితమైనది కాదు, ఇది మనకు కనిపించదు, ప్రయోగశాలలోని యంత్రాలతో భౌతికంగా నిరూపణ అయ్యేది కాదు, కొలబద్దతో కొలత కొలిచి చూపించగలిగేది కూడా కాదు. ఈ ఆరు అధ్యాయాల ఈ మూడు శ్లోకాల ఫలంగా సంప్రాప్తించిన తాత్విక ఆత్మిక జీవన వైభవం ఈ 32వ శ్లోకం. ఇది ప్రాపంచిక నైతిక న్యాయపరమైన కోణంతో మాత్రమే చూస్తే అర్థం కాదు, ఈ జీవన సత్యం అనుభవైకవేద్యం ఇది ధార్మికమైనది, ఇది చాలా సూక్ష్మమైనది, ప్రధానమైనటువంటిది, అనుభూతి అర్హమైన అంశం, ఓ అగ్ని కణం లాంటి తాత్విక సందేశం. ఇది ఈ పరమ సందేశాన్ని గ్రహించడమే మానవ జీవిత అంతిమ లక్ష్యం. మనిషి జన్మకు సార్ధకతను అందించే శ్లోకం ఇది. ఈ అంశాన్ని అవగాహనతో అనుభూతించి ఆత్మౌపమ్యంగా జీవించాలి. అంటే నిగూఢమైన గీతాశాస్త్ర జ్ఞానాన్ని ప్రామాణికంగా గ్రహించి 'తత్ త్వం అసి' అనే మహా వాక్యమైన ఆత్మలక్షణ శాస్త్రాన్ని మన శరీరంలోని ప్రతి కణంలోకి మనం నిబిడీకృతం చేసినప్పుడు ఈ ఫలితం అందులో ఉద్భవించి మనకు సంప్రాప్తిస్తుంది. ఎందుకంటే

విశేషించి మనకు అర్థం చేయించడానికి ఆత్మను ఇక్కడ ఉపమగా చెబుతున్నారు. మనకు ఇప్పటివరకు ప్రబోధించిన శ్లోకాల్లో ప్రాణికోటిలోని ఓ జీవిని లేదా ఓ వస్తువుని ఉపమగా ఉదాహరించేవారు, మనం కూడా వాటితో పాటు అనేక ఉపమలు, ఉదాహరణలు, ఉపపత్తులు చూశాం. దేనితో పోల్చుతున్నామో అది ఉపమ ఇక్కడ తానే అంటే ఆత్మే ఉపమగా చెప్పారు. ఉపమ యొక్క ధర్మం ఔపమ్యం, ఆత్మౌప్యం ద్వారా ఆత్మే ఉపమగా ఉండి సర్వప్రాణుల సుఖదుఃఖాలను గ్రహించడం. సర్వప్రాణి కోటిలో ఉన్నది నేనే అని నేనే సర్వప్రాణి కోటిలో ఉన్నాననే భావన కలిగిన వారు సమదర్శనులు, యోగులు కదా. అలాంటి ఆత్మజ్ఞాని తానే అయి ఉన్నానని చెప్పారు. కనుక ఈ సూత్రం ప్రకారం సకల ప్రాణులలోని సుఖదుఃఖాలు కూడా ఖచ్చితంగా సర్వప్రాణులలోని ఆత్మదే తనదే అవుతుంది, ఇలా మనం ఈ అంశాన్ని సమన్వయం చేసుకోవాలి. సర్వప్రాణులలోనూ ఏకాత్మని దర్శించినప్పుడు సర్వ ప్రాణులలో ఉన్నది ఆత్మే అయినప్పుడు అందరిలోనూ అనుకూల ప్రతికూల సుఖదుఖాలు కూడా సమదర్శికే వర్తిస్తాయి. ఇదే అద్భుత దైవిక అలౌకిక సూత్రం, ఇందులో విశేషం ఏమిటంటే ఆత్మను అంటే పరమాత్మనే తననే జగద్గురువు ఉపమగా పేర్కొనడం. ఈ అంశం శరీర స్థాయికి మనసు స్థాయికి బుద్ధి స్థాయికి మాత్రమే అందేది కాదు. ఇది ఆత్మ స్థాయిలోని జ్ఞానం, ఆత్మౌపమ్య స్థితిలో నుంచి ప్రవహించే ప్రేమ స్వరూపం, కరుణ స్వరూపం సర్వభూతాత్మ స్థితి. ఈ అంశాన్ని మనం మనకున్న దృష్టితో అవగాహన చేసుకోవడానికి ప్రయత్నిద్దాం. మనుషులు స్థూలంగా చూస్తే మూడు రకాలుగా కనిపిస్తారు. ఒకటి తమ సుఖదుఃఖాలకే పరిమితమై ఎవరేమైతే నాకేంటి నేను సుఖంగా ఉంటే చాలని వారి వారి సుఖం కోసం పరులను హింసించినా తప్పుకాదని భావించి అక్రమ మార్గంలో ప్రవర్తిస్తూ అమానవీయంగా ఉంటూ ఆధర్మంగా జీవిస్తారు.

రెండు పరుల సుఖాన్ని పాడు చేయకుండా తమ సుఖానికే ప్రాధాన్యతనిస్తూ పరులతో నాకెందుకులే అని తమకు తాముగా ఉండేవారు. వీరు సాధారణ స్థాయి మానవులు.

మూడు తమ సుఖంతో పాటు పరులకు కూడా తగిన సహాయం చేయాలని తమకు సరిపడేవి ఉంచుకొని మిగిలినవి పరోపకారార్థం వినియోగిస్తూ సేవా దృక్పథంతో ఉంటారు. ఈ మూడు రకాల కంటే భిన్నమైన వారు మన మస్తిష్కపు ఆలోచనలకు అతీతమైన ఆత్మిక స్థితి జ్ఞానం కలిగి ఉన్నవారు యోగ సిద్ధులు. అన్యుల సుఖదుఃఖాలను తమవిగా భావించే ఆత్మౌపమ్యేన విధానం అనితర సాధ్యంగాను అలౌకికంగాను ఉంటుంది.

6అ, 33శ్లో.

అర్జున ఉవాచ,

యోఽయం యోగస్త్వయా ప్రోక్తః సామ్యేన మధుసూదన |
ఏతస్యాహం న పశ్యామి చంచలత్వాత్ స్థితిం స్థిరామ్ ||

అర్జునుడు పలికెను - ఓ మధుసూదనా! సమభావమును గూర్చి నీవు చెప్పిన ఈ యోగము యొక్క స్థిరస్థితిని మనశ్చాంచల్యకారణమున తెలిసికొనలేకున్నాను.

మధుసూదనా! సమభావం గురించి నువ్వు చెప్పిన జ్ఞాన యోగం యొక్క స్థితిని నేను నాకు ఉన్నటువంటి మనఃచంచలం కారణంగా తెలుసుకోలేక పోతున్నాను. సర్వత్రా సమదర్శనస్థితి అయిన బ్రహ్మాత్మ దర్శనాన్ని పొందాలనే లక్ష్యంతో మనం ఇప్పటివరకు ఏకధాటిగా 265 శ్లోకాలను ఓ ప్రవాహంగా చర్చించాం. అయినా కూడా మనకు మళ్లీ సందేహం వచ్చింది. దీన్నిబట్టి మనలో ఆత్మవివేచన ఇంకా పటిష్ట పరచుకోవాల్సిన అవసరం ఉంది, ఇంకా ఇంకా లోతుల్లోకి వెళ్లి మనల్ని మనం పరిశీలించాలి. మనో నిశ్చలత్వం ద్వారా సిద్ధించే యోగాన్ని ఉపదేశించావు నువ్వు బోధించిన సుస్థిరమైన నిలకడను పొందాలనుకుంటున్నాను గాని నాలోని చపలత్వం వల్ల నేను తెలుసుకోలేకపోతున్నాను. ఈ శ్లోకంలో సమస్థితిని కూడా యోగంగా స్పష్టీకరించిన విషయాన్ని మనం గ్రహించాలి. దేవా! జీవాత్మ పరమాత్మల సామ్య రూపమైన నిశ్చలత్వం ధ్యాన యోగంలో నాకు స్థిరం కావడం లేదు, మనసు చపలత్వంతో ఉండడం వలన నిలకడ కుదరక నేను ఈ సమదర్శన స్థితిని పొందలేకున్నాను. మీరు చెప్పింది అర్థం చేసుకున్నాను కానీ అలా ఉండటానికి ఎంత ప్రయత్నించినా మనసు చపలంగానే ఉంటోంది అని అర్జునుడు తన మానసిక పరిస్థితిని వివరిస్తాడు. సద్గురువు దగ్గర బ్రహ్మ విద్య అభ్యసిస్తూ ఉన్నప్పుడు ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ సంశయాలకు సందేహాలకు తావు లేకుండా నివృత్తి చేసుకుంటూ ముందుకు వెళ్లాలి లేకపోతే బ్రహ్మవిద్య అధ్యయనం మనకు అర్థం కాదు. అందుకని గురుశిష్యుల భాంధవ్యం ఎలాంటిదో కూడా మనం ఆయా సందర్భాల్లో చూశాం. విద్యాభ్యాసంలో మన ఆంతరంగిక పరిస్థితుల్ని హృదయం విప్పి ఉన్నది ఉన్నట్లు యధాతధంగా చెప్పి తగిన సమాధానం పొందుతూ విద్యార్జనను కొనసాగించాలి. అప్పుడే బ్రహ్మదర్శనం మనకు అనుభవైకవేద్యం అవుతుంది. అందుకే ఇక్కడ అర్జునుడు మనలోని సమస్యలను గుర్తించి మన జగద్గురువు ముందు ఉంచాడు. నాలో మనసు నిలకడ పొందక చపలత్వంతో ఉన్న కారణంగానే ఆత్మ యందు మనసు సుస్థిరంగా నిలకడను పొందలేకున్నది. ఇది మన అందరి తరపున అర్జునుడు మనకోసం సంధించిన ప్రశ్న. దీన్నిబట్టి సమత్వం వల్లనే నిశ్చలత వల్లనే ఆత్మస్థితిని పొందుతామని సుస్పష్టం అవుతోంది. నిశ్చలస్థితి కుదిరినప్పుడే మనలోని శక్తి స్థితమౌతుంది. దీన్నే స్థితిశక్తి అని కూడా చెప్పవచ్చు. అలా మనలో స్థిరీకృతం అయినప్పుడే మనలోని అంతర్గత స్థితిశక్తితో మనల్ని మనమే నడపగలము. ఆ ఆంతరంగిక నిశ్చలత లేకపోతే వ్యక్తి

శక్తి కాలేడు, అలా కానప్పుడు చపలుడవుతాడు. మనసు వెళ్లినట్లు మనిషి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది తద్వారా జీవితం అస్తవ్యస్తమవుతుంది. మనో నిగ్రహం లేని వారి మనసు ప్రశాంతంగా ఉండదు. ప్రశాంతచిత్తం లేకపోతే యోగారూఢులు కాలేరు, బ్రహ్మ దర్శనాన్ని పొందడం వీలు కాదు. మనం మనసు యొక్క బలాబలాలను ముందు శ్లోకాల్లో సమగ్రంగా చూశాం. అలాగే 6-19 లో గాలిలేని చోట దీపం లాగా ఉండాలని 6-25లో మనసును ఆత్మయందే నిలిపి దేనిని చింతించకుండా సుస్థిరంగా ఉండాలని చూశాం. ఇవన్నీ మనలో ఆచరణయుతం కావడానికి తగిన ఉపకరణాలు మనకు అందించాలనే ఉద్దేశంతోనే అర్జునుడు ఇలాంటి ప్రశ్నను సంధించాడు. మనసు చలించడం సమస్య కాదు, అదే దాని స్వభావం అందుకే అది మనసు అయితే దాన్ని నడిపించే స్థిరత్వం మనలో లేకపోవడమే సమస్య. అస్థిరంగా చంచలంగా ఉండేదే మనసు అని తెలిసి మనం దానికంటే పై స్థాయికి వెళ్లి బుద్ధి స్థాయిలో స్థిరమై స్థితమైనప్పుడు బుద్ధి ఉన్నవారు అవుతారు, వారినే బుద్ధుడు అంటారు. గౌతముడు బుద్ధుడు అయింది ఇలానే. మనం కూడా బుద్ధి ఉన్న బుద్ధుడు లాగే అవుదాం. అందుకే అర్జునుడు మరి మధువు అనే రాక్షసుడిని వధించావు జ్ఞానరూపమై వేదాల్ని సంరక్షించావు మరి నన్ను మనసు స్థితిని దాటి బుద్ధి స్థితిలో సుస్థిరమయ్యేలా ఉద్బోధించు అని శ్రీకృష్ణుడ్ని అర్థిస్తున్నాడు.

6అ, 34శ్లో.

చంచలం హి మనః కృష్ణ ప్రమాథి బలవద్దృఢమ్ |
తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరమ్||

ఓ కృష్ణా! ఈ మనస్సు మిక్కిలి చంచలమైనది. ప్రమథనశీలమైనది (బాగుగా మథించు స్వభావము గలది). దృఢమైనది. మిక్కిలి బలీయమైనది. కనుక, దానిని నిగ్రహించుట గాలిని ఆపుటవలె మిక్కిలి దుష్కరమని భావింతును.

మనం మూడవ అధ్యాయం చివరి శ్లోకాలలో మనసు స్వరూప స్వభావాల్ని చూశాం. అలాగే 6-24,25,26 శ్లోకాల్లో మనసును గురించి విపులంగా చూశాం. బుద్ధి స్థితికి చేరని వారి మనసు నిలకడ లేక చంచలంగా ఉంటుంది. ధ్యాన యోగంలో మనసు ప్రధాన భూమిక పోషిస్తుంది. అందుకే మన తరఫున ఈ ప్రశ్నను సంధించాడు అర్జునుడు. సుస్థిరంగా ఏకాగ్రం కాని మనసుతో ధ్యాన యోగాభ్యాసం పొందడం దుష్కరం అని 'చంచలం హి మనః కృష్ణ' అంటున్నాడు. గాలివీస్తే కొలనులో అలలు చలించినట్లు బాహ్య విషయాలు అనుభవాలు ఏ కొద్దిగా స్మృతికి అందినా మనసు చలించిపోతుంది, ఒకవేళ అలాంటి బాహ్య ఒత్తిడి ఏమాత్రం లేకపోయినా కూడా మనసు లోలోపల నుండి మెల్లగా పూర్వజన్మల సంస్కార వాసన ఆలోచనా తరంగాలు మనసును కల్లోల పరుస్తాయి. ఈ చంచల చిత్తం ప్రమధనశీలమైనది, శరీరాన్ని ఇంద్రియాల్ని కలవరింతలకు గురిచేస్తుంది, అంతేకాదు బలమైనది, దృఢమైనది దేనిచేత నియమించ శక్యం కానిది, నివారించడం కష్టసాధ్యం, చేధించరానిది, గాలిని నిరోధించడం కన్నా మనసును

నిరోధించడం దుష్కరంగా ఉంది. ధ్యానయోగ అభ్యాసంలో మనసు యొక్క పరిస్థితిని అవి పరుగులెత్తే విధానాన్ని చూశాం. శంకరాచార్యులవారు మనసును తంతునాదం లాంటిది అన్నారు, అంటే సముద్రంలో సంచరించే తాడు వలె ఉండే అతి బలమైన జంతువు అని అర్థం, దీన్నే వరుణపాశం అని కూడా అంటారు. మనసు అనేది క్షీరసాగరాన్ని మదించిన మందర పర్వతంగా మనల్ని మదించి తీవ్రమైన శోభకు గురిచేస్తుంది. అంతేకాదు దృశ్య వస్తువుల్ని అనేక గత జన్మల వాసనలు సంస్కారాలను ప్రోగుచేసుకొని మరింత బలంతో దృఢంగా మనల్ని బంధిస్తుంది. ఎంతటి మేధ అయినా ఆ బంధనాలలో చిక్కుకొని కొట్టుమిట్టాడాల్సిన పరిస్థితి, అందుకే ఆ బంధనం లోంచి మనల్ని మనం విడిపించుకోవడానికి ఉన్నటువంటి ఏకైక మార్గం ధ్యాన యోగ అభ్యాసం. ఈ మనసు లక్షణాన్ని అర్జునుడు నాలుగు రకాలుగా చెప్పాడు. ఒకటి చపలత్వం, రెండు క్షోభజనకత్వం, మూడు బలవత్వం, నాలుగు దృఢత్వం ఈ లక్షణాలు ఉన్న ఈ జంతువు చేత మనం పీడింపబడుతున్నామనేది మనకు అనుభవమే. అందుకే పెద్దలు మనసును తేలు కుట్టిన, ముల్లు గుచ్చుకున్న, కల్లు తాగిన, దయ్యం పట్టిన కోతితో పోల్చుతారు. ఈ పోలిక మనకు మనసు తీవ్రత అర్థం కావడానికే మరో రకంగా చూడకూడదు. ఇదే మనసు శరీరం సమస్య, మైండ్ బాడీ ప్రాబ్లం. మనసు శరీరాన్ని ఎలా శాసిస్తుంది అని కాస్త శ్రద్ధగా పరిశీలిస్తే మనకు అవగాహన అవుతుంది. ఇంతకు ఈ మనసు భౌతికమా, అభౌతికమా?, మనసు శరీరం పూర్తిగా విభిన్నమైనది ఇవి రెండూ వేరు వేరు ప్రపంచాలకు సంబంధించింది. భౌతిక అంశాలను అనుసరించే శరీరం పని చేస్తుంది కానీ మనసు మాత్రం శరీరంతో సంబంధం లేని ఓ అంతుచిక్కని అభౌతికత్వానికి చెందినది.

6అ, 35శ్లో.

శ్రీ భగవానువాచ,

అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలమ్|
అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే ||

శ్రీ భగవానుడు పలికెను -

హే మహాబాహో! నిస్సందేహముగా మనస్సు చంచలమైనదే. దానిని వశపఱచుకొనుట మిక్కిలి కష్టము. కాని, కౌంతేయా! అభ్యాస వైరాగ్యముల ద్వారా దానిని వశపఱచుకొనుట సాధ్యమే.

భౌతిక ప్రాపంచిక విషయాల ఊబిలో చిక్కుకొని దారి తప్పిన బాటసారి తిరిగి స్వస్థితిలోకి సన్మార్గంలోకి రావాలి. అందుకు సాధకుడు వాస్తవాన్ని గమనించి పరిశీలించి అంగీకరించే ఉత్తమ లక్షణాన్ని కలిగి ఉండాలి. అలా అంగీకరించలేని దౌర్బల్యంతో ఆరాట పోరాటాలను పెంచుకొని మనకు మనమే శత్రువుగా మారి మనల్ని మనమే పతనం చేసుకోకూడదు. ఇలాంటి వారిని జగద్గురువు ముందు శ్లోకాల్లో ఆత్మఘాతకులని సంబోధించారు కూడా. కాబట్టి నిత్యానిత్య వివేకంతో వాస్తవాన్ని తెలిసి శ్రేయో మార్గాన్ని అవలంబించినప్పుడు సాధకుడు ముందుకెళ్లగలరు. మనసు చంచలంగా ఉంది నిగ్రహం సాధ్యం కావడం లేదు దృఢమై చాలా ప్రమాద భరితంగా ఉంది దాన్ని నిగ్రహించడం గాలిని బంధించినట్లే ఉంది అన్న అర్జునుడి మాటలను అంగీకరించిన జగద్గురువు అసంశయం అంటూ సమాధానాన్ని ప్రారంభించాడు. మనసు యొక్క బలాన్ని గూర్చి నువ్వు తెలిపిన విషయంలో సందేహం లేదు అంటున్నాడు జగద్గురువు, అంటే అది బలమైనదేనని, దృఢమైనదేనని, ప్రమాద భరితమైనదేనని అర్జునుడితో జగద్గురువు కూడా ఏకీభవిస్తున్నాడు. ఇది ఓ సమస్య కదా మరి అయితే సమస్య ఉన్నప్పుడు పరిష్కారం కూడా ఖచ్చితంగా ఉంటుంది అని జగద్గురువు అర్జునుడితో ఏకీభవించడంలోని ఆంతర్యం. ఎలా అంటే సమస్యను సమస్యగా అంగీకరిస్తే పరిష్కారం కూడా అందులోనే ఉందని అర్జునుడు ఖచ్చితంగా అంగీకరించి తీరాల్సిందే ఈ సత్యాన్ని మనం అవగాహన చేసుకోవాలి. ఎందుకంటే ఒకటి ఉంటే మరొకటి ఖచ్చితంగా ఉంటుంది, ఒకవేళ పరిష్కారం లేదు అంటే సమస్య కూడా లేనట్లేనని భావించాలి. అయితే సమస్యను చక్కగా అర్థం చేసుకుంటే పరిష్కారం దుష్కరం కాదు. మొదటి పాదంలో మన సమస్యను అర్థం చేసుకొని అంగీకరించిన జగద్గురువు వెంటనే రెండవ పాదంలో 'అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే' అని పరిష్కారం కూడా సూచించాడు. ఇంద్రియాలు మనసును ఏమాత్రం ఆకర్షించలేని స్థితిని విరాగానికి పరాకాష్టగా చెప్పుకోవచ్చు, మనోవృత్తులు పూర్తిగా పరబ్రహ్మంలో లయమైపోయి పునరుద్ధానం కానప్పుడు తిరిగి తిరిగి అవి మనలో పుట్టనప్పుడు అవి ఉపరతి స్థితికి చేరుకున్నాయని చెప్పవచ్చు. లౌకిక రంగంలోనూ ప్రయత్నం, అభ్యాసం లేకపోతే ఏ కార్యాన్నీ సాధించలేం కదా, ఒక పరీక్షలో ఉత్తీర్ణులు కావాలన్నా తగిన కృషి అవసరమన్న సంగతి మనకు తెలియనిది కాదు. అలాంటిది ఎన్నో జన్మల నుండి కరుడుగట్టి ఘనీభవించిన సంచిత, ఆగామీ కర్మల్ని క్షయం చేసుకుంటూ ప్రారబ్ధాన్ని తొలగించుకుంటూ ముందుకెళ్లడానికి ఎంత అభ్యాసం కావాలో మనకు మనమే ఆలోచించుకోవాలి. సదా విచార వైరాగ్యాల ద్వారా బాహ్యం వైపు పరుగులెత్తే మనసును మరలించి ఆత్మ ధ్యానంలో నియోగించుట అనే అభ్యాసం వల్లనే మనసు స్వాధీనం అవుతుంది. ఇందులో జగద్గురువు సూచిస్తున్న రెండు అంశాలు ఒకటి అభ్యాసం, రెండు వైరాగ్యం.

అభ్యాసం అంటే మనం ఇప్పటివరకు చెప్పుకున్న ధ్యాన యోగాభ్యాసం, నిరంతర ఆత్మ ధ్యాన అభ్యాసం, వైరాగ్యం అంటే విరాగం, రాగం లేకపోవడం. మనం ఏ విద్య నేర్చుకోవాలన్నా ఆ విద్యలో పరాకాష్ట స్థితికి చేరుకున్న వారిని వెదకి నేర్చుకోవాలి. అలాగే ఆత్మ జ్ఞానం కావాలంటే కూడా ఆత్మ దర్శనం పొందిన సద్గురువును చేరి ధ్యాన యోగాభ్యాసం చేపట్టాలి. జన్మ రాహిత్య విద్యను జన్మకు సార్థకతను అందించే బ్రహ్మవిద్యను నేర్చుకోవాలంటే మన చేత అభ్యాసం చేయించే సద్గురువు దగ్గర అభ్యాసం చేయాలి.

వేదాంత శాస్త్ర రహస్యం బాగా తెలిసిన సద్గురువును ఆశ్రయించి ఆత్మ జ్ఞానాన్ని పొందాలి. ఇక్కడ వేదాంత శాస్త్ర రహస్యం అంటే వేదాల పుస్తక జ్ఞానం మాత్రమే కాదని మనం 2-45లో చెప్పుకున్న ప్రకృతిలోని సమస్త జ్ఞానాన్ని స్వయంగా దర్శనం ద్వారా ఆ ప్రకృతిలో లయిస్తున్న వేదాల్ని శృతి ద్వారా దర్శించి, తెలిసిన మనం మూడవ అధ్యాయంలో చర్చించిన తత్వవిత్తు అని గుర్తించుకోవాలి. ఏ విద్యకైనా గురువు లేకున్న ఆ విద్య పట్టుబడదు. లోక వ్యవహారానికి పనికి వచ్చే ఎన్ని విద్యలు అభ్యసించినా ఆత్మజ్ఞాన దీపం వెలిగించే సనాతనమైన ఆధ్యాత్మ విద్యను గ్రహించడం అంత సులభం కాదు అందుకని అభ్యాస వైరాగ్యాలు తప్పనిసరి. వేద విద్యల లోతెరిగినటువంటి గురువు దొరకడం చాలా దుర్లభం అలాంటి సద్గురుని శ్రమతో వెదకి, మహాత్ముల దగ్గర అభ్యసించి సాధకుడు కృతకృత్యుడు కావాలి. కాబట్టి బ్రహ్మ విద్య అధ్యయనంలో అభ్యాసం అనేది చాలా ప్రధానమైనటువంటి భూమికను వహిస్తుంది. ఇదే అంశాన్ని ఆదిశంకరులు మానవజన్మ, మోక్షేచ్ఛ, సద్గురు ఆశ్రయం ఈ మూడు లభించడం దుర్లభం ఇది దైవానుగ్రహం వల్లనే సంప్రాప్తిస్తాయని అన్నారు. ఈ లక్షణాలున్నవారు సద్గురు ఆశ్రయంలో ధ్యాన యోగ అభ్యాసంలో మొదటిగా ఉచ్ఛ్వాస నిశ్వాసలను గమనించడం ద్వారా ఆలోచనా రహిత స్థితికి మనం చేరుకుంటాం. ధ్యానాభ్యాసానికి ఉపక్రమించగానే చంచలం దుర్నిగ్రహం అయిన మనసు బాహ్యానికి పరుగులు తీస్తుంది. పరుగులు తీయడం మనసు యొక్క సహజ స్వభావం కదా అయితే ఇక్కడ మనం గమనించాల్సింది మనసు అలా పరుగులు తీయడం సమస్య కాదు, ఎందుకంటే అదే తన సహజత్వం అయితే మనం దాన్ని వెంబడించడమే సమస్య. మనసు వెళ్లడం గమనించి బహిర్ముఖమైన మనసును తక్షణమే వెనక్కి తిప్పి అంతర్ముఖం చేయడం ధ్యానంలో జరిగే ప్రధానమైనటువంటి క్రియ. ఇలా ఎన్నిసార్లు మనసు వెళ్తున్నప్పటికీ వెళ్ళిన ప్రతిసారి తిరిగి మళ్ళీ మళ్ళీ మనం మన మనసును ఆత్మయందు నిలపాలి. 6-25లో తెలిపినట్లు మనసును సదా అంతర్ముఖం చేసి ఆత్మయందు పరమాత్మ యందు సుస్థిరపరచడమే ధ్యాన యోగ అభ్యాసం. ఈ అభ్యాసంలో మనసు నిస్సారమై నిర్వీర్యం అవుతుంది, తద్వారా అది చంచలత్వాన్ని కోల్పోతుంది. అప్పుడు మనలోని అంతఃశక్తి ఉద్దీపనమై విశ్వశక్తి మన బ్రహ్మ రంధ్రం ద్వారా మనలోకి ఆవాహనమై మనకు సమదర్శన స్థితికి కావాల్సిన శక్తి మనలో సమీకృతమవుతుంది. ఇది ధ్యాన యోగ అభ్యాస విధానం.

ఇక విరాగం, మనకు బాహ్యపు తాత్కాలిక రాకపోకలు కలిగిన వాటి పట్ల ఇహలోక బాహ్య భోగాల విలాసాల పట్ల ఆసక్తి లేకపోవడమే విరాగం కదా. వస్తువుల్ని ఇష్టపడటం వల్ల ప్రయోజనం లేదు వస్తువులైనా, విషయాలైనా మనకు మన సాధనను పరిపుష్టం చేయడానికి ఉపకరిస్తాయా? మన ఉన్నతికి దోహదం చేస్తాయా? లేవు కదా. మనం వాటిని ఇష్టపడితే అవి వాటికి ఇష్టం వచ్చినట్లు మనల్ని ఆడిస్తాయి. అందుకని అనిత్యాలైన వాటి పట్ల విరాగంతో ఉండాలి. ఈ అంశాన్ని ముందు శ్లోకాల్లో అనేక సందర్భాల్లో చర్చించాం కాబట్టి ఒకసారి పునఃశ్చరణ చేసుకొని సమన్వయం చేసుకుంటే సరిపోతుంది. ఇలా పరమేశ్వరుని పైన మన ధ్యాసను ఉంచి విరాగభావంతో సదా ధ్యాన యోగాభ్యాసం కొనసాగించాలి. అభ్యాస వైరాగ్యాలే ఉపాయం అని యోగ దర్శనం కూడా పేర్కొంది. ఇలా జగద్గురువు చెప్పినట్లు అభ్యాస వైరాగ్యాలచే మనస్సును నిగ్రహించిన వారికి యోగం సిద్ధిస్తుంది.

దీన్నిబట్టి మనసును జయించడం కష్ట సాధ్యమే గాని అసాధ్యం కాదు, సుసాధ్యమే. దుర్నిగ్రహమైనదే గానీ అనిగ్రహమైనది కాదు.

6అ, 36శ్లో.

అసంయతాత్మనా యోగో దుష్ప్రాప ఇతి మే మతిః ।
వశ్యాత్మనా తు యతతా శక్యోఽవాప్తుముపాయతః ||

మనస్సును వశపఱచుకొనని పురుషునకు యోగసిద్ధి కలుగుట కష్టము. కాని మనస్సు వశమునందున్న ప్రయత్నశీలుడైన పురుషుడు సాధనద్వారా సహజముగా యోగసిద్ధిని పొందుట సాధ్యమే అని నా అభిప్రాయము.

సంయమించని మనసు గలవారు యోగాన్ని అంటే బ్రహ్మైక్యాన్ని పొందలేరు అని నా అభిప్రాయం, స్వాధీనమైన మనసు కలిగి ప్రయత్నించేవారు మాత్రమే ఉపాయం ద్వారా పొందగలరు. ప్రయత్నశీలురకు నిత్య ధ్యాన యోగ అభ్యాసకులకు మాత్రమే బ్రహ్మయోగం ఆత్మసాక్షాత్కారం సిద్ధిస్తుంది గానీ సోమరులు అలసత్వం గలవారు బ్రహ్మయోగాన్ని పొందలేరు. అలాగే వీరు ఏ రంగంలోనూ కూడా వృద్ధి చెందలేరు. ఉపాయం అని చెప్పడం వల్ల యోగసిద్ధిని పొందడానికి ఖచ్చితంగా యోగ యుక్తులు కావాలని మనకు తెలుస్తుంది. మనం ముందు శ్లోకాల్లో యోగయుక్తులు అంటే ఏంటో చూశాం. 'మే మతిః' నా యొక్క నిశ్చయమని చెప్పడం వల్ల మనో నిగ్రహం లేని వారికి దైవసాక్షాత్కారం లభించదు, అలాగే ఉపాయంతో యోగయుక్తితో ప్రయత్నించేవారికి ఖచ్చితంగా సుసాధ్యమవుతుంది. ఈ శ్లోకంలో రెండు అంశాలను మనం గమనించాలి, ఒకటి సంయతమైన మనసు గలవారు సంయతాత్ములు, రెండు అభ్యాస వైరాగ్యాలతో మనసును నిగ్రహించువారు వశ్యాత్ములు. మనసు వశపరచుకున్న వారు కాబట్టి వశ్యాత్ములు వీరు గాలి లేని చోట దీపంలా సుస్థిరంగా ఉంటారు. ఈ రెండు లక్షణాలున్న యోగ యుక్తులకు ప్రయత్నంచేత పరబ్రహ్మ సాక్షాత్కారం సుసాధ్యం అవుతుంది. మనసు చలించడం అనేది కార్యం, అలా చలించడానికి కారణాలు రెండు. ఒకటి పూర్వజన్మ సంస్కారాలు వాసనలు, రెండు బాహ్య ప్రపంచపు ఆసక్తి. అయితే ధ్యాన యోగాభ్యాసంలో అభ్యాస విరాగాల ద్వారా ప్రపంచ వ్యవహారాల పట్ల సంగత్వం పూర్తిగా నశిస్తుంది. అలాగే ఆంతరంగిక శక్తి ఉద్దీపనం, విశ్వశక్తి ఆవాహనం ద్వారా వాసనలు సంస్కారాలు కూడా తొలగిపోతాయి. ఇలా ఈ చలనానికి కారణమైన రెండూ సమూలంగా క్షయమైపోయినప్పుడు మనకు స్వస్థితి కుదురుతుంది. ఇంతటి మహత్తరమైన ధ్యాన యోగాభ్యాసం లేని వ్యక్తిలో ధర్మ ప్రవృత్తి

అసంభవం. ఈరోజుల్లో ధర్మం పేరుతో చలామణి అవుతున్నవన్నీ కూడా ధర్మం లేని రుజువు చేస్తున్న సంగతి మనకు తెలుసు. బాహ్యంగా ధర్మాన్ని గురించి మాట్లాడుతూ ఆచరణకు నోచుకోని పరిస్థితి, వేర్లు లేని మొక్కల్ని మట్టిలో గుచ్చి అమర్చినట్లు అలంకరణకు పనికి రావచ్చుగాని వాటికి పూలు పళ్ళు కాయలు పండవు కదా. కాబట్టి గీతా స్వరూపులందరూ కూడా ధర్మమూలాలు ధ్యానంలో ఉన్నాయని ధ్యానం గీతాభ్యాసంలో గీతా యోగంలో ఉందని గ్రహించాలి. జీవితమనేది మరణించదు మృత్యువు అనేది జీవించదు. మరణించేది మరణిస్తుంది, జీవించి ఉండేది ఎప్పటికీ జీవించే ఉంటుంది. జీవితం మరణించదు, మృత్యువు జీవించదు. జీవితానికి అర్థం తెలియని వారు రాకపోకలు గల వాటిపై ఇష్టాన్ని పెంచుకొని వాటి వెంబడి వెళ్లి తన అమూల్యమైన సమయాన్ని వృధా చేసుకుంటారు. వీరు మృత్యువుతో జీవితం అంతమైపోతుందని భ్రమిస్తూ ఉంటారు కూడా. పుట్టుక జీవితానికి ఆరంభమూ కాదు, మృత్యువు జీవితానికి అంతమూ కాదు. ఈ జనన మరణాల మధ్య ఉన్నటువంటి జీవితం వాటికి అతీతంగా ఉంది. జనన మరణాలు రెండూ కూడా జీవితం లోపలే ఉంటాయి గాని జీవితం మాత్రం జన్మించనిది మరణించనిది అది సనాతనం. ఇలాంటి అంశాలను గురించి మనం అవలోకించి ఆత్మ పరిశీలనతో సంయతాత్ములుగా, వశ్యాత్ములుగా వర్ధిల్లాలి.

6అ, 37శ్లో.

అర్జున ఉవాచ |

అయతిః శ్రద్ధయోపేతో యోగాచ్చలితమానసః |
అప్రాప్య యోగసంసిద్ధిం కాం గతి కృష్ణ గచ్ఛతి ||

అర్జునుడు పలికెను -

ఓ కృష్ణా! యోగమునందు శ్రద్ధాదరములతో యోగసాధన చేయుచు మనస్సు వశమునందుండని కారణమున అవసానదశలో మనస్సు చలించి, యోగసిద్ధిని (భగవత్సాక్షాత్కారమును) పొందకయే మరణించిన సాధకుని గతియేమగును?

ఆత్మజ్ఞాన ఫలితం సమదర్శనం కదా అదే మోక్షానికి మార్గం, అయితే యోగనుష్ఠానాన్ని ప్రారంభించిన సాధకులు అనివార్య కారణాలవల్ల మనసును నిగ్రహించలేని స్థితిలో మరణిస్తే ఆ తరువాత ఏమౌతారనేది ఈ శ్లోకం స్పష్టం చేస్తుంది. యతి అంటే ప్రయత్నించేవారు, అయతిః అంటే ప్రయత్నం చేయనివారు, అలా అని వీరు శ్రద్ధ లేని వారు కాదు ఎంత శ్రద్ధ ఉన్నా వారి శక్తి మేరకు వారు ప్రయత్నించినా వారు జన్మజన్మలుగా ప్రోగుచేసుకొని ఉంచుకున్న నిల్వని ప్రక్షాళన చేసుకోవడానికి అది సరిపోదు. అంత సాధనకు తగినంత ప్రయత్నం చేయలేని పరిస్థితి వీరిది. వీరు ఎలాంటి వారంటే ఈ జన్మలోనే శ్రద్ధను అలవర్చుకున్న

వారు, అయితే వీరిలోని శ్రద్ధ అనేది ఇప్పటిది, ఈ జన్మది కదా. కానీ ప్రారబ్ధం ఎప్పటిదో కదా ఆ కారణంగా ప్రారబ్ధపు గాలులు వీరికి తగలడం వల్ల వీరు ఎంత ప్రయత్నించినా ఆ ప్రయత్నంలో అశక్తత చోటుచేసుకుని ఫలితం చేజారిపోతూ ఉంటుంది. అలా మనసు చలించిన కారణంగా భ్రష్టులై యోగ సిద్ధిని పొందకుండానే దేహాన్ని విడుస్తారు. కొందరు మోక్షమార్గాన్ని పొందాలనే నిశ్చయంతో ఇహలోకపు ఇచ్చకపు విషయాలు ఉచ్చులని, రాకపోకలు గలవని తెలుసుకొని వాటిని వదలిపెట్టి శ్రద్ధతో ప్రయత్నిస్తారు. ఈ శ్రద్ధ కారణంగా వీరు ఇహం భావం పోగొట్టుకుని ఇచ్చకపు ఉచ్చు నుండి బయటపడతారు. ఇదే మార్గంలో ధ్యాన యోగాభ్యాసాన్ని శ్రద్ధతో కొనసాగిస్తూ ఉంటారు. కానీ వీరికున్న వాసనలు మొత్తం తొలగడానికి సరిపడే ప్రయత్నం చేయడంలో తగిన సమర్ధత వీరికి ఉండదు. వీరు ఎక్కువగా ప్రయత్నిస్తున్నట్లు వీరికి అనిపించినా వారి నిల్వ మొత్తంలో వీరి సాధన అల్పంగానే ఉండి గమ్యాన్ని చేరుకోవడానికి సరిపడేంతగా ఉండదు ఇది ఇలా ఉండగా వీరి మోక్షం పరిస్థితి అంతు చిక్కనిది అవుతుంది. ఇహం పోయినా కూడా పరం అందుకోలేని ఓ అయోమయ పరిస్థితిని తలపిస్తుంది. ఈ పరిస్థితిలో పరమపదం చేరుకోవడం ప్రశ్నార్ధకంగా వీరికి అనిపిస్తుంది. ఇలాంటి సాధకుల పరిస్థితి ఏంటి అనేది అర్జునుడి ప్రశ్నలోని ఆంతర్యం. మనం ఇలాంటి వారిని మన అనుభవంలో చాలా మందిని చూస్తూనే ఉంటాం. అలాంటి సాధకులకు ధైర్యాన్ని ఊరటను ఇచ్చేదే ఈ శ్లోకం. ఇలా ఇహం పోయినా పరం ప్రసాదంగా మారిన సాధకులు అదే స్థితిలో నిష్క్రమిస్తే వారు మరణానంతరం ఏమవుతారు అనే సందేహం కూడా చాలామందిలో ఉంటుంది. అందుకే అర్జునుడు వీరు ఏ గతిని పొందుతారు అని చాలా స్పష్టంగా అందరి సాధకులలో ఉన్నటువంటి సందేహాన్ని సమానంగా తొలగించే విధంగా ప్రశ్నిస్తున్నాడు. అలా సమస్త సాధకులలో ఉన్నటువంటి సందేహాన్ని నివృత్తి చేసి ఈ విషయాన్ని నిర్ధారణ చేయడానికి అర్జునుడు ఈ ప్రశ్నను ఈ శ్లోకం రూపంలో మన ముందు ఉంచాడు. ఈ భూలోకంలో ప్రత్యేకించి ప్రస్తుత సమాజంలో నిలకడగా ధ్యాన యోగాభ్యాసం చేసేవారు చాలా అరుదుగా ఉంటారు. అసలు ధ్యానయోగం అనే ఆలోచన లేకుండా పూర్తిగా భౌతిక దృష్టితో మాత్రమే ఉండేవారు చాలామంది ఉంటారు. వీరిద్దరూ కాకుండా మధ్య రకం మనుషులు కొందరు కొంతసేపు ఆరోగ్యం కోసమో, ఆనందం కోసమో ధ్యానం చేద్దామని ప్రారంభించి కొద్దికొద్దిగా ధ్యానయోగభ్యాసాన్ని కొనసాగిస్తూ ఉంటారు. స్వల్ప సాధన తోనే దేహాన్ని విడిచి పెడతారు, ఇంకొందరు నేను సాధనలో పూర్ణత్వం పొందుతానో లేదో అనే నిర్వేదం అనుమానం హెచ్చరిస్తూ ఉంటుంది. వారిని అంతేకాక నేను ఇలాగే మరణిస్తే నా గతి ఏంటి ఈ జన్మ సార్ధకత ఎలా అనే శంక, ప్రశ్న వీరిని పలకరిస్తూనే ఉంటుంది. ఇలాంటి వారందరి సందేహానికి కూడా జగద్గురువు ఇచ్చే సమాధాన సందేశం కోసం మనం ఎదురుచూస్తూ ఉందాం.

6అ, 38శ్లో.

కచ్చిన్నోభయవిభ్రష్టః ఛిన్నాభ్రమివ నశ్యతి |
అప్రతిష్ఠో మహాబాహో విమూఢో బ్రహ్మణః పథి ||

హే మహాబాహో! అతడు (యోగభ్రష్టుడు) భగవత్ప్రాప్తిమార్గము నుండి జారినవాడై, ఆశ్రయరహితుడై (ఆలంబనము లేనివాడై), ఉభయభ్రష్టుడై, ఛిన్నాభిన్నమైన మేఘమువలె అధోగతి పాలు కాడు గదా!

ముందు శ్లోకంలో కృష్ణా! శ్రద్ధ ఉండి కూడా ప్రయత్నలోపం చేత యోగం నుండి చలించిన వారి గతి ఏంటి అని అడిగిన అర్జునుడు ఈ శ్లోకంలో ఆధ్యాత్మిక మార్గంలోకి ప్రవేశించి కూడా అందులో స్థిరత్వం పొందక ఇహం, పరం రెండు విధాలుగా చెడిన ఉభయ భ్రష్టులను గురించి అందులోనూ ప్రత్యేకించి 'విభ్రష్టులు' అన్నారు, వి అనే అక్షరం చేర్చడం వలన ఎటూ గాని పూర్తిగా భ్రష్టు పట్టిన అని అర్థం. ఏమాత్రం ఆధారం లేకుండా నిరాధారంగా మిగిలిపోయినటువంటి ప్రత్యేకమైన వారి కోసం చెప్పిన ఓ ప్రత్యేక శ్లోకం ఇది. వారు 'ఉభయవిభ్రష్టులు' బ్రహ్మపథంలో దారితప్పి నిలువ నీడ లేక చెల్లాచెదురైన మబ్బు వలె అనేటటువంటి పదాన్ని వాడారు. ఇందులో అర్జునుడు రెండింటికి చెడిన నిరాధారుల్ని చిన్నాభిన్నమైన మేఘంతో పోల్చాడు. అభ్రం అంటే మేఘం, చిన్నాభ్రం అంటే విడిపోయిన మేఘ ఖండం ఓ పెద్ద మేఘం నుండి విడిపోయిన మబ్బుతునక ఎటూ కాకుండా పోతుంది. అటు పైకి పోలేదు, ఇటు కిందకు వర్ష రూపంలోకి జారనూ లేదు, వృథాగా ఆకాశంలో ఉండిపోతుంది. అలా రెండింటికి చెడి విడిపోయిన మేఘశకలం లాగా మిగిలిపోతాడా అనేది అర్జునుడి ప్రశ్న. ఓ పెద్ద మేఘం నుండి విడిపడిన ఆ మబ్బు తునక తిరిగి మేఘాన్ని చేరలేందు. ఎంతో ఉన్నతంగా చరించాలని భావించి ఉన్నచోట నుండి విడిపోయింది. ప్రయత్న లోపం చేత అనుకున్న గమ్యాన్ని చేరే అవకాశాన్ని కోల్పోయింది. పోనీ ఇది తిరిగి వర్షించి భూమిని చేరుతుందా అనుకుంటే ఆ శక్తిని కూడా కోల్పోయిన పరిస్థితి. ఇది 'చిన్నాభ్రమివ' ఈ అంశాన్ని ఇప్పుడు ఉభయ విభ్రష్టులకు అన్వయించుకుందాం. మహామేఘమనే భౌతిక బంధాలను తెంచుకొని యోగమార్గంలో ప్రవేశించాక ఖచ్చితంగా గీతా సూత్రాలను పాటిస్తూ జ్ఞానమార్గంలో కొనసాగాలి. 6-32 లో చెప్పినట్లు ఆత్మౌపమ్యంగా కొనసాగాలి కదా, అలా కాక మళ్లీ ఆధ్యాత్మిక సాధనలో యోగ సిద్ధులను అనుభూతించాక వాటిని ఉపయోగించి అనేక విధాల వ్యాపార భావనతో కావచ్చు లేదా ఆధ్యాత్మిక అహంకారంతో కావచ్చు ఏ కారణం చేత అయినా స్వస్థానాన్ని తప్పితే సన్మార్గాన్ని వీడితే తదేక నిష్ఠను తప్పితే స్థానభ్రంశం చెందితే యోగభ్రష్టుడు అవుతాడు, రెండింటికి చెడిన వాడు అవుతాడు. అయితే అతని పరిస్థితి ఏంటి ఎందుకంటే సాధారణ స్థాయి మనుషుల కంటే సాధనలో కొంత పరిజ్ఞానం వీరికి ఉండటం వల్ల అలాంటివారు ఏమవుతారు అనేటటువంటి సందేహాన్ని సంధించాడు అర్జునుడు. ఆత్మజ్ఞాని ఎలా ఉంటాడని మనం ఆరు అధ్యాయాలుగా చూస్తున్నాం, అనుభవైకవేద్యం చేసుకుంటున్నాం కూడా. సమస్త ప్రాణుల సుఖదుఃఖాలు తనవిగా భావించేవారు యోగులు, సంయక్ దర్శనాన్ని కలిగి ఉండేవారు యోగులు. అన్నింటా నన్ను, నాయందు అన్నింటిని

చూసేవాడికి నేను కనిపించకపోవడం అన్నది నాకతడు కనిపించకపోవడం అన్నది లేనే లేదని 6-30లో చూశాం. అలాగే మూడవ అధ్యాయంలో మిధ్యాచారుల్ని, డాంబికుల్ని చూశాం. ఇలా మనం 2-42 లోని పుష్పితాం వాచం లాంటి వారి దగ్గర నుండి ఇప్పటివరకు మనం చర్చించిన వారిలో ఎవరు ఆత్మజ్ఞాన పరాయణులు ఎవరు మిథ్యాచారులో ఎవరు డాంబికులో ఎవరు కృత్స్నవిధులో ఎవరు అకృత్స్నవిధులో గమనించే శక్తిని చూపును జగద్గురువు అనుగ్రహంతో మనం పొందాం. వీటన్నింటినీ బట్టి అంతటి అన్నిటా ఉన్నది ఒకటే ఆత్మ అన్న భావంతో సుస్థిరంగా నిలిచి సర్వభూతాల యందున్న నన్ను కొలిచే యోగి ఎలా ప్రవర్తించినా నాయందే ఉంటాడు అన్న 6-31వ శ్లోకంలోని జగద్గురువు ఇచ్చిన భరోసాను బట్టి మనం ఈ అంశాలను నిర్ధారించుకున్నాం. అయితే అలా ఉండకుండా గీతా మార్గాన్ని లేదా బ్రహ్మ పదాన్ని వీడి దారి తప్పితే వారి పరిస్థితిని తెలుపమని మన తరఫున అర్జునుడు అడుగుతున్నాడు. 'భ్రష్టః' అంటే చెడినవారు, 'విభ్రష్టః' అంటే పూర్తిగా నిశ్శేషంగా చెడినవారు, అప్రతిష్టుడు. ఈ శ్లోకంలో రెండు అంశాలను మనం ప్రధానంగా గుర్తించాలి. ఒకటి బ్రహ్మ పథం చేరుకోలేక, రెండు తరువాతి జన్మకు మార్గం లేక అతని పరిస్థితి ఏమవుతుంది. చెల్లాచెదరైన మబ్బు వలె నిలువ నీడ లేని వాడవుతాడు, అప్రతిష్టుడు అవుతాడు. 4-9 వ శ్లోకంలో దివ్యమైన నా జన్మ కర్మల తత్త్వం తెలిసిన వారు మళ్లీ పుట్టరు, దేహం విడిచి నన్నే చేరుకుంటాడు అని మనం చూశాం ఆ చేరుకోవడమే గమ్యం కదా. మనం అది విడిచి ఆ బ్రహ్మ పథాన్ని విడిచి మనసు చలించి దృష్టిని మరల్చి దారి మధ్యలో దిశను మార్చుకొని అనేకరకాల దైహిక మానసిక వ్యాపారాలకు లేదా మరే వాటి కోసము దారి తప్పే పరిస్థితికి లోను కాకూడదని ఈ శ్లోకం ద్వారా మనం గ్రహించాలి.

6అ, 39శ్లో.

ఏతన్మే సంశయం కృష్ణ ఛేత్తుమర్హస్యశేషతః ।
త్వదన్యః సంశయస్యాస్య ఛేత్తా న హ్యుపపద్యతే ॥

ఓ కృష్ణా! ఈ నా సందేహమును పూర్తిగా నివృత్తిచేయుట నీకే చెల్లును. ఏలనన, ఈ సందేహమును తొలగించుట నీకు తప్ప మఱెవ్వరికిని శక్యము కాదు.

6-37, 38 శ్లోకాలలో ధ్యానమార్గంలో నుంచి దారి తప్పిన వారు అలాగే అనేక కారణాలవల్ల యోగభ్రష్టులైన వారి గతి ఏంటి వారి భవిష్యత్తు ఎలా ఉంటుంది అని ప్రశ్నించినటువంటి అర్జునుడు ఈ శ్లోకంలో నీవు తప్ప అన్యదా శరణం నాస్తి అని స్పష్టీకరించాడు. ఓ శిష్యుడిగా తనకున్నటువంటి బాంధవ్యంతో ఖచ్చితంగా నువ్వు తప్ప ఇంకొకరు లేరనే విషయాన్ని స్పష్టంగా తన జగద్గురువు ముందు ఉంచాడు. సద్గురువు మాత్రమే తన సందేహాల్ని సమూలంగా తొలగించగలరని నీవు తప్ప ఈ సంశయాన్ని తొలగించేవారు మరెవ్వరూ లేరని స్పష్టీకరిస్తున్నందువల్ల మనం ఈ విషయం నిర్ధారించుకోవచ్చు. కారణం శిష్యుణ్ణి కూడా

గురువుగానే భావించే సద్గురువు తత్త్వం లోనే అది వీలవుతుంది. ఒకరిలో ఒకరు మమేకం కాగలిగినప్పుడే అది సాధ్యమవుతుంది. భేదాలు అంతరాలతో ఒకరికొకరికి ఒనగూడకపోతే తలోదారిలో ఉంటే ఇలాంటి సందేహాలు నివృత్తి కావడం అసంభవం. అందుకని మమైక్యతా భావాన్ని, సమైక్యతా భావాన్ని చాటుతూ అర్జునుడు ప్రశ్నిస్తున్నాడు. ఈ అంశాన్ని మనం గమనించాలి సద్గురువు ఎప్పుడు కూడా అందరిలోనూ తననే చూసుకుంటాడు కాబట్టి ఎదుటివారిని తక్కువ లేదా చిన్న చూపుతో చూస్తే అది తననే చిన్న చూపుతో చూసినట్లు, తననే తక్కువ చేసి చూసుకున్నట్లు అవుతుందనే సూత్రం సద్గురువుకు తెలుసు కాబట్టి. సద్గురువు ఎప్పుడూ కూడా ప్రశ్నిస్తున్న శిష్యుల్లోనూ గురుత్వాన్నే దర్శిస్తాడు. అలా దర్శించిన సమదర్శులే సద్గురువులు అవుతారు. ఈ బాంధవ్యాన్ని ఈ సందర్భంగా మనం మరోసారి పునఃశ్చరణ గావించుకోవాల్సిన అవసరం ఉంది. బాంధవ్యం పరిపుష్టంగా ఉన్నప్పుడే మంచి ప్రశ్నలతో సంశయ నివృత్తితో బ్రహ్మవిద్య అధ్యయనంలో ఆటంకం లేకుండా కొనసాగి జన్మకు సార్ధకత చేకూరుతుంది. ఈ సూత్రాన్ని మనం 4-34లో చూశాం. నువ్వు తప్ప మరొకరు ఈ సందేహాన్ని తీర్చలేరని కూడా ఖచ్చితంగా చెబుతున్నారు కదా, ఇందులోని ఆంతర్యం సనాతనమైన అవ్యయమైన ఉత్తమమైన ఈ యోగాన్ని సృష్ట్యాదిలోనే సూర్యుడికి బోధించాను, సూర్యుడు మనువుకు, మనువు ఇక్ష్వాకునికి బోధించాడని 4-1లో జగద్గురువు చెప్పిన అంశాన్ని ఈ మాటకు అన్వయించుకుంటే మనకే సమాధానం స్ఫురిస్తుంది. సశిష్యుని లోని సందేహాన్ని సమూలంగా నివృత్తి చేసే సామర్థ్యం ఒక్క సృష్టికర్తకు, భగవంతునికే ఉంది, తానే బ్రహ్మమని ప్రవర్తిల్లే వారికే ఉంది. ఇదే విషయం మనకు విష్ణు సహస్రనామంలోనూ చాలా స్పష్టంగా ఉంది, 623వ నామం చిన్న సంశయః పరమాత్ముడు, సంశయహితుడు, జ్ఞాన స్వరూపుడైన అతనికి ఏ విధమైనటువంటి సంశయాలు లేవు, సకల సంశయాలకు మూలాలు పరమాత్ముని యందు కలవు. కనుక పరాపర భేదాలకు సకల సంశయాలకు సమాధానం అతని వద్దనే దొరుకుతాయి అని అర్థం. అలాగే 4-41లో యోగం చేత సమస్త కర్మలను వదిలిన వారిని, సంశయాన్ని జ్ఞానంతో ఛేదించిన వారిని కర్మలు బంధించవు అని చూశాం. అందుకని సృష్టికి మూలమైన సృష్టి మూలకర్త చెప్తున్న గీతా మార్గంలోనే మనకు సమస్త సంశయాలు నివృత్తి కాగలవు. ఈ అంశాలను మనం పరిశీలించి వాస్తవాన్ని గ్రహించి మనం కూడా మన మూలాల్లోకి సృష్టికర్త దర్శనం వైపుగా ప్రయాణించి మనలోని సమస్త సమస్యల్ని సమూలంగా తొలగించుకొని మన బ్రహ్మవిద్య అధ్యయనంలో ముందుకెళ్లాలి.

6అ, 40శ్లో.

శ్రీ భగవాన్ ఉవాచ।

పార్థ నైవేహ నాముత్ర వినాశస్తస్య విద్యతే ।
న హి కల్యాణకృత్కశ్చిత్ దుర్గతిం తాత గచ్ఛతి ||

శ్రీభగవానుడు పలికెను -

ఓ పార్థా! అట్టి (ఆ) పురుషుడు ఈ లోకమున గాని, పరలోకమున గాని అధోగతిపాలుగాడు. ఏలనన, నాయనా! ఆత్మోద్ధరణమునకు అనగా భగవత్ప్రాప్తికై కర్తవ్యకర్మలను ఆచరించువాడెవ్వడును దుర్గతి పాలుగాడు.

నాయనా నువ్వు చెబుతున్న యోగ భ్రష్టుడికి ఈ లోకంలో గానీ పరలోకంలో గానీ వినాశనం లేదు. మంచి చేసేవారు సన్మార్గంలో నడిచినవారు ఎన్నటికీ దుర్గతిని పొందరు. శ్రద్ధ ఉండి సామర్థ్యం లేక గాని మరే కారణం చేతగాని ఆగిపోయిన సాధకులు ఉభయ మార్గాల్లో భ్రష్టులైపోతారా అని సందేహిస్తున్న ప్రత్యేక సాధకులకు ఊరటను ధైర్యాన్ని ఇచ్చి ప్రోత్సహించేటటువంటి సంజీవని వంటి శ్లోకం ఇది. అర్జునా ! ఈ లోకంలో గాని పరలోకంలో గాని శుభకార్యాలు చేసిన వారికి వినాశనం లేదు, మనసు చలించిన యోగ భ్రష్టుడికి కూడా నాశనం ఉండదు. తాత అని సంబోధిస్తున్నందున తండ్రి అని అర్థం, తండ్రి పుత్రుని రూపంలో జన్మించే అవకాశం ఉన్నందున పుత్రుని తాత అంటారు. అందుకని తండ్రే తన కొడుకని కొడుకును తండ్రిగా పిలుస్తారు. శిష్యుడు పుత్ర సమానులు అంతకంటే ఎక్కువ అని మనం 4-1 లో చూశాం. అందుకని శిష్యుణ్ణి కూడా కొడుకు గానే భావిస్తారు కాబట్టి రక్తం పంచుకున్న కొడుకు కాకపోయినా తండ్రి అని పిలవచ్చనే సంస్కృతి సంప్రదాయాన్ని ఇక్కడ స్పష్టం చేస్తున్నారు. అలాగే దీని ద్వారా శిష్యుడి మీద ఉన్నటువంటి వాత్సల్యం కూడా మనకు అర్థమవుతుంది. మన ఆంతర్యాన్ని మనసును చూసే శక్తి ఒక్క దైవానికే ఉంది, భౌతిక ప్రపంచపు దృష్టికి మాత్రమే పరిమితమైన మనిషికి తెలియదు. టిట్టిభ పక్షిలా భగవంతునిపై దృష్టి నిలిపి సాధనలో కొనసాగితే చాలు అసమర్థత, అశక్తత తాత్కాలికం. కాబట్టి కొంతకాలానికి ఆ స్థితిని కూడా దాటి ముందుకెళ్లవచ్చు. ప్రయత్నం మంచిదైనప్పుడు ఫలితం కూడా మంచిదే అవుతుంది గాని పతనం కాదు. కాకపోతే పట్టు సడలకుండా దైవదృష్టిని వీడకుండా ధ్యాన యోగంలో కొనసాగాలి. ఆ ప్రయత్నంలో అసక్తత, అసమర్ధత చోటు చేసుకున్న కారణంగా ఫలితం అందనప్పుడు అక్కడే ఆగిపోతారు. అయినా కూడా వారు ధ్యానయోగం ఆరంభించిన వారు కాబట్టి ఆ జ్ఞానంతో, ఆ స్ఫురణతో తిరిగి పునః ప్రారంభంచేసి తగిన శక్తి సమర్ధతను సమీకృతమయ్యే విధంగా వీరు ధ్యాన సాధనలో కొనసాగగలరు. అందుకని వీరికి బుద్ధిలో శ్రద్ధ ఉంది కాబట్టి క్రమంగా మెల్లమెల్లగా సామర్థ్యాన్ని పెంచుకొని 'అయతి' 'యతి' అవుతాడు. అయితే శ్రద్ధ లేని వారు శుభకార్యాలు చేయని వారు పతనమవుతారు గాని శ్రద్ధ ఉండి ప్రయత్నలోపము ఉన్నవారు ఎప్పటికీ భ్రష్టులు కారు అని జగద్గురువు స్పష్టంగా తెలియజేస్తున్నారు. అందుకని వీరికి ఇహ, ఆముత్ర అని రెండు మాటలు ప్రయోగించాడు. సన్మార్గం వైపు సత్కార్యం వైపు తమ ప్రయాణాన్ని ప్రారంభించిన వారికి ఇహలోకంలో గాని పరలోకంలో గాని మరి ఎక్కడైనా గాని ఎన్నటికీ చేటు రాదు. కళ్యాణకృత్ అన్నారు మంచి పనిని శుభకార్యాలను కళ్యాణం అంటాం, ఈ పదం ప్రయోగించడం వల్ల ధ్యానయోగ ఆరంభం అనేది ఓ గొప్ప అత్యున్నతమైన శుభకార్యమని మనకు నిరూపణ అవుతుంది. మనం మనలో లీనమై మన

మూలాల్ని దర్శించే ధ్యానయోగభ్యాసం ఓ కళ్యాణకరమైన శుభకరమైన మంగళకరమైన కార్యంగా స్పష్టం చేశారు. ఇక ధ్యానయోగం ఆరంభించి మధ్యలో అశక్తత, అసమర్ధత వల్ల గాని లేదా ప్రయత్నలోపం వల్ల గాని ఏ కారణం చేతైనా ఆగిపోయిన లేదా నిష్క్రమించినా కూడా వీరు ఎక్కడైతే ఆగిపోయారో తిరిగి అక్కడి నుండే అదే జన్మలో గాని తరువాతి జన్మలలో గాని తమ తమ సాధనను కొనసాగిస్తారు. ఆ సమయం కూడా ఏదో ఒక క్షణం ఆసన్నమవుతుంది. ప్రకృతి సహజ సిద్ధంగా అలాంటి పరిస్థితి ఏర్పడేటట్లు మన చుట్టూ ఉన్న పరిస్థితులు తయారవుతాయి. అయితే ఇందులో మరో అంతర్యాన్ని గమనించాలి, 'కల్యాణకృత్ కశ్చిత్' అన్నారు మంచి పని చేసే వారికి సన్మార్గంలోని వారికి మాత్రమే దుర్గతి ఉండదు. అంతేగాని ఆ మార్గంలో లేనివారికి కళ్యాణకరమైన పనులు చేయకుండా ఆశుభకార్యాలు చేసే వారికి ఖచ్చితంగా దుర్గతి కలుగుతుందనే నిగూఢ అర్ధం ఇందులో మనకు ధ్వనిస్తుంది. జగద్గురువు అనేక అంశాల్ని చెప్పకనే అవ్యక్తంగా మనకు స్ఫురింప చేస్తాడు, ఇది సృష్టికర్త బోధనలో ఉన్నటువంటి గొప్పదనం. వీటన్నింటినీ పరిశీలించిన తర్వాత మనకు అర్ధమయ్యే విషయం ఏమంటే ఖచ్చితంగా సన్మార్గం వైపుగా ఒక్క అడుగు వేసినా ధ్యానయోగం వైపుగా ఒక్క ఆలోచన మనలో ముందుకు కొనసాగినా అది మన ఉత్తమ జన్మకు మన ఉన్నతికే తోడ్పడుతుంది అనేటటువంటి విషయాన్ని ఈ శ్లోకం స్పష్టీకరిస్తుంది.

6అ, 41శ్లో.

ప్రాప్య పుణ్యకృతాం లోకానుషిత్వా శాశ్వతీః సమాః ।
శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే ||

యోగభ్రష్టుడు పుణ్యాత్ములు పొందు లోకములను అవగా-స్వర్గాది- ఉత్తమ లోకములను పొంది, ఆయా లోకములలో పెక్కు సంవత్సరములు గడిపి, పిదప పవిత్రులైన | సంపన్నుల గృహమున జన్మించును.

ముందు శ్లోకంలో సత్కార్యులకు, సన్మార్గులకు ఉత్తమ జన్మ లభిస్తుందని అభయమిచ్చిన జగద్గురువు ఈ శ్లోకంలో ఎలా లభిస్తుందో వివరిస్తున్నారు. ధ్యానయోగ మార్గంలో ఉండి ఆగిపోయిన లేదా నిష్క్రమించిన యోగభ్రష్టులు, యజ్ఞాలు లేక యాగాలు చేసిన వారు పుణ్య లోకాలను చేరి వారు చేసుకున్న పుణ్యం మొత్తం క్షయమైపోయాక వారి వారి సాధనా స్థాయిని వారు వారు చేసిన కార్యాలను బట్టి జన్మ తీసుకుంటారు. వీరు ఎక్కడైతే ఆగిపోయారో ఎక్కడైతే వీగిపోయారో వీరి మనసు ఏ పరిస్థితుల్లో చలించిందో సరిగ్గా అదే పరిస్థితుల్లో నుంచి వారు తీసుకునే తరువాతి జన్మ ప్రారంభమవుతుంది. ఏ తరగతిలో ఆగిపోయారో ఖచ్చితంగా అదే తరగతి నుంచి మళ్లీ విద్యాభ్యాసం కొనసాగించాలని గ్రహించాలి. మళ్లీ అదే విధమైన వాతావరణం సందర్భం, పరిస్థితి ఎదురవుతుంది. ఖచ్చితంగా ఆ పరిస్థితిని ఎదుర్కొని ఆ స్థితిని దాటి అక్కడి నుండే తమ జీవితాన్ని కొనసాగించాల్సిన సందర్భం ఆసన్నమవుతుంది. ఇదివరకు వదిలిపెట్టిన లేదా ఆగిపోయిన ధ్యాన యోగాభ్యాసాన్ని అక్కడ

నుంచి మళ్లీ కొనసాగిస్తారు. శుచి అయిన శ్రీమంతుల గృహంలో జన్మ తీసుకుంటారని చెప్పారు అంటే దురలవాట్లకు దుష్ప్రవర్తనలకు అవకాశం లేనటువంటి కుటుంబం, సన్మార్గంలో నడుస్తున్న కుటుంబం అని అర్థం. డబ్బు విలాసాలు ఉన్న కుటుంబం అని కాదు పరిశుద్ధమైన భావాలు గల కుటుంబం. అటువంటి కుటుంబంలో పుట్టడం తన అభ్యాసాన్ని కొనసాగించడానికి అనువైన వాతావరణం ఏర్పడడం లాంటివి సహజంగానే జరిగిపోతాయి. యోగభ్రష్టులు పుణ్యలోకాలకు వెళ్లి అక్కడ పుణ్యమంతా క్షయమయ్యే వరకు ఉండి జన్మిస్తారని చెప్పడం వల్ల ధ్యానయోగంలో వీగకుండా దారి తప్పకుండా ముందుకెళ్తే సూక్ష్మంలోనే మోక్షం పొందవచ్చని నిరూపణ అవుతుంది. అంతేకాక జ్ఞాన యోగాభ్యాసం ప్రారంభమే మహా పుణ్యప్రదం అని ముందు శ్లోకంలో చూశాం. అలాగే సదాచార్యులు, శుచి అయిన శ్రీమంతుల ఇంట జన్మను పొందే అవకాశం కూడా వీరికి ఉండటం వల్ల తిరిగి వారు తమ ధ్యాన యోగాభ్యాసానికి ఏ మాత్రం ఆటంకం లేకుండా ఉంటుంది. మన జగద్గురువును మన సృష్టికర్తను మన మూల శక్తిని చేరడానికి మనం మోక్షం పొందడానికి ధ్యానయోగం ఎంతటి అత్యున్నతమైన ఉపకరణమో ఈ అంశాన్ని బట్టి గ్రహించాలి. కొంత కొంత ధ్యాన సాధన అయినా ఎంతటి బృహత్ స్థానాన్ని ప్రసాదిస్తుందో చూశారా గీతాస్వరూపులారా, దైవంశ సంభూతులారా ఇది ధ్యాన యోగ రహస్యం. సృష్టిలోని సకల జీవులూ ధ్యానయోగంలోనే ఉంటున్నాయి, అందులోనే లయిస్తాయి, ఒక్క మానవుడు తప్ప. ఒక పక్షి గాలిలో ఎగురుతుంది అలా ఎగరడానికి కారణం ఆ పక్షి లోని ధ్యాన దృష్టి, ఏకాగ్రత ఇలా మనం సమస్త ప్రకృతిని గమనిస్తే ప్రతి జీవి చాలా సహజంగా స్వస్థితిలోనే జీవిస్తుంది. ప్రాణం గల ప్రతి జీవి కూడా తనదైన రీతిలో ధ్యాన యోగంలోనే కొనసాగుతుంది, అవి తనలోని దైవ శక్తితోనే కూడి ఉంటుంది. మనం కూడా ధ్యాన యోగంలో అంతర్లీనంగా మనలో ఉన్న దైవశక్తితో సదా కూడి ఉండటమే మన యొక్క సహజత్వం. అలా మనం సదా మన మూల శక్తితో కూడి ఉన్నప్పుడే సహజమైన జీవనం జరిగి పరమపదాన్ని పొందగలం.   భగవద్గీతను కొంచెం అయినా అధ్యయనం చేసిన వారిని గీతా జలాన్ని ఒక్క చుక్కైనా పానం చేసిన వారిని ఆత్మజ్ఞానులను ఒక్కసారైనా దర్శించిన వారిని వారితో చర్చ చేసిన వారిని గూర్చి యముడు యమలోకంలో చర్చించరని ఆదిశంకరులు అన్నారు. ఇక్కడ గీతా జలం అంటే గీతా ధ్యాన యోగాభ్యాసంలో మనం పొందే జ్ఞానం, దైవ శక్తితో కూడి ఉండటం వల్ల మనం మనలో నింపుకునే దైవశక్తి అదే గీతాజలం. ఈ అంశాలన్నీ మనం పరిశీలించిన తరువాత కొంత కొంత మనం చేసేటటువంటి ధ్యానయోగ ఫలం ఏమంటే ఒకటి పుణ్యలోకాల ప్రాప్తి, రెండు శుచి అయిన శ్రీమంతుల ఇంట జన్మ, మూడు అలాంటి గృహంలో జన్మించి తిరిగి ధ్యానయోగభ్యాసాన్ని కొనసాగించే అవకాశం. కొంత కొంత ధ్యానం, ఎంతో ఎంతో లాభం మహా మహా లాభం, మహోన్నతమైన లాభం. ఇది ధ్యానయోగ ఫలితం. అర్జునా! ధ్యానయోగంలో ఆగిపోయిన లేదా నిష్క్రమించిన తరువాత పుణ్యాత్ములు ఉండే లోకాలకు వెళ్లి కొన్ని సంవత్సరాలు అక్కడే ఉండి ఆ తరువాత పవిత్రులైన శ్రీమంతుల ఇంట జన్మిస్తారు.

6అ, 42శ్లో.

అథవా యోగినామేవ కులే భవతి ధీమతామ్ ।
ఏతద్ధి దుర్లభతరం లోకే జన్మ యదీదృశమ్ ||

అథవా విరాగియైన పురుషుడు ఆపుణ్య (ఊర్ధ్వ) లోకములకు పోకుండగనే జ్ఞానులైన యోగుల కుటుంబములోనే జన్మించును. కాని, లోకమునందు ఇట్టి జన్మ ప్రాప్తించుట మిక్కిలి దుర్లభము.

యోగ భ్రష్టుడు కొంతకాలం పుణ్యాలోకాల్లో వశించి ఆ తరువాత సదాచారవంతులైన శ్రీమంతుల ఇంట జన్మించి తిరిగి తన ధ్యాన యోగ సాధనను కొనసాగిస్తారని ముందు శ్లోకంలో చూశాం. ఈ శ్లోకంలో వారి వారి ఔన్నత్యాన్ని బట్టి జ్ఞానవంతులైన యోగుల కుటుంబంలోనూ పుట్టవచ్చు కానీ ఇలాంటి జన్మ మహాదుర్లభం అన్నారు కారణం కొందరు గత జన్మల్లో సామర్థ్యలోపం వల్ల ఆచరించలేక విడిచిపెట్టిన వారు, మరికొందరు లక్ష్యాన్ని చేరకనే నిష్క్రమించిన వారు కావడం వల్ల తిరిగి ఆ తరగతి నుండే తమ తమ బ్రహ్మ విద్యాభ్యాసాన్ని ప్రారంభిస్తారు. ఉదాహరణకు యోగసాధన ఎక్కువగా చేసి లక్ష్యాన్ని మాత్రం పొందక శరీరాన్ని విడిచి ఉంటే వారు ధీమంతుల, యోగుల ఇంట జన్మిస్తారు. ఇందులో మనం ప్రధానంగా గ్రహించాల్సిన అంశం పుణ్యలోకాలకు వెళ్లినవారు వారి పుణ్యమంతా క్షయమయ్యే వరకు అనేక సంవత్సరాలు వేచి చూడాలి. ఆ తరువాత శ్రీమంతుల ఇంట జన్మించాలి లేదా తమతమ అర్హతను బట్టి సాధనా స్థాయిని బట్టి ధీమంతుల, యోగుల సంప్రదాయ కుటుంబంలో జన్మించడమనేది ఆధారపడి ఉంటుంది. పైగా మానవుల కాలమానం వేరుగా ఉంటుంది, దేవతల కాలమానం వేరుగా ఉంటుంది, సృష్టికర్త కాలమానం వేరుగా ఉంటుంది. మరి దేవలోకంలో పుణ్యం క్షయమయ్యే వరకు వేచి ఉండడం అనేది మానవ గణన ప్రకారం చాలా కాలం తీసుకుంటుంది. అయితే ఇది చాలా అరుదైనది అని ఈ శ్లోకం యొక్క ఆంతర్యం. ఈ పరిస్థితిని మనకు సంభవించకుండా వీరబ్రహ్మేంద్రస్వామి పుణ్యాలోకములకు పోయిన పోకగ పోవువారు వచ్చి పోవుచుంద్రు వచ్చి పోవు దారి వదిలించుకోవలె కాళికాంబ హంస కాళికాంబ అన్నారు. పుణ్యలోకాలకు వెళ్లిన మనం పుణ్యం అయ్యేవరకు వేచి వేచి ఉండాలి, ఆ అవసరం లేకుండా యోగయుక్తితో ఈ గీతాధ్యయన అవగాహనతో మనం తిరిగి తిరిగి జన్మించాల్సిన, వేచి ఉండాల్సిన రాకపోకలు గల పుణ్యలోకాలకంటే గూడ అతీతంగా ఆలోచించి ఈ జన్మలోనే తానే బ్రహ్మమై వెలుగొందేలా మనం మన ధ్యానయోగ విధానాన్ని పరిపుష్టం చేసుకుని యోగులం కావాలి. మనం ఇప్పటికి ఆరు అధ్యాయాలుగా ఎంతో సమయాన్ని వెచ్చించి ఈ బ్రహ్మ విద్యను అభ్యసిస్తూ ఉన్నాం. కారణం గీత కోసమో దేవుడు కోసమో కాదు, మన కోసం మనం భగవంతుడిని చేరడం కోసం భగవంతుని గీతలో పయనిస్తున్నాం. కాబట్టి ప్రతి అంశాన్ని మనకు మనం సమన్వయం చేసుకుంటూ ఆచరిస్తూ ముందుకెళ్లాలి. ముందు శ్లోకంలో శ్రీమంతుల ఇంట అని చెప్పిన జగద్గురువు ఈ శ్లోకంలో ధీమంతుల ఇంట అని పేర్కొన్నారు ఇది గమనించాల్సిన అంశం. ఈ ప్రపంచంలో యోగుల వంశంలో యోగుల కుటుంబంలో జన్మించే ప్రాప్తం ఉన్నతమమైనదని ఆ జన్మ

ద్వారా పరమపదం చేరుకోవచ్చని మనకు తెలుస్తుంది. ఇందులో 'కులే' అనే మాటకు వంశం లేదా సంప్రదాయం అని అర్థాన్ని తీసుకోవాలి. 4-13 లో మనం చర్చించిన శ్లోకంలోనూ ఈ అంశాన్ని గ్రహించవచ్చు. యోగుల వంశంలో సంప్రదాయంలో జన్మించడం చాలా అరుదు కాబట్టి ఒకవేళ మనం ఇప్పటివరకు జన్మించక పోయినా మనం మన తరువాత తరానికి ఈ సంపదను అవకాశాన్ని ఇవ్వగలం, అది మన చేతిలో పని ఆదిశగా మన ఆలోచన కొనసాగాలి. అందుకు మనం చేయాల్సింది బ్రహ్మ విద్య అధ్యయనం, ఆచరణం. తద్వారా తరతరాలకు ఈ యోగత్వపు సంప్రదాయం అబ్బుతుంది. మన తరువాత తరం మన పిల్లల కంతా కూడా చాలా ప్రశాంతమైన ఆధ్యాత్మికమయమైన అత్యున్నతమైన జీవితాన్ని అందివ్వగలమని మనం గ్రహించాలి. అందుకు మనం కంకణబద్ధులం కావాలి. ధనంతో కూడుకున్న సాత్వికయుత కుటుంబం కన్నా కూడా యోగ జీవనం, ధ్యానయోగ సంప్రదాయం అలవరచడం ఎంతో ఎంతో మహోన్నతమైనదిగా మనం గుర్తించాలి. కాబట్టి శ్రీమంతుల, ధీమంతుల యోగ సంప్రదాయపు జన్మనివ్వడానికి మన తరువాతి వంశపు భవిష్యత్తు తరానికి అంతా కూడా మనం మూల కారణం కావాలి. దైవత్వం వైపుగా ప్రయాణించి దైవంలో విలీనమయ్యే బ్రహ్మ పదానికి మన వంశానికి మన తరానికి మనం నాంది పలకాలి. మన భావితరాల దృష్టిని భౌతిక తాత్కాలిక రాకపోకలు కలిగినటువంటి భవభంధాల వైపుగా కాకుండా దైవంపై దృష్టిని నిలిపేట్లుగా చేయడానికి ఈ క్షణమే మనం బ్రహ్మవిద్య అధ్యయనంలో నిరాటంకంగా నిరంతరాయంగా యోగ భ్రష్టతకు అవకాశం లేకుండా కొనసాగుదాం.

6అ, 43శ్లో.

తత్ర తం బుద్ధిసంయోగం లభతే పౌర్వదేహికమ్ ।
యతతే చ తతో భూయః సంసిద్ధౌ కురునందన ||

అచట (యోగి కుటుంబమున పుట్టిన పిదప) పూర్వదేహమున సాధించిన బుద్ధి సంయోగమును అనగా సమబుద్ధిరూపయోగ సంస్కారములను, అతడు సులభముగనే పొందును. ఓ కురునందనా! ఆ బుద్ధిసంయోగ ప్రభావమున, అతడు మఱల పరమాత్మప్రాప్తి సిద్ధించుటకై మునుపటి కంటెను అధికముగా సాధన చేయును.

పూర్వజన్మల సంస్కారాలకు సంబంధించినటువంటి అంశాలను మనం 3-33లో సమగ్రంగా చర్చించాం. జన్మజన్మలకు సంస్కారాలు ఎలా మనలో నిల్వ ఉంటాయో ఎలా మనల్ని వెంటాడుతాయో సవివరంగా అక్కడ చూశాం. ఆ అంశాన్ని ఖచ్చితంగా పునఃశ్చరణ గావించుకొని ఈ అంశాన్ని పరిశీలిస్తేనే సంపూర్ణంగా మనకు ఈ శ్లోకం అవగతం అవుతుంది. ముందు రెండు శ్లోకాల్లో యోగభ్రష్టులు శ్రీమంతుల లేక ధీమతుల వంశంలో పుట్టవచ్చు ఇలాంటి జన్మ అరుదైనది అని చెప్పిన జగద్గురువు ఈ శ్లోకంలో అలా జన్మించిన వారు పూర్వజన్మ స్మృతితో పూర్వం కంటే వేగంగా ఆత్మసిద్ధి కోసం యత్నిస్తారని వారికి పూర్వజ్ఞానం సంక్రమించే విధానాన్ని స్పష్టం చేశారు. జనన మరణాల మధ్యలో పూర్వపు శరీరం నశిస్తుందే గాని పూర్వపు జన్మ

జన్మల సంస్కారం కాదు, మోక్షస్థితికి చేరేవరకు అవి అలాగే ఉంటాయి. ఈ జన్మలో పూర్వపు ధ్యాన యోగ సాధనా సంస్కార స్ఫురణబలంతో ఈ జన్మ ఆరంభమవుతుంది. కారణం మనిషికి జీవిత పరమార్ధం, లక్ష్యం, గమ్యం తెలియక అనేక జన్మలు గడుస్తాయి, తెలిసిన తరువాత సరైన దారిలో సాధనా మార్గంలో ప్రయాణించినా ప్రయత్నలోపం వల్ల అసమర్ధత వల్ల కొన్ని జన్మలు గడిచి పోతాయి. అలాగే మరెన్నో కారణాలవల్ల యోగ భ్రష్టత్వంతో మరికొన్ని జన్మలు గడిచిపోతాయి. వీటన్నింటినీ మించి 4-41లో చెప్పినట్లు అనేక సంవత్సరాలు పుణ్య లోకాల్లో గడిచిపోయాయి, ఇంతటి ప్రయాణంలో జన్మజన్మల సంస్కార ఫలితంగా పూర్వదేహ సంబంధమైన సంస్కారపు అవ్యక్త చిట్టా వల్ల ఖచ్చితంగా ఆ సంస్కారబలం ప్రభావం చేత ఈ జన్మలో సహజంగానే యోగంలో లీనమై తగిన విధంగా వేగంగా వీరు ధ్యానయోగ మార్గంలో కొనసాగుతారు. మనం జన్మజన్మల నుంచి భౌతిక ప్రపంచంతో తాదాత్మ్యం చెందుతూ ఉంటే అవే సంస్కారాల రూపంలో ఉండి మనల్ని ఈ జన్మలోనూ భౌతికత్వం వైపు నడిపిస్తాయి. అయితే జన్మజన్మల నుండి నేను ఆత్మను శరీరం వేరు, నేను వేరు అనే ధ్యాన యోగ సాధనలో కొనసాగి ఆగిపోయిన లేదా వీగిపోయిన యోగభ్రష్టులు ఈ జన్మలో పూర్వజన్మకు సంబంధించిన బుద్ధితో అదే జ్ఞానం స్థిరమై ఈ జన్మలో బలమై ఆ జ్ఞానమే వీరిని ముందుకు నడిపిస్తుంది. అందువల్ల సంపూర్ణ యోగ సిద్ధికై మరలా వీరు తీవ్రంగా ప్రయత్నాన్ని కొనసాగిస్తారు. వివేక చూడామణి లో చెప్పినట్లు విష పదార్థం యొక్క అవశేషాలు శరీరంలో ఉన్నంతకాలం స్వస్థత చేకూరదు, అలాగే మనలో లేశమాత్ర అహంకారం శేషించి ఉన్నా కూడా ముక్తి లభించదు అని దీని అర్థం. యోగభ్రష్టతకు మూలకారణం ఇదే అందుకని మనం భౌతిక ప్రపంచపు రాకపోకలకు సంబంధించిన వాటిని విషంలా భావించాలి, అప్పుడే స్వస్థత చేకూరుతుంది. అలాగే అహం భావన లేశమాత్రం కూడా మనలో శేషంగా మిగలకుండా చూడాలి, అందుకే 4-23 లో మనం 'సమగ్రం ప్రవిలీయతే' చూశాం. దీన్ని బట్టి జన్మజన్మాంతర సంస్కారాలు మొత్తం జ్ఞానాగ్నిలో దగ్ధమైపోయే వరకు ఆ సంస్కారాల దస్త్రం జన్మజన్మలకు కొనసాగుతూనే ఉంటుంది.

6అ, 44శ్లో.

పూర్వాభ్యాసేన తేనైవ హ్రియతే హ్యవశోఽపి సః ।
జిజ్ఞాసురపి యోగస్య శబ్దబ్రహ్మాతివర్తతే ||

శ్రీమంతుల ఇంటిలో జన్మించిన యోగభ్రష్టుడు పరాధీనుడైనను పూర్వసాధన ప్రభావమున నిస్సందేహముగ భగవంతునివైపు ఆకర్షితుడగును. అట్లే సమబుద్ధిరూపయోగజిజ్ఞాసువుగూడ వేదములలో తెల్పబడిన సకామకర్మల ఫలమును అధిగమించును.

ఈ శ్లోకంలో ప్రతిపాదించినవి ఈ రెండు అంశాలు, పూర్వజన్మలో చేసుకున్న అభ్యాసం పూర్వాభ్యాసం ఏ కారణం చేతనైనా యోగభ్రష్టుడైన పరవశుడు తన పూర్వాభ్యాసం చేత లాగబడినవాడై తన ప్రమేయం లేకుండానే గత జన్మల సంస్కారం ఈడ్చుకొని వెళ్లడం వల్ల తనకు తానుగా ఆత్మసిద్ధి వైపుకు నడుస్తుంటాడు. అలా అవి వారిని స్వరూపజ్ఞానం పొందే వరకు యోగమార్గం

వైపుకు లాగుతూనే ఉంటాయి, చేసిన పాపకర్మల బలం ఎక్కువైతే ధ్యానయోగం వల్ల కలిగిన సంస్కారం అణగి ఉంటుంది. ఆ పాప కర్మలబలం క్షయం కాగానే ధ్యానయోగ సంస్కారబలం తన పనిని తాను ప్రారంభిస్తుంది. ఎన్ని జన్మలు గడచినా ఎంత సుదీర్ఘకాలం ఉండినా కూడా ధ్యాన యోగ స్వరూపం తెలిసి స్వస్వరూపానుసంధానం జరిగే వరకు అది అలానే ఉంటుంది. జ్ఞానంలో సమస్త సంస్కారాలు భస్మమయ్యే వరకు అవి నశించవు, అలా ఉండిపోయిన సంస్కారాల నిల్వ మొత్తం యొక్క బలంతో ప్రజ్వలిస్తున్న అగ్ని సమిధల్ని భస్మం చేసినట్లు జ్ఞానం అనే అగ్ని సర్వకర్మల్ని సమూలంగా భస్మం చేస్తుంది. అలా గత జన్మల్లో యోగాన్ని విడిచి నిష్క్రమించిన వారు యజ్ఞాలు యాగాలు, పుణ్య కార్యాలు చేసినా మూలశక్తిని దర్శించడం తెలియక మోక్షం పొందక పుణ్యలోకాలకు వెళ్లి పుణ్య ఫలాలను అనుభవించి తిరిగి ఇక్కడ జన్మిస్తారు. ఆ కారణంగా వీరికి పూర్వజన్మల్లో ఎక్కడైతే విడిచిపెట్టారో ఆ భావాలు తిరిగి ఈ జన్మలో రెట్టించిన ఉత్సాహాన్ని ఇచ్చి ముందుకు నడిపిస్తాయి. కాలహరణకు వీరికి అవకాశం లేకుండానే వేగాన్ని పుంజుకొని శీఘ్రంగా ఆధ్యాత్మిక బాటలో పయనిస్తారు. యోగవాసిష్టంలో ఇలా చెప్పబడింది, శుచుల, శ్రీమంతుల, గుణవంతుల, సాధువుల గృహాలలో జన్మించి పూర్వ యోగ వాసన లాగడం చేత యోగాన్ని అనుష్టిస్తారు. పూర్వజన్మలో అనుష్టించిన యోగాభ్యాస క్రమం తెలిసి దాన్ని మరింత పరిణతితో ఆచరిస్తారు అన్నారు. మనం 3-33 లో సంస్కార ప్రభావం ఎలా ఉంటుందో సమగ్రంగా చూశాం, మనిషి జీవితంలో మనిషికి తన జీవితంలో జన్మంతరాల సంస్కారాలు ప్రధాన భూమికను పోషిస్తాయి. యోగభ్రష్టులలో అవి మరీ దృఢంగా బలంగా స్పష్టంగా కనిపిస్తాయి, ఈ విషయం మన నిజ జీవితాన్ని మన చుట్టూ ఉండే వారి జీవితాలను గమనిస్తే మనకే ఈ విషయం స్పష్టం అవుతుంది. జీవుని జీవత్వస్థితి నిరంతరం ఏదో విధమైన వేదనా సంభరితంగానే ఉంటుంది, కారణం తెలియని ఆధారం కనిపించని స్పష్టత లేని ఒక రకమైన వేదనను జీవుడు నిత్యం అనుభవిస్తూనే ఉంటాడు. ఆకలితో ఉన్నవారికి ఆకలి బాధ ఆకలి తీరిన వారికి మరేదో లేదని కొరత, అన్ని సౌకర్యాలు ఉన్నవారికి ఇంకేదో లేదని వెలితి. అన్నీ ఉన్నా మరే పదవి కోసమో కీర్తి కోసమో ఆరాటం, పోనీ కీర్తి సంపాదించినా ఇంకా ఇంకా ఏదో సాధించాలని పోరాటం ఇలా ఎన్ని విధాలుగా చూసినా చివరకు అందరిలో ఉన్నది కొరత వెలితి ఆరాట పోరాటం. కారణం ఏదో ఒక అమూల్యమైనది పొందాలని ఓ మహానంద సామ్రాజ్యం నుంచి తాను ఏదో పతనమైపోతున్నట్లు తనదైన సామ్రాజ్యాన్ని తాను ఇంకా చేరుకోనట్లు ఎప్పుడూ వేదన పొందుతూనే ఉంటారు అదే జీవుని వేదన. అయితే ఆ సామ్రాజ్యం దైవ సామ్రాజ్యం అని వారు పొందాల్సింది తనలోని అమూల్యమైన ఆత్మ సంపద అని గుర్తించలేని అవిద్యాపరులు, అజ్ఞానులు. అంటే ఈ బాహ్య ఇంద్రియాలతో బాహ్య కళ్ళకు కనువిందుగా అనిపించే ఈ బాహ్య ప్రపంచాన్ని కాక వీటికి ఆవల ఉన్న దైవశక్తిని తనలో తనకు కనిపించకుండా ఉంటున్న ఆత్మశక్తిని తెలుసుకోలేని దైన్యస్థితి. దీనితో క్రమంగా పరమాత్మలో ఒక అణువైన తాను వేరుగా ఉన్నానేమిటి, ఏమిటి ఈ ఎడబాటు ఎందుకు మనకీ బాధ వేదన, పరమాత్మలో తాను మమేకమైన అనుభూతి పొందే మార్గం ఎలా? ఇలాంటి మార్గం తెలియక దర్శించలేక పోవడానికి కారణం ఏంటి? ఎందుకు మనిషి ఇన్ని రకాల పేర్లతో వేదనకు వాదనకు గురి అవుతూ ఉంటాడు? అనే అన్వేషణలో ఇది ఇప్పటిదా, ఈనాటిదా ఈ జన్మదా అనుకుంటూ అది కాదని తేలిపోతుంది. జన్మజన్మలుగా జన్మిస్తూ మరణిస్తూ సుఖదుఖాల కడలిలో చిక్కి బిక్కరిస్తూ జన్మాంతరాలుగా

తెచ్చుకున్న సంస్కారం అని నిర్ధారించుకుంటారు. జ్ఞాపకాలు అనేవి ఈ జన్మకు సంబంధించింది, స్మృతులు అనేవి గత జన్మలకు సంబంధించినవి, మనకు తెలియకుండానే నిగూఢంగా ఉండే స్మృతులు మన ప్రమేయం లేకుండానే మనల్ని నడిపిస్తాయి. స్మృతులు మన వశంలో లేకపోయినా మనం వాటికి వశమై ఉంటాం. అందుకని ఆ సంస్కారంతో మనం వాటి ద్వారా లాగబడుతూ ఉంటాము, వాటికి బద్ధులవుతాము. తన వశంలో లేనివారు అవశులు, యోగభ్రష్టులు పూర్వపు స్మృతులతో అవశులై ధ్యాన యోగంలోకి లాగబడి కొనసాగుతారు. ఇది 'హ్రియతే హ్యవశోఽపి సః' ఇక్కడ అవశులు పరాధీనులు అంటే తమ ఆధీనంలో లేనివారు, అంటే ముందు జన్మల్లో మనసు చలించిన ఆగిపోయిన వీగిపోయిన లేదా లక్ష్యాన్ని చేరక నిష్క్రమించిన వారు కాబట్టి పరాధీనులు తనపై తాను పట్టును కోల్పోయిన వారు, తమపై తాము అదుపు తప్పిన వారు అని అర్థం చేసుకోవాలి. అందుకే జగద్గురువు వీళ్లను అవశులు, పరవశులు, పరాధీనులు అన్నారు. ఏ విధమైన అనుకూల పరిస్థితులు ఉండకపోయినా ఎవరి ప్రేరణ లేకపోయినా పూర్వపు స్మృతుల బలంతో శైశవ దశలోనే అపారమైన భక్తి, శ్రద్ధ అజ్ఞానం ఉన్న వారిని ఎందరినో మనం ఉదాహరించుకున్నాం, మన నిజజీవితంలో అరుదుగా అలాంటి వాళ్లను చూస్తున్నాం. ఇది మొదటి పాదం 'పూర్వాభ్యాసేన తేనైవ ప్రియతే హ్యవశోఽపి సః'.

ఇక 'శబ్దబ్రహ్మాతివర్తతే' ధ్యానయోగాభ్యాసంలో ధ్యాననిష్ఠలో ఆత్మసాక్షాత్కారాన్ని పొందాలనే జిజ్ఞాశువు శబ్ద బ్రహ్మాన్ని కూడా దాటిపోతాడు. శబ్దబ్రహ్మ అంటే వేదోక్తకర్మానుష్టానఫలం. 2-45 శ్లోకాన్ని ఖచ్చితంగా మళ్ళీ పునఃశ్చరణ గావించుకొని సమన్వయం చేసుకుంటేనే మీ అంశం మనకు అవగాహన అవుతుంది. వేదంలో పేర్కొన్న కర్మకాండల కార్యఫలాలన్నింటిని కూడా నిశ్శేషంగా విడిచిపెట్టిన వారు. అలా వేదంలోని పూర్వ భాగాన్ని దాటి ఉత్తర భాగంలోని వేదపు లోతుల్ని స్పృశించి తానే బ్రహ్మమని సర్వం బ్రహ్మమని అనుభవంలోకి తెచ్చుకున్నవారు, అది శబ్దబ్రహ్మాన్ని దాటిపోవడం అంటే. మూడవ అధ్యాయంలోని యజ్ఞ ప్రకరణం నాలుగవ అధ్యాయంలో చర్చించిన యజ్ఞాలన్నింటిని అర్థం చేసుకొని జ్ఞాన యజ్ఞంలో స్థిరమైనప్పుడు 'శబ్దబ్రహ్మాతివర్తతే' అన్న మాట అనుభవేద్యం అవుతుంది. ఈ అంశాలను నీటిని మనం పరిశీలించాక మనం రెండు అంశాలను గ్రహించాలి. ఒకటి యోగభ్రష్టులు జన్మాంతర సంస్కారం వల్ల తనకు తానుగా ధ్యానంలోకి లాగబడతారు, రెండు స్వస్వరూపాను సంధానం చేయాలనే జిజ్ఞాసులు, ఆత్మజ్ఞానం పొందాలని ఆకాంక్ష ఉన్నవారు అనిత్యమైన వేదోక్త కర్మకాండకార్య ఫలాన్ని శబ్ద బ్రహ్మల్ని దాటిపోయి పరమపదం పొందుతారు.

6అ, 45శ్లో.

ప్రయత్నాద్యతమానస్తు యోగీ సంశుద్ధకిల్బిషః |
అనేకజన్మసంసిద్ధః తతో యాతి పరాం గతిమ్ ||

కాని,ప్రయత్నపూర్వకముగ యోగసాధనచేయు యోగి అనేక జన్మల సంస్కారముల ప్రభావమున ఈ జన్మయందే సిద్ధిని పొంది, సంపూర్ణముగా పాపరహితుడై, తత్క్షణమే పరమ పదమును పొందును.

ప్రయత్నం అంటే అధిక ప్రయత్నం నిరంతరం పట్టు విడవకుండా టిట్టిభ పక్షిలా ప్రయత్నిస్తూనే ఉండేవారు అని అర్థం. అలాంటివారు అనేక జన్మలలో కొద్దికొద్దిగా తన సంస్కారాలను పోగు చేసుకొని అలా నిల్వ ఉంచుకున్న మొత్తంతో సంయక్ దర్శనం కలిగి పరమపదాన్ని పొందుతారు. ధ్యానశక్తి ద్వారా మనం యోగమయ్యే మూలశక్తి మనల్ని సదా రక్షిస్తూ ముందుకు నడుపుతుంది, అది మన ఉన్నతికే తోడ్పడుతుంది. మనం దాన్ని వీడినా అది మనల్ని వీడదు, సంస్కార రూపంలో మనకు తోడుండి మనల్ని సదా నడిపిస్తుంది. మన హృదయాన్ని జన్మజన్మలకు తట్టిలేపుతూ మనల్ని ఆత్మసాక్షాత్కారసిద్ధి పొందేవరకు మనతో అభ్యాసం చేయించి మనల్ని విలీనం చేసుకుంటుంది. యోగభ్రష్టుల్ని సైతం ఆ శక్తి ఎలా లాక్కొని వెళ్లి లయం చేసుకుంటుందో మనం చూశాం. దైవసిద్ధి అసాధ్యం కాదు, అలా అని అంత సులభం కూడా కాదు. దృఢప్రయత్నంతో మనం సాధించుకోవాలి. 37, 38, 39 శ్లోకాల్లో మనం సంధించిన మూడు ప్రశ్నలకు 40 నుండి 45 వరకు ఈ శ్లోకం వరకు జగద్గురువు ఇచ్చిన సమాధానంతో యోగభ్రష్టుల ప్రయాణం ఎంత సుధీర్ఘమైనదో చూశాం. మనం కూడా గత జన్మల స్మృతుల్ని అనుభవాల్ని సంస్కారాన్ని అనుభవన్లోకి తెచ్చుకున్నాం. ఇప్పుడు మోక్ష సాధాన్ని అధిరోహించాలంటే ఈ మూడు అంశాల్ని మనం గమనించాలి. ఒకటి పట్టుదలతో, నిర్వేదంతో ప్రయత్నించడం. రెండు అనేక జన్మల్లో చేసిన ధ్యానయోగభ్యాసం, సంస్కారం మనకు జన్మజన్మలకు సంక్రమిస్తుందని గ్రహించడం. మూడు పాపరాహిత్యంగా జీవించడం.

మొదటి రెండూ మనం సమగ్రంగా చూశాం మూడవ అంశాన్ని సంక్షిప్తంగా చూద్దాం. జీవకోటిలో మానవ జన్మమెత్తడమే దుర్లభం అలా జన్మించి దైవమార్గంలో నడవడం మహాభాగ్యం, ఈ మార్గంలో ఆత్మానాత్మ విచారణ చేస్తూ ఆత్మదర్శనాన్ని అనుభవంలోకి ఉంచుకోవడం మహోన్నతమైన విషయం. ఎన్నో వందల కోట్ల జన్మల పుణ్య పరిపాకం ఉంటేనే ఇలాంటి ముక్తస్థితి సాధ్యం కాదు అని అభివర్ణించారు ఆదిశంకరాచార్యుల వారు. మనం జంతువుల్ని బాగా పరిశీలిస్తే అవి పరోపకారం చేస్తూ జీవిస్తాయి, అవి తమ జోలికి రాని వారిని ఎంత మాత్రం బాధించవు, మచ్చిక చేస్తే ద్రోహం తలపెట్టవు, తమ ప్రాణాలను ఎదురొడ్డి మనల్ని రక్షిస్తాయి. ధైర్యంగా అడవులు కొండలు కోనల్లో భగవన్నామం స్మరిస్తూ జపిస్తూ ధ్యానిస్తూ ఉన్న వారిని సైతం చూసినా సమీపించినా వారికి హాని తలపెట్టవు ఇది ఎందరో మహాత్ముల అనుభవమే. జంతువులు తమ వ్యాధులకు తగిన మూలికలు భక్షించి నయం చేసుకుంటాయి. విషం కలిసిన ఆహార పదార్థాలు గమనిస్తే వాటిని తినవు, దూరంగా వెళ్లిపోతాయి. అంతేగాని ఆ విషం కలిపిన వారెవరా అని పసిగట్టి కసి తీర్చుకోవాలని కూడా అనుకోవు. అందుకే వాటికి క్రమంగా సహజంగానే ముక్తి సంప్రాప్తిస్తుంది. అవి ధ్యానయోగంలో సహజస్థితిలోనే ఉంటాయని మనం 4-41 లో చూశాం. మరి అన్ని ప్రాణుల కంటే ఉత్తమజన్మ పొందిన మానవుడు ఉత్తమోత్తమంగా జీవించి పరమపదం పొందాలి. అది మానవుని సహజ స్థితి, అదే మానవ జీవిత పరమార్థం. సజ్జనులు ఇలాగే ఆలోచిస్తారు ఈ మార్గంలోనే పయనిస్తారు. అయితే అందుకు భిన్నంగా ఉండే అసహజమైన అమానవీయమైన

పరిస్థితులు మనం మన కళ్లారా చూస్తూనే ఉన్నాం. అలాంటివి సమూలంగా ప్రక్షాళన జరిగి ప్రతి ఒక్కరూ దైవ మార్గంలోనే నడవాలని ఆశిద్దాం. ఈ రోజున సజ్జనుల స్థానాన్ని పొంది భగవంతుని గీతామార్గంలో జగద్గురువు చిటికెన వేలు పట్టుకొని నడుస్తూ దైవసిద్ధికి ప్రయత్నిస్తూ ముందుకెళ్తున్న మనకు అనేక జన్మజన్మలుగా ఫలించిన సుకృతమేనని ఈ శ్లోకాన్ని బట్టి తెలుస్తుంది. అలా ఫలించిన సంస్కారపు పట్టుదలతో ధ్యాన యోగాభ్యాసం చేసే కొద్దీ కొద్ది కొద్దిగా జన్మజన్మలలో సాధించుకున్న పుణ్య సంస్కార సముదాయం చేత పాపాలన్నీ ప్రక్షాళన అవుతాయి. ఇది అనేక జన్మ జన్మల సాధన ఫలమే ఈరోజు మనం దైవమార్గంలో నడుస్తున్నందుకు కారణం. ఆరు అధ్యాయాలుగా మనం బ్రహ్మపథంలో నడుస్తున్నది కూడా పూర్వ అభ్యాస ఫలమే, సంస్కారమే, పూర్వజన్మ సుకృతమే అని మనకు ఈ శ్లోకం నిరూపిస్తుంది. ఉత్తమమైన శ్రద్ధ గల జిజ్ఞాసువు యోగమార్గంలో పయనిస్తారు, ధ్యానిస్తారు తమ ప్రయత్నంతో దైవాన్ని దర్శిస్తారు. జన్మజన్మల దైవ సాధన ఫలితం చేతనే నరుడు నారాయణుడు అవుతాడని నారద భక్తి సూత్రాలలోనూ ఉంది. చూశారా గీతా స్వరూపులారా ఒక జన్మ ప్రయత్నం జన్మజన్మల వైభవం, కొంత కొంత ప్రయత్నం ఎంతో ఎంతో లాభం. జన్మజన్మలకు తోడుండి కడతేర్చే వరకు కంటికి రెప్పలా కాచుకొని నడిపించే అవ్యక్త స్నేహసూత్రం ధ్యానయోగ ప్రయత్నం.

6అ, 46శ్లో.

తపస్విభ్యోఽధికో యోగీ జ్ఞానిభ్యోఽపి మతోఽధికః |
కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున ॥

యోగి తాపసులకంటెను శ్రేష్ఠుడు. శాస్త్రజ్ఞానులకంటెను శ్రేష్ఠుడు. సకామకర్మలను ఆచరించువారికంటెను శ్రేష్ఠుడని భావింపబడును. కావున, ఓ అర్జునా! నీవు యోగివి కమ్ము.

మానవ జన్మకు సార్థకతనిచ్చే కీలకమైనటువంటి అంశం భగవద్గీత సందేశం ఇదే,18 అధ్యాయాల సమస్త సారం ఇదే, సమస్త గ్రంథాల సారం, సమస్త ఉపనిషత్తుల సారం, సమస్త సజ్జనుల సద్బోధసారం ఇదే. ధ్యానస్థితిని పొందడం అనేది ఓ విలక్షణమైనది విశిష్టమైనది. ఇతర సాధనలు ఇతర ప్రక్రియలన్నీ కూడా అనేక రకాల సంకల్పాలతో ముడిపడి ఉంటుంది కానీ ధ్యానం నిస్సంకల్పంగా కొనసాగుతుంది, పూర్ణత్వం వైపు నడిపిస్తుంది. అందుకనే అలా సంకల్పాలతో కూడిన సాధనలన్నీ కూడా నదులన్నీ మహాసముద్రంలో కలిసిపోయినట్లు చిట్టచివరగా ఏదో ఒక దశలో ఏదో ఒక క్షణం ధ్యానం వైపుకే మరలుతాయి. జగద్గురువైన యోగేశ్వరుడు తనలాగా అందరూ యోగులు కావాలని మనల్ని యోగివికా అని పిలుపునిస్తున్నారు, ఆదేశిస్తున్నారు, ఆజ్ఞాపిస్తున్నారు. యోగః అంటే ధ్యానం, యోగి అంటే ధ్యానంలో నిష్ణాతులైన వారు, ధ్యానంలో సిద్ధులైన వారు, ధ్యానయోగంలో పరాకాష్ట దశకు చేరుకొని 2-72లో చెప్పుకున్న బ్రాహ్మీస్థితిలోని వారు. నాలుగు మహా వాక్యాల సారంలో ఉన్న స్థితిని అనుభవం లోకి తెచ్చుకొని ఆ శబ్ద బ్రహ్మన్ని కూడా దాటిపోయిన వాడు. ఈ శ్లోకం నాలుగు అంశాలను ప్రబోధిస్తుంది ఒకటి

తాపసి అంటే తపించేవారు, తపస్సులు కఠోరమైన నియమాలతో నిరంతర ఉపవాసాలతో శ్రమిస్తూ శరీరాన్ని తపింపజేసే వారు తాపసులు. తపస్సు అనేది ఒక మార్గమే గాని ఫలం కాదు గమ్యం కాదు. సాధనలో నియమాలు శ్రమ అధికంగా ఉంటాయి, ఫలం అల్పంగా ఉంటుంది. ధ్యానం అనేది మహోత్కృష్టమైనది సంయక్ దర్శనమే ఫలంగా గలది. అందుకని తపస్సుల కన్నా యోగులు శ్రేష్ఠులు. రెండు జ్ఞానులు, జ్ఞా అంటే తెలియడం, శాస్త్ర పాండిత్యపు అవగాహన. ఈ విధమైన శాస్త్ర పాండిత్యం అనేది ధర్మాచరణకు, ధర్మావగహనకు సహకరిస్తుంది, పుణ్యలోకాల ప్రాప్తికి దోహదం చేస్తుంది. అయితే పుణ్యం కూడా ఏదో ఒకరోజు క్షయం కావలసిందే కదా. ఉత్తమం తత్త్వచింతనం, మధ్యమం మంత్రచింతనం, అథమం శాస్త్ర చింతనం, అధమాధమం యాత్ర చింతనం.

మూడు కర్మలు, ఇక్కడ కర్మ అంటే నిత్య నైమిత్తికకర్మలు. అగ్నిహోత్రాది వేదోక్త కర్మలు అని అర్థం. ఇవన్నీ ఇహలోకాలకు పుణ్యలోకాలకు సంబంధించినవే గాని పరమపదానికి సంబంధించినవి కావు. పోనీ ఓ అవగాహనతో చేస్తారా అంటే అదీ లేదు, వారు చేస్తున్నారు. కాబట్టి నేను చేయాలి అనే ధోరణి ఎక్కువగా కనిపిస్తుంది. కనీసం మనం వాటి ఆంతర్యాన్ని అర్థం చేసుకోలేకపోతున్నాం. అందులోని అంతరార్థాన్ని ఆలోచించే పరిస్థితి పూర్తిగా మృగ్యమైపోయింది. ఇవన్నీ కామ్యఫలసిద్ధి ప్రధానంగా సాగేవే గాని నిష్కామంగా కొనసాగడం లేదు. అందుకని వీటి ద్వారా నైష్కర్మ్యసిద్ధిని పొందలేక పోతున్నాం. ఆ కారణంగా ఇది పుణ్య ప్రధానమైనది కాదు, మోక్ష ప్రధానమైనది. అహం బ్రహ్మాస్మి భావాన్ని ప్రసాదించేది.

నాలుగు ధ్యానం, ఇది రాకపోకలకు అతీతమైంది పరమపద ప్రాప్తికి సంబంధించినది. తపో జ్ఞాన కర్మలు అనే మూడింటిని గురించి మన లోతుల్లోకి వెళ్లి మన స్వీయ అవగాహనతో ఆలోచిస్తే ఇవన్నీ కూడా అతి ప్రయాసతోను నియమాలతోనూ కూడి ఉండి అనిత్యమైనవి గానే రాకపోకలు కలవిగానే తెలుస్తున్నాయి. కానీ ధ్యానయోగం ప్రశాంత మార్గంలో సాగుతూ ఎప్పటికప్పుడు ఏ క్షణానికి ఆ క్షణం మనకు దైవ శక్తిని నింపుతూ మానవుని దైవంగా మలచే శక్తిని ధ్యాన యోగం సంప్రాప్తింపజేస్తుంది.. యోగీశ్వరులం కావాలంటే మనకు ధ్యానయోగం వినా అన్యధా శరణం న అస్తిః. ధ్యాన యోగంలో కళ్ళు మూసినా కళ్ళు తెరిచినా దైవదర్శనమే. ఆత్మౌపమ్యంగా కొనసాగే దివ్యమైన యానం దైవయానం ధ్యానయానం ఇది ధ్యానయోగ వైశిష్ట్యం. సర్వమానవాళిని యోగులు కమ్మని సందేశం ఇస్తున్నటువంటి మహాయోగి జగద్గురువు అయినటువంటి యోగేశ్వరునికి ప్రణమిల్లుదాం.

6అ, 47శ్లో.

యోగినామపి సర్వేషాం మద్గతేనాంతరాత్మనా |
శ్రద్ధావాన్ భజతే యో మాం స మే యుక్తతమో మతః ||

యోగులందఱిలోను శ్రద్ధాళువై, అంతరాత్మను నాయందే లగ్నమొనర్చి, అనగా, భక్తివిశ్వాసములతో నిశ్చలమైన, దృఢమైన అనన్య భావముతో నాయందే స్థిరమైయున్న మనోబుద్ధిరూప - అంతఃకరణమును గలిగి, నిరంతరము నన్నే భజించువాడు. పరమశ్రేష్ఠుడు- అని నానిశ్చితాభిప్రాయము.

ముందు శ్లోకంలో యోగివికా అంటూ పిలుపునిచ్చి జ్ఞానామృత సందేశాన్ని అందించిన జగద్గురువు ఈ శ్లోకంతో ఈ అధ్యాయాన్ని ముగిస్తూ తరువాతి అధ్యాయానికి నాంది పలికాడు. ఈ సందర్భంగా ఈ అధ్యాయాన్నంతా ఒకసారి పునరావలోకనం చేసుకొని శ్లోకాన్ని చూద్దాం. మనల్ని దైవంగా మలచడానికి జగద్గురువు చేస్తున్నటువంటి ప్రబోధాత్మక గీతామార్గంలో ఐదవ అధ్యాయంలోనే ధ్యాన యోగానికి బీజం వేశారు. సందేహానికి అవకాశం ఇవ్వకుండా ధ్యాన యోగాన్ని ఈ అధ్యాయంతో ప్రారంభించారు. యోగులు ఎవరో సన్యాసులు ఎవరో సశాస్త్రీయంగా అర్ధ వివరణ చేసి నిర్ధారించి ఉద్బోధించడంతో మొదటి శ్లోకం ప్రారంభమైంది. రెండవ శ్లోకంలో అలా నిర్ధారించిన అంశాన్ని యోగమని తెలుసుకున్నాం. కర్మలలో ధ్యానం కుదరదు ధ్యానంలో కర్మలు ఉండవు అని చూశాం, అంతేకాక కర్మయోగంలో శుద్ధిపడిన వారే ధ్యాన యోగంలో శాంతి స్థితిని పొందగలరని ఈ శ్లోకంలో తెలుసుకున్నాం. మూడవ శ్లోకంలో ధ్యానయోగానికి సిద్ధమైన వారు ఆరురుక్షువు అని తెలుసుకొని ఆరురుక్షువు యోగారూఢులు అవ్వాలని యోగారూఢుల లక్షణాలను వైభవాన్ని ప్రామాణికమైన అంశాలతో చూశాం. ఇందులో శమ దమాదులైన ఆరు అంశాల్ని పేర్కొని శమం అంటే అంతరింద్రియ నిగ్రహం, దమం అంటే బాహ్యేంద్రియనిగ్రహం అని సవివరంగా ఈ అంశాలను చూశాం. ఐదవ శ్లోకంలో మనిషి అనంతానంతం వైపు పయనించి తనను తానే ఉద్ధరించుకోవాలి గాని తనను తాను పాడు చేసుకోకూడదని తెలుసుకున్నాం. తనకు తానే బంధువు మిత్రుడు తనకు తానే శత్రువని గ్రహించాం. ఇందులో మనల్ని మనం ఎలా ఉద్ధరించుకోవాలో ఆత్మ సిద్ధాంతం, పునర్జన్మ సిద్ధాంతం, కర్మ సిద్ధాంతం, ధ్యాన యోగ సిద్ధాంతం, పురోగమన సిద్ధాంతం, విశ్వవ్యాపక సిద్ధాంతం ఈ ఆరు అంశాల్ని సవివరంగా విశ్లేషించుకున్నాం. ఆరవ శ్లోకంలో కార్యకారణ సమూహమైనటువంటి అంతర బాహ్య ఇంద్రియాలను వశం చేసుకున్న వారే జితేంద్రియులని అలాంటి వారికే ఆత్మ బంధువు అవుతుంది అలా నిగ్రహించలేని వారికి ఆత్మే శత్రువు అవుతుందని జగద్గురువు సూచించిన అంశాల్ని విశ్లేషించుకొని వశపడిన దేహేంద్రియ సమూహం మనిషికి శాంతిని చేకూర్చే విధానాన్ని చూశాం. అలా శాంతిని పొందిన తరువాత ఎంత అన్వేషించినా బాహ్యంలో విరోధి కనిపించడని కూడా గ్రహించాం. ఈ జితేంద్రియత్వం మన దృష్టిని జ్ఞానమయం చేసి సృష్టిని బ్రహ్మమయంగా దర్శింపజేస్తుందని వివరంగా తెలుసుకున్నాం. ఏడవ శ్లోకంలో చిత్త విక్షేపం లేని బుద్ధికి బ్రహ్మమే విదితమవుతూ ఉంటుంది, దేహస్థాయిలో తెలిసే శీతోష్ణాలను మనోస్థాయిలో చలింపజేసే సుఖదుఖాలను బుద్ధిస్థాయిలో తాండవించే మాన అవమానాలను అధిగమిస్తూ ఈశ్వర భావ యుక్తమైన కర్మ యోగత్వం నుంచి ధ్యానయోగత్వాన్ని అధిరోహించి ఆత్మభావనలో పరమాత్మ స్వరూపంగా విరాజిల్లాలని గ్రహించాం. ఎనిమిదవ శ్లోకంలో కూటస్థుడు ఎవరో సమలోష్టాస్మకాంచనుల దృష్టి ఎలా ఉంటుందో చూశాం. తొమ్మిదవ శ్లోకంలో సుహృద్భావం, మిత్ర భావం, శత్రుభావం, తటస్థులు, మధ్యస్థులు, ద్వేష్యులు, బంధు ప్రీతి గలవారు,

సాధు స్వభావులు, పాప బుద్ధి గలవారు ఇలా ఈ తొమ్మిది రకాల మానవుల యందు కూడా సమబుద్ధి గలవారే శ్రేష్ఠులని నేర్చుకున్నాం. పదవ శ్లోకంలో ఏకాంత స్థలంలో ఉంటూ దేహాన్ని మనసును వశం చేసుకొని భౌతిక రాకపోకలు గలవాటిపై ఆశను వీడి ఎప్పుడూ ధ్యాన సాధనలో ఆత్మ ధ్యానంలో కొనసాగాలని చూశాం. 11, 12 శ్లోకాల్లో ధ్యాన యోగ అభ్యాసం చేయనివారు ధ్యానాభ్యాసంలో ఉన్నవారు ధ్యానసిద్ధిని పొందినవారిని మనుషుల్ని మూడు రకాలుగా విభజించి తమ తమ కర్తవ్యాన్ని గుర్తించి నిర్వహించాలని తెలుసుకున్నాం. ఇందులోనే ధ్యానయోగం అన్నది వ్యక్తిగతం, ఆత్మగతం అని తెలుసుకొని స్థిర, సుఖ ఆసనంలో ధ్యానయోగం చేయాల్సిన విధానాన్ని సశాస్త్రీయంగా విపులంగా తెలుసుకున్నాం. 13,14 శ్లోకాల్లో స్థిర సుఖ ఆసనంలో ప్రశాంతంగా కూర్చొని శ్వాస మీద ధ్యాసలో లీనమై దైవ శక్తిని పొందాల్సిన విధానాన్ని నేర్చుకున్నాం. ఈ ధ్యాన యోగంలో పరుగులెత్తే మనసును ఎలా శ్వాసపై ధ్యాసతో నిలపాలో సవివరంగా సమగ్రంగా చూశాం. 15వ శ్లోకంలో మనసును సంయమించడం విధిగా నిరంతర అభ్యాసం చేయాల్సిన అవసరాన్ని తెలుసుకున్నాం. ఈ ధ్యానాభ్యాసంలో ప్రాణశక్తి విశ్వశక్తితో ఏకమై మనం సంపూర్ణ ఆరోగ్యాన్ని మానసిక ప్రశాంతతను పొందుతామని గ్రహించాం. 16వ శ్లోకంలో ఆహార నియమాలకు సంబంధించి అధికంగా తీసుకోవడం అది తక్కువ తీసుకోవడం అసలే తీసుకోకుండా ఉండటం అదేపనిగా తీసుకోవడం లాంటి నాలుగు విధానాల్ని పేర్కొని అలా కాక మధ్య మార్గంలో ఉంటూ మన దేహానికి ఆహారాన్ని అందించాల్సిన విధానాలను నియమాలను విశేషంగా తెలుసుకున్నాం. 17వ శ్లోకంలో యుక్త కర్మాచరణ, యుక్తమైన నిద్ర, మెలకువ ఈ మూడు అంశాల్లో మనిషి యొక్క సమస్త క్రియలను కర్మలను పొందుపరచిన విధానాన్ని అనేక ఉదాహరణలతో ప్రామాణికంగా చర్చించుకున్నాం. ఇందులో శారీరకపరమైన ఆహారం, మానసికపరమైన ఆహారం, బుద్ధి పరమైన ఆహారం, ఆత్మ పరమైన ఆహారం అనే నాలుగు అంశాల్ని మనం మన అవగాహన కోసం విభజించుకొని విశ్లేషించుకున్నాం.18వ శ్లోకంలో విశేషంగా నిగ్రహించిన మనసుతో సదా ఆత్మయందు స్థిరంగా నిలిపిన వారు సమస్త కోరికల నుండి విముక్తులు అవుతారని వారే యోగాన్ని సాధించిన వారవుతారని చూశాం. 19వ శ్లోకంలో గాలిలేని చోట దీపంలా మనసును స్థిరంగా ఉంచి ఆత్మతో ఏకమై వెలుగొందేలా చూడాలని తెలుసుకున్నాం. చిత్తానికి బాహ్యపు విషయాలనే గాలులు తగలకుండా జాగ్రత్త పడాలని నిర్ణయించుకున్నాం. 20వ శ్లోకంలో ధ్యాన యోగ అభ్యాసం వల్ల చిత్తం బాహ్య విషయాల వైపు వెళ్లకుండా ఆగిపోతుంది, అప్పుడు ఆత్మతో ఆత్మను చూసుకొని ఆత్మయందే ఆత్మతో ఆనందం పొందుతారని గ్రహించాం. 21వ శ్లోకంలో బాహ్య ఇంద్రియాలకు గోచరం కాని బుద్ధి చేతనే గ్రహించగల అనంత సుఖం తెలిసిన తరువాత యోగి తన యోగితత్త్వం నుండి చలించరని చూశాం. 22వ శ్లోకంలో ఆత్మిక శాంతి అనే లాభాన్ని పొందిన యోగి అంతకుమించిన లాభం మరొకటి ఉంటుందని భావించరు ఎంత గొప్ప దుఃఖమైనా ఆత్మవిధుని కలత పెట్టలేదని చూశాం. దుఃఖం అనేది అంతఃకరణ లక్షణమే గాని ఆత్మ లక్షణం కాదని మనిషికి దుఃఖం అనేది సమస్య కాదు తాను ఆత్మ అన్న జ్ఞానం లేకపోవడమే సమస్య అని ఆత్మ జ్ఞానంతో ఆత్మసాక్షాత్కారం పొందాల్సినటువంటి సూక్ష్మమైన ఆత్మిక అంశాలను గ్రహించాం. 23వ లోకంలో దుఃఖ సంబంధం నుండి విడిపోవడమే యోగమని జగద్గురువు ప్రతిపాదించిన అంశాన్ని చూశాం. వియోగాన్ని కూడా యోగంగా మలచిన విపరీత విలక్షణా బోధనా నైపుణ్యానికి ఆశ్చర్యపోయాం. ఇందులో టిట్టిభ పక్షిని

ఉదహరించుకొని నిరాశా నిస్పృహలకు నిర్వేదానికి తావు లేకుండా ధ్యాన యోగాభ్యాసాన్ని కొనసాగించాల్సిన మార్గాలను సమగ్రంగా ఉన్న విశ్లేషించుకున్నాం. 24, 25 శ్లోకాల్లో మనసులో పుట్టే బాహ్యపు అవసరం లేని కోరికలన్నింటినీ నిశ్శేషంగా వదిలిపెట్టి ఇంద్రియ సమూహాన్ని అన్ని వైపుల నుండి మనసు చేత నియమించి ధైర్య బుద్ధితో నెమ్మది నెమ్మదిగా మనసును సదా ఆత్మలో సుస్థిరం చేయాల్సిన విధానాన్ని నేర్చుకున్నాం. 24, 25 శ్లోకాల్లో మనసులో పుట్టే బాహ్యపు అవసరం లేని కోరికలన్నింటినీ నిశ్శేషంగా వదలిపెట్టి ఇంద్రియ సమూహాన్ని అన్ని వైపుల నుంచి మనసు చేత నియమించి ధైర్యబుద్ధితో నెమ్మది నెమ్మదిగా మనసును సదా ఆత్మలో సుస్థిరం చేయాల్సిన విధానాన్ని నేర్చుకున్నాం. 26వ శ్లోకంలో ధ్యానయోగ సాధనలో మధ్య మధ్యలో వచ్చే ఆలోచనలను కట్టడి చేసి మళ్లీ మళ్లీ శ్వాసపై ధ్యాస ఉంచాలని మనసుకు గుణపాఠం చెప్పాల్సినటువంటి మనసుకు బుద్ధి చెప్పే విద్యను అభ్యసించాం. 27వ శ్లోకంలో ప్రశాంత మనసం, శాంత రజసం, అకల్మషులు, బ్రహ్మభూతులు అని జగద్గురువు పేర్కొన్న నాలుగు రకాల మనుషులను గురించి సవివరంగా తెలుసుకున్నాం. ప్రశాంత మనసును ఏర్పరచుకున్న యోగి బ్రహ్మమే తానై శాశ్వతమైన ఉత్తమమైనటువంటి సుఖాన్ని పొందుతాడని చూశాం. 28వ శ్లోకంలో ఆత్మలో సుస్థిరంగా మనసును నిలిపిన యోగికి పాపాలన్నీ తొలగిపోయిన కారణంగా ధ్యాన యోగ సాధనలో అంతరాయాలు ఏమీ లేకుండా ఆద్యంతాలకు అతీతమైన అత్యంతమైన బ్రహ్మ సంస్పర్శ సుఖాన్ని పొందుతాడని ఇందులో ఆత్మ సాధ్యం, జ్ఞానం సాధనం అనే అంశాన్ని సమగ్రంగా విశ్లేషించుకున్నాం. 29వ శ్లోకంలో యోగసిద్ధులు తనను సర్వభూతాలలో సర్వభూతాలను తనలోనే దర్శిస్తారని అంతటా వారికి బ్రహ్మ దర్శనమేనని చూశాం. 30 వ శ్లోకంలో అన్నింటా నన్ను నాయందే అన్నింటిని చూసే ఆత్మైకత్వం దర్శించిన వారిలో నేను లేకపోవడం అన్నది లేదు, నాలోను వారు లేకపోవడం కనిపించకపోవడం అన్నది కూడా ఉండదని ప్రబోధించిన పరమాత్మ భరోసాను శిరోధార్యంగా స్వీకరించాం. 31వ శ్లోకంలో సర్వభూతాలలో ఉన్న నన్ను అభేద జ్ఞానంతో సేవించే యోగి, దర్శించే యోగి ఏ విధంగా ఎక్కడ ఎలా ప్రవర్తిస్తూ ఉండినా కూడా అతను నాలోనే ఉంటాడన్న సందేశాన్ని పొందాం. 32వ శ్లోకంలో మనిషి జన్మకు సార్ధకతనిచ్చే అనేక అంశాల్ని ఇక్కడ చర్చించాం. 10వ శ్లోకంలో ధ్యానయోగాభ్యాసానికి శ్రీకారం చుట్టి అందుకు అవసరమైన సమస్త విషయాల్ని విశేషంగా ప్రబోధించి ఇక్కడ ఈ శ్లోకంలో ధ్యానయోగభ్యాసఫల ప్రాప్తిని మనకు ప్రసాదించాడు. ఇందులో మన మస్తిష్కపు ఆలోచనకు అతీతమైనటువంటి ఆత్మైకస్థితి, జ్ఞానం కలిగి ఉన్నవారు యోగ సిద్ధులని, అన్యుల సుఖదుఃఖాలను తమదిగా భావించే అనితర సాధ్యమైన అలౌకికమైన, ఆత్మౌపమ్యేన విధానం ప్రసాదించి జగద్గురువు తన బోధన ముగించాడు. ఇదంతా విన్న అర్జునుడికి, మనకు కూడా వెంటనే సందేహం కలగడంతో 33 వ శ్లోకంలో మధుసూధనా సమభావాన్ని గురించి నువ్వు చెప్పిన ధ్యానయోగం యొక్క స్థితిని గురించి నేను నాకున్నటువంటి మనః చంచలం కారణంగా తెలుసుకోలేకపోతున్నాను అని ప్రాధేయపడ్డాం. దీన్నిబట్టి సమత్వం వల్లనే, సామ్యత వల్లనే, నిశ్చలత వల్లనే ఆత్మ స్థితిని పొందుతామని స్పష్టం చేసుకున్నాం. 34వ శ్లోకంలో కృష్ణా! మనసు చంచలమైనది శోభకు గురి చేసేది చాలా బలమైనది దృఢమైనది దాన్ని నిరోధించడం చాలా కష్టంగా ఉంది సాధించనలవి గానంతగాను గాలిని బంధించినంత కష్టంగానో ఉందని మరో సందేహాన్ని సంధించాడు. ఈ రెండు ప్రశ్నలకు జగద్గురువు సమాధానాన్ని

పునఃప్రారంభిస్తూ 35వ శ్లోకంలో వీరుడా నిస్సంశయంగా మనసు చంచలమే దాని నిగ్రహించడం కష్టమే అని అంగీకరించి అర్జునా దాన్ని అభ్యాస వైరాగ్యాల చేత నిగ్రహించవచ్చని భరోసా ఇచ్చాడు. ఇందులో సమస్యను అంగీకరిస్తే ఖచ్చితంగా పరిష్కారం ఉందని కూడా మనం అంగీకరించాలనే ఆంతర్యాన్ని గ్రహించాం. 36వ శ్లోకంలో ఆత్మసంయమనం లేని వారికి యోగం ప్రాప్తించడం కష్టం అని నా అభిప్రాయం మనసును వశం చేసుకున్న వారికి మాత్రం యత్నంతో ఉపాయంతో సాధ్యమవుతుందని జగద్గురువు చెప్పిన అంశాలు స్పష్టంగా తెలుసుకున్నాం. వీటిని పరిశీలించిన అర్జునుడికి వెంటనే మళ్లీ సందేహం అనిపించింది అందుకని 37వ శ్లోకంలో కృష్ణా! శ్రద్ధ ఉన్నా ప్రయత్నలోపం వల్ల మనోనిగ్రహం లేనివారు మనసు చలించి యోగసిద్ధిని పొందలేరు కదా మరి వారి గతి ఏంటి అని ప్రశ్నించాడు. అలాగే 38వ శ్లోకంలో అలా యోగసిద్ధిని పొందలేని వారు ఉభయ భ్రష్టులై బ్రహ్మపదం నుంచి దారి తప్పి నిలువ నీడ లేక చెల్లచెదరైన మబ్బు వలె నాశనం కారా అని ప్రశ్నించి 39 వ శ్లోకంలో కృష్ణా ! నా ఈ సంశయాన్ని పూర్తిగా తొలగించు నీవు తప్ప ఈ సంశయాన్ని తొలగించగలవారు మరొకరు లేరని నీవే శరణ్యమని తన అభిప్రాయాన్ని తెలియజేశాడు. ఇక్కడ గురు శిష్యుల బాంధవ్యాన్ని శిష్యులలోనూ గురువును దర్శించడమే సద్గురువుల లక్షణమని తెలుసుకున్నాం. ఈ మూడు ప్రశ్నలను ఉద్దేశించి జగద్గురువు తన ప్రబోధాన్ని 40వ శ్లోకంతో ప్రారంభించాడు. అక్కడి నుండి 45వ శ్లోకం వరకు కూడా ధ్యానయోగంలో శ్రద్ధ ఉండి సమర్థత లోపించిన వారి మతిని గతిని భవితను కూడా ఆమూలాగ్రంగా సందేహానికి సంశయాలకు తావు లేకుండా సమగ్రంగా చర్చించుకున్నాం. ధ్యానశక్తి యొక్క మహాత్మ్యాన్ని అది ఎలా జన్మజన్మలకు మనతో మనకు తోడుగా ఉండి సంరక్షిస్తూ మనల్ని మోక్ష పదానికి చేర్చుతుందో చూశాం. ఇదంతా ప్రబోధించిన జగద్గురువు 46వ శ్లోకంలో నాయనా యోగివికా, యోగీభవ అంటూ జగద్గురువు ఇచ్చిన పిలుపును సందేశాన్ని స్వీకరించాం.

ఇక ఈ శ్లోకంలో అర్జునా ! నాయందే మనసు నిలిపిన వారు, నాయందే శ్రద్ధ గలవారు నన్నే ధ్యానించువారు యోగులందరిలో శ్రేష్టులని నా అభిప్రాయం. శ్రద్ధ అనేది ఎవరి పట్ల దేని పట్ల అంటే దైవం పట్ల దైవాన్ని దర్శింపజేసే మోక్షప్రదాయని అయిన ధ్యానయోగం పట్ల శ్రద్ధ ఉండాలి. ఆ శ్రద్ధతో ధ్యాన యోగంలో ఉంటూ సదా నన్నే సేవించేవారు యోగులలో పరమ శ్రేష్ఠులు. నన్ను నాయందు అనే మాటలకు ఆత్మసాక్షి అని అర్థం చేసుకోవాలి, ప్రాణికోటి యొక్క హృదయాంతరాంతరాలలో వెలుగొందుతున్న సాక్షాత్తు పరమాత్మ స్వరూపమని గ్రహించాలి. మనసును క్షణం కూడా అన్యం వైపుకు పోనీయకుండా ఆత్మయందే సుస్థిరపరచాలి, అతడే మిక్కిలి శ్రేష్టుడు నా నిశ్చితమైన అభిప్రాయము అని ఖచ్చితంగా స్పష్టంగా తేల్చి చెప్పారు. కాబట్టి అత్యంత శ్రద్ధతో ఆత్మయందే మనసును లగ్నం చేస్తూ సదా పరమాత్మనే ధ్యానించువారు సర్వోత్తమమైన అత్యంత శ్రేష్టమైన యోగులని తెలుసుకున్నాం.

జ్ఞాన విజ్ఞాన యోగము.

7అ, 1శ్లో.

విజ్ఞానం అంటే విశేషమైన జ్ఞానం, విజ్ఞానంలో విశేషమైన జ్ఞానంలో యోగం కావాలని విజ్ఞానయోగాన్ని ఆరంభిస్తున్నాం. మనం ఒకటవ అధ్యాయంలో చూసిన అజ్ఞాన అంధకారాన్ని తొలగించుకోవడానికి విషాదయోగాన్ని వీడటానికి అవసరమైనటువంటి మార్గాలు రెండవ అధ్యాయంలో చూశాం. అందులో మన గురించి మనం తెలుసుకోవాల్సిన విద్యను మనిషి అంటే ఏంటో దేహేంద్రియ నిర్మాణం వ్యవహారం ఎలా ఉంటుందో, దేహోత్పత్తి విధానం లాంటివి అన్నీ అక్కడ చూశాం. మనల్ని మనం తెలుసుకొని అజ్ఞానాన్ని అస్వస్థతను వీడి స్వస్థితిని పొందాలంటే కర్మయోగాచరణ ప్రధానమని మూడవ అధ్యాయంలో కర్మయోగాన్ని అభ్యసించాం. కర్మయోగ మార్గం ద్వారా మనం పొందే ఫలం జ్ఞానం, అందుకే నాలుగవ అధ్యాయమైన జ్ఞానయోగంలో భగవంతుని అవతార విశేషాలు గీత ఆవిర్భావ వికాసాలు జ్ఞానం అంటే ఏంటి జ్ఞాన యజ్ఞం ఎంత శ్రేష్టమైనది గ్రహించాం. ఐదవ అధ్యాయంలో కర్మ సన్యాసం, కర్మయోగం యొక్క ప్రాధాన్యతను చూసి మనిషి కర్మలలో ప్రవర్తిల్లాల్సిన విధానాన్ని తెలుసుకున్నాం. అలా ప్రవర్తిల్లడానికి జ్ఞానం పొందడానికి ధ్యానయోగం కీలకమైనటువంటి ప్రధానమైనటువంటి భూమికను పోషిస్తున్నటువంటి విధానాన్ని మనం చూశాం. ఐదవ అధ్యాయం 26వ శ్లోకంతోనే కర్మ సన్యాస యోగం సమాప్తం అయింది. అప్పటివరకు చర్చించిన అనేక అంశాలు మనలో ఆచరణయుతం కావాలంటే ధ్యానయోగం అనివార్యమని గ్రహించాం. అందుకని అక్కడే ధ్యాన యోగానికి నాంది పలికి ఆరవ అధ్యాయం అయినటువంటి ధ్యానయోగాన్ని ప్రారంభించుకున్నాం. ఈ అధ్యాయం అంతా కూడా ధ్యాన సాధన ఆత్మసంయమమే ప్రధానంగా నడిచింది. ధ్యానయోగ విధానం ధ్యాన శిక్షణ, ధ్యానయోగంలో కలిగే ప్రతిబంధకాలు వాటిని అధిగమించే ఉపాయాలు యోగభ్రష్టుల భవిష్యత్తు ధ్యానయోగ ఫలం మొదలైనటువంటి అంశాలన్నింటినీ ఆ అధ్యాయంలో చూశాం. ఇందులో 45వ శ్లోకంతో ధ్యాన యోగం ముగించి 46వ శ్లోకంలో ఫలశృతిని చెప్పి ధ్యాన యోగమే అన్నింటికంటే శ్రేష్టమని పిలుపునిచ్చి 47 లో విజ్ఞానయోగమైన ఏడవ అధ్యాయానికి నాంది పలికాడు. అందులో "మాం భజతే' నన్ను భజించువారు యోగులలోనే పరమ శ్రేష్ఠులు అని చెప్పి అధ్యాయాన్ని ముగించి 6-47లో వివరించుకున్న పరమాత్మ స్వరూపమైన ఆత్మసాక్షి యందు అంటూ విజ్ఞాన యోగాన్ని ప్రారంభిస్తున్నారు. మనిషి జ్ఞాన దశ నుంచి విజ్ఞాన దశకు చేరినప్పుడే దృక్ దృశ్య వివేకం కలుగుతుంది. దృశ్యం ద్వారా కలిగే భ్రమ, అజ్ఞానం తొలగిపోతుంది. విజ్ఞానానికి శ్రీరాముడు చక్కటి నిర్వచనం ఇచ్చాడు, పంచవటిలో లక్ష్మణుడికి ఉపదేశం ఇస్తూ సాక్షాత్తు అనుభవం ద్వారా పొందగలిగేది విజ్ఞానం అన్నాడు. విజ్ఞానం అంటే విశేష జ్ఞానం లేదా అనుభవైక జ్ఞానం, స్వస్వరూప జ్ఞానం. స్వస్వరూపం తెలియక కనిపిస్తున్న నామ రూపాలే వాస్తవమని నమ్మడం ఆ నామరూపాల పదార్థానికి ఆవల ఉన్నటువంటి వాస్తవిక సత్యమైన మూలాన్ని యదార్థాన్ని గ్రహించలేకపోవడం అజ్ఞానం. నేను కనిపిస్తున్న దేహం మాత్రమే కాదు ఈ దేహంలోని దేహిని కూడా అని గుర్తించి దేహతత్త్వం, దేహితత్త్వం తెలిసి తదనుగుణంగా జీవించడం జ్ఞానం. జ్ఞానంతో సమానమైనది పవిత్రమైనది మరొకటి లేదని 4-38 లో చూశాం. నేను అనేది జ్ఞానస్వరూపం అది అనుభవంగా తెలియడం విజ్ఞానం, జ్ఞానమే తానై వెలుగొందడమే విజ్ఞానం. నేను ఈ దేహంలో

ఉన్న దేహిని మాత్రమే కాదు అన్నింటా అంతటా అఖండంగా వ్యాపించి ఉన్న వెలుగొందుతూ ఉన్న సచ్చిదానంద స్వరూపమని అనుభవంలోకి తెచ్చుకొని సర్వప్రాణి కోటిలో నా స్వరూపమే ఉంది, నేను సర్వప్రాణి కోటిలో ఉన్నానని గ్రహించడం విజ్ఞానం. ప్రపంచ సాహిత్యంలో దైవత్వాన్ని పొందిన ధార్మిక గ్రంథం గా వెలుగొందుతూ ఉన్న దివ్య గ్రంథం భగవద్గీత, దైవిక సంస్కృతిని సంస్కారాన్ని అందించే జ్ఞాన ప్రవాహం. 701 శ్లోకాలు గల భగవద్గీతను 18 అధ్యాయాలుగా విభజించారు. మొదటి ఆరు అధ్యాయాలను కర్మషట్కం అని, 7 నుండి 12 అధ్యాయాల వరకు భక్తిషట్కం అని, 13 నుండి 18 వరకు ఉన్న అధ్యాయాలను జ్ఞానషట్కం అని అంటారు. ఇలా మనం 18 అధ్యాయాల బ్రహ్మవిద్య ఆధ్యాయనంలో జగద్గురువు అనుగ్రహంతో ప్రధమషట్కం 280 శ్లోకాలు ముగించి ద్వితీయషట్కం ప్రారంభించుకుంటున్నాం. ఈ అధ్యాయంలో విజ్ఞాన సహిత జ్ఞానం పర అపరా ప్రకృతుల వివరణ, సర్వత్రా సమస్త పదార్థంలోనూ దివ్యమై వెలుగొందుతున్న భగవంతుని వ్యాపక విధానం, వర్ణన ఆసురీ స్వభావుల స్వభావం, భగవత్ భక్తులను ప్రశంసించుట, అన్య దేవత ఉపాసన, భగవంతుని మార్గంలో లేని వారి పరిస్థితి, దైవ మార్గంలో నడుస్తున్న వారు పొందే దైవ యోగ ప్రాప్తి, మొదలైన అంశాలు ఈ విశేషమైన విజ్ఞాన యోగంలో చూస్తాం.

ఒకటవ శ్లోకం,

మయ్యాసక్తమనా: పార్థ యోగం యుంజన్ మదాశ్రయః |

అసంశయం సమగ్రం మాం యథా జ్ఞాస్యసి తచ్ఛృణు ||

శ్రీ భగవానుడు పలికెను - ఓ పార్థా! అనన్యభక్తితో నాయందే ఆసక్తమైన మనస్సు కలిగినవాడవై యుండుము. అనన్య భావముతో మత్పరాయణుడవై, యోగమునందు నిమగ్నుడవగుము. అట్టి నీవు సంపూర్ణ విభూతి బల - ఐశ్వర్యాదిగుణయుక్తుడను, సర్వప్రాణులకును ఆత్మస్వరూపుడను ఐన నన్ను సమగ్రముగా తెలిసికొను విధమును వినుము.

పరమాత్మ స్వరూపమైన ఆత్మయందు మనసు సదా ఆసక్తిని కలిగి ఉండడమే భగవద్భక్తి. ధ్యానయోగంలో మనసును సదా ఆత్మయందే ఉంచాల్సిన విధానం అభ్యసించాం. ఈ శ్లోకం ఆ అంశాన్ని మనకు అనుభవైకవేద్యం చేస్తుంది. మనకు దేనిపైన శ్రద్ధ ఉంటే మనసు అటువైపుకే వెళుతుంది. ఆత్మ యందు ఉంటే ఆత్మవైపుకు పయనిస్తుంది, లేదు అగ్నిహోత్రాధి కర్మలపైననో లేదా మరి ఏదైనా అలవాట్లు ఇంకేదైనా ఆటలు పాటలు ఏదైనా కావచ్చు ఏది కావాలంటే ఏది పొందాలంటే దాన్ని మనం ఆశ్రయించాలి. ఉదాహరణకు ఆటలు గాని సంగీతం కానీ మొదలైన వాటిలో ప్రపంచ ప్రసిద్ధిని పొందాలంటే ఆయా శాస్త్రాన్ని ఆశ్రయించాలి. కీర్తి ప్రతిష్టలపై ఆసక్తి ఉన్నవారు ఆదిశగా శ్రద్ధ చూపుతారు, దాన్నే ఆశ్రయిస్తారు అదే పద్ధతిలో మనం మోక్షం పొందాలన్నా ఆ దిశగా పయనించాలన్నా మనం ఆత్మ యందు అంటే నాయందు భగవంతుని యందు ఆసక్తిగల మనస్సు గలవాడై ఆదిశగా ఆచరించువాడై నన్ను ఆశ్రయించిన వాడై ఉండాలి అంటూ విజ్ఞానయోగాన్ని మనకు అనుభవైకవేద్యం చేస్తూ ప్రారంభిస్తున్న జగద్గురువుకు ఈ సందర్భంగా శతకోటి నమస్సులు. ఆశ్రయ స్థానం ఆసక్తి స్థానం రెండూ

కూడా భగవంతుడే అయినప్పుడు చిత్తం అన్య స్థానానికి పోకుండా నీ పదాంభుజములందు నిలపగలం. ఉదాహరణకు భగవద్గీత ఆవిర్భావానికి కారణంగా కనిపిస్తున్న కురుక్షేత్ర యుద్ధం దీనికి సంబంధించి దుర్యోధనుడు అర్జునుడు ఇద్దరూ శ్రీకృష్ణుని ఆశ్రయించి సహాయం చేయమని ప్రార్థించారు. ఆ సందర్భంలో ముందుగా వచ్చిన దుర్యోధనుడికి ముందుగా చూసిన అర్జునుడికి ఇద్దరికీ సహాయం చేస్తానని మాట ఇచ్చాడు. అసమాన యోధులు సమరవీరులతో అలరారే తన సైన్యం ఓవైపు, ఏమాత్రం ఆయుధాలు ధరించని యుద్ధంలో పోరాడని తాను ఓవైపు అని ప్రకటించాడు శ్రీకృష్ణుడు. అప్పుడు అర్జునుడు అపారమైన భక్తి విశ్వాసంతో శ్రీకృష్ణుని పొంది సంతృప్తి చెందితే దుర్యోధనుడేమో సమరవీరుల సైన్యాన్ని పొంది ఉప్పొంగిపోయాడు. ఈ సందర్భాన్ని మనం గమనిస్తే ఎవరికి దేనియందు ఆసక్తి ఉందో దాన్నే వారు పొందుతారు. అదే భగవంతుని ప్రసాదితం అవుతుంది. మనం కూడా మన కోరికల కారణంగా మనకు మనమే కష్టాలు కొని తెచ్చుకుంటూ ఉంటామని గ్రహించాలి. దేన్ని పొందాలని అభిలాషిస్తామో దాని యందే మనకు ఆసక్తి ఉంటుంది. ఆసక్తి దేని మీద ఉంటుందో దానికి సాధనమైనదాన్నే ఆశ్రయిస్తాం, మోక్షం పొందాలనే అభిలాష ఉంటే దానికి ఉపయుక్తమైన సాధనమైన ధ్యాన యోగాన్ని భగవంతుని గీతా మార్గాన్ని ఆశ్రయించాలి. అప్పుడే మనం భగవంతుని పొంది సర్వవ్యాపకంగా విరాజిల్లగలం. అనంతమైన భగవత్ తత్త్వాన్ని పొందాలంటే పరిధిలో ఉండకూడదు కదా అనంతమైన భగవత్ శక్తిని ఆశ్రయించాలి. ఈ విధంగా దైవాన్ని పొందాలంటే ఈశ్వరునిపై ఆత్మపై సదా ఆసక్తిగల మనస్సు గల వారై, దైవ శక్తిని ఆశ్రయించిన వారై సందేహానికి తావు లేకుండా అసంశయంతో మనం మన జీవితాన్ని కొనసాగించాలి. అప్పుడే మనం విజ్ఞానయోగంలో యోగం కాగలం. భగవత్ తత్త్వాన్ని తెలియకుండా ఉన్నాను భగవంతుడిని చేరడం ఎలా, మోక్షం పొందడం ఎలా ఇలాంటి అనేక సందేహాలకు ఈ శ్లోకం సమాధానమిస్తుంది. భగవంతుని పొందడం తప్ప ఇతరములు ఏవీ వద్దనుకునే జీవుడికి ఖచ్చితంగా ఈ శ్లోకం దైవంగా భాసిస్తుంది, బ్రహ్మపదంగా భాసిస్తుంది. దైవాన్ని సంపూర్ణంగా నిశ్చయంగా తెలుసుకోవాలనుకునే వారికి ఇందులో మూడు అంశాలను సూచించారు. ఒకటి సదా భగవంతుని యందే ఆసక్తి గల మనసు గలవారై ఉండటం, రెండు భగవంతుని ఆశ్రయించడం, దైవం వినా నాకు మరేదీ అక్కర లేదనేటటువంటి సుస్థిరమైన నిర్ణయానికి రావడం. మూడు ధ్యానాభ్యాసంతో సదా యోగమై ఉండటం. ఈ మూడు అంశాల ఆధారంగా ఎలా మనం దైవంలో యోగం అవ్వాలో ఈ అధ్యాయం ఆసాంతం అనుభవంలోకి తెచ్చుకుందాం.

7అ, 2శ్లో.

జ్ఞానం తేஉహం సవిజ్ఞానమ్ ఇదం వక్ష్యామ్యశేషతః ।

యద్ జ్ఞాత్వా నేహ భూయోஉన్యత్ జ్ఞాతవ్యమవశిష్యతే ।।

నేను నీకు విజ్ఞానసహితముగా తత్త్వజ్ఞానమును సంపూర్ణముగా తెలిపెదను. దీనిని ఎఱిగిన పిమ్మట ఈ జగత్తులో తెలిసికొనవలసినది ఏదియు మిగులదు.

మనం 2-45 లో చెప్పుకున్న ప్రకృతిలోని కనిపించే శక్తి, కనిపించని శక్తి ఈ రెండింటిని నడిపే మూల శక్తి ఆ అంశాలు ఇక్కడ పునఃశ్చరణ గావించుకుంటేనే ఈ శ్లోకం మనకు అనుభవం అవుతుంది. వివిధ ప్రత్యయగమ్యమైన ఈ విశ్వంలో ఓవైపు నిర్ణయశక్తిగా ఉంటూ మరోవైపు విశ్వాన్ని అధిగమించే అసమానమైన అఖండ చైతన్యంగా భాసిస్తూ విరాజిల్లే అద్వితీయ స్వరూప శక్తి ఉంది. దాన్నే మనం మూల శక్తి అంటున్నాం, అదే పరమేశ్వర స్వరూపం. ప్రతి వస్తువులోనూ వ్యక్తిలోనూ మనకు కనిపించకుండా ఒదిగి ఉండి ప్రతి వస్తువును వ్యక్తిని కదిలిస్తోంది. ఆ స్వరూపమే జ్ఞానం, అదే జ్ఞాన స్వరూపం. అది ఇక్కడ జగద్గురువు చెప్తున్న ఇదం జ్ఞానం ఇదే పూర్ణజ్ఞానం. 6-8 లో జ్ఞాన విజ్ఞాన తృప్తాత్మ అని మనం చూశాం. శాస్త్రం పరిజ్ఞానం సంపూర్ణంగా గ్రహించడం జ్ఞానం కదా, ఆ గ్రహించిన విషయాన్ని అనుభవన్లోకి తెచ్చుకోవడమే విజ్ఞానం. మనం ముందు శ్లోకంలో విజ్ఞానయోగం అధ్యాయం ఆరంభించుకున్నాం కనుక విజ్ఞానం అనే అంశాల్ని విపులంగా చూశాం. ఆ పునాది మీదనే ఈ అధ్యాయం అంతా నడుస్తుంది. ఈ ఇదం జ్ఞానాన్ని సవిజ్ఞానం అన్నారు, విజ్ఞాన సహితంగా సంపూర్ణంగా బోధిస్తున్నాను అంటున్నాడు. ఇదే అద్వైత అఖండ పరిపూర్ణ జ్ఞానం, ఈ జ్ఞానాన్ని పొందిన తరువాత ఇక తెలియదగింది పొందాల్సింది మరేది ఉండదు. ఇక్కడ సందేహానికి తావు లేకుండా గమనించాలి జ్ఞానం, విజ్ఞానం రెండూ వేరు వేరు కాదు. శాస్త్రజ్ఞానం పరోక్షం అది అనుభవంలోకి వస్తే అపరోక్షం అంటే పరోక్షం కానిది. ఈ అనుభవం కావడమే అంటే శాస్త్రీయంగా పరోక్షంగా తెలిసినది అనుభవపూర్వకంగా పొందడమే తెలియడమే అపరోక్షం. ఈ అనుభవ అపరోక్షంతోనే అజ్ఞానపు ముడి విడిపోతుంది, సర్వసంశయాలు విచ్ఛిన్నమవుతాయి. ఈ పరోక్ష జ్ఞానం మన నుండి వేరుగా ఉందా అంటే కాదు మనలోనే మనతోనే మనం గానే ఉంది, దాన్ని అనుభవంలోకి తెచ్చుకోవడమే విజ్ఞాన సహితం. ఆత్మ చైతన్యమే బ్రహ్మ చైతన్యం, ఆత్మే బ్రహ్మం కదా ఇది అనుభవం కావడమే విజ్ఞాన సహిత జ్ఞానం. ప్రపంచంలో శాస్త్రాలకు విద్యలకు అంతులేదు అనేక కళలు విద్యలు ఉన్నాయి. అయితే అలాంటివి ఎన్ని నేర్చుకున్న విద్యాభ్యాసం సంపూర్ణం కాదు శేషించే ఉంటుంది. విద్యలు ఎన్ని ఉన్నాయి అనడానికి మనం 2-45 లో వేదాల్లో పేర్కొన్న సమస్త విద్యల్ని పరిచయం చేసుకున్నాం. కానీ ఈ సమస్త విద్యలకు, సృష్టికి కారణమైనటువంటి మూలవిద్య నిరుగవలె. అప్పుడే దేన్ని తెలిస్తే మరేది తెలియాల్సిన అవసరం ఉండదో ఆవిద్య అంటున్నటువంటి జగద్గురువు మాటలు అనుభవేద్యమవుతుంది. అందుకే ఆ బ్రహ్మవిద్యను విజ్ఞాన సహితంగా మనకు ప్రబోధిస్తున్నాడు. మనిషి ఆయుష్కాలం చాలా చాలా చిన్నది అతి తక్కువమైన అతి తక్కువ. ఈ అల్పాది అల్పమైన అతి తక్కువ సమయంలోనే బ్రహ్మవిద్యను అభ్యసిస్తేనే సమస్త విద్యలు నేర్చినట్లు, అదే జీవుని కర్తవ్యం. భగవద్విజ్ఞానం పొందకపోతే జన్మ నిరర్ధకమే కదా అందుకని మనల్ని తన దగ్గరకు తీసుకెళ్ళి తనతో ఐక్యమొందించుకోవాలని జగద్గురువు మనకు బ్రహ్మ విద్యాభ్యాసాన్ని అనుభవన్లోకి వచ్చేలా ఉద్బోధిస్తున్నారు.

ఒకటి జీవుడు జీవితం తరించాలంటే విజ్ఞాన సహిత జ్ఞానం అనుభవజ్ఞానం పొందాలి. రెండు బ్రహ్మవిద్యను, మూలవిద్యను అభ్యసిస్తేనే సమస్త విద్యలు అభ్యసించినట్లు. మూడు పరబ్రహ్మ పరమాత్మను అనుభవ పూర్వకంగా తెలుసుకుంటే సమస్తము తెలిసినట్లే ఇక తెలియడానికి ఏమీ మిగిలి ఉండదు.

7అ, 3శ్లో.

మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే ।

యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః |3|

వేలకొలది మనుష్యులలో ఎవడో ఒకడు మాత్రమే నన్ను గూర్చి తెలిసికొనుటకు ప్రయత్నించును. అట్లుప్రయత్నించినవారిలోగూడ ఒకానొకడు మాత్రమే మత్పరాయణుడై నా తత్త్వమును అనగా నా యథార్థస్వరూపమును ఎఱుంగును.

భగవత్భావన అనేది సామాన్యమైన సాధారణమైన విషయం కాదు ఆసామాన్యమైనది అద్వితీయమైనది అఖండమైనది అయితే ఇదే సహజమైనది అలా ఉండకపోతే వారు అసహజంగా ప్రకృతి విరుద్ధంగా వికృతంగా జీవిస్తున్న వారు అవుతారు, అంతేకాదు జీవితాన్ని గడుపుతున్న వారు అవుతారు. ఈ మాయామయ ప్రపంచంలో దృశ్యమానమవుతున్న వాటిని చూసి భ్రమకు లోనై సన్మార్గాన్ని విస్మరిస్తున్నారు. అయితే ఈ ప్రపంచంలో మనకు భ్రాంతిగా అనిపిస్తున్న దృశ్యాలను విస్మరించి శ్రేయో మార్గంలో పయనిస్తే ఇదం జ్ఞానం గురించి ఆలోచిస్తే ఈ విషయం మనకే తెలుస్తుంది. అందుకే జగద్గురువు మనకు మనుష్యాణాం సహస్రేషు అని అందులోనూ 'కశ్చిద్యతతి సిద్ధయే' ఏ ఒక్కడో ఆత్మసిద్ధికి యత్నిస్తాడు అన్నారు. ప్రాణి గమ్యం మోక్షమే మోక్ష అర్హత మనిషికి మాత్రమే ఉంది మానవజన్మ అనేది అందుకు సామాన్యమైన ప్రాథమికమైన అర్హత, అయితే ఆ దిశగా ఆ మార్గంలో ప్రయత్నంగాని కొనసాగడం లేదు. ఇక్కడ వెయ్యిమంది అని చెప్పడం వల్ల ప్రతి 1,000 మందికి ఒక్కరు ఉంటారని నియమం కాదు గాని సంఖ్య కోసం అలా చెప్పారు. ఈరోజుల్లో మనం గమనిస్తే అలాంటి వారు కోట్లలోనూ అరుదైన సంగతి మనం చూస్తూనే ఉన్నాం. పరమేశ్వర తత్త్వాన్ని అనుభవన్లోకి తెచ్చుకునే బ్రహ్మవిద్యను అభ్యసించే సిద్ధులలో 'యతతామపి సిద్ధానాం' ఏ ఒక్కడో నన్ను 'మాం వేత్తి తత్త్వతః' యథార్థంగా తెలుసుకుంటాడు. ఇక్కడ సిద్ధులు అంటే మోక్షమార్గంలో పయనిస్తూ ఉన్న వీరికి మధ్యలో కొన్ని సిద్ధులు తెలియడం వల్ల జగద్గురువు వారిని సిద్ధులు అన్నారు అలాంటి సిద్ధుల్లో కూడా ఏ ఒక్కడో మాత్రమే నన్ను పొందుతున్నాడు. అసలు ఆ సిద్ధుల స్థితికి ప్రయత్నించే వారే అరుదుగా ఉంటారు. మరి వారే అరుదైనప్పుడు చేరే వారు కూడా చాలా చాలా అరుదుగా ఉంటారు. ఆ సిద్ధుల స్థితికి చేరి ఇక మోక్షస్థితికి చేరే వారు ఇంకా ఇంకా ఎంత అరుదుగా ఉంటారో మనకు

గ్రాహ్యమే. దీనిని బట్టి ఈ శ్లోకం రెండు అంశాల్ని ప్రతిపాదిస్తుంది. ఒకటి మోక్షం పొందడానికి ఉపకరించే ధ్యానయోగ సిద్ధికి యత్నించేవారు, రెండు అలా ప్రయత్నించే వారిలో ఏ ఒక్కడో నన్ను యథార్థంగా తెలుసుకుంటారు.

7అ, 4 శ్లో.

భూమిరాపోఽనలో వాయుః ఖం మనో బుద్ధిరేవ చ ।

అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతిరష్టధా ।4।

ఓ మహాబాహూ! భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, బుద్ధి, అహంకారము, అని నా ప్రకృతి ఎనిమిది విధములుగా కలదు.

జగద్గురువు స్వయంగా తన శక్తిని తన స్వరూపాన్ని తన ప్రకృతిని ఈ శ్లోకంలో మన ముందు ఉంచాడు. అయితే లో చూపుతో శ్రద్ధా భక్తులతో దర్శించగలిగిన వారికి సాక్షాత్కార సామర్థ్యం ఉన్నవారికి పరమాత్మ స్వస్వరూపం దర్శితమవుతుంది. బ్రహ్మవిద్యను అభ్యసిస్తే సమస్తము తెలిసిపోతుంది ఇక తెలియదగింది మరేది ఉండదని 7-2 లో చెప్పిన సూత్రాన్ని బట్టి ఈశ్వరజ్ఞానం పొందితే చాలు దీనికి అన్యంగా భిన్నంగా బాహ్యంగా మరియు ఉండటానికి అవకాశం లేదు. కాబట్టి బ్రహ్మ విద్య అధ్యయనంలో భాగంగా ఈ భిన్న రూప ప్రకృతిని గూర్చి ఖచ్చితంగా మనకు తెలియాల్సి ఉంది అందుకే జగద్గురువు ఈ ప్రపంచపు లేదా ఈ సృష్టి యొక్క ఉత్పత్తి విధానాన్ని మనకు వివరిస్తున్నాడు. అయితే మనం ఈ అంశానికి పునాది మూడవ అధ్యాయంలోనే చాలా బలంగా పటిష్టంగా ఏర్పరచుకున్నాం. అక్కడ 3-7లో ఆ శ్లోకం అవగాహన కావడానికి అనుబంధంగా అదనపు సమాచారంగా పంచభూతాలను గురించి 25 తత్త్వాలను గురించి మన శరీర నిర్మాణపు తీరును సశాస్త్రీయంగా సమగ్రంగా నేర్చుకున్నాం ఇవన్నీ కూడా తమ తమ స్థానాలను తప్పడమే వ్యాధి పుట్టుకకు మనిషి అపమార్గపు ప్రయాణానికి కారణం అని కూడా అక్కడే చూశాం. అక్కడ మన శరీరం గురించి ఆయా అవయవాల ఇంద్రియాల అమరిక పనితీరు అంతా కూడా సవివరంగా చూశాం. ఇది జ్ఞానం ఎలాంటి జ్ఞానం? పరోక్ష జ్ఞానం అయితే అక్కడ నేర్చుకున్న సశాస్త్రీయమైన అంశాన్ని ఇక్కడ జగద్గురువు ప్రత్యక్షంగా అపరోక్షంగా విజ్ఞాన సహితంగా అనుభవ జ్ఞానం కలిగిస్తున్నాడని మనకు తెలియాలి. 3-14 లోనూ ఆయా భూతాంశాల ద్వారా మన దేహంలోని అవయవాలు తయారైన విధానం సమగ్రంగా చూశాం. ఈ రెండు శ్లోకాలు ఖచ్చితంగా సంపూర్ణంగా సమగ్రంగా మరోసారి తెలుసుకొని ఆ శాస్త్ర జ్ఞానాన్ని ఈ శ్లోకానికి అనుసంధానం చేసినప్పుడే ఈ శ్లోకంలో ప్రతిపాదించిన అంశం అనుభవేద్యమవుతుంది. ఉపనిషత్తుల్లో ఈ అంశాలు చాలా విస్తృతంగా ఉన్నాయి అయితే వాటిని పేర్కొన్నా మనకు అది పరోక్ష జ్ఞానమే అవుతుంది. కాబట్టి మనలో మనం ఈ అంశాన్ని ఆలోచించి మరోసారి ఈ రెండు శ్లోకాలు తెలుసుకొని ఆ గ్రహించిన అంశాలతో ఈ శ్లోకాన్ని సమన్వయం చేసుకుంటే అక్కడ నేర్చుకున్న పరోక్ష జ్ఞానం ఇక్కడ విజ్ఞాన సహితం విశేష జ్ఞానం అవుతుంది, అప్పుడే మనం వసీదేహి కాగలం. ఈ శ్లోకం ఈ సృష్టిని గురించి ఈ దృశ్యమయ జగత్తు ఉత్పత్తి విధానం గురించి స్పష్టంగా వివరిస్తుంది. సృష్టి అనేది కార్యం ఈ సృష్టి కార్యం

చేయాలంటే ఓ అద్భుత శక్తి ఉండాలి దాన్నే ప్రకృతి అంటారు అంటారు. ఈ ప్రకృతి తోనే జగత్తు లేదా సృష్టి ఆరంభమైందని కూడా మనం మూడవ అధ్యాయంలోనే చూశాం. ఇలా సృష్టి కార్యానికి కారణమైన మహాశక్తిని ప్రకృతి అంటున్నాం. ఈ మహాశక్తికే మాయ అని పేరు. ప్రకృతి అన్నా మాయ అన్నా ఒక్కటే, ఈ ప్రపంచం మాయా కార్యం. మాయకు ప్రత్యేక మనుగడ ఉండదు మాయ బ్రహ్మాన్ని ఆశ్రయించి మనుగడ కొనసాగిస్తుంది దీన్నే మనం పురుషుని మాయ అని చెప్పుకున్నాం. అలాగే నాకు పుట్టుక లేదు మార్పు లేదు ప్రాణులందరికీ ప్రభువును పరమాత్మను అయినా నా ప్రకృతిని వశం చేసుకొని నామాయచేత నేను పుడుతున్నానని 4-6లో చూశాం. కనుక మాయ శక్తే ప్రకృతి అదే పరమాత్మ శక్తి. పరమాత్మ శక్తిగా తెలుస్తున్న ఈ ప్రకృతి రెండు విధాలు ఒకటి స్వరూప ప్రకృతి లేదా పరాప్రకృతి, రెండు స్వభావ ప్రకృతి లేదా అపరా ప్రకృతి. ఈ శ్లోకంలో అపరా ప్రకృతిని చూసి తరువాతి శ్లోకంలో పరా ప్రకృతిని చూస్తాం. సృష్టి కార్యానికి ముందు చైతన్యమే ఉంది అదే 2-16 లోని 'సత్' ఋగ్వేదం ఏకం సత్ అని పేర్కొంది. ఇదే బ్రహ్మం, బ్రహ్మ స్వరూపం సర్వకారణం. ఈ బ్రహ్మమును కారణంగా కలిగిన ఏ కార్యమైనా అది బ్రహ్మం కన్నా అన్యంగా ఉండదు, ఇందుకు ఉదాహరణ సముద్రంలోని అల, కెరటం ఎంత ఎత్తుకు ఎగిరినా అది సముద్రందే కడలిదే గాని అన్యం కాదని ముందు శ్లోకాల్లో కూడా ఉదహరించుకున్నాం. కాబట్టి బ్రహ్మకార్యమైన ఈ జగత్తు పంచభూతాత్మక సృష్టి బ్రహ్మమేగాని అన్యం కాదని మనకు అనుభవన్లోకి రావాలి. ఇప్పటివరకు మనం ఆరు అధ్యాయాలుగా నేర్చుకున్న అవగాహనతో ఈ శ్లోకపు మూలాలను మనం గ్రహించగలగాలి. సృష్టికి ముందు అద్వితీయంగా ఉన్నది సదాత్మే కదా, భూమి నీరు అగ్ని గాలి ఆకాశం అనే పంచభూతాలు, మనసు బుద్ధి అహంకారం ఈ ఎనిమిది విధాలుగా మనకు తెలుస్తున్న అపరా ప్రకృతి ఈశ్వర మాయే భగవంతుని శక్తే పరమాత్మ శక్తే అని మనకు స్వయం పరిశీలన ద్వారా అనుభవేద్యం కావాలి. ఇందులో ప్రస్తావించిన పంచభూతాలు మనకు కనిపిస్తున్న భూతాలుగా మారకముందు సూక్ష్మభూతాలు గానే ఉండేవని 'మాత్రాస్పర్శాస్తు కౌంతేయ' అని 2-14లో సమగ్రంగా చూశాం. అది తెలిస్తేనే ఈ స్థూల భూతాంశపు తన్మాత్రలు మనకు అనుభవం అవుతాయి. ఈ ఐదు సూక్ష్మభూతాల అనే పంచతన్మాత్రల నుండి స్థూల పంచభూతాలు ఏర్పడ్డాయి. ఈ సూక్ష్మ భూతాల కారణంగానే స్థూల భూతాలు కార్యాలయ్యాయి. భూమి మొదలైన ఎనిమిది నా ప్రకృతులు అని యోగీశ్వరుడు చెప్పడం వల్ల అవి కారణాలైన తన్మాత్రలే గాని కార్యాలైన స్తుల భూతాలు కావని స్పష్టంగా తెలుస్తోంది. ఈ దృష్టితో మనం ముందుకు సాగాలి.

7అ, 5 శ్లో.

అపరేయమితస్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరామ్ ।

జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్ ।5।

ఇదిగాక ఈ సంపూర్ణ జగత్తును ధరించునట్టి మఱియొక 'ప్రకృతి' కలదు. అదియే నా జీవరూప 'పరాప్రకృతి' లేక చేతనప్రకృతి అని తెలిసికొనుము.

దృశ్య రూపమైన ఎనిమిది రకాలుగా కనిపిస్తున్న ఈ భిన్న రూప అపరా ప్రకృతి లేదా స్వభావ ప్రకృతిలో జన్మించిన మనిషి ఈ పంచభూతాత్మక దేహంలోను ప్రకృతిలోను ఉండి స్వస్వరూపాన్ని గుర్తించి ప్రకృతి సహజ సిద్ధంగా మోక్ష సాధన దిశగా పయనించాలి. అయితే అందుకు వ్యతిరేకంగా అపసవ్య దిశలో పయనిస్తూ మాయకు లోనవుతున్నాడు అందుకని స్వయంగా జగద్గురువే ఈ అధ్యాయంలో తన స్వస్వరూపాన్ని దర్శింపజేస్తున్నాడు. సమస్త జీవుల జీవశక్తికి కారణం అపరా ప్రకృతి కాదని గ్రహించాలి. ఈ అపరా ప్రకృతికి కూడా కారణం ధారణం పరాప్రకృతి అయిన జీవశక్తి ఈ విషయాన్ని మనకు స్పష్టంగా వివరంగా తెలియజేస్తున్నారు జగద్గురువు. ముందుగా అపరా ప్రకృతిని పేర్కొని ఈ అపరా ప్రకృతి అంటే ఇది, దీనికి ఆధారమైన జీవుని చైతన్యమే పరాప్రకృతి జీవ జడ రూప భేదంతో గోచరిస్తున్న ఈ పరా అపరా ప్రకృతులు చైతన్యం కన్నా భిన్నం కాదని ఎంతో సుస్పష్టంగా మనకు దర్శింపజేస్తున్నాడు. ఈ పరాపరా ప్రకృతులను సంపూర్ణంగా గ్రహిస్తే గాని బ్రహ్మమేమిటో మనకు తెలియదు. బ్రహ్మం తెలిస్తేనే బ్రహ్మాత్మ జ్ఞానం సర్వజ్ఞానం అనుభవ సహిత జ్ఞానం కలగదు. అందుకని జగద్గురువు తన మాయా స్వభావాన్ని తెలుపుతూ స్వస్వరూపాన్ని అనుభవన్లోకి తెచ్చుకోమని ఆదేశిస్తున్నాడు. అపరా ప్రకృతి అన్యమైనది, పరా ప్రకృతి స్వరూపమైనది. అందుకే మనం ఎప్పుడూ మాటల సందర్భంగా కాని మనం ఈ ఆరు అధ్యాయాల చర్చల్లో కాని అనేకసార్లు అన్యం వైపు మనసు వెళ్లకూడదు అనుకుంటూనే ఉన్నాం. ఆ అన్యం అంటే ఇదే, మాయమయ జగత్తు వైపుకు మనసు వెళ్ళకూడదు అని అర్థం. చిత్తం అన్య స్థలమునకు చేరకుండా ఈ నా స్వరూపంతో అనుసంధానమై ఉండాలని నేర్చుకున్నాను. ఆ నేర్చుకున్న దాన్ని ఇక్కడ అనుభవంలోకి తెచ్చుకోవాలి, విశుద్ధమైన స్వరూప ప్రకృతి జీవ రూపమైంది, అది సుసంపన్నమైనది అందుకే పరా ప్రకృతి విశుద్ధమైనది. ఈ జడమైన దేహేంద్రియాదుల చలనానికి కదలికకు కారణమైనది జీవశక్తి. చలనం జరిగింది అంటేనే అది చైతన్యం ఆధీనంలో ఉందని అర్థం. స్వరూపం అనేది స్వతంత్రం, స్వయం ప్రకాశం, స్వభావం అనేది పరతంత్రం, పరాధీనం అందుకని స్వతంత్రమైనా స్వప్రకాశమైనా జీవ రూపమైనా పరా ప్రకృతి అని తెలుసుకో అంటున్నాడు. పరా ప్రకృతి ఆత్మ రూపమై జీవ రూపంగా ఉందని తెలుసుకోవాలి. జీవ రూపం దేహాన్ని ఉపాధిగా కలిగి ఉందని గ్రహించాలి. ప్రాణధారణ గావించిన వాడే జీవుడు, ఈ జీవుడు దేహం నుంచి విడిపడితే దేహం ప్రాణాలను విడిచేస్తుంది. ఈ జీవశక్తి దేహధారణకు అలాగే విషయంలోని సమస్త జగత్తు నిలవడానికి కూడా కారణం అవుతోంది. కాబట్టి జడ రూప జగత్తుకు దేహానికి కూడా చేతనత్వం కల్పించేది ఈ పరా ప్రకృతే, జీవ రూపమైన పరా ప్రకృతి దేహంలో అంతర్యామిగా ఉంది, బుద్ధికి చేతనత్వాన్ని కల్పించి నేను నాది అనే అహం భావనకు స్ఫురణకు కూడా కారణమవుతుంది. ఇటు వ్యష్టిగా దేహంలోనూ అటు సమిష్టిగా విశ్వంలోనూ కూడా అవ్యక్తంగా ఉన్నది పరాప్రకృతేనని మనకు తెలియాలి. దేహంలో పరా ప్రకృతిగా ఉన్నది జీవుడు, విశ్వంలోని పరాప్రకృతి అంతర్ముఖ ప్రయాణం చేయాలని మనం ఆరు అధ్యాయాలుగా నేర్చుకుంటున్నాం. ఈ ప్రయాణానికి మనం ధ్యానయోగ ప్రక్రియను అధిరోహించాం. తద్వారా ఇప్పుడు అంతర్యామిని దర్శిస్తున్నాం. ఇకపై మనం విశ్లేషించుకునే ప్రతి శ్లోకం కూడా మనకు అనుభవ జ్ఞానం కావాలి అంటే విజ్ఞాన సహితంగా బోధపడాలంటే ప్రథమ షట్కంపై సమగ్రమైన అవగాహన తప్పనిసరి. ఈ అంశాలు ఒకవేళ అవగాహన కాలేదు అంటే ప్రథమ షట్కంలో అభ్యసనలో

కొరత ఉందని స్వయంగా గ్రహించి ఆ కొరతను పూర్తి చేసుకుని ఈ ద్వితీయ షట్కం అభ్యసించాలి. ఈ శ్లోకంలో గ్రహించాల్సిన అంశాలు పరా ప్రకృతి, స్వరూప ప్రకృతి జీవ రూపమైనది అది సమస్త జగత్తును ధరించి ఉంది అదే సర్వోన్నతమైనది. ఇది పరా ప్రకృతి విశేషం. ముందు శ్లోకంలో అపరా ప్రకృతిని ఈ శ్లోకంలో పరా ప్రకృతిని తెలుసుకున్నాం. ప్రతి శ్లోకంలో పరాపర ప్రకృతిలో ఉన్నది తానేనని తనకన్నా అన్యమైనది ఏదీ లేదని నిరూపించేటటువంటి విజ్ఞాన సహితమైన తరువాత శ్లోకం కోసం ఎదురుచూద్దాం.

7అ, 6శ్లో.

ఏతద్యోనీని భూతాని సర్వాణీత్యుపధారయ |

అహం కృత్స్నస్య జగతః ప్రభవః ప్రలయస్తథా | 6 |

ఓ అర్జునా! సమస్త ప్రాణులును ఈ రెండు విధములైన ప్రకృతుల నుండియే ఉత్పన్నములగుచున్నవి, ఈ జగత్తు యొక్క ప్రభవమూ (పుట్టుకయూ) ప్రలయమూ (లీనమగుటయూ) నావలననే జరుగుచున్నవి. అనగా ఈ సంపూర్ణ జగత్తునకు నేనే మూలకారణము.

సమస్తభూతాలు అంటే చేతన అచేతనాలు అని అర్థం, విజ్ఞాన సహితమైన జ్ఞానం తెలుసుకుంటే తరువాత తెలియదగింది మరేది ఉండదని చూసాం. పరమాత్మ జ్ఞానం కలిగితే ప్రపంచానికి సంబంధించిన సర్వజ్ఞానం సిద్ధించినట్లు అవుతుంది. అయితే ఈ అలాంటి అఖండ పరమాత్మ జ్ఞానం మనకు సంప్రాప్తించాలంటే పంచభూతాత్మక ప్రపంచం గురించి మనకు స్పష్టంగా తెలియాలి. అందుకే దానికి సంబంధించిన అంశాలను స్పష్టంగా విజ్ఞానసహితంగా ప్రబోధిస్తున్నారు. సృష్టి లయ ఉంటే కచ్చితంగా స్థితి కూడా ఉంటుంది. విశ్వం అనే పదార్థం పరమాత్మ అంతఃచైతన్యం వల్ల సృష్టితమైంది. సృష్టి అనేది శక్తికి ప్రతీక, దీంతోనే సృష్టి ప్రారంభం ఆ తరువాత ఖనిజాలు, వృక్షాలు, జంతువులు, మానవులు ఇది సమస్త ప్రకృతి క్రమం. సృష్టి అనేది ఒక యదార్థ నిరంతర ప్రక్రియ. ఇందులో కాలం, కర్మ, ధనం, స్వభావపు జీవులు ఈ మొత్తం కూడా బ్రహ్మ ఆధారితం. బ్రహ్మం స్థల, కాలాలకు అతీతం, పరమాత్మశక్తి వ్యక్తిస్థితుల్లో సందర్భానుసారంగా వ్యక్తమౌతూ ఈ సృష్టిని కొనసాగిస్తూ ఉంటుంది. ఈ విశ్వం తనకు ఆధారభూతమైన పరమాత్మతో బ్రహ్మంతో నిత్యం అనుసంధానమై ఉంటుంది. ఆ పరిపూర్ణుడైన బ్రహ్మం వల్ల ఈ విశ్వం నిరంతరం మార్పులు చెందుతూ ఉంటుంది. మారే విశ్వం సదా మారని శాశ్వత సనాతన పరబ్రహ్మతో కలిసే ఉంటుంది. మనిషిలో ఉన్నది, సూర్యునిలో ఉన్నది, సమస్త చరాచర జగత్తులో ఉన్నది ఒక్కటే. ఈ సత్యాన్ని దర్శించిన వారు భౌతికత్వం నుండి విడిపడతారు, సృష్టి మూలంలో ఐక్యమై సర్వాత్మగా విరాజుల్లుతారు. ఈ అంశాలన్నీ కూడా మేధోపరమైన పరీక్షలకు కొలమానాలకు అందదు. ఇవి మేధకు ఆవల జరిగే అనిర్వచనీయమైన అనుభవాలు భగవధానుభూతి యొక్క అత్యున్నత స్థితి. ఉదాహరణకు కుండ ఉంది అందులో నీరు ఉంది, ఆ నీటిలో సూర్యుడు ప్రతిబింబిస్తున్నాడు అనుకుందాం, ఇందులో కుండ అనేది దేహం, నీరు అనేది

మనసు, సూర్యబింబం అనేది జీవుడు, సూర్యుడు పరమాత్మ, కుండ నీరు అపరా ప్రకృతి, సూర్యబింబం పరాప్రకృతి, ఈ పర అపరా ప్రకృతాలకంటే విలక్షణమైన సూర్యుడు రెండింటికి అతీతమైన పురుషుడు, బ్రహ్మం, దైవం. కుండలోని నీటిలో ప్రతిబింబించిన సూర్యుడ్ని చూసి అదే సూర్యగోళం అనుకునేవాడు అవివేకి. జీవాత్మలలోని బుద్ధి పరమాత్మ ప్రతిబింబమే అయినా అది ఉపాధి సహితంగా ఉంటుంది కదా అందువలన ఆ బుద్ధినే పరబ్రహ్మం అనుకోవడం మూఢత్వం. కుండ వంటి స్థూలశరీరాన్ని నీటి వంటి సూక్ష్మ శరీరాన్ని, కుండలోని నీటిలో ఉన్నటువంటి సూర్యుడిలాంటి ప్రతిబింబమైనటువంటి బుద్ధిని వదిలిపెట్టి హృదయాంతరాంతరాలలో అఖండ జ్ఞానస్వరూపంతో ప్రకాశించే సూర్యుడి లాంటి పరమాత్మను తెలుసుకోవాలి. ఆ పరమాత్మ శాశ్వతుడు, సర్వగతుడు అంటే అన్నింటిలో ఉన్నవాడు, అత్యంత సూక్ష్మస్వరూపుడు, చరాచర సృష్టికి సాక్షిమాత్రుడు. ఆ పరమాత్మ సాక్షాత్కారం పొందిన వారు పాపరహితులై రజస్తమోగుణ శూన్యులై శోక మోహాల్ని పోగొట్టుకొని మృత్యువును సైతం జయించి ఆనంద స్వరూపులవుతారు. 2-45 లోని కనిపించే కనిపించని శక్తులు ఈ రెండింటిని వ్యవస్థీకృతం చేసి నడిపించే మూలశక్తి బ్రహ్మం అని చూసాం. కాబట్టి జడత్వం నుంచి జీవత్వంలోకి ప్రవేశించాలి, అది కూడా పరాధీనమే, దైవాధీనమే, ప్రకృతిలో అంతర్లీనమైనదే కాబట్టి పరాపర ప్రకృతి రెండింటికి సర్వాధారమైనటువంటి అధిష్టాన బ్రహ్మం అయిన పరమాత్మే సత్యం. ఈ అంశాలన్నింటినీ ముముక్షువులైన మనం చక్కగా సందేహాలకు తావు లేకుండా విశ్లేషించుకుని జీవజగత్తులకు మూలమైనటువంటి మూలశక్తిని, సృష్టికర్తను దర్శించాలి, అదే మోక్షం. దీన్ని బట్టి భేదాలన్నీ కూడా కుండ, నీరు ప్రతిబింబాలకు అంటే దేహము మనసు జీవుడికే, పరాపర ప్రకృతులకే కలుగుతుంది కానీ తద్విలక్షణమైన ఆత్మకు కాదు. అపరా ప్రకృతి అయిన పంచభూతాదులు జడం, పరాప్రకృతి అయిన జీవం అభాస చైతన్యస్వరూపుడు. అందుకని ఈ రెండింటి స్థితిని దాటి సర్వాధారమైన అధిష్టాన బ్రహ్మం అయిన సర్వాత్మను దర్శించాలి.

ఇందులో మనం స్పష్టంగా గ్రహించాల్సిన అంశాలు ఒకటి సమస్త ప్రాణికోటి పరాపర ప్రకృతుల వల్లనే ఏర్పడింది. రెండు ఈ సమస్త జగత్తు సృష్టి స్థితి లయలకు మూలకారణం అధిష్టాన బ్రహ్మం. ఈ రెండు అంశాలు అనుభవ పూర్వకంగా విజ్ఞాన సహితంగా తెలియాలి. మొదట పురుషుడు లేదా అధిష్టానబ్రహ్మం మూలశక్తి, సమస్థానికి ఆధార భూతమైన భగవంతుడు. అతని నుంచే సమస్తము ఆవిర్భవిస్తుంది, జీవిస్తోంది లయిస్తోంది. తైత్తిరీయోపనిషత్తులో తెలిపినట్లుగా ఏశక్తితో ఈ సమస్త భూతాలు పుడుతున్నాయో అలా పుట్టిన భూతాలు ఏ శక్తితో జీవిస్తున్నాయో ఎందులో లయమవుతున్నాయో అదే బ్రహ్మం. వరుణుడు తన శిష్యుడైనటువంటి భృగువుకు ఉపదేశించిన అంశం కూడా ఇదే. జగత్తుకు కారణం బ్రహ్మమే అయినప్పుడు భగవంతుడే సృష్టి, సృష్టిగా ఉన్నది తానే, సృష్టి కూడా తానే.

7అ, 7శ్లో.

మత్తః పరతరం నాన్యత్ కించిదస్తి ధనంజయ |

మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ |7|

ఓ ధనంజయా! నాకంటెను పరమకారణమైనది ఏదియును లేదు. ఈ జగత్తునందలి వస్తువులన్నియును సూత్రమున సూత్రమణులవలె నాయందే కూర్పబడి యున్నవి.

ముందు శ్లోకంలోని అంశానికి ఉపమ శ్లోకం ఇది ముందు శ్లోకంలో నిర్ధారించినటువంటి అంశాన్ని ఇక్కడ దారంలో ఇమిడిన మణుల సముదాయాన్ని ఉపమానంగా చెప్తూ అలా సమస్త జగత్తు నాలో ఇమిడి ఉందని మనకు విజ్ఞాన సహితంగా అనుభవపూర్వకంగా ప్రభోదిస్తున్నారు. పాలలో వెన్నలా, నువ్వులలో నూనెలా, మణులలో దారంలా పరమాత్మ జగత్తు అంతటా వ్యాపించి ఉన్నాడు. దైవం కన్నా అన్యమైనది ఏదీ లేదు మణిమాలలో దారం లేకపోతే మణులు నిలవవు కదా, మణులకు ఆధారం దారం. మందు శ్లోకంలో జగత్తు సృష్టి లయలకు కారణం నేనే అన్న జగద్గురువు ఈ శ్లోకంలో స్థితి కారణం కూడా నేనే అని స్పష్టం చేస్తున్నాడు. తనకన్నా పరమైనది లేదని చెప్పడానికి పరమత శబ్దాన్ని ప్రయోగించాడు. సృష్టికి తానే కారణమై అన్నింటిలో తానే ఉండేటప్పుడు మరి ఉన్నవన్నీ ఎక్కడున్నట్లు అనేది ప్రశ్న. ఒకవేళ ఉంది అనేది ఏదైనా ఉంటే అవన్నీ కూడా తన యందే ఉండాలి ఎలా అంటే దారంలోని మణులలాగా, దారంలో మణులను కూర్చినట్లు పరమేశ్వరుని యందు సమస్తభూతాలు, ప్రపంచం కూడా గుచ్చబడి ఉంది. కాబట్టి సర్వకారణమైన సర్వేశ్వరుని లోనే సర్వసృష్టి సంప్రతిష్టితమై ఉందని గ్రహించాలి. ఇక్కడ "మణిగణా" అంటే మణుల సముదాయము అని అర్థం చేసుకోవాలి. సూత్రంలో మణుల వలె సూత్రాత్మ యందు భూతాలు సమస్త ప్రపంచంలో ఉంది. విద్యాప్రకాశానందగిరి స్వామి చక్కటి సమన్వయం చూపారు. మణులను దృశ్యపదార్థాలతో, దారాన్ని పరమాత్మతో మణుల సమూహాన్ని వివిధ పదార్థాల సమూహంతో పోల్చారు. ఇలా పోల్చి ఈ పోలికను మళ్ళీ దారం లేకపోతే మణులు నిలవనట్లు పరమాత్మ శక్తి లేకపోతే జగత్తు నిలవదు, స్థూల దృష్టికి దారం కనిపించదు అజ్ఞాన దృష్టికి పరమాత్మ శక్తి గోచరించదు. భౌతిక దృష్టికి దారం కనిపిస్తుంది, జ్ఞాన దృష్టికి పరమాత్మ శక్తి దర్శితమవుతుంది. జగద్గురువు చెప్పినటువంటి ఉపమ శ్లోకానికి పోలికను చక్కగా సమన్వయించి మనకు అర్థమయ్యే రీతిలో సమన్వయం చేసి చూపినటువంటి విద్యాప్రకాశానందగిరి స్వామికి ఈ సందర్భంగా ప్రణామాంజలి. ఈ శ్లోకాన్ని మనం ఇన్ని విధాలుగా సమన్వయం చేసినా చివరికి అనుభవం కావాల్సింది మనకు మనలోనే. అదేమంటే పరమాత్మ ఆధారం, జగత్తు ఆధేయం, పరమాత్మ సత్యం, జగత్తు పరమాత్మ ఆధీనం.

7అ, 8శ్లో.

రసోఽహమప్సు కౌంతేయ ప్రభాస్మి శశిసూర్యయోః ।

ప్రణవః సర్వవేదేషు శబ్దః ఖే పౌరుషం నృషు |

ఓ అర్జునా! జలములో రస తన్మాత్రను నేనే. సూర్యచంద్రులలో కాంతిని నేనే. వేదములన్నింటిలోను ఓంకారమును, ఆకాశమునందు శబ్దమును, పురుషుల యందు పౌరుషమును నేనే.

జగత్తు సృష్టి స్థితి లయలకు కారణం నేను అని ప్రబోధించి విజ్ఞాన సహితం చేసిన జగద్గురువు ఈ శ్లోకంలో ఆ వ్యాపకం ఏ విధంగా ఉందో మనకు దర్శింపజేస్తున్నారు. సమస్త చరాచర ప్రాణికోటిలో మణుల సముదాయంలోని దారంలా నేను వ్యాపించి ఉన్నాను సర్వ సృష్టికారకుడ్ని, సర్వాధారుడ్ని నేనే అని ప్రతిపాదించిన జగద్గురువు ఆ సత్యాన్ని మనకు విజ్ఞాన సహితంగా దర్శింప చేయడానికి మనకు తెలిసిన పద్ధతిలో మనకు అర్థమయ్యే రీతిలో మనకు తెలిసిన కొన్ని వస్తువుల్ని తీసుకొని వాటిలో తానెలా వ్యాపితమై ఉన్నాడో సవివరంగా మనకు తెలియజేస్తున్నాడు. ఉదాహరణ చక్కెర నుండి తీపిని, ఉప్పు నుండి ఉప్పదనాన్ని, పువ్వు నుండి పరిమళాన్ని వేరుగా చూడలేము కదా అది తనదైన పద్ధతిలో వాటి వాటి ధర్మాలను ధరించివుంటుంది. ఈ దృష్టితో జగద్గురువు వర్ణిస్తున్న వాటిని మనం పరిశీలిద్దాం. నీటిలో రసం నేను అంటున్నాడు, నీటిలో రుచి ఉంది అలాగే శక్తి ఉంది, నీరు ప్రాణాధారమైంది, పరమ పవిత్రతను సంతరించుకున్నది కూడా. నీరు లేని జీవితాన్ని సృష్టిని ఊహించలేం కదా స్థూలంగా కనిపిస్తున్న నీటిలో రుచి అనేది సూక్ష్మంగా ఉంది, ఇది రుచి చూస్తేనే అనిపిస్తుంది కానీ కంటికి కనిపించదు. రసం అంటే ఆస్వాదించేది అందుకే అది రసం. అవలోకిస్తే నీరు, ఆస్వాదిస్తే రసం. జడమైనటువంటి నీటిలో దాహం తీర్చే శక్తి ఉంది, సర్వప్రాణుల్ని సంతృప్తిపరచే అద్భుతమైన రసపుష్టి ఉంది. నీటి మనుగడకు ఆధారపడి ఉన్నది ఇదే దైవమే ఇదే దైవ స్వరూపం. లేకపోతే నీరు త్రాగితే దాహం మనకు ఎలా తీరుతుంది. ఇది దైవ వ్యాపకం ఇదే భగవంతుని వైభవం.

రెండు సూర్యచంద్రులలో ప్రకాశం నేనే అన్నారు, నీటిలోని రసం లాగా సూర్యచంద్రులలో ప్రకాశంగా ఉంటున్నది నేనే, ప్రకాశం లేనటువంటి సూర్యచంద్రుల్ని ఊహించగలమా. బాగా తరచి తరచి చూసి స్వయం అధ్యయనంతో సమగ్రంగా స్వయంగా పరిశీలించి ఈ అంశాన్ని గ్రహించాలి. ఇంటిలో కాసేపు కరెంటు లేకపోతే చాలా ఇబ్బంది అని అనుకుంటారు. మనం నూనె వేసి దీపం వెలిగిస్తే అది ఎంత పెద్ద దీపమైనా ఎంత దూరం వెలుగునివ్వగలదు ఊహిద్దాం గీతాస్వరూపులారా! పోనీ మనం ఓ బల్బు వేస్తే అది ఎన్ని వాట్స్ అయినా కావచ్చు ఇప్పటికీ తయారీలో ఉన్నటువంటి గరిష్టమైన ఎంత ఎక్కువ వాట్స్ ఉపయోగించినా అది పరిమిత ప్రదేశానికి కొంత దూరానికి మాత్రమే వెలుగునివ్వగలదు, అది కూడా విద్యుత్తు సరఫరా ఉన్నంతవరకే. అలాంటిది మరి సూర్యచంద్రాదులకు విద్యుత్తును ఎవరు సరఫరా చేస్తున్నారు? ఎంత సరఫరా చేస్తే సరిపోతుంది? సమస్త ప్రపంచానికి వెలుగును ప్రకాశాన్ని నిత్యం ఇవ్వడానికి. ఇలా మనం మనలోకి వెళ్లి ఆలోచించాలి. దీన్నిబట్టి అది భగవంతుని వల్లనే సాధ్యం, దైవశక్తే ఆ అఖండ ప్రకాశానికి మూలం అని మనకు తెలుస్తుంది. ఈ సందర్భంగా దివ్యంగా మనకు సదా ప్రకాశాన్ని అందించే తేజోమూర్తులు సూర్యచంద్రులకు శిరస్సు వంచి ప్రణామాంజలి సమర్పిద్దాం.

మూడు వేదాలలో ప్రణవ నాదమైన ఓంకారం నేనే, ప్రణవం అంటే ఓంకారం, సర్వభూతాలకు రక్షితమై ఉన్నది ఓంకారం, వేదోపసారం ఓంకారమే, సర్వభూతాలను రక్షించగల శక్తి ఎవరికి ఉంటుంది అంటే సర్వవ్యాపక దైవానికే ఉంటుంది. ఆ సర్వవ్యాపకం రెండుగా ఉండదు ఏకం సత్ కదా కాబట్టి బ్రహ్మమే ప్రణవం. ఓంకారం ప్రణవం అనేది పరమాత్మకున్న పేర్లలో ఒకటి మనకు ధ్యానయోగంలో ధ్యానం బాగా కుదిరి యోగమైతే బాహ్యపు ఆలోచనలు పూర్తిగా శూన్యమైతే మొట్టమొదటగా మనకు కలిగే అనుభూతి ఓంకార ప్రణవ నాదమే. ఇది సత్య స్వరూపం, ఈ సమస్త ప్రపంచం ఓం అనే ప్రణవ అక్షరమే అని మాండూక్యోపనిషత్తు. సర్వ వేదాల్లోనూ ఓంకారం గురించినటువంటి చర్చలు చాలా విస్తృతంగా ఉన్నాయి. వేదాలన్నింటిలోనూ సార రూపంగా ఉన్నది ఓంకారమే, పరమాత్మకు శబ్ద రూప ప్రతీక ఓంకారం. అకార, ఉకార, మకార శబ్దాలతో ఏర్పడింది ఓంకారం, ఇది ప్రతి దేహంలోనూ ఉంది. ఓం అనే శబ్దం చేయగానే ఆ తరంగాలతో దేహం పులకితమవుతుంది ఇది మన అందరికీ అనుభవమే. సర్వ వేదసారం దేహంలో ఉంటుంది వేదాలలో సారంగా ఉన్న ఓంకార నాదమే దేహాన్ని నడుపుతుంది. ఓంకారం ఉచ్చరించడం వలన మనం సంపూర్ణ ఆరోగ్యంతో కూడుకొని ఉండి శరీరం సమతుల్యంతో ఉంటుంది కారణం ఆ ఉచ్చారణ ద్వారా ఉత్తన్నమయ్యేటటువంటి తరంగాలలో అపారమైనటువంటి శక్తి ఉద్దీపనం కావడమే. ఇదో విస్తృతమైన విశ్వవ్యాపకమైన నాదం. ఇది ప్రణవః సర్వవేదేషు.

నాలుగు ఆకాశంలో శబ్ద రూపంగా ఉన్నది నేనే, శబ్ద గుణం గలది ఆకాశం. మనం శబ్దాన్ని వింటున్నామంటే కారణం ఆకాశమే, శబ్దం లేని ప్రపంచాన్ని ఊహించలేం. ఆకాశంలో సారమై ఉన్నది శబ్దమే, మనం పలుకుతున్న శబ్దం ఇతరులకు తిరిగి మనకూ కూడా వినిపిస్తూ ఉన్నందుకు కారణం ఆకాశమే.

ఐదు మనుషులలో పురుషుడు నేనే. పురుష అనే శబ్దానికి మనం పరిమితార్థంలో వాడుతున్నాం కానీ పురుష శబ్దం చాలా విస్తృతమైనది. ఇది లింగభేదానికి సంబంధించింది కాదని తెలియాలి. పురుష శబ్దం అఖండ అవ్యక్త పరమాత్మకు సంబంధించినది. దేహాన్ని పూరించి దేహం కదలికకు కారణమై ఉన్న పురుషుడు ఇదే. పురుషుడు దేహంలోని సారం, పురుష శబ్దానికి ప్రతీక మనదేహాల్లో సార రూపంగా ఉంటున్నటువంటి పురుషుడే. మనిషిలోని ఈశ్వరశక్తే మనిషి మనుగడకు ఆధారం, దేహంలోని శక్తి పరమాత్మ శక్తే కాని జడమైన దేహానిది కాదు. ఈ సందర్భంగా నీటి యందు రసంగా సూర్యచంద్రులలో ప్రకాశంగా సర్వ వేదాలలో ప్రణవంగా ఆకాశంలో శబ్దంగా మనిషిలో శక్తిగా భాసిస్తున్నటువంటి సర్వజగత్తుకు కారణమైన పరమాత్మ శక్తికి ప్రణమిల్లుదాం.

7అ, 9శ్లో.

పుణ్యో గంధః పృథివ్యాం చ తేజశ్చాస్మి విభావసౌ ।

జీవనం సర్వభూతేషు తపశ్చాస్మి తపస్విషు |9|

పృథ్వియందు పవిత్రగంధతన్మాత్రను, అగ్నియందు తేజస్సును, సమస్త ప్రాణులలో జీవశక్తిని (చైతన్యమును) తాపసులలో తపస్సును నేనే.

భూమికి గంధం అనేది సహజలక్షణం అందులోని పవిత్ర పరిమళం పరమేశ్వరుడే పవిత్రతను సంతరించుకున్న కారణంగా విశేషమైనటువంటి పుణ్యః అనే పదాన్ని ప్రయోగించారు. తొలకరితో భూమి తడిసినప్పుడు అందులో నుంచి వెదజల్లే పరిమళం ఎంత అద్భుతంగా ఉంటుందో మనకు తెలియనిది కాదు. పరిమళభరితం కాని భూమికి మనుగడ ఉండదు కదా.

రెండు అగ్ని యందు తేజస్సు, అగ్నికి విభావసు అని పేరు తేజస్సు అనేది అగ్ని యొక్క వైభవం. వేడి వెలుతురు ఉండటం వల్ల తేజం ప్రకాశించడం వల్ల అది అగ్ని అయింది. తేజం లేని అగ్నిని ఊహిద్దాం, తేజం లేని అగ్నికి ఉనికి గాని మనుగడ గానీ ఉండదు. తేజం అనే సూత్రంలో అగ్నులన్నీ మణులుగా కూర్చబడి ఉంది.

తరువాత సమస్త భూతాల యందు ప్రాణమును నేనే అన్నారు. జీవులలోని జీవనం సర్వభూతేషు జీవనం సర్వప్రాణులలో జీవనంగా, జీవనాధారంగా ఉన్నది పరమేశ్వరుడే. ప్రాణం ఉండటం వల్ల ప్రాణులు జీవిస్తున్నాయి అందుకే అన్నము లేకపోతే మనిషి జీవించలేడు, అన్నం మనిషిని బ్రతికిస్తూ ఉంది. అందుకే అన్నం దైవం, అమృతం అంటోంది ఉపనిషత్తు. ప్రాణి పుట్టుకకు కారణం అన్నమేనని మనం 3-14 లో చూసాం, అన్నమే ప్రాణమని అని అక్కడ సమగ్రంగా నిరూపించుకున్నాం కూడా. కనిపిస్తున్న అన్నంలోని కనిపించని రసమే పరమేశ్వరుడు అయితే అన్నంతో జీవనం కొనసాగదు అన్నంలోని రసంతో నీళ్లలోని రసంతో గాలిలోని సారంతో జీవనం కొనసాగుతుంది. అవి లేనటువంటి గాలి నీరు అన్నం మొదలైన ఆహారాదులకు మనుగడ లేదని విజ్ఞాన సహితంగా తెలియాలి. దీన్ని బట్టి మనకు జీవనాధారాలుగా తెలుస్తున్న గాలి నీరు అన్నం మొదలైన ఆహారాదులలోనూ ఆంతర్యంగా సారభూతుడై జీవంగా శోభిస్తున్నది ఈశ్వరుడే, దైవమే, బ్రహ్మమే. ఈ అన్ని రకాల ఆహారాదులు అనే వివిధ రకాల మణుల సముదాయం అంతా కూడా సూత్రంగా ఉన్న సారంతో దారంతో కూర్చబడి ఉందని మనం దర్శించాలి. జగత్తుకు జీవం ప్రాణులకు జీవితం అంతా కూడా నేనే, దైవమే ఇది 'సర్వభూతేషు జీవనం'.

ఇక తాపసులలో తపస్సును, తపస్సు చేసుకునే వారిని తాపసులు అంటారు. తాపసులలో తపస్సును నేనే, ఆకలి తప్పులు శీతోష్ణాలు లాంటి ద్వంద్వాలు సహజంగా సహించే సామర్థ్యం వాటిని సమస్థితితో స్వీకరించే సహనం గుణం తపస్వికి ఉండాలి. తపఃశక్తిని పొందడమే తపస్సు లక్షణం, ఆ శక్తి మహా అద్భుతమైనది అదో అమూల్యమైన ధనం తపస్సు అనే అగ్నిలో తప్తులై శక్తిని పొంది తాపసులు తేజోవంతులు అవుతారు. అయితే ఇక్కడ ఒక విషయం గమనించాలి, వృధాగా కాలయాపన చేస్తూ నేను తపస్సులో ఉన్నానని చెప్పుకునే వారు తాపసులు కారు కాలేరు. తపఃశక్తిని పొందిన వారు తాపసులు, ఎందుకంటే తపఃశక్తే దైవం కనుక తాపసులలో తపస్సును నేనే అన్నారు.

కాబట్టి ఆ నేనే అయి ఉన్న తపఃశక్తిని దైవశక్తిని తాపసులలో అంతర్యామిగా సారంగా దైవంగా ఉన్న దైవశక్తిని తపఃశక్తిని పొందిన వారు తపస్సులు. దీన్నిబట్టి సుగంధం లేని భూమిని, ప్రకాశం లేని అగ్నిని, ప్రాణం లేని ప్రాణిని, తపస్సు లేని తపస్విని మనం ఊహించలేం ఎందుకంటే వీలుకాదు. అందుకు ఆయా జడ పదార్థంలోని ఆయా వస్తువుల్లో ఉన్న యదార్థాన్ని సారాన్ని పరమాత్మ స్వరూపాన్ని దర్శిద్దాం, ధన్యత పొందుదాం.

7అ, 10శ్లో.

బీజం మాం సర్వభూతానాం విద్ధి పార్థ సనాతనమ్ |

బుద్ధిర్బుద్ధిమతామస్మి తేజస్తేజస్వినామహమ్ |10|

ఓ పార్థా! సమస్త భూతములకును నన్ను సనాతన (శాశ్వత) మైన బీజముగా ఎఱుంగుము, ప్రజ్ఞావంతు లలో ప్రజ్ఞను, తేజోవంతులలో తేజస్సును నేనే.

ఇది సమస్త ప్రాణుల యొక్క బీజం మూలం నేనేనని తెలియజేస్తుంది. ఆ పరమాత్మ శక్తి అనే బీజం నుంచి ఇన్ని రకాల ప్రాణులు ఉద్భవించాయని మనం గమనించాలి. ఉదాహరణకు ఒక తల్లి గర్భం నుంచి పుట్టిన పిల్లలు అందరూ ఒకే రూపంలో ఒకే స్వభావంతో ఒకే విధంగా ఉండరు కదా అలా, ఉదాహరణ భూమిలో నుంచి ఎన్ని రకాల పంటలు ఫలాలు పండుతున్నాయో మనకు తెలుసు. ఈ గాలి నీరు వేడి వెన్నెల వెలుతురు చీకటి మనకు కంటికి కనిపిస్తున్న ప్రకృతి, అయితే అన్ని రకాల ఉత్పత్తులు ఒకే విధమైనటువంటి గాలిని నీటిని వేడిని వెన్నెలను చీకటిని వెలుతురును స్వీకరిస్తుంది. కానీ ఒకే విధమైన వాటిని స్వీకరించిన ఆయా విత్తనాలు చెట్లు ఒకే విధమైనటువంటి పంటలు ఇవ్వడం లేదు కదా. ఎన్ని విధాలుగా మనం సశాస్త్రీయ కోణంలో పరిశీలించినా అధ్యయనం చేసినా మనకు తేలేది ఏమంటే అన్నిటికి మూలం ఆ మూలశక్తే, దైవమే, ఆత్మే బ్రహ్మమని నిర్ధారణ అవుతుంది. ఇలా మనం చూస్తే అందరికీ బీజం పరమాత్మ ఈ భావన, దర్శనం, దృష్టి ప్రతి వ్యక్తికి ఉంటే ఇక వారు ఎక్కువ, నేను ఎక్కువ, మరొకరు ఇంకా తక్కువ, ఇంకొకరు ఇంకా ఇంకా తక్కువ అనే భావన ఎందుకు వస్తుంది? ఒకవేళ అలా వస్తుందంటే అది వారి వారి అవిద్య అజ్ఞాన అంధకారమే తప్ప మరొకటి కాదని గ్రహించాలి. అందరి గోత్రం పరబ్రహ్మమే, సర్వులూ సనాతన పరబ్రహ్మ స్వరూపమే, కనుక తరతమ భేదాలు లేకుండా సమదృష్టితో చూసే భావాలను మనం పెంపొందించుకోవాలి. అందరికీ బీజం, విత్తనం ఆ పరబ్రహ్మమే కనుక అందరూ సమానమే. బీజం మనకు ఆద్యంతాలు కలిగినవిగా అనిపించినా బీజాంకుర శక్తి సనాతనం, బీజం అనే శబ్దానికి దీని చేత పుట్టింపబడునది, పుట్టుకకు కారణమైనది అని అర్థం. మనం భౌతిక దృష్టితో చూస్తే బీజాలు అనేకం, వృక్ష బీజం, జంతు బీజం, మనుష్యబీజం ఇలా. అయితే అవి అంకురించి కార్యరూపాన్ని దాల్చిన తరువాత ఏ ఏ కారణాల నుండి అంకురించాయో ఆయా బీజాలలో కూర్చబడుతాయి. కాబట్టి ఆయా సముదాయపు బీజాలు అంకురించడానికి కారణం మూలబీజమైన పరమేశ్వరుడే. భూమికి బీజం నీరు, నీటికి బీజం అగ్ని, అగ్నికి బీజం

వాయువు, వాయువుకు బీజం ఆకాశం, ఇలా ఒకదానికొకటి బీజాలుగా మనకు తెలుస్తుంది. వీటన్నింటికీ ఆది బీజముగా ఉన్నది పరమేశ్వరుడు. ఒకటి నుంచి మరొకటి ఉత్పన్నమయ్యాయని మనం మూడవ అధ్యాయంలోనే చూసాం. ఆకాశానికి బీజం పరమాత్మ, ఇంకా సులభంగా అర్థం కావాలంటే పాలలో నుంచి పెరుగు పెరుగులో నుంచి మజ్జిగ మజ్జిగలో నుంచి వెన్న వెన్నలో నుంచి నెయ్యి ఇలా. బుద్ధిమంతులలో బుద్ధి, బుద్ధి అందరిలోనూ ఉంటుంది అయితే ఎవరి బుద్ధిలో వివేకం ఉంటుందో అలాంటి వివేకశక్తివంతులు బుద్ధిమంతులవుతారు. ఈ వివేక శక్తి యొక్క వైశిష్ట్యం గ్రహించారు కాబట్టి జగద్గురువు ఆదిశంకరులు తన గ్రంథానికి వివేకచూడామణి అని పేరు పెట్టారు. వివేక శక్తి ఉన్నవారందరూ పరమేశ్వరుని యందే కూర్చబడి ఉంటారు. తేజోవంతులలో తేజం నేనే, ఎవరిలో తేజం ఉన్నా అది పరమేశ్వర తేజమే, ఆ తేజమే దైవం. జ్యోతులలో జ్యోతి వెలిగే ప్రకాశించే తత్వం గుణం. అందుకే సూర్యచంద్రులలోని ప్రకాశం నేనే అని 7-8లో చూసాం. సర్వతేజాలకు కారణం ఈశ్వరుడే, సర్వభూతాలకు సనాతన బీజం నేనని తెలుసుకో. ఎందుకు తెలుసుకో తెలుసుకో అనే పదాన్ని ప్రయోగిస్తున్నారంటే అనుభవ పూర్వకంగా విజ్ఞాన సహితంగా దర్శించి గ్రహించాలని తెలుసుకోవాలని అర్థం. ఆ భావపు తీవ్రతను మనకు వివరించడం కోసం విద్ధి అనే పదాన్ని ప్రయోగిస్తూ తెలుసుకో అని ప్రబోధిస్తున్నారు.

7అ, 11శ్లో.

బలం బలవతాం చాహం కామరాగవివర్జితమ్ |

ధర్మావిరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ |11|

ఓ భరతశ్రేష్ఠా! బలవంతులలో కామరాగరహితమైన బలమును నేను, భూతములన్నింటియందును (సమస్తప్రాణులయందును) ధర్మమునకు విరుద్ధముగాని (శాస్త్రసమ్మతమైన) కామమును నేనే.

సమస్త ప్రాణుల యందును ఆశ, రాగం లేనటువంటి బలవంతుల యొక్క బలం నేను, ప్రాణులలోని ధర్మ విరుద్ధం కానటువంటి కోరికను నేను. ఆశ రాగం కామం అనే మాటలకు అర్థం భావం మనం అనేక సందర్భాల్లో చూసాం, ఆ అవగాహనతో పునరుక్తి లేకుండా సంక్షిప్తంగా ఈ శ్లోకాన్ని చూద్దాం. మనం చేసే ఆలోచనలో గాని పలికే మాటలో గాని ఆచరించే కర్మలలో గాని ఎక్కడా కూడా ధర్మాన్ని వీడకూడదు. అధర్మం చోటు చేసుకోకుండా జాగ్రత్త పడాలి, బలం శ్రేష్టతకు సంబంధించినది. శ్రేష్టమైన బలం కలవాడే బలవంతుడు అని అమరకోశం. కామ రాగ రహితంగా ఉండే బలమే శ్రేష్టమైనది. ఆశ రాగం లేకుండా ధార్మిక కార్యాచరణకే బలాన్ని వినియోగించాలి. అలాంటి ధర్మాచరణకు ఉపయోగించే శ్రేష్టమైన బలం నేనే అన్నారు. పరమార్ధ సాధనకు వినియోగింపబడే బలం ఉత్తమోత్తమమైనది. బలం చేత ప్రకాశించువాడు అది మానసిక బలమైనా శారీరక బలమైనా సరే, బలం అన్నది చాలా శ్రేష్టమైనది కావడం చేత అది సద్వినియోగమైనప్పుడు మాత్రమే దైవికమై ఒప్పారుతుంది. అలాకాక బలహీనత చోటు చేసుకుంటే అలాంటి వ్యక్తి బలము ఉన్నా బలహీనుడే అంతేగాని వాస్తవంగా బలం లేనివాడు

బలహీనుడు కాదు. ఎందుకంటే బలం లేని వారి వల్ల ఇబ్బంది లేదు ప్రమాదము లేదు కానీ బలముండి దాన్ని దుర్వినియోగపరిచే వారితోనే ఇబ్బంది, ప్రమాదం. అలాగే బలహీనత చోటు చేసుకున్న బలం ఉన్న వారి వల్ల కూడా ప్రమాదం ఇబ్బంది. ఉదాహరణకు అర్జునుడు, దుర్యోధనుడు ఇద్దరిలోనూ బలం ఉంది, అర్జునుడు ఎంతటి బలవంతుడో దుర్యోధనుడు కూడా అలాగే బలవంతుడు. రావణాసురుడు కూడా బలవంతుడే అయితే అర్జునుడిది మాత్రమే ఈశ్వర బలం శ్రేష్టమైన బలం, బలహీనత లేని బలం, కామరాగాలకు తావు లేని బలం. దుర్యోధనుడు రావణుడు లాంటి వారిది కామరాగంతో కూడుకున్న ప్రమాద భరితమైన బలం, ధర్మ విరుద్ధమైనది. అలాంటి బలాలను అణచడానికి ధర్మసంస్థాపనం చేయడానికి మళ్లీ నేనే అంటున్నటువంటి శ్రేష్టతను సంతరించుకున్న ఈశ్వర బలం అర్జునుడిలా శ్రీరాముడిలా అవతరిస్తుంది. వ్యక్తి సంక్షేమానికి, సంఘ సంక్షేమానికి కామరాగాలు లేని ధర్మానికి విరుద్ధం కాని ధార్మికమైనటువంటి బలమే ఉపకరిస్తుంది. ధర్మానుకూలమైన కోరిక ఉండొచ్చు, మోక్షేచ్ఛ, మంచిః సంతానం కలిగి ఉండాలి దేహధారణ నిమిత్తమైన మాత్రమే అన్న పానాదులు సంపాదించుకోవాలి అనేటటువంటి సంతృప్తితో కూడిన కోరిక, అలాగే జన్మను తరింప చేసుకోవాలి భగవత్ ధ్యానం చేయాలి ఇలాంటి కోరికలన్నీ ఉన్న వారిలో ఉన్నది ఈశ్వరుడే. అందుకే కామరాగ వివర్జితమైన బలం ఈశ్వర బలం అన్నారు. అలాంటి శ్రేష్టమైన దైవికమైన బలవంతుల సముదాయం అంతా కూడా ఈశ్వరుడనే దారంలో కూర్చబడి ఉంది.

7అ, 12శ్లో.

యే చైవ సాత్త్వికా భావా రాజసాస్తామసాశ్చ యే ।

మత్త ఏవేతి తాన్ విద్ధి న త్వహం తేషు తే మయి ।12।

సాత్త్విక, రాజస, తామస భావములన్నియును నా నుండియే కలుగుచున్నవని తెలిసికొనుము. కాని! యథార్థముగా వాటిలో నేను గాని, నాలో అవిగాని లేవు. అనగా నేను త్రిగుణాతీతుడను.

ఎనిమిదవ శ్లోకం నుంచి ఈ శ్లోకం వరకు వరుసగా ఐదు శ్లోకాల్లో పరమాత్మ పరబ్రహ్మం అంతర్లీనంగా వ్యాపితమైన విధానాన్ని స్పష్టంగా చూసాం. ఈ శ్లోకంలో అలా వ్యాపితమైన పరబ్రహ్మాన్ని తిగుణాత్మక స్వరూపాన్ని దర్శించి సత్యాన్ని సత్యంగా, మాయను మాయగా తెలుసుకుందాం. అర్జునా! మూడు లోకాల లోనూ నాకు పని లేదు అట్లే పొందదగిన వస్తువులలోనూ నేను పొందాల్సింది ఏమీ లేదు అయిననూ నేను కర్మలలో ప్రవర్తిల్లుతున్నానని 3-22 లో చూసాం. నేను ముల్లోకాలలో సంచరిస్తున్న నేను గుణాతీతుడనై కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నాను అని ఆ ముల్లోకాలలోని ఆంతర్యాన్ని మూడు గుణాలుగా మనం గ్రహించాం. ప్రస్తుత లోకంలోని అంశానికి పునాదిని బలంగా అక్కడే నిర్మించుకున్నాం. 3-27 లోనే కర్మలన్నీ కూడా ప్రకృతి వల్ల పుట్టిన సత్వరజస్థమో గుణాల ద్వారానే సమస్త కర్మలు జరుగుతున్నాయని కానీ అహంకారంతో కూడుకున్న మూఢులు, అవివేకులు తానే చేస్తున్నట్లు భ్రమిస్తుంటారని కూడా చూసాం. 3-22 లోని బీజం ఇక్కడ అంకురించింది 27లో అలా అక్కడ

అంకురించి ఈ శ్లోకంలో ఆ అంశం మొగ్గ తొడిగింది. ఇది మళ్ళీ 14వ అధ్యాయంలో గుణత్రయ విభాగంలో మహా వృక్షమై 18 మోక్ష సన్యాస యోగంలో విశ్వవ్యాపితం అవుతుంది. కాబట్టి మూడవ అధ్యాయంలోని 7, 14, 24, 27, 28 ఈ శ్లోకాల అవగాహనతో ఈ శ్లోకాన్ని అర్థం చేసుకోవాలి. ఆదికాలంలో అంటే సృష్ట్యాదికి ముందు పరబ్రహ్మం ఆకాశ స్వరూపమై నిర్గుణమై దేనిని అంటకుండా ఉంది. ఆ నిర్గుణం నుండి అవ్యక్తమాయ పుట్టింది, ఆ అవ్యక్తమాయ నుండి మహత్తు పుట్టింది, ఆ మహత్తు నుండి అహం నేను అనే భావం పొటమరించింది. అంటే నేనే అనే భావన కాదని గుర్తించాలి, నేను అనే ఒక వ్యవహార సంబంధమైన భౌతిక జగత్తులో మనుగడ కోసం తెలియడం కోసం మనం ఏర్పాటు చేసుకున్న నేను అనే వ్యక్తిత్వపు భావన. ఈ మాయమయ ప్రకృతి నుండి సత్వరజస్థమో గుణాలు పుట్టాయి. ఈ త్రిగుణాలు పరిణామం చెంది సూక్ష్మ, స్థూల భూతాలుగా ఏర్పడ్డాయి. మనం ఈ పంచభూతాలు ఒక్కొక్క దాన్ని కూడా మూడవ అధ్యాయంలో వేరువేరుగా తెలుసుకున్నాం, అర్థం చేసుకున్నాం. ఇలా జగత్తుగా కనిపిస్తున్న ఈ దృశ్య ప్రపంచం అంతా కూడా ఆ అవ్యక్త మాయ నుండి పుట్టిన, త్రిగుణ మిళితమైన కార్యమే. అందుకని ఈ సత్వరజస్థమో గుణాలనే ఇటుకలపైనే ఈ సమస్త దృశ్యమయ జగత్తు నిర్మితమై ఉందని 3-27లో చూసాం. ఆధారం లేనిదే ఆధేయం నిలవదు. అందుకు మనం సమస్త వస్తువుల్లో ఆంతర్యామిగా కూర్చబడిన మణుల సముదాయంలోని దారంలా వున్న పరమేశ్వరుడి స్వరూపాన్ని చూసాం. సముద్రంపై తరంగాలు ఆధారపడి ఉంటాయి కాని తరంగాలపై సముద్రం ఆధారపడి ఉండదు కదా. అలా తరంగాలు నాయందు ఉన్నవి, అంతేకానీ నేను వాటిలో లేను, ఎక్కడ తరంగాలలో. నేను వానియందు గాని అవి నాయందు గాని లేవు. ఈ దృశ్యమయ జగత్తు పరమాత్మ దృష్టిలో లేనిదై వుంది. ఇక్కడ మనం గమనించాల్సిన అంశాలు ఒకటి సత్వరజస్థమో గుణ భావాలు పరమాత్మ వల్లనే కలుగుతున్నాయి అని చెప్పారని ఆయా గుణాలతో ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తూ అవి కూడా పరమాత్మ వల్లనే జరిగిందని కప్పిపుచ్చుకునే మిధ్యాచార్యుల్ని, దాంభికుల్ని కూడా మనం చూస్తున్నాం, అలా కాదని మనకు తెలియాలి. రెండు సముద్రం తరంగాలకు ఆధారభూతమై ఉన్నట్లు సత్వరజస్థమో గుణజనితమైన సమస్త వస్తువులకు మహాసముద్రంలా ఆధారభూతుడుగా ఉన్నది ఈశ్వరుడే. అంటే అవి అతనికి వశములై ఉన్నాయి కాని పరమాత్మ వాటికి వశమై లేదని ఈ సందర్భంగా స్పష్టంగా తెలియాలి. మూడు ఎప్పుడూ ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తిస్తూ కామరాగంతో కూడిన బలంతో ప్రవర్తిస్తే అది దైవ మార్గం కాదు. అలా ప్రవర్తిస్తూ కూడా మళ్ళీ అది కూడా పరమాత్మే అని చెప్పేవారు లేకపోలేదు. కాబట్టి జాగ్రత్తగా ఈ అంశాన్ని సున్నితంగా లోతుల్లోకి వెళ్లి ఆ ఆంతర్యాన్ని విజ్ఞాన సహితంగా దర్శించినప్పుడే ఈ శ్లోకం మనకు అవగాహన అవుతుంది. ఈ శ్లోకంలో ప్రధానంగా గ్రహించాల్సింది త్రిగుణాల పుట్టుకకు కారణం కూడా పరమేశ్వరుడేనని గ్రహించాలి. గుణాలు అనేవి ప్రకృతి సంబంధితం, పర అపరా ప్రకృతులు కూడా పరమేశ్వరుని కంటే అన్యంగా లేవు కాబట్టి గుణాలు కూడా పరమేశ్వరుని యందే ఉన్నాయి, వాటి పుట్టుకకు కారణం అతనే.

7అ, 13శ్లో.

త్రిభిర్గుణమయైర్భావై: ఏభిః సర్వమిదం జగత్ |

మోహితం నాభిజానాతి మామేభ్యః పరమవ్యయమ్ | 13 |

ఈ జగత్తు అనగా ప్రాణిసముదాయము అంతయును గుణముల యొక్క కార్యరూపములైన సాత్త్విక, రాజస, తామసములు అను త్రివిధ భావములచే మోహితమగుచున్నది. కనుక త్రిగుణములకు అతీతుడను శాశ్వతుడను ఐన నన్ను ఆప్రాణులు తెలిసికొనలేకున్నవి.

అయితే గుణాల ద్వారా కలిగే భావాలకు రాగ ద్వేష మోహాదులైన నానారకాల పదార్థాల చేత సమస్త ప్రాణికోటి కూడా మోహం చెందుతూ వివేకం కోల్పోతున్నది. అయితే గుణాలకు అతీతంగా విలక్షణంగా ఉన్న జనన మరణ రహితుడైన నన్ను ఈ లోకంలోని మనుషులు తెలుసుకోవడం లేదు. మనిషిలోని అవిద్య అజ్ఞాన అంధకారానికి భ్రాంతికి, భ్రమలకు గల కారణాన్ని ఈ శ్లోకం చాలా స్పష్టంగా నిరూపిస్తోంది. త్రిగుణ జనిత వికారాలకు మోహితులు కావడమే మనం ముందు అధ్యాయాలలో చెప్పుకున్న ఆవరణ విక్షేప దోషాలు. వాటిని సమూలంగా తొలగించుకొని గుణాల అసలు స్వరూపాన్ని దర్శించి విజ్ఞానయోగం అభ్యసిస్తున్నాం. కాబట్టి మనం విజ్ఞాన సహితంగా అనుభవంలోకి తెచ్చుకోవాలి, గుణాల ద్వారా కలిగే పొరమరించే సాధారణ స్థాయి భావాలకు మోహితులు కాకూడదు. త్రిగుణాలు అనేవి ఓ పవిత్రమైన మాయమయ ప్రకృతి స్వరూపం. వాటిని విచారణతో సరిగ్గా అవగాహన చేసుకుని వాటిని వశం చేసుకొని సరైన మార్గంలో ధార్మిక ప్రవర్తనతో ధర్మాచరణ కార్యాలకు సద్వినియోగం చేసుకోవాలి. అంతేగాని తద్వారా కలిగే తాత్కాలిక భావాలకు లోను కాకూడదు, వశం కాకూడదు. శృతి తప్పితే గతి మతి రెండూ తప్పుతుంది. కాబట్టి పరబ్రహ్మ శృతి లోనే పరబ్రహ్మ పథంలోనే త్రిగుణ సంబంధిత కార్యాలు జరగాలి గాని తద్విరుద్ధంగా జరగకూడదు. మనలో త్రిగుణ జనిత మోహం రాజ్యమేలుతుంటే మరి పరమేశ్వర దర్శనం ఎలా సంప్రాప్తిస్తుంది, వెలుగు లేనప్పుడే చీకటి ఉంటుంది శ్రేయో మార్గంలో వెళ్లకపోతే అది అపమార్గమే కదా. ప్రాపంచిక విషయాలలో నిమగ్నమైపోయి జగత్కారకుడిని విస్మరించిన పరిస్థితికి కారణం త్రిగుణ జనిత భావం మోహమే. కాబట్టి త్రిగుణాలు మాయ ఆధీనాలు, బ్రహ్మాన్ని దర్శించి మాయను మాయగా తెలియాలి. మాయలోన పుట్టి మాయలోన పెరిగి మాయ తెలియలేని మనజుడేలని మనం ముందు శ్లోకాల్లో చెప్పుకున్నాం కదా, అందుకని మాయను మాయగా సత్యాన్ని సత్యంగా తెలుసుకుందాం. త్రిగుణాల్ని ఈశ్వర జనితంగా గ్రహిద్దాం.

మన స్వస్వరూపాన్ని మనం దర్శించి మోహానికి మనం వశం కాకుండా అవి మన వశమయ్యేటట్లుగా విజ్ఞానసహిత విద్యాభ్యాసాన్ని కొనసాగిద్దాం.

7అ, 14శ్లో.

దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా |

మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే |14 |

నా మాయ త్రిగుణాత్మకమైనది, అలౌకికమైనది. ఇది అధిగమించుటకు సాధ్యము కానిది. కాని కేవలము నిరంతరము నన్నే భజించువారు ఈ మాయను అధిగమించి, సంసారసముద్రము నుండి బయట పడగలరు.

8 నుంచి 12 వరకు గల ఐదు శ్లోకాల్లో పరమాత్మ ఎలా సమస్త జగత్తులో వ్యాపితమై ఉన్నదీ దర్శింపజేశాడు, 13వ శ్లోకంలో ఆ వ్యాపితమైన నన్ను గుణవికారాల చేత మోహానికి గురైన మనుషులు తెలుసుకోలేకపోతున్నారని కారణాన్ని తెలిపి కనువిప్పు కలిగించారు. ఈ శ్లోకంలో మాయ యొక్క ప్రభావాన్ని దాని తీవ్రతను దాని సామర్థ్యాన్ని మన ముందుంచాడు. ఎందుకంటే దాని బలాబలాలు మనకు తెలిస్తేనే కదా మనం దాన్ని అధిగమించడానికి అందుకని ఈ అంశాన్ని మనకు చాలా స్పష్టంగా తెలియజేస్తున్నాడు. మనసు చంచలమైనది బలమైనది దృఢమైనది అంటూ మనసు బలాన్ని సామర్థ్యాన్ని తెలిపి ఎలా దాన్ని దైవదృష్టితో అధిగమించాలో అనే సంశయానికి సమాధానం ఇచ్చిన తీరు మనం 6-34 లో చూసాం. అయితే అది వ్యష్ఠికి సంబంధించింది, వ్యక్తిగతమైనది. ఇది సమిష్టికి సంబంధించినది సమిష్టిగతమైనది. మాయ అనేది అందరికీ వర్తిస్తుంది, ఇది కూడా విశ్వవ్యాపకమే ఇది ఏ ఒక్కరికో ఏ కొందరికో పరిమితం కాదు. మాయ మహాశక్తి సంపన్నుడైన మనిషిని మాయ తన ఆధీనంలో ఉంచుకోగలిగే అలౌకిక అభౌతిక సామర్థ్యం కలిగినటువంటిది అందుకే అది మాయ. అయితే ఆ మాయను కూడా అవలీలగా దాటవచ్చని ఈ శ్లోకం ప్రబోధిస్తుంది, భరోసా ఇస్తుంది, ఉపాయాన్ని కూడా సూచిస్తుంది. అలా దాటలేకపోతే అది సంస్కారాల రూపంలో ఉండి జన్మజన్మలకు మనల్ని ఎలా వెంటాడి వేటాడి ఉక్కిరిబిక్కిరిచేసి వేధిస్తుందో 3-33 లో చూశాం. ఆ పరిస్థితికి మనం అవకాశం ఇవ్వకుండా యదార్థాన్ని గుర్తించి సర్వవ్యాపక పరబ్రహ్మ దర్శితమయ్యే విధానాన్ని ఈ శ్లోకం స్పష్టంగా సశాస్త్రీయంగా ప్రతిపాదిస్తుంది.ఈ శ్లోకంలో ప్రతిపాదించిన అంశాలు ఒకటి మాయ దైవ సంబంది, రెండు దాటశక్యం కానిది, మూడు మాయను దాటే మార్గం. ఒకటి మాయ దైవ సంబంది ఇది అలౌకిక సామర్థ్యం గలది, భగవత్ సంబంధమైనది, సామాన్యమైనది కాదని చెప్పారు. ఇది మహాశక్తివంతమైనది కాబట్టి పుణ్యకార్యాలు చేసి పుణ్యలోకాలకు వెళ్లిన వారిని కూడా మాయ క్షణంలో వారిని వశం చేసుకొని పుణ్యం క్షయమయ్యేటట్లు చేసి తిరిగి అవి ఈ భూలోకపు జన్మల చక్రంలో నెట్టి వేయడానికి కారణం అవుతోంది. మనం పుణ్యలోకాల గురించి ఆరవ అధ్యాయంలో చూసాం అలాగే మేధా సంపన్నులు బలవంతులు ఇంద్రులు చంద్రుల్ని కూడా తన మాయకు లోనయ్యేటట్లు చేస్తుంది, తిరిగి జనన మరణ ప్రవాహంలోకి నెట్టి వేస్తోంది. జనుల లౌకికమైన తెలివితేటలు కూడా దాని దగ్గర ఉపయోగపడవు. అందుకే అది దైవ సంబంది. అయితే అది దైవిక ఉపాయంతోనే లోబడగలదు. రెండు దాటశక్యం కానిది, సదా ఉండేది 2-16, 2-24 లో చెప్పిన సత్తు, సత్యం కదా. సదా లేనిదే మాయ సదా ఉండేది కాదు. పోనీ అది సదా ఉండకపోతే మనల్ని ఎలా ముప్పు తిప్పలకు చేస్తుంది అంటే అందుకే దాన్ని మాయ అంటున్నాం, లేకనే ఉన్నట్లు భ్రమింప చేస్తుంది. అతి తొలగిస్తే పోవడానికి అదో భౌతిక వస్తువు కాదు కదా. భ్రమ ఆభౌతికమే అయితే అర్థం చేసుకుంటే అదృశ్యమైపోతుంది, అర్థం కాకపోతే అనర్థాలకు కారణం అవుతుంది. గాలిని బంధించినంత కష్టమని అక్కడ అర్జునుడు చంచల మనసు గురించి మొర పెట్టుకున్నాడు. అలాగే ఇక్కడ మాయ దాటశక్యం కానిది అని కూడా

జగద్గురువే స్పష్టం చేసి మళ్ళీ ఉపాయాన్ని కూడా సుస్పష్టంగా గా మన ముందు ఉంచాడు. పైగా దైవీ అని విష్ణుమాయ ఈశ్వరీమాయ దైవమాయ అని మనకు కనువిప్పు కలిగిస్తున్నాడు. ముందు అధ్యాయాల్లో మనం మాయ స్వభావం చూశాం. ఇప్పుడు మనం మాయ స్వరూపాన్ని చూస్తున్నాం. ఇక మాయను ఎవరు దాటాలనేది ప్రశ్న, మాయలో ఉన్న వారే గానీ మాయలో లేనివారు కాదు కదా మరి మాయలో ఉన్నవారు మాయ ఏమిటో అర్థం చేసుకోలేకనే కదా అలా మాయలో ఉన్నారు. మరి మాయ అర్థం కాని వారు మాయనెలా దాటగలరు. అందుకే మనం దైవమాయ అయినటువంటి ప్రకృతి గుణాలతో కాకుండా దైవంతో అనుసంధానమై ఉంటే అప్పుడు మాయలో ఉండము. అలాంటి వారికి మాయ ఎక్కడుంటుంది మాయలో లేనప్పుడు దాటటానికి మాయలేదు కదా. అందుకే మాయలో ఉండి మాయను దాటలేం, అందుకనే జగద్గురువు మాయ దాటశక్యం కానిదని పేర్కొన్నారు. దీన్నే మనం మూడవ అధ్యాయంలో ఆత్మే బ్రహ్మం అని నిరూపించుకున్న చోట అది పురుషుని నీడ అని తెలిపోయింది. నీడను నీడగా గ్రహిస్తే మాయను మాయగా గ్రహిస్తే మాయ మనల్ని ఏమీ చేయలేదు. మనము మాయకు లోను కాము. మూడు మాయను దాటే మార్గం, ఇక్కడ శరణు పొందడం అంటే అపరా ప్రకృతి అయిన భౌతికమైన ప్రాపంచిక విషయాలపై దృష్టిని వీడి సదా దైవం పైనే నిలపడం. ఆత్మచింతన మొదలైన దైవిక లక్షణాలను కలిగి ఉండడం. మాయను దాటడం కష్టమే కానీ అసాధ్యం కాదు కదా. దైవ ధ్యానం దైవ దర్శనం వల్ల సుసాధ్యమే. దీన్నిబట్టి కేవలం భౌతిక దృష్టి ప్రాపంచిక విషయ వాసనలకే పరిమితమైన వారిని మాయ ముప్పు తిప్పలు పెట్టగలదు. వారి దగ్గరే దాని ఆటలు అంతేగాని ఆత్మిక దృష్టితో దైవంతో యోగమయ్యే ఆత్మజ్ఞాన పరాయణులు అవలీ లాగా మాయను దాటగలరు. ఎందుకంటే దైవంతో అనుసంధానమై ఉండే అద్భుతమైన ధ్యానయోగం అనే నావను పడవను మనం సంపాదించుకున్నాం. కాబట్టి భగవదాశ్రయం భగవత్ శరణాగతి ఆత్మచింతన ఉన్నవారు కచ్చితంగా ఈ నావతో ఆవు దూడ యొక్క కాలి గిట్టలలో ఉన్న నీటిని దాటినట్లు మహాసముద్రంలా తలపించి అనిపించి ఉక్కిరి బిక్కిరి చేస్తున్న మాయను అవలీలగా ఆనందంగా దాటగలరు. నన్ను శరణు పొందిన వారు ఈ మాయను దాటుతారు. మనం ఉన్నామంటే మనల్ని ఆశ్రయించిన మాయ ఉంటుంది కదా ఇది భూలోక తయారీ విధానం. సూర్యచంద్రుల గమనాన్ని బట్టి మన నీడ మనల్ని అనుసరిస్తూ ఉంటుంది అది మనల్ని ఆశ్రయించిందే గాని మనం దాన్ని ఆశ్రయించలేదని గమనించాలి. ఇది వ్యక్తి నీడ, వ్యక్తి మాయ అలాగే ప్రకృతి మాయ, ప్రకృతి నీడ అని అర్థం చేసుకోవాలి. మాయకు ఆధారం పరమేశ్వరుడని చూసాం, అలా పరమేశ్వరుడే సర్వాత్ముడు అని గ్రహించి ఆత్మ స్వరూపంగా మనలో భాసించేది పరమేశ్వరుడే అని తెలియగానే ఈ విధమైన బ్రహ్మాత్మ జ్ఞానంతో మాయ అదృశ్యమైపోతుంది. మనం ఎంతసేపటికి దైవాన్ని దర్శించక పోవడం వలనే ఈ మాయ సమస్య. దైవాన్ని దర్శించగానే మాయ మటుమాయమైపోతుంది. దైవం సత్యమని మాయ మాయమని తెలియవస్తుంది. అందుకని మమ మాయ ఇది నా మాయే అంటూ తన స్వరూపాన్ని స్వభావాన్ని స్పష్టంగా మన ముందు ఉంచారు. కాబట్టి మనం పరమాత్మ దర్శనంతో మాయను తెలిసి మాయను దాటిన వారవుదాం.

మనం దైవాన్ని దర్శించగానే మాయాబటు మాయమైపోతుంది దైవం సత్యమని మాయ మాయమని తెలియ వస్తుంది అందుకని మామ మాయ ఇది నామాయి అంటూ తన స్వరూపాన్ని స్వభావాన్ని స్పష్టంగా మన ముందు ఉంచారు జనంతో కాబట్టి మనం పరమాత్మ దర్శనంతో మాయను తెలిసి మాయను దాటిన వారవుదాం.

7అ, 15శ్లో.

న మాం దుష్కృతినో మూఢాః ప్రపద్యంతే నరాధమాః ।

మాయయాపహృతజ్ఞానా ఆసురం భావమాశ్రితాః | 15 |

మాయలో చిక్కుపడుటవలన విపరీత జ్ఞానమునకు లోనైనవారును, ఆసుర ప్రవృత్తిగలవారును, నరాధములును, మూఢులును, దుష్కర్మలను ఆచరించు వారును నన్ను భజింపరు.

ఇక్కడ నన్ను నేను నా లాంటి శబ్దాలకు మూలశక్తి దైవం, అధిష్టానబ్రహ్మం అని అర్థం చేసుకోవాలి. అంతేగాని ఏదో ఒక ప్రత్యేకమైన రూపానికి నామానికి పరిమితమైంది కాదని గ్రహించి ముందుకెళ్లాలి. దైవాన్ని ఆశ్రయిస్తే మనల్ని ముప్పుతిప్పలు పెడుతున్న మాయను అవలీలగా దాటవచ్చని ముందు శ్లోకంలో చూసాం మరి అందరూ ఆశ్రయిస్తే సరిపోతుంది కదా అనే ప్రశ్న మనలో మొదలవుతుంది. అందుకని జగద్గురువు ఇక్కడ ఈ శ్లోకంలో స్పష్టంగా ఎవరెవరు శరణు పొందలేకపోతున్నారో దైవాన్ని ఆశ్రయించలేకపోవడానికి గల కారణాలు ఏవో స్పష్టం చేశారు.

ఒకటి పాపులు లేదా దుష్టులు, రెండు మూఢులు, మూడు నరాధములు, నాలుగు మాయచే అపహరింపబడిన అవివేకులు, అయిదు అసుర స్వభావాన్ని ఆశ్రయించేవారు. ఈ ఐదు విధాలైనటువంటి వారు భగవంతుని శరణు పొందలేక దైవం పై దృష్టి నిలపలేక పోతున్నారు. పాపులు అంటే కామ క్రోధాదులు రాగద్వేషాలు భౌతికతపై ఆసక్తి కలిగి ఉండి తద్వారా సంస్కారాలను జన్మజన్మలకు మోసుకెళ్ళేవారు. వీరి హృదయంలోకి మాయ ప్రవేశించడం వల్ల వీరు మాయకు లోనుకావడం వల్ల వీరి జ్ఞానాన్ని మాయ అపహరించడం వల్ల వాళ్లకు ఈ గందరగోళపు అస్తవ్యస్త పరిస్థితి ఏర్పడుతుంది. మాయను గజదొంగగా పేర్కొన్నారు జగద్గురువు, మనం ఈ గజదొంగకు మన హృదయంలో అవకాశం ఎప్పటికీ ఇవ్వకూడదు. మనం దైవం పై దృష్టి లేక ఏమరుపాటుతో ఉంటే మాయ మనలోకి చొరబడి మన సర్వస్వాన్ని జ్ఞానాన్ని ప్రజ్ఞను వివేకాన్ని హరించి వేస్తుంది. అలా అది హరించి వేయడం వల్ల మహోన్నతమైన మానవుడు నరాధముడు అవుతున్నాడు, అధములు అనే శబ్దం గుణానికి సంబంధించింది స్వభావానికి సంబంధించిందే గానీ కులానికి సంబంధించింది కాదు. ఈ నరాధమ స్థితిలో మనిషి రాక్షసుడుగా మారి అమానవీయ చర్యలకు అక్రమాలకు పాల్పడే పరిస్థితికి దిగజారిపోయి ప్రవర్తిస్తాడు. ఇలాంటి వారిని మనం నేడు చూస్తూనే ఉన్నాం కారణం వారిలో దైవదృష్టి లేకపోవడం, తనలోని జ్ఞానం వివేకం మాయచే అపహరించబడటమే. అందుకని అప్రమత్తంగా ఉండి సదా దైవం పై దృష్టిని నిలపాలి, దైవదృష్టి లేని చోట మాయ దానికదే

జొరబడిపోతుంది. అందుకని నన్నే భజించు, దైవాన్నే స్మరించు దైవదృష్టిని అలవర్చుకో అని సత్ గ్రంధాలు ఉద్బోధిస్తూనే ఉంటాయి. క్షణమాత్రమైన మన దృష్టి మరలినదా ఆ గజదొంగ ప్రవేశించి మనపై ఆధిపత్యం చేసి మరీ అమాంతం మన పతనానికి కారణం అవుతుంది. కాబట్టి ఈ విషయాన్ని చాలా చాలా అప్రమత్తతతో ఆలోచించి క్షణమాత్రం కూడా ఏమరుపాటు లేకుండా దైవదృష్టిని కలిగి ఉండాలి. దుష్కృతులు అంటే సదాచారాన్ని అభ్యసించలేని దుర్చరులు, వ్యసనపరులు మలిన చిత్తులు, వివేకం లేని మూఢులు, అవివేకులు యుక్తాయుక్త విచక్షణం లోపించిన వారు. ఏది చేయాలి ఏది చేయకూడదు అనే వివేక జ్ఞాన శూన్యాలు, భ్రాంతికి లోనైన వారు. నరాధములు అంటే ఈశ్వరుని యందు పరమాత్మ యందు మనసును లగ్నం చేయని అయోగ్యులు, మాయను దాటలేని మందబుద్ధులు. అసురులు అంటే దేవతలు కదా దైవ భావం ఉన్నవారు అంటే దైవ భావన లేనివారు దేవతలు కాని వారు అని అర్థం. అజ్ఞానాన్ని అసత్యాన్ని భ్రాంతిని ఆశ్రయించుకొని ఉండేవారు అసురులు మరి వీరిలోని సాధారణ సహజమైన మానవ జ్ఞానం ఏమైంది అంటే వీరి దృష్టిని దైవం పై నిలపని కారణంగా మాయ అపహరించేసింది, అందుకు వీరు అసురులుగా మారిపోయారు. భౌతిక సంపాదన, వస్తువాహనాదుల విషయంలో ఏమరుపాటుతో ఒకవేళ మనం పోగొట్టుకున్నా మళ్లీ తిరిగి వాటిని శ్రమ చేత సంపాదించుకోగలం. కానీ వివేకా జ్ఞానం అనే సంపదను అప్రమత్తంగా ఉండి సదా దైవదృష్టితో ఉండి మనం మన వివేక జ్ఞానాన్ని కాపాడుకోవాలి. తద్వారా మనం మనమే దైవం కాగలిగే విధంగా ఎదగగలం. అప్పుడే జీవితం జన్మ పురోభివృద్ధి దిశగా ముందుకెళ్తూ ఉన్నట్లు భావించాలి. అలా లేని మాయాధీనమైన జన్మ జీవితం వృధా, పైగా సంస్కారాల మోత మోయలేనంతగా తయారై మనల్ని అయోమయంలో నెట్టివేస్తుంది. అదో అస్తవ్యస్తమైన దుస్థితి అందుకని ఆ దుస్థితికి లోను కాకుండా స్వస్థితిలో ఉంటూ స్వస్థితిని రక్షించుకుంటూ సదా దైవ స్థితికి చేరడానికి ప్రయత్నించాలి.

7అ, 16శ్లో.

చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినోఽర్జున |

ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ |16|

ఓ భరతశ్రేష్ఠా! అర్జునా! శుభకర్మలను ఆచరించుచు సుఖసంపదలను కోరుకొనువారు (అర్థార్థులు), శారీరిక మానసిక సంతాపములకు గురియైన ఆర్తులు, ఐహికవిషయములపై ఆసక్తిని వీడి పరమాత్మతత్త్వ జ్ఞానమును పొందుటకు ఇచ్చగలవారు (జిజ్ఞాసువులు), పరమాత్మప్రాప్తినందిన జ్ఞానులు అను చతుర్విధ భక్తులు నన్ను భజింతురు.

ముందు శ్లోకంలో దైవదృష్టి లేని వారి గురించి వివరించి ఈ శ్లోకంలో భగవంతుని ఆశ్రయించే దైవదృష్టి ఉన్న జిజ్ఞాసులను స్థూలంగా నాలుగు విధాలుగా పేర్కొన్నారు. వీరందరూ కూడా సుకృతం గలవారే అని పుణ్యాత్ములే అని భరోసా ఇచ్చారు.

ఒకటి ఆర్తి అంటే ఆపద ఆపదలలో ఉన్నవారు ఆపన్నులు, ఆపదలో సంభవించిన దుఃఖాన్ని భరించలేక ఆ ఆపత్తు తటస్థించిన సందర్భంలో భగవంతుడ్ని స్మరిస్తారు ప్రార్థిస్తారు. అలాంటి ఆపత్తు సందర్భంలో దైవం తప్ప ప్రపంచంలో మరొకరు నన్ను కాపాడలేరనే భావం సుస్థిరమైపోతుంది. ఆ సుస్థిర భావంతో నీవే తప్ప ఇహపరంబెరుగను అంటూ బాహ్య ప్రపంచాన్ని వీడి దైవం పై దృష్టి పెడుతారు. అది రోగ భయం కావచ్చు దొంగ భయం కావచ్చు ఏదైనా కావచ్చు శారీరక మానసిక సంతాపాలకు గురి అయిన వారు కావచ్చు అయితే అంతటి ఆపదలో కూడా దైవం ఒకటి ఉందని బుద్ధి గుర్తు చేసి దృష్టిని దైవం వైపుకు మరల్చుతుంది. ఇది రావాలంటే కూడా సుకృతం ఉండాల్సిందే అంటున్నారు జగద్గురువు. ఆపద కారణంగా దైవం పై దృష్టి సుస్థిరమైంది కాబట్టి అది కూడా జన్మజన్మల పుణ్యఫలమే అలా దైవ స్మృతిని కల్పించే దైవం పై దృష్టిని సుస్థిరం చేసే ఆపదలను కూడా సంపదలుగానే మనం భావించవచ్చు. ఎందుకంటే రాకపోకలు గల సుఖదుఃఖాలు తాత్కాలికం అయితే శాశ్వతమైన దైవస్మరణ దైవస్ఫురణ ఆ ఆపద సమయంలో కలిగింది కదా కాబట్టి దైవస్మృతిని కలిగించే ఆపదలు సంపదలే. మనకు ఇవన్నీ మన అనుభవంలోనివే కూడా అందుకే జగద్గురువు వీరిని కూడా సుకృతులు అన్నారు. శ్రీమద్ భాగవతం గజేంద్రమోక్షం ఘట్టంలోని గజేంద్రుడు ఇందుకు ఉదాహరణగా మనం తీసుకోవచ్చు.

రెండు జిజ్ఞాసువు, తత్త్వం తెలుసుకోవాలనే దైవ జిజ్ఞాసువు, భగవత్ తత్త్వాన్ని తెలుసుకోవాలనే అభిలాష, పరమేశ్వర తత్త్వం తెలుసుకోవాలనే ఇచ్ఛ గల జిజ్ఞాసువులు చాలా చాలా అరుదుగా ఉంటారు. కానీ భగవంతుడు జ్ఞానరూపంలో ఉంటాడు కదా జ్ఞాన స్వరూపమే దైవం అని తెలిసినవారు కూడా చాలా చాలా అరుదుగా ఉంటారు. జ్ఞాన సముపార్జనకు శాస్త్రం ప్రమాణమని తెలిసి భగవంతుని చేరే భగవద్గీత శాస్త్రాన్ని అధ్యయనం చేసే జిజ్ఞాసువులు చాలా చాలా అరుదు. అలాంటి అరుదైన జిజ్ఞాసువులకు ఉదాహరణ జనకుడు, ఉద్ధవుడు లాంటి మహాత్ములు. అలాంటి జిజ్ఞాసువులు వేదాలలోని శబ్ద బ్రహ్మాన్ని కూడా దాటిపోతారని ఇచ్చిన భరోసా 6-44 లో చూసాం. అనేకానేక జన్మల సుకృతమే ఈ జిజ్ఞాసకు కారణం.

మూడు అర్థార్థి, శుభకర్మలను ఆచరిస్తూ సుఖసంపదలను కోరుకునేవారు, ధనాన్ని ఆశిస్తూ పరమేశ్వరుని ఆరాధించేవారు. తమ తమ కార్యాలు భగవంతుని అనుగ్రహం చేతనే సాధ్యమవుతుందని గ్రహించి తత్కార్యసిద్ధికి భగవంతుని ఆశ్రయించుకొని ఆరాధిస్తూ ఉంటారు. ఆర్తితో అర్థాకలితో భక్తులుగా మారేవారు కొందరైతే ఆర్తి లేకపోయినా అవసరానికి మించిన ధనం ఉన్నా ఇంకా ఇంకా కావాలని పరిగ్రహ బుద్ధి ప్రేరణతో సంపదలనాశిస్తూ దైవాన్ని ఆశ్రయించేవారు కొందరు, వస్తు వాహనాదులనాశించి భగవంతుని ప్రార్థించేవారు ఉంటారు. ఇలా వివిధ రకాలుగా దైవాన్ని ఆశ్రయించే అర్థార్థులు మొదటగా ఐశ్వర్యాలను అభిలషించి భక్తులైనా కూడా క్రమేపీ వారిలో పరివర్తన చెంది నిజభక్తులు అవుతారు. నెమ్మదిగా వారిలో పరిగ్రహ బుద్ధి క్షయమైపోతుంది. ఎందుకంటే దైవదృష్టికున్న మహత్తు అలాంటిది ఏదో కారణం చేతనైనా దైవాన్ని స్మరిస్తే ఆ దృష్టి క్రమేణా తన మానసిక పరివర్తనకు దారితీసి పూర్తిగా దైవంతో నిమగ్నం చేసుకుంటుంది, అదే దైవశక్తి మహాత్మ్యం.

ఇక నాలుగు జ్ఞాని, ఆత్మానాత్మ వివేకం గలవారు స్వస్వరూపానుభవం పొందిన మహనీయులు. జ్ఞాని సదా తన దృష్టిని ఆత్మయందే సుస్థిరం చేసి దైవంతో ఏకమై ఉండేవారు. ఎలాంటి కోరికలు లేక సకామంగా కాకుండా నిష్కామంగా దైవంతో స్థితమైన వారు. ఇందుకు ఉదాహరణ శుకమహర్షి, సనక సనందాదులు, ప్రహ్లాదుడు లాంటివారు ఇలా నాలుగు రకాల చతుర్విధ భక్తుల్ని మనం సవివరంగా చూసాం. ఈ నలుగురిలో ఎవరు శ్రేష్ఠులో తెలియజేసే తరువాతి శ్లోకాన్ని విజ్ఞాన సహితంగా చూద్దాం.

7అ, 17శ్లో.

తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే

ప్రియో హి జ్ఞానినోఽత్యర్థమ్ అహం స చ మమ ప్రియ: ।17।

ఈ చతుర్విధభక్తులలో నిరంతరము నాయందే ఏకీభావస్థితుడై, అనన్య భక్తియుతుడైన జ్ఞాని అత్యుత్తముడు. ఏలనన వాస్తవముగ నన్ను (నాతత్త్వమును) తెలిసికొనిన జ్ఞానికి నేను మిక్కిలి ఇష్టుడను. అతడును నాకు మిక్కిలి ఇష్టుడు.

ముందు శ్లోకంలోని జ్ఞాని స్థితిని ఈ శ్లోకంలో అత్యంత శ్రేష్టమైనదిగా అభివర్ణించారు. ఇందులో నిత్యయుక్తం ఏకభక్తి అనే రెండు అంశాలతో జ్ఞానులు కొనసాగే విధానాన్ని ప్రతిపాదించారు. నిత్యయుక్త అంటే నిరంతరం పరమాత్మతో దైవంతో అనుసంధానమై ఉండటం. మానవుడికి దైవానికి అంటే మనకు మన అంతరాత్మకు ఉన్న ఉండాల్సిన అవ్యక్త అద్వితీయ ఆనందమయ అలౌకిక సూత్రం ఇది, అలా ఉండటమే మానవ జీవన సహజ స్థితి. జ్ఞానులు ఆత్మ ధ్యానంలో నిత్య యుక్తంగా ఏకమై ఉంటారు, అందుకనే జగద్గురువు చతుర్విధ భక్తుల్లో జ్ఞానిని శ్రేష్టుడుగా పేర్కొన్నారు. ఏకభక్తి అంటే విభక్తం కానిది వివిధం కానిది భిన్నం కానిది వియోగం లేనిది. కాబట్టి నిత్య యుక్తమైన ఏకభక్తి మాత్రమే వ్యక్తికి శోభను చేకూర్చుతుంది మోక్షాన్ని ప్రసాదిస్తుంది అదే ఏకభక్తి వైశిష్ట్యం. జ్ఞానికి పరమేశ్వరుడు ఆత్మ కాబట్టి పరమాత్మ జ్ఞానికి అత్యంత ప్రియుడు, అలాగే జ్ఞాని పరమాత్మకు ఆత్మ కనుక ఒకరికొకరు అత్యంతమైన మిక్కిలి అయిన అనంతానంతమైన ప్రియులు ఇష్టులు. అయితే ఆ ప్రేమ బంధాన్ని దర్శించి అనుభూతించి ఆస్వాదించే అనంతానంతమైన అనుభూతిని మనిషి సంప్రాప్తించుకోగలగాలి. 6-29, 30, 31, 32 లోను ఈ అంశాన్ని ప్రతిపాదించారు. 12 రకాల యజ్ఞాలతో పాటు ఆచరణ విధానాన్ని పేర్కొని చివరకు జ్ఞాన యజ్ఞమే శ్రేష్టమైనదని అలాగే జ్ఞానంతో సమానమైనది మరేది లేదని నాలుగవ అధ్యాయం అంతా ప్రతిపాదించిన విషయం విదితమే. చతుర్విధ భక్తులలో ప్రథముడు అధికుడు జ్ఞాని. తత్త్వం తెలిసినవాడు కనుక నిత్యం యోగంలో ఉంటాడు వీరికి భజించడానికి దైవం తప్ప మరొకటి కనిపించదు, అందుకే ఏకభక్తి కలవాడు అన్నారు. మిగిలిన మూడు విధాల వారు కొంతకాలం దైవాన్ని స్మరించి మళ్ళీ ప్రాపంచిక వ్యవహారాలలో ప్రవేశించి మనసును జారవిడుస్తూ దైవాన్ని మరుస్తూ ఉంటారు. నిత్య యుక్తంతో ఏకభక్తితో వెలుగొందే జ్ఞానియే సర్వకాల సర్వావస్థల యందు భగవంతునితో ఆత్మతో కూడి ఉంటారు. అందుకని నాలుగు విధాల భక్తులలో జ్ఞానికే ప్రథమ పీఠం. మనం

తరచి తరచి చూస్తే ఆత్మతో అనుసంధానమై అవలోకిస్తే భక్తి అనేది ఏకమే కానీ వివిధాలు కావు. వ్యవహారాల కోసం పంచభక్తి నవవిధ భక్తి శతభక్తి అని పేర్లు పెట్టబడ్డాయి గాని భక్తి అనేది ఏకమేనని గ్రహించాలి. ధ్యానయోగం ద్వారా ఏకాగ్రమొనర్చడమే భక్తి పూజ. కాబట్టి భక్తి ఏకమే గాని భిన్నం కాదని గ్రహించాలి. నిత్య యుక్తమైన ఏకభక్తి విశిష్టతను మనకు తెలపడానికి జగద్గురువు ప్రత్యేకించి ఈ విశిష్టమైన శ్లోకాన్ని మనం ముందు ఉంచారు. ఇక్కడ ఇంకాస్త లోతుల్లోకి వెళ్లి మనం విజ్ఞాన సహితంగా గమనిస్తే నిత్య యుక్త ఏకభక్తికి జ్ఞానికి అభేదం లేదని కూడా మనకు తేటతెల్లమవుతుంది. జ్ఞానమున్నవారే భక్తులు, ఆ జ్ఞానపూరిత భక్తి ఉన్నవారే జ్ఞానులు అని ఈ శ్లోకం స్పష్టీకరిస్తుంది. ఇక ఈ శ్లోకంలో అత్యర్థం అన్నారు అలాంటి జ్ఞానికి దైవం పట్ల దైవానికి జ్ఞాని పట్ల అమితమైనటువంటి ప్రియం ప్రేమ ఉంటుంది ఇదే ప్రేమ ఇదే దివ్య ప్రేమ. భక్తునికి భగవంతునికి మధ్య ఉన్న అద్వితీయ అఖండ అనుబంధమైన ప్రేమ సూత్రమే ఇందుకు ప్రతీక. ప్రేమ అనేది దివ్యతకు సంబంధించిందే గాని నస్వరమైన దేహానికి తాత్కాలిక రాకపోకలకు సంబంధించింది కాదు. ప్రేమ భగవంతుడ్ని భక్తుడ్ని ఏకం చేసే బంధం. ప్రేమ అనే భావనకు ప్రతీక ఇదే అందుకే ప్రియం అనే పదాన్ని ప్రయోగించారు. మనం ఈ ప్రేమ ప్రియం ప్రియుడు ఇష్టుడు ప్రియురాలు అనే పదాలను వివిధ రకాలుగా ప్రయోగిస్తూ అపార్థం చేసుకుంటూ ఉంటాం. కానీ ఆ ప్రేమమయమైన ప్రియమైన బంధం ఒక విశేషమైన నిత్య యుక్త ఏకభక్తి జ్ఞానికి దైవానికి మధ్య ఉన్న అంతఃసూత్రమేనని తెలియాలి. ఈ ప్రేమ ప్రియం అనే మాటలు దేహానికో వ్యవహారానికో కాదని ఖచ్చితంగా గుర్తించాలి. రాకపోకలు కలిగిన తాత్కాలిక ఆకర్షణ లాంటి వాటికి అసలు ఈ పదాలు వర్తించవు. ప్రేమ అనేది జీవశక్తికి అంతర్యామి అయిన పరమాత్మకు ప్రతీక, అంతేగాని దేహ బంధానికో ఇంద్రియాలకో సంబంధించినది కాదు. అందుకే భగవంతుడు జ్ఞానికి జ్ఞాని భగవంతుడికి అత్యంత ప్రియుడు, ఇది సకామ ప్రియత్వం కాదు ఆత్మ పరమాత్మ ప్రియత్వం. వీరు పరస్పరం అత్యంత ప్రియులు, ప్రేమికులు, ఇష్టులు. నేను జ్ఞాని యొక్క ఆత్మను అందుచేత అతనికి నేను అత్యంత ప్రియుడ్ని, ప్రియురాల్ని నాకు అతడే ఇష్టుడు ప్రియుడు. చతుర్విధ భక్తులలో నిత్యం పరమాత్ముని యందే భక్తి గల జ్ఞానవంతుడు నిత్యం ఆత్మయందు ఏకాగ్ర చిత్తంతో ఉండే జ్ఞాని ఇష్టుడు, జ్ఞానికి అత్యంత ప్రియుడను నేను అతడు నాకు ప్రియుడు.

7అ, 18శ్లో.

ఉదారాః సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్ |.

ఆస్థితః స హి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిమ్ | 18 |

ఈ చతుర్విధ భక్తులందఱును ఉదారులే. (అనగా భగవంతునియందు విశ్వాసమునుంచి, ఎల్లప్పుడును అతనినే సేవించుచు ఉండువారు.) కాని జ్ఞానియైన వాడు నా స్వరూపమే. ఇది నా అభిప్రాయము. ఏలనన, అట్టి భక్తుడు తన మనస్సును బుద్ధిని నాయందే స్థిరముగా ఉంచి నన్నే పరమప్రాప్యునిగా భావించును. ఈవిధముగా అతడు నాయందే స్థితుడు.

ముందు శ్లోకంలో చెప్పిన శ్రేష్ఠుడైన జ్ఞాన భక్తుడు తన మనస్సును బుద్ధిని నాయందే స్థిరంగా ఉంచి నన్నే పరమ ప్రాప్యునిగా భావించి నాయందే స్థితుడై ఉంటాడు అన్నారు మిగిలిన మూడు విధాల వారు ఇష్టం లేదని కాదు. ఉదారులు అంటే ఉన్నతులు అని అర్థం భక్తులందరూ ఉన్నతులే కానీ జ్ఞాని మాత్రం తానే అని తన స్వరూపమేనని సందేహానికి తావు లేకుండా ఈ శ్లోకాన్ని స్పష్టం చేశారు. జ్ఞాని తానే అయి ఉంటాడు, యుక్తాత్మా అని చెప్పడం వల్ల జ్ఞాని ఆత్మయందే తన చిత్తాన్ని నిరంతరం సంలగ్నమొనరుస్తూ ఉంటాడు. ఈ ముగ్గురూ కూడా పరమాత్మకు తానే పరమాత్మ అయిన జ్ఞానికి కూడా భక్తులుగా ఉంటారు. వారు కూడా నెమ్మదిగా జ్ఞానిగా ఎదిగి పరమాత్మ స్వరూప స్థితికి చేరుకుంటారు. సకామ భక్తులైన మూడు విధాల వారు దైవానికి ఇష్టులు కారా ప్రియులు కారా అనే సందేహానికి తావు లేకుండా వెంటనే జగద్గురువు ఈ శ్లోకాన్ని ప్రతిపాదించారు. ఆర్తులు, అర్థార్థులు, జిజ్ఞాసువులు ఈ ముగ్గురిదీ తాను వేరు, దేవుడు వేరు అనే బేధభక్తి అయితే జ్ఞానిది అభేద భక్తి. ముగ్గురు ఉదారులదీ ఉన్నతులదీ ద్వైతం, జ్ఞానిది అద్వైతం. ఇదే జ్ఞానికి మిగిలిన మూడు విధాలా భక్తులకు ఉన్న తేడా. ఆర్తాది భక్తులు చేసే పూజాది కార్యక్రమాలు కానీ సాధనలు కానీ దేశ కాలాదులకు పరిమితంగా ఉంటాయి. జ్ఞానం అలా కాదు

తనలోని ఆత్మే పరమేశ్వరుడు అనే తత్త్వంతో తానే దైవంగా దైవమే తానుగా ఉంటాడు. అలా తన స్వరూపమే జ్ఞానిది కనుక ఆ ఇద్దరూ ఒక్కరు గానే భాసిస్తారు. జ్ఞానికి భగవంతునికి భేదం ఉండదు. జ్ఞాని సాక్షాత్తు దైవ స్వరూపమే అని అర్థం అందుకే దైవ ప్రేమ కన్నా పరమాత్మ కన్నా ఉత్తమమైనది మరొకటి లేదు. ద్వైత భావంతో కొనసాగుతున్న గొప్పవారు ఉదారులు సుకృతులు కూడా అద్వైతంలోకి జ్ఞానమార్గంలోకి రావాలని తెలియజేయడమే ఈ శ్లోకంలోని ప్రత్యేకత. 4- 33, 6-32 లోని శ్లోకాల అవగాహనతో ఈ శ్లోకాన్ని సమన్వయం చేసుకొని అత్యుత్తమమైన సర్వోన్నతమైన జ్ఞాని అయిన పరమాత్మ పదవిని పొందుదాం. మన జన్మకు సార్థకతను జీవిత పరమార్థాన్ని సంప్రాప్తింప జేసుకుందాం.

7అ, 19శ్లో.

బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే |

వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః |19 |

అనేకజన్మలపిదప జ్ఞానియైనవాడు(భగవత్త్వమును ఎఱిగినవాడు) సర్వమూ వాసుదేవమయమే యని భావించి, నన్ను శరణుపొందును. అట్టి మహాత్ముడు లభించుట అరుదు.

16వ శ్లోకంలో చతుర్విధ భక్తుల్ని పరిచయం చేసి వారిలో జ్ఞాని శ్రేష్టుడని 17వ శ్లోకంలో నిర్ణయించి 18వ శ్లోకంలో పిలుపునిచ్చారు. ఈ శ్లోకంలో జ్ఞాని వైభవాన్ని స్తుతిస్తున్నారు. జ్ఞానం పొందడానికి అవసరమైన సంస్కారాలను సముపార్జించడానికి అనేక జన్మలెత్తిన అనుభవంతో చిట్టచివరకు పరిపక్వ జ్ఞానం కలిగి విశ్వవ్యాపక వాసుదేవుడ్ని అయిన నన్ను ప్రత్యక్షంగా తెలుసుకుంటారు. ఎలా తెలుసుకుంటారు అంటే సర్వమూ వాసుదేవుడే అని తెలుసుకుంటారు. వసతి, వాసం అంటే ఉండటం ఉన్నదాన్ని ఉన్నట్లుగా తెలియడం ఇదే వాసుదేవతత్వం. వాసుదేవుడంటే వసిస్తున్నవాడు, సర్వత్రా నివసిస్తూ వ్యాపితమైవున్న సర్వాత్మ అని అర్థం. సమస్త జగత్తులో ఆవాసమై ఉన్నవాడు అని అర్థం చేసుకోవాలి. అందుకే సర్వాత్మ అయిన నన్ను చేరిన వాడు మహాత్ముడు అన్నారు. సమస్త చరాచరంలోనూ నామరూపాల్ని కాకుండా అందులో అంతర్యామిగా ఉన్న సర్వాత్మను, వాసుదేవుడ్ని దర్శించడమే మానవ జీవితం అంతిమ లక్ష్యం ఈ దృష్టిని అలవార్చుకోవాలి. ఇక జన్మ అనే శబ్దం శరీర సంబంధమే ఉత్పత్తి జన్మ పుట్టడం. ఇక్కడ పుట్టింది శరీరమే అనేక జన్మలు అంటే అనేక శరీరాలతో పుట్టడం అని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. ఇక్కడ 'బహూనాం' అంటే అనేక జన్మల తరువాత అనే భావాన్ని మనం జీవపరిణామ క్రమం అని అర్థం చేసుకోవాలి. ఖనిజాలు వృక్షాలు జంతువులు మానవులు ఇలా పరిణమించిన వారని అర్థం. అంతేకానీ ఎన్నో జన్మలెత్తాక కదా ఇప్పుడే ఎందుకు మనకు ధ్యానం గీత ఇవన్నీ కూడా అని అనుకోకూడదు. అలా అనుకుంటే మళ్లీ మళ్లీ మనం దుఃఖ సాగరంలోకి నెట్టి వేయబడతాం. మనిషిగా జన్మజన్మలకు దుఃఖపూరిత సంస్కారాలు పోగై మనల్ని వెంటాడి వేటాడి మనల్ని ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. కాబట్టి మానవ జన్మ మొదటి దశలోనే మనం దైవచింతన అలవర్చుకొని ఆత్మ ధ్యాన యోగంలో పరమాత్మను పొందాలని అర్థం చేసుకోవాలి. అలాంటి ఆలోచన రావడం ఆస్థితిని పొందడం అరుదైనదని అదే మహాత్ముల స్థితి అని కూడా ప్రతిపాదించారు. జ్ఞాతృ, జ్ఞానం, జ్ఞేయం ఇవి మూడుగా తెలుస్తున్నా ఒక్కటిగా తెలియడం సర్వజ్ఞానం, జ్ఞేయం జ్ఞానం కన్నా వేరుగా లేదు జ్ఞానం జ్ఞానికన్నా వేరుగా లేవు అందుకని అభేదం లేని స్థితి జ్ఞాని స్థితి. ఉదాహరణకు ప్రపంచం ఉంది కానీ ఇది పరమాత్మ కన్నా వేరుగా లేదు ప్రపంచం పరమాత్మపై ఆధారపడి ఉంది, సర్వ ప్రపంచంలో సూత్రంగా ఉన్నది వాసుదేవుడేనని చూశాం. ఆ మూల శక్తి లేకపోతే ప్రపంచానికి మనుగడ లేదని కూడా తెలుసుకున్నాం. ప్రతి అంశాన్ని గాలి నీరు అన్నం అలా విభజించి అందులోనూ ఆంతర్యామిగా ఉన్న దైవాన్ని దర్శించాం. అందుకని నామరూపాత్మకమైన జగత్తు వాసుదేవుడి కన్నా పరమాత్మ కన్నా అన్యంగా లేదు. మట్టిలో సత్తు లేకపోతే కుండ తయారు కాదు కదా అలా అందుకని అవ్యయ బ్రహ్మ స్వరూపం నేనే అనే నిశ్చయజ్ఞానం కలవారు జ్ఞానులు వీరే మహాత్ములు. అనేక జన్మల అంతంలో మనిషి జ్ఞానవంతుడై సమస్తమూ వాసుదేవుడే భగవంతుడే అనే సద్బుద్ధితో నన్నే పొందుతున్నాడు. అట్టి మహాత్ముడు లోకంలో చాలా అరుదుగా ఉంటారు. మనం కూడా మట్టి చెట్టు పశుపక్ష్యాదులు అనేక జన్మల తరువాత మానవ జన్మను తీసుకున్నాం. కాబట్టి ఈ దశలో భగవత్ ధ్యానంలో గీతా మార్గంలో నడచి అరుదైన వారిలో ఒకరిగా మహాత్మ స్థితికి చేరుకుందాం. ఈ వాస్తవాన్ని గ్రహించలేకపోవడానికి గల కారణాన్ని వివరించే తరువాత శ్లోకంలోని విజ్ఞాన సహిత సందేశం కోసం ఎదురుచూద్దాం.

7అ, 20శ్లో.

కామైస్తైస్తైర్హృతజ్ఞానాః ప్రపద్యంతేఽన్యదేవతాః |

తం తం నియమమాస్థాయ ప్రకృత్యా నియతాః స్వయా | 20 |

నానావిధములైన భోగవాంఛలలో కూరుకొని పోయిన వారి జ్ఞానము హరింపబడును. వారు తమతమ స్వభావములకు అనుగుణముగా వారి వారి (ఆయా) నియమములను బట్టి ఇతర దేవతలను ఆరాధించుచుందురు.

ముందు శ్లోకంలో జ్ఞానిని స్తుతించి ఈ శ్లోకంలో జ్ఞానిగా ఎదగక పోవడానికి గల కారణాన్ని స్పష్టంగా తెలియజేశారు. పుత్రులు పశువులు స్వర్గం ఇంకా ఇహలోకపు భోగభాగ్యాలు మొదలైన వాటిపై కోరికలతో వివేకాన్ని కోల్పోయిన వారు ఆత్మరూపమైన వాసుదేవుడైన నన్ను కాక ఇతర దేవతలను చేరుతున్నారు. ఆయా దేవతల ఆరాధనతో ఆయా నియమాల్ని పాటిస్తున్నారు వారి వారి జన్మాంతర సంస్కారాలే స్వభావంగా ఉండి వారిపై ఆధిపత్యం వహిస్తూ నియంతగా మారి వారిని నియమిస్తోంది. కోరికల చేత అపహరింపబడిన మిథ్యాచార్యులు దాంభికులు అల్పులు మూఢులు మొదలైన వారిని ఉద్దేశించి ఉద్బోధించిన ప్రత్యేక శ్లోకమిది. ఆ భౌతికపరమైన విషయ వాంఛలు జ్ఞానాన్ని ఎలా అపహరించి మనిషి పతనానికి కారణం అవుతున్నాయో మన కళ్ళముందుంచారు. జన్మాంతరాలలో జ్ఞానాసక్తి గలవారు జ్ఞానాన్ని పోగుచేసుకుని జ్ఞానులైతే తద్విరుద్ధంగా జ్ఞానాసక్తి లేని వారు తాత్కాలిక సుఖాలతో రమించాలనే కామంతో కోరికల్ని తీర్చుకునే ప్రయత్నంలో నిమగ్నమై ఆ కోరికల్ని తీర్చుకోవడానికి ఆయా కోరికలకు సంబంధించిన దేవతలను ఉపాసిస్తూ ఉంటారు అదే వారి స్వభావమై ఉంటుంది. ఆయా కోరికలతో నిండిపోయిన స్వభావాన్ని అనుసరించే వారి వారి కర్మలు ఉంటాయి. అందుకని వారు ఆ సంస్కారాలతో ఈ జన్మలో కూడా కోరికల్ని తీర్చుకునే ప్రయత్నంలోనే ఉంటారు కాని విశ్వవ్యాపక వాసుదేవ పరమాత్మను ధ్యానించి తరించాలని భావించరు. ఎవరిని ఉపాసించాలి ఏమి పొందాలి అనే వివేకం వీరిలో దొంగల పాలైంది. అందుకని వీరు ఇలాంటి దుఃఖసాగరంలో జనన మరణ చక్రంలో చిక్కుకొని విలవిలలాడుతుంటారు. మనం ఆయా విశ్వవ్యాపక పరమాత్మ శక్తిని ఆయా నామరూపాలకు మాత్రమే పరిమితం చేసి పూజించడమే జగద్గురువు పేర్కొన్న అన్యదేవత ఆరాధన. దైవాన్ని దైవ శక్తిని ఓ పరిధిలో ఉంచడం ఇది మాత్రమే నా దైవం మిగిలింది కాదనే సంకుచిత దృష్టిని కలిగి ఉండడం లాంటి వాటిని వీడాలని అర్థం చేసుకోవాలి. అందుకే జగద్గురువు సర్వవ్యాపక వాసుదేవత్వాన్ని కాకుండా తమ తమ కోరికల్ని నెరవేరడానికి ఇతర దేవతల్ని ఆరాధిస్తున్నారు అన్నారు. దానికి కారణం వివేకాన్ని కోల్పోవడమేనని ఇక్కడ స్పష్టం చేశారు. మరి ఆ వివేకం ఏమైపోయింది, భౌతికమైన ఇచ్ఛకపు కోరికలనే దొంగలు వాటిని అపహరించారు. అవి వారి హృదయంలోకి జొరబడి వివేక శక్తిని ఆత్మిక జ్ఞానాన్ని అపహరించాయి. తత్ఫలితంగా వారు ఆత్మతత్వాన్ని భగవంతుని వ్యాపకాన్ని తెలుసుకోలేక తాత్కాలిక కోరికలు నెరవేరడానికని ఇతర దేవతల్ని ఆరాధిస్తుంటారు. తత్సంబంధమైన నియమాల్ని వ్రతాలను ఆచరిస్తూ భజిస్తూ

ఉంటారు. వారి అన్య దేవతారాధన లక్ష్యం కోరికలు నెరవేర్చుకోవడానికే గాని మోక్ష ప్రాప్తి కోసం కాదు. అందుకని మోక్షేచ్ఛ గలవారికి ఇలాంటి వాటి ద్వారా లక్ష్యం నెరవేరదు. కాబట్టి బాహ్యాంతర ఇంద్రియాల్ని సంయమించి హృదయస్థ పరమాత్మను ధ్యానించుటే ముక్తికి మార్గమని మనకు తెలియాలి. దీన్నిబట్టి ఇందులో మనం గ్రహించాల్సిన అంశాలు, మనిషి జ్ఞానాన్ని కోరికలు విషయ వాంఛలు హరించి వేస్తున్నాయి. దానికి కారణం జన్మాంతర విషయ సంస్కారాలు, తత్ఫలితంగా అద్భుతమైన మానవ జన్మ తీసుకున్న మహాశక్తి సంపన్నుడైన వివేకి కోరికలనే దొంగలకు అపహృతమై జ్ఞానాన్ని కోల్పోయిన వారై పరమాత్మను విడిచిపెట్టి అన్య దేవతల్ని ఆరాధిస్తున్నారు.

7అ, 21శ్లో.

యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధయార్చితుమిచ్ఛతి ।

తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్ । 21 ।

సకామభక్తుడు ఏయే దేవతా స్వరూపములను భక్తిశ్రద్ధలతో పూజింప నిశ్చయించుకొనునో ఆ భక్తునకు ఆయా దేవతలయందే భక్తిశ్రద్ధలను స్థిరముగా కుదురుకొనునట్లు చేయుదును.

పరబ్రహ్మాన్ని సత్యాన్ని గ్రహించలేక పోవడానికి గల కారణాలు ముందు శ్లోకంలో చూసాం. ఇందులో ఎవరిలో ఏ కోరికలున్నా ఎవరు ఏ దేవతలను ఆరాధించినా ఫలితం మాత్రం పరమేశ్వరుని ద్వారానే కలగాలి. అందుకని ఆయా కోరికలు ఉన్నవారు ఆ పరమేశ్వరుని అనుగ్రహం ఏ విధంగా పొందుతారో స్పష్టంగా ఈ శ్లోకంలో తెలియజేశారు. మనిషి ఏ ఏ కోరికతో ఏ ఏ దేవతా మూర్తిని శ్రద్ధతో పూజించాలని కోరుకుంటారో వారి వారికి అదే శ్రద్ధను తన ఇష్ట ప్రకారమే నేను స్థిరమయ్యేలా చూస్తాను అన్నారు. ఇక్కడ ఆ జన్మాంతర స్వభావం చేత ఏ శ్రద్ధతో ఏ దేవతామూర్తిని అర్చించ కోరుతారో అదే శ్రద్ధను అని ఇక్కడ అవగాహన చేసుకోవాలి. దీన్నిబట్టి మనం 3-33 లో సుదీర్ఘంగా చర్చించిన జన్మాంతర స్వభావం క్షయమైతేనే స్వస్వరూపం దర్శితమవుతుందని తెలియాలి. ఆయా దేవతలందరి పట్ల మనిషికి ఉన్నటువంటి భక్తిని శ్రద్ధను దృఢపరుస్తానన్నారు. ఇక్కడ భక్తి శ్రద్ధలకు ఉన్న ప్రాధాన్యతను మనం గమనించాలి. శ్రద్ధాభక్తులు లేని వారిని దైవమైనా చేయగలిగినది ఏమీ లేదు శ్రద్ధా భక్తులు ధ్యానయోగ సాధనలో జ్ఞాన యజ్ఞంలో ఎంతటి విశిష్టమైన స్థానాన్ని సంతరించుకుందో మనం ఆయా సందర్భాల్లో చూసాం. అందుకే ఇక్కడ ప్రత్యేకించి శ్రద్ధతో కూడిన భక్తిని పేర్కొన్నారు. స్థూల శరీరం మొదలు అహంకారం వరకు ఉన్న సర్వస్వమూ చిత్స్వరూపమే అఖండ విశుద్ధ చైతన్య జ్ఞాన స్వరూపమైన పరబ్రహ్మమే అని 7-4లోనే చూసాం. నీటిలో ఉన్న తరంగాలు నురుగు సుడులు బుడగలు లాంటివి అన్నీ కూడా నీటి యొక్క వివిధ రూపాలు మాత్రమేనని విజ్ఞాన సహితంగా గ్రహించాలి. మన లోపల బయట కింద ముందు వెనుక ఇరువైపులా అన్ని దిశలా నిండి ఉన్నది

ఆత్మేనని ఆత్మేతరమైనది లేనేలేదని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాం. అలాగే వేదాలు శృతులు కూడా ద్వైతరాహిత్యాన్నే ప్రబోధిస్తున్నాయి. దీన్నిబట్టి మనం దర్శించాల్సింది సనాతన అద్వితీయ పరబ్రహ్మమే గాని అన్యమైన వాటిని కాదు అయితే ఎవరికీ ఎందులో శ్రద్ధా భక్తి ఉందో నేను ఆయా అంశాలపైనే ఆయా దేవతా రూపాల పైనే వారి వారి ఇష్ట ప్రకారమే దృఢపరుస్తాను అని చెప్పడం వల్ల మన శ్రద్ధాభక్తులు విశ్వవ్యాపక పరబ్రహ్మమైన స్వరూపం పైన ఉంటే పరమేశ్వరుడు మనకు ఆదిశగా అనుగ్రహించి ముందుకు తీసుకెళ్తాడని అర్థమవుతుంది లేదా పరిమిత పరిధితో కూడిన నామం రూపం కోరిక ఏదైనా కావచ్చు, దానిపై శ్రద్ధతో భక్తితో పూజిస్తే ధ్యానిస్తే అందులోనే ఆ పరిధిలోనే మనల్ని స్థిరం చేస్తాడు. ఏదో ఒక క్షణం ఏదో ఒక జన్మలో ఆ పరిమిత పరిధిని దాటి విశ్వ వ్యాపకం చెందాలనే పరిపక్వత పరిణితి కలిగిన క్షణం మనం పురోభివృద్ధిని చెందగలమే గాని మరో మార్గం లేదు. మనలో ఆ దృష్టి శ్రద్ధ భక్తి కలిగిన నాడు మనలో ఎదుగుదల ఉంటుంది. మన పరిణితికి మనమే కారణం కాని ఇతరులు కాదు. పరిధిలో ఉండాలా స్వస్వరూపాన్ని దర్శించి విశ్వంలోకి విచ్చుకుపోయి విశ్వవ్యాపితమై విశ్వంతో మమేకమై విశ్వవ్యాపకులుగా వర్ధిల్లాలన్నా కూడా మన చేతుల్లోనే ఉందని ఈ శ్లోకం చాలా స్పష్టంగా తెలియజేస్తుంది. మన వాస్తవానికి మనమే సృష్టికర్తలమనే అంశాన్ని ఈ శ్లోకం నిర్ధారిస్తుంది. ఎందుకు వారి వారి ఇష్ట ప్రకారమే వారిని స్థిర పరుస్తాను అంటున్నారు అంటే వారిలోని శ్రద్ధా భక్తులు అనే ప్రధానమైన ఆయుధం సాధన ఉంటే చాలు నెమ్మదిగా తాబేలులా వారి అడుగులు సాగినా ఆలస్యంగానైనా పరమపదమైన దేవదేవుని పదాన్ని లక్ష్యాన్ని చేరుకోవచ్చని జగద్గురువు ఈ విధంగా ఈ శ్లోకాన్ని మన ముందు ఉంచారు. నీడ ఏదైనా అది ఏదో ఒక నిజాన్ని ప్రతిబింబిస్తూనే ఉంటుంది కదా, నీడలో ఉండేది ప్రతిరూపమే ప్రతిబింబమే, కానీ అది ఒక రూపానికి, బింబానికి ప్రతిబింబమేనని రోజు తెలిసి నిజాన్ని అన్వేషించాలి గుర్తించాలి దర్శించాలి దరి చేరాలి. జ్ఞాని కర్మల యందు భౌతిక విషయాల యందు ఆసక్తిగల అజ్ఞానుల బుద్ధిని కలత పెట్టకూడదని 3-26 లోనే చూసాం. అందుకే ఇక్కడ జగద్గురువు ఏ భక్తుడు ఏ దేవతా రూపాన్ని ఏ దేవతా రూపాన్ని శ్రద్ధావంతుడై పూజించాలని అర్చించాలని కాంక్షిస్తారో అట్టి కోరిక గల వారికి వాటిపైనే నిశ్చలమైన శ్రద్ధను అనుగ్రహిస్తాను. ఇక్కడ తనువు అంటే దేవతా రూపం అని అర్థం, సకామ భక్తులైనా కూడా శ్రద్ధాభక్తులు ఉండటం వల్ల అనుభవంతో ఏదో ఒక క్షణం నిష్కామంగా ఎదుగుతారని జగద్గురువు ప్రోత్సహిస్తూనే పరమాత్మ దర్శనమైన సన్మార్గాన్ని చేరుకోమని కూడా ఉపదేశిస్తున్నారు. ప్రతి మనిషి తమ తమ సంస్కారాలను అనుసరించి తగిన మార్గాన్ని వెతుక్కుని అందులో స్వేచ్ఛగా కొనసాగుతారు. ఏం మార్గం ద్వారా వెళ్లినా ఎవరిని ఆశ్రయించినా చిట్టచివరకు అందరూ మానవ జీవితం గమ్యమైన ఆత్మను దర్శించాల్సిందే, చేరుకోవాల్సిందే. కాబట్టి మన నడక మెల్లగా సాగిన త్వరగా సాగినా మన నడకను మాత్రం ఆపకూడదని ఈ శ్లోకం స్పష్టం చేస్తుంది. వారి వారి శ్రద్ధ భక్తులతో కూడిన దృఢ ప్రయత్నం కారణంగా ఎప్పటికైనా దేవదేవుని పరమ గమ్యాన్ని వారు చేరుకోవచ్చు. అందుకే తమ తమ మార్గంలోనే వారికి అనుగుణంగానే వారి వారి శ్రద్ధను దృఢపరుస్తూ ఉంటానని పేర్కొన్నారు. దీన్నిబట్టి ఆధ్యాత్మికోన్నతికై ఎంతటి ప్రయత్నం మనం చేస్తామో అంతటి ఫలితాన్ని మనం పొందగలమని మనకు స్పష్టం అవుతుంది. అసలు ప్రయత్నమే చేయని వారికి ఏ విధమైన శ్రద్ధా

భక్తులు లేని వారిని దేవదేవుడైనా చేయగలిగింది ఏమీ ఉండదు. కాబట్టి ప్రయత్నం నిర్విరామంగా కొనసాగించి గమ్యాన్ని శీఘ్రంగా చేరుకునే దిశగా మనం అడుగులు వేద్దాం.

7అ, 22శ్లో.

స తయా శ్రద్ధయా యుక్తః తస్యారాధనమీహతే |

లభతే చ తతః కామాన్ మయైవ విహితాన్ హి తాన్ |22|

అట్టి సకామభక్తుడు తగిన భక్తిశ్రద్ధలతో ఆ దేవతనే ఆరాధించును. తత్ఫలితముగ నా అనుగ్రహము వలననే ఆ దేవత ద్వారా ఆ భోగములను అతడు తప్పక పొందగలడు.

దేవతారాధనలో దేవతలే ప్రధానంగా కనిపిస్తూ ఉండినా వారి ద్వారా ఫలాలు అనుగ్రహించేది ఆ పరమేశ్వరుడే. దేవతలలోనూ ఆంతర్యామిగా ఉన్నది పరమేశ్వరుడే మనం కనిపించే కనిపించని శక్తి గురించి చూశాం. అలాగే సర్వత్రా దైవం విశ్వవ్యాపితమైన విధానాన్ని చూసాం. ఆ దృష్టితో మనం చూస్తే దేవతలలోనూ ఆంతర్యామిగా ఉన్నది దైవమే కదా దైవ శక్తే కదా అని మనకు అవగాహన అవుతుంది. అందుకని మన దృష్టిని పరిధిలో కాకుండా విశ్వవ్యాపకం గావించాలి అప్పుడు మనం పొందుతున్న ఫలితం అవ్యయమైన పరబ్రహ్మ స్వరూపానిదే అని అవగతమై అంతర్యామి అయిన సృష్టికర్త మూల శక్తి జగద్గురువు స్వరూపం వైపుకు విస్తృతం కాగలదు. మాయ చేత తమ జ్ఞానం అపహరింపబడి మూఢులైన పాపులైన నరులను అధములు వివేక శూన్యులు రాక్షస స్వభావాన్ని ఆశ్రయించి నన్ను శరణు చెందరు అని మనం 15వ శ్లోకంలో చూసాం. వారికి ఈ శ్లోకంలో పేర్కొన్న సకామ భక్తులకు తేడా ఉంది, వీరిద్దరూ వేరువేరు భావాలు కలిగిన వారని గ్రహించాలి. 15వ శ్లోకంలోని వారు మాయ ఆశ్రితులైతే ప్రస్తుత శ్లోకంలోని వారు శ్రద్ధాభక్తులు కలిగిన ఒక ప్రత్యేక లక్షణం చేత సకామ భక్తితో తమ ఇష్టదేవతల్ని ఆరాధిస్తారు ఉపాసిస్తారు. తద్వారా ముందు శ్లోకంలో పేర్కొన్న వారి వారికి ఇష్టమైన వాటిపై భగవంతునిచే స్థిరపరచబడిన శ్రద్ధతో కూడుకొని ఆరాధిస్తూ తత్ఫలితంగా తమ తమ కోరికలకు అనుగుణమైన ఇష్టమైన భోగ్య వస్తువుల్ని పొందుతూ ఉంటారు. దీన్నిబట్టి మనం అర్థం చేసుకోవాల్సింది సకామంతో దేవతలనారాదించి కోరికలు తీర్చుకొని అనిత్య ఫలాలను పొంది సాధించేదేమీ లేదు ఉండదు. అంతర్యామి అయిన పరమేశ్వరుడ్ని ఆరాధించిన వారికే మోక్షం అనే నిత్యఫలం సిద్ధిస్తుంది. దైవం కల్పవృక్షం వంటిది కదా దైవాన్ని ఆశ్రయించి శ్రద్ధాభక్తులతో ఎవరు ఏది కోరినా దాన్ని వారికీ ప్రసాదిస్తారు. ప్రాపంచిక దృశ్యపదార్థాలను, అనిత్యాలను కోరడం కంటే శాశ్వతమైన మోక్ష పదాన్ని పొందడమే లక్ష్యంగా ఏర్పరచుకోవడమే శ్రేయస్కరమని గ్రహించాలి. మూల శక్తి సృష్టికర్త ఈ భౌతిక దృశ్యమైన జగత్తుకంతా అధిపతి ఆ పరమాత్మ ఆధీనంలోనే జగత్తులోని కనిపించే కనిపించని శక్తులు ఈ విశ్వచక్రపు నియతితో సృష్టి చక్రాన్ని కొనసాగిస్తాయి. ఆ జగద్గురువు సూచనల మేరకే దేవతా జగత్తు అంతా కూడా నడుస్తూ ఉంటుంది. ఇదంతా కూడా ఓ విశ్వమయ ప్రభుత్వ యంత్రాంగం, ఇంద్ర సూర్య

చంద్రాది దేవతల విభిన్న శాఖలంతా కూడా జగద్గురువు ఆదేశం మేరకు తమ తమ విధుల్ని నిర్వర్తిస్తూ ఉంటాయి. కాబట్టి ఎవరికి ఏ ఫలితం అందినా అది మూల శక్తి నుండే అందేదని గ్రహించాలి. దేవతలు కూడా పరమాత్మ ఆశ్రితులే కాని వేరు కాదు అందుకే ఇక్కడ సకామ భక్తులు తమ స్వభావాన్ని అనుసరించి ఇష్టపూర్వక దేవతల్ని ఆరాధించినా వారి ద్వారా ఫలితాన్ని పొందినా వాస్తవానికి ఆ ఫలితాన్ని ఇచ్చేది నేనే అని దేవతలలో అంతర్యామిగా ఉన్నది నేనే అంటూ దేవ రహస్యాన్ని కూడా సవివరంగా స్పష్టంగా విజ్ఞాన సహితంగా మనకు ఉద్బోదిస్తున్నారు.

7అ, 23శ్లో.

అంతవత్తు ఫలం తేషాం తద్భవత్యల్పమేధసామ్ |

దేవాన్ దేవయజో యాంతి మద్భక్తా యాంతి మామపి | 23 |

కాని, ఈ సకామ భక్తులు (అల్పబుద్ధులు) పొందెడి ఫలములు గూడ నశ్వరములు. అన్యదేవతలను పూజించువారు ఆ దేవతలనే చేరుదురు. నా భక్తులు ఏ విధముగా ఆరాధించినను (వారి వాంఛలనేగాక) చివరకు నన్నే పొందుదురు.

పరమాత్మను విడిచి ఇతర దేవతల్ని ఆరాధించేవారు ఏ కోవకు చెందుతారో వారు ఎలాంటి ఫలితాన్ని పొందుతారో ఈ శ్లోకం చాలా స్పష్టంగా వివరిస్తుంది. అల్పాన్ని కోరే అల్పమేధస్సులు అల్పమైన ఫలాన్నే పొందుతారు. ఎవరి బుద్ధి అల్పంగా ఉంటుందో వారు అల్పమేధస్సులు, అల్పబుద్ధులు అనంతాన్ని కోరుకోరు కదా. అల్పులు పొందే అల్పమైన ఫలాలు ఏవైనా స్వల్ప కాలం ఉంటాయి లేదా ఉన్నట్లు భ్రమింపజేస్తాయి కాని అవి సుస్థిరం కావు. అందుకని అల్పబుద్ధులు పొందే ఫలాన్ని జగద్గురువు అంతవంతాలు అంటున్నారు. 2-18 లో అంతవంతాలు అనే అంశాన్ని సమగ్రంగా చర్చించాం. సూర్య లోకం సూర్యుడిది, చంద్రలోకం చంద్రుడిది, ఇంద్రలోకం ఇంద్రుడిది, వరుణ లోకం వరుణుడిది, అగ్ని లోకం అగ్నిది , నీటిలోకం నీటిది. ఎవరి పరిధి వారిది ఎవరి శక్తి వారిది ఎవరి నియతి వారిది ఎవరి విధి వారిది. వీరంతా కూడా తమ తమ కర్తవ్యాల్ని నిర్విరామంగా నిర్వర్తించేవారు వీరు పరమాత్మ అనే యజమానికి ఉద్యోగులు మాత్రమే అయితే ఈ దృశ్యమయ, అదృశ్యమయ రెండింటినీ వ్యవస్థీకృతం చేసి సమస్తంలో అంతర్యామిగా ఉంటూ సమస్తాన్ని నడిపిస్తున్న పరమాత్మ, మూలశక్తి, అనంతుడు, సర్వాధికారి. దేవతలు దేశ కాలాలకు లోబడి విధిని నిర్వర్తించేవారు, అల్పులు పొందే ఫలాలు అంతవంతాలు, పరమాత్మను కాకుండా ఇతర దేవతలను ఆరాధించేవారు పొందే ఫలాలు అనిత్యాలు, దేవత ఆరాధకులు ఆయా దేవతలను పొందుతారు, పరమాత్మను ఆరాధించి అర్చించేవారు ఆత్మసాక్షాత్కారంతో పరమ పదం పొందగలరు. ఆయా దేవతల్ని ఉపాసిస్తూ యజ్ఞయాగాది కర్మల్ని అనుష్టిస్తే తద్వారా స్వర్గాది లోకాలు ప్రాప్తించవచ్చు. మనం ఈ పుణ్య లోకాల్ని గురించి సమగ్రంగా ముందు అధ్యాయాల్లో చూసాం, అవి కూడా పరిమితమైనవే పుణ్యం క్షయం కాగానే మర్త్య లోకానికి తిరిగి

రావాల్సిందే. అంతవంతులైన దేవతలను ఉపాసించేవారు మాత్రమే అంతవంతములైన లోకాలను మాత్రమే పొందుతారు. అనంతుడైన వానిని ఉపాసించేవారు అనంతాన్ని పొందుతారు అన్నది వేదం. అల్పశక్తి గల దేవతామూర్తులను ఉపాసించేవారు అల్పమేధసులైన కామ్య భక్తులు, పరమేశ్వరుని ఆరాధించేవారు ఏకభక్తులు, నిత్య భక్తులు. దృశ్య వస్తువుల్ని కోరేవారు అన్య దేవతాఉపాసకులు దృక్ విషయాన్ని అభిలషించేవారు భగవద్భక్తులు. దృక్ అనేది బ్రహ్మం, బ్రహ్మస్వరూపం, అవినాశి. దృశ్యం అనేది మాయ, నాశితం. గంగానదిని వదిలిపెట్టి పక్కనే ఉన్న చిన్న చిన్న నీటి గుంటలను ఆశ్రయించేవారు ఎలాంటివారో కల్పవృక్షాన్ని వదిలి పక్కనే ఉన్న చిన్న చిన్న చెట్లను చేరే వారు ఎలాంటి వారో పరమాత్మను వదిలి అల్ప ఫలప్రదాతలైన దేవతల్ని ఆశ్రయించువారు అట్టివారే అవుతారు. అందుకే వారిచ్చే స్వల్ప ఫలాలను, భోగ్యపదార్థాలను బడసి ఆనందిస్తున్నారు. ప్రపంచంలో ఏ వస్తువైనా వ్యక్తి అయినా ఇంద్రుడైనా చంద్రుడైనా సరే దృశ్యవర్గం అంతాకూడా అపరాప్రకృతేనని మనం చూశాం. అది పుట్టింది కనుక క్రమంలో నశించిపోయేది, అయితే దృశ్యమయ దృశ్యం కాకుండా దృక్కు ఏదైతే ఉందో అది ఆత్మ ఒక్కటే, అదే అవినాశి, సనాతనం, అవ్యయం. అందుకని విజ్ఞులు తత్త్వవిధులు దానికోసమే అన్వేషిస్తారు దాన్నే ఆశ్రయిస్తారు. అల్ప బుద్ధి కలవారే నస్వర ప్రాపంచిక సుఖాలు కోరుతూ దేవతల నారాదిస్తారు. కాబట్టి ఎవరైనా ఏ కోరికతో అయితే నన్ను ఆరాధిస్తారో వారు ఆ కోరికను తీర్చుకుంటారు కానీ నన్ను చేరలేరు. నన్ను ఆరాధించే వారే నన్ను చేరుతారు పొందుతారనే అంశాన్ని ఇక్కడ జగద్గురువు చాలా స్పష్టంగా మనకు విశదీకరించారు. పరమాత్మను ఆరాధిస్తే పరమాత్మనే పొందుతారు. దీన్నిబట్టి బంధంగాని స్వర్గం గాని మోక్షం కానీ వారి వారి చేతుల్లోనే ఉందే తప్ప మరొకరు ప్రసాదించేది కాదు. సాధకుడు యోగ యుక్తితో శ్రద్ధా భక్తుల్ని విశ్వవ్యాపక పరబ్రహ్మం నందు ఉంచి దృఢ ప్రయత్నంతో సద్గురువుల సత్ గ్రంధాలలోని సారాన్ని గ్రహించి సర్వోత్తమ లక్ష్యాన్ని ఎరిగి పరమాత్మ పరమ పదాన్ని పరమాత్మ పాదారవిందాలనే అనన్యంగా ఆశ్రయించి మానవ జన్మకు సార్థకతను ఇద్దాం.

7అ, 24శ్లో.

అవ్యక్తం వ్యక్తిమాపన్నం మన్యంతే మామబుద్ధయః |

పరం భావమజానంతో మమావ్యయమనుత్తమమ్ |24|

నేను శాశ్వతుడను. సర్వోత్తముడను, ఇంద్రియములకును, మనస్సునకును గోచరింపనివాడను. నా పరమభావమును బుద్ధిహీనులు గ్రహింపక, ఇట్టి సచ్చిదానంద ఘనపరమాత్ముడనైన నన్ను సాధారణ మనుష్యునిగా అనగా జననమరణ చక్రము లోబడి పరిభ్రమించు వానినిగా తలంచెదరు.

ఇక్కడ 'వ్యక్తిం' అన్నారు రాకపోకలు గలిగిన వ్యక్తం అయ్యేవాని గాను సాధారణ వ్యక్తిగాను భావిస్తారని అర్థం చేసుకోవాలి. కాబట్టి వ్యక్తి కాకుండా అవ్యక్తం, వ్యక్తం, ఆపన్నం అనుకుంటే సరిపోతుంది. 2-28 లో అవ్యక్తం, వ్యక్తం

అనే శబ్దాలకు తేడాను సమగ్రంగా స్పష్టంగా చూసాం. 4-6 లో జగద్గురువు తన శక్తిని స్వరూపాన్ని ప్రకటించుకున్న అంశాన్ని గమనించాం. వ్యక్తరూపం అనేది ఎవరికి వారు కల్పించుకొని ఏర్పాటు చేసుకున్నది. ఈ నామరూపాత్మక దేహమే దైవం యొక్క భగవంతుని యొక్క పరిపూర్ణ రూపం కాదు. 4-6 లో చెప్పినట్లుగా ఆయా సందర్భాలలో భక్తులను అనుగ్రహించడానికి సాధు సజ్జనులను సంరక్షించడానికి ధర్మాన్ని సంస్థాపించడానికి తాత్కాలికంగా తీసుకున్న రూపమేనని తెలియాలి. అవ్యయమైన పరమాత్మ అనుత్తముడు తనకు మించిన ఉత్తముడు మరొకరు ఉండరు, తనతో సాటి అయిన మేటి అయిన సమానమైనది ఇక ఏది ఎవరూ ఉండరు. అందుకే అనుత్తమం సర్వోత్తమం అన్నారు, మనిషికి దేహం ఉంది అయితే నాదిగా ఉన్న దేహం కదలికకు కారణం నాలోని ఆత్మ అయిన నేను అనేది ఆధారంగా ఉందనే జ్ఞానం మనిషిలో ఉండటం లేదు, తాను దేహం అని భావిస్తున్నందున భగవంతునికి కూడా దేహం ఉందని తనకు రూపం ఉంది కాబట్టి భగవంతునికి రూపం ఉందని తను పుట్టినట్లు భావిస్తున్నాడు కనుక భగవంతుడు పుట్టినట్లు భావిస్తున్నాడు. ఇలా తన బుద్ధికి తోచినట్లు తన భౌతిక నేత్రాలకు అందే వాటి అవగాహనతోనే సరిపెట్టుకొని అంతకుమించి అతీతంగా ఆలోచించే వివేకశక్తి లేక సత్యనిర్దేశం చేసి సత్యాన్వేషణ గావించే ప్రయత్నం చేయలేక సత్యానికి దూరంగా ఉండిపోతున్నారు. అందుకని వారిని జగద్గురువు అవివేకులు అంటున్నారు, బుద్ధిలేని వారు అని సంబోధిస్తున్నారు కూడా. తమ కళ్ళకు కనిపించేవి చెవులకు వినిపించేవి మనసుకు అనిపించేవి మాత్రమే వాస్తవాలని భావిస్తారు, అంతకు మించిన అద్భుత అవ్యయ అనుత్తమమైన అవ్యక్తాన్ని దర్శించడం లేదని జగద్గురువు ఈ శ్లోకాన్ని ప్రతిపాదించి ఆదిశగా మనల్ని ఆలోచింపజేస్తున్నాడు. ఇందులో పరం భావం అంటే పర అపరా ప్రకృతులకు మూలమైన మూల శక్తి అని అర్థం చేసుకోవాలి. ఆ మూలం తెలియక అవివేకులు నామరూపాలకు అతీతమైన సనాతనమైన అవ్యయమైన అవ్యక్తమైన నన్ను వ్యక్తిగానూ వ్యక్తమయ్యే కనిపించే వానిగాను సాధారణ స్థాయి మనుషులకు తలపించే ఆపదలు పొందే వానిగాను తలుస్తున్నారు. ఆత్మ మూలాలను సృష్టి మూలాలను దర్శించలేనివారు అవ్యయ అద్భుత శక్తినైన విశ్వవ్యాపకమైన వాసుదేవత్వాన్ని తెలియలేకున్నారు. మనం అవ్యయం అనే శబ్దానికి 2-25 లో

'అవ్యక్తోఽయమచింత్యోఽయమ్' అని తెలుసుకున్నాం. మళ్లీ 4-1 లో అవ్యయం అనే మాటకు సంపూర్ణ భావాన్ని చూసాం. ఆయా సందర్భాల్లో దైవం ధర్మసంస్థాపనకు అవసరమైన రూపాన్ని ధరించడం గురించి కూడా 4-7&8 లో చూసాం. అయితే ఆ అవతరించిన ఆయా రూపాలను మాత్రమే దృష్టిలో ఉంచుకొని కేవలం ఏ ఒక్క నామానికో రూపానికో పరిమితమై పోవడం అనేది అల్పమైన అల్పాతి అల్పమైన ఆలోచన. అందుకే అవ్యక్తమైన నన్ను ఓ రూపానికి పరిమితం చేసి వ్యక్తం అయ్యేవానిగా చూస్తున్నారు అవివేకులు అని వాసుదేవ వ్యాపకత్వపు విశేషాన్ని సమగ్రంగా ఈ శ్లోకంలో చూపించి మనకు కనువిప్పు కలిగిస్తున్నారు. ధర్మసంస్థాపనకై అనేక సందర్భాల్లో దైవం అవతరించిన విధానాన్ని అనుసరించి ప్రసిద్ధమైన 21 అవతారాలను పేర్కొన్నారు. అందులోనూ సుప్రసిద్ధమైనవి దశావతరాలుగా గ్రంథస్థమైన విషయం మనకు విదితమే. ఇది సృష్టి చక్రాన్ని నియతితో కొనసాగించడంలోని విశ్వచక్రపు విధానమే గాని మరొకటి కాదు. నేను వ్యక్తం అయ్యే వాడిని కాదని నేను అవ్యక్తం అని స్పష్టంగా స్వస్వరూపాన్ని తేల్చి చెప్పారు. అయినా వివేక శూన్యులు మందబుద్ధులు ఆయా సందర్భాల్లో తన స్వీయ

ప్రకృతి మాయతో ఏర్పరచుకున్న పరిమిత దేహమే భగవంతుడని అదే యదార్థ రూపమని అనుకుంటున్నారు. తాత్కాలిక వ్యక్తరూపమైనటువంటి ఆయా సందర్భాలలో వ్యక్తం అయ్యే రూపమే భగవంతుడని పొరపడుతున్నారు. ఈ విషయాలన్నీ మనకు వివరించి తన స్వస్వరూపాన్ని మనకు విజ్ఞాన సహితంగా ఈ శ్లోకంలో దర్శింపజేస్తున్నాడు. ఒకవేళ ప్రారంభ దశలోని భక్తిశ్రద్ధలు కలగడం కోసం సాకార రూపాన్ని భావించినా క్రమంగా నిరాకార రూపాన్ని విశ్వమయ విశ్వవ్యాపకుడ్ని తెలుసుకోవాలి, దర్శించాలి. భౌతిక దేహపు కంటికి కనిపించే స్థూలమయమైన ఓ పరిమితమైన పరిధితో కూడుకున్నటువంటి ఓ ఆకారం కలిగిన స్థూల విగ్రహం ఉపాధి మాత్రమే దేవుడని భగవంతుడని తలచడం కాదు అది కేవలం భ్రమ అవుతుంది. ఆయా స్థూల దైవరూప విగ్రహాలలోనూ అంతర్యామిగా ఉన్న విశ్వవ్యాపక వాసుదేవ తత్వాన్ని దర్శించగలగాలి. ఆ దృశ్యానికంటే ఆవల ఉన్న దృక్కు వైపుకు మన దృష్టి మరలాలి. దృశ్య రహితమైన నాశరహితమైన దేశకాలాలకతీతమైన అవ్యయుడు కావున ఉత్తమోత్తముడని సర్వోత్తముడని అన్నారు. సగుణం సాకారం విగ్రహారాధన లాంటి భావాలకు పరిమితమైన వారి కోసం ప్రత్యేకంగా ప్రబోధిస్తున్న ప్రత్యేక శ్లోకం ఇది. అలాంటివారు క్రమంగా ఏకభక్తి నిత్య యుక్త భక్తితో తమ దృష్టిని విశాలం చేసుకొని విశ్వవ్యాపితమొనర్చాలి.

7అ, 25శ్లో.

నాహం ప్రకాశః సర్వస్య యోగమాయాసమావృతః |

మూఢోఽయం నాభిజానాతి లోకో మామజమవ్యయమ్ |25|

నా యోగమాయయందు నేను అందరికిని గోచరింపను. కనుక అజ్ఞానులు నన్ను జన్మరహితునిగా, శాశ్వతునిగా, పరమేశ్వరునిగా తెలిసికొనలేరు. (అనగా నన్ను జననమరణములకు లోనగువానినిగా తలంతురు).

మనం సహజంగా భగవంతుడు తెలియడం లేదు అనుకుంటూ ఉంటాం భగవంతుడు సర్వవ్యాపి అయితే అందరికీ ఎందుకు కనిపించడం లేదు తెలియడం లేదు దర్శితం కావడం లేదు అనే ప్రశ్నకు ఈ శ్లోకం స్పష్టంగా సమాధానం ఇస్తుంది. ఎందుకు సర్వజనులు తెలుసుకోలేకపోతున్నారు ఇందులోని దేవ రహస్యం ఏంటి అనే సంశయానికి ఈ శ్లోకం స్పష్టంగా సమాధానం ఇస్తుంది. ఇక్కడ యోగమాయ అంటే ప్రకృతి గుణాల కలయిక అని అర్థం. ఈ కలయికే మాయ, భగవంతుని చిత్త సమాధానం యోగం దానిచేత కప్పబడిన మాయ యోగమాయ. యోగ మాయతో కప్పబడి ఉన్నాను కనుక పుట్టుక లేని మార్పు చెందని నన్ను ఈ లోకంలో మూఢులు తెలుసుకోవడం లేదు అంటున్నాడు. తానేమో అందరినీ చూస్తున్నానని కానీ తాను ఎవ్వరికీ కనిపించకుండా ఉన్నాను అని కూడా అంటున్నారు. ఇదే దైవీమాయ, సృష్టిలో కాలం ఉండి ఇదేంటి అని విచారిస్తూ పోతే కాలం లేదు దేశం లేదు. ఈ రెండింటికి అతీతంగా ఉన్నామని మనకే స్ఫురిస్తుంది,ఇది కూడా అంతే. ఏది మాయ ఎక్కడుంది అని విచారిస్తూ లోతుల్లోకి వెళ్లి అధ్యయనం చేస్తే మనం మాయాతీతులం అని సశాస్త్రీయంగా మనకు బోధపడుతుంది. నా

యోగమాయచే అన్నారు ఇదే దేవ రహస్యం లేకనే ఉన్నట్లు భ్రమింపజేసే మాయ దైవసంబంధి అని, దాటశక్యం కానిదని దైవదృష్టి ద్వారా మాయను దాటే మార్గం ఉందని చూశాం. పైగా దైవీ అంటూ ఇది దైవమాయ అని కూడా అక్కడే స్పష్టం చేశారు. 15వ శ్లోకంలో మాయచేత అపహరించబడిన వివేకం కోల్పోయిన వారికి మాత్రమే నేను కనిపించను అన్నారు, 14, 15 శ్లోకాలను అనుసరిస్తూ ఈ శ్లోకాన్ని మనం సూక్ష్మంగా అర్థం చేసుకోవాలి. అయితే వివేకశక్తి గల వారికి నన్నే భజిస్తూ సదా ఆత్మ ధ్యానంలో నిమగ్నమైన వారికి నేను దర్శితమవుతానని ప్రస్ఫుటంగా ఈ శ్లోకం విజ్ఞాన సహితం చేస్తోంది. ఎవరైతే ఆ మాయను వివేకాదులచే ఛేదిస్తారో వారు భగవంతుని ప్రత్యక్షంగా చూడగలరు దర్శించగలరు అనేది సుస్పష్టం. కాబట్టి త్రిగుణాత్మక ప్రకృతిమయమైన ఆవరణ విక్షేపాలని తొలగించుకుని మూడు పొరలతో కూడుకున్న తెర అయిన సత్వరజస్తమో గుణాతీతులై మాయమయ యోగమాయ తెరకు ఆవల ఉన్న పరమాత్మను నిరావరణంగా దర్శించాలి. ఆధ్యాత్మిక రంగంలో అనేకులు అనేక విధాలుగా పేర్కొన్న గ్రంథస్తం చేసి ఉన్న సమస్త సాధనలు కూడా జీవుడికి దేవుడికి మధ్య ఉంటూ బలమైనదిగా తలపిస్తూ మనల్ని ముప్పుతిప్పలు పెడుతున్న మాయమయ తెర అనే అడ్డుగోడను నిర్మూలించడానికి బద్దలు కొట్టడానికేనని మనం గ్రహించాలి. ఆ మాయమయ తెర తొలగగానే సత్యదర్శితం అవుతుంది. అదే మానవ జీవిత అంతిమ లక్ష్యం అదే మోక్షం. అందుకు మూడు పొరలుగా మనకు కనిపిస్తున్న అనిపిస్తున్న త్రిగుణాలు మెల్లమెల్లగా చేధిస్తూ వెళ్లి బలమైన అసలు సిసలైన నా యోగ మాయ చే కప్పబడిన అంటున్న దైవీమాయ అనే బలమైన తెరను తొలగించుకోవాలి. వాస్తవానికి భగవంతుడు జన్మ రహితుడు పుట్టుక లేనివాడు నాశరహితుడు కదా అయితే మాయను దాటిన వివేకవంతులు మాత్రమే ఈ సత్యాన్ని దర్శించగలరని చూశాం. మాయకు లోబడిన మూఢులు, అవివేకులు నన్ను తెలుసుకోలేరు దర్శించలేరు. ఇందులో సర్వస్య అన్నారు అంటే అజ్ఞానులు వివేకశూన్యులు అయిన వారందరికీ కనిపించను అని అర్థం చేసుకోవాలి. వారి జ్ఞానం భౌతికమైన కోరికలచే గజదొంగచే అపకృతమైన కారణంగా వారు వివేకశక్తిని కోల్పోవడం చేత వారు దర్శించలేకపోతున్నారు. సూర్యుడికి మేఘానికి వాస్తవానికి ఏ సంబంధం లేదు. కానీ మేఘానికి కింద ఉన్న వారి దృష్టికి ఎలా అనిపిస్తుంది అంటే సూర్యుడు మేఘంచే కప్పబడ్డాడని తలుస్తారు. భగవంతుని యోగ మాయ తనకు తన సర్వజ్ఞత్వానికి అడ్డురాదు ఎలాంటి ప్రతిబంధకము కాదు. కారణం అది నాకు వశమై ఉంది అది నా అధీనంలో ఉంది అందుకని దానికి నేను వశం కాదు అని చెప్పిన సూత్రం ప్రకారం పరమాత్మకు ఏ ఆవరణ లేదు, నిరావరుణుడు నిరాకారుడు విశ్వవ్యాపి. మనం కూడా మనకు దైవానికి అడ్డుగోడగా అనిపిస్తున్న మాయారూప ఆవరణాన్ని ఈ జన్మలోనే ప్రయత్నపూర్వకంగా ఆధ్యాత్మిక పథంలో జగద్గురువు చిటికెనవేలు పట్టుకుని వదలకుండా ముందుకెళ్లి భగవత్ సాక్షాత్కారం పొందుదాం. మాయ జీవేశ్వరుల ఇద్దరికీ సమానమే అయితే దాని ప్రభావం జీవుల మీదే గాని ఈశ్వరుని మీద కాదని తెలిపే తరువాతి శ్లోకాన్ని విజ్ఞాన సహితంగా చూద్దాం.

7అ, 26శ్లో.

వేదాహం సమతీతాని వర్తమానాని చార్జున |

భవిష్యాణి చ భూతాని మాం తు వేద న కశ్చన |26|

ఓ అర్జునా! గతకాలమునకు చెందినట్టివియు, వర్తమాన (ప్రస్తుత) కాలము నందున్నట్టివియు ఐన చరాచరప్రాణులన్నింటిని నేను ఎఱుగుదును. అంతేకాదు రాబోవుకాలమున ప్రభవించు (జన్మించు) ప్రాణులను గూర్చియు నేను ఎఱుగుదును. కాని నాయందు భక్తిశ్రద్ధలుగలవారు తప్ప వేరెవ్వరును నన్ను ఎఱుగజాలరు.

వేదం అనే మాట యొక్క ఆంతర్యాన్ని మనం అనేక సందర్భాల్లో చూసాం. గతంలో ఉన్నవారు నేడు లేరు నేడున్నవారు భవిష్యత్తులో ఉండబోరు, భవిష్యత్తులో ఉండబోయే వారు వర్తమానంలో లేరు అయినా అందరూ నాకు తెలుసు అంటున్నాడు జగద్గురువు. 'సమతీతాని' గతించినవి, 'వర్తమానాని' అంటే ప్రస్తుతం ఉన్నవి, భవిష్యాణి అంటే ఇక రాబోయేవి మరి ఇవన్నీ తెలియాలంటే అన్ని కాలాలలోనూ తాను ఉండాలి, అంతేకాదు సమస్తాన్ని సర్వకాలాలలో తెలుసుకునే అవకాశం లేదు కనుక సర్వాన్ని తెలుసుకునే మహాశక్తిని కూడా కలిగి ఉండాలి. అన్నింటిలో ఉండి అన్ని కాలాల్లో ఉండేవాడై ఉండాలి, కాలాతీతుడై ఉండాలి. కాలమనేది చైతన్యం కన్నా వేరుగా లేదని మనం ముందు అధ్యాయాల్లో చూసాం. కాలం చైతన్య ఆశ్రితమే, బ్రహ్మ ఆశ్రితమే. కాలం లేకపోయినా చైతన్యం ఉంటుంది, భూతాలన్నీ ఏ కాలంలో కదులుతూ ఉంటాయో ఆ కాలం కూడా కరిగిపోతుంది. కానీ కాలాధిష్టాన చైతన్యం కాలంలోనూ కాలాతీతంగానూ నిత్య నూతనంగా ఉంటుంది. అందుకే సర్వజ్ఞుడైన సర్వేశ్వరునికి సృష్టికర్తకు మూలశక్తికి అన్నీ తెలుసు. మాయా మోహితులకు ఈ సర్వగత పరమేశ్వరుడు దర్శితం కావడానికి అవకాశం లేదు. అందుకే గతించిన ప్రాణులన్నీ కూడా కాలగర్భంలో కలిసిపోయాయి, భవిష్యత్ ఏమో అగమ్య గోచరం. కానీ జగద్గురువు నాకు అందరూ తెలుసు నేను అందరినీ ఎరుగుదును అంటున్నారు. 4-5 లోనే మనం ఈ అంశం నిర్ధారణ చేసుకున్నాం. అర్జునా! నాకు నీకు అనేక జన్మలు గడిచాయి కానీ వాటిని అన్నింటినీ నేను ఎరుగుదును, నీవు ఎరుగవు. దీన్నిబట్టి కాలమనేది విశ్వసృష్టి జరిగాక సృష్టిని నడపడానికి మానవుల కోసం భౌతికపు జీవుల మనుగడ కోసం మనం ఏర్పాటు చేసుకున్నది మాత్రమే దీన్నే కాలగణనం అంటారు. ఈ వివరాలు అన్నీ కూడా నాలుగవ అధ్యాయంలో సమగ్రంగా చూసాం. ఈ కాలం కూడా దైవాధీనమే అందుకే భగవంతునిలో ఇమిడి ఉన్న ఈ సృష్టితో పాటు అందులోని త్రికాలాలు కూడా పరమాత్మ ఆశ్రితమేనని మనకు విజ్ఞాన సహితంగా అవగతం కావాలి. జగద్గురువు ఈ శ్లోకం మన ముందు ఉంచడంలోని ఆంతర్యం కూడా ఇదే. ఈ అవగాహన మనకు ఉన్నప్పుడు మనం విశ్వ మానవులుగా వర్ధిల్లగలం. జీవుడు కాలానికి లోబడి ఉంటున్నాము అని అనుకుంటూ ఉన్నటువంటి   మృత్యుగ్రస్తుడు,క్షణిక జీవితం గలవాడు. భూత భవిష్యత్తులు తెలియలేనివాడు. మరి పరమేశ్వరుడు, పరమాత్మ అధిష్టానబ్రహం సర్వజ్ఞుడు విశ్వవ్యాపకుడు కదా. మరి పరమేశ్వరుని ముందు జీవుడు ఏపాటివాడు అయినా కూడా మనిషి నేను, నాది, నా వారు, నేనే గొప్ప, నాకే అన్నీ వచ్చు, నేను అందరికంటే ఎక్కువగా చదువుకున్నాను, ఇలాంటి భ్రమలతో విర్రవీగడమే కాక లోకానికి వారికి ఉన్నటువంటి అజ్ఞానపు భయభ్రాంతులతో అపకారం తలపెడుతూ కర్మల చక్రంలో ఇరుక్కుని వేదనకు వాదనకు గురి అవుతూ ఉంటారు. తన అల్పత్వాన్ని గుర్తించి భగవంతుని అనంతత్వాన్ని దర్శించిన వారు మాత్రమే దైవానికి ప్రణమిల్లి తాను కూడా

దైవంతో విలీనం కాగలడు. ఈ శ్లోకం జీవుని అల్పగ్నతను దేవుని విశ్వవ్యాపకజ్ఞతను స్పష్టికరిస్తుంది. ఇప్పటికైనా జీవుడు త్రికాలజ్ఞుని అమరత్వాన్ని అకుంఠిత భక్తితో గ్రహించి సేవించి దర్పాహంకారాలను విడిచి బ్రహ్మ విద్యను అభ్యసిస్తూ అల్పత్వం నుంచి అనంతత్వం వైపుగా పయనించాలి. అందుకు ఆ పురాణ పురుషుని చరణాలను ఆశ్రయించాల్సిందే, తద్వారానే దేవదేవుని దర్శనం. శ్రద్ధా భక్తులు లేని వివేక శూన్యులు ఒక్కరూ నాలోని నన్ను, లేదా నీలో నిన్ను తెలుసుకోలేకపోతున్నారు. కాబట్టి భగవంతుని సర్వవ్యాపకత్వాన్ని గుర్తెరిగి భక్తి ప్రపత్తులతో ధ్యానయోగంలో సుస్థిరమై వర్షపు బిందువు సముద్రంలో కలిసిపోయినట్లు తన చిత్తాన్ని పరమాత్మ యందు లయింప చేయాలి. తన యోగ మాయతో కప్పియున్న భగవంతుడు జీవుడ్ని తెలిసినట్లు జీవుడు కూడా యోగమాయ తెరను ఛేదించి ఆవల ఉన్న దైవాన్ని తెలియాలి. ఇదే జీవేశ్వరుల ఏకత్వం, మమేకత్వం.

7అ, 27శ్లో.

ఇచ్ఛాద్వేషసముత్థేన ద్వంద్వమోహేన భారత |

సర్వభూతాని సమ్మోహం సర్గే యాంతి పరంతప | 27 |

భరతవంశీ! ఓ అర్జునా! జగత్తునందు ప్రాణులన్నియును రాగద్వేషములవలన కలిగిన సుఖదుఃఖాది ద్వంద్వముల ప్రభావమున అంతులేని మోహము లో పడిపోవుచున్నవి.

ప్రథమ షట్కంలో ఆరు అధ్యాయాలలో కూడా వ్యక్తిగతమైన వ్యక్తిగత దేహ నిర్మాణాత్మక విషయగతమైన అంతర బాహ్య ఇంద్రియాలు ఇంకా అనేక ఇతర అంశాలన్నీ కూడా చర్చించాం. అయితే అవన్నీ కూడా వ్యక్తికి, వ్యష్టికి సంబంధించింది, కానీ ఈ అధ్యాయం అంతా కూడా సమస్తగతమైనది విశ్వవ్యాపకమైనది. అందుకే ఈ అధ్యాయం ఆరంభం నుంచి ఈ దృశ్యమయ జగత్తులోని ప్రతి అంశాన్ని పేర్కొని అందులో దైవం ఎలా అంతర్యామిగా విశ్వవ్యాపితమై వుందో విజ్ఞాన సహితంగా మనకు ఉద్బోధించాడు. అలాగే మాయ అనే అంశం కూడా వ్యక్తికి సంబంధించినదని అక్కడ తెలుసుకున్నాం. ఇక్కడ ఈ అధ్యాయం అంతా అదే మాయ సమష్టికి సంబంధించిన సమస్తాన్ని ఆవరించిన విధానాన్ని చూసాం. మాయను మాయగా సత్యాన్ని సత్యంగా దర్శించాం. ముందు శ్లోకంలో భూత భవిష్యత్ వర్తమానాల్లోనూ సమస్త ప్రాణులను పదార్థాలను ఎరిగిన త్రికాలజ్ఞత్వాన్ని దర్శించాం. అలాంటి విశ్వవ్యాపక వాసుదేవత్వాన్ని లోకంలోని జనులు తెలియ లేకపోవడానికి గల కారణాన్ని సూత్రాన్ని స్పష్టంగా ఈ శ్లోకం వివరిస్తుంది. పుట్టుకతోనే సర్వప్రాణులు సుఖదుఃఖాల మోహంలో కూరుకుపోతున్నాయి, భారతా! ఈ మోహానికి కారణం ఆ రాగద్వేషాలే. సర్వప్రాణులు పుట్టినప్పటినుంచి మోహంలో కూరుకుపోయాయి అన్నారు, మరి ఈ మోహం ఏమిటి? అది ఎలా కలుగుతుంది అనేది విచారణ పూర్వకంగా తెలియాల్సిన అవసరం ఉంది. ఈ రాగద్వేషాలను గురించిన ద్వంద్వాలను ప్రథమ షట్కంలో సమగ్రంగా చర్చించాం. రాగద్వేషాలు అనే ద్వంద్వాలే ఇక్కడ ఇఛ్ఛాద్వేషాలు. శీతోష్ణ సుఖదుఃఖాది ద్వంద్వాలలో రాగద్వేషాలనేవి పూర్వజన్మల కర్మనుసారంగా

సంభవిస్తూ ఉంటాయి. అందువల్ల సర్వప్రాణులు తల్లి గర్భం నుండి జన్మించినప్పుడే జన్మతోనే మోహంలో కూరుకుపోతున్నారు. అందుకే మహాకవి దేహమున్న వరకు మోహసాగరమందు మునుగుచుందురు శుద్ధ మూఢజనులు అన్నారు. ఈ జన్మాంతర సంస్కారాల ప్రకారం రాగద్వేషాలనే ద్వంద్వాదుల వల్ల ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తూ మోహంతో కూరుకుపోయి జ్ఞానానికి ప్రతిబంధకంగా మారుతుంది. భౌతిక విషయాలపై రాగద్వేషాలపై ఉన్న ఆసక్తితో రాకపోకలు గల వాటికే ప్రాధాన్యాన్నిస్తూ పిడికెడు మెతుకుల కోసం పదవి డబ్బు అధికారం లాంటి వాటి కోసం మోహంలో కూరుకొని తమను తాము మరచి ఆత్మను ఆధ్యాత్మిక శక్తిని అణచివేస్తున్న పరిస్థితిని మనం నేడు చూస్తూనే ఉన్నాం. రోగికి ఆహార పదార్థాలు రుచించనట్లు రాగద్వేషాలతో నిండిన బుద్ధికి జ్ఞానం రుచించడం లేదు. ఇలా రాగద్వేషాలు, ఇచ్ఛాద్వేషాలు సర్వప్రాణులలో మోహాన్ని కలిగిస్తూ మోక్షానికి ప్రతిబంధకాలుగా నిలుస్తున్నాయి. ఆ విపరీత విపత్కర పరిస్థితి, తీవ్రతను మనకు తెలియజేయడానికి జగద్గురువు మొదటిపాదంలో భారతా! అని రెండవ పాదంలో పరంతప అని సంబోధిస్తున్నాడు. ఆ ఇఛ్ఛాద్వేషాలనే శత్రువులను సమూలంగా తొలగించుకోవాలనే పిలుపునిస్తూ ఈ శ్లోకాన్ని ఉపదేశిస్తున్నారు. ఇచ్ఛా ద్వేషాల వల్ల కలిగినది ద్వంద్వ మోహం. శీతోష్ణాల వలె పరస్పరం విరుద్ధాలైన సుఖదుఃఖాలు వీటికి కారణాలు. వీటి వల్ల కాలానికి తగినట్లు ప్రాణులకు కలిగే ఇచ్ఛా ద్వేషాలే ద్వంద్వాలు, సుఖదుఃఖాలు వాటికి కారణాలు సంభవించినప్పుడు ఇచ్ఛాద్వేషాలు కలిగి అవి సర్వ ప్రాణుల వివేకాన్ని స్వాధీనం చేసుకొని వారి జ్ఞానాన్ని హరింపజేసి పరమార్థ తత్త్వ విషయమైన జ్ఞానం కలగడానికి అడ్డు వచ్చే మోహాన్ని పుట్టిస్తున్నాయి. ఇఛ్ఛాద్వేషాలు అనే దోషానికి చిత్తం వశం అయిన వారికి బయటి విషయాల యదార్థ జ్ఞానమే కలుగదు. అలాంటప్పుడు ఇక ఆధ్యాత్మిక అంతరాత్మ విషయంలో జ్ఞానం పొందడానికి వివేకంతో వివేచించడానికి వారికి అవకాశం ఎక్కడుంది. అందుకే జగద్గురువు మానవునిలోని మోహపు పుట్టుకకు గల మూలాల్ని మన ముందు ఉంచారు. ఆ ఇచ్ఛాద్వేషాల వల్ల కలిగే ద్వంద్వ మోహంచే సర్వప్రాణులు సమ్మోహం చెందుతున్నారు. పుట్టే జీవులందరూ మోహానికి వశమయ్యే పుడుతున్నారు అని తేల్చి చెప్పారు. బాల్యదశ నుంచే బ్రహ్మవిద్యను అభ్యసిస్తే ఈ జన్మల జన్మాంతర సంస్కారాలను స్వభావిక ప్రకృతిని అర్థం చేసుకొని అంతః శత్రువులైన ఇఛ్ఛాద్వేషాల ద్వారా కలిగే ద్వంద్వాలను నిర్మూలించుకొని దైవంపై దృష్టిని నిమగ్నం చేయగలం. ఇక్కడ సర్వభూతాని అంటే తన స్వరూపమే అంటున్న శ్రద్ధా భక్తులతో సదా భగవంతునిలో ఆత్మలో మనసు నిలిపిన జ్ఞానవంతులు తప్ప మిగిలిన ప్రాణులందరూ అని అర్థం చేసుకోవాలి. సమ్మోహం అంటే క్రోధంతో స్మృతి విభ్రమం చెంది బుద్ధి నశించిన స్థితి, ప్రాణులందరూ బుద్ధి నశించి మతి చెడి ఏ గతిలో తమ తమ జీవితాలను గడుపుతున్నారో ఎలా జన్మలను వృధా చేస్తూ మోహపు సంస్కారాల మూటను పెంచుకుంటున్నారో మనం అర్థం చేసుకోవచ్చు. అంతటి అధఃపతనానికి హేతువైన సమూహానికి గురికాకుండా దైవధ్యానంలో ధ్యానయోగంలో ముందుకెళ్ళాలి. ఈ మోహం పుట్టుకకు గల మూలాల్ని అందుకు గల కారణాలను గ్రహించి మోక్షానికి ప్రతిబంధకంగా ఉంటున్న మోహాన్ని కూకటి వేళ్ళతో సహా పీకివేసి ఆత్మ సర్వాత్మ అయిన పరమాత్మను దర్శించాలి.

7అ, 28శ్లో.

యేషాం త్వంతగతం పాపం జనానాం పుణ్యకర్మణామ్ |

తే ద్వంద్వమోహనిర్ముక్తా భజంతే మాం దృఢవ్రతాః | 28 |

కాని నిష్కామభావముతో పుణ్యకర్మలను ఆచరించు పురుషులపాపములు రూపుమాసిపోవును (నశించును).
అట్టివారు రాగద్వేషజనితములైన సుఖ దుఃఖాది రూపమోహములనుండి విముక్తులయ్యెదరు.
దృఢనిశ్చయముగల్గిన అట్టి భక్తులు అన్ని విధముల నన్నే భజింతురు.

మనం దాదాపు విజ్ఞానయోగం ముగింపు దశలో ఉన్నాం, ఈ సందర్భంగా అనూహ్యమైన మహా ప్రసాదం ఈ శ్లోకం. జన్మజన్మల పాపపు సంస్కారాల నిల్వతో పీడితులవుతున్న వారు సైతం ఎలా దైవ మార్గాన్ని అవలంబించి ముక్తి మార్గంలో పయనించవచ్చు అనే మార్గాన్ని సూచించే సూచిక ప్రామాణికమైన దిక్సూచి ఈ శ్లోకం. జన్మాంతరాలుగా పాపపు సంస్కారాల ద్వారా పీడింపబడుతున్న తాడిత పీడిత జనులైనా ఎలాంటివారికైనా పూర్వపు కర్మబంధనాలనుండి విడగొట్టి దైవం దగ్గరకు చేర్చగలిగే అనూహ్యమైన సూత్రం మహా ప్రసాదం ఈ శ్లోకం. ప్రతి ఒక్కరికి ఈ శ్లోకం ఓ అద్భుత ఆయుధం. గతించిన కాలంలోని సమస్త పాపపు సంస్కారాలు కూడా పుణ్య కార్యాలు ధ్యాన సాధన ద్వారా ప్రక్షాళన చేసుకుని దైవం వైపుగా ప్రయాణించే ఓచక్కటి రహదారి ఇది. ఈ శ్లోకం ద్వారా ఆత్మ యోగంతో అనంతాత్మ వైపు పయనించే అత్యద్భుత అవకాశం, సత్య శుద్ధి కలిగించే పుణ్య కర్మలు చేసుకున్న జనులకు పాపం క్షయమై చివరలో వారు ద్వంద్వ మోహము నుండి బయటపడతారు. అలాంటివారు పరమార్థ తత్వాన్ని పొందడానికి మార్గాన్ని గుర్తించి నిశ్చయమైన జ్ఞానంతో దృఢవ్రతులై పరమాత్మ అయిన నన్ను సేవిస్తారు. భగవంతుడ్ని దృఢవ్రతంతో సేవించాలంటే లోలోపల జన్మాంతర దుష్కర్మల ఫలిత పాపాలన్నీ కూడా సమూలంగా నశించాలి. అది ఎలా నశింప చేసుకోవాలో చక్కటి మార్గాన్ని సూచించే ఈ శ్లోకపు దిక్సూచి మనకు విశదీకరించింది. పాప కల్మష యుక్తమైన హృదయంలో పాప పంకిలం క్షయమైనప్పుడే సుకృతాత్ముడై పరమేశ్వరుని ఆరాధనతో తరిస్తాడు. లేకపోతే మోక్ష సాధనలో ఆ పాపం లేదా దుష్టత్వం అడ్డుతగులుతూ ఉంటుంది. అది జ్ఞానానికి ప్రతిబంధకంగా ఉంటుంది. పాపంతో ఉపహతమైన చిత్తం గలవారికి జ్ఞానం కలిగే అవకాశమే లేదని స్మృతి వాక్యం. ఉపహతం అంటే నశించడం, పాప కార్యాల ద్వారా వివేకం నశించిన వారికి జ్ఞానం ఎలా కలుగుతుంది అందుకని మనం వివేక శక్తిని కోల్పోకుండా జాగ్రత్త పడటానికి సదా ధ్యాన యోగంలో నిమగ్నమై దైవం పైనే దృష్టిని నిలపాలని నిర్ణయించుకున్నాం. తెలిసో తెలియకో చేసిన పాపాలు వాటి ఫలితాలు మనిషిలో ఉన్నంతవరకు మోహము నుండి విడి పడలేరు. ద్వంద్వ మోహాదుల నుంచి విముక్తి కలగాలి, పాప ప్రక్షాళనం కావాలి. ఇది పుణ్యకార్యాల ద్వారా క్షీణిస్తుంది, జ్ఞానం చేత నశిస్తుంది. ఆలా పాపం అంతగతమైన వారికే మోక్షమార్గం సుగమం అవుతుంది. ఇదే ఈ శ్లోకం యొక్క ఆంతర్యం. ఈ శ్లోకం ద్వారా మనం గ్రహించాల్సింది జన్మాంతర పాపపు సంస్కారాలను దుష్కార్యాలకు సంబంధించిన కల్మష కలుషిత బీజాలను సత్కార్యాలు, సత్కర్మల కార్యాచరణ ద్వారా ప్రక్షాళన చేసుకోవాలి.

అప్పుడే సుఖదుఖాది ద్వంద్వ మోహాదులు అంతరించి దైవ వ్రతం చేయడానికి తగిన ధృఢత్వసిద్ధి ప్రాప్తిస్తుంది. రాగద్వేషాల ద్వంద్వానికి వశపడకుండా పరమేశ్వర స్వరూపాన్ని తెలుసుకొని పరమేశ్వరుని సేవించే విధానం ఈ శ్లోకంలో చూస్తున్నాం.

7అ, 29శ్లో.

జరామరణమోక్షాయ మామాశ్రిత్య యతంతి యే ।

తే బ్రహ్మ తద్విదుః కృత్స్నమ్ అధ్యాత్మం కర్మ చాఖిలమ్ | 29 |

నన్ను శరణుపొంది జరామరణ విముక్తికై ప్రయత్నించు పురుషులు ఆ పరబ్రహ్మను, సమస్త - అధ్యాత్మమును, సంపూర్ణ కర్మను తెలిసికొందురు.

మనిషికి జన్మలో జీవితంలో ప్రధాన పాత్ర వహించేది జరామరణాలు, జీవిత ప్రమాణాలను నిర్ణయించి నిర్దేశించేవి కూడా ఇవే. ముసలితనం మరణం నేను పుట్టాను అనే భావన ఉన్న పుట్టిన ప్రతి మనిషికి ఇవి అనివార్యాలు. పుట్టుక అనేది జన్మాంతర సంస్కారాలపై ఆధారపడి ఉంటుంది, అయితే ఒకసారి జన్మ తీసుకున్నాక మనిషి జీవితపు ప్రతిక్షణం లోను అటు సన్మార్గంలో పయనించడానికి ఇటు దానికి వ్యతిరేకంగా దుర్మార్గంలో పయనించడానికి రెండింటికి క్షణక్షణం అవకాశాలు దైవ సృష్టి ప్రకారము మనకు అందుబాటులోనే ఉంటాయి. అయితే మనం దేన్నీ కోరుకుంటే అదే పొందుతాం ఈ విషయాన్ని కూడా మనం ముందు శ్లోకాలలో చూశాం. ఎవరు ఏది కోరుకుంటే వారిని అందులోనే స్థిరం చేస్తాను అని జగద్గురువు చెప్పిన మాటలను చూసాం. బాహ్య ప్రపంచపు భౌతిక విలాసాలు కీర్తి ప్రతిష్టలు కావాలనుకుంటే మనలోని ఆ ఆలోచనకు అనుగుణంగానే మన అడుగులు కదులుతాయి. ఈ మనం వేసే అడుగులు మన వార్ధక్యంలో ప్రాణశక్తి దేహం నుంచి నిష్క్రమించే సందర్భాన్ని నిర్ణయిస్తాయి. ప్రతి మనిషికి జరామరణాలు అంటే భయమే, అది ఎవరిని విడిచిపెట్టదని ప్రతి ఒక్కరికి తెలుసు. అయినా ద్వంద్వ మోహానికి గురై స్పష్టతను కోల్పోతున్న పరిస్థితి. ఈ సందర్భాన్ని 28 వ శ్లోకంలో గుర్తుచేసి వెంటనే దానికి పరిష్కారాన్ని ఈ శ్లోకంలో సూచించారు. మనిషిలో ఓ అనూహ్యమైన మార్పుకు చక్కటి మలుపుతో ఆధ్యాత్మికత వైపుగా మరలడానికి మనిషిలో లోలోతుల్లోకి వెళ్ళే ఓ అద్భుత అవకాశం ప్రసాదం వరం ఈ శ్లోకం. అందుకే బాల్యం నుంచే దైవం పైనే దృష్టి సారించి అనవసర ఆరాట పోరాటాలకు తావు లేకుండా జీవితాన్ని ఆధ్యాత్మమయం గావించుకున్నప్పుడు ప్రకృతిలోని శక్తులను వ్యవస్థీకృతం చేసే మూలశక్తి మనల్ని కర్మలనుంచి వేరుచేసి దారి తప్పకుండా కాపాడుతుంది. మనిషి ఎంత వైభోగంతో జీవించాడు అన్నదానికంటే ఎంత ప్రశాంతంగా వ్యాధి జరామరణ తదితర భవరోగ భయాలనుండి శీతోష్ణ సుఖదుఃఖాలను తావు లేకుండా ప్రాణశక్తిని విడిచాడు అన్నది ప్రధానమైనటువంటి అంశం. అలా విడిచినప్పుడు జీవితం జన్మ సార్థకమైనట్లు, కారణం మరణ బాధ అనేది కేవలం అనుభవించిన వారికే తెలుస్తుంది కాబట్టి ప్రశాంతంగా ఆగామి కర్మలను వెంట తెచ్చుకోకుండా జీవితాన్ని

ముగించినప్పుడు మూలశక్తిని చేరుకునే అవకాశం ఉంటుంది. ఈ సృష్టిలో తను మాత్రమే అనుభవించే బాధ మరణబాధ. ఆ దశలో ఆ శరీరంలో ఉన్న జీవాత్మ పడే వేదన, ఆ బాధను అనుభవిస్తున్న వ్యక్తికి లేదా ఆ సంస్కారాలను తీసుకున్న జీవుడికి మాత్రమే తెలుస్తుంది. ఇంతటి వేదన వృద్ధాప్య దశలో ఒక మనిషికి అవసరమా అనేటటువంటి ప్రశ్నను ఈ భౌతికపు ధనం కోసం ఆరాట పోరాటాల కోసం పరుగులెత్తే మనస్తత్వం ఉన్నవారు ఖచ్చితంగా వేసుకోవాల్సిన అవసరం ఉంది. ఏ మనిషికైనా అత్యంత ముఖ్యమైనది ప్రధానమైనది మరణ దశలో ఎంత వేదనారాహిత్యంగా ఆనందంగా శరీరాన్ని దైవదృష్టితో విడిచి వెళుతున్నాం అన్న విషయమే గాని మరొకటి కాదు. దీనిపైనే ఆధారపడి ఉంటుంది తరువాతి జన్మ తీసుకునే విధానం. మన పుట్టుక గురించి మన చేతుల్లో ఈ సమయానికి ఇప్పుడు ఏమి లేదు, ఎందుకంటే అది గడిచిపోయింది కానీ మన మరణం ఎలా జరుగుతుంది అని మాత్రం మన చేతుల్లోనే మన కర్మలను బట్టే ఉంటుంది. అందుకని గతాన్ని వదిలి ఇకనైనా మేలుకొలుపుతో అనవసర ఆరాట పోరాటాలకు స్వస్తి చెప్పి ప్రశాంత చిత్తంతో కర్మ చక్రంలో చిక్కుకోకుండా సమస్త గతమైన సర్వవ్యాపక వాసుదేవుడ్ని మూలశక్తిని గూర్చి ధ్యానించి పరమాత్మ దర్శనం గావించుకొని కర్మరాహిత్యంతో ఏ బాధ భయం వేదన నొప్పి లేకుండా జన్మరాహిత్యంతో శరీరం నుంచి ప్రాణశక్తి విడివడి పరమాత్మను చేరుకోవడానికి తగిన అడుగులు వేయాల్సిన ఆవశ్యకత ఎంతగానో ఉంది. ఈ దృష్టితోను ఇప్పటికే మనం చర్చించిన ఏడు అధ్యాయాల అవగాహన దృష్టితోను ఈ శ్లోకాన్ని పరిశీలిద్దాం.

ముందు శ్లోకంలో దృఢమైన భక్తితో భగవంతుని సేవిస్తానని చెప్పిన జగద్గురువు ఎందుకు భగవంతుని సేవించాలి అనే ప్రశ్నకు సమాధానం ఈ శ్లోకం వివరిస్తుంది. జర అంటే ముసలితనం, వృద్ధాప్యం, వార్ధక్యం, మరణం అంటే చావు ఉన్నాయి అనుకునేవారు వీటికి భయపడి ఈ మరణాన్ని, వార్ధక్యాన్ని భరించలేక వాటినుండి విడిపడటానికి ఏకైక శరణ్యమైన పరమేశ్వరుడిని ఆశ్రయిస్తారు. జరా మరణాలు అనేవి సృష్టిలో ప్రతి శరీరానికి అనివార్యం, జరా మరణాలనే ద్వంద్వాలలో నిర్ద్వంద్వమైన రహస్యం ఒకటి ఉంది. జరామరణాలు ఆద్యంతాలే కానీ ద్వంద్వాలే కానీ అందులో ఆంతర్యంగా నిబిడీకృతమై ఉన్న జీవశక్తికి, ప్రాణశక్తికి ఆద్యంతాలు లేవు. అయితే ఇందులో సాధారణ స్థాయి మనుషులకు మరో సందేహం కలిగే అవకాశం ఉంది, శరీరం శరీరమే ప్రాణశక్తి ప్రాణశక్తే ఇవి రెండు వేరు అని తెలిశాక దేహానికే కదా జరామరణాలు మరి ప్రాణశక్తికి కాదు కదా మరి దీనికి పరమేశ్వర ప్రాప్తికి మోక్షానికి ముక్తికి ఇక్కడ పని ఏంటి అని కూడా ఆలోచించేవారు లేకపోలేదు. అయితే ఈ జ్ఞానం విజ్ఞాన సహితంగా అనుభవ పూర్వకంగా అనుభవ జ్ఞానం కావడం లేదు. కాబట్టి నాకు చావు నాకు ముసలితనం నాకే జరామరణాలు నాకే అన్నీ ఉన్నాయి లేదా అందరికీ అన్నీ ఉన్నాయి, నాకే అన్నీ లేవు నాకు ఇంత డబ్బు ఉంది ఈ పదవి నాది అనే భ్రాంతి భ్రమతో తానేమిటో తనకు తెలియకపోవడమే నేటి గందరగోళపు పరిస్థితికి కారణం. ఆ స్పష్టత ఉంటే మనం చూస్తున్న అస్తవ్యస్తపు పరిస్థితులు ఉండకూడదు కదా. సమతాస్థితి, సమతాసిద్ధి ప్రతిఒక్కరిలో ఉండి లోకం, లోకులు శాంతియుతంగా కొనసాగే వారు కదా అది తెలియక ఆ స్పష్టత లేక వ్యామోహంలో చిక్కుకొని జన్మజన్మకు సంస్కారాల మూటను పెంచుకొని కర్మల చక్రంలో చిక్కుకొని బిక్కరిస్తున్న కారణంగా ఈ ఇబ్బంది. అందుకు పరమేశ్వరుని జగద్గురువును ఆశ్రయించాలి, బ్రహ్మ విద్యను అభ్యసించాలి, తనను తాను తెలుసుకోవాలి, తనను

తాను చేరుకోవాలి, ఇది మనకు విజ్ఞాన సహితం కావాలి. తాను బ్రహ్మం కన్నా అన్యం కాదని గ్రహించాలి. సమస్తమూ బ్రహ్మమేనని విజ్ఞాన సహితం గావించుకోవాలి. అంతేకాదు సమస్తం ఆధ్యాత్మం, ఈ బ్రహ్మాన్ని తెలుసుకోవడానికి చేసే జ్ఞానాభ్యాస సాధనాలైన మనన నిధిధ్యాసలు ధ్యానయోగ మార్గం ధ్యాన సాధనా సత్యశోధన జ్ఞానఅర్జన వీటి ద్వారా సమస్తము సమస్త కర్మలు జ్ఞాన స్వరూపమేనని తెలియాలి. తానే అఖండ బ్రహ్మం అని తెలిసినప్పుడు ఆ బ్రహ్మ స్వరూపానికి దేహమే లేదని లేని దేహాన్ని లేనిదిగా గుర్తించే స్థితి ఏర్పడుతుంది. పరమేశ్వర అనుగ్రహంతో అలా లేని దేహాన్ని లేనిదిగా గ్రహించడం వల్ల జరామరణాలు కూడా లేవని సమస్త భయభ్రాంతులనుండి విముక్తి పొందుతారు. బంధంలో ఉన్న జీవుడు మోక్షం కోసం బ్రహ్మానుభూతి కోసం ప్రయత్నిస్తారు. అట్టి ప్రయత్నశీలురలో బంధవిముక్తికై సర్వేశ్వరుని ఆశ్రయించి ఎవరైతే ధ్యానాది కార్యాచరణలో ఉంటారో వారు మాత్రమే కాలక్రమంలో తానే బ్రహ్మం అని తెలిసి జీవన్ముక్తులు అవుతారు. తన యందే సమస్త కర్మ సమూహం సమస్త జగత్తులు, సమస్త జీవరాసులు ఉన్నట్లు సర్వజీవుల యొక్క ఆత్మ తానే అయి ఉన్నట్లు అనుభూతిస్తారు. ఆ అనుగ్రహం దైవశక్తిని పొందే ధ్యానసాధన ద్వారానే సిద్ధిస్తుంది. ఇదే అహం బ్రహ్మాస్మి అనుభవం. ఈ శ్లోకంలో యతంతి, ఆశ్రిత్య అనే రెండు శబ్దాలు చాలా ప్రధానమైనవి. యతంతి అంటే యత్నించేవారు, ఆశ్రిత్య అంటే భగవంతుని ఆశ్రయించిన వారు. ఇవి రెండూ ఆధార ఆధేయాలు, దైవాన్ని ఆశ్రయించి ప్రయత్నం చేయకపోయినా ప్రయత్నిస్తూ దైవాన్ని ఆశ్రయించకపోయినా లక్ష్యాన్ని చేరడం వీలుకాదని గ్రహించాలి. దైవాన్ని ఆశ్రయించాలి ఆదిశగా అవిరళ నిర్విరామ కృషి ఉండాలి. అప్పుడే జరామరణ వ్యాధి నుండి విముక్తి, సమస్త ఆధ్యాత్మిక సాధనాలన్నీ ఇందుకోసం ఏర్పడినవే. సాధారణ స్థాయి త్రిగుణ పీడితులు ఆరురుక్షువు కావాలి. ఆరురుక్షువు యోగారూఢులు కావాలి. ఈ దిశగా ప్రతి జీవుడు ముందుకు కొనసాగాలి అప్పుడే సమస్త ప్రత్యగాత్మ స్వరూపం అద్వైత పరబ్రహ్మంగానే దర్శితమవుతుంది. ఆ స్థితిలో ఏది కూడా బ్రహ్మేతరమైనదిగా అనిపించదు కనిపించదు తలపించదు. సమస్తమూ ఆత్మమయమే బ్రహ్మమయమే. ఇందులో మనం గ్రహించాల్సిన అంశాలు ఒకటి జన్మ జరామరణ రూప సంసారబంధ విముక్తికి భగవంతుని ఆశ్రయించాలి. రెండు స్వప్రయత్నం దైవఆశ్రయం రెండింటిని దృష్టిలో ఉంచుకొని ఆధ్యాత్మిక బాటలో ప్రయాణించాలి. అంతా ఆత్మమయమే బ్రహ్మమయమేనని విజ్ఞాన సహితంగా తెలియాలి.

7అ, 30శ్లో.

సాధిభూతాధిదైవం మాం సాధియజ్ఞం చ యే విదుః

ప్రయాణకాలేఽపి చ మాం తే విదుర్యుక్తచేతసః |30|

అధిభూత, అధిదైవ, అధియజ్ఞములతోపాటు అందరికినీ ఆత్మరూపుడనైన నన్ను అంత్యకాలము నందైనను తెలిసికొనువారు నిశ్చలబుద్ధితో నన్నే చేరుదురు.

అంటే అన్ని భూతాలలో అన్ని దైవాలలో అన్ని యజ్ఞాలలో ఆంతర్యామిగా ఉన్న నన్ను తెలుసుకున్నవారు అని అర్థం చేసుకోవాలి. అలాంటివారు అధిభూత అధిదైవ అధియజ్ఞ సహితంగా నన్ను తెలుసుకున్నవారు మరణ సమయంలో కూడా చిత్తం చలించక నన్ను తెలిసే ఉంటారు. జీవితకాలమంతా ఆత్మ చింతనతో ఉన్నవారు అంతిమ కాలంలో దేహ వియోగసమయంలోను ప్రశాంత చిత్తులై దైవ అనుభవంతోనే కూడి ఉంటారు. అధిభూత అధిదైవ అధియజ్ఞ రూపాలైన సమస్త పదార్థాలు జీవించి ఉన్నంతకాలం జీవిత పర్యంతము పరమాత్మ స్వరూపాలే అనే ఆత్మ అనుభవంతో ఉంటారు కనుక అంతిమ కాలంలో కూడా అలాంటి బ్రాహ్మనుభవమే కలిగి ఉంటారు. సమస్తమూ బ్రహ్మమే ఆ బ్రహ్మం నేనే అనే బ్రాహ్మనుభవాన్ని జనులు జీవిత పర్యంతమందును అనుభవైకవేద్యం గావించుకొని ఉండాలి. ఇది మనోనిగ్రహం వల్లనే సిద్ధిస్తుంది ఇది ధ్యానయోగం వల్లనే సాధ్యం. కాబట్టి విధిగా ధ్యాన యోగ సాధనతో బాహ్య అంతర ఇంద్రియాలను సంయమించి సార్వాత్మిక అనుభవంతో బ్రహ్మనుభవాన్ని సిద్ధింప చేసుకోవాలి. మరి ఎప్పటినుండి అంటే ఇది అంతిమ కాలంలో అనుకుంటే వీలుకాదు దేహేంద్రియాలు శిథిలం కాకముందే దేహ శక్తి ఉడికిపోవడానికి ముందే ఆత్మసిద్ధికై యత్నించి ఆధ్యాత్మాన్ని పొందాలి. అప్పుడే ప్రయాణ కాలంలో దైవ స్మృతితో దేహవియోగం జరిగి అంత్యకాలంలోనూ నన్ను ఎరుగుదురు నన్నే చేరుదురు అంటున్న జగద్గురువు మాటలు మనకు విజ్ఞాన సహితం అవుతుంది.

7వ అధ్యాయం, అవలోకనం.

ఇప్పుడు ఈ అధ్యాయం ముగుస్తున్న సందర్భంగా ఒకసారి విజ్ఞానయోగాన్ని అవలోకనం చేసుకొని విజ్ఞాన సహితంగా అనుభవ జ్ఞానంతో ముందుకెళ్దాం. ఏడు అధ్యాయాలుగా ఆధ్యాత్మ జ్ఞానంతో భగవంతుని అడుగుజాడలో నడుస్తున్నాం. కనుక ఆ అవగాహనతో ప్రాణ ప్రయాణ సమయంలోనూ బ్రాహ్మీస్థితిలోనే ఉండి పరమాత్మ దర్శనంతో దైవంలో విలీనం అయ్యే పూర్ణ జ్ఞానాన్ని పరిపూర్ణంగా అనుభూతిధాం. ప్రధమ షట్కం సారాంశాన్ని సంక్షిప్తీకరించుకొని విజ్ఞానయోగం విశేషాలను వివేచించుకున్నాం. నాయందు ఆసక్తి కలిగిన మనసుతో నన్ను ఆశ్రయించి సంశయ రహితంగా నన్నే విధంగా పొందగలరు చెబుతాను విను అని పిలుపునిస్తూ విజ్ఞాన యోగాన్ని ప్రారంభించాడు జగద్గురువు. రెండవ శ్లోకంలో విజ్ఞానంతో కూడిన ఈ తత్త్వ జ్ఞానాన్ని సంపూర్ణంగా బోధిస్తాను దీన్ని ఎరిగిన తరువాత ఈ జగత్తులో తెలుసుకోవాల్సింది ఏదీ మిగలదు మరేది ఉండదని సమస్త విద్యలకు సృష్టికి మూల కారణమైన మూలవిద్యను బ్రహ్మవిద్యను అభ్యసించాలని స్పష్టంగా తెలుసుకున్నాం. మూడవ శ్లోకంలో వేలాదిమంది మనుష్యులలో మోక్ష సిద్ధికి ప్రయత్నించే వారు ఎక్కడో చాలా అరుదుగా ఉంటారు అలా ప్రయత్నించే సిద్ధులలో కూడా నన్ను యధార్థంగా తెలుసుకునేవారు ఎక్కడో ఒక్కడు మాత్రమే ఉంటాడు అని చూసాం. ఇందులో ప్రాణిగమ్యం మోక్షమేనని ఆ అర్హత కూడా మనిషికి మాత్రమే ఉందని గ్రహించాం. నాలుగవ శ్లోకంలో జగద్గురువు స్వయంగా తన శక్తిని స్వస్వరూపాన్ని తన ప్రకృతిని మన ముందు ఉంచాడు. లోచూపుతో శ్రద్ధా భక్తులతో దర్శించగలిగిన వారికి సాక్షాత్కార సామర్థ్యం ఉన్నవారికి పరమాత్మ స్వస్వరూపం దర్శితం అవుతుందని తెలుసుకున్నాం. ఇందులో సృష్టికి ముందు అద్వితీయంగా ఉన్నది సదాత్మేనని భూమి నీరు అగ్ని గాలి ఆకాశం

అనే పంచభూతాలు మనసు బుద్ధి అహంకారం ఈ ఎనిమిది విధాలుగా మనకు తెలుస్తున్న అపరాప్రకృతి ఈశ్వర మాయేనని స్వయం పరిశీలన ద్వారా అనుభవేద్యం చేసుకున్నాం. ఐదవ శ్లోకంలో అపరా ప్రకృతి కంటే పరమైన వేరై ఉన్న ఈ సమస్త జగత్తును ధరిస్తూ ఉన్న జీవరూపమైన పరాప్రకృతిని శ్రేష్ఠమైనదిగా తెలుసుకున్నాం. ఆరవ శ్లోకంలో సమస్త చరాచర భూత ప్రపంచానికి ఈ పరా అపరా ప్రకృతులే మూలమని గ్రహించాం. సమస్త జగత్తు ఉత్పత్తి లయమయ్యే స్థానం నేనేనని చూసాం. ఇందులో ఏ శక్తితో ఈ సమస్తభూతాలు పుడుతున్నాయో అలా పుట్టిన భూతాలు ఏ శక్తితో జీవిస్తున్నాయో ఎందులో లయమవుతున్నాయో అదే బ్రహ్మమని జగత్తుకు కారణం కూడా ఆ మూలశక్తేనని గ్రహించాం. ఏడవ శ్లోకంలో నాకంటే వేరుగా మరొకటి ఏదీ లేదు నా సమస్త జగత్తు దారంలో మణుల సముదాయం వలె నాలోనే ఇమిడి ఉంది అనే సందేశాన్ని సంపూర్ణంగా విజ్ఞాన సహితంగా స్వీకరించాం. ఎనిమిదవ శ్లోకంలో నీళ్లలో రసంగా సూర్యచంద్రులలో కాంతిగా వేదాలలో ఓంకారంగా ఆకాశంలో శబ్దంగా మనుష్యులలో పురుషుడిగా వ్యాపించి ఉన్న మూలశక్తి మూలాలను విజ్ఞాన సహితంగా చూసాం. 9వ శ్లోకంలో భూమిలోని సుగంధంగా అగ్ని యందు తేజంగా సర్వప్రాణులలోనూ జీవంగా తాపసుల యందు తపముగా వ్యాపించి ఉన్న విశ్వవ్యాపక విధానాన్ని గ్రహించాం. ఇందులో మనకు జీవనాధారాలుగా తెలుస్తున్న గాలి నీరు అన్నం మొదలైన ఆహారాదులతోనూ ఆంతర్యంగా సారభూతుడై జీవంగా శోభిస్తున్న ఈశ్వర తత్త్వాన్ని దారంలో కూర్చిన అమర్చి ఉన్న మణుల సముదాయంగా నిబిడీకృతమై ఉన్న విధానాన్ని చూసాం. పదవ శ్లోకంలో మొలకెత్తడానికి కారణమైన సనాతన బీజాన్ని మూలాన్ని అంతఃకరణంలోని వివేకశక్తి బుద్ధిని తేజస్సుల యందున్న తేజాన్ని దర్శించాం. 11వ శ్లోకంలో సమస్త ప్రాణులలోని ఆశారాగం లేని బలవంతులలోని బలాన్ని ప్రాణులన్నింటిలోని ధర్మ విరుద్ధం కాని కోరికను నేనే అంటూ జగద్గురువు చెప్పిన తీరును బ్రహ్మమయ బ్రహ్మాత్మ అండాండ పిండాండ బ్రహ్మాండమంతా వ్యాపించిన మూల శక్తిని దర్శించాం. ఇందులో వ్యక్తి సంక్షేమానికి సంఘసంక్షేమానికి కామరాగాలు లేని ధర్మానికి విరుద్ధం కాని ధార్మికమైన బలమే ఉపకరిస్తుందని తెలుసుకున్నాం. కామరాగ వివర్జితమైన బలమే ఈశ్వర బలం అని పరమేశ్వర పరబ్రహ్మ విశ్వవ్యాపక విధానం విజ్ఞాన సహితంగా గ్రహించాం. 12వ శ్లోకంలో సాత్విక రాజస తామస భావాలన్నీ నా నుండే కలుగుతున్నాయని తెలిపి నేను మాత్రం అందులో లేను నాలో అవి గాని లేవు అని చెప్పి తేట తెల్లం చేసిన తీరును దర్శించాం. 13 వ శ్లోకంలో త్రిగుణమయి భావాల చేత సమస్త జగత్తు మోహం చెందుతున్నది వీటికి ఆవల ఉన్న శాశ్వతమైన నాశరహితమైన నన్ను తెలుసుకోవడం లేదు గుణాల ద్వారా కలిగే భావాలకు రాగద్వేష మోహాదులైన నానారకాల పదార్థాల చేత సమస్త ప్రాణికోటి మోహం చెందుతూ వివేకం కోల్పోతున్నదని విప్పి చెప్పిన నేటి సమాజపు తీరును చూశాం. 14వ శ్లోకంలో త్రిగుణాత్మకమైన ఈ నా దివ్య మాయ దాటశక్యం కానిది నన్ను అంటే దైవాన్ని చూచినవారు మాత్రమే ఈ మాయను దాటగలరని మాయ బలా బలాలను దాని స్వరూపాన్ని తెలుసుకున్నాం. 15వ శ్లోకంలో పాపాలను ఆచరించే పాపులు దుష్టులు, మూర్ఖులు మాయకు లోనైన వారు రాక్షస స్వభావాన్ని ఆశ్రయించిన వారు అయిన అధమ మానవులు దైవాన్ని భజింపరని గమనించాం. 16 వ శ్లోకంలో పుణ్యం చేసుకున్న సుకృతుల్ని తట్టుకోలేనంతగా ఆపదలో కష్టాల్లో ఉన్నవారు, తత్త్వం తెలుసుకోవాలనుకునే జిజ్ఞాసువు,

ధనం కోరేవారు, జ్ఞానవంతులు అని నాలుగు విధాలుగా పేర్కొని విశ్లేషించుకున్నాం. 17వ శ్లోకంలో ఈ చతుర్విధ భక్తులలో నిరంతరం నా యందే ఏకీభావ స్థితులై అనన్య భక్తితో అంటే అన్య మనస్కంగా ఉన్న జ్ఞాని నిత్య యోగి అత్యుత్తముడని అలా యధార్థంగా నన్ను నా తత్త్వాన్ని తెలుసుకున్న జ్ఞానికి నేను ప్రియుణ్ని అతడు నాకు ప్రియుడు అని జ్ఞానికి దైవానికి ఉన్న దైవిక ప్రేమను దివ్యంగా విజ్ఞాన సహితంగా దర్శించాం. 18వ శ్లోకంలో ఈ చతుర్విధ భక్తులందరూ భగవంతుని యందు విశ్వాసం ఉంచి సేవించేవారు వీరు గొప్పవారే గాని జ్ఞాని మాత్రం నా స్వరూపమే అన్న జగద్గురువు అభిప్రాయాన్ని స్వీకరించాం. 19 వ శ్లోకంలో అనేక జన్మల చివర జ్ఞానిగాఎదిగి సర్వం వాసు దేవుడే అనే భావంతో నన్నే చేరుతాడని అలాంటి మహాత్ములు దొరకడం చాలా అరుదు అని కూడా చెప్పి జ్ఞాని వైభవాన్ని స్తుతించుకున్నాం. 20వ శ్లోకంలో తాత్కాలిక భౌతిక పరమైన కోరికల చేత జ్ఞానాన్ని కోల్పోయి అన్య దేవతలను వారి వారి నియమాలను అనుసరించి ఆశ్రయిస్తున్నారని వారి సంస్కార స్వభావమే వారికి నియంతగా ఉండి వారిని నడిపిస్తుందని వివరించి కోరికలనే దొంగలకు అపహృతమై జ్ఞానాన్ని కోల్పోయిన వారై పరమాత్మను విడిచి అన్య దేవతలను ఆరాధిస్తున్నారని జగద్గురువు నొక్కి వక్కాణించిన తీరును చూసాం. 21వ శ్లోకంలో ఏ ఏ భక్తులు ఏ ఏ దేవతా రూపాన్ని నామాన్ని శ్రద్ధతో పూజించదలచుకుంటున్నారో దానికి తగిన అదే శ్రద్ధనే వారి వారికి స్థిరమయేటట్లు కలుగజేస్తున్నానని సవివరంగా ప్రబోధించారు. ఇందులోనే ఆధ్యాత్మికోన్నతికై ఎంతటి ప్రయత్నం మనం చేస్తామో అంతటి ఫలితాన్ని మనం పొందగలమని మనకు స్పష్టమైంది. అసలు ప్రయత్నమే చేయని వారికి ఏ విధమైన శ్రద్ధా భక్తులు లేని వారికి దేవదేవుడైనా చేయగలిగింది ఏమీ ఉండదు కనుక ఆ స్థితికి చేరుకునే దిశగా అడుగులు వేయాలని నిర్ణయించుకున్నాం. 22వ శ్లోకంలో శ్రద్ధావంతులైన కామ్య భక్తులు దేవతా మూర్తిని అర్చిస్తారు ఆరాధనా ఫలాన్ని ఆ దేవత నుండే పొందుతారు వాస్తవానికి ఆ ఫలితాన్నిచ్చేది కూడా నేనే ఆ కోరికలు నేను తీర్చినవేనని జగద్గురువు చెప్పిన తీరును విన్నాం. ఇందులో ఆయా దేవతలే ప్రధానంగా కనిపిస్తూ ఉన్న వారి ద్వారా ఫలాలను అనుగ్రహించేది ఆ పరమేశ్వరుడే అని దేవతలలోనూ ఆంతర్యామిగా ఉన్నది దైవమేనని చూసాం. 23వ శ్లోకంలో భౌతికపు అల్పమైన వాటిని కోరే అల్ప బుద్ధులు అల్పమేధస్సులు అనిత్యమైన అల్పమైన ఫలాలనే పొందుతారు నా భక్తులు నన్నే పొందుతారు అని జగద్గురువు ఇచ్చిన భరోసా విన్నాం. 24వ శ్లోకంలో అవ్యక్తం ఉత్తమోత్తమం సర్వోత్తమం అయిన నా తత్త్వం తెలియని అవివేకులు అవ్యక్తమైన నన్ను వ్యక్తమయ్యే వ్యక్తిగాను రాకపోకలు గల ఆపదలు సంభవించే వానిగాను భావిస్తారని జగద్గురువు మందబుద్ధుల మనస్తత్వాన్ని విప్పి చెప్పారు. 25వ శ్లోకంలో నన్ను జన్మరహితునిగా అవినాశిగా పరమేశ్వరునిగా శాశ్వతునిగా తెలుసుకోవడానికి గల కారణం నా యోగ మాయచే నేను కప్పి ఉండటం వల్లనే, నేను గోచరించడం లేదు అంటూ దైవిక రహస్యాన్ని మనకు ప్రబోధించారు. ఇందులో దైవీమాయను బలమైనటువంటి త్రిగుణమయి మాయ తెరను తొలగించుకోవాల్సిన ఆవశ్యకతను విధానాన్ని చూసాం. 26వ లోకంలో జీవేశ్వరులు ఇద్దరికీ మాయ సమానమే గాని దాని ప్రభావం మాత్రం జీవుల మీదే గాని ఈశ్వరుని మీద కాదని జీవని దృష్టికి దైవ దృష్టికి ఉన్న తేడాను గమనించాం. నాయందు భక్తిశ్రద్ధలు ఉన్నవారు తప్ప వేరే ఎవరు నన్ను ఎరుగ జాలరని దైవం విశదీకరించిన దైవిక శక్తిని దర్శించాం. 27వ శ్లోకంలో జగత్తులోని ప్రాణులన్నీ రాగద్వేషాల వల్ల కలిగిన సుఖదుఃఖాది ద్వంద్వాల

ప్రభావంతో అంతులేని మోహంలో పడి కొట్టుమిట్టాడుతున్న తీరును జగద్గురువు మన ముందు ఉంచారు. 28వ శ్లోకంలో నిష్కామ భావంతో పుణ్య కర్మలు ఆచరించిన వారి పాపాలు క్షయమైపోతాయి అలాంటివారు రాగద్వేష జనితాలైన సుఖదుఃఖాది మోహాలనుండి విముక్తులవుతారని చూసాం. అలా ధృఢ చిత్తులైన భక్తులు నన్నే భజిస్తారని వివరించుకున్నాం. 29వ శ్లోకంలో భౌతిక విషయ ఆసక్తి వీడి దైవాన్ని శరణు పొంది జరా మరణ విముక్తికై ప్రయత్నించేవారు ఆ బ్రహ్మాన్ని ఆధ్యాత్మాన్ని తెలుసుకుంటారని విశదీకరించుకున్నాం. ప్రస్తుతం 30 వ శ్లోకంలో ఆది భూత ఆది దైవ ఆది యజ్ఞాలతో పాటు అందరికీ ఆత్మ రూపుడనైన నన్ను అంత్యకాలమందు తెలుసుకున్నవారు నిశ్చలబుద్ధితో నన్నే చేరుతారని మానవుడు దైవాన్ని చేరే రీతిని మన ముందు ఉంచారు.

8అ, 1,2శ్లో.

అర్జున ఉవాచ

కిం తద్బ్రహ్మ కిమధ్యాత్మం కిం కర్మ పురుషోత్తమ |

అధిభూతం చ కిం ప్రోక్తమ్ అధిదైవం కిముచ్యతే |1|

అర్జునుడు పలికెను - ఓపురుషోత్తమా! బ్రహ్మ-అనగానేమి? అధ్యాత్మము అనగానేమి? కర్మ అనగా నేమి? అధిభూతము అని దేనికి పేరు? అధిదైవము అని దేనిని అందురు. (1)

అధియజ్ఞః కథం కోఽత్ర దేహేఽస్మిన్ మధుసూదన

ప్రయాణకాలే చ కథం జ్ఞేయోఽసి నియతాత్మభిః |2|

ఓ మధుసూదనా! 'అధియజ్ఞము' అనగానేమి? ఆ అధియజ్ఞము ఈ శరీరమునందు ఎట్లుండును? అంత్యకాలమున మనస్సును పరమాత్మయందు లగ్నముచేసిన యోగులు నిన్నెట్లుతెలిసికొనగలరు?

ఇంతటి మహోన్నతమైన అంశాలను తనలో ఇముడ్చుకున్న అక్షర పరబ్రహ్మంలోని బ్రహ్మాత్మ జ్ఞానార్జనకై బ్రహ్మ శబ్దం వివేచనతోనే పరబ్రహ్మ యోగంలోకి ప్రవేశిద్దాం. ఆరవ అధ్యాయం 39వ శ్లోకంలో తన ప్రశ్నను ముగించి అక్కడ నుండి ఏడవ అధ్యాయం అంతా కూడా అనితరసాధ్యంగా జగద్గురువు ప్రబోధించిన బోధను చాలా స్పష్టంగా అర్థం చేసుకుంటూ జగద్గురువు చిటికెన వేలు పట్టుకొని నెమ్మదిగా ప్రయాణిస్తూ వచ్చాం. ఇక్కడ జగద్గురువు ప్రభోధం విన్న మనం ఒక్కసారిగా ఏకకాలంలో ఏడు ప్రశ్నలు సంధించడంతో ఎనిమిదవ అధ్యాయం ప్రారంభమైంది. సందేహం బ్రహ్మ శబ్దంతోనే ప్రారంభమైంది, కాబట్టి అక్షర పరబ్రహ్మ యోగంగా ఈ అధ్యాయం మన ముందుకు వచ్చింది. ఈ అధ్యాయాన్ని శంకరులవారు ధారణ యోగం అన్నారు, మరి కొందరు తారక బ్రహ్మయోగం అన్నారు. ముందు అధ్యాయం చివర జగద్గురువు జరామరణ విముక్తికై తనను ఆశ్రయించి ప్రయత్నించేవారు బ్రహ్మంను తెలుసుకుంటారని చెప్పారు. దేహవియోగ సమయంలో కూడా పరమాత్మనే చేరుతారని ప్రబోధించారు. అక్షరం అంటే నశించేది, అక్షరం అంటే నశించనిది, నాశరహితమైనది, నాశనం లేనిది. నాశరహితమైన అవ్యయమైన అనంతమైన సనాతనమైన పరబ్రహ్మం గురించి బోధించే అధ్యాయం కాబట్టి అక్షర పరబ్రహ్మ యోగం. అక్షరం క్షరం కానిది అదే పరబ్రహ్మం. ఈ అక్షరమైన పరబ్రహ్మాన్ని పొందే ఉపాయాన్ని తెలిపే విశిష్టమైన అంశాలు కలిగినదే అక్షర పరబ్రహ్మ యోగం, కాబట్టి ఈ క్షరం కాని అక్షర పరబ్రహ్మాన్ని దర్శింపజేసే అక్షర పరబ్రహ్మంలో యోగమై ఈ అధ్యాయాన్ని అభ్యసిద్దాం.

ఇందులో ఒకటి నుండి ఏడు వరకు బ్రహ్మం, ఆధ్యాత్మం, కర్మం మొదలైన అర్జునుడి ప్రశ్నలు భగవంతుని సమాధానాలు. 8 నుండి 16వ శ్లోకం వరకు ప్రణవోపాసన అద్భుత ఫలితాలు. 17 నుండి 19వ శ్లోకం వరకు సృష్టి ప్రళయాల వివరణ. 20 నుండి 22 వరకు భగవానుని సనాతన స్వరూపం, జ్ఞాన భక్తితో దాన్ని సంప్రాప్తింప చేసుకోవడం. 23 నుండి 26 వరకు శుక్ల కృష్ణ పక్షాల మార్గాల వర్ణన. 27 నుండి 28వ శ్లోకం వరకు యోగ మహిమ. ఈ ప్రశ్నలతో కూడుకున్నటువంటి రెండు శ్లోకాలను పరిశీలిద్దాం. పాపం నశించినవారు ద్వంద్వ విముక్తి జరిగిన జరిగిన వారే నన్ను భగవంతుని సేవిస్తారు భజిస్తారని 7-28లో చూసాం. జరామరణ విముక్తికై నన్ను శరణుపొంది ప్రయత్నించువారు ఆ పరబ్రహ్మాన్ని సమస్త ఆధ్యాత్మాన్ని సంపూర్ణ కర్మను తెలుసుకుంటారని 7-29వ శ్లోకంలో చూశాం. సమాహిత చిత్తం కలవారు మరణ కాలంలో కూడా పరమేశ్వరుని తెలుసుకుంటారని ఏడవ అధ్యాయంలోని చివరి శ్లోకం. ఇక్కడ ఈ మూడు శ్లోకాలతో సందిగ్ధం ఏర్పడుతుంది. ఇది ప్రతి సాధకునిలో ఏదో ఒక సమయంలో ఏదో ఒక కారణం చేత మనసును చేరి కలతకు గురిచేస్తూనే ఉంటుంది. మరణ కాలంలో నాకు సమాహిత చిత్తం కుదురుతుందా? అనే సందేహాలు మనకు సంధించక మానవు. మరోవైపు జరామరణ మోక్షార్థం ప్రయత్నించినవారు సమస్తాన్ని తెలుసుకుంటారు అంటూ బ్రహ్మం ఆధ్యాత్మం లాంటి ఏడు శబ్దాల్ని సరికొత్తకోణంలో ప్రత్యక్షంగా ప్రస్తావించాడు, ప్రయోగించాడు భగవానుడు. ఏడవ అధ్యాయంలోని చిట్టచివర జగద్గురువు ప్రబోధించిన ఈ అంశాలే అర్జునుడిలో, మనలో ఏడు ప్రశ్నలుగా తయారై వాటిని వివరించమని జగద్గురువును ప్రణమిల్లుతున్నాం. ఇంతకు మనం ఏడు అధ్యాయాలుగా చెప్పుకుంటున్న బ్రహ్మం ఏమిటి? అనేకులు అనేక విధాలుగా ఎవరికి తోచినట్లు ఒకటికి ఒకటి అర్థం చేసుకునే జనులను గురించి మనకు తెలియనిది కాదు. మనం ఆరవ అధ్యాయం ప్రారంభంలోనూ సన్యాసి లాంటి శబ్దాలకు అర్థ నిర్ధారణ చేసుకొని ముందుకు వచ్చాము. జగద్గురువు బ్రహ్మం అనే శబ్దాన్ని ఏ అర్థంలో ప్రయోగిస్తున్నాడు, సరైన భావాన్ని మనం అవగాహన చేసుకుంటున్నామా లేదా అనే అంశాల్లో మనలో మనకు స్పష్టత వస్తే తప్ప గీతామార్గంలో బ్రహ్మవిద్య అధ్యయనంలో ముందుకెళ్లడం వీలు కాదు. అందుకని ఇలాంటి అద్భుతమైన చక్కటి అర్థాన్ని నిర్ధారించే అమూల్యమైన ఏడు ప్రశ్నలు మనకు భగవంతుని చేరే మార్గాన్ని మరింత సులభతరం చేయబోతున్నాయి. రెండవ ప్రశ్న 'కిం ఆధ్యాత్మం', ఆధ్యాత్మం అంటే ఏమిటి? దేహాన్ని నడిపించే ప్రాణేంద్రియాలు ఉన్నాయి, దేహాన్ని అధిష్ఠించి ప్రత్యగాత్మ , జ్ఞాత ఉంది. ఈ అంశాలన్నీ మనం చూసాం అయితే మరి ఈ ఆధ్యాత్మం ఏంటి అదెక్కడుంది అనేది ప్రశ్న. మూడవ ప్రశ్న కిం కర్మ, కర్మ అనగానేమి? జరిగే ప్రతిదీ కర్మే, సృష్టే కర్మ అని మనం కర్మ యోగంలో కర్మ స్వభావాన్ని స్వరూపాన్ని సమగ్రంగా చూసాం. ఇక్కడ జగద్గురువు ప్రయోగించిన శబ్దం కర్మ ఏది?. నాలుగవ ప్రశ్న 'అధిభూతం చ కిం ప్రోక్తమ్' అధిభూతం అంటే ఏంటి?. ఐదు అధిదైవమని దేన్ని అంటారు, ఆరు ' అధియజ్ఞః కథం కోఽత్ర'   ఈ దేహంలో యజ్ఞం చేసేవారు ఎవరు? ఎలా చేస్తారు. ఏడు ' ప్రయాణకాలే చ కథం

జ్ఞేయోஉసి' మరణ కాలంలో మనసును సంయమించిన వారికి మనసును స్వాధీన పరచుకున్న వారికి ఎలా నువ్వు తెలియబడుతావు నిన్ను వారు ఎలా తెలుసుకుంటారు.

8అ, 3శ్లో.

శ్రీభగవాన్ ఉవాచ

అక్షరం బ్రహ్మ పరమం స్వభావోஉధ్యాత్మముచ్య తే |

భూతభావోద్భవకరో విసర్గః కర్మసంజ్ఞితః ||

శ్రీ భగవానుడు పలికెను - బ్రహ్మమనగా సర్వశ్రేష్ఠుడు, శాశ్వతుడు. అధ్యాత్మము అనగా స్వస్వరూపము అనగా జీవాత్మ, పరమాత్మయందు లీనమైన సకల భూతములను బహిర్గతమొనర్చి, వాటి ఉత్పత్తి- అభ్యుదయములకు కారణమైన చేష్టను అనగా సృష్ట్యాదికర్మలను కర్మయందురు.

అంటే భూత సృష్టికి కారణమైన విసర్గమునకు కర్మమని పేరు. అర్జునుడు సంధించిన ఏడు ప్రశ్నలలో మొదటి మూడు ప్రశ్నలకు ఈ శ్లోకం జవాబిస్తుంది.

ఒకటి బ్రహ్మము అనగానేమి దీనికి సమాధానంగా జగద్గురువు సర్వోత్తమమైన నాశరహిత వస్తువే బ్రహ్మం అన్నారు. ఈ దృశ్యమయ ప్రపంచంలోని సమస్త దృశ్య పదార్థాలన్నీ కూడా కాలక్రమంలో నశించిపోతున్నాయి కదా అందుకే అవి క్షరములు, నశింపనిది ఒక్కటే ఉంది ఉంటుంది అందుకే అది ఉంది ఉన్నది అంటున్నాం. 2-1లో మనం నిర్ణయించి 2-24లో సుస్థిరమైన సత్తు అదే పరమం అదే పరం. అందుకే అక్షర పరబ్రహ్మం అదే నాశనం లేనిది అక్షర స్వరూపం. ఇది దేశకాలాదులచే ఎన్నటికీ పరిచ్ఛిన్నం కానిది. బృహదారణ్యకోపనిషత్తులో అక్షరం యొక్క శాసనం ప్రకారమే సర్వ ప్రపంచం ఉంది సమస్త శ్రుతుల వేదాల సారం ఇదే. ఈ అక్షర బ్రహ్మాన్నే పరం, పరమం, సర్వోత్తమం, పరబ్రహ్మం అంటున్నాం.

ఇక రెండవ ప్రశ్న, ఆధ్యాత్మం అనగానేమి? స్వభావం అన్నారు ఎవరి స్వభావం? పరం అయిన బ్రహ్మ స్వభావం అక్షరమైన పరబ్రహ్మమే, ఇదే ప్రతి శరీరంలో ప్రత్యగాత్మగా లేదా జీవుడుగా ఉంటూ ఉంది. శరీరాన్ని అధిష్టించి జీవుడుగా ఉన్న పరబ్రహ్మమే ఆధ్యాత్మం. విశ్వంలో ఉండి విశ్వాన్ని సూర్యుడు ఎలా ప్రకాశింపజేస్తున్నాడో అలాగే దేహంలో ఉండి దేహేంద్రియ ప్రాణ మనో బుద్ధులను ప్రకాశింపజేసే ప్రత్యగాత్మ ఆధ్యాత్మం. ప్రతి దేహంలోనూ పరబ్రహ్మగా ప్రత్యగాత్మగా ఉండటమే స్వభావం. ఇదే మనం మూడవ అధ్యాయంలో నిర్ధారించుకున్న ఆత్మే పరబ్రహ్మం. ప్రతి దేహపు మనుగడకు ప్రతి

దేహంలోని నేను అనే స్ఫురణకు మూలం ఆధ్యాత్మమే. పరబ్రహ్మం ఆత్మ రూపంలో ప్రకాశించడమే ఆధ్యాత్మం. బ్రహ్మాన్ని అక్షరం అన్నప్పుడు క్షరం కానిది అని అర్థం చెప్పుకున్నాం కదా అయితే క్షరం కానివి ఆకాశం, ఓంకారం వీటిని కూడా అక్షర శబ్దంతోనే పిలుస్తారు. అయితే వీటిని వ్యష్టిగా చూచినప్పుడు మాత్రమే అక్షరమవుతుంది. సమిష్టిగా చూస్తే అవి కూడా క్షరములే. సృష్టి అంతమైతే సృష్టిలో ఆకాశం కూడా ఓ భూతం ఓ భాగమే కదా అందులో నుంచి వెలసినవే ఓంకారం అంతా కూడా. ఈ రెండూ క్షరములే అవుతాయి అందుకని సమిష్టితో చూస్తే సృష్టితో పాటు అవి కూడా క్షరములే అవుతాయి. అందుకే వాటిని పరమైన ఆకాశం, పరమైన ఓంకారం అని అనము, అనడానికి వీలు లేదు. ఈ రెండూ కూడా ఈ సమస్త ప్రకృతి మొత్తాన్ని తనలో ఇముడ్చుకుంటుంది గాని బ్రహ్మాన్ని ఇముడ్చుకోలేదు కదా కనుక ఆకాశం పరం కాలేదు ఓంకారం పరం కాలేదు. ఇదే అధ్యాయం 13వ శ్లోకంలో ఈ ఓంకారము యొక్క స్వరూప స్వభావాన్ని సమగ్రంగా చూద్దాం. బ్రహ్మము నుండే ఆకాశం పుట్టింది కనుక అది కార్యం. కార్యం కారణం కన్నా అన్యంగా వేరుగా ఉండలేదు. కాని కార్యం లేకపోయినా కారణం ఉంటుంది, ఆకాశం మాయ ఇవి బ్రహ్మాన్ని ఆశ్రయించుకుని ఉన్నాయి కానీ బ్రహ్మం ఆకాశం కన్నా మాయ కన్నా విలక్షణంగా ఉంది. వాటికన్నా పరమైంది సర్వోత్తమమైనది సర్వోన్నతమైనది బ్రహ్మం, అందుకే అది పరబ్రహ్మం అయింది. పరం అనే విశేషం ఒక్క బ్రహ్మం అనే పదానికే శబ్దానికే వర్తిస్తుంది. అందుకే అక్షరం బ్రహ్మ పరం. అక్షర పరబ్రహ్మంలోనూ వరం అనే శబ్దం బ్రహ్మానికి ముందు ఉన్నందుకు గల కారణం కూడా ఇదే, అందులోని ఆంతర్యం కూడా ఇదేనని మనం గమనించాలి. ఇప్పుడు ఈ బ్రహ్మ శబ్దాన్ని గ్రహించిన అవగాహనతో ఆధ్యాత్మం అంటే ఏమిటో చూద్దాం.

తను స్వయం సిద్ధావస్థలో నిరంతరం ఉండే బ్రహ్మతత్వాన్ని ఇక్కడ జగద్గురువు ఆధ్యాత్మం అన్నారు. ఆ పరబ్రహ్మం ప్రతి దేహంలోనూ అంతరాత్మ భావంతో ఉండటమే స్వభావం. ఆ స్వభావాన్ని ఆధ్యాత్మం అన్నారు. దేహాన్ని ఆశ్రయించి అంతరాత్మ రూపంలో ఉండే వస్తువు. ఈ అంతరాత్మే చివరకు పరమార్థ బ్రహ్మంగా పర్యవశిస్తుంది. అంతరాత్మ భావమే స్వభావం, దాన్నే ఆధ్యాత్మం అంటారు. ఇదే దేహంలోని ప్రత్యగాత్మ, ఇదే బ్రహ్మ స్వభావం. ఇది దేహేంద్రియ ప్రాణ మనో బుద్ధులను ప్రకాశింపజేస్తూ వాటికి అతీతంగా కూడా ఉంది. నేను సమస్త కర్మల్లో ఉన్నాను కానీ నాలో అవేమీ లేవు నేను త్రిగుణాల్లో ఉన్నా నాయందు అవి లేవు నేను వాటిలో లేను అని మనం చెప్పుకున్నాం. ఆ నేను అని చెప్పిన పరబ్రహ్మమే ఇక్కడ ఆధ్యాత్మం, స్వభావం, తన యొక్క భావం స్వీయ భావం. దేహాన్ని మనసును అందులోని ఆలోచనలను స్వభావం అని సాధారణ స్థాయి మనుషులు అనుకుంటారు. కానీ వాస్తవానికి ప్రత్యగాత్మ భావమే ఆధ్యాత్మం.

మూడవ ప్రశ్న 'కిం కర్మ' ప్రాణికోటి ఉత్పత్తికి కారణమైన యజ్ఞాదులు కర్మ అన్నారు. యజ్ఞం ద్వారా వర్షం, వర్షం ద్వారా పచ్చదనం తద్వారా ప్రాణ శక్తితో కూడిన ప్రాణుల ఉత్పత్తి సంభవిస్తుంది. ఇక్కడ విసర్గః అంటే విడుచుట అని అర్థం. యజ్ఞంలో హెూమ ద్రవ్యాలను వదులుతారు కాబట్టి యజ్ఞాలతో కూడిన క్రియలని చెప్పవచ్చు. అందుకే త్యాగంతో కూడిన క్రియ ఉత్తమమైనది మోక్ష హేతువు అదే కర్మం. ఆకాశంలో రంగురంగుల మేఘపటలాలు ఉత్పత్తి అవుతాయి కానీ అవి ఎలా పుట్టాయో ఎక్కడ నుంచి వస్తున్నాయో ఎవ్వరూ ఎరుగరు. అలా నిరాకార శుద్ధ బ్రహ్మం నుండి ప్రకృతి, అహంకారం మొదలైన భిన్నభిన్న భూతాలు పుడుతున్నాయి వాటి వల్లనే బ్రహ్మాండ రచన ఆరంభమవుతుంది. నిర్వికల్ప బ్రహ్మమనే భూమి యందే 'అహం బహుస్యా' అనే సంకల్ప బీజం ప్రప్రధమంలో చేరి అంకురాన్ని వెలువరిస్తూ బ్రహ్మాండరూపంలో నలువైపులా వ్యాపించి నిలబడిపోతుంది. మనం తరచి తరచి చూస్తే గమనిస్తే ఆ మూల బీజంతోనే ఆ బ్రహ్మ తత్త్వంతోనే నిండి ఉన్నట్లు తెలుస్తుంది. కానీ వీటి మధ్యలో జరిగే పుట్టే గిట్టే జీవుల్ని లెక్కించలేం. ఇలా అనేక విధాలుగా ఈ అనంత సృష్టి వృద్ధి చెందుతూ ఉంది కాబట్టి ఈ సృష్టిలో గల సమస్త పదార్థాలందు కూడా ఆ ఏకమేవా ద్వితీయ పరబ్రహ్మమే లోపలా బయటనూ నిండి ఉన్నదని మనం గమనించాలి, గ్రహించాలి. ఈ అనేకత్వంలో ఉన్నది ఏకత్వమే అలాగే ఈ సృష్టిలోని మనకు అర్థం కాని మనకు లెక్కకు అందని సమ విషమ భావాలు జీవకోటి సంఖ్య గాని ఈ భేద భావాల పరిధి గాని నిర్ణయించడానికి మనకు అలవి కాదు. కాని వీటి మూల తత్వాన్ని తెలుసుకోవడం వల్ల ఇవన్నీ కూడా ఆ శూన్య బ్రహ్మం నుండే పుట్టాయని మనకు స్పష్టం అవుతుంది. ఈ సృష్టి యొక్క మూలకర్త గాని ఈ సృష్టికి కారణమైన వస్తువు గాని కనిపించదు దొరకదు చిక్కదు. అయితే ఈ సృష్టి కార్యం తనంతట తానుగా అతి శీఘ్రంగా వృద్ధి పొందుతూ సృష్టి కొనసాగుతూ ఉంది. ఈ విధంగా కర్త ఎవరూ లేకుండానే ఆ నిరాకార బ్రహ్మపై పడే ఇంద్రియ గమ్యపు ఆకారపు ముద్రనే కర్మ అంటారు. భూతాలు ఉండటానికి పుట్టుకను కలిగించేది భూతభావోభవకరం. భూత ఆంటే చరాచర ప్రాణులు అని అర్థం. భావః అంటే మనుగడ, భూతానాం భావః భూత భావహః దాని పుట్టుకకు కారణమైనది ఉద్భవకరం, దీనికి హేతువైన యజ్ఞమే కర్మ. యజ్ఞాలలో సమర్పించే హెూమ ద్రవ్యత్యాగమే విసర్గం, యజ్ఞ కర్మ వల్లనే సృష్టికార్యం జరిగిందని మూడవ అధ్యాయం అంతా చూసాం. సృష్టి ఆదిలో త్యాగమయ యజ్ఞ రూపంలో ఉండినది ఏదైతే ఉందో అదే కర్మ. బ్రహ్మమనగా నశించనిది సర్వ శ్రేష్ఠమైనది శాశ్వతమైనది, అన్నింటి కన్నా గొప్పది సర్వోన్నతమైనది. దాని స్వభావమే ఆధ్యాత్మం, ఆధ్యాత్మః అంటే స్వస్వరూపం. పరమాత్మ యందు లీనమైన సకల భూతాలను బహిర్గతం చేసి వాటి ఉత్పత్తి అభ్యుదయాలకు కారణమైన యజ్ఞరూపమైన త్యాగమే కర్మ. ఇంతటితో మూడు ప్రశ్నలకు మనకు జవాబులు అందాయి.

8అ, 4శ్లో.

అధిభూతం క్షరో భావః పురుషశ్చాధిదైవతమ్ ।

అధియజ్ఞో హమేవాత్ర దేహే దేహభృతాం వర ।4।

ఉత్పత్తి వినాశశీలములైన పదార్థములు అన్నియును అధిభూతములు అనబడును. హిరణ్మయుడైన పురుషుడు" అధిదైవము. దేహధారులలో శ్రేష్ఠుడవైన ఓ అర్జునా! ఈ శరీరములలో అంతర్యామిగా ఉన్న వాసుదేవుడనైన నేనే అధియజ్ఞమును.

ముందు శ్లోకంలో మొదటి మూడు ప్రశ్నలకు వరుసగా సమాధానం చూసాం. తరువాతి నాలుగు నుంచి ఆరు వరకు ఉన్న ప్రశ్నలకు ఈ శ్లోకం సమాధానం ఇస్తుంది.

అధిభూతం అంటే ఏమిటి? ఇందుకు నశించే స్వభావం గల వస్తువు అధిభూతం అని జవాబు ఇచ్చాడు జగద్గురువు. క్షరో భావః అంటే నశించే స్వభావము గల వస్తువు యొక్క పుట్టుక అని అర్థం. మేఘాలు కనిపించి లేకుండా పోయినట్లు ఇవి కూడా కనిపిస్తాయి, నశిస్తాయి. ఇవి పంచ మహా భూతాల అంశల పరస్పర మిశ్రమం వల్ల నిర్మాణమైనది. భూతాలను ఆశ్రయించి వాటి యందే మిశ్రితమై ఉండి మనకు భాసమానమవుతూ ఉంటాయి. నామరూపాదులతో కూడి ఉండే భూత సంయోగంతో విఘాతం కలగడం వల్ల నశించిపోయే దాన్ని అధిభూతం అంటారు. కనుక పుట్టి నశించే ప్రతి వస్తువు అధిభూతమే అన్ని దేహాలు అధిభూతాలే. ఈ దేహాల ఉనికికి ఆధారాలుగా ఉన్న శీతోష్ణాదులు కూడా అధిభూతాలే. ఎందుకంటే వాటికి ఉత్పత్తి వినాశనాలు ఉన్నాయి కదా శీతోష్ణాలు పుడతాయి, పోతాయి ఈ పుట్టి నశించేవి నాశిత భావం ఉన్నవన్నీ అదిభూతమే. దీన్ని బట్టి దృశ్య సముదాయమే అధిభూతం.

అయిదవ ప్రశ్న, అధిదైవం. పురుషుడే అధిదైవం. మనం మూడవ అధ్యాయంలో నిర్ధారించుకున్న ప్రకృతి పుట్టుకకు కారణమైన పురుషుడు. శరీరరూప పురంలో వశించువాడు, శరీరాన్ని పూరించి ఉన్నవాడు పురుషుడు మనలోని ద్రష్ట. దృశ్యం వైపు కాకుండా ద్రష్ట వైపుకు మన దృష్టి మరల్చాలని మూడవ అధ్యాయంలో చర్చించుకున్నాం. ఆ ద్రష్టే ఇక్కడ పురుషుడు. ఈ పురుషుడు అనే శబ్దాన్ని 15, 16 లో మరింత సమగ్రంగా దర్శిస్తాం. మనం జ్ఞాత అని 24 తత్వాలకు ప్రభువు అని కూడా సమగ్రంగా తెలుసుకున్నాం. దేహం నశించినా నశించనిది కూడా ఇతడే, ఇదే. ఈ ఆధి దైవానికి హిరణ్య గర్భహః అనే పేరు ఉంది. దేహంలోని ఇంద్రియ ప్రాణ మనో బుద్ధుల చలనానికి ఆధారమై దేహంలో పూరింపబడుతున్న పురుషుడే అధిదైవతం. సూక్ష్మ శరీరాన్ని నడిపేవాడు ఇతడే. అయితే ఇది వ్యష్టికి సంబంధించినది. మరి సమిష్టిగా మనం చూడాలంటే సమిష్టి లోని అధిదైవం హిరణ్య గర్భుడు. సూర్య మండల అంతర్వర్తి. హిరణ్యం అంటే బంగారం బంగారు మయమైన గర్భాన్ని ధరించి ఉన్నవాడు కాబట్టి హిరణ్య గర్భహః అన్నారు. హిరణ్యమయమైన అండము నందు జన్మించాడు కనుక హిరణ్య గర్భుడయినాడు.

సూర్యునిలో ఉండి సమస్త ప్రాణుల ఇంద్రియాది కరణాలను అనుగ్రహించే హిరణ్య గర్భుడే అధిదైవం అన్నారు శంకరులు. ప్రాణులలో ఇంద్రియ ప్రాణ మనో బుద్ధులనే సూక్ష్మ శరీరం కదలికకు, చరించుటకు కారణమైన పురుషుడే సమిష్టి దేహాలలోని సూక్ష్మదేహాలు చరించడానికి కారణమై ఆదిత్య మండలంలో హిరణ్యగర్భుడుగా ప్రకాశిస్తున్నాడు, అతడే అధిదైవం. సమిష్టిలో సూర్య మండలాన్ని తపింపజేస్తూ సూర్యునిలోనే ఉన్న హిరణ్యగర్భుడే వ్యష్టిగా దేహంలో ఉండి దేహాన్ని ప్రకాశింపజేస్తున్న పురుషుడు, ఇదే అధిదైవతం.

ఆరవ ప్రశ్న, అధియజ్ఞుడెవరు? దేహములోని అధియజ్ఞం అని జగద్గురువు సమాధానం. 4-32వ శ్లోకంలో చర్చించిన అంశాన్ని ఇక్కడ ఈ శబ్దానికి సమన్వయం చేసుకోవాలి. సమస్త యజ్ఞాలు కర్మ వల్లనే కదా పుట్టుచున్నాయి, నిష్కామంతో యజ్ఞ భావంతో చేసే దేహంలోనే నేను అధియజ్ఞుడై ఉన్నాను అంటున్నారు. అంతేగాని సకామ భావన ఉన్న దేహంలో నేను ఉండను అనే సూచన ఇక్కడ చాలా స్పష్టంగా ఉంది. అందుకే అధియజ్ఞుడై ఉన్నది నేనే అన్నారు. అంటే కోరికలు ఆశ అనే త్రాళ్ళు ఉన్న దేహంలో నేను అనే అధియజ్ఞుడు ఉండటానికి అవకాశం లేదు గాక లేదు. ఎందుకంటే వారిలో ఇప్పటికే ఆస్థానం కోరికలనే గజ దొంగలకు అపహృతమైపోయాయి, వారు ఆ స్థానాన్ని అపహరించారు అందుకే చాలా స్పష్టంగా దేహంలోని అధియజ్ఞుడను నేను అన్నారు. ఈ శరీర మండపంలోనే యజ్ఞవేదిక ఉంది, విరాగమనే కట్టెలతో ఇంద్రియాలు అనే అగ్నిని ప్రజ్వలితం చేసి ఆ అగ్నిలోనే విషయాలనే ద్రవ్యాలను ఆహుతి చేసి ఉండాలి. ఇవన్నీ కూడా ప్రధమ షట్కంలోనే జరిగిపోయింది. అలా జరిగిన దేహంలో మాత్రమే నేను భగవంతుడు అధియజ్ఞుడుగా ఉన్నాను అంటున్నాడు. జ్ఞాని దేహంలో ఉన్నది నేనే అని అర్థం చేసుకోవాలి, జ్ఞానాగ్నిలో సమస్తమూ సమర్పణ గావించినప్పుడే అజ్ఞానం సమస్త జ్ఞేయ వస్తువులో లీనమవుతుంది. జ్ఞేయం అంటే తెలుసుకోదగినది ఎవరిని అంటే దైవాన్ని, పరమాత్మని అప్పుడు జ్ఞేయ స్వరూపమునందే సమస్తంలో అవిశిష్టంగా అశేషంగా ఉంటుంది. ఈ జ్ఞేయాన్ని అధియజ్ఞం అంటారు. తెలుసుకోదగినది కదా ఎవరిని దైవాన్ని పరమాత్మను. తెలుసుకునేవాడు జ్ఞాతృ, తెలుసుకో దగిన విషయం జ్ఞేయం, తెలుసుకున్నది జ్ఞానం కదా. ఈ తేడాలు లేని మూడూ ఏకమైన స్థితి అధియజ్ఞపు స్థితి. తెలుసుకునేవాడు, తెలుసుకోదగిన విషయం, తెలుసుకున్నది కూడా పరమాత్మే దైవమే కదా. అలా మనం విజ్ఞాన సహితం గావించుకున్నప్పుడే అక్షర పరబ్రహ్మంలో మనం యోగం కాగలం. దేహం నశించాక కూడా సంకల్ప వికల్పాలు రెండూ లేని విశ్రాంత స్థితికి చేరుకునేది కూడా ఇతడే. ఈ పురుషుడు వాస్తవానికి వ్యష్టిగా పురుషుడు, సమిష్టిగా పరమాత్మ. కానీ సమిష్టి లోని పరమాత్మకు, వ్యష్టి లోని పురుషుడికి కొంత తేడా ఉంటుంది. వ్యష్టిలోని జ్ఞాత, ప్రత్యగాత్మ, పురుషుడు. ఇదే అహం అనే భావన తెలియడానికి ఇతర దేహేంద్రియాదుల కదలికకు కారణమై ఉంది. సాధారణ స్థాయి వారిలోని జీవుడు అనే వాడు ఇతడే. ఇతడే ఈ పంచభూతాత్మక శరీర పిండంలో గల అధిదైవతం. మరి జగద్గురువు ఏమో నన్నే శరీరంలో గల అధియజ్ఞంగా ఎరుంగుము అన్నారు. శరీరంలో ఉన్న అధిదైవం నేనే అంటున్నాడు. మరి ఈ జీవుడికి

జగద్గురువు చెప్తున్న అధిదైవానికి గల తేడాను మనం గమనిస్తే ఈ శ్లోకంలో జగద్గురువు మనకు ఉద్బోధిస్తున్న ఆంతర్యం గ్రాహ్యమవుతుంది. జీవుడే దేవుడని వేద వాక్కు, ఈ అంశాన్ని మనం గమనించాలి. ఉదాహరణకు మంచి బంగారాన్ని కొంత రాగితో కలిపేస్తే మంచి బంగారం కూడా కల్తీ బంగారం అవుతుంది కదా. అయినా ఆ మంచి బంగారం రాగితో కలిసిపోయినట్లు అనిపించినా, ఆ రాగిలో అది భాగం కాలేదు కదా. అయినప్పటికీ ఆ మంచి బంగారం కల్తీ బంగారంతో కలసి ఉన్నంతకాలం దాని కల్తీ బంగారం అనే చెప్తాం, అదేవిధంగా దాన్నుంచి కరగదీసి దాన్ని విడగొట్టినప్పుడే మంచి బంగారం అవుతుంది.

అదే పద్ధతిలో ప్రకృతి మాయకు లోనైన వారు జీవుడని వివేచనతో ఆత్మ విశ్లేషణతో తమను తాము గుర్తెరిగి ప్రకృతి మాయ తెరను తొలగించుకున్న వారు దేవుడని మనం 7-14,15 లో చూసాం. అలా అవిద్య, అజ్ఞానం తొలగిపోయి భేద బుద్ధి అనే చిక్కుముడి జీవుడికి విడిపోయినప్పుడు ఈ అధిభూతం మొదలుగా గల ఇలాంటి దృశ్యమయ పదార్థాలన్నీ, దృశ్యాలన్నీ కూడా నశించి పరబ్రహ్మాత్మతో కలిసి ఏకమైపోతుంది. అప్పుడు పరస్పర భేదాలు ఉండే అవకాశం లేదు. అలా అధిభూతపు అహంభావం నశించి పోయినప్పుడు పరబ్రహ్మం, మూలవిరాట్ పురుషుడు ఐక్య రూపంలో స్వస్థితిలో సుస్థిరమై నిలిచి ఉంటుంది. ఈ ఐక్యత, ఏకత ఎవరిలో ఉంటుందో తానే బ్రహ్మమని తెలిసిన వారెవరో ఏ జీవుడైతే దేవుడిగా తెలుసుకుంటాడో 6:32 లోని సర్వత్రా సమదర్శితులెవరో ఆ తెలుసుకున్న జ్ఞాని లోని జ్ఞాత, పురుషుడు, విరాట్ పురుషుడు అధియజ్ఞుడు. ఇది జగద్గురువు చెప్తున్న అధియజ్ఞం నేనే అయి ఉన్నాను అనడంలోని ఆంతర్యం. యజ్ఞాలన్నింటికీ అధిపతి అయిన విష్ణువు అనే పేరు గల దైవమే వ్యాపకమే అధియజ్ఞం. విష్ణువు అంటే వ్యాపకత్వం, అర్జునా! ఈ దేహంలోని యజ్ఞానికి అధిపతి అయిన విష్ణురూప అధియజ్ఞాన్ని నేనే. యజ్ఞం దేహంతోనే నిర్వర్తిస్తాం కదా, అందుకు యజ్ఞానికి దేహంతో నిత్యసంబంధం ఉంది ఉంటుంది. అతడు దేహంలోనే ఉండి దేహంతోనే యజ్ఞాన్ని నిర్వర్తిస్తాడు, అందుకే అధియజ్ఞుడు నేనే అన్నారు. మనం మూడవ అధ్యాయంలో యజ్ఞ ప్రకరణంలోని యజ్ఞాన్ని అక్కడ చర్చించిన సమస్త అంశాలకు సంబంధించి పూర్తి అవగాహన ఉంటేనే ఈ అధియజ్ఞం అనే శబ్దం మనకు విజ్ఞాన సహితమవుతుంది. భగవంతుడు దేహ అంతర్వర్తియై అతి సమీపంలో ఉన్నాడు. అందుకని ఆత్మ పరిశీలన, ఆత్మ పరిశోధన చేసుకొని ప్రథమ షట్కంలోని చర్చించిన పంచీకరణ విధానం స్థూల సూక్ష్మ భూతాంశాల వివరణను వివేచన చేసుకొని మనలోని పరాత్పరుడ్ని పరమాత్మను అధియజ్ఞంను దర్శించి పరమశాంతిని పొందుదాం. మనలోని భేద భావమనే దీనత్వాన్ని తొలగించుకొని సమస్త దేహంలోనూ అధియజ్ఞుడైన పరమాత్మను దర్శించి సర్వప్రాణులందును సమ భావం కలిగి ఉండి దైవంగా పరమాత్మగా పరబ్రహ్మంగా విరాజిల్లాలి. దేహదారులలో శ్రేష్టుడు అని మనల్ని మన సహ విద్యార్థి అర్జునుడ్ని సంబోధిస్తున్నాడు. దీన్ని బట్టి మానవుడు దేహాన్ని ధరించే వాడే గాని వాస్తవానికి దేహం కాదని మనకు ఈ సందర్భంగా స్పురించాలి. ఇంతటితో ఆరు ప్రశ్నలకు సమాధానం

సమాప్తం అయింది. ఇక అక్షర పరబ్రహ్మం నుండి అందుకోబోయే ఏడవ ప్రశ్నకు సమాధానం సందేశం కోసం ఎదురుచూద్దాం.

8అ, 5శ్లో.

అంతకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా కలేవరమ్ |

యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః | 15 |

అంత్యకాలమునందైనను నన్నే స్మరించుచు దేహత్యాగమును చేసినవాడు నన్నే (నాస్వరూపమునే) పొందును. ఇందేమాత్రముగూడ సందేహము లేదు.

అర్జునుడి చిట్టచివరి ప్రశ్న, మరణ కాలంలో మద్భావం ప్రాణప్రయాణ సమయంలోనూ నియమిత చిత్తులకు నీవు ఎలా తెలియబడుతున్నావు, నీవు ఎలా వారికి తెలుస్తున్నావు. మనసును సంయమించిన వారు ప్రాణప్రయాణ కాలంలోనూ నిన్నే ఎలా తెలుసుకొని ఉపాశిస్తారు అనేది మన ప్రశ్న కదా. ప్రయాణకాలం అంటే శరీరాన్ని విడిచే త్యజించే కాలం ప్రయాణ కాలే చ అన్నాడు మన సహవిద్యార్థి. అంత కాలే చ అన్నాడు మన జగద్గురువు చ అంటే కూడా అని అర్థం. మరణ కాలంలో కూడా అంటే మరణ భయంతో భవరోగ పీడనకు గురి అయినప్పుడు నిన్ను ఎలా స్మరిస్తారు, ఎలా తెలుసుకుంటారు అనేది ప్రశ్న అయితే అందుకు ఆంతర్యం మరణ కాలంలో కూడా నన్నే స్మరిస్తూ నన్నే దర్శిస్తూ దేహాన్ని విడిస్తేనే నన్నే నా భావాన్నే పొందడం జరుగుతుంది అని పరమాత్మ సమాధానం. ఈ సందర్భంగా శేషప్ప చెప్పినటువంటి నరసింహ శతకం ఖచ్చితంగా మనం ప్రస్తావించుకోవాలి. స్వామి నేను బతికి ఉన్నంతకాలం నీ నామ స్మరణ తప్పను గాని మరణ కాలమందు యమదూతలు ప్రాణములు లాగి వేయునప్పుడు కఫ వాతాధి రోగముల వల్ల బాధపడుతూ నోరారా నిన్ను స్మరించగలనో లేనో కనుక స్వామి ఈనాడే భక్తితో నీ భజన చేస్తున్నాను గుర్తించుకో. ఓ నరసింహా! పంచభూతాలతో కూడుకున్న ఈ శరీరము విడిచి పెట్టేది ఎప్పుడో నాకు తెలియదు. ఇది నూరేళ్లు ఉంటుంది అంటారు కానీ నమ్మలేము, బాల్య, యవ్వన, కౌమార, వార్ధక్యములు ఎప్పుడో ఒకప్పుడు వూరి యందో అడవి యందో నీటి మధ్యనో ఈ శరీరాన్ని ఏ క్షణంలోనైనా విడుచుట అనేది నిశ్చయము కనుక ఈ దేహం ఉన్న కాలంలోనే నిన్ను తెలుసుకోవాలి. సదా జీవితకాలం అంతా సమస్త దేహేంద్రియాలను అన్ని వైపుల నుంచి సంయమించి సదా నన్నే భజించేవారు బ్రహ్మ రూపులై తన లోపల బయట అంతటను సర్వత్రా సదా బ్రహ్మ రూపముందే నివసిస్తుంటారు. వారు బ్రహ్మానుభవాన్నే లోపలి ఆంతరంగిక ఇంట్లో దృఢ వ్రత చిత్తులై దృఢ నిశ్చయమనే గదిలో సుస్థిరంగా సుప్రతిష్ఠమై ఉంటారు. అలాంటివారికి బ్రహ్మ మినహా మరేమీ వారి స్మరణ యందు ఉండదు. ఈ రీతిగా లోపల బయటా ఆంతరంలో బాహ్యంలో

మద్రూపులు బ్రహ్మ రూపులు అయిన వారికి లోపలా బయటా గల పంచ మహా భూతాలచే స్మరితమయ్యే ఆవరణ తొలగిపోయి ఉంటుంది, అంటే శరీరం ఉన్నప్పుడే. ఈ శరీర ఆవరణ గురించి దుఃఖం అతనికి ఉండనప్పుడు అది ఆ శరీరం అనే పొర తొలగిపోయినప్పుడు మాత్రం ఎలా దుఃఖిస్తాడు. ఇలాంటి వారికి శరీరం ఉన్నప్పటికీ నశించిపోయినప్పటికీ అతని బ్రహ్మానుభవం అనే దృఢ నిశ్చయమైన ఇంటికి లేశమాత్రమైనా కొరత రాదు కొరవడదు. పాము కుబుసం విడిచినట్లు శరీరం వస్త్రాలను విడిచినట్లు నామరూపాత్మక శరీరం నశించిందని తెలియ వస్తుంది. అందులోని బ్రహ్మమనే సద్వస్తువు ఆ దేహాదులు లేకుండానే స్వస్వరూపంతో యధా ప్రకారంగా స్వతఃసిద్ధంగా స్వతంత్రంగా ఉంటుంది. కాబట్టి బ్రహ్మస్వరూపంతో సమరసత్వాన్ని పొంది స్వయంగా బ్రహ్మత్వాన్ని పొంది ఉన్న బుద్ధి ఎలా చిన్నా భిన్నమవుతుంది. ఈ విధంగా దేహవసాన ప్రాణప్రయాణ సమయంలోను నా యందే దృష్టి నిలిపి నన్ను తెలిసి శరీరాన్ని విడిచేవారు నా స్వరూపులే అవుతారు. అలా ఉండే స్థితిలో ఉన్న శరీరంలో ఉన్నవాడే ముందు శ్లోకంలో మనం నిర్ధారించి నిరూపించుకున్న ఆ అధియజ్ఞుడు నేనే. ఆ నేనే అయిన అధియజ్ఞుడు మరణ సమయంలోను పరమేశ్వరుడు వ్యాపకుడు అయిన నన్నే స్మరిస్తూ శరీరాన్ని విడిచి నన్నే పొందుతాడు. ఈ విషయంలో పొందుతాడో లేదో అనే సందేహం కూడా లేదు ఉండదు ఉండటానికి అవకాశం లేదు. అందుకు గల కారణం రహస్యం ఏమంటే శరీరంలో ఉన్నప్పుడే వారు శరీరాన్ని విడిచారు కాబట్టి శరీరస్పృహ లేని వారు కావడం వల్ల సంశయం లేదు. ముందే దేహభావాన్ని త్యజించి దైవ భావాన్ని పొంది ఉన్నారు కనుక. ఇక వీరు కొత్తగా శరీరం విడిచేటప్పుడు పొందేది ఏదీ ఉండదు. ఈ ఆంతర్యం విజ్ఞాన సహితంతో అక్షర పరబ్రహ్మంగా మనలో యోగం కావాలి. దీన్నిబట్టి మనం శరీరంలో ఉన్నప్పుడే అది మనల్ని విడవకముందే ఏది దేహంలో ఉన్న దేహి మనల్ని విడవకముందే మనం దేహంతో దేహంలో ఉన్నప్పుడే మనమే దాన్ని పరమాత్మ దర్శనంతో త్యజించాలి. ఈ అనంత విశ్వంలోని జీవయాత్రలో మన అధ్యాయం ఏ పాటిదో మన జీవితకాలం ఏమాత్రమో మనం నాలుగవ అధ్యాయంలో చూసాం. అలా అనేక జన్మలలో అలసి సొలసిపోతున్న జీవుడు మధ్య మధ్యలో తీసుకునే విరామమే మరణం. నిద్ర అనేది ఓ చిన్నపాటి మరణం అనుకుంటే ఓ దీర్ఘమైన నిద్ర మరణం. ఇంతకూ అంత్య కాలం ఏది? మనకు వాస్తవానికి ప్రతిక్షణం అంత్య కాలమే మన వ్యవహారాలతో సంబంధం లేకుండా కాలమనేది కొనసాగుతూ ఉంటుంది. అది ఏ ఒక్కరి కోసమో ఆగదు, మన వ్యవహారాలు వ్యామోహాలు, వినోదాలు విలాసాలు కాలంలోనే జరుగుతున్నాయి. నిద్రించినవారు మేల్కొని తిరిగి మళ్ళీ తన తరువాతి వ్యవహారాన్ని కొనసాగించినట్లు మరణించిన జీవి మృత్యువనే నిద్ర నుండి మేలుకొని తరువాతి బతుకును కొనసాగిస్తాడు. ఎక్కడైతే ఆగిపోయాడో ఏ కారణం చేత వీగిపోయాడో సరిగ్గా అక్కడ నుంచే అదే స్థాయి నుంచే మళ్లీ పూర్వపు జన్మ జన్మాంతర సంస్కారాలతో తన వ్యవహారం పునః ప్రారంభం అవుతుంది. ఇక మరణ కాలంలో జ్ఞాని అయినా అజ్ఞాని అయినా దేహాన్ని విడుస్తాడు కానీ అజ్ఞాని తిరిగి వేరొక దేహాన్ని ఆశ్రయిస్తాడు, పొందుతాడు. అయితే దేహాన్ని త్యజించిన జ్ఞాని తిరిగి దేహాన్ని పొందడు

నన్నే పొందుతాడు. కారణం వారికి బలమైనటువంటి మాయమయ తెర తొలగిపోయి అజ్ఞానం అనేది నిశ్శేషంగా క్షయమైపోయింది కాబట్టి. ఇక స్మరించడం అంటే తెలియడం తెలుసుకోవడం అని అర్థం చేసుకోవాలి. ఎందుకంటే స్మరిస్తే సరిపోతుంది కదా పరమాత్మ ప్రాప్తి కలుగుతుంది కదా అనేటటువంటి సందేహానికి తావీయకుండా మనకు అవగాహన కావాలి. జీవించి ఉన్నప్పుడే తాను బ్రహ్మం అనే ఎరుక కలిగిన జ్ఞాని మరణ కాలంలో కూడా అంతకాలే చ తాను బ్రహ్మమే అనే జ్ఞానమెరిగి ఉంటాడు. అలాంటివారు మరణ కాలంలో కొత్తగా పొందేది ఏమి ఉంటుంది ముందే బ్రహ్మమై బ్రహ్మస్వరూపమై వెలుగొందుతున్నారు కదా. అలా మనం స్మరన్ అనే శబ్దాన్ని విజ్ఞాన సహితం గావించుకొని అక్షర పరబ్రహ్మంలో యోగం అవ్వాలి. జ్ఞానం లేని వాడు మరణిస్తే స్థూలదేహాన్ని విడిచి పెట్టి సూక్ష్మదేహంతో పయనించి మరో దేహాన్ని ధరిస్తాడు. ఆ అజ్ఞాన అంధకారపు బలమైన మాయ మయ తెర తొలగి అజ్ఞానం సమస్త జ్ఞానంలో లీనమయ్యే వరకు సూక్ష్మ శరీరం అనేక స్థూల దేహాలతో సంయోగ వియోగాల్ని సాగిస్తూనే ఉంటుంది కానీ అది నశించదు. అందుకని సమస్త కర్మలు పూర్తిగా నిర్బీజం కావాలి అని ప్రథమ షట్కంలోనే మనం చెప్పుకున్నాం. కాబట్టి జ్ఞాని బ్రహ్మం తెలుసుకున్నవాడు తానే బ్రహ్మం అనే బ్రహ్మాత్మ జ్ఞానం కలవాడు అందుకని మరణ కాలంలోనూ స్థూల సూక్ష్మ దేహాలు నశిస్తాయి. మరణానంతరం జ్ఞాని ఎక్కడికి పయనించాలని అనుకుంటాడు, తాను లేని చోటు ఉంటే కదా పయనించడానికి. అందుకే జ్ఞాని పరమాత్మ కన్నా వేరుగా లేడు అనే జ్ఞానంతో ఉంటాడు కనుక జ్ఞాని నన్నే పరమాత్మ స్వరూపాన్నే పొందుతాడు అంటున్నారు. దేహం ఉన్నా ఊడినా జ్ఞానిలో మార్పు ఉండదు సచ్చిదానంద బ్రహ్మమై వెలుగొందుతూనే ఉంటుంది. జ్ఞానికి ప్రాణోత్క్రమణమే లేనందున అతడు పోవడం ఉండదు. ఏది వచ్చినా ఈ పంచీకరణం చెందిన పంచభూతాత్మక ప్రపంచంలోనే, ఏది పోయినా ఈ ప్రపంచంలోనే రాకపోకలు లేనిది వచ్చిపోనిది జ్ఞానమే ఈ విషయంలో సందేహం లేదు. అందుకే జ్ఞాని దేహాన్ని త్యజించి పరమాత్మ స్వరూపాన్నే నన్నే పొందుతాడనే విషయంలో సంశయానికి తావు లేదు. పొందుతాడో పొందడో అనే సందేహానికి తావు అవకాశం లేకుండా ఖచ్చితంగా పొందుతాడని మనకు నిర్ధారణ అవుతుంది. ఇది కేవలం చెప్పడమే కాదు బోధ మాత్రమే కాదు ఇదే వాస్తవం ఇదే నిశ్చయ జ్ఞానం అంటున్నాడు జగద్గురువు. వశిష్ఠ మహర్షి శ్రీరామచంద్రుడికి గావించిన హిత బోధలో, ఓ రామచంద్రా అజాగ్రత్తగా ఉంటే నీ చిత్తాన్ని కోరికలనే పాము కాటు వేస్తుంది మింగేస్తుంది జాగ్రత్తగా ఉన్న వాని చిత్తాన్ని ఆ పిశాచమేమి చేయగలదు అంటాడు. కాబట్టి నిత్య జాగురూకతతో తపస్సుతో దక్షతతో దీక్షతో జీవిత పర్యంతం సదా ధ్యాన యోగంలో దైవం పై పరమాత్మపై దృష్టి నిలిపి బ్రహ్మమైనప్పుడు అంత్యకాలమందు కూడా బ్రహ్మంనే పొందుతాం. ఇంతటితో 7-29, 30లో కలిగిన సందేహాలు మనం సంధించిన ఏడు ప్రశ్నలకు సమగ్రంగా సవివరంగా అనేక విశేషాలతో సమాధానాలు సమాప్తి అయింది. మరణ కాలంలో ఏ భావం ఉంటే దాన్నే పొందుతారు అనే విషయం జ్ఞానులకు సంబంధించి చూసాం. ఇక అన్యుల పరిస్థితి ఏంటో జ్ఞానులు కాని వారు మరణ

కాలంలో ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొంటారో తెలియజేసే సందేశాన్ని అక్షర పరబ్రహ్మంలో యోగమై అవలోకిద్దాం.

8అ, 6శ్లో.

యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కలేవరమ్ |

తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః | 6 |

కౌంతేయా! మనుష్యుడు అవసానదశయందు ఏఏ భావములను స్మరించుచు దేహత్యాగము చేయునో అతడు మఱుజన్మలో ఆయాస్వరూపములనే పొందును. ఏలనన, సర్వదా అతడు దానినే స్మరించుచుండెను.

మనిషి నిరంతరం దేన్ని గూర్చి చింతిస్తుంటాడో దాన్ని గురించిన సంస్కారమే అతని చిత్తంలో ఏర్పడుతుంది, నిర్మితమవుతుంది. కాబట్టి అంత్య కాలంలో చిత్తమందు ఏ సంస్కారం ఉంటుందో తదనుగుణమైన జన్మనే పొందుతారు. జీవితమంతా దేనిని దృఢంగా అభ్యసిస్తామో అదే మరణ కాలంలో స్ఫురించి మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది. గతంలోని మన భావాలతో మనం ఏర్పరచుకున్న సంస్కారాలే నేటి మన జీవితాన్ని ఇలా నిర్మించాయి. నేడు మనం చేసే ఆలోచన భావనే రేపటి మన రూపుగా నిలుస్తాయి. ఇది శాస్త్రీయతకు సంబంధించిన సశాస్త్రీయమైన విజ్ఞాన సహితమైన అంశం. మనం మన ఆలోచనలను భావాలను దృఢపరచుకొని దాన్ని పొందడానికి అవశ్యం శ్రమిస్తాం తత్ఫలితంగా ఆఫలాన్ని పొందుతాం. అదే విధంగానే మనం జీవిత పర్యంతము మరణ కాలంలోనూ కూడా ఏ భావంతో ఉంటామో దాన్నే పొందుతాం గానీ వేరేగా ఉన్న వేరైన దాన్ని పొందలేము, ఇది సృష్టి యొక్క నియతి విధి. పండ్ల లోని రసం చెట్టులోని సారం కన్నా వేరు కాదు కదా అలాగే ప్రాణ ప్రయాణ కాలంలో స్ఫురించే అంతిమ సంకల్పం మన జీవిత పర్యంతం సాగిన సంకల్ప కార్యాల సారభూతమే గాని జీవనసారం కన్నా వేరు కాదు కదా. అలా మరణం తరువాత ఏమవుతుంది మనం మరణించి ఎక్కడికి వెళ్తాం ఏమి చేస్తాం లాంటి సాధారణ స్థాయి లేదా మంద బుద్ధుల సందేహాలకు ఈ ఏడు ప్రశ్నలతో జగద్గురువు సమాధానాల సందేశాలతో సంపూర్ణ సంతృప్తి చెంది దైవ మార్గంలో ప్రయాణించే అవకాశం ఇదే దీన్నిబట్టి జీవితమంతా మన మతి ఉండే స్థితిని బట్టి మన గతి ఉంటుంది. మన గతిని నిర్ణయించేది మన జీవితకాల కార్యాచరణ విధానమేనని మనకు తెలియాలి. మనిషి మృత్యు సమయంలో తన మనస్సున దేనిని భావిస్తాడో అతడు అదే అవుతాడు. జీవించి ఉన్నప్పుడు జీవునికి పూర్తికాని వాంఛలు కూడా మరణ సమయంలో మరింత ఉధృతమై అదే భావంతో దేహాన్ని త్యజిస్తాడు. ఈ జీవుడు దేన్ని భావిస్తూ స్మరిస్తూ త్యజించాడో అదే గర్భయోనియందు ప్రవేశిస్తాడు. ఎలాంటి భావాన్ని కలిగి ఉంటారో అట్టి రూపాన్ని భావాన్ని పొందుతారు. అంత్యకాల సంస్కారం జీవిత నిరంతర ప్రయత్నం పై ఆధారపడి ఉంటుంది

గానీ మరొకటి కాదు సదా తద్భావభావితః కదా. భాగవతంలో జడభారతుని కథ ఈ అంశాన్ని మనకు మరింత విశదీకరించింది.

మనందరికీ తెలిసిన ఒక కథ మరణ కాలంలో భగవాన్ నామాన్ని పలికితే పుణ్యం వస్తుందని విన్న ఓ తెలివైన వ్యక్తి వ్యాపారి అందుకు ఏం చేయాలి అని ఆలోచిస్తాడు. నామస్మరణ చేస్తేనే గుర్తుకు వస్తుందని పెద్దల సలహాను అప్పటికే పొంది ఉంటాడు తన నలుగురు పిల్లలకు నారాయణ జనార్దన మాధవ ముకుందా అనే పేర్లు పెట్టుకుని తన పథకం ప్రకారం పిలుచుకో సాగాడు వృద్ధాప్యం వచ్చింది చాలా గట్టివాడైన వ్యాపారి కదా తనకు మృత్యువు సమీపించిందని కూడా గుర్తించాడు ఆ నలుగురు దగ్గరకు వచ్చి నిలబడ్డారు నలుగురు వచ్చేసారా మరి అంగడి? ఇది అతని పరిస్థితి. అతనికి అంత్య కాలంలో మిగిలింది అంగడిలో ఎవరున్నారనే ప్రశ్న. దైవ సంస్కారమనేది ఒక్క క్షణంలో ఏర్పడేది కాదు శైశవదశ నుంచే, వార్ధక్యం రాకముందే జీవుడు పరమార్థ సాధన యందు ఆరితేరి ఉత్తమ దైవ సంస్కారం ఏర్పరచుకోవాలి. బంధానికైనా మోక్షానికైనా తానే కర్త అని తెలియాలి. ఉత్తమ జన్మ అధమ జన్మ జన్మ సార్థకత అంతాకూడా మన చేతుల్లోనే ఉంది మన జీవితం మన చేతిలోనే మన ఆరోగ్యం మన చేతుల్లోనే మన మోక్షం మన ముక్తి మన చేతుల్లోనే జీవితమంతా మనం చేసిన ఆలోచనలు చివరి దశలోనూ అంత్యకాలములోనూ ప్రబలంగా మనలో ఉండిపోతాయని మనం అర్థం చేసుకున్నాం కాబట్టి జీవితమంతా మనం క్షణికాలైన దృశ్య వస్తువుల గూర్చిన ఆలోచనలు భాగాలతో కాలాన్ని వెళ్లబుచ్చక పరమాత్మ చింతనతో ఉంటే ఆ దైవిక సంస్కారమే మన మనసులో రూఢిపడి అంత్య కాలంలో కూడా పరమాత్మనే పొందుతామని అనుభవైకవేద్యం గావించుకొని అక్షర పరబ్రహ్మంతో యోగమవుదాం. మనిషి ప్రాణ ప్రయాణ సమయంలో ఏ ఏ భావములతో దేహాన్ని విడుస్తారో తరువాతి జన్మలో ఆయారూపాలనే పొందుతారు దీన్ని బట్టి దైవ భావన అనేది శరీరం విడిచేటప్పుడో విడిచాకో వచ్చేది కాదని గ్రహించి అది దేహంలో దేహి ఉన్నప్పుడే జరగాలని తెలుసుకొని పరమాత్మ భావంతో దేహభావాన్ని సంపూర్ణంగా త్యజిద్దాం. ఈ భావన అనేది శరీరం విడిచేటప్పుడో విడిచాకో వచ్చేది కాదని మనం సంపూర్ణంగా గ్రహించి దేహంలో దేహి ఉన్నప్పుడే జరగాలని ప్రత్యక్ష ప్రమాణంతో తెలుసుకొని పరమాత్మ భావంతో దేహ భావాన్ని సంపూర్ణంగా త్యజిద్దాం.

8అ, 7శ్లో.

తస్మాత్ సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్య చ |

మయ్యర్పితమనోబుద్ధిః మామేవైష్యస్యసంశయమ్ ||

కావున, ఓ అర్జునా! నీవు సర్వదా నన్నే స్మరించు చుండుము. యుద్ధమును (కర్తవ్యకర్మను) కూడ చేయుము. ఈవిధముగా నీ మనోబుద్ధులను నాయందే నిల్పియున్నచో నిజముగా (నిస్సందేహముగా) నన్నే పొందెదవు.

అంత్యకాలం అనేది ఎప్పుడైనా రావచ్చు అందువల్ల అన్నివేళలా నన్నే స్మరించు నీ స్వధర్మమైన నీ జన్మకు కారణమైన సశాస్త్రీయమైన కర్తవ్య కర్మాచరణ అయిన యుద్ధం కూడా చెయ్యి. ఇదంతా కూడా ఎలా చేయాలంటున్నాడు జగద్గురువు నామీద మనోబుద్ధులు అర్పించి నన్నే స్మరిస్తూ అకర్తగా కర్తవ్యాన్ని నిర్వహిస్తే నన్నే చేరుకుంటావు ఇందులో సందేహం లేదు. బ్రహ్మాత్మ జ్ఞానం కలవాడు జ్ఞాని కాబట్టి వీరికి జీవిత కాలంలోనే జీవించి ఉన్నప్పుడే తానే బ్రహ్మగా ఆత్మే పరబ్రహ్మంగా దృఢచిత్తులై ఉంటారు. ఆ కారణంగా అంత్యకాలంలో ప్రత్యేకంగా భావనాపేక్ష వీరికి ఉండదు. మరణం తరువాత ప్రయాణమూ ఉండదు. స్థూల దేహం స్థూలభూతాలలో సూక్ష్మదేహం సూక్ష్మభూతాలలోనూ విలీనమై తాను అఖండాత్మ పరబ్రహ్మ స్వరూపుడవుతాడు. జ్ఞానులు కాని వారు జీవితకాలంలో వారిలో గాఢంగా పెనవేసుకొని ఉన్న భావాలే అంత్య కాలంలోనూ కలిగి దేహాంతర ప్రాప్తిని పొందుతారు. పూర్వాభ్యాస జనిత వాసన మరణ కాలంలో స్మరణ హేతువు అవుతుందని గ్రహించాలి. కాబట్టి జీవితమంతా కూడా ఎలా ప్రవర్తించాలో ఎలా జీవితాన్ని దైవమయం చేసుకోవాలో ఎవరికి వారు అర్థం చేసుకొని ఆ దిశగా మనం పయనించాలి. ఇందులో సర్వేషు కాలేషు అని చెప్పడంలో సుఖం దుఃఖం ఏ కాలంలో అయినా ఏ పరిస్థితిలో అయినా సదా అన్న ఆంతర్యాన్ని గ్రహించాలి. స్మర అనకుండా అనుస్మర అన్నారు, ఈ అను అనే ఉపసర్గ క్షణమాత్రం కూడా ఆగకుండా దర్శిస్తున్నవారై తానే దైవమై ఉండాలని అర్థం. పరమేశ్వర జ్ఞానం అనేది మూఢభక్తికి సంబంధించింది కాదు, సశాస్త్రీయంగా ప్రమాణ పూర్వకంగా విశదపరచుకొని విస్పష్టంగా మనలో మనం సుస్థిర పరచుకోవాలి. అధ్యయనమైనా ఆచరణ అయినా అది దైవికంగానే సదా కొనసాగాలి అదే అనుస్మరణం. ప్రమాణ పూర్వకమైన ప్రత్యక్ష అనుభవాన్ని ఈ అనుస్మరణాన్ని బట్టే మరణం ఉంటుంది, మరణగతి స్మరణమతిని బట్టే ఉంటుంది. నేటి సమాజం భౌతికమైన వస్తువిలాసాలనే అశాశ్వత వైభోగాలనే స్మరిస్తోంది. అందుకే అలాంటి మరణాలను మనం నేడు చూస్తున్నాం. నూటికో కోటికో ఒక్కడే ఒక్కడు అని 7-3 లో చూసాం. అలాగే ఈ స్మరణ అనుభవం బ్రహ్మవిద్య అధ్యయన అవకాశం ఒక్క మానవునికే ఉంది. మరణ యోగ్యత అన్ని ప్రాణులకు ఉండొచ్చు కానీ యోగ్యమైన మరణం ఒక్క మనిషికే ఉందని తెలియాలి. ఎప్పుడూ దైవాన్నే స్మరిస్తూ ఉంటే మరి భౌతికమైన కార్యకలాపాలు పొట్టకూడు ఎలా జరగాలి అనే సందేహం సాధారణ స్థాయి మనుషులకు కలగడం సాధారణమైన విషయం. అందుకే ఈ శ్లోకంలో ఉన్న మరో అంశాన్ని మనం గమనించాలి 'యుధ్య చ' సదా స్వధర్మాచరణలో ఉండాలని అర్థం చేసుకోవాలి. స్వధర్మాచరణ గురించి మనం రెండవ అధ్యాయం ధర్మ ప్రకరణంలో చూసాం. ఆ దృష్టితో ఇక్కడ 'యుధ్య చ' అనే శబ్దాన్ని సమన్వయం చేసుకోవాలి. మనం స్థూలంగా చూస్తే సాధన రెండు విధాలు ఒకటి

ఆంతరంగిక సాధనాస్మరణ, రెండు బహిరంగ సాధన స్మరణ. మొదటిది కర్మాచరణే, రెండవది కర్మాచరణే రెండింటిలో ఏదైనా కావచ్చు ఈ రెండు విధాలైన కర్మలు కలిపితేనే మనం చెప్పుకున్న స్వధర్మాచరణ. ఈ సమస్త కర్తవ్య కర్మలలోనూ కూడా సదా దైవ స్మరణ అభ్యాసానికి అడ్డురాని కర్మాచరణను కొనసాగించే సాధనోపాయమే ఈ శ్లోకం. ఇదే మనం చెప్పుకున్న ప్రతి పని, పూజ ధ్యానం కావాలి అని. అలా ధర్మ రూపంలో ఉన్నది దైవమే కనుక ధర్మాచరణ వివేచనంతో ఉంటూ ద్వంద్వాతీతులై అకర్తగా అభోక్తగా ఉంటూ స్వధర్మాచరణలో అనుస్మరణతో కొనసాగడమే ఈ శ్లోకంలోని ఆంతర్యం. కరచరణాదులు బహిరంగంగా కర్మలలో కదులుతుంటే అంతరంగంగా అనుస్మరణ అజేయమానంగా అనుపమానంగా దివ్యంగా సాగాలి ఇదే ధర్మనిష్ఠ. కర్తవ్య కర్మను నిర్వర్తించాల్సిన సశాస్త్రీయమైన ప్రత్యక్ష ప్రమాణ పద్ధతి ఇదే. అందుకని ఇక్కడ సదా మనం నిర్వహించే స్వధర్మాచరణ కర్తవ్య కర్మలు అని ఖచ్చితంగా గ్రహించి అవగాహన చేసుకోవాలి. ఇది మనకు 7 అధ్యయాల సంపూర్ణ అవగాహన అనుభవ జ్ఞానంతోనే సాధ్యం. మరో మార్గం లేదు. భాగవతం 11వ స్కంధంలో భగవంతుడు తన శరీరాన్ని విడిచే సందర్భంలో ఉద్ధవుడికి బోధించిన అంశం ఇదే. ఉద్ధవా! విషయాల్ని చింతించే చిత్తానికి విషయాలే విషయవుతాయి, నన్నే అనుస్మరించే చిత్తానికి నేనే విషయమవుతాను. నన్నే అనుస్మరించే ఆ చిత్తం నాయందే ఉంటుంది అదే నేనవుతాను. అందుకే మనం జీవిత పర్యంతం నన్నే పరమాత్మనే పరబ్రహ్మన్నే స్మరిస్తూ ఉండాలి అంటే తెలుస్తూ ఉండాలి. కళ్ళతో చూసేది వీనులతో వినేది మనసుతో చింతించేది వాక్కుతో పలికేది అంతా లోపల వెలుపల సర్వత్రా మద్రూపుడై ఉండి చూడాలి, వినాలి, చింతించాలి, మాట్లాడాలి. అలాంటి స్థితిలో సదా సర్వత్రా నేనే సహజంగా సిద్ధిస్తాను. నాయనా నీవు ఈ భావంతో ఉంటే మృత్యుభయం ఏమాత్రం ఉండక అమరత్వాన్ని సిద్ధింప చేసుకుంటావు. ఎప్పుడో అంత్యకాలంలో మాత్రమే దైవచింతన చేయాలనుకునే అజ్ఞానులు అకృత్స్నవిధులు మందబుద్ధుల కోసం చెప్పిన ప్రత్యేక శ్లోకం ఇది. జీవితమంతా భౌతిక విషయ చింతనలలో గడిపి వార్ధక్యంలో దైవ ధ్యానం చేయాలని వేచి ఉండే వారిని ఇక్కడ అప్రమత్తం గావిస్తున్నారని గ్రహించాలి. ఇందులో మనం గ్రహించాల్సిన అంశాలు దైవాన్ని ఎంతసేపు స్మరించాలి అంటే నిరంతరం, మన దైవస్మరణలో ఉంటే మనం మన జీవితాన్ని ఎలా నిర్వహించుకోవాలి అని ఆలోచించినప్పుడు ప్రతి మనిషి వారి వారి వృత్తులను కార్యాలను స్వధర్మాన్ని దైవిక దృష్టితో పూజ్య భావంతో దైవంతో అనుసంధానమై తమ తమ కర్తవ్య కర్మలను ఆచరించాలి. అలాగే తమ తమ మనోబుద్ధులను సదా దైవానికి సమర్పించి తమ తమ కార్యాచరణలో నిమగ్నం కావాలి.

8అ, 8శ్లో.

అభ్యాసయోగయుక్తేన చేతసా నాన్యగామినా ।

పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచింతయన్ ।।

మనస్సును ఎటూ పోనీయక (వేరే ధ్యాస ఏ మాత్రమూ లేకుండ) నిరంతరము పరమేశ్వరుని ధ్యానరూపయోగమునే సాధనచేయు మనుష్యుడు దివ్యపురుషుడైన పరమాత్మనే చేరును.

చిత్త సమర్పణకు ఉన్న ఏక విషయమైన నన్ను మరో తలపు కూడా మధ్యలో అడ్డురానీయకుండా మళ్లీ మళ్లీ తలుస్తూ ఉండడమే అభ్యాసం దీన్నే ధారణ అంటాం. అందుకే శంకరుడు ఈ అధ్యాయాన్ని ధారణ యోగం అన్నారు. యోగి చిత్తం ఈ దైవధారణలో లగ్నమై ఉంటుంది ఇతర విషయాల వైపు వెళ్ళని అలాంటి చిత్తంలో సాక్షాత్తు దైవమే ఉండి ప్రత్యక్ష ప్రమాణమైన సశాస్త్రీయమైన పద్ధతిలో దైవిక జ్ఞానాన్ని అనుభూతింపజేయడం వల్ల తానే దైవంగా విజ్ఞాన సహితమై అక్షర పరబ్రహ్మంలో యోగమవుతుంది. మనకున్న కళ్ళు నోరు మొదలైన జ్ఞానేంద్రియాల్ని ఎటుపడితే అటు వెళ్ళనివ్వకూడదు అవి ఉండదగిన చోటు అవి చేయ్యాల్సిన కార్యం దైవసాధనే, దైవ కార్యమే వాటికి యోగ్యమైన చోటు అదే. ఈ అంశాన్ని అక్షర పరబ్రహ్మయోగం మనకు ఉద్బోధిస్తుంది. అభ్యాసం అనేది ఓ ప్రత్యేకమైన యోగం కాదు కానీ ఏ యోగమైనా అభ్యాసం లేకపోతే పట్టువడదు కదా, అందుకే అభ్యాసం యోగం కాని యోగమై జగద్గురువు నోట అన్ని యోగాల కంటే విలక్షణమైన మహాయోగంగా భాసిస్తోంది. సర్వలోకాల్లోనూ 'తస్మాత్ సర్వేషు కాలేషు' దైవాన్నే అనుస్మరిస్తూ తన కర్తవ్యాన్ని ధర్మనిష్ఠతో ఆచరించే యోగి తన మనో బుద్ధులను కూడా భగవంతునికే సమర్పించి ఉన్నందున అతని సంకల్పాలన్నీ కూడా పరమేశ్వరుని వైపే సాగుతూ ఉంటాయి. అలా అభ్యాస యోగమనేది ఓ దివ్యమైన ప్రవాహంలా కొనసాగాలి. ఈ ప్రవాహాన్ని ఏ విధమైన భౌతిక అవరోధాలు అడ్డుకోలేవు గాక లేవు. ఎంతటి వివేక బుద్ధితో క్లిష్ట పరిస్థితులు సంభవించినా కూడా అనిత్యాలను ఆశాశ్వతాలను విశ్లేషించుకుని లక్ష్యాన్ని పదే పదే మననం చేసుకుంటూ ధారణ చేస్తూ దైవాభ్యాసాన్ని సదా కొనసాగించాలి. భగవద్గీత శాస్త్ర విధిని అనుసరిస్తూ గీతాచార్యుని అనుస్మరిస్తూ ఈశ్వరుడే లక్ష్యంగా అఖండ ధ్యానంలో దైవధారణలో లగ్నం కావాలి. న అన్యగామి అంటే అన్ని విషయాల వైపు చిత్తం గమించకుండా వెళ్లకుండా చూడటం. అలా అన్యం కాని చిత్తంతో పరమేశ్వరుడినే ధ్యానించి అక్షర పరబ్రహ్మ భగవంతుణ్ణి పొందాలి. ఇందులో జగద్గురువు అభ్యాసానికి ఓ ప్రత్యేక హోదా నిచ్చి గౌరవించడం, స్మరించడం, ధ్యానించడం మనకు కనిపిస్తుంది. ఆధ్యాత్మిక పథంలో అభ్యాసం ఉన్నత స్థానాన్ని సంతరించుకుంది. భౌతికమైన విద్యలు కూడా అభ్యాసం వల్లనే పట్టువడుతుంది, అలాంటిది బ్రహ్మ విద్య అక్షర పరబ్రహ్మం తెలియాలంటే అందులో యోగం కావాలంటే అభ్యాసం ఏ స్థాయిలో మనలో జరగాలో ఎవరికి వారే నిర్ణయించుకోవాలి. ఏ యోగమైనా ఏ

కార్యమైనా అభ్యాస యోగంతో మిళితమైనప్పుడే సత్ఫలితాలను ఇవ్వగలదు. కారణం అభ్యాస యోగం మాత్రమే చిత్తాన్ని నిర్మలమైనదిగా సమర్థమైనదిగా చేయగలదు. అభ్యాస ప్రక్రియను కూడా ఓ యోగంగా పేర్కొనడం ఇందులో విశేషం. మనం యోగయుక్తుని గురించి ఆరవ అధ్యాయంలో చూసాం, ఇందులో అభ్యాస యోగయుక్తుని పరిశీలించి ఆదిశగా మనం అభ్యసించాలి. అభ్యాసయోగం వల్ల మనం మన మనసును అక్షర పరబ్రహ్మ మార్గంలో యోగమయ్యేట్లు చేయాలి. అప్పుడు మనిషిని అనేక రకాలుగా దారి తప్పించి అనేక అవస్థలలోనికి తీసుకెళ్లే మనసు ఆత్మతో రమిస్తుంది. తద్వారా శరీర భావన జీవభావన తొలగిపోయి దైవ భావం, బ్రహ్మ భావం పెంపొందుతుంది. నదీ ప్రవాహంతో పాటుగా ప్రవహిస్తూ వెళ్లి సముద్రంలో కలిసిపోయిన నీరు తన వెనుక ఏమి జరుగుతుందో అని చూడటానికి తిరిగి రాదు కదా, అది సముద్రంతో పాటు ఏక రూపాన్ని పొంది దాని యందే ఐక్యమైపోతుంది. ఇదేవిధంగా అభ్యాస యోగం వల్ల చిత్తం చైతన్యమై అక్షర పరబ్రహ్మంలో యోగమవుతుందని గ్రహించాలి. ఇందులో మనం గ్రహించాల్సిన అంశాలు సర్వోత్తముడిని పొందాలంటే చిత్తాన్ని దృశ్య విషయాలపైకి పోనీయక సదా పరమాత్మనే ధ్యానించాలి, చింతించాలి. ఈ అభ్యాసం వల్లనే మోక్షమార్గం సుగమం, సులభతరం అవుతుంది. భగవంతుని పొందాలనే వారి చిత్తం సదా ధ్యేయమైన పరమాత్మ యందే తప్ప అన్యంవైపుకు మరల కూడదు.

8అ, 9శ్లో.

కవిం పురాణమనుశాసితారమ్ అణోరణీయాంసమనుస్మరేద్యః।

సర్వస్య ధాతారమచింత్యరూపమ్ ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్ | 9 |

అర్జునా! ఆ పరమ పురుషుడు కవి, పురాతనుడు, సర్వలోక నియామకుడు, అనుశాసనం చేసేవాడు, అణువు కంటే సూక్ష్మాతి సూక్ష్మమైన వాడు, అందరికీ విధాత, అచింత్యరూపుడు, ఆదిత్య వర్ణుడు, తమస్సుకు, చీకటికి, అజ్ఞానానికి ఆవల వాడు అయినటువంటి ఆ పురుషుడ్ని స్మరించేవారు అతనిని పొందుతారు.

ఈ శ్లోకంలో పరమ పురుషుని లక్షణాల్ని చాలా సరదాగా సహజంగా వర్ణించాడు. కవి అంటే క్రాంత దర్శి సర్వ జగత్తును శాసించేవాడు, అణువు కంటే సూక్ష్మాతి సూక్ష్మమై ఉండి అందరికీ విధాతగా ఉంటూ అందరి కర్మ ఫలాలనన్నింటిని ఎవరికి ఎంత ఏమి ఎలా చెందుతాయో తగిన విధంగా ఆయా పద్ధతిలో ఆయా రూపాల్లో ఆ విధంగానే విభజించి పంచేవాడు అచింత్యరూపుడు. అతని రూపం సదా ఉన్నదే అయినా ఎవరికీ చింతింపరానిది ఊహింపరానిది. సూర్యుని కాంతి వలె నిత్య చైతన్య ప్రకాశం కలవాడు అజ్ఞాన లక్షణాలనే మోహాందకారానికి ఆవలివాడు సత్య స్వరూపుడు అయినటువంటి పరమేశ్వరుని అర్థం చేసుకోవాల్సిన విధానం అతని దివ్యమైన లక్షణాలు ఈ శ్లోకంలో

ప్రస్ఫుటంగా మనకు అక్షర పరబ్రహ్మం సాక్షిగా అక్షరీక్షించారు. ఇందులో పేర్కొన్న అంశాలు, ఒకటి మనకు కవి అనగానే కవిత్వమో కథో, పద్యాలో, పాటలో అల్లేవారు రాసేవారు చెప్పేవారు అని సహజంగా అనుకుంటాం. కానీ అసలు సిసలైన కవి, కవికి కవి, కవులందరికీ అలాంటి సర్వజ్ఞుడైన పరమాత్మ అయిన పరమ కవిని ఎరుగడమే దర్శించగలగడమే కవిత్వం. కవుల భావ చలనానికి కవిత్వం కవులలో కదలడానికి ఆధారమైన చైతన్యం మహాకవి కవులకు కవి భగవంతుడు. అందుకే జగద్గురువు ఆ పరమ పురుషుని కవీశ్వరుడు అని సంభోదిస్తున్నాడు. క్రాంత దర్శి అంటే త్రికాలజ్ఞుడు కాలాతీతుడు కాలాన్ని శాసించి నడిపించేవాడు, కాలాలకు సంబంధించిన పూర్ణజ్ఞానం కలవాడు. క్రాంతం అంటే అతీతం, క్రాంత దర్శి అంటే అన్నింటికి అతీతమైన దృష్టి కలవాడు, దృష్టికి ఆధారమైన ద్రష్ఠ. పరమేశ్వరుని వంటి కవీశ్వరుడ్ని మరొకరిని చూడలేం, ఊహించలేం.

పరమేశ్వరుని వంటి సర్వదృష్ట మరొకరు లేరు అని అర్థం. కాబట్టి ఊహించే మనసుకు కవిత్రీకరించే కవులకు ఆధారమైన కవీశ్వరుడు ద్రష్ట పరమ కవి కవులందరిలో మెదిలే మహాకవి సర్వజ్ఞుడు పరమాత్మ.

రెండు పురాణుడు, పురాణపురుషుడు పురాణుడు సనాతనుడు అనాది స్వరూపుడు ప్రపంచంలో గల సమస్త దృశ్య పదార్థాలకు ఆది ఉంది కానీ పరమాత్మకు ఆది లేదు ఉండదు, ఉంటే అంతమవుతుంది కాబట్టి దృశ్య వస్తువులు నస్వరం, పరమాత్మ శాశ్వతుడు. పురాణం చిరంతనం పురాతనం, పురాతనుడు సదా ఉండేవాడు సదాపూర్వం నుంచి అనాది నుంచి ఉన్నదే కాబట్టి నిత్య నూతనంగా భాసించేది పురాణం.

మూడవది అనుశాసితారమ్, సర్వజీవుల్ని సర్వలోకాలను శాసించేవాడు, నియామకుడు, ప్రభువు ఆయారాజ్యాల్ని పాలించే భౌతికమైన రాజుల్ని పాలకుల్ని ప్రజలు భౌతిక దృష్టితో అవసరాల కోసం కొని ఆడటం మనం చూస్తూనే ఉన్నాం. అయితే ఈ బ్రహ్మాండమంతా నియమిస్తున్నటువంటి నియామకుడైన పరమేశ్వరుడిని సర్వోన్నతుడ్ని ఎంత భక్తిశ్రద్ధలతో కొలవాలో కొనియాడాలో మనం అర్థం చేసుకోవాలి. సమస్త విశ్వాన్ని శాసించే అనుశాసనుడు విశ్వానికి ఓ నియతిని ఏర్పరచి సృష్టిని ఆ నియతి ప్రకారము నడుపుతున్న నియామకుడు. విశ్వంలోని శాంతిభద్రతలు అతని మీద ఆధారపడి ఉంటాయి, అతనే ధర్మ స్వరూపుడు. విశ్వం అనేది ధర్మంపైనే ఆధారపడి కొనసాగుతూ ఉంది. ఆ ధర్మ రూపంలో ఉన్నది దైవమే. విశ్వపు బాహ్య అంతరాలలో ఉండి అటు విశ్వాన్ని ఇటు వ్యక్తిని శాసిస్తున్న అనుశాశితారుడు. విశ్వంలో వాయువును శాసిస్తున్న విశ్వాత్ముడే పరమాత్మే వ్యక్తిలో ప్రాణాన్ని శాసిస్తున్నాడు. భగవంతునికి భయపడి గాలి ప్రపంచంలో వీస్తూ ఉంది అని చెప్తుంది తైత్రీయోపనిషత్. అలాగే పరమేశ్వరుడి ఆజ్ఞానుసారమే సూర్యుడు ఉదయిస్తున్నాడు, అటు బాహ్యంలో వేడికి వెలుగుకు ఇటు వ్యక్తిలోని వేడికి వెలుగుకు కూడా కారణమవుతున్నది పరమాత్మే. సృష్టి యొక్క సర్వ ధర్మాలు కూడా పరమాత్మ ఆధీనంలోనే ఉన్నాయి. అందుకే అనంత శక్తిమంతుడు అనుశాసితారుడు.

నాలుగు, అణోరణీయాంసం, సూక్ష్మాతి సూక్ష్మరూపి అన్నిటికంటే సూక్ష్మమైనది పరమాణువు. దానికంటే సూక్ష్మమైన వాడని కీర్తింపబడ్డాడు పరమ పురుషుడు. అణువణువులో సూక్ష్మ రూపంలో వ్యాపించి ఉన్నది అతనే. ఎందుకంటే సూక్ష్మమైన వాడు మహత్తు కంటే మహత్తరమైన వాడు అని ఉపనిషత్తులు ఉద్ఘోదిస్తూనే ఉన్నాయి, ఇదే అణోరణీయాంశం. ఐదు, 'సర్వస్య ధాతారం' సర్వాధారుడు, సమస్త భూతాలకు ఆధారమైన సర్వాధారుడు. సమస్తాన్ని ధరించే పోషించే సంరక్షించే సర్వవ్యాపి. దృశ్య పదార్థాలన్నీ కూడా జడమే, చైతన్యం యొక్క ఆధారం లేనిదే అవి నిలువ జాలవు ఆ చైతన్య ఆధారమే పరమాత్మ.. అందుకే సర్వస్యధాతారం.

ఆరు, 'అచింత్యరూపమ్' ఇంద్రియ మనస్సులకు అతీతుడు కాబట్టి మనసు చింతించడానికి అలవి కానివాడు, అయితే పరిశుద్ధ మనసుతో నిత్య ధ్యానంతో సముద్రంలో లయమయ్యే నది లాగా ఆ పరమాత్మతో లయమై వెలుగొందవచ్చు. మలిన చిత్తులకు పరమాత్మ దర్శనం వీలు కాదు, పరిశుద్ధ చిత్తులకే అనుభూతం. ఒకానొక దృశ్య వస్తువును చూసి ఇది ఈ రూపం, ఇది యిది అని తెలుసుకున్నట్లు కాకుండా తత్ స్వరూపంలో

లయమై తదాకారమై వర్తించడం ద్వారా ఆ అనుభూతిని పొందవచ్చు. ఇదమిథమని ఆలోచనకు పరిధికి సంబంధించిన రూపానికి ఇది సరిపోదు, అందుకు వీలు లేని వారు మరెలా పరమాత్మను పొందాలి అనే సందేహానికి తావు లేకుండా బుద్ధి గ్రాహ్యం అతీంద్రియం అని ఆరవ అధ్యాయంలోనే చూసాం. కాబట్టి అనుస్మరణ ద్వారా మనం దైవదర్శనం పొంది తానే దైవంగా బుద్ధి గ్రాహ్యంతో వెలుగొందవచ్చు.

ఏడు "ఆదిత్య రూపుడు' ప్రకాశ స్వరూపుడని అర్థం. సూర్యుడు సైతం ప్రకాశించేటట్లు చేస్తున్న జ్ఞాన సూర్యుడు పరమాత్మ. సూర్యుడు తనకు తానుగా ప్రకాశిస్తుంటే తన వెలుగులో సమస్తమూ ప్రకాశిస్తున్నట్లు పరమేశ్వరుని ప్రకాశంతో విశ్వమంతా ప్రకాశిస్తోందని గ్రహించాలి.

ఎనిమిది, తమసః పరస్తాత్ అంటే ఆవల ఉన్నవాడు. చీకటికి అంటే అజ్ఞానానికి మాయకు ఆవల ఉన్నవాడు. చీకటిలో ఏదీ కనిపించదు. కారణం వెలుగు లేకపోవడం అయితే వెలుగు బాహ్యంలో లేదు అంతే, మనలో ఉంది. అందుకే బాహ్యంలో వెలుగు లేకపోతే చీకటిగా ఉందని మనకు తెలుస్తుంది. అలా బాహ్యంలోని చీకటిని గుర్తించి చీకటిగా ఉంది అని మనకు తెలియడానికి మనం గ్రహించడానికి కారణం కూడా మనలోని వెలుగేనని మనం గ్రహించాలి, అదే ఆత్మ చైతన్యం. ఆత్మే బ్రహ్మం కాబట్టి అజ్ఞానాంధకారానికి అతీతంగా చైతన్య జ్యోతి మనలో దివ్యంగా ప్రకాశిస్తోంది, అది స్వప్రకాశం. ఇలా పురాణపురుషుడైన కవి నుండి ఆదిత్య స్వరూపుడైన పరబ్రహ్మం వరకు జగద్గురువు పరమాత్మను వర్ణించిన తీరు అత్యద్భుతం.

ఇలా ఇన్ని లక్షణాలతో విలక్షణంగా శోభిస్తున్న పరమేశ్వరుడ్ని సదా స్మరించేవారు బ్రహ్మన్నే పొందుతారు.

8అ, 10శ్లో.

ప్రయాణకాలే మనసాచలేన భక్త్యా యుక్తో యోగబలేన చైవ ।

భ్రువోర్మధ్యే ప్రాణమావేశ్య సమ్యక్ స తం పరం పురుషముపైతిదివ్యమ్ ।10|

అట్టి పరమభక్తుడు అంత్యకాలమునందు యోగబలము చేత భ్రుకుటీ మధ్యమున ప్రాణములను స్థిరముగానిల్పి, నిశ్చలమైనమనస్సుతో స్మరించుచు దివ్యస్వరూపుడును, పరమపురుషుడును ఐన పరమాత్మనే చేరును.

ఇన్ని లక్షణాలున్న పరమాత్మను వివరించిన తరువాత అలాంటి పరమాత్మను ప్రయాణ కాలంలో అనుసరించాల్సిన సాధన మార్గాన్ని ఇక్కడ స్పష్టంగా పేర్కొన్నారు. నిజానికి మరణం అంటే మార్పు అని అర్థం, ఈ మార్పు అనేది నిరంతరం మనలోనూ మన దేహం బయటనూ నిరంతరం జరిగే ప్రక్రియ, మార్పులేని క్షణం ఉండటం సాధ్యం కాదు. నిరంతరం మార్పు జరుగుతూనే ఉన్నా ఆ జరిగే మార్పు మనకు తెలియకుండానే జరిగిపోతూనే ఉంది. మనలో జరిగే ఈ మార్పును మనమే గుర్తించక పోవడానికి కారణమూ లేకపోలేదు, సదా మార్పు చెందనిది కూడా మనకు అర్థం కాకుండా మనలో ఉండటమే. ఇక మనలోని జీవించాలనే ఆశ కలగడానికి మరణ భయానికి కూడా కారణం లేకపోలేదు. అవినాశి అయిన జీవస్వరూపం నశించే పాంచభౌతిక దేహంతో తాదాత్మ్యం చెందడమే, మరణానికి సంబంధించిన జ్ఞానం మనకు లేకపోవడమే. కాబట్టి మరణం అనేది ఒక ప్రక్రియ ఇక్కడ జరిగేది మార్పు మాత్రమే కానీ మరొకటి కాదని తెలియాలి. ఇది ప్రయాణ కాలే ఈ సమయంలో అచలేన మనసా చిత్తనైశ్చల్యంతో ఉన్న యోగి జ్ఞాని యొక్క మనసు నిశ్చలంగా గాలిలేని చోట దీపం లాగా చలనరహితంగా ఉంటుంది. మనసు చలిస్తే యోగం పట్టు తప్పుతుంది కదా అందుకే జ్ఞానికి యోగికి అచంచలమైన మనస్సు అకుంఠమైన భక్తి ఉండి తీరాలి. అందుకే పరమేశ్వరుని కన్నా అన్యమైనవన్నీ అనిత్యాలని వివేచనతో గీతా శాస్త్రం ఆధారంతో విశ్లేషించుకుని పొందదగినవాడు పరమేశ్వరుడు ఒక్కటే అని నిర్ణయించుకొని ఆ దిశగా దృఢనిశ్చయంతో దైవసాధనతో కొనసాగాలి. అప్పుడే దేహాన్ని విడిచే సమయంలోనూ అదే యోగ బలంతో నిశ్చల స్థితిలో నిలువ గలరు. ఎలా అంటే ధ్యానయోగ బలంతో స్థిరత్వం పొందిన యోగి ప్రాణశక్తిని గమనిస్తూ దృష్టిని దృష్టిని భ్రూమధ్యంలో నిలుపుతాడు, అంటే విషయాంతర వృత్తి నిరోధం చేత చిత్తాన్ని అంతర్ముఖం చేసి పరమేశ్వరుని యందే స్థిరంగా నిలిపి ఉంటారు. ఆ ధారణను సదా మనం కొనసాగించినప్పుడే ఇది సాధ్యం. ఆ విషయాన్ని ఈ అధ్యాయం స్పష్టంగా వివరిస్తోంది నేర్పుతోంది అందుకే ఇది ధారణా యోగం. ధారణకు భ్రూమధ్యం నాసికాగ్రం అనేది చాలా అనువైన ప్రదేశం. ఇందులో ఆంతర్యం లేకపోలేదు అలా చేయడం వల్ల అక్కడ జరిగేదేమంటే హృదయం నుండి బహిర్గతమయ్యే ఇడ పింగళ నాడులు ------ హృదయం నుండి ఊర్ధ్వంగా పయనించే సుషుమ్న నాడి ద్వారా హృదయంలోని ప్రాణాన్ని కంఠం వద్దకు చేర్చుతుంది. ఆ ప్రాణం అక్కడ వేలాడుతున్న చిరునాలుక ద్వారా

భ్రూమధ్యం చేరి కనుబొమ్మల మధ్య సంయక్ స్థిరంగా ఉండి ఆ తరువాత ఊర్ధ్వంగా పయనించి సహస్రారం ద్వారా బ్రహ్మరంధ్రం ద్వారా నిష్క్రమిస్తుంది. అలాంటి యోగి, జ్ఞాని దివ్యమైన పరమ పురుషుడ్ని పొందుతాడు.

భీష్ముడు తన ప్రాణ సంచారాన్ని నిరోధించి మరణాన్ని తన అదుపులో ఉంచుకున్నాడు, కృష్ణా ! ఈ కళేవరాన్ని అంటే ఈ శరీరాన్ని త్యజించడానికి నాకు ఆజ్ఞనివ్వు నీ ఆజ్ఞతో ఈ దేహాన్ని త్యజించి పరమగతిని పొందుతాను అన్నాడు. అదే విధంగానే స్వచ్ఛందంగా ప్రాణాన్ని విడిచిపెట్టాడు. ఇది ఉత్తమ యోగులకే వీలవుతుంది, ఇది యోగ బలం చేతనే వీలవుతుంది. స్వచ్ఛంద మరణం అంటే ఆ జరుగుతున్న మార్పును చలనం లేకుండా స్వఇచ్ఛతో చూస్తున్న వారై మరణ విద్యను సైతం జీవిత పర్యంతం ఎరిగిన వారై ఉండాలి. అందుకు జగద్గురువు బోధను అనుసరించి సశాస్త్రీయ పద్ధతిలో నిశ్చల మనసుతో శ్రద్ధా భక్తులతో ధ్యాన యోగంలో ప్రాణవాయువుతో ఏకమై పరమాత్మను దర్శించి ఈ బ్రహ్మ జ్ఞానాన్ని గ్రహించాలి. మందు శ్లోకంలో పేర్కొన్న లక్షణాలున్న పరమాత్మను అనుసరిస్తూ అక్షర పరబ్రహ్మంతోనే యోగమవుతాడని ఆ భావాన్ని ఈ శ్లోకంతో సమన్వయం చేసుకోవాలి.

8అ, 11శ్లో.

యదక్షరం వేదవిదో వదంతి విశంతి యద్యతయో వీతరాగాః |

యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి తత్తే పదం సంగ్రహేణ ప్రవక్ష్యే ||

వేదవిదులైన విద్వాంసులు ఆ సచ్చిదానందఘన పరమాత్మను శాశ్వతుడు (అక్షరుడు) అని ప్రస్తుతింతురు - ఆసక్తిరహితులై యత్నశీలురైన సన్న్యాసులు ఆ పరమపదమునందే ప్రవేశింతురు. ఆ పరమపదమును కోరియే బ్రహ్మచారులు బ్రహ్మచర్య వ్రతమును ఆచరింతురు. అట్టి పరమపదమునుగూర్చి సంక్షిప్తముగా నేను నీకు వివరింతును.

వేదవిదులు అక్షరమని దేనిని అంటారో విరాగులు, యతులు దేనికోసం ప్రయత్నిస్తున్నారో జనులు దేనిని కోరుకొని బ్రహ్మచర్యం అవలంబిస్తున్నారో ఆ పరమ పదాన్ని నీకు సంగ్రహంగా చెబుతాను విను.

వేదవిదులు అంటే 2-45లో మనం నిర్వచించుకున్న వేదం వేదార్థం తెలిసినవారు. నాశితం లేని అక్షరం అని చెప్పేది 8-3లో నిర్ధారణ అయినది తొమ్మిదవ శ్లోకంలోని లక్షణాలున్నది అని గ్రహించాలి. బ్రహ్మత్వాన్ని పొందినవారు అభివర్ణించేది ఈ అక్షరాన్నే. యతనశీలురైన యతులు రాగం నిశ్శేషంగా రాలిపోయిన సంయక్ దర్శనం కలిగి ఉన్న వీతరాగులు ప్రవేశించాలనుకునేది ఈ అక్షరాన్ని తెలుసుకోవడానికే, గురువు వద్ద బ్రహ్మచర్య వ్రతం అవలంబించేది కూడా ఈ అక్షరాన్ని పొందడానికే. అలాంటి సమస్త వేద

సారాన్ని అక్షరం అనే పరమ పదాన్ని మానవ జీవితానికి సార్ధకత నిచ్చే గమ్యస్థానాన్ని సంగ్రహంగా చెబుతున్నాడు. వేదవేత్తులు ఈ నాశితం లేని దాన్ని అక్షరంగా పేర్కొన్నారు. ఈ అక్షర పరబ్రహ్మం కాకుండా తక్కినవి ఎన్ని తెలుసుకున్నా అవి శాశ్వత సుఖాన్ని ప్రసాదింపజాలవు. అందుకే బాల్య దశలో పిల్లలకు మనం అక్షరాభ్యాసం నేర్పుతాం. పూర్వం నుంచి సంక్రమించిన వేద ప్రతిపాదితమైన సంప్రదాయమైన సనాతన అక్షరాభ్యాసంలోని ఆంతర్యం కూడా ఇదేనని మనకు తెలియాలి. అక్షరాభ్యాసం అంటే సాధారణ స్థాయి మనుషులు మందబుద్ధులు భౌతిక విద్యలు కనిపించే విద్యలు నేర్పడానికి జీవితం నుంచి జీవితాన్ని వేరు చేసే క్షరం అయ్యే విద్యలు నేర్చుకోవడానికే అని భ్రాంతి చెందుతూ ఆ దిశగా ఆ మార్గంలో వెళుతూ చిన్నపిల్లలను సైతం భ్రాంతికి గురి చేస్తూ ఉంటారు. మనమే మన పిల్లల్ని భ్రాంతిలోకి నెట్టివేస్తున్నామన్న సంగతే మనకు తెలియదు, ఎందుకంటే మనమే భ్రాంతిలో ఉంటున్నాం. మనం ఏ భావనలో అయితే ఉంటామో అదే మార్గంలో నడుస్తాం కదా ఆ భావాలే పిల్లలకు నేర్పుతున్నాం. అయితే నిజమైన అక్షరాభ్యాసం అంటే ఈ అక్షర పరబ్రహ్మాన్ని ఎరిగే విద్యను నేర్పడం. ఈ ఉద్దేశంతోనే చిన్న పిల్లలకు పూర్వం నుంచి ఓంకారాన్ని రాయిస్తారు, ఇంకా ఓంనమశ్శివాయ లాంటి దైవాన్ని దర్శింపజేసే దైవిక మంత్రాలను నేర్పడంలోని ఆంతర్యం కూడా ఇదే. అంటే ఇతర విద్యలు నేర్చుకోవద్దని కాదు ఎన్ని విద్యలు నేర్చినా సర్వవిద్యలకు అధికారి అయిన మూల విద్యను ఎరుగవలె, అభ్యసించవలె. మనం మాటల సందర్భంలో నీవేమైనా బ్రహ్మవా, అదేమైనా బ్రహ్మవిద్యా అని అంటూనే ఉంటాం. అంటే ఏమని? అన్నింటికంటే సర్వోత్తమమైనది బ్రహ్మవిద్యే కదా అని అర్థం. అలా మనం మనకున్న స్వీయ అవగాహనతో ఆత్మ దర్శనంతో ఈ అక్షరాభ్యాసం అక్షరం లాంటి శబ్దాన్ని దర్శించి దరిచేరాలి. కాబట్టి మనం కూడా అక్షరాభ్యాసాన్ని అనుభూతమొనర్చుకొని అక్షరుణ్ణి సాక్షాత్కరింప చేసుకోవాలి, మనమే అక్షరులుగా వెలుగొందాలి. అలాంటి అక్షరుడైన పరమాత్మ పరమపదం లోకి ఎవరు ప్రవేశించగలరంటే రాగాన్ని విడచిన విరాగులు మాత్రమే మోక్షసౌధంలోకి ప్రవేశించగలరు. ఈ రాగ వివర్జితం అనే టికెట్టు మనం ప్రధమ షట్కంలో అధ్యయనం చేసి వీతరాగత్వాన్ని అభ్యసించి మోక్షధామానికి అనుమతి పత్రాన్ని పొందాలి. ఇక్కడ మనం ఒక విషయం గమనించాలి, ఇక్కడ బ్రహ్మచర్యం అనే శబ్దంలోని నిగూఢార్థం ఆంతర్యం మనం చూశాం, గమనిక ఏమంటే దేన్ని ఆశించి భౌతిక ప్రపంచంలో చెలామణి అవుతున్న బ్రహ్మచారులు కఠినమైన నియమాలతో జపతపాదులు చేస్తూ కుటుంబాన్ని లేదా వైవాహిక జీవితాన్ని త్యజించి దేనికోసం దేన్ని కోరి వారు అన్నీ త్యాగం చేసి దేన్ని పొందాలని అనుకుంటున్నారో ఆ పరమ పదాన్ని అని అర్థం చేసుకోవాలి. ఇక్కడ వారి ఉద్దేశంలో గాని కోరికలో గాని లక్ష్యంలో గాని ఏమాత్రం దోషం లేదు, లోపం లేదు. అయితే వారు వెళ్తున్న మార్గం అనేది గీత అనేది మోక్షానికి లేదా వారి లక్ష్యానికి చేరువ చేసేది గానే ఉండాలి కదా, లక్ష్యం ఓవైపు వెళుతున్న మార్గం ఓవైపుగా ఉండి గమ్యం తెలియని ప్రయాణం కాకూడదు కదా. పిండం గర్భంలోనే కదా పెరిగి పెద్ద అయ్యేది, అలాగే మోక్షపథం కూడా. గీత లోని గీతా శాస్త్రం లోనే ఉంది. కాబట్టి అక్కడే విద్యాభ్యాసం చేసి ఆ

గీతా మార్గంలోనే మనం ఆ భగవంతుణ్ణి ఆ పరంధామాన్ని పొందాలి. భగవంతుణ్ణి చేరాలన్నా పొందాలన్నా భగవద్గీత లోనే పొందాలి. పరమపదం చేరాలి అంటే అది గీతా మార్గం ద్వారానే సాధ్యం. అక్షరంలోకి ప్రవేశించాలన్నా అది గీతాక్షరాలలోనే వెళ్లి ఆ క్షరం కాని అక్షరం లోకి ప్రవేశించాలి. కాబట్టి పరమపదం కావాలి, పొందాలి అనుకునే ఎవరైనా ఈ మార్గంలోకి రావాల్సిందే, నేల విడచి సాము చేస్తే ప్రయోజనం శూన్యం. అహర్నిశలు నిద్రాహారాలు మాని కఠోర నియమ నిబంధనలు పాటించి శరీరాన్ని ఎండబెట్టినా ప్రయోజనం లేదు. దైవాన్ని గీతను గీతా మార్గాన్ని ఖచ్చితంగా పట్టుకోవాల్సిందే. ఇక్కడ బ్రహ్మచర్యం అనే మాటను లోచూపుతో ఏడు అధ్యాయాల జ్ఞాన సహిత జ్ఞానంతో దర్శించాలి. ఈ శబ్దం వైవాహిక జీవన విధానానికి వ్యతిరేకమైనది కాదని గృహస్థాశ్రమానికి విరుద్ధమైనది కాదని గ్రహించాలి. 9 శ్లోకాలలో చర్చించిన లక్షణాలు గల పరమపదాన్ని పొందడానికి దైవప్రాప్తికి మోక్షధామానికి అవసరమైనది బ్రహ్మచర్యం. ఆరవ అధ్యాయంలోని మనం అభ్యసించిన ధ్యాన యోగంలో ప్రాణశక్తితో బ్రహ్మమార్గంలో చరించి తద్వారా ముందు శ్లోకంలో చెప్పిన అభ్యాస యోగంలో విహరించిన మూలశక్తిని దర్శించే దిశగా చరిస్తున్న వారు బ్రహ్మచారులు. బ్రహ్మవిద్యను అభ్యసించే వారే బ్రహ్మచర్య వ్రతాన్ని చేస్తున్నవారు, బ్రహ్మచర్య వ్రత దీక్షలో ఉన్నవారు, బ్రహ్మమందే సుస్థిరమై సదా చిత్తం లగ్నం చేసి ఉన్నవారు. అంతేగాని బ్రహ్మచర్యం అనే శబ్దానికి దాంపత్య జీవితంలోని దైహిక బంధాలకు సంబంధం లేదని గ్రహించాలి. గీతా శాస్త్రానుసారం దైవానుసరణలో దైవానుస్మరణలో దైవధామానికి ప్రవహిస్తున్న వారందరూ బ్రహ్మచారులే. ఆత్మ దృష్టితో ఈ అధ్యాయంలోని ఏడు ప్రశ్నలను వివేచించుకొని ఆధ్యాత్మాన్ని దర్శించి ఆ దారిలో ఆ ప్రత్యక్ష ప్రమాణమైన పరమాత్మ మనలను చిటికెన వేలు పట్టుకొని నడిపిస్తూ మనకు చూపుతూ దర్శింపజేస్తూ ఉన్న ఆ గీత లోనే చరించాలి. నాశరహితమైన పరమాత్మపథం అక్షరం ఈ సత్యాన్ని తెలుసుకుంటున్న వారు వేదవిదులైన మహాత్ములు, కోరికలు నిశ్శేషంగా నశించిన వీతరాగులు, బ్రహ్మచర్య దీక్షలో ఉన్నవారు, బ్రహ్మచర్యం అనుష్ఠానముగా ఉన్నవారు. అట్టి పరమాత్మ పరమపథాన్ని దర్శించగలరు, అందులో ప్రవేశించగలరు.

8అ, 12శ్లో.

సర్వద్వారాణి సంయమ్య మనో హృది నిరుధ్య చ |

మూర్ధ్న్యాధాయాత్మనః ప్రాణమ్ ఆస్థితో యోగధారణామ్ | 12 |

సర్వ ద్వారాలను నియమించి మనసును హృదయంలో ఆత్మతో సుస్థాపితం చేసి బ్రహ్మరంధ్రమందు ప్రాణవాయువును ఉంచి యోగ ధారణకు ప్రవృత్తులై అక్కడే ప్రాణవాయువును సుస్థిరంగా ఉంచి, ఇది ఈ శ్లోకం యొక్క భావం.

రూపానికి సంబంధించిన విషయం కన్ను ద్వారా లోనికి ప్రవేశించినప్పుడు అది మన మనసును చేరి కలవరపెడుతుంది. శబ్దానికి సంబంధించిన విషయం చెవి ద్వారా, వాసన ముక్కు ద్వారా ఇలా స్వవిషయాలైన శబ్దాది విషయాలను స్తోత్రాది ఇంద్రియాలు మనసుకు చేరవేస్తాయి. ఇలా మనసులోకి ప్రవేశించడానికి జ్ఞానేంద్రియాలే ద్వారాలై ఉన్నాయి. ఈ శ్లోకంలో చెప్పిన ప్రక్రియను మనం చేయడం ద్వారా మనలోని ఇంద్రియ ద్వారాలు మూతపడి శబ్దాది విషయాలు లోనికి ప్రవేశించవు. అందుకనే జ్ఞానేంద్రియాలనే ద్వారాలను మూయగానే అవి శరీరం అనే గృహాన్ని చేరలేవు. అలాగే మనసు కూడా బహిర్ముఖమైన విషయాలను చేరలేదు అయినా మనసు తన గుహలో ఊరేగుతూనే ఉంటుంది. అప్పుడు ఆలోచనలు పుట్టిన చోటనే లయమైపోతూ ఉంటాయి, క్రమంగా ఆలోచనారహిత స్థితికి చేరుకుంటాం, తద్వారా మనసు ఆత్మగతమవుతుంది. అందుకే మనసును ఆత్మస్థం చేయాలని హృదయంలో నిలపాలని మనం ప్రథమ షట్కంలో అభ్యసించాం, అందుకే ఇక్కడ ఈ అంశాన్ని చాలా సంక్షిప్తంగా చూస్తున్నాం. ఉదాహరణకు కుండ ఉంది అన్నప్పుడు ఆ కుండకు సంబంధించిన ఆలోచన విషయం ఎక్కడుంది కుండలోనే కదా, కుండను కుండకు సంబంధించిన ఆలోచనలు వేరు చేస్తే కుండ అనే భావన మనసులో ఉండే అవకాశమే లేదు. అలా ఇంద్రియాలను ఆయా విషయాల నుంచి మనసును వేరు చేసి ఆత్మస్థం గావించాలి. అలా ధ్యానయోగంలో మనసును ఆత్మస్థం చేసిన తరువాత ప్రాణవాయువును భ్రూమధ్యంలో నిలపాలి. అలా ప్రాణవాయువును భ్రూమధ్యంలో నిలిపాక హృదయంలో నిండి ఉన్న ప్రాణవాయువును సుషుమ్నానాడి ద్వారా ఊర్ధ్వంగా కంఠ ప్రదేశానికి నడపాలి. అలా మన ప్రాణవాయువును సుస్థిరం గావించి నడపడం వల్ల యోగంలో ధారణ గావించడం వల్ల ఆ ప్రక్రియ అక్కడ నుంచి ప్రాణవాయువును ఉన్నతంగా పంపించి బ్రహ్మపథం చేరుకునే దిశగా పయనింపజేస్తుంది. ఇది ఈ శ్లోకంలో చెప్పినటువంటి ధ్యానయోగ ధారణ విధానం, ఈ శ్లోకానికి కొనసాగింపుగా తరువాతి శ్లోకాన్ని చూసిన తరువాత రెండింటిని అక్కడ సమన్వయం చేసుకుందాం.

8అ, 13శ్లో.

ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్మామనుస్మరన్ |

యః ప్రయాతి త్యజన్ దేహం స యాతి పరమాం గతిమ్ | 13 |

బ్రహ్మమని చెప్పే ఓంకారాన్ని సదా ఉచ్చరిస్తూ దేహం విడిచినవారు పరమగతిని పొందుతారు.

మనం ముందుగా ఓంకారం వైశిష్ట్యాన్ని చూసి శ్లోకాన్ని పరిశీలిద్దాం. అకార ఉకార మకార శబ్దాలతో ఏర్పడింది ఓంకారం, శబ్దాలలో మొదటిది ఓంకారం. పరమాత్మకు శబ్దరూప ప్రతీక ఇది. ఆకారం జాగ్రదావస్థకు, ఉకారం స్వప్నావస్థకు, మకారం సుషుప్తావస్థకు శబ్ద రూప ప్రతీకలు. వాటికి అతీతమైన తురీయావస్థకు ప్రతీక శబ్దరహితమైన ఓంకారం. ఈ శబ్దరహిత ఓంకారం గ్రహించగలిగినవాడు మాత్రమే పరమాత్మ పరబ్రహ్మాన్ని దర్శించగలరు. ఇదొక ఏకాక్షర మంత్రం, సృష్టి ఉత్పత్తి ప్రక్రియ ఈ శబ్దంతో పాటే జరిగింది. సృష్టి ఉత్పత్తి మహావిస్ఫోటనం జరిగినప్పుడు ఉత్పన్న మైనటువంటి ప్రప్రథమ శబ్దం ఆదినాదం, మూల ధ్వని ఇది. ఈ ప్రప్రథమ నాదమే భిన్న రూపాలలో సృష్టిలో అభివ్యక్తమవుతూ ఉంది. దీనికే ఓంకారమని పేరు, సమస్త జగత్తు అంతా ఓంకారమే, సర్వ వేద సారం ఓంకారం. మనం ఏ మంత్రం చదివినా చెప్పినా ఓం కలపకపోతే అది పూర్ణతను పొందదని మనకు తెలుసు. మనం సహజంగానే ఓం ఓం అని ఉచ్చరిస్తూనే ఉంటాం. ఓం అనేది ఒక అక్షరమే కాదు, ఒక పదం కూడా ఇదే బ్రహ్మ, ఇదే వేదం. ఇది స్వతంత్రంగా తనదైనటువంటి అర్థాన్ని ఇవ్వగలదు. నన్నే స్మరించు అనే ఆంతర్యం కూడా ఈ ఓంకారం నుండి మనకు ధ్వనిస్తుంది. ఓం శబ్దాన్ని మనం తరచి తరచి చూస్తే ఈ శబ్దాన్ని లోచూపుతో దర్శిస్తే మన సమస్త సంశయాలను ఈ శబ్దం తీర్చగలదు. సకల దేవతా స్వరూపం ఓంకారం, బ్రహ్మ స్వరూపం ఓంకారం. అందుకే ఓంకారాన్ని మంత్రంగా జపిస్తారు, ధ్యానిస్తారు. అకార ఉకార మకార సమ్మేళన మైనటువంటి ఈ ఓంకారం తొలి వేదమైనటువంటి ఋగ్వేదంలో మొదటి మంత్రపు 'అ' అనే మొదటి అక్షరాన్ని, రెండో వేదమైనటువంటి యజుర్వేదంలో మధ్యమంత్రంలోని 'ఉ' అనే మధ్య అక్షరాన్ని కలిపితే 'ఓ' అవుతుంది దానికి చివరి వేదమైన సామవేదంలోని చివరి అక్షరం 'మ' కారం చేరిస్తే ఓంకారం అవుతుంది. ఈ మూడు వేదాల సారం, అందుకే ఇది సర్వ వేదాల సారం అయింది. నిజానికి వేదాలు మూడు అందుకే వాటికి త్రయి అని పేరు. మరి అయితే నాలుగో వేదం సంగతి ఏంటి అంటే ఈ మూడు వేదాల నుండి వేరు చేసినదే నాలుగో వేదమైనటువంటి అధర్వణ వేదం. కాబట్టి అన్ని వేదాల సారం ఓం శబ్దంలో ఉంది, ఇదే సృష్టికి మూలం. సమస్త వాంగ్మయానికి సర్వ దేవతలకు సర్వశక్తులకు మూలం ఈ నిరాకార ఓం అనే ప్రణవాక్షరమేనని మనకు తెలియాలి. ఈ సృష్టి అంతా లయం అయినా కూడా ఆ తరువాత మిగిలేది నాద బ్రహ్మమైన ఓంకారం మాత్రమే. పంచభూతాలలో సూక్ష్మాంశం అయిన ఆకాశం యొక్క శక్తి నాదబ్రహ్మం.

ఆకాశము నుండి మొదట వెలువడింది ఓంకారమే, ఓంకారానికి అధిష్ఠాన దైవం ఈశ్వరుడు. మూలాధారం నుండి పర, పశ్యంతి, మధ్యమ, వైఖరి వాక్కులలో అంతర్గతంగా ప్రయాణిస్తూ విశుద్ధి ద్వారా వాక్కు రూపంలో వెలువడేది ఓంకారమే. మనం ధ్యానయోగంలో అంతర్ముఖమైనప్పుడు ఆత్మ చేసే నాదం ఓంకారమే. పంచేంద్రియాలు ప్రాణవోపాసనపై ఏకాగ్రమైనప్పుడు దేహంలో అనంతమైనటువంటి శక్తి జనించి శరీరమే ఓ మహాశక్తి పాతంగా విరాజిల్లుతుంది. అందుకని శరీరంలోని అణువణువుని చైతన్యమొనర్చేటటువంటి శబ్దశక్తి ఈ ఓంకారమే. ఇది గుర్తించినటువంటి ఋషులు లోకానికి ఆవశ్యమైనటువంటి జ్ఞానాన్ని తమ తమ ధోరణిలో అందించారు. నాదోపాసకులకు అంతఃశక్తి నిచ్చేది ఓంకారమే.

ఈ ఓంకారం యొక్క ఉచ్చారణతో మన యొక్క మెదడు పనితీరు మెరుగుపడుతుంది. మన దేహంలోని అణువణువుకి కావలసినటువంటి ప్రాణ శక్తిని సమపాళ్లలో నింపేది కూడా ఈ ఓంకార ఉచ్చారణ. ఈ సృష్టికి ఆదిలో మూల కారణంగా ఉన్నది నాద బ్రహ్మమే ఆ నాదబ్రహ్మమే ఈ ఓంకారం. దిక్కులు రాత్రింబగళ్లు ఏవీ లేనటువంటి కాలగమనమే తెలియనటువంటి సృష్ట్యాది దశలో ఈ బ్రహ్మాండంలో వినిపించిన అవ్యక్త నాదం ఓంకారం. ఆ ధ్వని తరంగాల ఆధారంగానే ఈ భౌతిక జగత్తు సృష్టి ఏర్పడింది. ఈ ప్రపంచానికంతా ఆది మధ్య అంతం కూడా ఓంకారమే, ఈ విధంగా తెలుసుకున్నవారు ఆ క్షణంలోనే పరమాత్మ స్వరూపాన్ని తెలుసుకుంటారు అని మాండుక్యోపనిషత్తు. ఈ లేని జగత్తులో లేనిది ఎప్పటికీ ఉండదని నిర్ధారిస్తూ ఉన్నది పరబ్రహ్మం ఒకటేనని తానే పరబ్రహ్మం అనే దర్శింపజేసేది అకార, ఉకార, మకారాలతో కూడిన ఓంకారం. ఓంకారం లేని స్థానం, ఓంకారం లేని క్షణం, ఓంకారం వ్యాపించని జీవకణం జగత్తులో లేదు ఉండదు. ప్రణవమే పరబ్రహ్మం, ప్రణవమే ముక్తికి మార్గం, ప్రణవమే సర్వ వేదాలకు మూలం, ప్రణవమే సకల దేవతల మయం. ఓంకారం యొక్క కిరణజాలమే సకల దేవతా రూపాలు, ఆ ఏకత్వాన్ని మనం తెలియడానికి ఏ దేవతా పూజ జపం మంత్రం అయినా కూడా ఓం అనే ఏకత్వపు ఏకాక్షరాన్ని విడిచి చెప్పలేరు. ఇందుకు ఎటువంటి భేదాలు సైతం లేదు. ఎంతో మేధ ఉన్నటువంటి మనిషి ఈ మూలాన్ని గ్రహించినా సరే వ్యక్తి భావనలో ఇన్ని మతాలు మత భేదాలు ఏర్పడేవి కాదు. దీన్నిబట్టి సర్వ మంత్రాల స్వరూపం వేదసారం ఓంకారం. సర్వమంత్రాలలో ఉత్తమమైనది ప్రణవమే, అలాంటి ప్రణవోపాసన భావార్థ సహితంగా చేసేవారు సంసార బంధం నుండి విడి పడతారు. సమస్త మంత్రాలలో ఓంకారమే ఉత్తమమైందని వేదాలు ఋషులు కీర్తించాయి. ఈ ఓంకారాన్ని ఉపాసిస్తూ దేహ భావనను తొలగించుకోవాలి, దేహాన్ని వీడాలి. ఇప్పుడు మనం ఓంకారం యొక్క స్వరూప స్వభావాన్ని ఆంతర్యాన్ని చూసినటువంటి దృష్టితో ఈ శ్లోకాన్ని సమన్వయం చేసుకుందాం. సర్వేంద్రియాలను నిగ్రహించి మనస్సును హృదయమందే సుస్థిరంగా నిలిపి అలా నిలిపిన మనసు ద్వారా ప్రాణవాయువును సహస్రారమందు స్థిత మొనర్చి పరమాత్మ ధ్యానమందే నిమగ్నమై అనేది ముందు శ్లోకంలో చూసాం, ఆ భావానికి కొనసాగింపుగా ఈ శ్లోకాన్ని చూడాలి. అలా నిమగ్నమైనటువంటి మనసుతో బ్రహ్మనికి వాచకం ఓంకారం ఇదే

ప్రణవం. ఆ ఏకాక్షరానికి అర్థమైనటువంటి నన్ను ఈశ్వరుణ్ణి స్మరిస్తూ ప్రాణవాయువు ద్వారా ప్రణవం అనే ఓంకారాన్ని ధ్యానించాలి. ఇది మనం ఆరవ అధ్యాయంలో అభ్యసించిన ధ్యానయోగం ద్వారానే సిద్ధిస్తుందని తెలియాలి. అలా మనం ధ్యానయోగంలో స్థిరమైనప్పుడు క్రమంగా ప్రాణవాయువు బ్రహ్మ రంధ్రానికి చేరుకుంటుంది, అక్కడ ధ్యానయోగ విధానం చూసాం ఆ ప్రక్రియలో అక్కడ ధ్యాన యోగంలో ఉఛ్వాస నిశ్వాసలతో మనం ఏకమైనప్పుడు అంటే ప్రాణవాయువుతో మనం ఏకమైనప్పుడు బ్రహ్మ రంధ్రంలో సహస్రారంలో ప్రాణవాయువును తీసుకెళ్లినప్పుడు ధారణాబలం చేత బ్రహ్మాకాశంలో కలిసిపోయేటట్లుగా సుస్థిరంగా అచలంగా ఉంటుంది. ఆ తరువాత అ, ఉ, మ ఈ మూడు మాత్రలు అర్థమాత్రలో లయమైపోతుంది. ఇక్కడ మాత్ర అంటే ఆ అక్షరాన్ని ఉచ్చరించే నియమత సమయానికి సంబంధించినది అని అర్థం చేసుకోవాలి. అలా అవి మూడూ అర్థమాత్రలో లయమయ్యే వరకు చిత్తులో చిదాకాశంగా నిశ్చలంగా ఉంటుంది. ఈ సాధనలో ఐక్యత ఏకత మనకు ప్రాప్తించగానే ఆ ఓంకారమంతా కూడా మూల బ్రహ్మంలో నిండిపోయినట్లు విశ్వమంతా వ్యాపించినట్లు మనకు తెలుస్తుంది. ఈ అనుభూతి దర్శనంతో ఓం అనేటటువంటి ఏకాక్షర స్మరణం, ఉచ్చారణ కూడా అంతమైపోతుంది. ప్రాణవాయువును కూడా దాటిపోయినటువంటి స్థితి ఇది. ఇలా బ్రహ్మానంద స్వరూప స్థితిని పొంది శరీరాన్ని విడిచినవారు దేహ భావాన్ని త్యజించిన వారు నిస్సందేహంగా నన్నే నా స్వరూపాన్నే పొంది ఉన్నారు అన్నారు. ఇక్కడ త్యజన్ అనే మాటకు ముందు శ్లోకాలలో చర్చించినటువంటి ప్రాణ ప్రయాణ కాలమో లేదా మరణ కాలమో కాదని గ్రహించాలి. ధ్యాన యోగంలో ఇందులో చెప్పినటువంటి ప్రణవోపాసన ద్వారా మంత్రోచ్చారణ కంటే కూడా అతీతమైనటువంటి నిరాకార బ్రహ్మాన్ని చేరుకున్నప్పుడు మనం దేహం కాదనే భావనను చింతను చేస్తూ దేహ భావాన్ని విడిచి పెట్టడమని ఖచ్చితంగా తెలియాలి. అందుకే పొందుతాడా లేదా అనే సందేహానికి తావే లేదని 8-7 లో మనం చూసాం. ఎందుకంటే తాను అదే అయి ఉన్నాడు కనుక కొత్తగా ఏమీ పొందేది ఉండదు, మరి ఇంతటి ప్రయత్నం వార్ధక్యంలో ఇంద్రియాలన్నీ శిథిలమైపోయిన అవస్థలో ఈ దేహం దైవ ప్రయత్నానికి మోక్షాన్ని పొందే దైవ ధామాన్ని చేరే ప్రయత్నానికి తోడ్పడుతుందంటారా?

జీవితమంతా ఆరాట పోరాటాలతో అజ్ఞానం అనే పాము కాటుకు గురైన శరీరం కన్నులును కానలేని వీనులను వినలేని ఈ శరీరం దైవ యత్నానికి దోహదపడుతుందా ఆలోచిద్దాం. ఈ ఆలోచన మనలో కలిగించడమే ఈ శ్లోకాన్ని మన ముందు ఉంచడమే జగద్గురువు ఉద్దేశం. మృత్యుదేవత పూర్తిగా కబళించి వేసిన సమయంలో ఆసనంలో కూర్చొని ధ్యానం చేస్తారా? తమ అంతఃకరణంతో ఓంకార చింతన చేయగలరా? అలా చేసి ఓంకార స్థితిని దాటి పరమధామాన్ని పొందగలరా? స్వామి జగద్గురు పరమాత్మ ఈ అవగాహన అన్ని ప్రాణులకు కాదు కాదు మహామేధస్సును స్వంతం చేసుకున్న ప్రతి మనిషికి అర్థమయ్యేటట్లు దారి చూపు స్వామి. ఈ గీతా గ్రంథమంతా నువ్వు చెప్తున్న నన్నే స్మరించే వారికి సదా నేను స్వయంగా సేవకుడిని అంటున్న ఆంతర్యాన్ని ప్రతి మనిషి గుర్తించేలా చూడు స్వామి.

ఇందులో మనం గ్రహించాల్సింది ఓంకారాన్ని అర్థంతో భావంతో సహా చింతిస్తూ సదా ధ్యానించడం. అన్ని మంత్రాలలో ఓంకారమే ప్రణవ మంత్రమే శ్రేష్ఠమైనదని గ్రహించడం. దైవాన్ని నిరంతరం సదా అనుస్మరిస్తూ పరమ పదాన్ని పొందడం.

8అ, 14శ్లో.

అనన్యచేతాః సతతం యో మాం స్మరతి నిత్యశః |

తస్యాహం సులభః పార్థ నిత్యయుక్తస్య యోగినః ||

అర్జునా ! ఎవరు అనన్య చిత్తులై నన్ను గూర్చి అనుదినం నిరంతరం స్మరిస్తారో ఆ ధ్యాని నన్ను సులభంగా పొందుతాడు.

దృశ్యపదార్థాలపైకి పరుగులెత్తకుండా దృక్ స్వరూపమైన పరమాత్మయందే లగ్నమై ఉండటమే అనన్య చేతాః, బాహ్య విషయాలపైకి మనసు వెళితే అది అన్యచిత్తమే కానీ అనన్య చిత్తం కాదు. కొందరు ఏదో ఒకరోజు లేదా పండుగలలో లేదా ప్రత్యేక దినాలలో దైవాన్ని స్మరిస్తారు. మనసుకు దేనియందు ఆసక్తి ఉంటుందో అది దానియందే లగ్నమై ఉంటుంది. కొందరికి అనిత్యాలైన విషయాల యందే ఆసక్తి ఉంటే అలాంటి వారి మనసు ఆ అనిత్య ప్రపంచంలోనే పరిభ్రమిస్తూ ఉంటుంది. వీరు అన్య చేతసులు, వీరు అనేక రకాల భౌతిక విషయాలపైకి మనసును జారవిడిచినవారు. మరికొందరు ప్రతిరోజు కొంతసేపు దైవాన్ని స్మరిస్తారు, నిత్యానిత్యాలను రెండింటిని ఆశించి వీరు రెండింటి యందు ఆసక్తిని కలిగి ఉంటారు. వారికి ప్రాపంచిక విషయాలు కావాలి, పరమేశ్వరుడు కొంత కావాలి, దృశ్యమయ భోగాలు కావాలి, అదృశ్యమయ భగవంతుడు కావాలి. పైగా ఆ అదృశ్యమయ భగవంతుడిని కోరేది కూడా అనిత్యమైన వాటిని పొందడం కోసమే. వీరు అప్పుడప్పుడు లేక రోజులో కొంతసేపు తాత్కాలిక సమయంలో భగవదాసక్తిని కలిగి ఉంటారు. ఇలాంటివారు అటు ఇటు కాని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతూనే ఉంటారు. ఇది ఎలా ఉంటుందంటే ఒకే గుడ్డును రెండు భాగాలు చేసి సగభాగాన్ని పిల్లను పొదిగించడానికి మరో సగభాగాన్ని వండి తినడానికి ఉపయోగించినట్లు వీరి ధోరణి. దీన్నే శాస్త్రంలో అర్ధజరతీయ న్యాయం అని అంటారు. అది వీలవుతుందా? ఆలోచిద్దాం, దివ్యాత్మస్వరూపులారా! ఇలాంటి ప్రయత్నాలు వ్యవహారంలోనే ఫలించనప్పుడు ఇక పరమ పదాన్ని పొందే భగవంతుని విషయంలో వేరే చెప్పాలా? మనకు మనమే స్వీయ పరిశీలన కావించుకుందాం. ఇక అనన్య చేతసులు, వీరికి ఒక పరమేశ్వరుని యందే ప్రీతి భగవంతునిపైనే ఆసక్తి అంతేకాదు అనిత్యమైన ప్రాపంచిక విషయాల పట్ల అనాసక్తి కూడా. వీరికి దైవాసక్తి వినా వేరే ఉండదు, సదా దైవ స్మరణ లోనే ఉంటారు. వీరు అన్యమైన విషయాల పట్ల ఉదాసీనంగా ఉంటారు కూడా. జగద్గురువు చెప్తున్న సూత్రం ప్రకారం ఇలా ఇతర విషయాలపై మనసు లగ్నం చేయని వారు సదా

దైవం పైనే దృష్టి ఉన్నవారు అనన్య చిత్తులు. వీరు భగవంతునిపై పరమ ఆసక్తిని కలిగి ఉంటారు. ఓ జీవనది ఎలా అఖండంగా సముద్రం వైపు ప్రవహిస్తూ ఉంటుందో అదే విధంగా అనన్య చేతసుల హృదయం పరమేశ్వరుని చింతిస్తూ దైవం వైపుకు పరుగులెత్తుతూనే ఉంటుంది. ఇలా సర్వ సమర్పణ గావించిన వారు పరమపదం అనే పరంధామాన్ని సులభంగా పొందుతారు. అన్నిటి కంటే అనన్యమైన చిత్తమైన భక్తితో భగవంతుణ్ణి పొందడమే చాలా సులభతరమైనది. చిత్తాన్ని శివుడికి సమర్పించినప్పుడే శివునికి మనలో స్థానం ఉంటుందని గ్రహించాలి. అందుకే జగద్గురువు ఇక్కడ అనుదినం సతతం సదా అన్నారు. ఎడతెగని దైవస్మరణతో సదా దైవాన్ని అభ్యసిస్తూ ఉండాలి. అదే అనన్యచిత్తుల లక్షణం, అలాంటివారికి భగవంతుడు సులభ సాధ్యుడు, అతడే నిత్య యుక్తుడు, నిరంతర ధ్యాని. ఇది ఆరంభంలో కుదరకపోయినా ఏదో ఒక రోజు ఏదో ఒక జన్మలో ఆ స్థితిని అభ్యసించి తీరాల్సిందే. భగవంతునిపై ధ్యాసనుంచడం ఆరంభించిన క్షణంలోనే మరోవైపు నుంచి మాయ ప్రవేశించి అది తిరిగి భాహ్య విషయాల వైపుకు మరల్చి తప్పుదారి పట్టిస్తూనే ఉంటుంది. కారణం అది అంతకుముందు ఆస్థానాన్ని ఆక్రమించి ఉండటం వల్ల, అందుకని ఈ విషయంలో సాధకులు ప్రారంభ సమయంలో జాగురూకతతో ఉండి మాయకు ఒక్కింత అవకాశం కూడా ఇవ్వకుండా భగవత్ స్మరణను కలిగి ఉండాలి. అలాంటి నిరంతర దైవస్మరణ శీలురే పరమాత్మను సులభంగా పొందగలరు. దీన్ని బట్టి ఎడతెరపి లేని దైవ సాధన భగవత్ ప్రాప్తికి సులభోపాయమని మనకు నిర్ధారణ అవుతుంది. కాబట్టి ఇతర దృశ్య చింతనకు తావీయకుండా అనన్య చిత్తంతో దైవ ధ్యాన యోగంలో దైవ ధ్యాన స్మరణతో అక్షర పరబ్రహ్మంలో యోగమవుదాం. అలా దైవాన్ని సులభంగా సాధించుకుంటే మనకు కలిగే లాభమేమిటో తరువాతి శ్లోకంలో ప్రతిపాదించిన సులభ లాభాన్ని అందుకోవడం కోసం ఎదురుచూద్దాం.

8అ, 15శ్లో.

మాముపేత్య పునర్జన్మ దుఃఖాలయమశాశ్వతమ్ |

నాప్నువంతి మహాత్మాన: సంసిద్ధిమ్ పరమాం గతాః | 15 |

పరమసిద్ధిని పొందిన మహాత్ములు నన్ను చేరిన పిదప దుఃఖములకు నిలయమైన, క్షణభంగురమైన పునర్జన్మను పొందరు.

ఇందులో జన్మ అనేది ఉంది అనుకున్న వారికి అది దుఃఖాలయం అశాశ్వతం అని ఈశ్వరుడైన నన్ను చేరి నా భావాన్ని పొంది నాలో లీనమైన వారు పునర్జన్మ పొందరు అనే రెండు అంశాల్ని చాలా స్పష్టంగా పేర్కొన్నారు. ఇది లో చూపుతో ఆలోచించాల్సిన అంశం. ఇంతకు దుఃఖాలయం అంటే ఏంటి, దుఃఖం అంటే ఏంటి. ఆధ్యాత్మికం ఆధిభౌతికం

ఆధిదైవికం అనేవి తాపత్రయాలు లేదా త్రివిధ తాపాలు మూడు విధాలైన దుఃఖాలు. ఈ అంశాన్ని మనం 2-56 లోనే చూసాం,

ఒకటి మనలో కలిగే శోకం మోహం జ్వరం లాంటి దుఃఖాలను ఆధ్యాత్మిక దుఃఖం అంటారు.

రెండు మనుషులు పశువులు, పక్షులు, పాములు మృగాలు, మొదలైన ప్రాణుల ద్వారా సంభవించేది ఆదిభౌతిక దుఃఖం.

మూడు, భూకంపం, సునామీ అతివృష్టి అనావృష్టి పిడుగుపాటు ఇలాంటివన్నీ ఆదిదైవిక దుఃఖాలు. ఇవి దుఃఖాలకు బాధలకు నిలయాలు. అలాంటి దుఃఖానికి ఆశ్రయమైన జన్మని తిరిగి పొందరు అని అర్థం చేసుకోవాలి. ఈ త్రివిధ దుఃఖ పీడితులుగా వీరు ఉండరు. జన్మలు అనేవి శోకనిలయాలు, అశాశ్వతాలు. కొందరు భౌతికంగా అన్ని సౌకర్యాలు విలాసం వినోదం ఉన్నవాళ్లు నాకు అన్ని ఉన్నాయి కదా నాకేం తక్కువ అని అనుకుంటూ ఉంటారు. అయితే దుఃఖ పీడితులు కాకుండా ఉండటం అంటే ఈ మూడు రకాల దుఃఖాలకు లోను కాకుండా ఉండటం. సుఖదుఃఖాలు కష్టసుఖాలు మొదలైన ద్వంద్వాలను అనేక సందర్భాల్లో మనం చర్చించాం, ఆ అవగాహనతో ఈ అంశాన్ని అర్థం చేసుకోవాలి. ఒకవేళ సంతోషం అని ఎప్పుడైనా అనిపించినా వెంటనే దుఃఖం కూడా ఉంటుంది కాబట్టి పరమాత్మ జ్ఞానం లేని వారికి జన్మ అనేది దుఃఖాలకు నిలయమైనదిగా అనిపిస్తుంది. మనం చూసినటువంటి ఈ మూడు విధాల దుఃఖానికి లోను కాని మానవులు ఎవరైనా ఉంటారా ఆలోచిద్దాం. మరి అలా లోను కాని వాళ్లే మహనీయులు మహాత్ములు. రామాలయం దేవాలయం లాగా దుఃఖాలయం అన్నారు ఇందులో. జన్మ అనేది దుఃఖానికి నివాసస్థానమై ఉంది. జన్మ లేదని దృఢంగా రూఢీ పరచుకున్న మహాత్ములు మహానుభావులు పరమ పదాన్ని చేరుతారు. అప్పుడు ఈ జన్మయందే పరమం సంసిద్ధిం. అది కానివన్నీ దుఃఖాలే, అశాశ్వతాలే. అందుకే దైవసాధనతో మహాత్ములెందరో సంసిద్ధులయ్యారు. నిర్మల చిత్తులై పరమాత్మను ఆశ్రయించువారు మహాత్ములు. అసత్యాన్ని కాకుండా సత్యాన్ని ఆశ్రయించిన వారందరికీ మహాత్మా అనే బిరుదు వర్తిస్తుంది. నిజానికి దేహంలో జరిగే మార్పులు దేహానికి తెలియవు. దేహం జీవించినా జడమే, మరణించినా జడమే. అందుకే జ్ఞానం అనేది దేహానికి కాదు ఆ మార్పును తెలుసుకుంటున్న గమనిస్తున్న నేనుకు కలగాలి. నేను జ్ఞాన స్వరూపాన్ని ఈ దేహం ఉన్నా, వీడినా నేను జీవచైతన్యాన్ని అని మనలోని జ్ఞాతకు తెలియాలి. నేను కాని దేహాన్ని నేను అని భావించి నాకు లేనటువంటి చావునో లేదా దుఃఖాన్నో తెచ్చుకొని నేను దుఃఖిస్తున్నాను అనేటటువంటి భావన, మెలకువ, జ్ఞానం మనిషికి కలగాలి. నాకు లేని పుట్టుకను లేదా జన్మను నాకు ఆపాదించుకుని అలమటిస్తూ ఉన్నానని ఇది మిథ్యా జ్ఞానమేనని సత్యమైన జ్ఞానం కాదని గ్రహించాలి. జీవుడనైన నాకు ఈ దేహం ఒక ఉపాధి గా ఉంది అని గుర్తెరిగి తన మూలాల్ని దర్శించాలి. ఈ ఉపాధి భేదం వల్ల జీవేశ్వరుల భేదం అనిపిస్తోంది గాని వాస్తవంగా అది భేదం లేనిదే కదా. ఆ అభేద జ్ఞానం కలిగితే దుఃఖాలయం నుండి విముక్తి.

కుండలోని ఆకాశం కుండకు పరిమితం కానట్లే జీవుడు ఎప్పటికీ దేహానికి పరిమితుడు కాడు. కుండలో ఆకాశం కనిపించినా ఆకాశం అనంతంగానే ఉంటుంది కదా, దేహంలో ఉన్నా జీవుడు సర్వవ్యాపితమే కదా. కుండ పగిలినా ఆకాశానికి ఏమీ ఇబ్బంది లేనట్లే దేహం వీగినా విడచినా తాను మరణించడు అనే జ్ఞానం కలిగిన జీవుడే ఈశ్వరుడు. ఆ జ్ఞానం సంప్రాప్తిస్తే అదే స్వస్వరూపానుభూతి, ఈశ్వర భావన. నేను మళ్ళీ జన్మిస్తాను పునర్జన్మను పొందితే ఏమవుతుంది అని చాలా మంది అనుకోవచ్చు కానీ ఇక్కడ జగద్గురువు ప్రతిపాదిస్తున్న అంశమేమంటే జన్మ అనేది లేనిది అంటున్నారు, జన్మ అనేది ఉంటే అది శోకాలయంగా దుఃఖాలయంగా అవుతుంది, నాకు పుట్టుక చావు లేదని నేను నిత్యుడనని, శాశ్వతుడనని దర్శిస్తే నాలోని నాకు జన్మ లేదని జన్మే లేనప్పుడు మరణము లేదని నిశ్చయ జ్ఞానం దర్శితమవుతుంది. ఇదే జగద్గురువు చెప్తున్న సత్యం ఆంతర్యం. ఈ జ్ఞానం మనకు సంప్రాప్తించినప్పుడు దుఃఖాలకు లోనయ్యే విధంగా జనన మరణాలు జరగదు. జనన మరణాలు లేని అద్వితీయమైన స్థితిలో దేహంలో ఉంటూనే దేహమే లేనటువంటి అత్యున్నతమైన జీవంతో కూడుకున్న అత్యుత్తమ జీవితాన్ని కొనసాగిస్తాడు. ఈ అంశం మనకు విజ్ఞాన సహితం కావాలి. అప్పుడే మహాత్మ స్థితికి చేరుకొని దుఃఖాలయం అశాశ్వతం అయిన పునర్జన్మను తిరిగి పొందే పరిస్థితి సంభవించకుండా త్రివిధ తాపాలను గమనించి జయించి పరమపదంలోకి ప్రవేశించి పరిపూర్ణులు అవుతారు.

8అ, 16శ్లో.

ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోర్జున |

మాముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న విద్యతే |16 |

అర్జునా! బ్రహ్మలోకపర్యంతము ఉన్న సమస్త లోకములును పునరావృత్తములు. " కౌంతేయా! (ఈలోకములన్నియును కాలమునకు పరిమితమైనవి. కాని, నేను కాలాతీతుడను) కనుక, నన్ను చేరినవానికి పునర్జన్మ యుండదు.

భూతాలన్నీ ఇక్కడ ఉత్పత్తి అవుతాయి, పుడతాయి అందుకే జగద్గురువు భువనం అంటున్నారు. బ్రహ్మభువనం అంటే బ్రహ్మలోకం బ్రహ్మలోకంతో సహా లోకాలన్నీ పునరావర్తన స్వభావం గలవి. ఇక్కడ సాధారణ స్థాయి మనిషికి సందేహం కలిగే అవకాశం ఉంది ఎందుకంటే బ్రహ్మ దేవుడు కదా బ్రహ్మ సృష్టికర్త కదా అలాగే దేవతలు చేరే లోకాలన్నీ కూడా దైవ లోకాలు కదా అవి ఎలా పునర్జన్మకు కారణమవుతాయి అని ఈ అంశానికి బీజం మనం 6వ అధ్యాయంలోనే ఏర్పరచుకున్నాం. 6-41లో పుణ్యలోకాలలో చేరి అనేక సంవత్సరాలు అక్కడ వసించి తిరిగి మళ్ళీ జన్మిస్తారని చూసాం. ఇందుకు సాక్ష్యాలు భారతం భాగవతం నిండా మనకు కనిపిస్తాయి. మహాభిషుడు లాంటివారు అనేక పుణ్యకారాలు చేసి దేవతలను మెప్పించి బ్రహ్మలోకం చేరిన దైవ సమానులు. మరి

వీరందరూ కూడా బ్రహ్మసభలో నుంచి తిరిగి జన్మ తీసుకున్న విషయం మనకు తెలిసిందే. ఈ మహాబిషుడు గంగాదేవి కారణంగా తిరిగి సంతనుడుగా జన్మించిన విషయం మనకు మహాభారతంలో దర్శనమిస్తుంది. కానీ పరమాత్మను పొందితే ఎన్నటికీ జన్మ ఉండదు. బ్రహ్మలోక పర్యంతం గల సమస్త లోకాలు కూడా దృశ్యంలోనే అంతర్గతములై ఉంటాయి, అందుకే అవి జన్మకు హేతువులు. దైవం అనేది దృశ్యం కాని నామరూప గుణ రహితమైనది కదా అది దేశ కాల క్రియలకు వశం కాకుండా పరిణామం లేకుండా నాశితం లేనిదిగా ఉంటుంది. అలాంటి పరమాత్మ పరమపదానికి చేరిన వారికి కర్మ, జన్మ లేదు. కాబట్టి పునరావృత్తితో కూడిన స్వర్గాది ఇతర లోకాలను గురించి ప్రయత్నించి జీవితాన్ని జన్మను వృధా చేయకుండా విరాగంతో నిత్యానుస్మరణతో అనన్య భక్తితో కాలాతీతుడైనటువంటి నిర్గుణుడు, నిరాకారుడు అయినటువంటి నన్నే పరమ పదాన్నే చేరుకోవడమే శ్రేయస్కరం. బ్రహ్మలోకాలు దైవ లోకాలు కాలాతీతమైనవో కావో తరువాతి శ్లోకంలోని చర్చ ద్వారా మనం సమగ్రంగా చూస్తాం. అందుకే ఇక్కడ ఈ శ్లోకాన్ని సంక్షిప్తంగానే చూస్తున్నాం. లోకాలను చేరిన వారికి లోకానుభవం కలుగుతుందే గాని దుఃఖం ఎలా దూరమవుతుంది, జన్మ ఉంది అనుకుంటున్న వారెవ్వరూ దుఃఖాలయానికి దూరం కాలేరు. పరిమితలోకాన్ని పొందేవారు మరోపరిమిత లోకాన్నే పొందుతారు గాని పరిపూర్ణులు కాలేరు కదా. గొప్పదైన ఆత్మను తెలుసుకున్నవారు జ్ఞానవంతులు మహాత్ములు అని మనం చూశాం ఆత్మను తెలుసుకోవడం అన్నా పరమాత్మను తెలుసుకోవడం అన్నా ఒకటే అవుతుంది. ఆత్మజ్ఞానమే పరమాత్మ జ్ఞానం, జీవుడే దేవుడు. ఈ అనంత ఆత్మజ్ఞానం తెలిసిన వారు మాత్రమే పరిపూర్ణులు, వీరికి జన్మ ఉండదు. పరిమితమైనది ఏదైనా అది అంతం కలిగినదే కదా, సృష్టి జరిగింది అంటే ఏదో ఒక కాలంలో అది ప్రళయంలో నైనా నశించాల్సిందే కదా. ఈ విషయంలో బ్రహ్మలోకం కూడా మినహాః కాదు. ఈ సృష్టికి పూర్వం బ్రహ్మలోకం లేదు కాబట్టి ప్రళయంలో కూడా బ్రహ్మలోకం నిలబడదు. లోకాలన్నీ కూడా బ్రహ్మలోకంతో సహా కాలంలోనే కాలంతోనే నడుస్తుంది. కాల పరిధిలోనివే ఇవన్నీ కూడా బ్రహ్మలోకం సైతం కర్మచేతే సృష్టితమైనది కదా. సృష్టే కర్మ అని మనం చూశాం, కాబట్టి అది కూడా విడువ తగినదేనని తెలియాలి. వేద ప్రతిపాదిత లోకాలు కర్మలు అన్నీ కూడా ఈకోవకే చెందుతాయి. త్రైగుణ్యవిషయా వేదా మనం రెండవ అధ్యాయంలోనే చూశాం. మనం బ్రహ్మలోకం లేదా సృష్టికర్త మూల శక్తిని గురించి కూడా తెలుసుకున్నాం. అక్కడ వరకు మనం మన విద్యాభ్యాసాన్ని కొనసాగించాం. అక్కడికి మనం చేరాక తానే బ్రహ్మ అని తానే సృష్టికర్త అని తెలుసుకున్నప్పుడు సృష్టికి ఆవల ఉన్నటువంటి దేశకాలాలకు అతీతమైన పరమపదం మనకు స్వయంగా విజ్ఞాన సహితం అవుతుంది. అందుకే జగద్గురు చెప్పినటువంటి బ్రహ్మ లోకంతో సహా అనే అర్థాన్ని గ్రహిస్తే బ్రహ్మలోకం చేరిన స్థితి నుంచి కూడా సదా దైవ స్మరణతో ఉన్నతోన్నతమైన మోక్షధామాన్ని పరమ పదాన్ని దర్శించి పరిపూర్ణులు అవుతారు. ఇక ఇందులో తెలిపినటువంటి బ్రహ్మలోకంతో సహా సమస్థ లోకాలు ఎలా కాలపరిధికి సంబంధించినవో తెలిపేటటువంటి తరువాతి శ్లోకాన్ని అక్షర పరబ్రహ్మం తో యోగమై విజ్ఞానసహితం గావించుకుందాం.

8అ, 17శ్లో.

సహస్రయుగపర్యంతమ్ అహర్యద్బ్రహ్మణో విదుః

రాత్రిం యుగసహస్రాంతాం తే అహోరాత్రవిదో జనాః | 17 |

వేయి చతుర్యుగముల కాలము బ్రహ్మకు ఒక పగలు' అనియు, అంతే కాలము ఆ బ్రహ్మకు ఒక 'రాత్రి' యనియు తెలిసిన యోగులు కాలతత్త్వమును నిజముగా ఎఱిగినవారు.

మనం నాలుగవ అధ్యాయంలోని ఎనిమిదవ శ్లోకంలో కాలగణనలకు సంబంధించిన వివరాలను చూసాం అందుకు కొనసాగింపుగా ఈ శ్లోకం మనకు అవగాహన కావడానికి మరికొన్ని అంశాలను పరిశీలించి ఈ శ్లోకాన్ని చూద్దాం. ఇక్కడ యుగం అంటే కృత, త్రేతా, ద్వాపర, కలియుగం ఈ నాలుగు యుగాలను కలిపిన ఒక మహాయుగం అని అర్థం. సహస్రయుగ పర్యంతం, వెయ్యి చతుర్యుగాల కాలం అంటే వెయ్యి మహా యుగాలు బ్రహ్మకు ఒక పగలు, అంతే కాలం బ్రహ్మకు ఒక రాత్రి. ఈ విషయం తెలిసిన యోగులు కాలతత్వాన్ని నిజంగా ఎరిగినవారు అవుతారు. దీన్ని బట్టి బ్రహ్మలోకం లేదా బ్రహ్మ స్థితిలో కూడా కాలఅవధి కాలగణన ఉంది. అలాంటప్పుడు ఆ స్థితి కూడా ఆ లోకం కూడా కాల పరిధిలో ఉన్నట్లే కదా. ఇక్కడ నుంచి కూడా మనం మరింత మరింత ఉన్నతోన్నత స్థితిని చేరుకోవాల్సిన అవసరం ఉంది. అదే మన లక్ష్యమైన కాలాతీత బ్రహ్మాతీత పరబ్రహ్మ స్థితి, బ్రహ్మ కంటే పరమైన స్థితి. మనం నాలుగవ అధ్యాయం ఆరంభంలోనే అనేక సందర్భాల్లో అవ్యయం, సనాతనం, నిత్యం అని సమగ్రంగానే చూసాం. 8- 9 లోనూ ఆ పరమపదం పరబ్రహ్మం లక్షణాన్ని సవివరంగా తెలుసుకున్నాం. ఆ లక్షణాలను మనం ఇక్కడ సమన్వయం చేసినప్పుడు బ్రహ్మలోకానికి బ్రహ్మకు కూడా కాలమానం ఉందని నిర్ధారణ అవుతుంది. బ్రహ్మకు, తమస్సుకు ఆవల కాలపరిధితో సంబంధం లేనటువంటి కాలాతీతమైనటువంటి అక్షరుడ్ని , అవ్యయాన్ని పరంధామాన్ని మనం దర్శించాలి. అదే మనంగా మనమే అదిగా కాలాతీతంగా మనం రూపాంతరం చెందాలి. మనం గడియారం చూసి తెలుసుకుంటున్న మనం అనుకుంటున్న సమయం మాత్రమే కాలం కాదని తెలియాలి. ఉదయమో సాయంత్రమో లేదా ఈ 24 గంటలలో ఏదో సమయాన్ని చూసి ఇప్పుడు ఇంత సమయం అని అనుకోవడానికి లేదు. అది కేవలం సృష్టికి సంబంధించిన భౌతిక ప్రపంచం నడుస్తున్న సూర్యచంద్రుల గమనానికి సంబంధించిన సమయమే గాని అది మాత్రమే కాలం కాదు. కాల గణనం అనేది వేరుగా ఉంటుంది, ఈ అంశాలన్నీ కూడా మనం ప్రథమ షట్కంలో చర్చించాం. ఆ అవగాహన ఉంటేనే ఈ శ్లోకం విజ్ఞాన సహితం అవుతుంది. బ్రహ్మ కాలమానం, సృష్టికర్త కాలమానం మనకు తెలిస్తేనే కనీసపు కాల గణనపై మనకు అవగాహన ఉన్నట్లు భావించాలి. మానవుల కాల ప్రమాణం కంటే దేవతల కాల

ప్రమాణం 360 రెట్లు ఎక్కువ. మన ఒక సంవత్సర కాలం దేవతలకు ఒక్క రోజుతో సమానం, మన 30 సంవత్సరాలు దేవతలకు ఒక నెల. మన 360 సంవత్సరాలు దేవతలకు ఒక దివ్య సంవత్సరం. ఇలాంటి 12 వేల దివ్య సంవత్సరాలు వారికి ఒక దివ్య యుగం. ఇది ఈ శ్లోకంలో చర్చించిన చతుర్యుగ కాలానికి సమానం. ఇది సహస్రయుగ పర్యంతం ఇలాంటి 1000 దివ్య యుగాలు బ్రహ్మకు ఒక పగలు. ఈ ఒక పగటి కాలాన్ని కల్పం, స్వర్గ, సృష్టి అంటారు. అలాంటి వెయ్యి దివ్య యుగాలు బ్రహ్మకు ఒక రాత్రి, దీన్నే ప్రళయం అంటారు. ఈ ఒక పగలు ఒక రాత్రి బ్రహ్మ యొక్క ఒక రోజు, ఇలాంటి 360 రోజులు ఒక సంవత్సరం, ఇలాంటి వంద సంవత్సరాలు బ్రహ్మ ఆయువు కాలం. ఈ కాలం తెలుసుకున్నవారే నిజంగా కాలతత్వాన్ని ఎరిగినవారు. ఒక కల్పం అంటే సృష్టి స్థితి లయల మధ్యకాలం. మన నాలుగు యుగాలతో కలిపిన ఒక మహాయుగం బ్రహ్మ కాలమానం ప్రకారం 43.2 సెకండ్లు మాత్రమే. ఈ భౌతిక జగత్తును సృష్ట్యాది నుంచి చూస్తే మనం ప్రస్తుతం 71 మహా యుగాలలో 28వ మహాయుగంలోని కలియుగం నడుస్తోంది అందులో మనం ఉన్నాం.

భాగవతం అష్టమస్కంధంలో మన్వంతరాల వివరణ ఉంది. ప్రస్తుతం వైవస్వత మన్వంతరంలో 27 మహాయుగాలు గడిచి 28వ మహాయుగంలోని కృప, త్రేత, ద్వాపర యుగాల తరువాత కలియుగం నడుస్తోంది. హిందూ శాస్త్రం ప్రకారం ఒక మనువు పాలన కాలాన్ని మన్వంతరం అంటారు. ఒక్కొక్క మన్వంతరం 30 కోట్ల 84 లక్షల 48 వేల సంవత్సరాలు జరుగుతుంది. బ్రహ్మ యొక్క ఒక్కరోజు 14 మన్వంతర పగళ్ళు, 15 మన్వంతర రాత్రులు ఉంటాయి. ప్రస్తుతం మనం ఏడవ మన్వంతరంలో ఉన్నాం. ప్రతి మన్వంతరం 71 మన్వంతరాలుగా విభాజ్యమై ఉంది. బ్రహ్మాండాలన్నింటిని కాలం గ్రసించివేస్తుంది, అంటే మింగేస్తుంది. ఈ కాలమే సమస్తాన్ని మింగేస్తుంది, అయితే ఆ కాలాన్ని కూడా పరమాత్మ మింగేస్తాడు.

అందుకే పరమాత్మ అంతకాంతకుడు అంతాన్ని అంతమొందించేవాడు, కాబట్టి ఇంతటి ఆద్యంతాలన్నీ కూడా ఏ మహనీయుని యందు ఏ మహాత్ముని యందు కల్పితాలై తిరిగి వెలయుచూ ఉందో అలాంటి నిత్య సత్య స్వరూపాన్ని మనం ఆశ్రయించాలి. ఇలా మనం చూస్తే లోకంలో నివసించే వారిలోకులు లోకాలు నిత్యమైనవి కావు లోకులు నిత్యలు కారు. లోకాలు, లోకులు అన్నీ కూడా అశాశ్వతాలై నశించిపోతూ ఉంటాయి. మనుషులు ఉండేది మనుష్య లోకం దేవతలు ఉండేది దేవ లోకం, ఈ మొత్తాన్ని నడిపించే బ్రహ్మ ఉండేది బ్రహ్మ లోకం. అదే ముందు శ్లోకంలోని బ్రహ్మ భువనం. బ్రహ్మ ఉన్నంతవరకు బ్రహ్మ లోకం ఉంటుంది, బ్రహ్మలోకం ఉన్నంతవరకు బ్రహ్మ ఉంటాడు. బ్రహ్మ ఆయుర్దాయమే బ్రహ్మలోక ఆయుష్షు. ఇదంతా కూడా మానవీయకాల ప్రమాణంతో మానవులకు, దైవిక కాల ప్రమాణంతో దేవతలకు, బ్రహ్మ కాల ప్రమాణంతో బ్రహ్మకు కూడా నియమితమై ఉంటుంది. దీన్నిబట్టి బ్రహ్మలోకం కూడా కాలగర్భంలోనే ఇమిడి ఉండి ఒకానొక సమయంలో అది కూడా నశిస్తుందని నిర్ధారణ అవుతుంది. మనం ఈ శ్లోకంలో చెప్పుకున్న సూత్రం ప్రకారం కాల తత్త్వాన్ని ఎరిగిన వారి లక్షణం ఏమంటే ఈ కాలానికి లోబడిన వాటి పట్ల సమస్త

దృశ్యమయ ప్రపంచం పట్ల విరాగాన్ని కలిగి ఉండడం. అందువల్ల కాలతత్వాన్ని ఎరిగిన బ్రహ్మత్వపు అవగాహనతో అక్కడి నుండి కూడా కాలాతీతుని యొక్క 8-9లోని లక్షణాలు గల శాశ్వతుని యొక్కఠ పరమపదాన్ని పొందడమే మానవ జీవిత పరమార్థం. అక్కడికి మనల్ని తీసుకెళ్లగలిగిందే భగవంతుని భగవద్గీత మార్గం. ఇలా కాలాన్ని దాటి కాలాతీతులైన వారే కాలతత్వాన్ని ఎరిగిన కాలజ్ఞానం కలవారు, అహోరాత్ర విదులు. ఈ అహోరాత్ర విదులు మనకు అవగాహన కావడానికి ఇంతటి చర్చ మనం చేయాల్సిన అవసరం వచ్చింది. నాలుగు యుగాలు కలిసిన ఒక మహాయుగం ఒక దివ్య యుగం అలాంటి మహాయుగాలు వెయ్యి కలిస్తే బ్రహ్మకు ఒక పగలు, అదేవిధంగా వెయ్యి దివ్య యుగాలు అంటే వెయ్యి మహాయుగాలు బ్రహ్మకు ఒక రాత్రి. ఇలా మానవుల దేవతల బ్రహ్మ ఈ మొత్తం కాలాన్ని అవగాహన చేసుకున్న వారే ఈ శ్లోకం లో జగద్గురువు ప్రతిపాదిస్తున్న అహోరాత్ర విదులు.

8అ, 18శ్లో.

అవ్యక్తాద్వ్యక్తయః సర్వాః ప్రభవంత్యహరాగమే ।

రాత్ర్యాగమే ప్రలీయంతే తత్రైవావ్యక్తసంజ్ఞకే ।। 18 ।।

ఇక్కడ అవ్యక్తం అంటే మూల ప్రకృతి లేదా మనం చెప్పుకున్న మూలశక్తి అని తెలియాలి. పురుషుని మాయ లేదా బ్రహ్మ దేవుని పగలు ప్రారంభం కాగానే అవ్యక్తం నుండి సమస్త ప్రాణులు పుడుతున్నాయి, బ్రహ్మకు రాత్రి కాగానే అదే అవ్యక్తంగా లయమవుతున్నాయి. ఒకసారి ఈ ప్రపంచంలో మనం చూస్తున్నటువంటి వ్యక్త అవ్యక్తాలను, మన జీవితాల్ని సరదాగా అవలోకనం చేసుకుందాం. ఈ భూమండలం ఓ రంగస్థలం, ఎక్కడెక్కడ నుంచో నటీనటులొచ్చి రంగులు వేసుకొని అద్భుతంగా నటిస్తుంటారు. తల్లి తండ్రి బిడ్డలు కోడళ్ళు అల్లుళ్ళు ఇతర బంధు మిత్రులందరూ కలిసి ఈ భూలోకం అనే వేదికపై వేసే నాటకంలో పాత్రధారులే. ఒకరు చెప్పడం మరొకరు వినడం ఇంకొకరు వినకపోవడం అభిప్రాయ భేదాలు తగాదాలు సర్దుబాట్లు దుఃఖాలు సుఖాలు ఏడుపులు నవ్వులు విరహాలు కలయికలు అబద్ధాలు నిజాలు అసత్యాలు, సత్యాలు కుట్రలు మోసాలు ఎత్తులు జిత్తులు అన్నీ యధావిధిగా జరిగిపోతూ ఉంటాయి. ఆ నాటకం సుఖాంతము కాదు, దుఃఖాంతము కాదు. వ్యక్తమైన నటీనటులందరూ తమ తమ రంగులు కడిగేసుకుని ఎటువారటు అవ్యక్తంలోకి జారిపోతూ ఉంటారు. నూతన నటీనటులు వస్తూ మరో నాటకం ప్రారంభమౌతూ ఉంటుంది. అయితే వేషాలు రంగులు మారుతున్నా మొదటి నాటకమే ఇంకా ముగియనే లేదు, అందులో నుంచే తరువాతి నాటకం ప్రారంభమవుతుంది. పాపం మహామేధస్సులనుకునే ఈ అల్ప మనుషులకు ఆ వాస్తవం తెలియదు. జీవితమనేది ఓ రంగుల రంగస్థలం అని మనందరం ఈ రంగస్థలంపై నాటకంలోని నటీ నటులమని ఈ నాటకానికి కర్త, సూత్రధారి

పరమేశ్వరుడని తెలుసుకోలేనటువంటి మేధ ఈ మనిషిది. అన్నీ తానే, అన్నీ తనవే అనుకునే అల్పుడు ఈ మనిషి. ఈశ్వరుని నిర్దేశం ప్రకారం మనం మన పాత్రల్ని నటించి తెరచాటుకు వెళ్ళిపోతాం. ఆ నాటకంలోని ఆ పాత్ర మళ్ళీ రాదు, అదే నాటకం ఆ పాత్రధారులతో మరో ప్రదర్శన జరగనూ జరగదు. కానీ మనం ధరించిన పాత్ర మీద మమకారంతో ఆ పాత్రనే పట్టుకొని వేలాడుతూ ఉంటాం. ఈ పాత్ర ఈ నాటకం వరకే, పాత్రధారి పాత్రధారణ చేస్తున్నంత మేరకే నిజం. ఈ జీవితం జీవిస్తున్నంతకాలమే కనిపిస్తున్నట్లు అనిపిస్తుంది, నాటకంలోని పాత్రలా. అందులోంచి బయటికి వచ్చాక మిగిలిందే అసలైన జీవితం, అదే వాస్తవం. ఇలా ప్రాణి సమూహం మూల ప్రకృతికి, బ్రహ్మకు పగలుకాగానే వ్యక్తం అవుతాయి, రాత్రి కాగానే అవ్యక్తం లోకి జారుకుంటూ ఉంటాయి. ఇదే బ్రహ్మ మాయ మూలప్రకృతి యొక్క ప్రకృతి. బ్రహ్మ యొక్క నిద్రావస్థ అవ్యక్తం, అవ్యక్తం నుండి స్థావర జంగమ లక్షణమైన జీవులందరూ కూడా వ్యక్తమవుతూ ఉన్నారు. ఎప్పుడు అంటే బ్రహ్మకు పగలు ప్రారంభంలో తెల్లవారేటప్పుడు. అందుకే మనం సూర్యోదయానికి ముందు సమయాన్ని బ్రహ్మ ముహూర్తం అంటూ ఉంటాం, అంటే బ్రహ్మ మేల్కొనే వేళ. అలాగే బ్రహ్మకు రాత్రి అవుతూనే బ్రహ్మ నిదురించే వేళ, ఇప్పుడు ఏం జరుగుతుంది అంటే ఇదే అవ్యక్తమనే దానిలో ఈ వ్యక్తాలన్నీ కూడా లయమవుతోంది. ఇక్కడ వ్యక్తం అంటే సృష్టి ఆరంభ కాలం, అవ్యక్తం అంటే ప్రళయ కాలం. ఇలా మనం అర్థం చేసుకోవాలి. బ్రాహ్మణుడు అలాగే బ్రహ్మకు రాత్రి కాలం ఇలా మనం అర్థం చేసుకోవాలి. ముందు శ్లోకాలలోని అవగాహనతో ఈ శ్లోకాన్ని మనం సంక్షిప్తంగా చూడాలి. మనం అనుకుంటున్న రాత్రి పగలు కాదు ఈ బ్రహ్మకు పగలు అంటే ఏదో, బ్రహ్మకు రాత్రి అంటే ఏదో, అది తెలుసుకున్న వారే నిజంగా రాత్రి పగలు తెలిసినవారు, కాలం తెలిసినవారు అని మనం తెలుసుకున్నాం. పగలు రాత్రి, సృష్టి ప్రళయాలు అని మనకు తెలియాలి. ఒక్క పరమాత్మ పరమపదం తప్ప తక్కినవన్నీ కూడా చావు పుట్టుకలు కలవేనని మనం చూసాం. ఆ పదార్థాలన్నీ కూడా పరమాత్మ మాయలో పురుషుని అవ్యక్త మాయలో మూల ప్రకృతి లోనే ఉద్భవించి, లయిస్తూ ఉన్నాయి. నిద్ర రాత్రి అనే చీకటిలో స్వప్న పదార్థాలన్నీ సృష్టితమై మరలా అదే తమస్సులోనే విలీనమైపోతూ ఉంది. ఇందులో మేలుకొని ఉన్నవారికి ఏ సంబంధమూ ఉండదు, అదే పద్ధతిలో ఈ దృశ్యమయ జగత్తు కూడా పురుషుని మాయ యందు అభాస రూపంలో ఉన్న అవ్యక్తంలో మూల ప్రకృతిలో ఉద్భవించి తిరిగి దాని అందే లయిస్తూ ఉంటుంది. కాబట్టి ఈ సృష్టి ప్రళయంలో వాస్తవంగా పరమాత్మకు ఏ సంబంధమూ లేదు. అయినా కూడా వాటికి ఆధారమై అధిష్ఠాన రూపుడై ఉన్నది, వెలుగొందుతూ ఉన్నది పరమాత్మే.

8అ, 19శ్లో,

భూతగ్రామః స ఏవాయం భూత్వా భూత్వా ప్రలీయతే |

రాత్ర్యాగమే వశః పార్థ ప్రభవత్యహరాగమే ||

పార్థా! ఈభూత (ప్రాణి) సముదాయము ప్రకృతివశమున మాటి మాటికిని ఉత్పన్నమగు చుండును. రాత్రి ప్రారంభకాలమున లీనమగు చుండును. పగటి ప్రారంభ కాలమున ఉత్పన్నమగు చుండును.

పూర్వకల్పమందు ప్రాణిసమూహమే కర్మాధీనమై పరాధీనమై మరలా ఈ కల్పమందు పుడుతోంది, మరలా మరలా పుడుతూ చనిపోతూ ఈ విధంగా సంసార మహాచక్రంలో తిరుగాడుతోంది. భూత్వా భూత్వా అని చెప్పడం వల్ల జీవుని జన్మలు ఒకటి రెండు కాదని జ్ఞాన ప్రాప్తిచే కర్మ అంతమయ్యే వరకు ఎన్నో ఎన్నెన్నో జన్మలెత్తుతూనే ఉంటుందని స్పష్టమవుతోంది. కర్మ బద్ధుడు కాబట్టి జీవుడు అవశుడు అంటున్నారు. ఈ విషయం జీవులు ప్రకృతి వశం చేత కర్మానుసారంగా వివశులై అస్వతంత్రులై పుడుతున్నాయని మనం 3-33 లో సమగ్రంగా చూసాం. ఆ శ్లోకాన్ని సమగ్రంగా అవగాహన చేసుకొని ఈ శ్లోకాన్ని సంక్షిప్తంగా చూసి సమన్వయం చేసుకోవాలి. ఆశాపాశాలనే సంకెళ్లతో బద్ధులైనందువల్ల జీవుడు అస్వతంత్రుడై పరాధీనుడై ఉన్నాడు. ఈ శ్లోకంలో చెప్పిన రాత్రి పగలు మన కాలమానం కాదు, ఇది బ్రహ్మ కాలమానం. కాలం చాలా గొప్పది కాలమనేది చిత్ర విచిత్రమైనది, అది చాలా కఠినమైనది, కరుణాతప్తమైనది కూడా. మనల్ని కలిపింది ఈ కాలమే మనపై పొగలు సెగలు విరాజిమ్మింది ఈ కాలమే. ఆనందానికి తృప్తికి అసలు సిసలు నిర్వచనాలను సోదాహరణంగా ఇచ్చింది ఈ కాలమే, అవమానాలను అనుభవింపజేసేది ఈ కాలమే, ఎన్నో గౌరవాలను సన్మానాలను బిరుదులను అందించింది ఈ కాలమే. దుఃఖాలను చవిచూపించింది ఈ కాలమే. మనల్ని అవ్యక్తం లోకి జారిపోయేలా చేసేది ఈ కాలమే, వ్యక్తంలో కనిపించేలా చేసేది ఈ కాలమే. ఈ కాలగర్భంలో ఎన్నో దాగున్నాయి, ఎన్నెన్ని సత్యాలు మరుగుతున్నాయని మేధావులు రకరకాల పరిశోధనలు జరిపి ఏవేవో వెలికి తీశామంటున్నారు గాని వారికి అందనిది వారేనాటికీ అందుకోనివి వారి ఊహకు అందని రహస్యాలు కాలపేటిక నిండా ఉన్నాయి. ఎన్నెన్ని ఉన్నాయో కూడా ఈ మహా మేధావి అనుకుంటూ భ్రమిస్తున్న అల్ప మానవులకి తెలియదు.

ప్రాణి ఆవిర్భావ రహస్యం లాంటివి తన భౌతిక పరిశోధనలకు దృష్టికి అందదు. ఇవన్నీ కూడా ఎప్పటికప్పుడు తెలిసినట్టే ఉండి అసలేమీ తెలియకపోవడమే ఇందులో తెలుసుకోవాల్సిన దైవ రహస్యం. అధికారం పదవి లాంటి వ్యామోహంతో ఇరుక్కుపోయి సత్య దర్శనం చేయకనే ఎంతమంది పాలకులు అధికారులు అస్తమించారో సంపాదనలో పడి సర్వస్వాన్ని కోల్పోయిన వారు ఎందరో, అభినందనలు అనురాగాలు అవమానాలు అనుమానాలు అసూయలు కుట్రలు మోసాలు మౌన వేదనలు చిత్రహింసలు మొదలైన వాటన్నింటినీ కాలం జాగ్రత్తగా తనలో దాచుకుంటుంది. ఆకలికేకల్ని, ఆహాకారాల్ని విజయోత్సాహాల్ని అపజయాల్ని అవమానాల్ని ఎన్నింటినో తనలో ఇముడ్చుకున్నది కాలమే. ఇలా కాలదేవత ఎన్నింటిని తన గర్భంలో దాచుకుంటుందో, కాలానికి లోనైన మనిషి కాలంతో పాటు చేస్తున్న ఆగడాలకు స్వస్తి చెప్పి అసలు సిసలైన కాలాన్నెరిగి కాలజ్ఞానులై కాలాతీతులం అయితే ఎలా ఉంటుంది, అప్పుడు కాలంలో ఉంటూనే

కాలాతీతులుగా ఉంటాం. ఆ కాలం ఎంత ప్రశాంతంగా సుఖాంతంగా ఉంటుంది, కాలగర్భమంతా కూడా అప్పుడు శాంతి సౌధమే కదా, ఈ రొదలు వ్యధలు ఉండవు కదా. స్వామి కాల దేవుడా, అమ్మా కాలదేవత ఈ మనిషిని కాలాతీతుడుగా మారేటట్లు చూడు స్వామి, చూడు అమ్మా. అమ్మా అప్పుడే నువ్వు ఆ కాలాతీత శాంతి సౌధంలో ప్రశాంతంగా ఉండగలవు. లేకపోతే మనిషి తననే కాదు ప్రకృతినే కాదు కాల గర్భాన్ని కూడా ఇలాగే కలుషిత మొనర్చుతూనే ఉంటాడు. దీనికి అంతం లేదా? కాలాంతకా, అంతకాంతకా, జగద్గురు నీవే శరణ్యం. ఇది కాల రహస్యం, కాల స్వరూపం, కాల స్వభావం. కాబట్టి ప్రయత్నంతో ఈ జనన మరణ సంసారచక్ర పరిభ్రమణను వీడాలి. ఎన్నో కోట్ల జన్మలెత్తిన జీవుడు ఎన్నో జన్మల సుకృతం చేతనే ఇప్పుడు ఇలా మనం ఈ మానవ జన్మలో ఈ భగవంతుని మార్గంలో పయనిస్తున్నాం. దాన్ని సద్వినియోగం చేసుకొని జీవుడు దేవుడిగా పరిణతి చెంది మానవ జన్మకు సార్థకం చేకూర్చాలి. మానవ జన్మకు సార్థకతనిచ్చే కర్మ, జన్మ లేని స్థితిని ఆ జ్ఞానాన్ని పొందే వరకు కూడా జీవులు సృష్టి ఆరంభంలో పుడుతూ ప్రళయ కాలంలో లయిస్తూనే ఉంటారు. ఈ అంశాలన్నీ మనం పరిశీలన చేసిన తరువాత మనకు అర్థమయ్యేదేమంటే జన్మకు సార్థకత ఇచ్చే దిశగా అడుగులు వేసి ఆత్మ జ్ఞానంతో స్వస్వరూప అనుభవంతో కాలాతీతులుగా విశ్వవ్యాపక విశ్వమానవులుగా వర్ధిల్లాలి. అంతేకానీ కోట్ల జన్మలు ఎత్తుతూ జనన మరణ చక్రంలో ఇరుక్కుని బిక్కరిస్తూ ఉండకూడదు.

8అ, 20శ్లో.

పరస్తస్మాత్తు భావోఽన్యో ఽవ్యక్తోఽవ్యక్తాత్ సనాతనః ।

యః స సర్వేషు భూతేషు వశ్యత్సు న వినశ్యతి ॥ 20 ॥

ఆ అవ్యక్తమైన బ్రహ్మ కంటే మరొక అవ్యక్తం ఉంది, అదే సనాతనమైనది, సర్వభూతాలు నశించిన తరువాత కూడా అది నశించదు.

ఇక్కడ ఒక్క విషయం మనం గమనించి ముందుకు వెళ్లాలి. ముందు శ్లోకంలో చెప్పిన అవ్యక్తం మూల ప్రకృతి, బ్రహ్మ సృష్టికర్త ఈ అవ్యక్తము కాలపరిధికి లోబడినటువంటిది అయితే ఆ అవ్యక్తానికంటే పరమైన ఈ శ్లోకంలోని అవ్యక్తం బ్రహ్మాతీతమైన పరబ్రహ్మం. అందుకే ఇందులో రెండుసార్లు అవ్యక్తః అవ్యక్తః అని ప్రయోగించారు జగద్గురువు. మనం జాగ్రత్తగా ఈ అంశాన్ని గమనించి అర్థం చేసుకోవాలి. మొదటి అవ్యక్తమేమో మూల ప్రకృతి కాలగణనకు సంబంధించినది, కాలపరిధికి లోబడింది. రెండవ అవ్యక్తమేమో కాలాతీతమైనది, బ్రహ్మాతీతమైనది. ఈ అంశాన్ని స్పష్టంగా గ్రహించి రెండు అవ్యక్తాల భావాన్ని అర్థం చేసుకొని ముందుకు వెళ్లాలి. అందుకే జగద్గురువు ఇక్కడ సందేహానికి తావు

లేకుండా అవ్యక్తం కంటే మరొక అవ్యక్తం అని పేర్కొన్నారు. ఆ అవ్యక్తమే మనం 8-9 లో చర్చించిన లక్షణాలు గలది. అదే ఇంద్రియాలకు గోచరం కానిది అంటే ముందు శ్లోకంలో చర్చించిన సృష్టిని నడుపుతున్న కాల అవధితో కూడిన మూల ప్రకృతి కాక మరో అవ్యక్తమని అదే విశ్వవ్యాపకమని గుర్తించాలి. అంటే బ్రహ్మాది సర్వభూతాలు నశించినా కూడా నశించనిది. బ్రహ్మ లోకంతో సహా ఏ లోకాన్ని చేరినా అవశులై జీవులు పునర్జన్మను తప్పక పొందుతూనే ఉంటారు పరమేశ్వరుని పొందిన వారు మాత్రమే జన్మను సార్ధకం చేసుకున్నవారు అని మనం 8 -16 లోనే జగద్గురువు ప్రతిపాదించిన అంశాన్ని చూశాం. ఆ తరువాత మూడు శ్లోకాల్లో వాటిని నిర్ధారించి ప్రస్తుత శ్లోకంలో ఆ జన్మలేని కర్మ లేని జన్మకు సార్ధకతనిచ్చే అవ్యక్తం ఇదేనంటూ మనకు పరిపూర్ణాన్ని విజ్ఞాన సహితంగా ఇస్తున్నారని గ్రహించాలి. వ్యక్తం కన్నా పరమైనది అవ్యక్తం, మూల ప్రకృతి దీనికన్నా పరమైనది మరో అవ్యక్తం. ఈ మూడు పదాలను చాలా స్పష్టంగా ఇక్కడ అవగాహన చేసుకోవాలి. వ్యక్తం, అవ్యక్తం మరో అవ్యక్తం. ఆ మరో అవ్యక్తమే పరమపదం, అదే అక్షరం పరాత్పరం శ్రేష్టం. ఈ పరాత్పరస్వరూపానికి రూపం లేనందువల్ల అది ఇంద్రియాలకు అగోచరం. అలాగని లేనిది కాదు ఉన్నది శాశ్వతమైనది అదే. వ్యక్తానికి మూలమైన అవ్యక్త మూలప్రకృతి నశించినా మరో అవ్యక్తమైన తాను మాత్రం నిత్యసత్యంగా శాశ్వతుడిగా నాశనం లేనిదిగా అక్షరంగా అవ్యక్తంగా శోభిస్తూ ఉంటుంది. అందుకే అది సనాతనం, బ్రహ్మాది సమస్థ లోకాలు నశించినా పరాత్పరుడైన అవ్యక్త పరబ్రహ్మం నశించదు. అలాంటి పరాత్పర పరబ్రహ్మం పొందిన వారు తిరిగి పుట్టరు. ఇదే రాక లేనటువంటి పోక. ఈ రాక లేని పోక అయిన తిరిగి జన్మ కర్మ లేని జన్మకు సార్ధకతనిచ్చే పరమమైన పరమ పదం.

8అ, 21శ్లో.

అవ్యక్తోఽక్షర ఇత్యుక్త   స్తమాహుః పరమాం గతిమ్ |

యం ప్రాప్య న నివర్తంతే   తద్ధామ పరమం మమ | 21|

ఈ అవ్యక్తమునే అక్షరము అనియు అందురు. ఇదియే పరమగతి మరియు నా పరమధామము. ఈ సనాతన - అవ్యక్తమును అనగా నా పరంధామమును చేరినవారు మ� ల తిరిగిరారు.

వ్యక్త, అవ్యక్తములకు అన్యమైనది అతీతమైనది అయినటువంటి అవ్యక్త పరాత్పరుణ్ణి ముందు శ్లోకంలో చూసాం, ఆ పరాత్పరమైన అవ్యక్తమే అక్షరం. ఏది తెలుసుకుంటే ఇక

తెలుసుకోవాల్సిందేమీ ఉండదని మనం 7-2 లో చూసామో ఆ అవ్యక్త పరిపూర్ణం ఇదే, పునరావృత్తం లేనిది కూడా ఇదే, ఉత్పత్తి వినాశనం లేని శూన్య స్వప్రకాశ పరంధామం ఇదే. అందుకే జగద్గురువు ఇది నా స్థానం ఇదే నా పరంధామం, తద్ధామ పరమం మమ అంటున్నారు. తానున్న చోటును దివ్య ధామాన్ని మనకు విజ్ఞాన సహితం గావించడానికి తానే స్వయంగా మన చిటికెన వేలు వదలకుండా పట్టుకుని ఇక్కడిదాకా తీసుకొచ్చి ఇదే మరో అవ్యక్తం అని చెప్పి అక్షరం పరమగతి అయినటువంటి పరమాత్మ పరంధామాన్ని మనకు అనుభవైకవేద్యం చేస్తున్నారు. ఈ గతి పొందినవారు తిరిగిరారు, ఎందుకంటే మనం మానవ లోకాన్ని కాలాన్ని దేవతల లోకాన్ని కాలాన్ని బ్రహ్మలోకాన్ని బ్రహ్మ కాలాన్ని కూడా దాటుకుంటూ అధిగమిస్తూ అతీతమైనటువంటి పరంధామంలో ఇప్పుడు ఉన్నాం. ఇది చాలా శ్రేష్ఠమైనది పరమ పవిత్రమైనది కాలాతీతమైనది అక్షరమైనది, ఈ గతిని పొందిన వారు తిరిగి రారు. అందుకని ఇక్కడ ఇదే నా పరమపదం అని మనకు దర్శింప చేస్తున్నారు. వివేకులు మాయ ప్రభావానికి లోబడకుండా సర్వ శ్రేష్ఠమైన పరమాత్మ దివ్య పరంధామమైన ఆ మరో అవ్యక్త పరంధామాన్ని అన్వేషించాలి. ఆ అక్షర పరబ్రహ్మన్నే పునరావృతం లేని శాశ్వత కైవల్యాన్ని చేరాలి గాని అల్పమైన ప్రాపంచిక పదవులను కాదు అని మనం గ్రహించాలి. అలాంటి అవ్యక్త అక్షర పరబ్రహ్మ పదాన్ని పొందే ఉపాయాన్ని తెలిపే తరువాతి శ్లోకాన్ని అక్షర పరబ్రహ్మంతో యోగమై అభ్యసిద్దాం.

8అ, 22శ్లో.

పురుషః స పరః పార్థ భక్త్యా లభ్యస్త్వనన్యయా |

యస్యాన్తఃస్థాని భూతాని యేన సర్వమిదం తతమ్ || 22 ||

ఓ పార్థా! సమస్త భూతములు (ప్రాణులు) ఆ పరమాత్మయందే అంతర్గతములై యున్నవి. ఆ సచ్చిదానంద ఘనపరమాత్మచేతనే ఈ జగత్తంతయు వ్యాప్తమై (పూర్ణమై) ఉన్నది. అట్టి - సనాతన- అవ్యక్త పరమ పురుషుడు అనన్యభక్తి ద్వారా మాత్రమే లభ్యుడగును.

ఇక్కడ భక్తి అనే శబ్దాన్ని ఎనిమిది అధ్యాయాలుగా మనం చర్చిస్తున్నటువంటి విశ్వవ్యాపక వాసుదేవుని సదా అనుస్మరించే అనుసరించే ఆచరించే భక్తిగా తెలియాలి. అంతేగాని ఏ కొంతసేపు మాత్రమే నియమిత సమయాల్లోనో రోజుల్లోనో మాత్రమే చేసి తాత్కాలిక ప్రక్రియ కాదని గ్రహించాలి. పరమాత్మ స్వరూపాన్ని పొందే మార్గమైనటువంటి సాధ్యం సాధనం రెండింటిని కూడా ఈ శ్లోకం స్పష్టంగా ప్రతిపాదిస్తుంది. అనేక ప్రాణికోటితో నిండి నిబిడీకృతమైనటువంటి ఈ సమస్త జగత్తు ఎక్కడ ఉంది ? దానికి ఆధారమేమి అని మనం చూస్తే పరమాత్మ అనే ఆధారంపై అధిష్ఠానం పై ఈ చరాచర ప్రపంచమంతా కూడా పాములాగా కల్పితమై కనిపించే తాడు లాగా ఉంది. అంటే తాడులో లేని పాము ఉన్నట్లు మనల్ని భ్రమింప చేస్తుంది, అలాగే మనకు లేని ఈ ప్రపంచం లేకనే ఉన్నట్లు కల్పితమై

మనకు అలా తోస్తూ ఉంది. ఈ జగత్తు అంతా కూడా సద్వస్తువైన పరమాత్మలో అధ్యస్తమై వెలుగొందుతూ ఉంది. సమస్త ప్రాణికోటి యుక్తమైన ప్రపంచమంతా కూడా ఈ పరిపూర్ణమందే ఆత్మయందే ఇమిడి ఉంది, ఆత్మ చేతనే ఇది పరివ్యాప్తమై ఉంది. పాలలో వెన్న వ్యాపించి ఉన్నట్లు ఈ జగత్తు అంతా కూడా పరమాత్మ వ్యాపితమై ఉంది. అలాంటి సాధ్యమైనటువంటి విశ్వవ్యాపిత పరమాత్మ సాధారణ స్థాయి జీవులకు ఏ విధంగా లభ్యమవుతుంది అంటే 'భక్త్యా లభ్యస్త్వనన్యయా' ఇది సాధనం. అనన్య భక్తి అంటే ఏమాత్రం క్షణకాలం కూడా ఏమరుపాటు లేని ఎడతెరపిలేని సదా అనుస్మరణ సదా అనుచరణ. ఎలాంటి దృశ్యమైన పదార్థాలయందు ఏ విధమైనటువంటి ఆసక్తి లేకుండా కొంతసేపు భగవంతునిపై ఇంకొంతసేపు ప్రాపంచిక విషయాలపై కాకుండా అనన్య భక్తి చేతనే పొందగలం. ఈ సాధ్యం, సాధనం రెండింటిని అర్థం చేసుకొని ఈ ఉపాయం ద్వారా మనం మన లక్ష్యాన్ని ముందు శ్లోకంలో చెప్పినటువంటి గమ్యాన్ని, పరమపదాన్ని చేరాలి. సమస్త జగత్తు వ్యాపితమై ఉన్నది పరమాత్మ చేతనే ఇది సాధ్యం, ఆ పరమాత్మను పొందడానికి సాధనం అనన్య భక్తి. మనం పరిపూర్ణులు అయితేనే కదా ఆ పరిపూర్ణత మనకు దర్శితమవుతుంది. మన దృష్టి బాహ్యం వైపే ఉంటే వీలు కాదు కదా. ఈ పరిపూర్ణతను సంతరించుకోవడానికే మనం చేస్తున్న ఎనిమిది అధ్యాయాల అధ్యయన అధ్యాపక ప్రయత్నం. ఈ మార్గంలో అధ్యయనం చేసి అధ్యాపన చేసి అధిష్టానాన్ని అంటే సమస్త జగత్తుకు మూలాధారమైన అధిష్టాన పరబ్రహ్మాన్ని పొందే మార్గంలో ప్రయాణిస్తూ ఆ మార్గాన్నే ఇతరులకు బోధిస్తూ నేర్పిస్తూ అభ్యసింపజేస్తూ అధ్యయనం చేయించే వారే అధ్యాపకులు. అధ్యాపకులు అనే శబ్దానికి అర్థం వేద మార్గాన్ని విదితం చేయించేవారు అని శబ్ద రత్నాకరం నిఘంటువు నిగ్గు తేలుస్తుంది. అందుకు సాధనమే అనన్యమైన శ్రద్ధా భక్తులు. ఆత్మే బ్రహ్మమనే స్వరూప విచారమే భక్తి ఇదే అనన్య భక్తి. కార్యరూపంలో తెలిసే సమస్త భూత ప్రపంచానికి కారణమైన పరమాత్మనే దర్శించే దిశగా విచారించడం. కార్యరూపంలో తెలిసే కెరటాలకు కారణమైనటువంటి కడలి కెరటాల నుంచి వేరుగా ఉండదు కదా, అలాగే సమస్త చరాచర భూతజాలమంతా కూడా పరమేశ్వరుని యందే ఉంది. కార్యాలైన కెరటాలలో కడలి నీరై వ్యాపించినట్లు కార్యరూపమైన ఈ జగత్తంతా కూడా కారణ రూపుడైన పురుషుని చేతనే వ్యాపితమై ఉంది. ఈ అఖండ స్థితిని గుర్తించడం ఎలా అంటే అనన్య భక్తితోనే వీలవుతుంది. అప్పుడే అఖండస్థితి పరిపూర్ణం సాధ్యం. అవ్యక్తం కన్నా అన్యమైన మరో అవ్యక్తరూపుడే అక్షర పరబ్రహ్మం అని 20వ శ్లోకం లో చూసాం, అది సర్వ శ్రేష్టమని గ్రహించాం. ఆ పరమ పదాన్ని పొందితే తిరిగి జన్మకు రావడం జరగదు అందులో సందేహము లేదని నిరూపించుకున్నాం కూడా. అలాంటి అక్షర పరబ్రహ్మం చేరే పొందే ఉపాయ సూచి ఈ శ్లోకమంత్రం. పురుషః అంటే పురుషుడు పురం అంటే ఈ శరీరం అనేటటువంటి పురం, ఈ దేహాన్ని పూరించి ఉన్నవాడే పురుషుడు. అదే మనం కిమ్ అధిదైవః కిమ్ అధియజ్ఞః అని ప్రశ్నించి నిర్ధారించుకున్నటువంటి అధిదైవం అధియజ్ఞుడు. వ్యష్ఠిగా చూస్తే శరీరం అనే దేహం, సమిష్టిగా చూస్తే విశ్వమనే దేహం. ఇటు దేహంలో అటు విశ్వంలో కూడా పరబ్రహ్మ పరమాత్మ విశేషంగా వ్యాపితమైన విధానాన్ని

మనం చూసాం. అలా సమస్తాన్ని పూరించి పూర్ణంగా నిండి ఉన్నాడు కనుక పురుషుడు, అలాగే సమస్త మనుగడకు ఆధారమై అధిష్ఠానమై ఉండడం వల్లనే సమస్త జగత్తు చైతన్యవంతమై భాసిస్తూ ఉంది తద్వారానే సమస్త దృశ్యపదార్థాలు పూర్ణత్వాన్ని పొందుతూ ఉన్నాయి. అందుకే పురుషుడు పరిపూర్ణుడు మరి ఆ సర్వవ్యాపక అధిష్ఠాన పరబ్రహ్మ పరిపూర్ణుణ్ణి ఎలా పొందాలి? ఎలా పట్టుకోవాలి? ఎలా దర్శించాలి? ఎక్కడ దర్శించాలి? మరి అతను లేని చోటు ఎక్కడుంది ఈ రహస్యాన్ని గోప్యాన్ని తెలిసి సమస్తంలోని పూర్ణతను దర్శించేది ఎలా? అంటే మనం ఈ భక్తి అనే సాధనంతో పరిపూర్ణం అనేటటువంటి సాధ్యాన్ని మనం సాధించుకోవాలి అంటే మనమే పరిపూర్ణం కావాలి. ఇక జనులు ఏ మార్గంలో వెళితే తరించి పరిపూర్ణమైన పరమపదాన్ని పొంది తిరిగి జన్మను పొందరో, ఏ మార్గంలో వెళితే తిరిగి దుఃఖమయమైన సంసారంలో జన్మిస్తారు అనేటటువంటి తరువాత రెండు శ్లోకాలలోని రెండు మార్గాలను అక్షర పరబ్రహ్మంలో యోగమై విజ్ఞాన సహితం గావించుకుందాం.

8అ, 23శ్లో.

యత్ర కాలే త్వనావృత్తిం ఆవృత్తిం చైవ యోగినః |

ప్రయాతా యాంతి తం కాలం వక్ష్యామి భరతర్షభ ||

ఓభరతశ్రేష్ఠా! ఏ కాలమునందు దేహత్యాగాతల్లి కిసిన యోగులు తిరిగిరాని గతిని చేరుదురో, మఱియు ఏకాలమునందు దేహత్యాగము చేసినవారు తిరిగివచ్చు గతిని పొందుదురో, అట్టికాలములను, అనగా రెండు మార్గములను తెలిపెదను.

ఏ కాలము అని జగద్గురువు ప్రయోగించిన మాటను ఏ మార్గాన్ని అవలంబించినా, ఏ మార్గంలో ప్రయాణించినా అనే భావాన్ని తీసుకోవాలి. ఏ మార్గాన్ని అనుసరిస్తే, ఏ మార్గాన్ని ఆచరించి ప్రయాణిస్తే ఆ పరమ దివ్యధామాన్ని పొందుతామనే అంశాల్ని ఈ శ్లోకం స్పష్టం చేస్తుంది. ఎవరు ఎలా జీవిస్తారో దాన్నిబట్టే దేహవియోగాంతరం వారు పయనించే మార్గం వారు పొందే గమ్యం నిర్దేశితమవుతుంది. వారు చేరిన స్థానాన్ని బట్టి వారు తిరిగి దుఃఖాలయ జన్మను తీసుకుంటారా లేదా జన్మ రాహిత్యంతో జన్మను సార్థకం చేసుకుంటారా అనే అంశం ఆధారపడి ఉంటుంది. ఇందులో యత్రకాలేతు అనే మాట రెండవ పాదంలోని ప్రయాతా శబ్దానికి కూడా అన్వయించుకోవాలి. అనావృత్తి అంటే పునర్జన్మ లేనిది ఆవృత్తి అంటే మళ్ళీ మళ్ళీ తిరిగి తిరిగి ఆవృత్తి అయ్యేది, పునర్జన్మ కలది అని అర్థం. ఇక్కడ తిరిగి తిరిగి జన్మను పొందుతూనే ఉంటారు అంటే ఏ మార్గాన్ని అవలంబించి జీవితాన్ని గడించి దేహాన్ని వీడారో వారు అదే మార్గాన్ని అదే భావాన్ని పొందుతారన్న విషయం విదితమే. మన జీవితకాల ప్రవర్తనా ప్రయాణ విధానమే మన తరువాతి గతిని నిర్ణయిస్తుంది. యోగినః

అన్నారు సాధకులు, యోగులు స్థూలంగా చూస్తే రెండు రకాల వారుగా మనకు కనిపిస్తారు. ఒకటి మోక్షమే పరమావధిగా పరిపూర్ణతను సాధించి, పరిపూర్ణాన్ని దర్శించడమే ధ్యేయంగా ముందుకెళ్ళేవారు. రెండు వివిధ రకాల భావాలతో కేవలం ఆరోగ్యం మనఃశాంతి లాంటి ఇతర మోక్షేతర భావాలతో సాధన చేసేవారు. మరి వీరిద్దరి పరిస్థితిని పేర్కొన్నారు కానీ పూర్తిగా ప్రాపంచిక విషయాలకు పరిమితమైన వారిని గురించి ఇక్కడ ప్రస్తావించలేదు. ఈ దేహం ఎలాంటిది? నేను ఎవరిని? నాకు ఈ దేహానికి గల సంబంధం ఏమిటి? అనేటటువంటి విచారణ చేసి బంధ విముక్తికి ప్రయత్నించకుండా ఈ దేహాన్ని తానుగా భావిస్తూ దాని పోషణను గురించిన ఆలోచనలోనే నిమగ్నమై ఉండేవారు తనను తాను చంపుకునే ఆత్మఘాతకులు అన్నారు ఆది శంకరాచార్యుల వారు వివేక చూడామణిలో. కారణం భగవంతుని దృష్టిలో వారు లేరు, అజ్ఞానం వల్ల వీరికి నేను చేస్తున్నాను ఇది నాది అనే కర్తృత్వ, భోక్తృత్వ భావన ఏర్పడింది. వారు తమలో భగవంతునికి స్థానం ఇవ్వలేదు కారణం మనం ఆ స్థానం ఎవరికి అపహృతమైనదో మనం చూసాం కాబట్టి మనం ఎక్కడున్నామో ఏ మార్గానికి చెందుతామో కూడా ఇక్కడ ఆత్మ పరిశీలన చేసుకునే అవకాశం మనకుంది. ఈ విధమైన ఆత్మ పరిశీలనతో భగవంతుని దర్శింప చేసేటటువంటి పరిపూర్ణ పరంధామాన్ని గురించి మనం ఆలోచించాలి, ఆ దిశగా మనం ప్రయాణించాలి. పునర్జన్మ లేనటువంటి పరమపదాన్ని పొందే వారు వెళ్లే మార్గాన్ని దర్శించడానికి మనం కూడా సంసిద్ధులవుదాం.

8అ, 24శ్లో.

అగ్నిర్జ్యోతిరహః శుక్ల: షణ్మాసా ఉత్తరాయణమ్ |

తత్ర ప్రయాతా గచ్ఛంతి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః ||

బ్రహ్మవేత్తలైన యోగులు జ్యోతిర్మయమార్గము ద్వారా బ్రహ్మపదప్రాప్తి నందుదురు. ఈ జ్యోతిర్మయ మార్గమునకు అధిదేవత అగ్ని. దేహత్యాగము చేసిన ఆ యోగులను క్రమముగా దిన(పగలు) శుక్లపక్ష ఉత్తరాయణ - అభిమాన దేవతలు కొనిపోయి పరమపదమును చేర్చుదురు.

బ్రహ్మవిదులు పయనించే మార్గాన్ని దైవ మార్గమని, ఉత్తరాయణం అని బ్రహ్మపదమని అంటారు. ఉత్తరాయణం అనే శబ్దానికి అర్థం ఆంతర్యం చూసి శ్లోకాన్ని పరిశీలిద్దాం. ఆయనం అంటే ప్రయాణం, పయనించడం అని అర్థం అమావాస్య తరువాతి రోజు అయినటువంటి పాడ్యమి నుండి పౌర్ణమి వరకు గల 15 రోజులను శుక్లపక్షం, శుద్ధపక్షం అంటారు. చంద్రుడు అమావాస్య తరువాత నుండి ప్రవర్తమానం చెందుతూ పౌర్ణమి రోజున పూర్తిస్థాయిలో పూర్ణంగా ప్రకాశిస్తాడు. ఈ సమయాన్ని శుక్లపక్షంగా మనం భావిస్తాం. ఈ సమయంలోని చంద్రుణ్ణి శుక్లపక్ష చంద్రుడు అని కూడా అంటారు. అంటే రోజు రోజుకు వృద్ధి చెందుతూ ఉంటాడని అర్థం. అలా ఉన్నతంగా ఆత్మజ్ఞానంతో పురోభివృద్ధి చెందే

మార్గం, ఉత్తరాయణ కాలంలో వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. అందుకని చాలామంది పుణ్యక్షేత్రాలు తీర్థయాత్రలకు ఈ కాలాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉంటారు. ఈ ఉత్తరాయణ కాలంలో చెట్లు కొత్తచిగుళ్ళు తొడిగి పుష్పించి కాయలు కాచి మధురమైనటువంటి ఫలాలను అందిస్తాయి. ఉత్తరాయణ కాలాన్ని పుణ్యకాలంగా పెద్దలు చెబుతారు, శాస్త్రాలు చెప్తున్నాయి. కారణం ఉత్తరాయణం అంటే పురోభివృద్ధి దిశగా వెలుగు వైపుగా జ్ఞానం వైపుగా చేసే ప్రయాణం. ఒకసారి మనిషి ఉత్తరాయణంలోకి అంటే సన్మార్గంలోకి ప్రవేశించాక ఆ మార్గమే, ఆ గీతే మనల్ని పరమపదానికి తీసుకెళ్తుంది.

మనిషికి ప్రతిక్షణం రెండు మార్గాలు అందుబాటులో ఉంటాయి, క్షణక్షణం సృష్టిలో ఆ పరమేశ్వరుడు రెండింటికీ అవకాశం కల్పిస్తూనే ఉంటాడు. ఏ మార్గంలో వెళ్లాలో అనే వివేచన, కర్మ స్వేచ్ఛ మనిషిదే. సన్మార్గమా సరిగాని మార్గమా నిర్ణయించుకోవాల్సింది మనిషేనని ఎనిమిది అధ్యాయాలుగా సందర్భానుసారంగా మనం చూస్తూనే వచ్చాం. మనం ఏడవ అధ్యాయంలో ఆసురీ స్వభావం ఉన్నవారిని అంటే సరికాని మార్గంలో పయనించేవారు ఎలా ఉంటారో చూసాం, ఆ రెండు మార్గాలే ఉత్తరాయణం, దక్షిణాయనం. సన్మార్గం ఎంచుకొని దైవం వైపు జ్ఞానం వైపు పయనిస్తుంటే అది ఉత్తరాయణం అవుతుంది. అలా కాక అజ్ఞానం అసురీ స్వభావం అంధకారంతో చీకటిలో ప్రయాణిస్తూ ఉంటే అది దక్షిణాయనం అవుతుంది. అలాంటి వారికి ఇంకా ఉదయం కానట్లే, పగలు లేనట్లే. వారు రాత్రిలోనే అంటే చిమ్మ చీకటిలోనే అంధకారంలోనే అజ్ఞానపు మత్తులోనే దక్షిణాయనంలోనే వారు జీవితం కొనసాగిస్తున్నట్లుగా భావించాలి. రాత్రి అంటే చీకటి అజ్ఞానానికి ప్రతీక, అంతేగాని మనం అనుకునే రాత్రి పగలు కాలానికి సంబంధించింది కాదు. జీవిత కాలమంతా అజ్ఞాన అంధకారపు మత్తులో భౌతిక దైహిక విలాసాలకు పాకులాడి దక్షిణాయనంలో ప్రయాణించి సూర్యుడు ఉత్తరం వైపు వెళ్లే ఉత్తరాయణంలో దేహాన్ని విడిస్తే మరి వారు పరమ పదాన్ని పొందుతారా? అవకాశం ఉందా? ఎవరైతే జీవితకాలమంతా ఉత్తరాయణంలో వెలుగులో ప్రయాణిస్తారో వారే ప్రాణ ప్రయాణ సమయంలోను అదే మార్గంలో వెళుతారని మనం చూసాం. అలాగే తద్విరుద్ధంగా ప్రయాణించే వారికి ఏ పరిస్థితి సంభవిస్తుందో కూడా మనం 7వ అధ్యాయంలో శాస్త్రీయంగా చూసాం. ఉత్తరాయణం దక్షిణాయనం అనే అంశాల్ని ఈ దృష్టితో మనం చూడాలి. అగ్ని, జ్యోతి అన్నారు, అగ్ని ద్వారానే ప్రకాశం కదా ప్రకాశవంతమైన జ్ఞానవంతమైన మార్గంలో వెలుగులో కొనసాగించే ప్రయాణం అని అర్థం. అగ్ని అంటే అగ్నికి అభిమాన దేవత, జ్యోతి అంటే జ్యోతికి అభిమాన దేవత అని అర్థం. పగలు అంటే కూడా పగటి దేవత, వెలుతురుకు ప్రతీక. అలాగే శుక్ల అంటే తెల్లని అని అర్థం. అందుకే అహః అన్నారు.ఇక షణ్మాసా ఉత్తరాయణమ్ అంటే ఆరు మాసాలు గల ఉత్తరాయణ కాలం, ఉత్తరాయణ అభిమాన దేవత. వీరందరూ కూడా ఈ శక్తులన్నీ కూడా బ్రహ్మ పదాన్ని చూపుతాయి. అందుకు నిదర్శనంగా జ్ఞానం పొందిన బ్రహ్మజ్ఞాని లక్షణాలకు ప్రతీకగా ఈ అంశాలను మనం భావించాలి. జ్ఞానం- ప్రకాశం, అజ్ఞానం-చీకటి. ప్రకాశ రూపమైన బ్రహ్మ జ్ఞానం ఉన్నవారు

దేహాన్ని వీడినా వీడకపోయినా బ్రహ్మమై ఉంటారు, బ్రహ్మవేత్త బ్రహ్మమే అవుతున్నాడని శృతి. ఈ శ్లోకంలో బ్రహ్మవిదో జనాః అనే శబ్దాన్ని ప్రయోగించి విషయాన్ని చాలా స్పష్టంగా తేటతెల్లం చేశారు. బ్రహ్మాన్ని ఎరిగినవారు బ్రహ్మజ్ఞానాన్ని అనుభూతమొనర్చుకున్న వారు మాత్రమే అట్టి మహోన్నత స్థితి అయిన వెలుగుతో కూడుకున్న అగ్ని, జ్యోతి, పగలు, శుక్లపక్షం, ఉత్తరాయణం అలా పయనించగలరు కానీ తదితరులు కాదు అని మనకు స్పష్టం అవుతుంది. ఇక్కడ జనాః అన్నారు, జనులు అనే అర్థం. ఎలా అంటే కుల మత లింగ వర్ణ వర్గ విభేదాలకు ఏమాత్రం అవకాశం లేదనే అంశాన్ని కూడా ఇక్కడ స్పష్టం చేశారు. బ్రహ్మ జ్ఞానం పొందడానికి ఆ మార్గాన్ని పట్టుకొని పట్టు వీడకుండా దైవ మార్గంలో పయనించే ఏకాగ్రత మనస్థత్వం ఉండాలి గానీ అంతకంటే భిన్నం కాదని తెలియాలి. అగ్ని జ్యోతి పగలు శుక్లపక్షం ఉత్తరాయణం అనే అంశాలను ప్రతిపాదించారు, ఇందులో మొదటి నాలుగు కూడా ప్రకాశవంతానికి జ్ఞానానికి ప్రతీకలు. అట్టి జ్ఞానాన్ని ఆశ్రయించిన వారి మార్గం ఉత్తరాయణమేనని గ్రహించాలి. ప్రకాశరూప జ్ఞాన ధృష్టిని దైవం వైపుగా చేసే ప్రయాణాన్ని ఇక్కడ ఉత్తరాయణంగా పేర్కొన్నారని మనం విజ్ఞాన సహితం గావించుకోవాలి. తరువాతి శ్లోకంలో పేర్కొన్నటువంటి తిరిగి తిరిగి జన్మలు పొందే వారు వెళ్తున్న పునరావృత్తి గల దక్షిణాయణ మార్గాన్ని చూసిన తర్వాత రెండింటిని సమన్వయం చేసుకుందాం.

8అ, 25శ్లో.

ధూమో రాత్రిస్తథా కృష్ణః షణ్మాసా దక్షిణాయనమ్ |
తత్ర చాంద్రమసం జ్యోతిర్యోగీ ప్రాప్య నివర్తతే ||

పొగ, రాత్రి, కృష్ణపక్షం, 6 నెలలు గల దక్షిణాయన మార్గంలో వెళ్లినటువంటి సకామ కర్మయోగులు చంద్ర సంబంధమైన ప్రకాశాన్ని పొంది మళ్లీ వెనక్కు వస్తూ పోతూ తిరిగి తిరిగి జన్మిస్తున్నారు.

ఈ శ్లోకాన్ని అవగాహన చేసుకోవడానికి అవసరమైన కొన్ని అంశాలను చూసి ఈ శ్లోకాన్ని సమన్వయం చేసుకుందాం.

పక్షం అంటే 15 రోజులు, పౌర్ణమి తర్వాతి రోజు పాడ్యమి మొదలు అమావాస్య వరకు గల 15 రోజులను కృష్ణపక్షం అంటాం. చంద్రుడు పౌర్ణమి తరువాత నుండి రోజురోజుకు ప్రకాశం తగ్గుతూ అమావాస్య రోజున పూర్తిగా తన ప్రకాశాన్ని క్షీణిస్తాడు. ఆ సమయంలోని చంద్రుణ్ణి కృష్ణ పక్షం చంద్రుడు అని కూడా అంటాం. అంటే రోజురోజుకు క్షీణిస్తున్న చంద్రుడు అని అర్థం. భౌతిక ప్రపంచపు సమయానుసారం ఒక చాంద్రమాన రోజును తిథి అంటారు. సూర్యుణ్ణి చంద్రుణ్ణి కలుపుతూ ఉన్న అక్షాంశ కోణం 12 డిగ్రీలు పెరగడానికి పట్టే కాలాన్ని తిథి అనవచ్చు. తిథులు రోజులో ఏ వేళలోనైనా మొదలై ఏ వేళలోనైనా ముగియవచ్చు. 19

నుండి 26 గంటల సమయం ఉంటుంది, ప్రతి చాంద్రమానంలో 30 తిథులు ఉంటాయి. మానం అంటే కొలిచేది అని అర్థం ఉంది, చాంద్రమానం అంటే భూమికి అనుగుణంగా చంద్రుని గమనాన్ని బట్టి తిథులు వారాలు నెలలు లేదా మాసాలు సంవత్సరాలు నిర్ణయించడం జరుగుతుంది. ఇదంతా కూడా మనిషి మనుగడ కోసం మనిషి సృష్టించుకున్నదే గాని మరొకటి కాదు. పైగా ఇవి ఆయా ప్రాంతాలకు రాష్ట్రాలకు దేశాలకు సంబంధించి ఆయా భాషలకు సంబంధించిన క్యాలెండర్లు వేరువేరుగా ఉంటాయి. సాధారణంగా అందరూ భౌతిక ప్రపంచంలో పాటిస్తున్నది సౌరమానం ప్రకారం అంటే సూర్యుని చుట్టూ భూమి తిరిగే కాలాన్ని ఆధారం చేసుకున్నది. భూమి తన చుట్టూ తాను తిరిగే సమయం ఒకరోజు, దీన్నే భూ భ్రమణం అంటాం. భూమి సూర్యుడి చుట్టూ తిరిగే కాలాన్ని ఒక సంవత్సరం అంటాం. 360 రోజులుగా పరిగణించి 12 నెలలుగా విభజించారు, ప్రతి సంవత్సరంలో మిగిలిన పావు రోజును నాలుగో సంవత్సరంలో కలిపి 366 రోజులుగా లెక్కిస్తారు, దానినే లీపు సంవత్సరం అంటూ ఉంటాం. సౌరమానానికి సంవత్సరం పునాది అయితే చాంద్రమానానికి నెల ఆధారం. చాంద్రమానం ప్రకారం నెల అంటే ఒక పౌర్ణమి నుంచి మరో పౌర్ణమి వరకు ఉన్న కాలం. చంద్రుడు భూమి చుట్టూ తిరిగే కాలం సౌరమానం ప్రకారం 27.32 రోజులు దీనిని నెల లేదా మాసం ప్రకారం లెక్కిస్తారు. ఇందులో 30 తిథులు ఉంటాయి, అంటే చాంద్రమానంలోని తిథి సౌరమానంలోని రోజు కన్నా తక్కువ నిడివి కలది. 30 తిథులను రెండు పక్షాలుగా విభజిస్తారు, అమావాస్య నుండి పౌర్ణమి వరకు శుక్లపక్షం, పౌర్ణమి నుంచి అమావాస్య వరకు కృష్ణ పక్షం. శుక్ల అంటే తెల్లని అని అర్థం కదా, కృష్ణ అంటే నల్లని అని అర్థం. అందుకే వాటి వాటి స్వరూపాన్ని బట్టి ఈ పేర్లు వాటికి శుక్ల కృష్ణ అని సార్థకమయ్యాయి. ఈ అవగాహనతో మనం శ్లోకాన్ని చూద్దాం. ఇక్కడ ధూమం అంటే పొగ, చీకటి రాత్రి పొగ అనే శబ్దాలు అజ్ఞాన అంధకారానికి ప్రతీకలు. అందుకు సూచనగా ఈ శ్లోకంలో పొగ రాత్రి కృష్ణపక్షం దక్షిణాయనం అన్నారు, ఆత్మ జ్ఞానం లేమికి ప్రతీక. చివరిది దక్షిణాయన మార్గం అనేది అంధకారంతో కూడిన అథోమార్గాన్ని సూచిస్తుంది. ఈ అథోమార్గం అభివృద్ధి దిశకు దశకు వ్యతిరేకమైనది, అజ్ఞాన మార్గం కదా ఇది జ్ఞానం లేని వారి పరిస్థితి. ఈ దక్షిణాయనమైన మార్గంలో ప్రయాణించి వెళ్లేవారు వారి వారి కర్మలను అనుసరించి అవిద్యావశంతో పునర్జన్మకు కారణం అవుతున్నారు. అలా అయితే ఎందరో మహనీయులు మహాత్ములు మనం భావించే భూలోకపు కాలమాన ప్రకారం దక్షిణాయనంలో దేహాన్ని వీడారు, వీడుతున్నారు కూడా. అలాగే జీవితకాలమంతా అజ్ఞాన అంధకారంలో చిక్కుకొని కొట్టుమిట్టాడిన వారు కూడా ఉత్తరాయణ కాలంలో దేహాన్ని వీడిన వీడుతున్నవారు ఎందరో ఉన్నారు. కాబట్టి ఉత్తర దక్షిణ ప్రయాణ మార్గాలనేవి జ్ఞాన అజ్ఞాన జీవన విధాన మార్గాలే గాని మరొకటి కాదని తెలియాలి. తిరోగమనం అంటే తిరిగి తిరిగి ఆగమనం, వచ్చే లోకాలు, పునరావృతం గల మార్గాలు అని అర్థం. ఫలాపేక్షతో కూడుకున్న వారు ఆత్మ జ్ఞానం లేమిచే తిరిగి తిరిగి మళ్లీ మళ్లీ జన్మిస్తూ ఉంటారు. తిరిగి భూలోకానికి చేరే పునరావృత్తి గల మార్గమే ఈ దక్షిణాయన మార్గం. దేహి దేహంలో ఉన్నప్పుడే శ్వాసిస్తున్నప్పుడే శ్వాస అనే గీతను పట్టుకొని భగవద్గీత మార్గంలో సన్మార్గంలో

జీవించి ఉత్తరాయణం వైపుగా అంటే జ్ఞానం వైపుగా ప్రయాణించి దేహాన్ని వీడి బ్రహ్మపథం పరమపదం చేరాలి. లేకపోతే సరిగాని అజ్ఞానపు అంధకారపు మార్గంలో జీవించి దేహాన్ని వీడి చీకట్లో దక్షిణాయన మార్గంలో పునరావృత్తి గల స్థానాన్ని చేరి తిరిగి తిరిగి దుఃఖాలయాన్ని పొందేటటువంటి పరిస్థితి సంభవిస్తుంది. అయితే ఈ అంశాన్ని గమనించి ఎవరికి వారే ఏ మార్గంలో వెళ్లాలనే విషయాన్ని నిర్ణయించుకోవాలి. ఎవరి మార్గం వారి చేతుల్లోనే, ఎవరి దారి వారిదే. అయితే ఏ దారిలో వెళ్తే దాన్నే పొందుతామని మనం గ్రహించాలి.

8అ, 26శ్లో.

శుక్లకృష్ణే గతీ హ్యేతే   జగతః శాశ్వతే మతే |

ఏకయా యాత్యనావృత్తిమ్ అన్యయావర్తతే పునః ||

జగత్తులో శుక్ల, కృష్ణ మార్గాలు రెండూ శాశ్వతమైనవి అయితే శుక్లమార్గంలో వెళితే జన్మ రాహిత్యాన్ని, కృష్ణ మార్గంలో వెళితే పునర్జన్మను పొందుతున్నారు.

లోకంలో రెండు మార్గాలు ఉన్నాయి ఒకటి మనిషిని ఉన్నతంగా తీర్చిదిద్దే జ్ఞానమార్గం ఇది మనిషిని ఊర్ధ్వముఖంగా తీసుకెళ్లి మోక్ష పదానికి చేరుస్తుంది. దీన్నే శుక్లపక్షంలో చేసేటటువంటి ఉత్తరాయణ మార్గం అని అంటున్నాము. రెండు తద్విరుద్ధమైనది, దక్షిణాయనమార్గం, కృష్ణపక్ష మార్గం సరైన మార్గం కానిది. ఈ అజ్ఞాన మార్గం మనిషిని అధోపతనం వైపుగా తీసుకెళ్లి అజ్ఞాన అంధకారపు దుఃఖాలయంలో పడవేసి తిరిగి మళ్లీ పునర్జన్మలు పొందడానికి కారణం అవుతుంది. ఇలా జ్ఞాన మార్గాన్ని అనుసరించిన వారు ముక్తిని పొందుతారు, అంధకారంతో అజ్ఞాన మార్గాన్ని అనుసరిస్తున్న వారికి బంధం ప్రాప్తిస్తుంది. ప్రతి మనిషికి జీవితంలోని ప్రతి క్షణం ఉత్తరాయణం, దక్షిణాయనం అనే ఈ రెండు మార్గాలు ఏకకాలంలోనే అందుబాటులో ఉంటాయి. మరి ఆ అవకాశాన్ని అందిపుచ్చుకునే వారి భావాన్ని బట్టి వారి వారి మార్గాలు నిర్దేశితమవుతాయి. వారు ఆయా మార్గాల్లో వెళ్లి తగిన ఫలితాన్ని సంప్రాప్తింప చేసుకుంటారు. అయితే ఎవరు ఏ మార్గంలో వెళ్లినా అందుకు కారణం వారే గాని, వారి వారి జన్మాంతర సంస్కారాలే గాని దైవం కాదని ఇతరులు కాదని గ్రహించాలి. ఈ క్షణం నుంచైనా అజ్ఞానపు మత్తును వదిలించుకొని జ్ఞానమార్గాన్ని అనుసరించి ఉత్తరాయణ మార్గంలో ప్రయాణించి స్వయం ప్రకాశంతో వెలుగొందుతూ పరబ్రహ్మంగా విరాజిల్లాలి. ఈ జగత్తులోని జగన్నాటకమంతా కూడా రాత్రి పగలు చీకటి వెలుగుల మధ్య ప్రవాహ రూపంగా కొనసాగుతూ ఉంటాయి. జగత్తు ఉన్నంతవరకు జీవిత నాటకం నడుస్తూనే ఉంటుంది, సృష్టి ఆరంభం నుంచి ఉండేదే సంసారం. సృష్టే సంసారం, సంసారమే సృష్టి ఇవి అవిభాజ్యాలు, ఈ రెండు కలిసే ఉంటాయి. ఈ దృష్టితోనే జగద్గురువు శుక్ల కృష్ణే గతీ హ్యేతే జగతః శాశ్వతే మతే అన్నారు.

సృష్టి ఉన్నంతవరకు ఈ రెండు మార్గాలు ఉంటాయి కాబట్టి శాశ్వతేమతే అంటున్నారు. ఉపాసకులు కర్మ జీవులు ఉన్నంతవరకు ఈ రెండు మార్గాలు ఉంటాయి. ఒక మార్గం ఊర్ధ్వంగా నడిపిస్తే, మరో మార్గం పతనానికి దారితీస్తుంది. ఉత్తరాయణం అనేది కాంతిమయమైనది, జ్ఞానరూపమైనది పగలు వెలిగినట్లు ప్రకాశిస్తుంది, జన్మకు రాకుండా నివారిస్తుంది, మోక్షాన్ని పొందేలా చేస్తుంది అందుకే ఇది శుక్ల గతి. దక్షిణాయనం అనేది ధూమమయంగా జ్ఞాన రహితంగా ఉంటుంది. రాత్రి లాగా చీకట్లు ముసురుకొని ఉంటూ తిరిగి తిరిగి పునర్జన్మను కలిగించే బంధానికి హేతువు అవుతూ ఉంటుంది. అందుకే ఇది కృష్ణగతి ధూమ మార్గం. కర్మ బంధం చేత దక్షిణాయన మార్గం ప్రాప్తిస్తే జ్ఞానం చేత దేవయాన మార్గం సిద్ధిస్తుంది. చీకటి మార్గం ఎవరికైనా ఎప్పుడైనా దుఃఖాన్ని కలిగిస్తుంది. కాబట్టి మోహం నుండి మనిషి విడిపడాలి. వెలుగుల దారిలో వెలుగులు ఉంటాయి కాబట్టి ఆ మార్గంలో పయనించి మోక్షాన్ని పొంది తరించాలి. జ్ఞానం ప్రకాశం గలది గనుక శుక్లం వెలుగు, అది లేదు గనుక కృష్ణం చీకటి, ఇవి శుక్ల కృష్ణ గతులు. మనకు ఈ జ్ఞాన మార్గం, అజ్ఞాన మార్గం తెలియడానికి ఎవరు ఏ మార్గంలో వెళుతున్నారో ఎవరికి వారుగా పరిశీలన చేసుకోవడానికి మనకు అర్థమయ్యే విధంగా జగద్గురువు ఉత్తరాయణ మార్గమని దక్షిణాయన మార్గమని శుక్లగతి అని కృష్ణగతి అని స్పష్టంగా మన ముందు ఉంచారు. జగత్తుకు అన్నారు అంటే జ్ఞాన కర్మల యందు అధికారం గల వారికి అని అర్థం చేసుకోవాలి. అంతేగాని సర్వ జగత్తుకు ఈ గతులు సంభవం కాదు. సంసారం నిత్యం కనుక ఈ గతులు శాశ్వతం అన్నారు. సృష్టి ఉన్నంతకాలం అవి ఉంటాయని అర్థం చేసుకోవాలి.

8అ, 27శ్లో.

నైతే సృతీ పార్థ జానన్యోగీ ముహ్యతి కశ్చన |
తస్మాత్ సర్వేషు కాలేషు యోగయుక్తో భవార్జున ||

అర్జునా! ఈ రెండు మార్గ లను ఎరిగినట్టి తెలిసినటువంటి యోగులెవ్వరూ ఇక మోహాన్ని పొందరు. కాబట్టి నీవు ఎల్లకాలము లందు యోగ యుక్తుడవు కమ్ము.

ముందు శ్లోకంలో చెప్పిన ప్రకాశ రూపమైన ఉత్తరాయణ ఊర్ధ్వమార్గం, అంధకార రూపమైన దక్షిణాయన అథోమార్గం ఇది మంచిది, ఇది తద్విరుద్ధమైనది, ఇది మంచిది కాదు అని తెలిసిన విజ్ఞులు ఎన్నటికీ సరికాని దక్షిణాయన అథో మార్గాన్ని ఆశ్రయించరు, ఉత్తరాయణ సన్మార్గాన్నే ఆచరిస్తారు.

విచారణతో కూడిన జ్ఞానమార్గాన్ని ఆచరించిన వారు మోహం పొందడం జరగదు. మనిషి ఏ క్షణం ఆత్మ స్వరూపాన్ని విస్మరించినా దైవస్మరణను వీడినా తక్షణమే మాయ ప్రవేశించి అధఃపతనానికి హేతువవుతుంది. అందుకే ఇక్కడ జగద్గురువు ఎల్లవేళలా సదా ఆత్మ

దృష్టితో ఉంటే అప్పుడు మాయ జొరబడటానికి అవకాశమే లేదు, ఉండదు. యోగం అంటే ఐక్యం కలయిక కదా కాబట్టి మనం మన మనసును ధ్యానయోగంలో ఆత్మతో యోగం చేస్తున్నాం, ఐక్యం చేస్తున్నాం, కలిపేస్తున్నాం అదే యోగం ధ్యానం జ్ఞానం భక్తి. వీటిలో ఆంతరంగికంగా జరిగే ప్రక్రియ ఇదే, ఆత్మ స్వరూపంతో మనస్సును లయం చేయడమే యోగం కదా. అందుకే జగద్గురువు యోగయుక్తో భవ అర్జున అన్నారు. ఇదే మాట మనకు 6-46 లోనూ తస్మాత్ యోగీభవ అర్జున అని పిలుపునిచ్చిన విషయం మనకు విదితమే. మనం అక్షర పరబ్రహ్మ యోగంలో దాదాపుగా మనం ముగింపు దశకు చేరుకున్నాం. ఈ అధ్యాయం అంతా మనం అభ్యసించిన దృష్టితో పరిశీలిస్తే స్థూలంగా మనుషులు నాలుగు రకాలుగా మనకు కనిపిస్తారు.

ఒకటి మహాత్ములు లేదా జ్ఞానులు వీరు దేహాన్ని విడవక ముందే మరణించక ముందే పరమాత్మగా మధుసూధనుడిగా పరబ్రహ్మంగా వెలిగొందుతూ ఉంటారు. శరీరంలో ఉంటూనే శరీరాన్ని విడిచి తరించిన ఆత్మజ్ఞానులు, బ్రహ్మాతీతులు, జీవన్ముక్తులు, నిత్యానంద స్వరూపులు. వీరికి ప్రపంచం విస్మృత ప్రాయం, దేహం అనేది ఛాయ లాంటిది. వీరికి అంతా సర్వత్రా పరబ్రహ్మ దర్శనమే వీరు కృతకృత్యులు, సాక్షాత్తు బ్రహ్మస్వరూపులు. జీవించి ఉన్నప్పుడే సూక్ష్మ కారణదేహాలను నశింపజేసుకున్నవారు. వీరు జనన మరణాల భావాన్ని నశింప చేసుకున్న వారు. వీరు జనన మరణ భావాన్ని ఎరుగని వారు మృత్యుంజయులు. వీరు చాలా అరుదుగా ఉంటారు. వీరి దర్శనం బ్రహ్మ దర్శనమే దైవదర్శనమే.

రెండు ముముక్షువులు, వీరు మోక్షమే పరమ అవధిగా కలిగి అంతఃకరణ శుద్ధి కలిగిన వారు. వీరు తమ తమ అవగాహన స్థాయిని బట్టి పరబ్రహ్మాన్ని సంప్రాప్తింప చేసుకుంటూ ఉంటారు. వీరు దేహం ఉన్నప్పుడే తరించలేకపోయినా ఉత్తరాయణ మార్గంలో ఉన్నారు కాబట్టి దేహాన్ని వీడాక అయినా కూడా అక్కడి నుండే తపస్సు చేసి పునర్జన్మ లేకనే పరబ్రహ్మ పరంధామాన్ని ఖచ్చితంగా పొందుతారు. కారణం జీవితమంతా వారి ప్రయాణం కొనసాగింది ఉత్తరాయణం లోనే కదా. అందువల్ల ఉత్తరాయణ మార్గంలో తప్పటడుగులు వేసినా ఆరంభించినా చాలు ఆ అడుగులే నడకలై ఆ నడకలే పరుగులై వారు ఖచ్చితంగా అక్షర పరబ్రహ్మ స్థానాన్ని సంప్రాప్తింప

చేసుకుంటారు. దీన్నిబట్టి ఉత్తరాయణ మార్గాన్ని ఎంచుకొని ఆదిశగా వారు ఆరంభించినా చాలు వీరికి పరబ్రహ్మ పరంధామం ఖాయం. ఈ సందర్భంగా ప్రాపంచిక వ్యామోహాన్ని వీడి భౌతిక విలాస వినోదాలకు స్వస్తి చెప్పి దైవం వైపుగా ఉత్తరాయణ దిశగా పయనిస్తున్న ముముక్షువులందరికీ శతదా సహస్రదా నమఃస్సుమాంజలి.

మూడు సకామయోగులు.

వీరికి కర్మలలో ఫలాపేక్ష ఉంటుంది, యజ్ఞయాగాదులు నిర్వహిస్తూ పరోపకారార్థం అనేక ఇష్టపూర్వక కర్మలు ఆచరిస్తుంటారు, దానధర్మాలు చేస్తారు. వీరు దక్షిణాయనంలో ప్రయాణించి ఉన్నతమైన జన్మకు కారణమవుతారు. వీరికి పునరావృత్తి ఉంటుంది పునర్జన్మ ఉంటుంది. వీరు పుణ్య కార్యాలను చేసి చంద్రలోకానికి చేరినా తిరిగి జన్మ తీసుకుని కొంతకాలానికి నిష్కామ కర్మభావం వీరిలో ఏర్పడి ముముక్షువులుగా పరిణితి చెందాలని జ్ఞానుల స్థితికి చేరాలని మనం అక్షర పరబ్రహ్మాన్ని ఉపాసిద్దాం.

నాలుగు లౌకికులు, వీరు విషయ వాసనా పరులు, భోగాసక్తులు, పరమార్థం అంటే వీరికి అసలు పడదు. అలాంటి వారిని చూసినా వీరికేం పనిలేదు, వీరికి అన్నీ జరిగిపోతుంది కాబట్టి వీరికి పని పాట లేక ఆత్మ, బ్రహ్మం అనుకుంటూ కాలయాపన చేస్తుంటారని అనుకుండాను ఉండలేరు పాపం. ఆత్మశక్తి, పరబ్రహ్మం, పరమార్థం తెలియని ఆధ్యాత్మిక పసికందులు అభాగ్యులు. వీరికి అంతరించిపోయే పతనమైపోయే పనులే కానీ తరించిపోయే ఉపాయం తెలియనివారు. మనకు ప్రపంచంలో కనిపించే జనులలో అధిక శాతం వీరే అయితే వీరు జగద్గురువు చెప్తున్న రెండు మార్గాలు కూడా తెలియక మోహంలో ఉన్నవారు. అయితే ఈ లౌకికులు కూడా కొంతకాలానికి క్రమంగా సకామ కర్ములుగా ఆ తరువాత ముముక్షువులుగా ఆ తరువాత అధిష్ఠాన పరబ్రహ్మం గా వెలుగొందాలని జగత్తు దివ్యమయం కావాలని అక్షరబ్రహ్మం సాక్షిగా ఆకాంక్షిద్దాం.

8అ, 28శ్లో.

వేదేషు యజ్ఞేషు తపస్సు చైవ దానేషు యత్పుణ్యఫలం ప్రదిష్టమ్ |

అత్యేతి తత్సర్వమిదం విదిత్వా యోగీ పరం స్థానముపైతి చాద్యమ్ ||

యోగి అయిన వారు ఈ అధ్యాయంలో చెప్పిన అక్షర పరబ్రహ్మ తత్వాన్ని ఎరిగి వేదాలు యజ్ఞాలు దానాలు తపస్సులు మొదలైన వాటి వల్ల పొందే పుణ్యఫలమైన అనాది అయిన సర్వోత్తమ స్థానాన్ని పొందుతున్నారు.

వేదం యజ్ఞం తపస్సు దానం లాంటి వాటి వల్ల జీవులు కొంత పుణ్యం పొందుతున్నా పరమాత్మను ధ్యానించే యోగి లేదా ఆత్మజ్ఞానం బ్రహ్మ జ్ఞానం కలిగి ఉన్న యోగి వాటన్నింటినీ దాటిపోయి ఆత్మ ప్రాప్తి పరబ్రహ్మ ప్రాప్తిచే అతడు అనంతత్వాన్ని సంపాదిస్తున్నాడు. సముద్రమందు బిందువు అంతర్భూతమైనట్లు బ్రహ్మజ్ఞానం అనే మహా పుణ్యంలో తక్కిన పుణ్యాలన్నీ అంతర్భూతమై ఉంటాయి. లోకంలోని అనేకులు చదువు రాకపోవడం వల్ల వేదాల్ని అధ్యయనం చేయలేకపోవచ్చు, డబ్బు లేనివారు యజ్ఞాదులను ఆచరించలేకపోవచ్చు కఠినమైన తపస్సులు ఆచరించే శరీర ధారుఢ్యం లేకపోవచ్చు,

ధనం ఎక్కువగా లేని కారణంగా దానం చేయలేకపోవచ్చు. అయితే వీటన్నింటినీ మించిన పరమాత్మ జ్ఞానం అనే ఉపాయం ద్వారా ఈ అనంతత్వాన్ని పొందవచ్చని ఇక్కడ జగద్గురువు మనకు హామీ ఇస్తున్నారు. నిర్మల భక్తితో పవిత్ర హృదయంతో పరిశుద్ధ మనస్సుతో పరమాత్మను ధ్యానించి ఆత్మజ్ఞాన ప్రాప్తిని పొందిన వారు తక్కిన అన్ని పుణ్యాలను దాటిపోయి మహా పుణ్య ప్రాప్తులవుతున్నారని ఈ శ్లోకం స్పష్టంగా ప్రతిపాదిస్తుంది. అంతేకాకుండా బ్రహ్మ తత్త్వాన్ని ఎరిగిన యోగి సర్వోన్నత సర్వోత్తమమైన బ్రహ్మమునే పొందుతున్నారని అక్షర పరబ్రహ్మయోగం మనకు ప్రత్యక్ష ప్రమాణంగా ఉద్బోధిస్తుంది. మనం కూడా పరమాత్మ ధ్యానంతో పరబ్రహ్మ స్థానాన్ని పొందడానికి ఆత్మ సంయమనంతో అక్షర పరబ్రహ్మంలో యోగమై ముందుకెళ్దాం. జీవుని దేవునితో చేర్చే మార్గమే యోగం కదా.

ఇందులో గ్రహించాల్సిన అంశాలు వేదాలు యజ్ఞాలు తపస్సులు, దానాలు వీటన్నిటికంటే బ్రహ్మజ్ఞానం, ఆత్మానుభవం శ్రేష్ఠమని సర్వోత్తమమైనదని స్పష్టం అవుతుంది. కాబట్టి ఆరంభ దశలో వీటిని ఆశ్రయించినా వాటితోనే సంతృప్తి పొందక ఇంకా ఇంకా ఆత్మ విచారణ గావించి ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి వెళ్లే దిశగా చిత్తశుద్ధితో ముందుకెళ్లి బ్రహ్మానుభూతిని ఆత్మజ్ఞానాన్ని ప్రత్యక్ష ప్రమాణం గావించుకోవాలి. ఈ అధ్యాయం ముగుస్తున్న కారణంగా ఒకసారి ఈ అక్షర పరబ్రహ్మ యోగాన్ని అవలోకిద్దాం.

ఏడవ అధ్యాయం చిట్టచివరి దశలో జగద్గురువు చేసిన ప్రబోధంలో మెలిగిన సందేహాలను సంధిస్తూ ఎనిమిదవ అధ్యాయాన్ని ప్రారంభించుకున్నాం.

ఒకటి రెండు శ్లోకాలలో బ్రహ్మం అంటే ఏది? ఆధ్యాత్మం ఎట్టిది? కర్మ మనగా నేమి? అధిభూతం అని చెప్పున్నదేది? అధి దైవమని దేనిని అంటారు? అధియజ్ఞుడంటే ఎవరు? ఈ శరీరంలో అతడు ఎలా ఉంటాడు, మరణ కాలంలోనూ మనసును సంయమించిన వారికి నువ్వు ఎలా తెలుస్తున్నావు అనేటటువంటి బ్రహ్మ వివేచనంతో అక్షర పరబ్రహ్మ యోగంలోకి ప్రవేశించాం.

మూడవ శ్లోకంలో నాశరహితమైన తత్త్వం బ్రహ్మం, ప్రత్యగాత్మ భావం, స్వీయ భావం, స్వభావం, ఆధ్యాత్మం అని ప్రాణి కోటికి ఉత్పత్తిని కలుగజేసి యజ్ఞాది రూపమైన సర్వ సమర్పణతో చేసే త్యాగపూర్వమైన క్రియను కర్మ అంటారని చూశాం. పరమాత్మ యందు లీనమైన సకల భూతాలను బహిర్గతం చేసి వాటి ఉత్పత్తి అభ్యుదయాలకు కారణమైనటువంటి యజ్ఞ రూపమైన త్యాగమే కర్మ అని అలాగే ఇంద్రియ గమ్య ఆకారపు ముద్రనే కర్మ అంటారని తెలుసుకున్నాం.

నాలుగవ శ్లోకంలో నశించే పదార్థం అధిభూతమని విరాట్ పురుషుడే అధిదైవతమని ఈ దేహంలోని అధియజ్ఞాన్ని నేనే అని గ్రహించాం. ఇందులోనే పంచీకరణ విధానం అర్థం

చేసుకొని స్థూల సూక్ష్మ భూతాంశాల వివరణను వివేచన చేసుకొని మనలోని పరాత్పరుణ్ణి పరమాత్మను అధియజ్ఞుణ్ణి దర్శించాం. మనలోని భేదభావం అనే దీనత్వాన్ని తొలగించుకొని సమస్త దేహంలోను అధియజ్ఞుడైన పరమాత్మను దర్శించి సర్వ ప్రాణులందు సమభావం కలిగి ఉండి దైవంగా పరమాత్మగా విరాజిల్లాలని తెలుసుకున్నాం.

ఐదవ శ్లోకంలో నిత్యం జాగరూకతతో తపస్సుతో దక్షతతో, దీక్షతో జీవిత పర్యంతం సదా ధ్యాన యోగంలో సుస్థిరమై ఉన్నప్పుడే మరణ కాలంలో దేహాన్ని విడిచాక కూడా నా స్వరూపాన్నే పరమాత్మ స్వరూపాన్నే పొందుతారని ఈ విషయంలో సందేహం లేదని గ్రహించాం.

ఆరవ శ్లోకంలో మనిషి ఏ ఏ భావాన్ని చింతిస్తూ దేహాన్ని విడుస్తారో ఆయా స్మరణ ద్వారా పొందిన సంస్కారం ఉండటం వలన ఆయా భావాన్నే రూపాన్నే పొందుతున్నారని చూసాం. అలాగే శరీరాన్ని

విడిచేటప్పుడు నారాయణ జనార్ధన మాధవ ముకుందా అంటూ తన పిల్లల పేర్లను పిలుస్తూ అంగడిని తలుస్తూ దేహాన్ని విడిచిన తీరును మళ్లీ మళ్లీ పునర్జన్మకు కారణమవుతున్న వారి భావాన్ని ప్రత్యక్షంగా అనుభూతించాం. ఏడవ శ్లోకంలో అన్ని వేళలా నన్ను స్మరిస్తూ ఉండు, యుద్ధం చేయి, మనసు, బుద్ధి నాకు అర్పించు నిస్సంశయంగా నన్నే చేరుతావు సందేహం వద్దు అంత్య కాలం అనేది ఎప్పుడైనా రావచ్చు కాబట్టి ఎల్లవేళలా దైవాన్ని మయ్యర్పిత మనో బుద్ధి కర్తవ్య కర్మాచరణతో సదాస్మరిస్తూనే ఉండాలని గ్రహించాం. ఎనిమిదవ శ్లోకంలో జ్ఞాని అభ్యాస యోగంతో ఇతర విషయాల వైపుకు వెళ్ళని చిత్తంతో పరమ దివ్య పురుషుణ్ణి ధ్యానిస్తూ అతన్నే పొందుతాడని దీన్నే ధారణ అని చూశాం. తొమ్మిదవ శ్లోకంలో సర్వోన్నతమైన లక్షణాలుగా కవులందరికి కవి అయిన కవీశ్వరుడు సర్వజ్ఞుడు అనాది స్వరూపుడు జగన్నియామకుడు పరమాణువు కంటే సూక్ష్మమైన వాడు సర్వాధారుడు అచింత్య రూపుడు ఆదిత్య వర్ణుడు ఆదిత్య రూపుడు, స్వయంప్రకాశకుడు, తమస్సుకు మాయకు ప్రకృతికి ఆవల ఉన్నవాడు అంటూ పరమపద పరంధామాన్ని మోక్షధామాన్ని దర్శించాం. 10 వ శ్లోకంలో మరణ సమయంలో చలించని మనసుతో నిశ్చలభక్తితో ధ్యానయోగ బలంతో భ్రూమధ్యంలో దృష్టిని నిలిపి ప్రాణ శక్తిని జాగ్రత్తగా గమనిస్తూ ఆత్మతో యోగమైన వారు తొమ్మిదవ శ్లోకంలోని లక్షణాలున్న దివ్య పురుషుణ్ణి చేరుకుంటారని గ్రహించాం. 11వ శ్లోకంలో వేదవేత్తలు చెప్పే నాశితం లేని దాన్ని యత్నశీలురు, జితేంద్రియులు ప్రవేశించాలనుకునే మోక్షధామాన్ని జనులు దేన్ని అభిలషించి బ్రహ్మచర్య వ్రతాన్ని అనుష్ఠిస్తున్నారో అట్టి పరమాత్మ పరమ పదాన్ని నీకు సంక్షేపంగా చెబుతాను విను అంటూ ప్రశ్నించే అవకాశం మనకు ఇవ్వకుండానే తమ ప్రబోధాన్ని కొనసాగించాడు జగద్గురువు. ఇక్కడే ఈ బ్రహ్మచర్యం వైవాహిక దాంపత్య జీవితానికి వ్యతిరేకం కాదని తెలుసుకున్నాం. 12వ శ్లోకంలో సర్వ ద్వారాలను నియమించి మనసును హృదయంలో ఆత్మతో సుస్థాపితం చేసి బ్రహ్మరంధ్రమందు ప్రాణవాయువును

ఉంచి యోగధారణకు ప్రవృత్తులై అక్కడే ప్రాణవాయువును సుస్థిరంగా ఉంచి దానికి కొనసాగింపుగా 13వ శ్లోకంలో అలా నిమగ్నమయి బ్రహ్మనికి వాచకమైన ఓంకారం అనే ఏకాక్షరాన్ని ప్రణవ నాదాన్ని స్మరిస్తూ ఈశ్వరుని ధ్యానించాలని చూసాం. అక్కడ ఈ ప్రక్రియలో ప్రాణవాయువు క్రమంగా బ్రహ్మరంధ్రానికి చేరుకుంటుంది అలా సహస్రారంలోకి ప్రాణవాయువు తీసుకెళ్లినప్పుడు ధారణాబలంతో ప్రాణవాయువు బ్రహ్మకాశంలో కలిసిపోయేటట్లు సుస్థిరంగా అచలంగా ఉంచాలని చూసాం. చివరకు స్మరణను కూడా వీడి శబ్దాన్ని కూడా వీడి నిశ్శబ్దంలోకి చేరుకొని మూలబ్రహ్మంలో నిండిపోయి విశ్వమంతా వ్యాపింపజేసే ఓంకార ప్రణవనాదాన్ని ఆమూలాగ్రంగా దర్శించాం. 14వ శ్లోకంలో అనన్య చిత్తులై నన్ను గురించి నిరంతరం స్మరించే ధ్యాని నన్ను సులభంగా పొందుతాడని చూసి ఇక్కడే దృశ్యపదార్థాలపైకి పరుగులెత్తకుండా దృక్ స్వరూపమైన పరమాత్మ యందే లగ్నమై ఉండటమే

అనన్య చేతః అని తెలుసుకున్నాం. ఇందులో మనుషుల్ని మూడు రకాల వారుగా విభజించి విశ్లేషించుకున్నాం. 15వ శ్లోకంలో సర్వోత్తమమైన మోక్షాన్ని పొందిన మహాత్ములు నన్ను పొందినవారై మరలా దుఃఖ నిలయమైన జన్మను ఎత్తరని గ్రహించాం. జన్మ ఉంది అని అనుకునే వారికి అది దుఃఖాలయం కాని జన్మ లేనిదేనని తెలుసుకున్న జ్ఞానుల జీవితం అద్వితీయంగా శోభిస్తుందని అక్షర పరబ్రహ్మమై వెలుగొందుతుందని దర్శించాం.

16వ శ్లోకంలో బ్రహ్మలోకంతో సహా అన్నీ లోకాలు కూడా తిరిగి తిరిగి జన్మకు కారణమవుతున్నవేనని నిర్ధారించుకున్నాం. 17వ శ్లోకంలో కాలం అంటే ఏమిటో అహోరాత్రవిధులు ఎవరో సవివరంగా సమగ్రంగా చూసాం. ఇందులో మానవుల కాలమానం దేవతల కాలమానం బ్రహ్మ కాలమానం ఇలా సమస్త కాలగణనను లెక్కించి

కాలాతీతులే కాలజ్ఞానులు అని నిర్ధారించుకున్నాం. అహోరాత్రులు తెలిసినవారు వెయ్యి యుగాలు బ్రహ్మకు ఒక పగలు అని అంతేకాలం రాత్రి అని తెలుసుకుంటారని చూశాం.18వ శ్లోకంలో బ్రహ్మకు పగలు కాగానే అవ్యక్తం నుండి సమస్త ప్రాణులు పుడుతున్నాయి బ్రహ్మకు రాత్రి కాగానే సమస్త ప్రాణులు అదే అవ్యక్తంలో లయమవుతున్నాయని చూశాం. 19వ శ్లోకంలో పూర్వకల్పంలోని ప్రాణి సమూహమే కర్మాధీనమై పరాధీనమై అస్వతంత్రంగా పుట్టి పుట్టి బ్రహ్మకు రాత్రి కాగానే తిరిగి లయమవుతుంది తిరిగి మళ్ళీ బ్రహ్మదేవుని పగలు ఆరంభం కాగానే తిరిగి పుడుతోందని ప్రాణుల పరాధీన పుట్టుక లయలను చూశాం. 20 వ శ్లోకంలో అవ్యక్త మూలప్రకృతి కంటే పరమైన మరో అవ్యక్తం ఉందని అదే సనాతనం పురాతనం సర్వభూతాలు నశించిన తరువాత కూడా అది నశించదు అని మరో అవ్యయ అవ్యక్తమయ పరంధామాన్ని దర్శించాం. ఇక్కడే కనిపించే వ్యక్తం కనిపించని అవ్యక్త మూలప్రకృతి వీటన్నింటికి అతీతమైన విశ్వవ్యాపక అధిష్ఠాన అపురూప మరో అవ్యక్తం ఈ మూడింటిని సమన్వయం చేసుకున్నాం. 21వ శ్లోకంలో జీవుల పరమగతి అయిన పరమాత్మను అవ్యక్త అక్షరుణ్ణి పొందిన వారు తిరిగి జన్మకు రారు ఆ పరంధామం

నాదేనంటూ స్వయంగా తనకు తానుగా దర్శనమిచ్చాడు జగద్గురువు. 22వ శ్లోకంలో ప్రాణులన్నీ అతని యందే ఉన్నాయి ఈ సమస్త ప్రపంచమంతా అతని చేతనే పరివ్యాప్తమై ఉంది అట్టి పురుషోత్తముని పరంధామం అనన్య భక్తి చేతనే సాధ్యం అని పరమాత్మ స్వరూపాన్ని పొందే మార్గాన్ని ఉపాయాన్ని ఇక్కడ చూసాం. ఇందులో ప్రతిపాదించిన సాధ్యం సాధనం రెండింటినీ కూడా సూక్ష్మదృష్టితో విశ్లేషించుకున్నాం. 23వ శ్లోకంలో ఏ కాలంలో శరీరాన్ని విడిచినవారు తిరిగి జన్మను పొందరో ఏ కాలంలో శరీరాన్ని విడిచినవారు తిరిగి పునర్జన్మను పొందుతారో ఆయా కాల విశేషాలను చెప్తున్నాను అంటూ స్వయంగా జగద్గురువు చెప్పిన కాల విశేషాన్ని చూశాం. కాలగర్భంలో దాగి ఉన్న సమస్తాన్ని దర్శించాం. ఎవరు ఎలా జీవిస్తే దాన్నిబట్టే దేహ వియోగానంతరం వారు వెళ్లే మార్గం వారు పొందే గమ్యం నిర్దేశితమవుతుందని కూడా చూసాం. 24వ శ్లోకంలో అగ్ని, జ్యోతి, పగలు, శుక్లపక్షం ఉత్తరాయణం మార్గంలో జీవించిన వారు బ్రహ్మ విదులు వారు బ్రహ్మంగానే ఉండటం వల్ల దేహం విడిచాక కూడా బ్రహ్మన్నే పొందుతారని తద్విరుద్ధంగా పొగ చీకటి కృష్ణపక్షం దక్షిణాయనమార్గంలో జీవించి దేహాన్ని విడిచినవారు తిరిగి మళ్ళీ పునర్జన్మను పొందుతారని 8-25లో చూసాం. ఈ రెండు శ్లోకాలలో ఉత్తరాయణం దక్షిణాయనం అనే శబ్దాలను సరైన పద్ధతిలో సరికొత్త భావాన్ని మనం గ్రహించాం. 26వ శ్లోకంలో జగత్తులో శుక్ల కృష్ణ మార్గాలు రెండూ జగత్తు ఉన్నంతవరకు ఉంటాయి అయితే శుక్లమార్గంలో వెళ్ళిన వారు పునర్జన్మను పొందరని నిర్ధారించుకున్నాం. 27వ శ్లోకంలో ఈ రెండు మార్గాలు వాటి వివరాలు తెలిసిన యోగులు ఎవ్వరూ ఇక మోహాన్ని చెందరు కాబట్టి నీవు యోగయుక్తుడివికా అని మనకు పిలుపునిచ్చాడు జగద్గురువు. ఇందులో మనుషుల్ని మహాత్ములు ముముక్షువులు సకామకర్ములు లౌకికులు అని నాలుగు రకాలుగా విశ్లేషించుకున్నాం. 28వ శ్లోకంలో చక్కగా వేదాధ్యయనం చేసినందుకు యజ్ఞాలు ఏ లోపాలు లేకుండా అనుష్ఠించినందుకు తపస్సు బాగా చేసినందుకు అనేక దానాలు చేసినందుకు శాస్త్రం ఏ పుణ్యఫలం చెప్పిందో ఆ సమస్త ఫల సమూహాన్ని మించిన ఫలం యోగి జ్ఞాని పొందుతున్నాడని వివరించుకున్నాం.

ఇలా ఏడు ప్రశ్నలతో ఆరంభమైన ఈ అధ్యాయంలో అనేక అంశాలు చోటుచేసుకున్నాయి. ఆ ఏడు ప్రశ్నలకు జగద్గురువు ఇచ్చిన సమాధానాలు ఏడేడు లోకాలను కాదు కాదు సకల లోకాలను తలపించాయి. అక్షర పరబ్రహ్మంలో సమస్తము ఇమిడి ఉన్నట్లు ఈ అక్షర పరబ్రహ్మ యోగంలోనూ ఉత్తరాయణ దక్షిణాయన మార్గాలు మానవుల దేవతల బ్రహ్మ కాలమానాలు అంతకంటే అతీతమైన మరో అవ్యక్తం లాంటి అనేకానేక అంశాలతో ఈ అధ్యాయాన్ని ముగించిన పరమాత్మకు ఈ సందర్భంగా ప్రణమిల్లుదాం.

9అ, 1శ్లో.

శ్రీ భగవానువాచ |

ఇదం తు తే గుహ్యతమం ప్రవక్ష్యామ్యనసూయవే |

జ్ఞానం విజ్ఞానసహితం యద్ జ్ఞాత్వా మోక్ష్యసేఽశుభాత్ ||

అర్జునా దేనిని తెలుసుకుంటే అశుభ రూప దుఃఖాలయపు బంధం నుండి నీవు విడిపడుతావో అట్టి రహస్యమైన అనుభవ జ్ఞాన సహితమైన ఈ బ్రహ్మ జ్ఞానాన్ని అసూయ లేని వాడైన నీకు విశేషంగా చెబుతున్నాను.

మనం జ్ఞాన యోగం చూసాం విజ్ఞానయోగం చూసాం. ఇక్కడ జ్ఞానం విజ్ఞాన సహితం అన్నారు కాబట్టి ఈ రాజవిద్య రాజగుహ్యంలో విజ్ఞాన సహితంగా అనుభవ సహితంగా జ్ఞానాన్ని పొందబోతున్నాం. అది అతి రహస్యమైనది, మనం రహస్యం అంటే ఏంటో 4-3 లో విపులంగా చూసాం. మనం దర్శించలేని దాన్ని రహస్యం అంటున్నామే గాని అదేదో దాచదగినదో దాచుకోదగినదో కాదు. 4-3 లో శ్రేష్ఠమైన రహస్యమైన దాన్ని నీకు చెప్తున్నాను అన్నారు. ఇక్కడ అతి రహస్యం ఇంకా ఇంకా రహస్యమైనది మరింత లోతుల్లోకి వెళ్లి వివేచనతో మనం ఇంకా ఇదివరకు చూడని దర్శించని ఆత్మ ప్రకాశాన్ని విజ్ఞాన సహిత జ్ఞానంతో ప్రత్యక్ష ప్రమాణం గావించుకోవాలి. ఇది ఎప్పుడు వీలవుతుందంటే అనసూయవే మనం మనలోని హృదయ స్థానాన్ని అసూయ లాంటి గజ దొంగలు అపహృతమ్ చేయనప్పుడే వీలవుతుంది. అలా మనో బుద్ధులను ఆత్మస్థం చేస్తే అప్పుడు అసూయ ఉండదు కదా. అలా అసూయ ద్వేషాలకు మనలో అవకాశం ఇవ్వకుండా అనసూయంగా ఉంటేనే మనకు ఈ బ్రహ్మ విద్య విజ్ఞాన సహిత జ్ఞానం అవుతుంది. అందుకే ఆ విషయాన్ని ఎనిమిది అధ్యాయాలలో ఉద్బోధించినా మళ్లీ ఇక్కడ మనల్ని హెచ్చరించి మనకు అతి రహస్యమైన రాజవిద్య రాజగుహ్యమైన బ్రహ్మవిద్యను అక్షర పరబ్రహ్మాన్ని అభ్యసింపజేయడానికి మనల్ని ఉద్యుక్తులను చేస్తున్నాడు ఆ పరమాత్మ పరంధాముడు. అనేక దుర్గుణాలకు ప్రభువు అసూయ కావడం వల్లనే ఇక్కడ జగద్గురువు దాన్ని సమూలంగా వేర్లతో సహా పెకలించి నిర్మూలించుకోవాలని హితవు చెబుతున్నారు. అసూయ వేరు పురుగు వంటిది, వేరు పురుగుకు ఆశ్రయమిచ్చి పచ్చని చెట్టు ఎలా నాశనమవుతుందో దుర్గుణాలకు ఆశ్రయమిచ్చిన మనిషి కూడా అలాగే పతనమవుతాడు. కాబట్టి వాటికి మనం మనలో తావియ్యకుండా జాగ్రత్త పడాలి. అసూయ ద్వేషాలు ఉంటే ఈ విద్య మన వొంట పట్టదు అవి మనం తొలగించుకుంటేనే మనకు ఈ బ్రహ్మవిద్య విజ్ఞాన సహిత జ్ఞానం అవుతుంది. లేకపోతే కేవలం వినడం లేదా కంఠస్థం చేయడం లేదా పారాయణం చేయడం వరకే పరిమితమవుతుంది. మనలో ఆ అసూయపొరలు తొలగినప్పుడే అనుభవ జ్ఞానం మన

స్వంతమవుతుంది. లోతైన అధ్యయనానికి దర్శనానికి అది అడ్డు తగులుతుంది కాబట్టి ఇక్కడ బ్రహ్మ విద్య అధ్యయనానికి కావలసిన యోగ్యతను మరోసారి నిర్ధారించి జగద్గురువు మనల్ని ముందుకు తీసుకెళ్తున్నారు. కదలిక లేకుండా నిర్మలంగా ఉన్న వస్త్రం పైన్నే రంగు మనకు కావాల్సినట్లు అంటుతుంది, అతుకుతుంది. అలాగే నిర్మలంగా ఉన్న వారై బోధించే వారికి జ్ఞానం విషయంలో స్పష్టత ఉండాలి, బోధన అందుకునే వారికి అంతఃకరణ శుద్ధి ఉండాలి. అలా అసూయలేని అర్హులైన వారికి జ్ఞానం బోధించే స్పష్టత ఉన్నవారు బోధిస్తే జ్ఞానం ప్రాప్తిస్తుంది. జ్ఞానమే మోక్ష ప్రాప్తికి శరణ్యం కనుక బ్రహ్మనిష్ఠులు బ్రహ్మ జ్ఞానం ఉన్న దైవాంశ సంభూతులు ఎవరైనా బ్రహ్మవిద్యను బోధించవచ్చు. అర్హత గల ఎవరైనా అందుకోవచ్చు అదే మనం చూసిన ఉత్తరాయణ మార్గంలో ప్రయాణిస్తున్న బ్రహ్మపథం. వారు అంతఃకరణ శుద్ధి అర్హత గల ఏ మనిషికైనా బోధించవచ్చు, ఈ భౌతిక బంధాలతో కులమతాలతో సంబంధమే లేదు వర్గంతో వయసుతో లింగ భేదంతో అసలు సంబంధం ఉండదు. గుహ్యతమం అన్నారు బ్రహ్మజ్ఞానం అనేది ప్రత్యక్ష ప్రమాణానికి సాధనతోనూ ప్రయత్నంతోనూ మాత్రమే అందగలదు పొందగలదు. నీకు నీవుగా అర్థం చేసుకోలేని దాన్ని శాస్త్రం ద్వారానే అర్థం చేసుకోవాలి అని ఐతరేయ ఉపనిషత్తు. అందుకే అర్థం కాని మానవాళికి అర్థం చేయించడానికి ఆచార్యుడైన జగద్గురువే స్వయంగా మనకు బోధిస్తున్నారు. అయితే అందుకు అర్హత ఏమి అంటే అనసూయ అసూయ లేకుండా ఉండడం, అదే బ్రహ్మ జ్ఞాన సముపార్జనకు అర్హత. మనం కూడా మనలోకి అసూయ ఏమాత్రం ప్రవేశించకుండా జాగ్రత్త పడుతూ సద్గురువు బోధిస్తున్న విజ్ఞాన సహితమైన జ్ఞానాన్ని అనంతుడైన ఆత్మ జ్ఞాని బోధను అందుకోవడానికి సంసిద్ధులవుదాం.

9అ, 2శ్లో.

రాజవిద్యా రాజగుహ్యం పవిత్రమిదముత్తమమ్ |

ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తుమవ్యయమ్ ||

ఈ బ్రహ్మజ్ఞానం విద్యలలోకెల్లా శ్రేష్టమైనది, రహస్యాలలోకెల్లా అతి రహస్యమైనది సర్వోన్నతమైనది పవిత్రమైనది ప్రత్యక్షంగా తెలియదగినది ధర్మయుక్తమైంది ఆచరించడానికి సులభమైనది నాశరహితమైనది.

ప్రపంచంలో అనేక విద్యలు ఉన్నాయి అయితే అవి మాత్రమే సరిపోవు అవేవీ జీవుని జనన మరణ దుఃఖాల నుండి తప్పించలేవు కూడా ఒక్క బ్రహ్మ విద్యే ఆ పని చేయగలదు. దృశ్యమయ వస్తువులన్నీ కూడా మనిషికి పూర్ణ శాంతిని కలిగించలేవు శాశ్వతమైన నిత్యమైన బ్రహ్మవిద్య మాత్రమే సంపూర్ణ శాంతిని చేకూర్చి పరిపూర్ణాన్ని దర్శింప చేయగలదు. అందుకే బ్రహ్మ విద్య విద్యలలో కెల్లా శ్రేష్టమని అదే రాజవిద్య అని

జగద్గురువు ఇక్కడ ప్రతిపాదిస్తున్నాడు. ఇందులోని ఇదం అనే సర్వనామాన్ని బ్రహ్మ జ్ఞానమని భావించాలి, ఆ బ్రహ్మజ్ఞానం రాజవిద్య అని రాజగుహ్యం అని పవిత్రమని ఉత్తమమని ప్రత్యక్షావగమమని ధర్మ్యమని సుసుఖం కర్తుమని అవ్యయమని పేర్కొన్నారు. మొదటి శ్లోకంలో చెప్పినటువంటి విజ్ఞాన సహిత జ్ఞానమే ఇక్కడ రాజవిద్యగా చెబుతున్నారు. అక్కడ చెప్పిన విజ్ఞాన సహిత జ్ఞానం ఇక్కడ చెప్పిన రాజవిద్య ఎనిమిదవ అధ్యాయంలో మనం చెప్పుకున్న అక్షర పరబ్రహ్మం అనే మరో అవ్యక్తం ఈ మూడు ఒక్కటే. రాజవిద్యకున్న లక్షణాలను ఏడు విధాలుగా వివరించారు. సాధారణంగా విద్యలలో ఏ విద్యను ఎంతగా తెలుసుకున్నా ఇంకా తెలుసుకోవలసింది ఎంతో ఉంటుంది. కానీ బ్రహ్మవిద్య అలాంటిది కాదు, ఇది మిగతా విద్యలలాగా పరిమితమైనది కాదు బ్రహ్మవిద్య పూర్ణవిద్య అంతేకాక ఈ విద్యను పొందితే మరి ఏదీ పొందవలసింది గాని ఇంకేదో తెలుసుకోవాల్సింది గాని ఉండదు, అందుకే ఇది రాజవిద్య అయింది. బ్రహ్మవిద్య అంటే సాధారణ స్థాయి మనుషులు భావించే కులానికి పరిమితమైన బ్రాహ్మణ కులం అంటున్న వారిది కాదు రాజవిద్య అంటే రాజులది కాదు. రాజవిద్య అయిన బ్రహ్మవిద్యను బోధించే ప్రతి ఒక్కరూ రాజు బ్రహ్మ బ్రాహ్మణులు అవుతారు. మరి నేర్చుకున్న ప్రతి ఒక్కరూ రాజు బ్రహ్మ బ్రాహ్మణులే అవుతారు కదా. ఇద్దరూ ఒక్కటే ఎవ్వరూ ఎక్కువ తక్కువ కాదు. అలా అందరినీ ఏకం చేయడమే రాజవిద్య ప్రత్యేకత. అంతేకాక మృతప్రాయకు ఆలోచనను మృత్యువును నిర్మూలించే అమృతత్వాన్ని ప్రసాదించే రాజవిద్య కనుకనే బ్రహ్మవిద్య రాజగుహ్యం అయింది, ఇది రాజవిద్య రాజగుహ్యం. ఇక పవిత్రం అంటే పావనం శుద్ధి కారణం. పావనంయైన అన్నింటిలోకి ఉత్తమమైనది బ్రహ్మజ్ఞానం ఎన్నోవేల జన్మల్లో పోగు చేసుకున్న పుణ్య పాపకర్మలన్నింటిని సమూలంగా వేరు కూడా మిగలకుండా క్షణమాత్రంలో బూడిద చేసే బ్రహ్మ జ్ఞానం యొక్క గుణం ఎంతటి పావనమో పవిత్రమో అనంతమైన పవిత్రతను సంతరించుకున్నది కనుకనే ఇది ధర్మమయం. శుద్ధి చేసేది ఏదైనా పవిత్రమైనదే పావనమైనదే. నీరు మట్టి అగ్ని గాలి సూర్యుడు నదులు ఇలా పవిత్రం చేసేవి ప్రపంచంలో ఎన్నో ఉన్నాయి. ఇవన్నీ అపవిత్రాలను పవిత్రం చేయవచ్చుగాని అలా పవిత్రమైన వాటిని తిరిగి అపవిత్రం కాకుండా నివారించలేవు. నీరు పాపం పోగొట్టగలదు శుద్ధి చేయగలదు. కాని బుద్ధిలోని పాప భావనను మనసులోని పాపపు సంస్కారాన్ని పోగొట్టలేదు కదా. అలాగే యజ్ఞయాగాది క్రతువులు కూడా అయితే వీటన్నింటి నుంచి మనిషిని నివారించగలిగింది పవిత్ర పావనమైన రాజవిద్య అయిన బ్రహ్మ విద్య మాత్రమే. అందుకే పవిత్రాలలోకెల్లా పరమ పవిత్రమై విరాజిల్లుతోంది. ప్రపంచంలో ఎన్నో జ్ఞానాలు ఉన్నా బ్రహ్మజ్ఞానం ఒక్కటే ఉత్తమ ఫలమైన మోక్షాన్ని ప్రసాదించే సత్య జ్ఞానమై ఉన్నందున అది జ్ఞానాలన్నింటిలోకెల్లా ఉత్తమమైన జ్ఞానం అందుకే అది ఉత్తమం. ఈ రాజవిద్య పవిత్రం ఉత్తమం రహస్యాలలోకెల్లా అతి రహస్యమైనది ప్రత్యక్షంగా తెలియదగినది ధర్మ సహితమైనది నాశనం లేనిది అనుష్ఠించడానికి ఆచరించడానికి సులభమైనది అంటే విద్యలకు రాజు రాజవిద్య. అతిశయమైన దీప్తి కలది కనుక బ్రహ్మవిద్య సమస్త విద్యలలో అతిశయంగా ప్రకాశిస్తోంది. అలాగే రహస్య విద్యలన్నిటికీ రాజు కాబట్టి

రాజగుహ్యం. ఇక్కడి వరకు రాజవిద్య రాజగుహ్యం పవిత్రమిదముత్తమమ్ మొదటి పాదం పూర్తయింది. ఇక ప్రత్యక్ష్యావగమం ఈ బ్రహ్మవిద్యను ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చు అనుభూతి చెందవచ్చు ఇది ప్రత్యక్ష ఫలాన్ని అందిస్తుందే గాని పరోక్ష ఫలితాన్ని కాదు ఈ బ్రహ్మ విద్యను అనుభూతి చెందిన క్షణంలోనే మనకు బ్రహ్మం సాక్షాత్కారం అవుతుంది. ఇలా తానే బ్రహ్మమనే అనుభవం ప్రత్యక్ష ప్రమాణమే గాని పరోక్షం కాదు కదా కాబట్టి దీని ఫలితం అందుతుందా లేదా అనే సంశయానికి తావు లేదు. ప్రతి ఒక్కరికి సాక్ష్యంగా ప్రత్యక్షంగా తెలిసే అనుభవ జ్ఞాన సహిత జ్ఞానమే ఈ శ్రేష్టమైన బ్రహ్మవిద్య. ఆత్మ స్వతఃసిద్ధం, స్వప్రకాశం అయినందువల్ల ప్రత్యక్షానుభవమై ఉంది అందుకే జ్ఞానఫలం అనుభవ రూపమై ఉంది అని బ్రహ్మ సూత్రాలు ఉద్బోధిస్తాయి. అవగమము అంటే రెండు అర్థాలుగా చెప్పుకోవచ్చు ప్రమాణం అని ఒక అర్థం దేనిచేత తెలియబడుతూ ఉందో అదే అవగమం అంటే ప్రత్యక్షమైన ఆత్మవస్తువు. ఆత్మ జ్ఞానం ప్రమాణం కాబట్టి ఆత్మవిద్య ప్రత్యక్ష్యావగమం. ప్రమాణ పలానుభవం ప్రత్యక్షం కావడం వల్ల ఆత్మవిద్య ప్రత్యక్షావగమం. ఇక ధర్మ్యం అన్నారు ఏది ధర్మానికి విరుద్ధం కానిదో ఏది ధర్మం నుండి దూరంగా తొలగదో అది ధర్మ్యం. దైవం ధర్మ స్వరూపం ధర్మ స్వరూపంలో ఉండి సమస్తాన్ని ధరించేవాడు కాబట్టి దైవానికి ధర్మ నామం సార్ధకమయింది, సమస్త భూతాలకు ఆధారమైన స్థితికారకుడు కాబట్టి దైవం ధర్మ స్వరూపుడు. జ్ఞానం వేరు జ్ఞాని వేరు కాదు ధర్మం ధర్మి వేరు కాదు అలా ధర్మి నుండి దూరం కానిది ధర్మ్యం ఇదే బ్రహ్మ జ్ఞానం. శ్రీరాముడు ధర్మాచరణ గావించి ఆదర్శప్రాయుడైతే గీతా బోధకుడైన ఆచార్య జగద్గురువు ధర్మాన్ని అనుసరించి ఆచరించే ధర్మ మార్గాన్ని నిర్దేశం చేశారు ఇది ధర్మ్యం. సుసుఖం ఈ బ్రహ్మ విద్యను ఆచరించడం చాలా తేలిక అన్నారు మనలోనే మనకు అవసరం లేని మన వినాశనానికి కారణమవుతున్న సరికాని దుర్లక్షణాలను సంస్కారాలను ప్రయత్న పూర్వకంగా తొలగించుకుంటే స్వస్వరూప సాక్షాత్కారం సులభంగా పొందగలం. మనలో మన ప్రయత్నం లేకుండానే సహజంగానే ఉచ్ఛ్వాస నిశ్వాసలు జరుగుతుంటాయి. అలాగే మనము ఉత్తరాయణ మార్గంలో సన్మార్గంలో ఉన్నప్పుడు ధర్మానికి మూలమైన బ్రహ్మవిద్య కూడా మనలో సహజంగానే సిద్ధిస్తుంది. దీన్నిబట్టి బ్రహ్మ జ్ఞానం విద్యలన్నింటిలో శ్రేష్టమైనది అతి రహస్యమైనది పవిత్రమైనది ఉత్తమమైనది సులభంగా ఆచరించదగినది నాశరహితమైనది అని మనకు నిరూపణ అవుతుంది. సుసుఖం కర్తుం బ్రహ్మ జ్ఞానం అనేది స్వరూప జ్ఞానమే కనుక అది సులభమైంది, సాధించడం కష్టంగా అనిపించినా సుఖంగా సులభంగా అవలీలగా సాధించవచ్చు. ఎందుకంటే అది ప్రత్యక్ష ప్రమాణంగా అనుభవం అయ్యేది కాబట్టి ఏ కాలం కోసమో ఎదురు చూడాల్సిన పనిలేదు మరే స్థలం కోసమో వెతకాల్సిన పనిలేదు గ్రహించదగినది వీక్షించగలిగినది కాబట్టి చాలా సులభమైనది సుసుఖం కర్తుమ్. ఇక చిట్టచివరిది అవ్యయం దీని ఫలితం వ్యయం కాని అవ్యయమైనది ఎన్నటికీ క్షయం కానిది. ఈ ఈ మాటకు మనం అనేక సందర్భాల్లో చూసాం నాశితం లేనిది వ్యయం కానిది ఆ అవగాహనతో ఇక్కడ సమన్వయం చేసుకుంటే సరిపోతుంది.

9అ, 3శ్లో.

అశ్రద్ధధానాః పురుషా ధర్మస్యాస్య పరంతప |

అప్రాప్య మాం నివర్తంతే మృత్యుసంసారవర్త్మని |3|

ఓ పరంతపా! ఈ ధర్మమార్గమునందు విశ్వాసము లేని పురుషులు నన్ను పొందజాలరు. కనుక వారు మృత్యురూప సంసారచక్రమున పరిభ్రమించు చుందురు.

ముందు శ్లోకంలో రాజవిద్య విశిష్టతను పవిత్రతను వివరించి సులభంగా రాజవిద్యా రహస్యాన్ని దర్శించవచ్చని జగద్గురువు పిలుపునిచ్చారు. ఈ శ్లోకంలో ధర్మ స్వరూపంలోనూ దాని ఫలంలోనూ శ్రద్ధ లేని వారు నాస్తికులు పాపకర్ములు ఆసురీభావాల్ని ఆశ్రయించి దేహమే ఆత్మ అనుకునే ఇంద్రియలోరులు నన్ను చేరలేక దుఃఖాలయ మృత్యు సంసారమార్గంలో తిరుగుతున్నారు. 'మాం అప్రాప్యా" అని చెప్పడం వల్ల అలాంటివారు నన్ను చేరలేరు అని కూడా ఖచ్చితంగా తేల్చి చెప్పారు. కాబట్టి శ్రద్ధతో సన్మార్గంలో సదాచరణతో కొనసాగాలి. అప్పుడే ఆ శ్రద్ధకు జ్ఞానఫలం, జ్ఞానఫలం ద్వారా మోక్షం అందుతుంది. జ్ఞానానికి మూలం ధర్మమని అనుభవమవుతుంది.

జీవననదీ ప్రవాహంలో జీవంపై శ్రద్ధ కలిగినవారు విశ్వాసంతో శాస్త్రాన్ని అధ్యయనం చేసి విజ్ఞాన సహితం కావించుకొని దైవంగా విరాజిల్లుతారు. అందుకు భిన్నంగా శ్రద్ధ లేనివారు అశ్రద్ధావంతులు పాపాచారంలో మునిగిపోయి ప్రవర్తిస్తూ ఉంటారు. అయితే వీరికి శ్రద్ధ లేదని కాదు వారిలోని శ్రద్ధ అంతా పాపాచరణకు అంకితమై ఉంటుంది. న్యాయం ధర్మం లాంటివన్నీ వీరి దృష్టిలో అర్థరహితాలు. వీరు దేహమే ఆత్మ అని దృశ్యమయ భోగాలే జ్ఞానమని పొరపడుతూ ఉంటారు. ఇలా దారి తప్పిన వారు ఎప్పటికీ దరిచేరలేరు. సన్మార్గం పట్ల శ్రద్ధ చూపని కారణంగా వారు అశ్రద్ధ పరులే గాని వారిలో శ్రద్ధ లేనేలేదని కాదు. దైవంపై లేదా బ్రహ్మపై శ్రద్ధ ఉంటేనే ఆ శ్రద్ధకు ఓ విలువ ఉంటుందని గ్రహించాలి. లౌకిక పనుల్లో కానీ పారమార్థిక కార్యంలో కానీ ప్రతి కార్యంలోనూ శ్రద్ధ చాలా అవసరం, శ్రద్ధను బట్టే ఫలితం. అందుకే జగద్గురువు ప్రథమ షట్కంలో ఈ అంశాన్ని మరోసారి చెప్పి హెచ్చరిస్తూ శ్రద్ధ

లేని వారి పరిస్థితిని సవివరంగా ఇక్కడ నిర్ధారించారు. ప్రధమ షట్కంలో శ్రద్ధ అనే శబ్దాన్ని అనేక ఉదాహరణలతో విపులంగానే చూసాం కాబట్టి ఇక్కడ సంక్షిప్తంగా చూస్తున్నాం. ఇక నివర్తంతే అని చెప్పడం వల్ల ఆసురీ భావంతో ప్రవర్తిల్లేవారు దుఃఖాలయంలోనే మునిగి మిక్కిలి స్థిరంగా కూరుకుపోతారని అర్థం. దేనిపైన శ్రద్ధ ఉంటే దాన్నే పొందుతాం కదా కాబట్టి బ్రహ్మజ్ఞానంపై శ్రద్ధ ఉంటే బ్రహ్మాన్ని పొందుతాం. తద్విరుద్ధంగా ఆసూరి భావంతో ప్రవర్తిస్తే మృతప్రాయంగా ఉంటారు అశ్రద్ధావంతులుగా ఉన్నంతకాలం మృత్యు సంసారంలోనే శాశ్వతంగా తిరుగుతూ ఉంటారు. కాబట్టి మోక్షానికి మార్గం జ్ఞానం, జ్ఞానానికి మూలం ధర్మం. శ్రద్ధతో జ్ఞానార్జన గావించి పరమపదాన్ని పొందాలి గాని అశ్రద్ధతో ఆసురీభావంతో ఉండి మృత్యురూప సంసారంలో చిక్కుకొని మృతప్రాయులుగా ఉండరాదు. ఒకటి నుండి మూడు వరకు గల ఈ శ్లోకాల్లో రాజవిద్య వైభవం, వైశిష్ట్యాన్ని చూసాం. ఇక రాజవిద్యా శాస్త్రాన్ని పూర్ణ శ్రద్ధతో రాజవిద్య రాజగుహ్యంతో యోగమై అభ్యసిద్ధాం.

9అ, 4శ్లో.

మయా తతమిదం సర్వం జగదవ్యక్తమూర్తినా |

మత్ స్థాని సర్వభూతాని న చాహం తేష్వవస్థితః |4|

నిరాకారపరబ్రహ్మనైన నాచేతనే ఈ జగత్తంతయును జలముతో మంచువలె పరిపూర్ణమైయున్నది. ప్రాణులన్నియును నా సంకల్పమును ఆధారముగా కలిగి నాయందే అంతర్గతములై యున్నవి. కాని వాస్తవముగా నేను వాటియందు స్థితుడనుకాను.

విద్యాప్రకాశానందగిరి స్వామి చెప్పినటువంటి చక్కటి ఉపమానం చూద్దాం. ఈ నామరూపాత్మకమైన దృశ్య జగత్తంతయూ కూడా స్వప్నంవలె మిథ్యామయమై ఉన్నది అన్నారు. అంటే మిథ్యామయమైన దృశ్య వస్తువు నందు సత్య వస్తువగు పరమాత్మ ఎలా ఉండగలడు? మనకు కనిపిస్తున్న కార్యరూప జగత్తు వ్యాప్యం, కారణరూపుడైన పరమేశ్వరుడు వ్యాపకం ఈ జగత్తుకు ఈశ్వరునికి

వ్యాప్య, వ్యాపక, ఆధార, ఆధేయ సంబంధం ఉన్నట్లు మన వ్యవహారిక దృష్టికి అందుతోంది. ఈ సంక్లిష్ట సంశ్లేషాన్ని అంటే ఈ రెండింటి సంబంధాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ఒక వస్తువు మరో వస్తువుతో కలిసి ఉండటం సంశ్లేషత సంక్లిష్టత ఇదం సర్వం జగత్ మయాతదం. ఈ ప్రపంచం నాచేత వ్యాపించబడి ఉంది అంటున్నారు. అంటే కురుక్షేత్రంలో ఉభయసేనల మధ్య యుద్ధానికి సంసిద్ధమై ఇరువర్గాల వారు తమ తమ శంఖాలను పూరించాక యుద్ధారంభక్షణంలో అర్జునుడి ఎదుట నిలబడి ఉద్బోధిస్తున్న పరమాత్మ యొక్క పరిఛిన్నమైన ఈ భౌతిక దేహం విశ్వమంతా వ్యాపించి ఉందా? అలా ఉండేందుకు అవకాశం లేదు, సాధ్యతకు వీలు కానిది కూడా. అయితే వ్యక్తం అవుతున్న భౌతిక రూపం కాకుండా వ్యక్తం కాని తన అవ్యక్త స్వరూపంతో జగత్తు వ్యాప్తమై ఉంది. కనిపిస్తున్న శ్రీ వాసుదేవుడు వ్యక్తమూర్తి కనిపించని శ్రీ వాసుదేవుని యొక్క స్వరూపం అవ్యక్తమూర్తి. అదేవిధంగా ఇక్కడ కనిపిస్తున్న జగత్తు వ్యక్తమూర్తి చేత కాకుండా అవ్యక్తమూర్తి చేత వ్యాప్తమై ఉంది. అంటే కనిపించనిది కాబట్టి లేనిదే నేమో అనే సందేహం కలిగే అవకాశమూ లేకపోలేదు. వ్యక్తం అంటే భౌతిక ఇంద్రియ గోచరం. అవ్యక్తం అంటే భౌతిక ఇంద్రియాలకు కనిపించేది కాకుండా వ్యక్తమైన ప్రత్యక్షానుభవము అయ్యేది. ప్రత్యక్షావగమం అలా అనుభవంగా ప్రత్యక్ష ప్రమాణంగా మాత్రమే తెలియపడే అవ్యక్త మూర్తినైన నాచేత వ్యాపితమై ఉంది. నా స్వరూపంచేత వ్యాప్తమై ఉంది. ఈ అవ్యక్త మూర్తి మనకు అర్థమైతేనే ఈ అధ్యాయంలోని తరువాతి శ్లోకాలను మనం అభ్యసించగలం. ఈ అంశం మనకు అర్థం కావడానికి సుదీర్ఘమైన సుదూరమైన విశాలమైన ఆలోచనా దృక్పథం అలవడాలి. విన్న వెంటనే చదివిన వెంటనే అర్థం కాకపోయినా ఇదే అంశాన్ని చింతిస్తూ తలస్తూ తలపోస్తూ ఉంటేనే ఈ అవ్యక్తమూర్తి మనకు ప్రత్యక్షానుభవం అవుతుంది. అప్పుడే మనలోని అనేక చిక్కుముడులు వీడి ఈ బ్రహ్మపథంలో భగవంతుని చేరగలం. అందుకని కొన్ని ఉదాహరణలతో ఈ మరో అవ్యక్తమూర్తిని ప్రత్యక్షానుభవం గావించుకోవడానికి ప్రయత్నిద్దాం. ఈ రాజగుహ్యం అతి రహస్యం మనకు తెలియాలంటే ఇది తప్పనిసరి. సృష్టి కార్యరూపంలో ఉంది, సృష్టికి పరమేశ్వరుడు కారణంగా ఉన్నాడు. కార్యానికి ముందు కారణమే ఉంటుంది, కుండకు ముందు మట్టే ఉంది. చెట్టుకు ముందు బీజం ఉంది, బీజంలో అవ్యక్తంగా ఉన్న అంకురమే కార్యరూపాన్ని

పొందినప్పుడు శాఖోప శాఖలు గల వృక్షంగా మనకు వ్యక్తం అయింది. సృష్టికి ముందు అవ్యక్త మూర్తిగా ఉన్న పరమేశ్వరుడే సృష్టిగా వ్యక్తం అవుతున్నాడు. కుండలో మట్టి లాగా నామరూపాలలో కారణమే వ్యాపించి ఉంటుంది. కాబట్టి పాంచ భౌతికమైన దృశ్యమాన జగత్తులో పరమేశ్వరుని అవ్యక్త చైతన్యమే వ్యాపించి ఉంది. ఈ విధంగా విశ్వమంతా అవ్యక్తమూర్తి యైన పరమేశ్వరి చైతన్యం చేత వ్యాప్తమై ఉంది. మనం నిద్రిస్తున్నప్పుడు కలలు కంటున్నాం ఈ అంశంతో పోల్చి ఈ మరో అవ్యక్త మూర్తిని అవగాహన చేసుకోవడానికి ప్రయత్నిద్దాం. ఎవరి కల వారిదే ఎవరి కలకు వారే కర్త. ఒకవేళ కల నేను కనడం లేదు అనేవారు ఎవరైనా ఉన్నా నేను గాఢంగా నిద్రపోయాను అనే అనుభవం వారికి ఉంటుంది. ఈ కలను ఆ అనుభవం దగ్గర సమన్వయం చేసుకుంటే సరిపోతుంది. అలా మనం విద్యాప్రకాశానందగిరి స్వామి చెప్పినట్లు కలను ఉదాహరణగా తీసుకొని ఆలోచిద్దాం. ఎవరి కలకు వారే కర్త, ఎవరి కల వారిదే. అయితే నీ కలను తయారు చేసింది ఎవరు? మరొకరు తయారు చేసే సృష్టించే అవకాశం లేదు కదా. కాబట్టి నీ కలను నువ్వే సృష్టించావు, ఆ కల దేనితో తయారయ్యింది ? కుండకు ఉపాధాన కారణం మట్టి అయితే ఈ కలకు ఉపాదాన కారణం ఎవరు అని ప్రశ్నిస్తే ఆలోచిస్తే నీ కలకు కారణం నీవేనని నిర్ధారణ అవుతుంది. కల కార్యం, నువ్వు కారణం. నిద్రలో కలలో నువ్వు చూసేవన్నీ కూడా నీకు కనిపించే అనిపించేవన్నీ కూడా నీకు తెలిసినవే నీలో ఉన్నవే. నీలో అవ్యక్తంగా ఉన్నవే కలలో వ్యక్తం అవుతూ ఉన్నాయి. స్వప్నం విషయంలో నువ్వే సర్వవ్యాపివి కలలో నువ్వే అంతా అయి ఉండినావు కదా. చెట్లు నదులు సముద్రం మృగాలు మొదలైన అనేకమైన వాటిని నీ కలలో నువ్వే సృష్టించావు కదా, ఇక్కడ కాస్త ఆగి ఆచితూచి ఆలోచించి అడుగు వేయాలి. ఈ కలలన్నీ మనం సృష్టించుకున్నవేనా ఇదే వాస్తవమైతే మరి మన కలను మనమే తయారు చేసుకోవాలి. అవి అన్నీ మనకు అనుకూలమైనటువంటి విధంగానే ఉండాలి కదా. మరి మన కలలు మనకు అనుకూలంగా ఉండటం లేదే, ఇంకా ఇంకా లోలోతుల్లోకి వెళ్లి ఆలోచిస్తే కలకు కర్తవు నువ్వే అయితే కారణం ఎవరు?. కాబట్టి కలను నువ్వు సృష్టించవు కల నీ నుండే వ్యక్తం అవుతూ ఉందని తేలిపోతుంది. అవ్యక్తంగా ఉన్న నీ కల నీ నుండే వ్యక్తం అవుతున్నట్లు ఈ ప్రపంచం పరమేశ్వరుని నుండే వ్యక్తం అవుతూ ఉంది. నీలో వ్యక్తమైన కలలో

నువ్వే ఎలా వ్యాపకమై ఉన్నావో అలాగే పరమేశ్వరుని నుండి వ్యక్తమైనటువంటి సృష్టిలో పరమేశ్వరుని అవ్యక్త చైతన్యమే వ్యాపించి ఉంది. కల నీలో ఉంది కనుక కలలో ఉన్నవన్నీ కూడా నీలోనే ఉన్నాయి, ప్రపంచం కూడా పరమేశ్వరుని కన్నా భిన్నంగా లేనందున అంతా పరమేశ్వరుని లోనే ఉంది. కాబట్టి ప్రపంచంలో ఉన్నవన్నీ పరమేశ్వరుని లోనే ఉన్నాయి.

ఇప్పుడు సమన్వయం చేసి చూద్దాం. ఇప్పటివరకు మనం చర్చించిన ఉదాహరణల సారం అవ్యక్త మూర్తి అయిన పరమేశ్వరుని చేత సమస్త జగత్తు వ్యాప్తమై ఉంది, ఆ చైతన్యం వల్లనే జగత్తు మనుగడను కలిగి ఉంది. అందుకే భూతాలన్నీ అతని యందే ఉన్నాయి. ఇక్కడ నుంచి మన ఆలోచనా దృక్పథం మరింత మరింత మెరుగుపడాలి లేకపోతే ఈ శ్లోకంలో చెప్పినటువంటి అవ్యక్త మూర్తి మనకు అర్థం కాదు, అనుభవం కాదు. సాధనా శ్రద్ధ అంతా కూడా ఇంకా ఇంకా మేలైన విధంగా కొనసాగాలి. ఇప్పుడు మనం 8 అధ్యాయాల అనుభవసారంతో మరో సరికొత్త మరో అవ్యక్త అక్షర బ్రహ్మపథంలోకి ప్రత్యక్షంగా ప్రవేశించబోతున్నాం. ఒకవేళ ఈ అంశాలు అవగాహనకు అందకపోతే ప్రత్యక్షంగా సద్గురువుల దగ్గర సందేహాల్ని నివృత్తి చేసుకోవాల్సిందిగా మనవి. సర్వభూతాలకు సమస్త జగత్తుకు ఆధారం అధిష్టానబ్రహ్మం అయితే దీనికి ఆధేయం ఏంటి అని ఆలోచిస్తే జగత్తు అనే సమాధానం అనిపిస్తుంది. దీన్ని నిర్ధారణ చేస్తే జగత్తుకు అధిష్టాన బ్రహ్మకు ఆధార ఆధేయ సంబంధం నిర్ణయం అవుతుంది. మరైతే ఇది ఎలా కుదురుతుంది? ఆధార ఆధేయమంటే ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉండటం. మరైతే జగద్గురువు పదేపదే సమస్త జగత్తు నాపై ఆధారపడి ఉందే గాని నేను సమస్త జగత్తుపై ఆధారపడి లేను అంటున్నాడు. మరి దీన్నెలా అర్థం చేసుకోవాలి జగత్తుకు ఆధారం పరమేశ్వరుడైతే అతను కూడా జగత్తుపై ఆధారపడి ఉండాలి కదా, అప్పుడే ఆధార ఆధేయ సంబంధం ఏర్పడుతుంది, కుదురుతుంది లేకపోతే వీలు కాదు. ఈ శ్లోకం మనకు అర్థం కాకపోతే మనకూ ఈ శ్లోకానికి కూడా సంబంధం కుదరదు పొసగదు. ఈ ఆధార ఆధేయం అర్థం కావడానికి ఒక ఉదాహరణ. ఓ బల్ల మీద ఓ గ్రంథం ఉంది ఆ గ్రంథం అలా ఉండటానికి ఆధారంగా ఆ బల్ల ఉంది, ఆధారం బల్ల ఆధేయం గ్రంథం. బల్లకు

ఆధారం ఆ బల్ల ఉన్న వేదిక, ఆ వేదికకు ఆధారం భూమి. ఇది ఆధార ఆధేయమంటే.

మన చర్చనీయాంశమైనటువంటి జగత్తు బ్రహ్మలకు ఈ విధమైన ఆధార ఆధేయ సంబంధం ఉందా? ఒకవేళ ఉంటే అది సజాతీయమైనవిగా ఒకే విధమైనవిగా ఉండాలి. పాలు పాలలో కలుస్తాయి నీరు నీటిలో కలుస్తుంది వాటిలో రాళ్లు కలిసిపోవు కదా. రెండూ ఒకే చోట ఉన్నా రాయి రాయిగా నీరు నీరుగా ఉంటుంది. రాయి నీటిలో కలవదు కరగదు. కాబట్టి వాటి మధ్య సంబంధం ఎలా కుదురుతుంది అధిష్ఠాన చైతన్య బ్రహ్మం మరో అవ్యక్తమూర్తి జడమైన జడరూపమైన జగత్తులో వ్యక్త ప్రపంచంతో ఎలా కలిసిపోతుంది. ఈ రెండింటికి సంబంధం ఎలా కుదురుతుంది మనం మనలోకి వెళ్లి ఆలోచిద్దాం. మనలోనే మనం సమాధానం పొందుదాం. అందుకే సంక్లిష్టత సంశ్లేషత అని మనం శ్లోకం ఆరంభంలోనే చెప్పుకున్నాం. ఆ సంబంధమే కుదరనప్పుడు ఆధార ఆధేయ సంబంధం ఎలా పొసగుతుంది కుదురుతుంది. వీలు కాదు కదా మరి అయితే ఏంటి. అందుకే ప్రత్యక్షానుభవం కావాలి. వస్త్రం ఉంది, వస్త్రానికి సత్తానిచ్చేది నూలు మాత్రమే. నూలుతో వస్త్రాన్ని నేస్తారు, వస్త్రమంతా నూలు వ్యాపించి ఉంది. వస్త్రం అంటే ఏదో కాదు నూలే కదా. వస్త్రానికి నూలు ఆధారమైతే వస్త్రం ఆధేయమవుతుంది. వస్త్రం కాలిపోతే నూలు కూడా కాలిపోతుంది, మిగలదు. ఒకటి నశిస్తే రెండవది కూడా నశించిపోతుంది, నూలు నశిస్తే వస్త్రం, వస్త్రం నశిస్తే నూలు కూడా రెండూ నశించిపోతాయి. మరి జడమయ వ్యక్తమయ జగత్తుకు అధిష్ఠాన పరబ్రహ్మ చైతన్యానికి ఈ సంబంధం కుదురుతుందా? వీలు కానే కాదు. జగత్తు దాని కాలపరిధి దాటాక ప్రళయంలో లయమైపోతుంది. మరి అప్పుడు కూడా అధిష్ఠాన చైతన్య బ్రహ్మం ఉంటుంది కదా. జగత్తు పరిణామశీలమైనది కానీ మరో అవ్యక్త మూర్తి బ్రహ్మం అలా కాదు. ఇలా అనేక అంశాలను గురించి ఆలోచించి స్వీయ పరిశీలనతో స్వయం అధ్యయనం ద్వారా 8 అధ్యాయాల అనుభవంతోనే ఈ మరో అవ్యక్తమూర్తిని ప్రత్యక్షానుభవం గావించుకోవాలి. 9 -2 లోని ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తుం అవ్యయమ్ అనే మాటలు మనకు అప్పుడే అవగతం అవుతాయి. మసక చీకటిలో తాడును పాముగా భ్రమించడం వల్ల రజ్జు సర్ప భ్రాంతి ఏర్పడుతుంది. వాస్తవానికి అక్కడ

ఉన్నది తాడే గాని పాము కాదు, పాముగా కనిపించేటట్లు చేసేది భ్రమే కానీ మరొకటి కాదు కదా. ఇంతకూ మనకు పాముగా భ్రమింపజేసింది ఎక్కడ తాడులోనే కదా. మరి భ్రమ ఎక్కడ ఉంది మనలోనే కదా. ఆ తాడులో పాము ఉందా అంటే లేనేలేదు. కలలోనూ అంతే కలలో అంతటా నీవే వ్యాపించి ఉన్నావు కల నీలోనే ఉంది కానీ నువ్వు కలలో లేవు. నువ్వు కలలో లేకపోతే కలతో నీకు సంబంధం ఎలా ఉంటుంది. అది మిథ్యా సంబంధమే బ్రాంతి సంబంధమే. మట్టికుండకు మట్టి ఆధారం మట్టి లేకుండా కుండ ఉండలేదు. కుండ మట్టిపై ఆధారపడి ఉంది కానీ మట్టి కుండ పై ఆధారపడి లేదు కదా. కాబట్టి కుండ మిథ్య, మట్టి సత్యం. కుండలో మట్టి వ్యాపించి ఉంది అని మనం చెప్పుకోవచ్చు గాని మట్టికన్నా వేరుగా కుండ ఉంటే కదా మట్టి కుండలో వ్యాపించేది. కుండ స్థాయి నుంచి చూస్తే మట్టి ఆధారంగానూ కారణంగానూ తెలుస్తూ ఉంది. కానీ మట్టి స్థాయి నుంచి చూస్తే కుండ ఎక్కడుంది ఉన్నదంతా మట్టే కదా. పారమార్థికతతో పరమాత్మ అసంగుడై, అద్వయుడై, అవ్యక్త మూర్తియై శోభిస్తూ ఉన్నందున తాడులో పాము లేనట్లు కలలో బ్రహ్మం లేనట్లు, జగత్తులోనూ భూతాలలోనూ అవ్యక్త మూర్తి లేడు. ఒకవేళ బ్రహ్మం భూతాలలో ఉంటే బ్రహ్మం ఆధేయమై భూతాలు ఆధారమవుతున్నాయి. అందుకే నేను సమస్తంలో వ్యాపితమై ఉన్నాను కానీ నేను వాటిలో లేను అని కచ్చితంగా నొక్కి వక్కాణించాడు. ఇది ఈశ్వర తత్త్వం వైభవం.

9అ, 5శ్లో.

న చ మత్ స్థాని భూతాని పశ్య మే యోగమైశ్వరమ్ |
భూతభృన్న చ భూతస్థో మమాత్మా భూతభావనః | 5 |.

ఈప్రాణులన్నియును నాలో స్థిరముగాలేవు. ఈశ్వరీయమైన నా యోగశక్తిని చూడుము. ఈ భూతములనన్నింటిని సృష్టించునదియు, పోషించు నదియు నేనే యైనను యథార్థముగా నా ఆత్మ వాటియందు స్థితమై యుండదు.

ముందు శ్లోకంలో నాయందు సమస్త ప్రాణులు గలవు అని చెప్పి ఈ శ్లోకంలో నాయందు ఏ ప్రాణులు లేవు అంటున్నారు. ఇదే రాజగుహ్యం రహస్యాలలో కెల్లా అతి రహస్యం. పరమాత్మ దృష్టిలో ద్వైతం ఉండదు, అయితే ఇక ఈ ప్రపంచంగాని ప్రాణి కోటి గాని అక్కడ లేవు. అయితే ఆ అద్వైత దృష్టిలో నా యందే భూతములు కలవు అనే మాట ఎలా పొసగుతుంది అందుకే నాయందు ఏ భూతములు లేవు అన్నారు. ఇది ఎలా అంటే మనం దృక్ దృశ్య వివేకం గురించి 4-24 లోను ఇంకా అనేక సందర్భాల్లోనూ చూసాం. దృక్కు ద్రష్ట చూసేవాడు ఇది సబ్జెక్ట్, దృశ్యం చూడబడేది ఇది ఆబ్జెక్ట్. దృశ్యం నాయందు లేనే లేదు నేను దృశ్య మందు లేను అని సర్వోన్నత అద్వైత భావాన్ని ఇక్కడ స్పష్టం చేశాడు. ముందు శ్లోకాన్ని సమగ్రంగా అవగాహన చేసుకున్న విజ్ఞాన సహిత జ్ఞానంతో ఈ అంశాన్ని దర్శించాలి. ఇది ఎలా అంటే నిద్రపోయి కలగని మేలుకున్న తరువాత మనిషి కల నాయందు లేదు నేను కలలో లేను అని చెప్పడం మనకు తెలుసు. అలాగే తాడులో లేని పామును చూసి ఒక్కోసారి భ్రమించిన లేదా పాము ఉండి ఇది పాము కాదు తాడు అని భ్రమించి పొరపడినా కొంతసేపటికి మళ్లీ కాదు కాదు ఇది తాడు అని కాదు కాదు ఇది పాము అని ఉన్నది ఉన్నట్లుగా ఆవరణ విక్షేప దోషాలకు తావు లేకుండా సత్యాన్ని గుర్తించడం తెలియడం. ఇక్కడ భగవానుడు దృశ్యరహితమైన దృశ్యం వేరుగా లేని పరిపూర్ణ అద్వైత దృష్టితో ఈ అంశాన్ని ప్రబోధిస్తున్నారు. అలాంటి పరిపూర్ణంలో ఒక్క బ్రహ్మము తప్ప అన్యమైన ఏ వస్తువు ఏ భూతం ఉండదు. ద్వైత భావంతో తన స్వరూపం ప్రాణులను భరిస్తూ రక్షిస్తూ పోషిస్తూ ఉన్నా కూడా పరమాత్మ దృష్టిలో ప్రాణులతో కానీ జగత్తుతో గాని ఏమాత్రం సంబంధం లేదని పరమాత్మ మనకు ఉద్బోధిస్తున్నారు. జగత్తుతో పరమాత్మకున్న ఓ మహత్తరమైన అసంగత్వాన్ని నిర్లేపత్వాన్ని ఇక్కడ వ్యక్తం చేసి మనలో విజ్ఞాన సహిత జ్ఞానాన్ని నింపుతున్నాడని మనకు తెలియాలి. అందుకే ప్రాణికోట్లు ఈ జగత్తు నాలో లేవు అని తన యోగ మహిమను చూడమని మనకు ఆదేశిస్తున్నాడు, ప్రత్యక్ష ప్రమాణంగా సాక్షాత్కరింప చేస్తున్నాడు. ఈ ఈశ్వర సంబంధ యోగ మహిమ పారమార్థికత మనకు అవగాహన అయితే ఎంతటి అద్భుతం, దివ్యత్వపు అనుభూతి అంటే ఇదే. పరమార్థ దృష్టిలో జగత్తు కూడా బ్రహ్మ రూపంగానే శేషించి ఉంటుంది కదా జగత్తు అనే పదార్థం ఒకటి వేరుగా ఉండదు. ఆరోపిత వస్తువు కూడా సత్యదృష్టి

యందు అధిష్ఠాన రూపంగానే పరిణమిస్తుంది కదా. అందుకే పరమాత్మ ప్రాణులను భరిస్తూ రక్షిస్తూ ఉన్నాడు, అవేవీ వాస్తవానికి అతని యందు లేవు అని లేకనే ఉంటున్నాడు. ఇదే ఈశ్వర మహిమ ఇదే పరిపూర్ణ స్థితి, ఏకం సత్ అంతా బ్రహ్మ స్వరూపం. నీటిలో తరంగాలు ఉన్నాయి కదా గీతా స్వరూపులైన దివ్యాత్మ స్వరూపులే ఈ అంశాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలి. అలాగే అధిష్ఠాన బ్రహ్మంలో ఈ ప్రపంచం ఉన్నది కాదు, అలా అని లేనిది కాదు. సాధారణ స్థాయి మనుషులు అధిష్ఠాన బ్రహ్మం మీద జగత్తు ఆధారపడినట్లు జగత్తు కూడా ఆ అధిష్ఠాన బ్రహ్మానికి ఆధారం అనుకుని ఆధార ఆధేయ కార్యకారణ సంబంధాన్ని మనలో నుంచి తొలగించడానికి జగద్గురువు నాలుగవ శ్లోకం నుంచి ప్రారంభించి తన స్వరూపాన్ని మన ముందు ఉంచాడు. కుండలో మట్టి ఉంది కానీ మట్టిలో కుండ లేదు కదా కాబట్టి జడమైన జగత్తుకు చైతన్య స్వరూపమైన బ్రహ్మానికి ఏ విధమైన సంబంధం పొసగదు కుదరదు. ఒకవేళ ఉందని భావించినా ఊహించినా అది కార్యకారణ సంబంధమో ఆధార ఆధేయ సంబంధమో కాదు. అయితే ఎట్టి సంబంధం అంటే అదే పరమార్థిక అద్భుత అలౌకిక అవ్యక్త సూత్రం. ఈ సూత్రమే అద్భుత సంబంధాన్ని మనకు సాక్షాత్కరింపజేస్తుంది. ఈ సంబంధం ప్రత్యక్ష అనుభవమే కానీ మనం వేరుగా ఉండి పరమాత్మను వేరుగా మన భౌతిక ఇంద్రియాలతో చూసే ద్వైత స్థితి కాదు. అందుకే 'పశ్య మే యోగమైశ్వరమ్' నా ఈ అలౌకిక ఈశ్వర సంబంధాన్ని చూడు దర్శించు అని జగద్గురువు మనకు ప్రత్యక్షానుభవం గావిస్తున్నాడు. ఇక్కడ యోగం అంటే సంబంధం ఏ సంబంధం అంటే ముందు శ్లోకంలో చెప్పిన ఆధార ఆధేయమో కార్యకారణమో కాదు. దైవసంబంధం, ఈశ్వర సంబంధం, పరమేశ్వర యోగం, దైవ ఐక్యం. తాను తానుగా ఉంటూ తనలో ఏ మార్పులు లేకుండా అచలంగా ఉంటూ సమస్తాన్ని కదిలిస్తూ జగత్తుగా భాసిస్తున్నాడు. సర్వకారణమై సర్వాధారమై ఉంటూనే కారణ కార్యాలకు ఆధార అధేయాలకు అతీతంగా అధిష్ఠానంగా ఉంటున్న ఈశ్వర వైభవాన్ని మనం ఏమని చెప్తాం, ఎలా రాస్తాం, ఎంతని వర్ణిస్తాం. అందుకే 'పశ్య' నన్ను నా స్వరూపాన్ని చూడు. కుండ యొక్క ఉత్పత్తికి కారణమైన మట్టి కుండకు సత్తాత్మకంగా ఉంటూనే కుండను ధరిస్తూ భరిస్తూ ఉంది. అలా అని మట్టిలో ఏమైనా మార్పు ఉందా? లేదు కదా కాబట్టి మాయమయ కార్యమైన ఈ భూత ప్రపంచంలో అసంగుడైన చైతన్య

స్వరూపమైన పరమేశ్వరునికి ఆధార ఆధేయ సంబంధం ఉండేందుకు అవకాశం లేదని మనకు తేట తెల్లం కావాలి. కాబట్టి భూత భావనుడిగా భూత భృత్ అంటే భూతాలను రక్షించేదిగా భరిస్తూ ఉండేదిగా తెలుస్తూ ఉన్నా వాస్తవానికి 'మమాత్మా' ఈశ్వర చైతన్యం భూతాల యందు లేదు. ఈ నాలుగు, ఐదు శ్లోకాలు అర్థమైతే అజ్ఞాన అంధకార నిద్ర నుంచి మనకు మెలకువ వచ్చినట్లే, అప్పుడు ద్వైత ప్రపంచం అదృశ్యమై అద్వైతం సిద్ధిస్తుంది. ఇవి అర్థం కావడానికి జగద్గురు బోధిస్తున్న రాజవిద్యను నేర్చుకుంటూ రాజ గుహ్యాన్ని కూడా తెలుసుకొని రాజవిద్య రాజగుహ్యంతో యోగమవుదాం.

9అ, 6శ్లో.

యథాకాశస్థితో నిత్యం వాయుః సర్వత్రగో మహాన్ |

తథా సర్వాణి భూతాని మత్ స్థానీత్యుపధారయ ||

ఆకాశమునుండి ఉత్పన్నమై, సర్వత్ర సంచరించుచున్న విస్తృతమైన వాయువు సర్వదా ఆకాశమునందే స్థితమై యుండును. అట్లే నా సంకల్పము ద్వారా ఉత్పన్నమైన భూతములు(ప్రాణులు) అన్నియును నాయందే స్థితమై యుండును.

సమస్త ప్రాణికోటి పరమాత్మ యందు ఏ విధంగా స్థితమై వుందో ఆ స్థితిని ఈ శ్లోకంలో ఉపమగా చెబుతున్నారు. అంతటా సంచరించేది విశాలమైనది అయిన వాయువు ఎంత గొప్పదైనా అది సదా ఆకాశమందు అణగే ఉంది ఉంటుంది. అదే విధంగా విశాలమైనది అనేక ప్రాణికోటితో కూడినది అయిన ఈ జగత్తు పరమాత్మ యందే అణగి ఉంది ఉంటుంది. ఆ పరమాత్మ యందే అణగి ఉండే ఈ జగత్తు అణువణువునా వ్యాపితమై ఉన్నది పరమాత్మే కదా. ఈ సత్యం తెలుసుకుంటే ఇక వారు దైవంతోనే సదా అనుసంధానమై ఉంటారు గాని దైవాన్ని వీడిన పరిస్థితి మనిషికి కలగదు కదా. అణువణువునా వున్న పరమాత్మ సదా మన ప్రతి కదలికను ప్రతి చేష్టను గమనిస్తూ ఉంటాడు. ఈ దైవదృష్టి ఉంటే వారు ఎలా సన్మార్గం నుంచి తప్పుకుంటారు, సరికాని ఆసురీ

మార్గం వీరిని ఎలా చేరుతుంది. కాబట్టి జీవజాలం నుంచి ఈశ్వరుడు ఎంతో ఉన్నత మహోన్నత స్థానాన్ని అధిష్టించి ఉన్నాడు అందుకే అల్పమైన బలం అందం ధనం అధికారం మొదలైన వాటితో అహంభావానికి లోనుకాకుండా సదా దైవదృష్టిని అలవరుచుకొని సర్వేశ్వరుని సన్నిధిని పొందాలని ఈ ఉపమ శ్లోకం మనకు నిర్ధారిస్తుంది. వాయువు గాలి సదా ఆకాశంలోనే ఉంటుంది, ఆకాశానికి వాయువుకు ఆధార ఆధేయ సంబంధం ఉంది. ఆధారం అయిన ఆకాశం లేకుండా వాయువు ఉండలేదు చలించలేదు. మహాన్ అన్నారు వాయువు చాలా గొప్పది మహత్తరమైనది అని అర్థం, అయితే వాయువు కన్నా గొప్పది ఆకాశం. కనుకనే వాయువు యొక్క ఉత్పత్తి స్థితి లయలు ఆకాశంలోనే జరుగుతున్నాయి. గొప్పదైన వాయువును సర్వత్రగా అంటున్నారు అంతటా పయనించేది సంచరించేది, అన్నివైపులా ప్రసరిస్తుంది. ఇది ఎంత దూరం పయనించినా ఆకాశాన్ని విడిచి మాత్రం వెళ్లలేదు కదా ఆకాశంలోనే ఉండాలి ఆకాశంలోనే తిరగాలి. ఇలా వాయువు ఆకాశంలోనే ఉండినా తిరిగినా సంచరించినా వాయుగుణ దోషాలు ఆకాశానికి అంటవు ఆకాశంలో ఉండవు. ఎంత గొప్పదైనా దానికి ఒక పరిధి ఉంది, అనంతమైన ఆకాశం పూర్ణ రూపంతో భాసిస్తూ ఉంది. తనలో ఎన్ని ఉన్నా ఆకాశం దేన్నీ అంటకుండా నిర్లేపత్వాన్ని ప్రదర్శిస్తూ ఉంది కదా, వాయువు అంటే గంధాన్ని వహించేవాడు. వాయువు గంధాన్ని మోసుకొని ఆకాశంలో సంచరిస్తున్నా ఆకాశం మాత్రం నిర్లేపంగానే అంటకనే ఉంటుంది. అదేవిధంగా జగత్తు పరమేశ్వరుని యందే ఉన్నా జగత్తులోని గుణదోషాలు పరమేశ్వరుని అంటవు. వాయువు ఎలాగైతే ఆవిర్భావ తిరోభావాలను పొందుతూ ఆకాశంలో సంచరిస్తూ ఉంటుందో సృష్టితమవుతూ లయిస్తూ ఉండే ఈ జగత్తు కూడా పరమాత్మ యందే సృష్టి స్థితి లయాదులను పొందుతూ ఉంటుంది. గాలి వస్తుంది ఉంటుంది పోతుంది. ఈ మూడు ప్రక్రియలు ఆకాశంలో జరుగుతున్నాయి అదే విధంగా భూతాలు ఆవిర్భవించడం, ఉంటూ వృద్ధి చెందడం తిరిగి లయించి పోవడం అనేది సృష్టి బ్రహ్మమందే జరుగుతున్నాయి. సృష్టి స్థితి లయలకు తానే కారణమని జగద్గురువు ప్రబోధిస్తున్న రాజ విద్యా రాజగుహ్యమైన తరువాతి శ్లోకాన్ని అభ్యసిద్దాం. ఈ అంశాలను కూడా సాధన తోటి ప్రత్యక్ష ప్రమాణంగా మనం అనుభూతి చెందితేనే అవగతం అవుతుంది. ఓ వరుస క్రమంలో భగవద్గీతలో

పరమాత్మ బోధించినటువంటి వరుసక్రమాన్ని పాటిస్తూ ప్రతి అధ్యాయంలోని ప్రతి అక్షరంలో వెనుక దాగి ఉన్న మహత్తును గమనిస్తూ ముందుకు నడిచి నప్పుడే మనకు ఈ అంశాలు ఇక్కడ అవగాహన అయ్యే అవకాశం ఉంది. కారణం మనం ఇప్పుడు భగవద్గీత మధ్యలో ఉన్నాం, ఈ మధ్యలో ఉన్నప్పుడు అనేకరకాల సందేహాలు రావడం సహజం. ఈ సమస్త సందేహాలు నివృత్తి కావాలి అంటే కచ్చితంగా భగవద్గీత బోధన క్రమాన్ని అనుసరించాలి ఆచరించాలి.

9అ, 7శ్లో.

సర్వభూతాని కౌంతేయ ప్రకృతిం యాంతి మామికామ్ |

కల్పక్షయే పునస్తాని కల్పాదౌ విసృజామ్యహమ్ |7|

ఓ కౌంతేయా! కల్పాంతమునందు భూతము లన్నియును నా ప్రకృతినే చేరును. అనగా ప్రకృతిలో లీనమగును. కల్పాదియందు నేను మఱల వాటిని సృజించుచుందును.

మాయామయ ప్రకృతిని స్వాధీన పరచుకున్న వాడే మహేశ్వరుడు, దీన్నిబట్టి ప్రకృతిని జయించడానికి ఈ మాయను స్వాధీన పరచుకోవడానికి సర్వేశ్వరుని సహాయం అనుగ్రహం అత్యంత అవసరమనేది సుస్పష్టం. పారమార్థికంగా పురోభివృద్ధి చెందాలంటే మనిషి జన్మకు సార్ధకత నివ్వాలంటే జీవన్ముక్తుల అనుగ్రహం ఆశ్రయం తప్పనిసరి అందుకే మనం జగద్గురువును ఆశ్రయించాం. ప్రకృతి మాయకు

లోబడినవారు ఈ శ్లోకంలో తెలిపిన విధంగా సృష్టి కాలంలో పుడుతూ ప్రళయ కాలంలో లయిస్తూ ద్వంద్వపు ద్వయంలో రాకపోకలను కలిగిన వారుగా ఉంటారు. మాయాధీసుడైన సర్వేశ్వరుని ఆశ్రయిస్తేనే మనము మాయను అధిగమించగలం. జగత్తు ఉంది అంటే సత్తా వంతంగా ఉంది అని అర్ధం. జగత్తులోని సత్తా స్ఫురణలు జగత్తుకు సంబంధించింది కాదు ఈశ్వరుని సత్తా ఆధారంతోనే భూతాలు ఉంటున్నాయి. ఇది భూతాల లేదా ప్రాణుల స్థితి

కాలం. పరమేశ్వరుని యందున్న భూతాలు స్థితి కాలంలో కల్పాంతంలో లయించిపోతున్నాయి. ఎక్కడ లయమవుతున్నాయి అనేది ప్రశ్న, ఎక్కడ నుండి సృష్టి జరిగిందో అక్కడే లయమైపోతున్నాయి. నాలో లయిస్తుంది అనడం లేదు ఇక్కడ చాలా జాగురూకతతో గమనించాలి, నాలో కాదు ఈ సమస్త భూతాలు కల్పాంతమందు నా ప్రకృతిలో కలిసిపోతాయి. మట్టి నుండి కుండ తయారైనప్పుడు మట్టి వల్లనే కుండకు సత్తారూపం వచ్చింది పగిలి పోతే తిరిగి మట్టిలో కలిసిపోతుంది అంతేగాని మరోదానిలో కలిసిపోవడం లేదు కదా. కానీ ఇక్కడ భూతాలు మాత్రం పరమేశ్వరుని మాయమయ ప్రకృతియందు పుట్టి స్థితిని పొంది తిరిగి అందులోనే లయమవుతోంది. జగత్తు బ్రహ్మము వల్లనే సత్తావంతమైనా కూడా సృష్టి స్థితి లయలలో అసంగుడైన కల్పిత మాయమయ ప్రపంచంతో సంశ్లేషం లేదని మనం 9-4 లోనే చూసాం. మిథ్యామయ ప్రపంచానికి కారణం హేతువు మిథ్యా ప్రకృతి కదా అందుకే మిథ్యా ప్రపంచం మిథ్యలోనే లయం అయిపోతుంది. కలిసి పోతుంది, అదే ప్రకృతి లేదా మాయ. మాయ అనేది త్రిగుణాత్మక శక్తి కదా దానికి స్వతంత్ర మనుగడ లేదు. అనంతమైన బ్రహ్మం యొక్క నీడ లేదా మాయే ఈశ్వరుడు ఇతనే సృష్టికర్త బ్రహ్మ, ఇతనే సృష్టి కారణం. అంతేగాని సచ్చిదానంద పరబ్రహ్మం సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మం, సనాతనం అయిన అక్షర బ్రహ్మ పరమ పదం, సృష్టి కారణమైన వస్తువు కాదు. పరమేశ్వరుని మాయ సృష్టికి ఉపాధి లేదా కారణం అని గ్రహించాలి.

సృష్టికి కారణమైన ఇతనే స్థితి, లయలు కూడా. ప్రస్తుత శ్లోకంలోని ప్రకృతి ఈ మాయమయ ప్రకృతి బ్రహ్మే అందుకే మాయకు ప్రత్యేక మనుగడ ఉండదు. 7-14 లో మాయ దాటశక్యం కానిదని అలా దాటశక్యం కాని మాయను సైతం దాటే మార్గాన్ని తెలుసుకున్నాం దర్శించాం గ్రహించాం. మాయ అంటే ఏదైతే లేదో అదే మాయ అని అర్థం. జగత్తు సృష్టి, ఈ సృష్టి మాయా కార్యం. సృష్టిలో దేన్ని విచారించి చూసినా అది లేనిదే అవుతోంది. సాంఖ్య యోగంలో ద్వంద్వాలను గురించి మాట్లాడుకున్నప్పుడు అనేక అంశాలను మనం విచారించి అది లేనిదే అని తెలుసుకున్నాం కూడా. అదే మాయ గారడి. సృష్టిలో ఉన్నాయనిపిస్తుంది అవి ఏమిటి ఎలా ఎక్కడ అని విచారిస్తే అవి కనిపించవు అదే మాయ. ఏదీ లేకపోయినా అన్నీ ఉన్నట్లు చూసేదే భ్రమింపజేసేది

మాయే. ఈ మాయనే ఉపాధిగా గ్రహించి కల్పారంభంలో ఈశ్వరుడు సృష్టి చేస్తున్నాడు. దీన్నిబట్టి మాయమయ ప్రకృతి పరమాత్మ స్వాధీనంలో ఉంది, ప్రకృతికి లోబడకుండా పరమాత్మను పట్టుకుంటే మనం పరమాత్మను చేరుతాం, పొందుతాం. లేదు మాయకు లోబడితే మనకు తెలియకనే మిథ్యామయమైన భ్రాంతిచేత మాయనే పట్టుకొని మాయకు లోబడి మిథ్యా మయులు గానే ఉంటూ తిరిగి తిరిగి పుడుతూ లయిస్తూ ఉంటాం. ఇది మిథ్యను పట్టుకున్నంతవరకు మనిషికి మనుగడ ఉండదు ఎందుకంటే మనుగడ లేనిదే మిథ్య కాబట్టి ఆ లేనిదాన్ని ఉన్నట్లు భ్రమించి దాని వెనకాల వెళితే ఎడారులలో ఎండమావులలో నీటి కోసం వెతికినట్లే కదా. మనిషి ఈ భ్రమ నుండి వీడటానికి ఈ అధ్యాయంలో నాలుగు నుండి పది వరకు గల శ్లోకాలని తెలియాలి. వీటిని క్షుణ్ణంగా ఆత్మ పరిశీలనతో అధ్యయనం చేస్తేనే ఈ అంశాలు మనకు అవగతం అవుతాయి. ఏ కాలంలో భూతాలన్నీ త్రిగుణాత్మకమైన నా మాయమయ ప్రకృతిని చేరుకుంటాయి.

9అ, 8శ్లో.

ప్రకృతిం స్వామవష్టభ్య విసృజామి పునః పునః |

భూతగ్రామమిమం కృత్స్నమ్ అవశం ప్రకృతేర్వశాత్ | 8 |

తమతమ స్వభావవశమున పరతంత్రమైయున్న భూతసముదాయమును నాప్రకృతి నాశ్రయించి మాటిమాటికి వాటి కర్మానుసారము సృజించు చున్నాను.

3-5, 3-27, 3-33 లో ఈ అంశాలను సమగ్రంగా సందేహానికి తావు లేకుండా చర్చించాం. వాటిని చూసి ఈ శ్లోకాన్ని సమన్వయం చేసుకుంటే సరిపోతుంది.

మాయమయ ప్రకృతికి స్వాధీనమై ఉండడం వల్ల అస్వతంత్రమైనట్టి ఈ ప్రాణి సముదాయాన్ని నేను స్వకీయ ప్రకృతిని అంటే వారి వారి స్వీయ

కర్మానుసారాన్ని బట్టి మరలా మరలా సృష్టిస్తున్నాను. ఈ శ్లోకంలో జీవేశ్వరుల భేదం చాలా స్పష్టంగా తెలుస్తుంది. ఇది మనకు గ్రహణకు అందితే జీవేశ్వరుల అభేదం అనుభవమవుతుంది. జీవుడు ప్రకృతికి వశుడు, ఈశ్వరుడు ప్రకృతిని స్వాధీన పరచుకున్న వాడు. జీవులు తమ తమ మనః ప్రకృతికి వశులై అస్వతంత్రులై ఉన్నారు. కృత్స్నమ్ అని చెప్పడం వల్ల ఏ కొందరో కాదు ప్రకృతిని జయించిన జీవన్ముక్తులు మినహా సమస్త ప్రాణికోటి ప్రకృతికి ఆధీనమై ఉందని స్పష్టమవుతుంది. తమ తమ కర్మల ఫలితాలు జన్మాంతర వాసనలు ఉన్నంతవరకు ఈ పరిస్థితి ఇలాగే ఉంటుంది. ఈ మిథ్యామయ మాయ నుండి విడిపడాలను కొనేవారు పరమాత్మను ఆశ్రయించి వారి వారి మనసును, ప్రకృతిని జయించాల్సిందే. జనులకు ఎంతటి భౌతిక సంపత్తి ఉన్నా దానితో సంబంధం లేదు, వారు ప్రకృతికి లోబడిన వారే, తమ తమ ఇంద్రియాలకు దాసులే. అందుకే వారు అస్వతంత్రులు వీరు తమ అజ్ఞానవశంతో బలాత్కారంగా జన్మను కర్మను అనుభవిస్తూనే ఉంటారు. ఉదాహరణకు నేటి ఎగ్జిబిషన్స్ లోని రంగులరాట్నం లాంటివి ఎక్కిన మనుషులు అవసులై అస్వతంత్రులై తిరిగే విధంగా మాయాచక్రాన్ని అధిష్టించిన జీవులు కూడా వారి వారి ప్రకృతికి వశులై అస్వతంత్రులై జనన మరణ చక్రంలో గమ్యం తెలియని పయనంలో కొట్టుమిట్టాడుతూ ఉన్నారు. అందుకే విద్యా ప్రకాశానందగిరి స్వామి వారు ఇది వరకే జయించిన బ్రహ్మనిష్ఠులను సద్గురువులను మహాత్ములను వెతకి వెతకి వెతకి సంపాదించుకొని వారి దగ్గర బ్రహ్మవిద్యను అభ్యసించి మాయను దాటే ఉపాయాన్ని పొందినప్పుడే ఈ మాయా సాగరం నుండి గట్టెక్కగలరు అన్నారు. దీన్ని బట్టి మాయాధీశుడైన పరమాత్మను జీవుడు ఆశ్రయించి తీరాల్సిందే. ఆకాశంలో సంచరించే వాయువులాగా స్థితి కాలంలో భూతాలన్నీ పరమేశ్వరుని యందే ఉన్నా ప్రళయ కాలంలో అవి తిరిగి ఈశ్వరునిలో కాకుండా ఈశ్వర మాయలోనే లయిస్తున్నాయని ముందు శ్లోకంలో చూసాం. బీజరూపంలో ఉన్న సూక్ష్మ భూతాలు మళ్లీమళ్లీ సృష్ట్యాదిలో వాటి వాటి కర్మవశాన అదే మాయ నుండే సృష్టితమవుతూనే ఉంటుంది. ఇక్కడ ఇంకో సందేహం కలిగే అవకాశం ఉంది. ఈ పుట్టుక స్థితి లయలు ప్రాణులకేనా మరి భగవంతుడికి కూడానా? మరి అతను కూడా ధర్మసంస్థాపనకు లోక కళ్యాణానికి ప్రహ్లాదుడు ఆది శంకరులు లాంటివాళ్ళు అవతరిస్తూనే ఉంటారు కదా అది ఎలా అనే ప్రశ్న

మొదలుతుంది. అప్పుడు కర్మవశాన అస్వతంత్రంగా జనన మరణాలలో తిరుగుతున్న ప్రాణులు ఇలా ఆయా సందర్భాల్లో అవతరించే భగవంతుని అనేక అవతారాలకు కూడా కారణం మాయమయ ప్రకృతేనా? ఈ సందేహానికి మనం 4-6 లోనే సమాధానాన్ని పొందాం. అర్జునా నాకు పుట్టుక లేదు మార్పు లేదు అయినా నా ప్రకృతిని నేను వశం చేసుకొని నా మాయ చేత పుడుతున్నాను. ఎప్పుడు అంటే ఎప్పుడైతే ధర్మానికి హాని, గ్లాని సంభవిస్తే అప్పుడు. కాబట్టి ఇక్కడ గీతాస్వరూపులకు ఒకవేళ సందేహం అనిపించినా ఈ సమాధానంతో తమ తమ సందేహాల్ని నివృత్తి చేసుకుంటూ ముందుకెళ్లాలి. ఈశ్వరుని వేరుగా ఈశ్వర యోగ మాయను వేరుగా మనం విడగొట్టి చూడగలిగితే జీవేశ్వరుల ఐక్యత మనకు బోధపడుతుంది. జీవులది అవిద్యామాయ, మిథ్యా మాయ, భగవంతునిది ఆత్మమాయ. అసంగ పరబ్రహ్మ కర్మ సంబంధం లేకుండా స్వేచ్ఛగా స్వతంత్రంగా అవతరిస్తే మాయకు లోబడిన జీవుడు కర్మానుభవానికి అస్వతంత్రుడై ప్రారబ్ధానికి లోబడి అజ్ఞానపు మాయలో జనన మరణ చక్రంలో తిరుగాడుతూ ఉంటాడు. ఈ జీవేశ్వరుల ఆవిర్భావంలో ఉన్న ప్రధానమైన తేడాను మనం జాగ్రత్తగా గమనించాలి. శ్రీమధుసూధన సరస్వతి ఓసారి అజ్ఞానపు వశాన తిరుగుతున్న జనుల పక్షాన నిలబడి ఓ ప్రశ్నను లేవనెత్తారు. ఇది మనకు ఎప్పుడూ అనిపించే ప్రశ్న మనం ఎంతో మంది ద్వారా వింటుంటాం కూడా. అదేమంటే పరమేశ్వరుడు సృష్టి ఎందుకు చేసినట్లు అసలు సృష్టి లేకుండా ఉంటే జీవులకు ఈ తాపత్రయాలు ఇన్ని కష్టాలు ఉండేవి కాదు కదా అని. మరి దైవం దృష్టిలో సృష్టిలేనే లేదు ఉన్నది దైవమే, లేని దాన్ని ఉందనుకోవడమే సృష్టి ఉంది అనుకుంటున్నందుకు కారణం. కాబట్టి విజ్ఞులు వివేకులు, దైవాంశ సంభూతులు లేని సృష్టిని లేనిదిగానే భావిస్తారు, ఉన్న దైవాన్ని ఉన్నట్టుగానే దర్శిస్తారు. నేను అనే అహంభావం మిథ్య, దైవం సత్యం అనే ప్రత్యక్ష అనుభవం వారికి ఉంటుంది. ఈ విషయం మనకు స్పష్టం చేయడానికి 4-6 లో బీజం వేసి ఇక్కడ సంపూర్ణంగా ఆ విషయాన్ని జగదుత్పత్తి ఘట్టంలో తేల్చి చెప్పారు. నా ప్రకృతి నామాయ అని చెప్పడం వల్ల కచ్చితంగా ఇది మిథ్యేనని తేలిపోతుంది. ప్రళయ కాలంలో ప్రకృతిలో లయించిన జీవులు తమలో బీజరూపంగా ఉన్న వాసనలకు అనుగుణంగా తిరిగి తిరిగి జన్మిస్తూ ఉంటారు. ఇక్కడ గత జన్మలలో ఆచరించిన పుణ్య పాపాల ప్రభావం ఉంటుంది. వాటిని

అనుసరించి తదనుగుణమైన ప్రదేశాలలో వాతావరణంలో జీవులు కర్మానుభవం కోసం స్వయంగా అస్వతంత్రంగా పుడుతూ ఉంటారు. బీజముంటే తిరిగి అది మళ్లీ అవిద్యాజనిత పుట్టుకకు కారణం అవుతోంది. అందుకే మనం సాంఖ్య యోగంలో ఇంద్రియ ప్రకరణంలో రాగం నిర్బీజం కావాలని విశ్లేషించుకున్నాం. మనిషి పుట్టుకకు కర్త ఎవరు అంటే మనిషే. మనిషి తిరిగి తిరిగి అజ్ఞానంలో కొట్టుమిట్టాడడానికి కారణం ఎవరు అంటే మనిషే, ఎవరికి వారే. జన్మానికైనా బంధానికైనా జన్మలేని స్థితిలో దైవంగా అవతరించాలన్నా ప్రతిదానికి కారణం ఎవరికి వారే గాని మరొకరో మరొక వస్తువో మరో దైవమో కాదని ఇక్కడ తెలుసుకోవాలి. ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలని గ్రహించాలి. ప్రాణికోటి సృష్టి మాయమయ ప్రకృతి నుండి జనించినా అందులోనే లయించినా అందుకు శక్తిని సత్తాను ఇస్తున్నది పరమేశ్వరుడు కదా. మరి ఎలా వీటితో సంబంధం లేకుండా పోతుంది అనేటటువంటి ప్రశ్నకు సందేహాన్ని వివరించే శ్లోకాన్ని రాజవిద్యా రాజ గుహ్యంలో యోగమై చూద్దాం.

9అ, 9శ్లో.

న చ మాం తాని కర్మాణి నిబధ్నంతి ధనంజయ |

ఉదాసీనవదాసీనమ్ అసక్తం తేషు కర్మసు |9|

అర్జునా! ఆ విధంగా అంటే ముందు శ్లోకంలో చెప్పిన విధంగా సృష్ట్యాది కర్మల యందు తగులుకోనివాడై సాక్షిభూతుడుగా ఉండే నన్ను ఆ కర్మలేవి బంధింప నేరవు. ఆ కర్మలయందు నాకు ఆసక్తి లేదు వాటి విషయంలో నేను ఉదాసీనంగా ఉంటాను.

జీవులు తిరిగి తిరిగి పుడుతున్నందుకు జన్మల చక్రంలో చిగులుకుంటున్నందుకు కారణం ఎవరికి వారే గాని మరొకరో మరే దేవుడో పరమాత్మో కాదు. ఎవరి జన్మకు ఎవరి కర్మకు కారణం వారే ఇందులో పరమాత్మకు ఎలాంటి సంబంధం లేదు అని మరోసారి ఈ అధ్యాయంలో

జగద్గురువు తేల్చి చెప్తున్నాడు. సూర్యుని సన్నిధానంలో మనుషులు తమ తమ కర్మలను ఆచరించినా ఆ కర్మలతో సూర్యునికి ఎలాంటి సంబంధం లేనట్లు భగవత్సాన్నిధ్యంచే జరుగుతున్నా ప్రకృతి చర్యలు సృష్ట్యాది లయలతో వాస్తవానికి భగవంతునికి ఏ సంబంధం లేదు. అలాంటివారు వాటిలో చిగులుకోరు, వాటికి బందీలు కారు. దీన్నిబట్టి పరమాత్మతో ఐక్యమొందిన మనిషికి మహాత్మునికి కర్మ జన్మ బంధాలు ఉండజాలవు. సృష్టిలోని మనిషిలో తలెత్తుతున్న అహం అనే భావనే ప్రాణికోటి యొక్క అసమానతకు కారణం. దీన్నే ఆదిశంకరులు విషమ పరిస్థితి అన్నారు. నేను అనే అహంభావన ఆకాశమంతగా ఏపుగా ఎదిగిపోయి దైవ శక్తి ఆధారంతో తిరుగాడే మనిషి దైవాన్ని సైతం విస్మరించి ప్రవర్తిల్లే తీరును జగద్గురువు ఇక్కడ విషమంగా పేర్కొన్నారు. తన భాష్యంలో సృష్టిలోని ఈ వైషమ్యం ఆయాప్రాణులకు పుణ్య పాపాలే గాని వాటితో దైవానికి ఎలాంటి సంబంధం లేదు అని తేల్చి చెప్పాడు. ఏ మనిషికైనా కర్తృత్వ అభిమానం, ఫలాసక్తి లేనప్పుడు వారిని కర్మలు బంధించవు. అలా లేని జన్మ లేనిదని లేని కర్మలు లేవని అసంగులుగా భావించే ఆచరించే ప్రతి మనిషి దైవమే. అలా కాకపోతే మూఢులు సాలెపురుగు వలె అది తనకు తానే గూటిని ఏర్పరచుకున్నట్లు కర్మల గూడు అనే చక్రంలో చట్టంలో చట్రంలో మూఢులు చిక్కుకుంటూ ఉంటారు. కాబట్టి ఉదాసీనుని వలె ఉపేక్ష భావంతో అసంగత్వంతో దైవంలా మనం కూడా ఈ జగత్తు పట్ల వ్యవహరించాలి.

కర్మ స్వేచ్ఛ మనిషికి ఉంది కానీ కర్మ ఫలాల పట్ల అధికారం మనకు లేదు కదా. అందుకు మనం సాలె పురుగు వలె కర్మలలో చిక్కుకోకూడదు. ఏ కర్మ జరిగినా దాని వెనుక కర్త ఉంటాడు కర్మ చేసే కర్తకు ఆ కర్మకు సంబంధించిన జ్ఞానము ఉంటుంది. ఆ జ్ఞానమే కర్తచేత కర్మ చేయిస్తుంది. కర్మను ఆసక్తితో చేయడమే కర్తృత్వం. కర్మ ఏదైనా దేశకాల ప్రయత్నాల చట్రంలోనే ఉంటుంది. కనుక అది పరిమితమైనది. పరిమితమైన కర్మ పరిమితమైన ఫలాన్నే ఇస్తుంది కదా అది జీవుడు దేవుడుగా ఎదిగేటటువంటి జ్ఞానాన్ని పరిపూర్ణతను ఇవ్వలేదు. అందుకే సామాన్య కర్మలు జీవుల్ని బంధిస్తూ ఉంటాయి. మరి సృష్టి స్థితి లయలకు ఆధారమైనటువంటి పరమాత్మను కర్మ ఎందుకు బంధించదు అంటే తటస్థంగా ఉండే ఈ సృష్టి స్థితి లయలు సుఖ

దుఃఖాది ఫలాలు ప్రకృతి వల్లనే సంభవిస్తున్నాయి గానీ తటస్థంగా ఉండే దైవం వల్ల కాదు. బ్రహ్మ జ్ఞానం పొందిన బ్రహ్మానుష్ఠాన పరుల దృష్టిలో గాని పరమాత్మ దృష్టిలో గాని సృష్టి లేనిదే జగత్తు లేనిదే జన్మ లేనిదే. మాయమయ ప్రకృతికి లోనైన వారికి మాత్రమే అది ఉన్నట్లు తోస్తుంది. కర్మల పట్ల నిరాసక్తంగా ఉన్నప్పుడే ఉదాసీనత్వం సిద్ధిస్తుంది. తానే ఆత్మ అనే జ్ఞానం ఉన్నప్పుడు సచ్చిదానంద స్వరూపమైన ఆత్మ అకర్తే గాని కర్త కాదు కాలేడు. ఆత్మ జ్ఞానం కర్తృత్వ అభిమానాన్ని నిర్మూలిస్తుంది. ఆత్మ పూర్ణం కాబట్టి పూర్ణజ్ఞానం ఉన్నప్పుడు మనకు పరిపూర్ణం సిద్ధిస్తుంది. సృష్టి స్థితి లయాదుల కార్యాల్లో పరమేశ్వరుడు ఎలా బంధానికి గురి కాలేదో అలాగే ఏ వ్యక్తి అయినా కర్తృత్వ అభిమానం లేకుండా ఫలాసక్తి లేకుండా ఉండగలిగితే అతను కూడా బంధానికి గురికాడు. ఆ అసంగత్వమే పరిపూర్ణాన్ని ప్రసాదిస్తుంది. ధర్మరాజు నిర్వహించిన రాజసూయ యాగానికి ధన సేకరణకు వెళ్లి అక్షయ స్వీకరించినా దానిపై దృష్టి లేని నిరాసక్తుడు అర్జునుడు, అమూల్య ధన రాశులను ఉదాసీనంగా వీక్షించిన త్యాగమూర్తి. ధనంజయ అని సంబోధించడంలో ధనాన్ని జయించిన వాడు అని అర్థం కాదు, ధనం పై ఆశను జయించాడని అర్థం. ఆ సందర్భాన్ని ఈ సందర్భంగా పరమాత్మ జగద్గురువు మనకు గుర్తు చేస్తున్నాడు. ఇక ఈ భూతాలన్నీ సృజించటానికి లయించడానికి శక్తిని పరమాత్మ నుండే పొందుతున్నా అతను మాత్రం ఉదాసీనంగా ఉంటున్నాను అనడంలో ఉన్న రాజవిద్యలోని రాజ రహస్యాన్ని తరువాతి శ్లోకంలో చూద్దాం.

9అ, 10శ్లో.

మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్ |

హేతునానేన కౌంతేయ జగద్విపరివర్తతే | 10 |

ఓ అర్జునా! అధిష్ఠాతనైన నా అధ్యక్షతన ప్రకృతి ఈ చరాచర జగత్తును సృష్టించుచున్నది. ఈ కారణము వలననే సంసారచక్రము పరిభ్రమించు చున్నది.

అధ్యక్షుడనై ఉన్న నా ద్వారా ప్రకృతి చరాచర ప్రపంచాన్నంతటిని సృజిస్తూ ఉంది ఆ కారణం చేతనే జగత్తు ప్రవర్తిల్లుతూ ఉంది. జగదుత్పత్తికి సంబంధించిన ఈ ఘట్టాన్ని సూక్ష్మాతి సూక్ష్మ దృష్టితో మనం అవగాహన చేసుకోవాలి. మొదటి రెండు శ్లోకాలు రాజవిద్య రాజగుహ్య ప్రాధాన్యం, వైభవం. మూడవ శ్లోకంలో ఆ అతి రహస్యమైన రాజవిద్యను రాజ రహస్యాన్ని శ్రద్ధతోనే అభ్యసించడానికి వీలవుతుంది అశ్రద్ధాపరులకు వీలు కాదు వారు మృత్యు సంసారంలోనే స్థిరంగా ఉంటూ కొట్టుమిట్టాడుతున్నారని చూసాం. నాలుగు ఐదు శ్లోకాల్లో మరో అవ్యక్తమూర్తి పరమాత్మను ప్రత్యక్ష అనుభవం గావించుకొని అందుకు ఆరవ శ్లోకాన్ని ఉపమగా చూసాం. అక్కడ జగత్తులో పరమాత్మ అధిష్టించి వ్యాపితమై ఉన్న తీరును చూశాం. 7 నుండి 10 వరకు ఉన్న శ్లోకాలు ప్రత్యేకించి మాయమయ ప్రకృతి నుండి జగత్తు ఉత్పత్తి జరగడం అదే మాయమయ ప్రకృతిలోనే జగత్తు లయించడం అనే అంశాన్ని కేంద్రంగా చేసుకొని స్పష్టంగా తేల్చి చెప్పారు. మాయమయ ప్రకృతి ద్వారా సృజిస్తూ లయిస్తూ ఉన్న జగత్తు ఉత్పత్తి లయలను మనం స్పష్టంగా ఇక్కడ అవగాహన చేసుకోవాలి. అలా మాయమయ ప్రకృతి నుండి సృష్టితమవుతూ లయిస్తూ ఉన్న జగత్తు కూడా మాయేనని మిథ్యేనని గ్రహించాల్సిన విశాల దృక్పథాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఇక్కడ ఉంది. అప్పుడే ఈ జగదుత్పత్తి శ్లోకాలు మనకు ప్రత్యక్ష అనుభవం అయినట్లు. బ్రహ్మమే సత్యమని కనిపించే జగత్తు మిథ్య అని దృఢవిశ్వాసం కలిగి ఉండటమే నిత్యా నిత్య వస్తు వివేకమని చెప్పబడుతుంది అన్న ఆదిశంకరుల మాటను మనం ఇక్కడ గమనించాలి. ఈ జగత్తును మిథ్యగా దానికి అతీతమైన మనం ఎనిమిదవ అధ్యాయం ఆరంభంలో చర్చించిన అత్యంత గొప్పదైన సనాతనమైన అక్షరం బ్రహ్మ పరమం అని చెప్పిన అంశాలను సత్యంగాను మనకు ఇక్కడ తెలియాలి. అంటే మిథ్యను మిథ్యగా సత్యాన్ని సత్యంగా అనుభవంలోకి తెచ్చుకోగలగాలి. ఈ ప్రకృతి జడం, పరమాత్మ చైతన్య స్వరూపుడు అందుకే అధ్యక్షేణ అన్నారు. నా అధ్యక్షతన నాకు సంబంధం లేని నామాయ నుంచి జగత్తు వ్యవహారమంతా కూడా నడుస్తూ ఉంది. సనాతన అక్షర బ్రహ్మ పరమాత్మ అధ్యక్షతనే ప్రకృతికి సృష్టి రూప శక్తి ఏర్పడుతూ ఉంది. అయితే

మనిషి దృష్టి మాయమయ స్థూల ప్రపంచానికే పరిమితమైపోతోంది. మిథ్యనే మాయనే సత్యమని నమ్ముతున్నారు, దానివెంటే పరుగులు పెడుతూ ఉన్నారు. ఈ మాయమయ జగత్తు ప్రవర్తిల్లడానికి తగిన శక్తిని అధిష్ఠాన పరమాత్మ నుండే పొందుతుందనే సత్యాన్ని వాస్తవాన్ని మనం గుర్తించడం లేదు. ఆత్మశక్తి ప్రధానమైంది, చైతన్యవంతమైనది. తక్కిన శారీరక మానసిక శక్తులన్నీ ఎంత గొప్పదైనా ఆధ్యాత్మిక ఆత్మికశక్తి ముందు నిలబడలేవు. విజ్ఞులు భౌతిక పరమైన మాయమయ ప్రకృతికి చెందిన అవసరం లేని వాటిని చూసి మురిసిపోకుండా ఆత్మిక పారమార్థిక దైవ శక్తి సముపార్జన దిశగా అడుగులు వేస్తారు. మనం కూడా జడమైన దృశ్య వస్తువుల సేకరణపై దృష్టి నిలపకుండా అధిష్ఠాన చైతన్య పరమాత్మ సాక్షాత్కారమే ధ్యేయంగా మన దైవసాధన కొనసాగాలి. పరమాత్మ సర్వత్రా వ్యాపించిన చైతన్య స్వరూపం. అతని అధ్యక్షతన సృష్టి కొనసాగుతూ ఉంది, ఉంటుంది. మాయమయ ప్రకృతి సృష్టికి పరమాత్మ అధ్యక్షుడు మాత్రమే కేవలం ప్రకాశం మాత్రమే మరి మనం కూడా అదే విధంగా ఈ జగత్తు పట్ల అధ్యక్షత వహించాలి. సృష్టిని పరమాత్మ చేయడు అతను క్రియా శూన్యుడు, పూర్ణ పురుషుడు. ప్రకృతే సృష్టిని లేదా జగత్తును సృష్టిస్తూ ఉన్నది. ఇలా సృష్టి కార్యాన్ని నిర్వహించే ప్రకృతి జడమా చైతన్యమా? అంటే ప్రకృతి జడం ప్రకాశం లేనిది. అయితే పరమాత్మ ప్రకాశంతో ప్రవర్తిల్లేది మరి జ్ఞాన రహితమైన ప్రకాశరహితమైన జడ ప్రకృతి వివిధ ప్రత్యయగమ్యమైన విశ్వాన్ని ఎలా సృష్టిస్తుంది. అందుకే మనం ముందు శ్లోకంలో జగద్గురువు చెప్పిన సూత్రం ప్రకారం సృష్టి జన్మ కర్మ లేనిదని తెలియాలి. ఆ అనుభవాన్ని ప్రత్యక్ష ప్రమాణం గావించుకోవాలి. తనకు తానుగా చలించలేని సృష్టించలేని ప్రకృతి సూదంటురాయి సన్నిధిలో కదలలేని ఇనుప సూది కదిలినట్లు కదులుతూ ఉంది. ఆ కదలికే సృష్టి కార్యాన్ని నిర్వహించి సృష్టికి కారణమవుతూ ఉంది. సూదంటు రాయి అంటే అది అయస్కాంతపు లక్షణాలను కలిగి ఉన్న ఓ రాయి ఇది ఉన్నచోట ఆ ఆకర్షణకు తన ప్రకాశ శక్తితో తన చుట్టూ అల్లంత దూరంలో ఉన్న ఇనుప ముక్కలన్నింటికీ కూడా కదలికను కలిగిస్తుంది. ఈ విధంగా పరమేశ్వరుని అధ్యక్షతన ప్రకృతి స్థావర జంగమాత్మకమైన ఈ జగత్తును సృష్టించి స్థితి స్థాపనం చేసి లయింపజేస్తూ ఉంది. ఈ సృష్టి ప్రకృతి కార్యమే మాయమయ కార్యమే గాని అన్యమైంది కాదు. జడ రూప త్రిగుణాత్మక మాయకు స్వతంత్ర

మనుగడ లేదు, మాయ ఉనికే బ్రహ్మాన్ని ఆశ్రయించి ఉంది. సత్తా స్వరూప బ్రహ్మానికి ఏదీ దూరం కాదు కదా. కనుక మాయ కూడా బ్రహ్మానికి దూరంగా లేదు, అందుకని మాయను కారణంగా కలిగిన సృష్టి కార్యం కూడా మాయకు దూరం కాలేదు. సృష్టికి కారణమైన మాయ ఎప్పుడైతే పరమేశ్వరుని ఆధీనంలో ఉందో కార్యరూపమైన జగత్తు కూడా పరమేశ్వరునికి దూరంగా లేదు. ఈ కారణంగానే నేనే సృష్టి చేశాను అంటున్నాడు జగద్గురువు. అంతేగాని సృష్టికి కారణం పరమాత్మ పరంధామం కాదు. ముందు శ్లోకంలో అతను ఉదాసీనతను ప్రకటించుకోవడంలోని రాజగుహ్యం కూడా ఇదే. అహం అకర్త అంటూ సృష్టికి నేను కర్తను కాదు అని 5-18 లోనే మనం చూసాం. 8-9 లోనే పరమాత్మ లక్షణాలను చాలా విపులంగా చూసాం. ఇలాంటి విలక్షణమైన లక్షణాలున్న పరమాత్మకు ప్రకాశమేగాని ప్రవర్తిల్లడం అనేది ఉండదు. సృష్టిలో జరిగే కార్యాలకు పరమాత్మ విలక్షణుడు అందుకు ఎలాంటి సంబంధం లేనివాడు. మాయ అనేది అవిద్యా రూపం చీకటికి ప్రతీక, ప్రకాశం లేనిది జ్ఞానం లేనిది. చీకటిలో ఉన్న వస్తువు దీప సన్నిధిలో ప్రకాశించినట్లు పరమాత్మ సన్నిధిలో సృష్టి సృష్టికి కారణమైన మాయ ప్రకాశిస్తూ ఉన్నాయి. సూర్యుడు ప్రకాశిస్తూ ఉండటం వల్ల సర్వప్రాణులకు ప్రవృత్తి నివృత్తులు సిద్ధిస్తున్నాయి. అలాగే పరమేశ్వరుడు అధ్యక్షుడుగా ఉండటం వల్ల ఆ ప్రకాశ బలంతో ప్రాణుల సృష్టి లయలు జరుగుతూ ఉన్నాయి.

సూర్యుని ప్రకాశంతో సమస్త కార్యాలు సాగుతూ ఉన్నా తన ప్రకాశంతో జరిగే సమస్త ఉచిత అనుచిత సముచిత కార్యాలలో సూర్యునికి సంబంధం ఉందా? అలాగే పరమేశ్వరుని సన్నిధిలో పరమాత్మ అధ్యక్షతలో సాగిపోయే ప్రకృతి కార్యాలలో దైవానికి పరమాత్మ పరంధామునికి ఎలాంటి సంబంధం లేదు. అందుకే పరమాత్మే సమస్త జగత్తు అధ్యక్షుడు చైతన్యాత్మకుడు. నేను సృష్టించాను నాకు ఈ సృష్టికి సంబంధం లేదు అనడంలో మనకు రెండు కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి మాయకు లోను కాకుండా మాయను తన ఆధీనంలో ఉంచుకున్న కారణంగానూ అధిష్ఠాన బ్రహ్మ మాయకు కారణం గాను నిజ స్వరూపంగానూ మాయ అనే ఉపాధిని కలిగి ఉన్న కారణంగానూ నాచేతనే సృష్టి జరిగిందని బోధించాడు. రెండు మరోవైపు అకర్తగా క్రియాశూన్యంగా దృశిమాత్ర స్వరూపమైన తన అధ్యక్షతన మాయ జగత్తును సృష్టిస్తూ ఉన్న

కారణంగా కేవలం ప్రకాశ స్వరూపమైన తనను తానే ఉదాసీనంగా అభివర్ణిస్తున్నాడు. చిత్ శక్తి చేతనే బుద్ధి చేతనమై ఆలోచించగలుగుతూ ఉంది. బుద్ధిపై ఆధారపడి సమస్త కర్మలు నడుస్తున్నాయి. అయితే ఆ కార్యాలు నడవటానికి ఉపయోగితం అవుతున్న సత్తాస్ఫురణలు జ్ఞాన స్వరూపుడైన పరమాత్మ నుండే అందుతున్నాయి కదా. ఈ సమస్తము ఆ వెలుగులోనే వెలుగుతూ ఉంది అని కఠోపనిషత్తు. పరమేశ్వరుడు ఏకం ప్రకాశ స్వరూపం, ఏకో దేవః. అనంతుడైన తనలో ద్వైతానికి భేదానికి అవకాశం లేనందువల్ల అతను ఏకమే. మరి ఎక్కడున్నాడు ఆ ఏకోరూపుడు అంటే రాజవిద్య తెలిసిన వారికి రాజగుహ్యం తెలిసినవారికి సర్వవ్యాపక శక్తిమంతుడైనటువంటి భగవంతుడు అతను లేదా అది లేదా ఆమె సాక్షాత్కారమే ప్రత్యక్ష ప్రమాణమే. రాజ విద్యా రాజ రహస్యం తెలియని బ్రహ్మవిద్యను అభ్యసించని వారికి రాజవిద్య రాజగుహ్యమే. వారికి అతను నిగూఢంగా ఉన్నవాడే. పరమాత్మ సర్వత్రా వ్యాపించి ఉన్నా అన్నిచోట్ల వ్యక్తం కావడం లేదు, స్వచ్ఛమైన అద్దంలాంటి వస్తువునందే ప్రతిబింబం కనిపించినట్లు శుద్ధమైన బుద్ధి యందు మాత్రమే వ్యక్తమవుతున్నాడు. వ్యష్టిలో ఆత్మచైతన్యం యొక్క అధ్యక్షతనే. దేహేంద్రియ మనోబుద్ధులలోని సమస్త కార్యాలు జరిగిపోతున్నాయి. అలాగే పరమాత్మ అధ్యక్షతనే సమస్త సృష్టి కార్యము జరుగుతూ ఉంది. సర్వ సృష్టి కదలికకు కారణం అధ్యక్షమై ఉండి కూడా కార్యానికి అంటకుండా ఉదాసీనంగా ఉండటం పరమాత్మ వైభవమైతే సర్వకార్యాలకు ఆధారమై ఉండి కూడా దేనికి అంటకుండా అకర్తగా శోభించడం ఆత్మ వైభవం. శ్వాసించడం ప్రాణధర్మం, ఆలోచించడం మనోధర్మం, తినడం తిరగడం చూడడం లాంటివి ఇంద్రియ ధర్మం. అయితే ఇంద్రియ గమనాన్ని ప్రాణ మనో ధర్మాలను తనకు ఆరోపించుకుంటున్నాడు మనిషి. ఇక్కడ పొరపడుతున్నాడు మానవుడు, ఆత్మ దేహం కాదు గాని ఆత్మ సన్నిధానం బలం చేతనం చైతన్యం చేతనే ఈ కార్యాలన్నీ జరుగుతున్నాయి. లేకపోతే దేహం శవం అవుతుంది, ఈ సత్యం తెలియని అజ్ఞానపు మేధావి మనిషి తనకు ఆరోపించుకొని అహంభావంతో ప్రవర్తిల్లుతూ ఉంటాడు. ఇందులో నుంచి మనం గ్రహించాల్సిన అంశాలు పరమాత్మ అధ్యక్షతనే చరాచర జగత్తు వ్యవహారాన్ని కొనసాగిస్తూ ఉంది. ఈ సత్యం మహిమ తెలియని విధ్యాచారులు,

మిథ్యామయులు, ఆసురీ ప్రకృతీతులు, మూఢులు ప్రవర్తించే తీరును తరువాతి రెండు శ్లోకాల్లో చూద్దాం.

9అ, 11శ్లో.

అవజానంతి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్ ।

పరం భావమజానంతో మమ భూతమహేశ్వరమ్ | 11 |

నా పరమభావమును ఎఱుగని మూఢులు సర్వప్రాణులకును మహేశ్వరుడను (ప్రభువును) ఐన నన్ను లోకకల్యాణమునకై అవతారములను ఎత్తిన కారణమున సామాన్య మానవునిగా భావించి, తక్కువగా ఊహింతురు.

పరమాత్మ సమస్త ప్రాణికోటికి నియామకుడు ప్రభువు ఈశ్వరుడు కదా ధర్మోధరణకు లోక సంరక్షణ కోసం అతను మనుష్య దేహం ద్వారానే అవతరిస్తూ ఉంటాడు. అయితే సాక్షాత్తు భగవంతుని స్వరూపాన్ని తెలుసుకోలేని మూఢులు అతన్ని సామాన్యుని గానే భావించి నిర్లక్ష్యం చేయడం అవమానించడం వాదించడం లాంటివి చేస్తూ ఉంటారు. వీరు వివేకం లేనివారు తినడానికి నోరు తిరగడానికి కాళ్లు ఉంటే సరిపోతుంది గాని మనిషి దేన్ని అర్థం చేసుకోవాలన్నా వివేకం ఉండాలి అది లేనివారు అవివేకులు మూఢులు అంటున్నాడు జగద్గురువు. వీళ్ళు సామాన్య మానవుల్ని అర్థం చేసుకోరు వారికే వారు అర్థం కారు ఇక దైవాన్ని ఎలా అర్థం చేసుకుంటారు. అర్థం కాని చోట స్పష్టత లేని చోట ఉన్నది అస్పష్టతే అవివేకమే అనర్థాలే అపార్థాలే ఇది మనిషి పరిస్థితి. నేను శాశ్వతుడను సర్వోత్తముడను నా పరంభావం తెలియని గ్రహించని బుద్ధిహీనులు సచ్చిదానంద ఘన పరమాత్ముడనైన నన్ను సాధారణ మనిషిగా జనన మరణ చక్రంలో పరిభ్రమించే వానిగా తలుస్తారు. 7 - 24, 7 - 25 శ్లోకాల చర్చను ఇక్కడ సమన్వయం చేసుకుంటే సరిపోతుంది. సర్వాత్మ స్వరూపంగా శోభించే సర్వేశ్వరుడు సత్య స్వరూపం. సత్య స్వరూపాన్ని అర్థం చేసుకోవాలి అంటే సత్యానికి సంబంధించిన అవగాహన అవసరం, అదే వివేకం. నిత్యా నిత్యం

అనే విచక్షణే వివేకం, దేహమే సత్యమని శరీరమే నిత్యమని భావించేవారు దేహంలో దైవాన్ని శరీరంలో శివుణ్ణి దర్శించగలరా? నేను సర్వభూతాలలో భూతాత్మగా ఉన్నాను అది తెలియని మానవుడు నన్ను ఒక రూపంగా ఆరాధిస్తూ అలక్ష్యం చేస్తున్నాడని భగవానుడే స్వయంగా భాగవతంలో చెప్పి ఉన్నాడు. ఏ మాత్రం వివేకం విచక్షణా ఉన్నా దైవాన్ని విస్మరించరు దైవ దృష్టిని వీడరు. ఇందులో మన గ్రహించాల్సిన అంశాలు ప్రతి మనిషి మూఢత్వాన్ని పోగొట్టుకోవాలి, ఇతరులను నిందించకూడదు, భగవంతుని నిజతత్వాన్ని గుర్తెరిగి సద్భావంతో సదాచారంతో మెలగాలే గానీ మాయమయ ఆసురిభావాన్ని ఆశ్రయించకూడదు.

9అ, 12శ్లో.

మోఘాశా మోఘకర్మాణో మోఘజ్ఞానా విచేతసః

రాక్షసీమాసురీం చైవ ప్రకృతిం మోహినీం చైవ శ్రితాః | 12 |

వ్యర్థములైన ఆశలచే, కర్మలచే, విపరీత జ్ఞానముచే నిక్షిప్తములైన మనస్సులుగల అజ్ఞానులు రాక్షసీ-ఆసురీ మోహినీ స్వభావములను ఆశ్రయింతురు.

భగవంతుని మహిమాన్వితమైన మహత్తును తెలియలేని భగవంతుని తిరస్కరించే అవివేకులు శోచనీయులు. ధర్మాధర్మాల్ని అర్థం చేసుకొని సత్య అవగాహనతో ఆచరించే వ్యక్తులు పరమార్థాన్ని పొందుతూ ఉంటే క్షణికమైన నస్వరమైన ప్రాపంచిక విషయవాసనల వెంట పరుగులెత్తే ఆసురీ భావ ఆశ్రితులు తమ తమ జన్మలను జీవితాన్ని వృధా చేసుకుంటూ ఉంటారు. వారి వ్యర్థమైన ఆశలు వృధా, ఆశ ఉండొచ్చు కానీ అత్యాశ ఉండకూడదు, మనం ఆశ కర్మ లాంటి పదాలను ప్రథమ షట్కంలోనూ ద్వితీయ షట్కంలోనూ కూడా విపులంగా తెలుసుకుంటూనే ఉన్నాం. వారి ఆశ వారు చేసే ప్రతి పని, కర్మ వారి ప్రతి ఆలోచన వృథానే. చిట్టచివరకు వారి బ్రతుకే వృధా జన్మే వృధా కదా. ఈ అంశాన్ని జగద్గురువు ఎంతో స్పష్టంగా ఇక్కడ తేల్చి చెప్పాడు మనకు.

దీన్ని బట్టి గీతా మార్గంలో దైవ మార్గంలో బ్రహ్మవిద్యను అభ్యసించని వారి జన్మ జీవితం ఆలోచన ఆశ పని అన్నీ కూడా ఎలాంటివో మనకు తెలియవస్తుంది. మనం నేటి సమాజంలో ఇలాంటి స్వభావం గల అనేకమందిని చూస్తున్నాం. అలాంటి వారందరినీ ఈ సందర్భంగా దైవమార్గంలోకి స్వాగతిద్దాం. పరమేశ్వర జ్ఞానం లేని వారి జీవితాల్లో సత్య జ్ఞానం ఉండదు. అందుకే వారిని మోఘకర్ములు, మోఘాశులు మోఘజ్ఞానులు అంటున్నారు. వీరు కామ్యకర్మలే ఆశయంగా పెట్టుకొని జీవిస్తారు. వీటికంతా కారణం దైవాన్ని పరమాత్మను అలక్ష్యం చేయడమే. మనం ఇతిహాస, పురాణ కథల్లో చాలామంది రాక్షస స్వభావం గల వారిని చూస్తూనే ఉన్నాం. వారు గొప్ప శక్తివంతులుగా ఉంటూ యజ్ఞయాగాదులన్నీ కఠోర నియమంతో ఆచరిస్తారు కూడా. కానీ వారి శ్రమ జన్మ వృధా కావడం చూస్తూనే ఉన్నాం. రావణాసురుడు హిరణ్యకశిపుడు ఇలాంటివారి ఘోరతపస్సును వర్ణించ నెవరి తరము. పరమేశ్వరుని తిరస్కరించిన కారణంగా వారి ఆశలు తీరలేదు, కోరికలు ఫలించలేదు. ఎందుకంటే అవన్నీ ఆసురీ స్వభావికమైనవి కాబట్టి. దైవదృష్టి లేని కార్యం పరిమళం లేని పువ్వు లాంటిది, ఆసురీ స్వభావులు అంటే ఎవరో రావణుడో హిరణ్యకశిపుడో విక్రమార్కుడో అనుకుంటే అది పొరపాటు. సదా దైవదృష్టి లేని దైవ ధ్యానం లేని ప్రతి మనిషి ఆసురీ స్వభావం గల వారేనని గ్రహించాలి. అలాంటి వారి ఆశలు, కర్మలు, జ్ఞానం అన్నీ వృధానే, అంతేకాదు వారి వారి ఆశలు, కర్మలు, జ్ఞానం వారి వారి పతనానికి కూడా హేతువులుగా మారుతాయి. పరమాత్మను మరో అవ్యక్త మూర్తిని దర్శించే పొందే బ్రహ్మవిద్యను కాకుండా అర్థం లేని వ్యర్థమైన కార్యాలన్నీ కూడా అజ్ఞానంతో చేయడం వృధానే అని జగద్గురువు ఈ సందర్భంగా చాలా స్పష్టంగా వివరించాడు. ఆశల కర్మల వెనుక అవగాహనే ప్రధానంగా ఉంటుంది కాబట్టి వ్యర్థమైన ఆశల మధ్య వ్యర్థమైన కోరికల మధ్య వ్యర్థమైన జ్ఞానాలతో జీవితాన్ని నిష్ఫలం చేసుకోరాదు. విచేతసులుగా వివేక హీనులుగా ఉండరాదు. బ్రహ్మకు సంబంధించిన బ్రహ్మ విద్యను అధ్యయనం చేయకుండా బ్రహ్మమునకు సంబంధించిన జ్ఞానం లేకుండా మోక్షం ప్రాప్తించే ప్రసక్తే లేదు. మోఘ జ్ఞానంతో కూడి ఉన్న ఆసురీ స్వభావికులు బ్రహ్మ జ్ఞానాన్ని పొందలేరు. అందుకే ఉత్తమమైన మానవ జన్మనెత్తి కూడా వీరు పరమార్థాన్ని పొందలేక నశించిపోతారు. ఇందుకు ఇంతకు మించిన వినాశనం ఉంటుందా? గీత

స్వరూపులారా. ఇలాంటి వారి వల్లనే లోకం లోకులు మోహానికి గురై దుష్ప్రవర్తనకు పూనుకుంటారు. మోహానికి గురి అయిన ఇలాంటి ఆసురీ స్వభావం గలవారు తమ తమ ప్రగల్భాలతో ఢాంభికత్వంతో అర్ధరహిత ప్రలాపాలతో ప్రలోభాలు సృష్టిస్తూ సమాజాన్ని చిద్రం చేసి అశాంతిని రేకెత్తిస్తూ ఉంటారు. నేటి సమాజంలోని ఇన్ని హింసలకు కారణం ఇదే. హంసను అంటే శ్వాసను పట్టుకొని బ్రహ్మాన్ని పొందకపోవడమే. శంకరాచార్యుల వారు ఈ అంశాన్ని ఎంతో స్పష్టంగా తేల్చి చెప్పారు. నరుకు నాశనం చెయ్యి, త్రాగు తిను, అవతల వారిది కాజేయి, దోచేయి అంటూ వారు క్రూరకర్మలు చేస్తూ సమాజాన్ని దారి తప్పిస్తూ ఉంటారు అన్నారు. వీరు చిత్తం చెడిన వారు భ్రమించిన వారు విచేతసులు. మనం 2-62,63 లోచూసిన స్మృతి భ్రంశమై మతి చెడినవారు. దైవ జ్ఞానం లేని అజ్ఞానమే వీరిని ఈ పరిస్థితికి తీసుకొస్తుంది. రాక్షసీం, ఆసురీం అని వెంటవెంటనే ఒకే భావాన్ని స్ఫురింపజేసే రెండు శబ్దాలను ప్రయోగించడం వల్ల వారి క్రూరమైన స్వభావం వారి క్రూరత్వం వారి క్రూరత్వంలో ఉన్న తీవ్రతరం వ్యక్తం అవుతుంది. అందుకే వారి బ్రతుకు జన్మ మోఘపు బతుకుని భగవానుడు తేల్చాడు. మిథ్యామయ దృశ్య రూప వస్తువులను పట్టుకొని వేలాడే దుర్బలురు వీరు. అందుకే రాక్షస ప్రవృత్తిని అసుర స్వభావాన్ని కామాది దుర్గుణాలను రాజ తామస ప్రవృత్తులను వీడాలి. దైవ మార్గాన్ని దైవ లక్షణాలను పుణికి పుచ్చుకోవాలి. వ్యర్ధవంతమైన వృధా అయిన జీవితపు మార్గం నుండి అర్ధవంతమైన అమూల్యమైన పరమార్ధం లోకి మరలుదాం, ప్రవేశిద్దాం. విచేతసులుగా కాక విశేషమైన చేతసులుగా దైవచిత్తులుగా మెలగుదాం వెలుగుదాం. ఇందులో గ్రహించాల్సిన అంశాలు ఆసురీ స్వభావాన్ని వీడాలి, దైవీ స్వభావాన్ని ఆశ్రయించాలి, దైవం పై ఇచ్ఛ దైవాన్ని పొందటానికి అవసరమైన చేష్ఠ, కర్మ చేస్తూ దైవికజ్ఞానాన్ని పొందుతూ దివ్యంగా శోభిల్లాలి.

9అ, 13శ్లో.

మహాత్మానస్తు మాం పార్ధ దైవీం ప్రకృతిమాశ్రితాః |

భజంత్యనన్యమనసో జ్ఞాత్వా భూతాదిమవ్యయమ్ । 13 |

కాని ఓ పార్థా! దైవీప్రకృతిని ఆశ్రయించిన మహాత్ములైతే నన్ను సకల ప్రాణులకు మూలకారణముగను, అవ్యయునిగను (అక్షరస్వరూపునిగను) తెలిసికొని, నిశ్చల మనస్కులై నిరంతరము నన్నే భజింతురు.

భగవద్భక్తి లక్షణమైనటువంటి మోక్షమార్గంలో నడిచే శ్రద్ధావంతుల గురించి ఈ శ్లోకం వివరిస్తుంది. భగవద్భక్తి ఉన్నవారి మనసు మరో విషయం పైకి పోదు. నేను భూత సృష్టికి ఆకాశాది భూతాలకు ప్రాణులకు కూడా ఆది కారణమని అవ్యయ బీజం అని వారికి తెలుసు. అందుకే వారు మరో భావానికి తావీయకుండా దైవాన్ని స్మరిస్తారు. ఈహపరాలను పోగొట్టుకుని అజ్ఞాన తిమిరంలో తారాడే వారిని ఇరుసును ఆధారం చేసుకుని బండి చక్రం తిరిగినట్లు స్వార్థాన్ని కేంద్ర బిందువుగా చేసుకుని సర్వ వ్యాపారాలను సాగించే ఆసురీ స్వభావం కలవారు తమ జీవితాన్ని జన్మను నష్టపోతున్న విధానాన్ని ముందు శ్లోకంలో చూసాం. మహత్ అంటే పవిత్రమైన ఉన్నతమైన మహోత్కృష్టమైన అని అర్థం. వీరే మహాత్ములు, వీరు దైవాన్ని పరమాత్మను కేంద్ర బిందువుగా చేసుకొని సమస్త కార్యాలను పవిత్రంగా నిర్వహించే దైవీ సంపద ఉన్న మహాత్ములు. బుద్ధిని నాశనం చేసే అసుర గుణాలు లేకుండా ఉండటమే కాక దివ్య గుణాలతో శోభిస్తూ దైవంగా దివ్యంగా జీవిస్తూ ఉండేవారు మహాత్ములు. వీరు సదా పరమాత్మ సేవలోనే ఉంటారు, పరమ పురుషార్థ నిశ్చయం వల్ల వీరి గమ్యం సూపర్ సుస్పష్టంగా ఉంటుంది. లక్ష్యం బుద్ధిలో నిశ్చయమైతే కార్యమంతా కూడా దాన్ని అనుసరించే సాగుతూ ఉంటుంది. మహాత్ములు ఏది ఆలోచించినా ఏ కర్మను ఆచరించినా అది పరమార్థం వైపే అనన్యంగా సాగుతూ ఉంటుంది. వారి లక్ష్యం పరమేశ్వరుడే గాని అన్యం కాదనే పూర్ణ జ్ఞానం వారిలో సుస్థిరంగా స్పష్టంగా ఉంటుంది. పరమేశ్వరుని విడిచి అన్యములను ఆశ్రయించడం అనే ప్రవృత్తిని త్యాగం చేయడమే అనన్యభక్తి అని నారద భక్తి సూత్రాలు ప్రబోధిస్తాయి. మహాత్ముల మనసు సదా భగవంతుని పారవశ్యంలోనే ఉంటుంది. మహాత్మ అనన్య మనస్కులు అవ్యయం లాంటి ఈ శ్లోకంలోని ప్రతిపదాన్ని ఎనిమిది అధ్యాయాల్లో సందర్భానుసారంగా చర్చించుకున్నాం. కనుక ఇక్కడ మొత్తం శ్లోకాన్ని కలిపి సంక్షిప్తంగా చూస్తే సరిపోతుంది. దైవీ ప్రకృతిని ఆశ్రయించిన మహాత్ములు

ఎలా ప్రవర్తిస్తారనే అంశాన్ని ఈ శ్లోకం సుస్పష్టంగా మన ముందుంచింది. మనం కూడా మహాత్ముని లక్షణాలను పుణికి పుచ్చుకుందాం పరమాత్మను సమస్త భూత కోట్లకు అధికారునిగా అవ్యయునిగా ఎరిగి అనన్య మనసుతో సేవిద్దాం. అలా దైవీ ప్రకృతిని ఆశ్రయించిన వారే భగవత్తత్వం ఎరిగిన మహాత్ములు అవుతారు.

9అ, 14శ్లో.

సతతం కీర్తయంతో మాం యతంతశ్చ దృఢవ్రతాః |

ఘనమస్యంతశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే | 14 |

ఆ దృఢవ్రతులైన భక్తులు నా నామగుణములను నిరంతరము వాద్యబృందముతో కీర్తింతురు. నన్ను చేరుటకుయత్నింతురు. పదేపదే నాకు ప్రణమిల్లుదురు. సర్వదా నా ధ్యానమునందే నిమగ్నులయ్యేదరు. అనన్య భక్తితో నన్ను ఉపాసింతురు.

మహాత్ములైన వారు పరమాత్మను అనన్య మనసుతో సేవిస్తారని ముందు శ్లోకంలో చెప్పిన జగద్గురువు వారు ఎలా సేవిస్తారో ఆ పద్ధతిని ఇక్కడ వివరించారు. 7-28 లోనే ఈ విషయాన్ని మనం సమగ్రంగా చూసాం. పరమేశ్వరుని ఆశ్రయించి ఎలా దైవీ సంపదతో ముందుకెళ్లాలనే భగవంతుని ఆరాధించే విధానం మనకు ఈ శ్లోకం తరువాతి శ్లోకం 14, 15 శ్లోకాలు స్పష్టం చేస్తాయి. భగవంతుడు ఏంటో తెలియకుండా దైవాన్ని ఎలా కీర్తిస్తాం, స్తుతిస్తాం. దైవం దైవశక్తి అర్థమైతేనే మనం కీర్తించగలం, అర్థం కానప్పుడు అది కీర్తనం స్తుతి ఎలా అవుతుంది. అందుకే బ్రహ్మవిద్య మనిషికి అత్యంత అవసరం, బ్రహ్మ విద్య ద్వారా భగవంతుని తెలియడం మనిషి ప్రాథమిక కర్తవ్యం. మనకు అర్థమై అవగాహనతో కీర్తిస్తేనే అది జ్ఞానమవుతుంది. జ్ఞానం ఉంటేనే భక్తి నిలుస్తుంది ఆ నిత్య యుక్త భక్తితో మనం పరమపదం పొందుతాం. ఈ అవగాహన లేకపోతే నేను దైవాన్ని కీర్తిస్తున్నానని పూజిస్తున్నానని సేవిస్తున్నానని భ్రమతో కూడిన భక్తిలోనే చాలామంది ఉండిపోతున్నారు.

అందుకని జగద్గురువు ఇక్కడ ఈ శ్లోకాన్ని స్పష్టంగా మన ముందు ఉంచారు. గంధపు చెక్కల్ని మోస్తున్న గాడిద వాటి సువాసనను కొంచమైనా తెలుసుకోకుండా అర్థం చేసుకోకుండా బరువును మాత్రం మోస్తూ ఉంటుంది, అలాగే ఎన్ని శాస్త్రాలు వల్లించినా సారవంతమైన పరతత్వం ఆత్మతత్వం తెలియని వారు గాడిద వలె శాస్త్ర భారాన్ని మాత్రం మోసేవారు అని ఉత్తర గీత ఉద్బోధ. జగద్గురువు 7-28 లో చెప్పిన అంశాన్ని మరోసారి మనలో బాగా వేళ్లూనుకోవాలని ఇక్కడ గుర్తు చేస్తున్నారు. అంటే ఈ శ్లోకం యొక్క ప్రత్యేకతను మనం అవగాహన చేసుకోగలం, ఏ అంశానికైనా ఏ జ్ఞానం పొందాలన్నా ప్రాథమికంగా అవగాహన అనేది చాలా ప్రధానమైనటువంటి అంశం కదా. ఆ అవగాహనకు సంబంధించినటువంటి విషయాన్ని మనలో నిబిడీకృతం చేయాలని జగద్గురువు ఈ శ్లోకాలను ప్రతిపాదిస్తున్నారు. మనిషి ఈ దృఢత్వం లేని వారు దుర్బలులు అవుతారు. మనలోని దుర్బలత్వాన్ని పోగొట్టాలనేదే జగద్గురువు సంకల్పం. అందులో భాగంగా ప్రత్యేకించి దృఢత్వాన్ని భక్తిని అపారంగా పెంపొందించుకోవాలని దైవ సన్నిధికి మనల్ని నడిపించుకుని తీసుకువెళ్లాలని ఇలా ఈరోజు జగద్గురువు మనతోపాటు నెమ్మదిగా నడుస్తూ మనల్ని పరమపదం చేర్చడానికి ప్రయత్నిస్తున్నాడు. కాబట్టి మనం మనలోనే దుర్బలత్వాన్ని వీడుదాం, దృఢత్వాన్ని పెంపొందించుకుందాం.

భక్తి అంటే ప్రేమే, ప్రేమే భక్తి భక్తి ప్రేమ, దైవాన్ని లేదా ప్రేమను గీతా మార్గం ద్వారా అర్థం చేసుకోకుండా అవగాహన లేకుండా భక్తి లేదా ప్రేమ నిలవదు కదా. అవగాహన ఉన్న చోటే ప్రేమైనా భక్తి అయినా చిగురిస్తుంది, పుష్పిస్తుంది, ఫలిస్తుంది. పరమేశ్వరుడు సర్వజ్ఞుడు సర్వశక్తిమంతుడు సర్వవ్యాపి సృష్టి కార్యానికి అధిష్టాతా. అతని అధ్యక్షతనే సమస్తం నడుస్తోంది ఇదంతా ఈశ్వర జ్ఞానం. ఇప్పటివరకు మనం చర్చించుకున్న తొమ్మిది అధ్యాయాల సారమంతా కూడా భగవంతుని జ్ఞానం మరి మనలో మనం ఆలోచించుకుందాం ఇంతటి అవగాహన లేకుండా మోక్షమో ముక్తో భక్తో వీలవుతుందా? ఈ జ్ఞానం లేనిదే శ్రద్ధ నిలవదు విశ్వాసం బలపడదు. ఇవి లేకుండా ఈశ్వర అలౌకిక అవ్యక్త సూత్రం కుదరదు. ఈ అవగాహన లేకుండా నేను చేస్తున్నటువంటి పూజనో లేకపోతే కీర్తనో సరిపోతుంది అని అనుకుంటే

బొమ్మ దీపంతో వెలుతురును ఆశించినట్లే అవుతుంది కానీ అది నిజమైన దీపం కాదు. సూత్రాన్ని పట్టుకోకుండా భక్తి ఉండలేదు కదా కీర్తనం అంటే భగవంతుని అర్థం చేసుకోవడం అని అర్థం సత్యానికి సంబంధించిన జ్ఞానాన్ని పొందడం అని భావం ఇదే కీర్తన వైభవం. ఈ జ్ఞానంతోనే పరమేశ్వరుని పొందగలం. గీతా శ్రవణ సాధనను ఆచరిస్తూ గీతలో పేర్కొన్నట్లు ఇంద్రియాలు సంయమించి శమదమాది షట్కసంపత్తితో ధర్మాన్ని ఆచరిస్తూ బ్రహ్మాన్ని పొందే బ్రహ్మచర్య వ్రతంలో ఉండటమే దృఢప్రయత్నం. ఇప్పటివరకు మనం చర్చించిన అవగాహనతో కూడిన కీర్తనం భక్తి వల్ల ఏర్పడిన జ్ఞానమే నిత్యము అవుతుంది. దైనందిన జీవితంలో ఏ కొంత సేపో చేసే పూజో లేదా ఏ కొంతసేపో చేసే కీర్తనో భక్తి అనిపించుకోదు. ఒకవేళ దాన్ని భక్తిగా భావిస్తే వారు భ్రమలో ఉన్నట్లే లెక్క. ఈ గీత లో ఉన్నటువంటి సమస్త సారాన్ని సమస్త సృష్టి ఆవిర్భావ వ్యక్తి ఆవిర్భావ వికాస సారాన్ని అర్థం చేసుకున్నప్పుడే అవగాహన చేసుకున్నప్పుడే అది దైవ జ్ఞానం అవుతుంది. ఆ జ్ఞానంతో దైవాన్ని కొలిచినప్పుడే అది భక్తి అవుతుంది. అప్పుడే మనసు అనిత్యాల వైపు వెళ్లకుండా నిలుస్తుంది. అలా ఈశ్వర జ్ఞానం మనలో సుస్థిరమైనప్పుడు అహం భావం నశిస్తుంది. నేను పరమేశ్వరుని కన్నా అన్యంగా లేను అనే దైవిక భావన అలవడుతుంది. పరమేశ్వరుడు పరిపూర్ణుడు మనం అసంపూర్ణులం అయితే ఈ శ్లోకంలోని అంశాలను ఆచరిస్తే మనం అసంపూర్ణం నుండి పరిపూర్ణానికి ఎదగలం ఆ పరిపూర్ణతను మనకు ప్రసాదించే దివ్యమైనటువంటి మంత్రాలే ఈ అధ్యాయంలోని 14, 15 శ్లోకాలు. భౌతిక కళ్ళు చూడలేనివి మన దేహంలో ఎన్నో ఉన్నాయి, మనం అర్థం చేసుకోలేనివి జీవితంలో ఎన్నో జరిగిపోతున్నాయి. విశ్వమంతా వ్యాపించిన పరమేశ్వరుడే నా బుద్ధిని ప్రకాశింప చేస్తున్నాడు,

అతన్నే మోక్షార్థినై నేను ఆశ్రయిస్తున్నానని స్మృతి వాక్యం. భక్తిని బతుకు బండి కోసం మార్చకుండా భక్తిని బతుకు బండి నుండి వేరు చేయకుండా భగవత్ స్మరణ కీర్తనాధుల ద్వారా ప్రతి క్రియను పూజగా భక్తిగా కీర్తనగా మలచుకోవాలి, మార్చుకోవాలి. సూర్యుని వెలుతురు చీకటిని తొలగించినట్లు గాలి శక్తివంతంగా వీచి మేఘాలను తరలించినట్లు భగవంతుణ్ణి అవగాహనతో కీర్తిస్తే సమస్త దుఃఖాలు తొలగిపోతాయి. కాబట్టి భక్తి అనే తపస్సులో జ్ఞానార్జన

చేసి దైవదృష్టితో దివ్యంగా పయనించి దివ్యమైన వైకుంఠధామాన్ని చేరుకుందాం. మనం మహాత్ములుగా ఉండాలని జగద్గురువు చెప్పడంలోని ఆంతర్యం నేను అనే అహంభావం తొలగడమే. అందుకు భగవంతుని ఎలా సేవించాలి ఒకటి ఎల్లప్పుడూ దైవానికి కీర్తించే గుణం కలిగి ఉండాలి రెండు దృఢవ్రతం అవలంబించి దైవప్రాప్తికి యత్నిస్తూనే ఉండాలి. మూడు భగవంతుని భక్తితో సదా నమస్కరిస్తూనే ఉండాలి. అంటే సదా తమ అంతరంగంలో నమస్కారం భావాన్నే కలిగి ఉండాలని అర్థం అంతేగాని భౌతిక శరీరక అవయవాలతో నమస్కరించడం కాదు. నాలుగు చిత్తాన్ని అన్యం వైపు పోనీయకుండా సదా పరమాత్మ యందే నెలకొని ఉండేలా జాగ్రత్తలు వహించాలి. ఇవి మనం సాధించుకునే ఉపాయం ఏమంటే ఒకటి నిరంతరం అక్షర పరబ్రహ్మాన్ని స్మరించడం రెండు పరమాత్మను పొందాలనే సంకల్పం దృఢంగా ఉండటం. మూడు భక్తితో దైవభావంతో కూడిన ధ్యానం ఎందుకు ఇక్కడ భక్తితో కూడిన ధ్యానం అంటున్నామంటే రావణబ్రహ్మ విక్రమార్కుడు లాంటివారు ఎందరో ఆసురీభావంతోనూ చేసే గొప్ప ధనులను మనం చూసాం అందుకని అలా కాకుండా దైవీ ప్రకృతితో దైవిక దృష్టితో కూడినటువంటి ధ్యానం నాలుగు సదా నిరంతరం దైవచింతన నిత్య యుక్తమైన చింతకాంతక చింతనను కలిగి ఉండాలి. చింతకాంతక చింతన అంటే భౌతిక చింతనలకు అతీతమైన చింతన అని అర్థం.

9అ, 15శ్లో.

జ్ఞానయజ్ఞేన చాప్యన్యే యజంతో మాముపాసతే |

ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతోముఖమ్ | 15 |

మఱికొందరు జ్ఞానులు నిర్గుణ నిరాకార బ్రహ్మనైన నన్ను జ్ఞానయజ్ఞము ద్వారా అభేదభావముతో ఉపాసించు చుందురు. మఱికొందరు అనంతరూపములతో ఒప్పెడి నా విరాట్స్వరూపమును పృథక్ భావముతో ఆరాధించుచుందురు.

11, 12 శ్లోకాల్లో ఆసురీ స్వభావం గల వారిని గురించి పేర్కొని 13, 14 శ్లోకాల్లో పరమపదమే లక్ష్యంగా గల దైవీ ప్రకృతి గల వారిని గురించి వివరించారు. ఇక్కడ అసలు జ్ఞానం అంటే ఏది? ఏ ప్రక్రియ జ్ఞానం అవుతుంది, అనేక రకాల జ్ఞానాలు ఉన్నాయా? ఉన్నది ఒక్కటే జ్ఞానమా? ఇంతకు జ్ఞాన యజ్ఞం ఆచరించడం ఎలా? అనే అంశాలను ఈ శ్లోకం మరోసారి గుర్తుచేస్తుంది. ఇక్కడ ఈశ్వర విషయమైన పరమాత్మ జ్ఞానమే యజ్ఞం. జ్ఞానయజ్ఞం ఆచరించే మహాత్ములకు జ్ఞాన విషయం భగవంతుడే గాని మరొకటి కాదు. ఆ భగవంతుని అవగాహనతోనే మనం కీర్తించాలి, స్తుతించాలి అని ముందు శ్లోకంలో చెప్పుకున్నాం. ఆ అవగాహనతో చేసేటటువంటి స్తుతి కీర్తన పూజ జపం మంత్రం ఏదైనా సరే అదే జ్ఞానమవుతుంది, జ్ఞాన యజ్ఞం అవుతుంది కానీ భగవద్గీత అవగాహన లేకుండా సృష్టి స్థితి స్థాపన లయలు తెలియకుండా వ్యక్తి జనన మరణాల విషయ అవగాహన లేకుండా ఎన్ని పూజలు చేసినా ఎన్ని వ్రతాలు చేసినా అవగాహన శూన్యమే అవుతుంది కానీ అవగాహన అలవడదు. ఎప్పుడైతే భగవద్గీతలోని భగవద్ విషయకమైనటువంటి అంశాలను సశాస్త్రీయమైనటువంటి కోణంలో సూత్రీకరణ విధానాలతో అర్థం చేసుకుని అవగాహనతో ముందుకు వెళ్ళినప్పుడే మనం చేసే ఏ పూజ క్రియ అయినా కూడా ఫలిస్తుంది. ఇక్కడ జ్ఞానయజ్ఞం అంటే మనం నాలుగవ అధ్యాయం అంతా చూసిన జ్ఞానయజ్ఞం అని అర్థం చేసుకోవాలి. ఏమిటి ఆ జ్ఞానం అంటే పరబ్రహ్మం ఒక్కటే అనే సంయక్దర్శన జ్ఞానం. పరబ్రహ్మం ఒక్కటే దైవం ఒక్కటే దేవుడు ఒక్కడే అనేటటువంటి అంశాలను అవగాహన లేకుండా జపించడం ద్వారా స్మరించడం ద్వారా ప్రయోజనం ఉంటుందా? జామకాయను చూడకుండా జామకాయ జామకాయ అని జపిస్తూ ఉంటే జామకాయ ఎలా ఉంటుంది అని అవగాహన మనకు తెలుస్తుందా? అందుకని గీతలోకి ప్రతి ఒక్కరూ ప్రవేశించినప్పుడే భగవంతుని గీతామార్గంలో నడిచినప్పుడే భగవంతుని సస్వరూపం మనకు ప్రత్యక్ష్యానుభవం కలుగుతుంది. దైవాన్ని మనం స్తుతించాలి, కీర్తించాలి. ఉదాహరణకు మనం కొబ్బరికాయ కొడుతున్నాం కర్పూరం వెలిగిస్తున్నాం అనేక రకాల పద్ధతులలో పూజలు వ్రతాలు, జపాలు, తపాలు చేస్తున్నాం. అయితే మనం చేస్తున్నటువంటి ఆ క్రియ ఎందుకోసమో ఎవరికోసమో దేనిని పొందాలనుకుంటున్నామో అనే అవగాహన ఉన్నదా అని ప్రశ్నించుకుంటే

సరిపోతుంది. లేకపోతే మనం చేసే ప్రతి పని ప్రయోజనం లేనిదే, అందుకని మనకు ప్రాథమికమైనటువంటి అవగాహన భగవద్గీత మార్గం ద్వారానే అందుతుంది, పొందుతుంది. ప్రత్యక్ష ప్రమాణమైనటువంటి అనుభవ జ్ఞానమే యజ్ఞం. ఆ జ్ఞాన యజ్ఞంతో కొందరు నన్ను ఉపాశిస్తారు ఇంకొందరు కృతద్భావంతో సూర్యుడు చంద్రుడు మొదలైన భిన్న రూపాలలో ఉన్న వాడని భావించి నన్ను ఆయా రూపాల్లో ఉపాసిస్తారు. మరికొందరు ఆ భగవానుడే సర్వతోముఖంగా విశ్వరూపంతో బహు విధాలుగా ఉన్నాడని ఆ విశ్వరూపుని విశ్వతోముఖునిగా బహుధా ఉపాసిస్తున్నారు. జీవుడు వాస్తవంగా బ్రహ్మమే గాని అన్యుడు కాదు అనే నిశ్చయాన్ని కలిగి ఉండటమే జ్ఞాన యజ్ఞం. ఆచరించడం అంటే విశ్వతోముఖం అన్నారు విశ్వమంతా ముఖం కలవాడు, సర్వవ్యాపకుడు, సర్వాత్మ స్వరూపుడు ఈ అంశాన్ని జ్ఞాన యోగం అంతా కూడా మనం విభిన్న కోణాల్లో వినూత్నంగా చర్చించాం. ఆ అధ్యాయంలోని సమస్త జ్ఞానాన్ని లోతుల్లోకి వెళ్లి అవగాహన చేసుకున్నప్పుడే ఈ శ్లోకం మనకు అవగతం అవుతుంది. ఈశ్వర జ్ఞానం లేకుండా భగవంతుని అవగాహన లేకుండా ఆ భగవంతునితో ఏకం కాకుండా మనం చేసే కోటిపూజలు కోటి వ్రతాలు కోటి జపాలు ఏ పాటివో ఈ శ్లోకం మనకు నిర్ధారణ చేస్తుంది.

9అ, 16శ్లో.

అహం క్రతురహం యజ్ఞః స్వధాహమహమౌషధమ్ |

మంత్రోऽహమహమేవాజ్యమ్ అహమగ్నిరహం హుతమ్ | 16 |

నేనే క్రతువును. నేనే యజ్ఞమును, స్వధయును నేనే, ఓషధులును నేనే. నేనే మంత్రమును, నేనేఘృతమును. నేనే అగ్నిని, హోమరూపక్రియయును నేనే.

పరమేశ్వరుడు సమస్తంలోని ఆంతర్యామి సర్వాంతర్యామి, 4-24 లో చేసిన సుదీర్ఘమైన చర్చను ఇక్కడ సమన్వయం చేసుకొని ఈ శ్లోకాన్ని సంక్షిప్తీకరించుకుంటే సరిపోతుంది. క్రతువు అంటే వేదాల్లో ప్రతిపాదించిన శ్రౌత కర్మలు, యజ్ఞం అంటే వేదాలు శ్రుతులు, స్మృతులు ప్రతిపాదిత

యజ్ఞాలు అవి నిత్యానుష్ఠానాలు. స్వధా అంటే పితృపూజాత్మకమైన యజ్ఞం. మంత్ర భూతంగా పితృదేవతలకు అర్పణం చేసే అన్నం. పక్షులకు పురోహితులకు పితృదేవతలను సంతృప్తి పరచేందుకు సమర్పించేటటువంటి అన్నం కూడా తానే. దేవతలను ఉద్దేశించి సమర్పించే ద్రవ్యమయమైనవన్నీ యజ్ఞ రూపమే. ఇక్కడ ఔషధం అంటే ప్రాణులు తినే అన్నం, ఓషధుల నుండి ఉత్పన్నమైనవి ఔషధాలు. మొక్కలు తీగలు, మూలికలు దుంపలు ఇంకా వివిధ రకాల చెట్లనుంచి ఉద్భవించే ఓషధులే ఔషధం. వ్యాధిని పోగొట్టే మందును ఔషధం అంటాం. ఆకలికి క్షుద్వ్యాధి అని కూడా పేరు. ఆకలిని పోగొట్టే అన్నం కూడా ఔషధమే ఇన్ని రహస్యాలను తెలుపుతూ బ్రహ్మ జ్ఞానాన్ని ఉద్బోదించి జనన మరణ రోగాన్ని పోగొట్టే భగవద్గీత అన్నిటిని మించిన దివ్యమైన ఔషధం. మంత్రం అంటే రక్షించేది కాపాడేది అని అర్థం. మంత్రమే మహేశ్వరుడు వేదాలలోని మంత్రాల రూపంలో ఉన్నది భగవంతుడే. ఆజ్యం అంటే దేవతలకు సమర్పించే హవిస్సు అది భగవంతుడే. హోమాదుల్లో సమర్పించే నెయ్యి మాత్రమే కాదు ఆజ్యం అనేది సర్వహవిస్సులకు ఉప లక్షణమై ఉంది. అగ్ని అంటే దేనియందు హోమం చేస్తామో ఆ అగ్ని కూడా భగవంతుడే. హోమగుండంలో అగ్ని ఉంటేనే హోమం చేస్తాం, అలాగే మన దేహంలో వైస్వనరాగ్ని ఉంటేనే అన్నాదుల్ని మనం మన దేహానికి ఆహుతులుగా సమర్పించగలుగుతున్నాం. హోమం చేయడం అనే కర్మ కూడా భగవంతుడే, యజ్ఞంలో అనేక వస్తువులు వివిధాలుగా కనిపించినా అన్నింటిలోనూ ఆంతర్యామిగా ఉన్నది దైవమే. పరమాత్మ సర్వవ్యాపకుడై విశ్వతోముఖుడై సమస్త పదార్థము నందు వెలుగుతూ ఉన్నటువంటి విధానాన్ని మనకు అర్థమయ్యేటట్లు బోధించడానికి అనుభవ జ్ఞానం చేయించడానికి జగద్గురువు యజ్ఞం అనే క్రియను స్వీకరించి దానియందు ఉపయోగించే సమస్త పదార్థాలు భగవంతుని స్వరూపాలే అని ఏడవ అధ్యాయంలో చర్చించిన సమస్త అంశాలను ఇక్కడ మరోసారి స్పష్టంగా మనం ముందు ఉంచారు. ఇలా క్రతువు యజ్ఞం వధ ఔషధం మంత్రం ఆజ్యం అగ్నికుతం అన్నీ నేనే అంటున్న నేనులో మనం ఐక్యమవుదాం.

9అ, 17శ్లో.

పితాహమస్య జగతో మాతా ధాతా పితామహః ।

వేద్యం పవిత్రమోంకార ఋక్సామ యజురేవ । 17 ।

ఈసమస్త జగత్తునకు ధాతను అనగా ధరించువాడను, అట్లే కర్మలఫలములను ఇచ్చువాడను నేనే. తల్లియును, తండ్రియును, తాతయును నేనే. తెలిసికొనదగిన వాడనూ నేనే. పవిత్రుడను, ఓంకారమును నేనే. ఋక్సామయజుర్వేదములును నేనే.

తల్లి తండ్రి సోదరుడు ఇలాంటి లౌకిక బంధువులతో జీవుని సంబంధం తాత్కాలికమైనది. స్థూల దేహం ఉన్నంతవరకే వారితో సంబంధం ఉంటుంది, కానీ భగవత్ సంబంధం అలాంటిది కాదు. తల్లి తండ్రి తాత అంటున్న దైవమనే ఆత్మ బంధువు పరమాత్మతో అనుబంధం సంబంధం స్థూల దేహానికి పరిమితం కానిది అది ఆ విభాజ్యమైనది అనంతమైనది. ప్రపంచంలో అనేకమైనవి ఉన్నా ప్రధానంగా ముఖ్యంగా ఖచ్చితంగా తెలుసుకోవాల్సింది దైవాన్ని ఈ విషయాన్ని ఇక్కడ జగద్గురువు మరోసారి స్పష్టం చేస్తున్నాడు. దృశ్య రూప మయమైన ఎన్ని విద్యలు నేర్చుకున్నా బ్రహ్మవిద్యను ఎరుగని వారు అవిద్యాపరులే అని ఈ శ్లోకం నిర్ధారిస్తుంది. పరమేశ్వర వ్యక్త స్వరూపమైన ఈ జగత్తుకు అన్నీ తానే అంటున్నాడు. కార్యము ఏది కనిపించినా అది కర్తను జ్ఞాపకం చేస్తుంది ఈ ప్రపంచానికి భగవంతుడు నిమిత్త కారణం, ప్రకృతి ఉపాధాన కారణం. సర్వజ్ఞుడైన పరమేశ్వరుడు నిమిత్త కారణం కావడం వల్ల ఈ సృష్టి తయారయింది. అందుకే ఈ ప్రపంచానికి తండ్రి అలాగే ఉపాధాన కారణంగా ఉన్న ప్రకృతి పరమేశ్వరుని కన్నా అన్యం కాదు. ఎందుకంటే అది పరమేశ్వరుణ్ణే ఆశ్రయించుకొని ఉంది, అందుకే అది ఉపాధి. ఉపాధి ఉపాధాన కారణం కూడా పరమేశ్వరుడే ఈ జగత్తుకు పితామహుడు తాతను కూడా నేనే అంటున్నాడు. సృష్టికర్త సృష్టి బ్రహ్మ కనుక ఇతను విశ్వవ్యాపక నాభి కమలం నుండి పుట్టడం వల్ల ఇతనే ఈ సృష్టికి పితామహుడు. తండ్రి తానే తాత తానే ఎలా అవుతాడనే సందేహం కలగవచ్చు. జన్మనిచ్చిన వారు తండ్రి అయితే తండ్రికి జన్మనిచ్చిన వారు

తాత. కానీ ఇక్కడ భగవంతుడు తండ్రి, జగత్తుకు కారణమైన వాడు. మరి ఆ భగవంతునికి కారణం ఎవరు అని ప్రశ్నించుకున్నా ఎవరు కారణమైనా జగత్ పితకు కారణమైనటువంటి ఆ తండ్రి పితామహుడు అవుతాడు. ఇక్కడ నేనే పితామహుడ్ని అని చెప్పడం వల్ల తనకు మరొక కారణం లేదని తానే సర్వ కారణమని తెలుస్తుంది. అందుకే కారణాలకు కారణమైన వాడు మరో కారణం లేని వాడు అయిన భగవంతుడు పితామహుడు అయ్యాడు. ఇక ధాత ప్రాణుల కర్మలకు తగిన ఫలాలను అనుగ్రహించేవాడు కాబట్టి ధాత, పోషకుడు, స్థితికారకుడు. కర్మ ఫలాలు అందడం వెనుక ఓ ధర్మం ఓనియతి ఉంది. దానిని అనుసరించే మనకు ఫలాలు అందుతాయి. ఆ ధర్మం మనం చేసింది రూపొందించింది కాదు మనం ఈ ప్రపంచానికి రాకముందే ఈ విశ్వం ఉంది. అది ధర్మాలతోనూ ఓ నియతితోను ఉంది. సృష్టిలో ఈ ధర్మాలను రచించిన వారే ఫలితాలను అందిస్తుంటారు. ఇది సర్వజ్ఞుడికే సాధ్యం కర్మలకు తగిన ఫలితాలను ఎప్పుడు ఎలా ఏ రూపంలో ఎందుకు ఇవ్వాలో అన్నీ సమగ్రంగా తెలిసినవాడు. అందుకే ధాత. తరువాత వేద్యం, తెలియదగినవాడు తెలియదగింది అది ఒక్కటే. తెలియదగినవాడు అతను ఒక్కడే, ఉన్నది ఒక్కటే, అన్యమైనదేదీ ఏదీ లేదు. అదే ఆయనే వేద్యుడు, తెలియదగినవాడు. ప్రపంచంలో ఏది తెలుసుకున్నా అది మిథ్యా జ్ఞానమే. 7-2 లోని ఏది తెలిస్తే ఇక తెలుసుకోవలసింది ఏదీ ఉండదు అని మనం గ్రహించామో అదే ఆ దైవమే తెలియదగినవాడు. ఇక పవిత్రం పవిత్రాలలోకెల్లా పరమ పావనమైనది ఓంకారం. పరమేశ్వరుడు ఓంకార స్వరూపుడు, మనం ఈ ఓంకారమనే ఏకాక్షర స్వరూప విశ్వరూపాన్ని సమగ్రంగా 8-13 లో చూసాం. ఋక్ సామ యజుర్వేదాలు భగవంతుని స్వరూపం. వేదాల్లో ఉన్నదీ తానే అతనే వేదమై ఉన్నాడు. అతని విశ్వరూపాన్నే వేదాలు వర్ణిస్తాయి, ఉద్బోధిస్తాయి.

9అ, 18శ్లో.

గతిర్భర్తా ప్రభుః సాక్షీ నివాసః శరణం సుహృత్ |

ప్రభవః ప్రలయః స్థానం నిధానం బీజమవ్యయమ్ | 18 |

పరమగతియైన పరమధామమును, జగత్తును భరించి, పోషించువాడను నేనే. అందరికిని స్వామిని, అందరి శుభాశుభములను చూచువాడను నేనే. అందఱికిని నివాసస్థానమును, శరణుపొందదగిన వాడను నేనే. ప్రత్యుపకారమును ఆశింపక హితమొనర్చువాడను, అందఱి ఉత్పత్తి ప్రళయములకు హేతువును, వారి స్థితికి ఆధారమును, నిధానమును, శాశ్వతకారణమును నేనే.

ఒకటి గతి సాధారణంగా గమ్యస్థానాన్ని గతి అంటారు. భగవంతుడు అందరికీ గతియై గమ్యమై ఉన్నాడు. సర్వజనులు పొందాలనే చెందాలనే గమ్యం దైవమే మోక్షమే ఈశ్వరుడే కదా, అందుకే గతి అంటున్నాడు. గమ్యాన్ని పొందడానికి ఉపకరించే మార్గం కూడా తానే. ఇదే భగవంతుని గీతా మార్గం. ఈ దైవ మార్గం సంప్రాప్తిస్తే చాలు గమ్యం సిద్ధించినట్లే, మన గతి మనకు నిర్ధారణ అయినట్లే. ఎప్పుడు ?మనం సదా దైవం ఏర్పరచిన గీతా మార్గాన్ని వీడకుండా దారి తప్పకుండా పట్టు వీడకుండా దైవం చూపిన గీతలో నడిచినప్పుడు మాత్రమే. జీవనదులకు సముద్రం గమ్యమైనట్లు జీవులన్నిటికీ పరమేశ్వరుడు గమ్యం గతి పరమ గతి అయి ఉన్నాడు. సద్వస్తువైన శాశ్వతాత్మే సమస్త జీవుల పరమగతి అయి ఉన్నాడు. బ్రహ్మమును గతి అని ఎందుకు చెప్పారు అనేది ప్రశ్న పాపం నుండి లేదా అజ్ఞానం నుండి విముక్తులైన వారు పొందుతున్నందున బ్రహ్మం గతి అని సమాధానం. కాబట్టి మన బతుకుకు జీవితానికి భగవంతుడే పరమగతి అని నిర్ధారణ అవుతుంది, నిశ్చయమవుతుంది. కాబట్టి ఓ పరమగతి అయిన పావన మూర్తి స్వామి మమ్ము కరుణించే భక్తివి నీవే మమ్ము వరించే ముక్తివి నీవే. నీ వెంట పడితే వీడును మోహం, నిన్ను వేటాడితే దొరుకును మోక్షం. మనం ఆచరించే కర్మల నుండే కర్మ ఫలాలు ఆ పరమగతి అయిన దైవం అధ్యక్షతన మనకు అందుతూ ఉంటాయి. కాకపోతే మనం ఒక ప్రదేశంలో ఒక కాలంలో కర్మ చేస్తే దాని ఫలితం మరో ప్రదేశంలో మరొక కాలంలో కచ్చితంగా అది అంది తీరుతుంది. కర్మ చేయడంలో అధికారం ఉన్న మనం చేసిన కర్మకు ఏ ఫలం ఇవ్వాలో ఎప్పుడు ఇవ్వాలో ఎంత ఇవ్వాలో ఎక్కడ ఇవ్వాలో ఎందుకు ఇవ్వాలో ఎలా

ఇవ్వాలో అన్నీ కూడా పరమేశ్వరుని పరంధాముని ఆధీనంలో ఉంటాయి. అందుకే ఆ దైవమే మనకు గతి పరమ గతి.

రెండు భర్త, పోషించేవాడు భరించేవాడు భర్త. విశ్వమంతటినీ పోషిస్తూ భరిస్తూ అధిష్ఠానంగా ఉంటూ సత్తా స్ఫూర్తులు కలిగించే వాడే, స్థితికారకుడు భర్త. అంతేకాక జగత్తు నడవటానికి ఏ ధర్మాలు అవసరమో ఆ ధర్మాలు ఏర్పరచినవాడు జగత్పతి. ఆ జగత్పతి అడుగుజాడలో నడవడం జగత్పతి గీసిన రాసిన గీతా మార్గంలో పయనించడం మన ధర్మం. సూర్యచంద్ర నక్షత్రాధులను నియమించేవాడు నది సాగర పర్వతాలను కదిలించేవాడు ఆపేవాడు ధర్మంతో విశ్వాన్ని పోషించేవాడు భర్త. శరీర భారాన్ని మోస్తూ తిరిగే శక్తి దేహానికి ఉంది, చూసే శక్తి వినే శక్తి ఇంద్రియాల కున్నాయి. ఆలోచించే శక్తి మనసుకుంది. ఇలా వివిధ విధాలుగా మనం వినియోగిస్తున్న శక్తి అంతా ఒక్కటే అదే భగవంతుని శక్తి. అలా మనలోని ఇచ్చాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి అన్నీ కూడా భగవంతుడు ప్రసాదించిన శక్తులే. అలా పోషించే శక్తి భగవంతునికి తప్ప మరొకరికి లేదు. అయితే ఈ సత్యాన్ని ప్రత్యక్ష అనుభవంగా తెలియని వారు భౌతిక కంటికి కనిపిస్తున్న స్త్రీ పురుషుల శరీర నిర్మాణానికి సంబంధించిన అంశమే

భర్త అనే పదానికి అర్థమని భ్రమిస్తున్నారు. ఆ భ్రమలో దాన్ని ఒక అధికారంగా పదవిగా భావించి నేను భార్యననో భర్తననో ఒకరిపై ఒకరు అజమాయిషి చలాయిస్తూ అహంకార ప్రలోభాలకు లోనవుతుంటారు. భర్త అంటే మనం అనుకునే పరిమిత పరిధికి సంబంధించినది కాదు. ఈ శ్లోకంలో మనం చర్చించిన అవగాహన ఉన్న ప్రతీ మనిషి భర్త స్థానానికి బ్రహ్మస్థానానికి అర్హులవుతారు. ఇక నుంచైనా ఈ భర్త భార్య తల్లి తండ్రి లాంటి పేర్లతో నిబంధించి చలామణి అవ్వాలనుకునే సంకుచిత దృష్టిని వీడాలి. జగత్పతే పతి భర్త అనే విశాల దృక్పథం అలవడాలి. భర్త అంటే పోషించే వాడే గాని క్షోభింప చేసేవాడు కాదు, కష్టాలకు కన్నీళ్ళకు గురి చేసేవారు కాదు, స్వేచ్ఛను హరించేవారు కాదు. ప్రత్యేకించి నాలుగు గోడల మధ్యన నిబంధించి భద్రపరిచే వారు అసలు కాదు. అలా భౌతిక పరిధితో పదవిగా మాత్రమే భావించే ప్రతి ఒక్కరికీ ఈ శ్లోకం ఓ కనువిప్పు లాంటిదని తెలియాలి.

దేహాన్ని సదా పోషించేది దైవమే భర్తే. దైవం తప్పుకుంటే దేహం రాలిపోతుంది. కాబట్టి లింగ భేదంతో సంబంధం లేకుండా ప్రతి మనిషిని పోషించే ఆ దైవమే మనందరికీ భర్త, జగత్పతి. ఒకవేళ ఈ అంశాన్ని ఎవరైనా వ్యతిరేకించినా వివాహం అయిన తరువాత భార్యకు భర్త రావచ్చు, భర్తకు భార్య రావచ్చు అంతకుముందు వారిని పోషించింది ఎవరు? అనే ప్రశ్న వేసుకుంటే సరిపోతుంది. సమాధానం తనంతట తానుగా తనలోనే సిద్ధిస్తుంది, అప్పుడే ఐక్యత సమైక్యత వర్ధిల్లుతుంది. కాబట్టి జీవితంలో తోడు అనేది సహకారమనేది ప్రతి మనిషికి జీవికి అవసరం. అది ప్రత్యక్షంగా కొంత జరిగితే పరోక్షంగా ఎంతో ఎంతెంతో జరుగుతూనే ఉంటుంది. ప్రకృతి సహకరించకపోతే మనం జీవించలేం కదా అలా కుటుంబం భార్య భర్త పిల్లలు ఒకరికొకరు ప్రత్యక్షంగా సహకరించుకునే సంస్కృతి ఇది. ఈ బంధం బాంధవ్యం ఉన్నతికి దోహదపడాలే గాని అవి నిర్బంధం కాకూడదు. అక్రమాలకు హింసలకు హత్యలకు అది తావీయకూడదు. ఈ అంశాలన్నీ మనం ఈ సందర్భంగా గ్రహించి ముందుకు వెళ్లాలి. మనం మనలోని అహం పదార్థాన్ని సమూలంగా తొలగించుకొని దైవాన్నే బ్రహ్మాన్నే భర్తగా తెలుసుకుందాం, గ్రహిద్దాం, పొందుదాం, జీవిద్దాం. ఆ బ్రహ్మంలోనే ఆ బ్రహ్మంతోనే విశ్వాత్మతోనే జగత్పతితోనే కలిసి మెలసి వెలుగొందుదాం.

మూడు ప్రభువు, అండాండ పిండాండ బ్రహ్మాండ నాయకుడు విశ్వ సామ్రాట్టు అయిన దైవమే విశ్వానికి ప్రభువు. అతను ఒక్కడే, ఏకం సత్ ప్రపంచం అతని పాలనలోనే ఉంది, ఉంటుంది. కేవలం ఏ ఒక్క రాజ్యానికో ఏ పరిమిత ప్రాంతానికో ఏ కొంతకాలమో ఉండే పదవిని ప్రభువు అని తమను తామే గొప్ప అనుకొని భ్రమించే వారి కోసం ఈ శ్లోకం. నశ్వరమైన దేహంతో కూడుకొని ఉన్న మీరెవ్వరూ ప్రభువులు కాదు, ఈ విశ్వానికి నేనే విధాత ప్రభువును అని శాసిస్తున్నాడు జగద్గురువు. ప్రభువు పుట్టకముందు కూడా ప్రభుత్వము ఉంది కదా. ఈ చిన్నపాటి ఇంగిత జ్ఞానం లేక మనిషి అల్ప స్వల్పకాలికమైన పరిమిత ప్రాంతానికి తానే ప్రభువు అని తమలో తాము పదవి వ్యామోహంతో విర్రవీగుతూ ఉంటారు. ఇలాంటివారు బాహ్యంలో శాసించగలరు గాని తమతమ అంతరాన్ని శాసించలేరు కదా. భూత వర్తమాన భవిష్యత్తు వాటికి అతీతమైన కాలాతీతం లోనూ ఉండే కాలాంతక కాలాతీత కాలుడు ప్రభువు

భూత భవ్య భవత్ ప్రభువు సర్వలోకాధీశుడు సర్వేశ్వరుడు. అధికారంతోనూ దోచుకునే గుణంతోనూ ప్రజలను ఇబ్బందులకు గురి చేసేవారు ప్రభువులు పాలకులు కారు. సమస్త జనుల్ని సంరక్షించే వారే ప్రభువులు, పాలకులు.

నాలుగు సాక్షి, ప్రాణులు చేసిన చేస్తున్న చేయని కర్మలను తటస్థంగా ఉండి వీక్షించేవాడు భగవంతుడు. సమస్తాన్ని మరొక దాని సహాయం లేకుండా దర్శించేవాడు నిలిపేవాడు సర్వ జగత్ సాక్షి. ఇతనే మన కృత్యా కృత్యాలను సాక్షిగా వీక్షిస్తాడు. కాబట్టే గతి రూపంలో నిలిచి కర్మఫలాలను ప్రసాదిస్తాడు. ఎవరికి వారుగా చేసుకున్న కర్మల ఫలితాలు ఎవరికి వారే తెచ్చుకుంటారు. అందుకు సదా సాక్షి మాత్రుడే దైవం. సమస్త జగత్తును అధ్యక్ష స్థానంలో ఉంటూ సాక్షిగా వ్యవహరిస్తున్న దైవం సాక్షి.

ఐదు నివాసః, సర్వజీవులకు భగవంతుడే నివాస స్థానం. బ్రహ్మాండములన్నీ అతని కుక్షి యందే వర్తిస్తూ ఉంది. అన్నీ ప్రాణుల ప్రాణానికి నివాస స్థానం భగవంతుని నివాసం. ఉన్నదానికి లేమి లేదు ఆ ఉన్నది దైవమే సమస్త జగత్తు దైవంలోనే నివసిస్తూ ఉంది.

ఆరు శరణం, భగవంతుడే పరమ శరణ్యుడు, రక్షకుడు ఆర్తిని పోగొట్టేవాడు కనుక శరణం.

ఏడు సుకృత్, ప్రత్యుపకారం ఆశించకుండా ఉపకారం చేసేవాడు సుహృత్ మిత్రుడు అతనే పరమేశ్వరుడు. ఈ అంశాన్ని 6-9 శ్లోకంలోనూ 5-29 లోనూ చూసాం. ఇలా సర్వజనులకు శాశ్వత మిత్రుడు శాశ్వతుడు దైవమే.

ఎనిమిది ప్రభవ ప్రలయ స్థానాలు. అలలు సముద్రం నుంచి పుడతాయి ఆ పుట్టిన అలలు ఉన్నంతవరకు ఉండి మళ్ళీ సముద్రంలోనే విలీనం అవుతాయి. అలలకు ప్రభవ ప్రళయ స్థితి స్థానం సముద్రమే. అదేవిధంగా జగత్తు యొక్క సృష్టి స్థితి లయ కారకుడు ఆ పరమాత్మే. సూదంటురాతి చెంత సూదిలా ఈ సమస్త ప్రపంచం దైవ సన్నిధానంలో క్రియావంతమవుతూ ఉన్నది. జగత్తు పుట్టే స్థానం ప్రభవస్థానం అలా పుట్టిన జగత్తు తిరిగి అక్కడ లయిస్తుందో అది ప్రళయ స్థానం. రెండూ ఒకే చోటే కదా, ఈ రెండింటి మధ్య జరిగే స్థితి స్థానం కూడా దైవమే.

తొమ్మిది నిధానం, అంటే నిధి లేదా నిక్షేపం. విలువైన వస్తువులను దాచి ఉంచే లేదా నిల్వ చేసే స్థానాన్ని నిధి లేదా నిధానం అంటారు. సదా సమస్త జగత్తు లోని సమస్తంలోనూ నిక్షిప్తమై ఉన్నవాడు. మనం చేసే ప్రతి కర్మ దాని ఫలితం కూడా అక్కడ నిక్షిప్తమై ఉంటాయి. అందుకే అందుకు తగిన ఫలాలు మనకు అందుతూ ఉంటాయి. నిధానమైన భగవంతునిలో ప్రళయంలో లయించినవన్నీ తిరిగి పుడుతున్నాయి. అవన్నీ భగవంతునిలోనే నిక్షిప్తమై ఉంటాయి. అందుకే నిక్షిప్తంగా ఉండే స్థలం నిధానమైన భగవంతుడే.

పది అవ్యయబీజం, నశించని బీజం కావడం చేత పరమేశ్వరుడు అవ్యయబీజం. జగత్తు సంసారానికి బీజం పరమేశ్వరుడే, బీజంలో అంకురించే శక్తిగా ధర్మం గా ఉన్నది ఆ శక్తే. అంకురానికి కారణమవుతున్నది అవ్యయబీజమే. ఏ బీజమైనా అంకురించగానే మొలకెత్తగానే నశిస్తుంది. కానీ ఈ బీజం నశించదు, అందుకే అవ్యయబీజం అన్నారు. 7-10 లో బీజం మాం సర్వభూతానం అన్నచోట మనం అవ్యయ బీజంగానే చర్చించాం.

9అ, 19శ్లో.

తపామ్యహమహం వర్షం నిగృహ్ణామ్యుత్సృజామి చ |

అమృతం చైవ మృత్యుశ్చ సదసచ్చాహమర్జున |19|

ఓ అర్జునా! సూర్యరూపమున నేనే తపించు చున్నాను. సముద్రముల నుండి నీటిని గ్రహించి, వర్షరూపమున మఱల కురిపిస్తున్నాను. అమృతమును, మృత్యువును గూడ నేనే. సత్తును (శాశ్వతమైన ఆత్మను) అసత్తును (నశ్వరమైన సమస్త వస్తుజాలమును) గూడ నేనే.

సమస్త జగత్తుకు జగత్తులో జరిగే సమస్త క్రియలకు ఆధారంగా ఉన్నది పరమాత్మేనని సాధారణ స్థాయి మనిషికి సైతం ప్రత్యక్ష ప్రమాణంగా అవగాహన గావించడానికి జగద్గురువు దృష్టాంతంగా ఉదాహరణగా ఈ శ్లోకంలో మూడు రకాల క్రియలను తీసుకొని వివరించారు. ఒక భావాన్ని అర్థం

చేసుకోవడానికి వీలుగా మరొక అంశాన్ని భావాన్ని అద్దంలో చూపినట్లు చూపి అర్థం చేయించడం అనే దృష్టాంత పద్ధతిలో చెప్పిన శ్లోకం ఇది.

యావత్ విశ్వానికి స్ఫూర్తి ప్రదాత అయిన పరమేశ్వరుడు సూర్యునిలో నిలిచి వెలుగును వేడిని అనుగ్రహిస్తున్నాడు. సూర్యుని వల్లనే వర్షం కురుస్తోందని స్మృతి వాక్యం. పరమాత్మ సూర్య దేవుడి ద్వారా తన వేడితో జగత్తును ఉడికిస్తూ తన వెలుగుతో విశ్వాన్ని వెలిగిస్తూ జగత్తుకు జీవనాన్ని జీవాన్ని ప్రసాదిస్తున్నాడు. ఆవిరయ్యే సాగర జలాలు ఉప్పునీరు, వాటిని సూర్యకిరణాల ద్వారా చేదుకొని ఆకాశంలోనే ప్రయోగశాలను నిర్మించి ఉప్పునీటిని మంచినీరుగా చల్లని తీయని పానీయంగా మార్చి ఆ పావన జలాన్ని మనకు అందిస్తున్నాడు. ఇది మనకు అర్థమైతే పరమాత్మ విశ్వరూప మహత్తు మనకు అనుభవం అవుతుంది. ఈ వేడి వెలుగు నీరు వర్షం ఇవన్నీ కూడా కాలం మీద ఋతువుల మీద ఆధారపడి ఉన్నాయి. కాబట్టి ఋతువులు కాలం అంత దైవమే. సూర్యమండల అంతర్వర్తి అయిన నారాయణుడే ఈ కార్యాలన్నీ నిర్వహిస్తున్నారు. నదిలో నీళ్లు ఉంటాయి చెట్లో పళ్ళు ఉంటాయి, భూమిలో సారం ఉంటుంది. అలాగే ఆంతర్యపు స్వర్గంలో అమరత్వముంది, ఉంటుంది, అమృతం కూడా ఉంటుంది, సర్వాంతర్యామి ఉంటాడు. మనం ఆ అమృతంలో స్వర్గంతో గమిస్తే మనం సదా అమృత మయులమే. అలా అమృతంలో దైవంతో జీవంతో ఏకం కానిది మృతం. మృత్యువు వేరు మృతం వేరు. మృత్యువు మంగళకరమే శివ స్వరూపమే. అమృతం మృత్యువు రెండూ ఈశ్వరుడే. ఆత్మను వీడే దేహం లేదా మరణ ప్రక్రియ మహేశ్వర స్వరూపమే. అయితే జీవితం అనేది జీవించేది మన హృదయాల్ని అమృతమయునితో ఏకం చేసినప్పుడే మృత్యోర్మా అమృతంగమయ అవుతుంది. కాబట్టి జీవితాన్ని అమృతమయం చేసుకోవాలి జీవించాలి. తగిన సమయం ఆసన్నమైనప్పుడు దేహం తనకు తానుగా విడిపోతుంది, ఆ వీడిపోయే విధానాన్ని నియతిని ఏర్పరచింది కూడా దైవమే. ఇలా ఈ అంశాన్ని అర్థం చేసుకోవాలి. సూర్యుడు తనకు తానుగా ఉదయిస్తాడు తనకు తానుగా అస్తమిస్తాడు. అలాగే జీవం జీవాన్ని ప్రాణాన్ని పోసుకోవడం దేహం దేహాన్ని వీడటం అంతా కూడా దైవనియతి ప్రకారమే జరుగుతుంది. అయితే ఈ మధ్యలో జీవితాన్ని దైవంతో మమేకం చేసి అద్భుతంగా ఆనందమయంగా జీవించి దైవాన్ని తెలుసుకునే

బాధ్యత మనిషిదే. మనిషి అలా కాక అటు మరణించక ఇటు జీవించక మృతప్రాయంగా మృతంగా ఉండిపోతున్నాడు. అందుకు కారణాలు అనేకం, ఈ అనేకమైన కారణాలన్నీ కూడా అజ్ఞానమే అవిద్యే అని చెప్పక తప్పదు. ఇలాంటివి మనం గమనించి సవరించుకోవాలనేటటువంటి ఉద్దేశంతోనే జగద్గురువు ఇలాంటి శ్లోకాలను మన ముందు ఉంచారు. ఇదే అమృతం చైవ మృత్యుశ్చ.

ఇక సత్తు అసత్తు అన్నారు, ఈ అంశం 2-16, 2-24 లోనే నిర్ధారణ జరిగింది. ఉన్నది ఉండేది ఉంది అనేది సత్తు. అది సదా ఉంది ఉంటుంది. ఉన్నదానికి లేమి లేదు, లేనిది ఎంత ఉందనుకున్నా అది లేనిదే. కాబట్టి ఉన్నది ఉంది లేనిది లేదు. ఉంది అనేది సత్తు, లేనిది అసత్తు. ఈ రెండింటి సూక్ష్మార్థం తెలియక లేని దాన్ని ఉన్నట్లు, ఉన్నదాన్ని లేనట్లు భావించి భ్రమించడం వల్ల సమస్యగా సంఘర్షణగా అనిపిస్తూ ఉంటుంది. కాబట్టి సత్తు అసత్తుల స్థూల సూక్ష్మ అర్థాలు మనకు ప్రత్యక్ష ప్రమాణంగా తెలిస్తే సరిపోతుంది. అప్పుడే సత్తు అసత్తు నేనే అనే మాట అనుభవమవుతుంది. అంతేకానీ దైవం అసత్తు అని మృతప్రాయం అని కాదని గ్రహించాలి. ఇలా అమృత స్వరూపుడైన సద్వస్తువైన పరమాత్మను రాజవిద్య రాజగుహ్యంతో యోగమై తెలుసుకుందాం.

9అ, 20శ్లో.

త్రైవిద్యా మాం సోమపాః పూతపాపా యజ్ఞైరిష్ట్వా స్వర్గతిం ప్రార్థయంతే ।

తే పుణ్యమాసాద్య సురేంద్రలోకమ్ అశ్నంతి దివ్యాన్ దివి దేవభోగాన్ ॥ 20 ॥

ఋగ్యజుస్సామవేదములచే ప్రోక్తములైన సకామకర్మలను చేయువారును, సోమరసపానము చేయువారును, పాపరహితులై యజ్ఞముల ద్వారా నన్ను సేవించి, స్వర్గప్రాప్తిని కోరుచుందురు. అట్టి పురుషులు తమ పుణ్యఫల రూపమైన స్వర్గలోకమును పొందుదురు. అచ్చటి దేవతల దివ్యభోగములను అనుభవింతురు.

ఇక్కడ త్రైవిద్యాః సోమపాః అనే రెండు శబ్దాలు ఇప్పటివరకు మనకు 9 అధ్యాయాల్లో పరిచయం లేనిది. ఇదే అధ్యాయం 17వ శ్లోకం లోనే ఋక్సామ యజురేవచ అని మూడు వేదాలను మాత్రమే పేర్కొన్నారు. ఈ అంశం అక్కడ ఇక్కడ విడిచిపెట్టినా మళ్లీ 21వ శ్లోకంలోనూ త్రయీధర్మం అని ఉండటం వల్ల ఈ మూడు వేదాలు ఏంటి మనకు తెలిసిన నాలుగు వేదాలు ఏంటి అనేటటువంటి అంశాన్ని ఇక్కడ చూడాల్సిన అవసరం ఉంది. ఎక్కడికక్కడ ఈ అంశాల్ని సవివరంగా తెలుసుకుంటూ వెళ్ళినప్పుడే సంపూర్ణంగా బ్రహ్మవిద్యను అభ్యసించగలం. ఈ మూడు వేదాల విషయాన్ని తేటతెల్లం చేయాలని ఇక్కడ మళ్లీ జగద్గురువు త్రైవిద్యాః అంటున్నారు. వేదాలకు శృతి అనుశ్రవం త్రయీ సమం న్యాయం స్వాధ్యాయం ఆగమం నిగమం అనే పేర్లు ఉన్నాయి. ఇందులో త్రయీ అనే పేరు ఉంది. శృతి అంటే గురువు ఉచ్చరించిన దాన్ని విని అదేవిధంగా శిష్యుడు స్వయంగా ఉచ్చరిస్తూ నేర్చుకుంటాడు. అనుశ్రవం అంటే గురువు ఉచ్చరించిన దాన్ని సరిగ్గా తిరిగి అదే విధముగా శిష్యుడు ఉచ్చరిస్తూ నేర్చుకోవడం. త్రయీ అంటే ఋగ్వేదము యజుర్వేదము సామవేదములను కలిపి అంటారు. సమం న్యాయం అంటే ఎల్లప్పుడూ అభ్యసింప బడునవి అని అర్థం. నిగమం అంటే భగవంతుని నిశ్వాస రూపంలో బయలుపడేవి అని యాస్కుడు వీటిని నిగమం పేరుతో వ్యవహరించాడు. ఆగమం అనడానికి కారణం కూడా ఇదే. ఆం న్యాయము అంటే మళ్ళీ మళ్ళీ ఆవృతి లేదా మననం చేసుకుంటూ నేర్చుకునే విద్య. స్వాధ్యాయం, స్వ అధ్యయనం అంటే మనల్ని మనం విశ్లేషించుకుంటూ నేర్చుకోవడం. వేదంలోని ఋక్కులు యజస్సులు, సామలు అన్నీ కలిసి ఒకే వేద రాసిగా ఉండేది. ఎవరైనా వేదం నేర్చుకోవాలంటే మొత్తం వేద రాసిని అధ్యయనం చేయాల్సిందే. కృతయుగం నుండి ద్వాపరయుగం వరకు వచ్చేసరికి వేదరాశిని అధ్యయనం చేయాలంటే కష్టమని మొదట కలగలుపుగా ఉన్న వేద రాశిని వేదాలను వ్యాస మహర్షి ఒక క్రమం ప్రకారం ఋక్కులన్నింటిని ఋక్సహితంగానూ యజస్సులన్నింటిని యజు సహితంగానూ సామలన్నింటినీ సామ సహితంగానూ విడదీసి లోకానికి అందించాడు. అలాగే ఈ మూడు వేదాల్లోని అధర్వ మంత్రాలన్నీ ఒకచోట చేర్చి అధర్వ సహితంగా రూపొందించారు. వేదవ్యాస మహర్షి భగవంతునికి చేరువయ్యే భగవంతుని తెలిసే విద్యను అందించడం వల్ల పూజనీయుడు

అయ్యాడు. అలా మనకు నాలుగు వేదాలు లభించాయి. ఋగ్వేదము యజుర్వేదము సామవేదము అధర్వణ వేదము. వీటిని పైళుడు, వైశంపాయనుడు, జైమిని, సుమంతుడు అనే వారికి ఉపదేశించారు. వారు తమ శిష్యులకు బోధించారు. అలా గురు శిష్య పరంపరగా ఈ నాలుగు వేదాలు వేల సంవత్సరాలుగా తరతరాలకు సంక్రమిస్తూ వచ్చాయి. ఋగ్వేదము ఋక్కుల రూపంలో ఉంటుంది. వేదాలలో ఇది మొదటిది దేవ వేదంగా ఇది ప్రసిద్ధి. ఇందులో ధ్వని తరంగాలు నీటి నుండి విద్యుత్తును తయారు చేయవచ్చు అనేటటువంటి సమస్త విషయాలు ఇందులో ఉన్నాయి. మేఘాల నిర్మాణం దానికి పట్టే సమయం లాంటివన్నీ కూడా ఇందులోదే. సూక్ష్మాతి సూక్ష్మమైన శస్త్ర చికిత్సలు గణిత శాస్త్రపు మూలాలన్నీ కూడా ఋగ్వేదంలోనివే. యజుర్వేదంలో యజ్ఞ యాగాదుల నిర్వహణ విధానం మొదలైన అనేక అంశాలు యజుర్వేదంలో చోటుచేసుకున్నాయి. ఇక గానం ప్రధానమైనది సామవేదం పవిత్ర గానాల వేదంగా ఇది ప్రసిద్ధి. ఈ మూడు వేదాలలోని కొన్ని మంత్రాల సంకలనమే ఆధర్వణ వేదం. అందుకు వేదాలను జగద్గురువు త్రై త్రై విద్యాః అని సంబోధిస్తున్నారని మనకు తెలియాలి. 3 వేదాలను అధ్యయనం చేసిన వారు కర్మకాండను సకామ భావంతో ఆచరించే ఆ యజ్ఞ యాగాదుల ఫలమైన సోమరసాన్ని పానం చేసిన వారు తాగిన వారు లేదా పొందినవారికి పాపాలన్ని శుద్ధి జరుగుతాయి. అయితే వారు కూడా ఆ రసాన్ని స్వీకరించి స్వర్గం కోసమే ప్రార్థిస్తున్నారని జగద్గురువు ప్రస్తావన. దివ్య దేవలోక భూకాలను కోరుకుంటున్నారు అందుకనే ఇక్కడ జగద్గురువు ప్రార్ధయంతే అంటున్నారు. వారు స్వర్గలోక పదవిని ఎంతో ఆసక్తితో ప్రార్థిస్తున్నారని తేల్చి చెప్పారు.

ఎవరు ఏది కోరుకుంటే అదే మనకు అందుతుందని 7-21 లోనూ సకామ భక్తుడి భక్తిశ్రద్ధలకు అనుగుణంగానే అతడికి ఆయా భోగాలు నా అనుగ్రహం వల్లనే ప్రాప్తిస్తాయని 7-22 లో చూసాం. వేదంలో పేర్కొన్న యజ్ఞ యాగాదులను కూడా ఆధ్యాత్మిక మార్గంలోకి మరలడానికే గాని మరొకటి కాదు. ప్రతి మనిషి ఏదో ఒక రోజు సకామ కర్మను శబ్ద బ్రహ్మాన్ని దాటి నిష్కామ కర్మను చేపట్టవలసిందే. ఆ పని ఎంత శీఘ్రంగా జరిగితే అంత మేలు. నిజానికి పాపక్షయానికి ఉపయోగపడే వేదోక్త కర్మలన్నీ కూడా మోక్షమార్గానికి బాటలు

వేసేవే. అయితే మన భావన అక్కడికే ఆగిపోవడం వల్ల ఈ పరిస్థితి. అందుకే 14వ శ్లోకంలో గమ్యం తెలియని పూజల్లో జపతప శ్రోత్రాల్లో కూరుకుపోకుండా అవగాహనతో కూడిన పూజాది క్రియలు నిర్వహించాలని మనం చర్చించాం. 3 వేదాలు తెలిసినవారు కూడా సోమపానం చేసి పాపాలు కడిగేసుకున్నవారు యజ్ఞాల చేత నన్ను సేవించి స్వర్గగతిని కోరుతారు. వారు పుణ్యం చేసుకొని దైవలోకం చేరి దేవతా భోగాలను అనుభవిస్తారు. చతుర్విధ పురుషార్థాలలోని ధర్మార్థ కామ మోక్షాలను తెలియడానికి వాటి సాధనకు అనువైన విలువైన విషయ పరిజ్ఞానం అంతా కూడా వేదాల్లో ఉంది. అయితే మోక్షానికి పరమపదానికి మరో అవ్యక్తానికి సంబంధించిన అక్షర పరబ్రహ్మాన్ని పొందే తత్వం అనేది వేదోక్త జ్ఞానంతో స్వయంగా స్వాధ్యాయం ద్వారా స్వీయ పరిశీలన ద్వారా అలవడాలి. తనను తాను శృతి చేసుకుంటేనే తనతో తాను శృతి కలిపితేనే తనలోకి తాను వెళితేనే ఆ జ్ఞానం బోధపడుతుంది. అందుకే మనం ఆంతరంగపు స్వర్గం అని ముందు శ్లోకంలో చూసాం. వేదోక్త జ్ఞానంతో వేద త్రయాన్ని చదివిన వారు సైతం అలా వేదపు ల్లోతుల్లోకి వెళ్ళక పై పైన చదివి సకామ భావంతోనే అందులోని ప్రక్రియ ప్రకారం ఆయా యజ్ఞాలు అగ్నిష్టోమ అతి రాత్రాది యజ్ఞాలు క్రతువులు ఈ యజ్ఞాలు క్రతువులు మాత్రమే ఆచరించి వాటి ద్వారా దేవతల్ని ఆరాధించి స్వర్గాది పుణ్య లోకాలను పొందాలని ప్రయత్నిస్తారు. కారణం వారు దైవ లోకమే పరమపదం అనే పరిమిత జ్ఞానం కలిగి ఉండటమే. అక్షర పరబ్రహ్మకు అవగాహన అసలు లేకపోవడం. వీరు ఆచరించే యజ్ఞాలలో దైవానికి అర్పించిన తరువాత ఆ సోమరసాన్ని పానం చేసి పాపాలను పోగొట్టుకొని శుద్ధిపడుతారు. తద్వారా పుణ్యలోక ప్రాప్తిని వాంఛించి స్వర్గాన్ని పొందుతారు. వీరు స్వర్గం అనే శబ్దానికి మూలార్థం తెలియనివారు. స్వః గం స్వయంగా తనలోకి తాను గమించి అంటే పయనించి స్వస్వరూపాన్ని సాక్షాత్కరించుకొని అక్షర పరబ్రహ్మాన్ని పొందడమని తెలియని వారు. స్వర్గం అనే విస్తృతమైన శబ్దాన్ని పరిమితార్థంలో భావించే త్రైవిద్యాపరులు వీరు.

కాబట్టి వేద జ్ఞానంలో శబ్దాన్ని దాటిపోయే విశ్వవ్యాపక దృష్టితో విశ్వమానవుడుగా దేవుడిగా జగద్గురువుగా విహరించాలి. ఇది జగద్గురువు ప్రయోగించినటువంటి త్రైవిద్యాః శబ్దంలోని ఆంతర్యం.

ఇక ఇంతకు సోమపానం అంటే ఏంటి సోమపాః అనే శబ్దపు గుడార్థం తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. సోమవల్లి అనేది ఒక ఔషధపు తీగ దాని రసాన్ని సోమరసం అంటారు. దానిని యజ్ఞ యాగాదులలో దేవతార్పణం చేసి ఆ రసాన్ని ప్రసాదంగా స్వీకరిస్తారు. కలియుగంలో చేయదగిన యాగాలు సప్త సోమ యాగాలు. అగ్నిహోత్రంతో సశాస్త్రీయ సనాతన భారతీయ వేద విజ్ఞానం ద్వారా ప్రకృతిలోని జీవశక్తిని పెంచుటకు సోమలత నుండి తీసే సోమరసాన్ని ప్రకృతికి దేవతలకు సమర్పించడం సోమయాగం. సోమ అనగా చంద్రుడు, స ప్లస్ ఉమ, సా అంటే కూడినది ఉమ అంటే శక్తి ఈశ్వరుడు శక్తితో కూడినవాడు అని అర్థం. శివుడు శక్తి సహితుడు పదార్థాన్ని శక్తిని కలిపి సంధానపరచేటటువంటి చాంద్రీయ శక్తి సోమలత. ఇది ఒక లత అంటే తీగ భూమండలంపై ప్రతి ఒక్క ఔషధి చంద్రశక్తి వల్లనే పెరుగుతుంది. చంద్రుడు మనః కారకుడు చంద్రకాంతి ప్రకృతిని జీవుల మనసును ప్రభావితం చేస్తుంది. చంద్రకళలతో సమానంగా పెరుగుతూ సమానంగా తరిగే ఏకైక ఔషధీరాజ్యం సోమలత. అమితంగా చంద్రశక్తిని గ్రహించే ఏకైకలత సోమలత. సోమలత హిమాలయాల్లోనూ దక్షిణ భారతదేశంలోనూ కొంకణ ప్రాంత అరణ్యాలలో లభిస్తుంది. సోమయజ్ఞ నిర్వహణ అంటే సాధారణమైన సత్య వ్రతం తిరుకళ్యాణం రుద్రాభిషేకం నిత్యపూజ లాంటి భక్తి మార్గంలో చేసేవి కావు. అవి మనసుని భగవంతుని వైపు మరల్చే మహా యజ్ఞాలు. మన దేహానికి రోగం వస్తే మందు తిని తిరిగి ఆరోగ్యాన్ని పొందినట్లే దేశానికి అరిష్టం వచ్చినప్పుడు లేదా అరిష్టం రాకుండా కాపాడటానికి యజ్ఞాలు యాగాలు ఆచరించి దేశానికి అరిష్ట నివారణ చేయాల్సిన అవసరం ఉంది. శరీరంలో వచ్చే మార్పులను ఎలా తెలుసుకుంటామో దేశ కాలగమనంలో మార్పుల మాయాజాలన్ని గ్రహించి దేశ రక్షణ చేయడమే యాగం. ప్రకృతిపై ఎప్పుడూ వికృతి దాడి చేస్తూనే ఉంటుంది. చాలా రకరకాలైన అంటూ వ్యాధులు సూక్ష్మజీవుల వల్ల కలిగే రోగాలు మొదలైనవి మానవ శరీరంపై ఇలాంటివి పేర్లు మార్చుకొని ప్రతి నిమిషం 50 లక్షలకు పైగా సూక్ష్మ క్రిములు దాడి చేస్తూనే ఉంటాయి. ఆశక్తి మనకు తగ్గినప్పుడు రోగగ్రస్తులమవుతాం. దేహం, దేశం రెండూ ఒక్కటే. ఏ జీవి ప్రయత్నించని విధంగా మానవుడు వివిధ ఆయుధాలతో అణుశక్తి విస్ఫోటన శక్తితో ప్రపంచంలోని జీవకణశక్తిని నాశనం చేయడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. అలాంటి వినాశకర ఆలోచన విధానాన్ని మార్చడానికి చంద్ర

సంబంధమైన సోమలతతో అత్యంత కఠోర నియమావళితో చేయు మానవ ప్రయత్నమే సోమయాగం. ఏ యజ్ఞమైనా ఏ యాగమైనా ప్రకృతి సంరక్షణే దేశ క్షేమమే. అది ఓ ఔషధం జాతి మనుగడకు దేశ క్షేమానికి అవసరమైనది. అంతేకానీ అదే ముక్తి మోక్షం కాదు. సోమరసం దగ్గర ఆగిపోకుండా అక్షర బ్రహ్మానికి విస్తరించి విశ్వవ్యాపకులు కావాలి. అక్షర బ్రహ్మానికి విస్తరించి విశ్వవ్యాపకుడు కావాలి, వాసుదేవత్వం పొందాలి. అదే తిరుగులేని తిరిగి రాని విద్య, బ్రహ్మ విద్య. సోమయాగం ఆచరించడం వల్ల ప్రకృతికి ఏది అవసరమో అది తప్పనిసరిగా ప్రాప్తిస్తాయి. ఆవు నేటితో హోమం చేస్తే ప్రాణవాయువు పెరుగుతుంది. సోమరసంతో హోమం చేస్తే ప్రకృతిలోని సమస్త మూలకణాలు శుద్ధి చేయబడి జీవశక్తి పెరుగుతుంది. సోమయాగం జరిగిన చోటే కాక హోమ ధూమం వెళ్ళిన చోట అంతా కూడా స్వచ్ఛమైన గాలి ఉంటుంది, భూమిలో ఖనిజశక్తి కూడా పెరుగుతుంది, సకాలంలో వర్షాలు పడుతాయి, జీవజాతులలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. హానికరమైన సూక్ష్మ క్రిములు ఉండవు, ఆవులు గేదెలు పాలు ఎక్కువగా ఇస్తాయి, పాలలో పోషక విలువలు కూడా పెరుగుతాయి. పంటలు బాగా పండుతాయి. ప్రమాదాలు కూడా తగ్గుతాయి, ఆలోచన దుష్ప్రవర్తన ఉండదు. ఇదంతా కూడా సశాస్త్రీయ మైనటువంటి పరిశోధనాత్మక మైనటువంటి నిరూప ణాత్మకమైనటువంటి అంశాలు. ఈ యాగం ద్వారా ఉగ్రవాదాలు వైపరీత్యాలు అతివాదాలు మొదలైన వాటి నుండి కూడా మనకు సంపూర్ణ సంరక్షణ ఉంటుంది. ఈ సోమలత హిమాలయాలకు ఉత్తరంగా ఉన్న మూజవంత పర్వతంలో దొరికేది, ఈ పర్వతం అనంతర కాలంలో ఇదే కైలాస పర్వతంగా రూపాంతరం చెంది ఉండవచ్చు. మూజవంతం రుద్రుడికి వాసభూమి సోమపానం వల్ల ఆనందము బలము లభిస్తాయి. భారతదేశంలో యజ్ఞం చేస్తే విశ్వశాంతి కలుగుతుందని ప్రపంచం యొక్క ప్రగాఢమైనటువంటి విశ్వాసం వాస్తవం కూడా. భరతులు అంటే యజ్ఞం చేసేవారని అర్థం. మనం నోటితో తిన్న ఆహారం కడుపులో చేరి శరీరంలోని అన్ని అవయవాలకు కావలసిన శక్తిని ఇచ్చినట్లే సమస్త భూమండలానికి ప్రధాన మధ్య భాగమైనటువంటి భారతదేశంలో యజ్ఞ్యాగాదులు ఆచరించడం వలన ఆ జీవశక్తి విశ్వమంతా వ్యాపించి విశ్వశాంతిని కలుగజేస్తుంది. ఇదే సోమయజ్ఞం సోమయాగం సోమరసం సోమపానం ఫలితం. ఈ అవగాహన లేని సాధారణ స్థాయి మనుషులు

త్రైవిద్యాపరులు. ఇదే అంతిమ లక్ష్యంగా భావిస్తున్నారనేది జగద్గురువు ప్రత్యేకంగా ఈ శ్లోకంలో నొక్కి వక్కాణించిన అంశం. ఆ సోమరసాన్ని తాగి దైవశక్తితో తాత్కాలికంగా వారు పాపాన్ని శుద్ధి చేసుకున్న వారు అవుతారు. అయితే వారిని తిరిగి పాపపు పనులు చేయకుండా ఆపడం ఎలా అంటే అది అక్షర పరబ్రహ్మం ద్వారానే సాధ్యం. అందుకు సోమరసపు ఆంతర్యాన్ని సోమరసస్వరూప విశ్వరూపాన్ని మనం దర్శిస్తేనే అవగాహన చేసుకుంటేనే అప్పుడు మనం ఎక్కడున్నామో మనకు తెలియ వస్తుంది. పాపక్షయం జరిగి పుణ్యం ప్రాప్తించడం వల్ల ఆ పుణ్యఫలంగా దేవేంద్రాది లోకాన్ని చేరి దేవతలు అనుభవించే భోగాలను అక్కడ స్వర్గలోకంలో అనుభవిస్తారు. వీరు కూడా భక్తులే అయితే సకామ భక్తులు వేదత్రయాన్ని అధ్యయనం చేసిన వివేకం లేని కారణంగా మోక్షాన్ని విస్మరించి స్వర్గపు మోహంలో పడి కొట్టుమిట్టాడే వారు. పుణ్యం అనేది కర్మఫలం అనుభవించగానే నశిస్తుంది పుణ్యం వల్ల ప్రాప్తించే స్వర్గం అనిత్యం. స్వర్గంలో ప్రాప్తించే భోగాలు అశాశ్వతం. ఇక్కడ స్వర్గలోకం అనకుండా సురేంద్ర లోకం అనే పదాన్ని ప్రయోగించారు. సురలు అంటే దేవతలు కదా దేవతలు అక్కడ లభించే భోగాలు కూడా ఓ విధమైనటువంటి ఇంద్రియ సుఖాలే గాని మరొకటి కాదు. సురేంద్ర లోకం వేదాలలోని యజ్ఞ కార్యాల ద్వారా శుద్ధమైన బుద్ధితో దైవం వైపు పయనించి అక్షర పరబ్రహ్మాన్ని చెందాలి, పొందాలి. అలా కాక అక్కడికి ఆగిపోయి పునరావృత్తికి గురి అవుతూవున్న పరిస్థితిని జగద్గురువు మన ముందు స్పష్టం చేశాడు. అందుకే ఆగిపోయే వీగిపోయే ఆశాశ్వతంలో నిలిచిపోకుండా శాశ్వత పరబ్రహ్మ అవ్యయ అవ్యక్త పరంధామాన్ని మన ప్రయత్నంతో బ్రహ్మవిద్య అధ్యయనంతో భగవద్గీత మార్గంలో పొందుదాం. వేద జ్ఞానాన్ని సోమరసపు విశ్వరూప స్వరూపాన్ని చర్చించే అవకాశాన్నిచ్చిన ఈ శ్లోకానికి శిరస్సు వంచి నమస్సుమాంజలి సమర్పించుకుందాం.

9అ, 21శ్లో.

తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి |

ఏవం త్రయీధర్మమనుప్రపన్నా గతాగతం కామకామా లభంతే |21|

ఆ విశాలస్వర్గమునందు భోగములను అనుభవించి, పుణ్యములు అయిపోగానే (క్షీణింపగానే) మఱల మర్త్యలోకమున ప్రవేశింతురు. ఈ విధముగ స్వర్గప్రాప్తిసాధనములైన వేదత్రయవిహిత సకామ కర్మలను ఆశ్రయించువారు, భోగములను ఆశించుచూ స్వర్గమర్త్యలోకముల మధ్య రాకపోకలు సాగించు చుందురు. అనగా పుణ్యప్రభావముచే స్వర్గమునకు పోవుదురు. పుణ్యము క్షీణింపగనే మర్త్య లోకమునకు వచ్చెదరు.

త్రయీ ధర్మం అంటే ముందు శ్లోకంలో చర్చించిన త్రైవిద్యాః మూడు వేదాలను అధ్యయనం చేసిన వారు వేదోక్త ధర్మం తెలిసినవారు. 2-45 లోనే వేదపు ఆంతర్యాన్ని సమగ్రంగా చూసాం. 9-20 లోను సంక్షిప్తంగా చూసాం. 6-41లో పుణ్యలోకాలను చేరి అక్కడ అనేక సంవత్సరాలు వాసం చేసి పుణ్యమంతా క్షయం అయ్యాక తిరిగి మానవ లోకంలో జన్మ తీసుకుంటాడు అని చూసాం.

8 -16 లో బ్రహ్మలోకంతో సహా సమస్త లోకాలు పునరావృతాలే అని చూసాం. ఈ అంశాలన్నీ మనకు అవగాహన కావటానికి ప్రధానమైనటువంటి ఓ ప్రసిద్ధమైనటువంటి కథను ఉదాహరించుకొని ఈ అంశాన్ని అర్థం చేసుకుందాం.

ఆంధ్ర మహాభారతం అరణ్య పర్వంలోని ఓ కథ ధర్మరాజు మార్కండేయ మహర్షికి నమస్కరించి పుణ్యపురుషా! మీకంటే వయసులో వృద్ధులైన పురుషులు ఉన్నారా అని అడిగిన ప్రశ్నకు సమాధానంగా ధర్మరాజుకు ఇంద్రద్యుమ్నుని కథ చెప్పే ఘట్టం ఇది. ఇంద్రద్యుమ్నుడు అనే ఒక గొప్ప మహారాజు ఉండేవాడు. అతడు చిరకాలం స్వర్గలోకంలో చాలా సంతోషంగా నివసించాడు. చాలా కాలానికి లోకంలో అతని కీర్తి మాయమైపోవడం వల్ల దేవతలు ఆ ఇంద్రద్యుమ్నుడిని ఇక నీవు స్వర్గంలో ఉండజాలవు నీ పుణ్యం తరిగిపోయింది అని చెప్పి భూలోకానికి నెట్టి వేశారు. అంతలో ఆ మహారాజు మార్కండేయ మహర్షి దగ్గరకు వచ్చి ఓ పుణ్యాత్ముడా ప్రకాశించే పుణ్యాలు గల ఇంద్రద్యుమ్నుడను నేను అయ్యా నన్ను నీవు ఎరుగుదువా అన్నాడు. అప్పుడు మహర్షి అయ్యా నేను తెలుసుకోలేకపోయాను కానీ హిమాలయ పర్వత

శిఖరం దగ్గర నివసించే ప్రావారకర్ణుడు అనే పేరు గల గుడ్లగూబ వయసులో నాకంటే చాలా చాలా పెద్దది అందువల్ల అతడు నాకంటే నిన్ను గూర్చి నిశ్చయంగా తెలియగలడు అతడి దగ్గరకు పొమ్ము అని జవాబిస్తాడు. అంతట ఆ రాజు తనతో పాటు మహర్షిని రమ్మన్నాడు, అయ్యా ముసలితనంతో శక్తి నొసగే మాత్రను సేవించి ఉన్నాను అందువల్ల దేహతాపం కారణంగా కదల లేకుండా ఉన్నాను అని చెప్పాడు. అప్పుడు రాజు వెంటనే గుఱ్ఱపు రూపు ధరించి మహర్షిని వీపుపై ఎక్కించుకొని గుడ్లగూబ ఉన్న చోటికి వెళ్లి మహర్షిని అడిగినట్లే గుడ్లగూబను కూడా ప్రశ్నించాడు. ఆ గుడ్లగూబ కొంతసేపు యోచించి నాకు నీవు ఎవరవో తెలియ రాలేదు, ఇంద్రద్యుమ్నం అనే సరోవరం ఉన్నట్లు నాకు తెలియును. ఆ సరస్సులో నాళీకజంఘుడు అనే పేరు గల ఒక గొప్ప కొంగ ఉంది, ఆ కొంగ వయసులో చాలా చాలా పెద్దది. నిన్ను గూర్చి ఆ కొంగకు ఎరుగును అక్కడికి వెళ్ళుమని చెప్పింది. అంతట రాజు మహర్షిని, గుడ్లగూబను కూడా తన గుర్రపు వీపుపై ఎక్కించుకొని ఆ కొంగ దగ్గరకు వెళ్ళాడు. మళ్లీ అదే విధంగా తన పేరు చెప్పి తనను ఆ కొంగ ఎరుగునేమో అని ప్రశ్నించాడు. ఆ కొంగ తాను ఇంద్రద్యుమ్నుడిని ఎరుగను అని ఈ కొలనులో ఒక తాబేలు ఉంది, ఆ తాబేలుకు తెలిసి ఉండవచ్చు అని తాబేలును పేరు పెట్టి పిలిచి ఒక సందేహం తీర్చుకోవడానికై పెద్దలు నీ కడకు వచ్చారు. నీవు దయచేసి రమ్ము అని గట్టిగా పిలవగానే తాబేలు ఆ సరస్సు నుండి బయటకు వచ్చి కనిపించింది. ఇంద్రద్యుమ్న మహారాజును నీవు ఎరుగుదువా అని వారు ప్రశ్నించారు. ఆ తాబేలు కొంతసేపటికి జ్ఞాపకం తెచ్చుకొని కన్నుల నుండి నీరు కారుతుండగా గద్గద స్వరంతో వారిని చూసి ఇలా అంది, అయ్యో ఎంత మాట ఇంద్రద్యుమ్న మహారాజును నేను మరచిపోవటమా అతడు మహాత్ముడు గొప్ప గుణాల చేత అలంకరించబడినవాడు. ఆ మహనీయుడు అనేకసార్లు నన్ను అనేక ఆపదల నుండి కాపాడాడు. జనులలో శ్రేష్ఠుడై ఎంతో గొప్పతనాన్ని ఆర్జించిన ఆ ఇంద్రద్యుమ్నుని నేను సదా కృతజ్ఞతలతో స్మరించవలసి ఉన్నది. ఆ మహానుభావుడు ఎన్నో యజ్ఞాలు చేసి దక్షిణగా అనేక గోవులను బ్రాహ్మణులకు దానం చేశాడు. ఆ మహాత్ముడు దానం చేసిన వేలకు వేల గోవుల గిట్టల రాపిడికే కదా లోకం పొగుడుతున్న ఈ ఇంద్రద్యుమ్న మడుగు ఏర్పడడానికి కారణం అని తాబేలు చెప్తుండగానే దేవతల ప్రతినిధులు విమానాన్ని తీసుకొని

వచ్చి ఇంద్రద్యుమ్నుడితో మహాత్మా నీ యశస్సు లోకంలో ఎల్లప్పుడూ ఉంటుంది దయచేసి ఈ విమానం ఎక్కి స్వర్గలోకానికి రమ్ము. పాప రహితుడా ఈ లోకంలో తన యశస్సు ఎంత కాలం విలసిల్లుతుందో అంతకాలం నరుడు స్వర్గలోక సౌఖ్యాలను అనుభవిస్తాడు అని దేవతలు చెప్పగా విని దేవదూతలతో నాపని మీద ఈ ముదుసలి మహర్షిని ఈ ముసలి పక్షిని వారి సాయాన్ని కోరి తీసుకొచ్చాను కదా. వీరిని వారి వారి నెలవులలో దింపి రాగలను అని దేవతల అనుమతితో వారిని యధాస్థానాల్లో దింపి వేల్పుల విమానం ఎక్కి స్వర్గలోకానికి వెళ్లిపోతాడు. మానవ చిత్త ప్రవృత్తులకు ప్రతీకలే ఈ జంతు పాత్రలన్నీ కూడా.

ఈ అంశం ద్వారా మనకు ఈ శ్లోకం ప్రత్యక్ష అనుభవం కావడానికి ఈ ఉపాఖ్యానం ఎంతగానో దోహదపడుతుంది. స్వప్నంలో అపారమైన ధన సంపదలు ఇంకా ఏవో ఏవో చూస్తాం. కానీ మెలకువ రాగానే ఆ ధన సంపద అవన్నీ కనిపిస్తుందా, సరిగ్గా ఇదే విధంగా వేదజ్ఞులు కోరుకొని వారు పొందే స్వర్గ సుఖాలు కూడా మిథ్యే అవుతుందని తెలియాలి. గట్టి ధాన్యపు గింజను ఏరుకోవాలి కానీ మిగిలిపోయిన పొల్లును తూర్పార పట్టుట వల్ల నిష్ప్రయోజనం కదా. ఎంతటి వేదవేత్త అయినా నా శాశ్వత స్వరూప జ్ఞానం ప్రత్యక్ష ప్రమాణంగా అనుభవం కాకపోతే ఏమి ప్రయోజనం అన్నది జగద్గురువు ప్రశ్న. సకామ కర్మలను కోరికలను ఆశ్రయించిన వారు భోగాభిలాషులు తిరిగి తిరిగి మరణిస్తూ జన్మిస్తూ దుఃఖాలయంలో ఉంటారు. విశాలంగా ఉంటుందని భావిస్తున్న స్వర్గ లోకము శాశ్వత స్థితిని ప్రసాదించలేదు. మోక్ష ప్రయత్నం భూలోకంలోనే దేహధారణతోనే సాధ్యం అన్యాదా శరణం న అస్తి. అందుకే మానవజన్మ మహోన్నతమైనదని మనం తొమ్మిది అధ్యాయాలుగా చర్చిస్తున్నాం. 8-28 లోనే వేదోకమైన యజ్ఞ యాగాది కర్మకాండలకంటే జ్ఞానకాండమే ఉత్తమోత్తమమైనదనే సత్యం అనుభవం అవ్వాలి.

యజ్ఞ యాగాదులన్నీ కూడా మానవజాతి మనుగడకు మానవజాతి సంరక్షణకు సంస్కృతికి సంబంధించినవి. అంతేగాని రాకపోకలు లేని పోకకు పరిపూర్ణతకు సంబంధించింది కాదని ఈ శ్లోకం అద్దంలో చూపినట్లు స్పష్టంగా మనల్ని మన

ముందు ఉంచింది. స్వర్గాది భోగ భువనాల కంటే దివ్యమైనది ఉత్తమోత్తమమైనది ప్రత్యక్ష ప్రమాణమైనది అనుభవ జ్ఞాన యజ్ఞం.

నేననే అహం పదార్థ భావాన్ని వీడుదాం, నేననే దైవం యథార్థ భావంలో ఏకమవుదాం.

9అ, 22శ్లో.

అనన్యాశ్చింతయంతో మాం యే జనా: పర్యుపాసతే ।

తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ । 22 |

పరమేశ్వరుడనైన నన్నే నిరంతరము అనన్య భక్తితో చింతనచేయుచు, నిష్కామ భావముతో సేవించువారి యోగక్షేమములను నేనే వహించుచుందును. (అప్రాప్త వస్తుప్రాప్తిని 'యోగము'అనియందురు. ప్రాప్తించిన వస్తురక్షణమును 'క్షేమము' అని యందురు.)

అన్యం అంటే వేరైనది, అనన్యం అంటే వేరు కానిది. చింత అంటే ఆలోచన లేదా స్మరణ, అనన్య చింత అంటే భగవంతుని కన్నా అన్యంగా మరో ఆలోచనే లేకుండా ఉండే చింతలన్నింటినీ అంతం చేసే చింతకాంతక చింతన. ఇలా అనన్యమైన చింతకాంతక చింతనతో సదా పరమేశ్వరుడు జగత్పతి అక్షరం బ్రహ్మ పరమం అయిన పరంధామాన్ని చెందడానికి పొందడానికి ప్రయత్నించే అనన్య భక్తుల యోగక్షేమాలు నావేనని పరమాత్మ భరోసా. చూశారా దివ్యాత్మ స్వరూపులారా! భగవద్గీత పరాయణులకు ఎంతటి వైభవం.

ప్రపంచంలో స్థూలంగా మూడు రకాల మనుషులను మనం చూసాం.

ఒకటి భగవంతుని చింతన అసలు లేకుండా కేవలం బాహ్యదృష్టిని కలిగి ఉన్నవారు.

రెండు కొంతసేపు ధ్యానము పూజ చేసి మిగిలిన సమయం అంతా ప్రాపంచిక దృష్టితో ఉండేవారు.

మూడు దృశ్య పదార్థములన్నీ తుచ్ఛ పదార్థములుగా భావించి ధ్యానాధుల యందే మనసును ఆత్మస్థం చేసిన వారు. ఈ మూడవ రకం వారే అనన్య చిత్తులు. ఇలాంటి వారి యోగక్షేమాలు భగవంతుని దేనని ఇక్కడ పరమాత్మ ప్రతిజ్ఞ పూనుతున్నాడు. మన జీవిత పగ్గాలను దైవం చేతికిస్తే చాలు మన జీవిత యాత్రకు లోటు లేదు, ఉండదు. సంపూర్ణంగా మనోయోగపూర్వకంగా తనను తాను సర్వ సమర్పణం గావించిన వారే అనన్యచిత్తులు. ఏక నిష్టతో ఏక భక్తితో తన సమస్త జీవితము లక్ష్యము దైవమేయైన వారిపై దైవం కూడా శ్రద్ధ వహిస్తుందని మనకు అనుభవం కావాలి. తనకు తనువుకు జగత్తుకు అతీతంగా పరమేశ్వరుని స్మరణలో జీవించగలిగితే సరిపోతుంది. భక్తి యోగాన్ని జ్ఞాన యోగాన్ని రెండింటిని సమన్వయం చేస్తూ స్వీయ అనుభవ జ్ఞానాన్ని ప్రసాదించే శ్లోకం ఇది. దేహం దేశంలో చరిస్తున్నా కర్మలలో కదులుతున్నా భగవద్భక్తుని మనసులో మాత్రం భగవద్భావనే ఉంటుంది, భగవంతుడే ఉంటాడు. ఇదే అనన్య భక్తి అనన్యమైన చింతకాంతక చింతన. భగవంతుని భక్తి ప్రేమ అన్యమెరుగదు. మరో భౌతికపు చింతనను తనలో ఇముడ్చుకోలేదు. ఒకరి కళ్ళతో మరొకరు చూడలేరు కదా, ఎవరి ఆకలి వారిదే ఎవరి నిద్ర వారిదే, ఎవరి చూపు వారిదే, ఎవరి చింత వారిదే. అలా మనం చూసినప్పుడు భగవత్ చింతనకు భక్తికి ప్రేమకు ఎవ్వరూ అడ్డు కాదు కారు కాలేరు. అనన్య భక్తి ప్రేమతో కూడిన చింతకాంతక చింతనతో ఏకమైతే అన్య చింతలన్నీ వాటికవే జారిపోతాయి, రాలిపోతాయి. భక్తుని హృదయంలో ఉన్నది భగవంతుడే కాబట్టి భక్తుడు నిర్భయుడు. ఏ అవసరాలు చింతలు లేని వాడు. దైవంలోనే నిలిచి ఉన్నవాడు. అప్పుడు భక్తుడు భగవంతుని ఆధీనంలో భగవంతుడు భక్తుని ఆధీనంలో ఇద్దరూ ఒకరిలో ఒకరు ఏకమై దైవమే భక్తిగా భక్తే దైవంగా విరాజిల్లుతారు. అప్పుడు దైవ సంపద లేదా దైవ వైభవం అంతా యోగక్షేమాలు అంతా కూడా భక్తునిదే కదా. భక్తుని అవసరాలన్నీ కూడా భగవంతుడిదే అవుతుంది. అందుకే యోగక్షేమం వహామ్యహం. భగవంతుని పొందడం యోగం ఆ ప్రాప్తించిన దైవ యోగాన్ని పరిరక్షించుకోవడం క్షేమం. పసికందు ఆకలి తల్లికి తెలిసినట్లు భక్తునికి కావలసినవి భక్తుడు అడగకపోయినా భగవంతుడే చూసుకొని ఉండి కాచుకొని ఉండి మరీ తీరుస్తాడు. ప్రతి ఒక్కరూ తమ అవసరాల కోసం క్షేమం కోసం దైవాన్ని విస్మరించి పరుగులెడుతూ ఉంటారు. ఆ పరుగులు వల్ల ఆరాట

పోరాటాలే మిగులుతాయి. కానీ దైవమేమో నేనే నా భక్తుని యోగక్షేమాలు తీరుస్తాను అంటున్నాడు. ఆ పరుగులు ఆరాట పోరాటాలన్నీ భౌతిక అవసరాల చుట్టూనే తిరుగుతూ ఉండడం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. అందులో ఎక్కడే గాని దైవదృష్టి కనిపించదు. నాది నాకు అనే భౌతిక దృష్టే ప్రధానంగా కొనసాగుతూ ఉంటుంది. ఈ ఆరాట పోరాటాలలో కొందరు లేమితో కలవర పడుతుంటే మరికొందరు కలిమితో కుమిలిపోతూ ఉంటారు, లేనితనం ఓ విధమైన వేధింపు, ఉన్నతనం మరో విధమైన బాధింపు. ఆదాయం ఆరోగ్యం ఉద్యోగం సంతానం శాంతి ఇల్లు పెళ్లి జ్ఞానం లేదు లేదు అనుకుంటూ లేని వాటిని తలచుకొని బాధకు గురవుతూ ఉంటారు. ఇవన్నీ కూడా క్షేమం కోసమే, అయితే ఆ క్షేమమే భగవంతుడు అయినప్పుడు ఎంత అద్భుతం ఎంతటి అదృష్టం. ఒక్క అనన్య చింతనతో దైవ యోగంతోనే సిద్ధిస్తుందని ప్రాప్తిస్తుందని మనకు భరోసా ఇస్తున్నాడు. ఎంతో దూరం ప్రయాణించి ఈ రోజున దైవం దగ్గర మీ యోగక్షేమాలు నావే అనే భరోసాను మనం పొందుతూ ఉన్నాం. అనన్య భక్తి మన వంతు మన యోగక్షేమాలు భగవంతుని వంతు. జ్ఞాని నా స్వరూపమే అని 7-18 లో చూసాం. జ్ఞాన యోగక్షేమాలు అవసరాలు పరమాత్మ అవసరాలుగా యోగక్షేమాలుగా మారుతాయి. కనుకనే జ్ఞానియోగ క్షేమాలను పరమాత్మే వహిస్తాడు. అందుకే జగద్గురువు పరమాత్మ కంటే అన్యంగా లేని అనన్యులు పరమ దేవుడైన నారాయణుని ఆత్మ స్వరూపంగా తెలిసినవారు. వారు సదా దైవంతో యోగంలో ఉంటూ దైవాన్ని ఉపాసించే పరమార్థ దర్శనులైన సన్యాసుల యోగక్షేమాలను దైవమే వహిస్తున్నాడు. లేనిది పొందడం యోగం ఉన్నది కాపాడటం క్షేమం.

9అ, 23శ్లో.

యే ప్యన్యదేవతా భక్తా యజంతే శ్రద్ధయాన్వితాః ।

తేపి మామేవ కౌంతేయ యజంత్యవిధిపూర్వకమ్ 23

ఓ అర్జునా! శ్రద్ధాన్వితులైన సకామ భక్తులు ఇతరదేవతలను పూజించినప్పటికిని వారు నన్ను పూజించినట్లే. కాని, వారిపూజలు అవిధిపూర్వకము లైనవి. అనగా అజ్ఞానముతో కూడినవి.

వీరంతా దైవాన్ని పొందే దారిని ఇంకా కనుగొనలేదు. దైవ మార్గంలోకి వీరి నడక కొనసాగలేదనేది ఇక్కడ సుస్పష్టం. చెట్టు యొక్క కొమ్మలు ఆకులు కాయలు పళ్ళు మొదలైనవన్నీ కూడా ఒకే బీజం నుండి ఉత్పన్నం అవుతుంది. కానీ వీటన్నింటికీ ఒక వృక్షమూలమే నీటిని అందిస్తుంది. అవి నిలవడానికి తగిన ఉనికిని ఇస్తుంది. మనం ఆ చెట్టు మూలమైనటువంటి వేళ్లకు నీరు పోస్తాం, అంతేగాని ఏ ఒక్క కొమ్మ పైనో ఏ ఒక్క ఆకు పండు కాయ పైననో పోస్తే సరిపోతుందా. మరియొక ఉదాహరణ మనిషి శరీరంలోని ఇంద్రియాలన్నీ కూడా ఒకే శరీరంలోనే ఉంటుంది. ఆయా ఇంద్రియాలకు కేవలం ఓ పువ్వునో కాయనో తెచ్చి ఏ కంటికో చెవికో కట్టి లేదా పెట్టి నమస్కరిస్తే సరిపోతుందా. వాస్తవిక స్వరూపాన్ని గీతా జ్ఞానంతో సూత్రంతో అర్థం చేసుకొని విజ్ఞాన సహిత జ్ఞానంతో అక్షర పరబ్రహ్మంతో యోగమై దైవ రహస్యాన్ని రాజవిద్యను తెలుసుకొని సదవగాహనతో ఆహారాన్ని నైవేద్యాన్ని శుద్ధ మనసుతో దైవానికి సమర్పించాలి. సర్వేశ్వరుడైన పరమేశ్వరుని అర్చించి ఆరాధించే భక్తులు జ్ఞానులు పరమేశ్వరునే పొందుతున్నారనేది సుస్పష్టం. అలా కాక యజ్ఞ యాగాదుల ద్వారా ఇంద్రాది దేవతల్ని పూజించే ఆరాధించే భక్తుడు పరమేశ్వర స్వరూపమైన మోక్షాన్ని పొందలేక జనన మరణాలలో పరిభ్రమిస్తున్నారని చూసాం. ఇతర దేవతల్ని శ్రద్ధతో పూజించే భక్తులు అవిధి పూర్వకంగా తననే ఆరాధిస్తున్నారన్నారు. అంటే దారి తప్పిన వారు అని అర్థం, అర్థం జ్ఞానం అవగాహన లేనివి వ్యర్థమైనవి అవిధి పూర్వకమైనవి. మనం ముందు శ్లోకాల్లో చర్చించిన ప్రత్యేకించి 9-14 లో చూసినటువంటి అవగాహన లేని అర్థం లేని పూజాది కార్యాలు వ్యర్థమని అవిధిపూర్వకమైనవని ఇక్కడ జగద్గురువు తేట తెల్లం చేశారు. భగవంతుని జ్ఞానం లేకుండా భగవంతుని పొందడం ఎలా వీలవుతుంది. అందుకే అది అజ్ఞానం అవిధిపూర్వకం అవుతోంది. అన్యదేవత ఆరాధనలో భేద దృష్టి ఉంది. ఒక దేవత దేవుడు మరో దేవత దేవుడు మరో దేవుడి కన్నా అన్యం భిన్నం అనేది అన్య భేద దృష్టి. అలాగే ఆయా దేవతలు పరమేశ్వరుని కన్నా అన్యులు అనేది భిన్న దృష్టి. నిరాకార నిర్గుణ పరమాత్మను కాకుండా నామరూప సహితమైన ఇతర దేవతలను ఆరాధిస్తున్నారు. అయినా వారు ఆయా

దేవతలకు అధిష్ఠానమైన పరమాత్మను కొలిచిన వారే అవుతారు, అయితే అది సక్రమమైన భగవదర్చన కాదు విధి పూర్వకమైన పరమాత్మ సేవ కాదు అంటున్నారు. ఇది క్రమం తప్పినదే కానీ క్రమబద్ధమైనది కాదు అని తేల్చి చెప్తున్నారు. కారణం వారికి నేరుగా పరమాత్మ సాక్షాత్కారం పొందే మార్గం, నేరుగా పరమాత్మను దర్శించే విధానం తెలియకపోవడం వల్ల వారు పరమాత్మను పొందలేకపోతున్నారు. ఇదే అంశాల్ని విద్యాప్రకాశానందగిరి స్వామి సర్వవ్యాపక సర్వాధిష్ఠాన పరమాత్మను సేవించినప్పుడే సాక్షాన్ మోక్షము చేకూరుతుంది ఇతర దేవతల్ని ఆరాధించి అల్ప ఫలాలు పొందుట కంటే సాక్షాత్ పరమాత్మనే సేవించి మోక్షరూప మహోన్నత ఫలాన్ని పొందటమే శ్రేయస్కరం అన్నారు.

9అ, 24శ్లో.

అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ ।

న తు మామభిజానంతి తత్త్వేనాతశ్చ్యవంతి తే । 24 ।

ఏలనన సకల యజ్ఞములకును భోక్తను, స్వామిని గూడ నేనే. వారు నా పరమేశ్వర తత్త్వమును ఎఱుంగరు. కావున పతనమగుదురు. అనగా పునర్జన్మను పొందుదురు.

సమస్త యజ్ఞాలకు మూలం దైవమే కానీ ఈ జ్ఞానం యజ్ఞకర్తలకు లేదు. అందువల్ల వారు అన్య దేవతా భజన ఆరాధన చేస్తారు. దేవతల పితృదేవతల పేరుతో గంగలోని నీటిని గంగకే అర్పించే విధంగా యజ్ఞాది విధివిధానాల ద్వారా దైవం నుంచి పొందిన వస్తువులతో వాటిని తిరిగి దైవానికి అర్పిస్తున్నారు. దైవం కానిది దైవంకన్నా అన్యమైనది ఏదీ లేదు, కానీ అర్పణవిధి సూత్రంలోని సూక్ష్మాన్ని వారు ఎరుగలేక నన్ను విడిచి అన్యదేవతలను ఉద్దేశించి చేస్తున్నారు. ఈ అన్య దేవతా భావం వల్ల వారు చేసేవి నా వద్దకు వచ్చి చేరుటలేదు. ఎందుకంటే వారి భావంలో సమర్పణలో నేను లేను. అందుకే వారు ఏ దేవతలను ఉద్దేశించి ఈ సమస్త యజ్ఞాది కర్మలు

చేస్తున్నారో ఆయా ఉపాసనాది దేవతలు పొందుతున్నారు. సమస్త యజ్ఞాలకు పరమాత్మే భోక్త, కర్మ ,ప్రభువు ఈ యథార్థ జ్ఞానం లేక సంకుచిత దృష్టితో ఆయా దేవతలను ఉద్దేశించి క్రియలను జరుపుతూ ఉన్నత స్థానం నుండి జారిపోయి సంసార కూపంలో జనన మరణ ప్రవాహంలో పడిపోతున్నారు. తత్త్వేనా అన్నారు సర్వాంతర్యామి సమస్త చరాచరాలకు అధిష్ఠానంగా నిజరూపంగా వెలుగొందుతున్న విషయం యథార్థంగా ప్రత్యక్షంగా అనుభవ పూర్వకంగా తెలియాలి అని అర్థం. అలా పరమాత్మ అనుభవం ఉన్నవారు అతి జాగరూకులై స్వస్వరూపాత్మయందే నిష్ఠ కలిగి మిథ్యామయ దృశ్య ప్రపంచపు భావన లేకుండానే దేహంతో ఉన్నా అశరీరులుగా ఉంటారు. వివిధ రకాల యజ్ఞాలన్నింటికీ ఆయా దేవతా రూపంలోని ప్రభువును భోక్తను నేనే, యజ్ఞానికి స్వామిని నేనే. అయినా నా యొక్క లేదా దైవం యొక్క యధార్ధ తత్త్వం వారికి తెలియడం లేదు. అందుకే ఆదిశంకరులు అజ్ఞాన పూర్వకంగా అవిధి పూర్వకమైన యజ్ఞం చేసి యాగఫలం నుంచి పతనమవుతున్నారని స్పష్టంగా తన భాష్యంలో పేర్కొన్నారు. శ్రౌతములు అంటే శ్రుతములు. వేద ప్రతిపాదితమైన క్రతువులు యజ్ఞములు. స్మార్థములు అంటే ధ్యాన పూజ జప ప్రార్థనలు మొదలైనవి. ఈ రెండింటికి భోక్త పరమేశ్వరుడే. ఏ దేవతను ఉపాసిస్తూ యజ్ఞ యాగాలు నిర్వహిస్తున్నారో ఆ దేవతలకే ఆహుతులను సమర్పిస్తారు. కాకపోతే వీరు ఏ దేవతకు సమర్పించినా అవి దేవతా రూపంలో ఉన్న ఆయా దేవతలను నడిపిస్తున్న మూల శక్తికి మూలమైన పరమేశ్వరునికే చెందుతాయి. అలాగే యజ్ఞఫలంగా పరమేశ్వరుడు అనుగ్రహించేది కూడా ఆయా దేవతల ద్వారా ఉపాసకునికి అందుతుంది. అయితే ఈ విషయానికి సంబంధించిన జ్ఞానం దేవతాఉపాసకునికి యజ్ఞం చేసే వారికి ఉండటం లేదు. అందువల్ల యజ్ఞం యొక్క అవాంతర ఫలాలకే పరిమితమై పూర్ణఫలం నుండి వారు జారిపోతున్నారు. పరిపూర్ణాన్ని పొందలేకపోతున్నాడు. అంటే దైవం ప్రసాదించిన అనుగ్రహించిన అందుకునే జ్ఞానం వీరికి లేని కారణంగా వారు పరిపూర్ణఫలం పొందడం లేదు. దేవతలకు ఓ నియతి పరిమితి ఉంది. అలాంటప్పుడు ఆ దేవత నుండి ఆ పరిమిత నియత ఫలాన్నే అందుకుంటూ ఉంటారు. అనంత ఫలం అందుకునే మోక్షం పొందలేక జారిపోతున్నారు, వీగిపోతున్నారు, ఆగిపోతున్నారు. కాబట్టి ఉపాసన ఆరాధనలో కాదు, ఉపాసన ఆరాధన భావనలోనే లోపం ఉంది. సవరణ సంస్కరణ అక్కడే జరగాలి.

వీరిలో 4-24 లో మనం సుదీర్ఘంగా చర్చించిన సర్వేశ్వరుడే సర్వయజ్ఞాధీశుడు అనే తాత్విక జ్ఞానం లేదు. కాలం దేశం బ్రతుకు కర్మ కర్త భోక్త ప్రపంచం దైవం గురువు జ్ఞానం యజ్ఞఆహుతులు సమర్పించే వేళలు వేదజ్ఞులు సృష్టి స్థితి లయ సమస్తం పరమాత్మ స్వరూపమే. పువ్వులు మణులు దారంలో గుచ్చినట్లు సూత్రాత్మ అయిన పరమేశ్వరుని యందు సమస్తము నిలిచి ఉంది. ఈ విషయాన్ని 7-7 లోనే చూసాం. ఇదే అంశం భాగవతం దశమ స్కంధంలోనూ ఉంది. పరమేశ్వరుని కన్నా అన్యం లేదనే సత్యాన్ని గ్రహించడమే జ్ఞానం. అలాంటి తాత్విక జ్ఞానాన్ని కలిగి పరమేశ్వరుని ఉపాసించే ఆరాధించేవారు పరమేశ్వరునే పొందుతారు. ఈ తాత్విక జ్ఞానం పరమాత్మ పరమేశ్వర జ్ఞానం అవగాహన లేకుండా అన్య దేవతలను ఆరాధించేవారు ఆయా దేవతా లోకాలను చేరి ఆయాపరిమిత ఫలాలే పొందుతూ గతా గతంలో కొట్టుమిట్టాడుతూ ఉంటారు.

9అ, 25 శ్లో.

యాంతి దేవవ్రతా దేవాన్ పితౄన్ యాంతి పితృవ్రతాః ।

భూతాని యాంతి భూతేజ్యా యాంతి మద్యాజినో ఽపి మామ్ | 25 |

దేవతలను పూజించువారు దేవలోకములను చేరుదురు. పితరులను సేవించువారు పితృలోకములకు వెళ్ళుదురు. భూతప్రేతములను అర్చించువారు భూతప్రేత రూపములను పొందుదురు. నన్ను ఆరాధించు భక్తులు నన్నే పొందుదురు.” అట్టి నా భక్తులకు పునర్జన్మ ఉండదు.

పరమాత్మ తప్ప తక్కిన వ్యక్తులు గాని లోకాలు గాని ఏదో ఒక కాలంలో లయమయ్యేవే అని మనం చూశాం. అవినాశి అవ్యయుడు సనాతనుడు అయిన అక్షర పరబ్రహ్మ పరంధామ వ్రతాన్నే చేపట్టాలి. దేవత ఆరాధన కాకుండా పరమాత్మ పరంధామ పరమపద ఆత్మ ఆరాధకులు ఆత్మవ్రతులు కావాలి. ఆత్మ స్వరూప అనుభవం కానిదే నేను ఎవరికి ఎన్నటికీ ప్రియుడను కాను కాలేను, మరే ఉపాయం చేతను నేను ఎవరికీ సాధ్యుడను కాను. వేదాలు

కూడా నా స్వరూపాన్ని ఉన్నది ఉన్నట్లుగా వర్ణించడానికి వీలుకాక నేతి నేతి అని చెప్పి వైదొలిగాయి. అశేషమైన శక్తి గల ఆదిశేషుడు సైతం పరమాత్మకు శయ్యగా ఉంటున్న విషయం విదితమే. యజ్ఞ యాగాదుల్ని గురించి ప్రగల్భాలు పలికే వారి సమస్త కర్మలు గడ్డి పోచమాత్రపు ఉపయోగం కూడా లేదని గ్రహించాలని జ్ఞానేశ్వరి యోగి గారి వ్యాఖ్య. బుద్ధి మతి అనుసారం మతి గతి అనుసారం అని పెద్దల మాట. మతి మార్గంలో వెళ్తే ఆ మార్గం గమ్యాన్ని చేరుస్తుంది. మతిని బట్టి మార్గం మార్గాన్ని బట్టి గమ్యం ఇది పద్ధతి. ఏ విషయంలోనైనా ఉపాసన భావం ఎలా ఉంటే దాని ఫలం కూడా అలాగే ఉంటుంది. ఈ శ్లోకంలో ఉపాసకులు నాలుగు రకాల వారీగా చెప్పారు. వీరిలో ముగ్గురు అవిధి పూర్వకంగా పరమేశ్వరుని అర్చించేవారు. అంటే ముందు శ్లోకంలో మనం చర్చించిన అన్య దేవత ఆరాధకులు అజ్ఞానంతో పూజించేవారు. చివరి వారు అనన్యులు సాక్షాత్తు భాగవతారాధకులు. వీరే భగవంతుడు కూడా. అవిధి పూర్వకంగా ఉపాశించే దేవత ఆరాధకులు మనకు ఉపాధి గత గుణత్రయ భేదాన్ని బట్టి మూడు విధాలుగా తెలుస్తూ ఉంటారు.

ఒకటి సత్వగుణ ప్రధానులైన సాత్వికులు, దేవవ్రతులు దేవతల్ని ఆరాధించేవారు. వీరు యజ్ఞ యాగాదులు దానాది నియమరూపులు సత్వగుణ ప్రధానులై ఇంద్ర అగ్న్యాది దేవతలను ఆరాధిస్తూ యజ్ఞాలు నిర్వహిస్తాడు. వీరు శ్రౌత కర్మలను సాధనలను ఆచరిస్తారు. ఇంద్రాది దేవతలను తృప్తి పరచి ఫలితంగా ఆయా లోకాలను పొందాలనుకునే వారు. వీరు ఆయా కార్యాల పుణ్యఫలంగా ఇంద్రద్యుమ్నుడు, మహాభిషుడు విక్రమార్కుడు లాంటి వారిలాగా స్వర్గాది లోకాలను పొందుతారు. పుణ్యం క్షీణించగానే ఆయా లోకాలనుండి తిరిగి వచ్చి దుఃఖాలయ జన్మకు కారణమవుతూ ఉంటారు.

రెండు రజోగుణ ప్రధానులైన రాజసులు. పితృవ్రతులు, పితృ వ్రతం కలవారు పితృదేవతల యందు భక్తి కలిగి, శ్రాద్ధాది కర్మలను తర్పణ తిలోదకాలను సమర్పించే నియమాన్ని పాటించేవారు. వీరు రజో గుణ ప్రధానులు. వీరు మానవ లోకంలో ఆచరించే పితృ కర్మలతో పాటు వీరు ఆచరించే స్మార్త కర్మలైన పూజాది కార్యాలు వీరిని మారణానంతరం పితృ లోకం చేర్చుతాయి. అందుకే వీరు పితృవ్రతులు పితృలోకాలనే చేరుతారు. వీరు ఫలం క్షయం కాగానే తిరిగి జనన మరణ చక్రంలో పడిపోతారు.

మూడు తమోగుణ ప్రధానులైన తామసులు, భూత ప్రేత యక్ష గణాదులను ఉపాశించేవారు, ఆరాధించేవారు. భూతేజ్యాలు తమ గుణ ప్రధానులు. ఇలా భూతగణాలను పూజించేవారు మరణాంతరం భూతాలు వసించే లోకాలను పొందుతారు. వీరందరూ కూడా ఆయా గుణ భేదాన్ని బట్టి కర్మ భేదాన్ని బట్టి ఆయా ఫలితాలను పొందుతుంటారు.ఈ మూడు రకాల వారు వారి వారి విధులను బట్టి ఆయాలోకాలను పొందుతారు. లోకాలు ఏవైనా ఇవన్నీ కూడా కాలంలోనే దేశంలోనే జరుగుతాయి. కాలగతం దేశగతం అయినటువంటి ఇవన్నీ కూడా అనిత్యాలే కదా. కాబట్టి లోకంలోని ఫలాలు ఏవైనా నశించేవే అవుతున్నాయి అందుకే ఇవి తిరిగి తిరిగి జన్మకు కారణమవుతున్నాయి. ఈ మూడు కూడా అధిక శ్రమతో వ్యయ ప్రయాసలతో కూడినవి. అధిక ధనవ్యయం అధిక దేహశ్రమ కలిగినవి. వీటిని ఆచరించి అల్ప స్వల్ప అనిత్య ఫలాలను అనుభవించి తిరిగి తిరిగి జనన మరణాల వ్యాధితో కొట్టుమిట్టాడుతూ ఉంటారు. పైగా వీరు ఆచరించే నియమనిష్ట రూప కార్యాలలో ఎలాంటి కర్మలోపం జరిగినా వస్తులోపం ఏర్పడినా విధి లోపం కలిగినా మంత్ర తంత్రాలు సంభవించినా తగిన అల్ప స్వల్ప ఫలితం రాకపోగా విపరీతమైన ప్రతికూల ఫలితాలు ప్రమాదాలు సంభవించే పరిస్థితి ఎదురవుతుంది.

వ్యయం ప్రయాసం అధికం, ఫలం అల్పం ప్రమాదకరం. వీటికి కారణం వీటి ఆరాధన అవిధి పూర్వకమైనవిగా అజ్ఞాన పూర్వకమైనవిగా ఉండటమే. ఇలా గుణ భేదాలతో అన్య దేవత ఆరాధనలో నిమగ్నమై అవిధి పూర్వకంగా అర్చించి ఆనిత్య ఫలాలను అనుభవించడం అవసరమా? దేవవ్రత పితృవ్రత భూతేజ్యాల విపత్కర విపరీతాల పరిస్థితులలో మనకు మనంగా వెళ్లి చిక్కుకొని ధిక్కరించడం మన జన్మకు మనకు అవసరమా? దివ్యాత్మ స్వరూపలారా భగవంతుని దగ్గరకు స్వయంగా రాచబాటలో తీసుకెళ్లే మార్గంతో కూడిన రాజవిద్య ఉండగా గీతా మార్గం ఉండగా ఈ రాజ గుహ్యాన్ని గుర్తెరిగి పరమాత్మలో విశ్వవ్యాపక వాసుదేవునిలో విలీనం కావడం ఎంత సులభం, సుసుఖం కర్తుం అవ్యయం కదా. ఆలోచిద్దాం, జాగ్రత్తగా స్వయంగా స్వీయ పరిశీలనతో మనకు మనమే అరసి అరసి తరచి తరచి చూద్దాం. ఇక చిట్ట చివరి వారు మద్యాజులు అంటే విశ్వవ్యాపక పరమేశ్వరుని ఆరాధించే అనన్యులు. వీరు పరమేశ్వరుని ఎలా ఆరాధిస్తారు అంటే జ్ఞానపూరితంగా

అవగాహనతో యోగ యుక్తులుగా యోగారూఢులుగా దైవమే జీవితలక్ష్యంగా ఆరాధిస్తారు. వీరు అనంతమైన జ్ఞాన స్వరూపుడ్ని అనుభవ జ్ఞానంగా విజ్ఞాన సహితంగా అభేద భావంతో అనన్య చిత్తంతో ఆరాధిస్తారు, ఉపాశిస్తారు. చక్కెర తాను తీయగా ఉన్నానని తనకు తెలియడానికి తానేం చేయాలి. స్వస్వరూప జ్ఞానాన్ని పొందాలి, స్వీయ ఆత్మిక జ్ఞానం కలగాలి, అనుభవ జ్ఞానం కలగాలి, ప్రత్యక్ష ప్రమాణం కావాలి. విశ్వవ్యాపక వాసుదేవం అనే జ్ఞానం రాజగుహ్యం విజ్ఞాన సహితంగా రూపొందుతుంది. ఇలా అధిక శ్రమతో అనేక ప్రయాసలతో దేవతారాధకులు అల్పఫలాన్ని పొంది జనన మరణ చక్రంలో తగులుకొని చిగులుకొని ధిక్కరిస్తూ గమ్యం తెలియని పయనంలో గిలగిలా కొట్టుకుంటూ ఉంటే అల్ప శ్రమతో అనంతపలాన్ని పొంది సులభంగా సుసుఖంగా జనన మరణ వలయం నుండి విడిపడిన అనన్య భక్తులు జ్ఞాన స్వరూపులు భగవత్ స్వరూపులై శోభిస్తున్నారు. ఇక్కడ పూర్ణభక్తి అకుంఠిత అద్వితీయ అనన్య భక్తి ప్రాధాన్యమే గాని కర్మకాండలో వస్తువులు ధనము ప్రాధాన్యం కాదు అనంతుడు ప్రసాదించిన వస్తు విశేషాలను తిరిగి ఆయనకు నైవేద్యంగా సమర్పించడం మనమే దైవానికి సమర్పించాలి.

9అ, 26శ్లో.

పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి |

తదహం భక్త్యుపహృతమ్ అశ్నామి ప్రయతాత్మనః | 26 |

నిర్మలబుద్ధితో, నిష్కామభావముతో పరమభక్తునిచే సమర్పింపబడిన పత్రమునుగాని, పుష్పమునుగాని, ఫలమునుగాని, జలమును గాని, నేను ప్రత్యక్షముగా (స్వయముగా) ప్రీతితో ఆరగింతును.

భక్తి ప్రేమ అనేవి చాలా పవిత్రమైనవి, భక్తే ప్రేమకు పరాకాష్ట. భక్తిగా మారిన ప్రేమ అమృత స్వరూపమై అలరారుతుంది. భక్తుని హృదయం నుండి నిరంతరం ప్రవహించే ప్రేమ ప్రవాహం ప్రతిక్షణం పరమేశ్వరుని చేరుతూనే ఉంటుంది. భక్తి అనేది ప్రేమ స్వరూపం, సృష్టిలో ప్రేమ పూరిత కార్యకలాపాలు

అని వార్యంగా కొనసాగుతూనే ఉంటాయి. సూర్యుని నుండి కదిలేటటువంటి వెచ్చవెచ్చని కిరణాలు పువ్వులో నుండి విరాజిల్లే పరిమళం చల్లగా మెల్లగా హాయిని గూర్చే కడలి తరంగాలు మనలో ఉచ్ఛ్వాస నిశ్వాసలను నెరపే వాయువు గగనంలో విహరించే విహంగాలు అన్నీ కూడా భగవంతుడు మనపై చూపే ప్రేమకు తార్కాణాలు.

ఈ ప్రపంచంలో ఎన్ని ఉన్నా ఎంత ఉన్నా సంతృప్తి చెందని వారు మనుషులు కానీ శుద్ధ బుద్ధితో భక్తియుత ప్రేమతో ఏది సమర్పించినా సంతృప్తి పడేవాడు దేవుడు మాధవుడు. ఈ సృష్టిలోని ప్రతిదీ పరమాత్మ వస్తువే పరమాత్మ సృష్టే కదా. అయితే ఆయన వస్తువుకు మనం భక్తిని జోడించి అర్పించడమే మనం చేయదగిన కార్యం. పదార్థాలన్నీ పరమేశ్వరునిదే, ప్రేమ భక్తి మాత్రం మనది. పరమేశ్వరునికి తృప్తినిచ్చేది ఆయన సృష్టిలోని వస్తువు కాదు మన హృదయంలోని భక్తి ప్రేమ. ఆ సమర్పించడం అనే కార్యాన్ని మించిన పవిత్ర కార్యం మరొకటి ఉంటుందా? 4-24 లోని బ్రహ్మచర్య వ్రతంతో బ్రహ్మార్పణం గావించాలి. ఆ అర్పణంలో ఆకైనా బువ్వైనా పండైనా నీరైనా మరేదైనా ఫర్వాలేదు కానీ అర్పణం సమర్పణం ఒక్కటే ఉంది ఉంటుంది అది బ్రహ్మార్పణమే. అర్పించే యోగ్యత అర్హత మనం కలిగి ఉండాలి. ఇదే అంశాన్ని మరో కోణంలో చూద్దాం పత్రం అంటే మనసు ఆకు చిన్న గాలికే చలించినట్లు నిరంతరం మనకు ఎదురయ్యే అనేకమైన కారణాలకు మనసు చలిస్తూనే ఉంటుంది. అది దాని సహజత్వం చిన్నచిన్న గాలులకే ఆకులు కదిలినట్లు మనసు కూడా ప్రతి చిన్న విషయానికి చలించిపోతూ ఉంటుంది. ఆ చలనశీలనమైన మనసు అనే ఆకును పత్రాన్ని పరమేశ్వరుని పాదాల చెంత సమర్పించడమే పత్ర సమర్పణం. పుష్పమనేది బుద్ధికి ప్రతిరూపం సుందరంగా శోభించే వికసితమైన బుద్ధి పుష్పం. బుద్ధిని భవ్యమైన భగవంతుని చెంత సమర్పించడమే పుష్ప కైంకర్యం. ఫలం అంటే పండు అహంభావనే ఇక్కడ ఫలం. నేను కర్తను కాదు నా అహం కర్త. నేను భగవంతుని చేతిలో పరికరాన్ని ఉపకరణాన్ని అనే అహం రహిత భావనతో అహంభావనలేని ఫలాన్ని పరమేశ్వరునికి భక్తితో ప్రేమతో సమర్పించడమే బ్రహ్మార్పణం గావించడమే ఫలార్పణం. తోయం అంటే నీరు, చిత్తం తో దీన్ని పోల్చుకోవచ్చు. నది ప్రవాహంలా పాతనీరు పోతూ కొత్తనీరు వస్తూ ఉండేది

ఇక్కడే. ఈ నిత్య ప్రవాహంలో గత స్మృతులు నేటి భావాలు రేపటి ఊహలు పెనవేసుకుంటూ సాగే నిరంతరచింతనమే చిత్తమనే తోయం.

చిత్తవృత్తులను నిరోధించడమే యోగం. చిత్తవృత్తులను నిరోధించి చిత్తాన్ని చింతకాంతక చింతకునికి అంతకాంతక అనంతునికి సమర్పించడమే తోయం. కుచేలుడు తాను అటుకులు సమర్పించడానికి సిగ్గుపడుతున్న సందర్భంలో ఆ దైవమే స్వయంగా తన దగ్గరకు వచ్చి నాయందు భక్తి కలిగి ఉన్న నా భక్తులు ఆకు అయినా పువ్వు అయినా పండు అయినా నీళ్లు అయినా ఏది సమర్పించిన వారు సమర్పించే ప్రేమ భావాన్ని నేను మధురాంతంగా భావించి ఆరగిస్తాను అన్నాడు. దీన్నిబట్టి ఇచ్చేవారు పరిశుద్ధులై పరమ భక్తి పరాయణులై ఉండాలి. మలిన కల్మష చిత్తంతో పంచభక్ష భోజనాదులు ఏది ఇచ్చినా ఎంత ఇచ్చినా చివరకు సమస్త రాజ్యాలను ఇచ్చినా మేరు పర్వతమంత బంగారం ఇచ్చినా రత్న రాశులు ఇచ్చినా భగవంతుడు స్వీకరించడు. చిత్తశుద్ధి గల నిర్మల అంతఃకరణమే భగవంతుని అనుగ్రహ స్థానం ఆరగింపు స్థానం. పరమ భక్తి చిత్తశుద్ధి ఈ రెండే భగవంతుని దృష్టిలో ప్రధానమైనవి. విదురుడు కుచేలుడు శబరి గోదాదేవి లాంటివారు ఎందరో జ్ఞాన స్వరూప భక్తులు సర్వులకు విదితమే.

9అ, 27శ్లో.

యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్ |

యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్ | 27 |

ఓ కౌంతేయా! నీవు ఆచరించు కర్మను, భుజించెడి ఆహారమును, హోమముచేయు హవ్యమును, అర్పించు దానమును, ఆచరించు తపస్సును నాకే సమర్పింపుము.

కాలానికి పరిమితమయ్యే అర్చన పూజ నిత్యార్చన నిత్య పూజ అవుతుందా? నిత్యార్చన నిత్య పూజ కానిది భగవంతునితో సదా అనుబంధాన్ని ఎలా కలిగి ఉంటుంది. అవ్యక్త అలౌకిక సూత్రంతో పరమాత్మతో ఆత్మిక అనుబంధం ఎలా

వీలవుతుంది. అనిత్య ఫలం ద్వారా నిత్యఫలం ఎలా అందుతుంది. నిత్య సత్యమైన మోక్షానికి మార్గం ఎలా సుగమం కాగలదు. కాబట్టి భగవంతునితో భక్తునికి సంబంధం నిత్యసత్యమైనది సతతమైనది సదా అయినది ఉన్నప్పుడే మనకు దైవంతో అనుబంధం నిత్యమై శోభిస్తుంది. యజ్ఞ యాగాదుల్లోనూ పూజా మందిరంలోనూ దేవాలయంలోనూ గడిపే సమయమే కాదు ప్రపంచమే జీవితమే పూజా మందిరం కావాలి. దేహమే దేవాలయం కావాలి. ప్రతి కార్యం ప్రతి క్రియ ప్రతి మాట ప్రతి అడుగు ప్రతి ప్రవర్తన పూజ కావాలి, అర్చన కావాలి. ప్రతి ఆలోచన ఆరాధనే కావాలి. ఏది తిన్నా ఏమి తాగినా ఏమి సమర్పించినా ఏది నిర్వహించినా ఈ సమస్త కార్యాలన్నీ కూడా పరమేశ్వరునికి ఆరాధనగా పూజగా మారాలి, అదే నిత్య అర్చన నిత్య పూజ. అందుకే జగద్గురువు ఏది చేస్తున్నావో ఏది తింటున్నావో దేన్ని హోమం చేస్తున్నావో ఏది దానం చేస్తున్నావో ఏ తపస్సును ఆచరిస్తున్నావో వాటన్నింటినీ నాకు సమర్పించు. ఈ విధంగా జీవించగలిగితే మనం ఒక్క క్షణం కూడా పరమేశ్వరునికి అన్యంగా ఉండము ఉండలేము, అనన్యులు గానే ఉంటాం. ఇంతటి సుకృతం అదృష్టం ఎవరికి దొరుకుతుంది. దైవమే స్వయంగా మనకు తనను చేరే పొందే తానుగా విరాజిల్లే మార్గాన్ని ఎంత సులభమైన పద్ధతిలో ఉద్బోధిస్తున్నారు. పైగా మీ యోగక్షేమాలు నావే అని భరోసా ఇచ్చి మరీ ఇంత సులభమైన పూలబాటను రాజగుహ్యాన్ని రాజబాటను మనకు ఈ రాజవిద్య ద్వారా చూపి మనల్ని తరింప చేస్తున్నారు. మనం ముందు శ్లోకంలోనే మనలోని అహం అనే భావాన్ని ఫలంగా పండుగా సమర్పించి నాది అనే మమకారాన్ని నిర్వీర్యం చేశాం. అందుకే ఇక్కడ జగద్గురువు మనం చేసే పనులన్నీ పూజలే ప్రార్ధనలే మంత్రాలే అంటూ నిత్యార్చన నిత్యపూజను గావించే విధానాన్ని మనకు ప్రబోధిస్తున్నారు. ప్రాప్తించిన ప్రసాదాన్ని బ్రహ్మార్పణంతో స్వీకరించడం ఏది దానం చేసినా ఇచ్చే వానిలోనూ పుచ్చుకునే వానిలోనూ బ్రహ్మార్పణ భావంతో సమర్పించడం మనవంతు. మన యోగక్షేమాలన్నీ భగవంతుని వంతు.

దీన్నిబట్టి మనం ఏది చేసినా భుజించినా హోమం చేసినా దానం చేసినా తపస్సు చేసినా భగవదర్పణంగా చేయాలి. ఈశ్వరార్పణ బుద్ధితో శుద్ధమైన బుద్ధితో కర్మలను ఆచరించాలి.

9అ, 28శ్లో.

శుభాశుభఫలైరేవం మోక్ష్యసే కర్మబంధనైః |

సన్న్యాసయోగయుక్తాత్మా విముక్తో మాముపైష్యసి | 28 |

ఈ విధముగా సన్న్యాసయోగము నందు స్థిరచిత్తుడవై, అనగా సమస్తకర్మలను భగవంతుడనైన నాకే సమర్పించి, శుభాశుభఫలరూప కర్మబంధముల నుండి ముక్తుడవయ్యెదవు. పిదప నన్నే చేరగలవు.

శుభాశుభ ఫలాలు అంటే ఇష్టాయిష్ట ఫలాలు, ఆ ఫలాలను ఇచ్చే కర్మలే బంధనాలు. మనం వాటిని దైవానికి అర్పించి చేసినట్లయితే కర్మలు నిన్ను బంధించవు. బంధనాల నుండి నీవు ముక్తుడవుతావు దీన్నే సన్యాసయోగం అంటారు. దైవానికి సమర్పించడమే సన్యాసం, ఇలాంటి సన్యాసయోగంతో కూడిన అంతఃకరణం కలవాడు సన్యాసయోగ యుక్తాత్ముడు. అలాంటివారు జీవించి ఉండగానే కర్మబంధనాల నుండి ముక్తులైన జీవన్ముక్తులు. అగ్నిలో వేపిన మొలకెత్తుతుందా? అదే విధంగా జ్ఞానాగ్నిలో దగ్ధం చేసిన సమస్త కర్మల నుండి ఫలం ఉండదు. అప్పుడు ఆ కర్మలకు సంబంధించిన బాధలు ఉండవు. తద్వారా జనన మరణాలకు ఆధారం నశించిపోతుంది, సర్వాధారునిలో సంలగ్నం అయిపోతుంది, సార్వాత్మలుగా శోభిస్తారు. అందుకు ఇప్పుడే ఎందుకు తొందర అని ఆలస్యం చేసినా అది అంతకంతకు రెట్టింపు పై మనల్ని వేధిస్తుంది ఊపేస్తుంది విసిరేస్తుంది. అందుకే ఆత్మ స్వరూపాన్ని పొందడానికి అన్నిటికంటే సులభోపాయాన్ని ఫల సన్యాస ఉపాయాన్ని కర్మయోగాన్ని కర్మఫలాల సన్యాసాన్ని మీకు ముందే ఉపదేశించాను కదా అని ఇక్కడ జగద్గురువు తాను బోధించిన సమస్త ప్రబోధాన్ని ఒక్కమాటలో చొప్పించి గుర్తుచేసి మనకు కళ్ళు తెరిపిస్తున్నాడని మనం గ్రహించాలి. ఇక్కడ శుభ అశుభ కర్మలు అని జగద్గురువు చెప్పడంలో సమస్త దృశ్యము తదంతర్గతమగు సమస్త కార్యాలు కర్మలు వాటి ఫలాలు మిథ్యే అనే భావంతో ప్రయోగించాడని గమనించాలి. కర్మ అనేది బంధం కాదు

కర్మఫలాసక్తే బంధం అని కర్మయోగంలోనూ, కర్మ సన్యాస యోగంలోనూ చర్చించినటువంటి కీలకమైనటువంటి అంశాన్ని ఇక్కడ మరోసారి గమనించి ఆ అవగాహనతో ముందుకు వెళ్లాలి. కర్మహేతువులైన కర్మలన్నీ బ్రహ్మార్పణ భావంతో ఆవిరి అయిపోతాయి, అదే సన్యాసయోగం యొక్క ఆంతర్యం. కాబట్టి ఈ సుఖ దుఃఖాలనే మహాసముద్రపు దైహిక బంధం నుండి విడిపడి వ్యక్తి సహజమైన ఈ సుగమమైన దైవ మార్గంలో నడిచి ప్రసన్నతా పూర్వకమైన మహత్తును ఆనంద స్వరూపాన్ని పొందాలి, చెందాలి, దర్శించాలి తానే దైవంగా బ్రహ్మంగా భాసించాలి.

9అ, 29శ్లో.

సమోహం సర్వభూతేషు న మే ద్వేష్యో స్తి న ప్రియః ।

యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్ | 29 |

నేను సకలభూతముల (ప్రాణుల) యందును సమభావముతో వ్యాపించి యుందును. నాకు అప్రియుడు గాని, ప్రియుడు గాని ఎవ్వడును లేడు. కాని, నన్ను భక్తితో భజించువారు నాయందేయుందురు. నేనును వారియందు ప్రత్యక్షముగా ఉందును.

పరమేశ్వరుని పరమ భక్తితో సేవించేవారు స్వభావం చేతనే దైవానికి దగ్గరవుతారు, దైవం కూడా స్వభావం చేతనే భక్తునిలో ఉంటాడు. అంతేగాని అనురాగం బంధం లాంటి వల్ల కాదనే సంగతి మనకు తెలియాలి. వారు ఉంటే నేనుంటాను వారు లేని చోట నేను ఉండను, ఎంతటి అద్భుతం ఈ అలౌకిక అవ్యక్త సూత్రం. భగవంతుడు కాపురం ఎక్కడ ఉంటాడో చూసారా దివ్యాత్మ స్వరూపులారా పరిశుద్ధ హృదయమే భగవన్నిలయం. సాక్షాత్తు దేవుడే వచ్చి నివసించే కాపురం చేసే నివాస స్థలం వల్ల ఈ దేహం అనే ఉపాధి దేవాలయం అవుతోంది కదా. అందుకే వేదాలు దేహమే దేవాలయం అని ఉద్బోధించాయి. దైవం నివసించే చోటు దేవాలయం కనుక ఆ దేహం కూడా దైవ దేహమే అవుతుంది. అంటే అక్కడ మనిషి మాయం దైవం ప్రత్యక్షం జీవుడు శివుడు.

ఇది పరమేశ్వరుని అనన్యమైన భక్త్యా, భక్తితో భగవంతుని సేవించే వారి భక్తుని వైభవం. ప్రపంచం నిరంతరం మార్పు చెందుతూ ఉంటుంది. అలాగే దృశ్యాలు రూపాలు మనుషులు మనసులు అన్నీ కూడా ఏ క్షణానికి ఆ క్షణం మార్పు చెందుతూనే ఉంటాయి. అందుకే అవి దోష యుతాలు. అయితే ఈ సమస్త మార్పుకు విలక్షణంగా శోభించేది ఈ సమస్త మార్పుకు ఆలంబనంగా ఉండేది సదా మారనిది సర్వవికారాల నుండి విడిపడినది నిర్దోషమై ఉండేది సమూహం, నేనే సమంగా ఉంటాను. అదే బ్రహ్మం. 5 -19 లో ఈ మార్పులన్నీ ఆరోపితమైనవి అయితే సత్యమైన స్వస్వరూపం అక్షరం బ్రహ్మం పరమం సర్వేశ్వరుడు సమస్వరూపుడు పూర్ణ పురుషుడు. అతనికి సమీపించిన వారు సంతసిస్తారు దూరమైన వారు దుఃఖపడుతారు. నదిలో దిగిన వారు నదిలో ఉన్నట్లు అర్జునా ఈశ్వరుడైన నన్ను ఎవరు భక్తితో ఆరాధిస్తారో వారు సహజంగానే నాలో ఉంటారు. వారి స్వభావం చేతనే వారు నాలో ఉంటారు, కాబట్టి వారిలో నేనుంటాను అంతేగాని నాకు ఎవరి మీద ద్వేషం లేదు అనే విషయాన్ని చాలా స్పష్టంగా భగవత్ తత్త్వాన్ని మన ముందు ఉంచారు.

9అ, 30శ్లో.

అపి చేత్ సుదురాచారో భజతే మామనన్యభాక్ |

సాధురేవ స మంతవ్యః సమ్యగ్వ్యవసితో హి సః ।30।

మిక్కిలి దురాచారుడైనను అనన్యభక్తితో నన్ను భజించినచో అతనిని సత్పురుషునిగానే భావింపదగును. ఏలనన, యథార్థముగా అతడు నిశ్చయబుద్ధి గలవాడు. అనగాపరమాత్ముని సేవించుటతో సమానమైనది మఱియొకటి ఏదియును లేదని గట్టిగా నిశ్చయించు కొనినవాడు.

ఇక్కడ సు దురాచారి అన్నారు, మహా పాపి అయినా అతడు మనసు మార్చుకుని భగవంతుణ్ణి ఆశ్రయించినవాడు, శరణాగతి పొందిన వాడు కాబట్టి పుణ్యాత్ముడు అయినాడు. ఈ ప్రపంచంలో పరమాత్మ పరబ్రహ్మమే సత్యం మిగిలిన సమస్తము అసత్యం మిథ్య కాబట్టి మిథ్యను వీడి సత్తును పట్టుకుంటే

అతనూ పుణ్యాత్ముడే శ్రేష్ఠుడే అవుతున్నాడు. అది ఎలా? దైవం తప్ప అన్య మెరుగను అనేటటువంటి భావన సుస్థిరమైపోవాలి. పూర్వకాలిక సమస్త మహా పాపాలన్నీ కూడా పరమాత్మ సేవతో ఒక్క క్షణంలో భస్మం అయిపోవడం వల్ల అతడు నిర్మల నిశ్చలహృదయుడు. కుప్పలు కుప్పలుగా ఉన్న కట్టెలు సైతం ఒక్క నిప్పురవ్వతో భస్మమైపోయినట్లు పరమ భక్తుని పూర్వ కాలిక పాపమంతా క్షణంలో నశించి పుణ్యాత్ముడు అవుతున్నాడు. ఇక్కడ జరిగిందేంటి సు దురాచారి పరమ సదాచార సంపన్నుడు అవుతున్నాడు. రూపంలో నామంలో మార్పు కాదు కదా భావంలో ఆచరణలో భగవద్భక్తి అని అనన్యమైన అవ్యక్తమైన అద్భుత సూత్రంతో ఎంతటి మహత్తును సాధిస్తున్నాడు. ఇక్కడ సాధువు అనే పదం 9 అధ్యాయాల అవగాహనతో మనం అర్థం చేసుకోవాలి. ఇక్కడ జటాజూట కాషాయంబరములు ధరించిన వారు కాదు ఉత్తముడు నిర్మలుడు సదాచార్యుడు సన్మార్గుడు నైష్కర్మ్యసిద్ధుడు అని తెలియాలి. సత్తుతో ఏకమై చేయాల్సింది చేయడం సాదాచారం, అయితే అది చేయకపోగా చేయకూడనిది చేయడం దురాచారం. హంసను పట్టుకోకపోగా హింసను చేయడం, హంస అంటే దైవిక భావన హింస అంటే తద్విరుద్ధమైనది. కాబట్టి దురాచారం నుండి విడిపడాలి సదాచారంతో ముడి పడాలి.

9అ, 31శ్లో.

క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వ చాంతిం నిగచ్ఛతి |

కౌంతేయ ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి | 31|

కౌంతేయా! అతడు శీఘ్రముగా ధర్మాత్ముడగును. శాశ్వతమైన పరమశాంతిని పొందును. 'నా భక్తుడెన్నడును నష్టమునకు గురికాడు' అను విషయమును నిశ్చయముగాఎఱుంగుము.

పాపాత్ములైనా సరే భగవంతుడే పరమ శరణ్యంగా నమ్మి భజించేవారు శీఘ్రంగా ధర్మాత్ముడు అవుతున్నాడు. కారణం అతని చిత్తం ధర్మంతో

నిండిపోయింది, అందుకే శాశ్వత శాంతిని పొందుతున్నాడు. దీపం వెలిగించిన క్షణమే చీకటి తొలగిపోయినట్లు దైవ మార్గం వైపు మరలగానే అదే క్షణంలో జనులు మోక్షాన్ని పొందుతున్నారు. నా భక్తుడు ఎన్నటికీ చెడడు నశించడు అనే ప్రతిజ్ఞ మనకు ప్రమాణం. మనకు సదా మన స్మృతిలో మానసవీధులలో మదిలో మెదలాల్సిన అంశం ఇది. దైవాన్ని నమ్మినవారు ధర్మాత్ములవుతారని ప్రతిజ్ఞ పూనుదాం. దైవాన్ని నమ్మి విశ్వసించి దైవంతో ఏకమై మనమూ దైవంతో సహయానం చేద్దాం. సుదురాచారునికి ధర్మాత్మునికి మధ్యలో ఇక్కడ ఏం జరిగింది. అంటే వ్యక్తి చిత్తంలో ధర్మనిశ్చయం దృఢమయిపోయింది, శాంతి స్వరూపులు అయిపోయారు. అందుకే జగద్గురువు నిశ్చితమైన ప్రతిజ్ఞ చేసి నా భక్తుడు నశించడు అంటున్నాడు. ఇది జగద్గురువు మనకు ఇస్తున్న అభయంగా భావించాలి. దైవత్వాన్ని దైవభక్తిని మించినది మరొకటి లేదని దాశరధి శతకం చెబుతోంది. ఓ దశరధరామా శ్రీరాముడు యుద్ధంలో శత్రువులకు భయంకరుడు, కష్టాల్లో ఉన్నవారికి చుట్టం వంటి వాడు, అప్పుడు. బాణములను అమ్ముల పొదులును ప్రకాశింపజేసే విలువిద్య నెరపే తీవ్రమైన భుజముల కదలికలోని నేర్పు చేత పొగడ్తగన్న శ్రీరామచంద్రులకు సాటి దైవము మరొకరు లేరనుచు బ్రహ్మాండం అదిరిపోయేటట్లుగా ఢాం ఢాం అనే భేరి చేస్తూ మదించిన ఏనుగును ఎక్కి సర్వ ప్రపంచంలో ప్రకటిస్తాను. శ్రీరాముడు అంటే ఓ వ్యక్తికో ఓ రూపానికో సంబంధించింది కాదు. రామం అంటే దైవం అని అర్థం. సదా దైవంతో రమించేవాడు ఇలా దాశరధి దైవ శక్తిని దేశానికి చాటి చెప్పడమే తన జీవిత ధ్యేయమని ప్రతిజ్ఞ పూనాడు. దైవ శక్తితో మమేకమై దైవ శక్తిని ప్రచారం చేయడమే తన జీవిత ధ్యేయంగా ఎంచుకున్నటువంటి కంచర్ల గోపన్న, భక్త రామదాసుకు ఈ సందర్భంగా నమస్సుమాంజలి.

9అ, 32శ్లో.

మాం హి పార్థ వ్యపాశ్రిత్య యేఽపి స్యుః పాపయోనయః ।

స్త్రియో వైశ్యాస్తథా శూద్రాః తేఽపి యాంతి పరాం గతిమ్ | 32 |

ఓ అర్జునా! స్త్రీ, వైశ్య, శూద్రులును, అట్లే చండాలాదిపాపయోనిజులును నన్నే శరణుపొంది పరమగతినే పొందుదురు.

పాప యోనులు పాపపు జన్మ కలవారైనా అంటే పాపపు సంస్కారాలతో జన్మ తీసుకున్న వారైనా సరే అలాగే స్త్రీలు వైశ్యులు శూద్రులు ఎవరైనా సరే దైవాన్ని ఆశ్రయిస్తే పరమగతి పరంధామం నిశ్చయం. అనేక అనర్థాలకు అపార్థాలకు సాధారణ స్థాయి జనుల సమస్త సందేహాలకు కూడా ఈ శ్లోకం సమాధానం ఇస్తుంది. ఎన్నో ఎన్నో పాపపు సంస్కారాల మూట ద్వారా మోక్షం పొందే అర్హత జన్మతః లేకపోయినా నన్ను ఆశ్రయిస్తే పరమపదం దృఢ నిశ్చయమని ఈ శ్లోకం భరోసా ఇస్తుంది. శాస్త్ర మాతకు శృతి మాతకు అందరూ బిడ్డలే అందరూ సమానమే. ధర్మ మార్గంలో లేదా మోక్షమార్గంలో కర్మే ప్రధానం కాని జన్మ ప్రధానం కాదు భక్తిలో భేదాలు ఉండవు. భక్తే ప్రధానం కానీ భక్తికి జాతి కుల విద్య రూప ధన భేదాలు లేవు ఉండవు. సమస్త జాతి ఒక్కటే ఏకమే అన్న నినాదాన్ని ఈ శ్లోకం ద్వారా జగద్గురువు నినదిస్తున్నారు. వ్యాసుడు శుకుడు కన్నప్ప కనకదాసు విదురుడు విభీషణుడు సావిత్రి అనసూయ గుహుడు లాంటి వారు ఎందరో మనకు స్మరణీయులు కదా. వీరందరూ దేహధారులే అయినా వారు దేహంతో కాకుండా దైవంతో సంబంధం అనుసంధానం సత్సంగం ఏర్పరచుకున్నవారు. వీరు దేహంతో కాదు దైవంతో ముడి పడినవారు, దైవభక్తి కలవారు. తక్కువ కులంలో పుట్టినా అతడు బ్రాహ్మణ శ్రేష్ఠుడే అన్నది శాస్త్రం. లింగ భేదాన్ని జాతిభేదాన్ని జన్మ భేదాన్ని ఈ శ్లోకం తీవ్రంగా ఖండిస్తుంది. జాతి గుణ లింగ వర్ణ వర్గ భేదంతో సంబంధం లేకుండా భక్తి ముక్తికి మార్గమని ఉద్బోధించే మహత్తరమైనటువంటి మంత్రం. శంకరాచార్యులు తన మాండూక్య కారిక భాష్యంలో పుట్టుక లేనిది వినాశ మెరుగనిది సమమైనది అయిన బ్రహ్మ విషయము నందు సునిశ్చితమైన శ్రద్ధ గలవారు స్త్రీలు కాబట్టి వారు శీఘ్రంగా విద్యార్జన చేసి పరమార్థాన్ని పొందగలరు అని పేర్కొన్నారు. కాబట్టి ఎలాంటి సందేహాలకు వివక్షకు ఇక్కడ తావు లేదు. భవరోగాన్ని బాపే ఈ బ్రహ్మవిద్య దైవవిద్యను అభ్యసించడానికి అర్జించడానికి స్త్రీలుగానీ పురుషులు గానీ ఏ జాతి వారైనా ఏ మతం వారైనా ఎవరైనా సరే ఎలాంటి భేదము లేదు. అయితే

ఉన్న భేదమంతా ఒక్కటే అదే అభేద అనన్య భక్తి. ఈ అభేద అనన్య భక్తి యుక్తితో ప్రతి జీవి ప్రతి మనిషి దైవాన్ని బ్రహ్మాన్ని చెందవచ్చు పొందవచ్చు తానే దైవంగా ఎదగవచ్చు.

9అ, 33శ్లో.

కిం పునర్బ్రాహ్మణాః పుణ్యా భక్తా రాజర్షయస్తథా |

అనిత్యమసుఖం లోకమ్ ఇమం ప్రాప్య భజస్వ మామ్ ।33।

ఇక పుణ్యాత్ములైన బ్రాహ్మణులును, రాజర్షులును భక్తులును నన్ను శరణుపొందినచో వారు పరమ పదమును చేరుదురని చెప్పవలసిన పనియేలేదు. ఈ మానవశరీరము క్షణభంగురము. సుఖరహితము. ఐనను దుర్లభము. కనుక దీనిని పొంది - నిరంతరము నన్నే భజింపుము.

పాపాత్ములే పరమాత్మను సేవించి ముక్తిని పొందుతుంటే ఇక పుణ్యాత్ముల గురించి ప్రత్యేకంగా చెప్పేదేముంది. ఇక్కడ భక్తి గల వారే బ్రాహ్మణులు అని ఇక్కడ స్పష్టంగా తేటతెల్లం చేశారు. బ్రాహ్మణులు అంటే భక్తి గలవారు ఏమి భక్తి అంటే దైవంతో ఏకమైన భక్తి తన దేహంలో దైవం నివాసం ఉన్న భక్తి. భక్తుడే భగవంతుడుగా భగవంతుడే భక్తుడుగా మారిన భక్తి వారే బ్రాహ్మణులు అలా లేని వారెవ్వరూ బ్రాహ్మణులు కారు అనే విషయాన్ని ఇక్కడ స్పష్టం చేశారు. ఇక 'రాజర్షయః, మనం ఋషిత్వం, రాజర్షిత్వం, ఋషులు రాజర్షుల గురించి జ్ఞాన యోగం ఆరంభంలోనే సుదీర్ఘమైన చర్చ చేశాం. ఋషిత్వం పొందిన రాజర్షుల గురించి వేరే చెప్పాలా వారు కూడా ఎవరు అనన్య భక్తి గల రాజర్షులు, రాజర్షి ఋషులు, ఋషి రాజర్షులు అందరూ కూడా నన్నే పొందుతున్నారు. ఈ లోకంలో మనం ఉన్నది ఈ లోకాన్ని మనం పొంది ఉన్నది దైవ ప్రాప్తి కోసం దైవసాధన కోసమే దైవ యజ్ఞం కోసమేనని తెలియాలి. ఈ జన్మను ఈ శరీరాన్ని ఈ లోకాన్ని జగద్గురువు అనిత్యంగా అసుఖంగా పేర్కొన్నారు కారణం మట్టికుండ ఏనాటికైనా మట్టిలో కలిసిపోయేటట్లుగా ఈ దేహం కూడా ఎప్పటికైనా ఈ మృత్తికలో కలిసి పోవాల్సిందే. అయితే ఈలోపే

మనం చేయాల్సిన పరమార్థ కార్యాలను శీఘ్రంగా చేయాలి, చెందాల్సిన పరమపదాన్ని తక్షణమే తెలియాలి. ఈ ప్రపంచం ఈ దేహం శాశ్వతం అనే భ్రమలో విర్రవిగే వారికి కనువిప్పు కలిగించడం కోసం చేసిన హెచ్చరికగా మనం ఈ శ్లోకాన్ని భావించాలి. ఇది అంతా అనిత్యం అసుఖం అని చెప్పడంలో ఉన్నటువంటి ఆంతర్యం కూడా ఇదే దాన్ని ఛేదించే ఉపాయాన్ని కూడా ఇక్కడే సూచించారు. ఈ శ్లోకంలో సమస్యను రోగాన్ని సూచించి పరిష్కారం ఔషధం కూడా పేర్కొన్నారు. అధికులైనా అధములైనా పాపులైనా పుణ్యులైనా అందరికీ ఉన్నది ఒక్కటే మార్గం అనన్య భక్తి చేయాలి అనంత జ్ఞానం ఆర్జించాలి అశేష ముక్తి పొందాలి. ఈ లోకాన్ని పొంది అన్నారు ఈ లోకాన్ని పొందడం ఈ దేహాన్ని చెందడం కూడా మహా మహా సుకృతమే, అందుకు ఈ లోకాన్ని పొందిన ఈ దేహాన్ని ధరించిన మనం ఇక్కడే ఇప్పుడే తక్షణమే భక్తితో ముక్తి పొందాలి గాని మరో మార్గం లేదని చెప్పడం ఈ శబ్ద ప్రయోగంలోని ఆంతర్యం. అనిత్యమైన ఈ లోకం నిత్యసత్యమైన మార్గాన్ని చూపుతుంది, ఈ దేహపు నావ మనల్ని వీడకముందే ఈ దేహం ఈ లోకపు మట్టిలోకి చేరకముందే ఈ లోకపు నీటిలో మునిగిపోక ముందే జీవన నది అనే జీవితపు నదిని దాటి పరమాత్మ మహాసముద్రాన్ని చేరి తరించిపోవాలి. అందుకు దైవాన్ని దైవసాధనను మనం ఆశ్రయించాలి అని జగద్గురువు హెచ్చరిక.

9అ, 34శ్లో.

మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు

మామేవైష్యసి యుక్త్వైవమ్ ఆత్మానం మత్పరాయణః |34|

నా యందే నీ మనస్సును లగ్నము చేయుము. నా భక్తుడవు కమ్ము. నన్నే పూజింపుము. నాకు నమస్కరింపుము. ఈ విధముగా ఆత్మను నాయందే నిలిపి, మత్పరాయణుడవైనచో నీవు నన్నే పొందగలవు.

ఇది ఈ అధ్యాయపు చిట్ట చివరి శ్లోకం. మనకు బ్రహ్మ విద్యాధ్యయనానికి అభ్యసనానికి రాజబాటను చూపిన రాజ రహస్యాన్ని నిగ్గు తేల్చిన నవనవోన్మేషమైన రాజవిద్య రాజగుహ్యయోగానికి ఈ సందర్భంగా పాదాభివందన చందనాలు.

ఈ అధ్యాయం శీర్షిక ఆంతర్యాన్ని రాజవిద్య రాజగుహ్యం అనే శబ్దాల ప్రయోగంలోని మహత్తును అలాగే తొమ్మిది సంఖ్యకున్న వైభవాన్ని స్వరూప విశ్వరూపాన్ని ప్రత్యేక శీర్షికగా సుదీర్ఘంగా విశేషంగా చర్చించుకుని అధ్యాయాన్ని ప్రారంభించుకున్నాం.

ఒకటవ శ్లోకంలో అసూయ లేకుండా ఉన్నప్పుడే బ్రహ్మజ్ఞానం బోధ పడుతుందని తెలుసుకున్నాం.

రెండవ శ్లోకంలో విద్యలలోకెల్లా శ్రేష్టమైనది రహస్యాలలో కెల్లా అతి రహస్యమైనది సర్వోన్నతమైనది ధర్మయుక్తమైనది ఆచరించడానికి సులభమైనది నాశరహితమైనది అని చూసాం.

మూడవ శ్లోకంలో ధార్మిక శ్రద్ధ లేని వారు దైవాన్ని పొందలేక జనన మరణాలలో చిక్కుకొని తిరుగుతూ ఉంటారని చూసాం.

నాలుగవ శ్లోకంలో దైవవ్యాపకత్వాన్ని ఆధార ఆధేయ సంక్లిష్టమైన సంశ్లేషమైన కార్యా కారణం లాంటి సంబంధాలను విశేషంగా చర్చించాం.

ఐదవ శ్లోకంలో సమస్త ప్రాణికోటి నాయందుండేవి కావు ప్రాణులను పుట్టించే పోషించే నా ఆత్మ ప్రాణులలో లేదు అని ఈశ్వర యోగ మాయను విపులంగా చూసాం.

ఆరవ శ్లోకంలో సమస్త ప్రాణికోటిలో పరమాత్మ స్థితమై ఉన్న విశ్వవ్యాపక వాసుదేవ స్థితిని ఉపమగా చూసాం.

ఏడవ శ్లోకంలో మాయమయ ప్రకృతిని స్వాధీన పరచుకొని ఉన్న మహేశ్వరుని స్వరూపాన్ని సమస్త ప్రాణికోటి ప్రళయ కాలంలో మాయమయ ప్రకృతిలో

అణిగి ఉండటం తిరిగి ప్రభవకాలంలో సృష్టితం కావడం లాంటి జగదుత్పత్తి విధానాన్ని స్పష్టంగా అణువణువునా పరిశీలించాం.

ఎనిమిదవ శ్లోకంలో మాయా ప్రకృతిని ఆశ్రయించిన ప్రాణి సముదాయం వాటి కర్మానుసారం తిరిగి జన్మించే తీరును గ్రహించాం.

9వ శ్లోకంలో సృష్ట్యాది కర్మల యందు ఆసక్తి రహితుడని ఉదాసీనుని వలె ఉన్న నన్ను కర్మలు బంధించవు అని జగద్గురువు వహించినటువంటి ఉదాసీనత్వాన్ని చూసాం. పదవ శ్లోకంలో చరాచర ప్రపంచానికి భగవంతుడు అధ్యక్షత వహిస్తున్న తీరును చూసాం.

11వ శ్లోకంలో పరమాత్మ తత్త్వం తెలియని మూర్ఖులు మానుష శరీరంతో వ్యవహరిస్తూ దైవాన్ని నిర్లక్ష్యం చేస్తున్న వైనాన్ని స్పష్టంగా చూసాం.

12వ శ్లోకంలో అవివేకులు వ్యర్థమైన ఆశలతో కర్మలతో జ్ఞానంతో బుద్ధిహీనులై రాక్షస స్వభావంతో ఆసురీ ప్రకృతి మోహంలో కూరుకుపోతున్న విధానాన్ని జగద్గురువు ఎత్తిచూపాడు, హెచ్చరించాడు.

13వ శ్లోకంలో దైవీ ప్రకృతిని ఆశ్రయించిన మహాత్ములు మాత్రం దైవాన్ని నాశరహితంగా సృష్టికర్తగా అనన్య మనస్కులై సేవిస్తారని పేర్కొన్నారు. 14వ శ్లోకంలో మహాత్ములైన ఏకాంత భక్తులు సదా దైవాన్నే కీర్తిస్తూ నమస్కరిస్తూ మనసును దైవం పైనే సుస్థిరంగా నిలుపుతారని చూసాం. 15వ శ్లోకంలో విశ్వతోముఖమై వివిధంగా ఉన్న దైవాన్ని జ్ఞాన యజ్ఞం చేత కొందరు ద్వైత భావంతో మరికొందరు బహు విధాలుగా ఉపాసించే విధానాన్ని తెలుసుకున్నాం. 16వ శ్లోకంలో క్రతువు యజ్ఞం స్వధ ఔషధం మంత్రం ఆజ్యం అగ్ని హోమం అన్నీ నేనే అని పరమాత్మ ప్రకటించుకున్న తీరు చూసాం.

17వ శ్లోకంలో ఈ జగత్తుకు తండ్రి తల్లి ధాత తాత తెలుసుకోదగినవాడిని వేద్యుడను ఓంకారాన్ని వేదత్రయాన్ని కూడా నేనే అంటూ ఇక్కడ దైవం దర్శనమిచ్చింది.

18వ శ్లోకంలో సమస్తానికి గతిని గమ్యాన్ని భర్తను ప్రభువును సాక్షిని నేనే నిలయం శరణ్యం నిధానం మిత్రుడు ఉత్పత్తి లయ స్థానాలు నేనే

అవ్యయబీజము నేనే అంటూ దైవపు మూలాలను మనకు ప్రత్యక్ష అనుభవం గావించాడు.

19వ శ్లోకంలో సమస్త జగత్తుకు జగత్తులో జరిగే సమస్త క్రియలకు ఆధారంగా ఉన్నది నేనేనంటూ నేను సూర్యుడనై వేడిని వెలుతురును ఇస్తున్నాను. వర్షాన్ని ఆకాశంలో నిలుపుతున్నాను మళ్లీ కురిపిస్తున్నాను, అమృతం మృత్యువును సత్తు, అసత్తును నేనేనంటూ సమస్తంలోని దైవాన్ని దర్శింపజేశాడు.

20వ శ్లోకంలో సోమపానం మహత్తును సోమరసం విశ్వరూపాన్ని చూసాం. ఇక్కడ మూడు వేదాల నిర్ణయాన్ని వేదాల ఆవిర్భావ విధానాన్ని చూసాం.

21వ శ్లోకంలో అలా వేద జ్ఞానంతో యజ్ఞాలు చేసి సోమపానం తాగిన వారు సైతం విశాలమైన స్వర్గలోకాన్ని అనుభవించి పుణ్యం క్షీణించగానే మళ్ళీ మానవ లోకంలోకి ప్రవేశించి జనన మరణాలలో చిక్కుకొని బిక్కరించే తీరును చూశాం. అలాంటివారు ఎన్నటికీ స్వాతంత్ర్యం పొందలేరని తెలుసుకున్నాం.

22వ శ్లోకంలో నా కోసం ప్రయత్నించే భక్తులు ఇతర ఆలోచన లేకుండా నన్నే చింతించే భక్తుల యోగక్షేమాలు నేనే చూసుకుంటానని జగద్గురువు భరోసా ఇచ్చాడు.

23వ శ్లోకంలో ఇతర దేవతల్ని ఆరాధించే పూజించే అవిధి పూర్వకమైన అజ్ఞానకరమైన పూజా విధానాన్ని చూసాం. 24వ శ్లోకంలో సమస్త యజ్ఞాలకు భోక్తను ప్రభువును కూడా నేనే అంటూ నా తత్త్వాన్ని దైవత్వాన్ని గుర్తించక దారి తప్పి పతనమవుతున్న వారిని స్పష్టంగా మన కళ్ళ ముందు ఉంచారు.

25వ శ్లోకంలో దేవతలను ఆరాధించేవారు దేవతలను పితృదేవతల్ని ఆరాధించేవారు పితృదేవతలను భూతాలను ఆరాధించేవారు భూతాలను నన్ను ఆరాధించేవారు నన్ను పొందుతారు అంటూ జగద్గురువు మనకు కనువిప్పు కలిగించారు. నాకు భక్తితో అర్పించే ఆకైనా పువ్వైనా పండైనా నీరైనా చాలు నేను సంతృప్తితో సేకరిస్తానని అర్పించే భావంలో ఉండాల్సిన పవిత్రతను శుద్ధతను చూసాం.

27వ శ్లోకంలో నువ్వు ఏదైనా చెయ్యి ఏదైనా తిను ఏ హోమమైన చేసుకో ఏమైనా దానం చేయి ఏ తపస్సు అయినా ఆచరించు అయితే అన్నింటిని నాకు సమర్పించు అంటూ అర్పిత భావాన్ని మనకు అభ్యసింప చేశారు. అలా చేస్తే సన్యాసయోగ యుక్తమైన మనస్సుతో శుభా శుభ కర్మలనుండి ఫలాలనుండి ముక్తులై దైవాన్ని చేరవచ్చని 28వ శ్లోకంలో చూసాం.

29వ శ్లోకంలో సర్వ ప్రాణుల యందు సమ భావంతో ఉంటాను నాకు ఎవరిపైనా ద్వేషం లేదు నాకు ఎవరూ ప్రత్యేకంగా ఇష్టులు లేరు, నన్ను భక్తితో సేవించేవారు మాత్రం నాలో ఉంటారు, నేను వారిలో ఉంటాను అంటూ దైవం కొలువుండే నిలయాన్ని స్వయంగా దర్శించాం.

30వ శ్లోకంలో ఎంతటి దురాచారులైనా మనసు మార్చుకుని అనన్య భక్తితో దైవాన్ని ఆశ్రయించిన వెంటనే శ్రేష్టుడు సత్పురుషుడు అవుతాడని తెలుసుకున్నాం. దైవాన్ని ఆశ్రయించిన వారు శీఘ్రంగా ధర్మబుద్ధి గల వారై ఎప్పటికీ నశించరని పరమాత్మ ప్రతిజ్ఞ పూనిన విధానం చూసాం. పాపపు సంస్కారాలు జన్మాంతరాలుగా ఉన్నవారైనా స్త్రీలైనా వైశ్యులైనా శుద్రులైనా ఏజాతి వారైనా ఎవరైనా సరే దైవాన్ని ఆశ్రయిస్తే పరమగతి పరంధామం నిశ్చయం అంటూ సమస్త సందేహాలకు సమాధానంగా 32వ శ్లోకం ప్రబోధించింది. అలా ఎంతటి పాపాత్ములు అయినా సరే దైవాన్ని ఆశ్రయించి ధన్యులు అవుతూఉంటే ఇక పుణ్యాత్ములు భక్తులైన బ్రాహ్మణులు రాజర్షుల సంగతి వేరే చెప్పాలా ఈ ప్రపంచం నిత్యం కాదు ఇందులో సుఖం లేదు ఈ లోకాన్నిపొంది నన్ను సేవించు అంటూ జగద్గురు హెచ్చరించి నొక్కి వక్కాణించిన తీరును 33వ శ్లోకంలో చూసాం. ఇక ఈ శ్లోకం నీ మనసును నాయందే ఉంచు, నా భక్తుడివికా నన్నే భజించు నాకు నమస్కరించు నేనే నీకు పరమగతి నాలోనే చిత్తాన్ని నిలుపు నన్నే తప్పక పొందుతావు అంటూ దైవమే మనల్ని స్వయంగా తనలోకి ఆహ్వానిస్తున్నాడు. వీటన్నింటినీ పరిశీలించిన అధ్యయనం చేసిన అభ్యసించిన జ్ఞానంతో మనం మనసు అనే ఆకును బుద్ధి అనే పువ్వును భగవంతుని పాదాల చెంత సమర్పించి దైవాన్ని ఆశ్రయించి శరణాగతి పొంది నేను లేని జన్మలేని సదా అయినటువంటి మరో అవ్యయ అవ్యక్తంతో ఏకమవుదాం. భగవంతునికి సమర్పించని బ్రతుకు వ్యర్థం అని శాస్త్రం. ఈ అధ్యాయంలోని ప్రతి అక్షరం లోనూ రహస్యంగా దాగి ఉన్న

దైవాన్ని పొందే మార్గం మహత్తును ప్రత్యక్షంగా చూసాం. దైవమే జీవిత లక్ష్యంగా ఉండటం, సదా దైవాన్ని చింతించడం దైవాన్నే ఆరాధించడం ధ్యానించడం సదా దైవ ఉపాసన ప్రబోధం ఈ అధ్యాయంలోని ప్రత్యేకత. మనం దేన్ని చింతిస్తే అదే అవుతాం అలా భగవంతుని చింతతో భగవంతునితో ఏర్పడే సంబంధం ఫలితంగా అహం ను తొలగించుకుని త్వం ఒక్కటే ఉందని గ్రహించి సమస్తంలో సర్వేశ్వరుని దర్శించి తన్మయం చెందడమే నమస్కరు. అలా చేసే పరమేశ్వరుని నమస్కురులతో సాగిపోయేటటువంటి జీవనం జీవితం ఎప్పటికీ ఆగదు దారి తప్పదు. నడిచే శక్తి నడిపే భక్తి అంతా దైవమే. కదలిక అక్కడి నుంచే చేరేది అక్కడికే. మధ్యలో మనది ఏదీ లేదు ఉండదు. మా అంటే నాది, నా అంటే లేదు, నాది లేదు నేను లేను. ఇదే నమస్కారం యొక్క పరమార్థం.